# శ్రీరామవిజయం

మరాఠీమూలం

## శ్రీధరకవి

తెలుగు అనువాదం

## సాయినాథుని నారాయణరావు

(యస్వీయల్)

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2013

# SREERAMA VIJAYAM

**By**
**Sainadhuni Narayana Rao (SVL)**

T.T.D. Religious Publications Series No.1003
© All Rights Reserved

*First Edition : 2013*

Copies: 1000

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor in Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

## ముందుమాట

సనాతన భారతీయ వాఙ్మయ ప్రపంచంలో పరమపవిత్రత, పూజనీయత సంతరించుకున్న రమణీయచరితం శ్రీరామకథ! కవికోకిల ఆదికవి వాల్మీకిమహర్షి శ్రీమద్రామాయణమహాకావ్యాన్ని మధురాక్షర సమన్వితంగా లోకానికి అందించారు. ఆనాటినుండి మహనీయమైన శ్రీరామచరితం శతకోటిప్రవిస్తరంగా పల్లవిస్తూనే ఉంది.

రామాయణకావ్యంలోని ఉపదేశం, రాముని పితృవాక్య పరిపాలన, ఒకే సతి, ఒకేమాట, ఒకే బాణం – అన్న ఆతని నియమాలు, స్నేహానురక్తి, ప్రతిజ్ఞాపాలన, శిష్టరక్షణ, ఔదార్యం – అలాగే సీతాదేవి పాతివ్రత్యం, ఓరిమి, ఆదర్శ ధర్మనిర్వహణ, పుత్రవాత్సల్యం – దశరథుడి పుత్రప్రేమ – భరతాదుల సోదరభక్తి, ప్రేమ – లక్ష్మణుని సేవ – రామకార్యదురంధరుడైన హనుమంతుని స్వామిభక్తి, సమయజ్ఞత, అకుంఠిత బ్రహ్మచర్యం, భక్తరక్షణ... ఇవన్నీ కలిసి రామాయణకావ్య పవిత్రతకు, ప్రచారానికీ దోహదం చేశాయి.

అందువల్లే భువిపై పర్వతాలు ఉన్నంతకాలం, నదులు ప్రవహిస్తున్నంత వరకు పవిత్రమైన శ్రీరామగాథ సర్వలోకాల్లో వ్యాపించి వుంటుందన్న ప్రశస్తి శ్రీమద్రామాయణకావ్యానికి తప్ప మరే గ్రంథానికి కానరాదు.

భారతీయ సాహిత్యంలోనేకాక, రష్యన్, జర్మనీ, చైనా, ఇండోనేషియా, నేపాల్, బర్మా, మలయా... ఇలా అనేక విదేశ భాషాసంస్కృతుల్లోకూడా విశ్వమోహనమూర్తి శ్రీరామచంద్రునిగాథ సుందరంగా రూపుదిద్దుకొంది.

ఇలా విశ్వవ్యాపితమైన రామాయణకావ్యం భారతీయ భాషలన్నింటిలోను అనేక ప్రక్రియల్లో విస్తారంగా రచింపబడి కమనీయమైన పారాయణ గ్రంథంగా రూపుదిద్దుకొంది. ఇలా వేయి విధాలుగా పరిఢవిల్లిన రామాయణగాథను 17వ శతాబ్దంలో మరాఠీ భాషలో శ్రీధరకవి 'ఓవీ' ఛందస్సులో మధురమైన గేయకావ్యంగా **'శ్రీరామవిజయం'** పేరుతో రచించారు. ఈ గ్రంథం పరమపూజనీయమైన పారాయణ గ్రంథంగా మహారాష్ట్రమంతటా వ్యాప్తిని పొందింది.

మరాఠీలోని 'శ్రీరామవిజయం' గ్రంథాన్ని తెలుగువారికి కూడా అందించాలన్న సంకల్పంతో రచయిత శ్రీ నారాయణరావుగారు సరళమైన వచనంలో తెనిగించారు.

ప్రస్తుతం 'శ్రీరామవిజయం' తెనుగుసేత వచన గ్రంథాన్ని తి.తి.దేవస్థానం ధార్మిక ప్రచురణగా వెలువరించింది. ఆంధ్ర పాఠకలోకం ఈ సద్గ్రంథంలోని ప్రత్యక్షరం ఆస్వాదించి తద్వారా శ్రీసీతారాములవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఆకాంక్షిస్తూ...

సదా శ్రీవారిసేవలో

**(ఎల్.వి. సుబ్రహ్మణ్యం)**
కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు

# అవతారిక

**భా**రతీయ సంస్కృతికి మూలకందాలైన రెండు మహత్తర గ్రంథాలలో శ్రీమద్రామాయణం ఒకటి. వైదిక సంస్కృతి తరువాత పురాణ కావ్య సంస్కృతి భారతీయ జనజీవితానికి జీవనాడిగా నిలిచింది. సంస్కృతి విలువలను సామాన్యుని ముంగిట కథారూపంలో సాక్షాత్కరింపజేసింది. భారతం మహేతిహాస సంప్రదాయాన్ని నిర్మిస్తే, రామాయణం మహాకావ్య సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ఒకటి సమష్టి ధర్మానికి దారి దీపమైతే, మరొకటి వ్యష్టి ధర్మానికి కరదీపమయింది. వాల్మీకి నుండి మొదలుపెట్టి వివిధ భాషలలో వివిధ మహాకవులు తమదైన తీరులో రామాయణ గాథను దర్శించి తమ గొంతుతో గానం చేసి అమరులుగా నిలిచారు. అలాటి అమర మహాకవులలో ఒకరు మరాఠీ భాషలో 'శ్రీరామవిజయం' పేరిట రామకథా మధురామృతగానం చేసిన శ్రీధరకవి.

17వ శతాబ్దంలో వెలసిన శ్రీధరకవి తనకు ముందుగా అవతరించిన అన్ని రామాయణాల సారాన్ని మధురాతి మధురంగా మహారాష్ట్ర ప్రాకృతంలో విరచించారు. ఆయన పేర్కొన్న రామాయణాల పేర్లే, అంతకు మునుపున్న అఖండ రామాయణ సంప్రదాయపు పేర్మికి పరమనిదర్శనాలు. మనకు వాల్మీకి రామాయణం, అధ్యాత్మ రామాయణం వంటి ఒకటి రెండు పేర్లే తెలుసు. శ్రీధరకవి చెప్పిన రామాయణాల పరంపర చూడండి: వాల్మీకి రామాయణం, వశిష్ఠ రామాయణం, శుక రామాయణం, ఆంజనేయుడు వినిపించిన శ్రీరామచరిత్ర, విభీషణుడు పల్కిన బ్రహ్మ రామాయణం, శివుడుపదేశించిన శివ రామాయణం, అగస్త్య రామాయణం, శేష రామాయణం, ఆగమ రామాయణం, అధ్యాత్మ రామాయణం, భరత రామాయణం, ధర్మ రామాయణం, ఆశ్చర్య రామాయణం... ఇవిగాక భారతాంతర్గత వ్యాసమహర్షి

ప్రణీత రామకథ, కాశికాఖండ కథ రామకథ, పద్మపురాణాంతర్గత పద్మ రామాయణం... ఇలా ఎన్నో! వాటన్నింటినీ ఉటంకించి వాల్మీకి రామాయణాన్ని పరమాధారంగా తీసికొని శ్రీరామవిజయాన్ని గానం చేస్తున్నానన్నారు శ్రీధరుడు. నిజానికిది గానమే. మహారాష్ట్రి ప్రాకృతం పాటకు పెట్టింది పేరు. సంస్కృత నాటకాల్లో పాటలు మహారాష్ట్రి ప్రాకృత భేదంలోనే ఉంటాయి. అందులో ద్విపదల చక్కటి ప్రాసతో, యతివిరామంతో సాగిపోయే ఓవీ ఛంధస్సులో శ్రీధరుడు శ్రీరామవిజయాన్ని గానం చేశాడు.

ఈ ఓవీ మన దంపుడు పాట వంటిది. ఒక అద్భుతమైన లయతో శ్రోతను ఉన్మీలనం చేసుకొనే శక్తి దానికి సహజంగా ఉంటుంది. శబ్దలాలిత్యం తెలిసిన కవి దానిని చేపట్టాడంటే అంతకంటే శ్రవణానందం కలిగించే మధుర రీతి మరొకటుండదు. కవి భక్త్యావేశంలో తేలిపోయేవాడైతే ఇది శ్రోతను భక్త్యానంద సరస్సులో ఓలలాడిస్తుంది. ముందే ముముక్షువుకు మాధురీరసాన్నందించే రామకథ! అందుకుతోడు ఓవీ ఛందోమృదులత అందునా సమస్త పూర్వ రామాయణాల సాంద్రత. ఇక శ్రీరామవిజయ మాధుర్యమహత్వాణిని మాటల్లో వర్ణించడం సాధ్యమా?

అంత అసాధ్యమైన దాన్ని తేటతేట తెలుగులోకి, అతి అనాయాసంగా తెచ్చారు శ్రీసాయినాథుని నారాయణరావు. దానికి ప్రధాన కారణం సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ కృపాకటాక్షమే! శ్రీసాయినాథునికి 'జ్ఞానేశ్వరి'తో సమానంగా ప్రియమైన 'శ్రీరామవిజయాన్ని' మరాఠీ నుంచీ తెలుగులో అనువదించమని ఆదేశించింది శ్రీగురువుగారే! అక్షరమ్ముక్క మరాఠీ భాషరాని తనకు ఈ ఆదేశాలిచ్చారేమిటా? అని అక్కజపడ్డ నారాయణరావుకు, మరాఠీ భాషా కావ్యాన్ని, తద్వారా భాషను బోధించే ఏర్పాటును తన లీలావిశేషంగా చేసి, ఆ రూపంలో రామకథన సాధన చేయించి, అలవోకగా మూలమంత



మధురంగా తెలుగులో వెలయింపచేసింది శ్రీగురువుగారే! మరాఠీ భాష అక్షరం అంత కూడా రానివారు, అక్షయ మాధురీభరితంగా శ్రీరామవిజయం వంటి ప్రాచీన కావ్యాన్ని అనువదించటం శ్రీగురువుగారి లీలకు కృపకు మరో ఉత్కృష్ట నిదర్శనం.

మూలం పాటరూపమైనా అనువాదం వచనరూపమే. నేటి పాఠకుడికి అనువుగా ఉంటుందన్న ఆకాంక్షతో చేసిన రచనం హాయిగా అందంగా భక్తి పారవశ్యంతో చేసిన వచనం! శ్రీరాముని కాలి అందెల ఘలఘలలకు ఆకాశం ప్రతిధ్వనిస్తుంది. ఆ ప్రతిధ్వని గర్జనలు వినబడి అసురుల మోకాళ్ళు కడుపులోకి ముడుచుకుపోతాయి. చక్కటి ఆరటి స్తంభాల్లాంటి జానువులు, మోకాళ్లు, గరుడ పచ్చల్లా, ఇంద్రనీలమణుల్లా మెరుస్తున్నాయి. వేయిమెరుపులు మెరిసినట్లు శ్రీరాముని కటి ప్రదేశంలో పసుపు పచ్చని పీతాంబరం మెరిసిపోతున్నది... కటి మేఖలలోని చిరుగంటల సవ్వడి జటిలార్థాన్ని సహితం తత్‌క్షణం స్ఫురింపజేసే వేదస్వరంలా రసవత్తరంగా రవళిస్తున్నది... ఆ నీలమేఘశ్యాముని కుడిభాగాన శ్రీవత్సము, ఎడమభాగాన సుగంధభరితమైన శ్రీనికేతనము అలతరారుతున్నాయి. ఆ శ్యామలాంగుని శరీరంపై చర్చితమైన చందనాన్ని చూస్తే గంగా యమునా నదులలోని నిర్మల జలం రాకా పౌర్ణమి నాటి చంద్రుని శోభతో విలసిల్లే ఆకాశం, దేదీప్యమానమైన ఇంద్రనీలమణుల కాంతి స్ఫురణకు వస్తున్నాయి. ఆవరణ అంతా సుగంధ పరిమళంతో గుబాళిస్తున్నది... అటు సంప్రదాయం, ఇటు ఆధునికత అందగించిన ఈ భాషాసుగంధం చదువుతున్న పాఠకుల గుండెల్లో గూడా గుబాళిస్తుంది. అంత హాయిగా సాగిపోతున్న అనువాదం, అసలు అనువాదంగా అగుపించని ఆంధ్రవచనం. శ్రీధరుని కృతిని కృతి అనువాదంలో ఈ భాషామాధుర్యంతో పాటు ఎదురుపడే మరో పెద్ద సమస్య. అలా బారుగా సాగిపోయే ఉపమానాలు

ఒక్క విషయం చెప్పడానికి పదిపోలికలు చెబుతాడు శ్రీధరుడు. కించిత్తు వర్ణమైనా సరే వివిధోపమానాలతో ప్రవచించి అతి వివరంగా, గుండెల నిండుగా ఎలుగెత్తి పాడుతాడు. పాటలో అయితే ఉపమానాల పరంపర అంత ఇబ్బంది పెట్టదుగానీ, వచనంలో మాత్రం పునరావృత్తిగా అగుపిస్తూ, ఎంతోభక్తి పారవశ్యమైతే ఏమిటి మరీ ఇంతగా వర్ణించాలా? అనే ప్రశ్నను లేవనెత్తుతుంది. దానిని వీలయినంతవరకు శబ్ద పునరావృత్తి గాకుండా చూచుకుంటూ, ఏదో ఒక విధమైన అంతర్లయను పాటిస్తూ అనువదిస్తే తప్ప, సరైన సాఫల్యం సిద్ధించదు. శ్రీ నారాయణరావు ఇందులో అపారమైన జాగ్రత్త తీసుకున్నారు. పదేపదే రాసినదాన్నే రాస్తూ, ప్రతి అక్షరం అక్షరం దగ్గర పొదుపు సౌందర్యం పాటిస్తూ అనువదించారు. కనుకే ఈ తెలుగుసేత కూడా మరో భక్తిరసామృత గద్య కవితగా మారింది. అక్కడక్కడ మూలంలో ఛందః పరిమితులవల్ల కుదించుకుపోయి అస్పష్టమైన అర్థాన్ని ఎంతో జాగ్రత్తగా, సరళ సుబోధంగా మార్చి తెనుగులోకి తెచ్చారు. అందుచేత మరో వ్యాఖ్యానం అవసరం లేకుండా ఎవరికి వారు ఈ శ్రీరామవిజయగాథా రహస్యార్థాన్ని స్వయంగా అనుభూతం చేసికొని ఆనందించే అవకాశం లభిస్తున్నది.

అసలు ఏ కావ్యానికైనా పరమావధి అలా అనుభూతి చెంది ఆస్వాదించడమే. స్వయంగా తమ గుండెల్లో అనుభూతిని పండించుకున్నవారు దాన్ని అక్షరపుష్పహారంగా మార్చి ఇతరులకు అందిస్తారు. అప్పుడు రచయితతో పాటు పఠితలు కూడా తరిస్తారు. తన గురు ఆజ్ఞతో శ్రీరామవిజయ గానాన్ని చేబట్టి, శ్రీధరుడు తరించి తరింపచేసాడు. అలాగే తన గురువాజ్ఞతో శ్రీనారాయణరావు దాన్ని తెలుగులో రచించి తాను తరిస్తూ తరింపచేస్తున్నారు. శబ్దం నావలో ఎక్కించుకుని అర్థమనే మహానదిలో సులువుగా పయనింపచేసి అద్దరి చేర్పించేవాడే కవి, రచయిత. శ్రీరామవిజయ మధురానువాదంతో మనల్ని అలాగే భక్తిరసామృత నదిలో పయనింపచేసి, ఆనందపు అద్దరిని



చేరుస్తున్నారు శ్రీనారాయణరావు. అందుకూ, మరో భాషలోని ఒక ప్రాచీన రసత్కావ్యాన్ని మనభాషలో అందిస్తున్నందుకు శ్రీసాయినాథుని నారాయణరావును మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఈ రామాయణ యజ్ఞంలో యత్కించిత్ నేను భాగం పొందడం కూడా గురువుగారి అపారలీలకు నిదర్శనం. ఓ మారు శిరిడీలో సాయిపథానికి వెళ్ళి బయటకు వస్తూ 'అందరూ ఏదో రూపంలో గురుసేవలో నిమగ్నమై వున్నారు. నాకు కూడా ఏదైనా అవకాశం లభిస్తే బాగుణ్ణు. నాకు తెలిసింది అక్షరాల పనే కాబట్టి ఏ ప్రచురణ కార్యక్రమంలోనైనా పాలుపంచుకునే అవకాశం లభిస్తే ఎంత బాగుంటుంది' అని ప్రక్కనున్న శేఖరుకు మాత్రమే వినబడేలా అన్నాను.

తరువాత హైదరాబాద్ వచ్చాక అనుకోకుండా నారాయణరావు ఫోను. అప్పటికి నేనెవరో వారికి తెలియదు. అయినా అనువాద ప్రతిని నాకు చూపమని గురువుగారి ఆదేశం. వారివద్దకు చేరితే నేనెవరో తెలియని నారాయణరావు, మిత్రుడు సాయి వరప్రసాదరావు నుండి వివరాలు తెలుసుకుని ఫోను చేసారు. నేను అన్న మాటలు భౌతికంగా గురువుగారికి వినబడే అవకాశం ఏమాత్రం లేదు. అయినా నా పట్ల దయతో అదృశ్యంగా వెన్నంటి వున్న వారికి వినబడింది. ఆదేశం చేరవలసిన తీరులో చేరింది. ఇంతకంటే లీలకు మరో నిదర్శనం ఏముంటుంది? ఇలా లీలానుభూతినిచ్చిన శ్రీగురువుగారి పాదాలకు నా సాష్టాంగ ప్రణామాలు.

**– గంగిశెట్టి లక్ష్మీనారాయణ**

మాజీ వైస్‌ఛాన్స్‌లర్, ద్రవిడియన్ యూనివర్సిటీ

కుప్పం, ఆంధ్రప్రదేశ్.

## అనువాదకుని నివేదన

ఈ గ్రంథరచనకు స్ఫూర్తి, ప్రేరణ అంతా నా గురుదేవులైన శ్రీసాయినాథుని శరత్‌బాబుజీ. వారే నా సర్వస్వం, నా ధ్యానం, నా ధ్యేయం, నా దైవం. శ్రీసాయిబాబాను అనన్యంగా ప్రేమించి, ఆరాధించిన శ్రీబాబూజీ శ్రీసాయి ప్రేమస్వరూపానికి నిలువెత్తు రూపమై నిలిచి, శ్రీసాయిలో తాదాత్మ్యం చెందారు. వారికి తిరుమలతో ఉన్న అనుబంధం ప్రత్యేకమైనది. వారికి పసిప్రాయంలో శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో దివ్య సాక్షాత్కారం కలిగింది. చదువుకొనే రోజుల్లో తిరుమలలో ఎంతోకాలం వారు సాధన చేసుకొన్నారు. శ్రీసాయిబాబా తమ గురువు 'వెంకూసా' అని చెప్పారు. ఆ రీత్యా శ్రీసాయిని సమర్థసద్గురువుగా భావించిన వారికి శ్రీవేంకటేశ్వరస్వామి 'పరమగురువు'. శ్రీసాయిబాబా మహాసమాధి ముందు 'శ్రీరామవిజయం' గ్రంథాన్ని మూడుసార్లు చదివించుకొని విన్నారు. ఈ నేపథ్యంలో ఈ గ్రంథాన్ని శ్రీవేంకటేశుని పదసన్నిధిలో, తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ముద్రించాలన్న భావన కలగడం నా సుకృతంగా భావిస్తున్నాను.

శ్రీరామవిజయం గ్రంథ ప్రాశస్త్యం గురించి మా గురుదేవులు ఇలా వివరించారు: శ్రీసాయిబాబా పారాయణ చెయ్యమని ఇతరులకు విధించిన గ్రంథాల విషయం ఒక ఎత్తైతే, తాము ఇక కొన్ని రోజులలో దేహత్యాగం చేస్తారనగా వజే అను భక్తుని పిలిచి, 'శ్రీరామవిజయం – చదువు, దాని వల్ల మృత్యుంజయుడు సంప్రీతుడవుతాడు' అని ఆదేశించి, ఆ గ్రంథాన్ని, వజే చేత వరుసగా 3 సార్లు చదివించుకొని విన్నారు. శ్రీహేమద్పంతు తమ 'శ్రీసాయి సచ్చరిత్ర'లో యీవిషయాన్ని సవివరంగా గ్రంథస్థం చేశారు. అలా బాబా తామే కోరి చదివించుకొని మరీ వినిన గ్రంథం మరొకటిలేదు. ఇది బాబా మనకనుగ్రహించిన మృత్యుంజయ మంత్రం వంటిదని చెప్పవచ్చు.

శ్రీరామవిజయం మూల గ్రంథాన్ని మరాఠీలో రచించిన శ్రీధరకవిని ఈ సందర్భంగా స్మరించుకోవడం సముచితంగా ఉంటుంది. శ్రీధరకవి గురించి మా గురువుగారు ఒక వ్యాసంలో ప్రస్తావించిన వివరాలివి: పాండురంగభక్తపరంపరలో ప్రకాశించిన సంత్ కవులలో శ్రీధరకవి ఒకరు. ఈయన 1658లో జన్మించాడు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన పండరీపురానికి సుమారు 20 మైళ్ళ దూరంలో వున్న నాఘరీ గ్రామం ఈయన జన్మస్థలం. తండ్రి బ్రహ్మానంద, తల్లి సావిత్రీబాయి. ఈయన చిన్నతనంలోనే వీరి కుటుంబము పండరిపురం వెళ్ళి స్థిరపడడంతో ప్రాథమిక విద్య తప్ప మిగిలిన విద్యాభ్యాసమంతా పండరిలోనే గడిచింది.

సంస్కృతంలోని గ్రంథాలను దేశభాషలోకి అనువదించే పరంపరలో ఏకనాధుని మనుమడైన ముక్తేశ్వరుడు మహాభారతాన్ని మరాఠీభాషలోనికి అనువదించాడు. కానీ, అందులోని ఐదు పర్వాలు మాత్రమే లభిస్తున్నవి. ముక్తేశ్వరుని మరాఠీ భారత రచనా కార్యాన్ని పూర్తి చేయాలని ఎందరో కవులు ప్రయత్నించారు. వారిలో శ్రీధరకవి అగ్రగణ్యుడు. ఆయన మహాభారతకథ ఆధారంగా 'పాండవప్రతాపం', 'శ్రీరామవిజయం', 'హరివిజయం', 'శివలీలామృతము', 'పాండురంగ మాహాత్మ్యము', 'వెంకటేశ మాహాత్మ్యము', 'వేదాంతసూర్య', 'జైమినీ అశ్వమేధము', 'మల్హరీమాహాత్మ్యము', 'అంబికాఉదయము', మొ॥న గ్రంథాలెన్నో రచించారు. వాటిలో 'శివలీలామృతము', 'పాండవప్రతాపము', 'శ్రీరామవిజయము' ఎంతో ప్రఖ్యాతిచెంది, యీనాటికీ మహారాష్ట్రదేశంలోని వేలాదిగృహాలలో నిత్యం పారాయణ చేయబడుతున్నాయి. ఈ గ్రంథ అనువాదానికి ఉపక్రమించినప్పుడు నాకు మరాఠీ భాష తెలియదు. ఈ రోజుకూ మరాఠీలో మాట్లాడుకుంటుంటే నాకు సరిగా బోధపడదు. మాట్లాడటం అసలే రాదు. అలాంటివాణ్ణి మరాఠీభాషలో ఓవీ చందస్సులో పద్యరూపకంగావున్న ఈ

గ్రంథాన్ని తెనుగించడం ఎలా సంభవం? పైగా నాకు తెలుగులో ఏమన్నా ప్రత్యేకమైన అభినివేశముందా? నేను ఎస్.ఎస్.ఎల్.సి వరకు మాములుగా బడిలో నేర్చుకున్న తెలుగు మాత్రమే. కాకపోతే నా చిన్నతనంలో రామాయణ, భారత, భాగవతాలు, మహాత్ముల చరిత్రలు చదివాను. అంతమాత్రాన ఈ గ్రంథాన్ని తెనుగించేటంత భాషాపటిమ నాకు లేదు. అయినా గురుకృప విశేషంగా, దివ్యాశీస్సుల ఫలంగా మరాఠీగ్రంథం చదువుతున్నప్పుడు మాత్రం దానిలోని భావంతోపాటు విశేషాలు, ఉపమానాలన్నీ అవగతమయ్యేవి. నాకంతటి శక్తిసామర్థ్యాలను ప్రసాదించిన గురుదేవులకు నా సాష్టాంగప్రణామాలు. వారు వెన్నంటివుండి నాచేత ఈ బృహత్కార్యాన్ని చేయించి, నన్ను అన్నివిధాలా తీర్చిదిద్దారు.

నేను ఈ రచన చేస్తున్నానన్న అహంకారం ఉన్నంతవరకు గురువుగారు నా అనువాదాన్ని ఆమోదించలేదు. నేను నా రచనను తీసుకెళ్ళిన ప్రతిసారి గురువుగారు మరల చూడమనేవారు. ఏమిటి? నేను వ్రాసింది చూడకుండానే గురువుగారు మరల సరిచేయమంటున్నారు అని అనుకున్నాను. నా మనసు గ్రహించి గురువుగారు నేను వ్రాసిన దానిలోని ఆఖరుపేజీ చదవమన్నారు. తీరా వారి ముందు చదివాక నాకందులో ఎన్నో తప్పులు గోచరించాయి. దాంతో వారి శక్తి నా కర్థమయ్యింది. వారికి చదువవలసిన అవసరం లేదు. వెంటనే గ్రహించగలరు. వారు గ్రహించడమే కాదు నా కళ్ళకు కట్టినట్లు చేయగల మహిమాన్వితులు. వెంటనే వారి పాదాలపై పడి నన్ను మన్నించమని ప్రార్థించాను. గురువుగారు ఆమోదించేవరకు ఎన్నిసార్లైనా నేను క్షుణ్ణంగా సరిదిద్దగలనని చెప్పి నా అహంకారాన్ని వారి పాదాల ముందుంచాను. ఆ తరువాత నేను ఆ గ్రంథాన్ని పరిశీలించగా ఎన్నో అసంబద్ధమైన, లోపభూయిష్ఠమైన వాక్య నిర్మాణాలు గోచరించాయి. వాటిన్నన్నిటిని సరిచేసి గురువుగారికి నచ్చేరీతిలో దీనిని తయారు చేశాను. ఈ సంఘటనతో నాకు



హేమాడ్‌పంత్ సాయిసచ్చరితలో వ్రాసిన మాటలు గుర్తొచ్చాయి. హేమాడ్‌పంత్ సచ్చరిత వ్రాయుటకు శ్యామా ద్వారా బాబా అనుమతిని అర్థించగా అతడి అహంకారం పూర్తిగా నశించి, మచ్చుకైనా కనబడనప్పుడు నేను అతడిలో ప్రవేశించి నా చరిత్ర నేనే వ్రాస్తాను అని బాబా అన్నారు. వ్రాసేవారు, వ్రాయించేది, వ్రాయడం అనే ఈ త్రిపుటి గురువుగారే అన్న విషయం అచ్చుగుద్దినట్లు బోధపడింది.

1987వ సంవత్సరంలో గురువుగారితో కలసి రైలులో శిరిడీ నుండి తిరిగివచ్చేటప్పుడు మాటలమధ్యలో రామవిజయగ్రంథం యొక్క ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆ గ్రంథం మరాఠీలో ఉన్నందున అది తెలుగువారికి అందుబాటులో లేదన్నారు. బాబాచే మూడుసార్లు శ్రవణం చేయబడ్డ ఆ గ్రంథం మహత్తరమైనదనీ, ఈ గ్రంథాన్ని రచించిన శ్రీధరకవి, క్రీ.శ 17వ శతాబ్దానికి చెందినవాడనీ, ఆయన ఆధ్యాత్మికతను ఉపమానాలలో జోడించి, సుబోధకం చేశారని చెబుతూ, దానిని తెలుగులో అనువదిస్తే బాగుంటుందంటూ, నావైపు తిరిగి ఆ మరాఠీ గ్రంథాన్ని వెంటనే తీసుకోవలసిందన్నారు. నేను శిరిడీలో, నగర్‌లో, బొంబాయిలో ప్రయత్నించాను. కానీ దొరకలేదు. ఒకరోజు హైదరాబాదులోని మరాఠీ పుస్తకాల షాపులో విచారించగా అక్కడ ఒక ప్రతి లభించింది. అది తెచ్చి గురువుగారికిచ్చాను. వారు దానిని చూచి బాబాకు నమస్కరించి ఈ పుస్తకాన్ని తీసుకెళ్ళి హైదరాబాదులో ఎవరైనా తెలుగు-మరాఠీ వచ్చినవారితో కలిసి అనువదించమన్నారు. గురువుగారు చెప్పారుకదా! అని నేను వెంటనే ప్రయత్నించగా శ్రీనిత్యానంద్ విజాపూర్కర్ అనే ఆయన ఈ కార్యక్రమం చేపట్టటానికి అంగీకరించారు. వృత్తిరీత్యా వ్యాపారి యైనప్పటికీ, ఆధ్యాత్మికతపట్ల జిజ్ఞాస కలిగినవారు. అప్పుడు వారి వయస్సు 65-70 వుండవచ్చు. వారు

చదివి అర్థం చెప్తుంటే, నేను తెలుగులో వ్రాసుకునేవాడిని. అలా కొంతకాలం జరిగిన తరువాత, వారు రోజూ వంద ఓవీలు (మరాఠీ ఛందస్సులలో ఇది ఒకటి) చదివిచెప్తే నేను విని ఇంటికి వెళ్ళిన తర్వాత ఆ వంద ఓవీలను నేను చదువుతూ తెలుగులో అనువదించి చెప్తే మా ఆవిడ వ్రాసేది. ప్రక్కరోజు నేను వ్రాసినది వారికి వినిపించి బాగున్నదని చెప్పిన తర్వాత మరల ఒక వంద ఓవీలు చెప్పించుకునేవాడిని. ఆ సందర్భంలోనే ఒకరోజు వారు వంద ఓవీలు మరాఠీ పద్య చందస్సులో విని తిరిగి వాటిని ఇంటివద్ద తెలుగులో వ్రాయగలుగుతున్నావంటే ఇకపై ఈ పని నీవు స్వతంత్రంగా చేయగలవు అన్నారు. ఈ మాట ఎందుకన్నారోగానీ, తరువాత కొంతకాలానికే వారు కన్నుమూసారు. మళ్ళీ నా పని కుంటుపడింది. అప్పటికి నలభై అధ్యాయాలకు గాను పది అధ్యాయాలు మాత్రమే పూర్తయినాయి. ఈ విషయం గురువుగారికి చెబితే వేరే ఇంకెవరైనా దొరుకుతారేమో చూడమన్నారు. ఎంత తిరిగినా సరైనవారు దొరకలేదు. ఈ విషయాన్ని గురువుగారికి నివేదించగా, బహుశా ఈ పని ఇక మీరే చేయాలని బాబా సంకల్పమేమో! మీరే ప్రయత్నించండి అన్నారు. ఇక తప్పేదేముంది, నేను అలా ప్రయత్నించాను. ఒక్కోసారి ఒక్కో పదానికి అర్థం తెలియక, నిఘంటువులో ఆ పదం దొరకక రాత్రంతా అలా ఆలోచిస్తూ ఉండేవాడిని. ఏ రాత్రికో ఆ పదానికి సరైన అర్థం స్ఫురించేది. ఒకసారి శిరిడీ వెళ్ళినపుడు గురువుగారు ఈ గ్రంథాన్ని తెలుగు ప్రొఫెసర్ శ్రీలక్ష్మీనారాయణగారికి చూపించండి వారు చూస్తే బాగుంటుందన్నారు. నేను వారికీ విషయం చెప్పాను. వారు అంతకుముందే గురుపూర్ణిమకు శిరిడీ వచ్చినపుడు తను ఇలా అనుకున్నారట: 'అందరూ తలా ఒక పని చేస్తున్నారు. నేను ఏ పనైనా చేద్దామంటే నాకు ఏ పనీ చేత కాదు. కనీసం ఏదైనా పుస్తకానికి ప్రూఫ్‌దిద్దే పని అయినా గురువుగారు నాకు ఇస్తే బాగుండును' నేను ఈ మాట చెప్పగానే వారి ఆనందం వర్ణనాతీతం. నేను మనసులో



అనుకున్న వెంటనే గురువుగారు ఈ విధంగా నా కోరిక తీర్చేసారు అని చాలా ఆనందపడ్డారు వారు. వారి సహకారంతో ఆ కార్యం ఎంతో అందమైన రూపుదిద్దుకుంది. వారు కూడా గురు ఆదేశంగా భావించి ఎంతో శ్రద్ధగా పనిచేశారు.

ఈ తెనుగుసేతలో అన్నివిధాలా సహకరించిన మా అమ్మగారు గురుసతీమణి శీమతి అనసూయమ్మ గారికి, శ్రీగంగిశెట్టి లక్ష్మీనారాయణ, రిటైర్డ్ వైస్ ఛాన్సలర్, ద్రవిడియన్ యూనివర్సిటి, కుప్పం గారికి, మా బావ డా॥ కుంటుముక్కల లక్ష్మీనారాయణ శర్మ, లింగ్విస్టిక్స్ ఆఫీసర్, తెలుగు అకాడమి గారికి, నా ధర్మపత్ని శ్రీమతి ప్రభావతికి, తోటి గురుబంధువులకు, మిత్రులకు నా కృతజ్ఞతాపూర్వక నమస్కారములు. ఈ గ్రంథ ముద్రణకు సహృదయంతో సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి హృదయపూర్వక అభివాదములు. ఈ గ్రంథానువాదంలో అటు భాషాపరంగా, ఇటు విషయపరంగా ఎటువంటి దోషాలు దొర్లినట్లు గమనించినా వాటిని సహృదయంతో తెలియచేస్తే మరో ముద్రణలో సవరించగలనని సవినయంగా మనవి చేస్తున్నాను.

**– సాయినాథుని నారాయణరావు,** శిరిడీ

# విషయసూచిక


| అధ్యాయము సంఖ్య | పుట సంఖ్య |
|---|---|
| **బాలకాండం** | |
| అధ్యాయము - 1 | 1 |
| అధ్యాయము - 2 | 18 |
| అధ్యాయము - 3 | 35 |
| అధ్యాయము - 4 | 56 |
| అధ్యాయము - 5 | 75 |
| అధ్యాయము - 6 | 89 |
| అధ్యాయము - 7 | 110 |
| అధ్యాయము - 8 | 129 |
| **అయోధ్యాకాండ** | |
| అధ్యాయము - 9 | 151 |
| అధ్యాయము - 10 | 167 |
| అధ్యాయము - 11 | 182 |
| అధ్యాయము - 12 | 201 |

శ్రీరామవిజయం


| అధ్యాయము సంఖ్య | పుట సంఖ్య |
|---|---|
| **అరణ్యకాండ** | |
| అధ్యాయము - 13 | 213 |
| అధ్యాయము - 14 | 228 |
| అధ్యాయము - 15 | 245 |
| అధ్యాయము - 16 | 263 |
| **కిష్కింధాకాండ** | |
| అధ్యాయము - 17 | 279 |
| అధ్యాయము - 18 | 296 |
| **యుద్ధకాండ** | |
| అధ్యాయము - 19 | 315 |
| అధ్యాయము - 20 | 331 |
| అధ్యాయము - 21 | 347 |
| అధ్యాయము - 22 | 364 |
| అధ్యాయము - 23 | 382 |
| అధ్యాయము - 24 | 399 |
| అధ్యాయము - 25 | 415 |
| అధ్యాయము - 26 | 434 |
| అధ్యాయము - 27 | 450 |
| అధ్యాయము - 28 | 464 |
| అధ్యాయము - 29 | 480 |
| అధ్యాయము - 30 | 494 |
| అధ్యాయము - 31 | 510 |
| అధ్యాయము - 32 | 528 |
| అధ్యాయము - 33 | 547 |
| **ఉత్తరకాండ** | |
| అధ్యాయము - 34 | 544 |
| అధ్యాయము - 35 | 559 |
| అధ్యాయము - 36 | 576 |
| అధ్యాయము - 37 | 592 |
| అధ్యాయము - 38 | 608 |
| అధ్యాయము - 39 | 622 |
| అధ్యాయము - 40 | 637 |

## అధ్యాయము - 1

# మంగళాచరణం

ఓం శ్రీగణేశాయ నమః। శ్రీసరస్వత్యైనమః।

శ్రీగురుభ్యోనమః। శ్రీసీతారామచంద్రాభ్యాం నమః!

పురాణపురుషుడు, భీమానదీతీరవాసి, దిగంబరుడు, నాశములేనివాడు, బ్రహ్మానందుడు అయిన జగద్గురువునకు ప్రణామములు.

**పరాత్పర ప్రణుతి**

సర్వజగత్తుకు వందనీయుడు, పూర్ణబ్రహ్మ, జన్మరహితుడు, అజేయుడు, సకలజీవుల ఆత్మలలో విశ్రమించేవాడు, శంకరుని హృదయంలో సదా నివసించేవాడు, పూర్ణానందుడు అయిన పరాత్పరునికి ప్రణతులు. మాయాచక్రచాలకుడు, మాయాతీతుడు, విరించి జనకుడు, సకలచిత్తపరీక్షకుడు, స్వజన రక్షకుడు, కరుణాసముద్రుడైన పరమాత్మకు వినతులు.

కమలసంభవుడైన బ్రహ్మ, వైకుంఠవాసియైన విష్ణుమూర్తి, కర్పూరగౌరుడైన పరమశివుడు, జగన్మాతయైన అంబిక, గజవదనుడైన గణపతి, దినకరుడైన సూర్యభగవానుడు అందరూ నీ స్వరూపాలే. ఈ స్వరూపాలన్నిటిలో నీవే సదా నిర్వికారుడవై వెలుగుతూ ఉన్నావు.

**గజానన నుతి**

ఓ మంగళకారకుడవైన గణాధిపా! శుభకార్యారంభాన నీకేకదా తొలి నమస్కారం. వర్ణనాతీతమైన నీ గుణగణాలను లిఖించేందుకు మంగళప్రదమైన ఈ ధరిత్రి కూడా చాలదు.

ఎర్రకలువలవంటి సుకుమారమైన, నూపురసహితమైన నీ చెంగావిరంగు పాదపద్మాలను భక్తులు నిరంతరం ధ్యానిస్తారు. నిర్దోషిత్వానికి, యశస్సుకు, పవిత్రతకు చిహ్నంగా క్షీరసముద్రాన్నే వస్త్రంగా ధరించావా అన్నట్టుగా నీ శ్వేతాంబరం గోచరిస్తుంది. నీ నుదుట సిందూరం అరుణ సంధ్యాసమయ సూర్యబింబంలా అలరారుతుంది. చందనచర్చితమైన నీ నాలుగు హస్తాలు భక్తరక్షణలో మందరగిరిని పోలి ఘనంగా విరాజిల్లుతున్నాయి. పట్టపగ్గాలులేని అశేషమైన అజ్ఞానభక్తుల కోర్కెలనే ఏనుగులను నియంత్రించుటకు నీవు జ్ఞానాంకుశాన్ని ధరించి ఉన్నావు. అలాగే ఐహిక వాంఛలతో దరి చేరే భక్తుల అజ్ఞానారణ్యాన్ని ఛేదించడానికి గజాననా! పరశువుతో సర్వదా సిద్ధంగా ఉన్నావు. ఎన్నటికీ వసివాడని లీలాకమలాన్ని చేత ధరించిన నిన్ను నిర్మలమైన అంత:కరణంతో భక్తులు పూజించకోరుతున్నారు. కల్పాంతంలో మెరిసే మెరుపుల్లా నీ అలంకారాలు మెరిసిపోతున్నాయి.

నక్షత్రకాంతులు కూడా వెలవెలపోయేటట్లు నీ మెడలోని ముత్యాలహారాలు కాంతులీనుతున్నాయి. హృదయాకాశంలో చంద్రునిలా వెలిగిపోతున్న పతకం ధరించినా క్షయరహితంగా, నిష్కళంకంగా ఆత్మానందంలో అలరారుతున్నావు. భక్తుల ప్రచండమైన విఘ్నాలను నీవు తొండంతో నిరోధిస్తున్నావు. కల్పాంతంలోని మెరుపులకంటె ఎక్కువగా నీ ఏకదంతం ప్రకాశిస్తున్నది. మణిమయ కర్ణకుండలాల తేజ:కాంతులు సూర్యచంద్రులే ఆ రూపంలో ఉన్నారా అనిపిస్తుంది. ఆ కాంతులు దశదిశలకు వ్యాపించాయి. రత్నకిరీటం కాంతులకు ఆకాశం కూడా శోభిల్లింది. అట్టి ఆదిపురుషుడే సాకారుడై కవికి వరదానమీయడానికి వచ్చాడు. అటువంటి గజాననుడు వరదహస్తంతో రామకథాబీజాన్ని నాటించి నా చేత నీరుపోయించాడు. అలా ఉదయించిన వరదచంద్రుడు కవి హృదయసముద్రాన్ని ఉల్లాసపరచి అపారమైన సాహిత్యాన్ని అనూహ్యంగా కుమ్మరించాడు.



జయజయ గజవదనా! నిరుపమానము, అగాధమైన నీ మహిమలు వర్ణింపనలవి కావు. నీ గుణగణాల అవధులను కొలుచుటకు నేనెలా యోగ్యుడనవుతాను? నేను ప్రాకృతభాషా పదజాలంతో నీ మహిమను వర్ణింపబూనుకొనటం, మేరుపర్వతాన్ని చీమ తన చంకలో నిడుకొని నృత్యం చేసినట్లు, బ్రహ్మాండాన్ని దోమ పైకెత్తినట్లు, భూగోళాన్ని ఈగ కదిలించినట్లు, చంద్రునికి కర్పూరలేపనం చేసినట్లు, సూర్యునికి అద్దం పట్టినట్లు, మలయాచలానికి ధూపం వేసినట్లు, మంచుకొండకు వింజామర వీచినట్లు, మేఘాలకు నీటిని, కల్పవృక్షానికి రేగుపళ్ళను, కామధేనువుకు ఎండుగడ్డిని, క్షీరసముద్రానికి మేకపాలను, బంగారుకొండకు పలుకురాయి సమర్పించినట్లుంటుంది. తనయుడు హఠం చేస్తే తండ్రి ప్రేమతో వలసినవి అందించినట్లు, నేను మనసారా ప్రారంభించిన ఈ రామవిజయాన్ని నీ కృపతో సిద్ధి పొందించ ప్రార్థిస్తున్నాను.

## సరస్వతీ స్తవం

తల్లీ సరస్వతీ! నీవు కవుల నాల్కలందు లాస్యం చేస్తావు. నీ అనుగ్రహం వలన మూగవాడు కూడా బృహస్పతి అవుతాడు. ఆనందసరోవరంలో రాయంచల్లా కవికుమారులు విహరిస్తుంటారు. ఆనంద సరోవరంలోని రాజహంసా! చాతుర్యచంపకకళికా! నీవు, నీ కృప అనే నౌకలో కవిబాలకులను ఆవలితీరానికి చేరుస్తున్నావు. ఓ విరించి దేవేరీ! నీ దయవల్ల జన్మాంధుడు కూడా నిపుణుడైన రత్నపరీక్షకుడు కాగలుగుతున్నాడు. అతి మూఢుడు కూడా వేదార్థాన్ని చెప్పగలుగుతున్నాడు. ముష్టివాడు కూడా ఇంద్రపదవికి ఎదగగలుగుతున్నాడు. మాతా! నీవు ఈ కవి హృదయకమలాన భ్రమరంలా తిరుగుతూ నిజానందసాగరవీచికలలో ఉర్రూతలూగించు. నా జిహ్వాగ్రాన నెలవుండి ఈ కావ్యాన్ని సఫలీకృతం చేయి. తల్లీ! వివేకమనే తెల్లని రాజహంస

నీ వాహనం. పుటంబెట్టిన నిర్మలమైన బంగారువన్నెతో నీ దేహం అంతా మెరసిపోతున్నది. తెల్లని వలువలు దాల్చి, దివ్యమైన ముత్యాలహారాలతో అలంకృతవై, నిజబోధ అనే వీణను మీటుతూ మధురమైన స్వరంతో గానం చేస్తూ స్వానందంలో పరవశిస్తుంటావు. శారదాదేవీ! నీ పాట విని త్రిమూర్తులు కూడా తన్మయులవుతారు. నీ సౌందర్యాన్ని చూచి మన్మథుడే నిశ్చేష్టుడయ్యాడు. రంభ, ఊర్వశి, తిలోత్తమ, సావిత్రి, లక్ష్మి నీ శేముషీసాగరపు సరిహద్దులలోకి కూడా రాలేకున్నారు. సూర్యుని జిల్లేడుపూలతో ఎలా పూజించగలము? ఆకాశాన్ని అరచేతిలో ఎలా ఇముడ్చగలము? బుట్టలో వాయువును ఎలా బంధించగలము? భూగోళాన్ని తూకం వేయలేము! సముద్రములోని నీటిని కొలవలేము! సప్తావరణాలు ఛేదించుకొని దోమ ఎలా దాటిపోగలదు? అలాగే ఓ తల్లీ! నీ గుణాలను వర్ణించనెవరితరం? అని కవి కుమారుడు ప్రార్థించగా, తనయుని పలుకులు విని తల్లి ప్రీతితో బిడ్డను హృదయానికి హత్తుకున్నట్లు కరుణతో కవిబాలుని జిహ్వాగ్రాన వసించింది. అమావాస్యనాడు చంద్రుని కోసం నిరీక్షించే చకోరంలా నా మనస్సు అతి మూర్ఖమైనది. కాని అతి కృపాళువైన సరస్వతీదేవి నాపై కృష్ణపక్ష విదియ నాటి తెల్లని చంద్రబింబంలా ప్రసన్నమైంది. శుక్లపక్ష విదియ నాటి నుండి చంద్రకళలు పెరిగే కొలది చకోరానికి ఆనందం దినదిన ప్రవర్తమానమైనట్లు ఈ కావ్యంలో రఘునాథుని లీలలు ముందుముందు అతిరసవత్తరంగా ఉంటాయి.

## గురుపూజ

అనంతమైన జ్ఞానచక్షువులను పరిపూర్ణంగా తెరచి దివ్యజ్ఞానాన్ని ప్రకటితం చేసే సద్గురువు పాదపద్మాలకు నా నమస్కారం. అజ్ఞానమనే చీకట్లను ఛేదించి వేదాంత జ్ఞాన సూర్యునిగా ప్రకటితమైన బ్రహ్మానంద మహారాజు అద్భుతమహిమను చూడండి. నరునిగా జన్మించి పాండురంగభక్తునిగా విఖ్యాతి



పొంది, భీమానదీతీరాన సమాధి పొందిన యతీశ్వరుడైన గురుదేవుని అద్భుతమహిమను ఎవరు వర్ణించగలరు? జాగృతి, స్వప్నము, సుషుప్తి, తురీయావస్థలకు అతీతుడై పంచమావస్థయైన తూరీయాతీతంలో స్థితుడై ఎప్పుడూ సచ్చిదానంద స్థితిలో ఉండే గురువునకు నమస్కారం. చంద్రుడు లేకుండా వెన్నెల, సూర్యుడు లేకుండా వెలుగు, నీళ్ళు లేకుండా విత్తనం మొలకెత్తడం, కన్ను లేకుండా చూపు, చిలకకుండా వెన్న ఎలా అసంభవమో అలా సద్గురువు లేకుండా పరమార్థం జీవునకు లభించదు. పెళ్ళికొడుకు లేని పెళ్ళి, తల లేని దేహం ఎంత నిష్ప్రయోజనమో గురుకృప లేని జపం తపం సాధన అంతే! అంజనం లేక నిధి, గాయత్రి లేక బ్రాహ్మణత్వం, గ్రామాలు లేక సీమ లభ్యంకానట్లు గురువు లేక జ్ఞానం రాదు. త్రికరణశుద్ధిగా నా గురువైన బ్రహ్మానందుని అనన్యంగా శరణుజొచ్చి ప్రారంభించిన ఈ గ్రంథం తప్పక సంపూర్ణ సిద్ధి పొందగలదు. చకోరాల కోసమే చంద్రుడుదయించాడా అన్నట్లు, మేఘాలే చాతకపక్షుల దగ్గరకు వెళ్ళినట్లు, క్షీరసాగరమే క్షుధార్తుల కెదురైనట్లు, దరిద్రుని ఇంటిని వెతుక్కుంటూ కల్పతరువే కదలివచ్చినట్లు, పరమదయాళువైన నా గురువు రామవిజయగ్రంథం చక్కగా రచింపగలవని నాకు అభయమిచ్చారు.

## సాధు సజ్జన ప్రశంస

సాధుసజ్జనులు వైరాగ్యమనే అరణ్యంలో సంచరించే సింహాలు, ఉదయాస్తమయాలు లేక సదా ప్రకాశించే జ్ఞానాకాశంలోని సూర్యులు. భక్తిరససరోవరంలో రాజహంసలు. అవిద్యారణ్యానికి అగ్నివంటివారు. పద్మ చిహ్నితహస్తులు. విశేషించి భవరోగ వైద్యులు. పంచాక్షరీ మంత్రోపాసనా ప్రభావంతో పంచభూతాలను పరుగులెత్తించగలరు. ముముక్షువులను చేరదీసి వారి భావదారిద్ర్యాన్ని పోగొట్టి వారిని దైవసంపత్తి గల భాగ్యవంతులుగా

చేయగలరు. అద్భుతమైన వారి దయాగుణంతో పోలిస్తే గోపురాల ఎత్తు సరిపోలదు. జీవుని భగవంతుని పాదాల చెంత చేర్చుటకు ముహూర్తం నిర్ణయించే జ్యోతిష్కులు వారు. సరస్వతి ముందు మూర్ఖుడు తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించినట్లు, సూర్యునికి దివిటీ చూపినట్లు, గంగాదేవిని చిన్న చెంబెడు నీటితో అభిషేకించినట్లు, బంగారుకొండను అందంగా ఇత్తడినగలతో అలంకరించినట్లు, కామధేనువుకు మేకపాలు సమర్పించినట్లు, శీతలం కోసం చంద్రునికి కర్పూర లేపనం చేసినట్లు, కోరికలు తీర్చే కల్పతరువుకు వేపపండ్లు, రత్నాకరునికి గాజుముక్కలు సమర్పించినట్లు శ్రోతలైన మీముందు ప్రాకృతభాషలో ఈ రచన చేయడానికి సాహసిస్తున్నాను. అయితే విష్ణువుకు అభరణాలెన్ని ఉన్నా తులసిపైనే ఎక్కువ ప్రీతి, పార్వతీపతికి భక్తితో సమర్పించిన బిల్వపత్రమంటేనే ఎంతో యిష్టం. రాజు మన్నన పొందిన దాసి అందరిపై అధికారం చెలాయిస్తుంది. అల్పమైన అభరణాలు ధరించినా జనం ముందు గొప్పలు పోతుంది. కానీ, మహర్షులైన మీ మహిమ అపారం. మూటలో గాలిని బంధించగలరు. ఆకాశాన్ని పాదాల క్రిందకి దింపగలరు. భూగోళంలోని రేణువులను లెక్కించగలరు. సముద్రంలోని జలాలను కొలవగలరు. కనకాద్రిని బంతిలా ఆడుకొనగలరు. ఆదిశేషువు పడగపైనున్న మణిని క్షణంలో తేగలరు. ఆకాశానికెగరి సూర్యుని పట్టుకొనగలరు. నక్షత్రాలను మాలగా గుచ్చగలరు. చంద్రమండలంలోని అమృతాన్ని ఆస్వాదించగలరు. ఐరావతం యొక్క దంతాన్ని విరుగగొట్టగలరు. దిగ్గజాలను ఒకచోట చేర్చి కట్టివేయగలరు. గుర్రం మీద వాయువేగంతో ప్రపంచమంతా తిరిగి రాగలరు. సదా బ్రహ్మానందంలో తేలియాడే సాధువుల మహిమను తెలుసుకోలేము అన్న కవి పలుకులు విని ఆనందఘనులైన ఋషులు మాటలు విని మా మనస్సు సంతృప్తి చెందింది. అందువలన మధురమైన దృష్టాంతాలతో కూడిన రామకథాశ్రవణం చేయాలని మేము ఉవ్విళ్ళూరుతున్నాము. అందమైన రత్నాలతో కూడిన మేరుపర్వతంలా,



నక్షత్రాలతో అలరారే ఆకాశంలా, ఫలాలతో నిండిన వృక్షంలా, శాంతి క్షమ దయాగుణాలతో శోభిల్లుతున్న సత్పురుషుల్లా, పరివారంతో కూడిన భూపతిలా ఈ గ్రంథం రసవంతమైన ఉపమానాలతో విరాజల్లుతున్నది అన్నారు.

ఆకలిగొన్న వానికి అమృతం లభ్యమైనట్లు, దరిద్రునికి కల్పతరువు దొరికినట్లు, భూమండలమంతా కన్యకోసం తిరిగేవానిని రాజకుమారి స్వయంగా వరించినట్లు, రోగగ్రస్తునికి సరైన ఔషధం అయాచితంగా దొరికినట్లు, రాజహంస ఇసుకను వదిలి మంచి ముత్యాన్ని ఆరగించినట్లు, శుష్క శాబ్దిక జాలాన్ని వదలి రసవత్తరమైన రామకథను మాత్రం వినిపిస్తాను. కోశాగారం నుంచి రత్నాలను ఏరుకొన్నట్లుగా సాధుసజ్జనులు ఈ కావ్యంలోని దోషాలను వదలి సద్గుణాలనే స్వీకరింతురుగాక!

అటువంటి సాధుపుంగవులైన మీరు నా మాటలు వినవచ్చినందుకు బ్రహ్మానందంతో శ్రీధరుడు సాష్టాంగనమస్కారం చేస్తున్నాడు. సాదరంగా రామకథను అవధరించండి.

**రామకథా పరంపర**

అనూహ్యమైన, అగమ్యమైన శతకోటి గ్రంథవిస్తారమైన శ్రీరామచరిత్రను వాల్మీకి విశేషంగా వర్ణించాడు. సత్యవతీ పుత్రుడు, పరాశరనందనుడు, జగద్గురువైన వ్యాసమహర్షి కథనం చేసిన రామకథను వ్యాసోక్త రామాయణమని, వసిష్ఠుడు వచించిన రామాయణాన్ని వసిష్ఠ రామాయణమని, శుకుడు కథనం చేసిన రామాయణాన్ని శుకరామాయణమని, అంజనీ హృదయారవిందభ్రమరమైన ఆంజనేయుడు కథాగానం చేసి వినిపించిన శ్రీరామచరిత్రను నాటక రామాయణం అని, అకుంఠితవిశ్వాసంతో రాముని శరణుజచ్చిన విభీషణుడు కథనం చేసిన రామచరిత్రను విభీషణ రామాయణమని, కమలోద్భవుడు, విష్ణుసుతుడు అయిన బ్రహ్మ నారదునితో

చెప్పిన ఈ చరిత్రను బ్రహ్మరామాయణమని, శివుడు ఉమకు చెప్పిన రామాయణాన్ని శివరామాయణమని, అర్ణవాన్ని ఆచమనం చేసిన అగస్త్యుడు పలికిన రామాయణాన్ని అగస్త్య రామాయణమని, ఆదిశేషుడు సర్పాలకు వినిపించిన రామాయణాన్ని శేషరామాయణమని, ఋషులంతా కలిసి సంకల్పించిన రామాయణాన్ని ఆధ్యాత్మరామాయణమని అంటారు.

శేషరామాయణం సత్యమని ఒకరు, ఆగమరామాయణం సత్యమని ఒకరు, కూర్మరామాయణం యథార్థమని కూర్మపురాణోక్తిగా ఒకరు, స్కంధరామాయణం సత్యమని ఒకరు, పౌలస్త్యరామాయణం సత్యమని ఒకరు, కాశికాఖండంలో రామకథ సవిస్తృతమని మరొకరు, రవి అనూరు సంవాదాన్ని అరుణరామాయణంగా ఒకరు, అగాధమైన పద్మపురాణంలోని పద్మరామాయణం శ్రేష్ఠమని ఒకరు, భరతరామాయణం ప్రశస్తమని ఒకరు, ధర్మరామాయణమని మరొకరు, బకదాల్భ్య ఋషి ప్రణీత ఆశ్చర్యరామాయణమని వేరొకరు, ఇలా మూలానికి సంబంధించి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. వాటన్నింటినీ వర్ణించటం నా తరమా! అందువల్ల నేను వాల్మీకి రామాయణాన్నే రామవిజయంలో తెలియజేస్తున్నాను.

**శంకరపూజ**

కవులందరికీ నమస్కారము. జగద్గురువైన శ్రీశంకరులు నాస్తిక మతాలను ఖండించి సమగ్రంగా శుద్ధమార్గాన్ని ప్రతిష్ఠించారు. పూర్వం సత్యవతీ కుమారుడైన వ్యాసునివలె కలియుగంలో జ్ఞానసాగరుడైన శంకరుడు జగత్తునుద్ధరించారు. సకలమతాలను సమన్వయించి సన్మార్గాన్ని పెంపొందించారు. సకల నాస్తికమతవాదులనే జంబుకాలపై శంకరుడు మృగరాజులా గర్జించారు. భూమిపైనున్న సకల మతవాద దరిద్రులకు శ్రీమంతుడైన శంకరులు విధియుక్తంగా సన్యాసదీక్షనిచ్చారు. ఆ మతవాద రాక్షసులను ఆదిశంకరులు రఘువీరునిలా ఛేదించారు. కౌరవులను వధించుటకు ఉరకలెత్తిన శ్రీకృష్ణునిలా సకల పాషండ మతాలను ఛేదించిన శ్రీశంకరాచార్యుల పాదపద్మాలకు శ్రీధరభ్రమరం ప్రణమిల్లుతున్నది.



**సుకవిపూజ**

శ్రీమద్భాగవతానికి వ్యాఖ్యను వెలయించిన శ్రీధర పండితులకు, శ్రీమద్భగవద్గీతకు టీకను రచించిన మధుసూదనునితో పాటు బాలగ్రంథకర్తలైన కవీంద్రులందరికీ శ్రీధరకవి నమస్కరిస్తున్నాడు. శృంగార వనాల్లో విహరించే విహంగంలా గీతగోవిందకర్త, పద్మావతీరమణుడైన జయదేవుని కావ్యకళను గాంచి పండితజనులు అచ్చెరువొందారు. వేదాంత క్షీరసాగరంలో మీనంలా విహరించేవాడు, వివేకసింధు గ్రంథాన్ని రచించినవాడు, గుణనిధి అయిన ముకుందరాజు పాదపద్మాలకు నమస్కృతులు.

గీతార్థాన్ని విడమరచి చెప్పి లోకాన్ని తరింపజేయుటకు ఆ రమావరుడు జగద్గురువైన జ్ఞానేశ్వరుని రూపంలో అవతరించాడు. భానుదాసకులభూషణుడు, ప్రతిష్ఠానపురనివాసి, పరిపూర్ణుడైన ఏకనాథుడు 'జ్ఞానేశ్వరి' అనే గ్రంథాన్ని ఎన్నోసార్లు ప్రవచించాడు. శేముషీ రాజధానికి కలశ సమానమైన ముక్తేశ్వర ముద్గలదాసు రచించిన రసవత్తరమైన గ్రంథాన్ని చూచి శ్రోతలు బ్రహ్మానందంలో తేలియాడారు. ఆకాశంలో చండకిరణుని తేజస్సులా, వామనస్వామివారి అపూర్వమైన శ్లోకరచనలు భూమండలమంతా వ్యాపించాయి. శాంతి దయలకు నెలవైన కృష్ణదాస జయరాముడు రచించిన గ్రంథము పరమజ్ఞాన భరితము. ఆయన ఘోటక బ్రహ్మచారి. శ్రీరామోపాసకులు. నిర్మలులు. భక్తిసరోవరంలోని రాయంచ అయిన రామదాస్‌మహరాజ్ జనులలో భక్తిని ప్రబలం గావించారు. బ్రహ్మానందస్వామికి స్వయానా అన్న అయిన శ్రీరంగనాథుని కవితలను విని అసంఖ్యాకంగా ప్రజలు పునీతులయ్యారు. ఒక్కమాటలో చెప్పాలంటే

కవివరులంతా నిజానికి బ్రహ్మానంద స్వరూపులే. నా గురువైన బ్రహ్మానందుని అనన్యంగా శరణు వేడి ఈ గ్రంథాన్ని వ్రాయుటకు తగిన ప్రేరణ కలిగించమని ప్రార్థిస్తున్నాను.

శ్రీరఘువీరుడు రవికులంలో అవతరించి ప్రబోధించిన లీలాకథామృతాన్ని వాల్మీకిమహర్షి మధురంగా గానంచేశారు. ఎన్నో పాపాలు చేసినా, శ్రీరామచరిత్రను వర్ణించి వాల్మీకి తరించారు. ఆ కథను వినండి.

**వాల్మీకి కథ**

వాల్మీకి బ్రాహ్మణపుత్రుడు. అతడి పూర్వనామం వాల్యా. ఆచారానికి విరుద్ధంగా యజ్ఞోపవీతాన్ని విసర్జించి కిరాతులతో కలసి అతి ఉన్మత్తుడై ఘోరారణ్యాల్లో, మనసుకు భీతిని గొలిపే కొండచరియల్లో, తన పరివారంతో నివసిస్తూ బాటసారులను భయపెట్టి, దారిదోపిడీ చేసి జీవించేవాడు. ఆ చుట్టుప్రక్కల పన్నెండు గ్రామాల మేరకు మాటువేసి దారిదోపిడీలు చేశాడు. అసంఖ్యాకంగా బ్రహ్మహత్యలు చేశాడు. ఇక ఇతర జీవాలు లెక్కేలేదు. చేపను పట్టుకొనే కొంగలా, ఎలుకకోసం కాపుకాసే పిల్లిలా, మాటేసి లేడిని చంపే వేటకానిలా, జీవులను చంపే నిర్దయుడు, పాపనిధి వాల్యా. అపారంగా జీవహత్య చేసి అంత్యజుని ఇంటిచుట్టూ ఎముకలు కుప్పలు పడి ఉన్నట్లు పాపపర్వతాలను ప్రోగుచేశాడు. ముసలితనంలో కూడా పాపాలు చేయడం మానలేదు. పుత్రులు యుక్తవయస్కులైనా వాల్యా తన దినచర్య వీడలేదు.

ఆయుధాలు చేబూని వాల్యా దారి కాచివుండగా పూర్వపుణ్యం వల్ల ఒకనాడు నారదమహర్షి తారలతో పరివేష్టించబడిన చంద్రునిలా ఋషులతో కలసి ఆ దారిన వచ్చాడు. చాలామంది తాపసులు వస్తున్నారన్న వార్త వాల్యాకు చేరింది. పరుగున వారి దారికి అడ్డువచ్చి ఆయుధాలతో బెదిరించి ఆ ఋషులను నిలదీశాడు. స్వర్గానికి పోయేముందు యమలోకం ఎదురయినట్లుగా,



మునితపోదీక్షకు కామక్రోధాలు అడ్డువచ్చినట్లుగా, ఆ ఋషి సముదాయం దారికి వాల్యా అడ్డుపడి, 'మీ దగ్గరవున్న ధనమంతా ఇచ్చేయండి, లేకపోతే ప్రాణాలు తీస్తాను' అని బెదిరించాడు. అప్పుడు నారదమునీంద్రుడు నా మాట విను. నీకు వృద్ధాప్యం వచ్చింది. ఎన్నో పాపాలు మూట కట్టుకొన్నావు. నీ పాపాల్లో ఎవరైనా భాగం పంచుకొంటారా? అని విచారిస్తున్నాను. నీకు మరణకాలం సమీపించింది. యముడు నిన్ను దారుణంగా హింసిస్తాడు. ఆ సమయంలో నిన్ను విడిపించేవారెవరు? బాగా ఆలోచించు. భార్య, బిడ్డలు, ధనము, యౌవనం, సహోదరులు, సేవకులు, ఆప్తులు, స్వజనులు, శస్త్రాస్త్రాలు, చతురంగదళాలు ఏవీ అక్కరకురావు. దేవతలు సకల తత్త్వాలలో వ్యాపించివుంటారు. జీవులు చేసే కర్మలన్నిటినీ వారు అవలోకిస్తూ పరలోకంలో సాక్ష్యమిస్తారు. నరకంలో చిత్రగుప్తుని వద్ద నమోదైన లెక్కల ప్రకారం నీకు దండన విధిస్తారు. అప్పుడు నిన్ను విడిపించేదెవరు? పుణ్యమార్గాన చరించని నరుని, తీర్థయాత్రలు చేసేవాళ్ళను నిందించేవారిని కాల్చిన రాగిరేకులపై మెల్లమెల్లగా నడిపిస్తారు. పరోపకారం చేయనివారిని కత్తులచక్రంలో పడవేసి తిప్పుతూ ఆయుధాలతో పొడుస్తారు. అప్పుడు నిన్నెవరు విడిపిస్తారు? దేవద్విజులకు నమస్కరించని వారిని కాల్చిన ఇనుప స్తంభాలకు కట్టి బాధిస్తారు. సాధుసంతులను అగౌరవపరిచేవారి నేత్రాలను గ్రద్దలచే కుళ్ళపొడుస్తారు. కీర్తన చేయని వారి నాలుకలను పట్టకారలతో చీలుస్తారు, గురుదేవ బ్రాహ్మణులను సేవించక షడ్రసోపేతమైన భోజనం చేసిన వారిచే మహానరకంలోని దుర్గంధ జలాలను తాగిస్తారు. తీర్థస్నానాలను నిందించేవారిని మరిగే నూనెలో పడవేస్తారు. సాధుసత్పురుషులను పీడించే వారి చర్మం ఒలుస్తారు. గురు, ద్విజ, తీర్థాలను అవహేళన చేసేవారి నోట్లో మూత్రం పోస్తారు. అధర్మంగా ధనం సంపాదించిన వారిని కుంభీపాకనరకానికి తీసుకొని వెళ్ళి, ఆక్రందనలను లెక్కచేయక, కణకణ చెలరేగే నిప్పుల్లో పడవేస్తారు.

విష్ణుకథ విననివారి చెవుల్లో యమదూతలు బాగా కాల్చిన కడ్డీలతో పొడుస్తారు' అని పలికిన నారదుని మాటలు విని, వాల్యా పశ్చాత్తాపం చెంది వేగంగా తన ఇంటికి వెళ్ళి భార్యాపుత్రులను ఈ విధంగా అడిగాడు. 'నాకు పాపం వచ్చింది ఎవరు ఎంత పంచుకొంటారు?' బదులుగా వారు 'మాకు పాపమెన్నటికీ సంభవించదు. మేము పుణ్యంలోనే పాలుపంచుకొంటాము. పాపమంతా నీవే అనుభవించు' అన్నారు.

వాల్యాకు ఏం చేయాలో పాలుపోలేదు. 'నరజన్మ ఉత్తమమైనది. భగవదనుగ్రహం వల్ల ప్రాప్తిస్తుంది. నేను ఆత్మహితం చేకూర్చుకొనక చీకటికూపంలో మునిగిపోయాను. సాగు చేసిన మంచిభూమిలో ఉమ్మెత్త విత్తు నాటినట్లు, బంగారుమొక్క నాటితే అందులో నుండి గడ్డిమొక్క మొలచినట్లు, అమృతకలశాన్ని దేవుడిస్తే దాన్ని చెత్తకుప్పలో పారబోసినట్లు, చింతామణిని ముక్కలు చేసి మెట్లకు వాడినట్లు, కామధేనువు వెతుక్కుంటూ ఇంటికి వస్తే దాన్ని కర్రతో కొట్టి బయటకు తరిమినట్లు అయింది నా పరిస్థితి' అని విలపించాడు. 'కల్పవృక్షాన్ని కొట్టేసి కంటకవనాన్ని పెంచాను. రాజహంసను గెంటేసి గుడ్లగూబను పోషించాను. మహామూర్ఖునిలా అరటితోటను నరికి జిల్లేడు చెట్లు నాటాను. మెరిసే ముత్యాలను విడిచి మూర్ఖంగా ఇసుకను మూటకట్టాను' అనుకుంటూ జరిగినదానికి ఎంతో పరితాపంజెంది వాల్యా నారదముని వద్దకు తిరిగి వచ్చి త్రికరణశుద్ధిగా సాష్టాంగనమస్కారంచేసి, డగ్గుత్తికతో కనులనిండా నీరు నిండగా 'స్వామి! నిన్ను అనన్యంగా శరణు వేడుతున్నాను. మీరు దయ అనే నౌకతో నన్ను పాపసాగరంనుండి తరింపజేయండి. మహర్షీ! నీవు ధన్వంతరివి. నా భవరోగాన్ని నిర్మూలించి, బడబాగ్నిలా జ్వలిస్తున్న నా తాపాన్ని మేఘంలా వర్షించి చల్లార్చండి. అహంకార మమకారాల మాయాజాలంలో నేను మైమరచిపోయాను. పంచభూతాలు నాతో ఆడుకొన్నాయి. విషయవాసనలు



నా మెడ పట్టుకొని వదలక పీడిస్తున్నాయి. ఈ దేహంపై వీడని మోహం, ఒక్కక్షణం కూడా వీడని మమత, లోభమనే రక్కసి, క్రోధమనే మహిషాసురుడు, కామమనే భేతాళుడు నన్ను కాలరాసారు. ఆశ అనే మాయాలాడి నన్ను తగులుకొని వీడడంలేదు. వీటన్నింటివల్ల నేను భ్రష్టుడనైనాను. ఓ బ్రహ్మనందనా! నీవు పంచాక్షరివి, సకల దుష్టశక్తులను పారద్రోలి నాకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించు' అని కాళ్ళమీదపడ్డాడు. రోగిని పరీక్షించి వైద్యుడు దివ్యౌషధాన్ని తీసినట్లు, అష్టభావాలు ముప్పిరిగొనగా బ్రహ్మసుతుడు ఆలోచించి మంత్రోచ్చారణ కూడా చేయలేని కుసంస్కారి వాల్యాకు 'మరా' అనే మంత్రాన్ని ప్రేమతో ఉపదేశించాడు. దీన్ని నీవు ప్రేమతో జపిస్తే దానిలోని మర్మం నీకు బోధపడుతుందన్నాడు.

తదుపరి వాల్యా నామజపమే జీవనంగా అక్కడే కూర్చుండిపోయాడు. అతడి దేహంపై పుట్ట పెరిగి లోపలనుండి ధ్వని మాత్రం వినవచ్చేది. వాల్యా చుట్టూ పెద్దవృక్షాలు పెరిగాయి. చాలాకాలం తరువాత నారద మహర్షి అక్కడకు వచ్చాడు. చెట్టునీడలో పుట్టనుండి వినబడుతున్న మధురమైన ఆ రామనామ జపధ్వని విని, జరిగినదంతా తెలుసుకొని, పుట్టను తొలగించి, వాల్యాను తట్టిలేపి బాహ్యస్మృతి కలిగించాడు. వెంటనే వాల్యా, దివినుండి భువికి దిగివచ్చిన దినకరునిలా ఉన్న నారదుని పాదపద్మాలను స్పృశించాడు. శ్రీరామనామజపంతో పాపమంతా నశించిపోయింది. గడ్డిపర్వతాలు అగ్ని తగులగనే ఎలా భస్మమైతాయో అలా రామనామజపంతో అనంతజన్మల దోషాలు దగ్ధమౌతాయి. పాపాలను పూర్తిగా పటాపంచలు చేసే నామమహిమ అపారం. నామంతో భస్మంకాని పాపాలే లేవు. వాల్మీకి చేసిన పాపాలన్నీ నామమహిమతో భస్మమయ్యాయి. నామం ముందు వివిధ తాపాలు తుచ్ఛమైనవి. పర్వతం మీద అగ్ని చెలరేగితే జంతువులు, పశుపక్ష్యాదులు పారిపోతాయి. అట్లాగే నామాగ్నిలో పాపారణ్యాలు మాడిపోతాయి. స్వప్నంలో చేసిన దుష్కృత్యాలన్నీ

మెలకువ రాగానే మిథ్యాభూతమైనట్లు, రామనామంతో సమస్త పాపాలు మాయమౌతాయి. సూర్యోదయానికి ముందు దట్టమైన చీకటిలా, సింహం రానంతవరకు విజృంభించే మదపుటేనుగులా, అగస్త్యుని రాకకు ముందు చెలరేగిన సముద్రంలా, భూతవైద్యుడు రాకముందు పెట్రేగే భూతాల్లా, రామనామోచ్చారణకు పూర్వం పాపపంకిలమైన వాల్యా రామనామజప మహిమతో పునీతుడై తరించాడు.

గురునాథుడైన నారదునితో వాల్మీకి 'మీరు నాయందు దయతలిస్తే నేను రామచరిత్ర కథను సవిస్తారంగా రచిస్తాను' అని వేడుకొన్నాడు. ఆ మాట వినగానే నారదముని ఆంతర్యంలో ఎంతో సంతోషించి తన వరదహస్తాన్ని వాల్మీకి శిరస్సుపైనుంచి ఏమన్నాడో అవధరించండి.

'ఆరవైవేల సంవత్సరముల పిమ్మట శ్రీమహావిష్ణువు దశరథుని కుమారుడై అవతరిస్తాడు. ఆయన చరిత్రను ముందే నువ్వు రచించు. నీవు రచించిన విధంగానే శ్రీరాముడు జన్మకర్మలీలలు నిర్వర్తిస్తాడు' అని ఆశీర్వదించాడు. శతకోటి అక్షర నిర్మితమయిన ఆ గ్రంథం సుమధుర రసభరితం. ఆ రామకథా రసమధురామృతధారలు ముల్లోకాలను కల్లోలపరచాయి. ఆ వ్యవహారం ఈశ్వరుని వరకూ వెళ్ళింది. పరమచతురుడైన కైలాసనాథుడు ఆ అక్షరాలన్నీ అందరికీ పంచి శేషంగా మిగిలిన రెండు అక్షరాలను తన కంఠంలో ఇముడ్చుకొన్నాడు. హాలాహలం మింగినందువల్ల కలిగిన తాపోపశమనానికి అంతకు పూర్వం చేసిన శీతలోపచారాలు సఫలీకృతం కాలేదు. చంద్రబింబాన్ని శిరస్సున ధరించినా, జటాజూటంలో గంగను ఇముడ్చుకొన్నా, శీతలము సుందరము అయిన హిమవన్నగపుత్రి పార్వతిని అర్ధాంగిగా చేసుకొన్నా, శ్రీరామవిజయం సర్పరాజును శీతలుడని ఒంటిపై ధరించినా, అత్యంత శీతలమని గజచర్మాన్ని శరీరానికి చుట్టుకొన్నా, హాలాహలం శాంతించకపోగా ప్రబలమయింది. అట్టి సమయంలో రామకథాగ్రంథంలోని రెండు అక్షరాలను



ఏరుకొని కంఠాన ధరించగానే ఉమావరుని శరీరం శీతలమయింది. హృదయంలో రఘూత్తముని ధ్యానం, ముఖతా రామనామస్మరణ, మధ్యలో మహాభీతినిగొలిపే హాలాహల తాపం, నాలుకపై 'నామం' ఆంతర్యంలో 'రామం'తాపాన్నంతా నిర్మూలించి శాంతి కలిగించింది. హాలాహలం అలంకారప్రాయంగా శివుని కంఠంలో మిగిలిపోయింది.

నామంతో వాల్మీకి, బ్రహ్మాదులు తరించిపోయారు. కైలాసనాయకుడు శీతలమయ్యాడు. అద్భుతమైన ఆ మహిమ వర్ణింపనలవి కానిది. అమృతం ఎంత తీయగానున్నా, ఆకాశం ఎంత విశాలంగానున్నా, సూర్యుడు ఎంత తేజస్సుగానున్నా ఏమని వర్ణించగలం? భూమిని దేనితో పోల్చగలం? పాతాళం లోతు, మేరుపర్వతం ఎత్తు ఎంతని లెక్కించగలం? విష్ణువు ప్రతాపాన్ని ఏమని వర్ణించగలం? శంకరుని తపాన్ని గురించి ఎంతని చెప్పగలం? అలాగే రామనామ మహిమ అనంతం, అవర్ణనీయం.

## ప్రాకృత సౌలభ్యం

ప్రాకృతభాష అని పండితులు అలక్ష్యం చేయవద్దు. కృష్ణవేణీ నదికి తీరాలు రెండున్నా నీరు ఒక్కటే. అలాగే వాల్మీకి రచించిన ఆ గ్రంథం మొత్తాన్ని భరద్వాజఋషి ముఖతా అనేకమంది ఋషులు బ్రహ్మానందంతో శ్రవణం చేశారు. ఈ రామకథను కైలాసంలో పార్వతికి శివుడు, పాతాళంలోని సర్పాలన్నింటికీ ఆదిశేషుడు, కదళీవనంలో ఋషులందరికీ అగస్త్యుడు, కింపురుషఖండంలో వానరులకు హనుమంతుడు, నారదునికి బ్రహ్మ, బదరికాశ్రమంలోని ఋషులందరికి వ్యాసుడు వివరించారు. అటువంటి రామకథను ప్రాకృతభాషలో ఈ శ్రీధరుడు సాధుపుంగవులయిన మీ ముందుంచుతున్నాడు. తల్లి ఎదుట బాల్యచాపల్యంతో బిడ్డ అసందర్భంగా మాట్లాడినా తల్లి ప్రీతితో స్వీకరించినట్లు, నేను చేసే ఈ ప్రయత్నాన్ని

సహృదయంతో స్వీకరించవలసింది. ప్రాకృతమయినా సంస్కృతమైనా అర్థం ఒక్కటే. ఇద్దరు భార్యలైనా నాథుడు ఒక్కరే అయినట్లు, రెండు చేతులున్నా మనిషి ఒక్కరే అయినట్లు, దవడలు రెండయినా స్వరం ఒక్కటే అయినట్లు, కళ్ళు రెండైనా చూపు ఒక్కటే అయినట్లు, పాత్రలు రెండయినా పాలు ఒక్కటే అయినట్లు, త్రివేణీజలం రెండుపాత్రలలోనున్నా మాధుర్యం ఒక్కటే అయినట్లు, రామేశ్వరునికి బంగారు బిందెతో అభిషేకించినా, రాగిబిందెతో అభిషేకించినా, జలం ఒక్కటే అయినట్లు, దేవునికి రెండూ సమానమే. ప్రాకృతంలో చెప్పినా సంస్కృతంలో చెప్పినా విషయం ఒక్కటే. బావిలోని నీటిని చేద సహాయంలేక దప్పిక తీర్చుకోలేరు. కానీ జలాశయం దగ్గరకు వెళితే సులభంగా దప్పిక తీర్చుకోగలిగినట్లు, సంస్కృత భాషలో ఉన్న విషయాన్ని పామరులకు అర్థమయ్యేటట్లు ప్రాకృతభాషలో అందించాను. పామరులకు ప్రాకృతభాషలో రచించిన ఈ గ్రంథం జనామోదమవుతుంది. మదగజాన్ని తామరతూండ్లతో బంధించలేనట్లు సంస్కృతాన్ని పామరులు ఆకళింపు చేసుకోలేరు. సంస్కృతమంటే అందరికీ ఆదరమే. పూర్వపుణ్యం వల్లకాని ఆ జ్ఞానం అబ్బదు. అటువంటప్పుడు ఆబాలగోపాలం దాన్ని అర్థం చేసుకోవడం ఎలా? రాజు ఉత్తమ వస్త్రాలను ధరిస్తాడు. కాని దీనుడికి గొంగళే శరణ్యం. పెరుగును బాగా చిలికితే వెన్న వచ్చినట్లు, స్వాతి చినుకులోనుండి ముత్యం తయారయినట్లు, చెరుకుగడ తినేకొద్దీ తియ్యదనం పెరిగినట్లు, రాజు వద్దనున్న రాజపుత్రునికి అధికగౌరవం లభించినట్లు, మరాఠీభాషలో రచించిన ఈ గ్రంథం అత్యంతరసభరితంగా ఉంటుంది. తేనెటీగ నోటినుండి స్రవించే మధువు రసవంతంగా ఉండదా! సంస్కృతం చంద్రబింబమయితే దాని వెన్నెలే ప్రాకృతం. సంస్కృత గ్రంథార్థాన్ని పండితులు ప్రాకృతంలో వివరిస్తారు. జిల్లేడుచెట్లు, తేనెతుట్టెలు ఎక్కడబడితే అక్కడ ఉంటాయి. వాటికోసం కొండగుహల్లోకి పరుగెత్తి కష్టపడాల్సిన అవసరమేమిటి? ప్రయత్నం లేకనే ఇసుకలో దివ్యరత్నాలు దొరుకుతున్నప్పుడు తెలివైనవారు వెంటనే వాటిని గ్రహిస్తారు కాని ఎందుకు



ఆలస్యం చేస్తారు? అనాయసంగా రాజ్యం లభిస్తే దానిని వదులుకోవడమెందుకు? అలాగే ప్రాకృతభాషలో కవనం చేయబడ్డ ఈ కథాలాభాన్ని శ్రోతలు పొందవలసింది. అసలే ముత్యాలతో చేసిన మాల, పైగా సువాసనలు గుబాళిస్తున్నాయి. అటువంటప్పుడు చతురులు ఎందుకు దానిని ప్రేమతో మెడలో వేసుకోరు! ముందే చెరుకుగడ తీపి, గడ మధ్యలో మాధురీరసం జాలువారుతుంది. అదే విధంగా రఘునాథ కథ సుఖప్రదమైనది. సాహిత్యంతో కలిపి రసవంతమై శోభిస్తున్నది.

ఇపుడు శ్రోతలు సావధానులు కండి. వాల్మీకి కథనంచేసి వెళ్ళారు. ఆ సంపూర్ణమైన రామకథను, ఆమూలాగ్రం వినండి. ఆ గ్రంథంపై దృష్టి సారించకనే దోషారోపణ చేస్తే, వారిని శతమూర్ఖులంటారు. పండితులు, వివేకులు కాజాలరు. గ్రంథం పేరు రామవిజయం. నిరంతరం శ్రవణం చేస్తే విజయం పొందుతారు. మనోరథం సిద్ధించాలంటే ఒకసారి పారాయణ చేయాలి. ఆదిపురుషుడు, శ్రీఅవధూత, శ్రీధరవరదులు అయిన బ్రహ్మానందమునీంద్రుల అద్భుతమహిమను ఎవరూ వర్ణించలేరు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడినది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**మొదటి అధ్యాయం మధురం**



## అధ్యాయము - 2

# శ్రీగణేశాయ నమః

**మా**నస సరోవరంలో తిరుగాడే రాజహంసల్లా సజ్జనులయిన ఈ పరమ హంసలు ఆంతర బాహ్య దృష్టులు సారించి ఈ రామకథ వినడానికి ఆతురులై ఉన్నారు.

పున్నమినాటి చంద్రోదయంతో సముద్రుడు ఉప్పొంగినట్లు – ఈ రామకథను చెవులారా వింటూ, నోరారా పారాయణ చేస్తూ – సాధు సజ్జనులు ఆనందోత్సాహాలతో పొంగిపోతున్నారు.

వర్షర్తువున ప్రవహించే గంగలా, మేఘగర్జన విన్నంతనే పురివిప్పి నాట్యమాడే నెమలిలా, వసంత కాలంలో మైమరచి గానంచేసే కోకిలలా, సూర్యకిరణ స్పర్శతో విప్పారే కమలంలా, దాతను చూచినంతనే యాచకునిలో ఉప్పొంగే ఆనందంలా, ఈ సాధు సజ్జనులను చూచి సరస్వతీదేవి మనస్సు పులకితమైపోయింది. ఇంద్రసభలో దేవతలు రంభ నాట్య కౌశలాన్ని తిలకించి ఆనందిస్తున్నట్లుగా, రామకథను విని ఆనందిస్తున్న సాధుసజ్జనుల సభను చూచి సరస్వతీదేవి కూడా సంతుష్టాంతరంగురాలయింది.

మహేశ్వరుడు హాలాహలాన్ని మింగినట్లుగా, సముద్రుడు బడబానలాన్ని ఇముడ్చుకొన్నట్లుగా, కూర్మావతార కాలంలో మహావిష్ణువు భూమిని తన వీపున ధరించినట్లుగా నా తప్పులను సాధు సజ్జనులు మన్నించి కడుపులో ఉంచుకోవలసినది.

ఇంతకు మించి తార్కాణాలు ఏమివ్వగలను? ఇంకేమీ తోచడంలేదు. విదియనాటి చంద్రుడికి నూలుపోగు సమర్పించినట్లు, సజ్జనుల హృదయంలో



సత్యం నాటుకొన్నట్లు నారదమునిచే ఉద్ధరించబడిన వాల్మీకిమహర్షి రచించిన ప్రథమాధ్యాయ రామకథా విషయం శాశ్వతసత్యం.

శ్రీరామ కథను ప్రారంభిస్తున్నాను. రామకథా కవనం కృష్ణవేణి గమనం వంటిది. కృష్ణవేణి ప్రారంభంలో ఓ పిల్లకాలువగా ఆరంభమయి, సముద్రములో కలిసేముందు సంపూర్ణతను సంతరించుకొంటుంది. ఈ రామకథా కథనం కూడా అలాంటిదే.

### సోదరసమేతంగా రావణ ఉద్భవం

బ్రహ్మ మానసపుత్రుడైన పులస్త్యుడు సూర్యుడిలా ప్రకాశించేవాడు. అతడికి నాలుగు వేదాలు కంఠస్థం. తృణబిందుని కూతురు[1] పులస్త్యుని గృహిణి. దేవకుల సంజాతురాలు. వీరికి పుట్టినవాడే విశ్రవసుడు. విశ్రవసునికి భారద్వాజ[2] పుత్రికి కుబేరుడు జన్మించాడు. విశ్రావసుని పుత్రుడైనందున కుబేరునికి వైశ్రావణుడని పేరు. వైశ్రావణుడు ఘోరమైనతపస్సుతో బ్రహ్మను మెప్పిస్తే, బ్రహ్మ సంతోషించి తన మునిమనవడైన కుబేరునికి పుష్పక విమానాన్ని, సముద్ర మధ్యంలో లంకానగరాన్ని నిర్మించి యిచ్చాడు. కుబేరుని వద్ద ఉండే లంకానగరాన్ని రాక్షసులు తమ బలంతో వశపరచుకొన్నారు. కొంతకాలం తరువాత రాక్షసులను జయించి దేవతలు లంకా నగరాన్ని తిరిగి కుబేరుడికి కట్టబెట్టారు.

కొంతకాలానికి పాతాళంలో నివసించే సుమాళి అనే రాక్షసుడు భూలోకానికి బ్రాహ్మణ వేషంలో వచ్చాడు. అప్పుడు అతడు లంకానగరంపై మోజుపడి దాన్నెలాగైనా స్వంతం చేసుకోవాలని నిశ్చయించుకొన్నాడు. ఇందుకుగాను లంకను పాలించే రాజవంశం వివరాలను రాబట్టుకొన్నాడు.

---

1 తృణబిందు మహర్షి కూతురు 2 భారద్వాజుని పుత్రిక దేవపర్ణి

కుబేరుని అందాన్ని చూసి, నా కుమార్తెను ఈతని తండ్రికి యిచ్చి వివాహం చేస్తే, వారి సంతతితో ఈ లంకను అవలీలగా వశం చేసుకోవచ్చు అని మనస్సులో దురాలోచన చేశాడు దురాత్ముడయిన సుమాళి. కపట వేషధారిగా ప్రశాంతతను నటించాడు. వేశ్యయొక్క పాటలా, దాంభికుని భజనలా, లోభికి తత్వబోధలా, పరధనాపహరణకై ఉపయోగించే సౌందర్యంలా, కొంగజపంలోని శాంతస్వభావంలా, విటులను ఆకర్షించడానికి అలంకరించుకొనే వేశ్యలా, దొంగ సాధువులు చేసే తీర్థాటనలా, అరణ్యమధ్యంలో ముని వేషధారులయిన దోపిడీదొంగల్లా, మహాదురాశాపరుడు స్వార్థం కోసం ఇతరుల ప్రాణాలను సైతం తీయడానికి వెనుకాడని పయోముఖ విషకుంభ మనస్తత్వంగల సుమాళి తన కుమార్తె కైకసిని విశ్రావసుని వద్దకు తీసుకొనివచ్చి, నేను ఒక బీద బ్రాహ్మణుడిని. నాకెవ్వరూలేరు. నా కన్యను వివాహమాడి నన్ను కృతార్థుణ్ణి చేయవలసింది! అని ప్రార్థించి కైకసిని అతనికిచ్చి వివాహం చేసి, కపట వేషధారి అయిన సుమాళి పాతాళానికి తిరిగి వెళ్ళిపోయాడు.

ఒకనాటి సాయంసంధ్యావేళ విశ్రావసువు హోమం చేయబోతూండగా కైకసి భర్తను సమీపించి సంభోగేచ్ఛను వ్యక్తం చేసింది. భార్య కోరినపుడు సంభోగించని భర్తకు శిశు హత్యా దోషం సంక్రమిస్తుందనే తలంపుతోనున్న విశ్రావసుని హోమానికి వెళ్ళకుండా దురాత్మురాలైన కైకసి అడ్డగించింది. మనసులో మథనపడుతూనే భార్యతో సంగమించాడు. తరువాత భార్యతో, నువ్వు బ్రాహ్మణ కన్యవు కావు. పాపరూపివయిన తాపసివి. నీ సంతతి రాక్షసులయి పరమ దురాచార వర్తనులవుతారు అని శపించగా, కైకసి భర్త పాదాలమీద వాలి తనకు ఒక్కడయినా సుపుత్రుడు కలిగేలా కరుణించమని వేడుకొంది.

తరువాత కైకసికి రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు అనే ముగ్గురు కొడుకులు, తాటక, శూర్పణఖ అనే ఇద్దరు కుమార్తెలు జన్మించారు.



విశ్రావసువు వర విశేషంవల్ల విభీషణుడు సాధు స్వభావంతో జన్మించాడు. కుంభకర్ణుడు పుట్టినపుడు బిగ్గరగా ఏడ్చాడు. ఆ ధ్వనికి భూగోళం దద్దరిల్లింది. ప్రజలందరూ ప్రళయం వచ్చిందేమోనని భయభీతావహులయ్యారు. కాకులలో కోకిలలా, ముత్యపు చిప్పలో ముత్యంలా, దైత్య కులంలో ప్రహ్లాదుడిలా, విభీషణుడు రాక్షస వంశంలో జన్మించాడు. కాకిరెట్టలో పుట్టినా రావిచెట్టు విష్ణువుకు ఎంత ప్రీతి పాత్రమో దైత్యకులంలో పుట్టినా హరికి విభీషణుడు అంతే ప్రియుడు. కొంతకాలం తరువాత గోకర్ణతీరంలో ఆ ముగ్గురూ తపస్సు చేయసాగారు. రావణుడు అపర్ణా రమణుడైన ఈశ్వరుని, కుంభకర్ణుడు బ్రహ్మను, విభీషణుడు విష్ణువును ఆరాధించసాగారు. వారు చేసే భీకరతపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై ఆ ముగ్గురినీ వరాలు కోరుకొమ్మన్నాడు. అధిక సంపద, సంతతి, విద్య, బలం, సర్వ కళాప్రావీణ్యంతోపాటు, ఇంద్రాదిదేవతలు, నాగులు తన ఆజ్ఞానువర్తులుగా సంచరించేలా చేయమని రావణుడు కోరుకొన్నాడు. కుంభకర్ణుడి వంతు వచ్చేసరికి చరాచర సృష్టిని భక్షించాలన్న కోరిక కోరుతాడేమోనని దేవతలు తల్లడిల్లిపోయారు. భూగోళాన్ని మ్రింగి మునులను కర కర నములుతాడేమోనని భీతిల్లి, దేవతలు సరస్వతీదేవిని లోకకళ్యాణార్థం కుంభకర్ణుని నాలుక చివర వసించి ఆపదనుంచి కాపాడమని ప్రాధేయపడ్డారు. బ్రహ్మ ఆజ్ఞానుసారం కుంభకర్ణుడు వరమడగడానికి ఉద్యుక్తుడయ్యాడు. సరస్వతీదేవి మాయా ప్రభావంవల్ల సదా నిద్రలో ఉండిపోయే వరాన్ని కోరుకొనగా బ్రహ్మదేవుడు తథాస్తు అన్నాడు. వెంటనే కుంభకర్ణుడు శవంలా పడిపోగా అతని జ్ఞానమంతా సుషుప్తిలోనే మునిగిపోయింది. మహావృక్షంలా నేలకూలిన కుంభకర్ణుడు నిద్రలో మునిగి గురక పెట్టసాగాడు. ఆ శబ్దం నాలుగు దిక్కులా వ్యాపించింది. అరణ్యంలో నివసించే జంతుజాలమంతా కుంభకర్ణుడు పీల్చే శ్వాసకు అతడి నాసికా రంధ్రాలగుండా లోపలికి వెళ్ళి, శ్వాస వదలినప్పుడు తిరిగి భూమిమీదకు వచ్చి పడుతుండేవి. దేహానికి నిద్ర

సమాధి వంటిది. జీవాత్మకు నిద్ర ముసుగులా వర్తిస్తుంది. నిద్ర ధ్యానాన్ని, నిష్ఠను భంగం చేస్తుంది. భ్రాంతి చెందినవారికి మాత్రమే నిద్ర విశ్రాంతి స్థానంగా ఉపకరిస్తుంది. దొంగలకు మోసగాళ్ళకు సహాయపడుతుంటుంది. రాత్రి, మరణం, నిద్రకు తోబుట్టువులే. జీవులకు విశ్రాంతి కలుగజేసినా, సూక్ష్మంగా పరిశీలించినట్లయితే నిద్ర ఆయుష్షును హరిస్తుంది. కుంభకర్ణుడు అలా గాఢనిద్రలో మునిగిపోయాడు. మెలకువ లేదు. అహోరాత్రులు నిద్రాంబుధిలో మునిగిపోయిన కుంభకర్ణుణ్ణి చూసి విశ్వావసువు – 'ఈతని జన్మ వ్యర్థమయింది కదా' – అని విచారిస్తూ కుంభకర్ణుడికి ఆరు నెలలు నిద్ర, నిద్ర నుంచి మెలకువ రాగానే ఒక్కరోజు అన్ని సుఖాలు అనుభవించేట్లుగా అనుగ్రహించమని బ్రహ్మదేవుణ్ణి వేడుకొన్నాడు. అలాగే అని బ్రహ్మ అనుగ్రహించాడు.

పిదప విభీషణుని వరం కోరుకొమ్మనగా, సత్యశీలుడు, పవిత్రుడయిన విభీషణుడు సత్సమాగమం, శాస్త్రస వైదుష్యం, భజన, నిందావాద ద్వేషరహితమయిన విష్ణుచింతనం, వైరాగ్యం కలిగేట్టుగా వరం ప్రసాదించమని అర్థించాడు. ఆశ, విషయవాంఛలు, మనోవేగం, భ్రాంతి, వాసన, కోరికలు, మతిచాంచల్యం, మమత, అవిద్య వదలి విష్ణు చింతన చేస్తూ అరిషడ్వర్గాలను, అహంకారాన్ని నిర్జించగలనని భావించాడు విభీషణుడు. నిశ్చలానందంతో భక్తిస్వరూపుడయి శ్రీరాముని కీర్తిని లోకంలో వ్యాపింపజేయ అవతరించిన ధన్యజీవి అతడు.

సూర్యోదయానికి ముందు ఉషస్సులా, జ్ఞానం ముందు భజనలా, భజనకు ముందు వైరాగ్యంలా, తపస్సుకు పూర్వం శుభ్రతలా, బోధనకు ముందు సత్వగుణంలా, సత్వగుణానికి ముందు పుణ్యంలా, సాక్షాత్కారానికి ముందు ఆత్మచింతనలా, మననానికి ముందు శ్రవణంలా, శ్రవణానికి పూర్వం జిజ్ఞాసలా, శమదమాలకు ముందు విరక్తిలా, ఆనందానికి ముందు కలిగే వైరాగ్యంలా,



ఆత్మసుఖానికి ముందు లభించే శాంతిలా, ఫలానికి ముందు పూచే పుష్పంలా శ్రీరాముడి రాకను విభీషణుడు ముందే సూచించాడు. విభీషణుడి పుట్టుకవల్ల రాక్షసవంశం ధన్యమవుతుందని బ్రహ్మదేవుడు వచించాడు.

విభీషణుడికి ఉండే లక్షణాలన్నీ, రామోపాసన చేసే సాధువులకూ ఉంటాయి. మౌనం, దంభ రాహిత్యం, అహింస మొదలయిన గుణాలు ఎక్కడ ఉంటాయో అక్కడ రామభక్తుడుంటాడు. ఎవడు ఆత్మనిగ్రహంతో శాంతిని కలిగి ఉండి ఆత్మస్తుతిని కలలో కూడ రానీయడో, ఇతరుల దోషాలను లెక్కించడం సహించడో, పరుల మంచి గుణాలను గురించి గొప్పగా చెప్పి మర్చిపోకుండా ఉంటాడో, అణుమాత్రం గర్వం లేకుండా, నిష్ఠురం ఆడకుండా, తన్ను ఎవరయినా తిట్టినా ఆనందంగా స్వీకరిస్తాడో, దేనినీ అహంకారంతో తిరస్కరించకుండా ఉంటాడో అతడే నిజమయిన రామభక్తుడు. మేఘం ఉప్పునీటిని గ్రహించి మంచి నీటిని వర్షిస్తుంది. ఆవు గడ్డి తిని పాలనిస్తుంది. ఎరువు వేసిన పొలంలో పండిన చెఱకురసం తీపిగా ఉంటుంది. అన్ని పాపాలను తనలో ఇముడ్చుకొని గంగానది పుణ్యం ప్రసాదిస్తుంది. పరుసవేది లోహం కరకుదనాన్ని పోగొట్టి బంగారంగా మారుస్తుంది. అలాగే సాధువులు, సజ్జనులు తమ మంచితనంతో ఇతరుల దోషాలను కప్పిపుచ్చి సద్గుణాలను ప్రకాశింపజేస్తారు. వేశ్యలా అవయవ ప్రదర్శన చేయకుండా కులకాంత ఎలా వస్త్రాలను నిండుగా ధరిస్తుందో అలాగే సజ్జనులు తమ సుకృతాలను లోకానికి తెలియనీయరు. పరమ భక్తుడయిన విభీషణుడికి వరాలిచ్చిన తరువాత నీకు రఘువీరుడి దర్శన భాగ్యం కలుగుతుంది. సూర్యచంద్రుల మిత్రుడైన శ్రీరాముడు నిన్ను చిరంజీవిగా చేస్తాడని దీవించి బ్రహ్మదేవుడు అదృశ్యమయ్యాడు.

## రావణ కుబేర సమరం

అనంతరం రావణ, కుంభకర్ణులు రాక్షససేనను సమాయత్తపరచి ప్రధానులైన ప్రహస్తుడు, మహోదరుడు, ధావిన్నలుడు తోడురాగా,

విద్యుజ్జిహ్వుడు, జంబుమాలి, వజ్రదంష్ట్రుడు, విరూపాక్షుడు, ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు, విద్యున్మాలి, మాల్యవంతుడు, మత్తుడు, మహామత్తుడు, యుద్ధోన్మత్తుడు, సఖుడు, సారణుడు, దుర్ధరుడు మొదలగు బలాఢ్యులను తోడ్కొని, కుబేరుని స్థానమైన లంకపై దండెత్తాడు. చాలారోజులు ఘోర యుద్ధం సాగింది. కుబేరుడు రావణుని ధాటికి తట్టుకోలేకపోయాడు. నీ సవతి తల్లి కుమారుడయిన రావణుడికి లంకారాజ్యాన్ని అప్పగించాల్సింది అని తండ్రి వ్రాసిన లేఖను చివరిగా కుబేరుడికి అందించాడు రావణుడు. తండ్రి ఆజ్ఞను వేదవాక్యంలా పాటించి లంకను రావణుడికి అప్పగించి కుబేరుడు తన సంపదనంతా విమానంలో వేసుకొని సత్యలోక పాలకుడైన బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్ళాడు. బ్రహ్మదేవుడు కుబేరుడికి అలకాపురిని నిర్మించి యిచ్చాడు.

రావణుడు రాక్షస రాజయిన మయుని పుత్రికలు– మండోదరి, శక్తిలను, కుంభకర్ణుడు బలి మనుమరాలయిన దీర్ఘజ్వాలను, విభీషణుడు గంధర్వకన్య అయిన సరమను వివాహమాడారు. సకల రాజన్యలోకం భయానికి లోనయి లంకకు వచ్చి రావణాసురుడికి శరణాగతులయినారు. రావణుడు అన్ని దేశాలను జయించి గోబ్రాహ్మణులను పీడిస్తూ వారిని నానాహింసలు పెడ్తుండేవాడు. ప్రజలు భయపడి దాక్కోవడానికి కూడా చోటులేక కుబేరుడితో మొరపెట్టుకున్నారు. విషయాలను గ్రహించి రావణుడి దగ్గరకు దూతను పంపాడు. మీరు ఋషి పుత్రులు, వేదవేదాంగ పారంగతులు, అయినా వేదధర్మాలనతిక్రమిస్తూ, ఖండిస్తూ, అశాస్త్రీయంగా ప్రవర్తిస్తున్నారు. శాస్త్ర విధులకు వ్యతిరేక నడవడి కలిగివున్నారు. సృష్టిలో సర్వజన పూజ్యులయిన గోబ్రాహ్మణులను నానాహింసలు పెట్టి అకృత్యాలు తలపెడుతున్నారు. ఇంతకన్నా అధర్మం ఏదీ ఉండదు కదా? శాస్త్రసజ్ఞానం ఉండీ ఇటువంటి వారికి ఇహలోకంలోకాని, పరలోకంలోకానీ ఎదురయ్యేవి అనర్థాలే. కురూపి అద్దంలో తన రూపు చూసుకోనంతకాలమే తన అందంపై అహంభావం కలిగి ఉంటాడు. శాస్త్రసజ్ఞానం ఉన్నా మనసులో మంచిచెడుల విచక్షణ లేక, దోషభూయిష్ఠమైన ప్రవర్తన కలిగివుండటం విపరీతమైన స్థితి! – అన్న కుబేరుని సందేశాన్ని దూత రావణుడికి వినిపించాడు. ఈ మాటలకు రావణుడు ముష్టిఘాతం తిన్న బెబ్బులిలా, దండతాడిత భుజంగంలా, పాదఘట్టనకు లోనయిన సర్పంలా, తొండం మెలిదిప్పబడిన ఏనుగులా, ఆజ్యం పోసిన అగ్నిగుండంలా మండిపడ్డాడు. కోపోద్రేకంతో సకల సైన్యాన్ని సమీకరించి కుబేరుని నగరాన్ని చుట్టుముట్టాడు. సకల సంపదలను, పుష్పక విమానాన్ని బలవంతంగా హరించాడు. రావణుడి ధాటికి ఆగలేక కుబేరుడు ఇంద్రుని శరణుజొచ్చాడు. ఇంద్రుడు కుబేరుని తన కోశాధికారిగా నియమించాడు. కుబేరునిపై దండెత్తిన కాలంలో రావణుడికి ప్రథమ పుత్రుడైన మేఘనాథుడు జన్మించాడు. అనేక వేలమంది యువతులతో సంభోగించినా రావణుడికి తృప్తి కలుగలేదు. ఒక లక్ష మంది పుత్రులు, లక్షన్నరమంది మనవలు కలిగారు. అష్టాదశ అక్షోహిణి సేనలు రాత్రి పగలు మేళతాళాలతో కొలుస్తుండేవారు. భూమిపైన ఓడిన రాజులందరూ లంకాద్వారం వద్ద చేతులు జోడించి నిలబడి కాపలా కాస్తుండేవారు. రాత్రింబగళ్ళు వేల కర్పూర దివిటీలతో నిశాచరులు అప్రమత్తులై సంచరిస్తుండేవారు.



ఒకనాడు పర్వతాలన్నీ రావణుడి సమక్షానికి వచ్చి 'ఇంద్రుడు మా రెక్కలను నరికేస్తున్నాడు. మమ్మల్ని కాపాడగలిగిన సమర్థుడవు నువ్వే' అని ప్రార్థించాయి. రావణుడు 'మీరంతా గజరూపులై వర్తించండి' అని వరమిచ్చాడు. దాంతో ఆ పర్వతాలన్నీ మత్తగజాలయ్యాయి. అనంతరం రావణుడు దేవతలపై, మేఘనాథుడు ఇంద్రునిపై దండెత్తారు. ఇంద్రుడు ఐరావతంతో సహా నేలకూలాడు. మేఘనాథుడు ఆ విధంగా పదిహేడుసార్లు ఇంద్రుని జయించి 'ఇంద్రజిత్తు' అయ్యాడు. ఇంద్రుని బంధించి భూలోకానికి తీసుకుపోయే సమయంలో బ్రహ్మ ప్రత్యక్షమై మేఘనాథునికి కావలసిన వరాలు ప్రసాదించి

ఇంద్రుని విడిపించాడు. రావణుడు బ్రహ్మ వరప్రభావంవల్ల దేవతలనందరినీ జయించి, తన సేవలకు నియమించాడు. రావణుడి మెడలో ప్రతిరోజు ఇంద్రుడు ఒక హారం వేయాలి. చంద్రుడు ఛత్రాన్ని పట్టాలి. సూర్యుడు ద్వారపాలకుడు. కుబేరుడు, వాయువు ప్రాత్ణకాలంలో తన వాకిలిముందు కళ్ళాపుజల్లి ముగ్గులు వేయాలి. అగ్ని రజకుడుగా, బ్రహ్మ పురోహితుడుగా, బృహస్పతి ఆస్థాన పండితుడిగా, నారద తుంబురులు ఆస్థాన గాయకులుగా వర్తించాలి.

**రావణుని శివపూజ**

అలా దేవతలను వశపర్చుకొన్నా శివుడిని వశపరచుకోవాలని రావణుడు తన 20 చేతులతో, 10 నాలుకలతో నిరంతరం శివుని పూజించేవాడు. ఒకసారి పుష్పక విమానంలో రావణుడు ఆకాశమార్గాన వెళుతూ కైలాసగిరి ముందు ఆగాడు. ద్వారం వద్ద వుండే నంది, పుష్పకం దిగివచ్చిన రావణుని శివపార్వతులు ఏకాంతంలో ఉన్నారు. నీవు ఇప్పుడు ప్రవేశింప వీలులేదు అంటూ అడ్డగించాడు. రావణుడు ఆ ఆటంకాన్ని సహించలేక, కుపితుడై, నందితో "నీ కోతి మాటలు నేను లెక్కచెయ్యను. నన్నెవరూ ఆపలేరు. బలాత్కారంగానైనా ప్రవేశిస్తాను"అని అన్నాడు. అందుకు మహానందికి కోపం వచ్చి, "నువ్వు ఉద్రేకివి. మూఢుడివి. నన్ను కోతినని హేళన చేశావు. రణంలో నిన్ను ఆ వానరులే వధిస్తారు. దశ రుద్రాలు చేసినా, ఏకాదశ రుద్రునిలా మారుతి నిన్ను సంహరిస్తాడ"ని శపించాడు. దాంతో రావణుడు మరింత ఉద్రేకపడి కైలాసాన్నే పెకలిస్తానని బీరాలు పలుకుతూ కైలాసాన్ని ఎత్తడానికి ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గ్రహించిన కైలాసనాథుడు తన పాదంతో కైలాసాన్ని అణగద్రొక్కి ఉంచాడు. అంత బాధపడుతూనే వెయ్యేళ్ళు రావణాసురుడు కైలాసనాథుని స్తుతించాడు. అతని భక్తికి మెచ్చి ప్రసన్నుడై శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఆనందంతో రావణుడు లంకకు తిరిగి వచ్చాడు.



ఒకసారి రేవానదీ తీరంలో రావణుడు సైకత లింగం ముందు ధ్యానమగ్నుడయి ఉన్నాడు. చుట్టూ నీళ్ళు పొంగుతుండేవి. నదిలో చెలరేగే అలలు నీటి మట్టంలో హెచ్చుతగ్గులు కల్పిస్తూ ఉండేవి. అప్పుడు కార్తవీర్యార్జునుడు తన భుజబలంతో నదీప్రవాహాన్ని అడ్డుకొన్నాడు. ఫలితంగా నీటిమట్టం పెరిగి రావణుడు ఆకంఠ పర్యంతం మునిగిపోయాడు. ఆ చర్యకు రావణుడికి కోపం వచ్చి "ఎవరు నువ్వు? ఈ రేవా నదిలోని నీళ్ళను ఆపడానికి నీకెవరు అధికారం ఇచ్చారు" అని ప్రశ్నించగా సహస్రార్జునుడు క్రోధంతో మండిపడ్డాడు. సింహం ఏనుగు మీదికి దూకినట్లుగా రావణుడి మీదికి దూకి, మెడను గట్టిగా పట్టుకొన్నాడు. దాంతో ఉక్కిరిబిక్కిరైన రావణుడు చాలాకాలం కార్తవీర్యార్జునుడి బందీగా ఉన్నాడు. ఆ స్థితిలో విశ్రావసువు వచ్చి కార్తవీర్యార్జునుని బ్రతిమాలి, కుమారుణ్ణి విడిపించుకొనిపోయాడు.

**బలిచే రావణుని పరాభవం**

లంకాధీశుడు ఒకసారి బలిచక్రవర్తి నగరాన్ని చూసి, అహంకారంతో ఎలుక ఆహారం కోసం పాము పుట్టలోనికి దూరినట్లుగా ఆ రాజ్యంలో ప్రవేశించాడు. బలియందు ప్రేమతత్పరతవల్ల సూర్యచంద్రుల తేజస్సు కలిగిన త్రివిక్రముడు దండధారియై నగర ముఖద్వారం వద్ద కాపలాగా ఉండేవాడు. ఆ త్రివిక్రముడే రావణుడిని నగర ప్రవేశం చేయనీయకుండా అడ్డుకొన్నాడు. అందుకు రావణుడు ఆగ్రహించి, "బలిచక్రవర్తిని పిలువు! లేకపోతే ఈ నగరాన్ని సముద్రంలో విసిరి పారేస్తాను" అని హుంకరించాడు. "అలాగా, అయితే నువ్వే లోపలకు వెళ్ళు. బలిప్రతాపం ఏమిటో నీకే తెలుస్తుంది అని అన్నాడు త్రివిక్రముడు. రావణుడు నగరప్రవేశం చేసి, సభాసీనుడై ఉన్న విరోచనుడి పుత్రుడయిన బలిని చూశాడు. గడ్డిబొమ్మ అగ్నిని ఎదుర్కొన్నట్లు, ఎద్దు సింహాన్ని ఈడ్చడానికి ముందుకురికినట్లు, గొఱ్ఱె పులిని పట్టుకుంటానని దంభాలు పలికినట్లు, పురుగు గరుత్మంతుని ఎత్తుకు ఎగరాలని పైకెగసినట్లు, ఐరావతం

దంతాన్ని శలభం విరిచినట్లు, మిణుగురు సూర్యుడిని క్రిందికి పడద్రోసినట్లు, సరస్వతి ముందు మూఢుడు వాదించినట్లు – దశకంఠుడు బలిని యుద్ధానికి ఆహ్వానించాడు. బలి నవ్వి మునుపు నృసింహావతార కాలంలో ప్రహ్లాదుని రక్షించడానికి నృసింహుడు హిరణ్యకశపుని చీల్చి చెండాడే సమయాన, గదాప్రహారాలకు అతని కర్ణకుండలాలు కిందపడ్డాయి. చేతనైతే వాటిని ఎత్తుకొనిపో అని గేలిచేశాడు. రావణుడు కోపంతో ఈగ ఏనుగు మీదికి దండెత్తినట్లుగా, బలిమీదికి లంఘించ ప్రయత్నించి నిస్తేజంగా కూలబడిపోయాడు. బలిచక్రవర్తి అంత:పురంలో రాణి వింధ్యావళితో ద్యూతం ఆడుతున్న సమయంలో ఒక పాచిక జారి క్రిందపడింది. నీవు ఆ పాచిక తెమ్మన్నా తెచ్చే శక్తిలేనివాడివి, నీతో యుద్ధం ఏమిటని రావణుని చూసి వారిరువురూ పకపకా నవ్వుకొన్నారు. వెనుదిరిగి పారిపోయే ప్రయత్నంలో ఉన్న రావణుని బలి సేవకులు వెంబడించి, పట్టుకొని, బట్టలూడదీసి, ముఖానికి మసి పూసి చేతులను కట్టి, ఒకరు గడ్డం లాగితే, ఒకడు కూర్చోబెడితే, ఒకడు లేవదీస్తే, ఒకడు పేడతో కొడితే – ఈవిధంగా రావణుని నగరమంతా ఊరేగించి అవమానించారు. దీన్నుండి తప్పించుకోవడానికి కూడా రావణుడికి సాధ్యంకాలేదు. చివరికి మార్గాంతరం లేక ఒక మురికి కాలువ గుండా బయటపడే యత్నంలో ద్వారపాలకుడయిన వామనుడు అడ్డుపడి, భుజాలపై కొట్టాడు. ఆకలితో అలమటిస్తూ నగ్నంగా తిరుగాడే రావణుడు గత్యంతరంలేక అశ్వశాలలో గుర్రాలకు పెట్టే దాణాను ఏరుకొని తింటూ, ఖండోబా దేవునికి అంకితమైన శునకంలా – ఇంటింటికి వెళ్ళి, తినడానికి ఏమైనా పెట్టమని దేబిరించసాగాడు. మనశ్చాంచల్యానికి లోనై నీళ్ళు తెచ్చే ఒక ఆడుదాసిని ఆపి, ఆ నీళ్ళను జోలెలో కుమ్మరించుకున్నాడు. ఆ దాసి కోపంతో విదిలించింది. అలా మతి భ్రమించినట్లుగా తిరిగాడు. ఆ సమయంలో విశ్రావసువు బలిని కలుసుకొని, "మా రావణుని మీ నగరంలో బంధించారు. దయచేసి పుత్రభిక్ష



ప్రసాదించండని వేడుకున్నాడు. ప్రతిగా, 'ఇక్కడ ఎవ్వరూ బందీలుకారు. అతడు ఇక్కడే ఎక్కడో తిరుగుతూ ఉంటాడు. వెతికి తీసుకొని పోవచ్చు' అని బలి సమాధానం యిచ్చాడు. విశ్రావసువు వెతికి వెతికి రావణుని అశ్వశాలలో కనుగొన్నాడు. తండ్రిని చూడగానే రావణుడు దు:ఖభారంతో క్రుంగిపోయాడు. విశ్రావసువు వామనుని ప్రార్థించి రావణుని విడిపించుకొని వెళ్ళాడు.

**వాలిచే పరాభావం**

లజ్జాభారంతో లంకకు తిరిగివచ్చిన రావణుడు బలం చేకూర్చుకొని యీసారి వాలిని గెలవాలని తలచాడు. ఒకసారి సముద్రతీరాన ధ్యానంలోనున్న ఇంద్రపుత్రుడైన వాలిని పట్టుకోవాలని రావణుడు పుష్పక విమానం నుండి దిగాడు. సింహం ముందు పిల్లిలా, పండితుని ముందు మూఢుని తర్కంలా, నారద మహర్షి సంగీతాన్ని సవాలు చేసిన గాడిదలా, పెద్దపులిముందు ఎగిరిపడే నక్కలా – దశకంఠుడు వాలిని యుద్ధానికి రమ్మని సవాలు విసిరాడు. వాలి రావణుడి దవడలు పట్టుకొని, చంకలో ఇరికించుకొని నాలుగు సముద్రాలలో స్నానం చేయించి, కిష్కింధకు తెచ్చి, అంగదుడి ఊయలకు అలంకారంగా కట్టిపడేసాడు. అంగదుడు చీటికిమాటికి రావణుడి గడ్డాన్ని పట్టుకొని లాగుతూ బాల్యచేష్టలతో ఆడుకునేవాడు. ఈ విషయాన్ని విన్న విశ్రావసువు వాలిని వేడుకొని రావణుని వదలిపెట్టమని కోరాడు. అపుడు వాలి, రావణుడి మొహానికి మసిపూసి, ఇంటినుంచి లంకలో పడేట్లుగా ఒక్క తాపు తన్నగా రావణుడు అవమానభారంతో మరీ క్రుంగిపోయాడు.

**కౌసల్యాదశరథుల పరిణయం : రావణ ప్రతిరోధం**

ఒకప్పుడు దశకంఠుడు తన మరణరహస్యం తెలుపమని బ్రహ్మను కోరాడు. దానికి బ్రహ్మదేవుడు, దశరథ పుత్రుడయిన శ్రీరాముడు నిన్నంతం చేస్తాడని సెలవిచ్చాడు. ఆ వార్త విన్నంతనే దశరథుని చంపాలనే నిర్ణయానికి

వచ్చాడు రావణుడు. ఆ సమయంలో దశరథుడి వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని విన్న నారదుడు దశరథుని తండ్రియైన అజమహారాజుతో, రావణుని సంకల్పాన్ని వివరించి, కౌసల్యావివాహం భగ్నం కానున్నది కనుక జాగరూకుడవై ఉండమని హెచ్చరించగా అజపాలుడు కౌసల్య వివాహాన్ని సముద్రమధ్యంలో ఒక నావలో చేయతలపెట్టాడు. ఎనిమిదవనాటి రాత్రి రావణుడు ఈ సంగతి తెలుసుకొని – భోజన సమయంలో ఆకాశంనుండి ఎగిరివచ్చిన పక్షిలా – ఆకస్మికంగా ఏతెంచి ఓడను ముక్కలు చేసి, కౌసల్యను ఒక పెట్టెలోఉంచి, సముద్రంలో ఒకచేపకు ఆపెట్టెను భద్రంగా ఉంచమని, తనకు చెప్పకుండా ఎవ్వరికి ఇవ్వద్దని హెచ్చరించి లంకానగరానికి తిరిగి వెళ్ళాడు.

ఆ పెట్టెను సముద్రమధ్యంలో అడుగున ఎవరికంటాబడకుండా దాచిపెట్టి తన దోవన తాను వెళ్ళిపోయింది ఆ చేప. ఏం వివాహమో ఏమో, ఏం ముహూర్తమో ఏమో గాని పెండ్లికి వచ్చిన వాళ్ళందరూ సముద్రం పాలయ్యారు. దైవకృపవల్ల దశరథుడు సముద్రం పైకివచ్చి, అటువైపు తేలివస్తున్న ఓడ ముక్క పైకెక్కి కూర్చున్నాడు. కుంటివాడు ఆకాశానికి ఎగిరినట్లు, పెరటిలోని తీగలన్నీ కల్పతరువులుగా మారినట్లుగా ఉంది – దశరథుడి స్థితి.

ఎవరికి శ్రీరామచంద్రుడు పుత్రుడిగా జన్మిస్తాడో అతడికి అసంభవాలు కూడా సంభవాలే అవుతాయి. కష్టమయిన సమస్యలన్నీ సులభంగా నెరవేరుతాయి. విషం కూడా అమృతమై అపాయాలన్నీ సమసిపోతాయి. గాలివాటుకు విరిగిన ఓడముక్క కదలిపోసాగింది. ఆసమయంలో ఎదురుగా ఒక పెట్టె తేలి వచ్చింది. సహజమయిన కుతూహలంతో దశరథుడు ఆ పెట్టెను తెరచి, అందులోనున్న కౌసల్యనుగాంచి ఆనందోత్సాహాలు ఇనుమడించగా అచ్చెరువొందాడు. అప్పుడు త్రిలోకసంచారియైన నారదముని అకస్మాత్తుగా ప్రత్యక్షమై, విధియుక్తంగా వారిరువురికీ ఆ సుముహూర్తాన



వివాహమొనరించాడు. వైకుంఠ వాసుడయిన శ్రీ మహావిష్ణువు మీ గర్భాన జన్మిస్తాడు. మీకు మేలు జరుగుతుంది అని ఆశీర్వదించి వారిద్దరినీ అదే పెట్టెలో ఉంచి నారదముని అంతర్ధానమయ్యాడు.

దశకంఠుడు బ్రహ్మను దర్శించి, "నీ మాట అబద్ధమైంది. అసలు కౌసల్యా దశరథుల వివాహమే జరుగలేదు. పెండ్లి ఓడ మునిగిపోయింది. కౌసల్య ఇప్పుడు నా బందీగా వుందని ప్రగల్భాలు పలికాడు. అందుకు బ్రహ్మ నా వాక్కు ఎన్నటికీ అసత్యం కాదు. వారిద్దరికీ ఎప్పుడో వివాహం అయిపోయింది" అని సమాధానమిచ్చాడు. దానికి రావణుడు "అలా జరగటం అసంభవం. అలా జరిగితే ఒక్కసారి మీరేది చెబితే అది చేస్తాను" అని సవాలు చేశాడు. పెట్టెను జాగ్రత్తగా ఉంచమన్న చేపను పిలిచి, పెట్టెను తెప్పించి, సభాముఖంలో తెరచి చూడగా చూపరులను ఆశ్చర్య చకితులను చేసే విధంగా అందులోనుండి కౌసల్యా దశరథులు వెలువడ్డారు. రావణుడు బ్రహ్మదేవుని వాక్యం అసత్యం కాకపోవడం గ్రహించి, కోపోద్రేకంతో వారిద్దరినీ వధించడానికి ఉద్యుక్తుడయ్యాడు. కౌసల్య భయంతో కంపించిపోయింది. దశరథుడు ఏ మాత్రం జంకలేదు. నేను సూర్యవంశజుడ్ని. నా పరాక్రమం ముందు వీడు దోమతో సమానం. వీడి పదితలలను క్షణంలో ఖండిస్తాను. నువ్వేమి కలత చెందాల్సిన పనిలేదని కౌసల్యను ఓదార్చాడు. అంతలో బ్రహ్మ రావణుడి ప్రయత్నానికి అడ్డుపడి, "నాకు లోగడ ఇచ్చిన మాటను నెరవేర్చమ"ని కోరాడు. 'ఏం చెయ్యాలో చెప్పమన్నాడు' దశకంఠుడు. వధూవరులను తనకు యిచ్చివేయమన్నాడు విరించి. "ఎప్పుడూ ఆడిన మాట తప్పకూడదు. అబద్ధం ఆడకూడదు. అట్లా జరిగితే ఘోరవిపత్తులు సంభవిస్తాయి" అని మండోదరి దశకంఠుడికి సలహా ఇచ్చింది. దైవవశాన రావణుడికి సద్బుద్ధి కలిగి వారిని వదలిపెట్టాడు. చతుర్ముఖుడు వారిని అయోధ్యకు గొంపోయి, రాజ్యస్థాపన గావించాడు. ఆ సమయంలో ఇంద్రుడు ఛత్రం పట్టాడు. అయోధ్య ప్రజల

హర్షానికి అవధులు లేకుండా పోయింది. అనంతరం బ్రహ్మ, ఇంద్రుడు తమతమ స్వస్థానాలకు వెళ్ళిపోయారు. విధిలీలలు ఎంత విచిత్రములో కదా!

### రావణుని శాపవృత్తాంతం

ఒకసారి పుష్పకంలో వెళుతూ దశకంఠుడు అందమయిన ఒక దేవకన్యను చూచి మోహంతో బలవంతంగా ఆమె చేయిపట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ స్త్రీ రోదిస్తూ బ్రహ్మదేవునితో రావణుడి అకృత్యాన్ని గురించి చెప్పింది. సత్యలోక పాలకుడు అది విని, పరస్త్రీని బలాత్కరించినట్లయితే నీ శరీరం వందముక్కలవుతుందని రావణుడికి శాపం ఇచ్చాడు. శాపం వల్ల రావణుడి స్థితి బోనులో పడ్డ సింహంలా అయింది. దశకంఠుడు చేసే దుష్కార్యాలు సహించలేకున్నాను. గోబ్రాహ్మణులను వాడు విపరీతంగా బాధలు పెడుతున్నాడని భూదేవి గోమాతరూపంలో బ్రహ్మదేవుడికి మొరపెట్టుకొంది. ఋషులు, మునులు కూడా సత్యలోకపాలకుడితో తమ కష్టాలను ఏకరువు పెట్టసాగారు. సత్కార్యాలేవీ సాగనీయడంలేదు. తాటక యజ్ఞాలను ధ్వంసం చేస్తోంది. మారీచ సుబాహులు యజ్ఞ కార్యాలను భంగం చేస్తున్నారు. ముని కుటుంబాలను కుంభకర్ణుడు భక్షిస్తున్నాడు. ఇట్లా ఎన్నో అనర్థాలు జరిగిపోతున్నాయని మునులు బ్రహ్మకు విన్నవించారు. 'ఎవరి మాటవినక, ఎవరిని లక్ష్యపెట్టక తమను బంధించి హింసిస్తున్నాడ'ని, దేవతలు తమ కష్టాల్ని చెప్పుకొన్నారు. తరుణోపాయంకోసం విరించి, దేవతలు, మునులు, భూదేవి – అందరూ కలసి వైకుంఠానికి తరలి వెళ్ళారు.

వైకుంఠంలో సచ్చిదానంద స్వరూపుడైన శ్రీమహావిష్ణువు కోటి సూర్యప్రభలతో, సర్వాలంకార భూషితుడై, లక్షన్నరయోజన ప్రమాణంలో, అరవైవేల యోజనాల ఆదిశేషువుపై శయనించివున్నాడు. నవరత్నఖచితమైన స్తంభాలు, బంగారుతో తాపడం చేయబడిన దూలాలు, మణిమయ కవాటాలతో



వైకుంఠం మెరసిపోతోంది. ఎవరి సంకల్పమాత్రంగా ఈ సకలజగత్తు జనించిందో ఆ స్వామి చరణాల చెంత అనంతశక్తి స్వరూపిణియైన శ్రీదేవి ఆసీనురాలై ఉంది. లక్ష యోజనాల పర్యంతం వ్యాపించే ఆమె తేజస్సుకు సూర్యచంద్రులు సాటిరారు. వైకుంఠవాసుడి దర్శనార్థం వచ్చిన బృందం శ్రీమహావిష్ణువును ప్రసన్నం చేసుకొనేందుకు చేతులు జోడించి ఇలా ప్రార్థించారు.

"పూర్ణబ్రహ్మ, వనమాలీ, భక్తపాలకా, సర్వేశా, జయజయ అనంత బ్రహ్మాండనాయకా! వేదవంద్యా, వేదపాలకా, విశ్వంభరా, విశ్వవ్యాపకా, విశ్వరక్షకా, పురాణపురుషా, పరాత్పరా, పంకజలోచనా, క్షీరసాగర విహారా, పరమాత్మా, పరమఉదారా, భువనైక సుందరా, భవహృదయా, కర్మమోచకా, కరుణాకరా, కైవల్యదాయకా, కమలావరా, కర్మాతీతా, కైటభసంహారా, కనకవసన, కరుణాబ్ధే, కరుణాసింధూ, సకల లోకపాలకా, సకల దేవపాలకా, సకల చిత్తచాలకా, సకల హృదయ సంచారీ, నిర్గుణా, నిశ్చలా, నిస్సంగా, కేశవా, హరీ, మురారీ, మురమర్దనా, రమావల్లభా, మధుసూదనా, సకలదురిత కాననదహనా, తమోనాశనా, ప్రతాపసూర్యా, ప్రళయకాలాంత మత్స్యరూపా, దైత్యసంహారీ, జనార్దనా, వేదోద్ధారకా, నీవు కూర్మావతార కాలంలో మందర పర్వతాన్ని పాతాళానికి అణగద్రొక్కావు. వరాహావతారకాలంలో భూభారాన్ని మోసి హిరణ్యాక్షుని సంహరించావు, నరసింహావతారమెత్తి దానవ సంహారం చేసి భక్తుడయిన ప్రహ్లాదుని బ్రోచావు. వామనావతార కాలంలో బలిని పాతాళానికి అణగదొక్కి అతని ద్వారపాలకుడవై యిప్పటికీ కావలి కాస్తున్నావు. భృగుకుల తిలకుడయిన పరశురాముడుగా ఇరవైఒక్కమార్లు క్షత్రియవంశాన్ని నిర్మూలించావు. భక్త రక్షకా, శరణు శరణు. ఇప్పుడు రావణ కుంభకర్ణులు ముల్లోకాలను పీడిస్తున్నారు. మమ్మల్ని ఎలాగైనా కాపాడు తండ్రీ!" అని మొరపెట్టుకొన్నారు.

అప్పుడు క్షీరసాగరంలో ఒక అద్భుతమైన ధ్వని వినవచ్చింది. ప్రసన్నుడయిన హరి, రవికులంలో దశరథుడి గర్భాన శ్రీరాముడిగా అవతరిస్తాను. ఆదిశేషువు లక్ష్మణుడిగా, పాంచజన్యం భరతుడిగా, సుదర్శనం శత్రుఘ్నుడిగా అవతరిస్తారు. మిథిలాపురంలో జనకరాజు పుత్రికగా శ్రీమహాలక్ష్మి జన్మిస్తుంది. దేవతలు వానరులుగా, శివుడు హనుమంతుడిగా, బ్రహ్మ జాంబవంతుడిగా, ధన్వంతరి సుషేణుడిగా, ఇంద్రుడు అంగదుడిగా, అదితి కౌసల్యగా, కశ్యపుడు దశరథుడిగా అవతరిస్తారు. సూర్యపుత్రునిగా సుగ్రీవుడు, అగ్నిపుత్రుడిగా నలుడు, వాయుపుత్రునిగా నీలుడు, యమపుత్రునిగా ఋషభుడు అవతరిస్తారు. అప్పుడు దానవ సంహారం తప్పక జరుగుతుంది అని అభయమిచ్చాడు. అందరూ ఆనందోత్సాహాలతో తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు. రామకథ రసవత్తరం. మానస సరోవరంవలె నిర్మలం. చతురులయిన శ్రోతలే రాజహంసలు. అందరూ సమాన అర్హతలు కలిగినవారు. రామకథాశ్రవణంతో అన్ని పాపాలు నశిస్తాయి. భక్తితో చదివే వారి మనోరథాలు సిద్ధిస్తాయి. ఈ రామకథ విన్నవారికి సంభవించే విఘ్నాలను శ్రీరాముడే నివారిస్తాడు. సర్వకాలాల్లో రామచరణ సన్నిధి శరణుజొచ్చిన వారికి భవబంధాలనుండి విముక్తి సులభసాధ్యం. బ్రహ్మానందా! ఆత్మారామా! భక్త కామ కల్పద్రుమా! శ్రీధరవరదా! పూర్ణబ్రహ్మ! అక్షయా! అనామా! అభంగా! ద్వితీయాధ్యాయం మధురం! స్వస్తి.

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణం ఆధారంగా రచించబడింది. చతురులయిన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను ఆలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ద్వితీయాధ్యాయం మధురం**

## అధ్యాయము - 3

## శ్రీగణేశాయ నమః

**శ్రో**తలైన మీరు భావుకులు, సాధుసజ్జనులు. మీరు కవి పాండిత్య పటిమకు రత్నపరీక్షకులు. చంద్రుని వంటి శ్రోతలను చూచి వక్త చంద్రకాంతమణిలా కరిగిపోతాడు. మీరు బోధ అనే సముద్రంలోని ఆణిముత్యాలు. చైతన్యమనే ఆకాశములో ప్రకాశించే దివ్య నక్షత్రాలు. వైరాగ్యవనంలో వికసించిన విచిత్ర పుష్పాలు. సాధుసజ్జనులైన మీరు ఈ రామ కథామృతాన్ని శ్రవణానందకరంగా గ్రోలుటకు పాత్రులైనవారు. సస్యశ్యామల క్షేత్రాలవలె సంపూర్ణజ్ఞానులు. భజన సరోవరాన సాధురూపంలో వికసించిన సుమాలు. భవతాపమనే కారుమబ్బుని చెదరగొట్టే పెనుగాలిలా, అజ్ఞానాంధకారాన్ని ఛేదించే సూర్యకిరణాల్లా, మదపుటేనుగుల పాలిటి సింహాల్లా, ఈర్ష్యారణ్యాన్ని దహింపజేసే దావాగ్నిలా కొలువుతీరి వున్నారు. భ్రమరానికి కమలంలో ఉండే తేనెయొక్క మాధుర్యాన్ని వివరించాలా? రాజహంసకు ముత్యాలను భక్షించడం నేర్పాలా? శీతకరుని శీతలంగా ఉండమని వేరే చెప్పాలా? రామవిజయ గ్రంథమనే వజ్రాల గనినుంచి అమూల్య సాహిత్య రత్నాలను సంతృప్తిగా స్వీకరించమని వేరుగా ప్రార్థించాలా?

సూర్యుడికంటే ముందు వెలుగు వస్తుందని, సాధువులకు ఇంట్లో శాంతి క్షమ కలిగి ఉండమని మతిహీనుడు చెప్పినట్లుగా, భగవంతుడిపట్ల అనన్య ప్రేమ కలిగిన భక్తునికి ప్రేమ గురించి వివరించినట్లుగా, జ్ఞానధనులైన మీకు, 'ఈ రామకథా శ్రవణం చేయండి!' అని మాటిమాటికీ చెప్పడం దోషంగా తోస్తుందో ఏమో?

ముందు అధ్యాయంలో రావణుడి పుట్టుక, కౌసల్యాదశరథులకు విధియుక్తంగా వివాహం, అయోధ్యకు ఏతెంచడం వివరించాం.

సూర్యవంశభూషణుడు, అయోధ్యాపతియైన దశరథుడు, మంగళకరమైన శుభ లక్షణాలతో ప్రఖ్యాతిగాంచిన కౌసల్యను పట్టపురాణిగా, మంచి రూపురేఖావిలాసాలు గల సుమిత్ర, కైకేయిలను, తరువాత 700 మంది విలాసవతులను పరిణయమాడాడు.

జ్ఞానకళతో కౌసల్య, భక్తితో సుమిత్ర, రజోతమోగుణ కపట ప్రవృత్తితో కైకేయి మెలగుతూండేవారు. దశరథుడు మహావీరుడు, యుద్ధనిపుణుడు. ధనుర్విద్యలో అతడికతడే సాటి. కారుచీకటిలోనయినా సూటిగా బాణాన్ని సంధించగల మేటి. కాని సంతానం లేదన్న చింత మాత్రం ఎప్పుడూ బాధిస్తుండేది. ప్రాణంలేని శరీరం, మోహంలేని మదనుడు, దయలేని జ్ఞానం, శాంతిలేని వైరాగ్యం, బిడ్డలులేని ఇల్లు వ్యర్థం అని పండితులు అంటారు. ధర్మంలేని సంపద, పండితులులేని సభ, క్రియాశూన్యమైన జ్ఞానం, దీపంలేని మందిరం, అనుభవజ్ఞానం లేని శాస్త్రపాండిత్యం, అపాత్రదానం, స్నేహశీలత లేని బంధువు, నీళ్ళు లేని బావి, రాజులేని నగరం, ముక్కు లేని మొహం, ఫలంలేని వృక్షం, రామభజన లేని మందిరం ఎలా నిష్ప్రయోజనాలో అలా పుత్రులు లేని వంశం నిష్ఫలం.

దశరథుడు ఎన్ని ప్రయత్నాలు చేసినా సంతానం కలుగలేదు. రాజభోగాలపట్ల, కళావినోదాలపట్ల అభిరుచి నశించింది. పుత్రులు లేని దు:ఖాన్ని మరచిపోవడానికి వేటమిషతో అడవుల్లో తిరుగుతుండేవాడు.

ఒకరాత్రి దశరథుడికి నిరపరాధులయిన ఇద్దరు పురుషుల్ని, ఒక స్త్రీని తాను వధించినట్లు కల వచ్చింది. ఆ దుస్స్వప్నంతో కలతనొంది, నేరుగా కులగురువయిన వసిష్ఠునివద్దకు వెళ్ళి విషయాన్ని విన్నవించాడు. 'ఇది నిజంగా దుస్స్వప్నమే. కనుక నీవు వేటకు వెళ్ళి ప్రత్యామ్నాయంగా మూడు జంతువులను వధించు. దోషం నివారణమవుతుంది' అని వసిష్ఠుడు ఆనతిచ్చాడు.



**శ్రావణవధ**

గురువాజ్ఞ ప్రకారం దశరథుడు వెంటనే వేటకు బయలుదేరాడు. అప్పటికి సూర్యాస్తమయం అవుతోంది. వేటాడటానికి జంతువులేవీ దొరకలేదు. అంతటా చీకట్లు కమ్ముకున్నాయి. దశరథుడు ఒక్కడే అడవిలో తిరుగుతూ, వింటినారిని చెవిదాకా లాగి బాణాన్ని సంధించి మృగాల కోసం వెదుకుతున్నాడు. దశరథుడు ఒక సెలయేటి ఒడ్డున ఒక చెట్టుపై దాక్కొని చెవిఒగ్గి 'ఏదైనా జంతువు నీటికోసం వస్తే అలికిడి అవుతుంది కదా' అని వేచివున్నాడు. అప్పుడు శ్రావణుడు తన తల్లిదండ్రులను తీసుకొని ఆ దారినే పోతున్నాడు. పగలైతే ఎన్నో ఆటంకాలకు, ఎండధాటికి వృద్ధులైన తల్లిదండ్రులు తట్టుకోలేరని రాత్రులందే ప్రయాణిస్తూ, తన వృద్ధ మాతాపితరులను కావడిలో కూర్చునబెట్టి, దాన్ని భుజాన మోస్తూ తీర్థయాత్రలు సేవిస్తుండేవాడు. "మాకు దాహం వేస్తోంది, కొంచెం నీళ్ళు త్రాగించమ"ని శ్రావణుని తల్లిదండ్రులు కోరారు. శ్రావణుడు కావడి క్రిందబెట్టి చేతిలో కమండలం తీసుకొని సెలయేటి దగ్గరకి వెళ్ళాడు. కమండలాన్ని నీళ్ళల్లో ముంచగా, దశరథుడు ఆ 'గుడగుడ' శబ్దం విని ఏదో జంతువనుకొని బాణం వదిలాడు. ఆ బాణం శ్రావణుడి హృదయంలో గుచ్చుకోగా, కమండలంతోపాటు శ్రావణుడి శరీరం నేలపై ఒరిగిపోయింది. ప్రాణం పోయే అవస్థలో శ్రావణుడు రామ నామస్మరణతో విచ్చేసిన 'ఈ బాణం వేసిందెవరు?' నా హృదయం ప్రశాంతమయింది, నన్ను పావనం చేసింది అన్నాడు. ఆ మాటలు విని దశరథుడు పరుగున వచ్చి రామనామస్మరణ చేస్తున్న శ్రావణుని గాంచి, 'అయ్యో! ఎంత ఘోరపాపం చేశాను. బ్రహ్మహత్యా నేరానికి పాల్పడ్డా'నే అని దుఃఖించసాగాడు. అందుకు 'రాజా నువ్వు దు:ఖించవద్దు. నీ దోషం ఏమాత్రం లేదు. నా తల్లిదండ్రులు వృద్ధులు. దీనులు. దయతో ఈ నీళ్ళను తాగించు! అప్పుడు గానీ నేను ప్రాణం వదలలేను. నీవు తప్ప వారికెవ్వరూ లేరని గుర్తుంచుకో' అని శ్రావణుడు అన్నాడు. ఈ

సంఘటనతో దశరథుడు చలించి దుఃఖసాగరంలో మునిగిపోయాడు. శ్రావణుడు, దశరథా! ఇద్దరికీ త్వరగా నీళ్ళు ఇచ్చి, తదుపరి జరిగిన విషయం వారికి తెలుపవలసింది. లేకపోతే వెంటనే వారు ప్రాణత్యాగం చేస్తారు అన్నాడు. అయోధ్యరాజు దశరథుడు శోకంతో నీళ్ళు తీసుకొని శ్రావణుడి తల్లిదండ్రుల దగ్గరికి వెళ్ళాడు. వాళ్ళిద్దరూ తమ కొడుకే వచ్చాడనుకొని, 'వచ్చావా నాయనా!' అని పలకరించారు. దశరథుడు పెదవి కదపలేదు. 'ఏం నాయనా పలకవేమిటి? ఇంత రాత్రి పూట నీళ్ళు తెమ్మన్నందుకు కోపం వచ్చిందా ఏమిటి? సూర్యుడు తూర్పున అస్తమించినట్లుగా, ఆదిశేషువు భూభారాన్ని మోయలేక బరువు దించినట్లుగా, చంద్రుడు వేడి కిరణాలు ప్రసరింపజేసినట్లుగా – నీకు కోపం రావటం ఏమిటి? గంగాజలం వలె నీ మనస్సు నిర్మలం. ఎందుకు నాయనా మాట్లాడవు?' అని ప్రశ్నించారు. దశరథుడు ఈ ప్రశ్నలకు మనస్తాపం చెంది, తల్లడిల్లి, తనపేరు చెప్పి, 'నేను తెలియక శ్రావణుని వధించాను. అతడు కొనవూపిరితో ఉన్నాడని' జరిగిన విషయం వివరించాడు. అప్పుడు తల్లిదండ్రులు శ్రావణుడి గుణాలను తల్చుకొని, 'నాయనా! ఈ ప్రపంచంలో నీవంటి పుత్రుడు దొరకడం దుర్లభం. గంభీర గుణాలు కలవాడా! ఒక్కసారి నీ ముఖం మాకు చూపించు. వైకుంఠంలో లక్ష్మీనారాయణులను భక్తులు సేవించినట్లు మాకు పరిచర్యలు చేశావు. ఎవడు మాతాపితలను సేవించడో, వాడి బ్రహ్మజ్ఞానం నశిస్తుంది. షట్‌శాస్త్రాల అధ్యయనం, జప, తప, అనుష్ఠాన, అధ్యయన, శ్రవణ, మనన, కళాచాతుర్యాలు వ్యర్థం. అటువంటి వాడి మాటలు, తాగుబోతువాని మాటల్లా శుష్క ప్రలాపాలు. వాడు చతుష్షష్టి కళలను అభ్యసించినా నిష్ఫలం. తల్లిదండ్రులను అసహ్యించుకొనేవాడు చండాలుడు. అతణ్ణి ముట్టుకోకూడదు. మాతాపితలను, గురువును దైవసమానంగా, పెద్దలమాటను వేదవాక్కులా పాటించేవాడు పరమజ్ఞాని' అని శ్రావణుని గుణగణాలను తలచుకుంటూ, 'నువ్వు కూడా మాలాగే పుత్రవియోగంతో



విలపిస్తూ ప్రాణాలు విడుస్తావు' అని శపించి తనువు చాలించారు. దశరథుడు ముగ్గురికీ యథావిధిగా దహన సంస్కారాలు చేసి, ఉత్తర క్రియలు నిర్వర్తించి అయోధ్యకు తిరిగి వెళ్ళాడు. దశరథుడు ఒక విధంగా మనస్సులో సంతోషించాడు. శాపమే వరంగా పరిణమించిందనుకున్నాడు. పుత్రుడుంటే గదా, పుత్రవియోగం? శాపం వల్లనైనా త్వరగా పుత్ర సంతానం కలగనీ – అని అనుకొని, విషయాన్నంతా వసిష్ఠుడికి వివరించాడు.

## దేవదానవ యుద్ధం – దశరథ సహాయం

పన్నెండేళ్ళు గడిచాయి. భూమిమీద దుర్భిక్షం తాండవించింది. మేఘాలు వర్షించలేదు. సూర్యుడు తీక్ష్ణమవడంతో, ధాన్యం, గడ్డి, నీరు మొదలయినవి కొరవడగా, విపరీతమైన కరువు సంభవించింది. గోబ్రాహ్మణులకు ఎన్నో కష్టాలు కలిగాయి. దానవ గురువు శుక్రాచార్యుడు కపటి. మేఘాలను ఆకర్షించి వర్షాలు కురవకుండా చేశాడు. వేళకు వాన కురిస్తే గోబ్రాహ్మణులు ఆనందంగా యజ్ఞ యాగాదులను ఆచరించి దేవతలను మెప్పిస్తారు. అలా జరగకూడదని శుక్రాచార్యుడు అనేక విఘ్నాలను కల్పించాడు. యజ్ఞయాగాదుల బలంతో ఇంద్రాది దేవతలు యుద్ధానికి వస్తారని తెలిసి, దానవ రాజయిన వృషపర్వుడికి శుక్రుడు తోడ్పడ్డాడు. దేవతలు ఇంద్రుడి నాయకత్వంలో వృషపర్వుడితో చాలాకాలం యుద్ధం చేశారు. శుక్రుడి మాయాజాలంతో ఇంద్రుడు ఓడిపోయి దుఃఖితుడైనాడు. అయోధ్య రాజు దశరథుడు ప్రతాపరాశి, రణకోవిదుడు, దైత్యులను క్షణంలో జయించగలిగే శూరుడు. అతని సహాయం కోరమని దేవగురువు బృహస్పతి ఇంద్రుడికి సలహానిచ్చాడు. ఇంద్రుడి రథసారథి మాతలి దశరథుడి దగ్గరకు వెళ్ళి అనావృష్టికి గల కారణాలను వివరించాడు. రాక్షస అకృత్యాలను విన్న దశరథుడు వెంటనే దేవతలు పంపిన రథంలో యుద్ధానికి బయలుదేరాడు. ముద్దులభార్యయైన కైకేయి రణరంగానికి వస్తానని ముచ్చటపడింది. "నువ్వు సుకుమారివి. రణరంగంలో భయంకర పోరాటం

జరుగుతుంది. నువ్వేం చేయగలవు" అని దశరథుడు కైకను భయపెట్టగా 'మీరుండగా నాకేం భయంలేద'ని సమాధానం చెప్పి, రథం ఎక్కి కూర్చుంది. ఆకాశమార్గాన మాతలి రథాన్ని వాయువేగంగా నడిపాడు. వైకుంఠం నుండి గరుత్మంతుడు అకస్మాత్తుగా పాలసముద్రం ఒడ్డున వాలినట్లుగా, ఆ రథం సురాసుర రణరంగంలో ప్రవేశించగానే, దశరథుని చూచి ఇంద్రుడు కౌగిలించుకొన్నాడు.

దశరథుడు ధనుర్ధారియై దేవతలపక్షాన రణరంగంలో నిలబడ్డాడు. శబ్దాలు ఒక్కుమ్మడిగా వెలువడినట్లు, మేఘాలు వర్షించినట్లు, దశరథుడు బాణవర్షం కురిపించసాగాడు. కల్పాంతంలో మెరిసే మెరుపుల్లా, ఆకాశంలోకి ఎగిరే పక్షుల్లా దశరథుని బాణాలు రాక్షస సమూహాల శిరస్సులను వినువీధిలోకి ఎగిసిపడేలా ఖండించాయి. రాక్షసుల శక్తి సన్నగిల్లడంతో వృషపర్వుడు దశరథుడి ముందు కపట యుద్ధ కౌశలాన్ని ప్రదర్శించాడు. మూర్ఖుడి వాచాలత్వాన్ని పండితుడు ఒకే ఒకమాటతో అణిచివేసినట్లుగా, శక్తిమంతుడయిన మంత్రగాడి ముందు కొరగాని భూతపిశాచాల చేష్టల్లాగా వృషపర్వుడి యుద్ధనైపుణ్యం దశరథుడి ముందు నిష్ప్రయోజనమయింది. వృషపర్వుడు రథం దిగి పలాయనం చిత్తగించాడు. ఆజ్యంతో అగ్ని రగిలినట్లుగా రాక్షసగురువు శుక్రుడు అత్యంత కుపితుడై, రథాన్నధిరోహించి ఏకధాటిగా అస్త్రాలను సంధించాడు. మొదట ఆగ్నేయాస్త్రం వదలగా, దశరథుడు వారుణాస్త్రంతో బదులు చెప్పాడు. వాయవ్యాస్త్రాన్ని శుక్రుడు విడువగా, దశరథుడు పర్వతాలతో అడ్డగించి అస్త్ర వేగాన్ని నిరోధించాడు. వజ్రాస్త్రంతో శుక్రుడు పర్వతాలను ధ్వంసం చేయడంచూచి, విరుగుడుగా దశరథుడు శివుని అస్త్రమైన త్రిశూలాన్ని ప్రయోగించాడు.

శుక్రుడు రోష కషాయనేత్రుడై నిర్వాణబాణంతో దశరథుడి రథం ఇరుసును ఛేదించటానికి అస్త్రం సంధించాడు. దాని తాకిడికి దశరథుడి



రథం ముక్కలైపోవాల్సిందే. కాని కైకేయి అది చూచి, తత్క్షణమే ఇరుసును విరిగిపోకుండా పట్టుకొంది. పర్వతాకారంలో ఉండే రథం కైకేయి చేతులపై ఉందనే విషయం దశరథునికి తెలియదు. వెంటనే నిర్వాణ బాణంతో శుక్రుని రథం ముక్కలుముక్కలు చేశాడు. గుర్రాలు నేలవాలిపోయాయి. విరథుడయిన శుక్రుని శిరస్సు ఖండించటానికి సూర్యాస్త్రాన్ని సంధించినా బ్రాహ్మణుడని గుర్తురావడంతో కిరీటానికి గురిపెట్టాడు. క్షణంలో సూర్యాస్త్రం శుక్రుడి మకుటాన్ని ఎగురగొట్టింది. భృగుపుత్రుడయిన శుక్రుడు భయాందోళనలతో వెన్నుచూపగా, దేవతలు జయజయధ్వానాలు చేశారు. రాక్షసులందరూ పెనుగాలికి లేచిన దుమ్ములాగా పారిపోయారు.

## కైకేయికి వరదానం

యాజ్ఞికుడు హోమానికి ఆచ్ఛాదన చేసినట్లుగా, దశరథుడు బాణాలను తూణీరంలో ఉంచి, కూలిపోతున్న ఇంటిని పడకుండా బలంతో ఆపినట్లుగా, రథభారాన్ని మోస్తున్న కైకను సావధానుడై పరికించాడు. ఘోరయుద్ధం జరిగినా, విజయం కైకేయి వల్లనే లభించిందని తెలుసుకుని, వెంటనే రథం దిగి, రథభారం నుండి ఆమెను విముక్తిచేసి, కౌగలించుకొని, 'నీకిష్టం వచ్చిన వరాల్ని రెంటిని కోరుకొమ్మ'న్నాడు. కైక అపరిమితానందంతో మురిసిపోయి, ఆ వరాలను అడిగినప్పుడు తీర్చేట్లుగా బాస చేయించుకుంది.

ఈ మహాయుద్ధంలో దశరథుడికి విజయం ప్రాప్తించడానికి, కైకేయీ వరప్రసాదానానికి గల కారణాలు వేరే! కైకేయి తన తండ్రి యింట్లో ఉన్నప్పుడు అనుకోకుండా ఒక యతి వారింటికి వచ్చాడు. కైకేయి తల్లి అతడిని తమ ఆతిథ్యం స్వీకరించమని కోరింది. ఆ యతి అనుష్ఠానం చేసుకోవాలనుకొన్నాడు. కైకతల్లి కైకను యతికి కావలసిన ఉపకరణాలను సమకూర్చమన్నది. ధూప దీప నైవేద్య ఆరతులను, పుష్పాలను యతి దగ్గర

ఉంచేది కైక. ఆ యతి ప్రాణాయామం చేస్తూ ధ్యానంలో నిమగ్నుడవడం చూసి, బాల్యచాపల్యంతో యతి మొహమంతా మసి పూసింది కైక. ధ్యానం ముగిసిన తర్వాత విషయాన్ని గ్రహించి, యతి "ఏదో ఒకనాడు నీ మొహం కూడా మసిబారుతుంది! నీ మీద ప్రచండమయిన అభాండం మోపబడి, నీ జీవితంలో అది నల్లటి మాయని మచ్చ అవుతుంది. నీ పుత్రుడే నిన్ను ద్వేషించి, లేనిపోని అభాండాలు వేస్తాడు" అని శపించాడు. కైక తల్లి విషయం తెలుసుకొని యతిని ప్రసన్నుని చేయ ప్రయత్నించింది. 'కైక అజ్ఞానురాలు. తెలియక చేసింది కనుక మన్నించి శాప పరిహారాన్ని సూచించండి' అని వేడుకొంది. దానికా యతి "ఈమె భర్త వెంట యుద్ధానికి వెళ్ళి తన సహకారం ద్వారా విజయం సాధింపజేస్తుంది. పూజా సామగ్రి సమస్తం తన చేతుల్తో ఇచ్చి నాకు సేవ చేసినందువల్ల, తన చేతుల్తోనే భర్తకు అద్భుతవిజయం చేకూరుస్తుందని" సెలవిచ్చాడు.

అది అలా ఉండగా యుద్ధంలో తమకు విజయం సాధించిపెట్టిన దశరథుని బృహస్పతి, ఇంద్రుడు పలువిధాల కీర్తించారు. దేవేంద్రుడు వస్త్రభూషణాలను ఇచ్చి సత్కరించాడు. దివ్యమయిన మణులను కైకకు ప్రదానం చేయగా వాటిని అలంకరించుకొని కైక తేజస్సుతో శోభిల్లింది. 'రాజా నీకు సంతానమెందరు?' అని దేవగురువు దశరథుని ప్రీతితో ప్రశ్నించాడు. ఇప్పటివరకూ సంతానప్రాప్తి లేదన్నాడు దశరథుడు. 'త్రిలోకాధిపతియైన ఆ శ్రీమహావిష్ణువే నీ గర్భాన ఉదయిస్తాడు. సదా నీలకంఠుడు ఎవరిని ధ్యానిస్తాడో, సనకసనందనాదులు నిత్యం ఎవరిని కొలుస్తారో, ఆ మాయా చక్రసంచాలకుడు, అనంతకోటి బ్రహ్మాండనాయకుడు, చతుర్ముఖుని తండ్రి, వేదపురుషుడు, సకల మాయలకు అధిపతి, పురాణపురుషుడు, అగోచరుడు, నీకు పుత్రుడుగా జన్మిస్తాడు. విభాండకుడి పుత్రుడు, హరిణీ గర్భ సంభూతుడు, తేజోరాశి అయిన ఋష్యశృంగుని ఆధ్వర్యంలో పుత్రకామేష్టి చేయించు. జనవాసంతో



పరిచయంలేని ఋష్యశృంగుని ఎలాగైనా సరే మంచి మాటలతో పాటలతో రంజింపజేసి, మెప్పించి తీసుకురావలసింద'ని చెప్పాడు దేవగురువు. 'ఋష్యశృంగుడు ఉండే వనంలోకి ఆటపాటలతో మన్మథునికూడా పరవశింపచేయగల రంభ, ఊర్వశి మొదలైన శుభాననలను పంపుతాన'ని ఇంద్రుడన్నాడు. దశరథుడు దేవగురువు బృహస్పతి ఆజ్ఞానుసారం అయోధ్యకు విచ్చేశాడు. ప్రజలందరూ సంతోషంగా ఉన్నారు. సుభిక్షంగా వర్షం కురిసింది. విష్ణుసహస్రనామంతో మహాపాపాలు తొలగినట్లు సస్యసమృద్ధి కలిగి, దుర్భిక్షం మటుమాయమయింది.

## ఋష్యశృంగుని ఆగమనం

సత్వరం ఋష్యశృంగుని నగరానికి పిల్చుకువద్దామని మేళతాళాలతో వీణావాద్యాలతో దేవాంగనలు అరణ్యానికి బయలుదేరారు. ఋష్యశృంగుడి తండ్రి విభాండకుడు మహా తపోధనుడు. ఉషఃకాలంలో అనుష్ఠానం చేసుకోవడానికి జాహ్నవీ తీరానికి పోవడం ఆయన నిత్యకృత్యం. ఎత్తైయిన ప్రదేశంలో, అరణ్యంలోని క్రూరమృగాలు రాకుండా ఉండేలా ఏర్పాటుచేసిన ఆశ్రమంలో, ఋష్యశృంగుడు వసించేవాడు. విభాండకుడు అనుష్ఠానం ముగించి వస్తూ, కుమారుని చూచి ఆనందించి, అధ్యయనం చేయించేవాడు. ఋష్యశృంగుడికి నాలుగు వేదాలు కంఠస్థం, సకల శాస్త్రపారంగతుడు, యజ్ఞ యాగాదికాలు కరతలామలకాలు.

విభాండకుడు స్నానం చేయడానికి వెళ్ళగానే దేవాంగనలు ఆ వనంలో ప్రవేశించారు. ఆశ్రమ వాటికలోనున్న ఋష్యశృంగుని చూసి అప్సరసలు గానంచేయసాగారు. ఆ గానంతో మన్మథుడికే మతి తప్పుతుంది. మెరుపులాంటి వస్త్రాలను ధరించిన ఆ అపురూప లావణ్యవతులను, అందగత్తెలను చూస్తే అమృతం తాగే దేవతలు కూడా ముగ్ధులైపోతారు.

ఆ నెరజాణల అపూర్వ గానం, సౌందర్యం, వాల్గన్నుల చూపులు, హావభావాల ప్రదర్శన, వింత ప్రవర్తనకు ఋష్యశృంగుడికి మనసులో భయం కలిగింది. పాటకు సంతోషించి, తనను వశపరచుకోవడానికి ఎవరు పంపి ఉంటారా అన్న ఆందోళనతో వెనక్కు తిరిగి చూడకుండా పరుగెత్తసాగాడు.

అనుష్ఠానంచేసి తిరిగివచ్చి తమను శపిస్తాడేమోనన్న భయంతో దేవాంగనలు పారిపోయి, రెండోఝాముకు విభాండకుడు వెళ్ళింతరువాత, తిరిగి ఆశ్రమంలో ప్రవేశిద్దామనుకున్నారు.

ఇది ఇలా ఉండగా ఋష్యశృంగుడు తండ్రితో అప్సరసలను గురించి వివరిస్తూ, 'ఇక్కడకు కొందరు తాపసులు వచ్చారు. నేను వారిని వర్ణించలేను. వాళ్ళను చూసి దేహం మీది ఆశతో పారిపోయాను. వారు మరలా తిరిగి రారేమోనని బెంగగా ఉంది' అని అన్నాడు. 'ఆశ్రమానికి సాధుసజ్జనులు వస్తే వారికి ఆతిథ్యం ఇచ్చి, పూజాపునస్కారాలు చేయాలి' అని విభాండకుడు పుత్రునికి హితవు చెప్పి యథాప్రకారంగా తన ప్రాతఃకాల అనుష్ఠానానికి వెళ్ళాడు. వాళ్ళను మళ్ళీ చూసే భాగ్యం కలుగుతుందో లేదో అని ఋష్యశృంగుడు కలవరపడ్డాడు. రాయటం, చదవటం విస్మరించాడు. జప, తప, ధ్యాన, మననాలను మరచి, అనర్థ హేతువైన స్త్రీలమీది మోజును మదిలో నిలిపాడు.

స్వప్నంలో కూడా స్త్రీని చూడని ఋష్యశృంగుడు రమణుల దర్శనం మాత్రం చేతనే తన్ను తాను మరచిపోయాడు! కామం తాపసులకు అనర్థహేతువు. కామ లోలత్వానికి లొంగినవారు ఎంతటి బుద్ధిమంతులైనా ఈ భవసాగరంలో మునిగిపోక తప్పదన్నది లోకవిదితమే! అవిద్యాజనితమైన ఈ కామవికారం మాయా మోహాలకు పుట్టినిల్లు. అన్ని అనర్థాలకు ఆటపట్టు. కామమే కలహానికి మూలం. కాముకుని చిత్తం పాపసముద్రంలో లేస్తున్న అసత్యమనే అలలు, మహామోహ పర్వతాలు, మత్సరవనాలు, మూర్తీభవించిన



దంభరూపాలు. అహంకారం నిర్మించిన అజ్ఞానపు కోటలా, మూర్ఖుని మంకుపట్టులా, అంతా తనకే చెందాలనే దురాశలా, రూపుదాల్చిన భవవ్యాధిలా – అరిషడ్వర్గాలతో నిండి, విషయ వికారాలకు కాణాచియైనదే కాముకుల మనస్సు.

పుణ్యవృక్షాలను కూలదోసే కామమనే ఈ గొడ్డలిని ఎవరు సృజించారు? మోక్షద్వారాలకు ఆనకట్టలుగా, అవిశ్వాసమనే సంకెళ్ళతో జీవుని కాళ్ళను పెనవేసేదే ఈ కామం. ఈ కామరాక్షసి ప్రభావంవల్ల స్త్రీల దర్శనం చేతనే పురుషుల చిత్తాలు చలిస్తాయి, స్పర్శతో వీర్యం స్ఖలిస్తుంది, మహా తపశ్శక్తిమంతులు సైతం కామం వల్ల సర్వం కోల్పోతారు. కల్లు సారా నీరాలనే మూడు రకాల మత్తు పానీయాలకు తోడుగా వుండే నాలుగోది కామం. కాముకుల మనస్సులు దుర్గంధ భూయిష్ఠమైన పాపకూపాలు. విద్య, జపతపాలు, జ్ఞానం – ఇవన్ని మన్మథ వికారం ముందు నిర్వీర్యమైపోతాయి. పరాన్నానికాశిస్తే నాలుక, దానాన్ని గ్రహిస్తే చెయ్యి దగ్ధమైపోతాయి. కానీ కామం వల్ల అంతరంగమే అంతరించి పోతుంది. కామవివశులైన వారికి జపతపాలు, పూజా పునస్కారాలు, పారాయణలు ఎటువంటి ప్రయోజనాన్ని చేకూర్చలేవు. కామవశుడైనవాడు ఎప్పటికీ ధ్యానమగ్నుడు కాలేడు. అధ్యయనాలు, కీర్తనలు, పురాణ శ్రవణం, దానధర్మాలు – ఇవన్నీ కామం వల్ల నిష్ఫలాలుగా మారిపోతాయి. ఎవరి కళ్ళకు కామమనే పొరలు కప్పివుంటాయో, వారెంతటి జ్ఞానులైనా విషయారణ్యంలో చిక్కుకొని దారితప్పి తిరుగుతూ, చివరకు నరకానికి చేరుకొంటారు. స్వర్గానికి దూరంచేసి, సరాసరి యమలోకానికి చేర్చే ప్రత్యేక 'వాహనమే' కామం. కామం వల్ల ఇన్ని అనర్థాలున్నా బ్రహ్మానందుని (సద్గురు) కృప వుంటే భవబంధాలు తెగిపోయి, హృదయంలో సద్బోధలు హత్తుకుంటాయి. ఈశ్వరానుగ్రహం వల్ల హరి దర్శనం అయిన జనులను, శ్రీరామకటాక్షం సంపూర్ణంగా లభించిన వారిని మన్మథబాణం ఏమీ చెయ్యలేదు.

వారి ముందు మన్మథుడే నపుంసకుడైపోతాడు. మిథ్యకు ఉపాధిగా పురాణ పురుషుడు స్త్రీ పురుషులను సృజించాడు. ఎవరిపై ఆ పరమేశ్వరుని కృప కలుగుతుందో వారు మాత్రమే తప్పక తరించగలరు.

ఇక ప్రస్తుత కథావిషయానికొస్తే, ఋష్యశృంగుడు తాను చూచిన ఆ రూపసులు ఇంకా రాలేదేమా – అని మనసులో మథనపడసాగాడు. కొంత తడవైన తరువాత రంభా ఊర్వశులు ఆశ్రమంలోకి ప్రవేశించారు. సుందరరూపం, కోమలమైన కంఠం, విశాలమైన కనుదోయి కలిగిన ఆ అప్సరస స్త్రీలు ఋష్యశృంగుని చూస్తూ, సైగలతో తమ కామభావాలను ప్రదర్శించారు. నానావిధ పక్వాన్నాలు, మధురఫలాలు మునికుమారుడికి ఇచ్చారు. ఆయన వాళ్ళను తన దగ్గరగా వచ్చి కూర్చోమని, "మీరెవరు? మీ పేర్లేమిటి? ఎక్కడ నుంచి వచ్చారు? మీ వక్షస్థలంలో ఎత్తుగా బంతుల్లాగా ఉన్నాయే, అవేమిటి?" అని కుతూహలంతో ప్రశ్నించాడు. ఆ ప్రశ్నలకు వారు గలగలా నవ్వి "నీకు తలపై రెండు కొమ్ములున్నాయి గనుక ఋష్యశృంగుడివి. అలాగే మాకు వక్షస్థలంలో ఎత్తైన బంతులున్నాయి గనుక మమ్మల్ని 'గలండ' ఋషులని పిలుస్తారు. మా వద్ద అనంతమైన సుఖం లభిస్తుంది" అని ఋష్యశృంగుడితో సరసమాడారు. దానికి ఆ ముని 'సుఖమా? అది ఎలా లభిస్తుంది? దాన్ని ఎలా చవిచూడాలి? దాని తత్త్వమేమిటని' ప్రశ్నించాడు. సుఖతత్త్వాన్ని తాము బోధించగలమని వారనగా, మదనమోహితుడైన ఋషిసుతుడు ఆసక్తుడై, 'నేను మీ అధీనంలో ఉన్నాను. ఎక్కడికి తీసుకెడితే అక్కడకు వస్తాను' అని అన్నాడు. ఆలస్యం చేయకుండా వారందరూ విమానంలో మునికుమారుని వెంటబెట్టుకొని అయోధ్యకు తరలివచ్చారు.

దశరథుడు ఋష్యశృంగునికి నమస్కారం చేసి, ఆదర సత్కారాలను అందించాడు. 'మహాత్మా, మీ దర్శనభాగ్యంతో మా జన్మ చరితార్థమయింది' అని పలికి, తాను పెంచిన కన్యలలో ఒకరిని ఋష్యశృంగుడికిచ్చి వివాహం జరిపించాడు. ఆ సంరంభం నాలుగురోజులపాటు జరిగింది. లగ్న సమయానికి ఋషులందరూ వేంచేశారు. వారు వర, శాపానుగ్రహ సమర్థులు. వీరిలో తలమానికము కులగురువు వసిష్ఠుడు. దశరథుడు ఎవరికీ ఏ కొరతా రాకుండా అన్ని ఏర్పాట్లు చేశాడు. విభాండకుడు ఆశ్రమానికి తిరిగివచ్చి, పుత్రుడు లేకపోవడం చూచి, జ్ఞానదృష్టితో జరిగింది గ్రహించి, కోపంతో అయోధ్యకు చేరుకున్నాడు. నక్షత్రాల మధ్య చంద్రుడిలా, కిరణాల మధ్య సూర్యుడిలా, ఋషి కూటంలో ఉన్న తన కుమారుణ్ణి చూచాడు. దశరథుడు తటాలున లేచి విభాండకుడికి నమస్కరించి, శరణువేడాడు. దానికి ముని ఆనందించి, ముల్లోకాల్లో సమర్థులయిన నలుగురు పుత్రులు కలుగుతారని ఆశీర్వదించాడు.



యజ్ఞమంటపంలో ఋషుల సమక్షంలో ఋష్యశృంగుడు యజ్ఞకుండంలో 'స్వాహా'కారంతో ఆజ్యాన్ని అర్పిస్తూ యాగం నిర్వహించాడు. ప్రాత:కాలంలో ఉదయించే సూర్యుడిలా, పూర్ణాహుతి సమయాన అగ్నిదేవుడు ప్రత్యక్షమయ్యాడు. నాలుగు కొమ్ములు, రెండు తలలు, ఏడు చేతులు, మూడుకాళ్ళతో వున్న ఆ దివ్యపురుషుని చూసి మునులందరూ పరమానందం చెందారు.

### యజ్ఞఫలం : రాణులకు విభజన

ఆ యజ్ఞపురుషుడు మృష్టాన్నంతో నిండిన ఒక పాత్రను ఋష్యశృంగుడికి యిచ్చి త్వరగా భాగాలు చేసి ముగ్గురు రాణులకు పంచాల్సింది. ఈ పని తత్క్షణం చేయాలి. లేదా కార్యహాని జరుగుతుంది. క్షీరసాగరశయనుడు, కైవల్యప్రదాతయైన ఆ పరమాత్ముడే నీకు పుత్రుడిగా ఉదయిస్తాడని చెప్పి అదృశ్యమయ్యాడు. ఋష్యశృంగుడు ఆ యాగఫలాన్ని వసిష్ఠుడికిచ్చాడు. వసిష్ఠుడు దాన్ని మూడుభాగాలు చేసి, మొదటి దాన్ని కౌసల్యకు, రెండవ భాగం సుమిత్రకు, మూడో భాగం కైకేయికి ఇచ్చాడు. ఇది చూసి కైకకు

కోపం వచ్చింది. 'నేను రాజుకు ప్రియమయినదాన్ని. అందరు దేవతలు చూస్తుండగా యుద్ధంలో రాజుకు విజయం చేకూర్చిపెట్టాను. నన్నే శ్రేష్ఠురాలిగా ఎన్నుకోవాలి. కేతకీ పుష్పంలో ఉన్న చిన్న ఆకు, మిగతా వాటికన్నా గొప్పగా కొనియాడబడుతుంది. అమూల్యమైన చిన్నరత్నం ముందు పెద్ద బండరాయి సరిపోలదు కదా! మృగేంద్రుని ముందు మదగజం ఏపాటి' అని మథనపడుతూ, తనను పెద్దగా గౌరవించలేదని ముఖం ముడుచుకొని కూర్చుంది. ఆ సమయంలో వసిష్ఠుడు, 'విఘ్నం కలగబోతుంది, ఇక జాగుచేయక ఆరగించు!' అని హెచ్చరిస్తూండగానే, ఒక గద్ద వచ్చి కైక చేతిలోని భాగాన్ని తన్నుకొనిపోయింది. అందరూ హాహాకారాలు చేశారు. కైక కిందపడి దొర్లుతూ ఏడ్వసాగింది. 'నా పూర్వకర్మలు గహనమయినవి. అభాగ్యురాల్ని. పెట్టిపుట్టలేదు. నాకు పుత్రసంతానప్రాప్తి ఎక్కడ?' అని విలపించింది. దశరథుడు చింతాక్రాంతుడయ్యాడు. కైకను సమాధానపరచాలని యత్నించాడు. అప్పుడు కౌసల్య, సుమిత్రలు తమ వాటాలలో చెరిసగాన్ని పంచి పూర్ణభాగాన్ని కైకకు ఇచ్చారు. భాగీరథి మందాకినీ నదుల్లా, స్వప్నంలో కూడా రవంతయినా ఈర్ష్యాసూయలు లేకుండా కౌసల్య సుమిత్రలు మెలుగుతుండేవారు. కుటిలురకు కలలో కూడా శాంతిసౌఖ్యాలుండవు. వాళ్ళను లోకం సరకు చేయదు. వారు ఎప్పటికీ అపకీర్తికి లోనవుతారు.

వసిష్ఠుడు అందించిన ప్రసాదాన్ని ముగ్గురూ గ్రహించారు. ఆ ప్రసాదం గొంతులో ఇరుక్కోగా మింగలేక కైకేయి ఉక్కిరిబిక్కిరి అయింది. అది చూసి వసిష్ఠుడు తీర్థం గొంతులో పోశాడు. అప్పుడు ఆ పిండం గొంతులోంచి కిందికి దిగింది. దశరథుడు ఆనందంతో దానధర్మాలు చేశాడు. బ్రాహ్మణులకు వస్త్రసదానాలు, భూరిదక్షిణలు ఇచ్చాడు. బ్రాహ్మణులు, ఋషులు, ఋష్యశృంగుడు తమ స్వస్థానాలకు వెళ్ళిపోయారు. తరువాత ముగ్గురు రాణులు గర్భవతులయ్యారు. ఆ వార్త విని 'నాకు భాగ్యోదయమయింది' అని దశరథుడు సంతోషాతిశయంతో ఉప్పొంగిపోయాడు.



## శ్రీహనుమాన్ జన్మకథనం

ఇదిలా ఉండగా, గద్ద తన్నుకొనిపోయిన పిండ భాగం ఏమైందనే విషయం ఆమూలాగ్రంగా తెల్సుకోవాలనుకొంటున్నారు కదా?...

అంతకు కొంతకాలం క్రితం వానరుడయిన కేసరి యొక్క భార్య అంజనీదేవి ఋష్యమూక పర్వతం మీద ఘోర తపస్సు చేసుకొంటుండేది. ఏడువేల సంవత్సరాలు మౌనదీక్ష వహించి, నిష్ఠతో శివుణ్ణి ఆరాధించి ప్రసన్నం చేసుకుంది. శివుడు ప్రత్యక్షమై, 'నీకిష్టమొచ్చిన కోరికను కోరుకొ'మ్మన్నాడు. ప్రతాపవంతుడు, అక్షయుడు, కీర్తిమంతుడు, వజ్రకాయుడు, మహాభక్తుడు అయిన కొడుకును ప్రసాదించమని అంజనీదేవి వేడుకుంది. 'నేను మహారుద్రుడిని. ఏకాదశరుద్రుడిగా నే నీ గర్భాన జన్మిస్తాను' అని శివుడు వరమిచ్చాడు. అంజనీదేవి సంతోషంతో పులకించిపోయింది. 'అంజలి ఘటించి సావధానచిత్తంతో అంతర్ముఖివై నన్ను ధ్యానిస్తూండు. లోకానికే ప్రాణమయిన వాయుదేవుడు పెనుగాలి రూపంలో ఒక ప్రసాదం తెచ్చి నీకిస్తాడు. దాన్ని వెంటనే భుజించు' అని ఉపదేశించి స్వస్థానానికి వెళ్ళిపోయాడు. అంజనీదేవి శివాజ్ఞమేరకు అంజలి ఘటించి (తన దోసిటను తెరచి వుంచి) ధ్యానంలో మునిగిపోయింది. ఆ సమయంలోనే కైక చేతిలో నుంచి పిండ ప్రసాదాన్ని తన్నుకొనిపోతున్న గద్ద ఆకాశమార్గంలో అటే వెళుతోంది. అప్పుడు పెనుగాలి ప్రచండంగా వీయగా, ఆ తాకిడికి ఆ పిండం గ్రద్ద నోటి నుంచి జారి సరిగ్గా అంజనీదేవి దోసిలిలో పడ్డది. ఆమె వెంటనే శివస్మరణ చేస్తూ ఆ ప్రసాదాన్ని భుజించింది.

పూర్వం బ్రహ్మలోకంలో సువర్చస అనే దేవాంగన నృత్యం చేస్తూ మధ్యలో (అలసత్వం వల్ల) ఆపివేసింది. అందుకు కోపం వచ్చిన బ్రహ్మ ఆమెపై కోపించి గ్రద్దగా జన్మించమని శాపం ఇచ్చాడు. ఆ దేవాంగన తన తప్పుకాచి,

శాపవిమోచనం తెలుపమని వేడుకుంది. 'అయోధ్యనేలే దశరథుడు పుత్రకామేష్టి యాగం చేసి, తన భార్యలకు యజ్ఞపిండాలను పంచుతాడు. అందులో ఒకదానిని అంజనీదేవి గ్రహించేలా చేస్తే నీవు నీ నిజరూపాన్ని పొందుతావు' అని బ్రహ్మ శాపవిమోచన విధానం తెలిపాడు. అది ఇప్పుడు నెరవేరి, శాపవిమోచనమై ఆ గ్రద్ద తన స్వస్వరూపాన్ని పొందింది.

తరువాత అంజనీదేవికి తొమ్మిదినెలలు నిండాయి. సూర్యుడే ఉదయించినట్లుగా దేదీప్యమానంగా ప్రకాశించే వానరరూపంతో మహా బలాఢ్యుడైన పుత్రుడు అంజనీదేవికి జన్మించాడు. అతని కుండలాల కాంతి ముఖమంతా ప్రసరిస్తున్నది. నడుమువరకు వేలాడుతున్న యజ్ఞోపవీతంతో, గట్టిగా బిగించిన దట్టీతో శోభిల్లుతున్నాడు. పగడపురంగు ముఖవర్చస్సుతో అద్భుతంగా వెలిగిపోతున్న మారుతికి వెనుక ఎరుపురంగులో మోహాన్ని తాకగల పొడుగాటి తోక వున్నది. పుట్టగానే మారుతి ఆకలిగొని చంచలమయిన చూపులతో నాలుగువైపులా చూశాడు. అది గమనించిన అంజనీదేవి ఫలాలను తెద్దామని వెళ్ళింది. మారుతి ఆకలితో రోదించసాగాడు. అప్పుడే ఉదయిస్తున్న సూర్యబింబాన్ని చూచి అదేదో చాలా ఉత్తమఫలం కాబోలని భ్రమించి చంచల స్వభావంతో పైకి ఎగిరాడు. శరీరంలో ఉండే వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి. సింహంలా గర్జించాడు. ఆ ధ్వనులకు దిక్కులన్నీ మార్మ్రోగిపోయాయి. భూమి కంపించింది. బ్రహ్మాండమైన స్ఫూర్తితో, తోకను ఆడిస్తూ, అడ్డం వచ్చిన చెట్లను పడగొడ్తూ, కాళ్ళూచేతులు కదలిస్తూ, పాకుతూ లంఘనాతి లంఘనాలతో సూర్యుని లక్ష్యంగా పెట్టుకొని ఆకాశం వైపుకు దూసుకుపోయాడు. భూమి నుండి గరుడుడు వైకుంఠానికి ఎగిరినట్లుగా అంజనీసుతుడు భానుమండలానికి ఎగిరి, వాయువేగ మనోవేగాలతో పయనిస్తున్నాడు. లోకానికి ప్రాణదాత అయిన వాయువు ఇది గమనించి, 'సూర్యమండలం చాలా తీవ్రమయింది. ఆ వేడికి నా పుత్రుడు తట్టుకోలేడు.



నేను పరిగెత్తి పట్టుకోవాలి. కాని, వీడు చపలుడే! సులభంగా వశపడతాడా?' అని ఆలోచించాడు. హిమాలయం నుండి తెచ్చిన చల్లని మంచుకణాలతో నిండిన గాలిని, వాయువు మారుతిపైన ప్రసరింపజేశాడు. హనుమంతుడు నోరు తెరిచి సూర్యుని చేరాడు.

ఆ రోజు సూర్యగ్రహణం. అదే సమయంలో సూర్యుని మింగడానికి రాహువు కూడా పరుగున వచ్చాడు. రాహువుని చూచి మారుతి ఆగ్రహించి, 'నేను చాలా ఆకలితో పండును తినడానికొస్తే నా గ్రాసానికి అడ్డుపడ్డ నువ్వెవరు?' అని ప్రశ్నిస్తూ, మదగజం పిల్లిని పట్టుకొని తొండంతో ఏవిధంగా విసిరేస్తుందో, పాము ఎలుకను ఏవిధంగా చుట్టుకొని పీడిస్తుందో, ఆవిధంగా తోకతో రాహువు మోహాన్ని బద్దలుకొట్టి కిందపడేశాడు. ఆ దెబ్బకు రాహువు మూర్ఛిల్లాడు. రాహు పక్షానికి చెందిన కేతువు అది చూచి ఉన్మత్తుడై, సింహంపైకి నక్క ఎగిరినట్లు, తన శక్తి తాను తెలుసుకోక, మృత్యువును విస్మరించి హనుమంతుడి పైకి పోయే సాహసం చేశాడు. తన పైకి వస్తూన్న కేతువును చూసి హనుమంతుడు పిడికిలితో అతని ఒళ్ళంతా మర్దించాడు. ఆ దెబ్బలకు తాళలేక కేతువు పారిపోయాడు. నెత్తుటితో మర్దించిన పర్వతాల్లా రక్తసిక్తదేహాలతో రాహుకేతువులు ఇంద్రుని చేరుకుని, 'నువ్వు మాపై కోపంతో మాకు ఎందుకు విఘ్నాలు కల్పిస్తున్నావ'ని ఆక్రోశంతో ప్రశ్నించారు. 'ఈవిధంగా మిమ్మల్ని పిండి చేసిందెవ్వరు? ఇట్లాంటి విపరీతాన్నెవరు కలిగించారు', అని ప్రశ్నిస్తూ, దేవతలను వెంటబెట్టుకొని వజ్రాయుధాన్ని ధరించి ఇంద్రుడు ఆ ఉత్పాతాన్ని సృష్టించినవాడి దగ్గరకు బయలుదేరాడు. రాహువు ముందుగా సాగాడు. ఇంతలోపల అంజనీసుతుడు సూర్యుని మింగబోతుండగా 'ఈ శత్రువు నాకెక్కడ దాపురించాడు! తిథి వారం లేకుండా నేనెక్కడికీ పోలేని సమయంలో నాపైకి వచ్చాడ'ని సూర్యుడు గడగడా వణికిపోసాగాడు. రుద్రప్రతాపుడైన మారుతి, 'ఇది బడబానలంలా ప్రకాశించే

సూర్యమండలం. నిజంగా ఫలం కాదు' అని గ్రహించి, సూర్యుని మింగే ప్రయత్నాన్ని విరమించుకుని వెనక్కు తిరిగాడు. ఆ సమయంలో ఇంద్రునితో సహా దేవతలను వెంటబెట్టుకొని వస్తున్న రాహువును చూచి, 'ఇతణ్ణి మాత్రం వదలిపెట్టను. వీడి సంగతి ఏమిటో తేల్చివేస్తాను' అని అనుకున్నాడు. ప్రళయకాలంలో మెరుపులను చూచి ఆకర్షితమై వాటి మీదికి పోయి నశించే శలభాల వంటిదయింది దేవతలస్థితి. ఇంద్రుడు చూస్తుండగానే అకస్మాత్తుగా పర్వతమే మీద పడినట్లుగా మారుతి రాహువును పిడికిటితో ఒక్క పోటుపొడిచి, ఒక్క చరుపు చరిచాడు. రాహువుకు గ్రహపూజ యథావిధిగా జరిగినట్లయి, 'ఓ అమరనాథా! ఇంకా అలా చూస్తూ నిలబడ్డావేమిటి? ఈ మారుతి నన్ను పిండి చేస్తున్నాడు. నన్ను రక్షించు' అని ఆక్రోశంగా విలపించాడు. అప్పుడు ఇంద్రుడు ఐరావతాన్ని హనుమంతుడి మీదికి ఉసిగొల్పాడు. ఐరావతం అడుగుల బరువుకు భూమి కుంగిపోయింది. హనుమంతుని వైపు పరుగున లంఘించింది. పైకి వస్తున్న ఐరావతాన్ని మారుతి – వజ్రాయుధం పర్వతాన్ని ఛేదించినట్లుగా మర్దించాడు. దాంతో అది భయపడి పరుగెత్తసాగింది. తన నిజబలంతో దాన్ని వశపరుచుకోవడం ఇంద్రుడికి కూడా సాధ్యం కాలేదు. కాముకురాలయిన స్త్రీ ఏం చెప్పినా వినకుండా తనకు తోచినరీతిగా ఏవిధంగా ప్రవర్తిస్తుందో, ఆ విధంగా ఐరావతం దిక్కుతోచకుండా అడవుల వెంట పరిగెత్తింది. సాధుపుంగవులు వివేకంతో కామక్రోధాలను అణగ దొక్కినట్లుగా, ఇంద్రుడు ఐరావతాన్ని ఎలాగో స్వాధీనం చేసుకొని హనుమంతుడి ముందు నిలబడ్డాడు. ఆంజనేయుడు అది చూచి ఐరావతం నాలుగుదంతాల్ని పట్టుకొని గిరగిరా తిప్పి – దానిపైనున్న ఇంద్రుడితో సహా – కిందకు విసిరేశాడు. హనుమంతుడి చేతి చరుపుకు కిరీటం క్రింద పడిపోయింది. ఇంద్రుడు మరో ప్రక్కన పడ్డాడు. జుట్టు ఊడిపోయింది. కింద పడిన దేవేంద్రుని చూసి దేవతలు భయకంపితులయ్యారు. మళ్ళీ ఐరావతాన్ని ఉసిగొల్పి చూశాడు. కానీ అది



ఒక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేదు. పైగా వెనక్కు తిరిగి పరిగెత్తసాగింది. ఇంద్రుడు గాభరాపడ్డాడు. యముడు హనుమంతుడిపై దండెత్తి, గదతో ప్రహరించాడు. దాంతో మారుతి యముడిపైకి దూకి రొమ్ము మీద ఒక గుద్దు గుద్ది, నేలమీద పడేశాడు. రొమ్ముల మీద కూర్చొని మొదట ముష్టిఘాతాలతోనూ, ఆ తరువాత యముని గద లాక్కొని దానితోనూ కొట్టసాగాడు. అప్పుడు యముడు మారుతిని శరణుజొచ్చి ప్రార్థించాడు. వరుణుడు, కుబేరుడుకూడా శరణని మారుతిని స్తుతించసాగారు. ఈ లోపల మళ్ళీ ఐరావతం ఎక్కి ఇంద్రుడు ఎదురయ్యాడు. అది చూసి హనుమంతుడు ఐరావతం తోకను పట్టుకొని త్రిప్పి నేలపై కొట్టాడు. దాంతో లోకాలన్నీ కంపించాయి. ఇంద్రుడు వజ్రాయుధంతో సహా క్రిందపడ్డాడు. దేవతలు పరుగెత్తి పర్వతగుహల్లో దాక్కొన్నారు. భూమి రసాతలానికి కుంగిపోయిందని గగ్గోలెత్తారు. ఇంద్రుడు ధైర్యసాహసాలు కూడగట్టుకొని హనుమంతుని వజ్రాయుధంతో మొహంమీద కొట్టాడు. దెబ్బకు హనుమంతుడు మూర్ఛిల్లి, మేరుపర్వతాల లోయల్లో పడిపోతుంటే, వాయుదేవుడు తన సుతుని రక్షించి, కౌగలించుకుని జరిగింది తలచుకొని వెక్కివెక్కి ఏడవసాగాడు. 'అమరేంద్రుడు దురాత్ముడు. పసికందని కూడా తలంచక వజ్రాయుధం విసిరిన పరమ నిర్దయుడు. ఈ పసివాడు మరణిస్తే ప్రహ్లాదుడిని రక్షించడానికి నృసింహమూర్తి దైత్యకులాన్ని అంతం చేసినట్లుగా అతణ్ణి సంహరిస్తాను' అని మనసులో వితర్కించుకున్నాడు. అందరి ప్రాణాలు వాయువు ఆధీనం కనుక, క్షణం లోపల ముల్లోకాల్లోనూ వాయువును స్తంభింపజేశాడు. ఇంద్రుడు, త్రిమూర్తులూ, దేవతలు వాయువు సమ్ముఖానికి వచ్చి నమస్కరించారు. పుత్రుడికోసం సకల చరాచర సృష్టిని నాశనం చేయడం భావ్యంకాదని బ్రహ్మదేవుడు సమాధానపరిచాడు. 'నా పుత్రుడు నిర్జీవుడయితే ఇంద్రాది దేవతలూ నశిస్తారని' వాయువు ఆవేశంగా పలికాడు. విష్ణువు నవ్వి, 'నీకు కావాల్సిన వరం

కోరుకొమ్మ'న్నాడు. 'ఈ శిశువుకు చావు లేకుండా చేయమ'న్నాడు వాయువు. 'బ్రహ్మ కల్పాంతం వరకు చిరంజీవిగా ఉంటాడని' విష్ణువు, 'నడిమికంటి తీక్ష్ణాగ్నులు, త్రిశూలాలు కూడా ఏమీ చేయలేవ'ని శివుడు, 'బ్రహ్మాస్త్రాలు, ఇతర శస్త్రాలు ఏమీ బాధించలేవ'ని బ్రహ్మ, 'నా వజ్రాయుధం కూడా ఏమీ చేయలేదు. వజ్రశరీరుడై ఎలాంటి భంగపాటు లేకుండా చిరంజీవిగా ఉంటాడ'ని ఇంద్రుడు వరాలను ప్రసాదించారు. 'దవడలపై వజ్రాయుధం తాకినందువల్ల హనుమంతుడిగా ప్రఖ్యాతిపొంది, పెక్కుమంది రాక్షసులను నాశనం చేస్తాడ'ని కుబేరుడు, 'హనుమద్ధ్యానం వల్ల మృత్యుభయం ఉండదు. యమపాశం బంధించదు' అని యముడు, 'ఎంతకాలం యుద్ధం చేసినా అలసట ఉండదు. శక్తి భంగపడదని' వరుణుడు, వరాలిచ్చి మారుతిని కొనియాడారు. విశ్వకర్మ దివ్యకమలహారాన్ని మారుతి మెడలో వేసి 'ఈ మాల ఎంత కాలమైనా వసివాడదు' అని దీవించాడు. ఇలా దేవతలందరూ ఎన్నో వరాలు ఇచ్చి వారి వారి స్వస్థానాలకు వెళ్ళి పోయారు. వాయుదేవుడు ప్రీతితో ఆంజనేయుని అంజనీదేవి దగ్గరకి తెచ్చాడు. అంజనీదేవి తన బిడ్డను కౌగలించుకొని, తల నిమురుతూ స్తన్యాన్ని ఇస్తూ పొంగిపోయింది.

'రామవిజయ' గ్రంథంలోని హనుమంతుడి జనన విశేషాలను శ్రద్ధతో, సావధాన చిత్తంతో విన్న వారికి గ్రహబాధలు కలుగవు. హనుమత్కథ సద్భావంతో శ్రవణం చేస్తే దుష్టగ్రహాలు కలిగించే దారుణ విఘ్నాలు బాధించలేవు. ముమ్ముందు రసవంతమయిన కథ ఇంకా ఎంతో వుంది! ఆనంద భరితుడయిన దశరథుడు జన్మరహితుడయిన రఘునాథుడికి జన్మనిచ్చిన విధము మొదలైన కథాంశాలు – పంటపొలంలో పంటకొచ్చే కొద్దీ కంకులు పొట్ట విచ్చుకున్నట్లు – రామకథామృతరస ధారలు సందర్భోచితంగా జాలువారుతుంటాయి. పుత్రసంతతి లేనివారు, 'రామవిజయా'న్ని పఠిస్తే సంతతి, సిరిసంపదలూ కోకొల్లలుగా వృద్ధి పొందుతాయి.




మనసారా 'రామవిజయా'న్ని పఠిస్తే కైవల్యపథం లభిస్తుంది. బ్రహ్మానంద సద్గురో! రఘువరా! నీలకంఠ హృదయనివాసా! వేదవంద్యా! శ్రీధరవరా! దీనోద్ధారా! నీ దయామృతాన్ని నాపై వర్షింప జెయ్యి! స్వస్తి!

'శ్రీరామవిజయగ్రంథం' సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీశీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన పండితులు శ్రవణం చేయగలరు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

## తృతీయాధ్యాయం మధురం



# అధ్యాయము - 4

## శ్రీ గణేశాయ నమః

**మూ**డవ అధ్యాయంలో హనుమంతుడి జన్మవృత్తాంతాన్ని, దివ్యచరిత్రను తెలుసుకున్నాం. పురాణాల్లో ఆయనను గురించి ఎన్నో విభిన్న కథలుండటానికి గల కారణాలు అందరకూ తెలియచెప్పాలి. చతురులయిన శ్రోతలు ప్రశ్నలు వేస్తారు. శ్రోతల ఆసక్తిని అనుసరించి, కవి కౌశలంతో ప్రయోగించే అతి రసవంతమైన శబ్దజాలాన్ని దయతో ఆలకించండి.

తరంగాలకు ముందే నీరు వ్యాపించినట్లు, తారలు చంద్రుడు మేరుపర్వతం చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు, జపమాలలో పూసలు వరుసగా తిప్పబడినట్లు అనాదిగా జగదీశ్వరుడు సందర్భానుసారంగా దాల్చిన అవతారాలు ఒకదానివెనుక ఒకటి సృష్టిచక్రంలో పరిభ్రమిస్తుంటాయి.

సత్యవతీ పుత్రుడైన వ్యాసమహర్షి వివిధ కల్పాలలో భగవంతుడు ఎత్తిన వివిధ అవతారాల కథలను తెలియచెప్పాడు. ఆ పరమాత్మ ఒక అవతారంలో ప్రవర్తించినట్టు ఇంకో అవతారంలో ప్రవర్తించలేదు. ప్రతి ఒక్క అవతారంలోనూ, విశేషమయిన లీలలను ప్రదర్శించాడు. ఇవన్నీ వాస్తవాలే కాని విపరీతాలు కావు.

రణరంగంలో చతురంగ బలాలను సైన్యాధిపతి ఒక్కడే ఎదిరించినట్లు, సాగరంవలె గంభీర స్వభావులు చతురులైన శ్రోతల సమూహాన్ని ఈ కవి ఎదుర్కొంటున్నాడు. సభానాయకుడైన శ్రోత అత్యంత ప్రావీణ్యంతో సందేహమనే ధనుస్సు ఎక్కుపెట్టి, ప్రశ్నలనే బాణాలను వదులుతుంటాడు. ఆ సమయంలో బుద్ధి బలసమన్వితుడైన కవి ఆ శరాలనే లక్ష్యాలుగా చేసుకొని, వాటిని నేర్పు, క్షమాబుద్ధి అనే ధనుస్సుతో శాస్త్రాధారాలనే బాణాలతో ఖండిస్తాడు. విచక్షణాపూర్వకమైన ఆ ప్రశ్నోత్తరాలతో శ్రోతలు, వక్తలు



సమాధానపడి, ధన్యులమయ్యామని మస్తకతర్జనులనూపుతూ ప్రేమావేశంతో నామజపం చేస్తారు. ఆ ఘోషకు సందేహాలనే పశువులు పారిపోతాయి.

వక్తల అసమానమయిన వాగ్ధాటి అనన్య గౌరవపూర్వకంగా శోభిల్లుతోంది. పద్యరచనలు రంగ వల్లులు దిద్దిన సాహిత్యరంగంపై నృత్యం చేయసాగాయి. శాస్త్రాధారాలనే శరాలు శ్రోతల అంతరంగంలో నాటుకోవడం మూలాన వారు ఆనంద సాగరంలో మునిగి తేలుతుంటారు. నిర్మలమయిన మనస్సుతో శ్రోతలు ప్రశ్నిస్తుండగా, నిస్సంకోచంగా వక్తలిచ్చే ప్రత్యుత్తరాలతో జరిగే సత్యయుద్ధంలోని ఆ శబ్దకౌశలాన్ని వివేకులైన పండితులు గ్రహిస్తారు. గురుశిష్య సంవాదంలా, భగవంతుడుకీ భక్తుడుకీ మధ్య జరిగే సంవాదంలా, వక్తలకు శ్రోతలకు మధ్య జరిగే ఈ సంవాదంలో వైరం ఏమాత్రం ఉండదు.

శ్రోత వక్తల మధ్య సముద్ర మథనంలా సాగే సంవాద కళను పాండితీ పటిమ కలిగిన రసజ్ఞులే ఆదరించగలరు. గృహిణి ఒక్క గోధుమలతోనే రకరకాలైన పిండివంటలు తయారు చేసినట్లు, ఒకే మట్టితో కుమ్మరి రకరకాల కుండలు తయారు చేసినట్లు, ఒకే నూలుపోగుతో సాలెవాడు వివిధ వస్త్రాలను నేసినట్లు, ఒక్క బంగారంతో కంసాలి అనేక ఆభరణాలు తయారుచేసినట్లు, ఒకే కర్రతో వడ్రంగి నగిషీలు చెక్కినట్లు, యుక్తితో సాగరం నుండి పలు రత్నాలను వెలికి తీసినట్లు, శబ్ద సాహిత్యాలు మేళవించి చతురతతో వివిధ కవనాలు చేస్తుంటాడు. శ్రోతల కోసం ఇంత చెప్పాల్సి వచ్చింది. ఇక, రామకథను శ్రద్ధగా వినవలసిందని చతురులైన శ్రోతలకు శ్రీధరకవి విన్నవించుకుంటున్నాడు.

### రాణుల గర్భధారణ

లోగడ, తృతీయాధ్యాయంలో, హనుమంతుని జన్మకథను వివరించాం. ఆ తరువాత జరిగిన కథను సంక్షిప్తంగా సింహావలోకనం చేద్దాం. ముగ్గురు

రాణులు గర్భవతులయ్యారు. శుద్ధవిదియనాటి చంద్రుడు దినదిన ప్రవర్ధమానమైనట్టుగా, ప్రాత:కాలంలో ఉదయించిన సూర్యుడు త్వరత్వరగా సాగి పశ్చిమ దిశకు పయనించినట్లుగా, సాధుసజ్జనుల సాంగత్యం వల్ల దినదినము ప్రేమ పొంగి పొరలినట్లుగా, ఔదార్యంవల్ల, దినదిన ప్రవర్ధమానమయ్యే సత్కీర్తిలా – కౌసల్య, సుమిత్ర, కైకేయిల గర్భాలు పెరిగాయి. అప్పుడు కులగురువైన వసిష్ఠుడు రాణుల ఇష్టానిష్టాలను కనుక్కొని శాస్త్రవిధి ననుసరించి సీమంతం జరిపించమని దశరథుడికి సలహా ఇచ్చాడు. దశరథుడు గురుపాదాలకు అభివందనం చేసి శచీదేవి వద్దకు ఇంద్రుడు వెళ్ళినట్లుగా ముందుగా కైకేయి అంత:పురంలో ప్రవేశించాడు. పాయసం పంపకంలో వచ్చిన కోపాన్ని చల్లార్చడానికి లోగడ కైకేయి అంత:పురానికి ఒకసారి వెళ్ళాడు. ఆ తరువాత ఆమె అంత:పురంలో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి! చెలికత్తెలు వెళ్ళి రాజాగమన వార్తను, రాక కారణాన్ని కైకేయికి శుభం పలుకుతూ తెలిపారు. సౌందర్యవతి అనే అభిమానం, ఆభిజాత్యంతో నిండిన కైకేయి గర్భవతి గనుక ఆమె ద్వారం వద్దకు వచ్చి ఆహ్వానించక పోయినా దశరథుడే స్వయంగా వెళ్ళాడు. అల్పవిద్య గలవాడికి ఆడంబరం హెచ్చుగా వున్నట్లు, గారడీ వాడికి తెలిసింది కొంచమయినా ప్రగల్భాలు ఎక్కువయినట్లు, ముక్కిడి తన కంటె అందగాడు లేడని డంభాలు పలికినట్లు, విషం కొండెలో ఉన్నా తేలు తోకెత్తుకొని తిరిగినట్లు, మహామూర్ఖునికి ఉండే జ్ఞానం అల్పమైనా బృహస్పతిని కూడా లెక్కచేయనట్లు, వట్టి పోయిన ఆవు పాలు పితికే వాడిని తన్నినట్లు, కుండలో సగం వరకే ఉండే నీళ్ళు పైకెగిరెగిరి పడినట్లు – కైకేయి దశరథుని రాకను గమనించి కూడా, చూసీచూడనట్లుండిపోయింది. స్త్రీ, సేవకుడు, సంతానం, దాసి, కుక్క, కోతి, కుచ్చితుడు మొదలైన వాళ్ళను అవధుల్లో ఉంచకుంటే ఆపద తప్పదు. దశరథుని చూసి కూడా కైకేయి కనీస మర్యాదలు చేయకపోయినప్పటికీ, మహారాజు కైక నుద్దేశించి, 'నీకేం కావాలో



కోరుకో! నీ మనసులో ఉండే వాంఛితాల్ని నెరవేరుస్తాను. ప్రియా, దయచేసి నాతో మాట్లాడు' అని బుజ్జగించి, 'ఓ సుకుమారీ! నీ కోసం ప్రాణాలయినా అర్పించడానికి సిద్ధంగా ఉన్నాన'ని దశరథుడు తిరిగి హామీ ఇచ్చాడు. అప్పుడు కైక 'అయితే ఓ మహారాజా, విను! కౌసల్య, సుమిత్రలకు కలగబోయే సంతానాన్ని దిగంతాలకు పంపించాలి. వాళ్ళు అరణ్యాల్లో అలమటించాలి. వాళ్ళ ఆచూకీ కూడా మనకు తెలియకూడదు. నా పుత్రుడే సింహాసనం అధిష్ఠించాలి. ఇదే నా కోరిక! మీరు అధర్మంగా భావించవచ్చు. కానీ దోషం నాది కాదు. అన్ని లోకాలు నన్ను నిందించనీ! కాని ఈరకంగా చేస్తేనే నాకు ఆనందం. లోకదు:ఖమే నా హర్షం. అదే నా అభీష్టం' అని అన్నది. శూలాల్లాంటి ఆ మాటలు విని మహారాజు హతాశుడయ్యాడు. దు:ఖమనే తీగలకు కాచిన ఫలాలను ఆరగించినట్లు కైక విషపూరితమైన మాటలకు బాధావ్యథిత హృదయుడయ్యాడు. కొండచరియ విరిగి మీద పడ్డట్లు, కాలసర్ప విషజ్వాలల్లో చిక్కుకున్నట్లు, అకస్మాత్తుగా తీవ్ర శస్త్రాస్త్రాలు బాధించినట్లు, వేదాలు దొంగతనం జరిగినప్పుడు బ్రహ్మదేవుడు వ్యథ చెందినట్లు, అగస్త్యుని ఆపోశనంతో సముద్రుడు కటకట పడినట్లు – దశరథుడు దు:ఖితుడయ్యాడు.

కఠోరమైన కైకేయి కోర్కెలు దశరథుడ్ని వివశుణ్ణి చేశాయి. నెమ్మదిగా అక్కణ్ణుండి సాగి సుమిత్రా మందిరాన్ని సమీపించాడు. సంసారతాప దగ్ధుడైనవాడు సాధుసజ్జన సమాగమం వల్ల పొందే శాంతిని మహారాజు సుమిత్రా మందిరంలో పొందాడు. సుమిత్ర సార్థక నామధేయి. పేరు కర్ణుడు, కానీ కాణీ రాల్చడు! పేరుకు బృహస్పతి, నోటమాటరాదు! పేరు కమలనయన. కానీ, మెల్ల కళ్ళు! పేరు 'క్షీరసింధువు', చుక్క మజ్జిగైనా ఇంట్లో వుండదు. పేరుకు మృగరాజు, నక్కను చూస్తే వణుకు! మహారాజు అని పేరు పెట్టుకొని ఇంటింట బిచ్చమెత్తుకోవడం, 'మదనుడు' ముక్కు లేకుండా ఉండటం – మొదలయిన వన్నీ లోకంలో స్వభావ విరుద్ధంగా కనిపిస్తుంటాయి. కానీ,

సుమిత్ర ఇందుకు విరుద్ధంగా, స్నేహభావంతో సత్వగుణంతో సంచరిస్తుంది. మహారాజు ఆగమనం తెలియగానే హంస గమనంతో వెళ్ళి, ఎదురేగి పాదాభివందనం చేసింది.

స్త్రీలకు పతియే ప్రత్యక్ష దైవం. పుత్రుడికి మాతాపితలే దైవసమానులు. శిష్యునికి గురువే దైవం. అందువల్ల సుమిత్ర దశరథుడికి షోడశోపచారాలు చేసి, చేతులు జోడించి లజ్జతో తలవంచుకుంది. సద్బోధవల్ల అజ్ఞానం నశించినట్లుగా, సుమిత్ర పరిచర్యల వల్ల కైక సదనంలో కలిగిన వ్యథ దశరథుడికి తొలగిపోయింది. చిరునవ్వుతో సిగ్గుతో తలవంచుకుని వున్న సుమిత్రను చూసి మహారాజు మనసు ఉల్లాసపూరితమయింది. 'ఏదయినా కోరిక కోరుకొమ్మ'ని అడిగాడు. 'మహారాజా! కౌసల్య గర్భాన పరమాత్ముడు జగద్వంద్యుడు జగదాత్మయైన భగవంతుడు ఉదయించబోతున్నాడు. నేను అతన్నే పుత్రుడిగా భావిస్తాను. ఆయనకే హారతులిచ్చి ఆనందిస్తాను. సేవ కంటే గొప్ప సాధన లేదంటారుగనుక పెద్దవారిని సేవించటానికి నేను సదా సిద్ధంగావున్నాను. మధురమైన అమృతాన్ని విడిచి విష సేవనానికి ఎవరు ఇష్టపడతారు? మంచి బియ్యాన్ని వదిలి ఇసుకనెవరు వండుతారు? మంచి అరటిపండ్లను కాదని జిల్లేడుపండ్ల నెవరు భుజిస్తారు? నాకు జన్మించబోయే పుత్రుడు తన జ్యేష్ఠుని సేవించగలడు. పెద్దల సేవముందు చతుర్విధ ముక్తులు, త్రిభువనాలు తృణప్రాయాలు. కల్పవృక్షంపై విహరించే పక్షి తుమ్మచెట్టు మీద వాలాలని కోరుకొంటుందా? మానస సరోవరంలో సంచరించే హంస గుడ్లగూబ గూటికి పోదుకదా? క్షీరాబ్ధిలో మునిగి వుండేవాడు మండే అడవికి వలసపోతాడా? నందనవనంలో తిరుగాడే తేనెటీగ జిల్లేడు పువ్వుపై వాలుతుందా? ఇంద్రభవనంలో శయనించేవాడు, నిప్పంటుకొన్న పొలంలో పరుంటాడా? రంభలాంటి భార్యను వద్దని శవాన్ని ఎవరు కౌగలించుకుంటారు? భక్తి భజనల పట్ల ఆసక్తి ఉండేవారు విషయాసక్తులెలా కాగలరు?' అని సుమిత్ర



సమాధానం చెప్పింది. పెద్దలపట్ల ఆరాధనను, సేవాభావాన్ని తీయని పలుకులతో సుమిత్ర వ్యక్తంచేసిన తీరు మహారాజు మక్కువను అధికం చేసింది. ముల్లోకాలు జయించినంత ఆనందంతో అమృతం తాగినంత సంతోషంతో, సుమిత్రను ఆలింగనం చేసుకున్నాడు. అనేక ఆభరణాలతో ఆమెకు దిష్టి తీసి యాచకులకు సుమిత్ర ద్వారా దానం ఇప్పించి, 'చంపక పుష్పంలా ఉండే ఓ సుకుమారీ! నీ అభిమతం తప్పక నెరవేరుతుంది!' అని అన్నాడు.

## కౌసల్యాదేవి మనఃస్థితి

తరువాత పట్టపురాణి, జ్ఞాననిధి, పురాణ పురుషుని కన్నతల్లి, మూర్తీభవించిన ఆధ్యాత్మిక శక్తి, స్వయం ప్రకాశరత్నఖని, బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, ఇంద్రుడు ఎవరి ఆజ్ఞానువర్తులై వుంటారో ఆ పరమాత్ముని గర్భాన ధరించి, ముల్లోకాల్లో కీర్తిమంతురాలైన కౌసల్యాదేవి మందిరానికి సకల రాజవైభవాలతో దశరథుడు బయలుదేరాడు. జ్ఞానకళామూర్తి, సకల చరాచర సృష్టికి మూలకారణం, సకల జీవరూపమైన పరమాత్ముని గర్భాన ధరించడంవల్ల బాహ్యాభ్యాంతరాలలో ఆ కౌసల్య హృదయం బ్రహ్మానందభరితమయింది. సేవకులు ద్వారం వద్ద మర్యాదలు చేసి దశరథుని లోనకు ఆహ్వానించారు. చావడిలోనూ, అభ్యంతర మందిరంలోనూ కౌసల్య కనిపించలేదు. ఆశ్చర్యంతో ఎంత వెదికినా మందిరంలో ఆమె జాడే తెలియలేదు!

చివరగా, మందిరం వెనక చెట్టు క్రింద కూర్చుని నిర్వికల్ప సమాధిస్థితిలో అంతర్ముఖియై అద్వైత బ్రహ్మ తదాకార వృత్తిలో, దేహభావాన్ని విసర్జించి బ్రహ్మానందంలో తేలియాడుతున్న కౌసల్యను కనుగొన్నాడు. నిష్కళంక స్వస్వరూప ధ్యానంలో లీనమైన కౌసల్య సూర్యతేజంతో ప్రకాశిస్తూ, మహా యోగిని వలె భాసిస్తున్నది. ఆ స్థితిలో ఇంద్రియ జ్ఞానం యింకిపోతుంది.

కల్పాంతంలో కలిగే మెరుపులను ఒక దోమ మింగడం, చీమ మేరుపర్వతాన్ని తోసేయడం, ఆవు సింహాన్ని కబళించడం, శ్రోత్రియుల యజ్ఞశాలలో పంచముడు ప్రవేశించడం – ఇవన్నీ సంభవాలు కావచ్చు. కానీ, ఆ స్థితిలో అనుభవమయ్యే ఆ విశ్వరూపుని వర్ణన దృష్టాంతాలతో నిర్ధారించలేం. బడబాగ్నికి కర్పూరం వెలిగించినట్లు, సముద్రానికి ఉప్పు సమర్పించినట్లు, మనో బుద్ధులను ఐక్యం చేసి కౌసల్య స్వసుఖానందంలో నిమగ్నమై వుంది.

ఆమెను ఆ స్థితిలో చూసిన దశరథుడు నిశ్చేష్టుడయ్యాడు. మనస్సులో ఏదో కినుక వహించి తనతో మాట్లాడకుండా ఉందనుకొని, ఖిన్నుడయ్యాడు. ఆమె దగ్గర కూర్చొని స్నేహభావంతో ఊరడించసాగాడు. అయినా ఆమె కళ్ళు తెరువలేదు. దేహస్పృహ లేదు. సువర్ణాలంకార రహితయై, జీవన్మిథ్యాభావంతో, విశ్వమంతా ఆనందఘనుడయిన ఆ పరమాత్మ వ్యాపించి ఉన్నాడన్న అనుసంధానంలో ఆమె మునిగివుంది. ఆ స్థితిలో పాంచభౌతికమైన దేహాన్ని మరచి ప్రాపంచిక బంధాల్ని తెంచుకొంది. స్త్రీ, పురుష భేదం విస్మరించి కౌసల్య అలా అచేతనంగా ఉండిపోయింది.

ఆదిపురుషుడైన శ్రీమహావిష్ణువు శ్రీరామచంద్రుడిగా అవతరిస్తాడన్న విషయం దేవ ఋషులు, సిద్ధులు పూర్వమే తెలియజేశారన్న విషయం అప్పుడు మహారాజుకు జ్ఞాపకం వచ్చింది. శ్రీరామ నామస్మరణతో కౌసల్య కన్నులు తెరిచింది. ఆమెకు ప్రపంచమంతా సర్వవ్యాపకమైన రామస్వరూపం కనిపించింది. ఆ సమయంలో దశరథుడు కౌసల్యతో 'హరిణాక్షీ! మందగమనా! సందేహపడకుండా నీ మనోరథాన్ని తెలియజెయ్యి తీరుస్తాను' అని అన్నాడు. 'మాయాతీతుడయిన ఆ జగద్రక్షకుడే నా గర్భంలో ప్రవేశించడం మూలంగా నా అజ్ఞానం నశించింది. తరచి చూస్తే స్థూలంగా కనపడే రూపాలకన్నింటికీ ఆధారమయిన ఆ జగదేకమూర్తిని, ఆ ఆత్మారాముని కాంచగలుగుతున్నాను. నా స్థితి వేరు. ద్వైతాద్వైతాలకు భిన్నమై, వర్ణనాతీతుడయిన ఆ



సచ్చిదానందమూర్తిని నేనే! జీవుడు, శివుడు, ధ్యాని, ధ్యానం, లయ లక్ష్యాలకు సాక్షీభూతుడు, అచింత్యుడు, అగోచరుడు ఐన ఆ శ్రీరామునికి నేను తల్లిని కాబోతున్నాను' అని కౌసల్య సమాధానమిచ్చింది.

దానికి దశరథుడు, 'ఓ శశాంకవదనా! గుణసరితా! పద్మనయనా! అసలు నేనెవరో గుర్తించావా? సీమంత సమయంలో కలిగే కోరికలను తీర్చడానికి వచ్చిన నీ పతిని' అని అనునయంగా అన్నాడు దశరథుడు. 'జ్ఞాత, జ్ఞేయి, జ్ఞానం ఒకటయిన వారికి స్త్రీ పురుష భేదం ఉండదు. అటువంటప్పుడు నీవూ, నేను అనే భేదం మాత్రం ఎక్కడిది' అని అంది కౌసల్య.

ఈ పలుకులకు మహారాజు ఒకింత విచారపడి, ఈమెను ఏదో మహాభూతం ఆవరించింది. గతంలో జరిగిన సంఘటనలను కూడా మరిచిపోయింది. ఈమెను బుజ్జగించి మునుపు జరిగిన విషయాలను గుర్తుకుతెస్తాను – అని అనుకొని, ' మన వివాహ సందర్భంలో రావణుడు మనలనెత్తుకు పోయిన సంగతి జ్ఞాపకముందా?' అని ప్రశ్నించాడు. అందుకు కౌసల్య శత్రు నామోచ్చారణ వినగానే, బిగ్గరగా కేకవేసి భుజాలు చరిచి 'ధనుర్బాణాలను తెండి! వెంటనే రావణుడి పదితలలను ఖండిస్తాను. తాటకని సంహరించి ఋషుల యాగాలను సంరక్షిస్తాను. మహారాక్షసులను యుద్ధంలో సంహరించి విశ్వామిత్రుని సంతోషింపజేస్తాను. ప్రచండమయిన శివధనుస్సును రెండుగా విరిచి అఖండమయిన జ్ఞానశక్తితో స్వయంవరంలో సీతను గెలుచుకుంటాను. క్షత్రియ విజేత పరశురాముని గర్వాన్ని తుదముట్టించి ఏకపత్నీవ్రతుడుగా పితృవాక్యపరిపాలన చేస్తాను. ఘోరారణ్యంలో సంచరిస్తూ త్రిశిర ఖర దూషణాదులను – తృణాలను అగ్ని దహించినట్లుగా – నశింపజేస్తాను. భల్లూక, వానరాలతో కలిసి లంకను తలక్రిందులు చేస్తాను. అప్పుడు వజ్రదేహి మహావీరుడు పురుషార్థియైన మారుతి క్షణంలో లంకను కాల్చి రాక్షసులను సంహరిస్తాడు. సముద్రానికి సేతువు నిర్మించి లంక పైకి

దండెత్తుతాను. అతికాయుడయిన కుంభకర్ణుని అరక్షణంలో వధిస్తాను. సపరివారంగా దశకంఠుని తుదముట్టించి నా భక్తుడయిన విభీషణుడికి రాజ్యపట్టాభిషేకం చేస్తాను. అయోధ్యకు వచ్చి నా ప్రజలకు మృత్యుభయం, రోగభయం లేకుండా చేస్తాను. మాయాచక్ర సంచాలకుడనై, లింగభేదం లేక, నిష్కళంకంగా, అభేదంగా, బ్రహ్మానందంలో లోకాన్ని ఉంచుతాను. ప్రళయకాల శాసనకర్త, ఆదిమాయకు మూలమై, సర్వానికీ కర్త, భర్త, అయినవాడు నాకంటే భిన్నంకాదు. సర్వం నాలోనే ఐక్యం పొందుతాయి. చరాచరాలన్నింటిలో నేనే వున్నాను. నేనే సర్వేశ్వరుడిని, అద్వితీయుడను అని అంది. నిరంతర రామనామస్మరణంవల్ల కలిగిన తన్మయత్వంలో కౌసల్య రామునితో తాదాత్మ్యం పొంది అలా మాట్లాడింది.

ఆ మాటలు విని దశరథుడు ఈమెకు నిజంగా దయ్యం పట్టింది. పిచ్చి బాగా ముదిరిపోయింది. ఏదేదో వాగుతున్నది అనుకొని, ఎల్లప్పుడూ పంచాక్షరి జపిస్తూ వుండేవాడు, సద్గురువు, జ్ఞానఖని అయిన వసిష్ఠమహర్షిని తోడ్కొని రావలసిందని సేవకులకు ఆనతిచ్చాడు. దర్భపై భూమిని నిలబెట్టగలిగినవాడు, కమండలం మీద సూర్యుని కూర్చోబెట్టి ఇంద్రసభకు తీసుకొనిపోగలిగిన అద్భుత శక్తిసామర్థ్యాలు కలిగినవాడు, అయిన వసిష్ఠుడు వెంటనే వచ్చాడు. 'గురుదేవా! చక్కగా, ఆరోగ్యంగా వున్న కౌసల్యకు హఠాత్తుగా ఏదో మహా భూతం పట్టింది! మంచి పుత్రుడు కలగాలని యజ్ఞయాగాలు చేశాను. ఇంతలో కష్టం ప్రాప్తించింది. ఇప్పుడు నేనేం చేయాలో కర్తవ్యం నిర్దేశించండ'ని వసిష్ఠుని అడిగాడు దశరథుడు.

'క్షీరసాగరానికి ఆకలి పుడుతుందా? కల్పవృక్షానికి దారిద్ర్యం కలుగుతుందా? కనకాద్రి రాగినాణేలు కోరుతుందా? బ్రాహ్మణ మందిరంలో పంచముడు ప్రవేశిస్తాడా? శీతలకరుడకి తాపం కలుగుతుందా? చీకటి బావిలో సూర్యుడుంటాడా? అమృతం చేదుగా ఉంటుందా? అగ్నిహోత్రునికి అంధత్వం



కలుగుతుందా? చింతామణి తిరిపమెత్తాల్సి వస్తుందా? త్రికాలాల్లో ఇటువంటివి అసంభవాలు' అని అంటూ వసిష్ఠుడు కౌసల్యను పరికించి చూసి, ఈమె గర్భాన రఘునాథుడు జన్మిస్తాడు. ఈమె శ్రీరామునితో తాదాత్మ్యం చెందింది. స్త్రీమూర్తిగా నాకు గోచరించడంలేదు. ధనుర్బాణాలు ధరించిన జగద్వంద్యుడయిన ఆ శ్రీరామచంద్రుడే ఈమెలో సాక్షాత్కరిస్తున్నాడని భావించి బ్రహ్మానందంతో, అష్టభావాలు హృదయంలో హత్తుకొని పోగా తన దేహభావాన్ని విస్మరించాడు. కౌసల్య, వసిష్ఠమహర్షి ఇద్దరూ పరిపక్వమయిన బ్రహ్మానందంతో అచేతనులయ్యారు. దశరథుడు ఈ పరిస్థితి చూచి భయపడ్డాడు. ముల్లోకాల్లో ఎవరికీ ఈ భూతాన్ని తొలగించే శక్తి లేదు. నేను నిర్భాగ్యుడిని. నాకు పుత్ర సంతానం ఎలా కలుగుతుంది? కౌసల్య మూర్ఛితురాలయింది. నిరపరాధి బ్రాహ్మణ కుమారుడయిన శ్రావణుని వధించిన పాపం ఊరికేపోతుందా? అందుకే నాకీ దారుణ దుఃఖం కలిగి వుంటుంది అని మహారాజు లోలోపలే కుమిలిపోయాడు.

ఇంతలో వసిష్ఠుడు బ్రహ్మానందం నుంచి తేరుకొని కళ్ళు తెరిచాడు. ఇది గమనించిన దశరథుడు తన కులగురువు పాదాలకు నమస్కరించాడు. సర్పహతుని వద్దకు గరుత్మంతుడు వచ్చినట్లు, ఏనుగువల్ల పీడపొందుతున్న వాడి దగ్గరకు సింహం వచ్చినట్లు, క్షుధార్తుడి చెంతకు పాలసముద్రం వచ్చినట్లు, అంధకారకూపంలో ప్రవేశించేవాడికి సూర్యుడు చేయూతనిచ్చి రక్షించినట్లు, దావాగ్నిని ఆర్పడానికి అకస్మాత్తుగా వర్షంపడ్డట్లు, పేదవాడి ఇంటికి లక్ష్మి విచ్చేసినట్లు, ఆ క్షణంలో వసిష్ఠుని చూసిన దశరథుడు ఆనంద మనస్కుడయ్యాడు. 'స్వామీ! నువ్వు సమర్థుడివి. ఇదంతా నాకు కొత్తగా ఉంది. నీకు కూడా ఆ భూతం ఆవరించిందా ఏమి? నేను నిర్భాగ్యుడిని! నాకు సంతానప్రాప్తిలేదు' అని విచారం వ్యక్తం చేశాడు.

'ఈశ్వరుని హృదయంలో నివసించే అమూల్యరత్నం, బ్రహ్మ సనకసనందనాదులు నిత్యం హృదయపీఠంలో ప్రతిష్ఠించి, స్మరించే వైకుంఠవాసి కౌసల్య గర్భాన ప్రవేశించాడు. దుష్టులయిన దైత్యుల్ని తునిమి, దేవతలను బంధ విముక్తుల్ని చేస్తాడు. కౌసల్య ధ్యానపారవశ్యంతో పలికిన పలుకులన్నీ యథార్థాలు. నీకు నలుగురు పుత్రులు కలుగుతారు. ఇది సత్యం. ఓ రాజేంద్రా! ఆ శ్రీమన్నారాయణుడు శంఖము, చక్రము, ఆదిశేషువులతో సహా నీకు కుమారుడుగా జన్మిస్తాడు. ఆ పూర్ణబ్రహ్మ, జగద్గురువు మిట్టమధ్యాహ్నం పుష్యమీ నక్షత్రంలో శ్రీరామచంద్రుడిగా అవతరిస్తాడ'ని వసిష్ఠుడు వివరించాడు. ఆత్మానందాకాశంలో మెరిసే తారల్లా సత్యాల ఖనిలోని రత్నాల్లా దశరథుడి మోము అమితానందంతో వెలిగిపోయింది. వసిష్ఠుడి పాద కమలాలకు వినయంతో మోకరిల్లాడు. వసిష్ఠుడు అప్పుడు దశరథునితో ఇలా అన్నాడు

'మహారాజా! కౌసల్యాదేవికి నవమాసాలు నిండిన తరువాత వసంతఋతువులో చైత్రమాసం శుక్లపక్షం నవమి భానువారంనాడు మిట్టమధ్యాహ్నం పుష్యమీ నక్షత్రంలో సూర్యవంశజుడుగా ఆ జగన్నాథుడు, పూర్ణబ్రహ్మ, జగద్గురువైన రఘురాముడు అవతరిస్తాడు. ఈ వార్త విని సజ్జనులు, మునులు, తత్త్వజ్ఞానులూ ఆనందిస్తారు. ఎవరిలీలలు విని, దాటశక్యంగాని జనన మరణ చక్రాన్నుంచి విముక్తి పొందుతారో, అటువంటి దివ్యమూర్తి ఈ పృథ్విలో అవతరించడం ఒక విశేషం. జన్మ కర్మలులేని క్షీరసాగర శయనుడైన శ్రీమన్నారాయణుడు, లోకంలో అందరిలాగే కౌసల్యా మాతకు పుత్రుడిగా అవతరిస్తాడు. భక్తులను తరింపజేయడానికి నిష్కళంకుడు, కళ్యాణదాయకుడు అయిన ఆ పరమాత్మ శ్రీరాముడిగా తరలివస్తాడు. రాక్షసులను వధించి లోకులను దుఃఖవిముక్తుల్ని చేయడానికి అవతరించిన శ్రీరాముడిని చూచి దేవతలు జయజయ ధ్వానాలు చేస్తారు. అయోధ్యానగరాన దేవతలు విమానాల్లోనుండి విజయదుందుభులు మోగిస్తూ పుష్పవృష్టి కురిపిస్తారు.



కౌసల్య ఏకాంతంలో కూర్చొని ఉండగా అష్టాదశ వర్షప్రాయుడైన శ్రీరామచంద్రమూర్తిని గమనిస్తుంది. ఆయన వర్చస్సుతో ఆ మందిరం వెలిగిపోతుంది. ఆ కాంతికి సూర్యచంద్రులే సాటిరారు! ఏ పరిస్థితుల్లోను లోభి ధనాన్ని వదలిపెట్టనట్లుగా, సదా మకరందాస్వాదనం చేసే భ్రమరం మధువును వదలి పోనట్లుగా లక్ష్మి శ్రీహరి చరణ కమలాల్ని ఎప్పుడూ వదలి ఉండదు. ప్రాతఃకాలంలో ప్రకాశించే సూర్యుడిలా, దివ్యరత్న భూషితుడై, పద్మచిహ్నిత హస్తుడై, మెరిసే బాలుడు శ్రీరాముడే కృష్ణపక్షం తరువాత చంద్రుడు శుక్లపక్షంలో తన షోడశకళలతో ఆ మూర్తిలో లీనమయ్యాడు. శ్రీహరి చరణాలను సదా ఆశ్రయించిన లక్ష్మి చెంతకు చంద్రుడు వచ్చి శాశ్వతంగా నిలిచిపోయాడు. ధ్వజ, వజ్రాంకుశ, పద్మ, ఊర్ధ్వరేఖ, చక్రాది చిహ్నాలు ఉత్తమమయినవి. వీటిని అర్థం చేసుకున్న కొద్దీ భక్తులు సుఖపరవశులవుతారు. సత్వగుణం ప్రేమభావం కలవారికి ఈ ఊర్ధ్వరేఖలుంటాయి. సత్వశీలురికి, ధార్మికులకు, భావికులకు పై దశలు కలుగుతుంటాయి. ధనమదంతో, విద్యామదంతో తిరిగేవారికి ఇవి అసాధ్యం. మదపుటేనుగులను అంకుశంతో అణిచినట్టు వజ్రాలవంటి శ్రీరామచరణాలను ఆశ్రయిస్తే శరణాగతుల బాధలు తొలగి, అహంకార పర్వతాలు నిర్మూలింపబడి, దివ్యధామం సులభంగా లభ్యమవుతుంది. అగాధమయిన భవసాగరాన్నుంచి తరింపజేయడానికి ఓడల్లా రామచరణాలుపయోగిస్తాయి. ఆయన మహిమలవర్ణనీయం. కామక్రోధలోభమోహాదులనే దైత్య సమూహాన్ని నిర్జించడానికి అతని అరచేత చక్రం విరాజిల్లుతుంది. స్వచ్ఛమయిన మృదుపాదాలు త్రికోణాకారంలో ఇంద్రనీలాల్లా మెరుస్తున్నాయి. ఆ పాదాల కెంజాయఛాయలో ఒక పాదంలో సరస్వతి అలంకృత అయింది. మరో పాదానికి అందెగా సర్వజనపాపహారిణి గంగ అమరింది. సమీపంలోనే చామనఛాయతో సుకుమారమైన ఊరువులతో తనకు వచ్చిన అపవాదు తొలగించుకోవడానికి యముని సోదరియైన యమున

ఆశ్రయం పొందింది. మాఘమాసంలో భాగ్యవశాన మానవులు ప్రాత:కాలం స్నానానికి భక్తితో త్రివేణి సంగమమయిన ప్రయాగకు వెడుతుంటారు. రాజహంసల్లా విహరించే ఆ భక్తులు, ముముక్షువులు, సాధకులు, సజ్జనులు శ్రీరాముని చరణసన్నిధిని ఆశ్రయించిన వారవుతున్నారు. ఆ సంగమంలో సనకసనందనాదులూ విగత దేహులయ్యారు. భక్తులు ప్రయాగలో దేహత్యాగం చేస్తే మోక్షం సిద్ధిస్తుంది. నామశ్రవణం చేస్తే దేహంతోనే కైవల్యం కరతలామలక మవుతుంది. ప్రయాగ ప్రయాణమే కష్టసాధ్యం. ఆ యాత్ర చెయ్యాలన్న తలంపు కలగడమే అపురూపం. ఆ భావన కలిగినవారే సద్భక్తులు.

శ్రీరాముని కాలిగజ్జెల, మువ్వలు ఏకకాలంలో చేసే ఘర్ఘర ధ్వనులు తాండవనృత్యం చేసినట్లుగా ఆకాశంలో మార్మోగుతుంటాయి. చక్కటి అరటి స్తంభాల్లాంటి జానువులు, మోకాళ్ళు, గరుడపచ్చల్లా, ఇంద్రనీలమణుల్లా వెలిగిపోతున్నాయి. వెయ్యి మెరుపుల కాంతితో మెరిసే పీతాంబరం శ్రీరాముని కటిని ఆవరించి ఉంది. ఆ దృశ్యం ఆహ్లాదకరం. మొలతాడులోని మణులు ఒక్కొక్కటి ఒక్కొక్క సూర్యుడిలా మెరుస్తున్నాయి. కటిమేఖలలోని చిరుగంటల సవ్వడి జటిలార్థాన్ని సైతం స్ఫురింపజేసే వేదస్వరంలా, రసవత్తరంగా రవళిస్తున్నది. సుకుమారమయిన ఆయన కటిని చూచి మృగరాజు సిగ్గుపడి దుర్గకు వాహనంగా మారాడు. బ్రహ్మ పుట్టిన ఆయన నాభి ప్రాంతము కడు గంభీరము. రజస్తమోసత్వగుణాల్లా మూడు రేఖలు ఆయన ఉదరంపై విరాజిల్లుతుంటాయి. ఆయన కౌస్తుభ కిరీటం యొక్క తేజం అమోఘం. ఆ తేజస్సుకు సూర్యచంద్రులు సాటిరారు.

ఆ రఘుపతి వక్షఃస్థలంలో వ్రేలాడే ముత్యాల హారాలు అనంత బ్రహ్మాండంలోని నక్షత్రాల అమరికలా ఉంటాయి. ఆ ముత్యాల కాంతి కిరణాలు రఘునాథుని దేహంమీద ప్రతిబింబించి ఇంద్ర నీలాలుగా మారుతుంటాయి. నీలాకాశ నిర్మల మందాకినీ ప్రవాహ వికసిత పుష్పాలతో కూర్చిన మాల



రఘుపతిగళసీమను అలంకరించి ఉంటుంది. ఆకాశంలో వెలిగే ఇంద్రధనుస్సులో, మేఘాలు స్థిరంగా ఉన్నప్పుడు అకస్మాత్తుగా మెరిసే మెరుపులా వైజయంతీమాల శోభిల్లుతున్నది.

ఆ దివ్యమంగళమూర్తి వైభవ వర్ణన ఆదిశేషువుకు గూడా సాధ్యంకాదు! అనంతభక్తకోటికి స్థానమైన ఆయన వక్షఃస్థలం అతి విశాలం. సంపూర్ణ బ్రహ్మానంద నిలయం. ఆ శ్యామలవర్ణుని కుడిభాగాన శ్రీవత్సం, ఎడమభాగాన శ్రీనికేతనం అలరారుతున్నాయి. గంగా, యమునల జలంలా, పున్నమినాటి చంద్రుడి కాంతిలా, దేదీప్యమానమయిన ఇంద్రనీల ఛాయగల శ్రీరాముని శరీరంపై చర్చితమైన చందనంతో ఆ ఆవరణమంతా సుగంధ పరిమళాలతో గుబాళిస్తున్నది. శ్యామల వర్ణాన్ని చూచి హాలాహలమని భ్రమించి పరుగెత్తిన కర్పూరగౌరుడైన శంకరుడు శ్రీరాముని చేరి చందనలేపనంగా భాసించాడు. నాలుగు హస్తాలలో శంఖ, చక్ర, ధనుర్బాణాలు అమరివుండగా, నిష్కళంకంగా మెరిసే మంచి ముత్యాలు, ఇంద్రనీలాలతో అలంకృతమైన శ్రీరాముని చందన చర్చిత దేహం పున్నమినాటి చంద్రుడిలా శోభిల్లుతున్నది. ఆయన హస్తరేఖలు ఉపాసనాయంత్రాల్లా, ఆకాశాన మెరిసే మెరుపుతీగల్లా ఉన్నాయి. కంట్లో ప్రళయాగ్నులు వెలుగుతుండగా నిష్కళంకుడైన రోహిణీరమణుడు హృదయపీఠంపై విలసిల్లాడు. కోటి మన్మథులకు హారతులిచ్చినట్లుగా వుండే, ఆ ముఖవర్చస్సు, శంఖం వంటి మెడ, సుకుమారమయిన నాసిక, పగడాలవంటి పెదవులు, ఒక వరుసలో ధవళకాంతు లీనుతున్న దంతాలు – ఆ రూపం ముందు ఎవరూ సాటిరారు. ముల్లోకాల్లో వుండే ఆనందం ఆ మూర్తి ముఖకమలంలో మూర్తీభవించి వుంటుంది. చెవుల వరకూ విస్తరించిన కనుదోయి, అందులో కృపాదృష్టి, ప్రేమను విరజిమ్మే భావన, విశాలమయిన ధనురాకృతి కలిగిన భ్రుకుటి, సూర్యచంద్రుల్లా మెరుస్తున్న మకర కుండలాలతో ఆయన శోభిల్లుతున్నాడు. శుక్రబృహస్పతులిరువురూ శ్రీరాముని కుశలం

విచారిస్తారు. శ్రుతి సాగరాన జన్మించిన రత్నజ్యోతుల్లా పూర్వ, ఉత్తర మీమాంసల్లా ఆయన కుండలాలు విశేషార్థాలను తెలియజేస్తుంటాయి. శ్రీరాముని దేహం సుకుమారం. ముఖం చందనపు తిలకంతో, నిరుపమానమయిన తేజస్సుతో, ఊర్ధ్వరేఖలతో విరాజిల్లుతున్నది. నీలగిరి ప్రక్కనగల బంగారు నదికి వరదలవచ్చినప్పుడు కన్పించే ఇంపయిన దృశ్యంలా, నీలమేఘశ్యాముని నొసట ఆ చందన తిలకం అతి మనోహరంగా ఉన్నది. శ్రీరాముని కిరీట కాంతులు కల్పాంతంలోని సూర్య ప్రకాశంలా ఉన్నాయి. సామాన్య సూర్యచక్రంలో అది ఇమడదు. ఎందుకంటే శ్రీరాముని కంటికాంతికి అస్తమయంలేదు. దావాగ్ని జ్వాలాకాంతులు విరజిమ్మే ఉత్తరీయం అంచులలో ముత్యాలకాంతులతో కృత్తికాపుంజంలా మెరిసిపోతున్నది. స్వచ్ఛంగా, తెల్లగా, స్వచ్ఛమైన కర్పూరంలా మెరిసే వస్త్రాల్ని ధరించి, ఆ కర్పూర గౌరునివలె, పాదరసంలా చంచలంగా వుండే వెండికొండలా శోభిల్లుతున్నాడు. సూర్యవంశ తిలకుడు అయిన శ్రీరాముడు గంగా జలాన్ని కైలాసనాథుడికి అర్పించాడు. శ్రీరాముని ఛాయ సూర్యకాంతమణి, కలువల మిశ్రమచ్ఛాయగా, ఆకాశచ్ఛాయతో కలసి, మేఘాలపైన విస్తరించి ఇంద్రనీలాలను తలదన్నుతున్నది.అద్భుత సౌందర్యంలో, గరుడపచ్చ రత్నాలను మించిన ప్రకాశం గల ఆ రఘురాముని కౌసల్యాదశరథులు సందర్శించారు.

వైకుంఠప్రియుడు, భక్తజనమందిరాంగణ మందారము, బ్రహ్మాండాలను బద్దలు చేసి దృశ్యాలను అవలీలగా సృష్టించేవాడు, కోటిసూర్యప్రభలతో వెలుగొందే లీలామానుష విగ్రహుడు, లక్ష్మీ హృదయ నివాసి, ప్రేమానురాగ హృదయ పూర్ణబ్రహ్మానందుడయిన రఘునాథుని యువకుడిగా కౌసల్య దర్శించింది. 'భక్తవత్సలా! మధుకైటభారీ! కౌసల్యా పుత్రుడవను కీర్తి తెచ్చుకొనేలా, సదా చిరునవ్వులతో, రాజీవ లోచనాలతో సమ్మోహనంగా నడయాడే బాలుడిలా నా గర్భాన అవతరించు' అని ప్రార్థించింది.



## శ్రీరామ జననం

నీటితో నిండిన మేఘాన్ని పోలిన దేహచ్ఛాయతో క్షీరసాగర నివాసియైన విష్ణుమూర్తి పుష్య నక్షత్రాన కౌసల్యకు శిశువుగా జన్మించాడు. భక్తులందరూ మృదు మధురంగా కీర్తిస్తూ ఆ బాలునికి చరణాంకితులయ్యారు. వీరికి వేడుక కలిగించేందుకాన్నట్లుగా రఘురాముడు తన కాలిబొటన వ్రేలును నోటితో చప్పరించసాగాడు. కౌసల్యకు రాముడు జన్మించిన సమయంలో ఆనంద సూచకంగా జయ దుందుభులు మ్రోగాయి. దేవతాసమూహంతో సహా దేవేంద్రుడు జయజయధ్వానాలు చేశాడు. అయోధ్యా నగరం మీద పుష్పవృష్టి కురిపించారు. దుందుభుల మోతలు ఆకాశాన్ని దాటిపోయాయి. అప్పటి మంగళ వాద్యాలహోరును వర్ణించడానికి ఆదిశేషువుకూ అలవికాదనే చెప్పాలి. ముత్తైదువులు అతివేగంగా పసుపు కుంకుమలను వీధి వీధిన పంచుతూ కౌసల్య అంతఃపురం చేరారు.

మహాపర్వ కాలంలో ప్రయాగకు భక్తులు చేరినట్లు, మూర్ఖులు ఇనుమును తీసుకొని పరుసవేది కోసం వూరి బయటకు పరిగెత్తినట్లు, వేసవిలో గంగా జలాన్ని త్రాగటానికి ఆలమంద పరుగుతీసినట్లు, పళ్ళతో నిండిన వృక్షంపై పక్షులు దాడిచేసినట్లు, క్షీరసాగరాన్ని చూచి ఆకలితో అలమటించే వారు పరుగెత్తి వచ్చినట్లుగా, నాల్గు దిక్కుల్నుంచి బ్రాహ్మణులందరూ శ్రీరామ జననవార్త విని త్వరితంగా కౌసల్యాదేవి అంత:పురానికి విచ్చేశారు. ఆ సమయంలోనే పుత్రుణ్ణి చూడటానికి అంత:పురంలో ప్రవేశించిన దశరథుడు మీకేం కావాలో కోరుకోండి. తత్క్షణమే తీరుస్తాను. కోశాగారం తెరిచే వుంది. మీకు కావలసినంత ధనం తీసుకొని పొండి అని ఆ యాచకుల నుద్దేశించి పలికాడు.

స్నానం చేసిన తర్వాత, పుణ్యాహవచనంచేసి కుమారుని దర్శించి, సంతోషాంతరంగుడై రాముడినోట ఒక తేనెబొట్టు వేశాడు దశరథుడు. బాలుని

జాతక చక్రం రాయించి, యాచకులకు భూరిగా భూదానం, గోదానం చేసి రత్నాలను పంచాడు. రత్నఖచిత సింహాసనం మీద కౌసల్య రాముని ఒడిలో పెట్టుకొని వుండగా, ఆమెకు రెండు వైపులా పున్నమి వెన్నెల ఛాయవంటి తెల్లటి చామరాలు పట్టుకొన్న దాసీజనం, ప్రక్కగా ఉమ్మి పాత్రతో మరో చెలికత్తె నిలబడివుంది. కనకాంబరం రంగు చీర ధరించి కౌసల్య కడు సొగసుగా వుంది. ఆమె చుట్టూ మహా మాయ జగత్తును ఆవరించి ఉన్నట్టుగా, సూర్యునిచుట్టూ కిరణాల్లాగ, విద్యుల్లతల్లా మెరిసే జిలుగు వస్త్రాలు ధరించిన 700 మంది రాణులు ఆసీనులై ఉన్నారు. వీరుకాక భూత, భవిష్యద్వర్తమానాలు తెలిసిన పండితోత్తములు వారి సమక్షంలో ఉన్నారు. ఆ సమయంలో కులగురువు వసిష్ఠుడు ముందుకు వచ్చి రాముని రూపాన్ని తిలకించి, 'జన్మ కర్మలను నివారించే క్షీరసాగర నివాసియైన ఆ పరమాత్ముడే కౌసల్యా గర్భాన జన్మించాడు. జనులను ఉద్ధరించడానికి అవతరించిన అవతారపురుషుడు. ఈయనకు పన్నేండేళ్ళ ప్రాయంలో అకస్మాత్తుగా ఒక బ్రాహ్మణుడు వచ్చి, మహారాజువైన నిన్ను ప్రార్థించి శ్రీరాముని వెంటబెట్టుకొని పోతాడు. మొట్టమొదట బాణంతో రాక్షసుని వధించి గోబ్రాహ్మణులను, యజ్ఞయాగాదులను సంరక్షిస్తాడు. నీ పుత్రుడు చేయబోయే మహత్కార్యాలను విపులంగా విను! ఓ మహారాజా!' అని వసిష్ఠుడు భవిష్యార్థాలను వినిపించాడు.

'ఎండిన వనాన్ని మండించే దావానలంలా రాక్షసులను రాముడు దగ్ధం చేస్తాడు. పాదస్పర్శతో రాతిని నాతిగా మారుస్తాడు. భుజబలంతో ప్రచండమయిన కోదండాన్ని విరచి వధూ రత్నాన్ని చేపట్టి ఏకపత్నీవ్రతుడయి ముల్లోకాల్లో తిరుగులేని వీరుడిగా ఖ్యాతి పొందుతాడు. మహాయోధుడయిన బ్రాహ్మణాగ్రేసరుని క్షణంలో నిర్జించి స్వజన సమేతంగా అయోధ్యకు మరలి వస్తాడు. శ్రీరామ పట్టాభిషేక సమయాన సంభవించే ఇక్కట్టుతో అయోధ్యావాసులు దుఃఖమగ్నులవుతారు. పితృవాక్య పరిపాలన కోసం



శ్రీరాముడు భార్యా సమేతంగా పధ్నాలుగేళ్ళు అరణ్యవాసం చేస్తాడు. ఆ కాలంలో ఆయన లేని సమయం చూచి ఒక రాక్షసుడు, భార్య నపహరిస్తాడు. భార్యా వియోగకాలం ఆరు నెలలు భరించాల్సి వుంటుంది. అరణ్యంలో భార్యను వెదికేటప్పుడు వానరాలతో సంబంధం కలుగుతుంది. అందులో ఒక ఉన్మత్త వానరాన్ని, అతనికి తెలియకుండా చాటుగా నుండి వధిస్తాడు. గోటితోనే బ్రహ్మాండాన్ని ఎత్తగల బలమయిన మరో వానర శ్రేష్ఠుడు సముద్ర మధ్యంలో ఉండే లంకను చేరతాడు. అందరూ కలసి సులభంగా దాటడానికి సముద్రం మీద సేతువును నిర్మిస్తారు. అప్పుడొక రాక్షసుడు రాముని శరణువేడుతాడు. అతనికి జరగబోయే సమరంలో మృత్యుభయం లేకుండా చిరంజీవునిగా చేస్తాడు. రాక్షసులను అందరినీ వధించి, ఖైదీలుగా వున్న దేవతలను విడిపించి తిరిగి తన స్వస్థానానికివచ్చి, జయజయధ్వానాలతో అయోధ్య ప్రవేశిస్తాడు. పుత్రులతో వినోదపూర్వకంగా యుద్ధం చేస్తాడు. పదకొండువేల సంవత్సరాలు రాజ్యాన్ని పాలించి అవసాన కాలంలో వైకుంఠం చేరుకొంటాడు.' ఇవన్నీ విన్న దశరథుడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు. వాల్మీకి రచించిన కథను సంపూర్ణంగా వసిష్ఠుడు దశరథునికి వివరిస్తుండగా పాలు త్రాగుతూ రఘురాముడు వసిష్ఠుడి వంక చూడసాగాడు.

క్షీరసాగరంలో శయనించే ఆదిశేషువు బాలక రూపంలో సుమిత్ర ప్రక్కలోకి వచ్చాడు. సుమిత్ర స్వప్నావస్థలో ఆ విషయం గమనించి, అది మహారాజుకు తెలిపింది. దశరథుడు విప్రులతో వచ్చి చేయవలసిన విధులను నిర్వర్తించాడు. విష్ణువు శంఖ, చక్రాలు కైకేయికి పుత్రులుగా జన్మించారు. సుషుప్తిలో నిమగ్నమైన కైకేయికిది తెలియదు. దాది వచ్చి కైకేయికి పుత్రులప్రాప్తి సంగతి తెలిపింది. సూర్యచంద్రుల్లా వెలుగొందే పుత్రుల్ని చూసి ఆమె మిక్కిలి ఆనందించింది. విషయం తెలుసుకొని వచ్చిన మహారాజు పుత్రులను చూసి, సంతృప్తితో యాచకులకు వస్త్రాభరణాలను పంచి తృప్తిపరచాడు.

అయోధ్యలో ఉత్సవాలన్నీ పన్నెండు రోజులపాటు జరిగి పదమూడవ నాడు నామకరణ మహోత్సవంతో ముగిసాయి. కౌసల్య తనయుడికి శ్రీరాముడని, సుమిత్ర పుత్రుడికి లక్ష్మణుడని, కైకేయి సుతులకు భరతశత్రుఘ్నులని కులగురువు వసిష్ఠుడు నిర్ణయించాడు. సుడిగాలికి మేఘాలు మాయమయినట్లుగా దశరథుల జన్మకర్మ లీలలు విన్న వెంటనే సర్వపాపాలు హరించుకొనిపోతాయి.

శ్రోతలారా! సంతులైన మీరు రామకథా సరోవరంలో విహరించే రాజహంసలు సాహిత్యముత్యాలను ఏరుకొని నిరంతరం ఆదరంతో సేవించే మీరు చతురులు, సజ్జనులు. మా సేవ నిరంతరం స్వీకరించి రామకథా సుధారసాన్ని ఆస్వాదించండి. దేవతా సమానులైన మీరు రసవంతమయిన గ్రంథాన్ని నింపాదిగా అవధరించండి.

పురాణ పురుషుడు, బ్రహ్మానందుడు, శ్రీశీధర ప్రీతిపాత్రుడు అయోధ్యలో అవతరించాడు. అతని చరిత్రను ముందు ముందు విపులంగా తెలుసుకొందాము. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీ శీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. విజ్ఞులైన భక్తులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**నాలుగవ అధ్యాయం మధురం**

**అధ్యాయము - 5**

## శ్రీ గణేశాయ నమః
## శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః

**రా**మకథ నవవిధభక్తులనే తొమ్మిది గదులు గల దివ్యమయిన నావ. ఒకొక్క గదిలో ఆధ్యాత్మిక అనుతాపంగల భక్తులు ఆసీనులై వున్నారు. ప్రేమయనే తెరచాప రెపరెపలాడుతుండగా, ముముక్షువులయిన శ్రీరామదాసులను సంసార బంధాలనుంచి కడతేర్చి ముక్తియనే తీరానికి తీసుకొని పోతుంది. రామనామం మధురం. ఎవరి కథ వర్ణించడానికి (శబ్ద స్వరూపమైన) ఆకాశం కూడా చాలదో, ఎవరి లీల వినడంవల్ల మనస్సు తృప్తి చెందుతుందో, ఏ కథ విన్న తరువాత ఇంకో కథ విననవసరం లేదో– అదే రామకథ. రామకథారసం పుష్కలం. చంద్రుని కాంతికి చంద్రకాంత శిలలు కరిగిపోతాయి. అలాగే రామకథా శ్రవణంతో కఠిన కర్కశమైన మనస్సులు కరిగిపోతాయి. వినేవాళ్ళలో భక్తిశ్రద్ధలు లోపించినా, వినేవాళ్ళు మందబుద్ధులయినా, వాళ్ళకు ఈ రామకథను బృహస్పతియే స్వయంగా వివరించినా కూడా వ్యర్థమే అవుతుంది. మందబుద్ధులముందు రామకథా ప్రవచనం చెయ్యడం అరణ్యరోదనంలా వ్యర్థం. భోక్తలు రోగిష్ఠివారయితే కష్టపడి వండిన మృష్టాన్నాలు నిరర్థకమవుతాయి. ఆ ఇల్లాలి శ్రమ బురదలో పడిన వజ్రంలా నిష్ప్రయోజనం. షడ్రసోపేతమైన భోజనం గాడిదలకు ఇంపు చేకూరుస్తుందా? కవిత్వసాగర మథనం పండితులకే సాధ్యంకానీ మందబుద్ధులకు అవగాహనకాదు. పేడకుప్పపై అమృతం ఒలికించినట్లు, పుట్టుగుడ్డికి అద్దం పట్టినట్లు, శ్మశానంలో మెత్తని శయ్య వేసినట్లు, కాకికి అమృతఫలాలు రుచి చూపినట్లు, ఒంటెకు అరటిపండు వలిచిపెట్టినట్లు, మృతదేహాన్ని అందలమెక్కించినట్లు, గుడ్లగూబకు రత్నహారం వేసినట్లు, పందికి కస్తూరితిలకం దిద్దినట్లుగా మందబుద్ధులకు

మధురమైన రామకథను వివరిస్తే సరస్వతి దుఃఖిత అవుతుంది. ఆ ప్రయత్నం పద్మినీ జాతికన్యను నపుంసకుడికి ధారాదత్తం చేసినట్లు, చిల్లిచేదతో నీళ్లు తోడినట్లవుతుంది. మీరందరు భక్తులు, చతురులు కనుక అత్యంత ఉత్సాహంతో రామకథను వివరిస్తున్నాను! విన ప్రార్థన!

అసలే ముత్యం పైగా సువాసన కలది అన్నట్లు, అసలే వజ్రం పైగా అమూల్య కాంచనం తోడైంది అన్నట్లుగా శ్రోతలైన మీరందరూ చతురులు, ప్రేమరసజ్ఞులు. పైపెచ్చు శ్రీరామునికి ఇష్టులు. చతుర్థాధ్యాయం చివర మీకు రాముని జన్మకథను సవిస్తరంగా వివరించాను. అయోధ్యలో కౌసల్యా దశరథులకు పుత్రుడుగా బ్రహ్మజనకుడయిన శ్రీరాముడు అవతరించాడు. ఆ దశరథుడు కదా మహాభాగ్యశాలి! పదమూడవ రోజున రాకుమారుడయిన శ్రీరామచంద్రుని, మిగిలిన ముగ్గురు రాకుమారులను రత్నఖచితమయిన సుందర డోలికలలో పరుండబెట్టి వేద పురాణాలను జోలపాటగా పాడసాగారు. సనకసనందనాది మునులు నిత్యం కొలిచే ఆరాధ్యదైవము, పరమశివుడు సదా ధ్యానించే పరబ్రహ్మతత్త్వము, చతుర్ముఖుడు సదా అర్చించే పరమాత్మ, ఆదిమాయకు నిజపతి, పురాణపురుషుడు, పరాత్పరుడు, మాయా జగత్పంచాలకుడు ఐన రామునికి పాడే ఆ జోలపాట వైభవాన్ని వర్ణించడానికి సహస్రశీర్షాలు కలిగిన ఆదిశేషువుకూ అసాధ్యమే.

ఆ శ్రీరామచంద్రుని ఊయల దగ్గరున్న ముత్తయిదువులు ముక్తికాంక్షతో నిజస్థితి నొందడానికి దీక్ష వహించిన ముముక్షువులు. నిష్కామకర్ములై సమాధిస్థితిలో సద్గతి పొందడానికి జోలను స్వానందంతో గానం చేస్తున్నారు! పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అనే చతుర్విధ సరస్వతీ కళలతో నలుగురు స్త్రీలు, సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యమనే చతుర్విధ ముక్తుల్లా భాసిస్తూ నలువైపులా నిలుచుని వున్నారు. జాగృతి, స్వప్న, సుషుప్తులనే స్త్రీలకు అక్కడ ప్రవేశం దుర్లభం. రామదర్శనం అసాధ్యం. అసంభావన, విపరీత



భావన, విక్షేపత, గతాయుత భావనలను తెలుసుకోవాలి. తురీయావస్థ ఒక్కటే చక్కని మార్గం. ఆడంబరానికి అక్కడ ప్రవేశం లేదు. కనుక యౌవనషోడశ కళలతో శోభిల్లే యువతులు, అరవైనాలుగు కళలతో విలసిల్లే సుందరాంగులు బయటే ఉండిపోయారు. వచ్చిన వారందరూ పుణ్యస్త్రీలు. యథోచితంగా వస్త్రాలతో, బహుమతులతో కౌసల్య ఒడినింపి తమ స్వస్థానాలకు తిరిగి వెళ్ళారు.

శ్రీరామజనన వేళలో రాక్షసులకు దుశ్శకునాలు రఘుపతి అయోధ్యలో అవతరించినవేళ రాక్షసులకు అనేక విఘ్నాలు గోచరించాయి. లంకలో పిడుగులు పడ్డాయి. భూమి కంపించింది. రాజచ్ఛత్రం అవనతమయింది. రాజసభకు ప్రేతకళ పట్టింది. మహాద్వారం బీటలు వారింది. రావణుడి పది శిరస్సులపై ఉండే కిరీటాలు కిందికి జారిపడ్డాయి. స్వచ్ఛమయిన అద్దంలో కూడా రావణుడికి తన శిరస్సు కనిపించలేదు. గుడ్లగూబలు రాజమందిరం దగ్గర అరుస్తూ తిరగసాగాయి. కోతులు తన మంగళసూత్రం తెంచినట్లు, బోసిమెడతో విధవగా మారినట్లు, మట్టితో ఒడి నిండినట్లు మండోదరికి కల వచ్చింది. సులోచన నుదుటి మీద కుంకుమ లేక బోసిగానున్నట్లు మండోదరికి కనిపించింది. రావణుడు చింతాక్రాంతుడయ్యాడు. ఈశ్వరుడు ఆగ్రహించాడా? అని భావించాడు. ఆ శంకరుడు విముఖుడయితేనే కానరాని విఘ్నాలన్నీ ఇంట్లోకి ప్రవేశిస్తాయి. మహారత్నం కూడా గాజు పెంకుగా మారిపోతుంది. ఎవరూ పట్టించుకోరు. డబ్బు లోకులపాలవుతుంది. లాభం రాకపోగా అప్పులలో మునిగిపోతారు. అప్పులవాళ్ళు వాకిట్లోనే డబ్బుకోసం ఒట్టుపెట్టుకొని కూర్చుంటారు. మన విషయాలన్నీ శత్రువులకు తెలిసిపోతాయి. శత్రువులకు అధీనులం అవుతాం. అపకీర్తికి లోనయి ధర్మం చెడిపోతుంది. కామక్రోధాలు విజృంభిస్తే దేవుడి కృపలేదని తెలుసుకోవాలి. దైవానుగ్రహం లేకపోతే శత్రువుల కాళ్ళు పట్టుకొనే దుర్గతి కలుగుతుంది. లాభం అపేక్షించి వ్యాపారనిమిత్తం

బయలుదేరితే నష్టం కలుగుతుంది. ఎక్కడ మనం నిత్యం గౌరవింపబడతామో అక్కడ అవమానం ఎదురయితే దేవుని దయాహస్తం లేదని తెలుసుకోవాలి. సహృదయులు, ఆప్తులైన వారు కూడా ద్వేషిస్తారు. అనవసర బాధ్యతలు నెత్తినపడతాయి. మనసులో సదా ఆందోళన చోటుచేసుకొంటుంది. రాజ్యాన్ని, సంపదను, ధనాన్ని శత్రువే భోగిస్తాడు. దేహం ఏ జాడ్యం లేక అనారోగ్యంతో పీడించబడుతుంది. దాచిపెట్టిన సొమ్ము దొరక్కపోయినా, అకారణంగా భయం కలిగినా, వృద్ధాప్యంలో బీదరికం వచ్చినా, భార్య చనిపోయినా, కళ్ళుపోయినా, కొడుకు హేళనగా చూచినా, దైవానుగ్రహం మనమీద లేదని తెలుసుకోవాలి. లంకలో దశకంఠుడు మంత్రులను రావించి రాత్రింబవళ్ళు అప్రమత్తంగా ఉండమని ఆనతిచ్చాడు.

శ్రీరామజననం తరువాత అయోధ్యలో వృక్షాలు పుష్ప, ఫలభరితమయ్యాయి. గోవులు మూడువేళలా పాలిస్తుండేవి. ఎవరికీ మనస్తాపంలేక, వ్యాధులురాక, బీదరికంలేక, పొలాలు అపరిమితమయిన పంటలతో విరాజిల్లుతుండేవి. రాజ్యంలోని ప్రజానీకం తమలో వృద్ధాప్య సూచనలను గమనించలేదు. యువకులు అవిద్యా పాపరహితులయ్యారు. అసమాన పాండితీ ప్రతిభను పొందారు. కురూపులు రూపవంతులు, మిక్కిలి తేజస్వులు అయ్యారు. శ్రీరామావతరణంతో కామక్రోధాలు నశించాయి. అయోధ్యావాసులు ఆనందంతో సుభిక్షంగా వర్ధిల్లారు. సూర్యుడు ప్రకాశించేటప్పుడు చీకటి ఉంటుందా? ఇంటి యజమాని రాకను చూసిన తర్వాత దొంగలుంటారా? జ్ఞానులు వేదాంతం మాట్లాడేటప్పుడు కుతర్కాలేవీ నిలువవు. సద్వివేకం ప్రాప్తించినప్పుడు సంసార దుఃఖాలు అంటవు. శాంతి వైరాగ్యాలు పొందిన వారిని చూచి కామక్రోధాలు పరిగెత్తి పోతాయి. ఈ రకంగా రామావతారంతో దోషాలు, దుర్భిక్షాలు నామరూపాలు లేకుండా నశించిపోయాయి.



ఇదిలా ఉండగా దశరథ కుమారులు ఒకరివెంట ఒకరు ఆడుతూ పాడుతూండగా తల్లిదండ్రులు చూచి సంతోష పరవశులయ్యేవారు. పచ్చలతో కట్టిన ప్రాంగణంలో రాకుమారులు తప్పటడుగులతో ఆడుతుండగా, కౌసల్య భోజనానికి పిలిచినా, దూరంగా పరిగెత్తేవారు. దూరంగా వెళ్ళేవారిని బుజ్జగించి గోరు ముద్దలు తినిపించేది, తర్వాత నలుగురి మొహాలు కడిగి కూర్చోబెట్టుకొనేది. 'కొండంత పుణ్యం చేశాను కనుక సూర్యునివలె ప్రకాశించే నలుగురు కొడుకులు పుట్టార'ని దశరథుడు ఉప్పొంగిపొయ్యేవాడు.

లఘురూపాలతో, చిన్న ధనుర్బాణాలతో చిరుగజ్జెలతో కన్నుల పండుగగా తిరుగుతుండగా వారికి ఎనిమిదేండ్ల ప్రాయం వచ్చింది. అందరు ఒకే రకమయిన వస్త్రాలు, అలంకారాలు ధరించి, చిన్న ధనుస్సులు చేపట్టి బాణాలు వేసేవారు. పీతాంబరం నడుముకు కట్టి, చిన్న పతకం కలిగిన ముత్యాలమాలతో చుట్టూ పరివార సముదాయంతో రాముడు శోభిల్లుతుండేవాడు. సేవకులు ఛత్రంపట్టి, చామరంవీచి రాజోపచారాలను చేసేవారు. మొదట రాముడు బాణం వేస్తే, లక్ష్మణుడు వేగంగా మరోబాణం వేస్తే, భరత శత్రుఘ్నులు వెంటనే వాటిని ఖండించేవారు. వీరుడయిన దశరథుడు కుమారుల ఆటను దూరంనుంచి చూసి, అసురుల శిరస్సులే ఆ బాణాలకు తెగినట్లు భావించి సంతోషించేవాడు. వేదాంతులు సాధికారికంగా చెప్పే వేదంలా రాముడు అకుంఠిత దీక్షతో బాణాలు సంధించేవాడు.

## శ్రీరామ ఉపనయనం

ఇదిలా వుండగా, ఒక సుముహూర్తాన దశరథుడు కులగురువయిన వసిష్ఠుని అనుమతితో వేద బ్రాహ్మణులను ఆహ్వానించి ఉపనయనం గావించాడు. నాలుగు రోజులు ఏ ఒడిదుడుకులు లేక ఆ మహోత్సవం జయప్రదంగా జరిగింది. యజ్ఞభోక్త, వేదవంద్యుడయిన శ్రీరామునికి

బ్రాహ్మణులు యజ్ఞోపవీతాన్ని ధరింపజేశారు. శ్రీరాముడు గాయత్రి జపించాడు. వ్రతసమాప్తిన నలుగురు నాలుగు వేదాలు పఠించారు. వేదాలకే వర్ణింపనలవికాని రఘురాముడు గురువు వద్ద వేదాలు పఠించాల్సి వచ్చింది. ఆ సమయంలో ఎటువంటి క్లిష్ట సమస్యలు ఎదురుకాలేదు. ఈ విధంగా పన్నెండు ఏండ్లు చదువు పూర్తయింది. కులగురువు, మహారాజుల అనుమతితో తీర్థాటనకు బయలుదేరాడు. శాస్త్రప్రకారం బ్రహ్మచారి తీర్థయాత్రలు చేయాలి కనుక శ్రీరాముడు అపారమైన సైన్యంతో, పంచిపెట్టడానికి ధనరాసులతో, లేగదూడలతో కూడిన ధేనువులతో, నానా వస్త్రాలతో సుమంత ప్రధాని వెంటరాగా బయలుదేరాడు. తీర్థప్రదేశాల్లో యాచకులను సన్మానించి, విధి విధానాలను పాటించాడు. ఎవరివల్ల తీర్థాలే పవిత్రమవుతాయో ఆ రఘునందనుడు లోక కళ్యాణార్థం, లోకుల అజ్ఞాన నివారణార్థం తీర్థయాత్ర చేశాడు. ఆయా తీర్థాలలో సాధువులు, సజ్జనులు, భక్తులు మొదలైనవారిని దర్శించి వారి బోధనలను శ్రవణం చేశాడు.

### శ్రీరాముని తీర్థయాత్ర

కాశీవిశ్వేశ్వరుని, త్ర్యంబకుని, ఉజ్జయినీ మహాకాలుని, ఓంకారుని, మహాబలేశ్వరుని, జాశ్వనీల, బదరీ, కేదార, ఘృష్ణేశ్వర, నాగనాథ, వైద్యనాథ్, మల్లికార్జున్, భీమశంకర, సోమనాథ, రామేశ్వర, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అయోధ్యా, మథురా, హరిద్వార్, కాశీ, కాంచీ, అవంతిక, ద్వారావతి, గోమతీ తీర్థాలను దర్శించాడు. తీర్థరాజాలలో ముఖ్యమయిన త్రివేణిని, పుణ్యఖని పంచప్రయాగలను, పాపహారిణి బ్రహ్మకర్ణ ప్రయాగలను, సమర్థవంతమయిన గుప్త ప్రయాగను, పాపహరణార్థం దేవ, శివ ప్రయాగలను, ధర్మారణ్యమయిన నైమిశాన్ని, బ్రహ్మారణ్య, వేదారణ్యాలను, పావన బదరికాశ్రమాన్ని, యమున, సరస్వతి, భాగీరథి, గౌతమి, గోమతి, కృష్ణ, భీమ, తాపీ, నర్మదా, తపతీ, భోగవతీ, ప్రవర, మలప్రహార, కృతమాల, కావేరీ, స్వర్ణముఖి, మందాకిని,



ఆనందవర్ధని అయిన పయోష్ణ, పినాకిని, తుంగ, వేణి, వేదవతి, ఘటప్రహార, నందినీ, నళిని, గండకీ, సరయూ, వైతరణి, సోమనద, శివనద, సోమభద్ర, అరుణ, వరుణ, వేత్రవతి, కపిల, తామ్రపర్ణి, శరావతి, తుంగభద్ర, సోమవతి, సావిత్రి, కుంకుమవతి, రేవా, వేణామల, ప్రహార, ప్రాచీ, పురందరీ, సప్తోరగ, కర్ణకుమారి, స్వామికార్తికీ, పంచఘృతాచీ, వజ్రకాళిక, మహేంద్రకాళి, త్రిశూలి, మంత్రవర్థిని, నీరావతి, సురనది అయిన శంఖోద్ధారిణి, జయంతి, అమీర్ణవి, నాటకి, అలకనంద, ఫల్గుణ, త్రిపద, శాంత, బాణ, సుఖదా, అనుక్రమ మొదలయిన నదులను వరుసగా సందర్శించాడు. శేషాద్రి, బ్రహ్మాద్రి, మూలపీఠ పర్వతమయిన సహ్యాద్రిని, వింధ్యాద్రిని, హేమాద్రిని దర్శించి మానస సరోవరంలో స్నానమాడి, అరుణాచలాన్ని, ఆనందవనాన్ని, చిదంబరాన్ని, పావన అగస్త్యాశ్రమాన్ని, శోభాకరమయిన శ్రీరంగ పట్టణాన్ని, కన్యాకుమారిని, జనార్దనుని, శివకంచి, విష్ణుకంచి, మత్స్య, పక్షితీర్థాలను, శంఖోద్ధార, వేదోద్ధార, హిరణ్యనది, సంధ్యావటాన్ని, బ్రహ్మావర్తంలో ధర్మస్తంభ, సుభటాన్ని, బ్రహ్మయోని, పృథూదక, వారిష్ఠ, కురుక్షేత్ర, బిందుతీర్థ, ధర్మాలయమయిన కలాపగ్రామాన్ని, గంగాసాగర, సింధుసంగమం, కౌండిన్యపురంలోని అంబిక, ప్రేమపూర్ణుడయిన మార్తాండుని, బాలకల్లోల కమలేశ్వరిని, విరాట్ స్వరూపిణి అయిన రక్తాంబరిని, సుందర జ్వాలాముఖి అయిన భ్రమరాంబికను, పీతాంబరి అయిన మహాశక్తిని, భైరవి అయిన జోగలాదేవిని, కరవీరవాసిని అయిన శాంభవిని, సప్తశృంగియైన మహారుద్రాదేవిని, హింగుళజను, కమలజను, చాంగదేవుని, మోరేశ్వరుని, గుప్త కేదారంలోని వటేశ్వరుని, అక్షయవట కుశతీర్థాలను, త్రికూటాచలాన్ని, నృసింహపుర హరిహరేశ్వరుని, మూలమాధవుడయిన జ్ఞానేశ్వరుని, భూలేశ్వర కదంబమయిన చక్రపాణిని, గౌతమేశ్వరంలో జానాట నాగేంద్రుని, సప్తయోజనాలున్న కోటేశ్వరుని, సిద్ధవటాన్ని, రామేశ్వరాన్ని, దక్షిణ ప్రయాగ అయిన మాధవేశ్వరాన్ని, పూర్వసాగర తీర్థరాజాలను, వైరాగ్య పుష్కర

మహాబలేశ్వరాన్ని, నారాయణపురంలోని ధూలకేటక శంకరుడిని, మలయేశ్వర, పాంచాలేశ్వరులను, సత్యనాథ పూర్ణాలయాన్ని, సింధుపురంలోని మహాముండేశ్వరుని, యోగీశ్వరుడైన భీమశంకరుని, సోరటిలోని సోమనాథలింగాన్ని, భీమచండి, గోరక్షమఠాన్ని, వేదపురి, గయ, అమరావతి, ఉడిపి, శేషశాయిని, అహోబల త్రిపతిని, స్వామికార్తిక సత్య సుబ్రహ్మణ్యుని, కిష్కింధ మాతంగ పర్వతాలను, హంపీ విరూపాక్షుని, నిర్మల పంపా సరోవరాన్ని, చిత్రకూట, రుక్మకూటాలను, మహంకాపురాన్ని, కాలచంద్రికను, గోకర్ణాన్ని, కృష్ణసాగరాన్ని, హరిహరతీర్థమయిన జంబుకేశ్వరాన్ని, విమలేశ్వరంలో అనంతశాయిని, మధురా వికర్ణుడయిన ప్రభాకరుని, విశ్రాంతివనాన్ని, తపోవనాన్ని, కుంభకోణ, మంజరథ, మాతులింగ, ధూలకేట త్రివిక్రమతీర్థాలను, ముద్గల, మాంధాత, నాగనాథ, పండరి, చంద్రభాగ, త్రికోణి, కర్ణమూల, నాగరగౌర, ఆశాపురి, నేపాల, త్రిమల్ల మంథన కాళేశ్వరంలో కుశతర్పుని, మీనాక్షి, కామాక్షి సితాసితుడయిన చిదంబరేశ్వరుడిని, బ్రహ్మకటాహ హరిద్వార, ఆదిత్య, వైశ్వానర మహాతీర్థాలను రఘువీరుడు బ్రహ్మానందంతో సందర్శించాడు. తరువాత ఆ దీనజనోద్ధారకుడు అయోధ్యా నగర ప్రవేశం చేసి వసిష్ఠునికి దశరథునికి సాష్టాంగ నమస్కారం చేసి అభేదత్వంతో ముగ్గురు మాతలకు ప్రణామం చేశాడు.

యాత్రచేసిన అనంతరం శ్రీరాముడు విరక్తతతో ప్రాపంచిక విషయాలపట్ల అనాసక్తతతో మెలగసాగాడు. షడ్రసోపేతమయిన భోజనం, ఉత్తమాసనం, హాస్యవినోదాలు, శృంగార సంగీతాలు, వేట మొదలైన వాటిపట్ల విముఖుడయ్యాడు. స్త్రీలతో సంభాషించక చూడక ధ్యానతత్పరుడై నాసాగ్రంపై దృష్టి నిలిపి ఏకాంతాభిలాషిగా ఆనందసాగరంలో తేలియాడసాగాడు. ముగ్గురు సోదరులు కూడా మహా విరక్తులయి నిష్కాములై సాధువులై రామసేవలో సదా ఆనందభరితులయ్యారు.



## అయోధ్యకు విశ్వామిత్రుని రాక

ఆ సమయంలోనే సృష్టికి ప్రతిసృష్టి చేసే సమర్థుడూ, సిద్ధాశ్రమ వాసి మహాతపస్వి గాధి పుత్రుడయిన విశ్వామిత్రుడు అయోధ్యా నగరంలో ప్రవేశించాడు. దశరథుడు మునిరాక తెలుసుకొని ఎదురేగి సాష్టాంగ దండ ప్రణామాలాచరించి కౌగిలించుకొన్నాడు. బ్రాహ్మణుని చూచి లేచి మర్యాద చేయకపోతే ఆయుష్షు క్షీణిస్తుంది. వాడికి మరణం ఆసన్నమయిందని గ్రహించాలి. ఎవరయినా బ్రాహ్మణులకు తగు మర్యాద చేయకపోతే మరుజన్మలో కుక్కగా పుడతారు. బ్రాహ్మణ మర్యాద చేయనివారింటికి విఘ్నాలు వస్తాయి. ఈ విషయాలన్నీ తెలిసిన దశరథుడు బ్రాహ్మణభక్తుడు కనుక విశ్వామిత్రుని చేయి పట్టుకొని తన సింహాసనం మీద కూర్చోబెట్టాడు. వస్త్రాలంకారాలు అర్పించి పూజలు ఉపచారాలు చేసి జన్మ ధన్యం అయిందని భావించాడు. 'నాకీ రోజు చాలా సంతోషంగా ఉంది. మీ మనోరథం ఈడేరుస్తాను. కోరిక సెలవివ్వండి' అని నమస్కరించాడు.

విశ్వామిత్రుడు దశరథ మహారాజును చూస్తూ, 'సూర్యవంశభూషణుడవు ఉదారుడవు ఐన నీకు అనంత శుభాలు కలుగుగాక' అని ఆశీర్వదించాడు. 'సంతోషం బలం అధికమయి సార్థకమయిన జీవితంతో సమస్తసుఖాలు చేకూరుగాక! వివేక విజ్ఞానాలు సమృద్ధిగా, సదా విప్ర, విష్ణుభక్తి కలిగి, బుద్ధి ప్రతాప యశస్సులతో నీకు సమస్త శుభాలు చేకూరుగాక! శత్రువులందరూ నశించి శాశ్వతపదం ప్రాప్తిస్తుంది. అత్యంత భూతదయ కలిగి ఉంటావు. నీ వంశం అభివృద్ధి చెందుతుంది. తలపెట్టిన కార్యాలన్నీ విజయవంతమయి సర్వారిష్టాలు శాంతించి సర్వాభీష్టాలు సిద్ధిస్తాయి. ఓ దశరథ మహారాజా! నీకు దోషరహితమయిన కీర్తి కలుగుతుంది. సాధుసజ్జనులు నిన్ను కీర్తిస్తారు. నీ వలన యాచకుల కోరికలు తీరుతాయి. అనాచారాలను వదిలి సాధు, భజన, సంకీర్తనకారులను ఆదరాభిమానాలతో సత్కరించు. అప్పుడే నా

ఆశీర్వాదాలన్నీ సమగ్రంగా సత్ఫలితాల్ని ఇస్తాయి. నీ మనసులో సద్బుద్ధి పెంచుకో! బ్రాహ్మణుల ఆశీర్వాదాలు తీసుకో! నన్ను తలుచుకో! నీ కార్యాలన్నీ సిద్ధిస్తాయి' అని ఆశీర్వదించాడు.

నేను ధనాన్ని, సంపదను కోరడంలేదు. రాజసింహాసనం అడగడంలేదు. రాక్షసులు యజ్ఞాలకు అంతరాయం కలుగజేస్తున్నారు. నీ పుత్రుడయిన రాఘవుని నాకు తోడుగా పంపు. యజ్ఞాలు సిద్ధించడం లేదు. మారీచ సుబాహులు, తాటక రాక్షసబృందం హోమద్రవ్యాలను భక్షిస్తున్నారు. వారి నుండి రక్షణకు రఘురాముని నాతో పంపాల్సింది. యజ్ఞవేదికను ధ్వంసంచేసి, యజ్ఞపాత్రలను భగ్నంచేసి, మంటపాలకు నిప్పంటిస్తున్నారు. మానవ రక్త మాంసాలను యాగసమయంలో హోమకుండంలో పైనుంచి పోస్తున్నారు. లెక్కలేనంత మంది బ్రాహ్మణులను మింగేశారు. ఇటువంటి అకృత్యాలను ఆపి యాగసంరక్షణ చేయడానికి రాఘవుడి అండ తప్పదని విశ్వామిత్రుడు తన కోరికను తెలియజెప్పాడు.

ముని పలుకులకు మహారాజు భయభ్రాంతుడయ్యాడు. అకస్మాత్తుగా కొండ విరిగి మీద పడ్డట్టయింది. విద్యుద్ఘాతం తగిలినట్లయింది. బాగా కాల్చిన బాణాలు గుండెల్లో గుచ్చుకున్నట్లు, అకస్మాత్తుగా అంధత్వం వచ్చినట్లు, లోభి గృహాన్ని దుండగులు దోచుకున్నట్లు అనిపించింది. అధోవదనుడయ్యాడు. మారుమాట రాలేదు. వివేక చాతుర్యాలు నశించాయి. భయంతో స్తంభించాడు. 'ఓ తపస్వీ! యజ్ఞయాగాదులను ధ్వంసం చేసేది మహారాక్షసులు. నా కుమారుడా పసివాడు. వింటితో లీలావినోదంగా క్రీడించటమే అతనికి తెలుసు. యుద్ధరంగాన్ని ఎరుగడు. ధనుర్విద్యాభ్యాసమే ఇంకా పూర్తికాలేదు. ఇటువంటి పసివాడిని యుద్ధానికెలాపంపేది? నా రాజ్యాన్ని, సకల సంపదలు, గృహాలు మొత్తం సమర్పించగలను. కానీ, శ్రీరాముని పంపలేను. నేను ససైన్యంగా వచ్చి సమస్త రాక్షససంహారం చేసి యాగ సంరక్షణ చేస్తాను.



లోభి ధనాన్ని వదలనట్లు, చేప నీటి బయట జీవించనట్లుగా రాఘవుని వదలి నేను ఉండలేను. అదీగాక యుద్ధభూమికి అల్లారు ముద్దుగా పెంచిన బిడ్డను, ఎండ కన్నెరుగని పసివాడిని పంపలేను' అని జంకుతూనే విశ్వామిత్రుడికి సమాధానం చెప్పి కన్నీరు మున్నీరుగా విలపించసాగాడు. దశరథుడి సమాధానానికి విశ్వామిత్రుడు కోపంతో మండిపడ్డాడు. 'నువ్వే మాట ఇచ్చావు. కావలసిన కోరికను తెలుపమన్నావు. ఈ వంశంలోనే హరిశ్చంద్రుడు తనకొచ్చిన స్వప్నాన్నే సత్యంగా భావించి నాకు రాజ్యం ఇచ్చి తాను కాటికాపరి అయ్యాడు. అటువంటి వంశంలో జన్మించి మాట ఎలా తప్పగలుగుతున్నావు! నీ వల్ల సూర్యవంశం కలుషితమవుతుంది. శిబి చక్రవర్తి ఈ వంశంలోనే జన్మించి ఇచ్చిన మాటకోసం పావురం బరువుకు సమానంగా తన శరీరంలోనించి మాంసాన్ని కోసి ఇచ్చాడు. రుక్మాంగదుడు పవిత్ర ఏకాదశీ వ్రతం సంపూర్తి కోసం పుత్రుడినే వధించాడు. నీ వంశంలోనే సిరియాళుడు శంకరుడికిచ్చిన మాట కోసం పుత్రవధ గావించాడు. నీకు శ్రీరాముని గురించి ఏమి తెలుసునని ఇట్లా మాట్లాడుతున్నావు? కాలాన్ని శాసించేవాడు, ఆదిమాయనే వరించినవాడు, బ్రహ్మజనకుడు, వైకుంఠనాథుడు, సదా సదాశివుడు ఎవరిని ధ్యానిస్తాడో, ఎవరు సనకసనందనాదులకు ఆరాధ్యదైవమో, ఎవరి శరీరంలో ఇంద్రుడుంటాడో, వేదాంత శాస్త్రాలెరిగిన నిర్గుణ పరబ్రహ్మమయిన వాడిని పసిబాలుడుగా ఎంచుతావా? భక్తుల హృదయారవింద భ్రమరం, మీమాంసా కర్మ మార్గాచరణాల లక్ష్యం, వ్యాకరణకారులు శబ్దార్థ శోధన చేసి నానార్థాల నామసంధానంలో గ్రహించే లక్షణం, సాంఖ్య శాస్త్రంలో ప్రకృతి పురుష విభాగం, జ్ఞానయోగంలో శాశ్వతుడు, అభంగుడు, ఈ రాఘవుడే! అటువంటివాడు బాలుడా? నైయాయికులు జీవం అశాశ్వతమనీ ఈశ్వరుడే సత్యం నిత్యమనీ అంటారు. అటువంటి నిత్యుడు శ్రీరాముడు. పతంజలీ శాస్త్రంలో చెప్పిన యోగసాధనలు అష్టాంగ యోగాలు ఆచరించి ఎవరి

సమక్షంలో మోక్షం సాధించాలని యోగులు ఎంచుతారో అటువంటి శ్రీరాముని పసివాడంటావా? అయినా రాముడికి కల్యాణమే జరుగుతుంది. నేను నా ఆశ్రమానికి వెళ్ళిపోతున్నాను' అని కోపంతో వెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు.

ఈ మాటలకు దశరథుడు కలతచెందాడు. వెంటనే కులగురువు సమక్షానికి వెళ్ళి సమస్యను నివేదించాడు. విశ్వామిత్రుడు కోపంతో ఉన్నాడు. రఘునాథుని వెంట పంపమన్నాడు. మీరు మా కుల గురువులు, సమర్థులు. ఈ తరుణంలో నా కర్తవ్యనిర్దేశం చేసి మీ అనుగ్రహఫలమైన రాముని యముని వంటి ఆ విశ్వామిత్రుని బారినుండి కాపాడండి. విశ్వామిత్రుడికి ఏమయినా ఇచ్చుకొంటాను. రాముడికి ప్రాణభిక్ష పెట్టి నన్ను కడతేర్చండి' అని వేడుకొన్నాడు.

అప్పుడు వసిష్ఠుడు మహారాజుతో 'విశ్వామిత్రుని పట్టుదల మీకు తెలియదు. బ్రహ్మను గెలవడానికి సృష్టికే ప్రతిసృష్టి చేశాడు. లోహంతో చేసిన పిండిని భక్షించి అరవైవేల సంవత్సరాలు గాయత్రిని జపించాడు. ముల్లోకాల్లో అతని పేరంటే అందరికీ భయం. సదా ధనుర్బాణాలను ధరించిన మహా యోధుడు. ఆయన మాటను కాదంటే ఘోరశాపంతో నీ కులాన్నే భస్మం చేస్తాడు. ఇది నిజం. అందుచేత ఆయన వెంట రామలక్ష్మణులను పంపి భరత శత్రుఘ్నులను నీ వద్ద ఉంచుకోవడమే నీ ప్రస్తుత కర్తవ్యం' అని వివరించాడు. కులగురువు వివరణకు దశరథుడికి విచారం ఆగలేదు. బిగ్గరగా విలపించాడు. వసిష్ఠుడు రాజు శిరస్సు నిమురుతూ, 'మహారాజా! శ్రీరాముని తదేకంగా గమనించు. శంఖచక్ర గదాధరుడయిన ఆదినారాయణుడు అగుపిస్తాడు. వాల్మీకి మహర్షి నుడివిన భవిష్యత్తులో జరగబోయే విషయాలకు అనుగుణంగానే శ్రీరాముడు అవతరించాడు. విశ్వామిత్రుడు వాక్కు యథార్థం. లక్ష్మణుడే ఆదిశేషుడు'అని ధైర్యం చెప్పాడు. వీళ్ళు మానవులే కానీ దైవాంశసంభూతులన్న అభిప్రాయానికి దశరథుడు వచ్చి గురువాజ్ఞప్రకారం



రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంట పంప నిశ్చయం చేసుకొని అతని సమక్షానికి వచ్చి పాద ప్రణామం చేసి 'రామలక్ష్మణులను మీ వెంట తీసుకొనిపొండి' అని అన్నాడు. ఇందుకు విశ్వామిత్రుడు మరింత సంతోషించాడు. 'ఎంత మంచి విషయం చెప్పావు. నేను కోరింది రాముడినే. కానీ నువ్వు లక్ష్మణుని కూడ పంపుతున్నావు. నా భాగ్యం పండింది. నాకు రెండింతల లాభం చేకూరింది. నా పుణ్యం మేరుపర్వతం కన్నా మిన్నగా ఫలించి రఘువీరుడు ఈ రోజు నాకు ప్రాప్తించాడు' అని సంతృప్తితో తిరిగి వచ్చి యథాస్థానంలో ఆసీనుడయ్యాడు. ఆ సమయానికి కులగురువు ఇతర మునులు మహాత్ములూ సభాస్థలిలో ఉన్నారు. దశరథుడు సంతుష్టుడయ్యాడు. 'కోటి మన్మథులకు సాటిరాని శ్రీరాముని సౌందర్యం చూసి ధన్యుడినవుతాను. ఇక శ్రీరామ ముఖారవింద దర్శనం చేయించమ'ని మహారాజును కోరాడు విశ్వామిత్రుడు.

'విశ్వామిత్ర మహర్షి వెంట పోవడానికి సిద్ధమై సభకు రావల్సింది' అని మహారాజు కుమారులకు కబురుపంపాడు. వార్త విన్న వెంటనే ముత్యాలతో అలంకరించిన అంగవస్త్రం ధరించి త్రిభువన సుందరుడయిన శ్రీరాముడు ఉదయాద్రిన సూర్యోదయంలా రాజసభలో ప్రవేశించాడు. ఆ కౌసల్య హృదయారవింద భ్రమరం కనిపించగానే సభలో జయజయధ్వానాలు మారుమ్రోగాయి. శ్రీరాముడు విశ్వామిత్రుని సమీపించి ప్రేమతో ఆయన చరణాలకు ప్రణమిల్లాడు. ఆ ముని శ్రీరాముని లేవదీసి, నీలమేఘశ్యాముని హత్తుకొని జన్మను సార్థకం చేసుకున్నాడు. ఆ తరువాత కుల గురువయిన వసిష్ఠునికి కోదండపాణి నమస్కరించాడు. అందరి ఆశీర్వచనం పొంది వేదవంద్యుడయిన శ్రీరాముడు స్వస్థానంలో కూర్చున్నాడు. 'రాకుమారా! నా యజ్ఞాన్ని అసురులు విధ్వంస్వం చేస్తున్నారు. ముల్లోకాల్లోనూ యాగరక్షణకు నిన్ను మించిన వారు లేర'ని ఆగమన కారణాన్ని శ్రీరామునికి విశ్వామిత్రుడు

వివరించాడు. మునిపలుకులకు రఘువీరుడు మందహాసం చేశాడు. సూర్యకిరణాలకు విప్పారిన కమలంలా తయారయింది ఆయన వదనం.

ఈ రసవత్కథ సాధుసజ్జనులు వింటే మహాపాతకాలు తొలగిపోతాయి. వేదాంతశాస్త్రాల అధ్యయనంతో పునీతులైనట్లు రసభరితమైన ఈ ఆరవ అధ్యాయాన్ని శ్రవణంచేస్తే పరమపావనమౌతారు. ఈ అధ్యాయంలో శుద్ధ వేదాంత జ్ఞానాన్ని రాముడికి సదా బ్రహ్మానందంలో ఓలలాడే వసిష్ఠుడు ఉపదేశిస్తాడు. ఇది శ్రోతలకు ఆత్మజ్ఞానం కలిగిస్తుంది. శ్రీరాముని కోరికమేరకు, పరమ సుందరము, జ్ఞానభరితమైన వేదాంతతత్త్వాన్ని వసిష్ఠుడు ఉదారమైన మేఘంలా వర్షించాడు.

తన జ్ఞానసంపదతో వసిష్ఠుడే మళ్ళీ అవతరించాడా అన్నట్లుగా వసిష్ఠగోత్రోద్భవుడయిన పూర్ణబ్రహ్మానందస్వామి మా వంశంలో అవతరించాడు. అటువంటి మహాత్ముడు, శ్రీధరవరదుడు అయిన బ్రహ్మానందుని పాదపద్మాలను నిరంతరం సేవిస్తాను.

శ్రీరామవిజయ గ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులయిన భక్తులు సదా దీనిని అవలోకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**అయిదవ అధ్యాయం మధురం**

**అధ్యాయము - 6**

## శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః
## శ్రీగణేశాయ నమః

**జ**గదభివంద్యుడు, వేదవేద్యుడు, పరాత్పరుడు, అగోచరుడు, కమలోద్భవుని జనకుడు, సర్వానికి ఉపాధి తానే అయినవాడు, మన్మథుని దహించిన ఆ పరమశివుని హృదయములో విహరించేవాడు, సంకల్ప మాత్రాన మాయా పూర్ణమైన ఈ బ్రహ్మాండాన్నంతా సృష్టించి, సకల చరాచర సృష్టిలోని ఎనభైనాలుగు లక్షల రకాల జీవరాసుల హృదయాలలో నిండినవాడు అయిన బ్రహ్మాండనాయకునకు నమస్కారాలు.

సర్వ జీవరాసుల హృదయాలలో నీవు నివసించివున్నా, అహంకార మదాంధులై, జీవులు తమ స్వస్వరూపాన్ని మరచి మోసపోతున్నారు. శబ్దం విన్నంతనే లేడి గుండెలు అవిసిపోయినట్లు, అంకుశం పోటుకు ఏనుగు వంగినట్లు, ప్రాణులన్నీ విషయసుఖాలలో మగ్గి నశిస్తున్నాయి. రూపాన్ని చూచి భ్రమించి శలభాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. చేపలు నీటిలోనే పుట్టి అందులోనే అంతమవుతున్నాయి. పుప్పొడి ఆకర్షణకు భ్రమరం కమలంలో చిక్కి తన మరణాన్ని తానే కొని తెచ్చుకున్నట్లు, పంచేంద్రియాల మాయలోపడి మానవులు అధోగతి పాలవుతున్నారు. ఓ శ్రీరామా! నిన్ను విస్మరించి జీవులు ధన,కనక, కామాంధులై చరిస్తున్నారు. ఓ పూర్ణబ్రహ్మ! అట్టి జీవులను తరింపజేయడానికి నీవు దశరథుని కుమారుడవై అవతరించావు.

**యోగవాసిష్ఠసారం**

పంచమాధ్యాయం చివరి కథా భాగంలో దశరథుడు, రాముని విశ్వామిత్రునకు అప్పగించాడు. తరువాతి కథను సావధానులై వినండి. ఈ

కథను వాల్మీకి అద్భుతంగా రచించాడు. అది యోగవాసిష్ఠంలోని ముప్పదిరెండువేల శ్లోకాలలో ఉన్నది. సాగర గంభీరతను కలిగిన ఈ ఉద్గ్రంథ సారాంశాన్ని మాత్రమే ఇక్కడ వివరిస్తున్నాను. దప్పికగొన్నవాడు దోసిలితో గంగాజలాన్ని సేవించినట్లు, గజ ఈతగాళ్ళు సముద్రగర్భాన్నుండి మంచిముత్యాలను యథాశక్తిగా వెలికితీసినట్లు, అపార ధనరాసుల నుండి బిచ్చగాడు మోయగలిగినంత మూట గట్టినట్లు, క్షుధార్తునికి ఎంత అన్నం లభించినా, తన ఆకలి తీరేంత మాత్రమే గ్రహించినట్లు, ఈ 'యోగవాశిష్ఠం' లోని గూఢార్థాలను ఏతముతో పొలములోనికి నీరుపెట్టినట్లు నా శక్తి మేరకు చెబుతాను! అవధరించండి.

వాల్మీకి ఉచ్ఛిష్టమయిన ఈ గ్రంథాన్ని సాదరముగా అవలోకించండి. దానికి చతురులైన శ్రోతలు ఉచ్ఛిష్టమన్న దానిని తిరిగి మీరు చెప్పడం ఎందుకు? ఒకరి ఉచ్ఛిష్టాలను మేము అంగీకరించము అని సందేహాలనే ధనుస్సుతో ప్రశ్నలనే బాణాలను వదలగా, వక్తయైన శ్రీధరుడు స్ఫూర్తి యనే విల్లుతో శాస్త్రాలనే శరాలను గైకొని వాటిని ఖండించాడు.

అదెలాగో శ్రోతలారా, సావధానులై వినండి. ప్రపంచంలో ఏది ఉచ్ఛిష్టంకాదు? దేవునికి తేనెటీగల మధువు చాలా ఇష్టం. అది ఉచ్ఛిష్టం కాదా? దూడత్రాగిన పొదుగునుండి పాలు పితుకుతాం. పువ్వు పరిమళించగానే తుమ్మెద మకరందాన్ని గ్రోలుతుంది. సముద్రజలాన్ని పీల్చి మేఘాలు నిండుగా వర్షిస్తాయి. గౌతముడు గోదావరిని వెంటపెట్టుకొని వస్తూ తానే ముందుగా ఆ జలాలలో స్నానపానాదులు కావించాడు. ఇవన్నీ ఉచ్ఛిష్టం కావా? కానీ ఇవి ఉచ్ఛిష్టాలుకావని నిర్ణయించారు. యాజ్ఞికులు కూడ వాటిని పవిత్రమని అంగీకరించారు. వ్యాసోచ్ఛిష్టమైన పురాణాలు ఎంగిలి అవుతాయా? ఎన్నటికీ కావు! కాజాలవు!



భగవంతునికి నివేదించింది ఎంగిలి అవుతుందా? అది పరమ పావనమైన దైవ ప్రసాదమవుతుంది. వాల్మీకి కావ్యం ఎన్నటికీ ఉచ్ఛిష్టం కాజాలదు. పులి, లేడి చర్మాలు గంభీరమైనవి. గొఱ్ఱె కేశాలు చాల మృదువుగా ఉంటాయి. ఏనుగు దంతాలు, ఆవు కొమ్ములూ – ఇవన్నీ బ్రాహ్మణులకు పవిత్రాలే.

ఇక తరువాతి కథాక్రమానికొద్దాం! విశ్వామిత్రునితో యాగ సంరక్షణార్థం బయలు దేరేటప్పుడు రాముడు, ఓ మహర్షీ! మీరేమో నన్ను యుద్ధానికి తీసుకొని వెళ్తున్నారు. ఈ దేహం క్షణభంగురం. ఈ యుద్ధం వలన నాకేమైనా ఆత్మప్రాప్తి కలుగుతుందా? ఆత్మప్రాప్తి నొందని సాధనం వ్యర్థంకాదా! కంఠాభరణం లేని అలంకారము, దీపంలేని ఇల్లు, నీరులేని ఏరు, ప్రాణంలేని శరీరం, మక్కువ లేని మర్యాదలు, ఇంద్రియనిగ్రహంలేని ఆచారం.... అలా ఆత్మప్రాప్తి నొందించని సాధన వ్యర్థం! భర్తలేని స్త్రీ, చంద్రుడు లేని రాత్రి, ఆత్మప్రాప్తి కలుగని జీవితం నిష్ప్రయోజనం.

**గురుమహిమ**

"ఆత్మప్రాప్తికోసం గురుచరణాల నాశ్రయించాలి. గురుకృప లేనిదే యుగాంతమైనా జ్ఞానం కలుగదు. కన్నులు లేనిదే ఏమీ చూడలేము. నీళ్ళు లేని జీవితం నిస్సారం. పరుసవేదిలేనిదే ఎన్ని యుగాలయినా ఇనుమును బంగారంగా మార్చలేము. గురుసేవను నిష్ఠతో, భక్తి భావంతో వినమ్రుడై సేవించేవాడికి ఆత్మప్రాప్తి లభిస్తుంది. గురుసేవయందాసక్తి లేనివాడి జ్ఞానానికి చెదలుపట్టినట్లే! వాడు ఈ జననమరణ చక్రాన్నుండి బయటపడలేడు. వాడికి మోక్షప్రాప్తి కలిగే ప్రసక్తేలేదు.

ఎవరికైతే గురుసేవయందు ప్రీతి లేదో వాడు చతుష్షష్టికళలలో నిష్ణాతుడైనా, షట్ శాస్త్రసాలు వల్లించినా, హరికథ చెప్పినా, ఎంత దంభంగా అభినయించినా, బంధం నుండి విముక్తుడు కాలేడు. అట్టివాడి ప్రతిభాపాటవాలు

వ్యర్థం. విధవరాలి యౌవనంవలె వాని తపం నిష్ఫలం. జన్మాంధునికి విశాల నేత్రాలున్నట్లు, దానధర్మాల యందు ప్రీతిలేనివాడు గుళ్ళుగోపురాలు కట్టించినట్లు, లోభి తత్త్వవిచారం చేసినట్లు, అధముడికి అందమైన భవనం ఉన్నట్లు, వాని విద్య వ్యర్థం. భ్రష్టునికి కులగోత్రాలు పట్టనట్లు, పవిత్రాపవిత్రాలు కుక్కకు లేనట్లు, త్రాగుబోతువాని పాత్రను శ్రోత్రియులు అంటనట్లు – గురుకృప లేనివాడు నరదేహం ధరించిన గాడిదతో సమానం. సదా విషయలోలుడై ఉండే వాడిని ఇహపరాలలో ఎవ్వరూ లెక్కింపరు. ఉత్తమమైన నరజన్మమెత్తి, ఆత్మజ్ఞానం కోసం సాధన చేయనివాడు మూర్ఖుడు, జ్ఞానహీనుడు. అట్టివాడు ఘోరనరకం పాలవుతాడున్న" రాముని మాటలు విని, విశ్వామిత్రుడు సంతోషాంతరంగుడయ్యాడని శ్రీధరకవి చెప్పగా, శ్రోతలు పరమానందం చెందారు. రాముని మాటలకు విశ్వామిత్రుడు పరమానందభరితుడై వసిష్ఠునితో, "జగద్వంద్యుడు, ఇనకుల భూషణుడు, బ్రహ్మాండాన్నంతా తనలో ఇముడ్చుకొన్నవాడు, లీలామానుష విగ్రహుడు అయిన శ్రీరామచంద్రునికి దివ్యజ్ఞానము నుపదేశించు" అని అన్నాడు.

## వసిష్ఠునిచే రామచంద్రునికి దివ్యజ్ఞానబోధ

అప్పుడు కమలోద్భవునికే తండ్రియైన శ్రీరామచంద్రుడు వసిష్ఠునికి సాష్టాంగ నమస్కారం చేసి, "మిమ్ము శరణువేడుచున్నాను" అని త్రికరణ శుద్ధిగా శరణాగతి నొందాడు. వసిష్ఠుడు శ్రీరామచంద్రుని లేవనెత్తి హృదయానికి హత్తుకొని "జగద్వంద్యా! శ్రీరామా! అవతారపురుషా! పరబ్రహ్మ! సచ్చిదానందా! పరమాత్మా! నీకు నేనేమి ఉపదేశం చేయగలను? నీవు ఆదినారాయణుడవు! నిష్కళంకుడవు! శేషశాయివి! వేదశాస్త్రాలు గూడా నిన్ను వర్ణించలేక స్తబ్ధమయ్యాయి. నీ నామాన్ని జపించి అపర్ణారమణుడైన శంకరుడు శీతలత్వం పొందాడు. అట్టి నీవు గురుమహిమను ఈ జగత్తుకు ప్రకటించడానికే నన్ను శరణుజొచ్చావు.



యాచకులను రాజు దానమడగడం, సాగరం సరోవరాన్ని ప్రీతితో స్తుతించడం, మూగవానిని వాచస్పతి సలహా అడగడం, దినకరుడు అసూయతో దీపాన్ని వెలుగు కోరడం, చంద్రుడు చకోరాలను ఆనందింపజేయమనడం, కల్పతరువు దీనుని దానమడగడం, మేఘాలు చాతకాలను నీళ్ళడగడం, చక్రవాకాన్ని దర్శనం ఇవ్వమని సూర్యుడు కోరడం, తన బిడ్డను తల్లి చనుబాలు అడగడం, గంగానది దప్పికొన్న వానిని నీళ్ళడగడం, వసంతుడు వనస్పతులను తన కోరిక లీడేర్చమని అడగడం, ఇవన్నీ ఎట్లా అసంభవాలో, అట్లాగే భగవంతుడు భక్తుని శరణువేడడం అసంభవం! అయినా, జగద్గురువువైన నీవు నన్ను శరణుజొచ్చావు! అది కేవలం నా అదృష్టం"అంటూ బ్రహ్మానందనుడైన వసిష్ఠుడు ఆనందంగా శ్రీరాముని తన ఎదుట కూర్చుండబెట్టి గురు సంప్రదాయానుసారం శాస్త్రప్రమాణాన్ననుసరించి మహావాక్య దీక్ష నిచ్చాడు. అప్పుడు జగమంతా మాయచే రమింపజేయగల జగద్భూషణుడైన రఘురాముడు వసిష్ఠుని వైపు చెవులు సారించగా, చతుర్వేద సారమైన మహావాక్యాన్ని గురువుపదేశించాడు. పిదప వసిష్ఠుడు శ్రీరామునితో నీవు సర్వవ్యాపకుడవు, సర్వద్రష్టవు, పూర్ణబ్రహ్మవు, ఆత్మారాముడవు, అతీంద్రియుడవు, తురీయాతీతుడవు, జగత్తంతయు వ్యాపించివున్న మాయ నీ చిద్విలాసమే. ఎండమావులవలె నీ మాయ ఎన్నటికీ సత్యంకాదు. ఓ రాఘవా! వాస్తవానికి నీవు అన్నింట అలిప్తంగా ఉన్నావు. ఒకే సూర్యుడు వేరు వేరు కుండలలో ప్రతిబింబించినట్లు, కట్టెలలో నిద్రాణంగా అగ్ని వున్నట్లు, వాద్యాలనుండి ధ్వని ప్రకటమైనట్లు, కంఠంలో స్వరం నిక్షిప్తమైయున్నట్టు నీవు అంతటా వున్నా స్థూలదృష్టికి అగోచరుడవు. సర్వభూతాలయందు నీవే వ్యాపించి ఉన్నావు. అద్దంలో కనబడే బింబం ఉన్నా లేనట్లే. అలా ఓ రామా! ఈ విశ్వంలో నీ ఉనికి అట్టిదే! విశ్వమంతా నీవు వ్యాపించి ఉన్నా కనుగొనలేము.

"విత్తులో చెట్టు దాగినట్లు, నూలుపోగులో వస్త్రం దాగిఉన్నట్లు, నీటిలో అలలు ఇమిడి ఉన్నట్లు, సకల జగత్తు నీలో దాగి ఉంది. ఈ అనంత బ్రహ్మాండ జగత్తున నీ మాయాలీలా వినోదంతో మోహితులై విషయాలనే సుడిగుండాలలో మునిగితేలుతుంటారు. ఈ మాయా వికారాలనే ఎండమావుల వెంట తిరుగుతుంటారు. గంధర్వనగరం కనబడ్డా అది మిథ్య. ఈ ప్రపంచమే మాయ గారడీ. స్వప్నంలో సింహాసన మలంకరించడం, చిత్రంలో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లడం, అద్దంలో కనిపించే దివ్యహారాలను అలంకరించుకోవడం అంతా అసంభవాలు. ఎండమావిలో నీరు, గొడ్రాలికి సంతానం, ముత్యపు చిప్పతో చేసిన వెండిపాత్ర, చీకటిలో పట్టిన చేపలు, ఇవన్నీ ఎట్లా సంభవంకావో అట్లా ఈ కనబడే ప్రపంచమంతా మిథ్యయే!"

కంటిలోని బొమ్మ పుట్టుగుడ్డికి అభయమివ్వడం, ప్రళయకాలంలోని మెరుపులను దోమ మ్రింగడం, కుంటివాడు అంతరిక్షానికెగిరి ఆకాశం తోలు ఒలవడం, ప్రభంజనాన్ని చింపి పేలికలు చేయడం, అమావాస్య చీకటికి మసిపూయడం, దీపంతో ఎండకు ఆరతిబట్టడం, ఇసుకతో దారంచేసి పాము కాళ్ళు కట్టివేయడం, దీపంలోని రంగుతీసి వస్త్రానికి అద్దకం వేయడం, బడబానలంలో కాకి ఈదులాడడం – ఇవి అన్నీ ఎట్లా అసత్యాలో అట్లే కనిపించే యీ జగత్తు యొక్క సత్తా కూడా కేవలం మిథ్య. మాయా పెనుభూతం మర్మాన్ని తెలుసుకోవడం బ్రహ్మాదిదేవతలకూ తరంకాదు.

### మాయ మహిమ – గాధి కథ

ఈ మాయా కౌశల్యం మహా మహావారికే సంపూర్ణంగా తెలియదు. అయినా మాయ యొక్క కథను వివరిస్తాను. సావధానంగా విను. న్యాయశాస్త్రాన్ని సంపూర్ణంగా రచించిన గౌతమముని బహుప్రావీణ్యుడు. ఆతని శిష్యుడు గాధి పేరుప్రఖ్యాతులు గాంచినవాడు. ఆతడు చతుర్వేదాలు, షట్ శాస్త్రాలు చక్కగా నెరిగినవాడు. అతడు దివ్యానుష్ఠాన సంధానుడు. ఆతడికి విష్ణువు ప్రసన్నమై ఏమి వరం కావాలో కోరుకొమ్మన్నాడు. ఆ బ్రాహ్మణుడు వైకుంఠనాథునితో "ఓ హృషీకేశా! నీ మాయ ఎట్టిదో నాకు తెలుపవలసింది. అందరూ మాయ యొక్క మాయలో పడిపోతున్నారు. ఆ మాయ స్వరూపాన్ని నాకు తెలియజెయ్యమనగా, నారాయణుడు నవ్వి, "మాయాపాశం మహాదారుణమైనది. దీనికి శరణన్న వారికి భంగపాటుతప్పదు. దాన్ని నీవు చూడగలవా? ఈ ప్రపంచంలో అది అసత్యంగా గోచరిస్తుంది. ఇదే మాయ యథార్థస్వరూపం. తాడును చూచి పాము అనుకొన్నట్లు ముత్యపుచిప్ప మెరుపును చూచి వెండి అనుకొన్నట్లు దీని ప్రభావంవల్ల దొంగ కూడ సజ్జనుడుగా కనపడతాడు. స్వప్నంలోని సైన్యం మెలకువ రాగానే ఎలా మిథ్య అవుతుందో మాయకూడ అంతే" అని మాయాతత్త్వాన్ని వివరించాడు.

అప్పుడు గాధి ఆ వైకుంఠనాథునితో "మాయను గూర్చి గొప్పగా చెప్పావు. మాయ మిథ్య అంటున్నావు. మార్కండేయమహాముని బ్రహ్మాదిదేవతలను గూడ భ్రమింపజేశాడు. ప్రభూ! కన్నులారా ఒక్క క్షణం ఆ మాయను నాచే దర్శింపజెయ్యి" అని ప్రార్థించాడు. దానికి ఆ సర్వేశ్వరుడు ఒక్క నవ్వునవ్వి – మాయను చూడగానే నీవు పూర్తిగా భ్రాంతిలోపడి ఉక్కిరిబిక్కిరవుతావు. అప్పుడు నిన్నెవరు విడిపిస్తారు? నీ తెలివితేటలు పూర్తిగా నశించిపోతాయి. నీవు ఘోరమైన మాయా సుడిగుండంలో చిక్కుకుంటావు అని హెచ్చరించాడు. వెంటనే గాధి ఓ జగత్పతీ! నాకు ఒక వరమియ్యి, నేను ఉక్కిరిబిక్కిరి అయినపుడు, నిన్ను నాకు జ్ఞాపకం చెయ్యి. నేను నీ నామస్మరణ చేయగానే మామూలుస్థితి పొందేట్లు అనుగ్రహించు అని కోరాడు. తథాస్తు అని జగన్నివాసుడు తన స్వస్థానానికి వెళ్ళాడు.

ఓ రాఘవా! విను. ఒకానొకరోజు గాధి కుటుంబ సమేతంగా గంగానది ఒడ్డున విడిదిచేశాడు. మిట్టమధ్యాహ్నం గంగానదిలో స్నానమాచరించడానికి

ఒంటరిగా పోతూ మనసులో “ఈ చక్రపాణి నాకింకా ఎందుకు మాయను చూపించలేదు? ఆయన లీలా మర్మమేమిటో” అని అనుకుంటూ పాపపరిహారార్థం గంగానదిలో మునగగానే మాయపాశంలో చిక్కుకున్నాడు.

గాధికి మరణం ఆసన్నమయినట్లు తోచింది. దఃఖం పెల్లుబికింది. ఇంతలో యమభటులు వచ్చి యమపాశంతో గాధినీడ్చుకుని పోయారు. అసిపత్ర వనంలో నుండి కత్తుల బాటపై నడిపిస్తూ, కుంభీపాకాన, కాల్చిన ఇనుప స్తంభాలకు కట్టివేశారు. ఇంత దుఃఖాన్ని అనుభవిస్తూ కూడా ఆ బ్రాహ్మణుడు గంగానదిలో నిలబడి ఉన్నాడు. అటు పిమ్మట చండాలయోనిలో కంటజుడనే నామధేయంతో జన్మించాడు. భార్యా పిల్లలతో ఇరువదియైదు సంవత్సరాలు కాపురం జేశాడు. నానావిధాలైన హింసలు, గోబ్రాహ్మణుల హత్యలు, దారిదోపిడీలు చేసి, చాలా డబ్బు కూడబెట్టాడు. ఇంతలో కాలవశాన కుటుంబమంతా స్వర్గస్థులయ్యారు. తండ్రి, తల్లి, భార్యాబిడ్డలు అందరూ ఒకేసారి మరణించారు. ఆ కంటజుడు చాల దు:ఖపడి, విరక్తుడై ఈ సంసారం నాకిక అక్కర్లేదు అని తెగించి దురాచారాలను మిక్కుటంగా జేస్తూ దేశద్రిమ్మరై ఒకసారి కేరళ దేశానికి వెళ్ళాడు. ఆ సమయాన ఆ దేశపు రాజు హఠాత్తుగా మరణించాడు. అతడికి పుత్రసంతతి లేదు. మంత్రి ఆలోచించి నూతన రాజాన్వేషణకు పట్టపు ఏనుగుకు హారాన్నిచ్చి పట్టణ వీథులందు విహరింపజేయగా అది కంటజుని మెడలో హారం వేసింది. ఆ విధంగా కంటజుడు మహారాజై ఆరు సంవత్సరాలు రాజ్యమేలి ప్రజలనందరిని భ్రష్టులగావించి రకరకాలైన వారితో సంబంధం కలుపుకున్నాడు. ఒకరోజు కంటజుడు సిగ్గు, బిడియం లేక ఒంటరిగా రాజవీధిన పోతుండగా, ప్రధాని మొదలగు సేవకులు వెంటరాసాగారు. వారిని చూచి కంటజుడు కోపించి “నాతో ఎవ్వరూ రావద్దు. వెంటనే వెనక్కు వెళ్ళిపోండి” అని ఆజ్ఞాపించాడు. కానీ ప్రధాని, రాజు ఎక్కడకు పోతాడా అని కనిపెట్టడానికి రహస్యంగా



వెంబడించాడు. కంటజుడు పోయి అనామకులు, తాగుబోతులైన వారిని కలిసాడు. వాళ్ళు కంటజుని గుర్తించి వీడు మన బంధువే! ఈ రాజ్యం భ్రష్టం కావటానికి వీడే కారకుడు. ఈ సంగతి ఎవరికీ తెలియదు అన్నారు. కంటజుడు వారిని తీక్షణంగా చూచి “ఈ మాటలు ఎక్కడా అనకండి. అంటే కఠిన చర్య తీసుకొంటాను” అని అన్నాడు. మంత్రి మొదలగు వారు ఆ మాటలు విని రాజ్యం మొత్తం వీనివల్ల భ్రష్టమయ్యిందని కంటజుని కొట్టి తరిమివేశారు. తర్వాత ఏమి చేయడమా అని ప్రజలతో ఆలోచించి, శాస్త్రాలను పరిశోధించి ప్రాణత్యాగమే పరిహారమని నిర్ణయించి ప్రజలందరూ అగ్ని ప్రవేశం చేశారు. సకల మంత్రులు, స్త్రీలు, పురుషులు అగ్నిజ్వాలలో భస్మమయ్యారు. నగరమంతా జనశూన్యమైంది. ఇది చూచి కంటజుడు తాను చేసిన ఘోర పాపాలకు చాలా చింతించి, తాను కూడా అగ్నిలో దూకాడు. అప్పుడు కంటజుని వామభాగం కాలిపోగా బాధతో వెర్రికేకవేసి అగ్ని నుండి బయటకు దూకాడు. దాంతో గాధి నిజస్థితికి వచ్చాడు. గంగానది నుండి వెలుపలకు వచ్చి, కాలిపోయిన తన ఎడమభాగాన్ని గమనించాడు!

“నేను బ్రాహ్మణుడను. గాధిని. పాపపరిహారార్థం గంగాస్నానం చేస్తుండగా యింత దుఃఖం కలిగింది. యముడు నన్ను చాలా కష్టపెట్టాడు. చండాల యోనిలో పడవేసి ఆరు సంవత్సరాలు రాజ్యం చేయించాడు. లోకాన్నంతా భ్రష్టమొనర్చాను. లెక్కలేనంత మందిని మృత్యువు పాలు చేశాను. జరిగింది స్వప్నమని, అసత్యమని ఎలా తలచేది?” అంటూ గొల్లున ఏడవసాగాడు. జప తపాలను విసర్జించి, వేదాధ్యయనం మాని ఆశ్రమానికి తిరిగివచ్చి దుఃఖసాగరంలో మునిగాడు. అప్పుడు భర్తను జూచి, “నీ ఎడమ భాగం ఎలా కాలిపోయింది?” అని భార్య అడిగింది. ‘నాకు ఆ విషయం జ్ఞాపకం చేయవద్దు’ అని గాధి విలపించసాగాడు. ఒకనాడు తీర్థాటన చేస్తూ గురుబంధువు అకస్మాత్తుగా గాధిని కలిశాడు. గాధి వాని యోగక్షేమాలు విచారించి, “ఎందుకు

కృశించిపోయావ"ని అడిగాడు. దానికి ఆ గురుబంధువు యిలా బదులిచ్చాడు, "నేను దారుణమైన పాపం చేశాను. కేరళదేశంలోని ఒక నగరంలో శిథిలమైన మానవ దేహ అవశేషాలు తప్ప ఇంకేమీ లేవు. అక్కడ ఒకరింటిలో నేను భుజించాను. వాళ్ళను విచారించి జరిగింది తెలుసుకున్నాను. ఆ పట్టణాన్ని కంటజుడను అంత్యజుడు వచ్చి భ్రష్టమొనర్చాడని, అందరి ప్రాణాలు తీసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడని తెలిపారు. అటువంటి పాపిష్ఠనగరంలో నేను భుజించాను. ఆ పాపం పోవడానికి పన్నెండు సంవత్సరాలు తీర్థాటన చేస్తున్నాను" అని ఆ గురుబంధువు కాశీయాత్ర వెళ్ళాడు.

గురుబంధువు చెప్పిన విషయాలు యథార్థమా, కాదా అని పరిశీలించడానికి కేరళ దేశంలోని ఆ నగరానికి గాధి వెళ్ళాడు. అతడు చెప్పినట్లు అంతా యథార్థమని గ్రహించాడు. ఎక్కడ అంత్యజుడిగా జన్మించాడో అక్కడకు వెళ్ళగా ఆబాలగోపాలం, "కంటజుడు ఇక్కడే నివసించాడు. అతడు ఆరు సంవత్సరాలు రాజ్యంచేసి, నగరాన్ని పూర్తిగా భ్రష్టమొనర్చి, మొహం చెల్లక ఎటో వెళ్ళిపోయాడు" అని తెలిపారు.

గాధి ఆశ్రమానికి తిరిగివచ్చి "నాలో బ్రాహ్మణత్వం ఇంకా ఎక్కడ మిగిలింది? రౌరవాది నరకాల పాలయ్యాను అని నెత్తి నేలకేసి కొట్టుకొంటూ, జగద్విఖ్యాతుడైన గౌతముని శిష్యుడైన నాకెందుకీ గతి పట్టింది? దీనికి కారణం ఎవరిని అడగాలి? అసత్యమని అనుకోవడానికి, అన్నీ ప్రత్యక్షంగా కనబడతున్నాయి. జన్మ, కర్మ, దుష్కృత ఫలాలు ప్రత్యక్షంగా చూశానుగదా! ఇది సత్యమా! అసత్యమా! నాకు ఎవరు విప్పి చెప్పగలరు! ఎవరిని శరణువేడేది? నా బ్రాహ్మణ్యం మంటగలిసింది. నేను ఇప్పుడేం చేసేది. ఓ వైకుంఠవాసా, నన్ను రక్షించు! కరుణాకరా, ఆశ్రితవత్సలా, సర్వేశ్వరా, రాజీవలోచనా పరుగున వచ్చి నన్ను రక్షించు!"అని జగద్గురుని శరణువేడాడు.



అప్పుడు ఆ జగదాధారుడు ప్రత్యక్షమై "ఓ గాధీ, సావధానంగా విను. నా మాయ బహు జటిలమైనది. బ్రహ్మాది దేవతలకే అది అగోచరం, అతర్క్యం. నీవు అన్నీ తెలుసంటావ్! ఇప్పుడు చెప్పు. మాయ సత్యమా? అసత్యమా? ఎందరో ఋషులు దీనిని గూర్చి బహు తర్కవితర్కాలు చేసి కూడా ఒక నిర్ణయం చేయలేకపోయారు. సదా జ్ఞానబోధ చేస్తుండే మహాజ్ఞానులు కూడ మాయ మిథ్యయని అంటారు. అట్టి వారు సైతం ఈ మాయ అనే వరదలో కొట్టుకుపోయి ఖిన్నులవుతున్నారు. ఇప్పుడు ఈ మాయను నీకు కొంచెం రుచి చూపించానంతే! ఇంకా ముందు ముందు ఎన్నో అద్భుతాలు చూస్తావు" అన్నాడు. వెంటనే గాధి పరుగున ఆ జగదీశుని చరణాలపైబడి, "స్వామీ! నాకిది చాలు. నన్ను ఇక వదలిపెట్టు!" అని వేడుకున్నాడు. అప్పుడా వరదహస్తుడు తన అభయహస్తాన్ని గాధి శిరస్సుపై ఉంచి ఆత్మబోధ గావించాడు. స్వప్నంలో నుండి జాగృతికి వచ్చినట్లు చీకటి పోగానే సూర్యుదుదయించినట్లు, ఆత్మబోధ తర్వాత మోహ, భయ, వికల్పాలన్నీ తొలగి, గాధి సావధానచిత్తుడయ్యాడు.

"ఆవిధంగా గాధి ఉద్ధరింపబడి, తన నిజస్థితిని తెలుసుకున్నాడు. ఓ రామా! మాయను గురించి తెల్పడానికి ఈ కథను వివరించాను" అని వసిష్ఠుడు పలుకగా, రాముడు "ఈ మాయలో బడటానికి కారణమేమిటి? నిర్వికారము, నిర్గుణము అయిన మాయకు స్వరూపంలో స్ఫురణ ఎక్కడిది? అండపిండ బ్రహ్మాండంలో నానావిధ యోనులు, వర్ణాలు, తినుబండారాలు, అన్నీ మాయేనా? అంతా మిథ్యేనా? నిర్గుణం సగుణరూపం తాలుస్తుంది. అవ్యక్తం వ్యక్తమవుతుంది. అనామకం నామం ధరిస్తుంది. అనంగులకు అంగాలు వస్తాయి. ఇవన్నీ మాయాలీలలేనా?" అన్న శ్రీరాముని ప్రశ్న విని మిక్కిలి ఆనందించిన వసిష్ఠుడు ఇట్లన్నాడు: "నాయనా! నీవు పరిపూర్ణమైన చైతన్య బ్రహ్మవు. అన్నీ తెలిసికూడా నన్ను ప్రశ్నిస్తున్నావు. ఓ రామా! దివ్యజ్ఞానమే

నీవు. అట్టి నీకే నేను తిరిగి చెప్పవలసి వచ్చింది. కల్పతరువు నుండి కోసిన పండ్లు దానికే నైవేద్యం పెట్టినట్టు, కనకాద్రి నుండి బంగారం దీసి దానికే అలంకరించినట్లు, క్షీరసాగరంలోని పాలను తీసి దానికే అర్పించినట్లు, సముద్రంలోని నీటిని మేఘాలు పీల్చి వర్షరూపంలో దానికే సమర్పించినట్లు, జ్ఞాన ప్రదాతవైన నీకు నేను ఏం చెప్పగలను? అయినప్పటికీ నీవు ప్రశ్నించావు కనుక చెబుతాను. ఓ రామా! స్వరూపంలో మాయ యొక్క స్ఫురణ గూర్చి నీకు కొన్ని దృష్టాంతాలు వివరిస్తాను విను. "ఎవ్వరైనా, నిద్రించేటప్పుడు పూర్తిగా చింతారహితుడై ఉంటాడు. స్వఇచ్ఛతో మెలకువ చెందినవాడు, చేయవలసిన కార్యాలగూర్చి బాగా జ్ఞాపకం తెచ్చుకుంటాడు. సముద్రంలో తరంగాల హెూరు, ఆకాశంలో పుట్టిన ధ్వని, పెద్ద ఘోషగా మారుతుంది. ఇది నిశ్చయం! ఇదే మాయ. ఓ బ్రహ్మానందా! విను. నిశ్శబ్దంలో నుండి శబ్దం పుడుతుంది. ఆ ధ్వనినే మాయ అని వేదాంతశాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

### వేదాంతభాగ నిరూపణ

"దేన్నైతే మూల ప్రకృతి అంటామో అదే ఆదిపురుషుని చిత్ – శక్తి. ఆ మూల ప్రకృతి తన భర్తయిన ఆదిపురుషునితో శయనించి సృష్టికార్యాన్ని ప్రారంభించింది. వారి కలయికచే ఈ బ్రహ్మాండమంతా సృష్టించబడింది. ఆ కుటిలమైన మూలప్రకృతి ఆదిపురుషుని కన్నుగప్పి లేని దైవాలను సృష్టించింది. త్రిమూర్తులను నియమించింది. అందరిని తన మాయలో పడవైచి తన స్వరూపాన్ని చూడటానికి కూడ వీలులేకుండా చేస్తోంది. బ్రహ్మసుఖమనే సముద్రంలో ఈ జీవరాసులన్నీ మునిగిపోయాయి. దానిలో మాధుర్యాన్ని అనుభవించడానికి ఎవ్వరికి అవకాశం చిక్కలేదు. చైతన్యాన్ని బహిర్గతం కానీయక రూపంలేని వాటికి రూపాన్నిచ్చి పేరు లేని వాటికి పేరును ఆపాదించింది.



ఈ అనంత బ్రహ్మాండంలోని జీవకోటిని బొమ్మలవలె ఒక సూత్రంతో ప్రకృతి ఆడిస్తున్నది. నిర్గుణానికి గుణాన్నాపాదింపజేసింది. ఈమె నిరాకారానికి ఆకారాన్నిచ్చి జీవింప జేసింది. భర్తకు తెలియజెప్పకనే గర్భవతి అయి ఈ పరమపతివ్రత బ్రహ్మాండాన్నంతా రచించి, నానా వికారాలు కలిగించి, అనంతకోటి జీవరాసులను ఒక త్రాటిపై ఆడిస్తున్న ఆమె ప్రతిభ అమోఘం. అతి నేర్పుతో యీ మాయ కర్తృత్వమే లేకుండా గాధికి అనుభవాన్ని చాటిచెప్పింది!

ఎవరైనా అంతర్ముఖుడై తన నిజ స్వరూపాన్ని తెలుసుకోదలిస్తే అతనికి లేనిపోని ఇక్కట్లు కలిగించి, లేదా స్వర్గసుఖాలందించి, ధనమిచ్చి, అతని లక్ష్యాన్నించి మరపిస్తుంది. ఆత్మనెరిగి శాశ్వతానందాన్ని పొందాలనుకొనే జీవునికి దానిని అప్రియం చేసి, భ్రమింపజేసి విషయాదులలో మోహాన్ని కల్పిస్తుంది. గుణక్షోభిణియైన ఆదిశక్తే త్రిగుణాలను సృష్టించింది. అవే సత్వరజస్తమో గుణాలు. అవే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. ఆ ఆదిశక్తి త్రిశక్తులుగా మారి ఆ ముగ్గురిలో చేరిపోయింది. జ్ఞానశక్తి పటిమవల్ల జ్ఞానపంచకాలు నిర్మితి పొందాయి. వాటినే అంత:కరణ చతుష్టయాలు అని తత్త్వవేత్తలంటారు. క్రియాశక్తి వల్ల రజోగుణం ఉద్భవించింది. అది మూడు పంచకములు. 1) జ్ఞానేంద్రియపంచకము 2) కర్మేంద్రియ పంచకము 3) వాయుపంచకము. తమస్సు ఆధారంతో విషయపంచకము నిర్మితి పొందింది. వాటిని పంచతన్మాత్రలంటారు. ఇటువంటి ఇరవైఐదు తత్త్వాలను తగు పాళ్ళలో మిళితంచేసి బ్రహ్మాండాన్ని సృష్టించింది. బ్రహ్మాండ భాండాన్నంతా పలువిధాలుగా బ్రహ్మ, వివిధ వస్తువులను గనులనుండి వెలికి తీసినట్లు, ఎనుబదినాలుగు లక్షల జీవరాసులను సృష్టించాడు.

బ్రహ్మ ఈ ప్రకారం బ్రహ్మాండాన్ని సృష్టితో నింపగా విష్ణువు వాటిని సంరక్షిస్తుంటాడు. సమయోచితంగా దశావతారాలెత్తి భక్తులను సంకటాల

నుండి నివృత్తి చేస్తాడు. సృష్టిలోని దోషాలన్నింటిని నివారించటానికి లయ కారకుడైన ఈశ్వరుడు ఎప్పటికప్పుడు క్షాళన చేస్తాడు. ఆ విరాట్ స్వరూపుని రచనే బ్రహ్మాండం. శివుని స్థూలపాదస్పర్శ క్రింద పాతాళం, దానిక్రింద రసాతలమున్నదని నిర్దుష్టమైన జ్ఞానప్రాప్తి కలిగిన సాధు సత్పురుషులు చక్కగా తెలియజెప్పగలరు. ఇది విని సాధు సజ్జనుల సముదాయం పరమానందభరితమయింది.

## విరాట్‌స్వరూప వర్ణన

"ఆ విరాట్ స్వరూపుని పాదద్వయంలో మహాతలము, పిక్కల్లో తొడల్లో వరుసగా తలాతలము, వితలము, నడుమున మహీతలము, గుదస్థానమున నైరుత్య లోకము, దక్షప్రజాపతి శిశ్నమున, పరగడుపున నభోమండలము, మహా కల్లోలభూయిష్ఠమయిన బడబానలమే జఠరాగ్ని. సప్త సముద్రాలు ఉదరాన, వక్షఃస్థల జ్యోతిర్లోకము, కంఠంలో మహర్లోకము, వదనంలో జనలోకము, నాలుకలో వరుణలోకము, చిగుళ్ళలో యమలోకము, ముక్కున అశ్వనీ దేవతలు, భృకుటిలో భువర్లోకము, కపాలంలో తపోలోకము, శిరస్సులో బ్రహ్మలోకము, కళ్ళలో సూర్యలోకము ఉండగా ప్రకాశమానంగా బ్రహ్మాండము నిండివుంది! కళ్ళు తెరిస్తే వెలుగు, కళ్ళు మూస్తే చీకటి. అన్నిపనులు చేయు రెండు చేతులయందు అమర్లోకము నిండివుంది. మనస్సు చంద్రుడుగ, సకల వృక్షజాతులు రోమాలుగా, చర్మము ప్రభంజనముగ, బంకమట్టియే మాంసముగ, నాడీచక్రము గంగగా, పృష్ఠభాగమంతా అధర్మముగ, సద్బుద్ధి కలిగిన శిరోభాగము బంగారు కొండగ, ఎముకలు పాషాణముగ తెలుసుకో! ఎర్రని రక్తం నురుగుగా, మంచు మూత్రము, నీరు రక్తము, పాషాణగర్భమే మజ్జ. వర్షం శివుని రేతస్సు. కరువు ఆకలి అని తెలుసుకో! జలం ఇంకిపోవటమే దాహంగా, శీతాకాలం అలసత్వంగా, వర్షాకాలం నిద్ర, ఎండాకాలం మైథునంగా ఉంటాయి. ఆ ఉష్ణానికి వానలు కురుస్తాయి.



ఝంఝామారుతంగా వీయడం గాలి నైజం. ఆ సుడిగాలులు దశదిశలకు వ్యాపించి వాటి ధర్మాన్ని నెరవేరుస్తాయి. వాయువు స్తంభిస్తే సర్వం ముకుళిస్తుంది. వాయు నిరోధం వలన ఉక్కపోస్తుంది. జడివాన కామపూర్ణం. క్రోధశోకాలే మహాఅనర్థాలు. మోహం సృష్టిని పాలించడం. భయం మృత్యువని తెలుసుకో.

ఓ రాఘవా! వేదమే విరాట్ పురుషుని నిజస్వరూపం. పీతాంబరం అంతఃకరణానికి , చంద్రుడు మనస్సుకు, బ్రహ్మ బుద్ధికి, చిత్తం నారాయణునికి ప్రతీకలని తెలుసుకో. దేవదత్తం ముఖ్యప్రాణం. ధనుంజయుడు పాతాళం. దిక్కులే చెవులు, వాయువు అతని చర్మం, అగ్నియే అతని వదనం, చరణాలు పాతాళంలోని వామనుడు. ఆ విధంగా విరాట్ పురుషుడు సంపూర్ణంగా, సప్తావరణాలలో నిండిఉంటాడు.

భూగోళము దశగుణములతో ప్రబలిఉంది. పైకి కనపడేదంతా పృథ్వీతత్వము. దానికి పదింతలు సముద్రజలము ఆవరించుకొని ఉంది. ఉదకం కంటె పదింతలు మహానలం ప్రజ్వరిల్లుతోంది. దానికి పదింతలు అనిలం (వాయువు) నిండి ఉంది. వాయువుకు పదింతలు ఆకాశం, ఆకాశానికి పదింతలు దట్టంగా అహంకారం పరివేష్టించి వున్నాయి. అహంకారానికి పదింతలు మహత్తత్వం నిండి వుంది. తుదకు దానికి పదింతలు మాయ ఆవరించుకుని ఉంది. ఆ మాయకు కూడా ఆవల ఏముంది? స్వరూప నిర్వాణమే! అది ఇంత అంత అని, చిన్న పెద్ద అని వర్ణించ వీలులేనిది. ఆ మాయలీల వర్ణించనలవికానిది – చివరగా దానిశక్తిని మరోసారి వివరిస్తాను. దానినే వేదాంతశాస్త్రాలన్నీ పంచప్రళయాలన్నాయి.

ఈ జీవునికి ప్రతినిత్యం ప్రళయం సంభవిస్తుంది! అదే నిద్ర! అన్ని తత్వాలు సమంగా కూడిన స్థూలలింగ దేహాలు నిద్ర అనే సముద్రంలో

మునిగిపోతాయి. ఇదే నిత్యప్రళయం. మహాప్రళయమనేది మరణం. మరణం వల్ల ఈ స్థూల దేహం నశిస్తుంది. ఇది అందరూ చూచేదే! బ్రహ్మాండ ప్రళయం కూడ తప్పదు. నాల్గు యుగాలు వేయిమార్లు ఆవృత్తం అయిన తరువాత ప్రళయం వస్తుంది. అప్పుడు బ్రహ్మ నిద్రావస్థయందుంటాడు. అప్పుడు సృష్టిక్రమం ఆగిపోతుంది. సృష్టి నశించిన తరువాత ఒక క్షణంలో సర్వం జలమయమవుతుంది. బ్రహ్మాండమునందలి ముప్పదిరెండు లక్షల గ్రామాలూ నీటిలో మునిగిపోతాయి. ఏడుగురు చిరంజీవులు కూడ అందులో మునిగిపోతారు. సత్యలోకం కూడ నీటితో నిండిపోతుంది. అప్పుడు ఆ పరాత్పరుడు వటపత్రశాయి అవుతాడు. బ్రహ్మ ఆయన నాభి కమలాన నిద్రిస్తుంటాడు. నీరంతా తగ్గి, యథాస్థితికి వచ్చిన తరువాత బ్రహ్మ మేల్కొని తిరిగి సృష్టి చేయనారంభిస్తాడు. ఈ వివరణ వేదంలో ఉన్నదే. యథావిధి సృష్టి కార్యం నడుస్తుంది. అంతా యథాపూర్వకంగా మొదలవుతుంది. ఆ విష్ణుమూర్తి కూడా పూర్వంవలె అవతారాలెత్తుతాడు. నిత్య ప్రళయం సంపూర్ణమైన తర్వాత, దారుణమైన మహాప్రళయం వస్తుంది. అప్పుడు నూరు సంవత్సరాలు మేఘాలు వర్షించవు. అందువల్ల జీవసృష్టి అంతరించిపోతుంది. వెంటనే ద్వాదశ (మిత్రులు) సూర్యులు ఉదయిస్తారు. తీవ్రమైన బడబానలం భూమండలాన్నంతా కాల్చివేస్తుంది. ఆ భూమి తాపం నాగేంద్రుని ముఖతా జ్వాలారూపాన వెలువడి పాతాళలోకాలన్నింటిని భస్మం చేస్తుంది.

ఆ తదుపరి నూరు సంవత్సరాలు జలపాతంనుండి ఎడతెగక నీరు వచ్చినట్లు ఏకధారగా మేఘాలు వర్షిస్తాయి. ఆ ప్రకారం జగత్తంతా కరిగిపోతుంది. తేజోమయమయిన అగ్ని క్షణకాలంలో జలాన్ని ఇంకింపజేస్తుంది. అగ్నితేజాన్ని వాయువు క్షణంలో మ్రింగుతాడు. అద్భుతమైన ఆ గాలిని ఆకాశం మింగివేస్తుంది. దానిని తమోగుణం గ్రహిస్తుంది. తమోగుణాన్ని రజోగుణం గ్రహిస్తుంది. రజోగుణం సత్వగుణంలో



లీనమవుతుంది. సత్వం మహాసత్వంలో కలసి మాయలో సమరసమవుతుంది. మాయ స్వరూపంలో లీనమవుతుంది. స్వరూపానికి స్వరూపమే సమాధానం. పరిపూర్ణమైన ఆ బ్రహ్మానంద తత్వాన్ని వేదశాస్త్రసాలు గూడ వర్ణించలేవు. నిర్గుణ, నిర్వికార, నిరుపమ, పూర్ణ, శాంతి యోగక్షేమాలతో పరిపూర్ణంగా నింపి, ఆశ్చర్యకరంగా తిరిగి సృష్టిక్రమాన్ని రచిస్తుంది. ఓ రాఘవా! నీవు పరిపూర్ణమైన నటనాకౌశల్యాన్ని ప్రదర్శిస్తున్నావు. సచ్చిదానందమే సత్యం. దానిని వర్ణించడానికి మాటలు చాలవు. ఓ శ్రీరామా! సర్వాలంకారాల్ని విసర్జించి నిర్వికారుడవైనావు. అండ, పిండ, బ్రహ్మాండమంతా నీలో ఇముడ్చుకున్నావు. ఇక ఎక్కడి వైకుంఠం? ఎక్కడి కైలాసం? మాయా విలాసాలన్నీ నీలోనే వున్నాయి. శేషశాయివని జగన్నివాసుడవనే భ్రమ కూడా తొలగిపోయింది. ప్రతి సృష్టిలో కల్పాంతాన నీవే ఆ వటపత్రశాయివని, సర్వేశ్వరుడవని, ఆ వేదాలు ఘోషిస్తున్నాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా నీలో భాగాలే. నీ నిర్వికారస్వరూపమే చివరకు మిగిలేది! – అందువలన ఓ రాఘవా! నీవు నిర్వికల్పుడవు, అభేద్యుడవు, నిరాకారుడవు, పరిపూర్ణమైన ఆత్మారాముడవు.

అలా తన స్వరూపాన్ని వసిష్ఠుడు పూర్తిగా నిర్ధారణ చేసిన పిదప శ్రీరామచంద్రుడు కన్నులు మూసుకుని బ్రహ్మానంద సాగరంలో లీనమయ్యాడు. వసిష్ఠుడు కూడ ఆనందసాగరంలో ఓలలాడాడు. మాటలు మరచి గురు శిష్యులు ఏకరూపులయ్యారు. గురు శిష్యబంధం దైవభక్త సంబంధమయ్యింది. శ్రీరాముడు రాజసాన్ని వదలి తన స్వరూపంలో విశ్రాంతి పొందాడు. వసిష్ఠమహర్షి ఆత్మస్థితి, రఘునాథుని ఆత్మస్థితిని ప్రతిబింబించింది. పదునెనిమిది దినాలు అలా శ్రీరాముడు సమాధిస్థితిలో వున్నాడు. తన అవతార కారణాన్ని మరచి నిర్వికల్ప స్వరూపంతో సమరసమయ్యాడు. శరీరం అచేతనమయింది. హృదయం ప్రాణాన్ని ఆకర్షించింది? ఇదంతా చూచి

దశరథుడు గొప్ప అనర్థం సంభవించిందని మిక్కిలి కలవరపడ్డాడు! విశ్వామిత్రుడు కూడా “అవతార సమాప్తి అయిందా ఏమి? బంధించబడిన దేవతలను విడిపించ ఎవరితరం? ఇక నా యాగరక్షణ ఎట్లు? శ్రీరామచంద్రుడు అచేతనుడై ఇవాల్టికి పదునెనిమిది రోజులు గడిచాయి. రఘునాథుడింకను సావధానుడు కాలేదు!” అని లోలోన మథనపడసాగాడు.

బ్రహ్మజ్ఞానాన్ని గురుముఖతా విన్న రాముడు నిర్వికారుడయ్యాడు. అప్పుడు విశ్వామిత్రుడు వసిష్ఠుడికి నమస్కరించి “ఓ మహానుభావా! బ్రహ్మసుతా! రఘునాథుని సావధానపరచు. రాముడు ఎన్నో అవతార కార్యాలు చేయవలసి ఉన్నదని నీకూ తెలుసును గదా!” అన్నాడు. అప్పుడు వసిష్ఠుడు “ఓ రామా! సావధానుడవుకా! ఓ మేఘశ్యామా చిదానందా! పూర్ణబ్రహ్మా! యాగరక్షణకు బయలుదేరు! నీ స్వరూపాన్ని తెలుసుకో! సుఖంగా ధర్మమార్గంలో నడిచే సజ్జనులను రక్షించు! దుష్టక్షయం గావించు. వెంట్రుకలు, గోళ్ళు వద్దన్నా పెరుగుతాయి. వాటిని ఛేదించిన తరువాత ఎలా సుఖం కలుగుతుందో, అలా దుష్టులయిన ఈ రాక్షసులను వధించు, సమాధి తురీయ ఉన్మనీ స్థితులను దాటి, ఆనందఘనుడవై వర్ధిల్లు. తటస్థ స్థితిని వదలి, సమాధి నుండి మేల్కొని, భోగివి, రాజయోగివి, సర్వసంగుడవు, నిస్సంగుడవు అయిన నీవు బాహ్యస్మృతికి రా!

భ్రమ యందుండే వానికి, జగత్తంతా భ్రమగానే భాసిస్తుంది. బ్రహ్మాండమంతా భ్రమగా కనిపిస్తుంది. చివరికి ఆ భ్రమయే మృత్యువవుతుంది. ఈశ్వరుని స్వరూపమే నిర్వాణము. ఈ భ్రమచే దీనుడనైన నాకు ఏమీ తెలియదు. నేనెవరిని? ఈ జగత్తులో ఎవరికి ఎవరు? భ్రమలో మనం దేనిని తెలుసుకోలేం. భ్రమచేతనే జననమరణాలు కలుగుతుంటాయి. భ్రమ వల్లనే అధ:పతనమౌతాము. ఆ భ్రమ నుండి బయటపడగలిగితే మిగిలేది నేను? అదిగాక రెండవది లేదు! బ్రహ్మస్వరూపం నొందిన తర్వాత త్రిభువనమంతా



బ్రహ్మస్వరూపంగానే కనబడుతుంది. శత్రువులు, మిత్రులు, పెద్దవి, చిన్నవి అంతా బ్రహ్మరూపంగానే కనబడుతాయి. నీటితో నిండిన బిందెలు, కుండలు, బానలు ఎన్నున్నా అన్నింటిలో సూర్యుడు సమానంగా ప్రతిబింబిస్తాడు. భేదముండదు. కల్పాంతాన గూడ సూర్యునికి లింగభేదము లేదు. బంగారం నిజమైనది. ఆ బంగారుతో చేసిన అలంకార ఆభరణాలు కల్పితాలు. అలలు మిథ్య. సాగరమే సత్యం. వస్త్రం మిథ్య. పోగులు సత్యం. అట్లే చరాచర సృష్టి అంతా బ్రహ్మరూపం. ఇది నిజం. ఘటాలు వేర్వేరు కాని ఆకాశం ఒక్కటే. దారం ఒక్కటే కాని పూసలు మెండు. మాతృకలు ఎన్నోగాని ఓంకారమొక్కటే. అలాగే ఆ పరబ్రహ్మ ఒక్కడే నిత్యము, సత్యము – హృదయంలో గ్రంథులన్నీ స్పందించిన వేళ సంశయనివృత్తి పొందుతుంది. జ్ఞాన పూర్ణమైన కర్మచేతనే బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. ముల్లోకాలన్నీ బ్రహ్మరూపమే. కర్మజ్ఞానాలనే రెండు రెక్కలతో జీవుడనే పక్షి బ్రహ్మానందమనే ఆకాశాన ఎగురుతుంది. కర్మను, బ్రహ్మను ఒకటి చేసి స్వానందమనే వనంలో విహరించాలి. ఓ శ్రీరామా! మనస్సులో కలిగే సకల దుఖాలను నివారిస్తే అదే పూర్ణసమాధి! తటస్థతయే ఉపాధి. ఇది తెలుసుకో. ఈ అనుభవం కలిగితే అంతా ఏకమై తోస్తుంది. అంతరంగాన బ్రహ్మజ్ఞానంతో నిండి, బాహ్యంలో భిన్నంగా కనబడుతూ అంతరంగాన బోధను పూర్ణంగా నింపి, వెలుపల జడత్వాన్నభినయించాలి. అంతరంగాల్లో పూర్ణత్యాగమయుడై బయట లౌకిక వ్యవహారం చేస్తుండాలి. అంతరంగంలో నిస్సంగుడై, విషయములందు విరక్తి కలిగి నడవాలి.

“ఓ శ్రీరామా! బయటకు లోభివలె ఉంటూ లోన సమసమత్వం కలిగినవాడే నిజమైన సాధకుడు. అట్టివాడు లోకంలో ఉండిగూడ లేనట్లే. బీజం నుండి గొప్పగా కొండంత మఱ్ఱిచెట్టు ఎలా పైకి వస్తుందో అలా ఆత్మ నుండి ఈ చరాచర సృష్టియంతా ఉత్పన్నమైందని గ్రహించి మెలగాలి. పోగులు వస్త్రం ఒకటే. మట్టి కుండా రెండూ ఒకటే. ఆ రెండింటికి తేడా లేదు. అలాగే

జగత్తు జగదీశ్వరుడు భిన్నం కావు. ఓ రాఘవా! ఈ జ్ఞానాన్ని తెలుసుకొని నిర్వికారుడవై సదా వర్ధిల్లు.”

“ఓ రామా! అవిద్య ఒక మహాఘోర రాక్షసి. నిజమైన ఆత్మధనుడికి ఇది అంతరాయం. దానిని అఖండమైన గురుకృపతో ఛేధించాలి. ఓ రఘురామా! సంసారమనే సముద్రానికి తీరం కనపడదు. ఆత్మ విచారం చేసే సాధకుడు గురుకృప అనే నావలో నివృత్తి అనే తీరం చేరి, సమరసభావంతో ఆత్మ ప్రకాశం పొందాలి. అభ్యాసం లేని విద్య ఎంత గొప్పదైనా ఎందుకూ కొరగాదు. జ్ఞానకళ అలాంటిదికాదు. ఎంతటి బలహీనులనైన అది తన స్పర్శ చేత తరింపజేస్తుంది. లోహానికి పరుసవేది తగిలితే బంగారంగా మారుతుంది. మళ్ళీ అది లోహంగా మారలేదుకదా? అలాగే ఆత్మజ్ఞానం పొందినవారికి ఇక జననమరణాలెక్కడైన ఉంటాయా? ఉండనే ఉండవు!

జ్ఞానమార్జించి సాధకుడు గురువచనాన్ని నిర్దుష్టంగా పాటిస్తూ అకార్యాలు చేయక సన్మార్గాన వర్తించాలి. ఓ రామా! గురువంటే ఎవరు? గురువు తత్త్వవేత్తయై, పూర్ణానుభవం కలిగి ఉండాలి. శిష్యుడు విచక్షణా జ్ఞాన నిపుణుడై సద్బుద్ధి కలిగి ఉండాలి. ఆత్మబోధయనే వజ్రంతో జనన మరణ దు:ఖపర్వతాలను పిండిచేయాలి. ఇవన్నియు మోక్షమనే చెట్టుకు బీజాలవంటివి. కర్మలనాచరిస్తూనే ఆంతర్యంలో అద్వైతజ్ఞానం కలిగి దుర్గతులను వదలి ధర్మమార్గాన పయనించాలి. ఎవరైతే నిర్మల మనస్కుడో వాడు పరమపవిత్రుడు. సదసద్వివేకం కలవాడే పండితుడు. గురుభక్తిలేనివాడు విషం తాగినవాడితో సమానం. వేలాది గ్రంథాల వల్ల ఏం ప్రయోజనం? పరోపకారమే పరమధర్మం. పరులను పీడించుటే అధర్మం. ఈ కారణాల వల్ల, నాయనా! శ్రీరామా! సమాధి నుండి లేచి ధనుర్బాణాలు గైకొని యాగరక్షణకు బయలుదేరు!”



సద్గురు వచనాలు విని రాజీవనయనుడైన శ్రీరాముడు చిరునవ్వుతో కన్నులు తెరచి విన్నదంతా మననం చేసుకున్నాడు. సద్గురువుకు నమస్కరించి ముమ్మారు ప్రదక్షిణం గావించి అష్టభావాలు ముప్పిరిగొనగా గద్గద కంఠుడయ్యాడు. అప్పుడు వసిష్ఠుడు “ఓ రామా! ఇక నీ లీలలు చూపించు!” అన్నాడు. గురువాజ్ఞను శిరసావహించి, గురువుకు ప్రణమిల్లి కార్యసాధనకు ఆయత్తుడై, లక్ష్మణ విశ్వామిత్ర సమేతుడై, రఘునాథుడు దివ్యరథంలో సుముహూర్తాన సిద్ధాశ్రమానికి బయలుదేరాడు. దశరథుడు, వసిష్ఠుడు గంగాతీరం వఱకు సాగనంపారు. శ్రీరాముడికి మంచి శకునాలు ఎదురయ్యాయి. వసిష్ఠుడు రాజైన దశరథునికి శకునాల బాగోగుల గురించి వివరించి, రాముడు విజయలక్ష్మితో సుఖప్రదంగా అయోధ్యకు తిరిగి వస్తాడని పలికాడు.

ముందు కథ అమృతం కంటే మధురం. “రామవిజయం” వజ్రాలఖని. ఆరవ అధ్యాయం అలౌకికమైన అమూల్యవజ్రం. ఇది శ్రద్ధాళువులైన శ్రోతల హృదయ ఫలకంపై తళతళా మెరుస్తుంది. అందువల్ల సజ్జనులైన శ్రోతలు ఆనందంలో ఓలలాడుతారు! శ్రీరామచంద్రా! శ్రీధరవరదా! సద్గుణ సాగరా! రఘువరా! ఈ ఆరవ అధ్యాయం ఎప్పటికీ నా హృదయమందు వసించుగాక స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన పండితులు సదా అవలోకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఆరవ అధ్యాయం మధురం**

# అధ్యాయము - 7

## శ్రీగణేశాయ నమః

**సూ**ర్యవంశ ప్రకాశకా! కమలనయనా! విరించిజనకా! పతితపావనా! శ్రీరామా! పరమేశ్వర ధ్యానగమ్యా! భక్తవత్సలా! అనంతరూపా! త్రిభువనపాలకా! దీనదయాళూ! రఘుపతీ! అవిద్యారణ్యదహనా! కౌసల్య గర్భ జనిత అనర్ఘరత్నా! జగదుద్ధారకా! మునిజనరంజనా! దుర్జనభంజనా! రాఘవేశా! నీకు జయము జయము.

### తాటకి వధ

గత అధ్యాయంలోని కథాక్రమము ననుసరించి విశ్వామిత్రుడు రామలక్ష్మణులను యాగ సంరక్షణార్థం వెంటబెట్టుకొని వెళ్ళాడుగదా? దారిలో వారు గంగాస్నానంచేసి వేదోక్తంగా సత్కర్మలను, నిత్యానుష్ఠానాలను ఆచరించారు. ధనుర్విద్యా సంబంధమైన నానావిధమంత్రాలు, అస్త్రాలు సంధించే సమయ సందర్భాలు, సకల శస్త్రాలు యుద్ధంలో ప్రయోగించే నానావిధరహస్యాలు, సకల కౌశలాలు విశ్వామిత్రుడు శ్రీరామున కుపదేశించాడు. బోధించిన వెంటనే శ్రీరాముడు వాటిని కరతలామలకం కావించుకొన్నాడు. ఆయా అస్త్రాది దేవతలు ప్రత్యక్షమై, రాముని చరణాలకు మోకరిల్లి, సరోవరజలంలోని చల్లదనంలా, రామునిలో లీనమైనారు.

ధీమంతుడైన శ్రీశ్రీరాముని మనోధైర్యాన్ని పరీక్షించేందుకు గాధేయుడిలా అన్నాడు: “ఓ శ్రీరామా! మనమిప్పుడు సిద్ధాశ్రమానికి పోయే మార్గమధ్యంలో వున్నాం. ముందు మార్గాన్ని తాటక ఆక్రమించివుంది. భయంకరమైన ఈ మార్గాన్ని తప్పించి, వేరే త్రోవలో సిద్ధాశ్రమానికి పోదాము.” ఆ మాటలకు శ్రీరాముడు చిరునవ్వు నవ్వి, “స్వామీ! నీ కృపవల్ల మృత్యువే ఎదురైనా చీల్చి



చెండాడే శక్తి నాకు వచ్చింది. తాటక ఒకలెక్కలోనిది కాదు. ఈ క్షణమే దానిని సంహరిస్తాను” అని మహర్షికి సంతృప్తి కలిగేలా సమాధానం చెప్పాడు. దాంతో ఈ బాలకులు రాక్షసులనెలా ఎదుర్కొంటారన్న ముని సంశయం సమూలంగా సమసిపోయింది. ముగ్గురూ రథాన్నెక్కి తాటక విహరించే హిందోళికావనానికి పోసాగారు. హరికథ విన్నంతనే పాపాలు పటాపంచలైనట్లుగా, ఆ రథం తాకిడికి భూమి దద్దరిల్లింది. వాయువేగంతో చరించే ఆ అశ్వస్యందనం ఘోరారణ్యంలో అగమ్య ప్రదేశంలో ప్రయాణించి ఇక చొరడానికి వీలులేనిచోట ఆగిపోయింది. అప్పుడు “ఓ రాఘవా! ఇదే తాటక నివాసస్థానం. నరవాసన సోకగానే అది మనల్ని భక్షించేందుకు వస్తుంద”ని విశ్వామిత్రుడు శ్రీరాముని హెచ్చరించాడు. ఇంతలోనే యముడు కూడ ఉలిక్కిపడేట్టుగా తాటక పెడబొబ్బవేసింది. విశ్వామిత్రుడందుకు భయపడి, ‘ఓ శ్రీరామా! రక్షించు’ అని కేకవేశాడు.పదివేల మదపుటేనుగుల బలంగల శక్తిశాలిని, పర్వతోదరి, కుంభకర్ణుని సోదరియైన ఆ ఘోర రాక్షసి విజృంభించి వందలవేల సంఖ్యలో గోబ్రాహ్మణులను ఒక పంటిక్రింద కరకరా నమలివేస్తుంది. నిత్యం వనచరులను, త్రోవనపోతూ కనబడ్డవారిని మింగివేయడం తాటకకు అలవాటు. ఆ శవాలపైనున్న రక్తసిక్తమైన బట్టలను నడుముకు చుట్టుకుంటుంది. మానవకంకాళాలను కర్ణ కుండలాలుగా, రక్తం ఓడుతున్న మానవ కపాలాలను మెడలో మాలగా వేసుకొని, తలకు రక్తం పులుముకొని, పన్నెండు ఊళ్ళ విస్తీర్ణంగల ముఖంతో, ఐదు ఊళ్ళ పొడవైన వక్షోజాలతో అధికసంఖ్యలో రాక్షస సమూహం వెన్నంటిరాగా రామునిపైకి దండెత్తి వచ్చింది. ‘ఈ మార్గంలో వస్తున్న మానవులను వధించి, వారి రక్తమాంసాలతో విందుచేస్తాను’ అని తాటక తన రాక్షస సమూహానికి వాగ్దానం చేసింది.

అది గమనించి శ్రీరామునితో విశ్వామిత్రుడు ‘ఓ కోదండపాణి! ఈ రాక్షసి మహావృక్షంలా మిన్నంటుతోంది. రాక్షసమూకలు విశాలమైన వృక్షాలతో తాటకతో సహా ఆకాశాన హాహాకారాలు చేస్తున్నాయి. ఒకసారి అటు గమనించు!’ అని అన్నాడు.

రాత్రి అయిన తర్వాత సూర్యుడు ప్రకాశించినట్లు, యజ్ఞకుండంలో యాజ్ఞకులు అగ్నిని రగుల్కొలిపినట్లు, శ్రీరాముడు కోదండాన్ని తీసి నారిని సారించాడు. అప్పుడొక ప్రళయకాల మెరపుల ధ్వని పుట్టింది. అర్ధచంద్రాకృతిగా ధనుస్సును సాగదీసి వాయువేగాన్ని మించిన గమనం కలిగిన ఒక బాణాన్ని సంధించాడు. అది ఎదురొచ్చే వృక్షాలను చీల్చుకొంటూ తాటక హృదయచ్ఛేదనం కావించింది. ఆ దెబ్బకు తాటక ఘోరంగా పెనుకేకలు వేస్తూ, క్రిందకి ఒరిగిపోయింది. ఈ శబ్దాలకు విమానంలో గగనతలం నుంచి వీక్షిస్తున్న దేవబృందం ఉలిక్కిపడింది. రాఘవునికి జయజయధ్వానాలు పలుకుతూ పుష్పవృష్టి కురిపించింది. విశ్వామిత్రుడు బ్రహ్మానందభరితుడై శ్రీరాముని ఆలింగనం చేసుకున్నాడు. ‘రవికులభూషణా! రాజీవనేత్రా! సుకుమారా! నీ ధనుర్విద్యా కౌశలాన్ని కన్నులపండువుగా ప్రదర్శించావు. ఒకే నామజపంతో కోటిపాపాలు భస్మమైనట్టుగా, ఒక్క బాణంతో తాటకను భస్మం చేశావు’ అని ప్రస్తుతించాడు. తాటకి వధవల్ల పారిన నెత్తురు మడుగు ఇంతని చెప్పలేం! భూమి అంతా రక్తసిక్తమయింది. గగనాన దేవదుందుభులు మోగాయి.

**విశ్వామిత్రయాగపాలన : అసురసంహారం**

రాముడు సిద్ధాశ్రమానికి విచ్చేశాడు. తాటక మరణవార్తను, శ్రీరామ ఆగమనవార్తను విన్న మునిబృందం వర్షాకాలంనాటి వరదగంగలా ఉప్పొంగిపోతూ వచ్చారు. అందరిని కలుసుకొని శ్రీరాముడు అభివాదం



చేశాడు. ఆ తరువాత శాస్త్రోక్తంగా నాలుగు దిక్కులు, ఎనిమిదిమూలలు ప్రస్ఫుటమయ్యేలా యజ్ఞవాటికను నిర్మాణం చేశారు. సంభారాలన్ని సిద్ధంచేసి యాగాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో శ్రీరాముని సమీపించి విశ్వామిత్రుడు, ‘మేము యాగాన్ని ప్రారంభిస్తున్నాము. అప్రమత్తతతో చరించి, యాగసంరక్షణ చేయవలసింది. ఈ పాటికి తాటక మరణవార్త విని రాక్షసముఖ్యులైన మారీచ సుబాహులు వచ్చి విలయం సృష్టిస్తారు. రాక్షసులు బహుకపటులు. కొండరాళ్ళను ప్రహరిస్తారు. నాలుగు దిక్కులను జాగరూకుడవై కాపాడవలసింది’ అని హెచ్చరించాడు. ‘ఓ మహర్షీ! మీరెలాంటి విచారము పెట్టుకోనవసరం లేదు. విఘ్నాలు సృష్టించేవారిని విధ్వంసంచేసి యాగ సంరక్షణ చేస్తాను’ అని శ్రీరాముడు సమాధానం చెప్పాడు. శ్రీరాముని పలుకులకు అక్కడున్న మునిబృందం ఆనందభరితులయ్యారు. గాధిసుతుడు దీక్ష గైకొని యాగం ప్రారంభించాడు. తారల మధ్య చంద్రుడిలా, కిరణాల మధ్య సూర్యుడిలా, మునిబృందం మధ్య విశ్వామిత్రుడు శోభిల్లాడు. ఓంకార స్వాహాకారాలతో ఆజ్యంపోసి, దేవతలకు ఆహుతులనిస్తూ యజ్ఞం చేయసాగాడు. ఆ మంత్రాల వషట్కారఘోష మిన్నంటింది. సూర్యాస్తమయమైన, రెండుఝాముల రాత్రివేళ మాంసభక్షకులైన మారీచసుబాహులు, ఇరువది కోట్ల రాక్షస సమూహంతో, ‘తాటకా’ అని ఆక్రోశిస్తూ సిద్ధాశ్రమంవైపు రాసాగారు. ఈ కేకలకు మునులందరూ విభ్రాంతులయ్యారు. ఆజ్యంపోసే చేతులు వణికాయి. నోరు తడబడగా ‘రాఘవా! రక్షించు! గోవిప్రపాలకా! పాహి మాం’ అని ప్రార్థించసాగారు.

‘ఓ మహర్షులారా! మీరేం భయపడవద్దు!’ అని అభయమిచ్చాడు శ్రీరాముడు. ‘యాగరక్షణకు పూనుకొన్న రామలక్ష్మణులు బాలురు. వారు పోరాడవలసినది పర్వతాకారులైన ఇరువది కోట్ల మంది రాక్షసులతో! పోనీ వీరు ఒక ద్వారాన్ని రక్షిస్తారనుకొంటే, మిగిలిన ద్వారాలగుండా ప్రవేశించే

రాక్షసులను ఏవిధంగా ఎదిరించగలరు?' అని ఒక బ్రాహ్మణుడు సందేహాన్ని వెలిబుచ్చాడు. అందుకు విశ్వామిత్రుడు 'ఓ బ్రాహ్మణులారా! స్వస్థ చిత్తులు కండి! శ్రీరాముడు సాధారణ మానవుడు కాదు. సాక్షాత్తూ ఆదినారాయణుడే! రాక్షస సంహారానికే ఆయన ఈ లోకంలో అవతరించాడు' అని సమాధానపరచాడు. 'ఆ రాక్షసులు చెవులు దద్దరిల్లే కేకలతో, పర్వతాలవంటి రాళ్ళను యజ్ఞవాటికపైకి విసిరితే, రఘునందనుడు ఆ ఉత్పాతాన్ని ఎలా నిరోధించగలడు?' అని మరికొంతమంది బ్రాహ్మణులు సందేహించారు. 'రఘువీరుడు కోదండం సారించి శరపరంపరతో రాక్షసుల శిరస్సులను, కాళ్ళు చేతులను తుత్తినియలు చేస్తాడు' అని ధైర్యం చెప్పాడు కౌశికుడు. రాక్షసులు అతి బలాఢ్యులు. దేవతల కిరీటాలను కింద పడేసి, వాటితో ఆకాశంలో గగ్గోలుగా బంతాడుతుంటారు. అటువంటి వీరు యాగమండపాన్ని చుట్టుముట్టారు. ఆకాశంలో ఎగురుతూ ఒకడూ, యజ్ఞకుండంపై ఎగురుతూ ఒకడూ, ప్రేతాలను విసరసాగారు. అప్పుడు సర్వోత్తముడైన శ్రీరాముడు అంతటా తానే కన్పించి, నాలుగు ద్వారాల వద్ద, అష్ట దిక్కులలోను వ్యాపించి, శరసంధానం చేసి వాటిని నిరోధించసాగాడు. మండప శిఖరాన నిలబడి, నాలుగుమూలల బాణవర్షం కురిపించి రాక్షసులను అంతమొందించాడు. చుట్టూ, పైన, క్రింద, ఎటు చూచినా తానే అయి శ్రీరాముడు శరవర్షం కురిపించి శత్రుసంహారం చేశాడు. రాముడి తూణీరంలోనుంచి వచ్చే బాణాలను లెక్కించడానికి ఆ ఆదిశేషువు తరంకూడా కాదు. ఆ సన్నివేశం వర్ణించడానికి శబ్దజాలమూ సరిపోదు. మేఘాలనుండి వెలువడే వర్షధారలను, మహాకవుల ముఖతా వచ్చే శబ్దజాలాన్ని, కుబేరుని ధనాగారంలోని ధనాన్ని, మేరుపర్వతం క్రింద వుండే గనులలోని రత్నాలను, భూమిపై మొలిచే గడ్డిపోచలను, శాస్త్రవాక్యాలకు పండితులు చెప్పే వివిధ అర్థాలను లెక్కించలేనట్లుగా, శ్రీరాముని శరపరంపరనుగూడ లెక్కించలేము. అది



అక్షయం. మేఘాలు తననుండి ఎంత జలాన్ని సంగ్రహించినా సముద్రం శోషించదు. విష్ణుమహిమ వర్ణనకు కల్పాంతాలు సరిపోవు, అలాగే రాముని తూణీరం ఎన్నటికీ తరగదు. కోటానుకోట్ల బాణాలతో రణధీరుడైన శ్రీరాముడు రాక్షసులను పరిమారుస్తున్నాడు. తెల్లవారుఝామున పక్షులు గుంపులు గుంపులుగా చెట్లపై నుండి గగనానికి ఎగిరినట్లు, రాక్షసుల శిరాలు రాముని శరాఘాతాలతో మిన్నంటాయి. అసంఖ్యాక సర్ప సమూహం గరుడుని పైకెగసినట్లు, ప్రళయాగ్ని పైకి శలభాలు దూసుకెళ్ళినట్లు, మిణుగురులు సూర్యుని పైకి దండెత్తినట్లు, చీమలు మేరుపర్వతాన్ని లేవనెత్త పూనినట్లు, నక్కలు సింహం పైకి లంఘించినట్లు, మహాతేజశ్శాలియైన శ్రీరామునిమీదకు ఆ ఇరువదికోట్ల రాక్షససమూహం దండెత్తింది. పరశురాముడొక్కడే క్షత్రియ సమూహాన్ని తృటిలో నిర్వీర్యం చేసినట్లు, నారసింహుడొక్కడే దైత్యకులాన్ని దునిమాడినట్లు, లక్షల సంఖ్యలో ఉండే రాక్షసుల శిరస్సమూహాన్ని శ్రీరాముడు భూదేవికి కానుకగా సమర్పించసాగాడు. దీన్ని గమనించి మారీచసుబాహువులు తమ గదలను తీసుకొని రాముని పైకి పరుగుపరుగున వచ్చారు. సూర్యనారాయణాస్త్రమనే నిర్వాణబాణాన్ని శ్రీరాముడు సుబాహువు కంఠానికి గురిచూసి వదిలాడు. ఎగిరేపక్షి చిటారుకొమ్మన ఉండే ఫలాన్ని గుర్తించి ఎగరేసుకుపోయే విధంగా ఆ బాణం సుబాహుని శిరస్సును ఎగరేసుకు పోయింది. శరవేగం తాకిడి ఆ ప్రక్కనే వున్న మారీచుడికికూడా తగిలింది. గరుడుని రెక్కల వేగానికి పర్వతాలు ఆకాశంలో ఎగిరినట్లు, రామ శరాఘాతానికి మారీచుడు గాల్లోకి ఎగిరి దూరంగా సముద్రంలో పడి, శ్రీరాముడు ఇంకా వెంబడిస్తున్నాడేమోనన్న భయంతో వెనుతిరిగి చూడకుండా లంకవైపు పరుగుతీశాడు. మారీచుడు లంకలో ప్రవేశించి, రాక్షసశ్రేష్ఠుడైన రావణునికి జరిగిన వృత్తాంతం వివరించి, ఆ రాముడు మానవమాత్రుడు కాదు. ఆదిపురుషుడి అవతారం అని అన్నాడు. ఈ సంగతి విని రావణుడు మనస్సులో

కలతచెందాడు. గరుడుని ప్రతాపానికి సర్పాలు పొందే సంతాపంలాగా, సజ్జనుల గొప్పదనం విని దుర్జనులు కటకట పడినట్లుగా, పతివ్రతా ధర్మాలు విని వెలయాలు బాధపడినట్లుగా, శ్రీరాముని శౌర్యప్రతాపాలను గురించి విని రావణుడు మిక్కిలి ఆందోళన చెందాడు.

రాక్షసులందరినీ సంహరించి యుద్ధభూమిలో ఒక్కడిగా మిగిలిన రఘునాథుడు, మహాకల్పాంతంలో ఒంటరిగా మిగిలిన పరబ్రహ్మం వలె, నక్షత్రాలన్నీ లుప్తమయిన పిదప ఉదయించే సూర్యునివలె, ముత్యపుచిప్ప నుండి విడివడిన ముత్యంవలె, ప్రపంచాన్ని త్యజించిన యోగీశ్వరునివలె దేదీప్యమానంగా ప్రకాశించాడు. ఇక్కడ సిద్ధాశ్రమంలో రఘువీరుని సంరక్షణలో యాగం శుభప్రదంగా ముగిసింది. 'శ్రీరామా! ఆ ఆదిశేషువుకూ నీ మహిమ వర్ణనాతీతం' అని అంతులేని ఆనందంతో విశ్వామిత్రుడు శ్రీరాముని మూర్కొన్నాడు. 'రామలక్ష్మణలిరువురూ చిన్నవారయినా పర్వతాకారులయిన రాక్షసులను తృటిలో నిర్మూలించి యాగరక్షణ చేశారు' అని మునులు సంతోషం వెలిబుచ్చారు. అందుకు విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వి, 'సూర్యబింబం చిన్నగా ఉన్నా భూమి అంతటికీ వెలుగునిస్తుంది. అగస్త్యుడు పొట్టివాడైనా సముద్రాన్ని అవలీలగా ఆపోశన పట్టలేదా! వామనుడైన విష్ణువు తన రెండు పాదాలతో బ్రహ్మాండాన్ని ఆక్రమించాడుకదా? ఇంద్రుని వజ్రాయుధం చిన్నదయినా కొండల్నికూడా పిండిచేస్తుంది. పండితుడికి మేధసు ఆవగింజంత వున్నా ఆ మేధాశక్తి ప్రతిభ త్రిలోక వ్యాప్తమవుతుంది. అలాగే శ్రీరాముడు కూడా చిన్నవాడుగా కనిపించినా బ్రహ్మాదులకే అతని మహిమ తెలియదు. అతడే పరమాత్మ, పురాణపురుషుడు భక్తరక్షణకై భువిపై అవతరించాడు' అని శ్రీరాముని మహత్వాన్ని విశ్వామిత్రుడు వివరించాడు. ఇది ఇలా వుండగా యాగమండపం చుట్టు పడివున్న రాక్షస కళేబరాలను భూతగణాలు భక్షించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేశాయి.



**జనకుని పిలుపు**

ఆ సమయంలో మిథిలేశ్వరుడి దగ్గర నుండి ఒక లేఖ వచ్చింది. 'విప్రసమేతంగా విశ్వామిత్రులవారిని తాము ఏర్పాటుచేసిన స్వయంవరానికి విచ్చేయమ'నే ఆ ఆహ్వానాన్ని స్వయంగా చదివాడు విశ్వామిత్రుడు. ఆరోజు సిద్ధాశ్రమంలో పండుగరోజు. అందరికీ విందుచేసి బ్రాహ్మణులకు వస్త్రదానం చేశాడు. భూరి దక్షిణలిచ్చి సంతోషపరిచాడు. ఎక్కడ శ్రీరాముడు, సహాయకారిగా ఉంటాడో ఆ స్థలంలో ఎటువంటి లోటు జరగదు. ఇంతలో రాత్రి అయింది. విశ్వామిత్రుని కిరుప్రక్కలా రామలక్ష్మణులు పరుండి సుఖంగా శయనించారు. ఆదిశేషువు, శ్రీమన్నారాయణుడు ఉండడంవల్ల విశ్వామిత్రుడు సంపూర్ణసమాధి స్థితిని, ఉన్మనీ అవస్థను మించిన ఆధ్యాత్మికస్థితిలో ఉండిపోయాడు. శ్రీరాముని ధ్యానించక నిద్రించినవాడికి పశువుకు తేడా లేనట్లే. అట్టివారు నరరూప పిశాచాలని తెలుసుకో! శ్రీరాముని మనసారా ధ్యానించక, నివేదన చేయక చేసిన భోజనము, యజ్ఞపురుషునికి సమర్పించక వేసే ఆహుతులవలె ఎందుకూ కొరగాదు. రాముని ధ్యానించకుండా ఏ కర్మనాచరించినా అది నిష్ప్రయోజనమే. చివరకు గరిక, మట్టి, నీరు కూడా నశించిపోతాయి. రాముని ప్రాపులేక లభించిన జ్ఞానం అజ్ఞానంతో సమానం. విద్యకూడ అవిద్యే అవుతుంది. ధర్మంచేసినప్పటికీ అది అధర్మంలాగే పరిణమిస్తుంది. అయినా విశ్వామిత్రుడి భాగ్యమే భాగ్యం. పెన్నిధియైన శ్రీరామునితో శయనించే భాగ్యం కలిగిన వానికి వాస్తవంగా ఏ దిగులు ఉండదు. విశ్వామిత్రుడు నిద్రపోయాడని రూఢి చేసుకొని మెలకువగా ఉన్న రామలక్ష్మణులు ఇలా సంభాషించుకొన్నారు. 'సోదరా, లక్ష్మణా! మనం అయోధ్యకు తిరిగి ఎప్పుడు చేరుకోగలం. పితృదేవుల ముఖారవిందం దర్శించే భాగ్యం ఎప్పుడు కలుగుతుంది? సకల రాజన్యలోకం మహారాజుకు ప్రణమిల్లినపుడు వారి కిరీటాలు సోకిన గుర్తులు గల ఆ మహారాజు

పాదపద్మాలను ఎంతకాలానికి చూస్తాను? దివ్యరత్నాలు పొదిగిన ఆయన పాదరక్షలను పట్టుకొని ఆయనచెంత నేనెప్పుడు నిలుస్తాను. పట్టమహిషి కౌసల్యమాత నా రాకకోసం ఎదురుచూసి ఇంకా ఎన్నాళ్ళు కృశించాలి' అని శ్రీరాముడు వెక్కి వెక్కి ఏడ్చాడు. ఈ పలుకులు విని నిద్రిస్తున్న విశ్వామిత్రుడు లేచి, శ్రీరాముని హృదయానికి హత్తుకున్నాడు. "నాయనా! నేడే మిథిలాపురి మహారాజు ఆహ్వానం అందింది. ఉదయాన్నే మనం ప్రయాణం కావాలి. అక్కడ నిన్ను విజయలక్ష్మి వరిస్తుంది. జనకపుత్రి సీత నీకు వరమాల వేస్తుంది. నీ తల్లిదండ్రులు నిన్నక్కడే కలుస్తారు. శ్రీరామచంద్రా! నీవు జగద్గురువువయినా లౌకికంగా ఈ లీలలు ప్రదర్శిస్తున్నావు." అని ఊరడించాడు. ఇంతలో తొలికోడి కూసింది. సూర్యుడుదయాద్రిన ఉదయించాడు. నిత్యానుష్ఠానం చేసే ముని బృందంతో సహా రామలక్ష్మణులు వెంటరాగా, మిథిలానగరానికి పయనంకట్టాడు విశ్వామిత్రుడు. మునులందరూ పాదచారులై రావడం చూచి శ్రీరాముడు కూడా రథం దిగి వారితో నడవసాగాడు. ఇది గమనించిన మునులు "ఓ రామా! నీవల్ల జగత్తు ధన్యమయింది" అని కొనియాడారు. విశ్వామిత్రుడు లక్ష్మణుడిరువైపుల ఉండగా మధ్యగా జగద్వంద్యుడు, రాజీవనేత్రుడు, కంబుకంఠుడు ఐన శ్రీరాముడు నడుస్తూ చూపరులకు అత్యంత శోభను చేకూర్చాడు. క్షీరసాగరమథన సమయంలో బ్రహ్మ, మహేశ్వరులు శోభిల్లినట్లు, చంద్రుని చుట్టూ శుక్రుడు, గురువు అమరినట్లు, శంఖచక్రాల మధ్య మహావిష్ణువు శోభిల్లినట్లు వైభవోపేతంగా శ్రీరామచంద్రుడు వెలిగిపోయాడు.

## అహల్యోద్ధరణ

మిథిలానగరానికి పయనమైన విశ్వామిత్ర రామలక్ష్మణులను మార్గమధ్యంలో ఎదురయిన మునులు తమతమ ఆశ్రమాలకు రావించి ఆదర సమ్మానాలతో పూజించారు. అందరినీ ఉద్ధరిస్తూ, జగదుద్ధారకుడయిన



రాఘవుడు దారిలో ఒక పెద్దశిలను గమనించాడు. ఇంతలో గాలివాటున రాఘవుని చరణధూళి ఆ శిలపై పడగా, అది గౌతమ పత్ని అహల్యగా రూపొందింది! కాలిస్పర్శకే శిల యువతిగా మారడం అత్యంత ఆశ్చర్యకరం. దీనికి వివరణ మహర్షులే చెప్పగలరు. కొందరు కవులు శ్రీరాముని చరణస్పర్శ సోకగానే అహల్య ఉద్ధరింపబడింది అని వ్రాసారు. కాని బ్రహ్మకన్య, గౌతమపత్ని అయిన అహల్యవంటి బ్రాహ్మణపత్ని, మహాసతిని కాలుతో శ్రీరాముడు తాకడమనేది కల్పాంతంలో కూడా జరుగదు. శ్రీరాముని చరణధూళి సోకగానే ఆ పెనుశిల కంపించింది. అది గమనించిన శ్రీరాముడు ఆ ప్రకంపనాలకు గల కారణాలను విశ్వామిత్రుని తెలుసుకోగోరాడు. క్రమేపీ చంద్రోదయం అయినట్లు, ఆ శిల దివ్య స్త్రీ రూపు దాల్చసాగింది. పగడాల వంటి పెదవులు, చంపకవర్ణ శోభతో సుకుమారంగా ఉండి, నల్లని నిడుపాటి కేశాలు, చక్కని వస్త్రసధారణతో 'దేవతలకే జన్మనిచ్చిందా?' – అనే సందేహం కలిగించేట్లు, రంభా ఊర్వశుల సౌందర్యాన్ని తలదన్నే అహల్యగా రూపు దిద్దుకుంది. ఆదిశక్తి భవాని ప్రత్యక్షమయిందా? ఎవరో ఋషిపత్ని నిద్ర నుండి లేచిందా? మూర్ఛకు లోనయిందా? నాగలోక నివాసినా? ఎవరైనా ఇక్కడ పడి ఉండమని ఈమెను శాసించినందువల్ల మనస్సు నొచ్చుకొని ఆమె ఇక్కడ వుందా, మీ తపశ్శక్తి చేత ఇలా రూపొందిందా ఏమిటి? – అన్న సందేహాలకు సమాధానంగా విశ్వామిత్రుడు 'శ్రీరామా! ఈమె బ్రాహ్మణస్త్రీ. పరమ పతివ్రత. పతి శాపవశాన శిలగా రూపొందింది' అని అన్నాడు. అందుకు శ్రీరాముడు "మహర్షీ! ఈమె శిలగా మారిన వృత్తాంతాన్ని వివరించండి" అని కుతూహలంగా ప్రశ్నించాడు. అప్పుడు విశ్వామిత్రుడు అహల్య కథనిలా వివరించాడు.

పరమేష్ఠి తన సృష్టి రచన తర్వాత అహల్యను సకల సౌందర్యవతిగా, అపురూపమైనరూపంతో విశేషంగా తీర్చిదిద్దాడు. ఆమెను వరించడానికి ఎందరో ముందుకు వచ్చారు. అప్పుడు బ్రహ్మ ఆలోచించి స్వయంవరం

ఏర్పాటు చేశాడు. 'రెండు ఝాముల్లో భూప్రదక్షిణ చేసినవాడికి ఈ అహల్యను పొందే అదృష్టం లభిస్తుంది' అని ప్రకటించాడు. స్వయంవరానికివచ్చిన దేవతలు, మునులు, యక్ష, గంధర్వ, కిన్నర, తాపసులనేకులు భూప్రదక్షిణానికి బయలుదేరారు. ఇంద్రుడు ఐరావతంపైనా, ఇతర దేవతలు వారివారి వాహనాలపైనా శీఘ్రగతిలో సాగిపోయారు. కొందరు ఆకాశమార్గాన, మరికొందరు వాయువేగాన, మరికొంతమంది తడబడుతూ పరిగెత్తసాగారు. ఆ సమయంలో గౌతముడు గంగాస్నానం చేసి ఆవు దూడను ఈనే సమయంలో రెంటినీ చూశాడు. గాయత్రిని జపించి విధియుక్తంగా ఆ రెంటిచుట్టూ ముమ్మారు ప్రదక్షిణచేసి నిత్యానుష్ఠానం గావించాడు. సత్యలోకంలో బ్రహ్మ తన జ్ఞానదృష్టితో ఈ విషయం గ్రహించి, అహల్య భాగ్యానికి గౌతముడే సరిజోడని వెంటనే ఇరువురికి వివాహం జరిపించాడు. ఇంతలో అమరాధిపతి అమరేంద్రుడు త్వరగా భూప్రదక్షిణం గావించి వచ్చాడు. వధూవరులైన గౌతమాహల్యలను గాంచి క్రుద్ధుడైయ్యాడు. ముసలి మునికిచ్చి కల్యాణం చేసి మాటతప్పావు!' అని ఇంద్రుడు బ్రహ్మతో కోపంగా పలికాడు. దానికి బ్రహ్మ, నామాట అసత్యం కాదు. గౌతముడు ముమ్మారు భూప్రదక్షిణ గావించాడు. బాగా ఆలోచించు! సజ్జనులను అకారణంగా దూషించరాదు. అలా చేసేవాడు శతమూర్ఖులలో అగ్రగణ్యుడని వేదాలు ఘోషిస్తున్నాయి అని సమాధాన మిచ్చాడు. కానీ, ఈమెను ఏరకంగానైనా అనుభవించాల్సిందే అని నిర్ణయించి, ఇంద్రుడు ఆవేశంగా స్వస్థానానికి వెళ్ళిపోయాడు. గౌతముడు అహల్యను వెంటబెట్టుకొని ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. చాలాకాలం గడిచినా అహల్య ధ్యాసలోనే ఇంద్రుడు రోజులు గడపసాగాడు. ఇంతలో సూర్యగ్రహణం వచ్చింది. గౌతముడు, అహల్య నదికి స్నానానికి వెళ్ళారు. తర్వాత గౌతముడు ధ్యానముద్రలో ఉండటం గమనించి, అహల్య ఆశ్రమానికి చేరుకుంది. అహల్య ఒంటరిగా ఉన్నదని గ్రహించి, అమరేంద్రుడు గౌతమరూపుడై అహల్యతో సంభోగించాలని అక్కడకు



చేరాడు. ఆమె తలుపులు మూసి ఆశ్రమంలో ఉంది. కపట వేషధారి ఇంద్రుడు ద్వారంచెంత నిలబడి, 'అహల్యా! త్వరగారా!' అని పిలిచి నేలపై శయనించాడు. ఆమె ఆత్రుతగా ద్వారం వద్దకు వచ్చి భర్తను హృదయానికి హత్తుకుంది. కల్లాకపటం తెలియని గంగవలె నిర్మల మనస్కురాలయిన అహల్య కంట కన్నీరూరింది. అతనిని పైకిలేపి మంచంపై పరుండబెట్టింది. మాయావి ఇంద్రుడు, 'ప్రియే! నేను తాపంతో వేగిపోతున్నాను. నీ అంగస్పర్శతో నన్ను పరవశుని చెయ్యి' అని తొందరపెట్టాడు. అందుకు అహల్య, 'స్వామీ! ఈ రోజు గ్రహణం. పైగా మధ్యాహ్న సమయం. మీరు శాస్త్రం తెలిసినవారు. ఆలోచించండి' అని అభ్యంతరం తెలిపింది. 'శాస్త్రాల సంగతి ఇప్పుడెందుకు? నామాటే నీకు ప్రమాణం' అని బుకాయించాడు గౌతమరూపి. తప్పనిసరై అహల్య శయ్యన చేరింది. ఆ సమయంలోనే గౌతముడు స్నానానుష్ఠానాలు ముగించుకొని ఆశ్రమానికి తిరిగివచ్చాడు. 'అహల్యా! ఆశ్రమద్వారం తెరువు' అని కేకపెట్టాడు. అహల్య ఉలిక్కిపడి లేచి వాస్తవం గ్రహించి, చీర సవరించుకుని, 'దురాచారీ! ఎవరు నీవు?' అని శయ్యపైనున్న ఇంద్రుని ప్రశ్నించింది. 'నేను అమరేంద్రుడిని' అని సమాధానమిచ్చాడు. 'అపవిత్రుడా! ఎంతపని చేశావు? సద్బ్రాహ్మణుని సతిని ఎందుకు ముట్టుకున్నావు? నీ గొప్పతనం నేటితో మంటగలిసిపోయింది. చెయ్యకూడని కార్యానికి ఒడిగట్టావు. నీ కోర్కె తీరిందిగా? ఇక వెంటనే ఇక్కడ నుండి వెళ్ళు' అని తలుపు తెరిచింది అహల్య. ఇంద్రుడి పోకను గౌతముడు గమనించాడు. 'పరస్త్రీని చెరచిన పతితుడా! నీ ఒళ్ళంతా యోనులై, నపుంసకుడివవుతావు!' అని పారిపోతున్న ఇంద్రుని శపించాడు గౌతముడు.

అహల్యకు గౌతముని చూడగానే కల్పాంతాన విజృంభించిన సూర్యుడిలా, మూడోకన్ను తెరచిన ముక్కంటిలా తోచింది. పెనుగాలికి కమలం కదలాడినట్లు గడగడా వణికింది. గ్రహణం పట్టినపుడు సూర్యుడు కాంతి విహీనుడైనట్లు

అహల్య ముఖం కాంతిహీనమైంది. 'నీ శరీరం శిలగా మారి ఘోరారణ్యంలో జడమై అరవై వేల సంవత్సరాలు మూర్ఛితురాలుగా ఉండు' అని కోపావేశంలో అహల్యకు శాపం ఇచ్చాడు గౌతముడు. ఆ శాపం విని అహల్య 'అమరేంద్రుడు దుర్మార్గంతో మాయ చేశాడు. ఇంద్రుడని తెలిసి నేను పొందు కోరి ఉంటే నా శరీరం వేయి వక్కలై ఉండేది. ఆ పతితుడి మోసానికి లోనయ్యాను' అని ముని కాళ్ళమీద పడి వేడుకుంది. 'నీ కోరిక నెరవేరింది కనుక ఇక నిష్క్రమించవచ్చు!'– అని నీవు ఇంద్రుడితో అన్నందున నాకు కోపం వచ్చింది. 'నేను అకారణంగా శపించలేదు' అని అహల్యతో అన్నాడు గౌతముడు. అందుకు పరితపిస్తూ అహల్య 'ఓ తపోధనా! నేను తెలిసి ఏతప్పు చేయలేదు. పశ్చాత్తప్త నయ్యాను. నాకు శాపవిమోచనం కలిగించవలసింది' అని వేడుకుంది. గౌతముడి మనస్సు ద్రవించి, 'నా శాపంవలన నీవు శిలగా మారక తప్పదు. సూర్యవంశంలో కౌసల్యా తనయుడిగా శ్రీమన్నారాయణుడు అవతరిస్తాడు. ఆయన పాదధూళి సోకి నీవు నీ రూపాన్ని తిరిగి పొందుతావు' అని తరణోపాయాన్ని వివరిస్తుండగానే, అహల్య శరీరం చేతనత్వం కోల్పోయి అంగాలన్నీ పాషాణంగా మారిపోయాయి! ఆమె కేశాలు, నేత్రాలు, ముక్కు, వక్షోజాలు అన్నీ బండబారాయి. శరీరమంతా ఉండచుట్టుకుని బండరాయిగా మారిన అహల్యను చూచి ఆమె సద్గుణాలను తలచుకుని విలపించాడు గౌతముడు. 'అహల్య వంటి గుణవంతురాలిని వదిలి ఎలా వెళ్ళగలను. ఆమెకు తెలియకనే ఈ అనర్థం జరిగినా, నేను ఘోర శాపాన్ని ప్రసాదించాను. ఇక నేను తపోవనానికి పోవాల్సిందే' అని మథనపడ్డాడు. ఈమె చెంత ఎవరూలేరు ఇక్కడ సర్పాలు, పులులు, మొదలగు క్రూరజంతువులు సంచరిస్తూ శిల అనుకొని ఈ పువ్వు లాంటి స్త్రీని పీడిస్తాయి అని వితర్కించుకొని, 'ఎవరూ ఈ శిలవైపు కన్నెత్తి చూడడానికి వీల్లేదు. ముట్టుకుంటే మరణం తప్పదు' అని ఆ ప్రదేశాన్ని శాసించాడు. దాంతో వనచరాలన్నీ ఆ ప్రదేశం వదిలివెళ్ళాయి.



తరువాత గౌతముడు కామాంధుడైన ఇంద్రునికి శాపం ఇవ్వడం వలన కలిగిన తపఃక్షయాన్ని నివారించుకోవడానికీ, భార్యా వియోగ దుఃఖం మరచిపోవడానికి, బదరికాశ్రమం వెళ్ళాడు. ఇంద్రుడు నెమలిగా మారి అరణ్యంలో తిరుగాడుతూ, దేవ బృందాన్ని వెంటబెట్టుకొని గౌతముడి వద్దకు వెళ్ళి పరిపరి విధాల శాపవిమోచనాన్ని అర్థించాడు. గౌతముడు ప్రసన్నుడై 'నీవు ఇకపై సహస్రాక్షుడిగా మారుతావు' అని శాపాన్ని సవరించాడు. ఇంద్రుడు నిజస్థితినొంది దేవలోకానికి పయనమైపోయాడు. ఆనాటినుంచి అహల్య తన శాపవిమోచనం కోసం ఎదురు చూస్తూ ఇలా శిలగా పడి ఉంది" అని విశ్వామిత్రుడు అహల్య కథను ముగించాడు.

"రామా! నీ చరణ ధూళి ప్రభావంవల్లే ఆమె తన దివ్యరూపం తిరిగి పొందింది. నీ దర్శనార్థం ఉత్తేజంతో సజీవమైంది అని పలికిన విశ్వామిత్రుడితో ఆ వృత్తాంతం విని ఆశ్చర్యచకితుడై నా పాదధూళి వల్ల ఈమె జీవిత అయిందా? 'నేనలాంటి పుణ్యాచరణ ఏం చేశాను?' అని శ్రీరాముడు ప్రశ్నించాడు. నిస్సందేహంగా నీ చరణరజః ప్రభావంవల్లే ఇది సాధ్యపడిందని అంటూ శ్రీరాముని అహల్య చెంతకు తీసుకు వెళ్ళాడు విశ్వామిత్రుడు. ఆమె తన కేశపాశాన్ని బంధించుకొని, కొంగు కప్పుకొని లేచి రఘువీరుడికి ఎదురొచ్చి, సౌందర్యరాశి, జగద్వంద్యుడు, జగద్గురువు, దశరథుని బంగారుకొండ, ఇంద్రాదిదేవతలకు పూజనీయుడు, ఈశ్వరుని హృదయరత్నం, బ్రహ్మకు కూడా లక్ష్యస్థానం అయిన వాడిని, నారదాది మునులకు కూడా అంతుపట్టనివాడు, సనకసనందనులకు ఆరాధ్యమూర్తీ, చతుర్వేద, షట్ఛాస్త్ర వర్ణితుడు ఐన శ్రీరాముని తనివితీరా చూసింది. ఆనందోద్రేకాన్ని ఆపుకోలేక అష్టభావాలు ముప్పిరిగొనగా ఆ బ్రహ్మపుత్రి, రాజీవలోచననుడయిన రామచంద్రునికి సాష్టాంగ దండ ప్రణామం చేయగా శ్రీరాముడు, 'మాతా! పైకి లేవవలసింది' అన్నాడు. ఆ మాటలు విని అహల్య వెంటనే పైకి లేచి, వసంతకాలంలో

కోయిలలా ఇలా కీర్తించింది : 'జయజయరామా! కరుణాసముద్రా, దాశరథీ, ప్రతాపరుద్రా, జగద్గురో. రామచంద్రా! చంద్రోదయాన్ని చూసిన చకోరంలా నీరాకను గమనించి నేను పరవశురాలనయ్యాను. ఓ రాఘవా! పురాణ పురుషా! హే జగత్పాలకా! అనంతవేషా! హే కౌసల్యాత్మజా! భానుతేజా! నీ రాకతో చీకట్లు తొలగిపోయాయి. విద్వద్ హృదయపేటికా నివాసా, తాటకను పరిమార్చిన ప్రతాపసింహమా, నీ పౌరుషచ్ఛాయలు పడగానే, ప్రతాపఘోష వినగానే ఏనుగెత్తు పాపపుగుట్టలుకూడా చిటికెలో నశిస్తాయి. నీవు భవరోగవైద్యుడవు. నీ చరణరజఃస్పర్శతో దోషమనే క్షయరోగం తొలగిపోయింది. నన్ను నాశం లేని స్థితికి చేర్చావు. నీవే పంచాక్షరివి. అరువదివేల సంవత్సరాలుగా బాధించిన భూతప్రేతగణాలన్ని నువ్వు కాలుమోపిన క్షణమే పారిపోయాయి. అరవైవేల సంవత్సరాలుగా జ్వలిస్తున్న తాపాగ్నిపై మేఘంలా వర్షించావు. రామా, నా కేశాలతో నీ పాదాలను స్పృశించనీ, నా శరీరంతో నీకు హారతి ఇవ్వనీ!' అని స్తుతించింది. ఈ విషయం తెలిసి అక్కడికి వచ్చిన గౌతముడు కోదండరాముడికి నమస్కరించాడు. సూర్యునిలా వెలుగుతున్న శ్రీరాముని చూచి చక్రవాకాల్లా ఆనందిస్తున్న ఆ మునిదంపతులకు మునిబృందం మంగళతిలకం దిద్దారు. అహల్య 'రామా! అనంతకల్యాణమస్తు! శివుని అంతరంగంలో నివశించే ఓ దేవా! పరాత్పరా! పూర్ణబ్రహ్మా! శ్రీరామా! సీతాస్వయంవరంలో విజయం నీదే. సీత నిన్నే వరిస్తుంది. ఇది నిశ్చయం. సత్యం!' అని దీవించింది. మునిదంపతులు శ్రీరాముని తమ ఆశ్రమానికి తోడ్కొనిపోయి పూజించగా, వారి అనుమతి గైకొని, విశ్వామిత్ర రామలక్ష్మణులు మిథిలాప్రయాణం కొనసాగించారు.

అహల్యాపుత్రుడు శతానందుడు జనకమహారాజు ఆస్థాన పురోహితుడు. శ్రీరాముడికి ఎదురొచ్చి, ఆహ్వానించాడు. మిథిల వెలుపల ఉపవనంలో మునితో శ్రీరాముడు బసచేశాడు. శివధనుస్సు అతిబరువైనది, ఆ ధనువును



అవలీలగా ఎత్తగలిగిన వీరుడితో సీతకు పరిణయమవుతుంది – అని స్వయంవరం గురించి అనుకొనే మాటలు శ్రీరాముడి చెవినబడ్డాయి. 'జానకి ఎలా జన్మించింది? స్వయంవరంలో ధనుస్సును ఎవరుంచారు? ఆ ధనుస్సు ఎవరిది?' అని శ్రీరాముడు విశ్వామిత్రుని కుతూహలంగా ప్రశ్నించాడు. దానికి కౌశికుడు జానకి జనన వృత్తాంతాన్నీవిధంగా వివరించాడు.

**జానకి జననవృత్తాంతం**

పూర్వం పద్మాక్షుడనే మహారాజు ఆదిలక్ష్మి కోసం తపస్సు చేసి తన ఇంట కన్యగా వెలియవలసిందిగా ప్రార్థించాడు. వైకుంఠ పతికి సతి అయిన లక్ష్మి, 'ఓ రాజా! నేను నీ ఇంట వెలిసినపుడు కలిగే విఘ్నాలు అనేకం! కనుక ఆ ఆలోచన మానుకోవలసింది' అని హెచ్చరించింది. రాజు స్థిరంగా మరోసారి లక్ష్మిని తన కుమార్తెగా జన్మించమని అర్థించాడు. లక్ష్మి 'నేను మురారి అధీనను' అంది. విష్ణుమూర్తి ప్రత్యక్షమై రాజును వరం కోరుకోమన్నాడు. ఆ రాజు అదే వరం కోరుకోగా, శ్రీహరి అతడికి ఒక ఉసిరిక పండు ఇచ్చాడు. పద్మాక్షుడు దాన్ని మందిరంలో తొమ్మిది నెలలుంచాడు. అందులోనుండి ఒక బాలిక అనంత తేజస్సుతో ఆవిర్భవించి, దినదిన ప్రవర్ధమానమవుతూ కన్యగా మారింది. ఆమె సౌందర్యాన్నిగాంచి ఆమెను ఆశించే వరులెక్కువయ్యారు. మునులు, గంధర్వ, యక్ష, కిన్నర, చరణ, విద్యాధరులందరూ ఆమె సందర్శనాపేక్షతో మందిరానికి వచ్చేవారు. పద్మాక్షుడు తన కుమార్తె అందానికి మురిసిపోయినా, ఇంతమంది వరులను చూసి కుపితుడయ్యాడు. ఆ నీలమేఘశ్యాముడికే ఈ కన్య ధారాదత్తం అని ప్రకటించగా, ఆ రాజన్యలోకమంతా కోపోద్రేకంతో కయ్యానికి కాలు దువ్వారు. ఏడు రోజులు పోరాడి పద్మాక్షుని అంతం చేసి సంపద అంతా దోచుకొని నగరాన్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఆదిలక్ష్మి అగ్నిగుండంలో దాగి బ్రహ్మారణ్యంలో ప్రకటమయింది.

ఆ సమయంలో రావణుడు అసమాన సౌందర్యంతోనున్న ఆ లావణ్య సుందరిని చూసి ఒక్క వుదుటున అగ్నిగుండాన్ని ఆర్పివేశాడు. అక్కడ త్రవ్వగా అయిదు రత్నాలు దొరికాయి. వాటిని భద్రంగా ఒక పెట్టెలో ఉంచాడు. ఒంటరిగా ఉన్న సమయాన మండోదరితో 'నీకోసం అమూల్యమైన రత్నాలు తెచ్చాను' అని రావణుడు చెప్పగా మండోదరి పరిగెత్తి పెట్టె తెరువబోయింది. కాని సాధ్యపడలేదు. ఇరువది హస్తాలతో చేసిన దశకంఠుడి ప్రయత్నమూ వ్యర్థమయింది. ఇద్దరూ ఆశ్చర్య చకితులయ్యారు. మండోదరి మంత్రిని రావించి పెట్టెను తెరిపించగా, అందులో ఆరుమాసాలున్న బాలిక వుంది. మండోదరి ఆ బాలికను చూసి 'రాజా! ఈ విఘ్నాన్ని ఇంటికెందుకు తెచ్చారు? మాయాతీతుడైన, చైతన్యఘనుడైన ఆ ఘనశ్యామునే ఈ విఘ్నప్రదాయిని పెళ్ళాడుతుంది. ఇతరులకు అగ్నిజ్వాలగా పరిణమిస్తుంది. ఈమె పద్మాక్ష మహారాజును అంతమొందించింది. చాలామంది రాజులు ఈమె మూలంగా వధించబడ్డారు. ఈమె ఇక్కడ ఉంటే లంకకు చేటు తప్పదు. దశాననా! ఈమె పరమ విఘ్నకారిణి' అని అంది. వెంటనే సేవకులను పిలిచి పెట్టెను తలమీద పెట్టుకొని బయటకు తీసుకెళ్ళమన్నది. 'పరివార సహితంగా రావణకుల నిర్మూలన నిమిత్తం మళ్ళీ లంకలో ప్రవేశిస్తాననే మాటలు ఆ పెట్టెలోనుండి విన్పించాయి. ఈమాటల్తో రావణుడి మనస్సు వికలమయింది. ఆ మాయా శిశువును వధింపబూనాడు. ఎప్పుడో రాబోయే అనర్థానికి ఇప్పుడే ఆహ్వానం ఎందుకు పలకాలి' అని మండోదరి రావణుని పాదాలు పట్టుకొని వారించింది. మిగిలినవారు కూడా రావణుని శాంతింపజేశారు. 'ఈ పిశాచిని మిథిలానగరం పొలిమేరల్లో జనకుడి కంటపడేలా పాతిపెట్టండి.' అని రావణుడు సేవకులకు ఆజ్ఞనిచ్చాడు. సేవకులు రాజాజ్ఞను రాత్రికిరాత్రే పాటించారు.

జనకుడు ఒకానొక వేదపారంగతుడయిన బ్రాహ్మణుడికి దానమిచ్చిన నేలలో ఆపెట్టె పాతిపెట్ట బడింది. ఆ బ్రాహ్మణుడే పూర్వజన్మలో పద్మాక్షుడు.



ఒక సుముహూర్తంలో నాగలితో పొలం దున్నుతుండగా నాగేటికొర్రుకు ఆ పెట్టె తగిలింది. బ్రాహ్మణుడు సత్యవాది, సన్మార్గుడు కనుక పెట్టెను జనకుని వద్దకు తీసుకెళ్ళాడు. ఇది మీ సొమ్ము తీసుకోండి మహారాజా! అని అన్నాడు. అందులో ఏముందని ప్రశ్నించాడు జనకుడు. నాకు తెలియదని ఆ విప్రుడు సమాధానం చెప్పాడు. మంత్రులందరూ గమనిస్తూండగా ఆ పెట్టెను తెరిచారు. అందులో అయిదు సంవత్సరాల బాలికను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. జనకుడికి ఆ బాలికపట్ల వాత్సల్య భావం ఉప్పొంగింది. 'స్వామీ! ఈ కన్యారత్నాన్ని నాకు ప్రసాదించండి' అని అడిగాడు. 'ఈమె మీసొత్తే మీరే గైకొనండి' అన్నాడు ఆ విప్రుడు. 'ప్రపంచంలో ఉండే సౌందర్యానికి పుట్టిల్లు అయిన లక్ష్మి సాక్షాత్తూ నా ఇంటికి వచ్చిందని' ఆనందించాడు జనకుడు.

పరశురాముడు ఇరవై ఒక్క మార్లు క్షత్రియులను వధించి కార్తవీర్యార్జుని వధించి రేణుక పగ చల్లార్చి త్ర్యంబకమనే ధనుస్సును గైకొని జనకుని చెంతకువచ్చాడు. జనకుడు భార్గవరాముడికి సకలోపచారాలు చేసి భోజనానికి ఆహ్వానించాడు. శివకార్ముకం బయట ఉంచగా దానిమీదే జానకి స్వారిచేయసాగింది. పరశురాముడు భోజనానంతరం విల్లు వెదికితే కనిపించలేదు. మనసులో ఖిన్నుడయ్యాడు. ఏనుగుల సమూహం కూడా దీన్ని కదల్చలేదు. దీన్నెవరు తీశారని విచారిస్తూ ద్వారం చెంతకు వచ్చాడు. కోదండంతో గుర్రం ఆట ఆడుతున్న జానకిని చూసి ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకొన్నాడు. పరశురాముని, తండ్రిని చూసి సిగ్గుతో జానకి పారిపోయింది. ధనుస్సు నేలపై పడగా, ఎవరూ దాన్ని కదల్చలేకపోయారు. మహావీరులు సైతం విఫలమయ్యారు. అపుడు పరశురాముడు 'సీత తప్ప దీనినెవరూ ఎత్తలేరు' అని అన్నాడు. జనకుని ఆజ్ఞపై సీత దానిని మళ్ళీ ఉన్నచోట పెట్టింది. పరశు రాముడు, 'నా అవతార కార్యం సంపూర్ణమయింది' అని మనసులో అనుకొని వింటిని అక్కడే ఉంచాడు. 'రాజా! ఎవరైతే ఈ ధనువును ఎక్కుపెట్టాడో

అతనికే సీతనిచ్చి వివాహం జరిపించవలసింది'. అని జనకుడికి సలహానిచ్చి బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు. అని విశ్వామిత్రుడు పూర్వకథను శ్రీరామునికి తెలియజెప్పాడు. ఈ కథంతా నీకు తెలియనిదా రామా! అయినా నా నోటినుండి వినాలనే కదూ నీ కుతూహలం!' అని కౌశికుడు శ్రీరామునితో అన్నాడు.

శ్రీరామవిజయగ్రంథం కడుసుందరం. రాబోయే అష్టమాధ్యాయంలో సీతా స్వయంవరం జరిగి శ్రీరాముడు విజయం పొందుతాడు, ఆయన తప్ప ఎవరూ సీతను వరించలేరు. బ్రహ్మానందా! రఘువీరా! కమలోద్భవ జనకా! శ్రీధరవరా! పురాణపురుషా! పరాత్పరా! అక్షయంగా నీ కీర్తన చేసే భాగ్యం ప్రసాదించు! స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా శ్రోతలు శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**సప్తమాధ్యాయం మధురం**



**అధ్యాయము - 8**

## శ్రీ గణేశాయ నమః

**సా**ధు సజ్జనులారా! మీరు ధన్యులు. రామ మహిమ అనే సముద్రంలో చేపల్లా విహరిస్తూ పూర్ణానుభవం గడించిన ఆణిముత్యాలు. రాజభాండాగారంలోని అమూల్య రత్నాల విలువ కోశాధికారికే తెలిసినట్లు సూర్యుని తేజస్సు అనూరునికి, భూమి బరువు ఆదిశేషునికి, ఆకాశం విస్తీర్ణం గాలికి, కవి రచనాపటిమ సరస్వతికి, చంద్రుని శీత కిరణస్పర్శ చకోరానికి, ప్రేమకథల అమోఘ మధురరుచి అమాయక భక్తులకు, రామకథా వైశిష్ట్యం వాల్మీకికి, రామపాదధూళి పటిమ అహల్యకు, అద్భుతమైన రామనామ మహిమ ఈశ్వరునికి తెలుస్తుంది. రామకథలో మాధుర్యం మెండు. దానిలోని అమృతరసాన్ని సాధుజనులే సేవిస్తారు.

సప్తమాధ్యాయంలోని కథలో రాముడు మిథిల సమీపాన విడిది చేశాడు. దూతలను పంపి మిథిలేశుడు దేశదేశాలకు చెందిన రాకుమారులను ఆహ్వానించాడు. చాలామంది రాజులు విచ్చేశారు. దశరథుడికీ ఆహ్వానపత్రిక అందింది. విశ్వామిత్రుడు శ్రీరామ సహితుడై వెళ్ళాడు గనుక, ఆయన బయలుదేరలేదు. ఆయన పుత్రవియోగ బాధ భరింపరానిదయింది. నా యిద్దరు కొడుకుల్ని కౌశికుడు వెంట తీసుకువెళ్ళాడు. కుమారుల నెప్పటికి చూస్తానో? ఏమో? అనే వియోగభారంతో రాత్రింబవళ్ళు దుఃఖించి దశరథుడు కృంగి కృశించిపోయాడు. మిథిలకు రాకపోవడానికి అదే కారణం.

### రామలక్ష్మణుల మిథిలాప్రవేశం

ఇక్కడ మిథిలాధీశుడు నగరం వెలుపల విడిదిచేసిఉన్న విశ్వామిత్ర గణాన్ని స్వయంవర సంరంభానికి ఆహ్వానించడానికి వెళ్ళి, సూర్యనారాయణుల్లా

గోచరించే ముని పుంగవులకు సాష్టాంగ ప్రణామాలు ఆచరించాడు. అద్భుతమయిన నా భాగ్యఫలం కొద్దీ మునులు మహాత్ములు నా గృహానికి విచ్చేశారు. నేను పునీతుడనయ్యాను. పూర్వజన్మ పుణ్యఫలం వల్లే ఇది సాధ్యం అని చుట్టూ అవలోకించి, రామ లక్ష్మణులను గమనించి, 'ఈ ఇద్దరు బాలకులెవ్వరు? సూర్యచంద్రులా? ఇంద్ర బృహస్పతులా? రమాపతి ఉమాపతులా? వీరి రూపురేఖల ముందు కోటి మన్మథులూ తీసికట్టే. చూడగానే ఉన్మీల మయిపోతుంది మనస్సు' అని ఆతృతగా అడిగాడు. మహారాజా! 'వీరు దశరథుని కుమారులు. వీరిని వర్ణించడానికి ఆదిశేషువుకూ తరం కాదు. మార్గమధ్యంలో తాటకను సంహరించి యాగానికి సిద్ధి కల్పించారు. సుబాహు సహితంగా ఇరువది కోట్లమంది రాక్షసులను సంహరించారు. మార్గంలో రాముని పాదధూళికే బ్రహ్మపుత్రి అహల్య స్వరూపం పొందింది. శివధనుస్సును వీక్షించాలని ఇక్కడకు వచ్చారు. శేషువు, విష్ణువు ఏ ప్రయత్నం చేయకుండానే ఆహ్వానం లేకుండానే ఇంటికి వచ్చారు. అనుకోకుండా గొప్పనిధి దొరికినట్లు, చింతామణి ఎదురొచ్చినట్లు, దరిద్రుని వాకిట కల్పతరువు స్వయంగా నిల్చినట్లు, ఆకలిగొన్నవారికి క్షీరసింధువు దొరికినట్లు రామలక్ష్మణులు మీ గృహప్రవేశం చేశారు. నువ్వు గొప్ప భాగ్యశాలివి. శాస్త్రాభ్యాసం లేకుండానే భాగ్యంవల్ల తత్వజ్ఞానం అబ్బినట్టు, మట్టి తవ్వుతుంటే అకస్మాత్తుగా ధనం లభించినట్లు, యజమాని రాజైతే దాసికి కూడా అంతస్తు పెరిగినట్టు, మోడు వారిన చెట్టు కోరిన ఫలాలు అందించినట్లు, చేతిలోని గాజుముక్క చింతామణిగా మారినట్లు, పూరిల్లు బంగారు మందిరమైనట్లు, వట్టిపోయిన ఆవు పాలివ్వడం మొదలు పెట్టినట్లు, వైరులుకూడా మిత్రులైనట్లు, తన బుద్ధి విశేషంగా ప్రకాశించినట్లు, రాజే ఇంటికి వచ్చి గౌరవించినట్లు, సమయోచిత స్ఫూర్తి కలిగినట్లు, ఈ రోజుతో నీ కీర్తిప్రతిష్ఠలు నలుదిశలూ విస్తరిస్తాయి.'



'మహారాజా! ఈరోజు నిజంగా నీకు భాగ్యోదయమైంది. నీ ఇంటికి శివుని మిత్రుడు అరివీర భయంకరుడు అయిన శ్రీరామచంద్రుడు వేంచేశాడు.' అని విశ్వామిత్రుడు జనకునితో అన్నాడు. జనకుడు సాదరంగా రామలక్ష్మణులను, విశ్వామిత్రుని ఉచితఆసనాలపై ఆసీనుల గావించాడు. స్వయంవరానికి విచ్చేసిన అనేక దేశాల రాజులందరూ శ్రీరాముడి స్వరూపాన్ని చూసి ఆశ్చర్యపడి, సీతకు తగిన వరుడీతడే అని లోలోన తలపోశారు. స్వయంవర ప్రకటన బాగుంది కానీ పరశురాముని ధనుస్సును ఎక్కుపెట్టడం శ్రీరామునికయినా సాధ్యమేనా! అని ఒక రాజు సందేహపడ్డాడు. అవాంతరాలను అధిగమించి ఈ శ్రీరాముడే నా అల్లుడైతే నా భాగ్యానికి అంతుండదు కాని చేయవలసిన పని అతి క్లిష్టమైనదే అని జనకుడు మనసులో తలపోయసాగాడు. అదే సమయంలో కొంతమంది చెలికత్తెలు వింజామరలు వీయగా ఒక చెలికత్తె తాంబూలమందించగా అనుక్షణం సౌందర్యాన్ని సవరించుకొంటున్న సీత పుష్పమాలికను చేబూని తళతళ మెరిసే ఏనుగు అంబారీనెక్కి సభామండపాన కొలువుదీరిన రాజులను, మునిబృందాన్ని విలోకించింది. ఆ మంటపంలో జనకాత్మజ సౌందర్యంతో పోల్చడానికి సాటి వేరెవ్వరూలేరు. శుద్ధిచేసిన బంగారు వర్ణంతో జానకి శోభిల్లుతోంది. ఆకర్ణపర్యంతం విస్తరించిన విశాల నయనాలు, చంద్రబింబం వంటి ముఖం, సంభాషించేటప్పుడు మెరిసే పలువరుస, దానిద్వారా నలుదిక్కులా విరజిమ్మే కాంతికి పాషాణంకూడా పద్మరాగం అవుతుంది. మాట్లాడితే ముత్యాలు రాలుతాయా? అన్నట్లుండే ఆమె పలికే తీరు, శరీరలావణ్య సుగంధం మహదాకాశాన్ని చీల్చుకుపోయింది. తన స్వరూప విలాసాలతో ఆదిపురుషుని మాయపుచ్చింది. ముల్లోకాధిపతి పట్టమహిషి, ఆదిమాయ, ప్రణవరూపిణి, సంకల్పమాత్రంగానే బ్రహ్మాండాన్ని రచించి బ్రహ్మాదిదేవతల్ని నిజగర్భంలో ఉంచి పాలించుకునే శక్తి గల ఆమె స్వరూపం అపారం, అద్భుతం. ఆమెను

వర్ణించడానికి ఎవరి తరమవుతుంది? తలంపు మాత్రాన సర్వశక్తులు ఎవరి ఎదుట సాక్షాత్కారం పొంది ప్రణమిల్లుతాయో ఆ ఆదిశక్తి ఆదిపురుషుని మేల్కొలిపి సగుణరూపాన్నిచ్చింది. సీత పాదముద్రల పదసుగంధానికి వసంతుడు సైతం మైమరచి పోతాడు. నుదుట కస్తూరిబొట్టు, విశాలనేత్రాలకు కాటుక, చెవుల ముత్యాల కృత్తికాపుంజాల కాంతి, సూర్యచంద్ర ప్రభల ముఖవర్చస్సు సీత అందాన్ని ద్విగుణీకృతం చేసింది. ముత్యాలసరాలతో నిండిన ఆమె పయ్యెద, చేతికి రవ్వలగాజులు, పతకాలతో ఉన్న ముత్యాల కంఠహారం, వేళ్ళకు రవ్వల ఉంగరాలు, నడుముకు రవ్వల వడ్డాణం, కాళ్ళకు గలగలమని చప్పుడుచేసే అందెలతో, ఆకాశాన తొలకరి మెరుపుతీగలా ఉండే ఆమె రూపానికి కోటిమన్మథులూ సాటిరారు. ఇటువంటి రూపసి సీత తన చిత్‌శక్తితో సభను పరికించి మునిపంక్తులలో ఆసీనుడైన ఘనశ్యాముడు పరబ్రహ్మ అయిన శ్రీరాముని గమనించింది. 'ఆ ముగ్ధ మనోహరమూర్తి మీద నాకు మనసు కలిగింది. ఆయన తోడు లభిస్తే నేను ధన్యురాలిని అవుతాను. జన్మజన్మల పర్యంతం ఉగ్రతపం చేస్తేకాని ఇటువంటి వీరుడు నాకు లభించడు. అతడు నాకు జంటగా లభిస్తే ముల్లోకాల్లో నన్ను మించిన వారుండరు. నేనెవరిని వేడుకొనేది? ఆయనను ఎన్నుకొనే శక్తి నాకెవరు ప్రసాదిస్తారు? అందరిలో సౌందర్యాధికుడు, ఘనశ్యాముడు అయిన, ఆ రాజీవనేత్రునకు నా చేతుల్తో హారంవేసి వరిస్తాను. అప్పుడే ఉత్సవం సంపూర్తి అవుతుంది.' అని సీత తన చెలికత్తె అయిన విజయతో అంది. ఆ సమయంలో విశ్వామిత్రుడు జనకుడితో 'ఇంకా ఆలస్యం దేనికి? రాజపరివారం సభలో ఉన్నారు. అందరూ శక్తిసామర్థ్యాలున్నవారు. త్వరగా కోదండాన్ని తెప్పిస్తే మంచిది' అన్నాడు. ఎనిమిది చక్రాలుండే బండిలో కోదండాన్ని ఉంచి వేలాది వీరులు తమ భుజశక్తితో కదపలేక ఏనుగులతో ఈడ్పించుకొని వచ్చి మంటపంలో ఉంచారు. అదిచూచి రాజపరివారంలో కలవరం మొదలయింది. ఇదెవరయినా



ఎత్తగలరా? అని ఒకరంటే, ఇది శివుని ధనుస్సు. దీనినెత్తగల రాజెవరూలేరు అని మరొకరు, వేడుకను పరికించవల్సిందే అని ఇంకొకరు, జనకునికి స్నేహహస్తం అందించాలని వచ్చాం అని వేరొకరు అనసాగారు. ఒక రాజు ఆ శివధనుస్సు చూచి కలవరంతో గర్వమడిగి వెళ్ళిపోయాడు. జనకుడు సభనుద్దేశించి ఇలా అన్నాడు. 'సభాసదులారా! ఇది విరూపాక్షుని విల్లు. దీన్ని గైకొని స్వహస్తాలతో ఈశ్వరుడు దక్షుని శిక్షించాడు. ఇంద్రుడు కూడా దీన్ని ఎత్తలేకపోయాడు. ఈ చాపాన్ని సంధించినవారి గళసీమలో సకల గుణనిధి అయిన జానకి స్వయంవరమాల వేస్తుంది.'

ఈ ప్రకటన విని అందరూ తటస్థంగా ఉండిపోయారు. ఎవరూ ముందుకు రాలేదు. కొంతమంది వీరులు భుజాలు సవరించుకొని బలాన్ని ప్రదర్శించే యత్నం చేయబోయారు. అంతలో పిలవని పేరంటంలా రావణుడు మంత్రిసహితంగా సభలో సుడిగాలిలా ప్రవేశించాడు. సభంతా కల్లోలితమయింది. ఏదో విఘ్నం సంభవిస్తుంది. ఈ సమయం సరికాదు. శివచాపాన్ని సంధించి బలాత్కారంగా సీతను ఎత్తుకెళ్తాడు అని కొందరు భావించసాగారు. ఆ సమయంలో రావణుడు జనకుని ఉద్దేశించి 'ఈ ధనుస్సు ఎత్తాలనే ఒక నెపం పెట్టావు. క్షణంలో విరిచి తుత్తునియలు చేస్తాను. కైలాసాన్నే కదిల్చి దేవతలను బందీలుగాచేసి, యుద్ధరంగంలో ఐరావతంతో సహా ఇంద్రుడినే తలకిందులుగా చేశాను. అటువంటి మహావీరుడికి ఈ విల్లు ఒక లెక్కా! మేరుమందరపర్వతాలను పెకల్చి బంతిలా ఎగురేయగలను. ఉన్నపళంగా భూమిని సముద్రంలో విసిరేయగలను. అగస్త్యుడిలా సముద్రాన్ని ఒక్కక్షణంలో శోషింపచేయగలను. అందరూ చూస్తుండగా అవలీలగా ధనుస్సు విరిచి నీ అల్లుడనవుతాను' అని ప్రతిజ్ఞచేసి తన అలంకారాలు, వస్త్రాలు సవరించుకొంటూ ధనుస్సువద్దకు వెళ్ళాడు.

రావణుని ఆగమనంతో జానకి మనస్సులో మిక్కిలి కలవరపడి డగ్గుత్తికతో 'పరమేశ్వరా! త్రినయనా! త్రిపురాంతకా! మదనదహనా! నీ చాపాన్ని రావణుడు ఎత్తకుండా చూడు. పరమశివా! ఆ దురాత్మునికి తలవంపులు కలిగేలా చెయ్యి. వింటిపై ప్రచండ బలసంపన్నులైన దేవతలను కూర్చుండబెట్టమ'ని శివుని ప్రార్థించింది. వింటిపై కూర్చొని ఆ దుర్జనుడు విముఖుడయ్యేలా చూడమని దేవతలను కోరింది. 'దేవీ! మూలపీఠ సువాసినీ! మంగళకారికా! ఆదిజననీ! రావణశక్తిని ఉపసంహరించు' అని పార్వతిని ప్రార్థించింది. అప్పుడు దేవతలందరూ గుప్తరూపాలతో ధనువును ఆవహించారు. తొమ్మిదికోట్ల కాత్యాయనులు, అరువదినాలుగు కోట్ల యోగినులతో కాళీమాత ధనువును ఆవహించింది. దశకంఠుడు లేచి తన ఇరువది చేతులతో విల్లు ఎత్తబోతే శరీరం అలసిందే తప్ప కదలలేదు. పంటి బిగువున శక్తినంతా కూడదీసుకొని ప్రయత్నం చేయగా, ఒక అనర్థం జరిగింది. మహావృక్షం పెకలించబడ్డట్లు ఆ విల్లు ఒక పొర్లు పొర్లింది. రావణుడు వెల్లకిల దాని క్రిందపడి గావుకేక పెట్టగా సభంతా కలవరపాటు చెందింది. గయాసురుడు పూర్వం పర్వతాన్ని ఎత్తబోయి వెల్లకిల దాని కింద పడ్డట్టుగా అయింది రావణుని పరిస్థితి. వెల్లకిలపడగానే వక్షఃస్థలంమీద ధనుస్సు పడగా సభాస్థలినిండా దుమ్మురేగి రావణుని పది ముఖాలపై పడింది. అది చూచి జానకి ఆనందించింది. పది నోళ్ళనిండా రక్తం ధారలై కారిపోతుండగా రావణుడు ఆ వింటిని మోయలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. త్వరగా ఈ ధనుస్సును లేపండి అని కేకలు వేయసాగాడు. నా ప్రాణాలు పోవడం నిశ్చయం. అదే జరిగితే ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు మీ వంశాన్ని నిర్మూలిస్తారు అని జనకుని హెచ్చరించాడు. కల్లోలితంగా ఉన్న సభను చూచి, "ఇంత సభలో ఎవరూ బలవంతులే లేరా? ఈ అనర్థంనుండి నన్ను రక్షించే వారేలేరా? పరశురాముడు ఇరువది ఒక్క పర్యాయాలు దండెత్తడంతో క్షాత్రం అంతరించిందా?" అని జనకుడు



ఆవేదనతో ప్రశ్నించాడు. ఇది విని కౌశికుడు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా, నిద్రిస్తున్న సింహాన్ని మేల్కొలిపినట్లు రాముడివంక చూసి "ఓ నరసింహా! త్రిభువన వంద్యా! రాజీవనయనా! పురాణపురుషా! రఘునందనా! అరిమర్దనా! త్వరగా లే! కమలోద్భవ జనకా! ఉదారా! తాటకాంతకా! అహల్యోద్ధారా! యాగసంరక్షకా! సమరాంగణధీరా! అసురసంహారా! లేచి రా!" అని పిలుస్తూ సైగచేశాడు. పూర్ణాహుతి సమయాన ప్రత్యక్షమయ్యే ఆరాధ్యదైవంలా, ఉదయాద్రిన ఉదయించే సూర్యుడిలా, విష్ణురూపుడయిన రాముడు తన ఆసనంనుండి పైకి లేచాడు. ప్రహ్లాదుని రక్షించడానికి తటాలున ప్రత్యక్షమయిన నరసింహుడిలా ఉన్న రాముని రాజపరివారం తేరిపారచూసింది. అంతరంగాన వేదాంత విజ్ఞానం సహజంగా పొటమరించగా శ్రీరాముడు నిలిచి గురుచరణాలకు ప్రణమిల్లాడు. పూర్ణ బ్రహ్మానందుడయిన రాముడు వేద పురాణవంద్యుడు. విరక్తుడు, బ్రహ్మచారి, సరయూ తీరవిహారీ లేచి నిలబడగానే ఆ రమ ఈ రాముని తప్ప వేరొకరిని వరించదు అని రాజలోకం అభిప్రాయపడింది. అందరూ వారివారి ఆసనాల్లో సర్దుకొని కూర్చొని ఉత్కంఠతో గమనించసాగారు. దేవతలలో ఇంద్రుడిలా, శాస్త్రసాలలో వేదాంతంలా సమర్థుడయిన శ్రీరామునిచూచి జానకి మనస్సు సంతోషంతో ఉప్పొంగింది. కోటి మన్మథులకు సాటిరాని నీల మేఘచ్ఛాయతో విరాజిల్లే రూపంతో ఉన్న రాముడు గజ సమూహాన్ని చీల్చే సింహంలా, ధనువును లక్ష్యంగా వుంచుకొని, మంటపంలో అడుగిడడం కన్నులపండువుగా ఉంది. ఈ రాముడు సుకుమారకోమలుడు, ధనువు తాబేటి చిప్పవలె ప్రచండం. అట్టి మనోహరుడు శివధనుస్సును ఎత్తడం సాధ్యపడుతుందా? కోమలహస్తాలు కందిపోతాయేమో! ఘనశ్యాముడు, కోమలగాత్రుడు, రాకుమారుడు, రాజీవనేత్రుడు, ఈతనియందే నా మనస్సు లగ్నమయ్యింది. దుష్కరమయిన యీ కార్యం సఫలీకృత మయ్యేలా చూడు

తండ్రీ! అని అంతరంగాన భయాందోళనలతో జానకి విధాతను ప్రార్థించింది. నిర్వికారుడయిన శ్రీరాముని తప్ప వేరొకరిని వరించలేను అని నిశ్చయించుకొంది. చెలికత్తె విజయతో "నా తండ్రి స్వయంవరంలో రాముని గెలవనీయకుండా ఇటువంటి క్లిష్టపరిస్థితి ఏర్పరచి నాకు శత్రువయినాడు. శ్రీశీరాముని తప్ప వేరెవరిని వరించవలసి వచ్చినా నేను దేహత్యాగం చేస్తాను.' అని ఆవేదనతో నిందించింది.

## శివ ధనుర్భంగం

సీత మనసులో మథనపడే సమయాన జగదుద్ధారకుడు, ఆజానుబాహువు, దిగ్గజమైన శ్రీరాముడు సరోవరంలోని పద్మాలపై ఏనుగు పాదతాడనంలా, రావణుడి చేతులను తొక్కుతూ ప్రచండమైన ధనుస్సును సమీపించాడు. శ్రీరాముడు కోదండాన్ని చెరుకుగడలా రెండుముక్కలు చేస్తాడు. విజయం సాధించి సద్గుణవతి సీత వరమాలను గళసీమలో వేయించుకుంటాడు అని మునులు, శ్రీరాముడు అవలీలగా ధనుస్సును ఖండిస్తాడు. విజయకళ్యాణ ప్రాప్తిరస్తు అని బ్రాహ్మణులు ఆశీర్వదించారు. నీలోత్పలం వంటి శరీరచ్ఛాయగల సుకుమారుడు కోదండం ఎత్తగలడా? అని ఒకరు, శ్రీరాముడు బాలుడని మరొకరు, సింహం చిన్నదిగా కనిపించినా మత్తగజ కుంభస్థలాన్ని చీల్చిచెండాడినట్టుగా వింటిని విరుస్తాడని ఇంకొకరు, పొట్టివాడైన అగస్త్యుడు చిటికెలో సముద్రపానం చేసినట్టుగా రాముడు అవలీలగా కార్యసిద్ధి సాధిస్తాడని వేరొకరు, ఆకాశంలో సూర్యుడు చిన్నగా కన్పించినా ప్రతిభ అపారమైనట్టుగా, శ్రీరాముడు అసామాన్యుడని తలకొకరకంగా అనుకోసాగారు.

ధనుస్సును సమీపించిన శ్రీరాముడు మెరుపులా మెరిసే ఉత్తరీయాన్ని నడుముకు చుట్టుకున్నాడు. శిరస్సున ప్రభలతో కూడిన కిరీటం ఉంది. కేశపాశం నాభివరకు విస్తరించింది. ఆకర్ణాంతం విస్తరించిన విశాలనేత్రాలు



రక్తంలా ఎర్రబారాయి. ఆ సుకుమారుని కురులవెంట వెలువడిన సువాసనలు సప్తావరణాలను ఛేదించుకొనిపోతున్నాయి. ఆ సువాసనలకు తేనెటీగలు చుట్టూ తిరుగుతున్నాయి. వంగి శివధనుస్సును తాకగా శ్రీరాముని నీలకేశాలు దశకంఠుని హృదయాన్ని తాకాయి. శంకరార్చితుడయిన రాముడు కేశాలు సవరించుకొని, ధనుస్సు గంటలు మోగుతుండగా, వింటి ధ్వజం మెరుపులా మెరుస్తుండగా ఏనుగు చెరుకును చుట్టి లేపినట్టు ఆ వింటిని అవలీలగా లేపాడు. తనకు అలవిగాని కార్యాన్ని రాముడు అవలీలగా పూర్తిచేయడం చూచి ప్రచండమయిన రామ పరాక్రమానికి రావణుడు ఖిన్నుడైనాడు. 'ఓ నరవీర శ్రేష్ఠా! శ్రీరామా! సత్వరంగా అందరి అనుమానాలు తొలగించు' ఏ ధనుస్సును ఎత్తలేక రావణుడు నేలకొరిగిపోయాడో, అటువంటి దానిని శ్రీరాముడెలా అవలీలగా ఎత్తగలిగాడో వివరంగా చెప్పమని జనకుడు కౌశికుని కోరాడు.

"మహారాజా! శ్రీరాముడు వైకుంఠాధిపతి. ఎన్నో అద్భుతాలు చేయగల సమర్థుడని మీరే చూస్తార"ని విశ్వామిత్రుడు సమాధానం చెప్పాడు. ఇంతలో దరహాసవదనుడైన శ్రీరాముడు నారిని ఆకర్ణాంతం సారించాడు. శ్రీరాముని బలం ప్రచండం. ఆ శక్తిని ధనుస్సు ఆపలేక వేయి పిడుగులు పడ్డట్టు, బ్రహ్మాండం దద్దరిలినట్టు ధనుస్సు పెళ్ళుమని విరిగింది. పెళపెళమనే ధ్వనులు పిడుగులయ్యాయి. కల్పాంతమయింది అని ఇంద్రాదిదేవతలు భావించారు. భూమండలం కంపిస్తుంటే ఆదిశేషువు శిరస్సు సవరించుకొంటున్నాడా! ఆదివరాహం తన కోరలతో భూమినెత్తుతున్నాడా! భూమి రసాతలానికి కృంగిందా! అనే సందేహాలతో రాజన్యలోకం భ్రమించింది. రాముడు వింటిని రెండు ఖండాలుగా చేశాడు. బ్రహ్మాండం రాముని ప్రతాపంతో ఘోషిల్లింది. దేవతలు పుష్పవృష్టి కురిపించారు.ఇది చూసి సభ మూర్ఛిల్లింది. శివధనుస్సును రెండు తుంటలు చేయడం సావధానంగా జనకుడు, విశ్వామిత్రుడు,

లక్ష్మణుడు, సీత గమనించారు. యాజ్ఞికులు పంచముడని బైటికి గెంటినట్లు, భ్రష్టుని బ్రాహ్మణులు, పండితులు వెలివేసినట్లు, పూర్వపుణ్యంవల్ల నక్క సింహం పట్టునుంచి బైటపడినట్లు, పుణ్యం క్షీణించిన తర్వాత స్వర్గాన్ని వీడినట్లు రావణుడు తన ప్రధానితో శిక్షపడిన దొంగలా, రణంలో ఓడిపోయిన వీరుడిలా, అసత్యవాదిలా నలుగురికి మోహం చూపించలేక గుట్టుగా స్వస్థానానికి వెళ్ళాడు.

నిర్మలమైన ఆకాశంలో వెలిగే సూర్యుడిలా, విజయంపొందిన నీలమేఘశ్యాముని, సగుణరూపుని, భక్తజనులు, మునులందరు ఆనందాశ్రువులు ఉప్పొంగిరాగా ఆ శ్రీరాముడు వింటినెలా విరిచాడా అని అచ్చెరువందారు. ఉప్పొంగివచ్చే ప్రేమతరంగాలను ఆపుకోలేక సుకుమారుడైన శ్రీరాముని ఒక్క పరుగులో వెళ్ళి విశ్వామిత్రుడు ఆలింగనం చేసుకున్నాడు.

ఆదిపురుషుడు! పూర్ణబ్రహ్మానందుడు శంకరమిత్రుడు! ఆత్మారాముడు! భక్తుల కోర్కెలనీడేర్చే కల్పవృక్షమైన శ్రీరాముడు అద్భుత లీలను ప్రదర్శించాడు. చేతులుచాచి లావణ్యఖని సీతతోసహా ఆ రఘువీరునికి హారతి పట్టవలసిందేనని విశ్వామిత్రుడు ప్రశంసించాడు. ఇంతలో వయ్యారి సీత ఏనుగు అంబారీదిగి హంస గమనంతో, మాల చేత బూని వచ్చింది. నేటికి నా జన్మ ధన్యమైంది. నా కూతురు శ్రీరాముని వరిస్తోంది. జగద్వంద్యుడు, మనోహరుడు, సుగుణుడు, జగత్పిత అయిన శ్రీరాముడు నాకు అల్లుడైనాడని భూదేవి మురిసిపోయింది. జగన్మాతే జానకి. ఉభయులు భక్తులను తరింపజేయడానికి సగుణరూపంలో అవతరించారు. సచ్చిదానందంతో నీలమేఘశ్యాముడు, ఆదిపురాణపురుషుడు, పూర్ణావతారుడు, పూర్ణబ్రహ్మ, సకలజీవరాశికి సాక్షీభూతుడు ఆది, అంతము తానే అయిన సీతాపతి అందరి రాజులను నిర్జించి సీతకు ప్రియకరుడయ్యాడు అని జనకుడు మురిసిపోయాడు.

అందమైన మువ్వలు సవ్వడి చేస్తుండగా రఘుపతి మెడలో మాలవేసి పాదాలకు ప్రణమిల్లింది హంసగమనయైన సీతాదేవి. అందరూ ఆనందభరితులై



ఆ సుముహూర్తాన దేవ గంధర్వులు చేసిన వివిధ వాద్య ఘోష మిన్నంటింది. నా భాగ్యం అపారం. భువన సుందరుడు. మేఘశ్యాముడు, రఘువీరుడే నాకు అల్లుడుగా లభించాడని జనకుడెంతో సంతోషించాడు.

**దశరథునికి శుభలేఖ పంపడం**

జనకుడు, విశ్వామిత్రుడు కలసి రెండు శుభలేఖలను దూతద్వారా దశరథమహారాజుకు పంపారు. విశ్వామిత్రునిచే వ్రాయబడిన నాలుగువైపులా కుంకుమరాసిన, ఆ శుభలేఖను దశరథుడు తెరిచి చూచి వసిష్ఠుడి కిచ్చాడు. రెండు లేఖలలో వారి అభిప్రాయం ఒక్కటే. అందులో ఉండే విశేషార్థాలను, చాతుర్యంతో కూడిన వార్తలను కులగురువు వివరించాడు. శివధనుస్సు విరిచి రాముడు విజయం సాధించాడు. దీనికి శంకరుడు సంతోషించాడు. బ్రహ్మ ఆచంద్రార్కము వధూవరులు సుఖంగా వుండాలని ఆశీర్వదించాడు. సీత రాముడి ప్రతాపానికి పరవశురాలైంది. సీతారాములు ఏకమై అందరి ఆశీర్వాదాలు పొందారు. మీరు త్వరగా రావల్సింది అని లేఖలో ఉండే సారాంశాన్ని వివరించాడు వసిష్ఠుడు. త్రిపురాసురుని వధించిన శూలపాణికి పృథ్వే రథము, సూర్యచంద్రులే రథచక్రాలు, కనకాద్రే విల్లు, ఆదిశేషుడు నారి, బ్రహ్మ సారథి. అలాగే చక్రపాణి బాణం. ప్రస్తుతం రఘునందనుడు తానే బాణమై శివధనుస్సు విరిచి రథగర్భంలోనున్న రత్నాలరాశి సీతను సాధించాడు అని మహిమ్నసూక్తంలో రథక్షోణియంత అనే శ్లోకాన్ని రామపరంగా అన్వయించి చెప్పాడు.

అది విని మహారాజు ఆనందంతో జయధ్వానం చేస్తూ షోడశపద్మాలు గల చతురంగబలాల్ని సిద్ధం చేయమని ఉత్తర్వు ఇచ్చాడు. సుమంతుడు, మొదలైన ప్రధానులు వెంటరాగా, రాకుమారులు భరత, శత్రుఘ్నులు బయలుదేరారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి సముచిత వాహనాలు ఎక్కిరాగా

దశరథుని మిగిలిన ఏడువందలమంది భార్యలు శ్రీరాముని వివాహం చూద్దామని ఉత్సాహంతో ప్రయాణమయ్యారు. వీరితో బంగారు దండాలు చేతబూనిన వేత్రహస్తులున్నారు. వేలాది సైన్యం తోడుగాఉంది. పురప్రజలు వెంబడించారు. అందరూ కూడా వస్తుండగా దశరథుడు తన రథాన్నెక్కి మిథిలామార్గాన వేగంగా ప్రయాణించాడు.

రథంపై సూర్యధ్వజం, రెండుప్రక్కల చంద్రవర్ణంగల వింజామరలు ముందు మకరధ్వజం ఎగురుతుండగా ఛత్రధారియై మహారాజు రథంపై విరాజిల్లాడు. వెంబడి వివిధ వాద్యాలు, బాజా భజంత్రీల ఘోష అట్టహాసంగా వుంది. శమదమాలనే పదాతిదళం ముందు నడువగా, వెనుక సద్వివేకమనే ఆశ్వికదళాలు అపారంగా ఉన్నాయి. వాటి వెనుక నిజబోధ అనే ఏనుగులు రామనామాన్ని ఘీంకరిస్తూ సాగుతున్నాయి. ఆత్మానుభవమనే దివ్యపథంలో ఆ ఊరేగింపు సాగిపోతున్నది. ఆ రథానికి పూన్చిన చతుర్విధ పురుషార్థాలనే యుద్ధాశ్వాలు సమానగతిలో సాగిపోతున్నాయి. నిజానికి జాగ్రదవస్థలో సత్యం తొలిమెట్టు. స్థూలంగా అన్నింటిని గమనించవచ్చు. కానీ దశరథు డీ అవస్థలో లేడు. అతని చిత్తం రఘునాథునిమీదే వుంది. జాగృతి కంటె సూక్ష్మమైన స్థాయిలో స్వప్నావస్థ ఉంది. ఆ స్థితిలోను దశరథుడు లేడు. ఆయనకుండేదల్లా రాముని చేరుకోవాలన్న ఆతృత మాత్రమే. తదుపరి సుషుప్త్యవస్థ కారణభూతమైనది. అక్కడ అంతా నిర్మానుష్యం. అంధకారం. అక్కడ నుండి రామోపాసకులు త్వరగా ముందుకు సాగిపోయారు. ఏ ఆటంకాలు లేక రామోపాసకులతో ఆ ఊరేగింపు మిథిల వెలుపలి ఉపవనము చేరింది. యోగి తురీయావస్థలో పొందే దివ్యజ్ఞానంలా అందరూ రఘునాథ ప్రాప్తికోసం ఆగారు. ఎదురుగా విరాజిల్లుతున్నదే విదేహ నగరం. మంగళవాద్యాలతో విదేహాధిపతి అనాహత వాద్యబృందాలతో సైన్యంగా ఎదురొచ్చి దశరథునికి, విడివిడిగా అందరికీ స్వాగతం పలికాడు. దశరథుడు యథావిధిగా జనకుని యోగక్షేమాలు



విచారించాడు. భరత, శత్రుఘ్నుల్ని చూసి రామలక్ష్మణులుగా భ్రమించాడు జనకుడు. దశరథుడు తన పుత్రులను పరిచయం చేయగా జనకుడు అందరినీ మేళతాళాలతో సభామంటపానికి తోడ్కొని తెచ్చాడు. వీరులు కొందరు విరిగిన వింటిని చూసి గగుర్పాటు చెందారు. వింటి తుంటలను జూసి ఒకడు కన్నీరు కార్చాడు.

భక్త కల్పద్రుముడైన శ్రీరాముడు తల్లి కౌసల్య చెంతచేరి గాఢాలింగనం చేసుకొని ప్రేమతో మైమరచి పోయాడు. కౌసల్య రాముడిని ఒడిలోకి తీసుకొంటూ 'రామా! సుకుమారుడువి – ఇంత పెద్ద ధనుస్సు ఎలా విరిచావు?' అని ప్రశ్నించింది. దశరథుడు రాముని తన అక్కున చేర్చుకొన్నాడు. భరత, శత్రుఘ్నులు అన్న పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. జనకుడు తన దివ్యమందిరంలో వరుడికి అమూల్యమైన కానుకలెన్నో ఇచ్చాడు. మంగళవాద్యాల హోరులో ఇరుపక్షాలవారు పెళ్ళి మంటపాన్ని చేరుకున్నారు. జనకుడు వీరులైన లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల వంక చూస్తూ– 'జానకిని శ్రీరామునికిచ్చాను, వీరికి వరుసగా ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తులనిచ్చి వివాహం జరిపించాలని ఉంది. ఇందుకు అంగీకరించండి' అని దశరథుని కోరగా, దశరథుడంగీకరించాడు.

కులదైవాన్ని పూజించి అందరికీ పసుపుకుంకుమలు పంచారు. పెళ్ళికుమారులు మంగళస్నానాలు చేశారు. తదనంతరం జనకుడు రాకుమారులను పీటలమీద కూర్చోపెట్టడానికి వాద్యాల ఘోషతో బయలుదేరుతున్న సన్నివేశాన్ని దేవతలు వీక్షించసాగారు. శాంతి, దయ, క్షమ, ఉన్మనీ, సద్బుద్ధి, సద్విద్య, కామనీ, తితీక్ష, ముముక్ష, విలాసిని, తుర్య, ఉపరతి, సులీనత, సమాధి, సద్గతి గుణాలతో కళ్యాణమందిరం ప్రకాశిస్తోంది. బోధ, ఆనందం, సద్వివేకం, జ్ఞానం, వైరాగ్యం పరమార్థం, నిష్కామం, అక్రోధం, అనుతాపం అనే పవిత్రభావాలుగల శ్రీరాముని జనం అవలోకిస్తున్నారు.

మణిమయాలంకృతాలయిన పీఠికలపై మధుపర్కాలతో కూర్చొని వరులు వరపూజ చేశారు. రఘునాథుని సుందరపాదాలను బంగారుపళ్ళెరంలో ఉంచి పవిత్రమైన జలాలను, సుమేధ పోస్తుండగా జనకుడు కడిగాడు. వేదాలనే నిర్మించిన శ్రీరాముడికి యజ్ఞోపవీత ధారణం చేశారు. షోడశోపచార సేవకు సిద్ధంగా ఉండండి అని సద్బ్రాహ్మణుల హెచ్చరికతో నలుగురు రాకుమార్తెలు పెళ్ళి మంటపాన ప్రవేశించారు. దివ్యవస్త్రాలంకృతులయిన కోడళ్ళను గమనించి దశరథుడు ఆశ్చర్యానందభరితుడయ్యాడు. తన అల్లుళ్ళను చూచి జనకుని పట్టమహిషి, పుణ్యరాశి అయిన సుమేధ ఆనందం పట్టలేకపోయింది. శ్రీరాముని ముఖారవిందం ముందు కోటి మన్మథులు కూడ దిగదుడుపే. సీతభాగ్యం పండిందని సుమేధ ఆనందంతో పరవశించిపోయింది.

**శ్రీసీతారామ కళ్యాణం**

పండితులు సావధానమని మంగళాష్టకం చదువుతుండగా సుముహూర్తం సమీపించింది. ఓం పుణ్యా అనే ఆచార్యుల మంత్రోచ్ఛారణతో వధూవరుల మధ్య తెర తొలగింది. సీత శ్రీరామునిపై అక్షింతలు వేసి పాదాలకు నమస్కరించింది. శ్రీరాముడు ఆమె శిరస్సున మంగళాక్షతలు చల్లి శుభాశీస్సులిచ్చాడు. నలుగురి వివాహం అదే సమయంలో జరిగింది. మంగళ వాద్యాల హోరు మిన్నంటింది. ఆ వివాహ వైభవం వర్ణించడం ఆదిశేషువు తరం కూడ కాదు. ఆ సమయంలో జనకుడు విశేషమైన అమూల్యకానుకలను దానధర్మాలు చేశాడు. వధూవరులను హోమగుండం వైపుకు తీసుకెళ్ళాల్సిన సమయం వచ్చింది. ప్రపంచంలో ఉండే విపరీతపు రీతులు నాకెందుకు? అని శ్రీరాముడు నవ్వాడు. కులగురువు శ్రీరాముడి వంకచూస్తూ సీతను అనుసరించమని ఆదేశించాడు. రాముడు ఆ ఆదేశాన్ని నిర్వర్తిస్తే, మిగిలిన వరులు హోమగుండం చుట్టూ అందరూ కూర్చొని లాజహోమంతో పాటు యథావిధిగా అన్ని కార్యక్రమాలు జరిపారు. తరువాత రాముడు గౌరీ



పూజకుగాను సీతను అంతర్ గృహానికి తీసుకెళ్ళాడు. పూజ సమాప్తి కాగానే నలుగురు అమ్మవారికి మామిడి ఆకులతో ఎర్రనీళ్ళు చల్లగా ముత్తైదువులు దిష్టి తీసారు. వస్త్ర ప్రదానం చేసి మంటపాన కూర్చోబెట్టారు. నలుగురు కోడళ్ళను చూచి ముగ్గురు రాణులూ ఆనందించారు. ఈ వేడుకలతో జనకుడి అంతరంగం ఆనందంతో నిండిపోయింది.

"నాయనా! శ్రీరామా! నాలుగురోజులు ఇక్కడ ఉండి అప్పగింతల తర్వాత అయోధ్య వెళ్ళు" అని కోరాడు జనకుడు. జరుగబోయేది తెలిసినవాడు కనుక, శ్రీరాముడు అందుకు అంగీకరించలేదు. ఇప్పుడే బయల్దేరాలని అన్నాడు. శ్రీరామచంద్రుని తొందరపాటు జనకునికి అర్థం కాలేదు. ప్రచండవీరుడు భార్గవరాముడు ఈ సమయంలో యుద్ధానికి రావచ్చు. ఆయన కోపానికి మిథిలానగరం దహనం కావచ్చునని శ్రీరాముడు పరివారంతో పో సంకల్పించాడు. రావణసంహారం చేయాలని లంకకు చేరాలని ఆత్రుతగా ఉ ంది. అసంఖ్యాకంగా రాక్షసులను సంహరించి విభీషణుడికి రాజ్యం చేకూర్చే ఆలోచన ఉందని, రాముడి అంతరంగాన్ని వసిష్ఠుడు వివరించాడు. తదుపరి జనకుడు అయోధ్యవాసులకు, దశరథుడికి, రాణులకు, వధూవరులకు భోజనాదికాల తర్వాత అంపకాలు చేయించి, వస్త్రాలు చదివించి, అపారమైన కానుకలిచ్చి, అశ్వగజపదాతి దళాలు త్రికరణశుద్ధిగా సేవిస్తుండగా, శ్రీరాముని వెంట జనకుడు దశరథుడితో సహా బయలుదేరాడు.

అదే సమయాన నారదుడు బదరికాశ్రమానికి త్వరితంగా వెళ్ళి భృగు వంశజుడైన పరశురాముని సమీపించి "బ్రాహ్మణోత్తమా! నీ శివధనుస్సును విరిచి, శ్రీరాముడు నీకు చాలా అపకీర్తి తెచ్చి అపారమైన యశస్సును గడించాడు" అని రెచ్చగొట్టాడు. బదులుగా పరశురాముడు నా అవతారకార్యం పరిసమాప్తి అయిందని సమాధానమిచ్చాడు. అందుకు నారదుడు, 'నీకు ఇప్పుడు ఏమాత్రం కోపం రావడంలేదు. కోపాన్ని విసర్జించిన క్షణమే నీ

తండ్రి మృత్యువాతపడ్డాడు. నీకూ ఆ సమయం వచ్చింది. శ్రీరాముడు నిన్ను విడిచిపెట్టడు. శివవరప్రసాదమైన ధనుస్సుతో క్షత్రియ సంహారం చేశావు' అని ఇంకా ఏదో అనబోతుండగా జమదగ్ని కొడుకైన పరశురాముడు క్షోభించాడు. అగ్నిలో ఆజ్యం పడ్డట్టు, నిద్రిస్తున్న సింహాన్ని కాలితో గీరినట్టు, పులిముక్కు మీద కాలితో తన్నినట్టు, బలవంతంగా పాముని రెచ్చగొట్టినట్టు, మహాశివుడికి కోపం వచ్చినట్టుగా, స్తంభం నుండి నరసింహస్వామి మరలా ప్రకటమయినాడా అన్నట్లున్నాడు పరశురాముడు.

విష్ణుచాపం ధరించి నారదుడు వెంటరాగా అయోధ్యకు పయనమవుతున్న శ్రీరాముని అడ్డగించాడు. గోధుమ వన్నె కలిగి విశాలనేత్రాలతో, దరహాసవదనంతో, తలంతా జడలతో దేదీప్యమానంగా వెలిగిపోతూ, యజ్ఞోపవీతం మెరిసిపోతుండగా, నడుముకు పీతాంబరం కట్టి, ధనుస్సుకు బాణం సంధించి, రోషకషాయిత నేత్రుడై, సూర్యునిలా వెలిగిపోతూ పరశు రాముడు అడ్డువచ్చాడు. అతనిని చూడగానే షోడశ పద్మదళ సైన్యం నిర్వీర్యమయింది. ఇరువదిఒక్క పర్యాయాలు లోకమంతా తిరిగి భూమిపైనున్న రాజులందరిపై దండెత్తి వారిని నిర్జించాడు. రెండవ ప్రళయాగ్ని వలె పరశు రాముడు క్షత్రియ మేఘసముదాయాన్ని సుడిగాలివలె చేత గండ్రగొడ్డలి ధరించి వీరారణ్యాలను నిర్మూలించాడు. పెద్దపులిని చూసి మేకలమంద పరుగెత్తినట్లు, వారు శస్త్రాస్త్రాలు విసర్జించి పరుగెత్తారు. మేఘాలను తోలే పెనుగాలిలా, ప్రళయాగ్నిని పోలిన పరశురాముని చూచి, ఇప్పుడు ఎటువంటి అనర్థం రానున్నదో అని మిథిలేశ్వరుడు భయపడ్డాడు. దశరథుడు స్త్రీలచాటున దాగాడు.

వైరాగ్యమనే ఏనుగుపై ధృడచిత్తమనే అందమైన అంబారీలో, అనుభవమనే మావటివానిలా శ్రీరాముడు వివేకాంకుశంతో శోభిల్లాడు. జ్ఞానధ్వజం ఎగురగా, విజ్ఞాన బిరుదాంకితుడిలా మిరుమిట్లుగొల్పే తేజంతో, దృఢంగా, సంతోషంగా రాముడు ముందుకు సాగాడు. నివృత్తి పతకాలతో ముముక్షువులు సాధక



రామనామ చిహ్నాలను చూస్తూ సాగుతున్నారు. వాయువేగంతో అశ్వదళం పరుగిడుతోంది. మనోవీచికలనే అశ్వాలు అనుసంధానం అనే పగ్గాలతో విరక్తి జీను కప్పుకొని అనుభవాలనే ముత్యాల సరాలు వేలాడుతుండగా పరుగెడుతున్నాయి. చిత్రరత్నాలు పొదిగిన దివ్యరథంలో పర, పశ్యంతి, మధ్యమ, వైఖరులు నాలుగు చక్రాలుగా చతుర్విధ పురుషార్థాలు గుర్రాలుగా పూన్చి, ఆనందమనే సారథితో వెళ్తున్నాడు రాముడు. నామం అనే శస్త్రం ధరించి 'సోహం' అని ఘోషిస్తూ ఆ వీరులు క్షణంలో ప్రపంచాన్ని విధ్వంసం చేస్తారు. వారిని ఎదిరించడం అసంభవం. అధ్యయనమనే ఛత్రం, స్వానందమనే ఆతపత్రం, తన్మయమనే చామరాలు శోభిస్తుండగా ప్రేమ అనే వింజామర వీయుచుండగా, శుద్ధ సత్వగుణం నిజభక్తి అనే తాంబూలమిస్తున్నారు. అష్టభావాలనే సేవకులు రాముని ముందు వేగంగా పరుగులిడుతున్నారు. ఆయన ముఖావలోకనం వల్ల అనుతాపమనే రుమాలుతో మాయచేకూడుకున్న దుమ్ముధూళి నివారణ పొందుతుంది. రామవదనాన్ని విలోకిస్తూ తర్కాతీత స్థితిలో సైన్యం సాగిపోతోంది. లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు సచ్చిదానంద బంధుత్వంతో అభేదంగా స్వరూప ప్రాప్తి అనే సామ్రాజ్యాన్ని అధిరోహించారు. వజ్రాలు పొదిగిన దంతాలు, ముత్యాలు, సరాలు మెరుస్తూంటే కామక్రోధ వృక్షాలను నరుకుతూ సహజస్థితిలో సాగుతున్నారు. ఆశ, తృష్ణ, కల్పన, భ్రాంతి మొదలైన ఆటంకాలు ఎదురయినా ఛేదించి, పళ్ళతో గట్టిగా కొరికి, విషయ శిలలను పగలగొట్టారు. మద, మాత్సర్య, దంభ పర్వతాలను రథ చక్రాల కింద పిండిచేసి దుర్బుద్ధులైన పాషాణాలను నాశనం చేస్తూ, మెత్తగా నూరి, ధైర్యమనే గుర్రాలమీద దడదడా పోతున్నారు. కలికాలంలో కూడా ప్రబలమయిన మాయామెరుపులు రణరంగంలో మెరిసినా, నిర్మలమయిన రామోపాసకులు వాటిని లెక్కపెట్టరు. వారు శమ, దమ అనే కాల్బలాలతో నిష్కామప్రదేశం చేరి ఊగుతున్నారు. వారు పూర్ణభక్తిలో మునిగి పారవశ్యంతో

నిశ్శబ్దంగా సాగుతుంటే, ఉచ్ఛ్వాసనిశ్వాసాలనే వాద్యాల హోరువింటూ మెట్టవేదాంతులు కర్మజాలమనే వనచరాలను ఇంటిదాకా తరిమికొట్టారు. చతుర్వేదాలు, షట్శాస్త్రాలు, అష్టాదశపురాణాలు రామునికే వందిమాగధులయ్యాయి. సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యమనే చతుర్విధ మోక్షవనితలు ఆనందంతో నాట్యం చేయసాగారు. సైన్యంధాటికి మార్గంలో ఉండే అవిద్య అనే ఏరు ఇంకిపోయింది. నిశ్చలభావంతో వారు శ్రీరాముని ముందు సాగారు. సోహం జపిస్తూ, ద్వైతాన్ని ఖండిస్తూ, ఆత్మానందంతో రామునిముందు గంతులు వేస్తూ రాముని గుణగణాలను కీర్తిస్తూ సాగిపోతున్నారు. అందులో ఒకరు మూగవాడయ్యాడు. మరొకడు వాచాలత్వం చూపించాడు. మరొకడు సమాధిస్థితిలో ఉన్నాడు.

కౌసల్య హృదయ పేటికారత్నం అయిన రఘురాముడు సైన్యాన్ని ఆపి, గజబలానికి ముందుగా వెళ్ళి, క్షత్రియహంతకుడు, జమదగ్నిసుతుడు అయిన పరశురామునికి నమస్కారం చేశాడు. అదిచూసిన నారదుడు పరశురాముడితో 'చూశావా నిన్ను చూసి కూడా రాముడు ఏనుగుమీద నుండి దిగలేదు. వీరునీ, బ్రాహ్మణునీ గౌరవించే విధానం ఇదేనా!' అని రెచ్చగొట్టాడు. నిజమని భావించి భృగునందనుడు ఉగ్రుడై వింటిని సారించి, "నీవు క్షత్రియులలో మిన్న అని అనుకోవచ్చు. అధమురాలైన తాటక అనే అబలను చంపి అధర్మానికి పాల్పడ్డావు. స్త్రీ, రోగి, మూర్ఖుడు, బాలుడు, యోగి, యాచకుడు, బలహీనుడు, కుంటివాడు, గుడ్డివాడు, వృద్ధుడు, బ్రాహ్మణుడు, గోవు, గురువు, జ్యేష్ఠబంధువు, తల్లి, తండ్రి, వెన్నిరిచి పారిపోయేవాడు – వీరిపై శస్త్రాస్త్రాలను ప్రయోగించడం మహాదోషం. వీరులలో అధముడివి, స్త్రీ హంతకుడివి, జానకి మోహబద్ధుడివి, నీవేం మాట్లాడతావు?" అని కోపంగా పలికాడు. బదులుగా శ్రీరాముడు "తాటక నా తల్లికాదు, తల్లిని చంపిన దానికంటే నీచత్వం ఏముంటుంది! ఉన్నత వంశ బ్రాహ్మణుడివి, అనుష్ఠానం, జపతపాదులను వదలి శస్త్రాలను



ధరించి, రాజులను సంహరించి రాజహింసకు పాల్పడే అధికారం నీకెక్కడ ఉంది? నీవు బ్రాహ్మణుడవు, పవిత్రుడవు. నీపై శస్త్ర ప్రయోగం చేస్తే ఆ కర్మ మాకు అపవిత్రమే" అని సమాధానం ఇచ్చాడు. అందుకు బదులుగా పరశు రాముడు నిర్వాణబాణం ప్రయోగించాడు. శ్రీరాముడు బాణం సంధించాడే తప్ప వదలలేదు. పెనుగాలికి దీపాలు ఆరినట్లు, ముక్కంటి తీక్ష్ణమైన చూపుకు మదనుడు భస్మమైనట్లు, ఆత్మజ్ఞానం కలుగగానే మదమత్సరాలు మాయమైనట్లు, మంచివర్షానికి నిప్పు ఆరినట్లు, కల్పాంతంలో మెరిసే మెరుపులా మెరుస్తున్న శస్త్రం రాముని తీక్ష్ణమైన చూపుకు కరిగింది. ఎన్ని అస్త్రాలను పరశురాముడు ప్రయోగించినా మార్గమధ్యంలోనే శ్రీరాముడి చూపుకు ఆహుతి అయ్యాయి. అప్పుడు పరశురాముడు క్షీరాబ్ధినివాసి నారాయణుడే శ్రీరాముడని గ్రహించి, తన శక్తి తరిగిపోయిందని గుర్తించి ధనుర్బాణాలను కింద పెట్టి సముద్రంలో అలలు ఒకటయినట్లుగా, అద్వైతశాస్త్ర పండితుల శ్రుతి కలిసినట్లుగా శ్రీరాముని కలుసుకోవడానికి అతివేగంగా వెళ్ళాడు. రెండుదీపాలు ఏకమైనట్లు శ్రీరామ పరశురాములు ఒకటయ్యారు. త్రికాలంలో భిన్నత్వం లేకపోవడం, క్షత్రియులను సంహరించిన క్రోధజ్యోతి రఘుపతి ముఖంలో కలసిపోవడం అందరూ గమనించారు. అప్పుడు శ్రీరాముడు నేను సంధించిన బాణం ఎటువదలాలని పరశురాముని ప్రశ్నించాడు. స్వర్గమార్గంలో దీనిని వదలాల్సింది. నేను చిరంజీవిగా తపం చేసుకోడానికి నిష్క్రమిస్తాను అని సమాధానమిచ్చాడు. రఘురాముడు అలాగే బాణం వదిలి పరశురాముని చిరంజీవిగా జేశాడు.

### అయోధ్య తాత్వికస్వరూపం

అనుమతి పొందిన భార్గవరాముడు బదరికాశ్రమానికి, జనకుడు మిథిలకు, నరకిశోరము రఘునాథుడు సైన్యసమేతంగా అయోధ్యకు తరలివెళ్ళారు. నగరం చేరిన శ్రీరాముని, ప్రజలు కళ్ళారా తిలకించారు. ఆదిశేషుడితో నారాయణుడు నగరప్రవేశం చేశాడు.

ప్రథమ మార్గం స్థూలదేహ సమానం. రెండవది సూక్ష్మం. మూడవది కారణం. ఆఖరిది మహాకారణ దుర్గం. షడ్చక్రాలు గోపురాలు, ఇదే ఆత్మప్రాప్తిస్థానం, దేదీప్యమానం. నగరం వెలుపల నాలుగు దుర్గాలు. నాలుగు అవస్థలుగా, నాలుగు అభిమానాలుగా దివ్యతేజంతో మెరుస్తున్నాయి. అనేకస్థూల, సూక్ష్మ తర్కాలతో మార్గంలో పయనిస్తూ, పంచప్రాణాలు, దశేంద్రియాలు వీరుల్లా అక్కడక్కడ నర్తిస్తున్నాయి. పంచభూతాలు చాలా విలువైనవి. విశాలవ్యాప్తి కలవి. శమదమ వృక్షాలకన్న విలువకలిగి నిర్మలమయి ఎలా విరిచావు? అని ప్రశ్నించింది. దశరథుడు రాముని తన అక్కున చేర్చుకొన్నాడు. భరత, శత్రుఘ్నులు అన్న పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. జనకుడు తన దివ్యమందిరంలో వరుడికి అమూల్యమైన కానుకలెన్నో ఇచ్చాడు. మంగళవాద్యాల హోరులో ఇరుపక్షాలవారు పెళ్ళి మంటపాన్ని చేరుకున్నారు. జనకుడు వీరులైన లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల వంక చూస్తూ– జానకిని శ్రీరామునికిచ్చాను, వీరికి వరుసగా ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తులనిచ్చి వివాహము జరిపించాలని ఉంది. ఇందుకు అంగీకరించండి అని దశరథుని కోరగా, దశరథుడంగీకరించాడు.

కులదైవాన్ని పూజించి అందరికీ పసుపుకుంకుమలు పంచారు. పెళ్ళికుమారులు మంగళస్నానాలు చేశారు. తదనంతరం జనకుడు రాకుమారులను పీటలమీద కూర్చోపెట్టడానికి వాద్యాల ఘోషతో బయలుదేరుతున్న సన్నివేశాన్ని దేవతలు వీక్షించసాగారు. శాంతి, దయ, క్షమ, ఉన్మనీ, సద్బుద్ధి, సద్విద్య, కామనీ, తితిక్ష, ముముక్ష, విలాసిని, తుర్య, ఉపరతి, సులీనత, సమాధి, సద్గతి గుణాలతో కళ్యాణమందిరం ప్రకాశిస్తోంది. బోధ, ఆనందం, సద్వివేకం, జ్ఞానం, వైరాగ్యం పరమార్థం, నిష్కామం, అక్రోధం, అనుతాపం అనే పవిత్రభావాలుగల శ్రీరాముని జనం అవలోకిస్తున్నారు. మణిమయాలంకృతాలయిన పీఠికలపై మధుపర్కాలతో కూర్చొని వరులు



వరపూజ చేశారు. రఘునాథుని సుందరపాదాలను బంగారుపళ్ళెరంలో ఉంచి పవిత్రమైన జలాలను, సుమేధ పోస్తుండగా జనకుడు కడిగాడు. వేదాలనే నిర్మించిన శ్రీరాముడికి యజ్ఞోపవీతధారణం చేశారు. షోడశోపచార సేవకు సిద్ధంగా ఉండండి అని సద్బ్రాహ్మణుల హెచ్చరికతో నలుగురు రాకుమార్తెలు పెళ్ళి మంటపాన ప్రవేశించారు. దివ్యవస్త్రాలంకృతలయిన కోడళ్ళను గమనించి దశరథుడు ఆశ్చర్యానందభరితుడయ్యాడు. తన అల్లుళ్ళను చూచి జనకుని పట్టమహిషి, పుణ్యరాశి అయిన సుమేధ ఆనందం పట్టలేకపోయింది. శ్రీరాముని ముఖారవిందం ముందు కోటి మన్మథులు కూడ దిగదుడుపే. సీతభాగ్యం పండిందని సుమేధ ఆనందంతో పరవశించిపోయింది.

## శ్రీ సీతారామ కళ్యాణం

పండితులు సావధానమని మంగళాష్టకం చదువుతుండగా సుముహూర్తం సమీపించింది. ఓం పుణ్యా అనే ఆచార్యుల మంత్రోచ్చారణతో వధూవరుల మధ్య తెర తొలగింది. సీత, శ్రీరామునిపై అక్షింతలు వేసి పాదాలకు నమస్కరించింది. శ్రీరాముడు ఆమె శిరస్సున మంగళాక్షతలు చల్లి శుభాశీస్సులిచ్చాడు. నలుగురి వివాహం అదే సమయంలో జరిగింది. మంగళ వాద్యాల హోరు మిన్నంటింది. ఆ వివాహ వైభవం వర్ణించడం ఆదిశేషువు తరం కూడ కాదు. ఆ సమయంలో జనకుడు విశేషమైన అమూల్యకానుకలను దానధర్మాలు చేశాడు. వధూవరులను హోమగుండం వైపుకు తీసుకెళ్ళాల్సిన సమయం వచ్చింది. ప్రపంచంలో ఉండే విపరీతపు రీతులు నాకెందుకు? అని శ్రీరాముడు నవ్వాడు. కులగురువు శ్రీరాముడీవంక చూస్తూ సీతను అనుసరించమని ఆదేశించాడు. రాముడు ఆ ఆదేశాన్ని నిర్వర్తిస్తే, మిగిలిన వరులు హోమగుండం చుట్టూ అందరూ కూర్చొని లాజహోమంతో పాటు యథావిధిగా అన్ని కార్యక్రమాలు శ్రీమత్ భీమాతటవిలాసా! బ్రహ్మానందా!

పుండరీకా! శ్రీధరవరదా! పురాణపురుషా! అభంగా! అవినాశా! అజేయా! నీకు నమస్కారము. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**అష్టమాధ్యాయం మధురం**

బాలకాండం సమాప్తం



**అధ్యాయము - 9**

## శ్రీగణేశాయ నమః శ్రీరామచంద్రాయ నమః శ్రీగురవే నమః శ్రీదత్తాత్రేయాయ నమః శ్రీగురు బ్రహ్మానంద నమః

జగదుత్పత్తికి కారణభూతమై తన భక్తులను తరింపజేసే కైవల్యప్రదాతా! సుఖసాగరా! వివిధ యోగులకు ఆశ్రయమైనవాడా! వైరాగ్యలతకు పూచిన పుష్పమా! వేదాంత సముద్రంలో ముత్యాలవంటి ఆత్మలను ప్రకాశింపచేసేవాడా! ధర్మమనే మేరుపర్వతశిఖరమా! చిదాకాశంలో ప్రకాశించే మేఘమా! కృపాసాగరంలో మెరిసే సుందర దివ్యరత్నమా! శాంతి వెన్నెలలు విరజిల్లే చంద్రబింబమా! సత్యతేజో భానుమండలమా! సత్య సరోవరంలో కమలమా! సత్ఫలాలను ఇచ్చే ఆనందవృక్షమా! క్షమ అనే నిర్వికార మలయ పర్వతమా! ముముక్షువులనే సర్పాలతో సదా పరివేష్టించబడిన దివ్య చందనవృక్షమా! శుద్ధ బ్రహ్మమా! నిర్మలమైన భక్తి జ్ఞాన వైరాగ్య తరంగాలతో నిండిన గంగానది వంటి తీర్థరాజమా! నమోవాకములు!

**సద్గురువు - గురుభక్తులు**

ఇటువంటి గురునాథుని పరుసవేదితో పోలుస్తామనుకుంటే పరుసవేది ఇనుమును బంగారంగా మార్చగలదేగాని మరో పరుసవేదిగా చేయజాలదు. కామధేనువు, చింతామణి, కల్పవృక్షం ఇవన్నీ కోరినవి మాత్రమే ఇస్తాయి. కానీ వాటివలె తయారుచేయలేవు. గురువు ఏదీ కోరకుండానే శిష్యుని కటాక్షిస్తాడు. గురువును తల్లిదండ్రులతో పోల్చలేం! ఎందుకంటే, తల్లిదండ్రులు జన్మదాతలే కానీ, గురువు జన్మరాహిత్యాన్ని కలిగిస్తాడు. సృష్టి చక్రంలో ఎనభైనాలుగులక్షల జీవరాసులకూ తల్లిదండ్రులున్నారు. కానీ ఎన్ని జన్మలెత్తినా చిత్స్వరూపుడైన సద్గురువు దొరకడం మాత్రం దుర్లభం. ఎవరు భవకాష్ఠాన్ని

దహించే వైశ్వానరుడో, అజ్ఞానతిమిర ఛేదకుడో, దుఃఖపర్వతాలను ఖండించే ఇంద్రుడో, అట్టి గురువు ఆత్మబోధ అనే వజ్రాయుధంతో ప్రకాశిస్తున్నాడు. అటువంటి మహాత్ముడయిన గురునాథుడికి విరక్తుడయిన శిష్యుడు శరణాగతుడై ఆ గురు పాదపద్మ చరణరజాసక్తుడై, భ్రమరంగా పరిభ్రమిస్తుంటాడు. అగ్నిలో నిప్పుకణంలా, సరోవరంలో నీటిబిందువులా, సాగరంలో ఐక్యమయ్యే నదిలా భక్తులు గురుచరణాల్లో లీనమవుతారు. అందంలో అలంకారంలా, జలాశయంలో జలంలా, నీటిలో తరంగాల్లా, గురుచరణాల్లో తాదాత్మ్యం చెంది, ఆయన పాదసేవ చేస్తూ, పాలసముద్రంలో ఉపమన్యుడిలా, గంగలో మణికర్ణికలా, భీమానదిలో చంద్రభాగలా, భజనగంగలో మునిగితేలే గురుభక్తులు వందనీయులు. ఈ గురు మాహాత్మ్యం విని శ్రోతలు పరమానందభరితులయ్యారు. మహాత్ములు ఆనందంతో తలలు ఊపుతూ కలసి ధన్యవాదాలర్పించారు. ఇది చూసిన శ్రీధరుడు అందరికీ ఆదరభావంతో నమస్కరిస్తున్నాడు. "మీరందరూ రామకథామృతాన్ని గ్రోలేందుకు ఆసక్తులు. జ్ఞానగంగా ప్రవాహంలా నిర్మలులు. వివేకం మూర్తీభవించినవారు. కృపాసముద్రంలో క్షమ అనే తెరచాపతో తేలాడే ఓడలు, క్షమాబుద్ధితో ప్రకాశించేవారు. నవవిధ భక్తులుగా భాసిల్లే సుందరద్వీపాలు. అనుభవ శాస్త్రమందిరాలు. నలువైపులా సరిసమంగా పక్వానికొచ్చిన ఆనంద క్షేత్రాలు. పరోపకారమనే నిర్మలాకాశంలోని తారాగణాలు. సద్గుణాలనే మేలిముత్యాలను ఆకాంక్షించే రాజహంసలు. ఈ శబ్దసాగరంలోని శబ్దరత్నాలను గ్రహించేందుకు మీరందరూ కథాశ్రవణానికి విచ్చేశారు. మీరు రామకథా కమలంలోని పరాగాన్ని ఆస్వాదించే భ్రమరాలు. రామతత్త్వంతో అనుసంధానం చేసే మేఘాలు. నా మాటలన్నీ ప్రాకృతాలు. అయినా మీరు ప్రీతితో ఆలకిస్తున్నారు! శుకమహర్షి వనచర విహంగమయినా ఆయన బోధనలను వినడానికి గొప్ప శాస్త్రజ్ఞులు, పండితులు, ఋషులు, ఎదురయినట్లు మీరందరూ నా అదృష్టంకొద్దీ



తారసిల్లారు. చిన్నపిల్లవాడి ముద్దుమాటలకు తండ్రి ఆనందించినట్లుగా, పసివాడినైనా నన్ను ఆదరంతో మన్నించవచ్చారు. నా మాటల్ని ఆలకించవలసింది. రామకథా రచన అనే క్షేత్రాన్ని సాగుచేసి సిద్ధంచేశాను. మేఘాలవంటి శ్రోతలు సాదరం అనే వర్షాన్ని కురిపించకపోతే చిత్త వ్యాకులత వల్ల మొలకలు ఎండిపోతాయి. అలాగే శ్రోతలను ఆనందింపచేసే ప్రయత్నం నిష్ఫలమవుతుంది" అన్న కవివాక్కులు విన్న చతురులైన శ్రోతలు "చంద్రునివంటి శీతలకిరణ స్పర్శ కలిగిన మాటలతో మేము చకోరాలలా ఆనంద భరితులమయ్యాము" అని అన్నారు. సుందరమైన వాగ్దేవి యీ నవమాధ్యాయంలో అయోధ్యాకాండమంటపాన్ని అల్లుకొని సత్ఫలితాలను ఇస్తోంది, శ్రద్ధాళువులయిన భక్తులు సేవించండి.

గత అధ్యాయంలో రాముడు కోదండాన్ని విరిచి జానకిని పరిణయమాడడం, పరశురాముని దర్పం అణచి అయోధ్యకు తిరిగిరావడం మొదలైన కథాంశాలు విన్నాంకదా? పెళ్ళికి కైక తమ్ముడు కూడా వచ్చాడు. మిథిలలో వివాహ వైభవం చూచిన తర్వాత తిరిగి అయోధ్యకు వచ్చి కైకనుద్దేశించి "భరత, శత్రుఘ్నులను మా ఊరికి తీసుకుని వెళతాను. అన్నాడు. మహారాజుగారిని అడిగి అలాగే తీసుకెళ్ళు!" అని సమాధానమిచ్చింది కైక. దశరథుడి వద్దకువెళ్ళి "కైకపుత్రుల్ని మాదగ్గర ఒక నెలరోజులు ఉంచుకొని పంపుతాను" అని కోరాడు. అందుకు అంగీకారాన్ని తెలిపాడు దశరథుడు. కైక భరతుడితో 'నువ్వు మామ ఇంటికి తమ్ముడితో కూడా కలసి వెళ్ళమ'ని ఆదేశించింది. శ్రీరాముని వదిలి ఒక్కక్షణం కూడా ఉండలేను. ఆయన సేవతప్ప నాకు మరేదీ రుచించదు. ఆయన చంద్రుడు, నేను చకోరం. ఆయన మేఘం, నేను చాతకం. ఆయన ధేనువు, నేను లేగదూడను. మా వియోగం సహింపరానిది. ఆయన సేవ వదలి ఇతర సుఖాలను ఎవరు కోరుతారు? అమృతం వంటి అన్నం వదిలి కక్కిన కూటికి ఎవరు ఆశపడతారు? చచ్చిపోయే

సమయంలో కూడ రాజహంస ముత్యాలను వదిలి మయాన్ని ముట్టుకోదు. కల్పవృక్షాన్ని ఆశ్రయించిన పక్షి మర్రిచెట్టు మీదకి దృష్టి మరల్చదు. పంచామృతంతో నిండిన సరోవరం ఉన్నా జలచరాలు నీటిని వదిలిపెట్టి ఎప్పటికీ పోలేవు.' అని అశ్రునయనాలతో వివరించాడు. కైక ఒక్క నెలరోజులే కదా ఉండి వచ్చెయ్యమని కోరింది. మాతృవాక్యాన్ని కాదనలేక భరతుడు శ్రీరాముడి అనుమతిని అర్థించాడు. రాముడి ఆనతి గైకొని శ్రీరామచరణకమల భ్రమరాలైన భరత, శత్రుఘ్నులు ఆయన పాదపద్మాలకు నమస్కరించి చతురంగబలసమేతులై మామ ఇంటికి చేరుకొన్నారు.

## శ్రీరాముని విలువిద్యా ప్రదర్శన

ఇక్కడ అయోధ్యలో దశరథుడి ఆజ్ఞమేరకు రామ లక్ష్మణులు సదా గురుసేవలో నిమగ్నమయ్యారు. వసిష్ఠుడి వద్ద జ్ఞానబోధ పొందుతూ చతుష్షష్టికళలలో నిష్ణాతులయ్యారు. రాముడు ధనుర్విద్యతో సహా సకల యుద్ధకళలను అభ్యసించాడు. వెదురుబొంగు మొదట్లో కొంచెం చీల్చగానే చివరికంటా ఎట్లా చీలిపోతుందో ఆ రకంగా రాముడు ఎంతటి జటిలమయిన తర్కాన్నయినా అవలీలగా అవగాహన చేసుకునేవాడు. వసిష్ఠుడు ధనుర్బాణాలను ఏ స్థానాలలో సూటిగా ప్రయోగించాలో సూచిస్తేచాలు అతి సమర్థవంతంగా సంధించేవాడు. శ్రీరాముని ధనుర్విద్యా పాటవాన్ని పరికించడానికి దశరథుడు రంగమంటపానికి విచ్చేశాడు. ఆ రంగమంటపం వైభవాన్ని ఆదిశేషువు కూడా వర్ణించలేడు. ఆ తేజస్సుకు సూర్యుడే విచలితుడవుతాడు. ఆ మంటపం చుట్టూ కాశ్మీరం నుంచి తెచ్చిన కాంతులీనే పగడపు రంగురాతితో, ఏడురంగులు ప్రసరిస్తున్న చతురస్రాకారంలో చక్ర జాలరు కలిగి చూడడానికి ఆశ్చర్యం కలిగిస్తుంటుంది. పచ్చని ఆవరణంలో, గరుడ పచ్చలతో చక్కని నీలాలతో చేసిన ఏనుగుబొమ్మలను సమానంగా చెక్కారు. వాటిపైన వజ్రాల స్తంభాలు, వైడూర్యాలతో చెక్కిన ఫలకాలు వాటిపై



బంగారు పలకలు, ఆ మంటపం అంచు అంతా ఒకేతీరున తీర్చిదిద్దివుంది. గరుడ పచ్చలు తామర తూళ్ళవలె వేలాడదీయబడి వున్నాయి. సూర్యకాంతితో మెరిసే ఎర్రటి మాణిక్యాలు గొలుసుకట్టుగా ఆదిశేషుడి పడగలా అమరాయి. ఒకదాని మించి మరొకటి మెరిసే ఆ ప్రాంగణంలో రాత్రికి అవకాశమే లేదు. గరుడ పచ్చలతో చేసిన చిలకలు సజీవంగా పలికేలా ఉండే ఆ కళానైపుణ్యం అత్యద్భుతం. నీలాలతో చెక్కిన మయూరాలు నాట్యంచేస్తున్నట్లు, రత్నాలతో చేసిన మర్కటాలు పరిగెడుతున్నట్లు ఉన్నాయి. సకలరాజన్య లోకపు చిత్రపటాలు గోడలమీద చిత్రితమై ఉన్నాయి. తోలుబొమ్మలు పల్టీలు కొడుతూ నాట్యం చేస్తున్నాయి. నృసింహమూర్తి స్తంభం నుండి వచ్చి క్షణక్షణం హుంకరిస్తున్నట్లున్న రంగమంటపంలో వసిష్ఠుడు, ఇతర మునిబృందంతో దశరథుడు ఎనిమిదిమంది అధికార యంత్రాంగం, ప్రజలతో కలసి కూర్చున్నాడు. కౌసల్య, సుమిత్ర, కైకేయి ఇతర రాణులు వారివారి స్థానాల్లో కూర్చున్నారు. శ్రీరాముడు అభ్యాసం చేసిన సకల విద్యానైపుణ్యాన్ని తిలకించడానికి అందరూ విచ్చేశారు.

చుక్కల్లో చంద్రుడిలా ఆ సభాధిపతి దశరథుడు, ఇంద్రసభలో బృహస్పతిలా వసిష్ఠులు ఆసీనులయి ఉన్నారు. పచ్చలతో మెరిసే ప్రాంగణంలో రంగమంటపం ఎదురుగా సూర్యచంద్రుల్లా, శివపార్వతుల్లా, లక్ష్మీనారాయణుల్లా, మేరుమందర పర్వతాల్లా, రణాంగనంలో వీరుల్లా, రామలక్ష్మణులు నిలబడ్డారు. వారిద్దరూ సాక్షాత్తూ ఆదిశేషువు, నారాయణుడి అవతారాలే. ఎన్నోజన్మల తపఃఫలంగా దశరథుడికిది చూసే భాగ్యం కలిగింది. కోటి మన్మథుల సౌందర్యఖని, సూర్యతేజస్విగా, కల్పాంతంలో మెరిసే మెరుపుల సమూహంలోని కాంతితో శ్రీరాముడు అవతరించాడు. అటువంటి లావణ్యసాగరుడు, ఆజానుబాహువు, శ్రీరాముడు గురు, పితా, శస్త్ర వందనం చేశాడు. అనేక రకాలయిన వాహనాలెక్కి యుద్ధమర్మాలను తెలుపుతూ రథాన్ని నానావిధాలుగా తిప్పుతూ ప్రదర్శించటంచూసి, పురజనులు విస్మయం చెందారు. ఏనుగు అంబారీ

ఎక్కి, గుర్రం స్వారీచేసి, డాలు, చక్రం తిప్పసాగాడు. కాల్బలంలా కొంతసేపు, విభిన్న యుద్ధరీతులు, మల్లయుద్ధం, పొట్టేళ్ళకుస్తీ, కర్రయుద్ధం, వ్యాఘ్రసింహాల జగడం, కూర్మ వృషభ, మకరాలపోరు, జలమండలయుద్ధం, ఆకాశంలోను, భూమిలోను యుద్ధంచేయడం ఇలా సకల కళలతో కూడిన యుద్ధభంగిమలను ప్రదర్శించాడు. శక్తి, పాశుపత, తోమర, శూల, పరిఘ, అలాతచక్ర, కందుక, భిండిమాల, వజ్ర పాశ, ఖడ్గ అశిలత, ముద్గల, శతఘ్ని, పరిశాంకుల, కుంత, సరళ, యమదంష్ట్ర మొదలైన శబ్దయుద్ధాలన్నీ, యంత్ర మంత్ర యుద్ధగతులనే అస్త్రవిద్యలను ప్రదర్శించాడు. కళ్ళు మూసుకొని ముందుచూస్తూ వెనుకకు బాణం వేయడం, సముద్రం వంటి సేనను దాటి ఆవలకి వెళ్ళడం మొదలైన యుద్ధరీతులను ఆ రాజీవనేత్రుడు కన్నుల పండువగా ప్రదర్శించాడు. ఒకే బాణం కోట్లాది బాణసమూహాలుగా మారడం, సకల సైన్యాన్ని నిర్జించడం, ఆగ్నేయ, వారుణ, వాత, పర్వత, వజ్ర, మాయ, బ్రహ్మ, మహేశ్వర, భూత, భైరవ, సింహ, సర్ప, గరుడ,కామ, వైరాగ్య, తారకాసుర, పాపనామ గంధర్వాస్త్రాలను సంధించి చూపాడు. బ్రహ్మశిరో విశ్వజిత్ మొదలైన అస్త్రాలగతి కూడా ప్రదర్శించాడు. లక్ష్మణుడూ అన్నివిధాలుగా చేశాడు. పుత్రుల విద్యాకౌశలం గాంచి దశరథుని కనులు చెమర్చాయి. అన్నింటిని వసిష్ఠుల వారూ గమనించారు. లేచి శిష్యులను కౌగిలించుకొన్నారు. ఇది చూసిన దశరథుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. సభను ముగించి దశరథుడు గురు, శిష్యసహితంగా తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు.

తరువాత ఒకనాడు దశరథుడు అద్దంలో తన ప్రతిబింబం చూసి గడ్డంలో నెరిసిన వెంట్రుకను గమనించి, కులగురువును, మునులను, వ్యాపారవేత్తలయిన వైశ్యులను, వివేక సంపన్నులను ఏకాంత స్థలంలో సమావేశపరిచి మనోభావాన్ని బహిర్గతపరిచాడు. రాజ్యభారాన్ని విడనాడి, యోగ్యుడు, గుణసంపన్నుడు, ప్రతాపసూర్యుడు, ధీరుడు, వీరుడు, ఉదారస్వభావుడు, లావణ్యసాగరుడు



అనంత జన్మతపఃఫలంవల్ల జన్మించిన వాడైన రఘురాముడికి సుముహూర్తంలో రాజ్యభారాన్ని అప్పగించాలని ఉందనే ఆలోచన వ్యక్తంచేశాడు. వసిష్ఠుడు ఇతరులూ ఇందుకు అంగీకరించి సంతోషించారు. దశరథుని జన్మ ధన్యమైందని కొనియాడారు. వసిష్ఠాది ఋషులంతా మంచి ముహూర్తం చూసి చైత్రమాస గురు పుష్యయోగాన్ని స్థిరపరిచారు. అలా శ్రీరామ పట్టాభిషేకానికి అత్యంత శుభప్రదమయిన ముహూర్తం నిర్ణయించి, నాలుగు దంతాలున్న ఏనుగు, తెల్లటిగుర్రం, పున్నమివెన్నెల కాంతులీనే చామరాలు, పంచలోహాలతో, సప్తమృత్తికా పరికరాల్తో నాలుగు సముద్రాల జలం తెప్పించి దానికి తగిన ఏర్పాట్లు గావించి, దివ్యమయిన సింహాసనంమీద కొత్త ఛత్రం నిర్మించి, సింహాసనాన్ని అలంకరించారు. దివ్యతేజస్కులయిన బ్రాహ్మణులను 'వేదో నారాయణః సాక్షాత్' అనే అనుశృతిననుసరించి వేదాలను వల్లించడానికి కూర్చోబెట్టారు.

## శ్రీరామపట్టాభిషేక సమారంభం

యాభైఆరు దేశాలనుండి వివిధ రాకుమారులు, తొంభైఆరు క్షత్రియజాతి తెగల ప్రముఖులూ మోయలేని కానుకలతో విచ్చేశారు. ఆనందానికి పర్యాయంగా అయోధ్యను, విశేషంగా రాజమందిరాన్ని అలంకరించారు. చీకటిలో ప్రకాశించే తారలు సైతం చిన్నబోయేట్టు రత్నాలతో చెక్కిన కలశాలు మెరుస్తున్నాయి. దశరథుడు రాముని ఏకాంత ప్రదేశానికి పిలిచి మనసులో గుప్తంగా ఉండే ఆలోచనను వెలువరించాడు. "శ్రీరామా! ముందు రాబోయే కాలం గడ్డుది. నాకేమో గ్రహపీడ వదలడంలేదు. శని అష్టమస్థానంలో ఉన్నాడు. బృహస్పతి ద్వాదశస్థానంలో ఉన్నాడు. నాకు మృత్యుచిహ్నాలు గోచరిస్తున్నాయి. అందువలన నీకు సింహాసనం అప్పజెప్పాలనిపిస్తోంది. అదీగాక నీగురించి నాకో విచారం ఉంది. నువ్వేమో నన్ను వదలి దూరం వెళ్తానంటున్నావు? దానివలన ప్రయోజనం లేకపోగా నాకు బాధ కలుగుతుంది.

సౌందర్యామృతసాగరా! తమాలనీలా! రాజీవనేత్రా! శ్రీరామా! ఘనశ్యామా, రాజ్యభారాన్ని వహించు!" అన్నాడు. శ్రీరాముడు తండ్రి పాదాలకు మోకరిల్లాడు. దశరథుడు సీతారాములను ఉపవాసానికి ఉత్తర్వులిచ్చాడు. కులగురువు సీతారాములతో అపారదానాలను ఇప్పించాడు. శయనించడానికి దర్భాసనాన్ని సిద్ధం చేయించాడు. పురాణపురుషుడు, పురుషోత్తముడు ఐన శ్రీరాముడు ఋషిహోమం చేసి ఆహుతి వేయడం, చంద్రుడు చకోరంపై అమృతధార వర్షించునట్లు, ఆవు తన దూడకు పొదుగునందించి కడుపునింపినట్లు, తల్లి బిడ్డకు స్తన్యాన్నిచ్చి సంతృప్తి పరిచినట్లుగా చాతకంపై కరుణతో మేఘం వర్షించినట్లున్నది. శ్రీరాముడు యజ్ఞకుండానికి ఇచ్చిన ఆహుతివల్ల యజ్ఞనారాయణుడు సంతుష్టుడయ్యాడు. గోదావరి గంగలవలె కౌసల్య, సుమిత్రలు అపరిమితానందంతో విప్రులకు అపారదానాలిచ్చారు. శ్రీరాముడి సేవచేసేందుకు అనుమతి కోరాడు లక్ష్మణుడు. దశరథుడు ఈ కోరికకు ఆనందించి సౌమిత్రివదనాన్ని తనివితీరా నిమిరాడు. శ్రీరామ పట్టాభిషేకం సంరంభాన్ని దర్శించటానికి కోట్లాది దేవతలు ఆకాశంలో విమానాల నుంచి చూడసాగారు. అయోధ్యచుట్టూ విడిది చేసిన లెక్కలేనంత సైన్యం, చూచేవారి కనులను మిరుమిట్లు గొల్పాయి. చతుర్విధ వాద్యఘోషలు మిన్నంటాయి.

## దేవతల విషాదం

సురులందరూ చింతాక్రాంతులయ్యారు. సృష్టికర్త వద్దకు వెళ్ళి, "దశరథుడు రాముడికి రాజ్యాభిషేకం చేస్తున్నాడు. మా బంధాలను విముక్తిచేసే ఉద్దేశ్యం మీకు ఏ మాత్రం ఉన్నట్లు లేదు. అపూర్వమయిన ఇంద్రపదవి వంటి రాజ్యాన్ని వదలి రావణసంహారానికి శ్రీరాముడు ఎందుకు పూనుకొంటాడు? లక్ష్మీవరుడైన శ్రీరాముడు భక్తులకోసం అవతరించాడు. కనుక ఎలాగయినా శ్రీరాముని తపోవనాలకు తరలించాలి.' అని వేడుకొన్నారు. అప్పుడు బ్రహ్మ వికల్పుని అయోధ్యానగరంలో ప్రవేశించి కైకేయి మనస్సు నాక్రమించి



విఘ్నాలు కల్పించమని నిర్దేశించాడు. అయోధ్యలో పవిత్రమయిన ఉత్సవాలు జరుగుతున్నాయి. దుఃఖం కలగజేయడం నావల్ల కాదు. నేను కనిపిస్తే ప్రాణాంతకం అవుతుంది. మొత్తం అనర్థం వాటిల్లుతుంది. నేను అడుగిడితే శీతలం బడబానలం అవుతుంది. అమృతం హాలాహలమవుతుంది. నా శక్తి కల్పాంతంవరకు తరగదు అందుకని నేను పోలేను." అని వికల్పుడు సెలవిచ్చాడు. 'నువ్వు తప్ప ఈ కార్యాన్ని ఇంకెవరూ సాధించలేరు. మమ్మల్ని బంధ విముక్తుల చెయ్యడానికి ఈ మాత్రం సహకరించి ఉపకారం చేయాలి.' అని దేవతలు అందరూ వికల్పుడిని బతిమాలుకున్నారు. వికల్పుడు ప్రసన్నుడై అయోధ్యకు బయలుదేరాడు. అయోధ్యావాసులు పుణ్యశీలురు, సత్యవాదులు, సాత్త్వికులు, ప్రేమైకమూర్తులు. వారివంక మృత్యువు కూడా తొంగిచూడడానికి జంకుతుంది. అటువంటప్పుడు వికల్పుడికి కూడా నగర ప్రవేశం సుసాధ్యం కాలేదు. వేదాజ్ఞను ప్రమాణంగా భావించేవారిని, పరనింద సహించనివారిని, మంచిచెడ్డల గురించి శ్రవణం చేసేవారిని అనంత గురుభక్తులను, తల్లిదండ్రులను పూజించేవారిని, బ్రాహ్మణులను ఆదరించేవారిని, సదా హరిభజనలో గడిపేవారిని, హరికీర్తన శ్రవణ మనన తత్పరులను, ఇతరుల ధనాన్ని తృణప్రాయంగా చూసేవారిని, దీనులను చూడగానే దయచూపే వారిని, కుంటి, గుడ్డి, ముసలి మొదలైన అశక్తులకు అన్నవస్త్రాలు ఇచ్చి కాపాడేవారిని, పరస్త్రీలను మాతృమూర్తులుగ భావించేవారిని, వాదప్రతివాదాలు మౌనంగా గమనించేవారిని, మహాత్ములను ఈశ్వరభావంతో ఆదరించేవారిని, సకల జీవరాసుల్లో రామభావనపట్ల ఎరుక కలిగివుండే వారిని, ప్రపంచంలో జీవిస్తూ విరక్తులుగా ఉండేవారిని, బ్రహ్మానందంలో నిండి తనను తాను మరచేవారిని వికల్పుడు ఏ రకంగానూ బాధించలేదు. ఇటువంటివారితో నిండిన అయోధ్యలో ప్రవేశించడానికి వికల్పునికి సాహసం చాలలేదు.

## మంథర దుర్బుద్ధి

కైక దాసి మంథరకు శ్రీరాముడంటే ఎప్పుడు ద్వేషమే. రాముడిపట్ల పాపభావమే ఉండేది. పరమపాపియైన ఆమె సీతారమణుని ఎల్లప్పుడూ నిందిస్తుండేది. ఉదయాన నిద్రలేచే వేళకు రాముని మొహాన దుమ్ము పడేట్టుగా కసువు ఊడ్చేది. ఆ దుమ్ము పైనపడితే దేవేంద్రుడయినా దుర్దశ అనుభవించాల్సిందే. ఇది చూసిన రాముడు అపవిత్రురాలైన ఆ దాసిని కుబ్జగా, కురూపిగా, సర్వాంగాలు వంకర టింకరగా మారిపోతాయని శాపమిచ్చాడు. మంథర శాపవిమోచనం కోసం రాముడిని బ్రతిమలాడింది. ముందు జన్మలో కంసవధ నిమిత్తం మధురకు వస్తాను. అప్పుడు నీ కురూపం దివ్యరూపంగా మారిపోతుందని తరుణోపాయం తెలిపాడు.

ఇదిలా వుండగా అయోధ్య వెలుపల సుందర పుష్పవాటికలో ఫలవంతమయిన పుష్పాలున్న చోట వికల్పుడు ప్రవేశం చేశాడు. స్నేహ కర్పూరాన్ని దహించే నిప్పు, ప్రీతి అనే మేఘాలను చెల్లాచెదురు చేసే పెనుగాలి, భక్తిమార్గంలో పయనించేవారిని బాధించే నీచుడు, పరమదోషి, కాకిలా మలభక్షకుడు, ద్వేష వల్మీకంలోని విషసర్పం, మత్సరవనంలో తోడేలు, నిర్దయ సాగరంలో మకరం, పరనింద చేసే అల్పుడయిన గాడిద, వికల్పలక్షణుడు, ప్రపంచాన్ని ఛేదించడానికి గొడ్డలివంటివాడు అయిన ఘోరరూపుడైన వికల్పుడు అయోధ్యలోని ఆనందాన్ని క్షణంలో తారుమారు చేయగల శునకం. మంచుపడిన చెట్టు కింద వికల్పుడు కూర్చుని ఉండగా పాపరూపియైన మంథర పూలు కోద్దామని వచ్చి అక్కడ కూర్చునగానే కుమతి అయిన వికల్పుడు ఆమెలో ప్రవేశించాడు.

నిర్దయులు, ఆచారహీనులు, హరికథా శ్రవణం గిట్టనివారు, ఎప్పుడూ పరనింద చేసేవారున్నచోట, రాత్రింబవళ్ళు సాధు సజ్జనులను ద్వేషించేవారి



వద్ద, వేద విరుద్ధ వర్తనుల దగ్గర, కారణం లేకుండా ద్వేషించే కుమతుల చిత్తమందు, విశ్వాసంలేని వారిచెంత వికల్పుడు నివసిస్తాడు.

మంథర మనస్సులో వికల్పాలు చెలరేగాయి. పుచ్చకాయలు ప్రీతితో భక్షించి, దుష్టభావంతో పువ్వులు ఏరి, మనసులో కల్లోలంతో, కలహప్రియయై ఇంటికి చేరుకుంది. కైక మందిరంలో ఉత్సవ సంబరాలు జరుగుతున్నాయి. ఆకాశమంత పందిరి వేశారు. అందరూ నిశ్చింతతో వేడుకలు జరుపుతున్నారు. వసంతంలో కోయిల స్వరానికి కాకి ఈర్ష్య చెందినట్లు, అందరినీ చూసి మంథరలో ఈర్ష్యాద్వేషాలు ప్రజ్వరిల్లాయి. పండిన మామిడి పండ్లను చూడగానే కాకి నోటికి రోగం వచ్చినట్లు, మహాత్ముల ప్రతాపాన్ని గమనించి పరనిందాపరులు సంతాపం చెందినట్లు, పండితుల సామర్థ్యాన్ని చూసి అయోగ్యులు ద్వేషం పెంపొందించుకొన్నట్లు, సింహం ప్రతాపం గమనించి నక్కలు విచారించినట్లు, శ్రీమంతుడి ఐశ్వర్యానికి దుర్జనులు కుమిలినట్లు, ధర్మప్రవృత్తి కలిగినవారిని చూసి అపవిత్రుడికి ఖేదం కలిగినట్లు, పతివ్రతను చూసి వ్యభిచారి అసహ్యించుకొన్నట్లు, చంద్రుని దొంగలు చీదరించుకొన్నట్లు, గుడ్లగూబకు సూర్యుడు అగుపడనట్లు, హింసకులకు తత్త్వవిచారం ఇష్టం లేనట్లుగా ఆ వైభవం మంథరకు గిట్టలేదు. చింతాక్రాంతయై రాముని అంతమొందించాలని దుఃఖ ద్వేషభావంతో రాణివాసంలో అడుగు పెట్టింది. దుఃఖప్రవాహకల్లోలిత, కలహపీఠం అయిన మంథర, ఇంటికి నిప్పంటుకొన్నట్లుగా మందిరప్రవేశం చేసింది. గుండెలు బాదుకుంటూ కైకతో నువ్వు అభాగ్యురాలవి, తెలివితక్కువ దానివి. నీకు మేలు, కీడు తేడా తెలియడం లేదు. మేనమామ ఇంటికి సరయిన సమయంలో నీ కొడుకుని పంపేశావు. ఇక్కడేమో రామ రాజ్యాభిషేకం జరుగుతోంది. సౌభాగ్యం చేజారి నీకు దుర్గతి పడుతోంది. భరతుడు దేశంలో లేకపోవడం వల్ల నీకు అనర్థం సంభవిస్తోంది. అది నీకు తెలియడం లేదు. రాముడు రాజైతే నీకు పుత్రవ్యథ తథ్యం. నీకీ

విషయం నేను తప్ప వేరే ఎవరు చెప్తారు? అని ఆక్రోశించింది. "నాకు భరతుడెంతో, రాముడూ అంతే. ఈ విషయం పదేపదే విచారించి లేనిపోని ఊహలు కల్పించి అనర్థం తేవద్ద"ని మంథరను హెచ్చరించి మెడలోని ముత్యాల హారాన్ని కానుకగా ఇచ్చింది కైక. మంథర ఆ ముత్యాల హారాన్ని తెంపేసింది. మొహం ముడుచుకుంది. 'రాజ్యమంతా మునిగిపోయినట్టే' అని అంది. కైక స్నేహభావంతో మంథరను కౌగలించుకుంది. అదే సమయాన వికల్పుడు కైకలో ప్రవేశించాడు. వెంటనే కైక "మంచి ఆలోచన చెప్పావు. నువ్వు నిజంగా నాకు ప్రాణసఖివి. ఇపుడు ఏం చేయాలో ఉపాయం కూడా వివరించు. భరతుడా నా దగ్గర లేడు. రేపే రామ పట్టాభిషేకం. ప్రజలందరికీ, వసిష్ఠుడికీ, దశరథుడికీ రాముడంటేనే ఇష్టం. నేను చెప్తే నా మాట వినే వారెవరు?" అని ప్రశ్నించింది.

మంథర ఇందుకు సమాధానంగా "నేను చెప్పేది శ్రద్ధగా విను. పూర్వం ఇంద్రుడితో పోరు చేసిన సందర్భంలో రెండు వరాలు ఇచ్చాడు మహారాజు. అటువంటి అస్త్రాలు నీ దగ్గర ఉన్నప్పుడు నీకెందుకు భయం? నీ పుత్రుడికి రాజ్యాభిషేకం చేయించి రాముడికి పదునాలుగేళ్ళ వనవాసం విధింపజేయి. ఈ లోపల నీ పుత్రుడు చతుర్దశ లోకాలను జయిస్తాడు. రామ వనవాసానికి తోడుగా సౌమిత్రి వెళ్తాడు. రాక్షసులు నీచులు. రామ, లక్ష్మణులను భక్షించక మానరు. అప్పుడు సహజంగానే భరతుడు రాజ్య వారసుడవుతాడు. అందువల్ల ఈ ఉపాయాన్ని అమలుపరచి వరాలను కోరుకో. రామ వనవాసంతో మహారాజు ప్రాణాలతో ఉండడు. అది కూడా భరతుడికి స్థిరంగా రాజ్యం చేకూరడానికి ఉపకరిస్తుంది. రాముని పట్ల ప్రీతి ఉండే భక్తులు బయటికి వెళ్ళగానే దశరథుడు నీ చెంతకు రావడం ఖాయం. ఇప్పుడే ఈ అకార్యాన్ని ప్రారంభించు"అని ఉపదేశించింది. మంథర మాటలు కైక హృదయానికి హత్తుకొన్నాయి. కుక్క తన వాంతి తనే భక్షించినట్లు, ఈత చెట్టు మధ్యనుండి



జారుతున్న కల్లు చూచి తాగుబోతుకు నోరూరినట్లుగా మంథర పలుకులను కైక వెంటనే ఆమోదించింది. కల్లుతాగి ఉన్న కోతిని తేలు కుట్టినట్లుగా కైక ఆ స్థితిలో కంఠాభరణాలను తొలగించి, తల విరబోసికొని కోపంతో శయ్య వదలి నేలమీద పడుకుంది. విలాస సమయం కాగానే కైక మందిరంలోకి దశరథుడు విచ్చేసాడు. మంథరను 'మీ రాణి ఎక్కడ?' అని ప్రశ్నించాడు. పాపాలకు ఆటపట్టయిన మంథర 'ఆ పక్కన ఉంది మీ రాణి, ఆమె మనసులో ఏముందో తెలియదు' అని పెడసరంగా జవాబిచ్చింది. దశరథుడు కైకను సమీపించి బుగ్గమీద చేయి వేయగా ఆమె ఛీత్కరించింది. 'నువ్వు వెంటనే తొలగిపో, రాజుగా ఉండటానికి అర్హుడివి కావు. అబద్ధాల కోరువు. క్రియా భ్రష్టుడివి. నీ మనసులో అన్నీ తప్పుడు ఆలోచనలే ఉన్నాయి. ఇవ్వన్నీ నేను బాగా గ్రహించాను' అని తోసేసింది. ఈ కఠోర వచనాలు విన్న దశరథుడు ఆందోళనతో తడబడ్డాడు. కాళ్ళు పట్టుకున్నాడు. కైక మళ్ళీ తోసేసింది.

'రామరాజ్యాభిషేక సంరంభసమయాన ఎలాంటి విఘ్నాలు కలిగించవద్దు. నీకు కావలసిన వస్త్రాలు, ఆభరణాలు, ఏది కావాలంటే అది చేకూరుస్తాను. ప్రాణాలు నీకే ధారపోస్తాను. నేను జీవించి ఉండగానే మంగళసూత్రాలు తెంపడం న్యాయంకాదు. నిన్ను శరణు వేడుతున్నాను' అని కాళ్ళు పట్టుకున్నాడు. అయినా కైక కసిరి, విసిరికొట్టింది. కామం ఎంతోమందిని అధోగతి పాల్జేసింది. జనన మరణ చక్ర బంధంలో పడవేసింది. కామలోలత్వం పరమ దారుణం. ముందు ఎందరో జ్ఞానులు దీనిలో చిక్కుకొని హతమయ్యారు. సంసారం అనర్థాలకు మూలం. కామమోహంలో పడి సకలపాపాలు మూట కట్టుకుంటారు. దశరథుడు స్త్రీ మోహమనే మాయలో పడ్డాడు. కైకతో "నీకేం కావాలో కోరుకో తప్పక నెరవేరుస్తాను" అని మాట ఇచ్చాడు. ముందు అనుకున్న ప్రకారం రెండువరాలు కోరుకొనమని, రాముని అరణ్యాలకు పంపమని మంథర కైకేయికి సైగలు చేసింది. "మహారాజా! ముందు స్వర్గంలో

నాకు ఇచ్చిన వరాలను తీర్చకపోతే వంశానికే కళంకం వస్తుంది" అని కైక మహారాజును హెచ్చరించింది. 'వెంటనే వరాలు కోరుకో తీరుస్తాను' అని మరోమారు మాట ఇచ్చాడు మహారాజు. "రాముడికి అరణ్యవాసం విధించి, భరతుడుకి రాజ్యాభిషేకం చేయాలి. రాముడు దగ్గరుంటే, జనం రాముడివైపే ఉంటారు. కనుక రాముని పదునాలుగేండ్లు దూరంగా వనవాసానికి పంపాలి. నా పుత్రు డీ కాలంలో రాజ్యం చేస్తాడు. అనంతరం రాముని పిలిపించు. లేదా అక్కడే వుంచు" అని తన కోరికలను వెలిబుచ్చింది కైక. దశరథుడు విద్యుద్ఘాతం తిన్నవాడిలా హతాశుడయ్యాడు. శరీరం నిప్పుల్లో పడ్డట్లయింది. ఆలోచనా తీవ్రతలో శరీరం నల్లబారింది. వంటిమీద పర్వత ప్రమాణంలో రాళ్ళుపడుతున్నాయా అన్నట్లయింది. ప్రళయాగ్నివంటి కైక మాటలు ఆయుష్యమనే అరణ్యాన్ని కాల్చివేశాయి. దశరథుడు కైక పాదాల చెంత చేరాడు. "నువ్వు ఏ కోరికలు కోరినా తీర్చడానికి సమ్మతమే. కాని సుకుమారుడయిన రాఘవుని అడవులకు పంపొద్దు. నేను ఈ దేశాధిపతిని. నేనే నీకు శరణాగతుడనైనాను. పట్టపురాణులను నీ దాసీలుగా చేస్తాను. లావణ్యామృత సాగరుడు, ఉదారుడు, ధీరుడు, రణగంభీరుడు, కోమలగాత్రుడైన రఘువీరుడు నీకేం అన్యాయం చేశాడు? నీకెందుకు అతడిమీద కోపం? సాక్షాత్తూ విష్ణుమూర్తివంటి రాముని అడవులకు పంపాలన్న యోచన నీకెలా వచ్చింది? భరతుడికంటే చీకటి చెట్టు ఛాయగల రాముడంటేనే నీకు చాల ముద్దు. ఇప్పుడు నీ కెందు కీ కాఠిన్యం? పొరపాటేం జరిగిందో వివరించు. ఆ కమలనయనుని కాననాలకు పంపొద్దు" అని దశరథుడు ఒడి చాచి పదేపదే వేడుకున్నాడు.

"మహారాజా! నువ్వు అధముడివి. మాట ఇచ్చి, వరాలు కోరుకొమ్మని తీర్చలేకపోతున్నావు. మాటకోసం ప్రాణాన్నే త్యజించే వంశం మీది. అటువంటి కులంలో జన్మించి కులానికే కళంకం తెస్తున్నావు" అని కోపంగా అంది కైక.



వజ్రాల వంటి కఠినమయిన ఆ వాక్యాలు విని దశరథుని హృదయం వ్రయ్యలయింది. మూర్ఛిల్లాడు. ఆ రాత్రి కరాళరాత్రి అయింది. ప్రాత:కాలాన సుమంతుడు రాజదర్శనం చేసుకున్నాడు. "సర్వం సమాయత్తమయ్యింది. వసిష్ఠుడు మీకోసం ఎదురు చూస్తున్నాడు. సూర్యోదయం కాబోతున్నది. అక్కడికి మీరు వచ్చి రాముని రాజ్యాభిషిక్తుని చేయాలి" అన్నాడు. దశరథుడు ఏమీ మాట్లాడలేదు. సుమంతు డీ మౌనం చూసి నిశ్చేష్టుడయ్యాడు. 'నేను ఆజ్ఞ ఇస్తే రాముడికి వనవాసం తప్పదు. అందువల్ల గొప్పముప్పు వాటిల్లుతుంది. ఇప్పడెలా?' అని వితర్కించుకుంటున్నాడు దశరథుడు. ఈలోగా కైక సుమంతుడితో, 'రాముని తీసుకురమ్మ'ని ఆజ్ఞాపించింది. దశరథుడు మైకంలో ఉండి మాట్లాడలేదు. 'అక్కడ వసిష్ఠుడు అంతా సిద్ధం చేసి ఉంటాడు. వెంటనే రాముని తీసుకొని వచ్చేయి' అని మరోమారు అన్నది కైక. 'రాజు భూమిపై శయనించి విచారంతో ఉండటానికి కారణమేమిటి?' అని ప్రశ్నించాడు సుమంతుడు. దానికి మహారాజే సమాధానమిచ్చాడు. 'నా మాట విను. నాకు మరణం ఆసన్నమయింది. ఇక్కడి విషయం ఏమీ చెప్పకుండా రాముని తీసుకురా' అని అన్నాడు. గ్రహణకాలంలో కళాహీనమయిన సూర్యుడిలా పాలిపోయిన మొఖంతో విషాదభరితుడయి సుమంతుడు రాముని మందిరం చెంతకు వెళ్ళాడు. ముముక్షువు సంసార తాపంతో వేగిపోతూ సాధుసజ్జనుల చెంతకు వెళ్ళినట్లు రామమందిరం చేరగానే ఆత్మసాక్షాత్కారం కలిగిన భావం కలిగింది. నాలుగు మహాద్వారాలు దాటి రాముడిని కళ్ళతో చూడటానికి మొదట స్థూల దేహద్వారాన్ని, రాముని తత్త్వాన్ని ఆకళింపు చేసుకున్న సుమంతుడు రెండవదయిన సూక్ష్మ సుందర ద్వారాన్ని, మూడవదయిన కారణ ద్వారాన్ని, తర్వాత దేదీప్యమానంగా వెలిగిపోతున్న మహాకారణ ద్వారాన్ని చూడగా బ్రహ్మానందం కలిగింది. తురీయావస్థ దాటి ముందుకు పోయాడు. మణిమయ ప్రభలతో వెలిగిపోతున్న మంటపాన్ని చూసి శ్రవణ, కీర్తన, మనన,

పాదసేవన, అర్చన, వందన, దాస్య, సఖ్యమనే అష్టభావాలు ముప్పిరిగొనగా, ఆనందంతో వస్తున్న ప్రధానులలో అగ్రగణ్యుడయిన సుమంతుని స్వానంద మండపాన్ని అధిరోహించిన రఘువీరుడు గమనించాడు. నవవిధభక్తులలో ఆఖరుదైన ఆత్మనివేదనంతో సుమంతుడు రాముడికి పాదాభివందనం చేశాడు. “సుమంతా! నీవు ప్రధానులలో ముఖ్యుడివి. అన్నవంటివాడివి. నీ నిర్మల గుణం చూసి నాకు చాల ఆనందమయింది” అని కమలపత్రాక్షుడు రాముడు చిరునవ్వుతో ప్రతివాదం చేశాడు. సుమంతుడు రెండుచేతులు జోడించి రాఘవుడి ఎదుట నిలబడి దశరథుడు వెంటనే మిమ్మల్ని కైకేయీ సదనానికి రమ్మని కబురంపారని నివేదించాడు.

ఆ పూర్ణబ్రహ్మ శ్రీరాముడు కైకేయి మందిరానికి ఎలా వెళ్ళాడో మున్ముందు గమనించండి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. భక్తి జ్ఞాన వైరాగ్య భాండాగారంలో అపారమైన దృష్టాంత రత్నాలతో ధగధగా ప్రకాశిస్తున్నది. బ్రహ్మానందా! శ్రీధరవరా! శ్రీమద్భీమాతటవిహారా! పురాణపురుషా! నిర్వికారా! జగద్వంద్యా! అభంగా! స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన పండితులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**నవమాధ్యాయం మధురం**

❀ ❀ ❀

## అధ్యాయము - 10

## శ్రీగణేశాయ నమః శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః

శ్రీక్కిరిసి ఉండే సాధు సజ్జన సభను చూసి సరస్వతి పరుగున శబ్దరత్నాల భాండారంతో పాటు ఆ భక్త పీఠానికి వేగంగా వచ్చింది. గ్రాహకుల ఇష్టాయిష్టాలను బట్టి పరీక్షకులు కావలసిన రత్నాలను చూపినట్లు, ఆకలికి తగ్గట్టుగా అన్నం వడ్డించినట్లు, అతివలు అవయవ సౌందర్యానికి తగిన అలంకారం చేసుకున్నట్లు, అనుదినం సూర్యుడు సమయానుగుణంగా ఉదయించినట్లు, చంద్రుడు వెన్నెల ప్రసరించినట్లు, వర్షాకాలంలో మేఘాలు వర్షించినట్లు, ఋతు సంక్రమణాన్ని బట్టి తరువులు పుష్ప ఫలాలను ఇచ్చినట్లు, సత్సమయాన సత్పురుషులు ఫలాపేక్ష లేకుండా సత్కార్యాలు చేసినట్లు, వేద భావాలకు అనుగుణంగా పండితులు శాస్త్రతర్కం చేసినట్లు, ఉప్పును చూసి నీరు ఆకర్షించినట్లు శ్రోతల మనోభావాలకు అనుగుణంగా మహర్షి వాల్మీకి సక్రమంగా రామకథను వర్ణించిన క్రమాన్ని అవధరించండి.

శబ్దభవసాగరం ఉప్పొంగి పొరలుతోంది. దీనికి స్ఫూర్తి వాయువు. ఆ వాయుబలంతో ‘రామ విజయం’ అనే ఓడ కవిత్వ తరంగాలపై సద్గురుకృప అనే లక్ష్యంవైపు వేగంగా సాగిపోతోంది. ఆ రేవులో శబ్దరత్నాలు అపారం. మహాగ్రాహకులైన సాధుసజ్జనులు భాండాగారాల నిండుగా వాటిని నింపుకుంటున్నారు. ఆదరభావంతో శబ్దరత్నాలను పరీక్షించి ఆనందించండి.

### దశరథశోకం

ఇంతకు ముందు అధ్యాయంలో సుమంతుడు రామ మందిరానికి విచ్చేసాడని తెలుసుకున్నాం. అక్కడ కైకేయి సదనంలో దశరథుడు అగ్నిసపడ్డ ముత్యంలా శోకాకులిత మనస్కుడై ఉన్నాడు. గ్రహణ సమయాన

కళాహీనులయిన రవి చంద్రుల్లా, అడుసులో ఇరుక్కున్న అండజంలా దశరథుడు శోకగ్రస్తుడై శ్రీరాముని పిలవమని సుమంతుని నియంత్రించాడు. సుమంతుడు శ్రీరాముని సమీపించి, 'పురాణపురుషా! సర్వాత్మా! మహారాజుగారు మిమ్మల్ని కైక మందిరానికి రమ్మని కబురంపార'ని నివేదించాడు. వెంటనే నీలమేఘశ్యాముడు, కోదండధరుడు, భక్త కైవారి, కైవల్యదాత, వేదపురాణవంద్యుడు సిద్ధంగా ఉన్న స్యందనం ఎక్కాడు. సర్వాలంకార భూషితుడయిన శ్రీరాముని గాంచి అయోధ్యానివాసులు కోటానుకోట్ల మన్మథులు కూడా ఆయన అందం ముందు దిగదుడుపేనని అనుకున్నారు. రామ మకుటకాంతులతో సూర్యమండలం ప్రకాశించింది. ఆ కిరీటకాంతులు సూర్యుని ప్రభావితం చేసి తిరిగి భూమికి ప్రసరిస్తున్నాయి. ప్రళయాగ్ని జ్వాలలు, కల్పాంతం మెరుపులు శ్రీరాముడి మకర కుండలాల కాంతికి శీతలమయ్యాయి. అనంత బాల సూర్యప్రభలతో విలసిల్లే బ్రహ్మానంద రసమయ సగుణలీలాధారియైన శ్రీరాముని స్వరూపం. మేరు పర్వత వర్తిత నిర్మల సువర్ణజల ప్రవాహంలా నుదుట మెరిసే కుంకుమతిలకం శోభిల్లింది. అయోధ్యానగరమంతా సువాసనలు విరజల్లుతున్న దివ్యచందన చర్చిత దేహం, ఆ సువాసనలను ఆస్వాదించి దేవతలు ఆత్మానందంతో నాట్యం చేస్తున్నారు. అందాలుచిందే మెడలోని ముత్యాలమాలను చూస్తే బ్రహ్మాండంలోని నక్షత్రాలన్నీ మాలగా ఊగుతున్నట్లున్నాయా అన్నట్లుంది. భక్త సముదాయానికి ఆనందాతిశయం కలిగించే విశాలమయిన వక్షస్థలం, హృదయఫలకకాంతులు ఆకాశాన్నంటగా, చేతిన కోదండంతో, నడుమున పీతాంబరం కాంతులీనగా మహావిష్ణు అవతారమయిన శ్రీరాముడు రథంలో సాగగా, యాబదిఆరు దేశాధీశులూ సంతోషించారు. ముందు చతురంగబలాలు నడిచాయి. వాద్యాలహోరు మిన్నంటింది. పౌరులు, రాజులు శ్రీరాముని ముఖారవిందం దర్శనం చేసుకుని విష్ణుసందర్శన భాగ్యంగా భావించారు. శ్రీరామునికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు ధన్యులు. శ్రీరాముడు రాజ్యాభిషిక్తుడయ్యే సంతోష



సంరంభంలో పాల్గొని ఆపై తమ నివాసాలకు వెళ్దామని పురజనులు భావించే సమయాన శ్రీరాముడు కైక సదనం సమీపించాడు.

లక్ష్మణ సుమంత సమేతుడై శ్రీరాముడు జన సమూహాన్ని నెట్టుకుని అశ్రుధారలతో మూర్ఛిత స్థితిలో ఉన్న దశరథుని, ప్రక్కనే ఉన్న కైకను చూసి నమస్కరించాడు. 'సదా విజయం కలుగుగాక!' అని ఆశీర్వదించింది కైక. 'మాతా! తండ్రిగారి దు:ఖానికిగల కారణమేమిటి? నేలపై ఎందుకు పరున్నారో వివరించాల్సింది' అని కైకను అర్థించాడు శ్రీరాముడు. 'పూర్వం మహారాజు నాకు రెండు వరాలు ప్రసాదించాడు. వాటిని చెల్లించమని కోరినందుకు దుఃఖిస్తున్నాడు' అని అంది కైక. ఆ మాట విని 'ఆ వరాలను నేను చెల్లిస్తాను. అవి ఏమిటో సెలవివ్వండి' అని కైకకు మాట ఇచ్చాడు శ్రీరాముడు. 'నీవు పద్నాల్గేళ్ళు వనవాసం చెయ్యడం', లక్ష్మణుని వైపు చూస్తూ, 'నా పుత్రుడు భరతుడికి రాజ్యాభిషేకం జరగాల'ని అన్నది కైక. శాస్త్ర విదితంగా తల్లి ఆజ్ఞను ధిక్కరించకూడదు. సన్యాసం గ్రహించినా తల్లికి నమస్కరించాల్సిందే. నా ప్రాణం కన్నా భరతుడే మిన్న. అతడికి రాజ్యాభిషేకం చేస్తే నా కష్టాలు శాశ్వతంగా తొలిగి పోతాయని శ్రీరాముడు భావించాడు. కాని ఆదిశేషుని అవతారమయిన లక్ష్మణునికి క్రోధం పెల్లుబికి నిశితదృక్కులు సారించినా, వివేకంతో కోపాన్ని అణచుకున్నాడు. శ్రీరాముడు కైకకు నమస్కరించి పరమానందంగా తపోవనానికి వెళ్ళడానికి ఉద్యుక్తుడై వినాయకుడు, కుమారస్వామి దైత్యకుల సంహారానికి ముందుగా పార్వతికి మొక్కినట్లుగా, గరుడుడు అమృతం తేవడానికి ముందు తల్లి వినతకు నమస్కరించినట్లుగా శ్రీరాముడు కౌసల్య ఆశీర్వచనంకోసం కౌసల్యాసదనానికి వచ్చాడు.

### కౌసల్య సంతాపం

జరిగినదంతా శ్రీరాముడి ద్వారా విని, హృదయంలో బాణం గుచ్చుకున్నట్లుగా, నానావిధ ద్రవ్యనష్టం కలిగిన లోభిలా కౌసల్య బాధతో

విలవిలలాడుతూ కిందపడి మూర్ఛిల్లింది. “ఘనశ్యామా! రాజీవనేత్రా! నన్ను వదిలి వనవాసానికి ఏ విధంగా వెళ్ళిపోదామనుకొన్నావు? నా పుష్పవాటికలో ఎవరికీ కనపడకుండా పదునాలుగు ఏండ్లు వనవాసం చెయ్యి” అని తన అనుమతి కోరిన శ్రీరాముడితో కౌసల్య అన్నది. అందుకు రాముడు ‘వనవాసపాలన ఆ విధంగా నెరవేరదు. పితృ వాక్యపాలన అక్షరాల పాటించడానికి దండకారణ్యంలో నివసిస్తాను. సూర్యుడు పడమట ఉదయించవచ్చేమో కానీ, నేను ఆడినమాట తప్పను. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. వాస్తవంలో ఆచరించి చూపుతాను. సత్పతివ్రతకు సంతానంగా సంభవించిన నేను ఆడిన మాట తప్పితే సృష్టి ఉన్నంతకాలం ఆ అపకీర్తి తప్పదు. భర్త పోయిన అనంతరం భార్య సౌందర్యంలా, దాంభికుని జ్ఞానంలా, చపలుడి శూరత్వంలా, అజాగళస్తనంలా, స్త్రీ వేషధారి నటనలా, తాగుబోతు చేతిలో ఉండే అపవిత్రమయిన పాత్రలా, జన్మాంధుడికి విశాల నేత్రాలలా, దానమెరుగనివాడికి సంపదలా, పితృవాక్య పాలన చేయనివాడి జన్మ వ్యర్థం. కాబట్టి మాతా పిత్రాజ్ఞానువర్తిగా అడవులకు వెళ్ళడానికి ఆనతియ్యండి” అని తల్లి పాదాలకు నమస్కరించి, చేతులు జోడించి చేరువగా నిలిచాడు. కౌసల్య గుండె బరువుతో రాముని ఆలింగనం చేసుకుంది.

### సీతారామలక్ష్మణ వనవాస ప్రయాణ సన్నాహం

శ్రీరాముని వనవాసవార్త నగరంలో పాకిపోయింది. లోకులు చింతాక్రాంతులయ్యారు. చివరిగా కౌసల్య ‘నాయనా రఘునందనా! సుకుమారా! జగన్మోహనా! నా ఆజ్ఞకు వ్యతిరేకంగా వనవాసానికి ఏ విధంగా వెళ్తావు?’ అని ప్రశ్నించింది. ‘అన్నా! నువ్వు ఆనతిస్తే తృటిలో కైకేయి నిర్మూలనం కావించి అందరినీ సంతోషపరుస్తాను. నీ వనవాస వార్త దశరథుడి ప్రాణత్యాగానికి దారితీస్తుంది. అయోధ్య అనాథ అవుతుంది. నీయందే ప్రీతిగల భరతుడు రాజ్యతిరస్కారం చేస్తాడు. కైకేయి వధ భరతుడికి ఆనందమే.



దుర్వాసనల నాశనమే సాధకులకు ఆత్మప్రాప్తి కలిగిస్తుంది. రాత్రి ముగిసిన వెంటనే సూర్యోదయం అందరికీ ప్రీతి పాత్రం అవుతుంది. ఇందుకు అనుజ్ఞ ఇవ్వండి’ అని లక్ష్మణుడు వేడుకున్నాడు. ఆ మాటలను అప్రియంగా విన్నాడు శ్రీరాముడు. ‘సోదరా! లక్ష్మణా! జీవితంలో ఇటువంటి దుష్కర్మలు ఎన్నడూ చేయకూడదు. కౌసల్య, సుమిత్రలలాగానే కైకేయి కూడా మనకు మాతృమూర్తే. ఆమెను వధించడం వల్ల అపకీర్తి కలుగుతుంది తప్ప వేరే ఇంకేరకంగానూ మేలు జరగద’ని వివరించాడు. ‘అయితే నన్ను నీవెంట వనవాసం చేయడానికి అనుమతించు. నిరాకరిస్తే ప్రాణత్యాగం తప్ప వేరే గత్యంతరం లేదు’ అని అన్నాడు లక్ష్మణుడు. ‘రామా! లక్ష్మణుడు నిను వినా క్షణం కూడా మనలేడు. వనవాస కాలంలో నీరు, పళ్ళు, తెచ్చి తృణశయ్య ఏర్పాటుచేసి నిన్ను సేవిస్తుంటాడు, కాబట్టి అతన్ని వెంటతీసుకెళ్ళవలసింది’ అని బాష్పనయనాలతో సుమిత్ర శ్రీరాముని కోరింది. లక్ష్మణుడు ఊర్మిళను సమాధానపరచి సంసిద్ధుడయ్యాడు. ‘రఘునందనా! నన్ను వదలి వనవాసానికెందుకు పోతావు? మార్గం కంటకప్రాయం, ధూళి ధూసరిత విస్తార ప్రాంతం, పీతాంబరాలను వదిలి నారచీరలు ఏ రకంగా ధరిస్తావు? పట్టుపరుపు వదిలి నేలపై ఏ విధంగా శయనిస్తావు? రత్నమకుటాన్ని వదిలి జటాజూటం ఏ రకంగా పెంచుకుంటావు? నీ తనువు సుకుమారం. శీతోష్ణాలకు తట్టుకోగలదా? సుగంధ పరిమళాలను వదిలి భస్మ భరితుడవు అవుతావా? రాక్షసులు పెట్టే కష్టాలను ఎట్లా ఎదుర్కొంటావు?’ అని దుఃఖంతో కౌసల్య విలపించసాగింది. ఔషధప్రాయమయిన మొహర్లు వనమూలికలు కలిపి రక్షగా కేశాలకు కట్టింది. దిష్టి, పీడ తగలకుండ ఉండేందుకు రక్ష రేకు భుజాలకు కట్టింది. ఆదిపురుషుడికే తల్లి అయిన కౌసల్య శ్రీరాముడి కోసం సద్భావనతో పంచభూతాలకు నమస్కరించింది. ‘ఓ తల్లీ భూమాత! శ్రీరాముడు నీకు అల్లుడు. మన స్నేహబంధంతో ఇతన్ని రక్షించాలి. కమలపత్రేక్షుడు పోయే బాటలో సత్ఫలాలతో

కూడిన వృక్షాలు ఉండేలా చూడు. ఈశ్వరుడు ఇతన్ని సకల సంకటాల నుంచి కాపాడుగాక! కమల దళాలవలె మృదువైన ఎర్రని శ్రీరామ పాదాలకు రాళ్ళు, రప్పలు గుచ్చుకోకుండా రక్షించు' అని భూమిని, 'రాముడు వెళ్ళేదారిలో దాహం తీర్చడానికి నదీనదాలు, తటాకాలు, కాసారాలు నిండుగా నీళ్ళతో నింపి ఉంచమ'ని నీటిని, 'విశ్వప్రకాశం కల్పించే చండాంశుడా, నీ వంశంలో జన్మించిన రాముడికి తీక్ష్ణ కిరణస్పర్శ కలగకుండా రక్షించు' అని సూర్యుడిని, 'లోకప్రాణేశా! ప్రభంజనా! నీ ధూళి కంటిలో పడకుండా రక్షించు, తీవ్రమయిన తాపంవల్ల కలిగే అలసటను నీ మలయమారుతంతో తీర్చవలసింద'ని గాలిని, 'ఓ ఆకాశమా! నువ్వు నిర్వికారంగా వర్తించు. నీలో నిబిడమయి ఉన్న శబ్దజాలంలో మంజుల ధ్వనులను మాత్రమే ధ్వనింపజేయుమని ఆకాశాన్ని, త్రిమూర్తులు, అష్టదిక్పాలకులు, ఏకాదశ రుద్రులు, నవగ్రహాలు, అష్టవసువులు, ద్వాదశ సూర్యులు, సకలదేవతా సమూహం,పాతాళ సర్పాలను, జలచరాలను, సముద్రాలను, నలుదిక్కులను ఉద్బవింపజేసి, చరాచర ప్రాణులను ఆధీనంలో ఉంచుకొన్న సకల పురాణ, శాస్త్రాలను వాక్కులో దాచుకొన్న బ్రహ్మను శ్రీరాముడి రక్షణ కోసం ప్రార్థించింది. ఇన్ని ప్రార్థనల తరువాత కూడ రఘుపతికి వనవాసానుజ్ఞ ఇవ్వడానికి కౌసల్య ఇష్టపడలేదు. సాధు హృదయకమల భ్రమరం, దానవకుల వైశ్వానరం అజ్ఞానాంధకారాన్ని తొలగించే సూర్యుడు అయిన శ్రీరాముని మాతృవాత్సల్యంతో కౌసల్య అమాయకుడని తలచింది. రాముడు శత్రువులనే ఏనుగులకు సింహమని, దుఃఖపర్వతాలను ఛేదించే సహస్రకిరణుడని, విఘ్నసర్పాలకు గరుడుడని, సజ్జనచకోరాలకు చంద్రుడని, భక్తచాతకాలకు మేఘమని, సాధుకమలాలకు సూర్యుడని ఆమె మరచిపోయింది. పధ్నాల్గు సంవత్సరాలు జీవచ్ఛవంలా శరీరాన్ని పోషించి కర్మఫలాన్ని ఏ విధంగా అనుభవించాలి అని వనవాసానికి సిద్ధంగా ఉన్న రాముని చూసి విచారించింది. 'రామా! నీవే నా ఆలంబన. నీ వనవాస



వార్తతో నా స్తన్యం గడ్డ కట్టిపోయింది. మునిజనరంజనా! గుణనిధానా! భువన సుందరా! నువ్వు అయోధ్య విడువవద్దు. నువ్వులేని హృదయం సంపత్తి విపత్తులను, కళ అవకళలను లెక్కించదు. సంపూర్ణ విద్యావంతుడయినా అజ్ఞానిగానే చెలామణి అవుతాడు. చేసే కర్మలన్నీ భ్రమలుగా తోస్తాయి. సచ్చిదానందా! నన్ను వదలక తప్పదా!' అని విలపించింది. 'రాముడు సర్వత్రా విజయుడు. కల్పాంతం కూడా ఆయనను ఏమీ చేయలేదు. శ్రీమహావిష్ణువు అవతారమే ఈ శ్రీరాముడు' అని మృత్యుముఖంలో ఉండేవాడికి వైద్యుడు ధైర్యం నూరిపోసినట్లు ఆకాశవాణి కౌసల్యకు ధైర్యం చెప్పింది.

నిర్వికారుడు, ఆదిపురుషుడైన శ్రీరాముడు కౌసల్యకు ప్రదక్షిణం చేసి తల్లి వంక చూడగానే, ఆ అగోచరుడి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. తత్‌క్షణమే మాయ కౌసల్యను ఆలింగనం చేసుకుంది. ఈ సన్నివేశ వర్ణన కవి కల్పనలకు అందనిది. 'తండ్రి మాటను ఆదరించి కైకేయి ఆజ్ఞను పాలిస్తున్నావు కానీ, నా మాట మన్నించవేం?' అని కౌసల్య ప్రశ్నించింది. 'మాతా చింతించకు. నేను త్వరలోనే తిరిగి వస్తాను' అని జగద్వంద్యుడు బదులు పలికాడు. అనంతరం రాముడు సీతా మందిరం ప్రవేశించాడు. ఆమె భర్త రాకకు సంతోషించి అన్నంతో దిష్టి తీసేసింది. 'ఆర్యపుత్రా! మీరిలా ఒంటరిగా వచ్చారేమిటి? రాజచిహ్నాలేవీ మీ శరీరంమీద కన్పించడం లేదు' అని అనుమానంగా ప్రశ్నించింది. రాముడు జరిగిన వృత్తాంతం వివరించి, 'నేను, లక్ష్మణుడు అడవులకు పోవలసిన సమయం వచ్చింది. నువ్వు అత్తగారయిన కౌసల్య సేవ చేస్తూ సుమిత్రా, కైకేయిలను పూజనీయులుగా భావించి, మిథిలకు పోకుండా ఇక్కడే ఉండవలసింది. దండకారణ్యం దుర్గమం. అక్కడి శీతోష్ణస్థితులు నీకు సరిపడవు' అని తన అభిప్రాయం వివరించాడు. 'జగద్వంద్యా! శ్రీరామా! భక్తుల పాలిటి కల్పవృక్షమా! జగజ్జనకా! జలదగాత్రా! జలచరాలకు జలం, పక్షులకు ఆకాశం అవసరం. దీపం లేకుండా వెలుగు,

బంగారాన్ని వీడి వన్నె, శంకరుడు లేని పార్వతి, కిరణాలులేని సూర్యుడు, సాధు హృదయం వీడి వివేకం, రత్నాలు వదిలి కళ, బెల్లాన్ని వదిలి తీయదనం, కస్తూరిని వదిలి పరిమళం మనలేవు. ఆ విధంగా నిన్ను వదిలి నేను మనలేను. నన్ను వదిలి పోవద్దు. రఘుపతీ! కోమలాంగా ! దయాళూ! నా హృదయకమల భ్రమరమా! తాటకాంతకా! సింహం వంటి సఖుడువు నీవు వెంటవుండగా అడవులలో నీవెంట తిరగడానికి భయం దేనికి?' అని రాజహంస, గుణసరిత, చంపకమొగ్గ వంటి సీత జవాబు చెప్పింది. జగదాత్మ అయిన శ్రీరాముడు మనసులో సుధాకరుని చూచిన చకోరంలా సంతోషించాడు. మేఘగర్జన వంటి సీత పలుకులతో రఘురాము మానస మయూరం ఆనంద నృత్యం చేసింది. 'ఇందువదనా! కులగురువును వేడుకొని వనవాసానికి అనుజ్ఞ తీసుకో! ఈ పళంగా వనాలకు నిన్ను వెంటబెట్టుకొని వెళితే ప్రజలు నానావిధాలుగా నిందిస్తారు. అందువల్ల ఆయన అనుమతి పొందడమే భావ్యం' అని రాముడు అన్నాడు. అప్పుడు సీత వెళ్ళి వసిష్ఠుడి పాదాలకు నమస్కరించి వనవాసానికి అనుమతి కోరింది. కులగురువు రాముడి వంక చూస్తూ, 'నీవెంట జానకిని, నీ బాగోగులు గమనించడానికి లక్ష్మణుని తీసుకెళ్ళు!' అని ఆదేశించాడు. రాముడు లక్ష్మణుని వసిష్ఠులవారి ఇంట్లో ఉండే ధనుస్సును, అక్షయ తూణీరాన్ని, దివ్యాస్త్రసాలను తెచ్చేందుకు నియోగించాడు. కూడబెట్టిన ధనాన్ని యాచకులందరికీ పంచి, గురువుకు అశేష ద్రవ్యకానుకలను పంపాడు. గురువుకు నానా వస్తు సంపదను చెల్లించని వాడు నిస్సందేహంగా అభాగ్యుడే. త్రికరణ శుద్ధిగా గురువు శరణుపొంది భజించనివాడు శాస్త్రప్రవీణుడైనా తరించలేడు. అటువంటివాడి తపస్సు వ్యర్థం. అతని జపం మంటకలసిపోతుంది. గురువచనాలపట్ల ప్రీతిలేని ప్రతాపం నిష్ఫలం. సర్వసుఖాలను అనుభవిస్తూ గురువు కష్టాలను ఆదుకోలేనివాడి ముఖం కల్పాంతంలో కూడా చూడకూడదు. రఘురాముడు ఇందుకు భిన్నంగా తగు



విధాన గురువు ఋణం తీర్చుకున్నాడు. ఆదరభావంతో గురుపుత్రుని పిలిచి తన వస్త్రసాలు, భూషణాలు తీసి సంపూర్ణంగా అతడికి తొడిగాడు. సీత తన వస్త్రాలు, అలంకారాలను తొలగించుకుంది. అన్నీ గురుపుత్రుడికి ఇచ్చి రథంలో అతన్ని ఇంటికి పంపింది. విశ్వామిత్ర, అసిత, కణ్వ, దుర్వాస, భృగు, వామదేవ, అంగీరసాది మునిజనానికి పధ్నాలుగు ఏండ్లకు సరిపడే తరగని ధనాన్ని పంపాడు. అందరినీ గౌరవించి, ప్రీతితో, నాపై స్నేహభావం వీడక అందరూ సుఖంగా జీవించండని కోరాడు. అయోధ్య పురజనులు కల్పాంతమే వచ్చింది అనుకున్నారు. కైకేయి సదనానికి చేరాడు రాముడు. అయోధ్యలో స్త్రీ, పురుషులు, గో బ్రాహ్మణులు అందరూ అశ్రునయనాలతో తామూ రామునితో వనవాసం వెళ్ళాల్సిందేనని నిర్ణయించుకొన్నారు. రాముడు తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేశాడు. దశరథుడు రాముడివంక చూస్తూ 'నాయనా, రఘునందనా! నువ్వు వనవాసానికి పోతున్నావంటే ప్రాణం నిలువలేకపోతుంది. కూడా సైన్యం తీసుకపో, సుఖంగా పదునాలుగు ఏండ్లు గడుపు' అన్నాడు. 'మహారాజా! నేను అడవికి పోతున్నది తపస్సు చేసుకోవటానికి. నార చీరలే ధరిస్తాను. సైన్యంతో అవసరం ఉండదు' అని బదులిచ్చాడు రాముడు. ఆ మాటలు విన్న కైక నార చీరలందించింది. అవి కట్టుకొని తన నీలమేఘశ్యామల శరీరానికి విభూతి రాసుకున్నాడు. సుగంధ కేశాలను ముడికట్టాడు. అన్నగారి జాడలో లక్ష్మణుడు అదేవిధంగా చేసి దశరథుడి ఆశీర్వాదం గ్రహించాడు. కైక సీతతో, 'నువ్వూ వస్త్రాభరణాలు విడిచెయ్య'మని కోరింది. వెంటనే సీతకూడా అత్తగారి ఆజ్ఞను పాటించింది. కైక అందించిన నారచీరలు కట్టుకోవటానికి సతమతమయింది. శ్రీరాముడు సాయపడ్డాడు. ఆమె కోమల శరీరానికి అది అవస్థే అయింది. కులగురువు కైకను చూసి, 'నువ్వు పరమ నిర్దయవు, పాపివి. సీతనుంచి వస్త్రాలను లాక్కున్నావు. రాజ్యాన్ని హీనత్వం పాలుచేస్తున్నావు. రాముని క్రూరభావంతో అడవులకు పంపుతున్నావు' అని నిర్భయంగా

మందలించాడు. దశరథుడు కైక వంక చూచి, 'నువ్వు నా కళ్ళముందు నుంచి బయటకు ఫో! తీసుకున్న వస్త్రాలను అమ్ముకో! సభ్యతలేని దానా! నా బిడ్డలను నిర్దయగా బయటకు పంపుతున్నావు. మాటకు కట్టుబడ్డాను కనుక సరిపోయింది. లేకుంటే నీకు శిరశ్ఛేదమే గతి, బావిలో పడిన సింహంలా, బోనులో పడ్డ పులిలా, మంటల్లో చిక్కిన సర్పంలా, గొంతుకలో అడ్డుపడ్డ చేపలా, మంచివాడి సర్వస్వాన్ని హరించిన దొంగలా నేను నీచేత చిక్కాను' అని అసహ్యించుకొన్నాడు. సీతను హత్తుకుని, 'బాలా, నువ్వు కష్టాల పాలవుతున్నావు. చంపక పుష్పం వంటి దానివి, సుకుమారివి, నువ్వు అక్కడి శీతోష్ణాలకు తట్టుకోలేవు. ఇవన్నీ ఎవరికి చెప్పుకొని ఎలా భరించగలవు?' అని బాధపడ్డాడు. సుమంతుని పిలిచి సీతకు సంబంధించిన ఆభరణాలను ఇచ్చివేయమని జగన్మాతను గౌరవించమని చెప్పాడు. తరువాత, మంగళకారిణియైన సీత తన మామగారి చరణాలకు మ్రొక్కింది. వసిష్ఠులకు నమస్కరించి, కృపగా ఉండమని, విదియనాటి చంద్రుడు దినదిన ప్రవర్ధమానుడయినట్టు నాపై స్నేహాదరాలు పెంపొందనీయమని వేడుకుంది. 'సూర్యచంద్రులున్నంతకాలం అక్షయంగా ఉండి రాజ్యపాలన చేస్తార'ని వసిష్ఠుడు ఆశీర్వదించి, 'నువ్వు పూర్ణసతివి. ముల్లోకాల్లో నీ కీర్తి పెరుగుతుంది. రఘుపతి వనాంతరాల్లో విజయం సాధించడం తథ్యం' అని పేర్కొన్నాడు.

శ్రీరాముడు ఏడువందలమంది దశరథుని రాణులకు, తల్లి కౌసల్యకు నమస్కరించి సెలవు తీసుకొంటూ నాపై ప్రేమ భావాన్ని పెంపొందించుకోండని వేడుకున్నాడు.

అప్పుడు ఒక్కసారిగా తల్లులు గుండెలు బాదుకున్నారు. ఒకామె మట్టితీసి ముఖానికి పూసుకుంది. ఒకామె జుట్టు పీక్కుంది. మరొకామె అరుస్తూ, 'ఓ రామా నువ్విక్కడే ఉండిపో!' అంది. ఇవన్నీ చూసిన దశరథుడు, 'రామా నువ్వు నడచిపోకు. సరయూ తీరం వరకు షడ్గుణిరథంలో వెళ్ళు' అని కోరాడు.



మహారాజుకు నమస్కరించి సుమంతుడు తెచ్చిన రథాన్ని రాముడు అధిరోహించగా లక్ష్మణుడు, సీత అనుసరించారు. బయట పురజనుల కోలాహలం పెరిగింది. దశరథుడు దుఃఖం పట్టలేకపోయాడు. ద్వారం వెలుపలికి వచ్చి ప్రజల నుద్దేశించి గద్గద స్వరంతో, 'మీరందరూ సమాధానపడండి. రాముడు త్వరలో తిరిగివస్తాడు. నా బిడ్డ ఎక్కడికి పోయాడో, ఎటుపోయాడో నాకు చూడాలని వుంది. తీసుకొనిరండి. నేనూ అడవులకు పోతాను!' అని విలపించాడు. 'రథం కనుక తిరిగివస్తే దాన్ని అడ్డగించి రాఘవుడిని జోలెపట్టి అర్థించి అయినా సరే వనవాసానికి వెళ్ళనివ్వను. నా రాముడిని చూపించండి. రాముడు లేక మలినమయిన ఈ అయోధ్యకు నిప్పంటించండి. నా ప్రాణం కడతేరిపోతోంది. అయోధ్య ప్రాణంలేని కళేబరంలా ఉంది. త్వరగా దానికి నిప్పంటించి దానితో పాటే నన్నూ భస్మం చేయండి. దశదిశలూ దిగులుగా కనబడుతున్నాయి. రాఘవుడి వనవాసంతో అయోధ్య పాడుబడింది. లోకానికి మసిబారిన నా ముఖాన్నెలా చూపించేది. వెంటనే జడమయిన ఈ శరీరాన్ని వదిలి అడవుల్లో రాముని వెతకటానికి వెళతాను!' అని పై అంగవస్త్రం జారిపోతుండగా గోపురాన్ని ఎక్కి అటూ ఇటూ తిరుగుతూ నెత్తిబాదుకొంటూ పుత్రవిరహంతో ఉన్మత్తుడయి, సంచరిస్తూ లోకులవంక చూస్తూ, 'నా శ్యామల వర్ణుడయిన రాముని చూపించండి' అని దు:ఖించాడు. 'నీ ఆజ్ఞతోనే కదా రాముడు వనవాసానికి వెళ్ళింది' అని పరివారం ఓదార్చారు. అప్పుడొకామె, 'శ్రీరాముడు రథంలో ద్వారం వద్దకొచ్చాడు', అంటే వెంటనే దశరథుడు పరుగు పరుగున వచ్చాడు. 'ధ్వజం కనబడటం లేదు' అని అంటూ కౌసల్య బిగ్గరగా అరుస్తూ పరిగెత్తుతూ, 'అదిగో రాముడు నిలబడి ఉన్నాడు. నీ ముఖం చూడనీ తండ్రీ!' అంటూ భ్రమలో రోదించింది. 'కైకేయి మాటలు అమావాస్య చీకటిలాంటివి. అప్పటినుంచే రామచంద్రుడు కనబడటం లేదు. రామవియోగమనే చింతాగ్నిలో పడ్డ చకోరంలా ఉంది వారి పరిస్థితి. కైకేయి

అనే కేతువు రామ సూర్యుని మింగి వేసింది. ఇక పదునాలుగేండ్లు అన్నపానీయాలు లేకుండా ఎదురుచూడాలి. రాముడు మేఘం అయితే కైక పెనుగాలి. ఈ పెనుగాలితో ఆ మేఘం దూరమైంది. జీవనాధారం లేక మేము కుమిలిపోతున్నాం. అంధునిక ఊతకర్రలా ఉండే నా రాముడిని అడవికి ఎవ్వరు పంపారు? దరిద్రుడి సొత్తు నిర్దయగా గ్రహించినట్టు నా సర్వస్వాన్ని ఎవరు తరిమేసారు? నా చింతామణిని, పరుసవేదిని ఎవరు పారేశారు? నా చంటిబిడ్డ లేక నా స్తన్యాలు గడ్డకట్టాయి. నా బిడ్డను నాకు చూపించండి. సుకుమారుడైన రాముడు అడవిలో భోజనం ఎవరిని అడుగుతాడు? నారచీరలు ధరించాడే, మంగళస్నానం ఎలా చేస్తాడు? ఎర్ర కలువలకంటే కోమల చరణాలకు కంటకాలు, కఠిన శిలలు గుచ్చుకొంటే ఎలా భరించగలడు? గుడ్డివానికి వనంలో తోడు లేనప్పుడు కలిగే పరిస్థితి నాకూ సంభవించింది. చంటిబిడ్డను పరదేశంలో వదిలి తల్లి సహగమనంచేస్తే మనసు వ్యాకుల పడినట్లుగా రాముడు లేని పరిస్థితి నా కలాగే ఉంది' అని చింతించింది.

రవికులభూషణుడు అడవికి బయలుదేరగానే పాషాణాలు దు:ఖంతో కఠినత్వాన్ని కోల్పోయాయి. గజ, తురగ, పశుపక్ష్యాదులు, ఆహారం, నీరు ముట్టలేదు. అడవిలో పక్షులు రోదించాయి. అయోధ్య జనావళి, బ్రాహ్మణులు, భక్తులు, మిత్రులు, సేవకులు, చర్మకారులు,అంటరానివారు మొదలగువారు అందరూ కుటుంబసహితంగా శ్రీరాముని అనుసరించారు. అయోధ్య పాడుబడింది. ఆబాలగోపాలం రామచంద్రుడితో బాటు సాగింది. ప్రజలందరూ పలురకాలుగా అనుకోసాగారు. 'కైకేయి పరమ చండాల యువతి. సీత వస్త్రాభరణాలను అపహరించిన కైకేయి చేతికింద పనిచేయడానికి ఎవరు అంగీకరిస్తారు? దశరథుడు మరణిస్తే అయోధ్య పాడుబడుతుంది. రాజెవరయినా కైకకు కేశముండనం చేయించి పాడుబడ్డ అయోధ్యకు ఎవడు ప్రాణం పోయగలడు' అని ఒకరు, 'దశరథుడి పురుషార్థం వీగిపోయింది. కైకను



వధించి రామునిచేత రాజ్యస్థాపన చేయొచ్చును కదా?' అని ఒకరు, 'స్త్రీ వ్యామోహంలో పడి రాజు దీనుడయ్యాడు, అయోధ్య పెన్నిధిని వనవాసానికి పంపాడ'ని మరొకరు, 'మనమూ వనవాసానికి తప్పనిసరిగా పోవల్సిందే' అని వేరొకరు ఇలా రకరకాలుగా అనుకొన్నారు.

అయోధ్యాపురవాసుల పరుగును వెనుదిరిగి చూచిన రాముడు రథం నిలిపాడు. అందరికీ అభివాదం చేసి, 'దశరథ మహారాజు మనకు తలమానికం. మేం అరణ్యవాసం చేసి వస్తాము. మీరందరూ అక్కడికి రావడం అసంభవం. పదునాలుగుఏండ్లు పూర్తి కాగానే త్వరగా తిరిగి వచ్చేస్తాం. మీరు మీ ఇళ్ళలో సుఖంగా ఉండండి' అని విన్నవించాడు. గౌరవంతో నిస్తేజులయి దుఃఖభారంతో అందరూ వెనుదిరిగారు. రామభక్తులకు, బ్రాహ్మణులకు, అగ్నిహోత్రులకు, పండితులకు, జ్ఞానులకు, మొదలయిన వారికి ప్రళయం వచ్చినట్లయింది. రాఘవుడినే ప్రాణం కంటే ఎక్కువగా భావించిన వారంతా తామూ అరణ్యానికి వస్తామని పట్టుబట్టారు. అయినా వెళ్ళడానికి వారికి అవకాశం కలుగలేదు. రాముడు రథం దిగి బ్రాహ్మణుల పాదాలను పట్టుకుని వెనుదిరిగి వెళ్ళమని అర్థించాడు.

అయినా వాళ్ళందరూ 'రామా! నిన్ను వదలి వెళ్ళలేం' అని తిరిగి తిరిగి ప్రార్థించారు. 'అహల్యోద్ధారా! రాఘవా! ఈ బ్రాహ్మణులు చాలా అలసిపోయారు. సూర్యాస్తమయం అవుతోంది! కాబట్టి వారికోసం ఇక్కడే ఎక్కడో విశ్రమించాలి', అని అన్నగారిని లక్ష్మణుడు అనుజ్ఞ కోరాడు.

అక్కడ అయోధ్యలో స్త్రీలందరూ దశరథునికి తోడుగా కైకేయీ సదనానికి వెళ్ళారు. కౌసల్య, సుమిత్ర మొదలైన రాణులు, దశరథుని దగ్గరగా జరిగి కూర్చున్నారు. మందిరంలో దీపాలు వెలవెలబోతున్నాయి. రాముడి వనవాస కారణాన నగరంలో ప్రేతకళ ఆవరించింది. బుద్ధినాశనం తరువాత అజ్ఞానం

కమ్ముకొన్నట్లు, రాణులు, దశరథుడు ప్రాణత్యాగానికి సిద్ధపడి, తాకితేనే ప్రాణాలను హరించే ఘోర విషాన్ని తెప్పించారు. కులగురువు, వసిష్ఠుడు వెంటనే ప్రవేశించి, సపరివారంగా రావణుని హతమార్చి, దేవతలను విముక్తులను చేసి, పద్నాల్గేళ్ళ అనంతరం జగద్విఖ్యాతుడై రాముడు తిరిగి వస్తాడు. ఇది సత్యం. రాముడి పైన 'ఆన', 'మీరు ప్రాణత్యాగం చేయకూడదు' అని ధైర్యవచనాలను బోధించాడు. గురువు మాటను ప్రమాణంగా తీసుకొని వారు విషపానాన్ని వర్జించారు.

జగద్రక్షకుడు, బ్రహ్మజనకుడు, ఈశ్వరమిత్రుడు వనంలో బ్రాహ్మణ పరివేష్టితుడయి ఉన్నాడు. రాత్రి మూడు ఝాములయింది. నక్షత్రాల చుట్టూ చంద్రుడిలా, సూర్యునిచుట్టూ కిరణాల్లా రథం చుట్టూ బ్రాహ్మణులందరూ నిద్రించారు. లక్ష్మణుని పిలిచి రథం సిద్ధం చేయమని ఆదేశించాడు రాముడు. మరుక్షణంలో గరుడుడు అమృతాన్ని అపహరించిన వేగంతో, ఆకాశాన రాజహంసలు మానస సరోవరం చేరినట్లు, రథం అధిరోహించి వాయువేగ మనోవేగాలతో అయోధ్యవేపుగా పరుగుతీయించి గుహుడి ఆశ్రమం చేరి గంగాతీరంలో శ్రీరాముడు స్నానానికి బయలుదేరాడు. 'సూర్యవంశంలో భగీరథుడు నిన్ను నానావిధాల ప్రార్థించి జగదుద్ధరణకు గంగను భువికి తెచ్చాడు. అడగంగానే శివుని జటాజూటంలో విరాజిల్లే గంగను ఆ పరబ్రహ్మ భువికి ప్రసాదించాడు. బ్రహ్మ, ఇంద్ర, శివ, గంధర్వ, సర్ప, మునిజన సమూహాలు గంగానదిని అపారంగా స్తోత్రం చేశారు. గంగను చూస్తే వేయిజన్మల పాపం భస్మమయి పోతుంది' అని ఇలా సగరకులాన్ని తరింపజేసిన ఆ జాహ్నవిని రామలక్ష్మణులు స్తవం చేసి అందులో మునిగి స్నానం చేశారు. సీత సుమంతులతో కలిసి నిత్యానుష్ఠాన కర్మలు పూర్తిచేసి దర్భాసనంపై రాముడు ఆసీనుడయ్యాడు. మర్రిపాలతో తలను రుద్ది కేశాలను ముడివేసుకొన్న రాముడు భస్మం పూసుకొన్న శంకరుడిలా గోచరించాడు.



అక్కడ బ్రాహ్మణులు నిద్రలేచారు. రథంతో సహా రఘురాముడు నిష్క్రమించాడని తెలిసి, 'నిద్రతో అనర్థం జరిగిందని, చేజిక్కిన అవకాశం వదలి ఆనందఘనుడు, జగద్గురువు అయిన రాముని వదిలేసాం' అని దుఃఖించారు. అజ్ఞానం కప్పివేసింది. ఆత్మారాముడు అనుభవానికే రాలేదు. కష్టతరమైన మాయ మోసం చేసిందని ఒకరు, దశరథుడు ప్రాణాలు వదుల్తాడని, అందుకనే సీతానాథుడు అయోధ్యకే తిరిగి వెళ్ళాడు, అందుకనే చక్రాల గుర్తులు అయోధ్యవైపే కనిపిస్తున్నాయని అందరూ సంతోషించి ఆనందంగా వెనుదిరిగారు. అయితే, భవబంధ ఛేదకుడయిన రాముడు అయోధ్యలో లేడు! బ్రాహ్మణులందరూ విచారంలో సకల మంగళభోగాలు విసర్జించి ఏకాంతంగా కూర్చొని రామదర్శనం కాకుండా ఇళ్ళకు వెళ్ళకూడదని నిశ్చయించారు. గంగను రాముడు దాటిన వైనం ఆదరభావంతో సజ్జనులైన శ్రోతలు కౌతుకంగా శ్రవణం చేయండి. రామవిజయగ్రంథం కేవలం స్వయంగా గ్రోలాల్సిన అమృతం. దీన్ని సత్పురుషులు, దేవతలు బ్రహ్మానందంగా సేవిస్తారు. రవికులభూషణా, రాఘవేంద్రా! బ్రహ్మానందా! జ్ఞానసముద్రా! శ్రీధరవరదా! అతి ఉదారా! నిర్వికారా! అభంగా! నమస్సులు.

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. దీన్ని చతురులయిన శ్రోతలు సదా శ్రవణం చేస్తూనే ఉంటారు. స్వస్తి!

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**దశమాధ్యాయం మధురం**

## అధ్యాయము - 11

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

ఈ రామవిజయ గ్రంథంలో ఒక అధ్యాయం కన్నా మరొకటి మరింత మధురం. క్రమక్రమంగా సూర్యుడు పైకి వచ్చినట్లు, శుక్లపక్షంలో చంద్రకళ అనుదినం పెరిగినట్లు, అభ్యాసంవల్ల జ్ఞానం, యోగసాధన వల్ల మనశ్శాంతి ఇనుమడించినట్లు, బాల్యంనుంచి పాండిత్యం దినదినాభివృద్ధిచెందినట్లు వటవృక్షం బీజ దశనుంచి క్రమేపీ మహావృక్షంగా విస్తరించినట్లు, మొదట్లో చిన్నపాయగా ఉన్న కృష్ణవేణి పోనుపోను అతివిస్తృతమయినట్లు, చెరకుగడలో తీపి రానురాను అతిశయించినట్లు, గురుభజనవల్ల జ్ఞానకళ, లక్ష్యశుద్ధివల్ల తపస్సు, సాధుసంగమంవల్ల క్షమ, దయాది సద్గుణాలు దినదినాభివృద్ధి పొందుతాయి. నిష్కామదానంవల్ల త్రిలోకకీర్తి, వీరలక్ష్మిని ఆశ్రయించడంవల్ల విశేష ప్రతాపం, స్నేహ ఆదర భావంవల్ల మైత్రి, పరోపకారంవల్ల కీర్తి పెరుగుతాయి. సేవించే కొద్దీ మాధుర్యరసం ఇనుమడిస్తుంది. వర్షాకాలంలో గంగ దినదినప్రవర్ధమానంగా ఉప్పొంగి ఒడ్లను ఒరుసుకొని ప్రవహించినట్లు, చతుర రసజ్ఞులైన శ్రోతలను చూసి వక్త ఆనందం అతిశయించి అవధుల్ని దాటుతుంది. శ్రోతలు మందబుద్ధులైతే వక్త విద్వత్తు, ఆనందం సూర్యాస్తమయంలో కమలాల్లా ముకుళించుకొనిపోతాయి.

### గంగను దాటించిన గుహుని నావ

గత అధ్యాయంలో వివరించినట్లు, గంగఒడ్డున వటవృక్షం క్రింద దర్భాసనంపై విశ్రమించిన ఆ రఘురాముడు మాయ వీడిన ఏకాంతయోగిలా నిశ్చలుడై విరాజిల్లుతున్నాడు. పవిత్రమైన రామనామమనే నౌకలో దుస్తరమైన భవసాగరాన్ని దాటించగల ఆ రాఘవేంద్రుడు నది ఆవలితీరానికి చేర్చమని



గుహుని అర్థించాడు. క్షీరసాగరం దరిద్రుని యాచించినట్లు, బృహస్పతి మూర్ఖునివద్ద సందేహాలు తీర్చుకున్నట్లు, గంగానది చిన్నగుంటవద్దకు వెళ్ళి దప్పిక తీర్చమన్నట్లు, కల్పతరువు నిర్భాగ్యుణ్ణి అర్థించినట్లు రాఘవుడుతమను, తన నౌకలో గంగను దాటించమని గుహుని కోరాడు. గుహుడు శ్రీరాముని గాంచి కుతూహలంతో 'మీ నామధేయం ఏమిటి? మీరాకకు కారణమేంది? మీరెక్కడికి పోతున్నారు?' అని ప్రశ్నించగా 'రవికులభూషణుడైన దశరథుడు నా తండ్రి. నన్ను శ్రీరాముడని జనులంతా అంటారు'అని రఘునందనుడు జవాబిచ్చాడు. ఆ మాట విన్న గుహుని తల్లి రోదిస్తూ, 'కఠినశిల నీ పాదం తగిలి మహాలక్ష్మివంటి మగువగా మారిందని భక్త జనావళి, సాధు సజ్జనులు చెప్పగా విన్నాను. నీ కాలుమోపితే మా నావ కూడా స్త్రీగా మారుతుందేమోనని భయంగా ఉన్నది' అంటూ శ్రీరాముని నావ ఎక్కనీయవద్దని గుహుడితో అన్నది. 'ఉన్న ఒక్క భార్యనే పోషించడం కష్టంగా ఉంది. ఈ నావ కూడా నాతి అయితే నీ జీవనం ఎలా సాగుతుంద'ని గుహుణ్ణి ప్రశ్నించింది. కాని తల్లి మాట గుహుడు చెవిన పెట్టక 'సర్వోత్తమా! నీ చరణమహిమ అపారం. వాటిని నేను ముందుగా అభిషేకిస్తాను. నీ చరణధూళి సోకినందువల్లనే కదా శిల స్త్రీగా మారింది. అందుకని పాదాభిషేకానంతరం నా నావనెక్కవలసింద'ని అభ్యర్థించాడు. తదుపరి ఆ జగన్మోహనుడు, మాయాతీతుడు, శుద్ధచైతన్యుడు, పద్మాక్షీరమణుడు, జగద్గురువయిన శ్రీరాముని తన కుటీరానికి తీసుకుని వెళ్ళి సుఖాసీనుని గావించి, బ్రహ్మరుద్రాదులు ఎవరి పాద రజ:కణాన్ని వాంఛిస్తారో, సనకసనందనాదులు సదా ఏ పాదపద్మసన్నిధి కోసం నిరంతరం సాధన చేస్తారో, జాహ్నవి ఏ పాదాలనుండి ఆవిర్భవించిందో, ఆ చరణాలను తన స్వహస్తాలతో గుహుడు గంగాజలంతో అభిషేకించి, వనఫలాలతో, పుష్పాలతో, కందమూలాలతో జనక జామాతను పూజించాడు. ఆ సమయంలో గుహుని ఆనందం వర్ణనాతీతం. రామపాదాలను గట్టిగా పట్టుకొని

ప్రేమబాష్పానందభరితుడయి వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ, 'రవికులతిలకా! దయాసాగరా! మాయాచక్రచాలకా! అయోధ్యాపతీ! తాటక సంహారా! త్వరగా తిరిగి రా స్వామీ! నువ్వు తిరిగి రానంతకాలం నేను భుజించను. నీవు వచ్చేవరకు భోగభాగ్యాలు, మంగళస్నానాలు విడనాడెదను' అని అన్నాడు. ఆ భక్తుని ప్రేమకు పరవశుడైన శ్రీరాముడు గుహుని గాఢాలింగనం చేసుకున్నాడు. తదుపరి గుహుడు నావను తెప్పించి రాముని కూర్చుండబెట్టాడు.

సీతాలక్ష్మణులు నావలో కూర్చున్న తరువాత శ్రీరాముడు సుమంతునితో 'నీవు త్వరగా తిరిగి వెళ్ళి మహారాజుకు అన్ని సంగతులు విన్నవించు. కులగురువుకు, తండ్రిగారికి ప్రణామాలు తెలుపు. పదునాలుగు సంవత్సరాలు నిండగానే నేను తిరిగి వస్తానని చెప్పి ప్రజలందరినీ సమాధానపరచు. నీవు త్వరగా బయలుదేరు. లేకపోతే నంది గ్రామాన్నుండి వచ్చిన భరతుని, మహారాజు కోపావేశంతో వధిస్తారేమో! వారించు, ఇక నీవు వెంటనే బయలుదేరవలసింద'ని శ్రీరాముడు ఆనతీయగా సుమంతుడు రథం దిగి శ్రీరామునికి పాదాభివందనం చేసి, కన్నీళ్ళతో శ్రీరాముని పాదాలు కడిగి, "నేను అయోధ్యకు వెళ్ళి అందరికీ దు:ఖం కలిగించలేను! మీతో కలిసి వస్తాను. లేదా ప్రాణాలను త్యజిస్తాను. మీరు లేని ఈ శూన్యరథాన్ని చూచి మహారాజు, కౌసల్యమాత ప్రాణత్యాగం చేస్తారు. మిమ్మల్ని అడవిలో ఎందుకు వదిలిపెట్టి వచ్చావని నన్ను నిందిస్తారు" అని ఆక్రోశించాడు. శ్రీరాముడు సుమంతుని హృదయానికి హత్తుకుని 'నా ఆజ్ఞ పాలించి అయోధ్యకు వెళ్ళు! చింతించకు' అని వరదహస్తాన్ని సుమంతుని శిరస్సుపై నుంచి ఆశీర్వదించగా మేఘాలు వర్షించగానే మంటలు చల్లారినట్లు సుమంతుని శోకమంతా మటుమాయమయింది. శ్రీరాముని ఆజ్ఞ గైకొని సుమంతుడు, వారు ఆవలి ఒడ్డు చేరే దాకా చూస్తూ నిలుచున్నాడు. ఆవలి ఒడ్డు చేరిన శ్రీరాముడు నివృత్తినొందిన యోగిలా సుమంతుని వైపుచూచి త్వరగా తిరిగి వెళ్ళమని చేయి ఊపుతూ సౌంజ్ఞ చేశాడు.



## మునిజన సమాగమం

శ్రీరాముడు పుష్కరిణి దగ్గర ఒక రాత్రి గడిపి ప్రయాగ చేరాడు. రాముని దృష్టి సోకగానే ప్రయాగ పావనమైంది. అక్కడనుండి ఆ రఘునందనుడు భరద్వాజాశ్రమం చేరుకోగా శ్రీరామాగమనవార్త విని భరద్వాజముని శ్రీరాముని వద్దకు పరుగున వచ్చాడు. శ్రీరాముడు ఋషికి నమస్కరించగా ముని క్షేమాలింగనం చేసుకుని, 'ఈ రోజు నా జన్మ ధన్యం. త్రిలోకాధిపతియే నా ఆశ్రమం పావనం చేశాడు. నా పూర్వపుణ్య పర్వతాలు చిదాకాశావధులను దాటి వెళ్ళాయి. అందుకే రఘుపతి పిలవకనే నా ఇంటికి వచ్చాడు' అంటూ భరద్వాజ ముని ప్రేమతో, సకలమంగళప్రదాయకుడు, సీతానాథుడు, జగదుద్ధారకుడైన రఘునందనునికి ప్రదక్షిణం చేశాడు. దేవతలను బంధవిముక్తుల చేయుటకు ఆదారిన వెడుతూ రవికులభూషణుడైన రఘువీరుడు భరద్వాజాశ్రమానికి వచ్చాడని తెలియగానే ఋషులందరూ పరుగున వచ్చారు. వారందరూ ఇంద్రుని చుట్టూ దేవతల్లా, సూర్యుని చుట్టూ కిరణాల్లా, చందనం చుట్టూ మలయమారుతంలా, శివుని చుట్టూ వైరాగ్యంలా, వరుడిచుట్టూ మూగిన పెళ్ళివారిలా, సాధకునికి సమకూరిన సంపదలా, అమూల్యరత్నాన్ని పరీక్షించడానికి చుట్టూ చేరిన నిపుణుల్లా, మేరుపర్వతాన్ని ఆవరించిన చిల్లర పర్వతాల్లా, చంద్రుని చుట్టూ తారల్లా, మానస సరోవరంలో రాజహంసల్లా, మునులందరూ రాముని చుట్టూ చేరారు. భరద్వాజుడు రఘునందనుని పూజించి, "రామా! మీరు వనవాసకాలం పదునాలుగేళ్ళు ఇక్కడే ప్రశాంతంగా గడుపవలసింది. దండకారణ్యానికి అనవసరంగా ఎందుకు వెళ్ళడం?" అని అర్థించాడు. 'ఇక్కడ వుంటే అయోధ్య ప్రజలు, బ్రాహ్మణులు, తల్లిదండ్రులు అంతా ఇక్కడకు వస్తారు. మేం అజ్ఞాతంగా మహారణ్యంలో ప్రవేశిస్తాం. ముందు ఏం జరగబోతుందో మీకు స్పష్టంగా తెలుసు' అంటూ అక్కడ మరోరోజు గడిపి, 'మేము ముందుకు వెళ్ళడానికి మార్గం చూపించవలసింది!' అని రాముడు తన నిశ్చయాన్ని స్పష్టం చేశాడు.

'ముందు చిత్రకూటం వస్తుంది, అక్కడ ఉండే విద్వాంసులతో కొద్దిరోజులు గడపవలసింద'ని చెప్పి, భరద్వాజముని శ్రీరాముని వెంట సిద్ధవటం వరకూ వెళ్ళి ఆయనవద్ద సెలవు తీసుకుని, ప్రయాగకు తిరిగి వచ్చాడు. సిద్ధవటాన్ని చూచి శ్రీరామచంద్రుడు నమస్కరించాడు. సిద్ధవటంలో సావిత్రికి సీత నమస్కరించి, 'వనవాసానంతరం విజయవంతంగా రఘురాముడు తిరిగి వస్తే రెండు లక్షల గోవులతో బ్రాహ్మణ సంతర్పణ గావిస్తాను' అని మొక్కుకుంది. సరయూతీరవిహారి శ్రీరాముడు ముందుగా చిత్రకూటాన్ని అధిరోహించాడు. అక్కడ వాల్మీకి మునిజనబృందంతో తపస్సు చేసుకుంటున్నాడు. ఆ మహాముని నారద కృపాకటాక్షం వలన రామావతారం జరగక ముందే భవిష్యత్తు రచించాడు. చంద్రోద్భవానికి ముందే వికసించిన కమలాల్లా రాముడు జన్మించకుండానే శతకోటి విస్తారమైన రామచరిత్ర రచించిన వాల్మీకి రఘువీరుని రాకనెరిగి పరుగున వచ్చాడు. శ్రీరాముడు వాల్మీకి పాదాలకు మోకరిల్లబోగా, వాల్మీకి లేవనెత్తి ఆలింగనం చేసుకున్నాడు. తదుపరి శ్రీరాముడు అక్కడ ఉండే మునిజనాన్ని కలుసుకున్నాడు. ఆ సమయంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించగా శ్రీరాముడు ఋషులతో సహా అక్కడ బస చేశాడు. తదుపరి గుహుని వెనుకకు పంపాడు.

## సుమంతుని మరలి రాక

శ్రీరాముడు చిత్రకూటంలో విడిది చేశాడన్న వార్త గుహుడి ద్వారా సుమంతునికి తెలిసింది. శ్రీరామవియోగాన్ని తట్టుకోలేక ఇరువురూ ఎంతో దు:ఖించారు. గుహుడు సుమంతుని తన ఇంటికి తీసుకెళ్ళాడు. 'నేను శ్రీరాముని ఎన్నడు చూడగలను?' అని సుమంతుడు విలపిస్తూ, వెనుకకు మరలి, ప్రేతకళ ఆవహించిన అయోధ్యలోకి, తన ముఖంలోని దుఃఖచ్ఛాయలు కనపడనీయకుండా, రథాన్ని తోలుకొని వెళ్లాడు. 'నాలాంటి అభాగ్యునికి నా తల్లి ఎందుకు జన్మనిచ్చింది?' అని బాధపడ్డాడు. కైకేయి మందిరం ముందు



రథం నిలిపి అధోవదనుడై మందిరంలో ప్రవేశించాడు. శూన్యంగా రథం మరలి వచ్చిందన్న వార్త అప్పటికే అయోధ్యంతా పాకిపోయింది. అందరూ రామ వియోగాన్ని తట్టుకోలేక ఆక్రందనలు చేశారు. ఇక్కడ కైకేయి సదనంలో కొనఊపిరితో ఉన్న దశరథుని చూచి దుఃఖాన్ని దిగమింగి నమస్కరించాడు సుమంతుడు. సుమంతునితో దశరథుడు పెల్లుబికిన దుఃఖంతో 'నా రాజీవనయనుని వనంలో ఎక్కడ వదిలావు? నాకు ప్రాణత్యాగం చేసే సమయమాసన్నమయ్యింది. నా సర్వస్వమైన ఆ జగద్వంద్యుని ఎవరో దొంగిలించి అడవికి ఎత్తుకెళ్లారు. రాజహంస వంటి రఘురాముని బురదలో ఇరికించారు. నా ఆణిముత్యాన్ని ఎక్కడో విసిరి పారేశారు. అన్నపూర్ణేశ్వరుడైన శంకరుని హృదయరత్నాన్ని నీకప్పగిస్తే ఘోరారణ్యంలో వదలిరావడానికి మనసెలా ఒప్పింది? గుడ్డివానికి ఊతకర్రలా నాకు ఆధారమైన నా రాముని బలవంతంగా ఎవరు తీసుకెళ్ళారో తెలియదు. నా బిడ్డలు అరణ్యంలో అన్నంలేక ఉపవాసాలతో అలమటిస్తుంటారు. నా కోడలు సుందరసుకుమారమైన మొగ్గ. ఆ జనకరాజ పుత్రి రథం దిగి ఎలా నడువగలుగుతున్నది? అన్నీ వివరించు! అరణ్యంలో ముగ్గురూ ఎక్కడ భోంచేశారు? ఎక్కడ పడుకున్నారు? సత్వరం ఈ వివరాలన్నీ నాకు తెలియజెయ్యి! నా ప్రాణాలు కడతేరిపోతున్నాయి' అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

విషణ్ణవదనంతో సుమంతుడు ఇలా వివరించాడు "వారు మూడురోజులు నిరాహారంగా ఉన్నారు. ఆకాశమే కప్పుగా దర్భాసనం మీద పడుకున్న ఘనశ్యాముడైన శ్రీరాముని ఆపాదమస్తకం నేను చూశాను. రఘువీరుని ఆనతితో శృంగపురం వరకు వెళ్లాను. తదుపరి ఎవరి నామమాత్రంచేత జగత్తు తరించిపోతుందో ఆ శ్రీరాముని గుహుడు గంగానది ఆవలి ఒడ్డుకు చేర్చాడు. మాయానదిని దాటి స్వస్వరూపంలో లీనమైనట్లుగా, గంగానది ఆవలితీరం చేరి దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీరాముని కనులారా కాంచాను.

యజ్ఞకుండంలో ఆచ్ఛాదితమైన అగ్నిలా, పశ్చిమాద్రి చాటుకు చేరిన దినకరునిలా భాసిస్తున్న రాఘవునికి ఇటునుండి నేను సాష్టాంగనమస్కారాలు సమర్పించగా, ఆ కరుణాకరుడు, జగదుద్ధారకుడు నన్ను వెనక్కు వెళ్ళమని సైగచేసి పాదచారియై వనవాసానికి ముందుకు సాగిపోయాడు'.

**దశరథ ప్రాణత్యాగం**

సుమంతుడు చెప్పిన మాటలు వినగానే దశరథుడు దు:ఖంతో గుండెలు బాదుకున్నాడు. 'అటువంటి పరిస్థితుల్లో రాముని వదలి రావడానికి నీకు మనసెలా ఒప్పింది. నీవు కఠినాత్ముడివి. నీ ప్రాణం ఇంకా ఎందుకు పోలేదు. నువ్వు నిజంగా చాలా ధైర్యశాలివే. వజ్రం కంటె కఠినం నీ హృదయం. అందుకే నీవు శ్రీరాముని వనాలలో వదిలి ఇక్కడికి రాగలిగావు' అని గొంతులో చేపముల్లు ఇరుక్కున్నవానిలా విలవిలలాడుతూ 'ఈ రామవియోగాగ్ని నా అంగాంగాలను దహిస్తోంది. త్వరగా రా! రఘునందనా, సరోజనేత్రా! సుహాస్యవదనా! కోమలాంగా! నా ప్రాణమా! నన్ను వదిలి నీవు వనానికి వెళ్ళిపోయావా?' అని బోరున గావుకేక పెట్టాడు దశరథుడు. 'రఘునాథా! నా తండ్రీ! నీ బిడ్డనైన నన్ను వదిలి దూరారణ్యాలకు వెళ్ళావే ఇక నా ప్రాణాలు కడతేరుతున్నాయి. అంత్యసమయంలోనయినా నీ ముఖదర్శనాన్ని కరుణించు!' అని ఆక్రోశిస్తూ కళ్ళు తేలేసాడు. రామస్మరణతో దశరథుడు 'రామ రామ' అని చింతిస్తూ, తానే రాముడయి సమస్త దు:ఖకారణాలు, వాక్కులు స్తంభించగా ప్రాణాలు వదిలాడు.

శరీర కర్మగతి అనూహ్యం. దశరథుడికి నలుగురు పుత్రులున్నా ఒక్కరూ దగ్గర లేకుండా ప్రాణత్యాగం చేశాడు. వెంటనే సుమంతుడు పరుగున వచ్చి మహారాజు శిరస్సును తన తొడమీద పెట్టుకున్నాడు. సుమిత్ర, కౌసల్య, తక్కిన ఏడువందలమంది రాణులు, పరివారం గొల్లున ఏడ్చారు. అయోధ్యనగర



వాసులంతా అతలాకుతలంగా అపారమైన దుఃఖసాగరంలో మునిగిపోయారు. కౌసల్య, సుమిత్ర భోరున విలపిస్తున్నారు. అసలే రామవియోగ దుఃఖంలో కృశించిపోతున్న వారికి దశరథుని మరణంతో శోకానికి అంతులేకుండా పోయింది. మహాసర్పం కాటుతో బాధపడేవానికి తలపై తేలు కుట్టినట్లు, బడబానలంలో చిక్కుకున్న వానిని దొంగలు దోచుకున్నట్లు, భయపడే వానిపై బండ పడ్డట్లు, విషజ్వరంతో బాధపడేవానికి విషం త్రాగించినట్లు, నిప్పంటుకొన్న ఇంటికి సుడిగాలి తోడైనట్లు, పులిని చూచి భయపడి పారిపోతుంటే ఎలుగుబంటి ఎదురై కౌగిలించుకున్నట్లయింది కౌసల్య పరిస్థితి. నుదుటిని నేలపై కొట్టుకొని శోకించసాగింది. అప్పుడు కులగురువు వసిష్ఠుడు 'వ్యర్థంగా శోకించవద్దు, త్వరగా భరతుని పిలిపించి రాజ్య ప్రతిష్ఠ చేయాలి. రాజ నియామకం జరగకుండా, పుత్రుడు ప్రక్కన లేకుండా దహన సంస్కారాలు చేయలేము. తైలపేటికలో దశరథుని శరీరాన్ని ఉంచండి' అని చెప్పి 'సుమంతా! వెంటనే రథం తీసుకునివెళ్ళి సూర్యుడుదయించేలోగా భరతుని తీసుకునిరా! రామ వనవాసం, దశరథుని ప్రాణత్యాగం చెప్పకుండా వెంటబెట్టుకొనిరా! భరతుడు ప్రగాఢ రామభక్తుడు. ఈ వైపరీత్యాన్ని వింటే వెంటనే దేహత్యాగం చేస్తాడు. కాబట్టి ఏమీ చెప్పవద్దు!' అని సుమంతుని ఆదేశించాడు. 'భక్తుడు, విరక్తుడు, చతురుడు, మహాత్ముడు నిర్మలమైన జ్ఞాన గంగాప్రవాహం వంటివాడు, వివేక రత్నాలలో తలమానికమయినవాడు, ఒకే ధ్యేయంగల మహావీరుడు, పరిపూర్ణవైరాగ్యఖని, ఆనందనిధి, విరక్తి అనే లతకు పూచిన పుష్పం వంటివాడు, సత్యసాగరుడు, శాంతియనే వృక్షానికి పండిన పక్వమైన ఫలంవంటివాడు, దయాగ్రేసరుడు, నిర్మల వైరాగ్యమనే పూర్ణకుంభంతో మెరసిపోయేవాడు, సర్వగుణశోభితుడైన భరతుని త్వరగా తీసుకొని రావల్సింద'ని కోరాడు వసిష్ఠుడు. గురుచరణాలకు నమస్కరించి సుమంతుడు వాయువేగంతో బయలుదేరాడు.

అక్కడ తన మేనమామగారింట్లో భరతునికి ఒక దుస్స్వప్నం వచ్చింది. ఒక స్త్రీ నల్లటి వస్త్రం ధరించి నూనెతో తలంటుకుంటోంది. వెంటనే ఉలిక్కిపడి లేచి భరతుడు భోరున విలపిస్తూ ఇది కల కాదు, ఏదో అనర్థం జరిగింది. మా నలుగురు అన్నదమ్ములు, తండ్రి దశరథుడు జీవించి ఉన్నాడో లేడో అని బిగ్గరగా ఆక్రందనలు చేయసాగాడు. మేనమామ సంగ్రామజిత్తు భరతుని ప్రేమతో కౌగిలించుకుని శత్రుఘ్నుని కూడా దగ్గరకు తీసుకుని, బుజ్జగించి 'వ్యర్థంగా దుఃఖించి ప్రయోజనమేమి? తెల్లవారగానే చతురంగ బలాలను సిద్ధం చేసి నిన్ను అయోధ్యకు పంపుతాను' అని ఊరడించాడు. ఇంతలో తెల్లవారింది. భరత, శత్రుఘ్నులు ఊరి బయటకు వచ్చి అయోధ్య మార్గం చేరి చకోరాలు చంద్రుడి కోసం నిరీక్షిస్తునట్లు, మేఘాలకోసం మయూరాలు ఎదురు చూస్తున్నట్లు అయోధ్యా దిశవైపు చూడసాగారు. ఇంతలో హఠాత్తుగా రథాన్ని, దాని నధిరోహించి వస్తున్న సుమంత ప్రధానుని చూచారు. ఆ రథం మందగమనంతో వస్తున్నది. అశ్వాల కంట కన్నీరు కారుతున్నది. విద్యుల్లత వలె మెరవవలసిన ధ్వజవస్త్రం అమితంగా మాసిపోయి వుంది. పైగా సుమంతుడు మ్లానవదనుడై కళ్ళనుండి నీరు కారుతుండగా, రాఘవుని చేతలను తలంచుకొని పదేపదే కళ్ళు తుడుచుకుంటూ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. ఈ దుఃఖసంకేతాలను గమనించి భరతశత్రుఘ్నులు పరుగు పరుగున రథం వద్దకు చేరుకున్నారు.

**భరతసంతాపం**

భరతుని గమనించి సుమంతుడు త్వరగా రథం దిగి అన్నదమ్ములిద్దరినీ గాఢాలింగనం చేసుకుని 'మహారాజు మిమ్మల్ని త్వరగా తీసుకొనిరమ్మని నన్ను పంపారు' అని చెప్పాడు. భరతుడు అనుక్షణం సుమంతుడి ముఖంలో రంగులు మారడం చూచి 'మిత్రమా! నీ ఎర్రబారిన కళ్ళను చూస్తే ఏదో విపత్తు సంభవించిందనిపిస్తోంది. అయోధ్యలో విశేషాలేమిటి? రఘువీరుడు సుఖంగా



ఉన్నాడు కదా! దశరథమహారాజు క్షేమమే కదా?' అని ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా 'శ్రీరాముడు సుఖంగా ఉన్నాడు. శీఘ్రంగా మిమ్మల్ని తోడ్కొని రమ్మన్నాడ'ని చెప్పాడు. వెంటనే భరతశత్రుఘ్నులు రథంలో వేగంగా బయలుదేరారు. సుమంతుడు నొగలుపై కూర్చుని అప్పుడప్పుడు కంటి తడి ఒత్తుకుంటుంటే చూచి భరతుడు గద్గద కంఠుడైనాడు. ఇంతలో అయోధ్య ప్రాణం లేని దేహంలా, నీళ్ళు లేని సరోవరంలా, తల్లి లేని అనాథశిశువులా, ముక్కు లేని ముఖంలా, భర్త లేని భార్యలా, కాలిపోయినా అడవిలా గోచరించింది. అయోధ్యలో రాజమందిరపు గోపురాలు కళలు తప్పి ఉండడం, మంగళవాద్యఘోషకు బదులుగా ఇంటింటా ఆడ, మగా అంతా కలిసి శోకాలు పెట్టడం వినిపిస్తుండగా దశరథుని శరీరం ఉన్నచోట సుమంతుడు రథం నిలిపాడు. విరిగిన రాజచ్ఛత్రం చూస్తూనే భరతుడు రథం నుండి దిగి క్రింద నేలపై పడి దొర్లాడు. దశరథుని ప్రేతాన్ని గాంచి భరతుడు కన్నీరు మున్నీరై అపారమైన శోకంతో నేలపైబడి దొర్లుతుండగా, శోకతప్తులైన ప్రజలు గుమిగూడి భరతుని ఓదార్చసాగారు. ఆ సమయంలో సుమంతుడు కూడా భరతుని ఓదార్చి లేవనెత్తాడు. వెంటనే భరతుడు రాముని కళ్ళారా చూడాలని తలచాడు. 'సంసార మాయను దాటి దశరథుడు స్వర్గాన్ని అలంకరించాడు. నేనిక శ్రీరాముని పాదాలను భక్తిభావంతో దృఢంగా ఆశ్రయిస్తాను. ఆయన ముఖ సందర్శనం చేస్తే నా దుఃఖం దూరమవుతుంది. నన్ను తీసుకెళ్ళి శ్రీరాముని పాదాలపై పడవేయవలసింది' అని ప్రధానితో అంటూ పితృతుల్యుడైన అన్నగారి మందిరానికి తలవంచుకొని తరలిపోసాగాడు భరతుడు. శ్రీరాముడు వనవాసానికి వెళ్ళాడన్న వార్త ఎవ్వరూ చెప్పలేకపోయారు. సీతారమణుని చూడకపోతే భరతుడు ప్రాణత్యాగం చేయడం ఖాయం అని జనం గుసగుసలాడసాగారు. భరతుడు ఏడుస్తూ తల్లి కౌసల్య పాదాలపైబడి 'అమ్మా! శ్రీరాముడెక్కడ? నాకు త్వరగా చూపించు' అని వాపోయాడు. 'శ్రీరాముడు

తపోవనానికి వెళ్ళగా ఆ దుఃఖంతో దశరథుడు ప్రాణత్యాగం చేశాడు' అని మాటల్లో చెప్పలేక చెప్పి కౌసల్య మూర్ఛిల్లింది. ఈ మాటలు విన్న భరతుడు నుదురు కొట్టుకుంటూ వర్ణనాతీతమైన వేదన ననుభవించసాగాడు. ప్రళయం దాపురించినట్లుంది అక్కడి పరిస్థితి. 'రఘువీరా! రాజీవనేత్రా! నవమేఘవర్ణా! శంకర సఖా! జగద్వంద్యా! కోమలగాత్రా! మమ్మల్ని ఎలా మరిచిపోగలిగావు?' అని అంటూ భరతుడు నేలపై దొర్లుతూ 'నా తండ్రి అయిన రఘురాముడు మమ్మల్నందరినీ వదిలి వెళ్ళాడు. సీతాకాంతుడైన రఘునందనుడు అరణ్యానికి వెళ్ళగానే నా తండ్రి దశరథుడు ప్రాణత్యాగం చేశాడు. నాకు అలా మరణం ఎందుకు సంభవించలేదు? నన్ను మృత్యువు కబళించలేదంటే, మృత్యువే నిజంగా పారిపోయిందేమో? రామవియోగ దు:ఖం భరించరానిది. దానిని మృత్యువు కూడ సహించలేదు. కోమలహృదయుడు, ప్రేమమయుడైన నా తండ్రి దశరథుడు ధన్యాతి ధన్యుడు, దేహత్యాగం చేసి త్వరగా అదృశ్యరూపంలో రాముని వద్దకు చేరాడు' అని విలపించసాగాడు.

ఇంతలో అక్కడకు కులగురువైన వసిష్ఠుడు రావడం గమనించి భరతుడు ఎదురేగి, పాదాలకు ప్రణమిల్లి 'నాకు రఘునాథుని చూపించవలసింది' అని వేడుకున్నాడు. భరతుని అంతరంగం గ్రహించటానికి వసిష్ఠుడు, నిన్ను రాజుగా నియమించకుండా దశరథునికి అగ్నిసంస్కారం చేయరాదు. నీకు రాజ్యం సంప్రాప్తించాలన్న నీ తల్లి కోరిక మేరకు రాముడు వనవాసానికి వెళ్ళాడు' అని తెలిపాడు. ఈ వార్త విన్నంతనే భరతుడు దుఃఖం పట్టలేక 'నన్ను రాజ్యం చెయ్యమంటారా!' అని పెద్దగా ఆక్రోశించాడు. పిడుగుపాటుకు గురైన సుకుమార చంపకకళిక వలె, ఏనుగు తొండంతో మోదబడిన అరటి పిలకవలె, శస్త్రాలతో గాయపడ్డ బాలునివలె, వజ్రాఘాతంతో చూర్ణమయిన కపాలంవలె, అగ్నిలో పడ్డ ముత్యం వలె అయింది భరతుని స్థితి. 'రఘురాముడు వనాంతరం వెళ్ళిన తరువాత ఈ రాజ్యం ఏలితే భూమి మీద నివసించే బ్రాహ్మణులనందరిని



నా స్వహస్తాలతో చంపిన పాపం చుట్టుకుంటుంది. రాముని అరణ్యంలో వదలి నేను సింహాసనాన్ని అంగీకరిస్తే విధవయైన వ్యభిచారిణి గర్భాన జన్మించాల్సివస్తుంది. రాజ్యాభిషేక సమయాన పోసే ఉదకం రజస్వల శోణితంతో సమానం. నన్ను సింహాసనాన్ని అధిష్ఠించమంటే శస్త్రాలతో ప్రాణాఘాతం చేసుకోక తప్పదు. నిత్యం శంకరుడు ధ్యానం చేసే రాముడిదైన ఈ అయోధ్యా రాజధానిని అనుభవిస్తే మహాచండాల యోగం తప్పదు. రాముడు అడవుల్లో ఉండి నేనిక్కడ రాజ్యం చేస్తే నా నాలుక తెగిపోయి నోటిలో పురుగులు పడతాయి. గురువధ గావించినంత, మద్యపానం చేసినంత, తల్లిని సంగమించినంత పాపం సంక్రమిస్తుంది. సూర్యునికి కళంకం వాటిల్లితే, గంగ పాపాలతో కలుషితమయితే, ఎండమావుల్లో అగస్త్యుడు మునిగిపోతే, సూర్యకిరణాల వెంట చీమలదండు వలసపోతే, బడబానలం పైన మిణుగురు పురుగులు నాట్యం చేస్తే, సాలీడు తంతువులు ధరిత్రిని ఎత్తిపడితే, గడ్డిపోచలు సింహాన్ని బంధిస్తే, దోమ భూభారాన్ని మోస్తే, కీటకం గరుడుని బాధిస్తే, దీపపు వెలుగు కోసం చంద్రుడు కిందికి దిగివస్తే, బ్రహ్మనందనా! నాకు రాజ్యకాంక్ష కలుగుతుంది' అన్నాడు భరతుడు.

భరతుని మాటలకు వసిష్ఠుడు ఆనందంతో పరవశించాడు. భరతుని మాటలు వైరాగ్యలతా పుష్పాల్లా, జ్ఞానాకాశంలో కాంతితో విరాజిల్లే తారల్లా, భక్తి మార్గంలో ప్రవహించే సరోవరంలా, నిశ్చలజ్ఞానమనే విశ్రాంతి మందిరంలా గోచరించాయి. భరతుడు వసిష్ఠుని పాదాలు తాకి 'శ్రీరామునిపై ప్రమాణం చేస్తున్నాను. నాకు రాజ్యాభిషేకం వద్దు. మలినమైన కైక ముఖం చూస్తేనే పాపం. ఆమె తల్లి కాదు. పిశాచి. వైధవ్యం ఇష్టం కనుకే పతి ప్రాణాలు తీసింది' అని ఏవగించుకున్నాడు. 'దాసియైన మంథర సలహాలే సర్వనాశనానికి మూలకారణం. కలహకారిణి, దుష్టబుద్ధి అయిన మంథర దుర్బోధలే మీ తల్లి చేత ఇంత పని చేయించింది' అని వసిష్ఠుడు భరతుడికి జరిగిన వృత్తాంతమంతా

విశదీకరించాడు. వసిష్ఠుని మాటలు వినగానే భరతుడు పరుగున వెళ్ళి మంథర జడ పుచ్చుకుని ఆమెను వధించేందుకు కత్తి దూశాడు. ఇంతలో వసిష్ఠుడు పరుగున వచ్చి భరతుని చేయి పట్టుకుని 'స్త్రీ హత్య మహాపాతకం. అటువంటి విపరీతం ఎన్నడూ చేయవద్దు!' అని వారించాడు. కాని భరతుడు కాలితో మంథరను తన్నిన తన్నులకు మంథర శరీరంలోని ఎముకలు విరిగి మూడువంకరలతో వంగిపోయింది. అప్పటినుంచి ఆమెకు త్రివక్రకుబ్జ అనే పేరు వచ్చింది.

వెంటనే వసిష్ఠుడు మణిమయభూషితమైన రామపాదుకలను దివ్యరత్నఖచిత సింహాసనంపై స్థాపించి ఛత్రం పట్టాడు. ఆ తర్వాత దశరథుడి దేహానికి దహన సంస్కారాలు, ఉత్తర క్రియలు భరతుడు గావించాడు. అస్తమయ సమయంలో సూర్యకిరణాలు సూర్యుడిలో లీనమైనట్లు ఏడువందలమంది రాణులు, అగ్ని ప్రవేశం చేశారు. సుమిత్ర, కౌసల్య కూడా సహగమనానికి సిద్ధమయ్యారు. కాని కులగురువు శాస్త్రరీత్యా, పుత్రవతులైన స్త్రీలు సహగమనం చేయరాదని వారించాడు. బదులుగా కౌసల్య 'మేం జీవించడం వ్యర్థం. శ్రీరాముడు వనవాసం వెళ్ళాడు. మహారాజు దివంగతుడయ్యాడు. ఇక మేం బ్రతికుండి ఏం ప్రయోజనం? మేమూ అగ్నిలో కలిసిపోతాం!' అన్నది. 'శ్రీరాముని కలిసే అవకాశం మీకు కల్పిస్తాను. రాక్షసవధానంతరం అయోధ్యకు రాముడు తిరిగి వస్తాడు. వాల్మీకి కావ్యంలో ఇది ప్రధానాంశం. మహర్షి వాక్యం తప్పక సత్యమవుతుంది. దీన్ని విశ్వసించండి!' అని అగ్నిసాక్షిగా ప్రమాణం చేశాడు వసిష్ఠుడు. గురువచనాన్ని ప్రమాణంగా గ్రహించి చిత్రకూటంలో శ్రీరాముని కలవగలమనే నమ్మకంతో అగ్నిప్రవేశాన్ని విరమించుకున్నారు.

అప్పటికి రాత్రి రెండు ఝాములైంది. కైక త్వరగా భరతుని వద్దకు వచ్చి ఏకాంతంగా, 'కుమారా! జాగ్రత్తగా విను! ఎన్నో కష్టాలు పడి రాజ్యాన్ని



సాధించాను. ఎంతో ప్రయాసతో రాముని వనాలకు పంపాను. రామలక్ష్మణుల నిష్క్రమణ నీకు శుభప్రదమని తెలుసుకో. ఎలాంటి అపోహలూ లేకుండా ఆనందంగా రత్నసింహాసనాన్నధిరోహించు. పితృవాక్యపాలనకై రాముడు అరణ్యాలకు వెళ్ళాడు. ఆ శోకాన్ని భరించలేక రాజు మరణించాడు. అదీ మంచికే జరిగింది. రాముడు నీకు సవతి తల్లి కొడుకు. అతన్ని వంచిస్తే దోషం ఏమీలేదు. దేవతలు–దైత్యులు, గరుడుడు–సర్పాలు కూడా దాయాదులే. కాని వీరు పరస్పర విరోధులు. ఇది అనాదిగా వస్తున్నదే. నీవు నాకొడుకువైతే నా మాట విను' అన్నది. భరతుడు ఆ మాటలు విన్నంతనే దిగ్గున లేచి 'చండాలురాలా! ఇక్కడి నుంచి వెళ్ళి పో! తల్లివి కాకపోతే ఈ క్షణమే నిన్ను ఇక్కడే వధించేవాడిని. నీ అంత నిర్దయురాలు, పాపి ఎవరూ ఉండరు. అమంగళకారిణివి, రాక్షసివి. దశరథుని ప్రాణాలు కబళించావు. జానకీరమణుని వనవాసానికి పంపావు. దశరథుని విషనాగులా కాటేసి చంపావు. నా ప్రియసోదరుని దూరంగా కానలకు పంపావు. నా తండ్రి, అన్న ఏ త్రోవలో వెళ్ళారో నేనూ ఆ త్రోవనే అనుసరిస్తాను. పాపకూపానివి. నీవు వెంటనే ఇక్కణ్ణుంచి వెళ్ళిపో' అని చీదరించుకోగా కైక వెళ్ళిపోయింది.

## శ్రీరాముని సందర్శనకై భరతుని వనప్రయాణం

ఇంతలో సూర్యోదయమయింది. భరతుడు నారచీరలు ధరించి దేహానికి భస్మం పూసుకుని సర్వాలంకారాలు విసర్జించి మర్రిపాలతో జడలు పెనవేసుకుని వనానికి పాదచారిగా బయలుదేరాడు. వెంట షోడశపద్మాల సైన్యం, అయోధ్య ప్రజలంతా బయలుదేరారు. అయోధ్యా పట్టణం నిర్జీవమయింది. కౌసల్యాసుమిత్రలు మేలిముసుగులు ధరించి పల్లకిలో కూర్చున్నారు. పల్లకీకి కూడా పరదా వేశారు. వసిష్ఠుడు తదితర బ్రాహ్మణులు, చతుర్వర్ణాలవారు, అయోధ్య ప్రజానీకం అంతా బయలుదేరారు. కైకేయి తప్ప అయోధ్యలో ఇంకెవరూ మిగలలేదు. అపవిత్రురాలు, పాపి అయిన కైకనే అయోధ్యను

ఏలుకోనీ, ఆ పాపి కడుపున భరతుడు, కాకి రెట్టలో అశ్వత్థవృక్షం మొలకెత్తినట్లు, కాకి గూటిలో కోకిల జన్మించినట్లయిందని ప్రజలు భావించారు.

'రాముడు వెళ్లిన మార్గంలో సాగు. నిన్ను అనుసరిస్తాం' అని భరతుడు సుమంతుని వేడుకున్నాడు. ససైన్యంగా భరతుడు గుహుని నివాసాన్ని సమీపించాడు. వాద్యాల హెూరు మిన్నంటింది. గుహుడు దూరం నుంచి ఈ సంరంభాన్ని గమనించాడు. ఆ మహాతల్లి కైక రామలక్ష్మణులను వధించడానికి కొడుకులిద్దరినీ ససైన్యంగా పంపింది కాబోలు అని తలచి వేల కొలది సాయుధులైన కిరాతులను గంగా తీరాన విల్లంబులతో సమాయత్తం చేశాడు. గంగను ఎవ్వరినీ తాకనియ్యనంటూ, గుహుడు పోరుకు సిద్ధమయ్యాడన్న వార్త, చారుల వల్ల తెలిసి శత్రుఘ్నుడు, సేనాధిపతి, భరతునితో సమాలోచనలు జరిపారు. తమరు అనుమతిస్తే గుహుని శిక్షిస్తాం అన్నారు సేనాధిపతులు. వెంటనే భరతుడు ఇలా అన్నాడు 'గుహుడు రామభక్తుడని విన్నాను. అసలు విషయం తెలుసుకోకుండా అతనితో యుద్ధం చేయకూడద'ని వారించాడు. భరతుడు ముందు వెళ్ళి గుహునితో 'మీరు భయంకరమైన యుద్ధానికి సంసిద్ధులు కావడానికి కారణమేమిటి?' అని ప్రశ్నించాడు. 'నువ్వు సైన్యసమేతంగా రాముని హతమార్చబోతున్నావు. నేను రామోపాసకుడను. స్వామిసేవలో ప్రాణత్యాగం చేయుటకు సిద్ధంగా ఉన్నాను. నా స్వామి రామచంద్రుడు నిరాహారిగా కష్టాలు పడుతుండగా వారిని చంపడానికి మీరు సైన్యంతో బయలుదేరారు. రఘురాముని ద్వేషించేవారు చండాలురు, దుర్బలులు, దుష్టులు. వారు మహానిందల పాలవుతారు. అటువంటివారి శిరస్సు ఛేదించి వెంటనే యమలోకానికి పంపుతాను. తల్లి చెప్పుడు మాటలు విని వనంలో ఉన్న రాముని వధింపదలిస్తే ఈ గంగను రవ్వంత కూడా తాకనివ్వను!' అన్న గుహుని మాటలు విని భరతుడు పెద్దగా విలపించాడు. 'నువ్వు బాణం వదలి నా శిరస్సును ఖండించు. పాపపంకిలమైన ఈ దేహాన్ని



ఛేదించు. జానకీనాథుని అడవులకు పంపి కైక అనర్థం గావించింది. ఆ కైక కడుపున పుట్టిన పాపాన జనులంతా నన్ను రామవిరోధిగా భావిస్తున్నారు. అందువల్ల గుహా! త్వరగా నా దేహాన్ని తుత్తునియలు చెయ్యి. రామవియోగ దు:ఖం నేను క్షణం కూడా భరించలేను. ఒక్క నిర్వాణబాణంతో నన్ను రామపాదాల చెంతకు చేర్చు!' అని వేడుకున్నాడు.

భరతుని మనస్సు గ్రహించిన గుహుడు అతనికి పాదాభివందనం చేశాడు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని దేహభావాన్ని మరచి ఏకమయ్యారు. ఇరువురి కంట అశ్రుధారలు వరదల్లా స్రవించసాగాయి. ఇద్దరూ శ్రీరామ భక్తులే, యోగులు, విరక్తులే! ఇద్దరికీ రాముడంటే ఇష్టమే. నారచీరలు ధరించి, భస్మధారణ చేసి, జడలు ముడిచినవారు. రామదర్శనమయ్యేంతవరకు అన్న పానీయాలు ముట్టరు. 'భరతా! శ్రీరాముడు చిత్రకూటానికి వెళ్ళాడు. త్వరగావెళితే ఆయనను కలవవచ్చు' అని గుహుడు అన్నాడు. గుహుని మాటలు విని భరతుడు గుహుని పాదాలు పట్టుకొనుటకు ముందుకు వెళ్ళగా, గుహుడు భరతునికి సాష్టాంగ ప్రణామం చేశాడు. భరతుడు స్నానసంధ్యానుష్ఠానాలు ముగించి ప్రేమగా గుహుడి వంక చూసి నా శ్రీరామచంద్రుడు ఇక్కడ ఒక రాత్రి గడిపిన చోటు నాకు చూపించివలసింది అని కోరాడు. సమాధానంగా 'ఎవరిని సదాశివుడు సదా ధ్యానిస్తాడో, ఎవరిని ఇంద్రుడు శరణు వేడాడో, ఆ కమలపత్రాక్షుడు పద్మనయనుడు ఈ తృణశయ్యపై వటవృక్షం కింద శయనించాడు. ఈ మార్గంలో వచ్చి గంగాస్నాన మాచరించాడు. సీత కట్టుకొన్న నారచీర ధూళి కూడా ఆ నిర్మలమైన తృణశయ్య నంటలేదు' అని వివరించాడు గుహుడు. భరతుడు ఆ ప్రదేశంలోని రామ పాదముద్రలు చూసి ఆనందంతో ఆ ధూళిని నెత్తిన చల్లుకుని సాష్టాంగనమస్కారం చేశాడు.

## కాకికి శిక్ష – సుదర్శనుని కథ

అక్కడనుండి వారు ససైన్యంగా వేయి పడవల్లో ప్రయాగ వెళ్ళి భరద్వాజ మహర్షిని సందర్శించారు. అక్కడనుండి చిత్రకూటం దిశగా గుహుడు, భరతుడు బయలుదేరారు. ఆ సమయంలో లక్ష్మణుడు ఫలాలు తేవడానికి కొండ చరియలోకి వచ్చాడు. పర్ణశాలలో రాముడు యాగం చేయటానికి సంసిద్ధుడైనాడు. యాగానికి కావలసిన ఉపకరణాలు సీత సమకూర్చింది. చకోరాలకు చంద్రుడే స్వయంగా అమృతం అందించినట్లు, రాముడు స్వహస్తాలతో వేసిన ఆహుతులకు అగ్ని సంతృప్తుడయ్యాడు. ఆ సమయాన గంధర్వుడు సీతను చూచి మైమరిచాడు. ఆమె అందచందాలకు మోహించి సిగ్గు బిడియాలు వదిలి కామాతురుడయి కుటీరం వెనుక కార్యనిమగ్నయై చరిస్తున్న ఆ మంగళరూపిణిని అమంగళమైన కాకి రూపంలో వెంబడించాడు. దీపాన్ని చూచిన శలభం మృత్యువును మరచి అందులో దూకినట్లు, అగ్ని వద్దకు వచ్చి తేలు కొండెతో కాటేయబూనినట్లు సీత వెంటపడ్డాడు గంధర్వుడు. ఇంట్లో దాచిపెట్టిన నైవేద్యాన్ని కుక్క ముట్టుకొన్నట్లు, యజ్ఞశాలలోకి పాపాత్ముడు వెళ్ళి మలినం చేసినట్లు, జానకి వక్షోజాలను పట్టుకోవడానికి కాకి రూపంలో పతితుడయిన ఆ గంధర్వుడు ప్రయత్నించాడు. జానకి త్వరగా పరుగెత్తి తన్ను తాను రక్షించుకోవడానికి నేలపై బోర్లా పడుకొని 'రామా త్వరగా రా! రక్షించు! ఈ కాకి నా శరీరాన్ని ముట్టుకొని అపవిత్రం చేస్తోంది' అని ఆక్రందించింది. ఆ కేకలు విని రఘురాముడు లక్ష్మణుడు దాపున లేడని గ్రహించి యాగంలో ఆహుతి ఇవ్వబోతున్న దర్భను మంత్రించి వదిలాడు. కల్పాంతంలో మెరుపులా వచ్చే దర్భను చూసి బాణోపహతుడిలా ఆ కాకి భయపడి పరుగెత్తసాగింది. దాన్నుంచి తప్పుకోవడానికి ఆ గంధర్వుడు సృష్టి సమస్తం తిరిగాడు. కాని ఎవరూ వానిని ఆదుకోలేకపోయారు. తిరిగి తిరిగి ఆ దురాత్ముడికి దు:ఖమే ఎదురయింది. ఇంద్రాది దేవతలందరినీ శరణువేడాడు. 'దుష్టుడా నీ మొహం



మాకు చూపించకు తిరిగి వెళ్ళు' అన్నారు. ఇంతలో నారదముని ఎదురుపడగా కాకి ఆయన పాదాల నాశ్రయించి బాణం నా వెంటపడుతోంది. ముల్లోకాలలో నాకెవరూ ఆశ్రయమివ్వలేదని బాధపడింది. 'మూఢుడా, రామునే శరణు వేడు, నీ మరణం తప్పించగలవాడు ఆయనే' అని నారదుడు సలహా ఇచ్చాడు. అప్పుడు కాకి రాముడి చెంతకు వచ్చి 'జగద్వంద్యా! రామచంద్రా! నేను నిన్ను శరణు వేడుతున్నాను. కృపాసాగరా! ఉదారా! దీనరక్షకా! నేను పామరుడను. నన్ను చంపకు! స్వామీ! కమలంపై వజ్రం ప్రయోగించినట్లు, కీటకాలపై గరుడుడు దాడిచేసినట్లు, గడ్డిపోచలను బడబాగ్ని తగులబెట్టినట్లు, పూలను మోయుటకు ఆదిశేషుడు ఏతెంచినట్లు, గడ్డిపోచను లేపుటకు కుంభవృష్టి కురిసినట్లు, పుడిసెడు నీటితో అగస్త్యుని తృప్తిపరచినట్లు, మేఘాలు తమ ప్రతాపంతో చిన్నకుండలలో నీటిని నింపినట్లు, పులి ఆవుదూడతో తలపడ్డట్టు రఘురామా! నాలాంటి అల్పునిపై మహాస్త్రప్రయోగం చేశావు. దీనివల్ల నీ కీర్తి రాణించదు. తల్లిపాలిండ్లతో బిడ్డ ఆడుకొంటే తల్లి బిడ్డను చంపేస్తుందా! మహారాజా! రవికులభూషణా! తాటకసంహారా! అహల్యోద్ధారా! దశకంఠ దర్పమర్దనా! ఈ శరణాగతుని చంపవద్దు' అని వేడుకున్నాడు. 'ఓరీ మలినుడా! కల్పాంతంలోనూ నా బాణం వృథా పోదు. ఇది నిశ్చయం' అని కాకితో చెప్పి బాణాన్ని ఇలా ఆజ్ఞాపించాడు, 'అతని ప్రాణాన్ని రక్షించి కుడికంటిని మాత్రం ఛేదించు. ఇతనికిదే శిక్ష. కన్నుమూసి తెరిచే లోపల ఆ దర్భ కుడికంటిని ఛేదించింది. వెంటనే కాకి ఒకే కంటితో రెండు వైపులా చూసే శక్తి ప్రసాదించమని వేడుకుంది. అందుకే కాకి దృష్టి చపలమని సకల జనులు భావిస్తారు. 'దురాత్మా! నీవు సీతను చుంబించాలనే దుర్బుద్ధితో వచ్చావు. అందువల్ల నీవు మలభక్షణచేస్తూ పక్షులలో హీనాతిహీనంగా చూడబడుతావు. అయినా శరణువేడావు కనుక, ప్రేతాత్మ పిండాలను నువ్వు భక్షిస్తే తప్ప ప్రేతాత్మలకు పుణ్యగతులు కలగవని నీకు వరమిస్తున్నాను' అన్నాడు రాముడు.

గంధర్వుడయిన సుదర్శనుడు నిజ స్వరూపాన్ని పొంది రాఘవునికి సాష్టాంగ ప్రణామం చేసి ఆనందంగా స్వస్థానానికి వెళ్ళిపోయాడు.

ప్రాణసముడైన భరతుడు రామునితో కలిసిన వైనం వినండి. అందువల్ల భవరోగం నశిస్తుంది. రామవిజయగ్రంథం ప్రచండం. రసభరితమయిన అయోధ్యకాండ వింటేనే నాస్తికత నశిస్తుంది. విఘ్నాలు తొలగిపోతాయి. అయోధ్యాధీశా! రామచంద్రా! బ్రహ్మానందా! జ్ఞానసముద్రా! శ్రీధరవరదా! ప్రతాపరుద్రా! నీ నామముద్రను నాకు అఖండంగా ప్రసాదించు! స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులయిన భక్తులు సదా దీన్ని ఆలకిస్తారు.

*॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥*

**ఏకాదశాధ్యాయం మధురం**



**అధ్యాయము - 12**

## శ్రీగణేశాయ నమః

**బృ**హస్పతిని పోలిన చతురులయిన శ్రోతల కంఠసీమలో సాహిత్య సుమనోహారాన్ని అలంకరిద్దాం. ప్రకాశవంతమైన అమూల్య శబ్దరత్నాలను గ్రహించే నేర్పుగల పండితులు, విశేషించి వైరాగ్య సంపన్నులైన రామభక్తులు ప్రేమసాగరంలో ఓలలాడుతున్నారు. శ్రోతలు మందమతులయితే బూడిదలో పోసిన ఆజ్యంలా కావ్యరసం వృథా. రత్నపరీక్షకు చతురులే పనికివస్తారు. పుట్టు గుడ్డివారు పనికిరారుకదా? సంగీతజ్ఞానం కలవారు పాటవిని ఆనందిస్తారు. బధిరుడు ఇందుకు పనికిరాడు. భ్రమరం కమలంలోని మకరందాన్ని సేవిస్తుంది. దాని రుచి కప్పకు తెలియదు. హంస ముత్యాలను ఆహారంగా గ్రహిస్తుంది. కానీ కొంగకు వీలుపడదు. గోవుపాలు పిదికినప్పుడు అందరికీ లభిస్తాయి. కాని పొదుగు దగ్గరే వుండే పురుగుకు దాని రక్తం తప్ప పాలు లభించవు. వసంతరుతువులో కోకిల పంచమంలో మామిడి కొమ్మమీద పాడగలదు. కాకులు, మిగిలిన పక్షులు అలా గొంతెత్తి పాడలేవు. వర్షాకాలంలో మేఘగర్జన విని మయూరాలు నర్తిస్తాయి. అయితే ఈ విద్య వృషభాలకు వంటబడ్తుందా? చంద్రామృతం విలువ చకోరాలకు తప్ప కోడికి ఏం తెలుస్తుంది? మందమతులైన శ్రోతలను వెలివేయాలి. గొప్పవీరులు ఒకచోట కలిస్తే రణరంగంలో శూరత్వచ్ఛాయలు ఉట్టి పడ్డట్లు మంచి శ్రోతలు కలిస్తే కావ్యరసం పెంపొందుతుంది.

### శ్రీరామభరత సమాగమం

పదకొండో అధ్యాయం చివర శ్రీరాముడు చిత్రకూటంలో బసచేసిన సంగతి, సుదర్శనుడనే గంధర్వుడిని కాకి రూపంనుంచి ఉద్ధరించిన సంగతి

వివరంగా తెలుసుకున్నాం. సైన్యంగా భరతుడు చిత్రకూటాన్ని చేరుకోవడం, ధ్వజసంకేతాలను గుర్తించి భరత, శత్రుఘ్నుల రాకను పర్వతం దిగువన పళ్ళు ఏరుకొంటూ లక్ష్మణుడు గమనించాడు. నిస్సంకోచంగా కైక వీళ్ళను రాముని వధించటానికే వనానికి పంపి ఉంటుంది. వీళ్లు యుద్ధానికి సన్నద్ధంగా వచ్చారని శ్రీరామునితో నివేదించడం ఉచితం కాదు. ఆయన ఒంటరిగా ఉన్నాడు. వీళ్ళు సైన్యసమేతంగా వచ్చారు. అయినా అరణ్యంలో అగ్ని రగుల్కొన్నట్లు మహాద్భుతంగా యుద్ధం చేసి నేను ఈ సైన్యాన్ని భస్మం చేస్తాను. రవికిరణాలగుండా పిపీలికం సూర్యమండలం చేరగలదా? కల్పాంతంలోని మెరుపులను ఈగ తన నోటిలో నిగ్రహించగలదా? ప్రళయాగ్ని శిఖలపై సర్పం ఎలా నృత్యం చేస్తుంది? సాలెపురుగు నుంచి వెలువడే తంతువులు ఏనుగును ఎలా బంధిస్తాయి? గడ్డిపోచలు సింహాన్ని బంధిస్తాయా? చిన్న, చిన్న పురుగులు గరుత్మంతుడివలె ఆకాశానికి ఎగరగలవా? దీపం వెలుగులో సూర్యుడు వేడి పొందగలడా? అట్లా వీరుడైన ఈ లక్ష్మణుని గెలవడం వీరికి సాధ్యమా? అని ఆవేశంలో సైన్యం సమీపించగానే వింటిని సంధించి బాణాలు వదిలాడు. పెద్దపులి గర్జనకు మేకలు పారిపోయినట్లుగా పదహారు అక్షౌహిణుల సైన్యం భీతిల్లింది. ఆ బాణాలు ఎవరు సంధిస్తున్నారో తెలియక వాటిని ఎదుర్కొనేందుకు శత్రుఘ్నుడు సంసిద్ధుడయ్యాడు. ఇద్దరూ బాణాలు సమంగా సంధించారు. ఒకరు సూర్యుడయితే, మరొకరు చంద్రుడు. ఒకరు ఉమావరుడు మరొకరు రమావరుడు. మేరు మందరాలవలె వారు ఢీకొన్నారు. ఒకరు సముద్రం మరొకరు ఆకాశం. ఒకరు దావాగ్ని మరొకరు బడబానలం. ఒకరు వాసుకి, మరొకరు భోగీంద్రుడు. ఒకరు వసిష్ఠుడు, మరొకరు విశ్వామిత్రుడు. ఒకరు గద, మరొకరు చక్రం. విష్ణువు ఆయుధాలు కూడ అంత తీవ్రంగా పోరాడుతాయో లేదో కాని లక్ష్మణ శత్రుఘ్నులు మాత్రం ఏకధాటిగా అస్త్రాల్ని సంధించారు. అవి నలువైపులా చెదరి బాణాలతో మంటపం తయారైంది.



బాణాల ధాటికి సూర్యుడు కనిపించలేదు. రామనామ బీజాంకితమైన ఆ సతేజ బాణాలు రఘునాథ నామాంకితంగా అతి వేగంగా సాగిపోతున్నాయి. ప్రళయం వచ్చిందనే భ్రమతో వనచరాలు దారితెన్ను తోచక పరుగెత్తసాగాయి. మునులంతా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కొండగుహల్లో తలదాచుకోవడానికి పరుగులు తీశారు. యాగ సంరక్షణం కోసం కోట్లాది దానవగణాన్ని సంహరించ తలపెట్టిన శ్రీరాముడిమీద వైరంతో దైత్యగణం కోపంతో దండెత్తారని కొంతమంది భావించారు. లక్ష్మణుడు అనవసరంగా పరాక్రమం చూపి చిక్కులు తెచ్చుకున్నాడని మరికొంతమంది భావించారు. మునులంతా భయంతో తడబడుతూ శ్రీరాముని సమీపించి సంగతి వివరించారు. ఒకరు బిగ్గరగా ఆక్రందిస్తూ 'రామా! త్వరపడు. జాగరూకుడవై సీతను సురక్షిత ప్రదేశానికి తరలించు!' అని వేడుకున్నారు. శ్రీరాముడు ధనుస్సు చేతబట్టుకొని ఉదయ కిరణ ప్రభవాదిత్యుడిలా వెలుపలికి వచ్చి మునుల నుద్దేశించి 'మీరేమీ దిగులు పడకండి. కాలుడైనా మహర్షుల తపోవిఘ్నం చేయ సంకల్పిస్తే తుత్తునియలు కావల్సిందే. ఆకాశ పతనాన్ని స్తంభింప జేస్తాను. భూమి రసాతలానికి క్రుంగితే స్వస్థానంలో నిలుపుతాను. న్యాయమీమాంస, తర్కమహాభాష్య పఠనాన్ని విసర్జించవద్దు. నిశ్చింతగా తపస్సు చేసుకోండి!' అని చెప్పి బయలుదేరి దూరంగా ఉండే ధ్వజ చిహ్నాలను గుర్తించి భరతుడి రాకను ఎరిగి శత్రుఘ్నుడు బాణం వేయడం గమనించి, తత్క్షణం లక్ష్మణుడి దగ్గరకు వెళ్ళి 'నాయనా! భరతుడు మనలను కలవాలనే ఉత్కంఠతో వచ్చాడు. నువ్వెందుకు యుద్ధం చేస్తున్నావో క్షణం ఆలోచించు' అని హెచ్చరించాడు. కాని సౌమిత్రిని ఆవరించిన వీరావేశం చల్లారక బాణాలను సంధించడం మానలేదు. విపత్తు నివారించాలని, చేతినుండి ధనుస్సు లాక్కొనగా లక్ష్మణుడు రాముడికి మోకరిల్లాడు. శ్రీరాముని మందలింపుతో మాయ వీగిపోయి సాధారణ పరిస్థితి అలముకొంది. రాత్రి అయిన తరువాత సూర్యుడు

ఉదయించినట్లుగా ఉంది స్థితి. భరతుడు రాముని సమీపించి పదేపదే నమస్కారాలు చేస్తూ, ఒక్క ఉదుటన వచ్చి రామచరణాలు స్పృశించాడు. చాలాకాలానికి తల్లికి చేరువయిన బిడ్డలా, మేతకు వెళ్ళిన ఆవు వాత్సల్యంతో దూడను దరిచేర్చుకొన్నట్లు, ఎండమావిని చూసి మృగం పరుగెత్తుకొచ్చినట్లు, కల్పవృక్షంపై పక్షులు ఎగిరినట్లు, లోభికి జీవితాంతం దాచుకున్న ధనం పోయి మళ్ళీ దొరికినట్లుగా ఉంది భరతుడి స్థితి. భక్తి ప్రేమలే ఆనందబాష్పాలుగా పాదాలను కడిగాడు. పుత్రుడయిన జయంతుని ప్రేమగా ఇంద్రుడు ఆలింగనం చేసుకున్నట్లు, శ్రీరాముడు తమ్ముని రెండు చేతులతో లేవనెత్తి ఆదరంగా అక్కున చేర్చుకున్నాడు. ఇంతలో శత్రుఘ్నుడూ సాష్టాంగప్రణామం చేయగా రఘురాముడు అతనిని పరమ ప్రీతితో హృదయానికి హత్తుకున్నాడు. క్షీరసాగరంలో లేచిన అలలు వరుసగా ఒకదానిలోనొకటి లీనమయినట్లు, వేదాంతంలో శృతులు కలిసిపోయినట్లుంది వీరిద్దరి స్థితి. అయోధ్య నుండి వచ్చిన బ్రాహ్మణులు, సైన్యం, ప్రజలు శ్రీరాముడికి ప్రేమతో నమస్కారాలు చేశారు. లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు పరస్పరం అభివాదాలు తెల్పుకున్నారు. సుమంతుడు శ్రీరాముడికి అభివాదం చేశాడు. 'శ్రీరామా! నదిదాటి కులగురువు, మీ ఇద్దరు మాతలు వచ్చారు' అని చెప్పాడు. రాముడు ముందు నడువగా అయోధ్యా ప్రజలు అనుసరించారు. వేదాలు శ్రీమన్నారాయణుని పరివేష్టించినట్లుగా ఉంది అప్పటి స్థితి. ఈశ్వరుడి చరణాలకు స్కందుడు మొక్కినట్లుగా గురుచరణాలకు మోకరిల్లాడు శ్రీరాముడు. కౌసల్యాసుమిత్రల పల్లకీలను చూచి రామలక్ష్మణులు పరుగిడగా సుమిత్రా కౌసల్యలు పల్లకీలు దిగారు. శ్రీరాముడు వారికి మొక్కి 'దయాసాగరుడైన నా జనకుడు దశరథుడు క్షేమమే కదా?' అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నతో కల్లోలం చెలరేగింది. పెద్దపెట్టున ఏడుస్తూ అందరూ అంతులేని శోకంలో మునిగిపోయారు. 'శ్రీరామా! దశరథుడు నీ ఎడబాటు సహించలేక నీ పేరే కలవరిస్తూ మోక్షపథం



చేరుకున్నాడ'ని వసిష్ఠుడు అసలు వార్తను నెమ్మదిగా తెలియచేశాడు. ఈ వార్త విని కరుణాసాగరుడు, మోక్షప్రదాత సజల నయనాలతో స్థాణువయ్యాడు. 'నాతండ్రి సత్యానికే ఆదర్శం. మా తండ్రి యుద్ధకౌశలం వర్ణనాతీతం. ఇంద్రాదిదేవతలు స్వయంగా చూచారు. వృషపర్వుడు, శుక్రుడు, మొదలగు రాక్షసులను యుద్ధంలో జయించిన పరాక్రమశాలి' అని తలచుకుంటూ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

పురాణపురుషుడు, జగద్వంద్యుడు, ఆత్మారాముడు, అఖిల విశ్వానికి కారణభూతుడు అయిన శ్రీరాముడు తండ్రికోసం విలపించడమేమిటని శ్రోతలకు ఆశ్చర్యంగా ఉండొచ్చు. నీలకంఠుడు క్షీరసాగరం ప్రవేశించగానే చంద్రుడు తపించినట్లు, గరుత్మంతుడు సర్పాలతో బాధపడినట్లు, చింతామణికి దారిద్ర్యం కలిగినట్లు, కల్పవృక్షం మోడువారినట్లు, ప్రళయాగ్నికి అంధత్వం వచ్చినట్లు ఇదేం శోకం? అనే ప్రశ్నకు కవి యిలా వివరిస్తున్నాడు. నటుడు ఏ వేషం వేస్తే దానికి తగ్గట్లుగా నటించినట్లు, పూర్ణ బ్రహ్మానంద స్వరూపుడైన రఘువీరుడు మానవలోకంలో అవతరించాడు. ఆ జగద్గురువు దేవాధిదేవుడు తన అవతార కారణం తెలిసి మాయకులోనై లౌకికంగా వ్యవహరించాడు. జగదాత్మయైన ఆదిపురుషుడు అలా తన మాయను ప్రదర్శించాడు. అంధకారం సూర్యోదయంతో అంతరించినట్లు, అలా శబ్దరత్నభాండారాన్ని తెరచి అందులోని రత్నాలను కుమ్మరించి గుణగ్రాహులయిన శ్రోతలను సంతోషపెట్టి కవి వారి సందేహాలను తొలగించాడు. లంకెబిందెల కోసం ఆశపడితే కాలసర్పం కాటేసినట్టు వైరాగ్యం వల్ల కామం, జ్ఞానం వల్ల భ్రమలు తొలగిపోతాయి. సందేహనివృత్తితోబాటు కొన్ని విషయాలను అనుసంధానంగా వివరించాలి. ఇది దూషణమాత్రం కాదు. అన్నం ముద్దలో రాయివస్తే ఆస్వాదించటానికి ఆలస్యమయినట్లు, సెలవురోజు రసవంతమైన వేదాధ్యయనం కుంటుపడ్డట్లు, అడ్డదారిన పోతే ఒకరోజు ఆలస్యంగా చేరినట్లయింది,

సందేహనివృత్తి కారణంగా సాగతున్న ఈ కావ్యపఠనం. అందువల్ల ఈ కథాగోష్ఠిని దూషిస్తున్నాననుకోవద్దు. రాత్రులలో నిల్చిపోయిన సత్కర్మలు సూర్యోదయంతో మొదలవుతాయి. చెట్టు నీడన విశ్రమించిన బాటసారి అలసట తీరగానే లేచి తన మార్గాన తాను వెళ్ళినట్లు, సముద్రంలో తరంగాలు పుట్టి ఉవ్వెత్తున లేచి ఒడ్డును తాకి వేగంగా వెనక్కు వెళ్ళినట్లు, మేలు జాతి అశ్వం మొరాయించినా విశ్రాంతి అనంతరం జోరుగా పరుగుతీసినట్టు, ఒకింత విశ్రాంతితో వేగంగా ముందు జరుగబోయే ఆ కథాభాగాన్ని ఆదరంతో ఆలకిద్దాం.

జనకజామాత శ్రీరాముడు దశరథుని జ్ఞాపకాలతో శోకాకులిత చిత్తుడయ్యాడు. తదుపరి జరుగవలసిన కార్యక్రమాన్ని గూర్చి ప్రశ్నించగా, కులగురువు సమీపించి 'శ్రీరామా! దశరథుడు స్వస్థానానికి వెళ్లటానికి ప్రయాగ వెళ్ళి ఉత్తరక్రియలు నిర్వర్తించు' అని ఆదేశించాడు. దీన్ని గురించి మరాఠీ కవుల్లో భిన్నాభిప్రాయముంది. దశరథుడు గతించాడా లేదా అన్న విషయంపై చర్చ అనవసరం. దానివల్ల అనర్థమే కలుగుతుంది. ఎవరి దివ్య నామాన్ని ప్రేమతో స్మరిస్తే సమస్త జీవరాసులు ఉద్ధరిపబడతాయో అటువంటి పరమాత్ముని తండ్రి పరమపదించడం త్రికాలాల్లోనూ అసంభవమే. శ్రీరాముడు గయకు వెళ్ళి ఉత్తరక్రియలు జరిపి తిరిగి చిత్రకూటానికి వచ్చాడు. మునులు, అయోధ్యా జనులు ఆనందంతో రాముని చుట్టూ చేరారు. శ్రీరాముడికి భరతుడు సాష్టాంగదండప్రణామం చేసి, ఇలా విజ్ఞాపన చేశాడు. 'జయము! జయము! పురుషోత్తమా! మాయా చక్ర సంచాలకా! పూర్ణబ్రహ్మ! విరించి జనకా! సుఖ విశ్రామా! మంగళధామా! రఘురామా! రామా! కరుణాసముద్రా! రవికులభూషణా! రాఘవేంద్రా! సర్వానంద సదనా! రామచంద్రా! ప్రతాపరుద్రా! జగద్గురో! భవహృదయవిమోచనా! అహల్యోద్ధారకా! మఖరక్షకా! సీతాధవా! కౌసల్య గర్భరత్నా! మాయాపార శ్రమ విమోచనా! సనకసనందన



మానసరంజనా! నిరంజనా! నిజరూపా! దానవ సంహారకా! మమ హృదయారవింద భ్రమరా! అజ్ఞాన తిమిర చ్ఛేదక దివాకర సమా! జగదీశా! సర్వేశా! భక్త చాతక జలధరా! ప్రేమ చకోర వేధకచంద్రా! సంసార గజవిచ్ఛేదక మృగేంద్రా! అనంగమోహనా! అనంగా! చకోరాన్ని చూసి చంద్రుడు పరుగున వచ్చినట్లు, అకాలంలో జలధరం చాతకంపై వర్షించినట్లు, దరిద్రుడికి చింతామణి లభించినట్లు, బీదవాడి ఇంటిముందు కల్పవృక్షం మొలచినట్లు, పతివ్రత దేశాంతరం వెళ్ళిన పతిని కలుసుకున్నట్లు, ఆకలిగొన్న వానికి పాలసముద్రం ఎదురయినట్లు, సాధకునికి జ్ఞాననిధి దొరికినట్లు, ఎక్కడెక్కడో తిరిగి రాజహంస మానససరోవరం చేరినట్లు, పార్వతి శంకరుని కలుసుకున్నట్లు, అసంకల్పితంగా అపార ధనం నిరుపేదకు దొరికినట్లు, మీ దర్శనం మాకు ఆనందం కలిగిస్తోంది. సత్వరం మీరు అయోధ్యకు రావాలి. దశరథ మహారాజు పాలించినట్టు, మమ్మల్ని ఏలుకొని, గోబ్రాహ్మణ సంరక్షణ చేసి మా అభీష్టం నెరవేర్చాలి. శిరశ్ఛేదన చేసి మెుంగాళ్ళకు పూజ చేసినట్లు, పూజ్యమూర్తిని వదలి గొర్రె కాళ్ళు పట్టుకున్నట్లు, రాజకుమారుని విడిచి కన్యను పశులకాపరికి ఇచ్చినట్లు, దేవాలయ శిఖరాన్ని పడద్రోసి ప్రహరీగోడ కట్టినట్లు, తీర్థయాత్ర నొల్లక అన్నసంతర్పణ చేసినట్లు, పససను పారేసి ఉమ్మెత్తను ఆరగించినట్లు, ముత్యాన్ని వదలి గురివింద నేరినట్లు, వడ్లగింజను గ్రహించి వజ్రాన్ని పారేసినట్లు, చీకటిని గైకొని వెలుతురును విసర్జించినట్లు, రత్నాన్ని వదిలి గాజుపెంకును గ్రహించినట్లు, పరుసవేదిని కాదని మట్టిపెళ్ళ తెచ్చుకున్నట్లు, పండితుని విడిచి పిచ్చివాడిని సత్కరించినట్లు, చింతామణిని పారేసి ఉల్లిపాయలు ఏరుకున్నట్లు, అమృతం వదలి గంజాయి తాగినట్లు, కల్పవృక్షాన్ని పెరికి కూరగాయ పాదులు వేసినట్లు, కామధేనువును కాదని మేకను పూజించినట్లు, సుఖాన్ని వదలి దు:ఖాన్ని గ్రహించినట్లు, కస్తూరిని పారేసి బూడిదను పోగుచేసినట్లు, పళ్ళను వద్దని జిల్లేళ్ళను తిన్నట్లు, జ్ఞానానికి

బదులు అజ్ఞానాన్ని మూటగట్టుకొన్నట్లు నా తల్లి కైక అతితెలివితో మిమ్మల్ని అడవికి పంపి నాకు రాజ్యభారం అప్పగించాలని చూసింది. మా అపరాధం మన్నించి అయోధ్యకు రావలసింది'.

శ్రీరాముడు తమ్ముని మాటలు సావధానంగా విని, 'సూర్యడెప్పుడయినా గతి తప్పాడా? అగ్నికి అంధత్వం, దోమలు ఢీ కొనడం వల్ల మేరువు ఒరగడం, రాయి తగిలి వాయువు కాలు విరగడం, పిపీలిక పానం వల్ల సింధునది శుష్కించడం, మెరుపును ఈగ పట్టుకోవడం, కణకణమండే మంటలు కర్పూరంతో శాంతించడం మొదలయినవి జరగొచ్చేమో కాని నా మాటకు మాత్రం తిరుగులేదు. నాది ఒకే మాట, ఒకే బాణం, ఒకే పత్ని. పధ్నాల్గేళ్ళు నిండక అయోధ్యలో అడుగిడడం అసంభవం!' అని తన నిశ్చయాన్ని తెల్పాడు. అగ్నిలో పడ్డ పుష్పం వలె ఆ మాటలకు భరతుడి వదనం మాడిపోయింది. అగ్నిని రగిల్చి ప్రాయోపవేశానికి సిద్ధపడి, 'రాముని ఎడబాటు సహించలేను. దేహాన్ని త్యజిస్తాను' అని అంటున్నంతలో వాల్మీకి ఏతెంచి భరతుని ఆవలకు తీసుకెళ్ళి కావ్య మూలార్థాన్ని, భవిష్యార్థాన్ని తెలిపాడు. భరతుడది విని నిశ్చేష్టుడయ్యాడు. తిరిగి రాగానే శ్రీరాముడు భరతుని హృదయానికి హత్తుకుని, ఓదార్చి 'దేవతలను బంధ విమోచనం చేసి పదునాలుగు సంవత్సరముల పదునాలుగు రోజుల తరువాత పదిహేనవ రోజు మధ్యాహ్ననికల్లా నేను నిన్ను కలుసుకొంటాన'ని బాసచేశాడు. 'మాట జవదాటితే నాకు శరీర త్యాగమే శరణ్యం' అంటూ భరతుడు ప్రేమ పొంగి రాగా రామపాదాలకు మోకరిల్లాడు.

## శ్రీరామ పాదుకాప్రదానం: భరతుని నందిగ్రామనివాసం

'అన్నా! నేను అయోధ్యకు తిరిగి వెళ్ళను. మంగళ స్నానాలు, భోగభాగ్యాలు వదలి నందిగ్రామంలో నివసిస్తాను' అని అన్నాడు. మణిమయ భూషితములయిన తన పాదుకలను భరతుడికి ఇచ్చి అలాగేనని తన సమ్మతిని



శ్రీరాముడు తెలియజేసాడు. శివుడి శిరస్సున నెలవంకలా భరతుడి నెత్తిన పాదుకలు విరాజిల్లాయి. రామపాదుకలు శిరస్సును తాకగానే భరతుడు దు:ఖం మరచి ప్రశాంత చిత్తుడయ్యాడు. రామనామంలో పార్వతీ రమణుడైన గరళకంఠుడు శీతలత్వం పొందినట్లుగా ప్రేమమయుడైన భరతుడు అంతరంగంలో సంపూర్ణ స్వస్థత పొందాడు. తదుపరి శత్రుఘ్నునితో రఘునందనుడు "నువ్వు సుమంతుడితో కలిసి యథావిధిగా న్యాయసమ్మతంగా రాజ్యపాలన చెయ్యి. మహాత్ములను కీర్తించడం, గురుభజన చేయడం మానవద్దు. దుష్టులకు దూరంగా ఉండు. ప్రాణాన్ని కూడా లెక్కచేయక వేద మర్యాదను కాపాడు. అలవిగాని కష్టాలలో కూడా ధైర్యం వీడొద్దు. గురుభజనే పుణ్యమార్గం కనుక దాన్ని ఎప్పుడూ వదలవద్దు. పరసతులను, పరధనాన్ని ఆశించకు!" అని సలహానిచ్చాడు. "సాధు సన్యాసులను బ్రాహ్మణులను ఎప్పుడూ ఆదరించు. దుష్టులను నిర్జించి స్వధర్మ రక్షణచేసి కథా కీర్తన పురాణ శ్రవణంతో కాలం గడపాలి. వర్ణాశ్రమ ధర్మాలకు భంగం రాకుండా మహాత్ముల గౌరవాన్ని పెంచుతూ హరిభజనలో తరించాలి. చెడు వదలి సన్మార్గాన ఋషుల ఆశీస్సులు పొందు. వ్యక్తిగతమైన సంగతులందరితో ఏకరువు పెట్టవద్దు. విశ్వం పరమాత్మ స్వరూపమే. సత్సంగంలో ఉండి దురాలోచనలను దరిచేరనివ్వకు. స్వశక్తితో అరిషడ్వర్గాలు జయించు. నేనే జ్ఞానిననే భావం రానివ్వద్దు. వినోదం కోసమైనా ఇతరులను బాధించకూడదు. శమదమాది సాధనలతో సాధకుడు జనావళిని అడ్డుత్రోవనించి సన్మార్గానికి మళ్ళించాలి. కామ క్రోధ మద మాత్సర్యాది చోరులను శరీరంలోకి చొరనీయకుండా వివేక విజ్ఞానాలనే శస్త్రాలతో నిరోధించాలి. జీవితం క్షణభంగురం అని తెలుసుకుని ఆత్మవిచారంతో విషయాసక్తిని వీడాలి. సద్గురు వచనాలపట్ల ఆదరభావం ఉంచాలి. దైవానుగ్రహం వల్లే మానవజన్మ సాధ్యం. అందువల్ల గర్వం కూడదు. ఎట్టిపరిస్థితులలో ధైర్యాన్ని విడనాడవద్దు' అని కమలపత్రాక్షుడు, కృపానిధియైన

శ్రీరాముడు ముత్యపు చిప్పలోని స్వాతి బిందువుల వంటి వాక్యాలను భరతుడికి ఉపదేశించాడు.

అలా శబ్దామృతమనే వర్షధారలతో శ్రీరాముడు కర్ణచకోరమైన భరతుని శాంతింపచేశాడు. రామవచనాలు క్షీరసాగరం వంటివి. భరతుడు ఉపమన్యుడిలా అన్నీ విన్నాడు. సూర్యోదయంతో చీకటి తొలగినట్లు రాముని వచనాలతో భరతుడి అంతరంగం నిర్మలమైంది. వెంటనే నంది గ్రామం బయలుదేరాడు. తల్లులను సమాధానపరచి చూడవచ్చిన ప్రజలను, సుమంతుని, శత్రుఘ్నునికి నచ్చజెప్పి, తిరిగి అయోధ్యకు పంపాడు రాముడు. రామ పాదుకలను సింహాసనం మీద ఉంచి ఛత్రం పట్టి శత్రుఘ్నుడు అనుదినం రాజ్యం చేస్తుండేవాడు. నందిగ్రామంలో ఉన్న భరతుడితో సంప్రదించి శత్రుఘ్నుడు సకల రాజన్య లోకంపై ఆధిపత్యం సంపాదించాడు, నిర్వికారంగా ఉన్న భరతుడు రాజులకు విధి, బాధ్యతలు తెలియజెప్పేవాడు. నందిగ్రామవనంలోని పర్ణశాలలో భరతుడు నివసిస్తూ, నిరంతరం రామ పాదుకలను శిరస్సున ధరించేవాడు. రామభక్తులందరూ భరతుడిలా భోగభాగ్యాలను భార్యాబిడ్డలను వదలి మర్రిపాలతో జడలు ముడికట్టి నార చీరలు ధరించి దర్భాసనం మీద రామధ్యానంలో కూర్చున్నారు. అహోరాత్రాలు రామచరిత్రే వీరి పారాయణ. వీరి మధ్య భరతుడు నక్షత్రాల మధ్య చంద్రుడిలా, మానససరోవరంలోని రాజహంసలా వెలిగిపోయాడు.

## శ్రీరాముడు చిత్రకూటం వదలివెళ్ళడం

ఈ సందర్భంలో శ్రీధర కవి ఇలా అంటున్నాడు, "శ్రోతలు ముందు చెప్పబోయే విషయం మీద ధ్యానం ఉంచండి. రఘురాముడు చిత్రకూటంలో ఉండగా ఏం జరిగింది? కుమతులు మందమతులు శబ్దరత్న పరీక్షకు తగరు. శబ్ద రత్న భాండారాన్ని పండితులైన మీరు ఆనందిస్తారు. సావధానులై వినండి."



చిత్రకూటంలో పర్ణశాలలో నివసిస్తున్న శ్రీరాముడిని సమీపించి పామర బ్రాహ్మణులు తమ గోడు విన్నవించుకున్నారు. "నువ్విక్కడ నివసిస్తే మాకు విఘ్నాలు సంభవిస్తాయి. నీ భార్య సౌందర్యవతి. రాక్షసులు ఆమెను చూడగానే మోహిస్తారు. త్రిశిరఖర దూషణాదులు ససైన్యంగా దండెత్తుతారు. ఇలా జరుగుతుందన్న వాల్మీకి భవిష్యద్వాణి వ్యాప్తిలో ఉంది. కనుక నువ్వీ ప్రదేశాన్ని వదిలి వెళ్ళాల్సింది. లేకపోతే మేం మా ఆశ్రమాలు వదిలి వెడతాం" అని అన్నారు. "మీరు నిశ్చింతగా ఉండండి. యముడినైనా నిర్జిస్తాను. ఈ రాక్షసులు నాకో లెక్కలోని వారే కారు!" అని రాముడు హామీ ఇచ్చాడు. ఆయన పలుకులను వారు విశ్వసించలేదు. "ఇక్కడ దారుణమైన విఘ్నాలు సంభవిస్తాయి. ఆ సమయంలో నీవు నీ 'స్త్రీ' ని రక్షించుకుంటావా? లేక మమ్మల్ని రక్షిస్తావా? ఈ నాలుగు బాణాలు అయిపోతే ఏం చేస్తావు? నీ మాటలమీద విశ్వాసంతో మనలేం!" అని అంటూ, రాత్రికి రాత్రే వాళ్ళు వేరే చోటుకు తరలిపోయారు. ఉదయాన శ్రీరాముడు మునిజనం లేరని తెలుసుకున్నాడు. రాముడు మాత్రం ఏం చేయగలడు? తపోధనుడు, త్రికాలవేత్త అయిన వాల్మీకి మాత్రం మిగిలాడు. చిన్నగాలికి గడ్డిపోచ ఎగురుతుంది కాని కొండ తన స్థానం నుండి కదలదు. రణరంగంలో వీరుడు వెన్ను చూపడు. అందుకే వాల్మీకి మహాముని మాత్రం మిగిలాడు. ఇదంతా ముందే వాల్మీకి రాసినా, రామమహిమ తెలియని పామరులు పలాయనమయ్యారు.

రాముని మహిమానుభవం తెలియని వారు ఎంత ఆచారవంతులైనా అనాచారులే. కర్మ చేస్తున్నామన్న భ్రమలో మునిగితేలే నరరూప పిశాచాలు. రాముని శరణు వేడక వేదపఠనం చేసినా, శాస్త్రషట్కం చదివినా అవి తాగుబోతు మాటలతో సమానం. గాడిదకు పూసిన గంధం, పతిభక్తి లేని సౌందర్యం ఎందుకూ కొరగావు. షడ్రసోపేతమయిన వంటకాలలో గరిటతో ఎంత తిప్పినా, దానికి రుచేం తెలుస్తుంది? అలా సీతారాముల కృపలేని తత్త్వవిచారం వల్ల

ప్రయోజనం శూన్యం. అవి చిలక పలుకులే. అటువంటివారు తీర్థాటనలు చేసినా, చతుష్షష్టి కళలలో ప్రావీణ్యం సంపాదించినా, ఎన్ని కీర్తనలు పాడినా అవి దొమ్మరాటలతో సమానం. లోగడ వివరించినట్లు, బ్రాహ్మణులు జగద్వంద్యుడైన రాముని మహిమ తెలియక పారిపోయారు. తర్వాత శ్రీరాముడు సీతా సమేతంగా వాల్మీకికి నమస్కరించి చిత్రకూటం వదిలి దండకారణ్యానికి వెళ్ళాడు. శ్రీరామవిజయగ్రంథం ప్రచండం. ఇంతటితో అయోధ్యకాండ సమాప్తం. తర్వాత వచ్చే చెరుకుగడ వంటి అరణ్యకాండ మరింత రసవత్తరం. రామవిజయం క్షీరసాగరంలోని రత్నాలలా మంచి దృష్టాంతాలతో నిండి ఉంది. అజరామరులు సజ్జనులైన శ్రోతలు సదా దీన్ని ఆదరిస్తారు. బ్రహ్మానందా! రవికుల భూషణా! శ్రీధరవరదా! సీతా జీవనాధారా! ముందు ముందు అరణ్యకాండ నివేదిస్తాను.

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

*॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥*

**ద్వాదశాధ్యాయం మధురం**

**అయోధ్యకాండ సమాప్తం**



**అధ్యాయము - 13**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**సం**స్కృతోద్భవమైన ప్రాకృత మరాఠీ భాష రసవంతం. స్వాతి జలంనుండి వెలువడే ముత్యంలా ఈ భాష విరాజిల్లుతోంది. చంద్రుడి వెన్నెలలా, సూర్యుని కిరణాల్లా, మేరువులో బంగారంలా, పాలలో వెన్నలా, అభ్యాసం వల్ల అలరారే బుద్ధిలా, చెరకు నుండి వచ్చే తీయటి పంచదారలా, పూలనుండి వెలువడే సువాసనలా, చక్కని అరటి చెట్లనుండి వచ్చే కమ్మని వాసనలా, మృగం నాభి నుంచి ఉద్భవించే కస్తూరి పరిమళంలా, ముందు రాబోయే కథాభాగం ఆహ్లాదకరం. సముద్రంలో ఒకే స్థాయిలో తేలియాడే అలల్లా, ఈ అధ్యాయంలో అసంఖ్యాక సాహిత్యతరంగాలు శ్రోతలకు ఆనందం చేకూరుస్తాయి.

అమృతం కంటే అన్నం మధురం, అయినా కూరలు లేక అన్నానికి రుచి ఉండదు. సద్భావన లేని కీర్తన, అలంకారహీన అయిన స్త్రీ, ఆకాశాన్ని అలరించని తారలు, హంసలు లేని మానస సరోవరం, మననం లేని శ్రవణం, పండిత శూన్యమైన సభ, శృతి లేని పాట, శుచి లేని తపస్సు, కమలాలు లేని సరోవరం, రత్నఖని లేని మేరువు ఎలా నిష్ఫలాలో, అలాగే దృష్టాంతాలు లేని గ్రంథమూ శోభించదు. వైరాగ్యం లేని జ్ఞానం, భక్తి లేని భజన, దానగుణం లేని ధనవంతుడు, ఉపమానాలు లేని గ్రంథం ఒక్కటే. అరణ్యకాండ అరణ్యం వంటిది. ఉన్నతంగా విరాజిల్లే వృక్షాలే దీనిలోని ఉపమానాలు. ఫలవంతమయిన ఆ వృక్ష ఫలాలను ఆరగించి పండితులు రసాస్వాదనలో తేలిపోతుంటారు. అరణ్యకాండ ఒక వసంతవనం. అక్కడ సరస్వతి చిత్‌శక్తితో ఉల్లాసంగా క్రీడిస్తుంటుంది.

## శ్రీరామ దండకారణ్య ప్రవేశం

ఇదిలా ఉండగా, చిత్రకూటం నుండి బయలుదేరిన జగన్నాథుడైన శ్రీరాముడు సీతా సౌమిత్రి సహితుడై భక్తుల నుద్ధరిస్తూ దారిలోని ఋష్యాశ్రమాలు సందర్శిస్తూ దండకారణ్యంలో పదమూడు సంవత్సరాలు గడిపాడు. ఒకచోట సంవత్సరం, ఒకచోట ఆరునెలలు, మరొక చోట నెల, ఇంకోచోట పక్షం, ఒకచోట రాత్రి, మరోచోట మూడు రాత్రులు లేదా అయిదురాత్రులు – అలా వసిస్తూ దక్షిణాపథం వైపుకు సాగాడు.

## దత్తాత్రేయదర్శనం

అలా అత్రి ఆశ్రమం సమీపించిన అచ్యుతుడు అక్కడ దత్తాత్రేయ మూర్తిని దర్శించి ఆ పూర్ణబ్రహ్మ స్వరూపాన్ని గాఢాలింగనం చేసుకున్నాడు. పాలకడలిలోని అలల్లా గంగాయమున సంగమంలా, రఘురాముడు – దత్తాత్రేయుడు కలిసిపోయారు. అవతారాలెన్నో ఉన్నా కాలగర్భంలో అవి కలసిపోయాయి. దత్తాత్రేయ అవతారం కల్పాంతంలోనూ నశించదు. అది పూర్ణబ్రహ్మం. త్రిమూర్తులకు ఏకరూపం. ఆయన దర్శన మాత్రాన ముల్లోకాల్లో సకల జీవులు తరిస్తారు. సిద్ధులు, మునులు బ్రహ్మాది దేవతలు మొదలైనవారు త్రికాలాల్లోను ఆయనను దర్శిస్తూనే ఉంటారు. బ్రహ్మాండంలోని దేవతలందరూ పరుగు పరుగున చేరి సహ్యాద్రిమీద విడిది ఉండే ఆ అద్భుతమూర్తిని చూసేందుకు ఉబలాటపడతారు. ఆయన దర్శనం చేత శక్తి పెరిగి అభీష్ట సిద్ధి కలుగుతుంది. ఆయన నిత్యం ఉదయమే ప్రయాగలో స్నానం చేసి, పాంచాలేశ్వరుని అర్చించి, కరవీరపురంలో మధ్యాహ్న భిక్షచేసి సూర్యాస్తమయానికి సహ్యాద్రి చేరుకుంటారు. అక్కడ దేవతా సమూహం ఆయనకోసం చేతులు జోడించి ఎదురుచూసేది. ఈ దిగంబరుని దర్శనంకాగానే వారు అశేషంగా జయజయధ్వానాలు చేయడం భక్తులు ఇప్పటికీ వింటుంటారు. వీరి దృష్టి సోకితే చాలు దేవతలు పాదాభివందనం చేస్తుంటారు.



దత్తాత్రేయ స్మరణతో భూతప్రేత పిశాచాలు పారిపోతాయి. దత్తోపాసకులకు విఘ్నం కలిగించడం ఎవరికి సాధ్యం? అట్టి అమోఘ మహిమ గల అవధూతస్వామికి, అత్రితనయుడైన దత్తునికి, శ్రీరాముడు నమస్కరించి ఆపై అత్రిని దర్శించాడు. అప్పుడు అత్రి భార్యయైన అనసూయకు సీతారాములు నమస్కరించగా ఆమె సీతను ప్రేమాలింగనం చేసుకుని, తన నొసటనున్న కుంకుమ తీసి సీత నొసట దిద్ది, కల్పాంతం వరకు స్వచ్ఛంగా, నిత్యనూతనంగా ఉండే ఒక చీరను సీతకు బహూకరించింది. రవితేజస్సుతో మెరిసే, వాడని పూమాలను కంఠంలో అలంకరించింది. ఆకాశం ఉండేంత వరకు ఆ మాల పరిమళం వ్యాపించివుంటుంది. దాన్ని ధరిస్తే, దుర్భరులైన రాక్షసులు సమీపించినా నిర్భయంగా సంచరించగలవన్న వరం ప్రసాదించింది.

## రేణుకాదేవి సందర్శనం

మరుసటిరోజు ఉదయం ఎవరి వరంచేత భార్గవుడు క్షత్రియులను నిశ్శేషం చేశాడో ఆ ఆదిశక్తియైన రేణుకను దర్శించి, రవికులభూషణుడైన రాముడు నమస్కరించాడు. ఆమె రాముని ప్రకృతి. ఆది మాయ. ఆది మాయయే ప్రథమావతారానికి కారణభూతురాలు. ఆమే రెండవ అవతారంలో కౌసల్య. శ్రీరాముడు భక్తిశ్రద్ధలతో ఆమెను ఇలా స్తుతించాడు. శ్రోతలు ఆదరంతో ఆ స్తోత్రాన్ని వినండి! “ఓ ఆదికుమారీ, జయము! మూలపీఠనాయికవైన నీకు నమస్కారం. సకల కళ్యాణ సౌభాగ్యాలను ప్రసాదించు. జగదంబా! మూల ప్రకృతీ, భార్గవ ప్రియతమ మాతా! నీకు జయం. భవనాశనీ! భక్త వరదాయనీ! మంగళకారికా! హిమపుత్రీ! త్రిపుర సుందరీ! మహామాయే! ఆనందసరోవరమరాళమా! చాతుర్య చంపక కళికా! శుంభనిశుంభాంతకీ! సర్వవ్యాపికా! మృణాలినీ! శివ మానస కనకలతికే! పద్మనయనా! కష్టారణ్య దహనా! వివిధ తాపనాశనీ! నిజజనాదరణీ! అన్నపూర్ణా! నీ ముఖవర్చస్సుకు చంద్రబింబం చిన్నపోయింది. బ్రహ్మాదులను శిశువులుగా మార్చి స్వానందమనే

ఊయలలో పరుండబెట్టావు. జీవుని, శివుని నీ ఇచ్ఛతో సృజించావు. జీవుడు నీ స్వరూపాన్ని గుర్తించలేక జననమరణ చక్రంలో తిరుగుతుంటాడు. శివుడు తదేకంగా నీ ధ్యానంలో ఉండి నిత్యముక్తుడయ్యాడు. నీ కృపవల్లే శివుడు బ్రహ్మానందపథం చేపట్టాడు. పంచభూతాల మిశ్రమంతో ఈ బ్రహ్మాండాన్ని సృష్టించావు. నీ ఇచ్ఛానుసారం క్షణంలో సంపూర్ణంగా ఈ బ్రహ్మాండాన్ని నిర్మూలించగలవు. నీకు జయము!" అని స్తుతించి, సహ్యాద్రిపై మూడు రాత్రులు వసించి అత్రిముని అనుజ్ఞతో దక్షిణాపథంవైపుకు వెళ్ళాడు.

ఆ సమయంలో అత్రి రాముడినుద్దేశించి ఇలా అన్నాడు. "ఓ రామా! ఈ వనంలో చాలామంది రాక్షసులు సంచరిస్తుంటారు. చాలా జాగ్రత్తగా నీ సతి సీతను రక్షించుకోవాలి సుమా! వెనక్కి తిరిగి రావద్దు" అని హెచ్చరించాడు. అత్రి వద్ద శలవు తీసుకుని శేషావతారుడైన లక్ష్మణుడు, హంసగమనంతో జగన్మాత, మంగళప్రదాయిని యైన సీత వరుసగా అనుసరించగా జలజాక్షుడయిన రాముడు ప్రయాణమయ్యాడు. సీత నడకలో వెనుకంజవేయడం గమనించిన లక్ష్మణుడు, 'అన్నా! జానకీదేవి వెనుకపడ్తోంది. కొంతసేపు విశ్రమిస్తే బాగుంటుందేమో!' అని సూచించాడు. రాముడు క్షణం నిలబడి చిరుహాసంతో మందగమనయైన సీతవైపు చూశాడు. జనక రాజపుత్రి నెమ్మదిగా వారిని చేరింది. సద్విచారంతో ఆత్మానందంతో శోభిల్లుతున్న ఆ పతివ్రతా శిరోమణి రాముని ముఖారవిందాన్ని గాంచగా కోటి మన్మథులు సాటిరారు. శ్రీరాముని చూసి దరహాసవదనయై, సిగ్గుపడుతూ పలికిన మధురమైన మాటలు శ్రవణానందం కలిగించాయి. 'జగద్వంద్యా! రవికులభూషణా! శివహృదయ నివాసా! చిన్మయలోచనా! కాలినడకతో పయనించి చాలా శ్రమించావు. పరమ సుకుమారుడు లక్ష్మణుడు నడచి నడచి అలసిపోయాడు. చెట్టునీడన ఒకింత విశ్రమిద్దాం. గుణసాగరా! ఎర్రకలువలకన్నా మృదువైన మీ చరణాలు అరుణరాగ మిశ్రితమైన కెంజావి



రంగులో ప్రకాశిస్తున్నాయి. గంగకు జన్మనిచ్చిన ఈ చరణాలను నా కేశాలతో శుభ్రంచేసి చల్లటి నీటితో కడిగి పాదసంవాహన చేస్తాను. ఇంకెంతదూరం ప్రయాణించాలో తెలియదు కనుక ఇప్పుడే మీ శుశ్రూష చేస్తాను. ఆ అవకాశం కల్పించండి' అని వేడుకుంది. ఈ పలుకులకు రాముని హృదయం ద్రవించింది. 'ఓ సుకుమారీ! నువ్వూ కాలినడకనే వస్తున్నావుగా, నువ్వూ చాలా అలసిపోయి ఉంటావు' అని ఆ కమలాక్షుడు సజలనయనుడయ్యాడు. సీత గడ్డం కింద నిమురుతూ తలపై అభయహస్తాన్నుంచి, తన హస్తస్పర్శతో సీత అలసటను మరిపించి ఆనందింప చేశాడు. రాముని పాదాలను తన వెంట్రుకలతో శుభ్రం చేసి సీత కాళ్ళు ఒత్తింది. ముగ్గురూ మళ్ళీ ప్రయాణం కొనసాగించారు. ఆ సమయంలో వనచరాలు పరస్పరం విరోధభావం వదలి సంచరించాయి.

**విరాధవధ**

అప్పుడు విరాధుడు విశాల శరీరంతో నిప్పులు చెరిగే కళ్ళతో, తలపై కుంకుమతో తల విరియబోసుకొని, మహా భయంకరంగా, అగ్నిజ్వాలలు పై కెగసినట్లు నాలుక లోపలికి, బయటకు ఆడిస్తూ నల్లటి శరీరంతో కొండే కదలి వచ్చిందా అన్నట్లు మెడలో కంకాళాల మాల ధరించి, శూలం ఎత్తిపట్టుకొని సింహ, గజ, వనచర సమూహాన్ని నిర్జిస్తూ, వందలాది బ్రాహ్మణులను పళ్ళకింద నములుతూ, వృక్షాలను పెకిలిస్తూ భూమి అదిరేలా వచ్చాడు. ఇంట్లో దొంగలు పడి భోషాణం కొల్లగొట్టినట్టు, పులి అకస్మాత్తుగా జింకను కబళించినట్టు, యజ్ఞశాలలోని నేతిగిన్నెను కుక్క తీసుకుపోయినట్టు విరాధుడు రాముని వెనుక నడుస్తున్న సీతను అపహరించాడు. 'సూర్యవంశ భూషణా! అయోధ్యానాథా! దీనబంధూ! త్వరగా వచ్చి ఈ ధూర్తుడి బారినుండి నన్ను రక్షించు!' అని సీత ఆర్తనాదాలు చేసింది. అప్పుడు ఆ రాజీవనేత్రుడు వృక్షాలతో నిండివున్న ఆ అరణ్యంలో ఆమెను కానక తత్క్షణం

అర్ధచంద్రాకృతిలో వింటిని సారించి వనాన్ని నిర్మూలించాడు. సింహం ఏనుగు కుంభస్థలం పైకి లంఘించినట్లుగా శ్రీరాముడు విరాధునిపై విరుచుకపడ్డాడు. లక్ష్మణుడు సింహంలా 'ఓ రాక్షసుడా! నిలు. నా బాణం నీ ఆయుస్సముద్రాన్ని ఇంకింపచేస్తుంది!' అని గర్జించాడు. పెద్దపులి కంటబడ్డ తర్వాత నక్క ఎలా జీవిస్తుంది? సూర్య కిరణాలను దోమ ఎలా ఛేదిస్తుంది? యమదండాన్ని పిశాచం ఎలా భంగపరుస్తుంది? వాసుకి కోరలను ఎవరు పీకేయగలరు? కాని అటువంటిపనే విరాధుడు చేయబోయాడు. 'ఓ మానవమాత్రుడా! లెక్కలేని ప్రగల్భాలు పలుకుతున్నావు, ఒక్క ముష్టిఘాతంతో నిన్ను నుగ్గునుగ్గు చేస్తాను!' అని అంటూనే సీతను కిందికి దింపి ముఖం జేవురించుకుని రామలక్ష్మణుల మీదికురికాడు. చేతులతో గాలిని ఛేదించుకుని వస్తున్న విరాధుని బాహువులను రాముడు బాణాలతో ఖండ ఖండాలు చేయగా అవి గగనమార్గంలో ఎగిసిపడ్డాయి. సూర్యముఖ బాణంతో శిరస్సును ఖండించగా గగనం నుండి దేవతలు పుష్పవృష్టి కురిపించి జయజయధ్వానాలు పలికారు.

వెంటనే విరాధునికి దివ్యశరీరం ప్రాప్తించింది. రాముడి ముందు వినమ్రుడై నిలిచి, 'రామా! నేను తుంబురనామ గంధర్వుడను. ఒకరోజు నా పాట వినడానికి యక్షపతియైన కుబేరుడు పిలిపించాడు. మదిరాపాన మత్తులో ఒళ్ళుతెలియక నా కంఠం బలహీనమయింది. అది గమనించిన కుబేరుడు ఘోరారణ్యంలో రాక్షసుడిగా జన్మించమని నాకు శాపమిచ్చాడు. తిరిగి వేడుకోగా, వనవాసకాలంలో శ్రీరాముడు నీకు శాపవిముక్తి కలిగిస్తాడని నివారణ చెప్పాడు. నేను పదివేల సంవత్సరాలుగా ఇక్కడ చరిస్తున్నాను. రావణుడికి నా పేరంటేనే హడలు. ఇప్పటికి నాకు మీ దయవల్ల విముక్తి లభించింది' అని శ్రీరామునికి పాదాభివందనం చేశాడు. సత్పాత్రునికి దానమిస్తే భూలోకంలో కీర్తి వ్యాపించినట్లు, దుర్జనునికి రహస్యం చెప్తే నలుదిక్కులా పాకిపోయినట్లు, సత్సమాగంవల్ల దివ్యజ్ఞానం ప్రకటమైనట్లు,



గుణవంతునికి ఉపకారం చేస్తే కీర్తి పెరిగినట్లు విరాధుడి మరణవార్త నీటిమీద నూనె బిందువులా నలుదిశలా వ్యాపించింది. ఇంతలో జానకి వచ్చి శ్రీరాముని పాదాలకు నమస్కరించి, ఈ రోజు నాకు మీ పరాక్రమం, శరసంధానం కనులారా గాంచే భాగ్యం కలిగిందని చెప్పింది. విరాధుడు సెలవు తీసుకుంటూ స్వామీ మీ దర్శన భాగ్యాన్ని శరభంగునికి కలిగించవలసింది. మీ దర్శనం కాక ఆ మహర్షి ఎన్నటికీ బ్రహ్మపదం పొందలేడు. చంద్రదర్శనానికి చకోరం ఎదురుచూసినట్లు, రామదర్శనానికి శరభంగ ఋషి తహతహలాడుతున్నాడు అని విన్నవించి స్వస్థానానికి వెళ్ళాడు.

### శరభంగముని విమోచనం

అంతకుముందు విరాధుడు చెప్పినట్టుగా శరభంగాశ్రమం దిశగా, ఏ సమయంలోనయినా రాక్షసులను ఎదుర్కోవల్సి రావచ్చని వింటిని ఎక్కుపెట్టి సీతారాములకు రక్షణగా లక్ష్మణుడు నడవసాగాడు. చెట్టునీడలో అప్పుడప్పుడూ విశ్రమిస్తూ నడుస్తున్న సీత 'మనం ఈవాళ ఎక్కడ విడిదిచేస్తాం?' అని లక్ష్మణుని ప్రశ్నించింది. చరాచర సృష్టిలోని జీవుల చిత్తాలు పరీక్షించే రాముడు ఒక్క క్షణం సీత నిలబడి సీత ఎలా నడుస్తున్నదా! అని గమనించాడు. ఆ దయాసాగరుడు శరభంగాశ్రమం సమీపించగానే గంగకు వచ్చిన వరదలా మునులు సమాధి, తపశ్చరణ వదలి నలువైపులనుండి పరుగు పరుగున శ్రీరామునిచుట్టూ చేరారు. కుష్ఠవ్యాధి పీడితుడైన శరభంగుడూ వచ్చి నమస్కరించాడు. ఆయన తన వ్యాధిపీడిత శరీరాన్ని వదలి దివ్యదేహంతో రామదర్శనార్థం వచ్చాడు. ఆ మునిగణానికి రామలక్ష్మణులు అభివాదం చేశారు. రాముడు శరభంగునితో సహా అందరినీ ఆలింగనం చేసుకున్నాడు. శరభంగుని ఆశ్రమంలో ముగ్గురూ విడిది చేశారు. రాముడు శరభంగుని పూజించాడు. 'ఆ గొంగడి క్రింద వణికేది ఏమిటి' అని లక్ష్మణుడు ప్రశ్నించాడు. శరభంగుడు గొంగడి ఎత్తి, 'ఇది నా కర్మశరీరం. అది అనుభవించక

దేహబంధనాలు తెగవు. రాజు, రైతు, సాధువు, సుజ్ఞాని ఎవరికయినా కర్మానుభవం తప్పదు' అని సమాధానమిచ్చాడు. ఆ శరీరాన్ని చూచి లక్ష్మణుడు సహించలేక అన్నను వరం ప్రసాదించమని కోరాడు. అందుకు శరభంగుడు, 'కావల్సినప్పుడు నాకు వేడినీళ్ళు దొరకవు, ప్రతిరోజు చన్నీటి స్నానం చేయడంవల్ల శరీరం చిట్లిపోయింది' అని తన కోరిక విన్నవించాడు. 'ఉదయాన్నే నీళ్ళు ఇచ్చి వెళ్ళిపోతాం' అని అభయమిచ్చాడు రాముడు. సూర్యోదయాన మునికిచ్చిన మాట మరచి గౌతమీతీరానికి వెళ్ళాడు శ్రీరాముడు. గౌతమిలో స్నానం చేస్తున్నప్పుడు ఆ మాటలు గుర్తుకువచ్చి వెంటనే ఆగ్నేయాస్త్రం వదిలాడు. ఆ బాణం ఋష్యాశ్రమం వద్ద పాతాళంలో ప్రవేశించి ఉష్ణోదకాన్ని వెలువరించింది. ఆ స్నానంతో ముని దివ్య శరీరుడై ఇంద్రుడు తెచ్చిన విమానంలో అమరలోకానికి వెళ్ళాడు. దారిలో ఎంతోమంది మునులను సేవిస్తూ సుతీక్ష్ణుని ఆశ్రమం దిక్కుగా సాగాడు శ్రీరాముడు. ఫలాలను బాహువులతో మెత్తగా చేసి ఆరగించే వృద్ధులను, వృక్షాగ్రవాసులను, మౌనవ్రతులను, దిగంబర జటాజూటధారులను, పాలు పండ్లు మాత్రమే భుజించేవారిని మార్గమధ్యంలో చూశాడు. సుతీక్ష్ణుని ఆశ్రమంలో ఋషులు పరమానందంతో శ్రీరాముని కలిసారు. అక్కడ మూడు రోజులుండి ముందుకు సాగాడు.

పావన గౌతమీ తీరంలో పాంచాళేశ్వరం వద్ద భూమినుంచి వచ్చే రమ్యమైన సంగీతాన్ని శ్రీరాముడు ఆలకించాడు. రాముడదేమని ప్రశ్నించగా అక్కడి మునులు, 'రామా! ఇక్కడ మందకర్ణి అనే ముని ఉండేవాడు. పరమ తపస్సంపన్నుడు. సూర్యుడిలా తేజోవంతుడు. ఆయన తపోభంగానికి ఇంద్రుడు ఐదుగురు కన్యలను పంపగా, వారిని చూచి ముని మైమరచి గృహంలో వుంటూ పాటలు వినేవాడు. ఆ ధ్వనే ఇప్పటికీ వినిపిస్తుంటుంది' అని వివరించాడు. మందకర్ణుడు రాముని రాక ఎరిగి భూద్వారం తెరచి



బయటకురాగా రాముడు నమస్కరించాడు. ఆదరాభిమానాల తర్వాత ఋషి ఆశ్రమానికి తీసుకెళ్ళి పూజచేశాడు. అక్కడొక రాత్రి గడిపి రాముడు ముందుకుసాగాడు. ఆ నీలమేఘశ్యాముడు సుతీక్ష్ణుని ఆశ్రమం చేరాడు. అగస్త్యుని దర్శించాలనే కోరిక రాముడిలో వుందని గ్రహించి సుతీక్ష్ణుడు ఆయనను గురించి వివరంగా చెప్పాడు.

### అగస్త్యవృత్తాంతం

ఆతాపి, వాతాపి, ఇల్వలుడు అనే ముగ్గురు పరమ దుర్మార్గమైన రాక్షసులు క్షుద్రవిద్యలలో నిపుణులు. ఒకరు అన్నదాత, మరొకరు అన్నం, మరొకరు నీరుగా మారి వనమధ్యంలో సంచారం చేస్తుండేవారు. ఆతాపి బ్రాహ్మణులకు పూజచేసి వారికి అన్నదానం, ఉదక సమర్పణ ఆదరభావంతో చేసేవాడు. భోజనానంతరం అతడు వాతాపి అని పిలవగానే బ్రాహ్మణుల పొట్ట చీల్చుకొని వాతాపి బయటకు వచ్చేవాడు. ఆవిధంగా అసంఖ్యాకులైన బ్రాహ్మణులను ఇలా చంపితినడం చూసిన మిగిలినవారు కుంభసంభవుడైన అగస్త్యుని శరణువేడారు. అప్పుడా మహాత్ముడు, దయాసాగరుడు దేవతలకు సైతం వందనీయుడైన అగస్త్యుడు ఆ రాక్షసుల నివాస స్థానానికి చేరుకున్నాడు. అప్పుడా రాక్షసులు అగస్త్యునికి అభివందనం చేసి మా ఆశ్రమం పావనం చేసి, అన్నం, ఫలం, మంచినీరు వీటిల్లో ఏదయినా తీసుకోమని ప్రార్థించారు. ధనుర్బాణాలు వీపున ధరించే కపటరూపులైన ఆ రాక్షసులు సతతం వేదాధ్యయనం చేస్తున్నవారిలా శుభ్రమైన తడిధోవతి, యజ్ఞోపవీతం, దర్భలు గైకొని భక్తి నటిస్తూ నిలుచున్నారు. లోనంతా దురాలోచనతో వేశ్య కపటప్రేమలా, కపటమిత్రుని స్నేహంలా తీపిని నటిస్తూ వారు తీయని మాటలు పలికారు. దొంగ ఊళ్ళో అందరితో మొదట స్నేహంగా వున్నట్లు, విషకుంభాలవంటి వారు పైపైన అమృతం చిలికిస్తూ, శిష్యులా, విరక్తులా మెలుగుతూ గురుసేవను

అభినయించారు. మునిపై కపటాదరభావాన్ని చూపుతూ ప్రియమైన వాక్కులతో మాయావియైన ఆతాపి అగస్త్యుని ఆశ్రమంలోనికి తీసుకెళ్ళాడు. ఈ లోపల వాతాపి ఫలరూపం దాల్చాడు. అగస్త్యుడు ఫలభక్షణ చేసి మంచినీళ్ళు తాగకుండానే కపటత్వాన్ని గ్రహించాడు. పొట్టను నిమురుకొంటూ ఉదరంలో రాక్షసుడిని భస్మం చేశాడు. ఇద్దరూ మూడోవాడిని పేరుపెట్టి బయటకు రమ్మన్నారు. కానీ జవాబు లేదు. దాంతో ఆ ఇద్దరూ భయానక రూపాలతో మునిపై పడ్డారు. మహాపరాక్రమశాలియైన అగస్త్యుడు వింటిని సారించి ఒకే బాణంతో ఆతాపి శిరస్సుని ఛేదించి గాలిలో ఎగరేశాడు. ఇల్వలుడు పారిపోయి ముల్లోకాలు తిరిగి సముద్రంలో దాక్కున్నాడు. అగస్త్యుడు వాడిని వదలక వెంబడిస్తూ కోపంతో తన దోసిటితో సముద్రాన్ని ఆపోసన పట్టాడు. అటువంటి మహాత్ముడైన అగస్త్యుని దర్శించి ముందుకు సాగాల్సింది అని సుతీక్ష్ణుడు శ్రీరామునికి సలహా ఇచ్చాడు.

సుతీక్ష్ణుని ఆజ్ఞను పాటించి రాముడు కర్దళీవనం దిశగా వెళ్ళాడు. అగస్త్యుడి అన్న మహామతి గొప్ప తపస్సింధువు. ఆయనను సీతావల్లభుడు, ఆనందకందుడైన శ్రీరాముడు కలుసుకుని ఒక రాత్రి గడిపి, తిరిగి ప్రయాణం కొనసాగించాడు.

## అగస్త్యమహర్షి సందర్శనం

ఆ తరువాత అందమైన ఫలాలతో నిండిన అగస్త్యుని వనంలో వారు ప్రవేశించారు. సూర్యకిరణాలు చొరరాని ఆ వనంలో అరటి, కొబ్బరి, బొప్పాయి, అశోక, ఖర్జూర, ఉసిరిక, నిమ్మ, పిప్పలి, మర్రి మొదలైన చెట్లు ఉన్నాయి. దానిమ్మ, బూరుగు, పారిజాతం, మందారం, చందనం, మోహన, మేడి, చంపక, జాజి, సన్నజాజి, వకుళమల్లి, తులసి, కోవిదార, చేమంతి, కనకవల్లి, నాగవల్లి, ఎర్రపగడం, కల్పవృక్షం, గరుడవృక్షం, అర్జునవృక్షాలతో



అలరారుతూ, సాల, తమాల, పారిజాత, శిరీష, రాయచంపక, అశోక, పనస, నింబోళి, మాతులుంగ మొదలైన పుష్పాలతో సువాసనలు వెదజల్లుతూ, అగరు, కృష్ణాగరు వాసనలతో, పచ్చికబీళ్ళతో, నెమళ్ళు, బాతులు, చాతకాలు, కస్తూరి మృగాలు, జవ్వాది పిల్లులు, రాజహంసలు, నకులచక్రవాకలు, కోయిలలు విలాసంగా విహరించే ఆ ప్రదేశం చూచి అగస్త్యమునిని ధన్యజీవిగా భావించారు. అక్కడ జంతువులకు సఖ్యతే తప్ప వైరం తెలియదు. పక్షులు పండితుల్లా శాస్త్రచర్చ చేస్తాయి. ఆ వనంలో సంచరించే శిష్యగణం వేదం, న్యాయమీమాంస తర్కాలు, పతంజలి వ్యాకరణము, నానా శాస్త్రాలు, పురాణాలు పఠిస్తుంటారు. వారిలో అష్టాంగ యోగసాధన చేసేవారు కొంతమంది. ఆ శిష్యగణంలో కొందరు తమ గురువు వద్దకు పోయి సంతోషాతిశయంతో రామలక్ష్మణ సీతాగమన వార్తను నివేదించారు. ఆ వార్త విన్న అగస్త్యుడు అవధులు లేని ఆనందంతో నిజపతప స్సమాధి అనుష్ఠానాలు ఆపి జగద్వంద్యుడు, ఆదిబంధువు, అగమ్యుడు, శివబ్రహ్మేంద్రాదులకు పూజనీయుడైన శ్రీరాముడు పూర్వపుణ్యంవల్ల పిలువకుండానే మన ఆశ్రమాన్ని పావనం చేయటానికి వచ్చాడు అంటూ నిందునదులు సముద్రాన్ని చేరిన రీతిలో శిష్యగణంతో లేచి ఎదురెళ్ళి శ్రీరాముని ఆహ్వానించాడు. రామలక్ష్మణులు మునులకు అభివాదం చేశారు. అగస్త్యుడు త్వరగా ముందుకు వెళ్ళి, శివకేశవులు ప్రీతిగా కలిసున్నట్టు, ఇంద్ర బృహస్పతులు ఆలింగనం చేసుకున్నట్టుగా రాముని గాఢంగా కావలించుకున్నాడు. 'ఈరోజు చాలా సుదినం. కౌసల్యాసుతుని కళ్ళారా చూశాం!' అని మునిజనం – దాతని యాచకులు చుట్టుముట్టినట్టు, గంధాన్ని ఫణీశ్వరుడు చుట్టుకున్నట్టు, రాజు వెంట సైన్యం చుట్టి ఉన్నట్టు, చకోర సమూహాలు చంద్రుడి చుట్టూ చేరినట్టు రాముని చుట్టూ మూగారు. ఉరుములు మెరుపులు చూసి నెమళ్ళు ఆనందనృత్యం చేసినట్టు, మహావైద్యుని చూసి రోగులు సంతృప్తి

చెందినట్టు, సూర్యోదయం కాగానే చక్రవాకాలు సంతోషించినట్టు రాముని చూసి వారు సంతోషించారు.

ఋషి సమూహాన్ని గమనించిన సీత సిగ్గుతో దూరంగా నిలబడి పోయింది. అప్పుడు పరుగున వచ్చిన మునిపత్నులు ఆ మునిజనసందోహంలో రాముని తెలుసుకోలేక పోయారు. జగత్తులో ఉండే మాయాజాలం వల్ల జగదీశ్వరుని తెలుసుకోలేక పోయినట్టుగా మునుల మధ్య ఉండే రాముని కానలేక, సాధకుడు సద్గురువును వేడినట్లు, వారు ఆదిమాయయైన భగవతి అనంతశక్తిని ఆవరించినట్టు, మునిపత్నులందరూ సీతను పరివేష్టించి, 'జటాజూటాలతో ఉండే ఆ మునులు ఒకరికంటే ఒకరు తేజస్వులు. నీ నేత్రచకోరాలకు శశివంటి నీ రాముడు నీకు త్వరగా గోచరిస్తాడు. ఆ రామచంద్రుడు మా సమీపంలో వున్నాకూడా ఆ సమూహంలో గుర్తించలేక పోతున్నాం. ఓ మంగళదాయినీ! మంగళ ప్రదుడయిన నీ మనోహరుని మాకు చూపించు! ఎనుబదినాలుగు లక్షల జీవరాసులలో వెలిగే ఆ పరమాత్మను వెదకి వెదకి అలసిపోయాం! యుగరక్షకుడు, సర్వేశ్వరుడు, ఆదిపురుషుడు ఎక్కడ ఉన్నాడో చూపించు! నాభి నుండి వస్తున్న కస్తూరి పరిమళం ఆ మృగానికే తెలియనట్టు, పుట్టు గుడ్డికి రత్నాభరణాలు దగ్గరున్నా కనబడనట్టు, వేదవల్లి యొక్క దివ్యఫలం, సరసిజోద్భవునికే మూలమైన ఆ అనాదిఘనశ్యాముడు, నారదాదులకే గ్రాహ్యమైన ఆ పూర్ణబ్రహ్మం, గరళ కంఠుని ధ్యానగమ్యం ఎక్కడున్నాడు?' అని రకరకాలుగా ప్రశ్నించారు. వివిధ మునుల గుర్తులు చెప్పినా సీత వ్యతిరేక సమాధానం చెప్పింది. గోచరమయ్యే జగత్తు పరబ్రహ్మ కాదని శ్రుతులు 'నేతి నేతి' అని ఘోషించినట్టు, కనబడేవి నశిస్తాయే తప్ప చిన్మయాలు కావు. అశాశ్వతాలు. వేదశాస్త్రాలే భగవంతుని వర్ణించలేక మూగపోయాయి. అటువంటి పరంధాముని శబ్దాలతో సీత మాత్రం ఎట్లా వర్ణించగలదు? అందుకే తలమాత్రం అడ్డంగా పంకించి ఊరుకుంది. నిర్గుణుని, నిర్వికారుని



సంకేతాలతో చూపలేకపోయింది. సాధకులు యోగసాధన చేసినా పరమాత్ముని కనుక్కోలేనట్టుగా మునిపత్నులు రాముని గుర్తుపట్టలేకపోయారు. వేదపఠనంతో పరమాత్ముడు అవగతం అయినట్లుగా ఆ మునిపత్నులు అకస్మాత్తుగా నీలమేఘచ్ఛాయ గలవాడు, ఆకర్ణాంత నేత్రుడు, సుహాస్య వదనుడు, బ్రహ్మానందమూర్తి, చిన్మయస్వరూపంలోవుండే శ్రీరాముని కనుగొన్నారు. 'జటాజూటధారి, ఆజానుబాహువు, వల్కలాలను ధరించిన వాడేనా నీ పతి?' అని మునిపత్నులు ప్రశ్నిస్తే సీత చిరునవ్వు నవ్వి ఉన్మీలిత నేత్రాలతో తల ఊపింది. రాముని రూపం చూచి అందరూ బ్రహ్మానందంలో మునిగిపోయారు. సీత చరణాలను స్పృశించి 'వేదాలు మౌనంగా ఉండే మహాత్ములకు బ్రహ్మపదాన్నిచ్చినట్టు నీ దయవల్ల శ్రీరామ దర్శనం మాకు సంప్రాప్తమైంది. నిజంగా ధన్యులమయ్యాం!' అని అన్నారు.

అగస్త్యుడు శ్రీరాముని ఆశ్రమానికి తీసుకెళ్ళి యథావిధిగా సత్కరించాడు. అక్షయ చాప, తూణీర, కవచ, శస్త్రాస్త్రాలను మంత్ర సహితంగా రఘురాముడికి ప్రదానం చేస్తూ, నవగ్రహాల్లో సూర్యునివలె ప్రకాశించే ఒక బాణాన్ని రామునికిచ్చి 'ఈ బాణంతో రావణుడు పరమపదం చేరుకుంటాడ'ని వివరించాడు. నెలరోజులు అగస్త్యాశ్రమంలో గడిపిన అనంతరం, మేం వెళ్ళవలసిన దిశ నిర్ధారించండని శ్రీరాముడు అగస్త్యుని కోరాడు. గోదావరి తీరాన పంచవటి మీకు తగిన నివాస స్థానం. సీతను జాగ్రత్తగా రక్షించుకోమని సలహా ఇచ్చాడు అగస్త్యుడు.

### పంచవటి ప్రవేశం

అగస్త్యుడి దగ్గర సెలవు తీసుకుని పంచవటి మార్గం పట్టారు. దారిలో జటాయువు కనిపించింది. ఈతడు రాక్షసుడు కాబోలు, త్వరగా ధనుర్బాణాలు సిద్ధం చేయమని రాముడు లక్ష్మణుని ఆదేశించాడు. తూణీరాలనుంచి

బాణాలను తీసి ప్రయోగం చేయబోయే సమయంలో 'ఈ వనంలో సంచరించే నీవెవరు? నామీద బాణ ప్రయోగం ఎందుకు చేస్తున్నావు? నీపేరు, గుర్తులు చెప్పు?' అని జటాయువు ప్రార్థించింది. 'రఘుకుల భూషణుడైన దశరథుని కుమారుడను. నా పేరు శ్రీరాముడు' అని తన పరిచయం చేసుకున్నాడు శ్రీరాముడు. జటాయువు దగ్గరగా వచ్చి, 'కశ్యపపుత్రుడు అరుణుడు నా తండ్రి. నా పెదతండ్రి సుపర్ణుడు. నా పేరు జటాయువు. మా అన్న సంపాతి. దక్షిణ సముద్రం దగ్గర నివసిస్తాడు. నీ తండ్రి దశరథుడు నాకు బంధు సమానుడు. శుక్ర పోరాటంలో అతనికి సాయం చేశాను. అందువల్లే నేనంటే గౌరవం' అని తన గురించి వివరించాడు. రాముడు గాద్గద్యంతో 'నీవు నా తండ్రికి ఆప్తుడివి గనుక నాకు పెదతండ్రివి!' అని కౌగిలించుకున్నాడు. జటాయువు అనుమతితో పంచవటి ప్రవేశించారు. అక్కడ లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. కందమూలాలు తెచ్చి సీతారాములకు సమర్పించి తాను మాత్రం వనవాస కాలంలో నిరాహారుడిగా ఉండేవాడు. లక్ష్మణుడు వన సంచారంలోనే ఫలాలను భుజించాడని భావించి సీత కూడా ఏమీ ఇచ్చేది కాదు. ఆమె ఇస్తే తప్ప తినడు కనుక లక్ష్మణుడు ఉపవాసం ఉండేవాడు. జరిగేవన్నీ తెలుసు కనుక రాముడూ లక్ష్మణుడికి ఏమీ ఇచ్చేవాడు కాదు. ఆ విధంగా లక్ష్మణుడు ఉపవాసం ఉండేవాడు. ఆదిశేషుడైన సౌమిత్రి నిరంతరం ధనుర్బాణాలు ధరించి సావధానుడై నిద్రాహారాలు మాని, నిర్మలమైన మిత్రుడిలా భక్తితో పర్ణకుటీరానికి ద్వారపాలకుడిలా ఉదాత్తమైన సేవ చేసేవాడు. రఘునాథుడు పంచవటిలో నెలకొన్న విషయం భిల్లజాతి స్త్రీలు తెలుసుకుని ఆయన దర్శనార్థం బయలుదేరారు. అయోధ్యారాముడి కీర్తి వినడమేకాని చూడలేదు. ఏకపత్ని ఏకబాణం అనే సూత్రం గల మహనీయుడు, శత్రు మద పీడకుడు, సీతానాథుడు, నిరంజనుడు, అవతార పురుషుడు, శ్రుతులకు సైతం అవర్ణనీయుడు, పూర్ణకాముడు, శ్యామలవర్ణుడైన పరబ్రహ్మ ఏ విధంగా ఉంటాడోననే



ఉత్సాహంతో భిల్ల స్త్రీలు మంచి ఫలాలతో రాముని స్తుతిస్తూ వచ్చారు. చరణరజం వల్ల అహల్యను తరింపజేసిన వాడు, దశకంఠుని దర్పమడంచిన వాడు, యాగ సంరక్షకుడు, యాగభోక్త, ఎవరి నామస్మరణతో నీలకంఠుడు శీతలుడయ్యాడో, అటువంటి శ్రీరాముడు వచ్చిన వైనం ఎరిగి పూర్వ పుణ్యం వల్ల పరబ్రహ్మ సందర్శనం ప్రాప్తించిందని, తమ జన్మ సఫలం చేసుకునేందుకు పంచభూతాత్మకమైన పంచవటిని చేరి ఆ సృష్టికర్తకు సాష్టాంగ ప్రణామం చేశారు. ఫలాలను సమర్పించారు. వారి భక్తి శ్రద్ధలు చూచి సీతారాములు ఆ ఫలాలను భక్షించారు. ఆ భిల్లులు నిత్యం వారికి ఫలాలను సమర్పించేవారు. కొంతమంది దీనిని విపరీతంగా వ్యాఖ్యానించి సీతారాములు ఎంగిలి పండ్లు తిన్నారనేవాళ్ళు. కానీ, భిల్లజాతి వారు మాత్రం మంచి ఫలాలనే ఏరి రామునికి సమర్పించేవారు. నిజం తెలియక నిందలు మోపేవారికి ఆచంద్రార్కం సద్గతి ఉండదు.

శ్రీరామవిజయం యథార్థంగా అమృతవృక్షం. దీని ఫలాలు రామభక్తులు ప్రీతితో ఎల్లవేళలా భక్షిస్తారు. బ్రహ్మానందా! జగదుద్ధారకా! పంచవటి నివాసా! శ్రీధరవరా! ఆదిపురుషా! నిర్వికారా! అచలా! అభంగా! అక్షయా! నీకు జయము జయము!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**పదమూడవ అధ్యాయం మధురం**

## అధ్యాయము - 14

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

శశాంకుని చూచి సాగరం పొంగి పొరలినట్లు, సాదరంగా శ్రీరామకథ విన్న శ్రోతల హృదయాలలో సుఖసాగరం ఉప్పొంగుతుంది. సూర్యోదయంతో కమలం వికసించినట్లు, దరిద్రునికి ధనం లభించినట్లు, సద్గురువనే మేఘం వర్షిస్తే శిష్యుడు చాతకపక్షిలా స్వానందజలాలలో మునిగి తేలుతాడు. మండే అడవిపైన మేఘం వర్షించినట్లు, వసంత కాలంలో మోడువారిన కొమ్మలు చిగురించినట్లు, ఈ కథ వింటే దుఃఖతప్తులైన శ్రోతలకు సుఖం లభిస్తుంది. ఏ రామకథను విని కైలాసనాథుడు పరవశించిపోయాడో, పార్వతీసమేతుడై ప్రేమతో ఏ రామకథను హృదయాన ధరించాడో, ఏది మోక్షతరువుకు బీజమో, ఏది భవసాగరాన్ని దాటించే తారకనౌకయో, ఏది అజ్ఞానతిమిరానికి ప్రకాశమో, అటువంటి జ్యోతిని వాల్మీకిమహర్షి ప్రకాశింపజేసాడు. ఈ కథ అజ్ఞానారణ్యాన్ని దగ్ధంచేసే అగ్నివంటిది, మహాలక్ష్మివలె సుందరమైనది, మనోరథ కల్పలతలకు ఆనందజలధివంటిది. ఈ కథ పుణ్య, వైరాగ్యాల గని. ధర్మార్థ, కామ, మోక్షాలకు పుట్టినిల్లు, ఆకాశగంగలా తత్‌క్షణం పాపతాపాలను హరింపజేస్తుంది.

### శంబరుని మరణం

అటువంటి పరమపావనమైన రామకథను పండితులైన మీరు శ్రవణం చేయండి. పదమూడవ అధ్యాయంలో కథాక్రమాన్ననుసరించి రఘునందనుడు పంచవటికి చేరాడు. పదితలల రావణుని గర్వభంగం చేసినవాడు, సూర్యకులభూషణుడు, భూజాత ప్రాణనాథుడు అయిన రఘురాముడు పంచవటిలో వసించాడు. అరివీరులకు సింహస్వప్నంగా ఆదిశేషుని అవతారమైన లక్ష్మణుడు రసవంతమైన తాజా ఫలాలను అరణ్యం నుండి



తెచ్చేవాడు. ఇలా ఉండగా ఒకరోజు అరణ్యంలో లక్ష్మణుడు ఆకాశాన్నంటుతున్న వెదురు పొదలు గల ప్రదేశాన్ని చూశాడు. అక్కడ దశకంఠుని మేనల్లుడైన శంబరుడు కాలశస్త్రప్రాప్తి కోసం ఈశ్వరుని ఆరాధిస్తూ అరవై వేల సంవత్సరాలనుండి ఎవరికంటా పడకుండా దారుణమైన తపస్సు చేస్తున్నాడు. మిట్టమధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా కాలఖడ్గం ఆకాశంనుండి దిగుతూ సుమిత్రాసుతుని చూసి ఆ శస్త్రదేవత తన మనస్సులో, 'నేను ఆ శంబరుడి హస్తగతం కాను. ఈ సుమిత్రాసుతుని శరణు వేడుతాను. అతడే ఈ శంబరుని బారినుండి నన్ను రక్షించగలడ'ని తలపోసింది. అయాచితంగా చింతామణి భాగ్యవంతునికి లభించినట్లు కాలశస్త్రం లక్ష్మణుని దరిచేరింది. లక్ష్మణుడు ఆ శస్త్రాన్ని గైకొని 'త్రినేత్రుడు ఎంతో దయాళువు' అని పరవశుడయ్యాడు. ఊర్మిళా ప్రాణనాథుడైన లక్ష్మణుడు ఆ కాలశస్త్రాన్ని వస్త్రంతో శుభ్రపరచి అమోఘమైన దాని ప్రతాపం పరీక్షించాలనుకున్నాడు. భూమిని అవలీలగా లేవనెత్తగల ఆదిశేషుడి అవతారమైన లక్ష్మణుడు తన బలాన్నంతా ఉపయోగించి, ఆ ఖడ్గంతో వెదుళ్ళను నరకసాగాడు. ఆ ఖడ్గం శంబరుడికి తగలగానే వాడు రెండుముక్కలైనాడు. రక్తం వరదలా ప్రవహించసాగింది. ఎవరో విప్రుని తెలియక సంహరించానేమోనని లక్ష్మణుడు ఆందోళన చెందాడు. తపస్విని వధిస్తే కోమల హృదయుడైన రఘురాముడు కోపిస్తాడని చింతాక్రాంతుడైనాడు సౌమిత్రి.

ఇదిలా ఉండగా కుటీరంలో జానకి మధ్యాహ్నవేళ దాటిందే సౌమిత్రి ఇంకా రాలేదేమా అని ఎదురుచూస్తుండగా కుటీరాన్ని సమీపిస్తున్న లక్ష్మణుడు శస్త్రంతో రావడం గమనించి, ప్రాణనాథునితో 'స్వామీ! ఈ రోజు లక్ష్మణుడు విచారవదనుడై పరధ్యానంగా నడుస్తున్నాడు. మీరు సర్వసాక్షి. పూర్ణచైతన్యఘనులు. అందరి ఆంతర్యం బాగా ఎరిగినవారు' అని అంది. ఇంతలో మహావీరుడైన లక్ష్మణుడు రఘుపతి ముంగిట శస్త్రాన్ని ఉంచి

రెండుచేతులూ జోడించి విషయాన్నంతా నివేదించాడు. 'అయోధ్యాధీశా! సమర్థా! అకస్మాత్తుగా ఈ ఖడ్గం చేతిలో పడింది. దీనితో వెదుళ్ళను నరకుతుండగా ఒక తపస్వి హతుడయ్యాడు' అని చెప్పాడు. అప్పుడు జనకజామాత నగుమోముతో 'లక్ష్మణా! నిజానికి అతడు బ్రాహ్మణుడు కాదు. రావణాసురుని మేనల్లుడు. శూర్పణఖ కొడుకు. అతడు చాలారోజులు ఈశ్వరుని తపస్సు చేసి కాలఖడ్గం చేతికి రాగానే ఇంద్రాది దేవతలనందరినీ యుద్ధంలో ఓడించి, అజేయుడిగా ఉండాలని తలచాడు. నువ్వు ఎవరి చావుని గూర్చి బాధపడుతున్నావో, అనర్థ కారకుడైన ఆ రాక్షసుని చంపింది ఈశ్వరుడే! పాముపుట్టను పడగొట్టబోతే మహాసర్పం కాటేసినట్లు, మండే గోళాన్ని పట్టుకుంటే చేయి కాలినట్లు, ఎవరు చేసిన కర్మఫలితం వారు అనుభవిస్తారు. ఇక ఆలస్యం చేయక సీతారక్షణ కోసం జరుగబోయే మహాయుద్ధానికి ఇప్పటినుండే సంసిద్ధులం కావాలి. రాక్షసమాయలు పలువిధాలు. బ్రహ్మాదులకే అవి అర్థం కావు. కాలఖడ్గం మనచేతికి వచ్చింది. జరిగిందంతా మన మంచికే' అని విపులీకరించగా, సౌమిత్రి మనస్సు కుదుటపడింది.

### శూర్పణఖ పుత్రశోకం

ఆ రాత్రి రావణుని చెల్లెలు, శంబరుని తల్లి అయిన శూర్పణఖ ఒక దుస్స్వప్నంతో మేల్కొని, కుమారునికి ఏదైనా జరిగిందేమోనని కంగారుపడి, నలుగురు రక్కసులను వెంటబెట్టుకుని తెల్లవారుఝామున బయలుదేరింది. శంబరుడున్న ద్వీపాన్ని చేరి వెదికింది. తన కుమారుని కోసం వెదురుపొదలలో వెదుకుతుండగా రాబందుల సమూహం కంటబడింది. బీభత్సంగా ఉన్న ఆ ప్రదేశానికి వెళ్ళి చూడగా తన పుత్రుడు రెండు ముక్కలుగా నేలపై పడి ఉన్నాడు. రక్తం ఏకధారగా కారిపోతోంది. ఎలా చనిపోయాడు అంటూ పెద్దపెద్దగా రంకెలు వేస్తూ భూమిపైబడి దొర్లసాగింది. నీటి నుండి బయటపడ్డ మీనంలా మితిమీరిన శోకంతో గుండెలు బాదుకుంది. చెలులంతా ఆమెను



సావధానురాలను చేయగా, తన సహచరులతో, 'ఈ వనంలో ఎవరు నా కుమారుని చంపి ఉంటారు?' అని అంటుండగా, సమీపంలో మానవుల పాదముద్రలను గమనించి విస్మయం చెందింది. ఒక మానవుని చేతిలో, ఒకే వేటుతో శంబరుని శరీరం రెండు ముక్కలవడం చూచిన ఆ రాక్షసుల ఆశ్చర్యానికి అవధులు లేవు. శంబరుని దహనం చేసి, ఆ రాక్షసి తన పుత్రుని చంపిన వారికోసం వనంలో వెదుకుతుండగా, సూర్యతేజస్కుడైన లక్ష్మణుడు దూరంగా కనిపించాడు. తప్పక వీడే నా బిడ్డ పాలిట యముడయ్యుంటాడనుకుని ఆ రాక్షసి మారువేషంలో అతన్ని సమీపించింది. రంభను మించిన సౌందర్యంతో, నలుగురు చెలికత్తెలు వెంటరాగా, మదనుణ్ణి కూడా పరవశింపజేసేలా దివ్యరూపంతో ప్రకాశిస్తూ శూర్పణఖ అరణ్యంలో సంచరించసాగింది. నలుగురు ఒకరిపైన ఒకరు చేతులు వేసుకొని కాళ్ళకు రత్నఖచితమైన పాదుకలు ధరించి హావభావాలు ప్రదర్శిస్తూ మధురస్వరంతో గానం చేయసాగారు. ఆహ్లాదకారకుడైన చంద్రుని బోలిన ముఖం కల్గిన ఆమె పలికితే ముత్యాలవంటి పలువరుసలు మెరుస్తున్నాయి. గజగమన వలె నడుస్తూ సౌమిత్రిని సమీపించి సిగ్గుతో కళ్ళుదించుకుంది. ప్రక్కనున్న చెలులతో మెల్లగా 'నా కుమారుణ్ణి సంహరించిన వాడు ఈతడే. నేరుగా మాట్లాడి ఆ విషయం తేల్చుకుందాం' అంది.

### శూర్పణఖ సౌమిత్రి దరిచేరడం

కమలం చుట్టూ భ్రమరం ఝుంకారం చేస్తూ తిరుగుతున్నట్లు రామస్మరణ చేస్తూ సౌమిత్రి అడవిలో తిరిగేవాడు. ఆ సమయంలో శూర్పణఖ సౌమిత్రి దరిచేరి కామభావాన్ని ప్రదర్శిస్తూ మధురంగా, 'అతిలోక సుందరా! నేను ఈ భూమండలమంతా చూచాను. కానీ నీవంటి యోగ్యుడు, చతురుడు, ప్రతాపవంతుడు, కుశలుడు, నాకెక్కడా కనబడలేదు. ఈనాటికి నా జన్మ ధన్యమైంది. నా భాగ్యం పండింది. నన్నేలే స్వామి దొరికాడు. నా తపస్సు

ఫలించింది' అంటూ నవరత్నమాలను లక్ష్మణుని మెళ్ళో వేయబోయింది. సత్యశీలుడు, గుణనిధియైన ఆ జానకీరమణుని కృప ఎవరిపట్ల పరిపూర్ణంగా ఉంటుందో వారికి విషయవాసనలందు త్రికాలాలలోనూ మనసు మలినం కాదు. అమృతాన్ని సేవించినవారికి కాలకూట విషంవల్ల బాధ కలుగుతుందా? సూర్యసన్నిధిలో నివసించే వారిని చీకటి బాధిస్తుందా? కల్పవృక్షం పెరట్లో ఉండేవారికి భిక్షాటన అవసరం ఎందుకు కలుగుతుంది? వైకుంఠనాథుని సన్నిధిలో వున్నవారికి భూతప్రేతాలను పూజించవలసిన పని ఏమిటి? ఊర్వశి వంటి భార్య ఉండేవాడు ఎన్నడైనా ఒక ప్రేతాన్ని ఆలింగనం చేసుకుంటాడా? నందనవనంలో చరించే భ్రమరం జిల్లేడు పువ్వుపై వాలుతుందా? అహోరాత్రాలు మకరందం సేవించే మధుపం రసహీన పుష్పంపై నివసించగలదా? శరీరమంతా కస్తూరి లేపనం చేసుకొన్నవానికి కాకిరెట్టపైకి దృష్టిపోతుందా? పాలసముద్రం ఒడ్డున కూర్చున్నవాడు గంజిని ఆశిస్తాడా? నిరాహారియై నిర్వాణ స్థితిలోనున్న ఆదిశేషుని అపరావతారమైన లక్ష్మణుడు శూర్పణఖతో, 'ఓ సుందరీ! నా సోదరుడైన శ్రీరాముడే నాకు తల్లీ, దండ్రీ, గురువు, దైవం. సతీసమేతంగా ఆయన పంచవటిలో ఉన్నాడు. వారే నాకు ఉమామహేశ్వరులు. సర్వం వారే. రఘువీరుడే నా కృపాసింధువు. ఆయన ఆజ్ఞ లేకుండా నాతో సాంగత్యం సంభవించదు. ఆదిశేషుడు భూభారాన్ని దించుకోవడం, దినకరుడు తూర్పున ఉదయించకపోవడం ఎలా అసంభవాలో అలా రామాజ్ఞ లేకుండా నిన్ను వరించడం అసంభవం.' అని అన్నాడు. 'అయితే నన్ను వెంటనే ఆ రాముని వద్దకు తీసుకుపొమ్మని' బతిమాలింది శూర్పణఖ. అవశ్యం– అని లక్ష్మణుడు రామాశ్రమానికి మార్గం చెప్పాడు.

శూర్పణఖ తన నలుగురు సఖులతో ఈ రాత్రికే రాముడు, లక్ష్మణుడు, సీతా ముగ్గురినీ భక్షించి లంకకు వెళ్ళిపోదాం అంది. కార్యసిద్ధికొరకు ఐకమత్యంగా వ్యవహరించి, ఆ వనంలోని బ్రాహ్మణుల నందరినీ భక్షించాలని



అనుకుంటూ వారు పంచవటి చేరారు. సీతారాములకు సాష్టాంగనమస్కారం చేసి శూర్పణఖ, 'ఈ రోజు నా భాగ్యం ఫలించింది. నా స్వామి యొక్క అన్నగారి చరణాలను దర్శించాను. నా స్వామి వదినగారివైన నిన్ను శరణు వేడుతున్నాను. అమ్మా! నేను నీ దగ్గరకు రావచ్చునా? నాతో స్నేహంగా ఉంటావా? బావగారిని త్వరగా ప్రార్థించి నన్ను వివాహం చేసుకొమ్మని తమ్ముడికి లేఖ వ్రాసివ్వమని చెప్పండి. నా ప్రాణనాథుని చరణాలు సుందరమైనవి. కోమలమైనవి. పువ్వులవలె మెత్తని కర కమలములతో ఏకాకిగా అరణ్యంలో తిరుగుతుంటాడు. అన్నగారి ఆజ్ఞలేక వరించనంటున్నాడు. నేను ఆయన వియోగం సహించ లేకున్నాను. విరహంతో ప్రాణం పోతోంది. కళ్ళలో నీరు తిరుగుతున్నాయి. నా భర్తకు నాపై నమ్మకంలేకపోతే ముందు జీవితం గడపలేమని బావకు చెప్పవలసింది. నేను పతివ్రతను, కన్యకుమారిని పరమపవిత్రను, అమ్మా! నేనింతవరకు ఏ పురుషునీ స్పర్శించి ఎరుగను. నా పతి తప్ప ఇతర పురుషులందరూ నాకు అన్నలతో సమానం' అంటూ కన్నుల నీరునిండగా తొందరగా పత్రం రాసివ్వమని కోరింది. సీత సంతోషంగా 'చాలా మంచి ఆలోచన. ఓ రఘురామా! ఈమెకు త్వరగా ఏదో గుర్తునిచ్చి పంపండి! స్వామీ! ఈమె సౌమిత్రికి తగిన భార్య' అని అంది. సర్వాత్మకుడు, చరాచర చిత్త పరీక్షకుడు, మాయా చక్రచాలకుడు, సృష్టి స్థితి లయకారకుడు, జనకజామాతయైన ఆ రాఘవుడు, శూర్పణఖ కనుపాపలు వెనక్కు తిరిగివుండటం గమనించి 'ఈమె నిస్సందేహంగా రాక్షసే! కాపట్యంతో మమ్ము మోసం చేయాలని చూస్తున్నది' అని అనుకున్నాడు.

పూల సంగతి చెట్టుకు బాగా తెలుస్తుంది. మాటలవల్ల మనసు, ఆచరణవల్ల పూర్వజన్మ సంస్కారం, వృత్తినిబట్టి వర్ణాశ్రమం, నడతనుబట్టి పరమార్థం, పలుకునుబట్టి పాండిత్యం, ప్రేమనుబట్టి భక్తి, దానాన్నిబట్టి ఔదార్యం, యుద్ధాన్నిబట్టి శౌర్యం, క్షాత్రలక్షణాలనుబట్టి రాజు, వాసననుబట్టి కొయ్య,

స్వరాన్నిబట్టి కంఠం, మొలకనుబట్టి భూమిసారం, ఇంటి పెరడునుబట్టి గృహస్తు స్థితి, భూతదయనుబట్టి బ్రహ్మజ్ఞానం, కాంతినిబట్టి రత్నాన్నీ తెలుసుకోవచ్చు.

### శూర్పణఖ భంగపాటు

సరి! ఇదిలా ఉండనీ! లోపల కుటిలత్వం, పైకి మృదుభాషణ చేస్తున్నా, కమలంలా విరాజిల్లుతూ మాటలు చందనానికన్నా శీతలంగా ఉన్నా ఆంతర్యంలో అంతా మోసమేనని చతురుడైన శ్రీరాముడు గమనించాడు. అప్పుడు శ్రీరాముడు 'నీవు తొందరపడుతున్నావు గనుక లగ్నపత్రిక నీ వీపుపై వ్రాయుటకంటే గత్యంతరం లేదు!' అన్నాడు. దాని పర్యవసానం ఎలా వుంటుందోనని ఆ రాక్షసి భయభీత అయింది. ఆమె సీతతో 'అమ్మా! బావగారి ఎదురుగా మాట్లాడాలంటే నాకు చాలా సిగ్గేస్తాంది. ఆయనను నువ్వే ప్రార్థించు. బావగారు చాలా చతురులు, యుక్తవయస్కులు. నాకు ఆయన ఎదురుగా కూర్చోవాలంటేనే సిగ్గుతో ప్రాణం పోతున్నది.' అంది. కానీ రఘునందనుడు, నీవీపు మీద వ్రాయడం తప్ప ప్రస్తుతానికి వేరే మార్గం ఏమీలేదని ఖండితంగా చెప్పగా శూర్పణఖ విధిలేక అంగీకరించింది. రఘురాముడు వీపుపై వ్రాసి 'నీవు త్వరగా వెళ్ళి సౌమిత్రిని తీసుకునిరా!' అని అన్నాడు. రాముడు ఆ మాటలు అంటుండగానే ఆమె శరవేగంతో వెళ్ళిపోయింది. లక్ష్మణుని దగ్గరకు చేరి మహాసంతోషంగా బావగారు తనను ఎలా గౌరవించింది అక్కడ జరిగిన సంభాషణ మొత్తం చెప్పింది. 'మీ అన్నగారు నన్ను వరించమని నీతో చెప్పమన్నారు. గాంధర్వ లగ్నం నిశ్చయించి, నిన్ను వెంటబెట్టుకొని రమ్మన్నారు!' అని అంది. అప్పుడు లక్ష్మణుడు 'శ్రీరాముని గుర్తుచూడక నేను నిన్ను వరించను, ఇది సత్యం' అని అన్నాడు. ఆమె 'ఇప్పుడు కూడా నన్ను విశ్వసించవా? జన్మజన్మలకు నీవే నా భర్తవు. నేనేగనుక అబద్ధం చెప్పినట్లయితే మళ్ళీ బావగారికి నా మోహం ఎట్లా చూపించేది? నేను వారిని కలిసే ఇక్కడికి వస్తున్నాను. బావగారు నీలమేఘశ్యాములు. మీ వదిన చంపాలత వలె



సుకుమారి, తొందరలో నీకు గుర్తుగా లేఖ వ్రాయడానికి వీలుపడలేదు. ఆయన నిన్ను వరించమని నన్ను కోరారు. నువ్వు శ్రమించి అలసట చెంది వున్నావు. అసలే నీపాదాలు అతికోమలమైనవి. ఇలారా! ఇద్దరం కల్సి కొంతసేపు సుఖంగా శయనిద్దాం' అని విపులంగా చెప్పినా, లక్ష్మణుడు అంగీకరించలేదు. శూర్పణఖ నవ్వి 'నేను ఒక గుర్తు తెచ్చాను. నీ మనస్సు గ్రహించాలని చూపలేదు. ఆ గుర్తు నా వీపుపై ఉంది' అని అంటూ వీపు చూపగా, దానిపై శ్రీరామాజ్ఞ ఇలా ఉంది: 'శూర్పణఖ రావణుని చెల్లెలు. పెళ్ళికూతురిలా సింగారించుకున్న ఈమె ముక్కు, చెవులు కోసి, అమంగళంగా లంకకు పంపు. స్త్రీవధ చేయకూడదు సుమా! అందుచేత దీని ప్రాణాన్ని మాత్రం తీయకు!' లక్ష్మణుడు ఆ సందేశాన్ని చదివి శూర్పణఖతో ఏకాంతానికి వెళ్దామన్నాడు. చెలికత్తెలు నలుగురు దూరంగాపోగానే నిశాచరి, పాపఖనియైన శూర్పణఖ జడపట్టుకొని నేలమీదకు తోయగా, ఆమె 'ఓ ప్రాణనాథా! ఆ పనికి నేను ఎప్పుడూ సిద్ధమే. ఎందుకు ఇలా తొందరపడుతున్నావు. నీ తీరు నాకు వింతగా ఉంది!' అని అంది. లక్ష్మణుడు ఒక్క క్షణం కూడా ఆలసించక ఆమె ముక్కు, చెవులు కోశాడు. దానితో ఆ రాక్షసి తన నిజశరీరం ధరించి పెద్దగా ఆక్రందించ సాగింది. అత్యంత భయంకరమైన భారీరూపంతో కపాలంపై కుంకుమ ధరించి ముక్కులనిండా నెత్తురు వరదలై పారుతుండగా, నలుగురు చెలులతో పారిపోతూ, ఎక్కడ లక్ష్మణుని కంట పడతామోననే భయంతో నాలుగు దిక్కులా గమనిస్తూ, ఎటుపోవాలో దిక్కుతోచక భూమిపై పడుతూ లేస్తూ, ముక్కులో నోట్లో మట్టి నిండగా పొలికేకలు పెడుతూ రాక్షసులతో సహా శూర్పణఖ పద్మపురం చేరింది.

### త్రిశిర, ఖర, దూషణసంహారం

మిన్నంటుతున్న ఆ పెడబొబ్బలు విని త్రిశిరుడు, ఖరదూషణులు మొదలైన రాక్షసవీరులు విషయం తెలుసుకుని ఆగ్రహోదగ్రులై చతురంగ బలాలతో

వెంటనే బయలుదేరారు. వారి చేతిలో కత్తి, డాలు, నడుముకు యమదంష్ట్ర వేలాడుతుంది. సర్వాలంకారాలతో శోభిల్లుతూ వారు గొప్ప చిత్రకారుడు గీసిన అద్భుతచిత్రంలా యుద్ధ సన్నద్ధులై వున్నారు. రణరంగంలో అరివీర భయంకరులు కాలునితో సమానమైన ఆ రాక్షసులు సింహనాదాలు చేస్తూ ఒకరి కంటే ముందు మరొకరు పోసాగారు. మదించిన గజబలాల వెంట ఐరావతం యొక్క సంతానమైన శ్వేతవర్ణం, చౌదంతం ఘీంకరిస్తూ పరుగెత్తసాగాయి. దేవాసుర సంగ్రామంలో వాటితో యుద్ధం చేయలేక దేవతల కిరీటాలు క్రింద పడ్డాయి. ఏనుగులపై అధిరోహించి అసురులు శస్త్రాలను సునాయాసంగా ఎక్కుపెట్టగలరు. వాటివెనుక రథాలపై అపారమైన శస్త్రసామగ్రితో పధ్నాలుగువేల మంది మహావీరులైన రాక్షసులు దండయాత్రకు కదిలారు. త్రిశిర, ఖర, దూషణులు ఆ రాక్షస సైన్యానికి నాయకులు. శరీరమంతా రక్తంతో నిండి కుంకుమ పర్వతంలా వున్న శూర్పణఖ వారి సముఖంలో పెద్దగా విలపిస్తూ, సమస్త రాక్షససైన్యాన్నిచూసి 'రఘునాథుడు పంచవటిలో ఉన్నాడు. అతడు నీలమేఘ వర్ణంలో ఉంటాడు. సౌమిత్రి గౌరవర్ణం కల్గిన సుకుమారుడు. సీత రూపం ముందు రతీదేవి అందం కూడా దిగదుడుపే. కానీ లక్ష్మణుడు చాలా మొరటువాడు. అతడి పేరు వింటేనే గొంతులో గుటకపడదు. మీరందరూ కలిసి నాకు వారి రక్తపానం చేయించండి! నా ముక్కు, చెవులు కోసినవాణ్ణి నేను మొత్తంగా మింగేయాలి' అని అన్నది. బీభత్సంగానున్న శూర్పణఖమాటలు విని త్రిశిర, ఖర, దూషణులు నవ్వసాగారు. 'ఆ రఘునందనుడు కేవలం మానవుడు. మనం వాళ్ళ వద్దకు చతురంగబలాలతో పోవడం అల్పత్వం, అవమానమ'ని, పధ్నాలుగుమంది రాక్షసులను శూర్పణఖకు తోడిచ్చి, వారితో 'ఆ రామలక్ష్మణులను చంపి ఈమెకు రక్తపానం చేయించి, తృప్తిపరచండి!' అని ఆదేశించారు. శూర్పణఖ ఆ రాక్షసులతో 'మనం త్వరగా పంచవటికి వెళ్ళి రామలక్ష్మణులను బందీలుగా



ఖరుని వద్దకు తీసుకునివద్దాం!' అని అన్నది. దానికి, 'అవునవును వాళ్ళని ఇక్కడే చంపి మేము మాంసభక్షణ చేస్తాము. నువ్వు రక్తపానం చెయ్యొచ్చు!' అని ఆ రాక్షసులలో ఒకడన్నాడు. సింహం పరోక్షంలో నక్క నిందించినట్లు, పురుగు గరుడుని అరక్షణంలో పట్టుకుంటానన్నట్లు, గడ్డిపోచలన్నీ కలిసి బడబానలాన్ని బంధిస్తామని బెదిరించినట్లు, సూర్యుణ్ణి అవలీలగా త్రోసెయ్యాలని మిణుగురుపురుగు అత్యాశపడ్డట్లు, శలభాలన్నీ కలసి కల్పాంతంలో వచ్చే మెరుపులను మింగివేద్దామనుకున్నట్లు, ఆ రాక్షసులు పరుగు పరుగున పంచవటికి వచ్చారు.

పధ్నాలుగుమంది రాక్షసులు వచ్చారని లక్ష్మణుడు రాముడికి తెలిపాడు. ఆ వార్త విని రవికులభూషణుడు వింటికి నారిని సారించి పర్వత గుహలలో నుండి అకస్మాత్తుగా సింహం లంఘించినట్లు కౌశిక యాగరక్షకుడైన ఆ రఘురాముడు కుటీరం వెలుపలకు వచ్చాడు. రాముడు నరవీర కిశోరం. ఆ గజబలులైన రాక్షసులు దూరాన్నుండి పులిని చూచి లేడి బెదిరినట్లు రామచంద్రుని చూసి, భయంకరంగా కేకలు వేస్తూ దారుణమైన శస్త్రాలు వేయసాగారు. మూర్ఖులకు వాచాలత మెండు. పండితులకు ఒక శబ్దం చాలు. అలా శ్రీరాముడు శత్రువుల శస్త్రాలన్నిటికి కలిపి జవాబుగా తన వింటి నారిని ఆకర్ణం సంధించి సూర్యముఖ బాణాన్ని వదిలాడు. దానితో ఆ పధ్నాలుగు మంది రాక్షసుల శిరస్సులు ఒక్కసారి తెగి నేలమీద పడ్డాయి. సింహం చేతిలో ఏనుగు చచ్చినట్లు, గరుడుని చేతిలో పాములు దారుణంగా చిత్తయినట్లు, ఆ రాక్షసులు ఒక్క దెబ్బతో రాముని చేతిలో హతులయ్యారు. రాముడు రాక్షసులను అంతంచేసే ప్రళయాగ్ని. ఆ అగ్నికి పధ్నాలుగురు రాక్షసులను తోడ్కొని వచ్చి శూర్పణఖ ఆహుతి చేసింది. విషయం గ్రహించి శూర్పణఖ తిరిగి వెనక్కు పారిపోతుండగా, సౌమిత్రి శత్రుశేషం ఉండకూడదంటూ శూర్పణఖ శిరస్సును ఖండించడానికి శరాన్ని ఎక్కుపెట్టాడు. అప్పుడు శ్రీరాముడు 'లక్ష్మణా! దీనిని

నువ్వు చంపవద్దు. ఇది వెళ్ళి వెంటనే మిగతా రాక్షసులందనీ బలి యివ్వడానికి తీసుకొస్తుందిలే!' అని అన్నాడు.

ఇదిలా వుండగా శూర్పణఖ పెద్దగా రంకెలు వేస్తూ ఖరదూషణులతో 'మీరు పంపిన రాక్షసులందరూ హతులయ్యారు. ఇక మీరు త్వరగా కదలిరండి' అంటూ జరిగిందంతా చెప్పగా, అందరూ మూకుమ్మడిగా రణాతురులై పెద్దపెట్టున కేకలు వేస్తూ వాయువేగంతో బయలుదేరారు. ఖరుడు కేవలం ఖరముఖుడే, దూషణుడికి తెల్లటి ముక్కు అది నిస్సందేహంగా పాండురోగమే. అందుకే అతడికి దూషణుడని పేరు వచ్చింది. త్రిశురుడికి మూడు తలలు. ఆపేరుకు అదే కారణం. వాళ్ళతల్లి ముగ్గురికీ తగిన పేర్లు పెట్టింది. ఆ సార్థకనామధేయులు ముగ్గురూ పెద్దగా రణభేరి వాయిస్తూ పంచవటిని సమీపించారు.

దూషణుడికి కఫాలీ, ప్రమాధీ, స్థూలలోచనుడు అనే ముగ్గురు పుత్రులు. వారి ముగ్గురికీ విఘ్న సూచకంగా పెద్ద సుడిగాలి లేచి అందరి కళ్ళూ మట్టితో నిండి పోయినట్లు, రథధ్వజం విరిగిపడ్డట్లు అపశకునాలు గోచరించాయి. రాముడు దూరం నుండి ఆ సైన్యాన్ని చూచి రణాతురుడై దిశాంతాలు, ధరిత్రి దద్దరిల్లేటట్లు సింహనాదం చేశాడు. రఘునందనుడు సౌమిత్రితో 'సీతను జాగ్రత్తగా ఆ పర్వతశిఖరం పైకి తీసుకెళ్ళు. నేను రాక్షసులందరినీ దారుణంగా వధిస్తాను.' అని అన్నాడు. రామునికి నమస్కరించి, ఆజ్ఞగైకొని సీతా సహితంగా లక్ష్మణుడు పర్వతం పైకి బయలుదేరాడు. పర్వత శిఖరంపైనున్న జనకనందిని మూల పీఠనివాసినియైన ఆదిభవానిలాగ, తాను పరశురాముడిలా చేతులు జోడించి అభివాదం చేస్తున్నట్లు లక్ష్మణునికి అనిపించింది.

ఇదిలా వుండగా, ఇక్కడ రఘునందనుడు ధనుస్సుకు నారి సారించి ఆకర్ణాంతం లాగి ఝుంకారం చేయగా అటువైపు రాక్షసులు కర్కశంగా



సింహనాదం చేస్తూ, పురాణపురుషుడు, జగదాత్మయైన అయోధ్యాధీశుని చుట్టుముట్టారు. కళ్ళు మూసి తెరిచేలోగా ఆ రాక్షసులు వాద్యాలహోరుతో భూమిలో నుండి పుట్టుకొచ్చారా అన్నట్లు అసంఖ్యాకంగా పైకొచ్చారు. మృగరాజు వృషభంపై లంఘించినట్లు, ఖగరాజు పాములపైకి దండెత్తినట్లు, రణకర్కశులైన రాక్షస సమూహంపై శ్రీరాముడు దండెత్తాడు. దీపాన్ని శలభాలు ముసురుకున్నట్లు, మహాభుజంగమైన వాసుకిచుట్టూ ఎలుకలు మూగినట్లు, రణరంగధీరుడైన శ్రీరాముని శత్రుసమూహం ఆవరించింది. అగస్త్యుని ఎదుట సాగరంలా, సూర్యుని ముందు అంధకారంలా, పులిముందు మేకలమందలా, కట్టెలుకొట్టేవాని ముందు చెట్టులా, గరుడుని ముందు పాముల్లా, అయోధ్యాధీశుడైన రాముని ముందున్నారు రాక్షసవీరులు. రాక్షస సైన్యం సాగరం ఉప్పొంగినట్లు, భూమిపై ప్రళయం వచ్చినట్లు, మేఘం గర్జించినట్లు, ఆకాశంలో మెరుపులు మెరసినట్లు, పదునైన కత్తులతో శస్త్రాల సమూహంతో సింహనాదం చేస్తూ యుద్ధం చేయడానికి వచ్చారు. ఆ రాక్షసులందరూ 'ఎవరా రఘువీరుడు! ఎక్కడున్నా సరే శూర్పణఖచే రక్తపానం చేయిస్తాం! ముక్కలుముక్కలుగా చేసి మట్టిలో కలిపేస్తాం!' అన్నారు. అంతమందిలో రణరంగ ధీరుడైన రఘురాముడు ఎక్కడున్నాడో ఖచ్చితంగా తెలీలేదు.

పాములమీదికి పక్షీంద్రునిలా ఆ జానకిరాముడు వేసిన బాణాలు చెట్టుపై పక్షి వాలినట్లు ఆ జానకీ రమణుడు ఆవేశంగా వేసిన బాణాలకు రాక్షసుల శిరస్సులు లెక్కలేకుండా కింద పడ్డాయి. ప్రజ్వరిల్లిన అతి ప్రకాశవంతమైన అగ్నిలా, వాసుకి ముఖంలో హాలాహలంలా, సముద్రంలోని బడబానలంలా, మేఘంలోని విద్యుల్లతల ప్రకాశంలా, రాముని తూణీరం నుండి వెలువడే లెక్కలేనన్ని బాణాలకు కొందరికి చేతులు తెగాయి. కొందరికి భుజాలు విరిగాయి. కపటులైన రాక్షసులు రాముని సమీపించి అగ్నిలో పడ్డ కర్పూరంలా ఆహుతై పోతున్నారు. సింహం ముందు నక్క కవ్విస్తూ నృత్యం చేసినట్లు,

బృహస్పతి ముందు మూఢుడు తగుదునమ్మా అని వాదించినట్లు, గంధర్వసభలో గాడిదలు బృందగానం చేసినట్లు, ఆ రాక్షసులు రాముని ఎదుర్కున్నారు. ఒక్క క్షణంలో రఘువీరుడు ఆ రాక్షసుల శిరస్సులను పదునైన బాణాలతో తామర తూండ్లను ఛేదించినట్లు ఛేదించాడు. అది గమనించి యుద్ధంలో నేర్పరి అయిన దూషణుడు మేఘంవలె దట్టంగా బాణాలను కురిపిస్తూ ముందుకు వచ్చాడు. సూర్యుడు పైకి రాగానే నక్షత్రాలు మాయమైనట్లు, అపారమైన అనుతాపం వల్ల పాపప్రక్షాళన గావించబడ్డట్టు, జ్ఞానులవద్ద సాంసారిక దు:ఖాలు మాయమైనట్టు, దూషణుడు వేసిన బాణాలను తృటిలో నిర్వీర్యంచేసి, అశ్వసహితంగా అతని రథాన్ని కూల్చాడు రాముడు. అయినప్పటికీ ఆ రాక్షసుడు తన గద తీసుకొని రామునిపై లంఘించాడు. అప్పుడు రావణుని దర్పమడంచిన శ్రీరాముడు వేగంగా ఒక అర్ధచంద్రబాణాన్ని వదలి దూషణుని చేతులోని గదను ఛేదించాడు. అయితే దూషణుడు వెంటనే వీరభద్రునిచే ప్రసాదించబడిన పరిఘ అనే ఆయుధాన్ని చేబూని పరుగున రాగా, శ్రీరాముడు వాయువునే ఖండించగల ఒక దివ్య బాణాన్ని వదిలాడు. అది పరిఘతో సహా దూషణుడి చేతిని ఖండించి రఘునాథుని వద్ద పడేసింది. వెంటనే సీతాపతి సూర్యముఖ బాణాన్ని తీసి దూషణుడి కంఠానికి గురిచూసి వదలగా, ఒక్క తృటిలో శిరస్సు తెగి దూషణుడు నేలకూలాడు. దూషణుడి పుత్రులు ముగ్గురు మిక్కిలి రణోన్మత్తులు. తండ్రి కోసం ప్రతీకారం తీర్చుకోవడానికి, తద్వారా పురుషార్థాన్ని సాధించడానికి ముగ్గురూ కలిసి రామునిపై దండెత్తారు. సర్పం కలుగులోనికి ప్రవేశించేటప్పుడు సగం బయటే వున్నట్లు ఆ రాక్షసుల దేహాల్లో గుచ్చుకున్న రామబాణాలు సగం బయటున్నాయి. అయినా వారు తమ పట్టు వీడలేదు. నెమలి పురి విప్పినట్లు రాముడు పనసముళ్ళవంటి బాణాలతో అద్భుతమైన ప్రతాపం చూపి ఆ ముగ్గురి శిరస్సులను ఆకాశానికి ఎగరేశాడు. అప్పుడు త్రిశిరుడు తీవ్ర ఆవేశంతో రాముని పైకి వచ్చాడు. రథారూఢుడైన ఆ నిశాచరుడు



రామునిపై అసంఖ్యాకమైన బాణాలు వేయగా రఘురాముడు మేఘాలను గాలి పారద్రోలినట్లు చెల్లాచెదురు చేశాడు. రఘుపతి తీక్ష్ణమైన బాణాలు త్రిశిరుని రథాన్ని ఛేదించాయి. అప్పుడతడు కుమారదత్తమైన శక్తిని, తన శక్తినంతా కూడదీసుకుని రామునిపైకి విసిరేసాడు. కానీ అది రాముని వశమైంది. ఆ శక్తి 'నేను నీ దాసిని!' అంటూ రాముని పాదాలపై పడింది. పదునైన బాణాన్ని సంధించి ఆ అయోధ్యానాథుడు వదలగా దాని తేజస్సు బ్రహ్మద్వారం వరకు ప్రకాశించింది. త్రిశిరుని మూడు తలలు రఘువీరుని బాణంతో ఛేదింపబడ్డాయి. అది గమనించి ఖరుడు రథారూఢుడై అసంఖ్యాకమైన బాణాలను అన్నిదిశలనుండి అతివేగంగా ఒంటరివాడైన శ్రీరామునిపై సంధించగా, రాముడు ఒక్క క్షణంలో ఆ చక్రబంధాన్ని ఛేదించాడు. యోగీశ్వరుడు మాయాజాలాన్ని రూపుమాపినట్లు, సహస్రకిరణుడు చీకటిని పారద్రోలినట్లు, గరుడుడు సర్పకులాన్ని కబళించినట్లు, ఆ బాణసమూహాన్ని శ్రీరాముడు విధ్వంసం చేశాడు. ఎండిన వనాన్ని అగ్ని క్షణంలో భస్మం చేసినట్లు, సుడిగాలి మేఘరాశిని తృటిలో చెల్లాచెదరు చేసినట్లు ఆ బాణసమూహాన్ని రాముడు చీల్చిచెండాడాడు. ఆ యుద్ధంలో ఖరుడు వేసిన బాణాలకు రాముడి శరీరం నుండి అగస్త్యదత్తమైన కవచం చీలిపోయింది. ఆ విపరీతాన్ని చూసి దేవతలు కలవరపడ్డారు. రఘువీరుని క్షేమం గురించి ఆందోళనచెంది, ఖరుడు ఎలా మరణిస్తాడా? అని చింతించసాగారు. సహస్రాక్షునికి కూడా నివారింపనలవికానివి, ప్రళయకాలంలో మెరిసే మెరుపుల్లాంటి శక్తివంతమైన నాలుగు బాణాలను ఖరుడు రామునిపై ప్రయోగించాడు. భూచరులు ఖేచరులు చూస్తూండగా మహాద్భుతంగా ఆ నాలుగు బాణాలు ఒక్కసారిగా బ్రహ్మముఖాలలో నాలుగు వేదాలు ప్రవేశించినట్లు, నాలుగు నదులు ఒక్కసారిగా సాగరంలో కలిసినట్లు ఆనందవనంలోని కమలాలపై నలువైపులా భ్రమరాలు వాలినట్లు, రఘుపతి తూణీరంలోకి చొరబడ్డాయి. అది చూచి

ఖరుడు పిచ్చెక్కినవానివలె రామునిపై కత్తి దూయగా, రాముడు వసిష్ఠదత్తమైన ఒక అమోఘాస్త్రాన్ని వదిలాడు. ఆ దివ్యాస్త్రం ఖరుని శిరస్సును ఛేదించి వెంటనే తిరిగివచ్చి శ్రీరాముని తూణీరంలో ప్రవేశించింది. రఘునందుని విజయంచూచి దేవతలు పుష్పవర్షం కురిపించి, రఘురాముని యథాశక్తిగా పూజించారు. విచిత్రమేమంటే పధ్నాలుగువేల మంది రాక్షసులలో ఒక్కడూ మిగలలేదు. రణంలో రఘురాముడు ఒక్కడే విజయం సాధించాడు. దీన్నంతా సీత, సౌమిత్రి కొండపై నుండి అవలోకిస్తున్నారు. మహాప్రళయంలో సర్వమూ నశించిన తర్వాత ఒక్క పరబ్రహ్మం మాత్రమే మిగిలివున్నట్లు, పదునాలుగు వేలమంది రాక్షసులూ నశించగా, శ్రీరాముడొక్కడే రణరంగంలో విరాజిల్లాడు. కర్మజాలమంతా నశించి నివృత్తిలో యోగులు నిశ్చలంగా ఉన్నట్లు తమాలనీలుడైన శ్రీరాముడు ఒక్కడే రణరంగంలో తేజరిల్లాడు. నక్షత్రాలన్నిటిని మింగేసి సూర్యుడు ఒక్కడే ప్రకాశించినట్లు ఆ సీతామానసచోరుడు ప్రకాశించాడు. ఎన్ని కట్టెలు అగ్నిలో వేసినా ప్రకాశం ఒక్కటే అయినట్లు, రాఘవుడు విరాజిల్లాడు. శబ్దధ్వని ఆగిన తర్వాత అర్థం ఒక్కటే మనస్సులో ఇమిడినట్లు, జడత్వాన్ని వదలిపెట్టి జలం నిర్మలంగా పారినట్లు, దహనాన్ని వదిలి తేజస్సు సమూలంగ ప్రకాశరూపం పొందినట్లు, గాలి చంచలత్వాన్ని వదలి ఒకే సంపూర్ణ పవనంగా మారినట్లు, శూన్యాన్ని విడిచి ఆకాశం సర్వవ్యాపకమైనట్లు, శబ్దజాలమంతా నశించిన తర్వాత వేదస్వరూపుడు సమాధిస్థుడైనట్లు, అసురులను సంహరించిన శ్రీరాముడు అద్వితీయుడై నిలిచాడు. కామక్రోధ మత్సరాలే త్రిశిర, ఖరదూషణులు. వాటిని నాశనం చేసి శ్రీరాముడు తన భక్తులను ఆనందింపజేశాడు. దుర్వాసనే శూర్పణఖ. రామసఖుడైన లక్ష్మణుడు దాన్ని విరక్తి అనే అస్త్రంతో ముక్కులేనిదిగా చేశాడు. ఆశ మనిషి కల్పన. కామంపై కోరిక మాయ కలిగిస్తుంది. అందువల్లనే ఆ రాక్షసి లక్ష్మణుని వెంటబడింది. చెత్తనంతా ఊడ్చిన తర్వాత మందిరం శు



భ్రంగా ఉన్నట్లు, గోదావరీ తీరంలోని దండకారణ్యం రాక్షసరహితమయింది. స్థూలలింగ కారణ దేహాలు నశించిన వెనుక శుద్ధజ్ఞానం ఉదయించినట్లు, రాక్షస సంహారానంతరం జనస్థానంలోని బ్రాహ్మణులు సుఖంగా జీవించడం మొదలు పెట్టారు. బ్రాహ్మణులు చంపేస్తారని భయపడి శూర్పణఖ రాక్షస స్త్రీలను వెంటబెట్టుకొని పెద్దగా కేకలువేస్తూ లంకకు పారిపోయింది. రావణుని సేవకులు శూర్పణఖ ముక్కులేనితనాన్ని గూర్చి రావణునికి తెలిపారు. శూర్పణఖ లంకచేరి పెద్దగా రంకెలు వేయసాగింది. రావణుడు ఆమెను ఏకాంతంగా పిలిచి ఏం జరిగిందని అడిగాడు. అప్పుడు ఆమె, 'రామలక్ష్మణులనేవారు జనస్థానానికి వచ్చారు. వారిలో లక్ష్మణుడు నీ చెల్లెలినైన నన్ను ఇలా ముక్కుకోసి గౌరవించాడు. త్రిశిరుని, ఖరదూషణులను సమరరంగంలో పరివార సహితంగా వధించారు, శంబరుని వధించారు. జపతప యాగవ్రతాదులు ఆచరిస్తూ సన్మార్గంలో చరించే సౌమిత్రికి కాలఖడ్గం వశమైంది. గోదావరీ తీరాన జనస్థానంలోని బ్రాహ్మణులు నిరాటంకంగా వేదాధ్యయనం చేస్తూ ఎలాంటి భయం లేకుండా హాయిగా వున్నారు. నీ గుండెల మీద పడ్డ ధనుస్సును రాముడు క్షణంలో విరిచాడు. అక్కడ రాజులందరూ చూస్తుండగా నీకు తలవంపులయింది. సీత నిజంగా పెళ్ళికూతురులాగా ఉంటుంది. ఆమె సౌందర్యం చూచి వనచరాలు కూడా మైమరచి పోతున్నాయి. ఆనాడు స్వయంవర మండపంలో నీ చేతుల్లో నుండి తప్పించుకున్న సీత ఇప్పుడు ఇక్కడికి వచ్చింది. నీకేగనక పౌరుషం ఉంటే సీతను వెంటనే ఇక్కడకు తీసుకురా!' అని ఇంకా ఏమేమో రావణుని రెచ్చగొడుతూ మాట్లాడింది. 'నీకు ఒక ఉపాయాన్ని సూచిస్తాను. మేనల్లుడైన మారీచుని అందమైన లేడివేషంలో అక్కడకి పంపు. వెంటనే దాన్ని వధించడానికి శ్రీరాముడు బయలుదేరుతాడు. అప్పుడు నువ్వు దివ్యరత్నమైన జానకీదేవిని అపహరించుకుని రా!' అని రావణునికి సలహా ఇచ్చింది.

ఇదిలా ఉండగా ఇక్కడ లక్ష్మణుడు, సీత పర్వత శిఖరాన్నుండి దిగారు. సీత గద్గద స్వరంతో రాముని చరణాలపై వ్రాలి 'వేదశాస్త్రాలకు కూడా తర్కింపనలవికాని లీలను నాకు చూపించారు! మీ రౌద్రాకారాన్ని చూచి ఎవ్వరూ మీ బాణాన్ని నిరోధించలేక పోయారు!' అని అన్నది. ఇంతలో ఋషులందరు పరుగున వచ్చి శ్రీరాముని పరివేష్టించారు. 'కౌసల్యాగర్భరత్నా! మేఘశ్యామా! శతపత్రనయనా! కమల లోచనా! తాటకాంతకా! భవమోచనా! భవహృదయా!' అని ఋషీశ్వరులు జయజయ ధ్వానాలు చేశారు. పూర్ణ బ్రహ్మానందుడైన రఘువీరుడు, సరయూతీరవిహారి, శ్రీధరుడు నిర్విఘ్నంగా విజయం సాధించాడు. స్వస్తి.

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆదరంతో తిలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**పదునాలుగవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 15

## శ్రీగణేశాయ నమః  శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**భ**వాబ్ధి పరమ భయంకరమైనది. ద్వైత భావాలే దాని తీరాలు. అది కుబుద్ధిచే కల్లోలితమై పరమ భయంకరంగా పొంగిపొర్లుతోంది. ఆశ, తృష్ణ, భ్రాంతి అనే సుడిగుండాలతో అది నిండి వుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే మొసళ్ళు అందులో తిరుగుతుంటాయి. మమతాద్వేషాలనే అతి దుస్తరమైన అలలతో అది కూడుకున్నది. దంభము, అహంకారములనే నీటిపాములు అందులో నాట్యమాడుతున్నాయి. అవివేకమే అందులోని పీతలు. అవిద్యాభ్రాంతియే అందులోని జలదేవత. ముల్లోకాలలోని జీవులందరిని ఇచ్ఛ, మమత, కల్పనలు పీడిస్తున్నాయి. ఈ సంసారమనే సముద్రం ఎంతో అగాధమైనది. రామకథ అనే సుందరనావయే దానిని దాటించగలదు. దాని శిల్పకారుడు వాల్మీకి మహర్షి. ఆయన దానిని రచించి భవాబ్ధి నుండి తరించాడు.

గ్రంథాలన్నీ సుందరమైనవి. వాటి ఫలాలు చాలా మహనీయమైనవి. అవి వివేకాన్ని, సమగ్రంగా అభేదత్వాన్ని బోధిస్తాయి. సాహిత్యం కర్కశమైనది. నానావిధాలైన దృష్టాంతాలతో ప్రకటమయ్యే రమ్యపదాల ద్వారా దానిలోని అర్థం మెల్లమెల్లగా అవగతమౌతుంది. అందరూ అర్థరసాస్వాదనలో మునిగి తేలుతుంటారు.

సువిశాలమైన రామకథ అనే నావపై రామప్రతాపమనే ఎత్తైన స్తంభానికి కీర్తి పతాకమనే తెరచాప ఎగురుతున్నది. అందులోని ఏడుకాండలు ఆ నావలోని ఏడుభాగాలు. వాటిని చక్కగా తెలుసుకొనగోరే వారందరినీ భావ ప్రభంజనంలో ముంచెత్తి నిజబోధతో కర్ణపుటాలను నింపివేస్తాయి. ఎవరైతే పూర్వ పుణ్యంవల్ల

యీ అద్భుత గ్రంథనావలో ఆసీనులౌతారో వారికి భక్తి, జ్ఞానవైరాగ్యాలు అనాయాసంగా అబ్బుతాయి. ఈ రామకథానావలోని యంత్రాలన్నీ రామనామ ఘోషతో దద్దరిల్లుతుంటాయి. ఆ శబ్దానికి జలచరాలన్నీ భయంతో పారిపోతాయి. కల్లోల భరితమైన భవసాగరాన్నుండి తరించాలంటే అపారమైన గురుకృపను పొందాలి. దాంతో మోక్షమనే ద్వీపాంతరానికి అవలీలగా చేరవచ్చు. కనుక, సజ్జనులైన శ్రోతలందరూ ఈ నావపై కూర్చుని భవసాగరాన్ని దాటి నివృత్తితీరం చేరండి!

పూర్వం పద్నాలుగవ అధ్యాయంలో త్రిశిర, ఖర, దూషణుల వధ, ఈ వార్తను శూర్పణఖ దశకంఠునికి నివేదించడం చూచాం. సద్భక్తులను స్తుతిస్తే దుర్జనులు క్షోభిల్లినట్లు, పతివ్రతలా జీవించాలని జారిణి కష్టాలు కొని తెచ్చుకున్నట్లు, సింహగర్జన విని ఏనుగు వణికిపోయినట్లు, అపారమైన విష్ణుమహిమను విని దైత్యులు క్రుద్ధులయినట్లు, అమోఘమైన శ్రీరామ ప్రతాపాన్ని విని లంకానాథుడు చింతాక్రాంతుడయి మారీచ గృహంలో ప్రవేశించాడు. మారీచుడు సగౌరవంగా రావణుని ఉచితాసనంపై కూర్చుండబెట్టాడు. కుశలప్రశ్నల అనంతరం రావణుడు, మారీచునితో 'రఘునందనుడు పంచవటికి వచ్చాడు. త్రిశిర, ఖర, దూషణులను సంహరించాడు. శూర్పణఖను అవమానించి శంబరుని హతమార్చాడు. శత్రువు చిన్నవాడు కాదు. పాము, నిప్పులాంటివాడు. క్షణంలో ప్రాణం తీయగలడు. చాలా అప్రమత్తంగా ఉండాలి. జింక వేషం ధరించి నీవు పంచవటికి వెళ్ళి రాఘవుని మరపించి, దూరంగా తీసుకెళ్ళు. ఆ తర్వాత నేను సీతను తీసుకుని వస్తాను. ఈ కార్యం నీవల్లనే అవుతుంది. చాలాకాలం తర్వాత అడుగుతున్నాను. నా మాటలు గౌరవించు' అన్నాడు. మూఢుని వాచాలత్వాన్ని పండితుడు వెంటనే అరికట్టినట్లు మారీచుడు రావణునితో ఇలా అన్నాడు.



## రావణునికి మారీచుని బోధ

'పూర్వం యాగరక్షణ సందర్భంలో సుబాహుని చంపిన బాణ వేగానికి ఎగిరి సముద్రంలో పడ్డాను. ఇరవై కోట్లమంది రాక్షసులు హతమయ్యారు' అని రాముని ప్రతాపాన్ని తలచుకుంటూ మారీచుడు మూర్ఛపోయాడు. అప్పుడు రావణుడు అతనికి సపర్యలు చేసి మేల్కొలిపాడు. మారీచుడు రావణునితో ఇలా అన్నాడు. 'పరస్త్రీని అభిలషించడం నీ ప్రాణానికి ముప్పు తెచ్చుకోవడమే. ఇది ముమ్మాటికీ సత్యం. సద్వివేకాన్ని హృదయాన నింపుకో. అనుచిత కర్మలను మనసులోకి రానీయవద్దు. సద్గురువు చెప్పిన ఈ మాటలను తప్పక హృదయగతం చేసుకో. ఎవ్వరినీ హేళన చేయవద్దు. ఎన్నడూ దుర్భాషలాడవద్దు. ఇతరుల కష్టాన్ని గమనించి పరోపకారం చెయ్యి. వేదశాస్త్రాలు ఘోషిస్తున్నట్లు సకల ప్రాణుల్లో వుండే దేవుడొక్కడే! అందుచేత ఎవ్వరినీ ద్వేషించవద్దు. దానివల్ల పరమార్థాన్ని తప్పక సాధిస్తావు. ఈ శరీరం క్షణభంగురం. బలాబలాల విచారం చెయ్యి. నేను జ్ఞానిని అనే అహంకారం కూడదు. కామ, క్రోధ, మద, మాత్సర్యాలనే శత్రువులను అవశ్యం జయించాలి. ఓ రావణా! నీవు ఎంతో జ్ఞానసంపన్నుడవు. త్వరగా రఘువీరునితో స్నేహం చెయ్యి. ఆ ధనుర్ధారితో స్నేహం చేస్తే సుఖానికి లోటుండదు. ఆచంద్రతారార్కం నీవు ఆనందం అనుభవిస్తావు. రాముడు మానవోన్నతుడు. సాక్షాత్తూ ఆదినారాయణుడు. సీతా స్వయంవరంలో నీ గుండెలపై ధనుస్సు పడ్డ విషయం జ్ఞాపకంలేదా! ఆనాడు ఆ రాముడే ఆ విల్లును ఎత్తి, ఆ శివధనుస్సును విరిచి, పోయే నీ ప్రాణాన్ని కాపాడి నీకు ప్రాణదానం చేశాడు. నీవు అటువంటి ఫలమనుభవించి, ఉపకారం చేసిన వానికి అపకారం చెయ్యడానికి పూనుకుంటావా! అమృతపానం చేయించిన వానికి విషాన్ని తాగించినట్లు, ఎవరైతే రణరంగంలో నిశ్శేషంగా మిగిలిపోయాడో వాని గృహానికి అసూయతో నిప్పంటించినట్లు, మనలను రక్షించినవాడికి ఆపదలు కొనితేవడానికి యత్నించకూడదు. నిద్రిస్తున్న

పాషాణంతో వైరం కొనితెచ్చుకోవడం ఎందుకు? మునిగిపోయే నౌక నుండి పైకి తెచ్చినవారు, మండే గృహంనుండి బయటపడేసినవారు, శిరశ్ఛేదన చెయ్యబోయి వదిలివేసినవారు, పితృసమానులని వేదాలు వల్లిస్తున్నాయి. అలాగే ఓ దశకంఠా! నీవు మంచి బుద్ధిమంతుడవు. రామునితో విరోధం తగదు. రాముడు కేవలం బ్రహ్మానందమే. అతడే ఆనందకందుడైన జగద్గురువు. నీ స్వామియైన శంకరుడు కూడా నిరంతరం సాదరంగా రాముని భజిస్తాడు. అటువంటి రాముని భార్యను నీవు పామరుడవై బలాత్కారంగా తేవాలనుకుంటున్నావా?' అంటూ మేనల్లుడైన మారీచుడు అమృతం వంటి మధురభావంతో కూడిన వివేక వైరాగ్య రత్నాలను రావణుని కందించాడు. పరమ మందమతి, కుత్సితుడు, మహామూర్ఖుడు, అయినవానికి పరీక్ష పెట్టినట్లు, రోగిష్టివాడిముందు అన్నం పెట్టినట్లు మారీచుడు చెప్పినదంతా వ్యర్థమయింది.

యజ్ఞం ముగిసాక ఆహుతి సమర్పించినట్లు, పెంటకుప్పపై అమృతం చిలికించినట్లు, మద్యపానంలో ఉన్మత్తుడైనవానికి పరమార్థం బోధించినట్లు – అంతా బూడిదలో పోసిన పన్నీరయ్యింది. మారీచుడు పలికిన సాధు వాక్యాలకు రావణుడు పరమ క్రుద్ధుడై, తీక్ష్ణ స్వరంతో, 'నా ప్రతాపం ముందు కేవలం మానవుడైన ఆ రాముడెంత? రణరంగంలో నేను దేవతల ఎముకలను పిప్పి చేసినపుడు నీవు చూడలేదా? ఆతడి ప్రతాపాన్ని కీర్తించినందుకు నిన్ను వధించక తప్పదు!' అంటూ శస్త్రాలను చేతికి తీసుకున్నాడు. మనస్సులో రావణుని అసహ్యించుకుంటూ మారీచుడు, 'వీడు అధముడు. పరమ దుర్జనుడు. నేను జింక వేషం ధరించి రాఘవేంద్రుని శరణుగోరతాను. రామబాణంవల్ల మరణించినా అఖండానందం ప్రాప్తిస్తుంది. వీడిచేతిలో చనిపోతే భ్రష్టుడనై అధఃపతనమవుతాను' అని తలపోసి, ఇక మారుమాట్లాడకుండా రావణుని ఆదేశాన్ని పాలించడానికి అంగీకరించాడు.



## మాయామృగం – సీత అపేక్ష

రావణుడు, మారీచుడు రథం మీద వేగంగా పంచవటికి పయనమయ్యారు. వాయువేగంతో జనస్థానానికి చేరారు. రావణుడు వనంలో రహస్యంగా పొంచి ఉండగా, మారీచుడు లేడి వేషం ధరించి అంతర్యంలో రామస్మరణ చేస్తూ ఈనాటికి తన జీవితం ధన్యమైనదని భావించాడు. శ్రీరాముని రూపంపై దృష్టి నిలిపి హృదయంలో పరమ సంతుష్టుడై అంతర్యంలో ఎలాంటి విచారం లేక మెరుస్తున్న దేహంతో పంచవటి చేరాడు మారీచుడు. బంగారు వన్నెతో మెరిసిపోతున్న ఆ లేడిని చూచి రాముడు ధనుస్సును చేబట్టాడు. అనుక్షణం వెనుదిరిగి రాముని అవలోకిస్తున్న ఆ లేడిని చూచి సీత రామునితో ఇలా అంది. 'ఈరోజు వరకు నేను ఇలాంటి లేడిని చూడలేదు. ఇది నిజంగా అంతఃపురాల్లో ఉండవలసిన ఉత్తమ జాతి మృగం. ఓ ప్రాణనాథా! అయోధ్యకు వెళ్ళేటప్పుడు దీనిని మన కూడా తీసుకొనిపోవాలి.' పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసానికిగాను, ఇంక ఆరుమాసాలు మిగిలివున్నాయి. సీత కోరిక అనే నది కర్మజలాలతో ఎగిసిపడుతూ దుఃఖసముద్రంలో కలవడానికి సాగిపోతుంది. జానకి మనసెరిగి మరియు భవిష్యత్తు తెలిసినవాడై ఆ అయోధ్యాధీశుడు సత్వరం ధనుర్బాణాలు గైకొని, బయలుదేరేముందు సౌమిత్రితో ఛిద్రత్నమైన జానకిని జాగరూకుడవై కాపాడుతుండమని హెచ్చరించాడు. రాక్షసులు పరమ కపటులు. అనేక విఘ్నాలు కలిగిస్తారు. నిక్షిప్తమైన నిధికి మహాభుజంగం కాపలా వున్నట్లు, లక్ష్మణుడు సీతను కాపాడటానికి ద్వారపాలన చేయసాగాడు. పార్వతి వద్ద కుమారస్వామివలె, ఇందిర వద్ద గరుడునివలె లక్ష్మణుడు ద్వారం వద్ద రక్షణగా నున్నాడు.

ఇక్కడ రాఘవుడు వాయువేగంతో పారిపోతున్న ఆ లేడిని గౌతమీ తీరం వెంట వెంబడించాడు. ధ్వజ, వజ్ర, రేఖాంకిత – మైన పాదముద్రలు భూమిపై పడుతుండగా ఆ మనోమోహనుడు మనస్సుకంటే వేగంగా పోసాగాడు. బ్రహ్మ,

ఈశ్వరుడు, ఆదిశేషుడు, ఇంద్రుడు దుర్లభమైన ఆ ఇందిరా రమణుని పాద ధూళికై పరితపిస్తుంటారు. ఆ లేడి మర్మాన్ని ఛేదించడానికి రాముడు ఒక దివ్యబాణాన్ని వదిలాడు. అపూర్వమైన ఆ రామబాణం తాకిడికి అది నేలపై పడింది. ఆ రఘువీరుడు సాదరంగా దానిని చూడగా అక్కడ ఒక రాక్షసుని శరీరం పడి ఉంది. శ్రీరామబాణంతో ఆ నిశాచరుడు దివంగతుడైనాడు. ఆశ్చర్యంతో అయోధ్యాధీశుడు రాక్షసులు పరమ కపటులు అంటూ సేద తీర్చుకోవడానికి అశ్వత్థవృక్షం కింద కూర్చున్నాడు.

పంచవటి వద్ద మారువేషంలోనున్న రావణుడు లేచి నిలబడ్డాడు. శాంతి చెంత పరమార్థంలా తపస్వి చెంత శుచిత్వంలా, కుటీర ద్వారంలో లక్ష్మణుడు అప్రమత్తంగా కాపలా ఉన్నాడు. ఇది గమనించి లంకానాథుడు శ్రీరాముని కంఠ స్వరాన్ని అనుసయించి అరణ్యంలో నుండి 'లక్ష్మణా త్వరగారా! త్వరగారా! అని సీతకు వినిపించేలా కేకలు పెట్టాడు. లక్ష్మణా త్వరగా పరుగునరా! అరణ్యంలో రాక్షసులు నన్ను చుట్టుముట్టారు. నేను చాలా ఇబ్బందిలో వున్నాను. నీవు వెను వెంటనే రావలసింది. రణభూమిలో ఒంటరివాడనైన నన్ను రాక్షసులంతా చుట్టుముట్టి ప్రాణం తీస్తున్నారు. వెంటనే ఒక్క ఉదుటున ఇక్కడకు వచ్చేయ్! అంతకంటే నేనేమి చెప్పేది' అని కేకలు వేశాడు. ఆ కేకలు విని జానకి చాలా కలవరపడి, లక్ష్మణునితో 'శ్రీరాముడు అరణ్యంలో దీనాతిదీనంగా కేకలు వేయడం వినలేదా! యుద్ధంలో అన్న, మిత్రుడు సంకట పరిస్థితిలో వుంటే ముసలివానివలె అతని భార్యను చూస్తుంటావా! ఆపత్కాలంలో సత్పుత్రుడు తండ్రిని ఆదుకుంటాడు. ఎక్కువగా శస్త్ర ఘాతాలు తగిలినందువల్ల మీ అన్న రక్షణకై పిలుస్తున్నాడు. సంసార తాపంలో సంతృప్తుడైనవాడికి సాధువులు చెప్పే ఆత్మబోధలు రుచిస్తాయా?' అని జానకి లక్ష్మణుని ఎత్తి పొడిచింది. వినయంగా లక్ష్మణుడు, 'అమ్మా! ఈ మాటలన్నీ కపటమైనవి. చరాచర బీజాలను ఫలింపజేసే కల్పతరువైన రఘునందనుడు సంకటస్థితిలో



పడటం కల్పాంతంలో కూడా సంభవించదు. సూర్యుని ముందు చీకటి నిలువగలదా! చలిజ్వరం అగ్నిని బాధిస్తుందా? ఆ జగద్రక్షకునికి కాలుని వలన, భూతాల వలన బాధ కలుగుతుందా? సాలెపురుగు దారాలు మహాగజాన్ని బంధించగలవా? అలా రఘురాముడు సంకటంలో పడడం అసంభవమ'ని సీతకు నచ్చచెప్పాడు.

లక్ష్మణుని పలుకులు విని సీత మిక్కిలి కుపితయై తీక్ష్ణమైన పదజాలంతో, 'నీ కపట ప్రేమ నాకు తెలిసింది. నీ మనస్సు నాకు పూర్తిగా అర్థమయింది. నామీద కోరికచే నీవు అరణ్యానికి పోవడానికి ఆలస్యం చేస్తున్నావు. రాముని రాక్షసులు అరణ్యంలో వధించిన తరువాత నీవు నన్ను భార్యగా పొందాలని ఆకాంక్షిస్తున్నావు. దుర్మార్గుని ఓర్పుతో సహించి సేవ చేయించుకుంటే ఇలానే వుంటుంది. రామునితో కూడా వుంటూ అరణ్యంలో సమయం చూచి రాముని చంపవలసింది అని నిన్ను కైక పంపించింది. నీవు దాయాదివి. పరమ దుర్జనుడవు. సవతి తమ్ముడివి. కపటివి. నీ మ్లానవదనం మండిపోనూ. నీకు కొంచమైన జ్ఞానం, వైరాగ్యం కలుగదేమీ! అక్కడ రఘుపతి విపరీతమయిన ప్రాణాపాయస్థితిలో వుంటే నీవు నిర్దయుడవై నిర్లిప్తంగా వున్నావు. నీవంటి వాడు ముల్లోకాల్లో కూడా వుండబోడు. నాపై వ్యామోహంతో రాముని మరణాన్ని కోరుకుంటున్నావు' అంటూ ఆ జగన్మాతయైన జానకి వాగ్బాణాలను సౌమిత్రిపై సంధించింది. తీవ్రమైన ఆ వాగస్త్రాల గాయాలు, పర్వతాల వంటి రాళ్ళు శరీరంపై గుచ్చుకొనగా సౌమిత్రికి నోట మాట రాలేదు. ఇది యథార్థంగా చేటుకాలమేనని గ్రహించి లక్ష్మణుడు దుఃఖతప్తుడై, 'ఓ మాతా! జనకనందినీ! ఆ కోదండపాణిని సదా విజయలక్ష్మి వరిస్తుంది. వారికి అరణ్యంలో కష్టం ఎలా కలుగుతుంది? పంచభూతాల సాక్షిగా, నీ తోడుగా, సూర్యుని తోడుగా నేను నిర్దోషినని ప్రమాణం చేస్తున్నాను. వారి కీర్తి ప్రతిష్ఠలు అద్వితీయమైనవి. నేను నీ బిడ్డను, నీవు నా తల్లివి. నా మనస్సులో వున్న భావం ఇది! నీ

దుర్భాషలకు తగిన ఫలితమనుభవిస్తావు. ఆరునెలలు కష్టాలలో చిక్కుకుంటావు. రాముని తిరిగి కలుసుకున్న తరువాత మహా అనర్థం సంభవిస్తుంది' అంటూ లక్ష్మణుడు ద్వారం ముందు ధనుస్సుతో గీత గీసి, 'నీవు ఈ గీతదాటి బయటకు వస్తే అనర్థం కొనితెచ్చుకుంటావని అయోధ్యావాసుడైన రఘురామునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను' అని లక్ష్మణుడు వేగంగా వనంలోకి వెళ్ళిపోయాడు.

రామదర్శనం కాకపోతే ప్రాణత్యాగం చేయాలనే సంకల్పంతో లక్ష్మణుడు ఘోరారణ్యంలో విలపిస్తూ శ్రీరాముని వెదుకుతున్నాడు. శ్రుతుల ఆధారంగా సజ్జనులు స్వస్వరూపం తెలుసుకున్నట్లు, ధ్వజ వజ్రాది చిహ్నాంకితమైన శ్రీరామ పాదముద్రలు ఆధారంగా శ్రీరాముని అన్వేషించసాగాడు. సంసార తాపంతో సంతప్తులై సద్గురు శరణు జొచ్చినట్లు, దప్పిక గొన్నవాడు గంగానదికి పరువెత్తినట్లు, లక్ష్మణుడు వేగంగా అశ్వత్థ వృక్షం చెంత కూర్చుని వున్న మనోమోహనుడూ, శ్యామసుందరుడూ, దేదీప్యమానుడూ, మఖపాలకుడూ అయిన రఘురాముని కలుసుకున్నాడు. కోమలమైన శ్రీరామ వదనాన్ని చూచి లక్ష్మణుడు శోకంతో దీనవదనుడై సాష్టాంగ నమస్కారం చేశాడు. కంఠం గద్గదమైంది. నయనాలు అశ్రు పూరితమయి శ్రీరామ చరణాలను క్షాళనం చేశాయి. సౌమిత్రి రఘువీరుని చూస్తూ తటస్థంగా వుండిపోయాడు. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణుని, 'సీతను వదిలేసి, వనానికి ఎందుకొచ్చావు?' అని అడుగగా, లక్ష్మణుడు స్వామీ! నన్ను త్వరగా సంహరించు. రామ చరణాలవద్ద నా దేహం సమర్పించనీ, అని అర్థించగా, రాముడు మనసారా లక్ష్మణుని ఆలింగనం చేసుకున్నాడు. సౌమిత్రి గద్గదితుడై 'సీత వాగ్బాణాలతో నా సర్వాంగాలను తూట్లు పొడిచింది. నేను పలు విధాలుగా నచ్చ చెప్పినప్పటికీ బయలుదేరక తప్పలేదు' అని విన్నవించగా, వెంటనే ఇద్దరూ కలిసి ఆశ్రమం వైపుకు బయలుదేరారు.



## సీతాపహరణం

ఇక్కడ కథ ఏం జరిగిందో చూడండి. అక్కడ దశకంఠుడు ఏం చేశాడు? అతిథి వేషంలో కపట రూపం ధరించి, మచ్చలేని జానకీ చంద్రమండలంలో రాహువులా ప్రవేశించాడు. సుకుమారమైన లేడిని చూచి ఎగరేసుకొనిపోయే పెద్దపులిలా దురాచారుడు, పాపాత్ముడు అయిన రావణుడు, లక్ష్మణుడు గీసిన గీతకావల అతిథి వేషంలో నిలబడ్డాడు. ఆ రేఖను దాటబోతే ప్రచండమైన దావాగ్ని చెలరేగి శలభానికి కూడా దాటడానికి శక్యం కాలేదు. దాంతో రావణుడు భయాక్రాంతుడై, నిర్మలమైన, నిశ్శంకయైన జానకి ముందు, మహేశుని ఎదుట మశకంలా నిలబడ్డాడు. ఇంద్రుని ఎదుట బిచ్చగాడిలా, జ్ఞాని సమక్షంలో మహామూర్ఖునిలా, కేసరి ముంగిట జంబుకంలా, సూర్యునిముందు మిణుగురు పురుగులా, అగ్నిముందు శలభంలా, గరుడుడి ముందు పాములా, రాజహంస ఎదుట కాకిలా, రామనామం ముందు పాపంలా, వేదం ముందు నాస్తికునిలా, పండితుని ఎదుట గొర్రెల కాపరిలా, శ్రోత్రియుని ఎదుట కసాయిలా, వాసుకి ముంగిట కప్పలా, అగ్ని ఎదుట గడ్డిపోచలా, జ్ఞానం ఎదుట అజ్ఞానంలా, పెనుగాలి ఎదుట మేఘరాశిలా, సీత ఎదుట ఖలుడైన రావణుడు నిలబడ్డాడు. పరీక్షగా ఆమె ముఖంచూచి అటువంటి అందాలరాశి ముల్లోకాల్లో కూడా లభించదని తలపోశాడు. జగన్మాత, ఆదిశక్తి అయిన సీత ఎదుట, చేటుకాలం ప్రాప్తించి కుత్సితమైన ఆలోచనలతో జోలె పట్టుకొని నిలుచున్నాడు. కామధేనువును కోరి సహస్రార్జునుడు హతుడైనట్లు, పార్వతిని అభిలషించి జలంధరుడు భస్మమైనట్లు, దీపాన్ని తాకి గడ్డిమోపు భస్మమైనట్లుంది దశకంఠుని పరిస్థితి. కర్పూరపు బొమ్మ అగ్ని జ్వాలను ఆర్పగలదా! అలా రావణుడు జానకిని స్పృశించడం అసంభవం.

సీతతో రావణుడు, 'ఈ వనంలో వున్న నీవెవరు? ఈ ఘోరారణ్యంలో ఎవరిని సేవిస్తున్నావు? దానికి కారణమేమిటి?' అని అడిగాడు. అప్పుడు జగన్మాత 'అయోధ్యా ప్రభువు అయిన రఘునందనుని భార్యను నేను. జనక మహారాజు నా తండ్రి. దారుణమయిన శివధనుస్సును ఒక క్షణంలో భగ్నంచేసి రావణుని బలదర్పం హరించినవాడు, తాటకను అంతం చేసి యాగాన్ని సంరక్షించినవాడైన శ్రీరాముడు పితృవాక్య పాలనకు అరణ్యానికి వచ్చాడు. శూర్పణఖ గర్వమడచి త్రిశిర, ఖర, దూషణులను అంతమొందించాడు. ముందుముందు రావణ, కుంభకర్ణులను ఇద్దరు దుష్టులను వధించి బందీగ వున్న దేవతలను విడిపించి అయోధ్యకు వెళ్ళిపోతాము. రామలక్ష్మణులు వనానికి వెళ్ళారు. రావటానికి ఇంకొక క్షణంకూడా పట్టదు. అంతవరకు మీరు స్వస్థమనస్కులై కూర్చుండవలసింది. రఘునందనుడు స్వహస్తాలతో మిమ్ములను పూజిస్తాడు' అని దర్భాసనం వేసింది. ఆ కుటీరంలోకి ప్రవేశించటానికి లంకానాథుడు భయభ్రాంతుడయ్యాడు. ఆ లక్ష్మణరేఖ దాటి సీత వెలుపలికి రాదని తెలిసి 'ఇది రాక్షసవనం. నీవు ఒంటరిగా వున్న ఆడదానివి. రాక్షసులు బహురకాలు, లోపలికి రాగానే మింగేస్తావు. కుటీరంలో ఆసనం కూడా వేశావు. కనుక నేను లోపలికి రాను. వస్తే నీవు తప్పక నన్ను భక్షిస్తావు. నీ మనస్సు నాకు పూర్తిగా అర్థమయ్యింది' అని అనగా, సీత 'శివా! హరహరా! మేము నిజంగా రాక్షసులము కాము. అతిథులకు సేవచేసే భృత్యులము. ఇది ముమ్మాటికీ సత్యము' అని వక్కాణించింది. రావణుడు కుతర్కించి ఈమె కుటీరం నుండి బయటకు రాకపోతే భూమిపై మూర్ఛిల్లజేసి మాయలో పడవేస్తాను అని లోలోపల అనుకొని, సీతతో 'ఫలహారం లేకుండా నా ప్రాణం నిలువదు. నీవు కుటీరం నుండి బయటకు వచ్చి, నాకు ఫలాలు ఇవ్వవలసింది' అని కుటిలంగా అడిగాడు. అప్పుడు సమస్త దేవతలు గుప్తరూపాల్లో జగన్మాతను 'నీవు త్వరగా లంకకు వెళ్ళి మమ్ములను



బంధముక్తులను చేయవలసింది. నిన్ను స్పర్శిస్తే రావణుడు భస్మం కావడానికి క్షణం కూడా పట్టదు. కానీ తదుపరి మమ్ములను బందిఖానా నుండి ఎవ్వరూ విడిపించలేరు' అని వేడుకున్నారు. నీ కారణంగా రఘునాథుడు లంకకు వస్తాడు, అందువల్ల ఓ జననీ! నీ స్థూలరూపాన్ని అగ్నిలో దాచిపెట్టవలసింది. నీ ఛాయారూపంగా అగ్ని నటిస్తాడు. రావణవంశాన్ని భస్మం చేసి కార్యసిద్ధి కలిగిస్తాడు. నీ నిజరూపం గుప్తంగా వుండి, ఛాయా రూపం మాత్రమే అక్కడికి వెళ్ళాలి, అన్న దేవతల విన్నపాన్ని జానకి అంగీకరించింది.

ఇదిలా వుండగా వెలుపల రావణుడు 'నా ప్రాణం పోతుంది త్వరగా రా' అని కేకలు వేయసాగాడు. అప్పుడు ఆ జగన్మాత పండ్లు తీసుకొని రేఖ దగ్గరకు వచ్చి, భిక్ష వేయడానికి చేతిని రేఖ బయటకు చాపగా, వెంటనే ఆ నిశాచరుడు చేతిని లాగి సీతను ఎత్తుకొన్నాడు. రావణుని నిజ స్వరూపాన్ని తెలుసుకున్న జానకి, 'నన్ను బందీగా చేశావు. నా నాథుడు నిస్సందేహంగా నాకోసం వస్తాడు జాగ్రత్త' అని హెచ్చరించింది. తనను ఆలింగనం చేసుకోవాలన్న రావణుని ఆలోచన గమనించి సీత 'ఓ రావణా! అలా చేస్తే క్షణంలో భస్మమైపోతావు. అగ్నివద్ద ఏదైనా ఆహుతైపోవాల్సిందే. దీపం చెంత శలభం నశించిపోతుంది. నీకు మృత్యువు ఇలా చేరువైందని తెలుసుకో! మృగేంద్రుని వంటి రాముని ఆస్తిని నక్కలా దొంగిలించావు. వంటింట్లో కుక్కలా ప్రవేశించావు! నిప్పు అంటుకున్న చెట్టుకు వృశ్చికంవల్ల బాధ కలుగుతుందా! ఓ రాక్షసా నన్ను వదిలిపెట్టు లేదా భస్మమైపోతావు!' అని బెదిరించింది. అయినా రావణుడు వదిలి పెట్టక ఆమెను రథంలో ఎక్కించాడు. గృహస్థుకు చేటుకాలం రాగానే ఆశ్రితులంతా ముఖం చాటేసినట్లు, కుటీరంవద్దకు వచ్చిన బ్రాహ్మణులు భయంతో పారిపోయారు.

ఇంతలో లంకానాథుడు రథాన్ని ఆకాశమార్గాన మళ్ళించాడు. గద్గదస్వరంతో సీత, 'రాఘవా! త్వరగా రా!' అని రోదిస్తూ, వృక్షాలతో,

వనచరాలతో సీత, 'రాక్షసుడు నన్ను ఎత్తుకుపొయ్యాడని నా రఘుపతికి చెప్పండి' అని వేడుకోగా, సీతకు పట్టిన దుస్థితికి పశుపక్ష్యాదులు విలపించాయి. వృక్షాలు, పాషాణాలు దుఃఖంతో కరిగిపోయాయి. సీత 'శ్రీరామా! అపర్ణావర మనవిశ్రామా! విరించి జనకా! పూర్ణబ్రహ్మా! త్వరగా నావద్దకు పరుగునరా! ఓ తాటకాంతకా! రఘువీరా! హే యాగసంరక్షకా! రణధీరా! అహల్యోద్ధారా! పరమఉదారా! వెంటనే పరుగునరా! రావణుడు మహాదారుణమైన సర్పం. అతడి మర్మస్థానం ఛేదిస్తే ప్రాణం పోతుంది. నీవు గరుడవాహనంపైన ఒక్క వుదుటన వేగంగా వచ్చేయ్. రావణుడు మదించిన ఏనుగు. మృగేంద్రుడవయిన నీవు త్వరగారా! వియోగాగ్నిలో సర్వాంగాలు దహించుకు పోతున్నాయ్! నీ కరుణ అనే మేఘాన్ని నాపై వర్షించు. పరమ సాధువైన లక్ష్మణుని, ఆదిత్యుని వంటి పవిత్రుని దూషించినందువల్లనే నాకు ఈ ఆపద సంభవించింది. ఎవరు సాధువులను దూషించినా జన్మజన్మలకూ వంశక్షయం, దారుణ నరకం తప్పదు. సాధువులను నిందించే దురాచారులవల్ల ధరిత్రి విపరీతంగా కంపిస్తుంది. ఈశ్వరుడు అందరి తప్పులను క్షమిస్తాడు. పతితులను భవసాగరం నుండి తరింపజేస్తాడు. కానీ సజ్జనులను దూషించే పతితులు అనేక దుఃఖాలు అనుభవిస్తారు. అటువంటి సాధు ద్రోహుల ముఖం చూడరాదు. దారిద్రం వలన ఎంతో దుఃఖం, విఘ్నం కలిగి సర్వనాశనమవుతారు. రాక్షసచౌర్యంతో నాకు జీవన సంధ్య సంప్రాప్తించింది. ఇది నాకు జీవితంలో బాగా అనుభవమయింది. నా ప్రవర్తన వల్లనే నాకీ దుస్సాంగత్యం కలిగింది' అని కుమిలిపోతున్న జానకిని చూసి చరాచరజీవులన్నీ రోదించాయి.

**జటాయుప్రతిఘటన**

ఆ సన్నివేశాన్ని చూచి జటాయువు పరుగున వచ్చి, పూర్ణకాళునివలె మిక్కిలి కుపితుడై రావణుని ఎదుర్కొన్నాడు. అతడి శరీరం మహాపర్వత



సమానం. అతడి గోళ్ళు ముదురు ఎరుపు రంగు కలిగి వజ్రాలవలె పరమ వాడియైనవి. 'ఓరేయ్ దుర్జనా! క్రూరుడా! మోసగాడా! మలినుడా! త్వరగా శ్రీరామపత్నిని విడిచిపెట్టు. లేకపోతే నీ ప్రాణం పోతుంది. దీపగర్భంలో వత్తి నల్లగా ఉన్నట్లు, బ్రహ్మవంశానికే నీవు చీడపురుగువు. నీవు జానకిని వదిలి పెట్టకపోతే నీ శిరస్సును ఖండిస్తాను. నీ వేదాధ్యయనమెందుకు? నీ బ్రహ్మజ్ఞానం వ్యర్థం. నీ తపస్సు మండిపోనూ, నీవు చేసిన శివభజనంతా వ్యర్థమై పోయింది. ఎవరైతే జగద్వంద్యుడు, జగదుద్ధారకుడో ఆయన వస్తువునే దొంగిలించావు. నీముక్కు, చెవులు మొత్తం కోసెయ్యకుండా వదిలి పెట్టను' అని హుంకరించాడు. అప్పుడు రావణుడు ధనుస్సు గైకొని, జటాయువుపై బాణం వదిలాడు. దానిని జటాయువు ముక్కుతో అడ్డగించి కింద పడేసాడు. అలా బాణాలన్నీ వ్యర్థంకాగా, పరమ ప్రతాపవంతుడైన జటాయువు అద్భుతంగా విజృంభించాడు. జటాయువు నాసికా ఘాతం పరమ దారుణమైనది. రావణుని రథాశ్వాలు హతమైనాయి. రథం విరిగింది. సారథి శిరస్సు తెగిపడింది, ఇదంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది. కిరీటం, ధనుస్సు బాణాలు అన్నీ లాక్కొని, వస్త్రాలంకారాలన్నింటినీ పేలికలు చేసి, దశకంఠుని నగ్నంగా నిలబెట్టాడు. రావణుని తల మీదున్న కేశాలనన్నీ నిశ్శేషంగా గొరిగేసి, లంకేశుని బౌద్ధభిక్షువులా చేసి ఆకాశాన్నుండి అకస్మాత్తుగా రావణాసురుడిపైన పర్వతంలా పడ్డాడు. ఆ తాకిడికి రావణాసురుని తల పగిలింది. పర్వతానికి కుంకుమ పులిమారా అన్నట్లు రక్తం ధారగా కారసాగింది. జానకిని భర్తకు దూరం చేసిన ఫలితం ఇది. అన్న బోధ మనసులో నాటుకోగానే అభిమానం కోల్పోయి భయంతో పారిపోయాడు.

ఈ జటాయువు రెక్కలు నన్ను హడలకొట్టాయి అనుకుంటూ, తిన్నగా పైకి లేచి జటాయువును దగ్గరకు పిలిచి, 'యుద్ధంలో వధించే శక్తిని కోల్పోయాను, నీ రఘునాథునిపై ఆన. నీ మృత్యుంగమేదో చెప్పు. నా

మరణాంగం ఏదో నీకు చెబుతాను' అని బేలగా పలికిన పలుకులను నమ్మి, జటాయువు 'నా రెక్కలు పోతే నాకు మృత్యువు వస్తుంది. నీ మరణాంగం ఏదో త్వరగా చెప్పవలసింది' అని అడిగాడు. దానికి రావణుడు 'నా కాలి బ్రొటనవేలు తెగిపోతే నా ప్రాణం పోతుంది' అని జటాయువును చేతివాటుకు తెచ్చుకోవడానికి ఆ రాక్షసుడు కుట్రపన్నాడు. జటాయువు పరుగున వచ్చి ముక్కుతో రావణుని బ్రొటనవేలును ఖండించగా ఆ రాక్షసుడు రెండు రెక్కలను నరికివేశాడు. దడదడా రక్తం కారసాగింది. ఆ పక్షిరాజు ఉక్కిరిబిక్కిరై ఇలా అన్నాడు. 'ఎప్పుడో ఒకప్పుడు రఘువీరుడు ఇక్కడకు వస్తాడు. ఈ సంగతంతా నేను చెపుతాను.' సీతను భుజాలపై ఎత్తుకుని ఆ రాక్షసరాజు కొన ఊపిరితో ఆకాశమార్గాన వెళ్లాడు. జటాయువు పరిస్థితి చూచి జనకపుత్రి తన చేతులతో నుదురు బాదుకుంటూ బిగ్గరగా రోదించింది. జటాయువు భక్తి పూర్ణమైనది. నా కారణంగా ప్రాణాన్ని ఫణంగా పెట్టాడు. నన్ను రాముని తండ్రి దశరథునితో సమానంగా గౌరవించాడు అని శోకించింది.

ఇంతలో మాతంగ పర్వత ప్రాంతంలో ఒక అద్భుతం జరిగింది. అయిదుగురు వానరులు నిలబడి వున్నారు. వారు సుగ్రీవుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు అయిదోవాడు మహారుద్రుడైన హనుమంతుడు. అంజ నా తనయుని బాల్య పరాక్రమం అద్భుతమని వాల్మీకి, వ్యాసుడు వర్ణించారు. బాల్యంలోనే సూర్యుని ఒక్క క్షణంలో మింగబోయాడు. ఇంద్రాది దేవతలను అఖండప్రతాపంతో యుద్ధంలో గెలిచాడు.

ఆ సమయంలో ఆకాశంలో రావణునితో పోతూ ఆ వానరులను చూసి, జానకి చీరె చెరుగు చింపి తన ఆభరణాలన్నీ తీసి మూటగట్టి పడేసింది. ఆ మూటను తీసుకుని హనుమంతుడు ఆకాశం వైపు చూడగా రాక్షసుడు జానకిని తీసుకుని పోవడం, ఆ జానకి 'ఓ సుందరా! రామా! రాజీవనేత్రా! ఘనశ్యామా! శంకరుడు సదా ధ్యానించే కోమల శరీరా! పరుగున రా! హే రామా!



జగదంకురకందా! హే తాటకాంతకా! హే బ్రహ్మానందా! రాక్షసాంతకా! జగద్వంద్యా! ఒక్కసారి నన్ను రక్షించు' అని కేకలువేయడం గమనించిన హనుమంతుడికి విపరీతమైన ఆవేశం వచ్చింది. ఎవరి సౌభాగ్యాన్నో ఆ రాక్షసుడు దొంగిలించుకొని పోతున్నాడు. ఆ రాక్షసుణ్ణి చంపాలి. ఆ సుందరి చెర వదిలించాలి. ఆమె ఎవరికోసం వెదుకుతున్నదో, వారిని ఆమెకు అందిద్దాం అని అంటూ చూస్తుండగనే హనుమంతుడు మృగేంద్రునివలె రావణునిపై లంఘించాడు. ఈ రెండో విఘ్నం ఏమిటా అని రావణుడు హతాశుడయ్యాడు. మారుతి లంఘనం ప్రచండం. ధ్రువమండలమంతా తిప్పాడు. కానీ రావణుడు లంకలో ప్రవేశించి అదృశ్యమయ్యాడు. కాలుడి యమపాశమే తలక్రిందులయ్యింది. పాము నోటినుండి ఎలుక తప్పించుకుంది. సింహం పట్టు నుండి పూర్వపుణ్యం వల్ల నక్క జారుకుంది. ఆ కపీశ్వరుని పట్టు వ్యర్థమయ్యింది. 'ముందు ముందు ప్రతీకారం తీర్చుకుంటాను. ఆ రాక్షసుని ముప్పుతిప్పలు పెడతాను' అని ప్రతిన పూనాడు ఆంజనేయుడు. పిమ్మట సీత ఆభరణాలను భూమిలో దాచిపెట్టాడు.

'మీరు పంచవటికి వెళ్ళి రాముని బాగా వెతకండి. రామలక్ష్మణులిరువురినీ వధించండి' అని లంకలో దశకంఠుడు మిక్కిలి బలశాలురైన పదునెనిమిదిమంది రాక్షసులను ఆజ్ఞాపించాడు. వారు రావణునికి నమస్కరించి ఆజ్ఞాపాలనకు ఉత్తరదిశగా వెళ్ళారు. వారికి మృత్యువాసన్నమైంది. వారి ఆయుష్యసింధువులోని జలం ఇంకిపోయింది. అందువల్ల మృత్యువుకెదురుగా వెళ్ళారు. రావణుడు ఏకాంతంలో సీత పాదాలు పట్టుకొని ఎంతో ప్రాధేయపడ్డాడు. తన వైభవాన్ని సంపత్తిని సమస్తం ఆమెకు చూపించి, తన పురుషార్థాన్ని వర్ణించాడు. నేను దేవతలందరినీ బందీచేసాను. అయినా నన్నెందుకు త్వరగా వరించవు? కామాతురునికి సిగ్గు, ప్రతాపశూరులకు మరణం, తాగుబోతుకు సారాసార వివేకం, కాముకునికి విరక్తి, గజదొంగకు హరిభక్తి, పెద్దపులికి శాంతి, త్రికాలాల్లో

అసంభవం. ఆవిధంగా లజ్జను విడనాడి ఆ దశముఖుడు జానకితో 'నామాట విను. రామరావణుల జన్మనక్షత్రం, రాశి ఒక్కటే. నన్ను పెళ్ళిచేసుకో! రామ రావణులిరువురిది చిత్తా నక్షత్రం. తులారాశి. అయినప్పటికీ నీవు నన్ను ఎందుకు తిరస్కరిస్తున్నావు. ఓ శుభాంగీ! త్వరగా సమాధానం చెప్పు' అన్నాడు. బదులుగా జానకి 'దశముఖా! శలభం దీపాన్ని కావలించుకోగలదా? తస్కరుడు, మహామలినుడు, మూర్ఖుణ్ణి నేనెందుకు వాంఛిస్తాను? ప్రళయాగ్నిలో స్నానం చేసిన తరువాత, మశకం తిరిగి రాగలదా? వాసుకి విషదంతాల మధ్య చిక్కిన ఎలుక తిరిగి ఎలా వస్తుంది? మృగేంద్రుని వద్ద నున్న మాంసాన్ని మినహా నక్క ఏదైనా కోరుకుంటుందా? సూర్యగోళంలో పడ్డ కప్ప భూమి మీదకు ఎలా వస్తుంది. నీళ్ళతొట్టి – సముద్రం, కాకి – ఖగరాజు, నక్క – సింహం, మశకం – మహేశుడు, చీకటి – వెలుతురు, ఇవన్నీ ఒకే రాశికి చెందినవి. వీటిలో ఏవి సమానమో చెప్పు. రజకుడు – రమావరుడు, కుక్కుటం – కుంజరం, రజనీచరుడు – రఘువీరుడు, కంటకం – కమలలోచనుడు, కపటి – కమలాసనుడు, అలాగే రాముడు – రావణుడు వారి గుణరాశిలో పోలిక ఎక్కడిది? మదనుడు అందరినీ గెలిచినా, శివుని ముందు వీగిపోయాడు. అగ్ని అన్నిటిని భస్మం చేసినా మేఘాన్ని ఏం చెయ్యగలదు? అందరినీ కష్టపెట్టిన నువ్వు నన్ను తాకితే భస్మమౌతావు. పూర్ణకాముడయిన ఆ రఘురాముడు నిన్ను వధించడానికి తప్పక ఇక్కడికి వస్తాడు'. ఈమెకు మనస్సులో స్థిరత్వం ఏర్పడేదాకా గట్టికాపలా ఉంచాలని తలపోసి త్రిజట ఆమోదంతో అశోకవనంలో ఉంచి రక్షణగా ఐదు కోట్లమంది రాక్షసులను అహోరాత్రాలు అప్రమత్తంగా ఉంచాడు.

### అశోకవనంలో సీత

అక్కడ ఏమాత్రం వాయు సంచారం లేదు. నిధుల రక్షణకు భూతాలు నిరంతరం కావలివున్నట్లు రాక్షసస్త్రీలు సీతచుట్టూ కూర్చున్నారు. సత్వశీలుడు,



సాధువు, పుణ్యపరాయణుడైన విభీషణుడు రావణుడు పరమ కామాతురుడు. ఉన్మాదియై ఏదీ ఆలోచించక సీతను తెచ్చి సంపూర్ణంగా కులక్షయానికి నాంది పలికాడు అన్న మాటలు విని రావణుడు, బ్రహ్మజ్ఞానియైన విభీషణునితో నా శరీరము తాపంతో వేగిపోతున్నది. ఎన్ని ఉపచారాలు చేసినా ఏమీ ప్రయోజనం లేదు. నీవు బృహస్పతి అంతటి జ్ఞానివే. కానీ ఒక్క క్షణం నీ వేదాంతం చాలించు. నీ కిన్నరగానం ఇక చాలు. నేను మన్మథబాణాలను తాళలేకున్నాను. సీతతో రమించాలని నా ప్రాణం తహతహలాడుతున్నది. నా ఇంట అన్నీ వున్నాయి కానీ ఏం ప్రయోజనం? కనీసం నాకు శీతలోపచారాలన్నా చేయవలసిందని అన్నాడు. రాక్షసస్త్రీలందరినీ పిలచి 'సీతను మీరు బాగా భయపెట్టి నాపై మరులుగొనేట్లు చూడండి' అని ఆనతిచ్చాడు. అవశ్యం అంటూ నిశాచర స్త్రీలు ఆ అమంగళ కార్యాన్ని నిర్వర్తించానికి పరుగున వెళ్ళారు.

వాళ్లు సీతతో 'నీవు రావణుని వరించు. లేకపోతే నిన్ను భక్షిస్తాము' అన్నారు. వికటరూపంతో విశాలమైన చెవులతో, వక్రముఖంతో, పొడవాటి స్తనాలతో, కుంకుమ వర్ణం కల్గిన ఎఱ్ఱని కళ్ళతో సీతను భయపెట్టసాగారు. గాడిద మొహం, వ్యాఘ్రవదనం, సూకర, గజముఖాలతో గాడిద, గుర్రమువంటి నాసికలతో సీతను భయపెట్టారు. ఒకటి తన స్తనాలతో చెట్టును ఢీకొనగా అది విరిగిపడింది. ఒకపాదం గలది, రెండు పాదాలు గలది, మూడు పాదాలుకలది, సీతను తినేస్తామని బెదిరించాయి. పరమ కురూపి, కుత్సిత వర్ణం కలది, దుర్గంధి, అమంగళమైనది అలాంటి నిశాచరి ఒకటి సీత గొంతుపై కూర్చుని ఒక్క గుటకతో మింగేసేదా అని అడిగింది. ఒక రాక్షసి దీని శరీరాన్ని ముక్కలుచేసి కరకరా నమిలేస్తాను. అంటూ కళ్ళు బాగా పెద్దవిగా చేసి పెద్దగా ఆక్రోశించింది. అలా రాక్షసస్త్రీలు చేస్తున్నప్పటికీ ముల్లోకాలకు రాణియైన సీత నిర్భయంగా ప్రశాంతమైన అంతఃకరణంతో వీటిని లెక్కచేయలేదు. ఈ

జగత్తులో దు:ఖం నానా విధాలు. జ్ఞానులు తమ శరీరం శిథిలమైపోతున్నా ఏమాత్రం ఆందోళన చెందరు. సీతాదేవి కూడ అలాంటి కోవకు చెందినది. కుక్క ఎంత పెద్దగా మొరిగినా ఏనుగు చలించదు. నక్క ఎంత బిగ్గరగా వూళ వేసినా సింహం ఉలిక్కిపడుతుందా? సుడిగాలికి సుళ్ళు తిరుగుతూ గడ్డిపోచ పైకి లేచిపోతుంది. కానీ అచలం ఏమైనా చలిస్తుందా? అలాగ సత్యరూపిణి అయిన సీత ఏమాత్రం తొణకలేదు. కాకుల్లో కోకిలలాగ త్రిజట పుణ్యశీల. రాక్షస స్త్రీలనందరినీ అదిలించి దూరంగా తరిమేసింది. త్రిజట జనకనందిని యైన సీతతో 'నీవు ఏమాత్రం దిగులుపడవద్దు. నిన్ను అనతికాలంలో కోదండపాణియైన రాముడు తప్పక కలుస్తాడు.' అయోధ్య నుండి వచ్చింది మొదలు జనస్థానంలో జరిగిన దాంతో సహా అన్ని విషయాలు ఎంతో ప్రీతిగా సీత త్రిజటకు తెలియజేసింది.

జరిగిన చరిత్ర అంతా ఒక్కసారి సింహావలోకనం చేస్తాను వినండి. లేడిని చంపి రామలక్ష్మణులు ఆశ్రమానికి వచ్చారు. ఈ కథ చాలా మధురమైనది. జ్ఞానులు, పండితులు ఈ కథా శ్రవణం చేస్తారు. రామవిజయగ్రంథం రసవంతమైనది. వింటే సమస్త కోరికలు నెరవేరుతాయి. అయోధ్యాధీశుడు, బ్రహ్మానందుడు, శ్రీధర వరదుడు, ఆనందకందుడూ, అభంగ, అక్షయ అభేద వేదవంద్యుడూ, ఆనంద సాగరంలో ఓలలాడుతుంటాడు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా శ్రవణం చేస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**పదిహేనవ అధ్యాయం మధురం**

## అధ్యాయము - 16

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

శ్రీరామకథ అతి రసవంతమైనది. సకలతీర్థాలకన్నా విశేషమైనది. గంగస్పర్శ నిర్దోషుల గావిస్తుంది. అలాగే శ్రీరామకథ ప్రియభక్తులకు పరాయణత్వాన్ని కలిగిస్తుంది. ఇహపరాలే తీరాలుగా రఘువీరచరిత్ర అనే గంగాజలం ఉప్పొంగిన ప్రేమతో రామఘోష హెూరుతో ప్రవహిస్తోంది. గంగానదికి నీరు జీవనాధారం. కానీ ఈ కథాసరిత్తు జగత్తుకే జీవనాన్నిస్తుంది. చిత్తవృత్తులనే జలచరాలతో నిండి నిబిడీకృతమై మెరుస్తుంటుంది. గంగలో నీరు కలుషితమవుతుంటుంది. కానీ రామకథ అనుదినం మనస్సును నిర్మలం చేసి బ్రహ్మానందాన్ని కలిగించి ముల్లోకాలను కూడా పునీతం చేస్తుంది. గంగలో మునిగిపోతే మరణిస్తారు. రామకథలో మునిగిపోతే తరిస్తారు. విశేషమైన ఈ గుణాలవల్ల ఇది గంగ కంటే శ్రేష్ఠమైనది. ఈ రామకథా శ్రవణం చేస్తే సకలతీర్థాలలో స్నానం చేసిన ఫలం సంపూర్ణంగా ప్రాప్తిస్తుంది. అటువంటి పావనమైన రఘువీరుని కథను సాధువులు, శ్రోతలు సావధానంగా శ్రవణం చేస్తే వక్త సంతోషానికి అవధులుండవు.

### పంచవటిలో శ్రీరామవిలాపం

పదిహేనవ అధ్యాయంలోని రామకథ సుందరమైనది. రావణుడు సీతను అపహరించి లంకకు తీసుకెళ్ళాడు. లేడిని చంపి రామలక్ష్మణులు పంచవటికి తిరిగివచ్చారు. దారిలో అపశకునాలు ఎదురయ్యాయి. వచ్చేటప్పుడు నడక స్తంభించింది. ఆశ్రమానికి వచ్చి చూస్తే అంతా శూన్యంగా గోచరించింది. ప్రాణం పోయిన దేహంలా, ఉదకంలేని సరోవరంలా, ముక్కులేని ముఖంలా కళాహీనంగా కనబడింది. పండ్లు లేని చెట్లలా, సైన్యం లేని రాజులా, పిల్లలు

లేని ఇల్లులా, దేవుడు లేని మందిరంలా, దయలేని మనసులా, ప్రేమలేని కీర్తనలా, కనుపాపలు లేని కళ్ళులా, ఆశ్రమం శూన్యంగా గోచరించింది. ఋషులను ఏం జరిగిందని అడుగుదామంటే వారు తమ కుటుంబాలతో సహా పారిపోయారు. రఘురాముడు దశదిశలు వెదికినా అంతటా శూన్యమే తాండవించింది. నేత్రాలలో అశ్రుధారలు కారసాగాయి. 'సీత ఎక్కడుందో చెప్పు లక్ష్మణా' అంటూ శ్రీరాముడు మూర్ఛిల్లాడు. నిశ్చేష్టితుడై పడివున్న రఘునందనునికి సజల నయనాలతో ఉపచర్యలు చేసి లక్ష్మణుడు సావధానుని చేశాడు.

దేవాధిదేవుడు, ఆత్మారాముడు, శంకరుడు ఎవరినామం నిరంతరం జపిస్తాడో అటువంటి శ్రీరామునికి మోహం, భ్రమ కలుగుతాయా? ఇది చాలా వింతగా ఉంది. అంధకూపంలో సూర్యుడుండటం, ప్రళయాగ్నిని చంద్రుడు బాధించటం, పెరట్లో కల్పవృక్షం కలవాడు బిచ్చమెత్తటం, యముని భూతాలు ఎదుర్కొనటం, ఎండమావిలో సూర్యుడు మునగటం ఎలా అసంభవాలో రాముడు శోకించటం అలా అసంభవం. పురాణపురుషుడైన రఘునందనుడు మాయాతీతుడు, శుద్ధచైతన్యమూర్తి. అయినప్పటికీ మాయ అంటే పూర్ణమైన అభిమానం కలవాడు. అతడు మాయామయుడంటే శుద్ధ అబద్ధం. ఈ జగత్తులో వసిస్తూ జగత్తునంతా మాయామయం చేసే జగన్నాటక సూత్రధారి జగద్గురువు అయిన రఘురాముడు మాయలో పడ్డాడనటం మన భ్రమ. వసిష్ఠుడు ఉపదేశించిన విధంగా సర్వద్రష్ట అతడొక్కడే. జగత్తంతా పూర్ణంగా భాసిస్తుంటాడు. అటువంటి వారిని మాయ ఏంచేస్తుంది? స్వప్నంలో అనుభవించే నానావిధాలయిన జన్మలు, యాతనలు నిద్రలేవగానే మిథ్య అని అందరికీ విదితమే. స్వప్నంలో ప్రాణనాథుని మరణాన్ని చూచిన పతివ్రత నిద్రలేవగానే తాను సుమంగళినని తెలుసుకుంటుంది. కుండ పగిలినా చంద్రబింబం చెక్కుచెదరనట్లు, స్వయంభువు, లీలావతారుడైన సీతావల్లభుడు



దేనికీ చలించడు. అయినా మాయను నటిస్తూ సౌమిత్రితో రఘురాముడు 'చుట్టూ ఉన్న వృక్షాలు, పర్వతాలను అడిగి సీత ఎక్కడికి పోయిందో తెలుసుకో' అన్నాడు. గుహల్లో, కొండచరియల్లో తమాలనీలుడైన శ్రీరాముడు వెతుకుతూపోయాడు. నిర్మలమయిన గోదావరీ తీరమంతా సుమిత్రాసుతుడు వెతికాడు.

అరణ్యమంతా పరుగెత్తుతూ రాముడు సీతా! సీతా! అని పలవరిస్తూ 'ఓ హరిణనయనా! నన్ను త్వరగా కలుసుకో!' అంటూ అపారంగా శోకించాడు. బాతులను, చాతకాలను, రాజహంసలను, నెమళ్ళను, చిలుకలను, అడవిపందులను రాముడు 'నా సీతను ఎక్కడయినా చూచారా?' అని ప్రీతిగా అడిగాడు. లేడి, పులి, సింహము, పాము, ముంగిస, పంది, కస్తూరిమృగాలను, కోకిల, చక్రవాక పక్షులను కూడా ఆ సీతాపతి అడిగాడు. కానీ ఏవీ జవాబు చెప్పలేదు. దాంతో రఘువీరునికి కోపం వచ్చి సౌమిత్రితో, 'విల్లంబులు తీసుకురా! అరణ్యాన్నంతా భస్మం చేస్తాన'న్నాడు. అపుడు లక్ష్మణుడు 'రామా! సీతామాతను గురించి వాటికి ఏం తెలుస్తుంది? తొందరపడి వాటిపై నీ కోపం ప్రదర్శించవద్దు' అని బ్రతిమాలాడు.

సీతా విరహంలో నున్న రఘునందనుడు లక్ష్మణుని చూచి 'నువ్వెవరు? ఎందుకు ఇక్కడ నిలబడి ఉన్నావు?' అని వివశత్వంతో ప్రశ్నించాడు. అప్పుడు సౌమిత్రి 'స్వయానా శ్రీరాముని తమ్ముడను' అన్నాడు. అప్పుడు వేదవంద్యుడయిన రఘురాముడు 'రాముడు ఎవరు? ఎక్కడ ఉంటాడు?' అని అడిగాడు. 'శివధనుస్సును విరిచినవాడు, పరమధీరుడు ఆ రాముడు' అని బదులివ్వగా ఆ సీతానాథుడు ఇలా అన్నాడు. 'ధనుస్సును ఎందుకు విరిచాడు?' 'జనకుని మండపంలో ధనుస్సును స్వయంవరార్థంగా విరిచాడు' అని సమాధానమిచ్చాడు సౌమిత్రి. అయితే 'జనకుడు ఎవరో నాకు ఖచ్చితంగా చెప్పవలసింది' అన్నాడు రాముడు. 'ఓ రఘునాథా! జానకి తండ్రియే జనకుడు'

అని పలుకగా 'గుణవతియైన జానకిని చూపించు' అన్నాడు. మళ్లీ సౌమిత్రితో రఘువీరుడు 'మనది ఏ ఊరు?' అని అడిగాడు. 'అయోధ్యాపురం మన ఊరు. పిత్రాజ్ఞ పరిపాలించుటకై అరణ్యానికి వచ్చాము' అన్నాడు లక్ష్మణుడు. 'వనానికి ఎవరెవరు వచ్చారు?' అన్న రాముని ప్రశ్నకు సౌమిత్రి ఇలా జవాబిచ్చాడు. 'నేను, మీరు, చిద్రత్నమైన సీతాదేవి ముగ్గురం కలసి వనానికి వచ్చాము' 'అలాగయితే త్వరగా నాకు జానకిని చూపించు' అంటూ రఘురాముడు నేలపై మూర్ఛిల్లాడు. సౌమిత్రి ఉపచారాలకు రాముడు తెప్పరిల్లాడు.

ఇంతలో సూర్యుడు అస్తమించాడు. రాత్రి చంద్రుడుదయించగానే రాముడు 'సూర్యుడెందుకు అంత తీవ్రంగా మండిపోతున్నాడు?' అని అడిగాడు. అప్పుడు సౌమిత్రి 'స్వామీ అది చంద్రబింబం, సూర్యగోళం కాదు. చంద్రుని శీతలకిరణాలు సీతా విరహవేదనలో మీకు వేడిగా తోస్తున్నాయి' అన్నాడు. ఆ విధంగా దేవాధిదేవుడైన రఘురాముడు విరుద్ధ భావాలెన్నో ప్రకటించాడు. ఎవరైతే పుట్టుకలేనివాడో, అజేయుడో, స్వయంగా శంకరుడు నిరంతరం ఎవరిని ధ్యానం చేస్తాడో అటువంటి రఘురాముడు సీతా! సీతా! అంటూ వృక్షాలను, పాషాణాలను ఆలింగనం చేసుకున్నాడు. అవి వెంటనే ఉద్ధరింపబడి విమానంలో స్వర్గానికి వెళ్ళాయి. రఘునందనుడు సౌమిత్రితో 'మనం వెంటనే బయలుదేరి అగస్త్యుని దర్శనం చేసుకుందాం. జరిగినదంతా ఆయనకు చెప్తే ఆయన తన సహజపాండిత్యంతో మనకు కర్తవ్యాన్ని బోధిస్తాడు' అని అన్నాడు. పిమ్మట రామలక్ష్మణులు అగస్త్యాశ్రమానికి వెళ్ళారు. కానీ ద్వారపాలకుడు అడ్డగించి వారిని నిలబెట్టాడు. కుంభసంభవుడైన అగస్త్యుడు సేవకుని ద్వారా శ్రీరాముని ఆగమన వార్త విని తన తపశ్శక్తితో సీతను రావణుడు ఎత్తుకుపోయాడని తెలుసుకున్నాడు. ఆ ముని తన ఆంతర్యంలో 'రాముడు రాజ్యం వదలి అడవుల్లో తిరుగుతున్నాడు. జానకిని పోగొట్టుకొని మూర్తీభవించిన శోకంతో ఉన్నాడు. భార్యా వియోగంలోనున్న రఘురాముని దర్శనం చేసుకోకూడ' దని నిర్ణయించి సేవకునితో ఆ మాటే చెప్పి పంపాడు. 'ఈరోజు మీకు దర్శనం లేదు. వచ్చిన దారినే తిరిగిపోండి' అని తెలుపగా ఋషి మనోగతాన్ని అర్థం చేసుకున్న రాముడు ఆ మాటలకు నవ్వుకుని వెనుతిరిగాడు. కాని లక్ష్మణుడు, 'అగస్త్యుడు కఠినుడు, నిర్దయుడు. జగదుద్ధారకుడైన రామునే తిప్పి పంపాడు. జ్యోతిర్లింగమని తెలిసి కాలితో తన్నాడు. కామధేనువు ఇంటికి వస్తే కర్రతో కొట్టాడు. కల్పతరువు ద్వారం చెంత నిలిస్తే చూచి కూడా అభాగ్యుడు తరిమేసినట్లు, పరుసవేది అని తెలిసికూడా విసిరిపారేసినట్లు, చింతామణిని కాలితో తన్నినట్లు, అమృతభాండం దైవవశాత్తు లభిస్తే తెలిసి కూడా వెనక్కి పంపాడు'అని కోపంగా అన్నాడు. 'అగస్త్యుడు పరమజ్ఞాని. సీత లేకుండా నా దర్శనం ఆయనకు తగదు. నేను నిర్వికారుడను, నిర్గుణుడను. అన్నింటికీ కారణమైనది సీత. ఆమే నన్ను మేల్కొలిపి సగుణత్వాన్ని ఆపాదించింది. ఆమె పంచభూతాలను నిర్మించి త్రిగుణాలను, తత్త్వాలను, కౌతుకమైన అవతారలీలను జగత్తుకు ప్రకటించింది. నేను రూపరహితుడను, అనామకుడను. ఈ సంగతి అగస్త్యునికి బాగా తెలుసు. ఆ ఋషి తేజస్వి, తపస్సంపన్నుడు, జ్ఞానసూర్యుడు' అని లక్ష్మణునికి జ్ఞానబోధ గావించాడు రాముడు.

జగజ్జెట్టియైన శ్రీరాముడు వృక్షాలు, తీగలు, లతలు, ఆకులను కౌగిలించుకుంటూ పంచవటికి తిరిగి వచ్చాడు. దేహాభిమానాన్ని విసర్జించి ఏకాంతంలో ఆత్మవిచారణ చేసే యోగిలా, ప్రాణం వీడిన శరీరంలా, కోపాన్ని విసర్జించిన జమదగ్ని ఋషిలా, సంసారమనే మాయనుండి బయటపడ్డ విరక్తునిలా, కుబుసం వదిలిన పాములా, మోహాన్ని విడనాడిన తపోధనునిలా, చెడునడతను వీడి శ్రేష్ఠకర్మలను ఆచరించే పవిత్రునిలా, పరనిందను విసర్జించిన సజ్జనునిలా, ఆత్మస్తుతిని విడనాడిన సాధుపుంగవునిలా, అమంగళాన్ని

దరిచేరనీయని అగ్నిహోత్రునిలా, శ్రీరాముడు లక్ష్మణునితో సహా పంచవటిని వీడివెళ్ళాడు. రాముడు వెనుకకు తిరిగి చూడగా పన్నెండుచేతుల పొడుగు, నాలుగుచేతుల వెడల్పు కలిగిన రాక్షసుని పాదచిహ్నాలు కనబడ్డాయి. వాటి దగ్గరే కుంకుమాంకితమైన సీత పాదాల గుర్తులు, కంఠహారంలోని ముత్యాలు, రత్నాలు పడి ఉన్నాయి. ఇది చూచి లక్ష్మణుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. శ్రీరాముడు కీకారణ్యంలో వెదుకుతూ పోగా దూరంగా రక్తసిక్తమై రామస్మరణచేస్తున్న జటాయువు కనిపించాడు. రామస్మరణ మహిమవల్లనే అక్కడ వృక్షాలన్నీ బాగా ఫలవంతంగా ఉన్నాయి. ఆ సమయంలో అక్కడ ఒక రాక్షసి కూర్చొని ఉన్నదేమో అని రామునికి భ్రాంతి కలిగింది. పర్వతం పైనుండి ప్రవహించే సెలయేరులా రక్తం నలువైపులా ప్రవహిస్తున్నది. ఆ రాక్షసి జానకిని తినేసి తృప్తిగా కూర్చొని ఉన్నదేమో అనుకుని రాముడు విల్లంబులు గైకొని త్వరగా ధనుస్సును ఎక్కుపెట్టి ముందుకుసాగాడు.

**జటాయుసమాగమం**

సమీపానికి రాగానే, కోదండపాణికి మధురమైన రామనామం వినిపించింది. రక్తసిక్తమై పడివున్న జటాయువును గమనించి రాముడు ఒక్క ఉదుటున జటాయువును తన ఒడిలోనికి తీసుకుని, ఒక్కగానొక్క బిడ్డను కోల్పోయిన తండ్రివలె తల్లడిల్లాడు. ఆప్తమిత్రుడు, సహోదరుడు రణరంగంలో నిర్జీవంగా పడివున్నప్పుడు దుఃఖించినట్లు ఆ కోదండధారి గుండెలవిసేలా రోదించాడు. లక్ష్మణునికి కూడా చాలా దుఃఖం కలిగింది. 'జటాయువు మంచి భక్తుడు. సూర్యుని సారథియైన అరుణుని పుత్రుడు. పరమపవిత్రుడు' అన్నాడు. అప్పుడు రఘువీరుడు 'నాయనా! సంగతేమిటి?జరిగిందేమిటో నాతో చెప్పు. మాట్లాడటానికి కొంచెం శక్తిని తెచ్చుకో' అని జటాయువును అనునయంగా ప్రశ్నించాడు. జటాయువు మంద్రస్వరంతో 'రామా! రావణుడు సీతను లంకకు తీసుకుని వెళ్ళాడు. నేను వాని బారి నుండి రక్షించుదామని



ప్రయత్నిస్తే ఇలా అయింది' అన్నాడు. రఘునందనుడు నలువైపులా చూచాడు. అక్కడ సారథి, రథం, రావణాసురుని వస్త్రాలంకారాలన్నీ చూర్ణమై పడి ఉన్నాయి.

జటాయువు పరిస్థితి చూచిన రామునికి సీతావియోగశోకాన్ని మించిన శోకం కలిగింది. జటాయువు ఈ విధంగా అన్నాడు. 'రఘుపతీ, సీత నిన్ను తీసుకుని రమ్మంది. నా రెక్కలు విరిచేసి రాక్షసుడు నా ప్రాణం తీశాడు. నాకు మాటలు రావటం లేదు చూడు' అంటూ రాముని పాదాలపై తలవాల్చేసాడు. శ్రీరాముడు కన్నీటితో జటాయువుకు అభిషేకం చేశాడు. 'జటాయూ! నేను నీకు సత్వరం స్వస్థత చేకూరుస్తాను' అన్నాడు. కాని అరుణనందనుడైన జటాయువు 'ఆ విధంగా నా మరణాన్ని పొడిగించవద్దు. మీ ఒడిలో నేను ఆనందంగా ప్రాణాలు విడుస్తాను' అంటూ రాముని ముఖంలోకి చూస్తూ హృదయమంతా రామధ్యానంతో నిండగా ముఖతా రామస్మరణ చేస్తుండగా శ్రీరాముడు అతనిని తన హృదయానికి హత్తుకున్నాడు. వెంటనే ప్రాణం వదలగా, హంసవిమానంలో బ్రహ్మ జటాయువును వెంటబెట్టుకుని వెళ్ళాడు.

జటాయువుతో రాముడు 'నిన్ను స్వర్గంలో నా తండ్రి కలుస్తాడు. ఆయనకు సీతను తీసుకుని వెళ్ళిన సంగతి, ఇక్కడ జరిగిందేదీ చెప్పవద్దు. తెలిసిందా మహా పరాక్రమశాలియైన దశరథుడు ఈ కర్మభూమికి వస్తాడు. నేనే రావణుని వధించి స్వర్గలోకానికి పంపుతాను. అప్పుడు ఈ వృత్తాంతమంతా తానే చెబుతాడు' అన్నాడు. ఆ విధంగా జటాయువు స్వర్గప్రాప్తి పొందాడు. ఇంద్రునితో యుద్ధం చేసే సమయంలో దశరథుని జటాయువు సోదరునిగా భావించాడు. అందువలన శ్రీరాముడు జటాయువును తన తండ్రివలె గౌరవించి అతడితో గడిపిన మధురక్షణాలు తలచుకుంటూ కాలం వెళ్ళబుచ్చాడు. గడియగడియకు శ్రీరాముడు జటాయువు సంభాషణా విశేషాలనడుగుతూ ఎంతో ప్రీతి

చెందాడు. సౌమిత్రి కట్టెలన్నీ ప్రోగుచేయగా, కౌసల్యాసుతుడైన రఘురాముడు చితిని వెలిగించి జటాయువు ఉత్తరక్రియలన్నీ నెరవేర్చాడు. తదుపరి శరణాగతులకు వజ్రపంజరమైన రాఘవేంద్రుడు సుందరమైన తన సీతను వెదకటానికి ముందుకు సాగాడు.

## శ్రీరామవిలాపరహస్యం

దక్షిణాపథాన దండకారణ్యంలో తాను నివసించిన ప్రతిచోట రఘునాథుడు శివలింగాలను స్థాపించాడు. అక్కడ ఈ రోజుకు కూడా బాణాల గుర్తులు కనబడతాయి. పరమ గంభీరమైన మయూరగిరికి అహల్యోద్ధారకుడు వచ్చాడు. హే సీతా! హే సీతా! అని పలవరిస్తూ వృక్షాలను, పాషాణాలను ఆలింగనం చేసుకున్నాడు. కాని చిత్రంగా అవి చేతిలో జపమాల ధరించి కోమలమైన రామనామాన్ని నిరంతరం జపించే కైలాసనాథుని వద్దకు వెళ్ళాయి. ఎవరైతే హాలాహలాన్ని శమింపజేసాడో, సహస్రనామాలకన్నా నిర్మలుడో, చంద్రునికన్నా అతిశీతలమైనవాడో, అమృతం కన్నా మధురమైనవాడో, దినకరునికన్నా తేజోవంతమైనవాడో, ఆకాశానికన్నా విశాలమైనవాడో, సకలానందానికి మూలాధారమైనవాడో అతడే కేవలం పరబ్రహ్మం. రూపం సగుణం. నామం నిర్గుణం. మాయామయుడైన ఆనందఘనుని నామస్మరణతో రూపం లయమై నామం మనస్సులో హత్తుకొనిపోతుంది. ఇది యుగయుగాలలో కూడా గుర్తుంచుకోవాలి. నియమంగా రూపం ముందు నామాన్ని స్మరించు. రూపం క్షణికం. నామం సత్యం. అర్థం తెలుసుకొని నామాన్ని నిరంతరం జపిస్తే వేదాలే తటస్థమవుతాయి. సారానికే సారమైన ఆ నామాన్ని అఖండంగా జపించే కర్పూరగౌరుని వద్ద చేతులు జోడించి హిమాద్రి తనయ సాదరంగా, 'స్వామీ! నీకంటే ఎక్కువగా రాత్రింబగళ్ళు జపం, ధ్యానం చేసే వాళ్ళు ఎవరైనా వున్నారా? నాకు చెప్పవలసింది' అని అర్థించింది. అప్పుడు శివుడు 'విను కళ్యాణీ! సకల గుణసరిత్తు, లావణ్యఖని, రవికుల



దివ్యమణి అయిన రాముడు నన్ను ధ్యానిస్తాడు. ఆ రాముడు రాక్షసారణ్యాలకు అగ్నివంటివాడు. భక్తుల హృదయాలనే కమలాలకు భ్రమరం వంటివాడు, అజ్ఞానమనే చీకటిని పారద్రోలే దినకరుడు, ఉదారుడు శ్రీరాముడు ముల్లోకాలకే మూలస్తంభమైనవాడు, వేదలతలకు కాసిన పక్వమైన ఫలము. సకలసృష్టికి కారణభూతమైనవాడు, నిర్మలుడైనట్టి తమాలనీలుడు ఆ శ్రీరాముడు. రావణుని గర్వభంగం చేసినవాడు, భవగజాల బారినుండి తరింపజేసే మృగరాజు, జనకుని అల్లుడు, యజ్ఞసంరక్షకుడు అయిన శ్రీరాముని నేను ధ్యానిస్తాను.' ఇది విని ఆ భవాని నవ్వింది. ఆ రాముడు వనంలో సీతా! సీతా! అని పలవరిస్తూ వృక్షపాషాణాల చుట్టూ తిరుగుతున్నాడు. ఆయన భార్యను రావణుడు తీసుకెళ్ళాడు, స్త్రీ వియోగంలో మతి చెడి, అహోరాత్రాలు ఆమె ధ్యాసలో వున్నాడు. అటువంటి రాముని నామం జపించడం చిత్రంగా వుందే! అని అంది. అప్పుడు శివుడు, ఆ రఘువీరుడు లీలావతారుడు. నిర్వికారుడు. వేదాలకు, వేయితలలు గల ఆదిశేషునకు కూడా అంతుబట్టనివాడు. అతడు పూర్ణబ్రహ్మానందుడు, నిర్గుణుడు. దేవతలను విముక్తులగావించుటకు సంపూర్ణంగా సగుణరూపంతో లీలా వేషధారియై భక్తుల కోసం ప్రకటమైనాడు. విశ్వరూపుడు ఆ రఘువీరుడొక్కడే. బంగారం ఒకటైనా ఆభరణాలు ఎన్నో. ఒకే ఆకాశంలో భవనాలు లెక్కలేనన్ని ఉన్నట్లుగా సీతాపతి సర్వవ్యాపి. సాగరం ఒకటైనా అలలు అనంతం. లోహం ఒకటైనా ఆయుధాలు అపారం. దారం ఒక్కటైనా వస్త్రాలు రకరకాలు. మేఘం ఒకటైనా బిందువులు అసంఖ్యాకం! నెయ్యి ఒక్కటైనా అందులోని కణాలు అపారం. నాదం ఒక్కటయినా వాద్యాలు అనేకం. నేల ఒక్కటే అయినా చెట్లు ఎన్నో రకాలు. వేదం ఒక్కటే అయినా శ్రుతులు అనంతం. ఆకాశం ఒక్కటే అయినా నక్షత్రాలు అసంఖ్యాకం. అలా రాముడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. అనగా ఆ హిమనగపుత్రి, 'నువ్వు ఏ రాముని వర్ణించావో ఆతని నేను మరిపిస్తాను' అంది.

వెంటనే కాంచనవర్ణంతో, సుహాస్య వదనంతో, పద్మ నయనాలతో సురేఖయై జానకీరూపం ధరించి భవాని రాముని ఎదుటకు వచ్చింది. మాట్లాడితే పలువరుసలు మెరుస్తున్నాయి. గగనాన్నంటే తేజంతో, వజ్రాలవంటి పాదధూళితో ఆమె అతర్క్యంగా వుంది. శరీరం నుండి అపారమైన సువాసనలు వెలువడగా ఆ అరణ్యంలో ఆ సుగంధాన్ని ఆస్వాదించటానికి భ్రమరాలన్నీ పరుగున వచ్చాయి. మెరుపు తీగవలె ఆ పీతవసన సర్వాలంకార భూషితయై పరిపూర్ణంగా వున్నా, రాఘవుడామెను చూచి, ముఖం తిప్పుకొని వెళ్ళిపోయాడు. ఇక్కడ సరిగ్గా చూడలేదని మళ్ళీ ముందుకు వచ్చి ఆ గణపతి మాత 'స్వామీ! రఘునాథా! నేను సీతను వచ్చాను' అని వేడుకోగా, రాముడు ఆమెను పట్టించుకోక, వృక్షపాషాణాలను కౌగలించుకొన్నాడు. ఇది చూచి జానకిని వదలిపెట్టాడా ఏమి? అని ఆశ్చర్యపోయాడు లక్ష్మణుడు. అప్పుడు ఆమె ఓ ఆత్మీయరామా! ఓ అయోధ్యానాథా! పూర్వపుణ్యం వల్ల లేడి పులి పట్టునుండి తప్పించుకొన్నట్లు, నీ రాణి రావణుని బారినుండి బయటపడి వచ్చింది. విషకంఠ హృదయా! పూర్ణబ్రహ్మ! పూర్ణకామా! పరుగున వచ్చి నన్ను ఆలింగనం చేసుకో అని ప్రాధేయపడింది. ఇదంతా దేవతలు ఆకాశం నుండి గమనిస్తున్నారు. జానకి దగ్గరున్నా కూడా ఆ మోక్షదాత కన్నెత్తి చూడటంలేదు. కోపించాడో ఏమో? అని అనుకొన్నారు దేవతలు. అప్పుడు లక్ష్మణుడు 'పద్మదళాక్షా! మనోమోహనా! నిర్వికల్పవృక్షా! ఓ సర్వరక్షా! సీతను ఆలింగనం చేసుకొని ఆమె కోరిక తీర్చవలసింద'ని ప్రార్థించాడు. బదులుగా రఘువీరుడు, 'నీకు ఆమె దురాలోచన తెలియదు. నిజానికి ఆమె అపర్ణాదేవి. మనలను మోసగించడానికి వచ్చింది. శివునితో మనలను మోసగిస్తానని పందెం వేసింది. ఇది నీకు సరిగ్గా తెలియదు' అని అంతర్జ్ఞానంవల్ల కైలాసంలో జరిగిందంతా సౌమిత్రితో చెప్పాడు. ఇది విని స్కందుని తల్లియైన పార్వతి ప్రసన్నురాలైంది. 'హే అజితా! పూర్ణబ్రహ్మ! అంటూ ఆ ఆదిమాయ అంబికగా ప్రకటమై ఆ విరించి జనకునకు వరమివ్వటానికి ముందుకు వచ్చింది'. అప్పుడు శ్రీరాముడు 'హేమాతా! జ్ఞానగంగా! హిమనగసుతా! శివాజ్ఞను ధిక్కరించి ఇక్కడికెందుకొచ్చావు?' అని ప్రశ్నించాడు. అప్పుడు దుర్గ రఘునందనునితో 'భార్గవజితా! శివమనోరంజనా! నరవీరశ్రేష్ఠా, ఆనందవదనా, జగద్వంద్యా, జగదుద్ధారా! నీవు నిర్వికారుడవు, పూర్ణజ్ఞానివైనా, ఎందుకా వృక్షాలను, పాషాణాలను ఆలింగనం చేస్తున్నావు' అని అడిగింది. అప్పుడు కౌసల్యాసుతుడు సీతా! సీతా! అని పిలవగా, వృక్షాలు, పాషాణాలు ఓ అన్నాయి. అది చూచి అంబిక నిశ్చేష్టయింది. తరువాత శ్రీరాముడు 'దీన్ని గురించి శివుని దగ్గరకు వెళ్ళి అడుగు. నీకు ఆంతర్యంలో విశ్వాసం లేదు. ఆధ్యాత్మజ్ఞానం పూర్తిగా లేదు. నేను వృక్షాలనెందుకు కౌగిలించుకొంటున్నాను, అన్న విషయం పురుషోత్తముడైన శివునికి తెలుసు' అన్నాడు. కానీ, అంబిక ఇలా అంది. 'మీరు ఇద్దరైనా రూపం ఒక్కటే! పరస్పరం ఆంతర్యం బాగా తెలిసినవారు. ఆకాశం వైశాల్యం వాయువుకే తెలుసు. వాయువు గమనం అంతా ఆకాశానికి పూర్తిగా తెలుసు. నా అభిమానాన్నంతా వదిలి నిన్ను శరణు వేడుతున్నాను. ఓ విరించిజనకా! నీవెందుకు ఆ వృక్షాలను, పాషాణాలను ఆలింగనం చేసుకొంటున్నావో నాకు వివరంగా చెప్పవలసింది' అని కోరింది. అప్పుడు రాముడు అపర్ణ అంతరంగాన దివ్యజ్ఞానాన్ని ప్రవేశపెట్టాడు. ఆ వృక్షాలు, పాషాణాలు ఎవరో నిదానంగా చూసి తెలుసుకో! భవాని జాగ్రత్తగా పరికించగా అక్కడ మహాఋషులు కూర్చొని ధ్యానం చేస్తున్నారు. వారికి మోక్షం ప్రసాదించడానికి సీతు అనే మిషతో ఆలింగనం చేసుకుని తాపసులను ఉద్ధరించాడు. ఆ తరువాత ఆ పురాణపురుషునకు తన అసలు రూపం ప్రదర్శించింది జగన్మాత. అప్పుడు స్వయంగా రాముడు అంబికను పూజించగా ఆ తుల్జా భవాని 'ఓ రాజీవనేత్రా! రఘునందనా! నీవు త్వరలో రావణుని వధించి, జానకిని తీసుకొని అయోధ్యకు విచ్చేస్తావు' అని వరమిచ్చింది. రఘురాముడు సీతను వెదుకుతూ అక్కడనుండి దక్షిణాపథం వైపు సాగాడు.

త్రోవలో ఎవరి స్మరణ మాత్రం చేత పాపాలు నశిస్తాయో అటువంటి కృష్ణవేణి కనబడింది. ఆ నది ఒడ్డున కోదండపాణి ఒక్క క్షణం కూర్చున్నాడు. స్నానం చెయ్యాలని రఘునందనుడు కృష్ణలో ప్రవేశించాడు. జగన్మోహనుడు, జగజ్జీవనుడు లోతైన ఆ నీటిలో మునక వేశాడు. విష్ణువు తనువు నిజంగా కృష్ణే అన్నట్లుగా రాజీవనేత్రుని శరీరం క్షణంలో జలమయమైంది. ప్రక్కనే వున్న సౌమిత్రి చూస్తుండగానే రాముని శరీరం నీరవడంచూచి కలవరపడ్డాడు. ఇప్పుడు నేనేం చేసేది? ఆ శ్రీరామచంద్రమూర్తికి ఏమైంది? అనాథలకు తల్లి అయిన శ్రీరాముడు ఎక్కడికి వెళ్ళాడు? 'ఓ రామా! నీవు లోకమాతవు నన్నెందుకు ఉపేక్షిస్తున్నావు' అంటూ నిశ్చేష్టుడై సౌమిత్రి కూలబడ్డాడు. 'రామా! ఈ క్షణంలో పరుగునరా! నీవే నా తల్లివి, తండ్రివి. నన్ను వనంలో ఒంటరిగా ఎందుకు వదిలిపెట్టావు? రాఘవా! నేను అలసిపోయాను. నన్ను ఈ ఘోర అరణ్యంలో వదలివెళ్ళావు. నాకు ప్రాణత్యాగమే శరణ్యం. తల్లి అయిన జానకి నన్ను వదిలేసింది, నీవూ నన్ను ఉపేక్షిస్తే ఎలా? రఘుపతీ! నీమీదే ఆశపెట్టుకొన్నాను. నువ్వు నన్ను వదలవద్దు' అంటూ లక్ష్మణుడు పైకి లేచి నిర్వీర్యంగా నలువైపులా చూచి మితిమీరిన కోపంతో ధనుర్బాణాలు చేతికి తీసుకున్నాడు. ముఖంలో ప్రళయాగ్ని ప్రజ్వరిల్లగా కృష్ణతో 'నవమేఘరంగుడు, రాజీవనేత్రుడు అయిన నా రఘువీరుని తీసుకొనిరా! లేకపోతే ఈ క్షణమే ఒకే బాణంతో నిన్ను మొదలంటా నిర్జలం కావిస్తాను ఆలోచించుకో' అని అన్నాడు. ఇది తెలుసుకొని అహల్యోద్ధారకుడు వెంటనే బయటకు వచ్చాడు. రామదర్శనంతో ఆనందం ముప్పిరిగొనగా సౌమిత్రి సాష్టాంగపడ్డాడు. ఆ స్థలంలో శివలింగం స్థాపించి ముందుకు సాగాడు రామచంద్రుడు. ఆ స్థలాన్నే బాహొక్షేత్రమని అంటారు. అదే కబంధుని నివాసం.

## కబంధుని శాపవిమోచనం

ఆ కబంధునికి త్వరగానే ఎదురయ్యారు రామలక్ష్మణులు. కావలసిన వారు వీరేనని ఎరిగి కబంధుడు తన శరీరాన్ని వ్యాపింపజేసి వారిని ఆవరించాడు. అతడి చేతులు పన్నెండు యోజనాల పొడుగు. దారికి అడ్డంగా పర్వతంలా పడ్డాడు. వజ్రఘాతం వల్ల అతడి శిరస్సు గుండెలపైకి వచ్చింది. వాడికి కాళ్ళు లేవు. రెండు చేతులూ జాపి కూర్చున్నాడు. వాడికి అకస్మాత్తుగా రామలక్ష్మణులు తారసిల్లారు. అమోఘమైన వాడిబలం తెలుసుకొని అయోధ్యానాథుడు ధనుస్సు గైకొని రెండు వాడి బాణాలతో, వాడి రెండు చేతులూ నరికేసాడు. శ్రీరామబాణంతో కబంధుడు ఉద్ధరింపబడి దివ్యదేహం పొంది, రఘుపతి చరణాలపై వాలి, చేతులు జోడించి నిలబడ్డాడు. నేను దన్ను గర్భాన జన్మించిన కశ్యప సుతుడను. మద్యపానంతో మహా ఉన్మత్తుడనై, స్థూలశిరుడనే ఋషి ఏకాంతంగా అరణ్యంలో తపస్సు చేసుకుంటుండగా నేను పెద్ద కేకవేసి అతడిని భయపెట్టాను. నీవు చండాల పాపఖనివి. కబంధుడవై అరణ్యాలలో పడివుండు అని శపించాడు. కానీ నేను ఆయన కాళ్ళమీద పడి ప్రార్థించగా ఆయన శాప విముక్తిని ప్రసాదించాడు. దశముఖుని వధించటానికి రాముడు తప్పక దండకారణ్యానికి వస్తాడు. అప్పుడు నీకు యథారూపం వస్తుంది అన్నాడు. ఇంద్రపదం కోసం నేను చాలాకాలం జపం చేశాను. ఇంద్రుడు వజ్రాయుధంతో నా నెత్తిన కొట్టాడు. దాంతో తల కడుపులోనికి దిగింది. రెండు కాళ్ళూ నరికేశాడు. పూర్వకర్మ ఫలితంగా చాలా కష్టాలు అనుభవించాను. రామా! నన్ను ఉద్ధరించు. నా శరీరాన్ని అగ్నిదేవుడికి సమర్పించి, భస్మం చెయ్యి. సౌమిత్రి కట్టెలన్నీ పోగుచేసి ఆ కళేబరాన్ని అగ్నిలో వేశాడు. కబంధుడు పుణ్యశరీరం పొంది విమానంలో కూర్చున్నాడు. పరుసవేది స్పర్శించినంతనే లోహం సువర్ణమవుతుంది. ఆ విధంగా కబంధుడు వైకుంఠ ధామానికి వెళ్ళాడు. శంఖ చక్రాది చిహ్నాలు కలవాడు, చతుర్భుజుడు అయిన విష్ణుమూర్తి భక్తుడయిన కబంధుని ఆ విధంగా ఉద్ధరించాడు. విమానంలో కూర్చున్న తరువాత కబంధుడు ఇలా అన్నాడు. అయోధ్య ప్రభువైన రఘునాథా! ఇక ముందు నీవు సుగ్రీవుని స్నేహం చెయ్యి. జగద్వంద్యా! జనకజామాతా!

జలదగాత్రా, జన్మరహితా, జలజనేత్రా! విరించి జనకా! జనార్దనా! జగద్గురో! అంటూ రఘూత్తమునికి నమస్కారం చేసి కబంధుడు మోక్షం పొందాడు.

## శబరి మోక్షం

తదుపరి శబరి ఆశ్రమం వైపు, జగదాత్మయైన రాముడు ప్రయాణం కొనసాగించాడు. శబరి పరమ తపస్విని. తపస్సు చేస్తూ ఆమె ముసలిదై పోయింది. ఆమె ఆశ్రమంలో శ్రీరాముడు మూడు రోజులున్నాడు. ఆమె కందమూలాలు తెచ్చి భక్తి భావంతో రఘురాముని పూజించింది. శబరి తపస్సు పూర్తయిందని గ్రహించి రాజీవనయనుడు ఆమెకు జ్ఞానాన్ని ఉపదేశించాడు. ఆమె వెంటనే ఉద్ధరింపబడి శరీరాన్ని వీడి మోక్షపథాన్ని పొందింది. అప్పుడు సౌమిత్రి పురాణపురుషా! జగదుద్ధారా! అయోధ్యాధీశా! సర్వేశా! నాకు దయతో తత్త్వజ్ఞానాన్ని, సారాసార విచార నిరూపణను బోధించవలసినదని వేడుకున్నాడు. లక్ష్మణుని సందేహాలన్నీ తీర్చాడు రఘురాముడు. జగత్తంతా మాయతో నిండివుంది. సత్యము, శాశ్వతమైనది మోక్షమే. ఆ ప్రకాశించే వస్తువులన్నీ నేనే. నా నామమే ఆత్మజ్ఞానం.

ఇదిలా వుండగా, రఘుపతి హంపీ విరూపాక్షుని వద్దకు చేరాడు. ముందు పంపా సరోవరం, శివునికి విశ్రాంతి నిలయం. దివ్యలతలతో, కొమ్మలతో ఎల్లప్పుడూ మంచి ఫలాలనిస్తుంది. అక్కడ స్ఫటికశిలపై ఘనశ్యాముడైన శ్రీరాముడు కూర్చుని ఉండగా కైలాసంలోని యోగక్షేమాలు తెలుపడానికి మేఘుడు దిగివచ్చాడు. శేషశయనుడైన నారాయణుడు, ఇందిరా రమణుడు, నిర్వికారుడూ, అజితుడూ, సర్వం తానే అయిన ఆ శ్రీరాముడు లక్ష్మణుని తొడపై శిరస్సు ఉంచి శయనించాడు. ఆ సమయంలో రఘునాథునికి సీత జ్ఞాపకం వచ్చింది. బరువుగా ఊపిరి పీల్చుకొని జగత్పితయైన రాముడు 'ఆహా! జానకీ! మృగాంకవదనా! గుణసరిత్తా! పద్మనయనా! సకలలావణ్యా



గుణనిధానా! నన్ను ఎన్నటికైనా కలుసుకొంటావా!' అని ఆక్రోశించాడు. రామునికి విరహజ్వరం వచ్చింది. ఆ సమయంలో కోకిల మధురంగా కూసింది. ఆగ్రహించిన త్రిభువనేశ్వరుడు 'నీ స్వరం ఎప్పటికీ పలకకుండు గాక!' అని శపించాడు ఆ కోకిలను. వెంటనే ఆ తమాలనీలుని వద్దకు కోకిలలన్నీ వచ్చి శరణువేడాయి. అపుడు రాముడు వసంతకాలంలో నా మాట వీగిపోతుంది. ఆడ, మగ మృగాలన్నింటితో రఘునాథుడు ఇలా అన్నాడు. 'మీరు సంయోగిస్తే మిమ్మల్ని వేటగాడు వధిస్తాడు' ఇది సత్యం అన్నాడు. వెంటనే ఆ మృగాలన్నీ శరణు వేడగా వాటికి శాపవిమోచన ప్రసాదించాడు. రాత్రిపూట సంభోగిస్తే వధించబడ్తారు. పగలంతా మీరు ముక్తులే. అప్పుడు ఆడ మగ ఏనుగులు రమించడం చూచి శపించాడు. వాటికి వియోగం తప్పలేదు. ఏనుగు ఏడు దినాలవరకు అచేతనంగా ప్రేతంవలె మూర్ఛిల్లింది. అప్పుడు అవి శరణువేడితే రాజీవ నయనుడు 'జలంలో మైథునం చేస్తే ఎన్నటికీ మూర్ఛరాదు' అని శాపవిముక్తి గావించాడు. నెమళ్ళతో రఘునాథుడు 'నీ ప్రియుడు నపుంసకుడవుతాడు' అని శపించగా, అవి శరణు వేడగానే ఆ జగద్గురువు 'కళ్ళలో నీరు ఒలికే నెమళ్ళ వలన మీ సంతతి వృద్ధి పొందుతుంది' అని అభయమిచ్చాడు. చక్రవాకాలను పిలిచి రఘుపతి 'సూర్యోదయంలో కలియమన్నాడు. రాత్రిపూట మీకు ఎడబాటే' అన్నాడు. ఆడ మగ కాకులపై దృష్టి సారించి 'జీవితంలో ఒకేసారి సంసార సుఖం బడయవచ్చు' నేను సీతావియోగంతో బాధపడుతుండగా మీరు రతి సుఖం అనుభవిస్తూండడం చూచి మీకు దండన విధించాను. అందుకు ప్రతిగా 'రాక్షసులు ఎందరో వస్తారు. వాళ్ళ స్త్రీలందరిని అపహరించండి. సీతకు జరిగినట్లే వారికి జరగాలి. నా ముందు రతి చేష్టలు ఎందుకు చేస్తారు? నా జానకి నాకు దూరమైంది' అని వరదానమిచ్చాడు. అలా ఆ సమయంలో జనకజామాతకు ఎన్నో ఆలోచనలు వచ్చాయి. కోటి సంవత్సరాలు శోధించినా ఆయన గుణాలు గణించ శక్యంకాదు.

ఇదిలా వుండగా ఆ కోదండపాణి ఋష్యమూక పర్వతం పైన వానరులైన నలుని, నీలుని, జాంబవంతుని, సుగ్రీవుని మరియు ఐదవవాడయిన హనుమంతుని చూశాడు. ఉమాకాంతునిగా ఎవరైతే అవతరించారో, వారి జన్మకర్మలు అద్భుతమైనవని తృతీయాధ్యాయంలో వర్ణించాము.

రామవిజయ గ్రంథరాశి నిజంగా వారణాసి. రామకథ విశ్వేశ్వరునికి ప్రియమైనది. ముముక్షువులైన నరులకు ఆ యాత్రలో ఎలాంటి కష్టాలు సంభవించవు. సంసార కార్యాలను వదలి సాదరంగా శ్రవణం చేస్తారు. దీంతో అరణ్యకాండ ముగిసింది. ముందు కిష్కింధకాండ ఆరంభమౌతుంది. రత్నాలగనినుండి రత్నాలు వచ్చినట్లు ఇది భక్తి వైరాగ్యాలగని. దీని పరీక్షకులు సాధుజనులే. బ్రహ్మానందుడూ, పరిపూర్ణుడూ అయిన శ్రీధరుని అనన్యశరణుజొచ్చి ఈ అభంగం సదా అక్షయం కావాలని ప్రార్థిస్తున్నాను. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా శ్రవణం చేస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**పదహారవ అధ్యాయం మధురం**

**అరణ్యకాండ సమాప్తం**

**అధ్యాయము - 17**

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**సా**మాన్యులు, సాధుపుంగవులు బాహ్యదృష్టికి ఒకే పోలికగా గోచరిస్తారు. కానీ సాధుపురుషులు సదా చిదానందఘనులై బ్రహ్మానందసాగరంలో ఓలలాడుతుంటారు. కొంగ, హంస చూపరులకు తెల్లగా ఒకే రకంగా కనబడతాయి. కానీ హంస నీళ్ళను, పాలను వేరుచేయగలదు. ఆ శక్తి కొంగకు లేదు. కాకులమధ్య కోకిల వసించినా వసంతకాలంలో పంచమస్వరంలో కోకిల మాత్రమే మధురంగా కూయగలదు. నక్కలుండే అరణ్యంలోనే సింహం కూడా జీవిస్తుంది. కానీ రెండూ ఒక్కటనగలమా? స్ఫటికం, ముత్యం రెండూ ఒకేలాగు అగుపడినా ముత్యాన్ని మాత్రమే ఏరుకొని భద్రపరచుకుంటారు. పాషాణం, పరుసవేది రెండూ నల్లగా ఒకే రంగులో జడంగా, అతికఠినంగా ఉంటాయి. కానీ పరుసవేది నల్లరంగుగల లోహాన్ని సువర్ణంగా మారుస్తుంది. కస్తూరి, మట్టి రెండూ ఒకే రంగులో ఉంటాయి. కానీ కస్తూరి అందరికీ సువాసనను అందిస్తుంది. శ్రీమంతులకు సుఖాన్నందిస్తుంది. మజ్జిగ, పాలు ఒకే రంగులో ఉంటాయి. కానీ పాలలోని తీపి అందరినీ రంజిస్తుంది. అలాగే సాధుపుంగవులను రూపాన్నిబట్టి ఇతరులతో సమానంగా చూడరాదు.

అలాంటి ఆనందఘనులైన సాధువులు పరమపావనమైన రామవిజయ గ్రంథాన్ని అత్యంత ఆదరంతో శ్రవణం చేస్తున్నారు. రాబోయే కిష్కింధాకాండ అనే కమలంపై, వాగ్దేవియనే భ్రమరం విహరిస్తోంది. దానిలోని మాధుర్యాన్ని విజ్ఞులు సదా గ్రోలుతారు. షోడశాధ్యాయంలో రఘువీరుడు పంపాసరోవరానికి రావడాన్ని గూర్చి చెప్పుకున్నాం. శంకరుడు ఎవరినైతే నిరంతరం ధ్యానిస్తాడో ఆ సజల జలదగాత్రుడు ఋష్యమూక పర్వతం పైకి వచ్చాడు. అక్కడ సింహబలురైన వానరులు ఐదుగురు రామలక్ష్మణులకు తారసపడ్డారు.

రత్నమండితమైన మేరుపర్వతాన పంచశృంగాలు విరాజిల్లుతున్నట్లు, ఉదయాచలంపై పంచాదిత్యులు వెలసినట్లు గోచరించారు. శ్రీరామునికి సహాయం చేయడానికి పంచమహాభూతాలు ఆ వానర పంచాయతన రూపంలో అవతరించాయా అన్నట్లున్నది. పంపాసరోవర తీరంలో శ్రీరాముడు స్ఫటిక శిలవద్ద సౌమిత్రి తొడపై శిరస్సు నుంచి పడుకుని ఉండగా సుగ్రీవుడు వారిని చూచి భయభ్రాంతుడయ్యాడు. మహావీరులైన ఈ ఇద్దరు మానవులను నన్ను హతమార్చుటకై వాలి పంపాడనుకొని భీతిల్లి వెంటనే వెనుదిరిగి అక్కడున్న నలుగురు వానర వీరుల్ని సంప్రదించకుండా వనాలన్నీ లంఘిస్తూ వాయువేగంతో పారిపోసాగాడు.

అప్పుడు హనుమంతుడు పరుగున వెళ్ళి సుగ్రీవుని నిలిపి 'నీవు ఎందుకు భయపడి పారిపోతున్నావు? అంత విపరీతం ఏం జరిగింది?' అని ప్రశ్నించాడు. సుగ్రీవుడు 'వారిరువురూ గొప్ప ధనుర్ధారులు, ప్రచండవీరుల్లా కనబడుతున్నారు. వాళ్ళను చూస్తూనే నాకు విపరీతమైన భయంతో గుండెలదురుతున్నాయి. ఈ రోజు తెల్లవారుఝామున స్వప్నంలో, ఇద్దరు ధనుర్ధారులు నాకు సహాయం చేసి, వాలిని సంహరించి కిష్కింధారాజ్యాన్ని నాకిచ్చారు. ఈ ఉదయమే ఆ ధనుర్ధారులు నాకు కనబడ్డారు. కానీ విపరీతమైన భయం వల్ల వారిని కలిసేందుకు నాకు ధైర్యం చాలలేదు' అన్నాడు. అప్పుడు వాయునందనుడు 'మేం నల్గురం ప్రధానులం ఉన్నాము. యముడినైనా శిక్షించి నిన్ను సర్వదా రక్షిస్తాము. పంపాతీరం వద్ద ఆ ఇద్దరు వీరులు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నారు. వారివురూ ఇంద్ర, బృహస్పతులవలె గోచరిస్తున్నారు. ఒకరు తపస్వి, ఒకరు ఉదాసి. ఒకరు ఔదార్యవంతుడు, మరొకరు ధైర్యవంతుడు. ఒకరు పుణ్యం, మరొకరు యశస్సు. ఒకరు జ్ఞాని, మరొకరు విజ్ఞాని. ఒకరు ఆనందం, మరొకరు ప్రశాంతం. ఒకరు సగుణుడు, మరొకరు నిర్గుణుడు. అలా రెండూ హరి స్వరూపాలే. ఒకరు సాధకుడు, మరొకరు సిద్ధుడు. ఒకరు వైరాగ్యం,



మరొకరు బోధ. ఒకరు మోక్షం, మరొకరు బ్రహ్మానందం. వారి రాక చూచి నా హృదయంలో ఆనందం కలుగుతున్నది. నేను వెళ్ళి వాళ్ళ సమాచారం కొంచెమైనా తెలుసుకుని వస్తాను' అన్నాడు. చతురులు మాటల్లోనే ఎదుటివారి ఆంతర్యం తెలుసుకోగలరు. రుచి చూసి పదార్థ స్వారస్యాన్ని తెలుసుకున్నట్లు, అరుణోదయం తర్వాత చీకటి తొలగినట్లు, మంటలు మణిగితే అగ్ని మందగించినట్లు, కష్టకాలం రాగానే కపటబంధుమిత్రులు కనుమరుగైనట్లు, ఇంద్రియాలను నియమించటం వల్లనే యోగాచరణ, దయవల్ల శాంతి, తర్కం వలన ధైర్యం, వేదాంత శ్రవణంవల్ల వైరాగ్యం, ప్రేమరసంవల్ల భక్తి, నిరపేక్షవల్ల విరక్తి ఇహపరాలలో అనిర్వచనీయమైన ముక్తి పొందినట్లు నీ ఆంతర్యమంతా నాకు తెలుసు. నీవు స్వస్థుడవై ఉండు. ఏదైనా విపరీతం జరిగితే నాకు చేతితో సంకేతమియ్యి. ఈ విధంగా చెప్పి హనుమంతుడు త్వరగా పంపాతీరానికి వచ్చాడు. వటవృక్షం నీడలో రఘునాథుడు పడుకొని ఉన్నాడు. శ్రీరాముడు పడుకొన్న స్ఫటికశిల దేదీప్యమానంగా శేషతల్పంవలె శుభ్రవర్ణంలో విరాజిల్లుతున్నది. అప్పుడు హనుమంతుడు చెట్టుపైకెక్కి రఘునాథుని చూచి హర్షాతిరేకంతో ఎగురుతూ కోతిచేష్టలు చేయసాగాడు. ఆ వానరాన్ని రఘురాముడు సౌమిత్రికి చూపించి, ఆ కపివీరుడే మదనుని మదమడంచినవాడు. మెరుస్తున్న బంగారు కౌపీనాన్ని ధరించిన ఆ వీరుని వజ్రబంధనాలలో మదనుని ఆటలు సాగలేదని తెలిపాడు. ఆ వీరుని చూస్తుంటే స్నేహం చేయాలనిపిస్తున్నదన్నాడు.

### హనుమంతుడు శ్రీరాముని దర్శించడం

గుప్తంగా ఉన్న తన కౌపీనాన్ని చూడగలిగిన శ్రీరాముణ్ణి చూడగానే ఆంజనేయుడికి తన తల్లి మాటలు గుర్తుకొచ్చాయి. 'నా స్వామివి నీవే' అనుకున్నాడు. నా అద్భుతబలాన్ని కోమలుడైన ఈయన ముందు ప్రదర్శించి నాపై ఈయనకు నమ్మకం కలిగిస్తాను అనుకొని గురువు ముందు శిష్యునివలె

బలప్రదర్శన చేశాడు. ఒక మర్రికొమ్మను విరిచి బలంగా రాముని మీదకు వేశాడు. అది చూచి ఊర్మిళానాథుడు వేగంగా వింటికి బాణం సంధించాడు. కౌసల్యానందనుడు 'ఒక్క క్షణం ఓపికపట్టు. ఆ బాలుని చేష్టలు వినోదం కలిగిస్తున్నాయి. అతనిపై బాణం వేయటం దేనికి' అంటూ వారించాడు. అప్పుడు హనుమంతుడు ఇంకొక కొమ్మను వేగంగా విసిరివేశాడు. దాన్ని రాముడు తన కోదండంతో అడ్డుకొనగా అది గడ్డిపోచవలె ఆకాశంలోకి ఎగిరిపోయింది. ఇంకా చాలా వృక్షాలు, రాళ్ళు వాయునందనుడు విసిరేశాడు. వాటన్నింటిని కౌసల్యానందనుడు కోదండంతో ఎగరగొట్టాడు. హనుమంతుడు హుంకరించి ఐదు పర్వతశిలలను విసిరేశాడు. అయినా రామునిలో ఎట్టి కదలిక లేదు. ఉల్లాసంగా ఎంతో ప్రసన్నంగా కానవచ్చాడు. రఘునాథుని వింటి నుండి వెలువడ్డ బాణం క్షణంలో ఐదుపర్వతాలను చూర్ణంచేసింది. ఆ బాణం తాకిడి కొంచెం హనుమంతుడికి తగిలింది. దానివల్ల హనుమంతుడు గాలిలోకెగిరి ఆకాశంలో గిరగిర తిరగసాగాడు. ప్రాణం ఉక్కిరిబిక్కిరి అయింది. సుడిగాలిలో చిక్కిన గడ్డిపోచవలె వాయునందనుడు గాలిలో పల్టీలు కొట్టసాగాడు. తండ్రియైన వాయుదేవుడు సమయానికి వచ్చి ఆత్మజుని తన హృదయానికి గట్టిగా హత్తుకుని 'నాయనా! నువ్వు వెంటనే రామచంద్రుని శరణువేడు. క్షీరాబ్ధిశయనుడైన ఆ శేషశాయియే శ్రీరామునిగా అవతరించాడు. త్రికరణశుద్ధిగా ఆయన పాదాలు పూజించు' అన్నాడు. వెంటనే హనుమంతుడు శ్రీరాముని వద్దకు వచ్చి ఆయనకు సాష్టాంగదండప్రణామం చేసి పైకిలేచి ముప్పిరిగొన్న ప్రేమతో మరల శ్రీరాముని చరణాలపై వాలిపోయాడు. రఘురాముడు పవనకుమారుని పైకి లేపి హృదయానికి హత్తుకున్నాడు. దేవతలు జయజయధ్వానాలు చేశారు. శ్రీరాముడు హనుమంతునితో 'సూర్యచంద్రులున్నంత వరకు అమోఘమైన నీ బలం అక్షయంగా ఉంటుంది' అన్నాడు. కైకేయి చేతుల్లోని పూర్ణపిండం అఖండంగా అంజనాదేవి చేతిలో పడింది. దానివల్ల రాఘవుని కన్నా ముందుగా ప్రచండమైన ఈ వానర వీరుడు జన్మించాడు. హనుమంతుడు రాముని ఎదుట చేతులు జోడించి 'హే కరుణా సముద్రా! జగదుద్ధారా! దీనబంధూ! హే రామా! త్రిభువన సుందరా! జనకజామాతా! నవపంకజనేత్రా! పురాణపురుషా! జగదాత్మా!' అని స్తుతించాడు. హనుమంతుడు రామునికి పరమభక్తుడని తెలుసుకొని లక్ష్మణుడు ఆయన చేయిపట్టుకొని కూర్చుండబెట్టాడు. శ్రీరామ చరణాలను స్పృశించి మారుతి 'రఘువీరా! నాదొక విన్నపం. ఋష్యమూకపర్వతం ఆవలివైపు సుగ్రీవుడనే కపిరాజు వసిస్తున్నాడు. ఆయన మిమ్ములను కలిసినప్పుడు అభయం ప్రసాదించవలసింది. ఆయన చేతుల మీదుగా మున్ముందు ఎన్నో కార్యాలు జరుగవలసి ఉన్నవి' అని విన్నవించాడు. దానికి రఘునందనుడు సుగ్రీవుడెవరని అడిగాడు. అప్పుడు హనుమంతుడు చెప్పిన పూర్వకథను సావధానంగా వినండి.



### వాలిసుగ్రీవుల జన్మవృత్తాంతం

బ్రహ్మదేవుడు ధ్యానం చేసుకొంటుండగా తన కంటినుండి ప్రేమబాష్పం ఒకటి అంజలిలో పడింది. దానినుండి ఋక్షరాజు జన్మించాడు. వానర వేషధారియై అతి బలశాలియై వనములందు తిరుగుతూ ఆ బ్రహ్మప్రియనందనుడు ఒకనాడు శివలోకం వెళ్ళాడు. అక్కడ అందమైన సరోవరాలు చూశాడు. అక్కడి చెట్లనిండా ఫలాలు ఉన్నాయి. కాని ఏ నరుడైనా అక్కడి నీటిని తాకితే వాడు వెంటనే స్త్రీగా మారిపోతాడని పార్వతీదేవి పూర్వం ఘోరశాపం ఇచ్చింది. ఈ విషయం తెలియని ఋక్షరాజు సరోవరంలో స్నానం చేసి బయటకు రాగానే స్త్రీగా మారిపోయాడు. అత్యంత సుందరంగా ఉన్న స్త్రీని చూచి సూర్యుడు, ఇంద్రుడు మంచి అందగత్తె లభించిందని వచ్చారు. స్త్రీగా మారిన బ్రహ్మపుత్రుడు సిగ్గుపడి కూర్చొని ఉండడంతో సంభోగించటానికి

వీలుపడక ఇద్దరూ వీర్యాన్ని కార్చారు. మొదట ఇంద్రుడి వీర్యం తలపై పడింది. వెంటనే వాలి జన్మించాడు. తరువాత సూర్యుని వీర్యం కంఠంపై పడింది. తత్ఫలితంగా సుగ్రీవుడు జన్మించాడు. తన పుత్రుడు స్త్రీగా మారిన విషయం తెలుసుకుని బ్రహ్మ వానికి శాపవిముక్తిని ప్రసాదించమని పార్వతిని ప్రార్థించాడు. అప్పుడు పార్వతీదేవి తన శాపాన్ని ఉపసంహరించగా ఋక్షరాజుకు పూర్వరూపం తిరిగి వచ్చింది. కొడుకును, ఇద్దరు మనవలను తీసుకొనివెళ్ళి బ్రహ్మ భూలోకంలో అద్భుతమైన కిష్కింధానగరాన్ని నిర్మించి ఇచ్చాడు.

ఋక్షరాజు భూమండలంలో కిష్కింధారాజ్యాన్ని చాలాకాలం పాలించాడు. వాలి, సుగ్రీవులిరువురికి తల్లి, తండ్రి కూడా ఋక్షరాజే. ఒక సుమూహర్తంలో వాలికి అర్ధరాజ్యమిచ్చి పట్టము గట్టి ఋక్షరాజు యోగసాధన చేసి బ్రహ్మపదం పొందాడు. తరువాతి కాలంలో వాలి, సుగ్రీవులిరువురు కలిసిమెలిసి పాలన చేయసాగారు. ఇంద్రుడు వాలిని బలాఢ్యుని చేయడానికి విజయమాలనిచ్చాడు. ఆ మాల ధరించిన వారి ధాటికి శత్రువు దుర్బలుడౌతాడు. సూర్యుడు సుగ్రీవుని చేయిపట్టుకుని తీసుకొచ్చి హనుమంతుని చేతిలో పెట్టి 'ఈతనిని దయతో నీవు కాపాడవలసింది' అని ప్రార్థించాడు. సుగ్రీవునికి వాలికి మధ్య రాజ్యసంబంధంగా వైరం వచ్చింది. వాలి కోపంతో సుగ్రీవుని చంపటానికి ప్రయత్నించాడు. సుగ్రీవుని భార్య, రూపవతి అయిన రుమను చెరపట్టాడు. ఆరునెలల యుద్ధం తరువాత సుగ్రీవుడు వాలి ధాటికి తట్టుకోలేక ఋష్యమూక పర్వతానికి పలాయనం చిత్తగించగా, సూర్యదేవునికిచ్చిన మాటప్రకారం ఆంజనేయుడు సుగ్రీవునికి అండగా నిలిచాడు. ఇది విని అయోధ్యానాథుడు 'హనుమా! నేను మనఃస్ఫూర్తిగా ప్రమాణం చేస్తున్నాను. సూర్యనందనుడు నాకు అత్యంత ప్రియుడు. వెంటనే అతడినిక్కడకు తీసుకొనిరా! అతని శత్రువు ఎక్కడ ఉన్నా సరే వెదికి పట్టుకుని వధించి, సుగ్రీవుని సింహాసనాధిష్ఠుని



చేస్తాను. ఆ తరువాతే చిద్రత్నమైన జానకిని వెదకుతాను' అని అన్నాడు. హనుమంతుడు వెంటనే ఎగిరి వెళ్ళి సుగ్రీవునితో ఈ మహద్భాగ్యాన్ని గూర్చి వివరించి సీతావియోగంతో ఆ రాఘవుడు, రుమావియోగంతో నీవు సహజంగా దు:ఖిస్తున్నావు. అందువల్ల ఒకరి పనులొకరు పూర్తిచేయటంలో పరస్పరం సహాయం చేసుకోండి అని చెప్పాడు. మారుతి మాటలు విని మిత్రనందనుడు నృత్యం చేస్తూ, ఆనందంగా హనుమంతుని కౌగిలించుకున్నాడు. 'రఘునాథుని స్నేహాన్ని ఒనగూర్చి నిజంగా నాకు గొప్ప ఉపకారం చేశావు. నీవు నాకు సద్గురుని వంటివాడవు. నీకు ఎలా కృతజ్ఞతలు తెలిపేది? నీ మేలు నేనెన్నటికీ మరువలేను. దశరథాత్మజుడైన రాఘవుని కీర్తిని గూర్చి పూర్వమే విని ఉన్నాను. ఆయన పంచవటిలో చేసిన రాక్షస సంహారం గూర్చి కూడా విన్నాను' అని అన్నాడు.

పిదప వానర సైన్యాన్ని, నల, నీల, జాంబవదాది వానర వీరులను తీసుకుని సుగ్రీవుడు త్రిభువన సుందరుడైన రఘువీరుని దర్శించాడు. కోటానుకోట్ల మన్మథులు కూడా సౌందర్యంలో సుగుణఖనియైన శ్రీరాముని ముందు దిగదుడుపే. అట్టి రఘువీరుని కనులారాగాంచి పులకితుడైన సుగ్రీవుడు శ్రీరామ చంద్రునికి సాష్టాంగనమస్కారం చేశాడు. నల నీలాది వానరులందరూ సీతాపతిని కనులారా చూడటానికి పరుగున ముందుకు వచ్చారు. రెండుచేతులతో సుగ్రీవుని పట్టుకుని పైకిలేపి ఆలింగనం చేసుకున్నాడు రఘువీరుడు. క్షుధార్తునకు క్షీరసాగరం లభించినట్లు, దరిద్రునికి అపారనిధి దొరికినట్లు, సోమరిపోతుకు ఇంట్లో అకస్మాత్తుగా కల్పవృక్షం లభించినట్లు, తప్పిపోయిన బాలుడు అనుకోకుండా తల్లిని కలుసుకున్నట్లు, దప్పికగొన్నవాని ఎదుట గంగ ఉద్భవించినట్లు, సుగ్రీవుని మనస్సులో బ్రహ్మానందం పొంగిపొరలింది. జీవుడు శివుడు ఒక్కటేనన్న భావం ఆ కలయికలో నిరూపణమైంది. ఆ సమయంలో దేవతలందరూ విమానారూఢులై వైభవంగా

పూలవర్షం కురిపించారు. నలుడు, నీలుడు, జాంబవంతుడు మొదలైన వానర ప్రముఖులందరినీ రాముడు ఆలింగనం చేసుకున్నాడు. ఆ ఆనందానికి అవధులు లేవు.

అప్పుడు హనుమంతుడు చెట్ల కొమ్మలను ప్రోగుచేసి అగ్ని రగిల్చి, దాని కిరువైపులా రామసుగ్రీవులను కూర్చోబెట్టి ఒకరి కార్యాన్ని మరొకరు చేయడానికి అగ్నియే సాక్షీభూతుడని అన్నాడు. రఘువీరుడు 'ఓ రవికుమారా! నీ రాజ్యాన్ని, భార్యను విడిపించి నీకిస్తాను. నా మాట ఖచ్చితం, నేను రేపటినుండే ఆ పనిలో ఉంటాను' అన్నాడు. సుగ్రీవుడు 'సీతను ఎత్తుకెళ్ళిన వానిని సంహరించి మంగళప్రదమైన సోదరి జానకితో సహా నిన్ను అయోధ్యకు పంపిస్తాను' అని రాఘవునికి ప్రమాణం చేశాడు. సుగ్రీవుని ప్రమాణం విని అందరూ ఆనందంతో పెద్ద ఎత్తున కేకలు వేయసాగారు. ఆ శబ్దాలు మిన్నంటి దిక్కులన్నీ ప్రతిధ్వనించాయి. సుగ్రీవుడు రఘునాథునితో 'కొంతకాలం ముందు అందమైన స్త్రీని రాక్షసుడొకడు వేగంగా ఆకాశమార్గాన తీసుకెళ్ళడం మేమంతా కళ్ళతో చూచాం. కరుణాపురితమైన ఆక్రందనలతో ఆమె 'ఓ కోదండపాణీ! కరుణాకరా! రామా! నేను ప్రాణపాయ స్థితిలో ఉన్నాను. పరుగున రా!' అని రోదిస్తూంది. ఇంకో క్షణం 'లక్ష్మణా! పరమపవిత్రా! పరుగున రా!' అని ఆక్రందిస్తూ తన ఉత్తరీయాన్ని చింపి ఆభరణాలన్నీ మూటకట్టి పడేసింది. మేము వాటిని జాగ్రత్త చేశాము' అన్నాడు.

ఇది విని రాముడు విస్మితుడైనాడు. 'వానరా! ఇది చాలా అద్భుతం. సత్వరం ఆ ఆభరణాలు తెప్పించండి' అని చెప్పగా హనుమంతుడు ఆ ఆభరణాలను తెచ్చి రఘువీరునికి అందించాడు. వెంటనే ముడిని విప్పి ఆభరణాలన్నీ చూచి 'హా ప్రియే!' అంటూ రాముడు నేలపై మూర్ఛిల్లాడు. ఆ ఆభరణాలన్నింటినీ గుండెకు హత్తుకొని శోకార్ణవంలా పడివున్న రఘువీరుని చూచి వానరులందరికీ కళ్లు చెమర్చాయి. గొంతు గద్గదమయింది. సీత



గుణగుణాలను గుర్తు తెచ్చుకుంటూ విలపిస్తున్న రఘునందనుని వద్దకు లక్ష్మణుడు పరుగున వచ్చి పాదాలపైబడ్డాడు. శ్రీరాముడు లక్ష్మణునితో 'ఈ అలంకారాలన్నీ సరిగ్గా చూడు. ఇవన్నీ ప్రతిరోజు జానకి ధరించేవే' అన్నాడు. సౌమిత్రి ఆ ఆభరణాలను సాదరంగా పరీక్షించి 'ఆ నూపురాలు సీతాదేవి చరణాలలో చూచాను. అవి నాకు బాగా తెలుసు. మిగతా ఆభరణాలు నాకు తెలియవు' అన్నాడు. 'ఈ ఆభరణాలు ప్రతిరోజూ సీత ధరించేవే' అని రాముడు అనగా, సౌమిత్రి, 'తల్లి అయిన సీతమ్మను నేనెన్నడూ చూడలేదు. త్రికాలాల్లో పాదాభివందనం చేసేటప్పుడు చరణాలకు ఉన్న నూపురాలు మాత్రం చూచాను' అన్నాడు. ఆ మాటలకు రఘునందనుడు ఆనందభరితుడై 'నాయనా! నీవు దివ్యరత్నానివి, వైరాగ్యఖనివి. భక్త సరోవరంలో రాజహంసవు. జ్ఞానముత్యాల పేటికవు. శత్రువుల పాలిటి అగ్నివి, సూర్యుని వలె సదా నిర్దోషివి' అని కొనియాడాడు.

'రవికులపుంగవా! జానకి నిన్ను కలిసేవరకు నేను యమయాతనలనైనా అనుభవిస్తాను. ఇది కల్పాంతం వరకు నిశ్చయం. నలుడు, నీలుడు, జాంబవంతుడు జగద్విఖ్యాతులైన నా ప్రధానులు ఒక్కక్షణం లోపల భూప్రదక్షిణం చేసి రాగలరు. రఘుపతీ! నీమీద ఆన. స్వర్గమృత్యుపాతాళాలు శోధించి జానకిని తెస్తానని ముమ్మారు ప్రమాణం చేస్తున్నాను' అన్నాడు సుగ్రీవుడు. దానికి రాముడు 'నీకు రుమను, రాజ్యాన్ని ఇవ్వకుండా సీతను వెతకవద్దు. ఇది నా ఆజ్ఞ. మొదట నీ పని నెరవేరాలి. ఆ తరువాతనే సీతాన్వేషణ. ఇది త్రికరణశుద్ధిగా నా ప్రతిజ్ఞ. త్రికాలాల్లో అది తప్పదు. గురుకృపలేని జ్ఞానం, ప్రీతిలేని భజన, ప్రేమలేని కీర్తన, స్నానంలేని అనుష్ఠానం, అతిథిలేని భోజనం, వీరుడులేని రణరంగం, విద్యలేని విప్రుడు వీటిని సకల జనులు నిందిస్తారు. అలాగ నీ కార్యం నెరవేర్చకనే ఎన్నటికీ సీతను వెదకవద్దు' అని చెప్తుండగా వీరులలో మేటియైన రఘువీరుని శరీరం ఉత్తేజితమైంది. వింటికి

బాణం సంధించి వాలిని పిలిపించమన్నాడు. సుగ్రీవుడు పరుగున వెళ్ళి రాముని పాదాలు పట్టుకుని, చేతులుజోడించి 'వాలిని చంపడం తప్పనిసరి. అయితే మీరు వానితో నేరుగా యుద్ధం చేయవద్దు. హఠాత్తుగా బాణం వేసి వాడిని సంహరించండి' అని వేడుకున్నాడు. శ్రీరాముని కోరికపై జరిగిన వృత్తాంతమంతా సుగ్రీవుడు నివేదించసాగాడు. మహిషాసురుని కుమారుడు దుందుభి. వాడు పరమబలిష్ఠుడు, గర్వి. తప్పతాగి, ఎవరితోనైనా యుద్ధం చేయడానికి ఎప్పుడూ అరణ్యాలలో తిరుగుతుండేవాడు. కానీ రణరంగంలో వాడికి ఎవ్వరూ ఎదురు నిలవలేకపోయేవారు. ఒకసారి ఆ రాక్షసుడు యముడి వద్దకు వెళ్ళి తనకు యుద్ధఫలమిమ్మని అడిగాడు. అప్పుడు యముడు వాడిని కిష్కింధలో వాలివద్దకు వెళ్ళమని సూచించాడు. యముడి మాటలు విని వాడు పాము కలుగులోకి ఎలుక వెళ్ళినట్లు, పులి మాటేసిన పొదలోనికి నక్క వెళ్ళినట్లు కిష్కింధకు వెళ్ళాడు. ఆ రాక్షసుడు గట్టిగా వేసిన కేక విని వీరుడైన వాలి పరుగున వచ్చాడు. మృగేంద్రుడు దూరంనుండి ఏనుగును చూచి లంఘించే రీతిగా వాలి నూరుయోజనాల వైశాల్యం కలిగిన ఆ రాక్షసుని పైకి లంఘించి కాలితో ఒక్క తన్ను తన్నాడు. వాలి పాదతాడనానికి ఆ రాక్షసుడు వెంటనే భూమిపై పడ్డాడు. ఆ ధ్వనికి భూమండలమంతా అదిరింది. విగత జీవుడైన ఆ ప్రేతాన్ని కోపంతో గిరగిరా త్రిప్పి వాలి ఋష్యమూక పర్వతంపైకి విసిరి వేశాడు. నూరుయోజనాల వైశాల్యం కలిగిన ఆ రాక్షసుని కళేబరం అక్కడున్న ఋష్యాశ్రమాలన్నింటినీ ధ్వంసం చేసింది. అది చూచి ప్రముఖులైన మాతంగ ఋషీశ్వరులు వాలికి శాపం ఇచ్చారు. ఆ శాపకారణంగా శక్రనందనుడైన వాలి ఈ పర్వతంపై కాలుమోపితే వెంటనే విగతజీవుడౌతాడు. అప్పటినుండి ఆ దుందుభి ప్రేతం ఇక్కడే పడివుంది.

'మయాసురుడనేవాడు దుందుభి కొడుకు. కీటకం ఖాండవవన దహనంపై ప్రతీకారం తీర్చుకోవాలని అగ్నివద్దకు ఆత్రుతగా వెళ్ళినట్లు, పర్వతంపై



పిడుగుపడినట్లు, తండ్రికి జరిగిన అవమానుషానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకొన్న మయాసురుడు వాలి ముష్టిఘాతాలకు రక్తం కక్కుతూ పాతాళబిల ద్వారం గుండా పారిపోసాగాడు. వాడి వెనుకనే వాలి కూడా పరుగెత్తాడు. ఓ రాఘవా! బిలద్వారానికి నేను రక్షణగా చాలా రోజులు ఉన్నాను. అప్పుడు యక్షులు, గంధర్వులు అంతా కలిసి నన్ను కిష్కింధకు తీసుకుని వెళ్ళాలని పరుగున వచ్చారు. రాజు లేకపోతే రాజ్యాన్ని ఎవరు రక్షిస్తారు? భయంతో వానరులంతా దేశం వదిలి వెళ్ళిపోతున్నారు అని ప్రధానులు, ప్రజలు పరిస్థితిని విన్నవించారు. అప్పుడు బిలద్వారానికి పర్వతాన్ని అడ్డంగా పెట్టి కిష్కింధకు త్వరగా తిరిగి వచ్చాను.'శత్రుసంహారం ముగిసిన తర్వాత ప్రజలంతా సుఖంగా ఉన్నారు. ఇరువది నెలలు వాలి గుప్తంగా బిలంలో ఉండిపోయాడు. ప్రధానులు, ప్రజలు అందరూ వాలి మరణించాడని అనుకున్నారు. అందరూ బలవంతం చేసి నన్ను రాజ్యాభిషిక్తుని చేశారు. తదుపరి మయుని శిరస్సును చేతబట్టుకుని వీరుడైన వాలి తిరిగి వచ్చాడు. ఇరువదిమాసాలు నిరాహారంగా ఉన్నందువల్ల బిలద్వారం అతనికి కనబడలేదు. వాలి ఎంతో దిగులుపడి ఆందోళన చెందాడు. సూర్యుడు ఉదయించిన తర్వాత ద్వారం కొంచెం కనపడింది. గోళ్ళతో ఆ పర్వతాన్ని వెల్లకిల పడేశాడు. సంతోషంతో ఆకాశాన్ని అంటే సింహగర్జన చేశాడు. ఆ సమయంలో నాకెందుకో అపారమైన దుఃఖం కలిగింది. రాక్షసుని చంపి అన్న కిష్కింధవైపు వస్తున్నాడని తెలిసి నేను చాలా ఆందోళన చెందాను. నా రాజ్యభోగాన్ని కళ్ళారా చూసి వాలి మనసెంతో క్షోభించింది. జ్ఞానహీనుడైన శిష్యునిపై గురువు, ప్రేమహీనుడైనవానిపై మిత్రుడు ఎలా కోపిస్తాడో అలా వాలి క్రోధించి శస్త్రాలు తీసుకుని నా వెంటబడ్డాడు. వాలిని అడ్డగించే వారెవ్వరూ లేరని తెలిసి నేను, నలుడు, నీలుడు, జాంబవంతుడు నా ప్రాణసఖుడైన హనుమంతునితో సహా పారిపోయాను. దారిలో నన్ను బాగా కొట్టి దౌర్జన్యంగా

నా భార్యయైన రుమను తీసుకుని వెళ్ళాడు. ఓ సీతాపతీ! మేమప్పటినుండి ఈ ఋష్యమూకపర్వతమే నివాసంగా చేసుకుని ఉన్నాము. శాపం వలన వాలి ఇక్కడకు రాలేని కారణంచేత నిశ్చింతగా ఉన్నాము.'

'ఓ రఘురామా! ఆరు నెలలు మా ఇరువురి మధ్య ఘోరయుద్ధం జరిగింది. మేమిరువురం సమ బలులం. కానీ వాలి మెడలో విజయమాల ఉండటం వలన వాని బలం పెరిగి ఎదుటి వాని బలం తగ్గుతుంది. భయంకరంగా పెరిగి అసమానంగా ఉన్న ఏడు తాటిచెట్లను ఒకే బాణంతో నిమిషంలో ఎవరైతే ఛేదిస్తారో వారి చేతిలో వాలి మృతి చెందుతాడని భవిష్యవాణి పేర్కొంది' అని సుగ్రీవుడు చెప్పగానే సీతారమణుడు ధనుస్సు గైకొని అర్ధచంద్ర బాణాన్ని ఆకర్ణాంతం సారించాడు. పైకిలేచి కుడికాలుని తొడలపై వరకు ఎత్తి సర్వసన్నద్ధుడై వెనుక లక్ష్మణుడు నిలబడి ఉండగా ఆ ఏడు తాటిచెట్లను మొదలంటా ఒకే బాణంతో నేలకూల్చాడు. ఆ వేగానికి మొదళ్లతో కూడా ఏడు తాటిచెట్లున్న ప్రదేశమంతా శుభ్రమై నేలమట్టమయింది. ఆ ఏడు తాటిచెట్లు ఉన్న ప్రదేశంలో దుందుభి ప్రేతం పడి ఉండడాన్ని రామునికి చూపించారు. ఇంతలో రాఘవుడు కాలిబొటనవ్రేలితో ప్రేతాన్ని ఎగరేశాడు. ఆ ప్రేతం గడ్డిపోచవలె ఎగిరి దిగంతాలకావల పడింది. అద్భుతమైన రాముని ప్రతాపాన్ని చూచి సుగ్రీవుడు రాముని కాళ్ళపై పడ్డాడు. అప్పుడు ధనుర్ధారి అయిన రఘుపతి 'సుగ్రీవా! నీవు వెంటనే కిష్కింధకు వెళ్ళి వాలిని యుద్ధానికి పిలుచుకురా!' అన్నాడు. ఈ మాటలు విన్న సుగ్రీవునికి చాలా ఆవేశం వచ్చింది. రామునితో, 'మీరు వాలిని వధించడం నిశ్చయం. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఓ కమలదళాక్షా! కృపాఘనా! నీ మాటల్ని వీనులవిందుగా సేవిస్తే స్వానందమనే అమృతజలాలు వర్షిస్తాయి' అంటూ సుగ్రీవుడు సంతృప్తుడైనాడు. శ్రీరాముడు వదిలిన అమృతబిందువు సుగ్రీవుని కర్ణచకోరంలో పడింది. శ్రీరాముని మాటలు విన్న అతడి కర్ణపుటాలు సంతృప్తినొందాయి. కానీ,



సుగ్రీవుడు దాశరథితో 'రామా! నాకు ఇంకొక కోరిక వుంది. దాన్ని కూడా తీర్చు. ఒకే బాణంతో ఉన్నట్లుండి వాలి ప్రాణం తీయాలి' అని వేడుకున్నాడు. భక్తవచన పాలకుడైన ఆ జగన్మోహనుడు 'అవశ్యం. అలాగే జరుగుతుంది' అన్నాడు.

**వాలిసంహారం**

సుగ్రీవుడు కిష్కింధకు వెళ్ళి గట్టిగా సింహనాదం చేశాడు. దాంతో నగరమంతా భయభ్రాంతమైంది. వాలి ఆశ్చర్యచకితుడై విజయమాలను మెడలో ధరించి పరుగెత్తుకుని వచ్చాడు. అప్పుడు వాలి 'ఇవాళ వీడు విపరీతమైన కల్లోలం సృష్టిస్తున్నాడు. వీడికి ఎవరు సహాయం వచ్చారో?' అన్నాడు. సమాధానంగా తార 'స్వామీ! నా మాట వినండి. అంగదుడు వేటకు వెళ్ళినపుడు ఋషులంతా రాముడు సుగ్రీవునికి అండగా ఉన్నాడని అనుకుంటున్నారట. అందువల్ల ఓ రాజేంద్రా! మీరు యుద్ధానికి వెళ్ళవద్దు' అంటూ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలింది. కానీ ఆ ఇంద్రపుత్రుడు ఆమె మాట మన్నించలేదు. 'ఏనుగు ఘీంకారం విని సింహం ఎలా శాంతంగా ఉండగలదు? లేడి బలప్రదర్శన చేస్తే శార్దూలం చూస్తూ ఉంటుందా? ఎండిన వనంలో ప్రళయాగ్ని శాంతంగా ఎలా ఉండగలదు' అని వాలి తారను సమాధానపర్చాడు. అందుకు తార 'ఓ ప్రాణప్రియా! ఈ విషయం గమనించండి. ఆరునెలల నుంచి యుద్ధంచేసి రక్తసిక్తమైన తర్వాత కూడ, మరలా మూడవ రోజు ఉల్లాసంగా గర్జిస్తూ సుగ్రీవుడు ఈ రోజు వచ్చాడంటే నాకెందుకో అనుమానంగా ఉన్నది. అతడికి సహాయంగా వాయుకుమారుడు, ఎవరో వీరులు కూడా వచ్చారట' అంది తార. దానికి సమాధానంగా 'నేను ఈ రోజు సుగ్రీవుణ్ణి చంపకుండా తిరిగిరాను. నీవు, అంగదుడు సుఖంగా రాజ్యభోగాలు అనుభవించండి' అంటూ వాలి వెంటనే ఉన్న పళంగా కొదమసింహంవలె మాతంగమహాముని ఆశ్రమం వైపు

లంఘించాడు. ఒక పర్వతంపై మరొక పర్వతం విరుచుకుపడ్డట్టు సుగ్రీవునిపై కలియబడ్డాడు.

ఆవేశంలో వారి పోరుకు భూమి గడగడ వణికింది. మల్లయుద్ధం అనివార్యమైంది. శ్రీరామచంద్రుడు చాటునుండి గమనించసాగాడు. చూడడానికి ఇద్దరు వీరులు ఒకే రకంగా కనబడుతున్నారు. ఎవరిపై బాణం వేయాలో అర్థం కాలేదు. మారుతి అయోధ్యాపతితో ఇద్దరూ ఒకటే రకంగా ఉన్నారు అంటూ త్వరగా ఒక పూలహారం తెచ్చి సుగ్రీవుని మెడలో వేశాడు. సుగ్రీవుని మెడలో మాల వేసిన మరుక్షణంలో కైవల్యదాత అయిన ఆ రఘురాముడు సుగ్రీవుని చూచాడు. వాలి,సుగ్రీవుల కేకలతో ఆ ప్రదేశమంతా ప్రతిధ్వనించింది. వజ్రసమానమైన ఆ ముష్టిప్రహారాలకు భూగోళమంతా భయంతో కంపించింది. వారిరువురు చెట్లను ఊడబెరికి ఒకరిపై ఒకరు విసురుకొనగా అవి నూరుయోజనాల అవతల పడ్డాయి. ఆ చెట్లు ఆకాశమార్గాన పోయేటప్పుడు విమానాలను అడ్డగించాయి. పర్వతాలను చక్రాలవలె తిప్పి అకస్మాత్తుగా విసిరివేస్తే ఆ క్షణం భూకంపం వచ్చినట్లుగా ఉంది. ఆ తాకిడికి ఆదిశేషుడు కూడా చలించాడు. గుండెలపై ఒక వజ్రాఘాతం తగులగానే నక్షత్రాలు కనబడేవి. ఆ యుద్ధాన్ని ఆకాశం నుండి దేవతలు బారులుతీరి తిలకించసాగారు. వాలి, సుగ్రీవుణ్ణి పిడికిలిపోట్లు పొడిస్తే ఆ సూర్యపుత్రుడు ఉక్కిరిబిక్కిరై వెనక్కు తిరిగి రాముని వంక చూశాడు. రణరంగంలో కూలిపోతున్న వీరుడు తన రక్షకుని కోసం ఎదురు చూచినట్లు సుగ్రీవుడు తన హృదయంలో దీనబంధుడైన శ్రీరాముని 'నా దు:ఖం ఎందుకు తీరడం లేదు. ఓ సీతానాథా! భక్తజన హృదయ కమల భ్రమరా! దశకంఠ దర్పహరణా! ఎందుకు నాపై నీకింకా దయ రాలేదు' అంటూ స్మరించాడు. ఇక్కడ ఆ సమయంలో కౌసల్యానందనుడు కల్పాంతంలో మేఘంవలె బయటకు వచ్చి, తన వింటికి దివ్యబాణాన్ని సంధించి, దూరాన ఉన్న వాలిపై గురిచూచి బాణం వదలగా అది వాలి గుండెల్లో గుచ్చుకుంది. వేగంగా వచ్చిన బాణం పర్వతంపై పిడుగు పడ్డట్టు, సర్పాలను గరుడుడు అకస్మాత్తుగా ఎత్తుకుపోయినట్టు, అభాగ్యునిపై ఆకస్మికంగా దాడి జరిగినట్టు, రాహువు నోట్లోకి చంద్రుడు ప్రవేశించినట్టు, తపస్వి వ్యసనదాసుడైనట్టు, ముక్కంటి అగ్ని మన్మథునిపై పడ్డట్టు వాలి హృదయంలోకి దూసుకుపోయింది. ఒక మహావృక్షం విరిగి నేలపై పడగానే భూమి కంపించినట్లుగా పర్వతాకారుడైన వాలి నేలకూలగానే భూమి కంపించింది. వాలికి మరణం ఆసన్నమైనదని తెలుసుకుని కోదండరాముడు వాలి దగ్గరకు వచ్చాడు. అప్పుడు వాలి 'రామా! నీవు క్షత్రియుడవు. ఏకపత్నీవ్రతుడువు. ఎందుకీ అపకీర్తి తెచ్చుకున్నావు? నీవు అన్యాయాన్ని సమర్థించవు గదా? వ్యర్థంగా నాపై బాణాన్ని ఎందుకు వేశావు? నీవు సత్యవాక్పాలకుడవు. యశోవంతుడవు. యుద్ధరంగంలో మహాప్రతాపవంతుడవు. అటువంటి ఓ రాఘవా! ముల్లోకాల్లో కూడా ఈ అపకీర్తి నీకు తప్పదు. ఇది సత్యం' అంటూ శరాఘాతం వల్ల మాట్లాడలేకపోయాడు. అప్పుడు జానకీరమణుడు, 'నీవు కోతివి. కేవలం వనచరానివి. నీతో ఎందుకు మాట్లాడాలి. వీరుడైనవానిని ఎదురించవచ్చు. వనచరాలను గుప్తంగానే చంపాలి. మృగాన్ని వేటాడి సంహరించాలి. ఆహ్వానించి ఏం ప్రయోజనం. నీవు పరమకిరాతకుడవైన వానరుడవు. తమ్ముని భార్యను అభిలషించిన అనాచారుడవు. నేను దుష్టులను దండించడానికి అవతరించాను' అన్నాడు.



ఆ మాటలను వినగానే వాలి హృదయం గద్గదమైంది. 'ఓ రాఘవా! నీ చేతులలో మరణం పొందుతున్న నా జన్మ పావనమైంది. కొండంత పూర్వపుణ్యం చేసుకొన్నందున కనులారా రాఘవుని దర్శించాను. నిజంగా నా జన్మ సార్థకమైంది. నా అంత భాగ్యవంతుడు ఎవడూ లేడు. ఈ మార్గంలోనే రావణుడు

సీతాదేవిని ఎత్తుకెళ్ళాడు. నాకు అతణ్ణి బంధించి తేవడానికి ఒక్కక్షణం పట్టదు. పూర్వం రావణుని నా చంకలో ఇరికించుకొని నాలుగు సముద్రాలలో ముంచి అంగదుడు పడుకొని వున్న ఉయ్యాలకు బంధించాను. అప్పుడు వాని తండ్రియైన పులస్త్యుడు పుత్రభిక్ష పెట్టమని అర్థించి దశకంఠుని విడిపించుకుని వెళ్ళాడు. ఆ అర్భకుని చెంత నుండి సీతను తేవటానికి ఆలస్యమెందుకు? నా కర్మ బలీయమైనది. నిన్ను సేవించే భాగ్యం నాకు కలుగలేదు' అని అన్నాడు. అప్పుడు రాజీవాక్షుడు స్నేహపుర్వకంగా 'నీ హృదయంలో గుచ్చుకున్న బాణం తీసివేసి నిన్ను ఆరోగ్యవంతుని చేస్తాను' అన్నాడు. కాని ఇంద్రపుత్రుడైన వాలి 'ఇటువంటి మరణం నాకు ఎన్నటికీ రాబోదు. నీ చేతిలో మరణించే అదృష్టం లభించడం అసాధ్యం' అంటూ వాలి సుగ్రీవుని దగ్గరకుపిలిచి కళ్ళలో నీళ్ళు నిండగా, శోకం ఉప్పొంగగా తమ్ముని ప్రేమతో దగ్గర కూర్చుండబెట్టుకుని, విజయమాలను తీసి సుగ్రీవుని మెడలో వేశాడు. 'ప్రియ సహోదరా! నీ జన్మ ధన్యమైంది. శ్రీరాముని కృపాదృష్టి నీపై సోకింది. నీతో వైరం కూడా నాకొక వరమయింది. చివరకు రఘురాముని దరి చేర్చావు. ఇది వైరం కాదు, గట్టి స్నేహబంధం. ఆంతర్యంలో భేదభావం అంతరించి ఏకమయ్యాము. నిరంతరం నువ్వు రఘురాముని ప్రేమతో సేవించు. ఎల్లవేళలా వారికి సహాయంగా ఉండి సీతాసతిని విడిపించు' అని చెప్పి వాలి రాముని ధ్యానిస్తూ తదేకంగా శ్రీరాముని అవలోకిస్తూ ప్రాణంవదిలాడు. విష్ణుదూతలు వచ్చి విమానంలో వాలిని తీసుకుని వెళ్ళారు. తరువాత రఘునందనుడు తారను సమాధానపరచాడు.


ఈ కథ ఎంతో రసవంతమైనది. సాధువులు సాదరంగా అవధరించండి. బ్రహ్మానందుడు, శ్రీధర వరదుడు, అభంగ రూపంలో ఈ చరిత్ర వర్ణించాడు. స్వస్తి!



శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా శ్రవణం చేస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**పదిహేడవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 18

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

రఘునాథుడు అఖిలుడు, గుణసముద్రుడు, జలచరాలు నీటిలో సంచరించినట్లు రామోపాసకులు ప్రేమబంధం ముప్పిరిగొనగా బ్రహ్మానంద సాగరంలో ఓలలాడుతుంటారు. వారు స్వానందంలో తన్మయులై సారాసార విచారంలో మునిగి తేలుతుంటారు. నీరు లేక జలచరాలు జీవించలేనట్లు రామస్మరణ లేక రామోపాసకులు మనలేరు. వారున్న చోట మాయారణ్యాలు శుష్కించిపోతాయి. వాసనలకు అక్కడ తావులేదు. నందనవనంలో భ్రమరం జిల్లేడు పూవుపై వాలుతుందా? అమృతపానం చేసేవాడు కక్కిన కూటికి ఆశపడతాడా? నిరంతరం ఆత్మానందంలో భోగించేవాడు ఐహికబంధాలలో చిక్కుకుంటాడా? ఎవరి పెరట్లో కల్పతరువు, కామధేనువు వసిస్తాయో అటువంటివానికి ఎప్పుడైనా గడ్డిపోచలు తినవలసిన గతిపడుతుందా? 'ప్రారబ్ధం వల్ల ఈ శరీరాన్ని మోస్తున్నాను!' అని చింతించేవాడు విషయాలపట్ల ఆదరణ చూపడు. వాడు తప్పక రఘువీరుని సాదరంగా భజిస్తాడు.

### తార అనునయం

పదిహేడవ అధ్యాయంలోని కథననుసరించి శ్రీరాముడు వాలిని సంహరించాడు. మరణావస్థలోనున్న వాలిని సుగ్రీవుడు తన తొడపై పరుండబెట్టుకున్నాడు. తార అంగదునితో కలిసి వచ్చి ఆఖరిక్షణాల్లో ఉన్న తన భర్తను చూచి అయోధ్యాపతితో 'నువ్విలా ఎందుకు చేశావు? ఓ రాఘవా! ఇంకొక బాణం వేసి నా ప్రాణం కూడా తీసుకో! భర్తలేని వ్యర్థమైన ఈ బ్రతుకు వల్ల ఏమి ప్రయోజనం?' అని వాపోయింది. వాలి శవాన్ని కౌగిలించుకుని తార విపరీతంగా దుఃఖించింది. ఇది చూచి జనకజామాత



'తారా! నీవు దుఃఖించినందువల్ల ఏమైనా ప్రయోజనం చేకూరుతుందా?' అని అడిగాడు. దానికి తార 'పతి వియోగం వల్ల నేను దహించుకుపోతున్నాను' అంది. వెంటనే శ్రీరాముడు 'ఈ కళేబరం పేరు వాలి. యథాతథంగా నీ ప్రక్కనే పడి ఉంది. ఆ పడివున్న వాలి ప్రేతం కొరకా నీవు దుఃఖిస్తున్నావు' అని అన్నాడు. బదులుగా ఆమె 'హృదయగతమైన ఆత్మ వెళ్ళిపోయింది' అంది. దానికి ఆ అయోధ్యాపతి 'నీవు ఆత్మకు పత్నివా? లేక శరీరానికా? బాగా ఆలోచించి నాకు చెప్పు. శరీరము నశ్వరము. ఆత్మ అవినాశి, శాశ్వతమైనది. అలాంటప్పుడు ఎందుకు శోకించడం? బాగా ఆలోచించి చూడు. పెద్దకుండలోగానీ, చిన్నపిడతలోగానీ కనబడే సూర్యుడొక్కడే. అలాగే స్త్రీ, పురుషులు పేరుకు వేరయినా వారిలో ఉండే ఆత్మ ఒక్కటే. ఘటాలు, మఠాలు నిశ్శేషమై పోవచ్చు. కానీ ఆకాశం, సాగరంలోని అలలు ఎన్నటికీ అంతరించవు. మాయాభరితమైన ఈ లీల అంతా మిథ్య. అది ఎండమావివలె గోచరిస్తుంది. గంధర్వనగరంలా మిథ్యాభాసమై వెలుగుతుంటుంది. దేవతలు స్వర్గంలో అమృతపానం చేస్తారు. అయినా వారు కూడా కల్పాంతంలో నాశనమవుతారు. ధరించిన ప్రతి ఒక్కటికూడా తప్పక నాశనమై పోవలసిందే! ఓటి కుండలోని నీళ్ళన్నీ కారిపోతాయి. అందులో చంద్రుని ప్రతిబింబం కనబడలేదని అజ్ఞాని ఎంతో దు:ఖిస్తాడు. ఎంతటి అనుభవశాలికైనా ఎండమావిని చూడగనే అక్కడికి వెళ్ళాలన్న కోరిక కలుగుతుంది. కానీ వెళితే అక్కడ ఏమీ ఉండదు. అది చూచి తమ మూర్ఖత్వానికి దుఃఖిస్తాడు. సకలప్రాణులతో కలసి ఈ బ్రహ్మాండమంతా మిథ్యాభూతమైనదే. ఆత్మ అక్షయం, శాశ్వతం. అందువలన నీవు ఎందుకు దుఃఖిస్తావు' అని తత్త్వబోధ చేశాడు. అటువంటి గంభీరమైన, అమృతతుల్యమైన, మధురమైన రాముని మాటలు, బోధ సముద్రంలోని చిద్రత్నాలవలె తార మనస్సులో బలంగా నాటుకున్నాయి. విశ్రాంతినిచ్చే మందిరాల్లా, అనుభవాకాశంలోని నక్షత్రాల్లా, స్వానంద పాత్రల్లా ఆమె

ముఖబింబం ఆనందంతో ఉప్పొంగిపోయింది. రాముని మాటలు అగస్త్యునివలె ఆమె శోకసాగరాన్ని శుష్కింపజేశాయి. వచన రూపంలోని ఆ జ్ఞాన సూర్యప్రభలు అజ్ఞానమనే చీకట్లను నిర్మూలించాయి. తార ప్రీతిపూర్వకంగా రఘురాముని పాదాలపై పడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిలిచిపోగా నిశ్చలస్థితిలో ఉండిపోయింది. శ్రీరాముడు తారతో 'నా మాటలు ప్రమాణంగా తీసుకో. సుగ్రీవుని మెడలో మాలవేసి, సుఖంగా అతనితో జీవించు' అని ఆనతియ్యగా, తార ఆ సారంగపాణితో 'అలా చేయడం వేద విరుద్ధం కదా?' అంది. బదులుగా ఆ కైవల్యదాత 'నీవు నా మాటలు విశ్వసించు. నీవు పతివ్రతగా కీర్తిపొందుతావు!' అని ఘటనాఘటన సమర్థుడు, అద్భుత మహిమాన్వితుడైన రఘునాథుడు తారతో అన్నాడు. భగవంతుని లీలలు అసాధారణమైనా, మానవులు అన్నీ తామే చేస్తున్నామనుకుంటారు. ఆ కారణంగా వారు తప్పక నరకానికి పోతున్నారు. స్తంభాలు లేకుండా ఆకాశం, నీళ్ళపైన తేలుతున్న భూమండలం ఆ రఘునందనుని అసాధారణ లీలలకు నిదర్శనం. అంతటికీ కర్తను నేనే అనుకోవడం కన్నా అవివేకం వేరే లేదు. సర్వేశ్వరుడు స్వేచ్ఛావర్తి. ఆయనకు సాటి ఎవరూ లేరు.

వాలి అంత్యక్రియలు సూర్యపుత్రుడైన సుగ్రీవుడు నిర్వహించాడు. రఘునాథుడు అత్యంత ప్రీతితో అంగదుని ఆదరించాడు. తార శ్రీరాముడు చెప్పిన విధంగా సుగ్రీవునికి తిలకం దిద్ది వస్త్రాలిచ్చి, మెళ్ళో మాల వేసింది. ఇది చూచి తమాలనీలుడైన శ్రీరాముడు ఎంతో ప్రసన్నుడయ్యాడు. వానరులందరూ మిన్నుముట్టేటట్లు జయజయధ్వానాలు చేశారు. రాఘవుడు సుగ్రీవునితో 'మేము ఇక్కడ నాలుగు మాసాలు ఉంటాము. నీవు రాజ్యభోగాలు అనుభవించి త్వరగా రా!' అన్నాడు. బదులుగా సుగ్రీవుడు శ్రీరాముని కిష్కంధకు రావలసిందని ప్రార్థించాడు. శ్రీరాముడు సమాధానంగా, 'నా భరతుని కారణంగా నేను వ్రతదీక్షలో ఉన్నాను. నా భార్య లేకుండా నేను మంగళస్నానం



చేయను' అని అంటూ చిత్రకూటం వీడిన తర్వాత భరతుడు పడ్డ కష్టాలను సుగ్రీవునికి చెప్పలేక ఉదాసీనడయ్యాడు. 'నేను లేని కారణంగా భరతుడిప్పుడు తల్లిని వదిలి పరదేశానికి పోయిన బాలకునివలె ఉన్నాడు' అని భరతుని గుణగణాలను తలచుకుని రఘురాముని కంఠం గద్గదమయింది. సుగ్రీవుడు పరుగున వెళ్ళి రాముని పాదాలపై బడ్డాడు. లక్ష్మణుడు కూడా గంభీరుడయ్యాడు. ఆ తరువాత రాజీవనేత్రుడు, శ్యామలవర్ణుడు సౌమిత్రిని కిష్కింధకు వెళ్ళి సుగ్రీవుని పట్టాభిషిక్తుని చెయ్యమని ఆదేశించాడు. రఘుపతి కాళ్ళకు మొక్కాడు లక్ష్మణుడు. రాముడు విజయీ భవ అని ఆశీర్వదించాడు. లక్ష్మణుడు త్వరగా వెళ్ళి సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేసి పవిత్రమైన అమాత్య పదవిని వాలి సుతునకిచ్చి, వెంటనే తిరిగి జానకీనాథుని వద్దకు వచ్చాడు. అప్పుడు రాముని చెంత వాయునందనుడు చేతులు జోడించి నిలబడి ఉన్నాడు. వాయునందనుడు రోజూ కిష్కింధకు వెళ్ళి వెంటనే రాఘవుని వద్దకు తిరిగి వచ్చేవాడు.

ఇంతలో నాలుగు మాసాలు గడిచిపోయాయి. కానీ సుగ్రీవునికి రాముని విషయం గుర్తుకు రాలేదు. శరత్కాలం కూడా రావడం చూచి తమాలనీలుడైన రాముడు 'సుగ్రీవుడు రాజ్యమోహంలో బాగా మదించి ఉన్నాడు. అతడి మనస్సు పూర్తిగా విషయసుఖాల్లో మునిగి వుంది. అధికారం, ధనమదంతో అంతా మర్చిపోయాడు. కానీ సజ్జనుడు అట్టివానిని దండించి సన్మార్గంలో పెట్టాలి' అంటూ 'లక్ష్మణా! నీవు కిష్కింధకు వెళ్ళి ఆ సూర్యనందనునికి గుర్తుచెయ్యి. అతడు నా మాట మన్నించకపోతే, అతడిని చంపైనా సరే ఇక్కడికి తీసుకునిరా! తార, రుమలతో కలిసి నిత్యం మద్యపానంలో మైమరిచి ఉన్నాడు సుగ్రీవుడు. నన్ను స్మరించనివారిని, బ్రాహ్మణులను అపహాస్యం చేసేవారిని, సజ్జనులను, భక్తులను నిరసించి, సద్గురువచనాలను అలక్ష్యం చేసేవారిని అవశ్యం శిక్షించాలి. హరిహరుల చరిత్రను నిందించేవారు, అగౌరవపరచేవారు, ఇతరులను అదే

పనిగా పీడించేవారు, వేదవిరుద్ధంగా నడిచేవారు, ఐశ్వర్యమదం తలకెక్కి సదా ఇతరులను హింసించేవారు, ధర్మపథం తప్పినవారు, కార్పణ్యలోభం వల్ల దైవాన్ని, ధర్మాన్ని విస్మరించినవారు శిక్షార్హులు. ధర్మవర్తనుల ఇంట లక్ష్మి, విష్ణువు వశిస్తారు. దండనార్హులు. అందువల్ల ఓ వీరచూడామణీ! నీవు ఈ క్షణమే కిష్కింధకు వెళ్ళు. నా మాట సరకు చేయకపోతే సుగ్రీవుని తత్‌క్షణమే వధించు. వాలి ఏ బాణంతో సంహరించబడ్డాడో, ఆ బాణంతోనే ఆతడి ప్రాణం తియ్యి!' అని ఆదేశించాడు. లక్ష్మణుడు రాముని చరణాలకు నమస్కరించి వింటికి బాణం ఎక్కుపెట్టి వేగంగా కిష్కింధకు వెళ్ళాడు.

ఇక్కడ కిష్కింధలో మారుతి ఈ విషయాన్ని సుగ్రీవునికి సూచనప్రాయంగా తెలియజేసాడు. 'రఘుపతి ఒక్కడే అరణ్యంలో ఉన్నాడు. ఆయన దర్శనానికి త్వరగా పోదాం పద! సీతను వెదుకటానికి సత్వరం వానరులను పంపు. నీవు చాలా ఉన్మత్తుడవై యౌవనోద్రేకంతో రామకార్యాన్ని పూర్తిగా మరచావు. పైగా మద్యపానం, ధనమదం, దానికి తోడు అహంకారం విపరీతంగా పెరిగిపోయాయి. అత్యంత వాచాలుడైన వాడు కల్లబొల్లి మాటలు చెప్పినట్లు, మద్యపానం చేసినవారికి కుడిఎడమల భేదం తెలియనట్లు నీవు కూడా స్త్రీలతో కలసి ఉన్మత్తుడవై స్వామి కార్యాన్ని విస్మరించావు' అని హెచ్చరించాడు. అప్పుడు సుగ్రీవుడు మత్తెక్కిన కళ్ళతో ఉదాసీన వచనాలతో వానర సైన్యాన్నంతా మెల్లమెల్లగా సమీకరించి సిద్ధం చేయమని ఆంజనేయునికి చెప్పి రాణివాసంలోకి ప్రవేశించాడు. ఇంతలో ఊర్మిళానాథుడు ధనుర్బాణాలను గైకొని ప్రళయాగ్నిలా ప్రజ్వరిల్లుతూ నగరద్వారం వద్ద నిలబడగా, వానరసైన్యమంతా పారిపోయి సుగ్రీవుని శరణుజచ్చారు. దాంతో సుగ్రీవుడు హతాశుడై, 'పవనకుమారా! వీళ్ళంతా లక్ష్మణుడు కోపంగా ఉన్నాడంటున్నారు. ఈ సమయంలో వారిని దరిచేరటం ఎవరికీ శక్యంకాదు. నన్ను రక్షించు' అని దీనంగా అర్థించాడు. వెంటనే హనుమంతుడు సుగ్రీవునితో 'నీవు నీ భార్యలతో కలసి వెళ్ళి లక్ష్మణుని



శరణువేడు!' అని సమాధానపరచి, తర్వాత వానరులందరితో 'మీరందరూ నమ్రతగా లక్ష్మణులవారికి సాష్టాంగ నమస్కారం చెయ్యండి' అని సూచించాడు. అలాగేనని వానరగణంతో సహా సుగ్రీవుడు లక్ష్మణుని చరణాలను ఆశ్రయించాడు. సౌమిత్రి కోపంతో, 'నీవు నిర్దయుడవు. సచ్చిదానందుడైన శ్రీరాముని వనంలో పెట్టి రాజభోగాల్లో మునిగితేలుతున్నావు. అనంత బ్రహ్మాండనాయకుడు, పుణ్యశ్లోకుడు, అయోధ్యానాథుని వనంలో వదిలి రాజ్యసుఖాలు అనుభవించడానికి నీకెలా మనస్కరించింది?' అని మందలించాడు. మారుతి లక్ష్మణుని శాంతింపజేసి 'సుగ్రీవుడు చేసిన తప్పులన్నీ క్షమించి ప్రేమతో ఆదరించండి' అని ప్రార్థించాడు.

సుగ్రీవుని పైకి లేవదీసి లక్ష్మణుడు ఆలింగనం చేసుకున్నాడు. వానరసైన్యమంతా ఆనందంతో నలువైపులా పరుగెత్తసాగారు. నది ఉరకలు వేస్తూ సముద్రాన్ని కలిసే రీతిగా ససైన్యంగా సుగ్రీవుడు రామదర్శనార్థం బయలుదేరాడు. ఆలమంద దప్పిక తీర్చుకోవడానికి నదిఒడ్డుకు పరుగెత్తినట్లు ఆవేశంగా వానరులంతా పరుగెత్తసాగారు. దాత ఇంటికి యాచకులు పరుగెత్తినట్లు, సద్గురు చరణాలను దర్శించటానికి సచ్ఛిష్యుడు పరుగిడినట్లు, కళ్యాణ ఘడియలు సమీపించగానే పెళ్ళి ఊరేగింపు సంభ్రమంగా వచ్చినట్లు, భ్రమరాలు పరుగున వచ్చి పద్మాల్లోని మకరందాన్ని సేవించినట్లు వానరసమూహం రఘుపతి వద్దకు వచ్చింది. వెంటనే సుగ్రీవుడు రామునికి సాష్టాంగ నమస్కారం చేశాడు. శరణన్న సుగ్రీవుని రాముడు ఎంతో ఆదరంతో గుండెలకు హత్తుకున్నాడు. అలాగే వానరులందరు వరుసగా రాముని దర్శించి, చేతులు జోడించి, కిష్కింధేశుడు రాముని స్తవనం చేస్తుండగా ముందుకు సాగారు. నిగమాగమవంద్యా! రఘువరా! భక్తకైవారీ! ఆనందసముద్రా! దశరథపుత్రా! విశ్వనేత్రా! విశ్వపాలా! నీకు జయము. శరణాగతులను నీవు అభేద్యమైన వజ్రపంజరం వలె కాపాడుతావు. ఓ శార్ఙ్గధరా! నీవు వారినెన్నటికీ

ఉపేక్షించవు. బలమైన కాష్ఠం నీటినుండీ రక్షించినట్లు నీవు శరణాగతులను తల్లిలా కష్టాలనుండి కడతేరుస్తావు. పద్మాన్ని వదలి భ్రమరం ఉండదు, కాని కాష్ఠాన్ని అది పొడిపొడి చేస్తుంది. ఓ సీతావల్లభా! అలా నీవు భక్తులను రక్షించి దుష్టులను సంహరిస్తావు అంటూ పరిపరి విధాల శ్రీరాముని కీర్తించాడు సుగ్రీవుడు.

అంతలో సీతను వెదుకుతూ నలుదిక్కులకూ పోవడానికి వానరులంతా సంసిద్ధులయ్యారు. అప్పుడు విషకంఠుని మిత్రుడైన రాముడు సత్వరం సైన్యాన్ని నలుదిశలకు పంపండి అని ఆదేశించాడు. సుగ్రీవుడు దూతలను పంపి సప్తద్వీపాలలోనున్న వానరులందరినీ పిలిపించాడు. అష్టాదశపద్మ సమ్మిళితమయిన ఆ సైన్యబలం అద్భుతమైనది. వారందరూ యుద్ధంలో ఎప్పుడూ అజేయులే. అందరినీ పిలిచి ఆ సూర్యనందనుడు 'నేను చెప్పే మాటలను మీరందరూ శ్రద్ధగా వినండి. సీతాదేవిని వెదకి త్వరగా రాముని జత చేర్చాలి. ఈ కార్యం సిద్ధించకుండా మీరు మీ స్వగ్రామాలకు పోకూడదు. సీతను రఘువీరుని కలపకుండా ఎవరైనా తిరిగి ఇంటికి వెళితే వాడికన్నా బ్రహ్మహత్యాపాపం చేసినవాడు సృష్టిలో మరొకడు ఉండడు. అటువంటి స్వామిద్రోహిని గాడిద మీద ఎక్కించి, ముక్కు చెవులు కోసి భూలోకమంతా ఊరేగిస్తాను. సీతను కనుక్కోవడం అసాధ్యమని ఎవడన్నా వెనుదిరిగితే వాడి కరచరణాలను స్వహస్తాలతో ఛేదించి దండిస్తాను!' సుగ్రీవుని పిలుపు విని సకలద్వీపాల్లోని వానరులు, గుహల్లో నివసించేవారు, మేరుపర్వతం వెనుకవైపునున్న వానరులందరూ జయజయధ్వానాలతో విచ్చేసారు.

ఆ జయజయధ్వానాల హోరుకు భూమ్యాకాశాలు దద్దరిల్లాయి. ఆ ధ్వని విని ఆదిశేషుడు, భూభారాన్ని వహించే ఆదికూర్మము కూడా కలవరం చెందాయి. ఒక వానరం పర్వతాన్నెక్కి బంతిలాగా ఆకాశంలోకి ఎగిరి అవతలివైపు నుండి ఇవతలివైపుకు, ఇవతలివైపునుండి అవతలివైపుకు



దూకసాగింది. ఇంకొకటి పెద్దపెద్ద చెట్లెక్కి పండ్లను భక్షిస్తున్నది. ఈ విధంగా ఆ వానర భల్లూక సమూహాలు భూమ్యాకాశాలు నిండే కోలాహలంగా గంతులు వేయసాగాయి. ఒక్కో కోతి ఆకాశానికెగిరే విధానం చూస్తే సూర్యుణ్ణే క్రిందికి లాగుతుందా అన్నట్టుగా వుంది. ఆ వానరుల ధాటికి గాలి గతి కూడా కుంటుపడింది. ఒకడు పశ్చిమ సముద్రానికి వెళ్ళి సూర్యాస్తమయాన్ని చూశాడు. ఒకడు తోకను సముద్రంలో ముంచి జలచరాలన్నింటినీ బయటకు లాగాడు. నాలుగు సముద్రాలలో జీవించే పదిలక్షల నానాజాతి జలచరాలను రాఘవుని ముందుంచారు. నానాజాతి వానరులు వివిధరంగులతో రకరకాల రూపాలతో రాఘవుని ముందు బారులు తీరి నిలబడగా ఆ దృశ్యం ఎంతో వినోదం కల్గించింది. పెద్దపెద్ద చెట్లెక్కి ఆ వానరులు నాట్యం చేయసాగారు. కొందరు ప్రేమతో గానం చేయగా రాముడది విని ఆనందించాడు. రాగోపరాగాలతో, సప్తతాళాలతో, గీతా ప్రవచనాలతో తన్మయులై పులకాంకితులైనారు. గద్యపద్యాలను ఛందోబద్ధంగా గానం చేయడం విని సూర్యుడు నిశ్చలుడైనాడు. వారి గానానికి శిలలు కూడా మెల్లమెల్లగా కరగసాగాయి. ఎలాగైతే సాగరంలోని అలలు తీవ్రంగా ఒడ్డును తాకి తిరిగి సాగరంలోనే ఏకమవుతాయో అలాగ వానరులనే అలలు బ్రహ్మానందసాగరుడనే రఘువీరునిలో ఏకం కాసాగాయి. భూమ్యాకాశమంతా వానరమయంగా గోచరిస్తున్నది. ఆ వానర సమూహాన్ని చూచి రాముడు సకలదేవతలు భూమిపై వానరవేషాలలో తమ అపారశక్తితో అవతరించారా! అని తలపోశాడు. పద్దెనిమిది పద్మాల వానరసైన్యానికి దళాధీశుడు నలుడు. డెబ్బది రెండు కోట్ల ఎలుగుబంట్లు, యాభైఆరు కోట్ల నల్లకోతులను చూచి సీతావల్లభుడు, కిష్కింధానాథునితో వీరందరినీ చూచి నాకు ఎంతో బాధ కలుగుతున్నది. వీరందరికీ అన్నవస్త్రసాలు ఎలా సమకూర్చగలము? అని అన్నాడు. దానికి సమాధానంగా సుగ్రీవుడు 'ఆహారం దొరక్కపోతే గాలిని భుజించి సంతృప్తి

చెందుతారు. ఆకాశం వలె వీరు దిగంబరులు. వీరికి పర్వతాలు, వృక్షాలు ఆయుధాలు' అని చెప్పగా రాముడు విని ఎంతో అచ్చెరువొందాడు. అప్పుడు సుగ్రీవుడు రామునితో 'ఓ రాజీవనేత్రా! కోమలగాత్రా! ఇదంతా నీ లీలే! ఈ విషయం తెలిసి కూడా ఎందుకు ప్రశ్నిస్తున్నావు? బహుశా వానరులకు మోక్షపథాన్ని అందించుటకేమో!' అన్నాడు.

## సీతాన్వేషణకై వానరుల ప్రయత్నం

తరువాత సుగ్రీవుడు సమస్త వానరులనుద్దేశించి, 'ముల్లోకాల్లో ఎక్కడున్నా సీతను వెతకండి! మహీతల, అతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతలాది సప్తపాతాళాలు శోధించండి. పద్నాలుగు లోకాలను గాలించండి. వైకుంఠం, కైలాసం, బ్రహ్మలోకం, ఇంద్రలోకం, చంద్రసూర్యలోకాలు, జనలోకం, తపోలోకం సకల లోకాలు శోధించండి. వరుణలోకం, భూలోకం, యమలోకం, పితృలోకం, మృత్యులోకాలతో సహా అన్ని లోకాలూ వెదకండి. భరత, రమణక, హరిత, సత్య, కేతు, సువర్ణ, ద్రాక్ష, వితండ, హరి మొదలైన నవ ఖండాలలోను, జంబూద్వీప, శాఖాద్వీప, శాల్మలీ, క్రౌంచ, ద్రాక్షాద్వీప, అంగవంగాది దక్షద్వీపాలలో యాభైఆరుదేశాలలో కూడా వెదకండి. వన, ఉపవన, పర్వత, ఋష్యాశ్రమాలలో అనేకరకాల గుహలలో, భక్తులకు స్థానమైన వివిధమతాలలో సీతను వెదకండి' అని పంపించాడు. నానావిధ తీర్థాలు, క్షేత్రాలలో శోధించినా సీత ఎక్కడా కనపడలేదు. ఎంత కష్టపడినా వారికి సీత జాడ తెలియలేదు. సీత రాముని జ్ఞానశక్తి. ఆమె స్థితి ఎలాంటిదో తెలుసుకోకుండా అహంకారంతో మైమరచి వ్యర్థంగా తిరిగితే ప్రయోజనం లేదు. సద్గురుకృప లేక ఆత్మజ్ఞానం ఎన్నటికి ప్రాప్తించదు. చిలక్కుండా వెన్న ఎన్నటికీ రాదు. వ్యర్థంగా అటుఇటు తిరుగుతున్న వానరుల దృష్టికి సుందరమైన సీత ఎన్నటికీ కనబడదు. వారంతా అవమానంతో అధోవదనులై తిరిగి వచ్చారు. వారినందరినీ రఘునందనుడు స్వయంగా సమాధానపరచాడు.



దక్షిణదిశకు ఎవరెవరు వెళ్ళారో వారిగురించి వినండి. వారిలో ముఖ్యులు వాలి సుతుడైన అంగదుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు, ఉమాకాంతుని అవతారమైన హనుమంతుడు మొదలైన నూరుమంది వానరులు ఉన్నారు. రఘుపతి ఆజ్ఞ గైకొని అందరు వాయువేగంతో ఆకాశానికెగిరారు. అప్పుడు కాలుణ్ణే శిక్షించగల మహారాజైన రుద్రావతారుడు హనుమంతుడు అంగదునితో 'మీరంతా ఒక్కక్షణం ఆగండి! నా మనసుకు ఏదో తోస్తున్నది. రఘురామునితో ఒక్కక్షణం మాట్లాడివస్తాను' అని వెనుకకు వెళ్ళాడు. నేరుగా వెళ్ళి రాముని పాదాలకు ప్రణమిల్లి చేతులు జోడించి విష్ణువు ముందు గరుడుని వలె నిలబడ్డాడు. పరశురాముని జయించిన ఆ రామునితో సీతను ఎలా వెదకాలో చెప్పమని మంజుల స్వరంతో అడిగాడు. 'స్వామీ! సీతాదేవి స్వరూపం ఎలాగుంటుందో వానరులమైన మాకేమి తెలుస్తుంది? ఆమె రూపురేఖలు ఎలా ఉంటాయో తెలుపవలసింది' అని కోరాడు. అది విని బ్రహ్మజనకుడైన రఘురాముడు సంతోషించి ఇలా అన్నాడు. 'నీ తెలివితేటల ముందు ఆ వాచస్పతి కూడా సాటిరాడు. నీవు సీతాస్వరూపం అడిగావు. అలాగైతే నా రూపాన్ని బాగా చూడు. దీపాన్ని బట్టి దాని కాంతి ఉంటుంది. అలాగే మా ఇద్దరిదీ ఒకే రూపం. కనకానికి కాంతివలె, రత్నానికి దీప్తివలె సీతాసతిని గుర్తించవచ్చు. మా స్వరూపం అభేదమైనది. సీత శరీరం నుండి కస్తూరి వాసనలు విరజిమ్ముతుంటాయి. అర్ధయోజనపర్యంతం ఆ సుగంధం వ్యాపించి వుంటుంది. ఆమె సదా నన్ను స్మరిస్తుంటుంది. మారుతీ! బాగా విను. ఆమె ముఖం కర్పూరకాంతి కలిగి వుంటుంది. ద్వాదశహస్త ప్రమాణం వరకు సీత చుట్టూ ఉండే పాషాణాలు వృక్షాలు కూడా నిరంతరం నన్నే స్మరిస్తూ ఉంటాయి. నీకు ఒక గుర్తు చెప్తాను. బాగా విను. వనవాసానికి వెళ్లే ముందు తల్లియైన కైకేయి నివాసంలో నేను స్వహస్తాలతో సీతకు నారచీర కట్టాను. ఆ రహస్య సమాచారాన్ని సీతకు తెలియచెయ్యి' అన్నాడు. అప్పుడు హనుమంతుడు

'స్వామీ! నన్ను సీతాసతి తమ దాసుడని నమ్మేవిధంగా ఏదైనా ఆనవాలు ప్రసాదించవలసింది' అని కోరాడు. మారుతి పలుకులు విని శ్రీరాముడు ఎంతో సంతోషించి 'నువ్వు ధన్యుడివి, బ్రహ్మాండంలోకెల్లా సంపూర్ణ ప్రతిభాప్రతాపవంతుని కన్న నీ తల్లి జన్మ ధన్యమైనది' అని ప్రేమతో రఘురాముడు ఆంజనేయుని ఆలింగనం చేసుకుని అభినందించాడు. తన వరదహస్తం మారుతి తలపై ఉంచి ముద్రికను గుర్తుగా ఇచ్చాడు. దాన్ని చూడగానే జానకి మనస్సులోనే రామునికి సాష్టాంగనమస్కారం చేస్తుంది అనుకుని మారుతి రామునికి నమస్కరించాడు. రాముని వదనాన్ని చూచి మనస్సులో ఆ రూపాన్ని ధ్యానించాడు. శ్రీరాముడు గద్గదస్వరంతో 'సీత ఎక్కడ ఉందో వెదకి తిరిగి రండి' అన్నాడు. అప్పుడు హనుమంతుడు ఒక్కమాసంలో సీతా దర్శనం చేసుకుని వస్తానన్నాడు. 'అయోధ్యానాథుడు పూర్ణయశస్వి!' అని ఆనందంగా సింహనాదం చేస్తూ సాధకుడు స్వస్వరూపంలో ఐక్యమయినట్లు వాయునందనుడు తిరిగి కపి సమూహంతో కలిశాడు. అందరూ రామస్మరణ చేస్తూ పర్వతానికి రెక్కలు వచ్చాయా అన్నట్లుగా ఆకాశమార్గంలో దక్షిణదిశగా పోసాగారు. చపలురైన ఆ వానరులు యశస్వి అయోధ్యా ప్రభువు అని మాటిమాటికి గర్జిస్తూ గగనమార్గాన ప్రయాణించారు.

ఈ వానర సమూహం ఆకాశంలో ప్రయాణిస్తూ శాపగ్రస్తమైన ఒక వనాన్ని చూసింది. వానరులకు ఎగిరే శక్తి నశించి శరీరాలు ముకుళించుకొనగా ఒకరినొకరు చూచుకోసాగారు. ఇది చూచి మారుతి దీనికేదో బలమైన కారణం ఉండాలనుకొన్నాడు. పూర్వం ఆ ప్రదేశంలో తేజోరాశి, మహాతపస్వి అయిన దండక ఋషి ఉండేవాడు. అతడి పుత్రుడు పదునెనిమిదేళ్ళ ప్రాయంలో వనంలో విహరిస్తుండగా అకస్మాత్తుగా ఆ వనదేవత పరుగెత్తుకొచ్చి ఋషిపుత్రుణ్ణి భక్షించింది. ఇది తెలిసి దండకఋషి మిక్కిలి కోపంతో ఈ వనంలో సంచరించే ప్రాణులు వెంటనే మరణిస్తాయి అని శాపమిచ్చాడు. కపులన్నీ నిరంతరం



రామనామ స్మరణలో ఉండటం వల్ల ప్రాణాలను కాపాడుకోగలిగాయి. మరణించిన దండకుని కొడుకు బ్రహ్మరాక్షసి రూపంలో నిత్యం పన్నెండు యోజనాల పరిధిలోని జీవులను చంపి భక్షించేవాడు. ఈ వానరులను చూచి వాడు భయంకరంగా నోరు తెరిచి భక్షించడానికి వచ్చాడు. ఇది చూచి ప్రతాపవంతుడు, ప్రచండవీరుడు అయిన అంగదుడు వెంటనే పరుగెత్తి ఆ రాక్షసుని కాళ్ళుగట్టిగా పట్టుకొని ఆకాశంలో గిరగిరా త్రిప్పి నేలకేసి కొట్టాడు. వాడి శరీరం మట్టి కుండ పగిలినట్లు తునాతునకలైంది. వెంటనే దండకుని పుత్రుడు పూర్వశరీరం ధరించి తన వృత్తాంతాన్నంతా ఆ వానరులకు వివరించాడు. వానరగణానికి వందనం చేసి పితృదర్శనానికి వెళ్ళాడు. ఇక్కడ రామదూతలకు ముందుమార్గం బోధపడలేదు. ఏ దిశలో వెళ్ళాలో అర్థం కాలేదు. అక్కడ వృక్షాలు లేవు. త్రాగడానికి నీళ్ళు లేవు. ఎటుచూసినా అన్నీ దగ్ధమైన అడవులే గోచరించాయి. ఆకలిదప్పులతో వికలురై వానరులు తిరగసాగారు.

## మయుని వనమందిరవృత్తాంతం

అలాంటి క్లిష్టమైన పరిస్థితులలో ఎండిపోయిన ఆ అడవులలో వానరులు తిరుగుతుండగా వారికి ఒక గుహలో నుండి ఒక పక్షి పండ్లు తేవడం కనిపించింది. తత్క్షణం వారు ఆ గుహలోనికి ప్రవేశించారు. ఆ గుహ ఒక యోజనం పొడవు ఉంది. లోపల అంతా గాఢాంధకారమే. ముందు వాయుపుత్రుడు నడువగా సమస్తవానరులు, మహాత్ములవెంట ముముక్షువులు ఆత్మసాధన కోసం అనుసరించినట్లు, వేదాధ్యయనం పూర్తిచేసి జనులు సన్మార్గంలో సంచరించినట్లు, రణరంగంలో వీరమరణం పొందిన వీరులు వరుసగా స్వర్గారోహణ చేసినట్లు ఆ వానరులు హనుమంతుని అనుసరించారు. ఆ చీకట్లో ఉక్కిరిబిక్కిరై కొందరు వానరులు మూర్ఛపోయారు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు అందరికీ కష్టమైనాయి. కానీ హనుమంతుడు తోకతో

అందరినీ బంధించి తీసుకెళ్ళాడు. క్రమంగా యోజనం పొడవున్న ఆ గుహను మారుతి త్వరగా దాటాడు. దాటగానే అపారమైన వెలుగు, ఫలభరితమైన సుందరవనం గోచరించాయి. పుష్పఫలాలతో బరువెక్కి ఆకాశానికి ఎదిగి ఉన్న ఆ వృక్షాలెక్కడానికి వానరులకు శరీరం బాగా నీరసించి ఎగరడానికి కూడా శక్తిలేదు.

అప్పుడు సుప్రభ అనే అప్సరస వచ్చి వారి ఎదుట నిల్చింది. ఆమెను చూచి వాయునందనుడు 'స్వర్ణమయమైన ఈ నగరమంతా అమృత సమానమైన జలఫలభరితమై ఉంది. దీనినెవరు నిర్మించారు?' అని అడిగాడు. సుప్రభ ఇలా వివరించింది. 'ఈ స్థలం మయుడనే రాక్షసునిది. అతడు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మదేవుని ప్రసన్నం చేసుకున్నాడు. వాని కోరికపై బ్రహ్మదేవుడు ఈ స్థలంలో ఒక మందిరాన్ని నిర్మించాడు. నీవు గుహలో ఉన్నంతవరకు చిరంజీవిగా ఉంటావు. గుహలో నుండి బయటకు వస్తే వెంటనే మరణిస్తావు' అని మయుడికి వరమిచ్చాడు బ్రహ్మ. ఆ మయుని వద్ద నానా కుటిలవిద్యలు, మంత్రశక్తులు ఉన్నాయి. ఘోర తపస్సు చేసి ఆ దైత్యుడు ఎన్నో వరాలు పొందాడు. ఇంద్రుడు విధాతను ప్రార్థించగా ఆయన హేమ అనే స్త్రీని సృష్టించాడు. తన సౌందర్య లావణ్యాలతో ఆమె గుహలోనికి ప్రవేశించింది. మయుడు ఆమెను చూచి సర్వం మరచిపోయాడు. 'ఓ సుందరీ! నన్ను వరించు' అని అడిగాడు. ఆమె గుహ వెలుపలకు రమ్మనగా ఆ దురాచారి మరణం సంగతి మరచి బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఇంద్రుడు వజ్రాయుధంతో మయాసురుణ్ణి సంహరించాడు. తదుపరి బ్రహ్మదేవుడు ఈ నగరాన్ని హేమకిచ్చాడు. కాలాంతరంలో హేమ నాకు వరంగా ఇచ్చింది' అని తన వృత్తాంతాన్ని వారికి చెప్పింది.

అది విని హనుమంతుడు 'సీతామాతను వెదుకుతూ మేమంతా వెళ్తున్నాము. ఆకలిదప్పులతో ఈ గుహలో ప్రవేశించాము' అన్నాడు. వెంటనే



సుప్రభ వారికి నమస్కరించి పూలు, పండ్లు, జలము తెచ్చి వానరసహితంగా వాయుకుమారుని షోడశోపచారాలతో పూజించింది. పండ్లు, నీరు సంపూర్ణంగా సేవించి వానరగణాలు తృప్తులైనారు. తిరిగి వెళ్ళిపోదామంటే ఆ గుహ ద్వారం తెరుచుకోలేదు. అప్పుడు హనుమంతుడు సుప్రభతో 'మాతా! మాకు వెలుపలకు పోయేదారిని చూపించవలసినది' అని అభ్యర్థించాడు. ఆ సుముహూర్తంలో అప్సరస వారందరినీ కళ్ళు మూసుకొమ్మని, ఒక మంత్రం జపించి కళ్ళు తెరవమని చెప్పింది. కళ్ళు తెరిచేసరికి వానరులంతా సముద్రతీరంలో ఉన్నారు. సుప్రభ కనబడలేదు. ఆ అద్భుతానికి వానరులెంతో ఆశ్చర్యచకితులైనారు. సంసారదు:ఖంలో మగ్గిపోయే ప్రాణికి సద్గురువు ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించి బయటపడవేసినట్లు, మండే ఇంటినుండి అందరూ బయటపడ్డట్లు, నిండా మునిగినవాడు హఠాత్తుగా ఆదుకోబడినట్లు, మరణశిక్ష పడ్డవానికి శిరశ్ఛేదన ఆఖరి క్షణంలో తప్పిపోయినట్లు వారిని కాపాడింది సుప్రభ. రవికులభూషణుడు ఎంతో కృపాళువు. ఆయన కృపవల్లనే ఈ కష్టం గట్టెక్కాము అని సముద్రతీరంలో వానరులంతా బ్రహ్మానందంతో నృత్యం చేశారు. ఇక్కడ సుప్రభ ఆ గుహ వదిలి కౌసల్యా గర్భరత్నమైన ఆ సీతావల్లభుని కన్నులారా వీక్షించడానికి కిష్కంధకు వెళ్ళింది. బ్రహ్మానందా! ఆత్మారామా! మేఘశ్యామా! నన్ను పావనం చేయి అని రాఘవుని ప్రార్థించింది. ఆమెకు జ్ఞానాన్నుపదేశించి బదరికాశ్రమానికి పంపాడు రఘువీరుడు. కాలాంతరంలో బదరికాశ్రమంలో దేహాన్ని విసర్జించి కుండ మట్టిలో కలిసిపోయినట్లు ఆమె స్వస్వరూపంలో లీనమైంది.

### సముద్రతీరంలో సంపాతి సందర్శనం

ఇక్కడ సముద్రతీరంలో వానరులకు ఏ మార్గం గోచరించక ఏం చేయాలో పాలుపోక చింతాక్రాంతులైనారు. ఒకడు తిరిగి పోదామంటాడు. కాని రఘువీరునితో మాకు సీతాదేవిని శోధించటం సాధ్యం కాలేదని ఎలా చెప్తాం?

అందువల్ల ప్రాణం ఉన్నంతవరకూ తిరిగి వెళ్ళకూడదు. వ్యర్థంగా వెళ్ళి జీవచ్ఛవాల్లా బ్రతికి ఏం ప్రయోజనం? అని ఆలోచించి చివరకు కట్టెలు తెచ్చి పెద్ద కుప్ప పోసి నిప్పంటించి ఆత్మాహుతి చేసుకోవాలనుకున్నారు. ఇది చూచి జాంబవంతుడు 'నేను ముందు అగ్నిలో ప్రవేశిస్తాను' అని అన్నాడు. హనుమంతుడు జాంబవంతునితో నీవు సర్వజ్ఞుడవు. నన్ను మొదట ఆజ్ఞాపించవలసింది అని అడుగగా ఆ ఋక్షరాజు 'నేను మీ అందరికన్నా చాలా పెద్దవాడిని. మొదట అగ్నిప్రవేశం చేసే హక్కు నాకివ్వండి' అన్నాడు. దానికి వాయునందనుడు 'ఆయుష్షులో నేను గొప్ప. ఎవరి ఆయుష్షు ఎక్కువ ఖర్చయిందో వారిని వృద్ధుడంటారు. వారికి మరణం తథ్యం అంటారు. నీ ఆయుష్షంతా అయిపోవచ్చింది. నాకు చాలా ఆయుష్షు మిగిలి ఉంది. ఎవరి ధనమంతా ఖర్చయిందో వారిని భాగ్యవంతుడనరు' అనగా వానరులందరూ జాంబవంతుని శ్రీరామముద్రాంకితుడైన మారుతికి అనుజ్ఞ నివ్వవలసిందిగా ప్రార్థించారు. హనుమంతుడు కనులు మూసుకుని హృదయంలో మేఘవర్ణుడు, కోమలగాత్రుడు, శివుని మిత్రుడు, అతి పవిత్రుడైన రాముని స్మరించి అగ్నికి ప్రదక్షిణము చేసి అగ్నిలో దూకగా అగ్ని చల్లారిపోయి, ఎంతో అద్భుతం జరిగింది. వానరులు కట్టెలు పచ్చివని మళ్ళీ కట్టెలన్నీ కుప్ప చేసి మంట చేశారు. ఆ అగ్నిజ్వాలలు మింటికెగిశాయి. రెక్కలు గల పర్వతం ఎగిరి వచ్చిపడిందా అన్నట్టు ఆంజనేయుడు అగ్నిలో దూకాడు. వెంటనే అగ్ని శాంతించింది. అలా మూడుసార్లు జరిగింది. కానీ ఆంజనేయుడు మరణించలేదు. కపి సమూహమెంతో ఆశ్చర్యచకితమై మారుతి బలాన్ని అభినందించింది.

ఆ వానరులంతా ప్రాణత్యాగం చేయటానికి హనుమంతుని అనుమతినర్థించారు. కాని హనుమ సముద్రంలో దూకి ఆత్మాహుతి చేసుకుందామని సమాధానమిచ్చాడు. అక్కడినుండి వానరులంతా బయలుదేరి



సమీపంలో ఉన్న సాగరాన్ని చూచి చింతాక్రాంతులైనారు. హనుమంతుడు మాత్రం ఏకాంతంగా ఒక మూల ధ్యానంలో కూర్చున్నాడు. మిగిలిన వానరులంతా శోకతప్తులై శయనించి ఉండగా సంపాతి వారిని భక్షించటానికి ఆవురావురుమని వచ్చాడు. అరుణుని పుత్రుడైన ఆ పక్షి చాలా గొప్పది. జటాయువుకు సోదరుడు. భయంకరంగా నోరు తెరచి వచ్చిన సంపాతిని చూచి కపులంతా ఏకమై ఇది అచ్చంగా పక్షిరాజైన జటాయువులా వుంది. ఇది పక్షిరాజే. మనకు అనాయాసంగా మరణం ప్రాప్తించిందని పెద్దగా రఘునాథుని నామస్మరణ చేశారు. ఎవరి పేరు వింటే సృష్టిలోని సకల సంకటాలు నివృత్తి అవుతాయో, అపాయం ఉపాయమవుతుందో, దు:ఖం సుఖమవుతుందో అట్టి నామస్మరణ కపులు చేశారు. అది విని సంపాతి సంప్రీతుడై వారికి నమస్కరించి జయజయధ్వానాలు చేశాడు. ఓ వానరులారా! మీరు ధన్యులు. ఈ రోజు నన్ను ఉద్ధరించడానికే మీరు వచ్చారు. ఎక్కడా రఘువీరుడు? నా సహోదరుడెక్కడ? వాడి సమాచారం తెలిసి చాలా రోజులయింది అని సంపాతి అడిగాడు. జటాయువు రావణుని చేతిలో మరణించాడని, తన పితృసమానుడని రఘువీరులా జటాయువును గౌరవించి ఉత్తరక్రియలన్నీ తన చేతిమీదుగా జరిపించాడని కపిపుంగవులు వివరించారు. జటాయువు జన్మ సార్థకమైంది అంటూ సంపాతి శోకతప్తుడై నేలపై పడుకుని నేడు చాలా దుర్వార్త విన్నాను. నా తమ్ముడు లేకుండా సర్వం శూన్యంగా గోచరిస్తున్నది. ఒక రోజు సూర్యమండలాన్ని చూచి మేమిరువురము పైకెగిరాము. నేను నా రెక్కలు జాపి జటాయువుకు ఎండ తీవ్రత తగలకుండా చేశాను. అప్పుడు నా రెక్కలు దగ్ధమైనాయి. దాంతో పెద్ద కేక వేయగా సూర్యరథసారథి అయిన మా తండ్రి అరుణుడు ఇది విని వాత్సల్యంతో సూర్యుని ప్రార్థించి నాకు వరదానమిచ్చాడు. రామదూతల దర్శనమైన తరువాత దగ్ధమైన నీ రెక్కలు బాగవుతాయి అని వరమిచ్చాడు. ఇన్నాళ్ళు

రెక్కలు తెగిన పర్వతం వలె నేనిక్కడ పడి ఉన్నాను. ఈ రోజే నాకు అకస్మాత్తుగా మీ దర్శనభాగ్యం వలన రెక్కలు వచ్చాయి. అది చంద్రగిరి పర్వతము. అక్కడ చంద్రనామ అనే మహాత్ముడున్నాడు. ఆయనే నాకు సద్గురువు. నాకు వేదాంత జ్ఞానాన్ని ఉపదేశించాడు అని చెప్తూ సంపాతి, 'మీరంతా ఎక్కడికి పోతున్నారు?' అని అడిగాడు. సీతాదేవిని వెదకటానికి అని వానరులు బదులిచ్చారు. సంపాతి ఆవలి ఒడ్డున కన్పించేదే లంక. సీతాసతి అక్కడ అశోకవనంలో ధ్యానస్థయై కూర్చొని ఉన్నది. మీరంతా నా వీపుపై ఎక్కండి. నేను సముద్రాన్ని దాటించి లంకకు చేరుస్తాను అని అన్నాడు. సంపాతి స్నేహభావానికి సంతసించి జాంబవంతుడు నిమాకు లంకకు దారి చెప్పిన చాలున్నాడు. ఆవలి ఒడ్డున మలయగిరి ఉన్నది. దాని శాఖలు శతయోజన విస్తీర్ణము, దానిలోనుండి లంకకు ప్రవేశించాలి. అక్కడ కృష్ణసర్పాలు ఉంటాయి. అవి లోపలకు పోనీయవు. శతయోజన విస్తీర్ణమయిన ఈ సముద్రమే లంకకు కందకము అని చెప్పి వానరులకు నమస్కరించి సంపాతి తన నివాసానికి వెళ్ళాడు.

కపులంతా జాంబవంతునితో సమావేశమై, శతయోజన విస్తీర్ణమైన ఈ సాగరాన్ని దాటడం ఎవరి తరం? వానరులలో దీనిని లంఘించేదెవరు? అన్న ఆలోచనలో పడ్డారు. జాంబవంతుడు 'నేను దాటగలను కానీ నా కాళ్ళు బాగా అలసిపోయాయి. త్రివిక్రముడైన వైకుంతనాథునికి ఒకేరోజులో సప్తప్రదక్షిణలు కావించి అద్భుత బలశాలురమైన నేను, వైద్యుడైన సుషేణుడు ఎంతో శ్రమించాము. దాంతో నా కాళ్లు బాగా అలసిపోయాయి. మరోసారి మేరుపర్వతం పైనుండి దూకాను. అక్కడ సూర్యరథచక్రంలోని వజ్రం ఒకటి తొడలో గుచ్చుకొంది. దాంతో అహోరాత్రులు బాధపడ్డాను. అంతేకాక వృద్ధాప్యంవల్ల నేను ఎగురలేను' అన్నాడు.



వెంటనే వాలినందనుడైన అంగదుడు 'నేను ఎగురగలను కానీ బాలుడనైనందున నా కనుభవము లేదు' అనగా వానరులంతా ఇప్పుడేం చేయాలి. ఆవలి తీరానికి ఎవరు వెళ్తారు? అని మథనపడసాగారు. ఆ సమయంలో జాంబవంతుడు, 'వాయునందనుడు ఒక్కడే దీనిని దాటి తిరిగి రాగలడు' అన్నాడు. ఆ సమయంలో అంజనాతనయుడు రామధ్యానంలో నిమగ్నమై ఉన్నాడు. వానరులంతా సాష్టాంగప్రణామం చేసి ఆయనను స్తుతించి 'నీవు ఎంత దూరం ఎగురగలవో చెప్పు' అని అర్థించారు. వారి మాటలు మారుతికి నవ్వు తెప్పించాయి. 'మా తల్లి అంజనాదేవీ నన్ను ప్రసవించగానే నాకు చాలా ఆకలి వేసింది. నేను లక్షయోజనాల దూరంలో ఉన్న సూర్యునిపైకి ఎగిరాను' అని అనగా తత్క్షణం వానరులంతా హనుమంతుని కాళ్ళపై పడ్డారు. 'రాఘవునికి నీ శక్తిసామర్థ్యాలు సంపూర్ణంగా తెలిసే నీకు ఉంగరమిచ్చాడు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. వెంటనే సముద్రాన్ని లంఘించు' అని ఆంజనేయుని వేడుకున్నారు. అప్పుడు హనుమంతుడు వానరులతో 'మీరంతా ఈ పర్వతాన్ని గట్టిగా పట్టుకోండి. నేను వెళ్ళేటప్పుడు వచ్చే గాలి వేగానికి మీరు సముద్రంలో పడిపోగలరు అన్నాడు. వానరులంతా చెట్లు, చేమలను గట్టిగా పట్టుకున్నారు. హనుమంతుడు మహేంద్ర పర్వతాన్నధిరోహించగా జాంబవదాది వానరులందరూ మారుతిని వింతగా చూడసాగారు. తన తోకతో గట్టిగా కొట్టి, హనుమంతుడు వానరులందరి వద్ద వీడ్కోలు గైకొని సింహనాదం చేశాడు. హృదయంలో శ్రీరామస్మరణ చేస్తూ తన శక్తిదాత శ్రీరాముడేనని భావిస్తూ, మారుతి అహంకర్తృత్వ భావాన్ని వదలి మనస్సును రామునిపై లగ్నంచేశాడు. పరాత్పరుడు, రవికులజుడు, బ్రహ్మానందుడు, పురాణపురుషుడైన శ్రీరాముని మారుతి మనసారా ధ్యానించాడు.

శ్రీరామవిజయగ్రంథం విశిష్టమైనది. షడ్రసాన్నాలతో నిండిన భోజనం వంటిది. ఎవరైతే దీన్ని సాదరంగా శ్రవణం చేస్తారో వారికి క్షుద్బాధ వుండదు.

కిష్కింధాకాండ ఇంతటితో సమాప్తం! ముందు సుందరకాండ ఆరంభమవుతుంది. ఈ గ్రంథంలో పూర్వార్ధం ముగిసింది. ఉత్తరార్ధం విందాం. బ్రహ్మానందుడు, జానకీజీవనుడు, శ్రీధరవరదుడు, జగద్భూషణుడు, అజ, అజిత, అవ్యయ, అక్షయ, అభంగ, అవ్యయుడు, నిర్గుణుడు అయిన జానకీరమణునికి నమస్కృతులు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకించగలరు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**పదునెనిమిదవ అధ్యాయం మధురం**

**కిష్కింధకాండ సమాప్తం**



**అధ్యాయము - 19**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**రా**మకథ మహిమ అద్భుతమైనది. గోదావరిలో స్నానం చేస్తే కర్మ, అకర్మల నుండి ముక్తులవుతారు. ఉభయలోక వాసులు సుందరమైన ఆ ఒడ్డున మనోహరమైన ఆ ప్రవాహాన్ని వీక్షిస్తూ బ్రహ్మానందంలో తేలియాడుతుంటారు. రామకథామృత నీరాలు ప్రేమభరితమైన దేవ, గంధర్వ, మునిజనాలనే జలచరాలతో నిండి ఉంటాయి. ఆ నది ఒడ్డున వున్న ఘనమైన మహావృక్షాలు కూడా వీరే. నదికి ఉపనదులు కలిసినట్లు ఎందరో మహాత్ముల చరిత్రలు ఇందులో చోటుచేసుకుంటాయి. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలే దీనిలో అలలుగా ఉప్పొంగుతున్నాయి. ఆ ప్రవాహం చాలా అమోఘమైనది. దాని ధాటికి పాపపర్వతాలు బద్దలైపోతాయి. సప్తకాండలే సప్తముఖాలుగ ఆ రామకథా ప్రవాహం భక్తుల హృదయసాగరంలో సంగమిస్తున్నది. త్రివిధతాపాలతో తపించేవారు, తీర్థవ్రతాలు చేసి అలిసిపోయినవారు దీనిలో స్నానం చేస్తే ప్రశాంతచిత్తులవుతారు. సంసారతాపాలు మరల వారిని తాకవు. ఈ గంగలో స్నానం చేస్తే భక్తిజ్ఞానాలుదయించి సకలచాతుర్యాలు అద్భుతరీతిలో వారి పాదాలవద్ద పడివుంటాయి. సుందరకాండ ఇంద్రలోకం వంటిది. అందులోని ప్రేమరసమే ఇంద్రుడు. సాక్షాత్తూ సరస్వతియే ఇక్కడ రమణీయంగా పూర్ణానందంతో నృత్యం చేస్తుంటుంది. ఇప్పుడు ఏడుకాండలలోకెల్లా అత్యంత రసభరితమైన సుందరకాండను పండితులైన శ్రోతలు అంతర్ముఖులై చక్కగా అవధరించండి.

**మారుతి సముద్రలంఘనం**

పద్దెనిమిదవ అధ్యాయంలోని కథ అద్భుతమైనది. సముద్రతీరంలో హనుమంతుడు లంకకు పోవడానికి ఉద్యుక్తుడవుతుండగా వానరులంతా

ఉత్సుకతతో చూడసాగారు. వాయుపుత్రుడు మహేంద్రగిరి పైకెక్కి భయంకరంగా సింహనాదం చేయగా భూగోళమంతా దద్దరిల్లింది. మారుతి లంఘించినప్పుడు వచ్చే గాలివేగానికి ఎక్కడ ఎగిరిపోతామోనని ముందుగానే వానరులంతా భయాక్రాంతులై పర్వతాన్ని కరుచుకుని కూర్చున్నారు. రఘువీరునికి జయము అంటూ అంజనాతనయుడు గాలిలో కెగిరాడు. ఆ గాలి వేగానికి ప్రళయం వచ్చిందా అన్నట్లుగా ఉంది. మహావృక్షాలన్నీ పెకలింపబడి పక్షులవలె ఆకాశంలో కెగిరాయి. కొండలు కూడా ఆ ధ్వనికి కదిలిపోయాయి. నక్షత్రాలు నేలరాలాయి. కొన్ని మేఘాలు చాటున దాగాయి. యుగాంతమైందా అన్నట్లుగా సర్వత్రా భయం అలముకొంది. సముద్రజలాలు ఉప్పొంగి భూమండలం దద్దరిల్లింది. సప్తపాతాళాలు ఆ గాలికి ఊగిసలాడాయి. ఆదిశేషుడు ఉలిక్కిపడ్డాడు. ఆదికూర్మం కూడా తన వీపు సవరించుకొంది. ఆదివరాహం కూడా ఆ గాలి తాకిడికి తన ముట్టెను పైకెత్తి కోరలతో భూమిని పట్టుకుంది. దిక్కులు కంపించాయి. మేరుపర్వతం తల్లడిల్లింది. దేవతలంతా భయభ్రాంతులయ్యారు. ఇంద్రుడు కలవరపడ్డాడు. పార్వతి శివుని కౌగిలించుకొంది, భయభీతయైన లక్ష్మీదేవిని విష్ణువు వెన్నుతట్టి నిమిరాడు. బ్రహ్మదేవుడు దేవతలతో 'సీతను వెతకటానికి మారుతి బయలుదేరాడు. విమానాలలో వెళ్ళి ఆ అద్భుతాన్ని తిలకించండి' అన్నాడు. దినకరుడే వానరవేషంలో వెడుతున్నాడా అన్నట్లు రుద్రాంశ సంభూతుడయిన అంజనాతనయుని సురులందరూ కౌతుకంతో అవలోకించారు. కల్పాంతంలో మెరిసే మెరుపుల్లా అతని కర్ణకుండలాలు, కటిప్రదేశంలోనున్న వజ్రకౌపీనము కాంతులీనాయి. త్రిగుణరూపుడయిన అతడు కల్పాంతంలోని మెరుపులా పయనిస్తుండగా అతడి యజ్ఞోపవీతం మెడకు చుట్టుకుని చూడటానికి ఒక దివ్యమైన పగడం ఆకాశంలో ఉన్నట్లు భ్రమ కలుగుతుంది. అతడి ముఖం, తోక ఎఱ్ఱబారి శరీరమంతా నిక్కబొడుచుకోగా హోరుమనే శబ్దంతో గగనంలో



సాగిపోయాడు. ఆ తాకిడికి ఆకాశం దద్దరిల్లింది. దిగ్గజాలు తమ స్థానం తప్పాయి. బ్రహ్మాండమంతా అల్లకల్లోలమైంది. తోకతో అతడు కొట్టిన శబ్దానికి ఆకాశం ప్రతిధ్వనించింది. ఆ శబ్దానికి లంకానగరమంతా భీతిల్లింది. రావణుడు కూడా ఆ ధ్వనికి విచలితుడయ్యాడు. ఆ రుద్రావతారుడైన మారుతి నీటిలో ఈదినట్లు కాళ్ళు రెండూ ఆడిస్తూ ఆకాశమార్గంలో ఎగిరిపోసాగాడు. క్షీరాబ్ధిలో శయనించే వైకుంఠవాసుని కోసం వెళ్ళే గరుడునిలా, మానససరోవరానికి వెళ్ళే రాజహంసలా, రెక్కలు వచ్చిన పర్వతంలా హనుమ ఆకాశంలో ఎగిరాడు. చింతామణిలా ప్రకాశిస్తూ యుద్ధంలో మెరుపులా గెంతే గుర్రంలా గంతులేస్తూ తండ్రికంటె వేగంగా, వింటి నుండి వదిలిన రామబాణంలా, చంచలమైన మనస్సు ఎక్కడ స్థిరత్వం పొందుతుందో ఆ యమదిశగా అంజనాతనయుడు గగనపథంలో సాగిపోయాడు.

అట్లా అంతరిక్షంలో సాగిపోయే అంజనాపుత్రుని చూచి, దేవతలు అత్యంత ఆశ్చర్యంతో ఆయన సామర్థ్యాన్ని పరీక్షించాలనే కుతూహలంతో రంభను పంపారు. పరమార్థ జ్ఞానాన్ని సాధించిన ఆయనకు మాయావిఘ్నం కలిగించు అని దేవతలన్నారు. పెన్నిధిని సాధించిన వానికి పిశాచాలడ్డం వచ్చినట్లు రంభ నోరుతెరచుకొని హనుమంతుని దారికడ్డంగా నిలిచింది. మారుతి అకస్మాత్తుగా ఆమె నోటిలోకి దూకి కర్ణద్వారాల గుండా రెప్పపాటులో తిరిగి బయటకు వచ్చాడు. ఆమె ప్రేమతో హనుమంతుని కొనియాడి స్వర్గానికి మరలి వెళ్ళింది.

తదుపరి సముద్రుడు మైనాకుడనే పర్వతాన్ని హనుమంతుని దారికడ్డంగా నియమించాడు. ఆ పర్వతం పెరిగేకొలదీ, హనుమంతుడు కూడా అంతకన్నా పైకెగరసాగాడు. ఆ సమయంలో ఆ పర్వతం హనుమంతునితో 'ఓ మహాపురుషా! నాపై ఒక్కక్షణం విశ్రాంతి తీసుకుని వెళ్ళవలసింది' అని ప్రార్థించింది. హనుమంతుడు ఆ కొండపై ఒక చెయ్యి మోపగానే అది

పాతాళానికి దిగిపోయింది. శాంతిసౌఖ్యాలతో అలరారేవారిని చూచి క్రోధం పారిపోయినట్లు మారుతి కరస్పర్శతో పర్వతం సాగరాంతానికి కుచించుకునిపోయింది.

అక్కడి నుండి ఎగురుతూ ముందుకు పోగా సింహిక నోరు తెరచి దుర్బుద్ధితో విచిత్రంగా హనుమంతుని నీడను పట్టి ఆకర్షించసాగింది. సింహిక రాహువుకేతువుల తల్లి. ఎన్నో ఏళ్ళనుండి ఆంజనేయుని మింగాలని తపిస్తున్నది. అది సముద్రంలో వెల్లకిలా పడుకొని పన్నెండు యోజనాల పొడువున నోరుతెరచి హనుమంతుని నీడను మ్రింగగా స్వర్గంలోనున్న వారు అకస్మాత్తుగా భూమిపై పడ్డట్టు హనుమంతుడు తటాలున ఆకాశంనుండి సముద్రంలోనున్న సింహిక నోటిలో పడ్డాడు. వెంటనే దాని కడుపులోనికి వెళ్ళి విరక్తుడు పరమార్థానికి పయనించినట్లు హనుమ బయటకు వచ్చాడు. దాంతో సింహిక మరణించింది.

అలా ముందుకు సాగిపోగా లంకాదేవి పరుగున వచ్చి హనుమంతుని పాదాలు పట్టుకొని క్రింద పడవేసింది. శ్రీరామభజన చేసేవారికి విఘ్నాలు దరిచేరవు. సాధకుడు వాటి గురించి ఏ మాత్రం కలవరపడక సావధానంగా నామస్మరణ చేస్తుంటాడు. వాయుకుమారుడు లంకాదేవిని వజ్రతుల్యమైన పిడికిటి పోట్లతో హింసించగా ఆమె అంజనాతనయుని స్తుతించి తనను చంపవద్దని వేడుకుంది. 'నీవు విజయుడవౌతావు. ముందుకు సాగితే బహిర్లంకా నగరాన్ని చేరుతావు' అంది. హనుమ అక్కడకు వెళ్ళి చూడగా ఆ నగరమంతా భయభ్రాంతంగా ఉన్నది. అక్కడ రావణాసురుని చెల్లెలి వరసైన క్రౌంచ నివసిస్తుండేది. ఆమె అన్న ఘర్జరుడు. వాడు ఇంద్రుని చేతిలో హతమయ్యాడు. అప్పటి నుండి ఆమెను దశకంఠుడు బహిర్లంకలో నియమించాడు. లంకంతా భయాక్రాంతమయిందన్న వార్త విని కారణం తెలుసుకొని క్రౌంచ అపారంగా రాక్షస సైన్యాన్ని పంపి హనుమంతుని పట్టుకుంది. ఆ సమయంలో హనుమంతుడు సూక్ష్మరూపంలో ఉన్నాడు. క్రౌంచ అతడిని చూచి గట్టిగా



చేతులతో పట్టుకుని ఈ కోతిని వండి ముక్కలుగా కోసి త్వరగా తీసుకురండి అంది. దానికి హనుమంతుడు నా శరీరమంతా నీటితో నిండి ఉన్నది. వండితే ఏమీ మిగలదు. అందువల్ల నీవు మొత్తం ఇలాగే తిను అన్నాడు. రాక్షసి హనుమంతుని మింగగా, హనుమంతుడు లోన దాని జీవాన్ని పట్టుకుని ఊపసాగాడు. ఆ రాక్షసి సెగలుపొగలు గ్రక్కుతూ కళ్ళుతేలేసి 'నాకిక చావు తప్ప'దంటూ నేలపై పడింది. హనుమంతుడు లోపల బాధపెడుతున్నాడని, అతడిని బయటకు తేవడానికి రాక్షసులు పందిపెంట తెచ్చి ఆ రాక్షసి శరీరానికి పూర్తిగా పూశారు. హనుమంతుడు ఆమె ముక్కుపుటాల ద్వారా తోకను బయట పెట్టగా అది రోగబీజమనుకొని రాక్షసులు దాన్ని పట్టి లాగారు. లాగగా లాగగా ఆ తోక అంతా ఒక పెద్దకుప్ప అయింది. హనుమంతుడు ఆ రాక్షసులందరినీ తోకతో చుట్టి బంధించాడు. ఆంజనేయుడు అద్భుతమైన తన బలంతో గర్జిస్తూ క్రౌంచ ఉదరాన్ని చీల్చుకొని బయటకు వచ్చాడు. అది చూచి అసంఖ్యాకంగా పుచ్ఛబంధంలో చిక్కుకున్న రాక్షసస్త్రీలు దానినుండి తప్పించుకొని సముద్రజలాల్లో దూకి జలచరాలకు ఆహారమైనారు. మనస్సులో చెలరేగే అనంతవృత్తులను లయింపజేసి యోగి మనస్సును జయించినట్లు హనుమంతుడు రాక్షసులను సంహరించి లంకా ఉపనగరంలో విజయాన్ని సాధించాడు. ఆ నగరంలో మిగిలిన ఒక వృద్ధ రాక్షసిని చూచి ఆ రుద్రావతారి 'నాకు లంక ఏదో చూపించు. లేకపోతే నిన్ను భక్షిస్తాను' అంటూ పెద్దగా నోరుతెరిచాడు. 'ఆవలి ఒడ్డున కనబడేదే లంక' అని ఆమె బదులు ఇచ్చింది.

## లంకలో హనుమ సీతాన్వేషణ

సూర్యడస్తమించడం చూచి వాయుపుత్రుడు 'కుంభిలా దుర్గానికి వెళ్ళి సౌందర్యరాశియైన సీత కొరకు అంతటా వెదకసాగాడు. కంసాలి కసువులో నుండి సువర్ణకణాలను గాలించినట్లు, చెత్తలో నుండి ముత్యాన్ని వెలికితీసినట్లు, ఆత్మప్రాప్తి కొరకు సాధకుడు సారాసార విచారం చేసినట్లు, యాత్రలో

తప్పిపోయిన తల్లిని సత్పుత్రుడు వెదికినట్లు, మహావైద్యుడు అడవిలో సంజీవినిని అన్వేషించినట్లు, సముద్రంలోని వేదాలను మత్స్యరూపంతో ముకుందుడు శోధించినట్లు' మారుతి కుంభిలలో సీతకై గాలించాడు.

హేమరత్నమయమైన, అతిసుందరమైన ఇంద్రజిత్తు భవనాన్ని చూచి వానరుడు సీతను వెదకడానికి అందులో ప్రవేశించాడు. అక్కడ ఇంద్రజిత్తు, సులోచనలు ఒకే మంచంపై శయనించి ఉండగా, సులోచన అందం గాంచి ఈమె సీతేనా? అని క్షణకాలం భ్రమించి, ఆగ్రహించి, తన అపచారాన్ని గుర్తించి పరితపించాడు. ఇంతలో మాటల సవ్వడి విని, ఏం మాట్లాడుకొంటున్నారో విందామని ఆగాడు. ఆ నాగకన్య ఇంద్రజిత్తుతో, 'మీ తండ్రి లంకానాథుడు చాలా అనుచితంగా ప్రవర్తించాడు. ఎలాంటి వైరం లేకపోయినా, నిష్కారణంగా సీతను తీసుకుని వచ్చి వంశనాశనానికి కారణభూతుడయ్యాడు. పరసతులను అభిలషించేవారు, సాధుసజ్జనులను ద్వేషించేవారు, గురుద్రోహం చేసినవారు, తల్లిదండ్రులను తిరస్కరించినవారు, బ్రాహ్మణులను నిరంతరం నిందించేవారు, దుష్ట దురాచారాలతో హింసకు పాల్పడేవారు, హరిచరిత్రను నాశనం చెయ్యాలనుకునేవారు, మహాత్ముల గ్రంథాలను నిందించేవారు, నాస్తికులు అల్పాయుష్కులౌతారు. సీతను తీసుకొని వచ్చి వృథాగా అనర్థం కొని తెచ్చాడు. అందువల్లనే లంకకు ఈ గతి పట్టింది. ఎటుచూచినా మనకు మేలు కలిగే సూచన కనబడడం లేదు' అని బాధపడింది. ఆ మాటలు విని హనుమంతుడు అక్కడ సీత లేదని గ్రహించి లంకలోని విభీషణుని మందిరంలోకి ప్రవేశించాడు. సత్వశీలుడైన విభీషణుడు విష్ణు ఉపాసకుడు. ఆ మందిరం నిరంతరం హరికీర్తనలతో మారుమ్రోగుతుంది. అక్కడ రజస్తమోగుణాలకు తావులేదు. ద్వేషం, హింస ఎక్కడ వెదకినా కానరావు. పురాణశ్రవణం, హరికథలు తప్ప వేరే చర్చలేదు. హృదయమంతా దయ, క్షమ, శాంతితో నిండివున్న విభీషణుని కీర్తనలకు మైమరచి, అంతరంగమంతా



పులకించిపోగా హనుమంతుడు గద్గదకంఠుడై బ్రహ్మానందంలో తన్మయుడయ్యాడు. ఆ భక్తుని పాదధూళి గైకొని వాయునందనుడు శిరస్సున ధరించాడు. రాక్షసవంశజుడైనా ఈ భక్తశిరోమణి మహాసాత్వికుడు. కాకులలో కోకిలవలె, దైత్యకులంలో పుట్టిన భక్తుడైన ప్రహ్లాదునివలె, కాకిరెట్ట నుండి మొలచిన అశ్వత్థవృక్షంవలె, పాషాణాల్లో పరుసవేదివలె, ఆలిచిప్పలో దివ్యమైన ముత్యంవలె, రాక్షసకులంలో ఉత్తమగుణాలతో అలరారే ఈ భక్తుడు ఉదయించాడు. లంకకు వచ్చి రఘురాముడు పరివారంతో సహా రావణుని చంపిన పిదప, రఘుపతిని ప్రార్థించి రాజ్యం సంపూర్ణంగా విభీషణుని పరం చేయాలి. సాధువుల బోధలు విని కామ, క్రోధ, మత్సరాలు ఎలా పారిపోతాయో అలాగే భక్తప్రసిద్ధుడైన విభీషణుని వల్ల లంక అక్షయమైంది. అనుకుంటూ బాగా దప్పికగొన్న పండితునకు ఆకస్మికంగా గంగ లభించినట్లు, చకోరం చంద్రుని తిలకించినట్లు, మేఘాన్ని చూచి చాతకం పులకించినట్లు విభీషణుని మందిరంలో వాయుపుత్రుడు పరమానందంలో పరవశించాడు.

అటునుండి ముందుకు వెళ్ళగా, కుంభకర్ణుని మందిరం కానవచ్చింది. అచ్చటి దుర్గంధానికి మారుతి మనస్సు వికలమైంది. మేఘగర్జన లాగా కుంభకర్ణుడు గురకపెట్టగా, ఆ ధాటికి ఏనుగులు, గాడిదలు ముక్కపుటాల్లోకి వెళ్ళి ఊపిరి వదలగానే మరల అతడి శరీరంపై పడసాగాయి. ఇంత జరుగుతున్నా అతడు మందరాచలంలా అచేతనుడై నిద్రావస్థలో నేలపై పడి ఉన్నాడు. కుంభకర్ణుడు తల్లి గర్భంలో నుండి తన పొడవైననాలుకను చాచి ముప్పై వేలమంది స్త్రీలను మింగేశాడట. అటువంటి కుంభకర్ణుని చూచి వాయునందనుడు అచ్చెరువొంది ఈతడి జన్మ వ్యర్థము. నిరుపయోగంగా పడి ఉన్నాడు అనుకున్నాడు. చండాలుని ఇంటిని చూచి వేదవిదులైన బ్రాహ్మణులు పరుగెత్తినట్లు, కల్పతరువుపై వసించే పక్షి ముళ్ళపొదలలో నిలువలేనట్లు, హనుమంతుడు కుంభకర్ణుని భవనాన్ని వదిలి ముందుకు పోసాగాడు.

మహాసాధ్వియైన సీత లంకలో ఎక్కడ ఏ రూపంలో ఉందో, ఆమెను ఎలా వెదకాలా అని మథనపడసాగాడు. వానరరూపంతో లంకలో తిరిగితే రాక్షసులు వినోదంగా నానా అల్లరి చేస్తారు. క్రూరమైన రాక్షస రూపం ధరిస్తే బ్రాహ్మణులను చంపి వండిన మాంసాహారం తిని పుణ్యమంతా నాశనం చేసుకోవలసి వస్తుంది. ఏదైనా రాయబారం చేద్దామంటే రావణుడు అంగీకరించడం త్రికాలాల్లో అసంభవం. రాక్షసులలోనే విభేదం కలిగించి వినోదిస్తాను అని తలపోసి హనుమంతుడు వానరరూపం విడిచి చీమకంటే కూడా సూక్ష్మరూపంలో ఇల్లిల్లూ తిరగసాగాడు. జీవులందరిలో వసిస్తూ కూడా జనార్దనుడు ఏ విధంగా అదృశ్యుడై ఉన్నాడో అలాగే వాయునందనుడు ఎవరికంటా పడక, ఇంటింట్లోని అధర్మ ప్రవర్తనను గమనించాడు. ఇంట్లో శాంతి లేకపోయినా డంబాచారం మెండు. నిరంతర అగ్నిహోత్రంతో సదా వేదాధ్యయనం చేసేవారుకూడా గోబ్రాహ్మణులను చూచినంతనే నోట్లో వేసుకుని నమిలేయడం, జారులైన స్త్రీ పురుషులు రుద్రాక్షమాల ధరించి జారణ, మారణ, మోహనాది కుటిల మంత్రాలను జపించడం, రక్తమాంసాలలో, మద్యపానంలో మత్తెక్కి కళ్ళుమూతలు పడుతుండగా శాంతిని పాటించే వారిలా నటించే వారినీ చూచాడు. హృదయాల్లో మదమత్సరాలు ముప్పిరిగొనగా వాచాలత్వంతో జనులు తామే కర్మాతీతులమని చెబుతూ సదాచార భ్రష్టులై సంచరిస్తున్నారు. మహా ఉన్మత్తులై, విషయాంధులై మేమే జ్ఞానులము, సదా ముక్తులము, కర్మరాహిత్యం చేస్తామంటూ మనస్సుకు నచ్చినట్టు భోగ భాగ్యాలనుభవిస్తున్నారు. ఏనుగు స్నానం చేసి వచ్చినా, గాడిద బూడిదలో పొర్లాడినా, వాటిని ఎవరైనా యోగీశ్వరులంటారా? అలాగే ఈ రాక్షసుల డంబాచారం వ్యర్థం.

### లంకానగర ప్రజల అధర్మవర్తన

ఒకడు సన్యాసం తీసుకొని ఉదయాన్నే ఆచమనం చేసి గోమాంసాన్ని భుజిస్తాడు. పైగా కర్త ఎవడు? అంటాడు. విరజాహోమం చేస్తూ నువ్వులు,



నెయ్యి మంటలలో వేసి కాలుస్తున్నా కామక్రోధాది అరిషడ్వర్గాలు మాత్రం పెరిగిపోతున్నాయని, నానారకాల జీవులను భక్షిస్తూ మాకంటే దైవం వేరే లేదని గోచర్మాన్ని ధరించి జటాధారులైన వారినీ, వానప్రస్థ వేషంలో వనాల్లో తిరుగుతూ రహస్యంగా గోబ్రాహ్మణులను చంపి భక్షిస్తూ వీటికంతా కర్త ఎవరు? అని బుకాయించేవారినీ, మేము బ్రహ్మచారులం, విరక్తులం, ఇంద్రియాలను అధీనంలో ఉంచుకున్న ముక్తులం అంటూ సాంసారిక బంధాలలో చిక్కుకొని అమిత పాపాన్ని మూటగట్టుకొనే వారిని, క్షత్రియులంతా అధర్మ వర్తనులై సమరంలో వెన్నిచ్చి పారిపోతూ, శుష్కసంభాషణలతో కాలం వెళ్ళబుచ్చుతూ నానాటికి దిగజారిపోతున్నవారినీ, వర్తకులు వ్యాపారం మానేసి, అధర్మనిరతులై తూనికలలో ఇతరులను మోసం చేస్తూ ధర్మాన్ని, బ్రాహ్మణులను సేవించడం మానేసినవారినీ. కంసాలివారు గీటురాయితో గీచి చూచి ఆభరణాలకంతా వెల తక్కువ కట్టి జనాన్ని మోసం చేసి ఆ నగలను బంగారంగా మారుస్తున్నవారినీ, వ్యవహారంలో ఎవరినయినా నమ్మి ఆస్తిని ఇతరుల చేతిలో పెడితే కాలాంతరంలో కుదువ పత్రాలు చేతి కొచ్చి ఆజన్మాంతం దు:ఖిసున్నవారినీ చూచాడు. అటువంటి మోసగాళ్ల వద్ద, గానుగ చుట్టూ తిరిగే నూనె వ్యాపారుల వద్ద, గాజులమ్మేవారి వద్ద, గిన్నెలమ్ముకునేవారి వద్ద, మగ్గం నేసే సాలెవాళ్ళ వద్ద, స్మశానంలో తిరుగాడే వారి వద్ద, తమలపాకులమ్మే వారి వద్ద, దర్జీ పనివారి వద్ద, అద్దకం పని చేసేవారి వద్ద, ధాన్యం సేకరించడంలో జీవితమంతా వృథా చేసే కామందుల వద్ద సీత ఎలా ఉంటుంది? నిష్ఠ లేకుండా దానం కోసం ఎదురు చూసే అభావుకులయిన వేదపాఠకుల వద్ద, సదా పరనింద చేస్తూ తమలో తామే కలహించుకుంటూ ఏది జరగాలో అది జరుగుతుంది అంటూ కాలం గడిపే పండితుల వద్ద, గాయకులైనప్పటికీ బింకంతో, అభిమానం ప్రేమలేక శృంగారంగా గానం చేసే చోట, జ్యోతిషమంటూ గ్రహగతులను గూర్చి ఉపన్యసించి తన ఇంటిలో జరగబోయేది తెలియని మూర్ఖులవద్ద సీత ఉండగలదా?

ప్రహస్తుడు మొదలగు ప్రధానుల అంత:పురాల్లో శోధించి పద్మినీ జాతి సుందరాంగులను ఆపాదమస్తకం చూచి హనుమంతుడు పరిపరి విధాలుగా తర్కించుకున్నాడు. జానకీదేవి ఎక్కడా కనిపించలేదే, బహుశా యోగమార్గంలో తన ప్రాణాలు అర్పించి ఉంటుందా? లేక సముద్రంలో మునిగిపోయిందా? లేక రావణుడు కోపంతో భక్షించాడేమో? లేక దారిలో ఆకాశమార్గం నుండి క్రిందికి దూకి తునాతునకలైందేమో? రావణుడితో పోట్లాడి అలసిపోయి అతడినే ఆశ్రయించిందేమో? లేక సవతి అవుతుందేమోనన్న ఈర్ష్యతో రావణుడి భార్యలు ఆమెను అంతమొందించారేమో? నేను సముద్ర లంఘనం చేయటం వృథా ప్రయాసేనా? అని అనుకొని హనుమంతుడు కళ్ళనీళ్ళు నిండగా తల్లడిల్లాడు. రాజీవనయనుడు అడవుల్లో 'సీతా! సీతా!' అని పలవరిస్తూ కనిపించిన రాయినెల్లా హృదయానికి హత్తుకొని ఆలింగనం చేసుకుంటున్నాడు. నేను సీతను కానక తిరిగి వెళితే రఘురాముడు తప్పక దేహాన్ని త్యజిస్తాడు. లక్ష్మణుడు, సుగ్రీవుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు అందరూ ప్రాణత్యాగం చేస్తారు. ఈ వార్త అయోధ్య చేరి అక్కడ భక్తశిరోమణి, మహావీరుడు అయిన భరతుడు, శత్రుఘ్నుడు, తల్లులు అంతా కూడా తప్పక తనువు చాలిస్తారు. నా కష్టం అంతా ఎందుకూ కొరగాకుండా పోయింది. జానకి జాడ తెలియలేదు. నేను తిరిగి వెళ్ళనట్లయితే ఆ కోదండపాణి నాకొరకు ఎదురు చూస్తుంటాడు.

### హనుమ అసహనం: లంకావిధ్వంసం

సుడిగాలి వీస్తే మేఘాలన్నీ ఎలా చెల్లాచెదురౌతాయో, కొంచెం నిప్పు తగలగానే గడ్డి వాములెలా భస్మమవుతాయో, ఇంటియజమాని మేల్కొనడం చూచి దొంగలెలా పారిపోతారో, సూర్యుడుదయించగానే నక్షత్రాలెలా లుప్తమౌతాయో, సింహాన్ని చూడగానే ఏనుగులెలా అచేతనమౌతాయో అలా రఘుపతిని స్మరించగానే విఘ్నాలన్నీ క్షణంలో వీగిపోతాయి. నేను లంకను



సర్వనాశనం చేసి సముద్రంలో విసిరివేస్తాను అని నిశ్చయించి హనుమంతుడు అంతటా కల్లోలం సృష్టించి ప్రతిఇంటిలో హాహాకారాలు రేకెత్తించాడు. రత్నఖచిత గోపురాలతో, వాటిపై మెరుపులవలె మెరిసే పతాకాలతో లెక్కలేనన్ని కనక కలశాలతో ఆ లంకానగరం దివ్యంగా అలరారుతున్నది. అంజనాసుతుడు మదగజంవలె వజ్రతుండం వంటి తోకతో ఆ గోపురాలన్నింటినీ పడగొట్టాడు. అర్ధరాత్రి లోకమంతా నిద్రాణమై ఉండగా ఇళ్ళన్నీ అకస్మాత్తుగా నేల మట్టమయ్యాయి. అదిచూచి జనులంతా భయకంపితులయ్యారు. పర్వతశిఖరాలు నేలమట్టమయినట్టు గోపురాలన్నీ కూలిపోయాయి. మహాద్వారాలను పెకలించి మారుతి ఆకాశంలోకి విసిరేసాడు. కిటికీ తలుపుగుండా ఇంటిలోనికి తోకను పోనిచ్చి ఇంటి స్తంభాలను తోకతో చుట్టి పడగొట్టాడు. తలుపులను చేత్తోమోది విరగగొట్టాడు. నగరమంతా అల్లకల్లోలమైంది. అకస్మాత్తుగా చెట్లన్నీ కూకటివేళ్ళతో పెళ్ళగించ బడ్డాయి. అది చూచి జనులు భయవిహ్వాలులయ్యారు.

నగరమంతా ఉన్నట్లుండి కల్లోలితమైంది. ఒకడేమో పారిపోండి! పారిపోండి! అంటుండగానే ఒక రాయి వచ్చి నెత్తిమీద పడింది. రాక్షసస్త్రీల జుట్టుపట్టుకొని గిరగిరా త్రిప్పి ఆకాశంలోకి విసిరివేయగా, గుండెలు బాదుకుంటూ వారు హాహాకారాలతో ఆక్రోశించారు. స్త్రీ, పురుషులిద్దరూ శయనమందిరంలో ఏకాంతంలో నగ్నంగా శయనించి ఉండగా వారి మంచం వీధిలో పడి ఉండేది. భాండాగార గృహాలను పగులగొట్టి నానారకాల వస్తువులున్న పెట్టెలను తెచ్చి రహదారిలో పోసి అన్నింటినీ ఒక కుప్ప చేశాడు. ఆ రాత్రిపూట శక్తిమంతమైన ఆ తోక చేసిన వీరవిహారాలకు అసురులంతా భయభ్రాంతులయ్యారు. మాట్లాడ్డానికి కూడా వారు అశక్తులయ్యారు. అలా నగరాన్ని మొత్తం గడగడలాడించి ఆంజనేయుడు తాపీగా రాజద్వారం వద్దకు వెళ్ళి కలహప్రియుడై కూర్చున్నాడు. తోకను గుండెకు హత్తుకొని

హనుమంతుడు మాటిమాటికి దానిని చుంబిస్తూ కళ్ళుమూసుకుని తల ఆడిస్తూ కోతిచేష్టలు చేయసాగాడు. ఉదయాన్నే ఆడ, మగ అసంఖ్యాకంగా నీటి కలశాలు తెస్తుండగా ఉన్నట్టుండి తోకతో చుట్టి అన్నింటినీ ఒక్కసారి విరగ్గొట్టడంతో స్త్రీలంతా హడలిపోయారు. ఎవర్రా! కుండలను విరగ్గొట్టింది అన్న వారి ముక్కుచెవులపై హనుమ తోకనుంచగా రాక్షసస్త్రీలు కలవరపడ్డారు. ఒకామె భయంతో విపరీతంగా తుమ్మడం మొదలుపెట్టింది. కుండలు నింపుకుని వచ్చిన వారిని మారుతి ఆటంకపరచి వాళ్ళ కుండలను రాజద్వారంలోనే పెద్దశబ్దంతో పగులగొట్టాడు. ఆ రాక్షసస్త్రీలను నగరంలోనికి పోనివ్వలేదు. 'ఓ రావణా! జానకిని క్షోభపెట్టినందుకు నీకు ఏమీ మిగలదు. సీత సృష్టించిన భూతం నగరమంతా అదృశ్యంగా తిరుగుతూ లంకను కల్లోలం చేసి చివరకు నిన్ను కూడా తప్పక అంతమొందిస్తుంది' అని శాపనార్థాలు పెట్టసాగారు. రాజదర్శనం కోసం మహావీరులు అశ్వారూఢులై వేగంగా రావడంచూచి ఆ కపివరుడు గుర్రం వెనుక కాళ్ళు పట్టుకుని గిరగిరా త్రిప్పి నేలకేసి కొట్టి ఒకదానిపైనొకటి వేసి స్వారీచేసేవారితో సహా అశ్వాలను కుప్పపోశాడు. ఇంతలో ఉన్మత్తమైన గజదళాలు వచ్చాయి. వాటితోక పట్టుకుని తిరగేసి కొట్టగా వాటినధిరోహించిన రాక్షసుల పళ్ళు నేలరాలాయి. ఏనుగులను వాటిపైనున్న అంబారీతో సహా సముద్రజలాలలోకి విసిరేశాడు. రకరకాలయిన వాద్యాల హోరుతో రథారూఢులై వస్తున్న రాజకుమారులను చూచి ఆ వానరవీరుడు కోపించి వెంటనే తోకను వారిపైకి వదిలాడు. వందలకొద్దీ రథాలు పల్టీకొట్టగా రాజకుమారులు నేలపై బోర్లాపడ్డారు. సారథులు ఆకాశానికి ఎగిరారు. గుర్రాలన్నీ మరణించాయి. తోక దెబ్బతిని వాద్యకారులు, వాద్యాలతో సహా నెత్తీనోరూ బాదుకుంటూ తిరిగివెళ్ళారు. ఇంతలో పల్లకిలో వస్తున్న ప్రధానిని చూచి వాయునందనుడు తోక చిన్నది చేసి బోయీల చెవుల్లో గుచ్చాడు. వారు భయభ్రాంతులై పల్లకిని కిందపడేసారు. అందులోని ప్రధానిని



పట్టుకొని పిడిగుద్దులు గుద్దాడు. వీడిని చంపడం వ్యర్థం అనుకుని సీత సృష్టించిన భూతం నీకు ఈ అవమానం చేసింది అంటూ పల్లకిని ధ్వంసం చేశాడు. పల్లకి, రథాలు, ఏనుగులు, గుర్రాలు, అన్నీ ఒక కుప్పగా పడివున్నాయి. ఎవరూ రాజద్వారం వైపు పోవడంలేదు. ఎవరన్నా రహస్యంగా పారిపోవాలని ప్రయత్నం చేస్తే వారి కాళ్ళు, కీళ్ళు వేరు చేయబడ్డాయి. వెంటనే లేచి మారుతి ఎవరెవరు సీతను గూర్చి ఏమేమి అనుకొంటున్నారా? అని వినడానికి ఇల్లిల్లు తిరిగాడు. ఇంతలో సూర్యుడస్తమించాడు.

రావణాసురుడు సభామండపంలో సింహాసనంపై ఆసీనుడైవుండగా అంజనాపుత్రుడు సభలో ప్రవేశించి లంకానాథుని వెనుక నిలబడ్డాడు. రక్షకభటులంతా రావణ సముఖానికి వచ్చి 'ఓ మహారాజా! నగరంలో జరిగిన దుష్టవిఘ్నాలకు, నగర ద్వారం దగ్గర కుప్పగాపోయబడిన రథ, గజ, తురగాలకు, కూలిపోయిన గోపురాలకు, నేలమట్టమైన మందిరాలకు, ఆకాశానికి విసిరివేయబడ్డ పిల్లలకు, విరిగిన తలుపులకు ఒక వానరుడు బాధ్యుడని వీరులందరూ అనుకుంటున్నారు. నిద్రలో జనులు ఏవో భయంకరమైన శబ్దాలు విని ఉలిక్కిపడుతున్నారు. ఓ లంకాధీశా! ఏవేవో దుశ్శకునాలను చూచి అందరికీ ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. సీతను వెంటనే అరణ్యాలలో వదిలిపెడితే లంకానగరం చిరకాలం మనగలదు' అని పలికిన ద్వారపాలకుల మాటవిని రావణుడు కుపితుడై 'మీ నాలుక, చెవులు ఖండిస్తాను. కల్పితమైన ఆ దుశ్శకునాలు ఎక్కువకాలం ఉండవు. వాటిని గురించి నాకు చెబుతారా మూర్ఖులారా!' అన్నాడు. ఈ మాటలు విని ఆంజనేయుడు క్షోభిల్లాడు. ఈ దుశ్శకునాలు కల్పితాలా? వాటిని నిరూపించడానికి నా తోకతో ఈ సభను కదనరంగం చేసి వీడికి పెళ్ళిచేస్తాను అని తలచాడు. ఇంతలో రావణుని వద్దకు ఒక మంగలి వచ్చి గడ్డం చేయసాగాడు. హనుమంతుడు తోకతో ఆ మంగలి చెవిలో గిలిగింతలు పెట్టాడు. దాంతో ఆ మంగలి భయంతో

ఉలిక్కిపడగా చేయి వణికింది. ఒకవైపు సరిచేస్తున్న రావణుని మీసం కాస్తా పూర్తిగా తెగిపోయింది. రావణుడు పరమకుపితుడై మంగలిని ఒక తాపు తన్నాడు. రావణుని వెనుకనున్న హనుమంతుడు వీపుపై పిడిగుద్దు గుద్దాడు. వామహస్త ప్రహారానికి పది ఛత్రాలు నేలకూలాయి. వెంటనే కుడిచేత్తో రావణుని పది కిరీటాలు పడగొట్టాడు. గొడుగు కఱ్ఱను తీసుకొని రావణుని అపానద్వారంలో గుచ్చాడు. రావణుడు వెంటనే వెనక్కి తిరిగిచూడగా ఆ కర్ర రెండుముక్కలైంది.

**రావణసభాకల్లోలం**

రావణుని సభామంటపం పదునాలుగు గ్రామాల విస్తీర్ణం కలది. సుగంధాలతో దేదీప్యమానంగా శోభిల్లుతున్నది. శోభాయమానంగా వెలిగే పదునాలుగు వేల కర్పూరదీపాలు చక్కగా అమర్చబడి ఉన్నాయి. విశాల శరీరం కలిగిన ఎనిమిది లక్షలమంది వీరులు సభముందు నిలబడి ఉన్నారు. ఆ సభలోని దీపాలను వాయుపుత్రుడు తోకను ఝాడించి ఆర్పేశాడు. దీపం ఒక్కటి కూడా మిగల్లేదు. సభాసదులంతా గాభరా పడ్డారు. అంతా చీకటిమయమయింది. ఇంతలో హనుమంతుడు అందరి వస్త్రాలంకారాలను అపహరించి దిగంబరుల గావించాడు. కిరీటాలు తీసివేసి తలపై కొట్టిన ముష్టిఘాతాలు పర్వతాల రెక్కలను ఖండించిన దేవేంద్రుని వజ్రాయుధాన్ని మరపించాయి. వాయునందనుడు వాళ్ళ వేళ్ళు విరిచి ఉంగరాలు వొలిచేశాడు. మెడలు విరిచి హారాలు పీకేసాడు. ముష్టిఘాతాలతో గుండెలు చీల్చి బంగారుపతకాలను పెరికేసాడు. పాదప్రహారాలతో నడుములు విరగ్గొట్టి వెండి మొలత్రాళ్ళు లాగేశాడు. కొందరిని వివస్త్రలను చేసి లింగాన్ని విరిచేశాడు. వాళ్ళ మొలలకు చుట్టుకున్న గుడ్డలను పీకేసి దిశమొలతో నిలబెట్టాడు. దాంతో రాక్షసులంతా అల్లకల్లోలమైనారు. ఒకడేమో ప్రాణాలు దక్కాయి కదా అని, వస్త్రసాలంకారాలన్నీ పోతే పరవాలేదు కానీ, లింగభంగంతో జీవితమంతా



గడిపేదెలా? అని, ఎలాంటి విషమ పరిస్థితి కలిగిందా అని, హనుమ రాక్షసుల పాదాలను మెలితిప్పి గొంతులను నులమగా ప్రాణాలు పోతున్నాయి. ఊపిరాడటం లేదు అని కేకలు పెట్టసాగారు. ఒకరి గతి చూచి మరొకరు ప్రాణాలు పోతాయేమోనని నోటమాటలేకుండా నిశ్చేష్టులై నిలబడ్డారు. ఈ పెనుభూతం మనలను సంపూర్ణంగా నిర్మూలించడానికి ఉదయించిందనుకున్నారు. శ్రీరాముడి భార్య సీత పతివ్రతా శిరోమణి. ఆమే ఈ భూతాన్ని సృష్టించి లంకకు ప్రళయం తెచ్చింది అని తలచారు.

లంకంతా పెనుచీకట్లు కమ్మాయి. ప్రచండమైన సుడిగాలిలో దివిటీలు తెచ్చినా నిలవడంలేదు. మహా అనర్థం సంభవించింది. ఒకడు ఎక్కడ లంకానాథుడు అన్నాడు. ఒకడు 'బహుశా ఇంటిలో ఉంటాడు. ఇక్కడుంటే అపజయమో, ప్రాణాపాయమో తప్పదు కదా!' అన్నాడు. దేవాంతక, నరాంతక, రాజసుతులు అతికాయుడు, ఇంద్రజిత్తు, మత్త, మహామత్త, యుద్ధోన్మత్త, ప్రహస్తాది వీరులు నగ్నం గావించబడ్డారు. తలుపులు తెరుచుకుని ఒక్కరు కూడా సభాద్వారం దాటి బయటకు వెళ్లలేకపోయారు. ప్రయత్నించినవారు తోకతాపుతో ఘోరంగా దెబ్బతిన్నారు. దశకంఠుడు భయభ్రాంతుడై 'ద్వారపాలకులు నిజమే చెప్పారు. ఇదేదో దుస్తరమైన ప్రచండ ఉత్పాతం నిజంగానే వచ్చి పడింది' అని అనుకున్నాడు. రావణుడికి వీపుపై తగిలిన వజ్రప్రాయప్రహారాలవల్ల మాట్లాడటానికి అశక్తుడై ఊపిరిపోతుందా అన్నట్లున్నాడు. హనుమంతుడు రావణుని చెవిలో మెల్లగా, నేను శ్రీరాముని దూతను. నగరాన్నంతా అల్లకల్లోలం చేశాను. నీ పదితలలు నరికి ఒక్క క్షణంలో కిష్కింధకు పోగలను. కానీ ఉదారుడైన రాఘవుడు నాకు అనుమతి ఇవ్వలేదు అన్నాడు. వాయునందనుని మాటలు విని రావణుడికి అది కలా? నిజమా? లేక మతిభ్రమణమా? అన్నది అర్థం కాలేదు. అలా అక్కడ మహాప్రళయం ఏర్పడగా దశకంఠుడు మొదలగు మహావీరులు నగ్నంగా

మూర్ఛావస్థలో వికలురై నేలమీద పడి ఉన్నారు. కొందరు చేతులు కాళ్ళు విరిగాయని, అనేకులు చెవిముక్కులు తెగాయని, కొందరు లింగం పోయిందని రావణునికి చూపించారు. రాక్షసులంతా దుఃఖితులై స్వగృహాలకు వెళ్ళారు. చింతాక్రాంతుడై దశవదనుడు అంతఃపురంలో ప్రవేశించాడు.

రామవిజయగ్రంథం సుందరమైనది. ఇది దివ్య విశ్రాంతిధామం. దీన్ని చదివి రఘురాముని ఉపాసించినవారు జ్ఞానం పొందుతారు. అవిద్యారణ్యంలో సంచరిస్తూ మందమతులైన వారికి రామవిజయ సదన ప్రవేశం ఎన్నటికీ ప్రాప్తించదు. ఈశ్వర హృదయవాసి అయిన రఘురామా! రావణుని దర్పమడచిన శ్రీరామా! శ్రీధరవరదా! జగద్భూషణా! బ్రహ్మానందా! నీకు జయము. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

*॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥*

**పంతొమ్మిదవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 20

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**ద**రిద్రుని ఇంటికి అతిథి వస్తే ఆదరించడానికి శక్తి లేకపోయినా ప్రేమతో కందమూలాలను సమర్పించి సత్కరిస్తాడు. అలా ఈ గ్రంథకర్త ప్రాకృతపదజాలన్ని సాధుపురుషులకు సమర్పిస్తున్నాడు. పాలసముద్రానికి మజ్జిగ, కామధేనువుకు మేకపాలు, అమృతానికి చక్కెర, కుబేరునికి బిచ్చగాడు కాసును, చంద్రునికి నవనీతాన్ని, కల్పతరువుకు రేగిపండు, రత్నాలగనికి స్ఫటికమాల, మలయపర్వతానికి వేపగంధం, సూర్యునికి హారతి, సమర్పించినట్లు ఈ ప్రాకృత సమర్పణలో నిమ్నమైన పదజాలాన్ని ప్రయోగిస్తున్నానని తెలిసీ, సాధువులు ప్రీతితో ఇక్కడికి ఏతెంచారు. ఇక గత అధ్యాయంలోని కథను వినండి.

### హనుమ మండోదరి మందిరప్రవేశం

సభలోని రాక్షసులనందరినీ హనుమంతుడు దిగంబరుల గావించి, నానావిధాల చికాకుపరచి, తన ధైర్యసాహసాలు ప్రదర్శించి, గుప్తరూపంలో సభనుండి బయటకు వెళ్ళిపోయాడు. అమూల్య రత్నాలకోసం రత్నపరీక్షకుడు గాలించినట్లు సీత కొరకు హనుమంతుడు లంకలోని సమస్త మందిరాలను శోధించాడు. లంకానగరమంతా వెదికినా జానకి జాడ తెలియలేదు. ఇంద్రియాలను జయించిన మహాయోగియైన హనుమంతుడు వేయి అంతఃపురాలలో సీతకోసం గాలిస్తూ, రావణుడు చెరపట్టిన పద్మిని, నాగిని, కిన్నెర స్త్రీలను చూశాడు. వారి కాలిగోళ్ళ సౌందర్యాన్ని చూచి భ్రమరాలు అక్కడే ఝుంకారం చేస్తూ పరిభ్రమిస్తున్నాయి. అంతటి సౌందర్యలలామలైన స్త్రీలను వీక్షించినా, హనుమంతుడు కామ వశుడు కాలేదు. హనుమంతుడు

రాఘవునికి అత్యంతప్రియుడు. అతివిరాగి. ఊర్ధ్వరేతస్కుడు, వజ్రదేహి అయిన, అంజనాతనయుడు ఈ లోకంలో వసిస్తున్నా ఘటమఠాలలో ఉంటూ సర్వత్రా వ్యాపించి ఉన్న ఆకాశంలా తానుగా సంచరించాడు. చివరకు మండోదరి నిద్రించే భవనంలో అడుగుపెట్టగా, అభ్యంతరమందిరంలో పట్టపురాణి మండోదరి తల్పంపై నిద్రిస్తోంది. ఆమె సౌందర్యాన్ని చూచి ఒక్క క్షణం నిశ్చేష్టుడైనాడు. ఈమే వైదేహి కావచ్చు. పరమ పతివ్రతయైన సీత శయ్యపై శయనించిందని తలచాడు. పతివ్రతలకే శిరోరత్నమైన సీతాసతిని, పరమపురుషుని చిత్‌శక్తిని నేను ఈ రోజు కలుసుకున్నాను అని ఆనందంతో గంతులు వేయసాగాడు. ఆ సమయంలో లంకలో సంభవించిన విఘ్నాలు నశించిపోవటానికి రావణుడు హోమవిధులను పూర్తిచేసి రావణుడు అక్కడకు వచ్చాడు. వెంటనే మండోదరి లేచి పతి పాదధూళి గైకొంది. అది చూచి హనుమంతుడు జానకి నిజంగా రావణుని వశమైంది అనుకుని ప్రళయకాలరుద్రుడయ్యాడు.

ఆ సమయంలో సీత ముఖంలో కర్పూరదీప్తి ఉంటుందన్న రాముని మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే మండోదరి ముఖాన్ని వాసన చూడగా దుర్గంధం సోకింది. ఇద్దరూ కలసి మద్యపానం చేశారనుకున్నాడు. గోడకు చెవి ఆనించి విన్నా రామస్మరణ మాటే లేదు. సంపూర్ణంగా రావణుడి వశమైతే ఇక రామస్మరణ అవసరమేముంది? రావణుడు, మండోదరి పాన్పుపై పవళించి నిద్రలోకి జారిపోయారు. వీళ్ళను కిష్కింధకు తీసుకెళ్ళి రఘురామునికి చూపిద్దామా, ఒక పెద్దబండరాతిని పడేసి వారిని చంపేద్దామా అనుకుంటుండగా అనుకోని సంఘటన జరిగింది.

అకస్మాత్తుగా మండోదరి ఉలిక్కిపడి లేచి గుండెలు బాదుకుంటూ బోరున విలపిస్తూ, దశకంఠునితో “నేను ఈ రోజు ఒక పీడకల కన్నాను. నా మెడ చుట్టూ మంటలు లేచాయి. ఒక బలమైన వానరుడు అశోకవనాన్ని విధ్వంసం



చేశాడు. అతడే అక్షయకుమారుని సంహరించి, ఇంద్రజిత్తుని యుద్ధంలో ముప్పుతిప్పలు పెట్టాడు. వానరసైన్యం గావించిన అద్భుతాలు వర్ణింపనలవి కావు. సముద్రంపై రాళ్ళు పరచి సునాయసంగా శ్రీరాముడు లంకకు విచ్చేసి రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులను వధించి విజయం సాధించాడు. ఇది స్వప్నం కాదు, బ్రహ్మవాక్కు. అందువల్ల వెంటనే మంగళప్రదాయినియైన సీతను రఘురామునికిచ్చివేసి శరణువేడు. పరకాంతలను అభిలషించిన వారెవరైనా గతంలో కీర్తి గడించారా? రాఘవుడు మానవమాత్రుడు కాదు. పురాణపురుషుడే ఆ రూపంలో అవతరించాడు. కడుపుకు పెద్ద బండరాయి కట్టుకొని ఎవరైనా అగాధమైన సముద్రాన్ని ఈదగలరా? బలవంతంగా విషం త్రాగినవాడికి శుభం ఎలా కలుగుతుంది? నిప్పుల శయ్యపై ఎలా నిద్రించగలరు? మహాసర్పం నోట్లో చేయిపెట్టి మనగలరా? పులిమాటేసి తిరుగుతున్నప్పుడు దాని వలలోపడ్డ ప్రాణి క్షేమంగా ఎలా బ్రతికి బయట పడగలదు. నీవు ఎందరినో జయించావు. కానీ రాఘవేంద్రుడు అలాంటివాడు కాదు. ఆయన భక్తులను రక్షించటానికి అవతరించిన పూర్ణబ్రహ్మ. అందువల్ల ఓ ప్రాణనాథా! నేను వెళ్ళి రాముని శరణువేడి, జానకీ సతిని అప్పగించి నా మాంగల్యాన్ని అర్థిస్తాను’ అని వేడుకుంది. ఆ మాట విని లంకాపతి, ‘ఈమె మాటంటే అందరికీ గౌరవమే. ఆమె ఆజ్ఞాపిస్తే ఎవరైనా మారుమాట్లాడక సీతను తిరిగి అప్పగించి వేస్తారు. విభీషణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులకు మండోదరి మాటంటే ఎంతో గౌరవం. ఈమెకు పూర్తిగా నమ్మకం కలిగించకపోతే జానకిని తీసుకెళ్ళి రామునికి అప్పగిస్తుంద’ని ఆలోచించి మండోదరితో, ‘నీవు ఏం దిగులు పడకు. రేపు ఉదయానికల్లా జానకిని జనకజామాతకు అప్పగిస్తాను’ అని నమ్మబలికాడు. అశోకవనానికి రక్షణగా ఉన్న ఐదుకోట్ల రాక్షసులను రాత్రింబగళ్ళు అప్రమత్తంగా వ్యవహరించమని కబురుపంపాడు రావణుడు.

## హనుమ అశోకవనప్రవేశం

ఆ సమాచారమంతా విని వాయుపుత్రుడు పశ్చాత్తప్తుడై, నిమండోదరి సతి జన్మధన్యమైనది. ఆమెను స్మరిస్తేనే సకల దోషాలు మటుమాయమౌతాయి అని తలపోశాడు. ఇంతలో ఒక దూతను పిలిచి రావణుడు, 'నీవు వెంటనే అశోకవనానికి వెళ్ళి జానకి సమాచారాన్ని తెలుసుకొని రా' అని ఆజ్ఞాపించాడు. ఆ దూత వెనుకనే మారుతి కూడా అశోకవనానికి వెళ్ళి అక్కడ అశోకవృక్షం కింద ధ్యానస్థురాలైయున్న మైథిలిని చూచి ఆనందం పట్టలేకపోయాడు. దూత వెంటనే తిరిగి వెళ్ళాడు. కానీ హనుమంతుడు అక్కడే ఆగి 'అయోధ్యానాథుడైన రఘువీరునికి జయము, జయము' అంటూ కేకలు వేస్తూ నర్తించాడు. జగన్మాత దర్శనంతో నేను ఈ రోజు ధన్యుడనయ్యానని తోకతో విన్యాసాలు చేస్తూ కిచకిచమంటూ, కళ్ళు తిప్పుతూ, పల్టీలు కొడుతూ రామనామాన్ని బిగ్గరగా జపించసాగాడు. నలువైపులా పరికించగా, వృక్షాలు, పంచభూతాలు, పక్షులు, రాళ్ళురప్పలు సర్వం రామనామాన్ని స్మరిస్తున్నాయి. ఈమే పతివ్రతయైన సీతాదేవి. పురాణపురుషుని చిత్‌శక్తి. ఆమె నుండి వెలువడుతున్న కర్పూర వాసనలు, కస్తూరి పరిమళాలు అశోకవనం చుట్టుప్రక్కలంతా కూడా గుబాళిస్తున్నాయి. అక్కడ రక్షణగా ఉన్న త్రిజట, సీతను చాలా శ్రద్ధగా చూచుకుంటున్నది. సత్సంగమహిమ చాలా గొప్పది. దుష్టులకు, పాపులకూ కూడా సద్భావం కలిగిస్తుంది.

లక్ష్మీదేవి ముందు గరుడునివలె, పార్వతి ముందు నందీశ్వరునివలె, శచీదేవి ముందు జయంతపుత్రునివలె సీతాదేవిముందు అంజనీతనయుడు అంజలి ఘటించాడు, ధ్యానస్థయై మనసులో రాముని స్మరిస్తున్న జానకి చెంతకు వచ్చి చరణాలకు నమస్కరించి, రామముద్రికను ఆమె ముందుంచి అశోకవృక్షం పైకి ఎక్కి కూర్చున్నాడు. ధ్యానంలోనున్న జానకీదేవి రాఘవుని కుడిచేతికి అవతారముద్రిక లేదని గమనించింది. ముద్రిక కనబడలేదేమా!



అని కలవరంతో కళ్ళు తెరువగా, ముంగిట దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ముద్రికను చూచి, సీతాదేవి హృదయానికి హత్తుకుంది. ఆనందాతిరేకంతో అశ్రుధారలు కారిపోతుండగా, 'తల్లీ! రఘూత్తముని, లక్ష్మణుని వదలి ఇక్కడికి ఎందుకు వచ్చావు? జగద్వంద్యుడు, చరాచర సృష్టికర్త అయిన ఆ రాఘవుని యోగక్షేమాలను గూర్చి నాకు తెలియజెయ్యి' అని ప్రార్థించింది. ఇంతలో వనంలోని నిశాచరులు, దురాచారులు, వికలరూపులు పరుగున సీత వద్దకు వచ్చి, 'ఎందుకు ఏడుస్తున్నావు? ఇంకెక్కడి రాముడు? నీవు రావణుని మెడలో మాల వెయ్యి. కాదంటే నిన్ను ముక్కలు ముక్కలు చేసి నంచుకునితింటాం.' అని నానాబీభత్సం చేశారు. భయంకరంగా జుట్టు విరబోసుకొని, ముఖానికి కుంకుమ పులుముకొని, పొడవుగా వ్రేలాడే స్తనాలతో, బానకడుపులతో, పర్వతశ్రేణుల్లా ఉన్న రాక్షసస్త్రీలను చూచి, ఆంజనేయుడు తోకను ఝాడించి ఒక పట్టుపట్టాడు. దాంతో వారు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరయ్యారు. కళ్ళు తేలిపోసాగాయి, చాలామంది మరణించారు. తోక పట్టు అంత గట్టిగా ఉంది. ఇంతలో ఒకతె జానకీమాతా! మమ్ములను రక్షించు! అని వేడుకుంది. కొందరు రావణునికీ విషయం తెలపడానికి వెళ్ళారు. ఆత్మజ్ఞానం కలుగగానే కనుమరుగయ్యే భ్రాంతి, కోరికలు, వాసనలు, ఆశ, తృష్ణ, కల్పనల్లా రాక్షసస్త్రీలు పారిపోయారు.

జానకి ముద్రికతో, 'సరయూ తీర విహారియైన రాఘవుడు ఎక్కడున్నాడో చెప్పవే! రాఘవుడు నన్ను కౌగిలించుకున్నప్పుడు మా మధ్య వారి కంఠంలో హారం కూడా ఉండేది కాదు. కానీ ఇప్పుడు మా మధ్య పర్వతాలు, అరణ్యాలు, సముద్రాలే ఉన్నాయి. వాల్మీకి చెప్పిన భవిష్యవాక్కు వ్యర్థమైంది. మహాబలవంతుడయిన ఒక వానరుడు వచ్చి లంకానగరాన్ని భస్మంచేసి, నాకు సంతోషం కలిగించి, త్వరగా రఘురాముని తీసుకుని, సముద్రంలో రాళ్ళను పరచి దశకంఠుని హతమారుస్తాడు అని వాల్మీకి చెప్పాడు కదా!' అని అనగా

ముద్రిక బదులు పలుకలేదు. 'నాకు అంతా అర్థమయింది. నా విరహం సహించలేక రాముడు దేహత్యాగం చేసుంటాడు. యోగుల ధ్యానంలో సదా చరించేవాడు, భక్తుల వెన్నంటివుండేవాడు, సదా సౌమిత్రిని విడువనివాడు నన్నెందుకిలా బాధపెడుతున్నాడు? నా పై దయతలచకపోతే నన్ను వధించు. నన్ను ఈ శోకసాగరం నుండి త్వరగా బయటపడవెయ్యి రామా! రాజీవనేత్రా! రావణారీ! విషకంఠమిత్రా! ఎందుకయ్యా ముందుగా ఈ ముద్రిక నాకు పంపావు? నీ ఉద్దేశ్యం ఏమిటి? లేడి చర్మంతో పయ్యెద కావాలని ఆశపడి లక్ష్మణునికి ఎంతో అన్యాయం చేశాను. పాపినైన నేను ఆ సమయంలో సౌమిత్రిని నానా బాధపెట్టాను. నేను సాధునింద చేసాను. అందుకే ఇలా రాక్షసుల పాలబడ్డాను. ఆ పాపం వల్లనే నాకు వియోగం దాపురించింది. ఎవరు సాధువులను నిందిస్తారో వారికి నాలాగా దు:ఖం తప్పదు. చివరకు అధోగతి పాలై నానా అనర్థాలు కొనితెచ్చుకుంటారు' అంటూ సీత పరిపరివిధాల శోకించసాగింది. ఆ క్షణంలో ముల్లోకాధిపతి భార్యయైన ఆ సాధ్వికి అనేకరకాల భావాలు కలిగాయి. ఇక ఈ దేహంతో ఉండవలసిన పని ఏమి? అన్న ఆలోచనలతో విచలిత అయిన సీతాదేవిని చూచి అశోకవృక్షంపై నక్కి కూర్చున్న నిర్మలమనస్కుడైన ఆంజనేయుడు శ్రీరాముని లీలలను మధురస్వరంతో గానం చేయనారంభించాడు.

అతడు సాక్షాత్తు రుద్రావతారమే. రుద్రవీణలాంటి చక్కటి స్వరంతో అతి మధురంగా గానం చేశాడు. కోమలమైన ఆ కపీంద్రుని గానానికి రవిమండలం ప్రసన్నమైంది. పాతాళాన్ని వదలి వాసుకి పైకి వచ్చాడు. గాలికి కదలబుద్ధి కాలేదు. చంద్రుని చల్లదనం ఇనుమడించింది. అశోకవనంలోని పక్షులన్నీ చుట్టూ చేరిపోయాయి. అశోకవృక్షంలో నుండి వస్తున్న ఆ మంజులనాదానికి సీతాదేవి కూడా తన్మయమైంది. ఎవరైతే అజ అజిత నిర్గుణ బ్రహ్మయో, రవికులభూషణుడో, భక్తహృదయారవింద భృంగమో, జలదవర్ణుడు,



జలజాక్షుడు, మంగళధాముడు, మంగళకారకుడో, మంగళప్రదాయిని ప్రాణనాథుడో, మంగళజననీ ఉద్ధారకుడో, సూర్యప్రతాపుడో, రావణుడి గర్వమడంచినవాడో, చండీశ కోదండ ప్రభంజనుడో, భవగజ విదారణ పంచాననమో, నరవీరాంతకుడో అటువంటి శ్రీరాముని చిత్కళ అయిన జానకి అనంతమైన ఈ బ్రహ్మాండాన్నంతా రచించింది. రఘువీరుడు పరబ్రహ్మమే. అతడి లీలలు తర్కానికి అందనివి. సచ్చిదానందుడు, నిష్కళంకుడు, పితృవాక్యపరిపాలకుడు, మాయాచక్రచాలకుడు, జగద్వంద్యుడు, జగద్గురువు, పంచమహాభూతాలు ఎవరి ఆజ్ఞకు లోబడి ఉంటాయో అటువంటి పంచవటి నివాసియైన రఘురాముని వద్దకు రావణుడు మాయలేడితో వెళ్ళాడు. దురాచారియైన రావణుడు దొంగ వలె పర్ణకుటీరంలోకి ప్రవేశించి భూగర్భరత్న సుందరియైన సీతను అపహరించి క్షణంలో తిరిగి వెళ్ళాడు. ఆ తస్కరుని వెదుకుతూ రాఘవుడు కిష్కింధకు వచ్చి, వాలిని సంహరించి సుగ్రీవునికి పట్టం కట్టాడు. ఆ సీతారమణుని దాసానుదాసుడు, సేవకుడు అయిన ఒక వానరుడు లంకానగరాన్ని ధ్వంసం చేసి అశోకవనానికి వచ్చాడు అన్న భావం నిండిన ఆ పాటవిని జానకి మనస్సు ఆనందమయమయింది. ఆమె చెట్టుదగ్గర నిలబడి చేతులు జోడించి 'ఓ తరులారా! మీరంతా ధన్యులు. మీలో ఎవరు ఈ గానం చేశారో వారి ముఖం నన్ను చూడనియ్యండి. వారి పాదాలకు నేను ఆదరంగా నమస్కరిస్తాను. ఎవరైతే ఈ గానం చేస్తున్నారో వారి తల్లి ధన్యురాలు. వారికి ఎల్లప్పుడూ శుభం కలుగుతుంది. కల్పాంతంలో కూడా వారికెట్టి విఘ్నం కలుగదు. ఎవరు ప్రీతిగా రామగానం చేస్తారో వారికి ఎట్టి కష్టాలు కలుగవు. చతుర్విధముక్తులు వారికి సదా దాస్యం చేస్తుంటాయి' అని అన్నది.

జగన్మాత పలుకులు విని కూడా హనుమంతుడు కదలలేదు. ఏం మాట్లాడకుండా ఆనందంగా జానకీదేవిని చూడసాగాడు. 'ఇదంతా

రాక్షసమాయగా ఉంది. ఎవరు గానం చేశారో తెలియడంలేదు. బయట ఎవ్వరూ లేరు. ఇక నేను ప్రాణం వదిలేస్తాను' అని నిర్ణయించుకుంది. ఆ సాధ్వి ఎంతో కుమిలిపోతూ, ముద్రికను గైకొని 'అయోధ్యాపతీ! జగజ్జెట్టీ! మిమ్మల్ని కలవలేకపోయాను. మీరులేక నేను ఒక్కక్షణం కూడా జీవించలేను' అంటూ జానకి ప్రాణత్యాగం చేయడానికి జడను మెడకు చుట్టుకుని చెట్టుకొమ్మకు కట్టింది. అది చూచి మారుతి ఎంతో కలవరపడ్డాడు. జానకీమాత ప్రాణత్యాగం చేస్తే నేను రఘురామునితో ఏమని చెప్పేది? భరతాగ్రజా! జగన్మోహనా! వెంటనే కదలిరావయ్యా! ఈమెకు మంచి బుద్ధిని ప్రసాదించమని మనస్సులో రామచరణాలను స్మరించి ఆకాశంలోకి ఎగిరి 'రాముడు సముద్రం ఒడ్డుకు వచ్చి ఉన్నాడు' అని అరవగా, జనకనందన తలెత్తి చూచింది.

## సీతాహనుమల సంభాషణం

మారుతి నేలపై దిగి సీతాదేవికి సాష్టాంగ నమస్కారం చేశాడు. జానకీదేవి ఆచంద్రార్కం నీకు శుభమగు గాక! అని దీవించింది. ఆంజనేయుడు రెండు చేతులూ జోడించి జనకాత్మజ ఎదుట నిలబడి 'కళ్యాణరూపుడైన రఘువీరుడు కిష్కింధలో సుఖంగా ఉన్నాడు. నేను శ్రీరాముని అనుచరుడను. వాయుకుమారుడను. నా పేరు హనుమంతుడు. మాతా! మీ కోసం నేను లంకా నగరమంతా వెతికాను' అన్నాడు. చాలాకాలం తర్వాత పుత్రుని కలుసుకున్న తల్లివలె జనకాత్మజ ఆనందించి నిర్భీత అయింది. అకాలంలో వర్షం కురిసినట్లు, మృత్యుముఖంలోనున్న వాడికి అమృతం లభించినట్టు, దరిద్రునికి పాల సముద్రం లభ్యమైనట్లయింది సీత పరిస్థితి. జటాయువును ఉద్ధరించడం, కబంధవధ, వాలి సంహారం, సుగ్రీవ పట్టాభిషేకం, అపారమైన వానరసైన్యం శ్రీరామునికి సహాయంగా రావడాన్ని గూర్చి వర్ణించాడు. మీ గుణాలను, రూపాన్నీ తలచుకొని రాముడు సదా విలపిస్తుంటాడు. పశు వులనూ, రాళ్ళనూ, చెట్లనూ ఆలింగనం చేసుకుని సీతా! సీతా! అంటూ



పలవరిస్తున్నాడు. నీవు పడవేసిన ఆభరణాలను నేను శ్రీరాముని ముందుంచగా, వాటిని తిలకించి రాముడు పడ్డ క్షోభ వర్ణనాతీతం. తల్లికోసం ప్రేమతో తపించే బాలునిలా అహోరాత్రాలు సౌమిత్రి నీ కోసం పరితపిస్తున్నాడు అని శ్రీరాముడు పంచవటి వదిలిన దగ్గరనుండి జరిగిన విషయాలు, రామలీలలన్నీ వాయునందనుడు సీతాదేవికి వివరించాడు. ఈ సమాచారమంతా విని జానకి 'రఘువీరుడు పరమదయాళువు. నా కారణంగా కష్టాలనుభవిస్తున్నాడు. అయోధ్య నుండి అరణ్యవాసానికి వెడుతున్నప్పుడు నేను నడకలో వెనకబడేదాన్ని. శ్రీరాముడు చెట్టునీడన నా కోసం ఆగి నువ్వు చాలా కష్టపడుతున్నావు' అంటూ నా ముఖమంతా నిమిరేవాడు అంటూ దు:ఖం పెల్లుబికి గళం గద్గదమై వెక్కిళ్ళు పెట్టసాగింది.

హనుమంతుడు ఓదార్పుగా సీతతో 'ఎందుకమ్మా! అంతగా దు:ఖిస్తావు. రఘురాముడు త్వరలో దశకంఠుని హతమారుస్తాడు. నీవు ఆదిపురుషుని చైతన్యశక్తివి. ప్రణవ రూపిణివి. మూలప్రకృతివి. బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలైనవారంతా నీ ఆజ్ఞానువర్తులై ఉంటారు. భక్తులను తరింపజేయడానికి మీరిద్దరూ అవతరించారు. మీ యిద్దరి వియోగ ప్రసక్తే లేదు'అని ఊరడించగా జానకి, 'నీవు శ్రీరాముని సంపూర్ణ విశ్వాసపాత్రుడివి గదా! నీతో రాఘవుడు ఏమన్నా అంతరంగిక విషయం చెప్పి పంపాడా?' అని ఆతృతగా అడిగింది. బదులుగా హనుమ 'కైకేయి సదనంలో శ్రీరాముడు తన స్వహస్తాలతో నీకు నారచీరలు కట్టబెట్టాడు కదా!' అన్నాడు. ఈ మాట విని జనకపుత్రి 'హితుడా! ఆంజనేయా! నీవు శ్రీరామునికి సంపూర్ణంగా ప్రీతిపాత్రుడవు. కోటిగుణ సంపన్నుడవు. కానీ నీవు చాలా చిన్నగా ఉన్నావు. సహజంగా కోతులు అట్లానే ఉంటాయి. మరి దుర్గమమైన లంకానగరాన్ని ప్రవేశించడం నీకు ఎలా సాధ్యపడింది?' అని ప్రశ్నించింది. సీత మాటలు విని ఆంజనేయుడు తన అసలు రూపాన్ని ప్రదర్శించాడు. మందరాచలమంతటి విశాలమైన మారుతి

దేహాన్ని చూచి సీత, రాక్షసులనందరినీ వధించటానికి యుగాంతంలో వానరవేషం ధరించి వచ్చిన మేరుపర్వతమా అని అచ్చెరువొందింది. ఆ భీకరావతారాన్ని చూచి సీతాదేవి ఈయన సాక్షాత్తూ రుద్రుడే! రామ కార్యాచరణకు ఈ రూపంలో అవతరించాడు అనుకుంది. హనుమంతుడు 'తల్లీ! రామాజ్ఞ లేకుండా నేను లంకను పైనుండి క్రిందికి కలియదిరిగాను. బహుశా ఆ ముల్లోకాధిపతికి కోపం వస్తుందో ఏమో! జగన్మాతా! మంగళరూపిణీ! నాకంటే ప్రతాపవంతులయిన వానరులెందరో కిష్కింధలో రాముని చెంతనున్నారు. జాంబవంతుడు, నలుడు, నీలుడు, సుగ్రీవుడు మొదలయిన రణకోవిదులు, ప్రతాపవంతులు, కాలునికే పాఠాలు చెప్పగల వీరులు ఎందరో రాముని దగ్గర ఉన్నారు' అన్నాడు.

సీత హనుమంతునితో 'మరి అపారమైన సాగరాన్ని ఎలా లంఘించావు!' అని అడుగగా, హనుమ 'రామముద్రికే నన్ను అనాయాసంగా ఈ దరికి తీసుకొచ్చింది. ఆకలిగొన్న వానికి పండ్లు ఎదురుగా కనబడ్డట్లు, మార్గాయాసమంతా మీ దర్శనంతో హరించుకుపోయింది. నాకు బాగా ఆకలిగా ఉంది. ఈ వనంలో ఫలాలు సమృద్ధిగా ఉన్నాయి. ఇతరులు ముట్టుకొన్న దాన్ని తాకను. కానీ మీరు ఆజ్ఞ ఇచ్చినట్లయితే వాటిని భుజిస్తాను' అన్నాడు. దానికి శ్రీరామపత్ని 'రావణుడు అరువది వేలమంది రాక్షసులను రక్షణగా నియమించాడు. వారికి తెలియకుండా ఈ వనంలో గాలి కూడా చొరబడటానికి వీలులేదు' అన్నది. వెంటనే మారుతి నేలమీదబడి దొర్లుతూ 'ఏదైనా ఫలాహారం తీసుకోకపోతే నా ప్రాణాలు నిలువవు. నాకు మధ్యలోనే మరణం సంభవించేట్లుంది. రఘుపతి చరణాలకు దూరమౌతానే! సీతను కనుగొన్న సంగతి కౌసల్యాసుతునికి ఎవరు చెప్తారు? ఫలభరితమైన ఈ వృక్షాలను చూచి నా మనస్సు తట్టుకోలేకపోతున్నది. వాటి ఫలాలనన్నింటినీ తినాలనే కోరిక కలుగుతున్నది' అంటూ హనుమ ఒక్కక్షణం నిశ్చేష్టుడై, కళ్ళు కలియతిప్పుతూ పండ్లకోసం నోరు బారచాపాడు.



అతడి పరిస్థితి చూచి జగన్మాత జాలిపడి అయ్యో అంటూ పరుగున వచ్చి తన వరదహస్తంతో హనుమను ఓదార్చి, 'ఓ కపీంద్రా! ఇక లే! చెట్లమొదళ్ళలో పడివున్న ఫలాలలో ఒక పిడికెడు మంచివి ఏరుకుని తిని కడుపు నింపుకో! అలా చేస్తానని వాగ్దానం చెయ్యి' అని అనింది. సీత ఆ మాటలనగానే హనుమ లేచి ఒళ్ళు విదిలించుకుని పరుగున వెళ్ళి సీత పాదాలపైబడి 'మీ ఆజ్ఞ నాకు ప్రమాణము' అంటూ ఏయే వృక్షాలు రామస్మరణ చేస్తూ సీతకు చల్లదనాన్ని కల్గించాయో ఆ వృక్షాలకంతా ఆ రామబంటు నమస్కరించాడు. ఎవరు నిర్మలమైన మనస్సుతో రామోపాసన చేస్తారో వారికి విఘ్నం కల్పించడం కాలునికే సాధ్యం కాదుగనుక మారుతి వాటిని రక్షించాడు. రాముని స్మరించని వృక్షాలను సమూలంగా పెకలించి నేలమీదకేసి కొట్టాడు. చంచలమైన చూపులతో ముందు వెనుక గమనిస్తూ, కిందపడ్డ పండ్లను ఏరుకొని రెండుచేతులతో నోట్లో వేసుకోవడం, నవలడం చకచకా జరిగిపోతున్నాయి. వనపాలకులందరు తప్పతాగి నిద్రావస్థలోనుండగా, హనుమంతుడు తన తోకతో చెట్లనన్నిటిని కుదిపేసి వనమంతా విధ్వంసం చేశాడు. హనుమంతుడు విశ్రాంతిగా కూర్చొని ఫలాలను సేవిస్తూండగా, తోక చుట్టుతిరిగి ఆపోసనం పట్టిన రీతిగా కిందపడ్డ ఫలాలన్నీ పోగు చేసి హనుమ ముందుకు తెచ్చేది. చివరకు హనుమ తాను కూర్చున్న చెట్టును కూడా వదలలేదు. హనుమంతుడు తన తోకతో 'ఈ ఫలాలు ఎంత మధురంగా ఉన్నాయో! నాకు ఈ రోజు ఎంతో తృప్తిగా ఉంది. వాటిని పెట్టినందుకు నువ్వు చిరంజీవిగా ఉంటావు' అని ఆశీర్వదించాడు.

అశోకవనంలోని నందనవనం కంటే అందమైన పనస, చెరకు, లవంగం, అరటి, కొబ్బరి, దేవదారు, నేరేడు, జామ మొదలగు ఎన్నో లక్షల, కోట్ల రసభరితమైన వృక్షాలను తన భుజబలంతో పెకలించి మధురమైన ఫలాలను రామస్మరణతో యజ్ఞకుండమైన నోటిలో వేసి జఠరాగ్నిని సంతృప్తి పరిచాడు.

చెట్లపైకెక్కకుండా తోక కుదుపులతోనే పళ్ళన్నీ నేలరాల్చినందుకు సీత తన ఒట్టును వెనక్కు తీసుకుంది. మెరుపు మెరిసినట్లుగా తోకధాటికి చెట్లు నేలకూలసాగాయి. ఈ గందరగోళానికి రాక్షసులు నిద్రలేచారు. చక్రాలు, డాళ్ళు, బల్లాలు తీసుకుని ఒక్కసారిగా పరుగున వచ్చి అందరూ కలిసి ఆంజనేయుని చుట్టుముట్టారు. ఎద్దులన్నీ కలిసి పెద్దపులిని, పాములన్నీ కలిసి గరుడుని, నక్కలన్నీ కలిసి సింహాన్ని, మిణుగురు పురుగులు సూర్యుని, పక్షులన్నీ కలిసి సాగరాన్ని, కర్పూరంతో చేసిన బొమ్మ బడబాగ్నిని చుట్టుముట్టినట్టు, ఈగలన్నీ కలిసి భూగోళాన్ని పైకి ఎత్తినట్టు, ఒంటెలన్నీ గానంలో తుంబురునితో పోటీపడినట్టు, తేలు తన కొండెతో వజ్రాన్ని కాటేసినట్టు, వనరక్షకులంతా కట్టకట్టుకొని హనుమంతుని పైకి వచ్చారు. అప్పుడు హనుమంతుడు ఏం చేసాడో చూడండి.

## హనుమ చేతిలో రాక్షసవధ

ఒక విశాలమైన వృక్షాన్ని ఒక్కక్షణంలో పెళ్ళగించి కుడిచేతిలోకి తీసుకుని, ఎండిన వనాన్ని దావాగ్ని భస్మం చేసినట్టు త్రుటిలో రాక్షససంహారం చేశాడు. అరువది వేలమంది వనపాలకులను తోకతో బంధించాడు. తోకతో వారిని గిరగిరా తిప్పి నేలకేసి కొట్టాడు. చెట్లనుండి పండ్లను రాలగొట్టినట్టు, వనరక్షకులనందరినీ పిండిచేసి వారి శవాలను సముద్రంలో విసిరి పారేశాడు. వాళ్ళ హాహాకారాలతో ఆకాశమంతా మార్మోగి పోయింది. దెబ్బలతో తప్పించుకున్న కొందరు రావణుని వద్దకు పరుగెత్తి 'ఒక వానరుడు హఠాత్తుగా అశోకవనంలో ప్రత్యక్షమై, వనాన్నంతా విధ్వంసం చేసి, వనపాలకులందరినీ సంహరించాడ'ని మొరపెట్టుకున్నారు. ఈ వార్త విని రావణుడు ఎంతో సంతాపం చెంది, వెయ్యిమంది యోధులను రావించి 'వెంటనే వెళ్ళి ఎలాగైనా సరే! ఆ కోతిని పట్టుకుని రండి. ఆ పని మీ వల్ల కాకపోతే మీ ముఖాలు తిరిగి నాకు చూపించవద్ద'ని ఆజ్ఞాపించాడు. ఆ విధంగా ఆ వేయిమంది



రాక్షసులూ సింహనాదం చేస్తూ వనానికి వచ్చారు. చేతిలో నానారకాల ఆయుధాలతో ఆకాశం దద్దరిల్లేలా కేకలు వేస్తూ వస్తున్న ఆ రాక్షసులను చూచి మారుతి విశాలంగా తన దేహాన్ని పెంచాడు. మందర పర్వతం వలె విశాలదేహుడైన ఆంజనేయుడు, వాసుకి వంటి బలమైన తోకను సుదీర్ఘంగా వదలిపెట్టాడు. లంకామహాద్వారాన్ని లోహపు కడ్డీలతో, లోహపు గొలుసులతో కట్టుదిట్టం చేయగా మారుతి దానిని విరిచి నేలకూల్చి సింహనాదం చేస్తూ వారిపై లంఘించాడు. ప్రాతః సంధ్యాకాలంలో పక్షులన్నీ చెట్లపైనుండి ఎగిరి ఆకాశమంతా విస్తరించినట్టు, శత్రువుల తలలన్నీ చెల్లాచెదురుగా భూమిపై ఎగిరిపడ్డాయి. శత్రుసమూహాన్నంతా బంధించి వాయుపుత్రుడు గాలిలో తిప్పి నేలకేసి కొట్టగా శత్రువుల కాళ్ళూచేతులూ, మిగతా అవయవాలు పిండిపిండి అయ్యాయి. వారిలో ముఖ్యుడు జంబుమాలి పెద్దగా కేకలు వేస్తూ 'ఓయీ! వానరా! నేను ఈ రోజు నిన్ను యుద్ధంలో సంహరిస్తాను' అంటూ శూలం తీసుకుని హనుమంతుని పైకి ఉరికాడు. హనుమంతుడు తన్నిన తన్నులకు జంబుమాలి కడుపు ముక్కలైంది. కత్తిపోట్లకు పనసపండు పగిలినట్లు, కొండరాళ్ళు కూడా వజ్రఘాతానికి పిండి అయినట్టు, హనుమ ధాటికి తట్టుకోలేక పారిపోయాడు జంబుమాలి. దశముఖునికి ఈ విషయం తెలుపగా ఎంతో కుపితుడయ్యాడు. వెంటనే అసంఖ్యాకంగా వీరులను, ముఖ్యులయిన ఐదుగురు సైన్యాధ్యక్షులను, మల్లుడు, ప్రతిమల్లుడను చండప్రచండమైన రాక్షసులను ఆంజనేయుని పైకి పంపాడు. వారు రావణుని ఆజ్ఞానుసారం వేగంగా అశోకవనానికి ఇనుపకడ్డీలను పట్టుకొని వచ్చారు. వారిని హనుమ తన తోకతో ఎడాపెడా కొట్టి, చేతితో ఒక ఇనుపరోకలిని గైకొని, లంకేశుని సైన్యాన్ని చితకబాదాడు. వడ్ల నుండి పొట్టు వేరుచేసినట్టుగా, రాక్షసులంతా విగతజీవులయ్యారు. ఈ కపి చేతుల్లోంచి బయటపడితే చాలన్నట్లు పారిపోయారు. ఆంజనేయుడు పళ్ళుకొరుకుతూ, కళ్ళు గిరగిరా తిప్పుతూ

శస్త్రాలను వర్షిస్తున్న రాక్షసుల ఎదుట నిలబడ్డాడు. మేరుపర్వతం వంటి బలశాలి అయిన అంజనాతనయుడు దాపునే ఉన్న సహస్ర స్తంభ నిర్మితమైన దేవాలయాన్ని చూశాడు. అక్కడ రావణుడు దేవీ విగ్రహాన్ని స్థాపించి నిత్యమూ బ్రాహ్మణులను దేవికి బలి ఇచ్చేవాడు. వాయుపుత్రుడు ఆ ఆలయాన్ని ధ్వంసం చేసి స్తంభాలను పెళ్ళగించి ఆకాశంలోకి ఎగరేశాడు. నలుదిక్కులా చెల్లాచెదురైన రాళ్ళు ఆకాశమంతా పక్షులు ఎగురుతున్నాయా అన్న భ్రమ కలిగించాయి.

తరువాత హనుమంతుడు ఇనుపకడ్డీ తీసుకొని రామగానం ఆలపిస్తూ ఆ వీరులందరినీ సంహరించాడు. హనుమంతుడు అశోకవనంలోని రాక్షసులనంతా అంతమొందించి నాలుగువీధుల మధ్య తోకను గిరగిరా తిప్పసాగాడు. దుర్గాదేవికి బలులు సమర్పించినట్టుగా వనంలో సీతాదేవి చుట్టూ మహావీరుల తలలు గుట్టలుగా పడి ఉన్నాయి. రేణుకాదేవి కారణంగా భార్గవుడు క్షత్రియుల శిరస్సులను ఛేదించినట్లు సీత కారణంగా హనుమ రాక్షస సంహారం చేశాడు. హనుమంతుడు ఆ అసురుల దేహాలను తోకతో చుట్టి సముద్రంలో పడవేశాడు. అసంఖ్యాకంగా వీరులు కుప్పకూలడంతో తన ఏడుగురు కొడుకులను పంపాడు రావణుడు. వారు కూడా లోహపుకడ్డీ దెబ్బలకు చూర్ణమయ్యారు. రాక్షసులందరూ ఆ వానరుని చేతిలో హతమయ్యారు. సైన్యంతో సహా అక్షయుడనే తన కుమారుని వెంటనే పంపాడు రావణుడు. అక్షయుని చూడగానే హనుమంతుడు లోహదండాన్ని చేతబూని నాట్యం చేస్తూ చిరునవ్వుతో ఇలా అన్నాడు 'అరే! అక్షయా! అజగళస్తనాలవలె నీకు పెట్టిన పేరు వ్యర్థం. మూర్ఖుని అలంకరించినట్లు, చెవిటివానికి స్తోత్రం చేసినట్లు, పుట్టుగుడ్డికి విశాలమైన కళ్ళున్నట్లు, ముక్కులేని ముఖం ఉన్నట్లు, గాడిదకు పట్టం కట్టినట్లు, కుక్కకు అగ్రపూజ చేసినట్లు, ప్రేతానికి మంచి అలంకారం చేసినట్లు, వ్యర్థంగా శతమూర్ఖుడయిన ఆ దశకంఠుడు నీకు అక్షయుడని నామకరణం చేశాడు. అక్షయా! నిన్ను క్షణంలో క్షయం చేస్తాను'



అన్నాడు. అక్షయుడు ధనుస్సును సారించి ఒకదాని వెంట ఒకటిగా బాణాలు వేయగా, ఒక్కక్షణం వాయునందనుడు అక్షయుని చూస్తూ నిలబడ్డాడు. గడ్డిపోచలు ఎన్నయినా పర్వతాన్ని కదిలించగలవా? మదగజంపై పూలవాన కురిసినట్లు అక్షయుడు సంధించిన బాణాలు అణుమాత్రం కూడా క్లేశాన్ని కలిగించలేకపోయాయి. ఈ లోగా లోహదండాన్ని చేబూని యమునివలె మారుతి పరుగున వచ్చి ప్రహరించిన లోహదండం దెబ్బలకు అక్షయుడు క్షయమయ్యాడు. విజయం వాయుపుత్రుని వరించగా దేవతలు ఆనందించారు.

అక్షయుని మరణవార్త విని లంకేశ్వరుడు శోక సముద్రంలో మునిగిపోయాడు. ఆసాళీ అనే భయంకరమైన రాక్షసి అశోకవనంపై దండెత్తింది. పదివేల ఏనుగుల బలంతో, పర్వతాలను ఇముడ్చుకోగల ఉదరంతో, ఒక యోజనం విస్తారమైన ముఖంతో, ముఖాన కుంకుమ పులుముకుని భయంకరంగా జుట్టు విరబోసుకొని వేగంగా వచ్చి వాయుసుతుని పట్టుకుంది. హనుమ ముఖాన్ని నొక్కి పట్టి పళ్ళన్నీ కడుపులోకి దిగేట్టుగా అదిమింది. అరక్షణంలో ఆ రాక్షసి వానరాన్ని మింగిందన్న వార్త గూఢచారుల ద్వారా విని రావణుడెంతో ఆనందించి సభలో అందరికీ తీపి పంచిపెట్టాడు. ఇంతలో ఒక దూత, ఆసాళీ హనుమంతుని చేతిలో హతమైందన్న వార్త తెచ్చాడు. ఈ వానరుని జయించే వీరుడే లేడు, ఎంతటి మహావీరులనైనా పొట్టచీల్చి పారేస్తున్నాడు అని శోకాకులిత చిత్తుడైనాడు దశకంఠుడు. ఇదేదో చాలా విచిత్రంగా ఉందే అనుకుంటూ యుద్ధానికి ఇంద్రజిత్తును పిలిపించమని ఆజ్ఞాపించాడు.

శ్రీరామవిజయగ్రంథం రసభరితమైనది. రామభక్తులంతా ఎంతో ఆదరంతో, సావకాశంగా కుతూహలంతో సుందరకాండను విశేషంగా శ్రవణం చేస్తారు. రవికులభూషణా! పురాణపురుషా! శ్రీమద్భీమాతటనివాసా! బ్రహ్మానందా! అవినాశా! శ్రీధరవరదా! జగద్గురో! నీకు వినతులు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**ఇరువదవ అధ్యాయం మధురం.**



**అధ్యాయము - 21**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**ని**రంతరం పాలసముద్రపు ఒడ్డున కూర్చున్నవానికి ఆకలి బాధ కలుగుతుందా? సూర్యుడు ప్రక్కనుంటే దీపాన్ని గూర్చిన చింత కలుగుతుందా? కల్పతరువు చెంతనుండగా కోరికలనే నాగులు కాటెయ్యగలవా? గంగాజలాల్లో శయనించిన వానిని అగ్ని ఏమైనా చేయగలదా? అహోరాత్రులు సింహం సాంగత్యం ఉన్నవానికి నక్కవల్ల బాధ కలుగుతుందా? ఇవన్నీ కల్పాంతంలో కూడా సంభవించవు. నిత్యం సుధారసపానం చేసేవానిని దారుణవిషం ఏమైనా చేయగలదా? ఆత్మవిచారంలో సదా గడిపేవాని దరికి దుష్కర్మలు చేరగలవా? కామధేనువు ఇంటనున్న వానిని కామనలు బాధించగలవా? అగ్నిజ్వాలలు ప్రకాశించే చోట శీతలం మనగలదా? అలా రఘువీరుని కృప ఎవరిపై సంపూర్ణంగా ఉంటుందో వారిని విషయాగ్ని జ్వాలలు బాధించలేవు. రామచరితపై మనసు లగ్నం చేసినవానికి మిగిలినవాటిపై ప్రీతి కలుగదు.

**హనుమద్బంధనప్రయత్నం : ఇంద్రజిత్తు పరాభవం**

గత అధ్యాయాంతంలో హనుమంతుడు ఆసాళీని వధించడం, లంకానాథుడు ఇంద్రజిత్తును సత్వరం రమ్మని ఆజ్ఞాపించడం గురించి విన్నాం. ఆ తరుణంలో మండోదరి వెనుకనుండి తుమ్మగా రావణుడు బ్రహ్మదేవుని శకునం చెప్పమని అడిగాడు. బ్రహ్మ మీ ఇద్దరిలో ఒకరికి అపకీర్తి కలుగుతుంది అని చెప్పాడు. రావణుడు కోపగ్రస్తుడు కావడం గమనించి, హనుమంతుడు హస్తగతమౌతాడని తెలిపాడు. వెంటనే ఇంద్రజిత్తు చతురంగబలాలతో అశోకవనానికి వెళ్ళాడు. ఎనుబదిఆరువేల గజబలం, అసంఖ్యాకంగా రథతురగపదాతులు అనుసరించాయి. దేవతలంతా విమానాలలో కూర్చొని

ఇంద్రజిత్తు ససైన్యంగా అశోకవనానికి రావటాన్ని ఉత్కంఠతతో తిలకించసాగారు. హనుమంతుడు వారికి వెన్ను చూపుతూ నిదానంగా ఫలాలను ఆరగించసాగాడు. రాక్షసులు ఎంత ఘోషించినప్పటికీ వారివంక కన్నెత్తి కూడా చూడలేదు. అనుక్షణం వీపు గీరుకుంటూ వెనక్కి తిరిగి వారిని చూసి గేలిచేస్తున్నాడు. రాక్షసులు ఆ కపివరునిపై అస్త్రాలు కుమ్మరించారు. ఇంద్రజిత్తు ఎన్ని బాణాలు వేసినా హనుమంతుడు వాటన్నిటినీ పిడికిలితో పట్టుకోసాగాడు. అకస్మాత్తుగా తోకను జాపి ఇంద్రజిత్తు ధనుస్సును హరించి ఆకర్ణాంతం లాగి ఆంజనేయుడు బాణాలు వదిలాడు. ఒక శబ్దం వెంట మరొక శబ్దం వెంటవెంటనే వచ్చినట్టు మారుతి ఏకధాటిగా బాణాలు గుప్పించాడు. ఇది చూచి దేవతలు 'మారుతీ! నిన్ను కన్న మీ తల్లి అంజన ధన్యురాలయింది' అంటూ పుష్పవృష్టి కురిపించారు. అసంఖ్యాకంగా రాక్షసుల తలలు ఎగిరిపోయాయి. ఇంద్రజిత్తు కిరీటం ముక్కలై నేలమీద పడింది. బాణాలయిపోగానే మారుతి లోహపు గోళాన్ని చేబూని వాయువేగంతో రాక్షసులపై ఉరికాడు. ఆ గుండు దెబ్బకు రథం గుర్రాలతో సహా నేలకొరగగా ఇంద్రజిత్తు విరథుడై గాభరాపడ్డాడు. ఆ ఇనుపగుండుతో హనుమ ఇంద్రజిత్తు సైన్యాన్ని చితకబాదగా రక్తం వరదలై పారి సముద్రంలో కలిసింది. హనుమ ఆ రాక్షస సమూహంలో అలా చక్రం తిరిగినట్లు కలియదిరిగి, ఇంద్రజిత్తును లోహపు గుండుతో మోదసాగాడు. అంతలో ఇంద్రజిత్తు హనుమంతునిపై పాశం విసిరాడు. మారుతి సూక్ష్మరూపియై ఎగిరిపోయాడు. పాశం చిన్నది చేసి పైన వేయగా పర్వతాకారుడై పాశాన్ని తెంచేశాడు. ఎన్ని శస్త్రాలయినా బలాఢ్యుడైన కపివరుని ఏమీ చేయలేకపోయాయి. తదుపరి అంజనాసుతుడు ఇంద్రజిత్తును మల్లయుద్ధానికి పిలిచి, నగ్నం గావించి కాళ్ళు పట్టుకొని గిరగిరా త్రిప్పి బలంగా నేలకేసి మోదాడు. ఇంద్రజిత్తు పెద్దగా ఏడుస్తూ 'నాకు మృత్యువు సమీపించిందా ఏమి? సైన్యం సమస్తం సంహరించబడ్డారు. నాకిక్కడెవరూ



కనిపించడం లేదు' అని విలపించాడు. 'ఫలాహారం తప్ప వేరే స్వీకరించని ఈ నిరాహారి చేతిలో నాకు చావు రాసి పెట్టి ఉన్నది కాబోలు. నానా దుర్భాషలాడుతూ రాముని వద్దకు తీసుకుపోతాడేమో! ఎలాగైతే రావణుని పట్టుకుని పంచరేఖలతో గుండుగీయించారో, ఆ విధంగా జానకీదేవిని వదలి పెట్టేంతవరకు నన్ను కారాగారంలో బంధిస్తారు' అనుకుని ఇంద్రజిత్తు పారిపోయి గుహలో దాక్కున్నాడు. హనుమంతుడు ఒక పెద్ద బండరాయి తెచ్చి ఆ గుహకు అడ్డంగా పెట్టి దారి మూసేసాడు. ఇంద్రజిత్తు 'నాకు ఇంకా చావు రాలేదేమి? ప్రాణత్యాగం చేద్దామంటే ఒక్క అస్త్రం కూడా చెంతలేదే' అని విచారించాడు.

ఇంద్రజిత్తును గుహలో బంధించారన్న వార్త విని దశకంఠుడు మిక్కిలి భీతిల్లి బ్రహ్మదేవునితో 'నీ మాట ప్రకారం ఆ వానరం ఎందుకు హస్తగతం కాలేదు? కనుక నీవు వెంటనే వెళ్ళి ఆ కోతిని పట్టుకుని మాకు అప్పగించి నాకు పుత్రభిక్ష పెట్టు. ఆ వానరుడు కాలరూపుడు. నీకు తప్ప వేరెవ్వరికీ ఈ పని శక్యంకాదు' అని అర్థించాడు. బ్రహ్మదేవుడు వెళ్ళి చూస్తే గుహలో ఇంద్రజిత్తు నగ్నంగా దాక్కుని భయంతో వణికిపోతూ కనిపించాడు. దీనాతిదీనమైన పలుకులతో ఇంద్రజిత్తు 'నీవు నన్ను విడిపించినా, ఆ వానరాన్ని పట్టుకోకపోతే నేను బయటకు రాను' అని భీష్మించుకున్నాడు. అంతట కమలోద్భవుడు నీవు గుహ బయటకు వచ్చి, బ్రహ్మాస్త్రం సంధించి ఆ వానరుని పట్టుకోమన్నాడు. బ్రహ్మాస్త్రం కూడా అతనిపై పని చేయదని ఇంద్రజిత్తు వగవగా బ్రహ్మ, 'నీవు అపవిత్రుడవు. అందువల్ల ఆ అస్త్రం పని చేయలేదు' అని చెప్పి బ్రహ్మదేవుడు హనుమంతుని ఈ విధంగా స్తుతించాడు. 'నీవు వజ్రకాయుడవు. మహాబలాఢ్యుడవు. రాక్షసులు నిన్ను చూస్తేనే వణికిపోతున్నారు. నీవు నా మాటను నిజం చేయి. బ్రహ్మపాశానికి లొంగి, రాజసభకు వచ్చేవరకు నీ పరాక్రమం చూపవద్దు' అని వేడుకోగా మారుతి కమలోద్భవుని విన్నపాన్ని

గౌరవించాడు. బ్రహ్మపాశం వేయగా హనుమంతుడు దానికి కట్టుబడ్డాడు. వెంటనే ఇంద్రజిత్తు పరుగున వచ్చి ఆ పాశాన్ని తన హస్తాలతో దృఢంగా బంధించాడు. ఒకడు గడ్డిపోచలతో కాళ్ళు కట్టేస్తే, మరొకడు చెట్ల తీగలతో గట్టిగా చుడుతున్నాడు. ఒకడు తాళ్ళుతేవటానికి నగరానికి వేగంగా వెళ్ళాడు. హనుమంతుడు బంధవిముక్తుడయినప్పటికీ బందీగా నటించాడు. జ్ఞాని సంసారం చేస్తూ కూడా ముక్తుడై వున్నట్లు, తామరాకు నీటిలో వున్నా నీటిబిందువును నిలువనీయనట్లు, ఆకాశంలో ధూళివల్ల శీతోష్ణాలు మలినం కానట్లు, గాలి ఎక్కడైనా అలిప్తంగా వున్నట్లు, హనుమంతుడు ఇహపరాలకు అతీతుడు. బ్రహ్మ, ఇంద్రజిత్తు కలసి హనుమంతుని సభకు తీసుకుని వచ్చారు. దారిలో ఎదురుపడ్డ రాక్షసులంతా పలురకాల ఆయుధాలతో హనుమంతుని పొడిచారు. కానీ వజ్రశరీరుడయినందున అవి విరిగిపోయాయి. అసురులంతా కలసి సభాస్థలికి తీసుకునివచ్చిన మారుతిని చూచి, రావణుడు పళ్ళు పటపటా కొరికాడు. ఇంతలో ఆంజనేయుడు బంధనాలను తెంచి రావణుని ఆసనం కన్నా ఉన్నతంగా తోకతో ఆసనం చేసుకుని కూర్చొన్నాడు.

ప్రధానియైన ప్రహస్తుడు హనుమంతునితో 'నీవు ఎవరు పంపగా వచ్చిన దూతవు?' అని అడిగాడు. హనుమంతుడు బదులు పలకలేదు. అందరూ కారణం తెలియక ఆశ్చర్యంతో చూసారు. అప్పుడు రావణుడు 'ఓ వానరా! నీవెవ్వరవు?' అని ప్రశ్నించాడు. దానికి ఆంజనేయుడు 'ఒరే! నిశాచరాధమా! నీవు పాపివి. మహామలినుడవు. దుర్జనుడవు. పామరుడవు. దొంగవు. నేనెవరో నీకు నిజంగా తెలియలేదా? స్వయంవరంలో నీ గుండెలపై నుండి ధనుస్సును తీసి, నిన్ను మృత్యుముఖం నుండి కాపాడిన ఆ రాముని దాసుణ్ణి! తాటక, సుబాహులను చంపి, విశ్వామిత్రుని యాగరక్షణ చేసిన రఘురాముని బంటును. నీ చెల్లెలు ముక్కు కోసి, ఖరదూషణ త్రిశిరులను సంహరించిన రామలక్ష్మణుల దూతను. ఒరే మూర్ఖా! లంకను దహించి, నీకు శిక్ష



విధించడానికి వచ్చాను. వంటింట్లోకి దొంగతనంగా చొరబడే కుక్కలా, నీవు పంచవటికి వెళ్ళి శ్రీరాముని హృదయరత్నమైన సీతాదేవిని అపహరించావురా పాపీ! అపవిత్రుడా! మృగేంద్రుడైన రాముని వస్తువునపహరించి ఎలా జీవించగలవురా! నీవు ఆయన ముందు మేకతో సమానం. వాసుకి కోరల్లో చిక్కిన కప్ప బ్రతికి బయటపడగలదా? పులి నిద్రిస్తూ నాలుక బయటపెట్టినా దానిని కొరికి నక్క జీవించి ఉండగలదా! అక్షయుని చంపి, అశోకవనాన్ని విధ్వంసం చేశాను. నీ సైన్యాన్నంతా సంహరించి ఇంద్రజిత్తును ముప్పుతిప్పలు పెట్టాను. రాక్షసుల వైశ్వానరుడు, అయోధ్యాప్రభువు, కౌసల్య కుమారుడు, నీ శిరస్సు ఖండించుటకు సమరసన్నద్ధుడై ఇక్కడకు వస్తాడు. నిరంతరం ఈశ్వరునిచే ధ్యానింపబడే ఆ రఘునందనుడు నీ పదితలలు కోసి దశదిశలకు బలి ఇచ్చి సీతను గైకొనిపోతాడు' అని బదులిచ్చాడు.

## హనుమద్బంధనం : లంకాదహనం

ఈ మాటలు విని దశకంఠుడు కుపితుడై 'ఈతడి తోక, ముక్కు, చెవులు, నాలుక ఖండించ'మని ఆజ్ఞ ఇచ్చాడు. ఆజ్ఞ కాగానే బలవంతులైన రాక్షసులంతా చుట్టుముట్టి తోకపై బలంగా శస్త్రాలతో మోదసాగారు. చెమటలు కారిపోతున్నా పట్టువదలక గట్టిగా నరకసాగారు. కాని అతని వెంట్రుక కూడా చెక్కుచెదరలేదు. అది చూచి దశగ్రీవుడు భీతిల్లి ఏంచెయ్యాలో తోచక మనస్సులో ఈ రామోపాసకుడు సత్యసంధుడు, ఈతనికి మృత్యువు ఎలా సంభవిస్తుందో తెలుసుకుంటాను అనుకొని మారుతితో 'రామునిపై ఒట్టు వేసి నీ మృత్యాంగం ఏదో నిజం చెప్పు!' అన్నాడు. దానికి హనుమ 'నాకు మృత్యువు లేద'నగా రావణుడు నవ్వాడు. 'బ్రహ్మకు కూడా మరణం ఉందే, మరి కీటకం వంటి నీవెంత' అన్నాడు. బదులుగా మారుతి 'నా బలం సమస్తం నా తోకలో ఉంది. నూనె గుడ్డలను తోకకు చుట్టి అగ్ని రగిలిస్తే సమస్తం భస్మీపటలమవుతుంది' అన్నాడు. 'వెంటనే నూనెలో ముంచి వస్త్రాలను చుట్టండి. అగ్ని రగల్చగానే

క్షణంలో అంతమవుతాడు' అన్నాడు రావణుడు. రాక్షసులు నూనె వస్త్రాలు తెచ్చి తోకకు చుట్టారు. ఇంతలోనే వాయుకుమారుడు తోక కొంచెం బయటకు కనబడితే ఏం చేస్తానో నాకే తెలియదని బెదిరించాడు. రాక్షసులు గుడ్డలకోసం పరుగులు తీసి చుడుతున్నారు. కానీ తోక ఇంకా ఇంకా పెరుగుతూనే వుంది.

ప్రజ్ఞాశాలియైన పండితుడు ఎంత మాట్లాడినా మాటలు పొంగుకొచ్చినట్లు, మహాకవి ఎన్ని పద్యాలు వ్రాసినా ఇంకా వ్రాయాల్సినట్లు, రామగుణ వర్ణన ఎంత చేసినా తరగనట్లు, గొర్రెలకాపరికి వేదార్థసారం ఎన్నటికీ బోధపడనట్లు, మారుతి తోక మహిమ రాక్షసుల కంతు పట్టలేదు. నగరంలో అందరూ నగ్నులయ్యారు. సకల వస్త్రరాశి పూర్తిగా హరించుకొనిపోయింది. ఎంత వెతకినా ఎక్కడా ఏమీ లభ్యంకాలేదు. రాణివాసం కూడా నగ్నమయింది. కానీ తోక ఇంకా మిగిలే ఉంది. నగరంలో ఎక్కడ వెదకినా దారపు పోగు కూడా దొరకలేదు. హనుమంతుడు ఏమాత్రం తోక మిగిలినా పర్యవసానం చెప్పలేనంటున్నాడు. నూనె, నెయ్యి, వెన్న, గుడ్డలు ఎక్కడా దొరకలేదని రావణునికి చెప్పారు. భయంతో ఒకడు యజ్ఞోపవీతం తీసి తోకకు చుట్టాడు. రాజసేవకులు కూడా నగ్నంగా తిరగసాగారు. అన్ని గృహాల ప్రధానద్వారాలు బార్లా తెరిచి ఉండగా నగరంలోని జనులందరూ వివస్త్రలై సిగ్గుతో తలుపుల వెనుక దాక్కున్నారు. ఒకరు చీకట్లో కూర్చుంటే, ఒకరు భూగృహంలో తలదాచుకున్నారు. ఒకడు కళ్ళు మూసుకొని వెలుతురు వచ్చినా రాత్రే అనుకుంటున్నాడు. వృద్ధులలో ఒకడు లంకానగరానికి మంచిరోజులు లేవు, అంత్యకాలం సమీపించింది, అంతా భస్మమయ్యేట్లుంది అన్నాడు.

ఇక్కడ తోక ఇంకా చేయి మందం మిగిలి ఉంది. వస్త్రాలు దొరికే ఆశ లేదు. ఆఖరకు రావణుడు అశోకవనంలోని సీత వస్త్రాలను తెమ్మన్నాడు. హనుమంతుడు రావణుని ఆదేశం విని తోకను ముకుళించాడు. వెంటనే తోక మిగలలేదన్న వార్తను దూత రావణునికి తెలిపాడు. 'ఇక అక్కడ నుండి



గుడ్డలు తేవడమెందుకు, వెంటనే తోకకు నిప్పు పెట్టండి' అన్నాడు రావణుడు. రాక్షసులు కాగడా తెచ్చారు. కాని నిప్పు తోకకు అంటుకోలేదు. ఎన్నో ఉపాయాలు చేశారు. కానీ అగ్ని అంటుకోలేదు. రావణుడు అగ్ని అంటకపోవుటకు కారణమేమని హనుమంతుని అడిగాడు. బదులుగా మారుతి 'నీ యింట్లో పుచ్ఛ యజ్ఞం జరుగుతున్నది. అలాంటప్పుడు సేవకుల చేతికి ఈ పని అప్పగిస్తారా? ఆ మూర్ఖులు నోటితో ఎందుకు ఊదుతారు? నీవు వచ్చి స్వయంగా నోటితో ఊదితే ఒక క్షణంలో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లుతాయి' అన్నాడు. అంజనేయుని మాటలను విని దశకంఠుడు లోలోపల భయంగా ఉన్నా పైకి బింకంగా లేచాడు. స్వయంగా వెళ్ళి నోటితో బలంగా అగ్నిని ఊదాడు. ఆ క్షణంలో హనుమంతుడు తన తండ్రియైన వాయుదేవుని, అగ్నిని స్మరించాడు. వెంటనే అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లి దశముఖాల పైకెగిశాయి. గడ్డము, మీసాలు అన్నీ భస్మమయినాయి. రావణుడు ఎన్నో పాపాలు చేశాడు. రాబోయే కాలంలో రామబాణం శరీరంలో గుచ్చుకోకముందే, హనుమంతుడు ప్రాయశ్చిత్తం చేశాడు. దశకంఠుని పది ముఖాలు బాగా కాలిపోయి చూచుటకు కాలిన అడవిలా గోచరించాయి. ముఖానికి గుడ్డ కప్పుకుని తన ఆసనంలో కూర్చున్నాడు. అప్పటికి తోకకు నిప్పు అంటుకుంది. హనుమంతుడు ఉన్మత్తుడై నేలమీదపడి దొర్లసాగాడు. దయనీయమైన స్వరంతో నన్ను ఎవరైనా వదలి పెట్టండి అని ఆక్రోశిస్తున్న హనుమంతుని చూచి అసురులు మనస్సులో ఆనందించారు. అక్షయాది సమస్త రాక్షసులను సంహరించినందుకు, ఇంద్రజిత్తును బాధించినందుకు వీడికి తగిన శాస్తి జరిగిందని సంతోషించారు. అగ్నిని తెప్పించి తోకకు నిప్పు అంటిస్తే మారుతి వెంటనే మరణిస్తాడని భ్రమించిన దశముఖుని మూర్ఖతను, మారుతి ఆలోచనను పసిగట్టి బ్రహ్మదేవుడు వినోదంగా తిలకించసాగాడు. ఇంతలో హనుమంతుడు అగ్నితాపానికి బుసలు కొడుతూ, భూమిపై ఇటునటు దొర్లుతూ, మోకాళ్ళపై కూర్చొని రావణుని

గడ్డం పట్టుకోవడానికి వెళ్ళాడు. అక్కడ గడ్డం ఏమీ మిగలలేదు. రావణునికి అగ్ని అంటుకోగా, దరహాసవదనుడైన బ్రహ్మ, ముందు అనర్థం జరగబోతోంది అనుకున్నాడు. అసురులందరితో హనుమంతుడు నన్ను వదలిపెట్టండి అని అర్థించాడు. కానీ వారు పట్టించుకోకుండా దూరంగా పారిపోసాగారు. ఇంతలో మారుతి తోకతో అసురులందరి గడ్డాలను కాల్చి గొప్ప ప్రళయం సృష్టించాడు. తోక గిరగిరా త్రిప్పగా ప్రళయజ్వాలలు విజృంభించాయి. తోక రాక్షసుల చుట్టూ తిరిగి అందరినీ భస్మం చేసింది. రాక్షసులంతా సభను వదలి పారిపోయారు. మారుతి రాక్షసులతో ఆగండిరా! నన్ను వదలి పెట్టండి అంటూ వందలాది రాక్షసులను క్షణంలో తోకతో బంధించి రావణుని ఎదుటకు తెచ్చి ఎక్కడికిరా పారిపోతున్నారు? అని గదమాయించాడు.

ఇంతలో నీ వానరుడు చనిపోయాడన్న వార్తను రాక్షసులు సీతకు చెప్పారు. ఈ వార్త విని జానకి దుఃఖంతో ఈ విపరీతం ఎలా సంభవించింది? దోమ సాగరాన్ని శోషింపజేయడం, నక్క సింహాన్ని పట్టుకోవడం, మిణుగురు పురుగు సూర్యుని పడదోయడం, కమలం వజ్రాన్ని పగులగొట్టడం, పతంగం బడబానలాన్ని మింగివేయడం, వాసుకి పడగను అణచి వేయడం, దోమరెక్కల ధాటికి ప్రళయమేఘాలు విచ్ఛిన్నమవడం, పిపీలకాల దాడికి కనకాద్రి పడిపోవడం, పుష్పప్రహారానికి తాబేటి వీపు తట్టుకోలేకపోవడం, చిత్రలేఖనంలోని కాంతి ప్రళయకాలం మెరుపులను మింగివేయడం ఎలా అసంభవాలో అలా రుద్రావతారుడైన హనుమంతుడు ఈ రాక్షసులు వెలిగించిన అగ్నిచేత మృత్యువువాత పడడం అసంభవం అనుకుంది జానకి. జఠరాగ్నిని అడుగగా హనుమంతుడు క్షేమంగా ఉన్నాడు, వాయుదేవుని సహాయంతో నగరాన్నంతా దహిస్తున్నాడు అని జవాబిచ్చింది.

రాజసభలో రాక్షసులంతా కలిసి హనుమంతుని శస్త్రాలతో కొట్టగా తోకలోని మంటలు మరీమరీ ప్రజ్వరిల్లాయి. దాంతో రక్కసులు నలుదిశలకు



పారిపోయారు. నానాశస్త్రాలు, బాణాలు ప్రయోగించగా, మారుతి విగతజీవునిలా పడిపోయాడు. వానరుడు మూర్ఛిల్లగనే అసురులంతా పరుగున వచ్చి దగ్గరకు చేరి, నేను చేసిన గాయం వల్లనే మరణించాడు అని ప్రతిఒక్కరు గుర్తులు చూపించసాగారు. అజేయుడైన ఆ వానరుడు చనిపోయాడు, ఇక మీరు సుఖంగా నిద్రించవచ్చు అని రావణునికి విన్నవించారు. మరణించినవానివలె మారుతి రెండు ఘడియలు భూమిపై పడున్నాడు. రాక్షసులంతా కలిసి అతడిని అవలోకిస్తున్నారు. నోటినుండి నురగ వస్తోంది. వైద్యులు నాడి చూస్తున్నారు. ఎన్నో పురుషార్థాలు సాధించి చివరకు వానరుడు మృత్యువు పాలయ్యాడు అని అనుకున్నారు.

అలా అందరూ చూస్తుండగా హనుమంతుడు అకస్మాత్తుగా లేచి అందరినీ తోకతో బంధించాడు. రాక్షసులలో కొందరు ఆ మంటలలో మండిపోగా, కొందరు పారిపోయారు. దశకంఠుడు ఒక్కడే మిగిలిపోయాడు. రావణునితో 'ఇప్పుడు నీకు రక్షణ ఎవరు?' అని అడిగాడు. హనుమ. కానీ రావణుడు ఇంద్రజిత్తుతో లోహపు గొలుసులు తెచ్చి ఈ కోతి మెడ, చేతులు బంధించి లంకంతా తిప్పండి అని ఆజ్ఞాపించాడు. ఇంద్రజిత్తు అలాగే హనుమంతుని బంధించి నగరమంతా తిప్పసాగాడు.

బంగారానికి పుటం పెడితే దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. ఆ విధంగా సీతాశోకహరణుడైన హనుమ అగ్నితో కలిసి శుద్ధమై వెలుగొందాడు. హనుమంతుని వీధివీధి తిప్పుతుండగా కొందరు సహజంగా గూఢచారని తలచారు. నిందించిన వారి నోటిని దహించాడు. ఇది చూచి ప్రజలు తలోదిక్కుకు పారిపోయారు. హాహాకారాలు చేస్తూ దయనీయంగా ఒక యువతి తన సహోదరునితో, నీవు నన్ను ఇక్కడి నుండి బయటకు తీసుకపోకపోతే ఆ వానరుడు నన్ను దహిస్తాడు అని విలపించింది.

ఇదిలా ఉండగా హనుమంతుడు రాక్షసులందరిని తనను గట్టిగా పట్టుకోమని హెచ్చరించి, సూక్ష్మరూపంలో అక్కడి నుండి ఎగిరిపోయి వెటకారంగా నవ్వసాగాడు. రాక్షసులకు తోక చూపిస్తూ సుడిగాలిలా లంకంతా నిప్పంటించాడు. మిద్దెలు, గోపురాలు, అందమైన రాణివాస భవనాలు, నగరంలోని అన్ని మహాద్వారాలు, ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కపి లంకాదహనం చేయడానికి వాయువు ఎంతో సహాయపడ్డాడు. నగరపౌరులు నగ్నంగా ఇళ్ళు వదలి పారిపోయారు. సంసారికి ధనం ముఖ్యం. అంతకంటే ప్రియం సంతానం. అంతకంటే భార్య అధికం. అన్నిటికంటే ప్రాణం ముఖ్యం. తను ప్రాణత్యాగం చేయవలసినప్పుడు ఇంద్రియాల పట్ల ఉదాసీనుడై దేహాభిమానము నశించగా నిస్సంగుడై విషయభోగాలను వదిలేస్తాడు. మోహమమతలపై భ్రాంతి వీడనివాడు ఇతరుల గూర్చి పట్టించుకుంటాడా? ఎవరూ ఎవరినీ పట్టించుకోక ప్రాణం దక్కించుకోవడానికి పారిపోతారు. భర్తను అత్యంత ప్రియంగా ప్రేమించే భార్య సైతం భర్త కోసం మండే ఇంటిలో ఉండగలదా? మంటలు అపరిమితంగా పైకిలేచి ఆకాశాన్ని అంటసాగాయి. కల్పాంతంలో రుద్రునిలా అగ్ని రావణునిపై ప్రజ్వరిల్లింది. పొగ పదిదిక్కులకూ దట్టంగా వ్యాపించింది. ఎవరికి కూడా చూపు సరిగా కనబడడం లేదు. పరుసవేది వంటి రామభక్తుని వీరవిహారంతో లంకానగరమంతా కాలిపోయి ఎర్రని మంటలలో సువర్ణంలా గోచరించింది.

అలా లంకాదహనం గావించిన హనుమంతుడు శ్రీరామదర్శనాభిలాషియై వెంటనే ఎగిరి సముద్రతీరం చేరుకున్నాడు. సముద్రంలో మండుతున్న తోకను ముంచగానే ఎన్నో ఆక్రందనలు, విన్నపాలు వినబడ్డాయి. జలచరాలన్నీ ఆ వేడికి మగ్గిపోయి, నీవు దూరంగా వెళ్ళు మారుతీ! అని వేడుకున్నాయి. వాటి విన్నపాన్ని మన్నించి హనుమ తీరానికి రాగా, యాజ్ఞికుడు అగ్నిని ఆర్పినట్లు, సముద్రుడు అలల రూపంలో నీళ్ళు చల్లి తోకను చల్లార్చాడు.



ఆ సమయంలో హనుమకపాలం నుండి రాలిపడ్డ ఒక స్వేదబిందువు నుండి మకరధ్వజుడు జన్మించాడు. ఆ కపీంద్రుడు వెనుదిరిగి చూడగా లంకంతా మంటలలో భగభగ మండసాగింది. అసంఖ్యాకమైన ఆ అగ్నిజ్వాలలో జానకి భస్మమైపోయిందేమో! నేను వచ్చిన కార్యమంతా నాశనమైంది అని తలపోసి వాయునందనుడు మిక్కిలి శోకాక్రాంతుడయ్యాడు. నేను రామస్మరణ చేసిన తోడనే నన్ను అగ్ని బాధించలేదు. అలాంటప్పుడు జగన్మాతను అగ్ని ఎలా బాధించగలదు. నిర్మలమైన మనస్సుతో రామనామాన్ని స్మరించినంతనే శివుని కంఠంలోని హాలాహలం కూడా శీతలమైంది అని తన్ను తాను సమాధానపరచుకున్నాడు. ఇంతలో వాయుదేవుడు ముల్లోకాధిపతి హృదయేశ్వరియైన జానకీదేవి సుఖంగా ఉందన్నాడు. ఆ వార్త విన్న తరువాత హనుమంతునికి రాముని చూచి, వారి పాదాలపై పడాలన్న కాంక్ష మరింత బలపడింది. కాని ఆ జానకీనాథుడు జరిగిన సంగతులను చెప్పమంటాడు. ముఖతా నన్ను నేను కీర్తించుకొనుట తగదు. తన కీర్తిని, ధర్మాన్ని, విద్యను, ధైర్యాన్ని, బలపరాక్రమాల్ని గురువు ఎదుట వర్ణించినవానికి తప్పక హాని కలుగుతుందని శాస్త్రవాక్యం. అందుచేత గుప్తరూపంలో అంజనేయుడు పరమేష్ఠిని దర్శించి నేను అయోధ్యాపతి చరణ సందర్శనానికి పోతున్నానన్నాడు. ఇక్కడ జరిగిన సంగతులన్నీ ఆమూలాగ్రంగా వ్రాసియివ్వండి అని అడిగాడు. ఈ వార్త విని బ్రహ్మదేవుడు బ్రహ్మానందంలో మునిగి తేలాడు. 'హనుమా! నీ జన్మ ధన్యమైంది. నన్ను కూడా పావనం చేశావు' అంటూ వెంటనే జాబు వ్రాసి అతని చేతికిచ్చాడు. బ్రహ్మ అనుమతి గైకొని అశోకవనానికి వచ్చి జనకాత్మజకు సాష్టాంగనమస్కారం చేశాడు. 'దశరథునికి మహా పుణ్యఖనియైనవాడు, బ్రహ్మాండనాయకుడు, జగద్గురువు, భక్తమందిర ప్రాంగణ మందారమూ అయినటువంటి ఆ రాముని దర్శనానికి వెళుతున్నాను' అన్నాడు. ఆమె హనుమంతునకు నమస్కరించి కళ్ళనిండా నీరు నిండగా గద్గదస్వరంతో నా ప్రాణనాథుడు ఇక్కడకు ఎప్పుడు వస్తాడు అని అడిగింది.

హనుమంతుడు 'జగన్మాతా! రఘునాథవల్లభే! గుణసరితే? కమలప్రియే! కమలోద్భూతే! నీవు ఇక దిగులు చెందనవసరము లేదు. మాతా! ఉదయం రెండు ప్రహారాలయిన తరువాత రాఘవుడు సముద్రతీరానికి వచ్చి దైత్యేంద్రునితో సహా రాక్షసులందరినీ సంహరించి నిన్ను విడిపిస్తాడు. నాకు మీరేదయినా గుర్తు ఇస్తే తాటకను సంహరించి యజ్ఞాన్ని కాపాడిన రఘునాథుడు సంతుష్టుడై నన్ను ధన్యజీవిగా మెచ్చుకుంటాడు' అని వేడుకోగా, ఆమె తన జడలో నుండి దివ్యంగా ప్రకాశించే ఒక మణిని తీసి హనుమంతుని చేతిలో పెట్టగా హనుమ 'ఆ జానకీ రమణుని అమితానందభరితుని చేసే మరొక గుర్తును చెప్పవలసింది' అని సీతాసతిని అర్థించాడు. 'మేము త్రికూటపర్వతంపై వసిస్తున్నప్పుడు ఒకరోజు లక్ష్మణుడు వనానికి వెళ్ళాడు. ఏకాంతంలో నేను రఘునాథుని తొడపై తలపెట్టిపడుకున్నాను. రఘురాముడు ప్రీతితో మిక్కిలి సువాసన గొలిపే ఒక కేసరిరంగు మూలికను అరగదీసి ఆ తిలకాన్ని నా నుదుటిపై దిద్దాడు. ఈ విషయం రఘునాథునికొక్కరికే తెలుసు' అని జానకి హనుమంతునికి మరొక గుర్తును కూడా తెలియజేయగా వాయునందనుడు మిక్కిలి ఆనందించాడు.

జానకీదేవి హనుమతో 'సముద్రం శతయోజన పర్యంతమై ఉప్పొంగుతున్నది కదా! అసంఖ్యాకంగా వానరసేన దానిని దాటి ఎట్లా రాగలదు?' అని అడిగింది. 'రాఘవుడు బాణాలతో వారధి నిర్మిస్తాడు. లేదా నా తోకతో అఖండమైన వారధిని నిర్మించవచ్చు. కాకపోతే రామబాణం బడబానలమై సముద్రాన్ని శుష్కింపజేయవచ్చు. అదీ కాకపోతే అందరం ఎగిరి ఇక్కడకు రావచ్చు. స్తంభాలు లేకుండా ఆకాశం ఎలా ఉన్నదో, నీటిపై పృథ్వి స్వయంభువులాగా ఎలా ఉన్నదో, అలా జానకీమాతా! నీ భర్తకు శక్యం కానిది ఏమున్నదమ్మా! తల్లి కడుపులో బిడ్డ నవమాసాలూ జీవిస్తుంది. దాన్నెవరు రక్షిస్తున్నారు? ఆ సర్వేశ్వరునకు సాధ్యంకానిదేమున్నది? బిడ్డపుట్టగానే



తల్లిస్తనాల్లో పాలు ధారగా స్రవిస్తాయి. ఇది ఆ పరాత్పరునికి తప్ప అన్యులకు శక్యమా? క్షణంలో అనంతమైన బ్రహ్మాండాన్ని చూపగలడు. వెంటనే దానిని లుప్తం చేయగలడు. అట్టి త్రిభువన గోసాయికి శక్యంకానిదేది? సూర్యుడొక్కడే జగత్తునంతా ప్రకాశింపచేయగా జ్ఞానసూర్యుడైన రఘువీరుడు ఈ మాత్రం చేయలేడా? నవరంధ్రభరితమైన శరీరంలో ప్రాణం పోకుండా నిలుపగలిగిన జగన్మోహనుడైన అయోధ్యానాథునకు ఇది ఒక లెక్కా! వేదాలు ఎవరిని వర్ణించలేక మూగవోయాయో, అట్టి రఘునాథుడు రేపు ఉదయం రెండో ప్రహారానికల్లా సముద్రతీరంలో ఉంటాడు. మాతా! నిన్ను నాతోనే తీసుకొని వెళ్ళేవాడిని. కాని రఘురాముడు నిన్ను వెతకమని మాత్రమే నాకు అనుజ్ఞ ఇచ్చాడు. తదుపరి వారేం చేస్తారో నాకు తెలియదు' అని పలికి సాష్టాంగ నమస్కారం చేసి సీత ఆజ్ఞ గైకొని వాయునందనుడు రఘునాథునకు జయము కలుగుగాక! అని జయజయధ్వానాలు చేస్తూ నింగికెగిరాడు. దేవతలంతా మారుతీ! నీవు త్వరగా శ్రీరాముని తీసుకొనిరా! నీవే మా ప్రాణదాతవు. మమ్ములనందరిని ఇక్కడ నుండి బంధ విముక్తుల చేయమని ప్రార్థించారు. దేవతలతో హనుమంతుడు మీరు ఇక చింతించనవసరం లేదు. ఉదయానికల్లా రాముడు సముద్రతీరంలో ఉంటాడు అని ధైర్యం చెప్పాడు.

**హనుమ తిరిగిరాక**

తదుపరి లంకాగిరి శిఖరాన్ని అధిరోహించి హనుమ హుంకారం చేయగా ఆవలిఒడ్డున ఉన్న వానరసేనలు విన్నాయి. లంకాగిరి నుండి హనుమ ఎగరగా ఆ ధాటికి ఇసుకతిప్పలు కూడా రెండు యోజనాలు ఎగిరిపడ్డాయి. ఇది చూచి సముద్రుడు భీతిల్లాడు. రాత్రి ముగియగానే ఉదయించిన సూర్యుని వలె, వైకుంఠంలో దిగిన సుపర్ణుని వలె, మానసతీరంలో దిగిన రాజహంసవలె మారుతి ఆవలిఒడ్డున దిగాడు. అకస్మాత్తుగా మహేంద్రగిరిపై నిలచిన హనుమంతుని చూచి, వెంటనే కలవాలని జాంబవదాది సమస్త వానరులు

పరుగుదీసారు. గొప్పగొప్ప వానరులందరూ హనుమను కలుసుకొని ఆపాదమస్తకం ఆలింగనం చేసుకొన్నారు. ఒకరు తోకను కౌగిలించుకోగా, ఇంకొకరు తోకను ముద్దాడారు. ఒకడు మెడను వెనక్కు తిప్పి తోకను పైకెత్తి చూపిస్తున్నాడు. ఒకడు చప్పట్లు కొట్టగా ఒకడు మారుతి ముందు నాట్యమాడాడు. ఒకడు పిల్లి మొగ్గ వేస్తే ఒకడు శ్రీరాముని గుణగానం చేశాడు. ఒకడు హుంకారం చేయగా ఒకడు సాష్టాంగనమస్కారం చేశాడు. ఒకడు శ్రీరామచంద్రుని వద్దకు వెంటనే పోదామన్నాడు. సకలదేవతలు శ్రీమహావిష్ణువును పూజించినట్లు వానరులు పూలు తెచ్చి హనుమంతుని పూజించారు. మారుతి ఒంటిపై ఉన్న మట్టిని చూచి వానరులంతా లంకలో ఏం ప్రతాపం చూపావో మాకు వివరంగా చెప్పమని బ్రతిమాలారు. మారుతి సమాధానం చెప్పకుండా బ్రహ్మ వ్రాసిన పత్రాన్ని వారికిచ్చాడు. విరించి ముద్రాంకితమైన ఆ ఉత్తరాన్ని వారు తెరువలేదు. కిష్కింధకు ఈ సమాచారం చెప్పకుండా ఇక్కడ కూర్చుని జాబు చదువుతుంటే చతురులు మనలను చూచి నవ్వుతారు అని వానరులు మారుతితో సహా కిష్కింధకు బయలుదేరారు. దారిలో సుగ్రీవుని మధువనాన్ని క్షణంలో నాశనం చేశారు. మధువనాన్ని రక్షించే వానరులు సుగ్రీవునితో 'మీకు అత్యంత ప్రియమైన మధువనాన్ని వానరులతో సహా వాయునందనుడు ధ్వంసం చేసాడని' తెలిపారు. ఆ వార్త విని సీతాపతి సుగ్రీవునితో 'మారుతి విజయం సాధించిన ఆనందంలో మధువనాన్ని నాశనం చేసి ఉంటాడు' అని చెప్పాడు. ఇంతలో మధువనం నుండి అంజనాసుతుడు స్వానందంలో తేలియాడుతూ పంపాసరోవరం ఒడ్డున ఉన్న రఘురాముని వద్దకు రెక్కలతో ఎగిరి వచ్చి పర్వతమే వాలిందా అన్నట్లు, ఆదిత్యుడు భూమిపై దిగాడా అన్నట్లు, మాయాచక్రబంధాన్ని నిరసించి స్వస్వరూపంలో తేలియాడే యోగిలా వానరులతో ఎగిరి వచ్చాడు హనుమంతుడు. లంకలో విజయం సాధించిన హనుమంతుని గాంచి



రఘునందనుడు ప్రసన్న వదనుడయ్యాడు. ఆ సుప్రసన్నత సాధకుడు తన గమ్యాన్ని సాధించాడా, సుపర్ణుడు సుధారసాన్ని హరించి తెచ్చాడా అన్నదానికి ప్రతీకగా ఉంది. అయోధ్యాపతి, కిష్కింధాపతి ఇరువురు తమ ఆసనాలను విడిచి పరుగున వెళ్ళి మారుతిని బ్రహ్మానందంతో కౌగిలించుకొన్నారు. పరమస్నేహాళువైన రఘురాముడు మారుతి చేతులు పట్టుకొని క్షేమాలింగనం చేసుకొనగా ఆకాశమంతా ఆనందంతో నిండింది. ప్రాణసఖుడైన హనుమంతుని హృదయానికి హత్తుకున్నాడు రఘునందనుడు. ముందుముందు ఏ కారణంగానైనా నీవు నన్ను వదిలితే నా మనస్సు తాళలేదు అన్నాడు శ్రీరాముడు.

హనుమంతుని క్షేమాలింగనం తరువాత ఆ కోదండపాణి మిగతా వానరులను కలుసుకున్నాడు. జాంబవంతుని, అంగదుని ప్రేమతో హృదయానికి హత్తుకున్నాడు రఘూత్తముడు. సుగ్రీవుడు పరుగున వచ్చి ప్రేమతో మారుతిని ఆలింగనం చేసుకోగా, బృహస్పతి ఇంద్రుని కలుసుకున్నంత ఆనందం వెల్లివిరిసింది.

తదుపరి రాజాధిరాజులలో సమర్థుడైన రఘురాముడు సభచేయగా, హనుమంతుడు బ్రహ్మ వ్రాసిన జాబును తెప్పించి రఘుపతి ముందుంచాడు. ఋషిపుత్రుడైన దండి మొదలుకొని సుప్రభను ఉద్ధరించినంతవరకు ఆంజనేయుడు చెప్పగా విని అందరూ ఆనందించారు. తదుపరి అంగదుడు సముద్రతీరం వరకూ జరిగినదంతా వర్ణించి చెప్పాడు. 'సీతాదేవి జాడ తెలియలేదు, అని మేము అనుకుంటుండగా ఒక అద్భుతం జరిగింది. అందరం అగ్నిలో దూకి ఆత్మాహుతి చేసుకుందామని అగ్ని రగిల్చాము. ఇంతలో హనుమంతుడు మమ్ము రక్షించాడు. సముద్రతీరంలో సంపాతి కలిసి మాకు సీత ఎక్కడ ఉన్నదీ తెలియజేశాడు. వాయునందనుడు సముద్ర లంఘనం

చేయడం, తర్వాత లంకలో జరిగిన సంగతులు బ్రహ్మ తన స్వహస్తాలతో వ్రాసాడ'ని బదులిచ్చాడు.

అప్పుడు మారుతి, 'జగద్వంద్యా! అయోధ్యాపతీ! సీతాసతి సుఖంగా ఉన్నది. గద్గదితయై ఈ మణిని గుర్తుగా నా చేతికిచ్చింది. మీరు ఏకాంతంలో సీతాసతి నుదుట తిలకం దిద్దిన విషయాన్ని గుర్తుగా విన్నవించింది' అని పలుకగా రాముని కళ్ళలో ఆనందాశ్రువులు నిండాయి. మణిని హృదయానికి హత్తుకుని రఘునాథుడు 'హా సీతా!' అంటూ అత్యంత శోకాకులితచిత్తుడైనాడు. హనుమంతుడు 'ఓ రఘురామా! జనకాత్మజ సుఖంగా ఉన్నది. మీ ముద్రికను చూసి ఆమె ఎంతో పరవశించింది. కాని మీ వియోగంతో ఆమె ఎంత కృశించిందంటే మీ ముద్రికను వేలుకు ధరించగా గాజులా అది చాలా వదులుగా ఉన్నది.' అన్నాడు. రఘునందనుడు ఆమెలో ఇంకా ప్రాణం ఎలా మిగిలివుందని అడిగాడు. 'రఘుపతీ! వాస్తవంగా నీ నామామృత జపం వల్లనే జానకి బ్రతికి ఉంది. రాహుగ్రస్తమైన శశాంకుని వలె ఆమె సదా చింతితురాలై వుంది' అన్నాడు మారుతి. సముద్రజలాలను ఎలా లంఘించావు?' అని ప్రశ్నించగా, 'మీరిచ్చిన అద్భుతమైన ముద్రికవల్ల క్షణంలో ఎవరైనా దాటగలరు' అని సమాధానమిచ్చాడు మారుతి. విరించి వ్రాసిన పత్రాన్ని శ్రీరాముడు లక్ష్మణునికివ్వగా అతడు దానిని చదువనారంభించాడు. వానరులంతా సావధానులై వింటున్నారు. గాలికూడా విరించి పత్రాన్ని వినడానికి సిద్ధమైంది. ఆ పత్రాన్ని తెరచి చదువుతున్న సౌమిత్రి పున్నమి నాటి చంద్రునిలా ప్రకాశించాడు. సరస్వతీ జనకుడైన బ్రహ్మదేవుని అక్షర కౌశలం వర్ణింపనెవరితరం? అట్టి లేఖాంశాన్ని శ్రోతలు ఇప్పుడు వినవలసింది. రఘువీరుడు కేవలం పరబ్రహ్మ. ఆయనకు బ్రహ్మదేవుడు వ్రాసిన పత్రం అతి పవిత్రంగా శ్రీధరకవి వర్ణించాడు. స్వస్తి।



శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. భక్తులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**ఇరువది ఒకటవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 22

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

### బ్రహ్మదేవుని లేఖ

**సౌ**మిత్రి బ్రహ్మదేవునిచే వ్రాయబడిన లేఖను తెరిచి చదువుచుండగా రాజీవనేత్రుడు, సుగ్రీవాది కపులు సావధానులై విన్నారు.

అనంతకోటి బ్రహ్మాండనాయకా! దయార్ణవా! విశ్వపాలకా! వైకుంఠపతే! విశ్వవ్యాపకా! మమజనకా! శ్రీవల్లభా! హే రామా! సకలబంధచ్ఛేదకా! సాధుప్రతిపాలకా! దుష్టరజనీచరసంహారకా! జానకీనాయకా! జగద్గురో! జగదంకురమూలకందా! సాధుహృదయారవింద భ్రమరా! నిజజనచాతకజలదమా! బ్రహ్మానందా! పరాత్పరా! సంసారగజవిదారక మృగేంద్రా! దు:ఖపర్వతభంజన వజ్రధరా! నిజభక్తచకోరసుధాకరా! అతిఉదారా! సీతాధవా! త్రిభువనజనకా! దు:ఖహరణా! జనకజామాతా! జనపాలకా! జనకజాపతే! జలజనయనా! జలదవర్ణా! జగత్పతే! జయజయరామ! వేదోద్ధారకా! కమఠరూపా! సృష్టిపాలకా! నమో సకలదైత్యాంతకా! వరాహవేషా! దీనబంధో! నమో హిరణ్యకశ్యప మర్దనా! నమ స్త్రివిక్రమా! బలిబంధనా! నమో బ్రాహ్మణకులపాలనా! భార్గవకులదివాకరా! నమ: పౌలస్త్యకులవిపినదహనా! మీనకేతనారి హృదయజీవనా! నమో చతుర్దశలోకపాలనా! మఖరక్షకా! రఘువీరా! జయజయ విశ్వపాలకా! విశ్వవ్యాపకా! విశ్వకారణా! విశ్వమతిచాలకా! విశ్వజీవనా! విశ్వరక్షకా! విశ్వేశా! నమో మాయాచక్రచాలకా! నమో అజ్ఞాన తిమిరాంతకా! నమో వేదరూపా! వేదపాలకా! వేదస్థాపకా! వేదవంద్యా! నమో కమలనాభా! నమ: కమలజీవనా! నమ: పాపారణ్యకుఠారతీక్షణా! నమ: త్రివిధదాహతాపశమనా! అనంతశయనా! అనంతా! నమో దశావతార చరిత్రచాలకా! నమో



అనంతబ్రహ్మాండనాయకా! నమో అనంతవేషకారకా! తాటకాంతకా! పాపహరణా! నమో జననమరణరోగనిర్మూలనా! సచ్చిదానందా! స్వసంవేద్యా! మాయాతీతా! జగద్వంద్యా! భేదాభేదాతీతా! స్వర్గస్థిత్యంతకారకా! కైవల్యపదదాయకా! అజ అజిత సర్వాత్మకా! కరుణాలయా! సుఖాబ్ధీ! జయజయ షడ్వికారరహితా! నమో షడ్గుణాలంకృతా! అరిషడ్వర్గచ్ఛేదప్రతాపవంతా! శబ్దాతీతా! నిరంజనా! ” నీవు నిర్వికారనిరంజనుడవు. మా కొరకు సగుణరూపం ధరించావు. రాక్షసులను సంహరించి బందీలుగా ఉన్న దేవతలను విడిపించటానికే అవతరించావు. పితృవాక్యపరిపాలన నెపంతో అరణ్యానికి వచ్చి, సహజంగా పంచవటిలో వసిస్తూ అక్కడి రాక్షసులను అంతంచేశావు. దశకంఠుడు సీత నపహరించినందున, సాక్షాత్తూ రుద్రావతారం, అంజనా హృదయారవింద భ్రమరం, బ్రహ్మాండానికంతా స్ఫూర్తియైన అంజనేయుడు సీతను వెదుకుటకు అరనిమిషంలో సాగరాన్ని లంఘించాడు.

“మారుతి సముద్రలంఘనం అత్యద్భుతం. ఎన్ని విఘ్నాలు కలిగినా అజేయంగా సాగిపోవడం ఇతరులకసాధ్యం. లంకకు వచ్చిన తర్వాత హనుమంతుడు చాలమంది రాక్షసులను సంహరించాడు. క్రౌంచ నోటిలోకి పోయి దంతాలతో దాని కడుపు చీల్చి బయటకు వచ్చాడు. నికుంభిలా దుర్గమంతా వెదికి సౌందర్యవతి సులోచనను చూసి ఆమే జానకి అనుకున్నాడు. ఆమెపైన ఒక పెద్ద బండరాయిని వేయటానికి సంసిద్ధుడైన వాయునందనుడు ఆమె మాటలు విని ఆమె సీత కాదని తెలుసుకున్నాడు. తదుపరి సూక్ష్మరూపంలో లంకానగరం ప్రవేశించి, రాక్షసులను బాధించి నగ్నంగా వీధులపాలు చేశాడు.”

లేఖ వింటూ జానకీనాథుడు ‘ధన్య! ధన్య వీరమారుతి!’ అంటూ అటువంటి అగాధశక్తి, అద్భుత కర్తవ్యనిర్వహణ ముల్లోకాలలో ఎవరికీ లేవు

అని పొగిడాడు. మారుతి వినోదలీలలు విని వానరులంతా విపరీతంగా నవ్వుతూ ఒకరిపైనొకరు పడుతూ, ఆనందంగా తలలాడిస్తూ వినసాగారు. విలువైన కానుకలతో హనుమంతునికి హారతిచ్చారు. ఒక్కొక్కరు వరుసగా మారుతిని ప్రేమగా హృదయానికి హత్తుకొని బలాఢ్యుడవైన నీ జన్మ ధన్యమైందని పరిపరి విధాల మెచ్చుకొన్నారు. వానరగణం నవ్వులాపి సావధానులైన తరువాత, లక్ష్మణుడు దరహాసవదనుడై పత్రంలోని మిగత భాగాన్ని చదివాడు.

సీతాన్వేషణకై విభీషణుని మందిరంలో ప్రవేశించిన హనుమ, అక్కడ జరుగుతున్న కీర్తనను విని పరవశించాడు. అలాగే కుంభకర్ణుని సదనం చూసి ఎంతో ఏవగించుకొన్నాడు. రావణుని భార్యలు ఎనుబదివేలమందిని శోధించినా సీతను కానరాక వాయునందనుడు రావణసభకు వెళ్ళి అక్కడ అందరినీ అవమానించిన తీరు వర్ణింపనలవికానిది.

'రావణుని పక్కన శయనించిన మండోదరిని చూచి ఆమే సీతని తలచి, దుస్స్వప్నం చూచిన వానివలె ఎంతో కలవరపడ్డాడు. ఇంతలో శివునికి ప్రియమైన రఘునందనునికి సీతను అప్పగించు అని మండోదరి రావణునితో పలికిన పలుకులు విన్నాడు. ఇంతలో సీత ఎలాగుందో చూడమని రావణుడు దూతను పంపగా మారుతి ఆ దూతను అనుసరించాడు. అశోకవనంలో నున్న సీతాదేవిని చూచి నమస్కరించి, ఆమె ముందు ముద్రికనుంచి క్షణంలో చెట్టు పైకెక్కి కూర్చున్నాడు. ఇంతలో రాక్షసస్త్రీలు గుంపుగా వచ్చి వాళ్ళ పరాక్రమం సీతాదేవి ముందు ప్రదర్శించారు. సీతాదేవి ముద్రికను చూచి శోకతప్త కాగా మారుతి ప్రత్యక్షంగా దిగి వచ్చి ముందు నిలిచాడు. అన్ని విషయాలు వివరించి, ఆకలిగా ఉందనే నెపంతో ముప్పయి యోజనాల విస్తీర్ణమున్న అశోకవనాన్ని ధ్వంసం చేశాడు. రావణుడు సైన్యాన్ని పంపాడు కాని వారిని మారుతి ఆక్షణంలోనే సంహరించాడు. రావణుని పుత్రుడైన



అక్షయుని చంపి ఇంద్రజిత్తును ముప్పుతిప్పలు పెట్టాడు. తరువాత నేను హనుమంతుని ప్రార్థించి బ్రహ్మపాశబద్ధుని చేసాను. రావణుని వాగ్బాణాలు వింటూ నిర్భీతితో హనుమంతుడు సభలో నిలిచాడు. 'మారుతిని త్వరగా సంహరించాలని తోకకు గుడ్డలు చుట్టి నూనె పోసి నిప్పంటించారు. తోకకు నిప్పంటించగనే హనుమంతుడు ఎగిరిపోయి ఒకక్షణంలో లంకను మూడువంతులు తగలబెట్టాడు. లంకంతా మంటలతో సువర్ణమయంగా గోచరించింది. వాయుపుత్రుని అసామాన్య సామర్థ్యానికి జోహార్లు. సముద్రంలో తోకను చల్లార్చి, ఆటలలో అలసిపోయిన బాలుడు తల్లి ఒడిచేరినట్లు తిరిగి జానకిని సందర్శించాడు.'

సౌమిత్రి ఆ జాబు చదవగానే ఘనశ్యామగాత్రుడైన రఘువీరుడు పరుగున వెళ్ళి వాయుపుత్రుని ప్రేమతో కౌగిలించుకొన్నాడు. అటువంటి సద్గుణుడైన రత్నాన్ని కని అంజనాదేవి జన్మ ధన్యమైంది. మారుతి ముఖమంతా నిమిరి రఘురాముడు తిరిగి తన ఆసనంలో కూర్చున్నాడు. కిష్కింధావాసులు రత్నాలు తెచ్చి మారుతికి హారతి పట్టారు. మారుతాత్మజా! బ్రహ్మాండమంతా కీర్తిగాంచిన నీ జన్మ ధన్యమైనది. నీ స్వామి స్వముఖ ఆదరణముందు అమృతపానంగాని, స్వర్గసుఖాలుగాని ఎందుకూ కొరగావు. కోదండపాణియైన రాముడు దివ్యమణిని హృదయానికి హత్తుకొని, హనుమంతుడు జానకిని తెచ్చాడన్నంత సంబరపడ్డాడు. 'మారుతీ! మన స్నేహం ధన్యమైనది. నా జానకిని నాతో కలిపావు. నీ ప్రతాపానికి అవధులు లేవు. నీ కీర్తి భూనభోమండలాల్లో మార్మోగుతుంది. నీవు సాగరాన్ని లంఘించి జానకిని శోధించి నన్ను ఋణబద్ధుని చేశావు' అన్నాడు రఘురాముడు.

హనుమంతుడు మనస్సులో ఇలా తలపోసాడు. నేను గుర్తుగా సీతాదేవి వద్దనుండి మణి తెచ్చినందుకే రాముడు అమిత ఆనందపడుతున్నాడు. నేను

చాలా పెద్దపొరపాటు చేశాను. సీతనే గనుక తెచ్చినట్లయితే రఘువీరుడు బ్రహ్మానందం పొందేవాడు కదా! అయినా ఇప్పుడు నాకేమయినా బలం తగ్గిందా! ఒకటిన్నర గంటలకాలంలో సీతను తీసుకుని తిరిగి రాగలను అని తలపోసాడు. రాఘవునితో 'రాక్షసులనందరిని చంపి ఒక్కక్షణంలో సీతను తెస్తాను' అంటూ హనుమంతుడు ఎగరబోగా సీతారమణుడు సావధానుడై 'హనుమంతా! నీవు వెళ్ళవద్దు. దానికి చాలా కారణాలున్నాయి' అన్నాడు. అయినా మారుతి ఆవేశంతో బయలుదేరాడు. ఏం చేయాలో ఎవ్వరికి తోచలేదు. ఇంతలో స్వయంగా రఘుపతి పరుగున వెళ్ళి హనుమంతుని ఆపాడు. హనుమంతుడు రఘునాథుని పైకెత్తి తన భుజాలపైకెత్తుకొని 'రావణుని చంపుటకు మిమ్ములను త్వరగా లంకకు తీసుకుపోతాను' అన్నాడు.

ఇంతలో లక్ష్మణుడు, సుగ్రీవుడు, అంగదుడు, జాంబవంతుడు నలుగురు పరుగున వచ్చి హనుమంతుని చుట్టూ చేరి ఈ పద్ధతి సర్వదా పనికి రాదు అని నచ్చచెప్పారు. మారుతి నలుగురినీ ఎత్తుకొని పైకెగిరి, చిటికలో లంకకు వెళ్ళి రాక్షససంహారం చేసి వద్దాం అన్నాడు. మిగతా వానరులు సాగరం దాటి రావడం సాధ్యమా! అని వారంటే, ఆ రాక్షసులను చంపటానికి మనం ఐదుగురము సరిపోమా? అన్నాడు హనుమ. ఐదుగురుని భుజంపై ఎక్కించుకొన్న అంజనేయుడు చూడటానికి ఐదుశిఖరాల పర్వతంలా శోభిల్లాడు. చెట్టుకు ఐదు పండ్లు కలిగితే దానికి భారమవుతాయా? అలా ఆ తేజోరాశిని చూస్తే ఉదయాద్రి పైన పంచసూర్యులు ఉదయించారా అన్నట్లు ప్రకాశించారు. ఆ ఐదుగురిని తీసుకొని బయలుదేరిన హనుమంతుని చూచి సీతారమణుడు 'మారుతీ! ప్రాణసఖా! నా మాట విను. ఆలోచించకుండా ఎవరూ ఏపనీ చేయకూడదు. ఇది అనాదిగా ఉత్తములు ఆచరించే పద్ధతి' అన్నాడు. రఘునాథుని విన్నపం విని ఐదుగురిని దింపి ప్రేమతో జానకీపతి పాదాలనాశ్రయించాడు ఆంజనేయుడు. సుగ్రీవుడు, జాంబవంతుడు, నలుడు,



నీలుడు హనుమంతుని బలాన్ని పొగడుతుండగా తమాలనీలుడైన శ్రీరాముడు సభలో ఆసీనుడయ్యాడు. శ్రీరాముడు మారుతితో లంక ఎలాగుంది? రాక్షసులు ఎలా ప్రవర్తించారు? ఏమైనా పుణ్యకర్మలు చేస్తున్నారా? అని అడిగాడు. ఆ పైన మారుతీ రఘురాముల సంభాషణ, ఏకాంతంలో ఇంద్రుడు బ్రహస్పతి సమాలోచన చేసినట్లుగానున్నది.

## హనుమంతుడు లంకగురించి వివరించుట

లంక మూడువందల గ్రామాల నిడివి కలిగి ఉందని లంక రేఖాచిత్రాన్ని గీసి రఘునందనునకు చూపించాడు మారుతి. అక్కడ ఉన్న భవనాల సంఖ్య మెల్లమెల్లగా ఆ చిత్రంలో గీసి చూపించాడు. అక్కడ మేలైన పచ్చలతో పొదిగిన రాళ్ళతో కట్టిన గృహాలు ఐదు లక్షలున్నాయి. ఇటుకలతో నిర్మించి దేదీప్యమానంగా వెలిగే మందిరాలు ఏడు లక్షలున్నాయి. రాగి, కంచు భవనాలన్నీ కలిపి ఐదు కోట్లుంటాయి. బంగారంతో కట్టిన భవనాలు ఏడు కోట్లుంటాయి. అక్కడ బంగారము, రత్నాలతో అలంకరించిన శివాలయాలు తొమ్మిది కోట్లున్నాయి. త్రికాలాలలో పెక్కురు రాక్షసులు రుద్రాభిషేకం చేసి నైవేద్యాలు ఇస్తుంటారు. రాక్షసుల గృహాలన్నింటిలో నిత్యాగ్నిహోత్రం, వేదాధ్యయనం జరుగుతాయి. రాక్షసులు రుద్రాక్షమాలాలంకృతులై విభూతిని నిత్యం ధరిస్తారు. ముఖ్యంగా రావణుడు తన స్వబుద్ధితో వేదాలను ఖండించి పారవేశాడు. అక్కడక్కడా కొందరు దారుణమైన తపస్సు చేస్తుంటారు. వాయునందనుని పలుకులు విని రఘునాథుడు ఉద్విగ్నుడై లంక అంత పుణ్యప్రదంగా ఉంటే నేను అక్కడికి పోవడం సంభవించదు. ఎక్కడ సత్కర్మాచరణ జరుగుతుందో అక్కడ యశస్సు, కీర్తి, కళ్యాణాలు తాండవిస్తుంటాయి. ఎంత ప్రయత్నించినా అట్టి లంకా నగరంపై నేను చేయి ఎత్తలేను అని అంటూ రాఘవుడు ఒక్కక్షణం మౌనంగా ధ్యానంలో

ఉండిపోయాడు. ఆ సమయంలో వానరులంతా నిశ్చేష్టులై రఘురాముని అవలోకించసాగారు.

శ్రీరాముడు మారుతితో నీవు రాక్షసుల స్థితిని గురించి చెప్పావు. వారికి దయ, క్షమ, ఉపరతి, శాంతి, విరక్తి ఉన్నాయా? శుచిగా, దానం, ధర్మం అసురులు అనుదినం చేస్తారా? అని అడిగాడు. దానికి బదులుగా అంజనేయుడు క్షమ, దయ, శుద్ధాంతఃకరణం, శౌచము, దానము, ధర్మము, పవిత్రత అనునవి లంకలో అణుమాత్రం కూడా కనబడవు. అసురులు పరమ అధర్మవర్తనులు, నిర్దయులు, కపటులు, క్రూరులు, అత్యంత దుర్మార్గులు, దురాచారులు. మద్యపానంతో నిరంతరం మత్తెక్కి ఉంటారు అన్నాడు. మారుతి పలుకులు విని కోదండపాణియైన రాముడు నగుమోముతో 'లంకలో పాపాత్ములు నివసించేట్లయితే ఈ క్షణమే లంకను పట్టుకుందాం' అన్నాడు. 'ఆంతర్యంలో దయ క్షమ లేకుండా వ్రతాలు తపాలూ చేసినా ఏం ప్రయోజనం లేదు. శాస్త్రసజ్ఞానం కూడా ఎందుకూ కొరగాదు. స్త్రీ వేషం ధరించిన పురుషునిలా, గారడీ వాని శూరత్వంలా, భ్రష్టుని తత్వజ్ఞానంలా, సర్పంయొక్క శాంతంలా, విధవ యవ్వనంలా, చిన్న గుంటలోని నీటిలా, చండాలుని రమ్యసదనంలా, వేశ్యముఖంలా, పుట్టుగుడ్డికి విశాలమైన నయనాల్లా, బధిరునికి అందమైన చెవుల్లా, అజాగళస్తనంలా, వ్యభిచారి నడవడిలా, పెద్దమనిషి వేషం ధరించిన దొంగ పలుకుల్లా, జడుని శాంతి ప్రవచనంలా, దారిదోపిడి చేసేవాని నిర్మలత్వంలా, కీకారణ్యంలోని దట్టమైన ముళ్ళపొదల్లా, దాంభికుని వ్యర్థ భజనలా, భూతదయ లేకుండా జ్ఞానమూ, ధ్యానమూ వ్యర్థమే. వాళ్ళ ఏకాంతం ఎలుక కోసం పిల్లి కాపు కాయడం వంటిది. చేపలకోసం వేటాడే కొంగజపం వంటిది. వాళ్ళ ఒంటికి భస్మం పూసుకున్నా చెత్తకుప్పలో పొర్లాడే గాడిదతో సమానమే. వారు నిరంతరం అరణ్యాల్లో వసించే



క్రూరమృగాల వంటివారు. అటువంటివారు పుణ్యస్థలాలలో నివసించినా కాకితో సమానమే. తీర్థజలాలలో ఎన్నాళ్ళు కప్పలున్నా ఏం ప్రయోజనం? అవి ఎంత అరచినా ప్రయోజనం ఉండదు. వారికి అరవైనాలుగు కళలు తెలిసినా వాటి భావం విపరీతంగా బోధపడుతుంది! దయ, క్షమ ఎన్నటికీ రుచించవు. వారు వేదాధ్యయనం చేసినా గాడిదకు చందనం రాసినట్టే. గరిటెను షడ్రసాలలో ఎంత కలియబెట్టినా దానికి రుచి ఏంతెలుస్తుంది? దంబాచారంతో చేసే కీర్తనలా, వేటగాడి కూతలా, తాగుబోతు వాని వాగుడులా వారి శబ్దపరిజ్ఞానం ఎందుకూ కొరగాదు. బృందావన ఫలం ఎంత శుభ్రంగా ఉన్నా, ఉమ్మెత్తకాయ పనసనుబోలి ఉన్నా ఏం ప్రయోజనం? ఎంతసేపు సున్నాన్ని చిలికినా నవనీతం వస్తుందా? ఇసుకను ఎంత ఉడకబెట్టినా దానికి మృదుత్వం కల్పాంతానికి కూడా కలుగుతుందా? వేపకాయను ఎంతకాలం చక్కెరలో ఉంచినా దానిలోని చేదుగుణం మారుతుందా? కాకికి సున్నం వేసి రాజహంసలా తయారుచేసినా అది పెంటను వెతకడం మానతుందా? అలా వేషం వల్ల ఉపయోగమేమి? అలాగే హనుమంతా! దయా క్షమా హృదయంలో లేకుండా జపో, తప, ధ్యానాలు నిష్ప్రయోజనం. అందువల్ల ఆవలి ఒడ్డున ఉన్న లంకలోని అసురులందరిని సంహరించాలి' అన్నాడు రాముడు. ఈ మాటలు విన్న వానరులంతా ఆనందంతో కేకలు వేశారు.

మరలా బ్రహ్మ వ్రాసిన పత్రం చదవడం మొదలుపెట్టారు. 'హనుమంతుడు లంకాదహనం చేసిన తర్వాత లంకంతా సువర్ణమయమయింది' అని విని శ్రీరామచంద్రుడు ఆశ్చర్యంగా జాంబవంతునితో 'నీవు చాలాకాలం నుండి ఉన్నావు. బ్రహ్మాంశసంభూతుడవు. ఎన్నో విషయాలు చూచి ఉంటావు. విని ఉంటావు. ఆ వివరం మాకు తెలియచెయ్య'మని అడిగాడు. వయస్సులో, తపస్సులో, గుణంలో తండ్రి వంటి జాంబవంతుడు లంకానగరస్థల పూర్వవృత్తాంతాన్ని ఇలా చెప్పాడు.

## లంకానగరస్థల పూర్వవృత్తాంతం

'గజేంద్రోద్ధారణ చేసి రమాకాంతుడు వేగంగా వెనుదిరిగాడు. అప్పుడు గరుత్మంతుడు తనకు ఆకలిబాధ తీవ్రంగా ఉన్నదని మనవి చేశాడు. వెంటనే శ్రీధరుడు నీవు వెళ్ళి గజేంద్రుని గోళ్ళలో ఎన్నో కళేబరాలున్నాయి, త్వరగా ఆరగించి రమ్మనగా గరుడుడు ఎగిరివెళ్ళి గజేంద్రుని గోళ్ళనుండి రెండు కళేబరాలు తీసుకొని ఆకాశానికి ఎగిరాడు. ఇంతలో రాబందు వచ్చి భాగమడిగింది. వైనతేయుడు దానిని ఒక క్షణంలో సంహరించి జంబూ వృక్షం కొమ్మపై కూర్చున్నాడు. ఆ కొమ్మపై అరవైవేల మంది వాలఖిల్యులు అనే ఋషులు తపస్సు చేస్తున్నారు. పక్షీంద్రుడు బలంగా దానిపై వాలగానే విశాలమైన ఆ కొమ్మ విరిగింది. నూరుయోజనాల క్రిందకు ఆ కొమ్మ పడితే ఆ విప్రులందరూ మరణించేవారే. అది గమనించి కశ్యపసుతుడు కళేబరాలను నోటితో, కొమ్మను చేతితో పట్టుకొని పైకెగిరాడు. నేనిపుడు ఎవరి శరణు వేడేది? కొమ్మను వదలితే అరవైవేల మంది ఋషులు మృతులౌతారు అని మథనపడసాగాడు. కశ్యపుడు అనుష్ఠానంలో కూర్చొని ఉండగా అతనిపై ఆకాశంలో ఎగురుతున్న పక్షి నీడ పడింది. అతడు దృష్టి సారించి సుపుత్రుడు సంకటంలో పడ్డాడని తెలుసుకున్నాడు. అప్పుడు గరుడుడు కశ్యపఋషిని ప్రార్థించగా ఆ ఖాళీస్థలంలో బ్రాహ్మణులను దించమని, ఆ కొమ్మ కారణంగా మానవులు ఒకరి ప్రాణం ఒకరు తీసుకుంటారు కనుక ఆ కొమ్మను మాత్రం అక్కడ ఉంచవద్దని చెప్పాడు. మరలా పక్షిరాజు ఆ కొమ్మను ఏటవాలుగా యథాస్థానంలో ఉంచాడు. అందువల్ల అది త్రికూటాచలమైంది. గరుడుడు అక్కడ ఆహారాన్ని తిని ఆ కొమ్మను అక్కడనే వదలివెళ్ళాడు. తదుపరి ఆ ప్రదేశంలో లంకానగరం నిర్మించబడింది. సువర్ణశాఖ పడివున్న లంకను హనుమంతుడు దహించాడు. ఆ శాఖనుండి బంగారం కరిగి బయటకొచ్చింది.



అందువల్లనే లంక సువర్ణమయమయింది' అని అయోధ్యాపతికి తెలియజెప్పాడు జాంబవంతుడు.

## శ్రీరామ యుద్ధసన్నాహం

తదుపరి సుగ్రీవుడు 'విజయదశమి శ్రవణానక్షత్రము, చాలా మంచి ముహూర్తము' అన్నాడు. ఆ రోజునే రఘునందనుడు యుద్ధానికి బయలుదేరాడు. పూర్వం రఘుమహారాజు కూడా ఈ సుముహుర్తాన బయలుదేరి దిగ్విజయం పొందాడు. సర్వశుభలక్షణాలున్న ఆ తరుణంలో మాల తీసుకొని సుగ్రీవుడు శ్రీరాముని పాదారవిందాలకు ప్రణామం చేశాడు. శ్రీరాముని వెంట కిష్కింధేశ్వరుడైన సుగ్రీవుడు, పదునెనిమిది పద్మాల వానరులు నిలబడ్డారు. డెబ్బైరెండు కోట్ల భల్లూక వీరులు, వారి రాజైన జాంబవంతుడు అనుసరించారు.

ఏభైఆరు కోట్ల వానరసేనంతా కలసి హుంకారాలు చేస్తూ బయలుదేరగా భూమండలమంతా అచ్చెరువొందింది. ఆకాశమంతా దద్దరిల్లింది. ఆదిశేషువు కూడా తన పడగ వాలిపోకుండా అప్రమత్తమైనాడు. యజ్ఞవరాహం ముట్టెను పైకెత్తి పళ్ళుబిగపట్టింది. కూర్మం తన వీపు సవరించుకుంది. దిగ్గజాలు భయాక్రాంతమయ్యాయి. హుంకారాలు విని భూమి కంపించింది. వనచరాలు, ఖేచరాలు భీతిల్లాయి. వాద్యాల హోరు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆ సమయంలో రథారూఢుడయిన సూర్యునివలె, గరుడుని అధిరోహించిన శ్రీమహావిష్ణువు వలె, హనుమంతుని భుజస్కంధాలపైనున్న రఘువీరుడు శోభిల్లాడు. నందినెక్కిన శివుని వలె, ఐరావతారూఢుడైన ఇంద్రునివలె అంగదుని భుజస్కంధాలపైన ఆసీనుడైన సౌమిత్రి అలరారాడు. కిరణాలచే పరివ్యాప్తుడైన సూర్యునివలె, సప్తగిరులలోని కనకాద్రివలె, ప్రమథగణాలమధ్యన శివునివలె రాముని వానరులు పరివేష్టించారు. సముద్ర మథనానికి సురాసురులంతా కదలివెళ్ళినట్లు వానరులంతా సింహనాదాలు చేస్తూ దక్షిణదిశగా వెళ్ళారు.

విశాలమైన వృక్షాలను పెకలించి రామునికి గొడుగు పట్టారు. వృక్షాలచిగుళ్ళను చేత ధరించి చామరంలా రామునికి విసరసాగారు. దశయోజనవిస్తారంగా సేన కదిలిపోతుండగా దారిలో వానరులు రఘునాథునితో రావణుని మట్టిగరపించి జానకిని మీతో కలుపుతాము అని పలికారు. ఒక వానరవీరుడు నేరుగా వెళ్ళి దశకంఠుని పరిమారుస్తానన్నాడు. ఒకడేమో రావణుని బంధించి తేవడానికి క్షణం కూడా పట్టదన్నాడు. ఒకడు రఘునందనునితో స్వామీ! నా మనసులో రావణుని ముక్కు చెవులు కోసేసి త్వరగా తిరిగిరావాలనుంది అన్నాడు. ఒకడేమో నేను వెళ్ళి లంకనంతా తలక్రిందులు చేసి వస్తాను. అది విని నీవు సంతోషిస్తావు రఘురామా! అన్నాడు.

దక్షిణాపథంలో సైన్యం అంతా కదిలిపోతుండగా దారిలో వానరులు పర్వతాలను పైకెత్తి బంతుల్లాగా ఎగరేసి పట్టుకొంటూ ఆవేశంగా పరుగులెత్తసాగారు. సైన్యమంతా సముద్రతీరం చేరింది. వానరుల హుంకారాలకు సముద్రుడు మిక్కిలి భీతిల్లాడు. వేదాలలోని అద్భుతమైన భావాన్ని, వాటి స్వరూపాన్ని చూచి యోగి నిశ్చలమైనట్లు, వానరవీరులంతా సముద్రతీరం వద్ద ఆగిపోయారు. రాజహంస మానససరోవరానికి వచ్చి స్థిరపడినట్లు కపికేసరాలన్నీ సముద్రతీరం వద్ద విడిది చేసాయి. దశయోజన విస్తీర్ణంలో నలుమూలలా సేనలు విడిది చేశాయన్న విచిత్రవార్త లంకకు చేరిన విధం పరిశీలించండి. వానరసహితంగా అయోధ్యావిహారి సముద్రపు ఆవలి ఒడ్డుకు వచ్చి ఉన్నాడన్న వార్త లంకలోని రాక్షసశ్రేష్ఠులందరూ విన్నారు. ఇంద్రజిత్తు మొదలైన కుమారులతోనూ, ప్రహస్తుడు మొదలైన ప్రముఖ ప్రధానులతోనూ లంకేశ్వరుడు సమావేశమైనాడు.

**రావణుని యుద్ధసమాలోచనలు**

శత్రువు, పాము అగ్నితో సమానం. వారిని తక్కువగా అంచనా వేయకూడదు. జాగ్రత్త వహిస్తే వారిని విధ్వంసం చేయడానికి క్షణం పట్టదు



అని లంకేశ్వరుడు ఆలోచనామగ్నుడయినాడు. 'సపరివారంగా రఘునందనుడు ఆవలితీరాన విడిది చేశాడు. ఒక వానరుడు వచ్చి లంకానగరాన్ని తగులబెట్టి వెళ్ళి జరిగినదంతా రామచంద్రునికి చెప్పి త్వరగా వెంటబెట్టుకొని వచ్చాడు. వారిని కైవశం చేసుకొనే పద్ధతి ఆలోచించి నాకు వెంటనే చెప్పండి' అన్నాడు. ఈ మాటలు లంకేశ్వరుడు పలికినంతనే కుమారులు, ప్రధానులంతా కలిసి మిక్కిలి కుపితులై ఆయుధాలు చేబూని ఇలా అన్నారు. ఆ నరులు, వానరులు, భల్లూకాలు మనకు భక్ష్యాలు. మన ప్రభువు శంకరుడు పరమదయాళువు. అందువల్లనే ఆయన వీళ్ళను ఆహారంగా పంపాడు. మీరు దిగులు చెందనవసరం లేదు. మీ శత్రువును సంహరించి తిరిగి రావడానికి మాకు ఒక్కక్షణం పట్టదంటూ కత్తులు దూసారు. సింహానికి దూరంగా వెనుక నిలబడి నక్క వదరినట్లు, కప్పలన్నీ కలిసి వాసుకిని గెలుస్తామని ఎగిరిపడ్డట్లు, శక్రజిత్తు, అతికాయుడు మొదలైన కుమారులు, దేవాంతక, నరాంతక, మహోదర, ధూమ్రాక్ష, వజ్రదంష్ట్రాది అసురులు అందరూ కలసి ఆ నరవానరాలను ఒక్క క్షణంలో జయిస్తామని ప్రగల్భాలు పలికారు. ఆ సమయంలో కాకుల సభలోకి రాజహంస ప్రవేశించినట్లుగా విభీషణుడు సభకు విచ్చేసాడు. వివేకరత్నాలకు మకుటం, అపార సద్గుణగంగ, సద్భావఖని, దివ్యమణియైన విభీషణుడు తేజరిల్లాడు. వివేకఖని, భక్తసముద్రుడు, పరమార్థవనంలో అలరారే దివ్యకుసుమంలా విభీషణుడు విరాజిల్లాడు. అటువంటి ఉన్నతమైన న్యాయసింధువు, సత్యసముద్రుడైన విభీషణుడు హితవు చెప్పసాగాడు.

**విభీషణుని హితబోధ**

'మీరు వాచాలురు. పరమ దుర్మార్గులు, మహాకపటులు, అంతరంగంలో పరిశుద్ధత లేనివారు. దశముఖునికి దాసోహమని నానా కుతర్కాలు చేశారు. సజ్జనుల యశస్సు, ధైర్యము, సకల సద్గుణాలు, వారు చేసిన మంగళకార్యాలు

విని, దుర్జనులకు దుఃఖం కలుగుతుంది. వారిని దూషించకుండా ఉండలేరు. దుష్టబుద్ధులు, బలహీనులైనవారే పరనింద చేస్తూ రాత్రింబవళ్ళు తమ్ముతాము పొగుడుకుంటూ యుద్ధభూమి నుండి పారిపోతారు. ఇవన్నీ శునకలక్షణాలు. సకలసైన్య సహితంగా యుద్ధంలో విజయం పొందడానికి అయోధ్యానాథుడు విచ్చేసాడు. ఇంతకు పూర్వం హనుమంతుడొక్కడే వచ్చి తన బలాన్ని చూపించాడు. ఆయన దృష్టిలో సముద్రం, చేత్తో ఆపోసన పట్టిన ఉదకంతో, లేగదూడ అడుగుజాడలోని నీళ్ళతో సమానం. ఆ సముద్రాన్ని రఘురాముడు ఒక్క క్షణంలో దాటి రాగలడు. హనుమంతుడు నగరాన్నంతా విధ్వంసం చేశాడు, రావణ సభనంతా నగ్నం కావించి కోటానుకోట్ల నిశాచరులను అశోకవనంలో సంహరించాడు. రాజకుమారులనందరిని వధించి ఇంద్రజిత్తును గుహలో బంధించాడు. అద్భుతంగా లంకను దహించి పౌరుషాన్ని ప్రకటించాడు. ఆ సమయంలో మీ బలమంతా ఎందుకు వికలమైంది? ఇప్పుడు రావణుని ముందర ప్రగల్భాలు పలుకుతున్నారు!' అని హితవు పలికాడు విభీషణుడు.

'పరమపాషండులైన దుర్జనులు, యవనులు వేదాలను దూషిస్తారు. కాని విద్వజ్జనులు జ్ఞానసంపన్నులకు, ధర్మాత్ములకు నమస్కరిస్తారు. కమలాన్ని కప్ప నిందిస్తుంది. కాని భ్రమరమెన్నటికి దానిని వదలదు. తస్కరులు చంద్రుని నిందించవచ్చు కాని చకోరం సదా ఆనందిస్తుంది. ఖలులు పండితులను దూషిస్తారు కాని విజ్ఞులందరూ ఆదరిస్తారు. కాకి ముత్యాన్ని పారవేస్తుంది. కాని హంస దానిని వదలిపెట్టదు. మూఢునికి కస్తూరి వాసన తెలియదు. బురద అనుకొని దూరంగా విసిరివేస్తాడు. కాని శ్రీమంతుడు అహోరాత్రులు దాన్ని హృదయాన, శిరస్సున ధరిస్తాడు. గుడ్లగూబకు సూర్యుడంటే ఇష్టముండదు. కాని చక్రవాకం ఆనందిస్తుంది. అంధుడు జాతిరత్నాన్నైనా పారేస్తాడు కాని రత్నపరీక్షకుడు దాన్ని సంరక్షిస్తాడు. అలాగే జగద్వంద్యుడు,



ఎవరి హృదయంలో సదా ఉమావరుడు నివసిస్తాడో, సదా ఆదిశేషువు ఎవరిని కీర్తిస్తాడో, సనకసనందనాదులు ఎవరిని హృదయాన ధ్యానిస్తారో, ఎవరు వేదాచలానికి వెలుగో, అట్టి కమలోద్భవుడు, సహస్రనేత్రుడు, పురాణపురుషుడు, మూలప్రకృతితో సహా రఘువీరుని రూపంలో అవతరించాడు. అలాంటి వేదవంద్యుడైన రఘురాముని మీరు పామరులై నిందిస్తున్నారు. రావణుడు కామంతో చేసిన ఘాతుకాన్ని మరచి అతని మాటలకు తలలూపుతున్నారు. కార్తవీర్యునిచే బంధింపబడ్డాడు రావణుడు. అట్టి సహస్రబాహువును భృగునందనుడు వధించాడు. క్షత్రియులకెల్ల ప్రళయరుద్రుడైనట్టి, క్షత్రియాంతకుడైనట్టి పరశురాముని రాముడు జయించాడు. మతిలేనివాడై దశకంఠుడు శ్రీరాముని స్వరూపాన్ని తెలుసుకోలేక పోతున్నాడు. మామూలు కోతులు చిన్నచెట్లను కూడా చేతులతో పెకలించి పైకెత్తలేవు. కాని దేవతలంతా వానరవీరుల రూపంలో అవతరించారు. ఇప్పటికైనా ఈ విషయం గుర్తుంచుకొని జానకిని రామచంద్రునికి అప్పగించండి. శివధనుస్సు అతి ప్రచండమైనది. రావణునికి దానిని కదల్చ సాధ్యం కాలేదు. అందరు రాజులు చూస్తుండగా రాముడు దానిని రెండు ముక్కలు చేశాడు. రామచంద్రుడు ఇప్పటికి చాలా దూరం వచ్చి సముద్రం ఆవలి తీరానున్నాడు. ఇప్పటికైనా మంగళజననియైన సీతను రాఘవేంద్రునికి సమర్పించండి. దశముఖా! చిత్రకూటంలో లక్ష్మణుని వింటి గీతను దాటడానికి నీకు ధైర్యం లేకపోయింది. ఇప్పుడేం చేయగలవు? అందువల్ల ఆ త్రిభువనేశ్వరునికి సీతను తీసుకునివెళ్ళి అప్పగించిరండి.

సీతను రఘురామునితో కలిపిన తరువాత బందీలుగా నున్న దేవతలందరిని విడిపించు. దానివల్ల ఆచంద్రార్కం నీ పుత్రపౌత్రులు శుభం పొందగలరు. నా మాటలు నీకు ప్రస్తుతం కఠినంగా తోచవచ్చు. కాని ముందుముందు నీకు దానిలోని మాధుర్యం అమృతత్వం అనుభవమౌతుంది. మందు ఎప్పుడూ

చేదుగా ఉంటుంది. కాని రోగాన్ని త్వరగా తగ్గిస్తుంది. కలకండ గట్టిగా ఉన్నా నమిలితే దాని రుచి మధురంగా ఉంటుంది. అలాగే నా మాటలు కూడా. ఉసిరికాయ తినేటప్పుడు పుల్లగా ఉంటుంది. కాని అది కలిగించే ఆనందం అధికం. అలాగే నా పలుకులు. నా మాటలు విశ్వసించు. దశగ్రీవా! తండ్రి బిడ్డకు ఎన్నో బోధిస్తాడు. అప్పుడు అవి వాడికి విషప్రాయంగా తోస్తాయి. కాని తరువాత అందులోని మధురామృతాన్ని వాడు సంపూర్ణంగా ఆస్వాదిస్తాడు. అశుభశకునాలు లంకలో అధికంగా కన్పిస్తున్నాయి. అనుక్షణం ఉల్కాపాతాలు కలుగుతున్నాయి, ఆకాశం కూడా అదురుతున్నట్టున్నది. మేఘాల జాడ కనిపించడం లేదు. రక్తమే మేఘాల నుండి వర్షిస్తున్నట్లుగా, విధవలు ఒడినిండా మట్టి నింపుకొన్నట్లు, యమధర్మరాజు మంగళసూత్రాన్ని తెంపినట్టు మండోదరికి ఎన్నో దుస్స్వప్నాలు కలిగాయని తెలిసింది.

అందువలన ఓ దశవదనా! నీవు జ్ఞానివై కూడా వేదాలనే ధిక్కరించావు. ఎవరైనా తెలిసి తెలిసి అగ్నిని ఒడిలో మూటకట్టుకుంటారా? దారుణమైన విషమని ఎరిగి ఎందుకు బలవంతంగా గ్రోలడం? పామని తెలిసి తలగడగా పెట్టుకుంటారా? నివురుగప్పిన నిప్పని తెలిసి దానిపై ఎవరన్నా శయనిస్తారా? కడుపుకు బండ కట్టుకొని నీటిలోకి దూకడం సంభవిస్తుందా?' అంటూ విభీషణుడు పలికిన పలుకులకు సభాసదులంతా అవాక్కయినారు. రావణుడు పరమక్రుద్ధుడైనప్పటికీ మౌనం వహించాడు.

ప్రహస్తుడు విభీషణునితో 'మాట్లాడకుండా ఊరకే కూర్చో. సభలో అనుచితాలు మాట్లాడితే మృత్యువు తప్పదు. నీవు రాజబంధువైనా శతమూర్ఖునివలె, బుద్ధిహీనునివలె మాట్లాడావు. నీకు వివేకంగా మాట్లాడడం తెలియకపోతే లేచి ఇంటికి వెళ్ళు' అన్నాడు. ఇంద్రజిత్తు కోపంగా 'నీవు సభలో అనుచితంగా మాట్లాడావు. నిజానికి నిన్ను ఇప్పుడే వధించాలి. కాని



పినతండ్రివని ఉపేక్షిస్తున్నాను' అన్నాడు. తండ్రిని చూచి 'నీ తమ్ముని పక్షపాతం చూచావా? ఇది ఎంతో అనర్థహేతువు' అన్నాడు. బదులుగా విభీషణుడు 'నీవు చండాలుడవు. మహా కపటివి. కృతఘ్నుడవు. దుర్మార్గుడవు. నీతో సాంగత్యం చేసి రాజు మందమతియైనాడు. ఏనుగు అంకుశానికి లొంగుతుంది. పాము మంత్రానికి కట్టుబడుతుంది. రాజుల బుద్ధి, పరమచతురులు, మేధావులు అయిన ప్రధానుల వశమవుతుంది. అగ్నిజ్వాలలను నీటితో ఆర్పివేయవచ్చు కాని దారుణమైన క్రోధాగ్నిని సద్వివేకంతప్ప అదుపు చేయలేదు. రాజు అనుచిత కార్యాలు చేస్తే వెంటనే ప్రధానులు దాన్ని ఖండించాలి. కాని మీరంతా పాపఖనులు, నిర్దయులు, కృతఘ్నులు. రాజు అసలే అతి దుర్మార్గుడు. దానికి తోడు అమంగళులైన ప్రధానులు తోడైనారు. అవివేకం ప్రబలి, దుష్టబుద్ధి కల్లోలమై తాండవిస్తున్నది. ఒకడికి చేతితో నోరు కొట్టుకొనే కోరిక కలగగానే ఫాల్గుణమాసం ప్రవేశించినట్లు, జారునికి స్త్రీ రాజ్యానికి వెళ్లడానికి అవకాశం వచ్చినట్టు, నిరంతరం చాడీలు చెప్పేదొంగకు రాజు వత్తాసు పలికినట్లు, మదిర సేవించేవానికి మద్యపాన సరోవరం లభించినట్లు, దుర్మతులంతా రావణుని పరివేష్టించారు. నీకు దొరికిన ప్రధానులను చూస్తే తోడేలు ఇంట్లో కుక్క పెత్తనం చేసినట్లుంది. నీకు చావు దగ్గరబడింది. కాబట్టే సీతను తెచ్చావు. అయోధ్యాపతి ప్రతాపానికి బలి అయ్యే వేళ నీకు ఆసన్నమయింది. రావణుడు చేయరాని పని చేస్తున్నాడని తల్లి ప్రేరేపించి పంపినందువల్ల వచ్చాను. నీకు నామాటలు మనసుకు హత్తుకుంటాయని చెబుతున్నాను. కాని విధి బలీయమైనది. జరిగేది జరగక మానదు. నీవు ఉన్మాదివి. నా మాటలు రుచించవు. సీతను నువ్వు పంపివేయకపోతే కులక్షయం తప్పదు' అన్నాడు.

ఈ మాటలు విని రావణుడు క్రోధాయమానుడై కత్తి దూసి ఆవేశంతో విభీషణునిపైకురికాడు. విభీషణుడు పరమభక్తుడు. ఆయనకు రక్ష ఆ

రఘునాథుడే. రావణుడు చెయ్యి పైకెత్తగానే కత్తి నేలపై పడింది. తిరిగి రావణుడు వచ్చేంతలో ఇంద్రజిత్తు రావణుని అడ్డగించాడు. కాని రావణుడు ఎడమకాలు విసరగానే అది విభీషణునికి తగిలింది. విభీషణుడు కేవలం శాంతమూర్తి. మత్సర, భేదభావరహితుడు. తిరిగి రావణునితో రఘునాథుని స్నేహం ఎందుకు చెయ్యవని అడిగాడు. విభీషణుడు పూర్ణక్షమాశీలుడు అని రాక్షస గణాలన్నీ వినుతించాయి. ఆ సమయంలో తల్లి కైకసి వచ్చి విభీషణునికి హితం బోధించింది. 'నువ్వు లేచి వెంటనే రఘునాథుని శరణు వేడు. అతడు శరణాగతులకు వజ్రపంజరం వంటివాడు. భవవ్యథలన్నీ హరింపజేస్తాడు. నీవు నా కడుపున పుట్టావు కాబట్టి నన్ను ఉద్ధరించు. త్రికరణశుద్ధిగా ఐహిక విషయాలన్నీ వదిలిపెట్టి జానకీనాథుని శరణుకోరు. రావణుడు వినాశనాన్ని కొనితెచ్చుకున్నాడు. నీవు వెంటనే ఇక్కడినుండి వెళ్ళిపో. ఎవరు బలవంతంగా విషాన్ని భక్షిస్తారో వారి చెంత విజ్ఞులు చేరరు. నీవు రఘుపతి స్నేహం చేస్తే నీకు కల్పాంతంలో కూడా నాశనముండదు' అన్న తల్లి హితవు విని విభీషణుడు తల్లికి సాష్టాంగనమస్కారం చేసి, రావణునితో 'నేను శ్రీరాముని శరణుజొచ్చుతున్నాను. నీవు పెద్దన్నవు కనుక మరల నిన్ను అనుమతి అడుగుతున్నాను అంటూ త్వరగా తన నలుగురు ప్రధానులతో విభీషణుడు ఆకాశానికి ఎగిరాడు. శరీరాన్ని వదిలి పంచప్రాణాలు ఒక్కసారిగా వెళ్ళిపోయినట్లు ఐదుగురు ఆకాశానికి ఎగిరిపోయారు. కల్పాంతంలో పంచ మహాభూతాలు స్వస్వరూపంలో కలిసి పోయినట్లు ఐదుగురు జానకీనాథుని శరణుజొచ్చారు.

శ్రీరామవిజయగ్రంథం సుందరం. అది కేవలం రామేశ్వరం. దీనికొరకు కావళ్ళతో భక్తి నింపుకుని సద్భక్తులు పరువులెత్తుతారు. భక్తి భావమే ప్రయాగగా, ప్రేమే ఉదకంగా ఎవరైతే ఆ రామేశ్వరునికి అభిషేకం చేస్తారో వారి




మనోరథాలను సత్యపాలకుడు, అయోధ్యానాయకుడైన శ్రీరాముడు సంపూర్ణంగా నెరవేరుస్తాడు.

అయోధ్యాధీశా! బ్రహ్మానందా! శ్రీధరవరదా! వేదవంద్యా! నీవు అజ్ఞానాన్ని రూపుమాపి శాశ్వత పదాన్ని అందిస్తావు. స్వస్తి! శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా చతురులైన పండితులు ఆలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఇరువది రెండవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 23

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**ప**ట్టనలవికాని అహంకారమే దశాననుడు. అహందేహబుద్ధియే లంకాద్వీపము. అక్కడ అనుదినం క్రోధమే కుంభకర్ణ సహోదరుడుగా, అనర్థకారకమైన కామమే ఇంద్రజిత్తుగా, మదమే ముఖ్యప్రధాని ప్రహస్తునిగా, మత్సరము దంభమే దేవాంతక నరాంతకులుగా శోకము, మోహము, అనర్థము, భేదము అనబడే పలువురు రాక్షసులతో దుర్మార్గము, కుటిలము, కుతర్కాలన్నిటితో లంక అనే దేహం అలరారుతున్నది. తన బలాన్ని చూపి రావణుడు దేవతలను బందీ గావించాడు. ఆధిదైవతము, ఆధ్యాత్మికము ఆ లంకాదేహంలో బందీలయినాయి. అంత:కరణంలో రమేశుని, మనస్సులో చంద్రుని, బుద్ధికి విరించిని, చిత్తంలో నారాయణుని, కళ్ళలో సూర్యనారాయణుని నాలుకపై రసనాయకుడైన వరుణుని, నాసికా పుటాలలో అశ్వినీ దేవతలను, వాక్కున వైశ్వానరుని, చేతిలో పురందరుని రావణుడు బందీ చేశాడు. ఈ విధంగా దేవతలనందరినీ సేవకులుగా నియమించాడు.

రఘునందనుడు మాయ అనే మృగాన్ని ఛేదించటానికి అడవిలోకి వెళ్ళాడు. కపట శబ్దాలతో వివేకమనే లక్ష్మణుని తరిమివేసి సద్బుద్ధియైన జానకిని హరించి అహంకారం క్షణంలో వెళ్ళిపోయింది. అహం దేహమైన లంకకు తెచ్చి దురాచారం బందీ చేసింది. అప్పుడు వైరాగ్యమనే హనుమంతుడు పరుగున వచ్చి అహం దేహమైన లంకను దగ్ధం కావించి, కామక్రోధాది రాక్షసులను, అహంకారియైన లంకానాథునితో సహా బాధించాడు. సద్బుద్ధి అనే సీతను సమాధానపరచి రాముని తీసుకుని లంకకు వచ్చాడు. సద్భావుకుడైన విభీషణుడు రావణుని నిండు సభలోనే భయపెట్టాడు.



ఆత్మారాముడు, పూర్ణ సద్గురువు అయిన రాముని విభీషణుడు శరణుజొచ్చడం గత అధ్యాయంలో చెప్పుకున్నాము.

### విభీషణుడు శ్రీరాముని శరణువేడడం

కాకుల గుంపును చూచి అసహ్యించుకొని రాజహంస ఎగిరిపోయినట్టు, దుష్టులు, నిందితులు, దుర్మార్గులనుండి సాధువులు దూరంగావుంటారు. అలా ప్రధానులతో సహా విభీషణుడు ఆకాశంలోకి ఎగిరి, భవసింధువును దాటి, గుణసింధు చరణాలను చేరాడు. హిరణ్యకశిపుడు ఎంత బాధించినా ప్రహ్లాదుడు ముకుందుని తన హృదయంలో నిలుపుకున్నట్లు, జానకి హృదయరత్నమైన రాముని సన్నిధికి విభీషణుడు చేరాడు. వానరులు ఆకాశంలోకి చూస్తుండగా, ఐదుగురు రాక్షసులు భూమిపై దిగి సేనలున్నచోట చేతులు జోడించి నిల్చున్నారు. కొందరు వానరులు చెట్లు, రాళ్ళు గైకొని వారిమీదకు పోయారు. అప్పుడు విభీషణుడు 'నేను రావణుని సహోదరుడైన విభీషణుడను. మా అన్న నన్ను అవమానించగా నేను సీతావల్లభుని శరణు కోరడానికి వచ్చాను. ఎవరైతే సనకసనందనాదులకు ఆరాధ్యమూర్తియో, నారదాదులు ఎవరి కీర్తిని సదా గానం చేస్తారో, ఎవరైతే వేదరూపంలోనున్న లతలకు కాచిన పక్వమైన సంపూర్ణఫలమో, విషకంఠుని మనోరత్నమో, పద్మోద్భవుడు నిరంతరం ఎవరిని కొలుస్తాడో, ఎవరైతే శత్రువులనే ఏనుగుల సమూహానికి సింహం వంటివాడో, ఎవరైతే ఖరదూషణాదులను సంహరించాడో, ఎవరైతే పరబ్రహ్మమని వర్ణించే అజఅజిత పూర్ణకాముడో అట్టి బ్రహ్మానందుడు, అయోధ్యాపతి, ప్రతాప సూర్యుడు, దశరథాత్మజుడైన రాముని చరణాలు నాకు చూపించవలసిందని ప్రార్థించాడు.

వ్యాకరణ పండితులు పదాలనుండీ ఎవరి నామానికి అనేక అర్థాలను వెలికి తీసారో, పతంజలి యోగం ద్వారా యోగులు దర్శించే మాయాతీతుడైన

పరమాత్మ ఎవరో, ప్రకృతిపురుషుడని సాంఖ్యశాస్త్రం ఎవరిని గూర్చి ఘోషిస్తున్నదో, అట్టి సూర్యకులభూషణుని, మంగళప్రదాయిని జానకీమాత భర్త పాదాలు నాకు చూపించండి. తార్కికులు, కర్త, ఈశ్వరుడని ఎవరినంటారో, జీవుడికి దరి ఏదో, ముముక్షువులు కర్మాచరణవల్ల పొందే పరబ్రహ్మ ఎవరో, అట్టి పరాత్పరుడు, విశ్రాంతి ధామమైన శ్రీరాముని చరణకమలాలు నాకు చూపించండి' అని విభీషణుడు నోటివెంట శబ్ద రత్నాలు, భక్తి ఆకాశంలో తారలవలె, వైరాగ్యలతకు పూచిన ప్రేమ సువాసనలు వెదజల్లే కుసుమాలవలె వెలువడ్డాయి.

వానరులలో ఒకరు వెళ్ళి రామసుగ్రీవులకు, నలుగురు ప్రధానులతో ఒక రాక్షసుడు వచ్చాడన్న వార్తనందించాడు. రావణుని తమ్ముడు, పేరు విభీషణుడట అని చెప్పాడు. ఈ వార్త విని రాముడు సుగ్రీవుని వంక చూచాడు. సమాధానంగా సుగ్రీవుడు 'అతడు సాత్త్వికుని వలె కనబడుతున్న రాక్షసుడు. అతని అంతరంగం పూర్తిగా తెలియకుండా త్వరపడి దగ్గర చేర్చకూడద'న్నాడు. 'గుడ్లగూబను సేవించి పిదప కాకులు అగ్నిని రగిల్చి వెళ్ళినట్లు విభీషణుడు ఏం చేయబోతాడో అలోచించవలసింది. వాలిని చంపి కిష్కింధను సుగ్రీవునికి పట్టం కట్టారన్న మీ కీర్తిని విని, రావణుని చంపి లంకారాజ్యం తనకిస్తారన్న కోరికతో మీ శరణు జొచ్చాడన్నాడు' జాంబవంతుడు. 'ఆపద సమయంలో ఎవరైనా సోదరులకు సహాయం చేస్తారు. అటువంటి రావణుని వదిలి మీ శరణు వేడాడంటే విచిత్రంగా ఉంది' అన్నాడు సుషేణుడు. వానరులు పలు విధాలుగా వితర్కించుకున్నారు. చివరకు రుద్రావతారుడైన హనుమ ఖండితంగా ఇలా అన్నాడు. 'సీతను వెదకటానికి లంకకు వెళ్ళినప్పుడు నేను అతడి గృహంలోకి ప్రవేశించాను. అతడు సాధు స్వభావి, నిష్కపటి అని నేను గుర్తించాను. మీకు అతడు రాక్షసునిలా కనపడవచ్చు. కాని ఆంతర్యంలో నిర్దోషి, ప్రేమగలవాడు. పనస పైకి ముళ్ళు ముళ్ళుగానున్న లోపల స్వారస్యంగా



ఉంటుంది. వజ్ర పంజరం వంటి మీ శరణుజొచ్చాడు. ఆ రాక్షసుని దగ్గరకు పిలిచి అభయాన్ని ప్రసాదించండి'. ఒక విషయాన్ని గూర్చి ఎన్నో రకాలుగా భాష్యం చెప్పుతారు. కాని వాటి భావం వేదాంతంలోని ఒక్క మాటతో సరిపోతుంది. అలా హనుమంతుడు చెప్పిన సలహాను అందరూ అంగీకరించారు.

అంగదునికి కనుసైగ చేసి సుగ్రీవుడు విభీషణునికై కబురంపాడు. అంగదుడు వాయువేగంతో వెళ్ళి విభీషణునితో నీ భాగ్యం పండింది మిత్రమా! అజితుడు రాజీవనేత్రుడైన రామచంద్రుడు నిన్ను ఆహ్వానించాడని చెప్పి సాధకునికి సద్వివేకంతో స్వస్వరూపాన్ని దర్శింపచేయగల శ్రీరాముని వద్దకు విభీషణుని చేయిపట్టుకుని తీసుకునివచ్చాడు అంగదుడు. చరాచరాలన్నిటికీ ఫలప్రదాయి అయిన శ్రీరాముని చూచి విభీషణుడు జయజయధ్వానాలు చేసి సాష్టాంగ ప్రణామం చేశాడు. శ్రీరామచంద్రుని కరుణాదృష్టిని పరికించి విభీషణుని భావసముద్రం ప్రేమభరితమై అపారంగా పొంగిపొరలింది. శ్రీరాముని చరణారవిందాల లోని మకరందాన్ని విభీషణుడు భ్రమరంలా ఆస్వాదించాడు. అష్టభావాలూ ముప్పిరిగొనగా గద్గద కంఠంతో ఆనందమయుడైనాడు. రామపాదాలపై శిరస్సునుంచగా బ్రహ్మాండనాయకుడు, అక్షయ కళ్యాణ ప్రదాయకుడు సంతసంతో శిరస్సుపై తన వరదహస్తాన్నుంచాడు. 'ఎంతవరకు సూర్యచంద్రులుంటారో, ఎంతవరకు రామకథ ధరిత్రిపై నుంటుందో అంతవరకూ నీవు, బలి ధ్రువుల వలె చిరంజీవివై లంకానగరాన్ని పాలిస్తావు. చిరంజీవియై వాయునందనుడున్నంతవరకు ఈ కలికాల బంధనాలకతీతంగా నీవు లంకలో సుఖంగా వసిస్తావు!' అని ఆశీర్వదించి శ్రీరాముడు విభీషణుని ప్రేమగా ఆలింగనం చేసుకున్నాడు. వానరులంతా ఆనందించారు. సౌమిత్రి, అష్టదిక్పాలకులు విభీషణుని కలుసుకోగా దేవతలు పుష్పవర్షం కురిపించారు.

విభీషణుడు చేతులు జోడించి శ్రీరాముని ఎదుట నిలబడి 'కరుణాసముద్రా! జగదుద్ధారా! దీనబంధూ! నీకు జయ'మంటూ జయజయధ్వానాలు చేశాడు. 'రామా! కమలపత్రాక్షా! హే తాటకాంతకా! సర్వసాక్షీ! మఖపాలకా! నిర్వికల్పవృక్షా! కర్మాధ్యక్షా! కర్మమోచకా! నీకు జయము. జయరామా! శివధనుర్భంజనా! దశకంఠదర్పహరణా! హేరామా! విషకంఠదాహశమనా! భక్తరంజనా! జగద్వంద్యా! పద్మజాతజనకా! విబుధబంధచ్ఛేదకా! దుష్టఅసురాంతకా! ఆదిశేషునికి కూడా నిన్ను వర్ణించనలవికాదు' అని అలా విభీషణుడు స్తుతించగా సీతాపతి ఎంతో గౌరవంగా విభీషణుని చేతిని పట్టుకుని ప్రేమగా తన పక్కన కూర్చుండబెట్టుకున్నాడు. రాముడు ఆనందంగా విభీషణుడు నా ఐదవ తమ్ముడు అని చెప్పగా వానరులంతా విభీషణుని అదృష్టాన్ని కొనియాడారు. యథావిధిగా నాలుగు సముద్రాల నుండి నీటిని తెప్పించి రాముడు విభీషణుని కూర్చుండబెట్టి లంకాపతిగా పట్టాభిషిక్తుని గావించాడు. లంకానగరంలోని రాజులందరూ వచ్చి విభీషణుని దీవించారు. ఆ సమయంలో హనుమ ఇసుకతో విశాలమైన లంకను తయారుచేశాడు. కపులంతా బయట నిలబడగా రాముడు విభీషణుని చేయిపట్టుకుని అక్కడకు వచ్చాడు. మా హనుమంతుడు చేసిన లంకముందు ఆ లంక కూడా దిగదుడుపే అంటూ పరమప్రీతితో సీతారమణుడు మారుతి నిర్మించిన లంకను ప్రశంసించాడు.

ఆపైన విభీషణునితో జానకీరమణుడు సాగరాన్ని ఎలా దాటాలో ఉపాయం చెప్పవలసింది అని అడిగాడు. సముద్రుని ప్రార్థించి, వానరులందరూ సముద్రాన్ని దాటుటకు మార్గాన్ని అడగడం మంచిదన్నాడు విభీషణుడు. సముద్రతీరంలో రవికులభూషణుడైన రఘునందనుడు దర్భాసనంపై ఆసీనుడై సాగరుని దారి వదలమని ప్రార్థించాడు. అన్నపానీయాలు విసర్జించి నిరాహారియై హిమగిరి జామాతయైన ఈశ్వరుని సీతారమణుడు ధ్యానించాడు.



అక్కడ జరిగినవన్నీ పూసగుచ్చినట్టుగా రావణుని గూఢచారియైన శార్దూలుడు రావణునికి నివేదించాడు. ప్రతాపసింధువు, రవికులభూషణుడైన రఘురాముడు అపారమైన వానర సముదాయాన్ని తీసుకుని సముద్రం ఆవలిఒడ్డున విడిది చేసాడని చెప్పాడు. ఆ సమాచారం విని రావణుడు చింతాక్రాంతుడై శుకుడనే రాక్షసుని పిలిచి, నీవు వెళ్ళి సుగ్రీవునితో 'నీవు మా సహోదరుడవు. సీతను గురించి నీవు రావటానికి కారణమేంది? వెంటనే తిరిగి వెళ్ళిపోవలసింది' అని చెప్పమన్నాడు. వెంటనే శుకుడు చిలకరూపంలో సముద్రాన్ని దాటి, ఆకాశంలో నిలబడి ధైర్యంగా ఇలా అన్నాడు. 'ఓ వానరేశ్వరా! నా మాటలు విను. రావణుడు నన్ను పంపాడు. నీవు మర్కటసేనను తీసుకొని వెంటనే తిరిగి వెళ్ళు. మేము సీతను ఎత్తుకొని వచ్చాము. నీవు ఇక్కడకు రావడానికి గల కారణమేముంది? ఊరకే ప్రాణాలు పోగొట్టుకోకు. వెంటనే కిష్కింధకు తిరిగి వెళ్ళు. వెళ్ళకపోతే నీ శిరస్సును ఛేదించి లంకకు తీసుకెళ్తాను' అని హెచ్చరించాడు. రాక్షసుడైన శుకుని మాటలు విని వానరులు పరమక్రుద్ధులై పరుగున వెళ్ళి వానిని పట్టుకొని ఈడ్చి నేలపై పడవేశారు. ఏనుగులన్నీ కలిసి పిల్లిపై దండెత్తినట్లు ముష్టిఘాతాలతో ఆ అసురుని చావబాదారు. దాంతో వాడు ఊపిరి తిప్పుకోలేక 'రాఘవా! నన్ను వీరి బారి నుండి కాపాడు' అని ప్రార్థించాడు. కృపాసాగరుడైన రఘునందనుడు ఆ వైపు దృష్టిసారించాడు. లక్ష్మణుడు అది గమనించి త్వరగా వానిని విడిపించమని చెప్పగా వానరులు వెంటనే విడుదల చేశారు. ఆ అసురుడు వెంటనే గగనానికి ఎగిరి వెళ్ళబోయే ముందు 'ఓ కిష్కింధాపతీ! నీవు వెంటనే ఇక్కడినుండి వెళ్ళిపో! రాముని సాంగత్యం వలదు. దేవతల బుద్ధి చంచలమైనది. ఈశ్వరుడు మన్మథుని భస్మం చేయలేదా? రఘునాథుడు నిన్ను వధించడానికే ఇక్కడకు తీసుకొొచ్చాడు. మీ వానరులు శతమూర్ఖులు. మీకు మంచి చెప్పినా తెలుసుకోరు' అన్నాడు. ఋషభుడు 'ఒరే! శుకా! దుర్బుద్ధితో మలినమైన మశకమా! నీవు వెళ్ళి

రావణునితో సీతను వెంటనే విడిచిపెట్టమని చెప్పు. నీవు మాకు నిజంగా శత్రుసమానుడవే! నిన్ను వధించడానికే రఘువీరుడు ఇక్కడకు వచ్చాడు. నీ పదితలలూ ఖండించి పదిదిక్కులకు బలి ఇస్తాడు అని రావణునికి చెప్పు' అన్నాడు. బదులుగా శుకుడు సుకుమారియైన సీత ఇక మీకు కనిపించదు. ఆమె కోసం ప్రయత్నించడం వృథాగా కష్టపడినట్లవుతుంది. ఈ మాటలు విని అంగదుడు వాడిని తిరిగి పట్టుకోండి అన్నాడు. వెంటనే వానరులు ఎగిరి పట్టుకుని చావబాదారు. కాళ్ళుచేతులు కట్టి శుకుని బంధించారు.

అక్కడ రఘునందనుడు సముద్రుని దారిచూపమని అడిగి మూడురోజులు అయింది. గుణసముద్రుడు, రఘునాథుడు ఎంత ఓపికగా ఎదురుచూచినా సముద్రుడు ఉన్మత్తస్థితిలోనే ఉండి పోయాడు. సముద్రుడు సగరునిచే అవతరణుడయ్యాడని నేను ఎంతో ఆదరించాను. కాని సముద్రునికి యథార్థం బోధపడలేదని రాముడెంతో క్షోభిల్లాడు. 'లవణజలాలలోని విషం కారణంగా పొడవైన సర్పాలెన్నో సముద్రంలో విస్తరించి ఉన్నాయి. ఒక్క గరుడాస్త్రం వీటన్నింటినీ అరక్షణంలో మింగివేస్తుంది. నా బాణం బడబానలంతో సమానం. జ్ఞానం రాగానే అజ్ఞానం మటుమాయమయినట్లు క్షణంలో సముద్రజలాలన్నీ ఇంకిపోతాయి. నా బాణం అగస్త్యుడే. సూర్యుడుదయించగానే చీకటి మటుమాయమయినట్లు క్షణంలో జలమంతా ఆవిరైపోవలసిందే' అంటూ అక్షయమైన సాగరాన్ని చూచి ప్రళయరుద్రుడు క్షోభిల్లాడు. ఒక్క క్షణం ఎదురుచూచాడు రఘునందనుడు. ధనుస్సుకు బాణాన్ని సంధించటానికి అరక్షణం పట్టలేదు. బాణానికి బ్రహ్మాస్త్రాన్ని జోడించి ఆకర్ణాంతం నారిని సారించగా ఆ శబ్దానికి బ్రహ్మాండమంతా దద్దరిల్లింది. జలచరాలు, ఖేచరాలు మూర్ఛిల్లాయి. చీకటి ముగియగానే ఉదయాద్రిన సూర్యుడుదయించినట్టు దివ్యరూపంతో సముద్రుడు సరిత్సమేతంగా ప్రత్యక్షమయినాడు. రాఘవుని చరణాలకు నమస్కరించి 'రాజీవాక్షా! రఘునందనా! స్మరారిమిత్రా!



ఆనందసదనా! జానకీజీవనా! రఘుపతే! నీవు కృపాసముద్రుడవు! రఘువీరుడవు! నా అలలు భయంకరంగా ఉన్నాయని నామీద అన్యాయంగా బాణం వేయవద్దు. గర్వహరణా! నా స్వభావమే గర్జించడం. అంతేకాని నీ ముందు గర్వించడం ఎన్నటికీ అసంభవం' అని వేడుకున్నాడు. రఘునందనుడు ఒకసారి వింటిని సంధించిన తరువాత తిరిగి తీసుకొనే ప్రసక్తేలేదు. అందువల్ల వేరే మార్గమేదైనా చెప్పమన్నాడు. అప్పుడు సరిన్నాథుడు పశ్చిమంలో మరుదైత్యులున్నారు. వారు నాలోని జలచరాలన్నిటినీ భక్షిస్తున్నారు. ఎల్లప్పుడు గోబ్రాహ్మణులను హింసిస్తున్నారు. వారిపై బాణం వేయవలసిందని కోరాడు. బాణం క్షణంలో కల్పాంతంలోని మెరుపులా వెళ్ళి జలచరాలను వధించే మరుదైత్యుల శిరస్సులను ఛేదించింది. అక్కడ జలమంతా ఇంకిపోయి మార్వాడ దేశంగా ఏర్పడింది. తదుపరి కాలంలో అక్కడ నీరు తక్కువగా ఉన్నా వృక్షాలన్నీ ఎల్లప్పుడూ ఫలభరితంగా ఉండేవి.

ఇక్కడ సాగరుడు పూజాద్రవ్యాలన్నీ తెచ్చి ఘనశ్యామగాత్రుడు అపర్ణావరుని మనోరంజనుడైన, రఘునందనుడైన శ్రీరామచంద్రుని అల్లుని ఆదరించినట్టుగా ఆదరంతో పూజ చేసి సంతృప్తుని గావించాడు. దివ్యాలంకారాలను, దివ్యవస్త్రాలను, అమూల్యమైన, ప్రకాశవంతమైన రత్నాలను రాఘవునికి సమర్పించాడు. అయోధ్యానాథునితో సాగరుడు 'ఈ వస్త్రాభరణాలన్నీ స్వీకరించవలసింది. శత్రువు ముందు రాజులు నారచీరలు ధరించుట తగదు అన్నాడు. 'అయోధ్యానాథా! నృపవరా! వీనిని స్వీకరించి సమరాంగణంలో దశకంఠుని ముక్కలుముక్కలు చేయవలసింది' అన్నాడు. యుద్ధం చేయడానికి ఇంద్రుడు దివ్యరథాన్ని పంపాడు. సుగ్రీవాది వానరులందరూ రఘూత్తమునితో స్వామీ! మీరు దివ్యవస్త్రాభరణాలను ధరించాలని మా అందరి మనస్సులలో కూడా ఉన్నది అని మనవి చేశారు. భక్తుల ప్రార్థనలను మన్నించాడు కోదండపాణి. రాఘవుడు పీతాంబరాన్ని ఉత్తరీయాన్ని ధరించి దేదీప్యమానమైన

సూర్యునివలె, కల్పాంతంలోని మెరుపువలె ప్రకాశించాడు. జడలన్నీ సరిచేసుకొని అందమైన కిరీటాన్ని ధరించాడు. అపారమైన ఆ తేజస్సుకు పదిదిక్కులూ చాలలేదు. ప్రళయకాలంలోని ప్రభంజనంవలె, శుక్రాచార్య, బృహస్పతులవలె కర్ణకుండలాలు కాంతులీనాయి. రాఘవుని మెడలోని ముత్యాలమాలలు ఊగడం, ముత్యాల రూపంలో అనంత బ్రహ్మాండాలన్నీ ఊగుతున్నాయా! అన్నట్లుంది. ముత్యాలు ఎంతో ప్రకాశమానంగా ఉన్నాయి కాని శ్యామలాంగుడైన రఘుపతి శరీరచ్ఛాయవల్ల వాటి రంగు ఇంద్రనీలాలుగా గోచరిస్తున్నాయి. నిష్కళంకుడైన చంద్రునిలాంటి హృదయఫలకంపై పతకం విరాజిల్లుతున్నది. కటిబంధనం తేజస్సు చూచి సూర్యుడే మైమరిచినట్లుంది. జటిలమైన వేదార్థాన్ని స్వరం సుబోధం చేసినట్లు, కటిబంధనంలోని గంటలు చిన్నవే అయినా సుమధురమైన రవళుల్ని వినిపిస్తున్నాయి. వాడి కిరణాలవలె చేతిలోని ముద్రిక తళతళా మెరుస్తున్నది. అసురులపై ప్రతాపం చూపడానికి కాలి అందియలు ఉత్సాహంగా ఘల్లుమంటున్నాయి. అందమైన నీలాకాశంలా పరిశుద్ధమైన మందాకినీ ప్రవాహంలా, వసివాడని పూలహారంతో శ్యామలాంగుడు ప్రకాశించాడు. దివ్యగంధంతో, సుందరపుష్పాలతో కోదండరాముని సాగరుడు పూజించాడు. అలాగే లక్ష్మణుని కూడా వస్త్రాలంకారాలతో గౌరవించాడు.దేవతలు జయజయారావాలతో పుష్పవృష్టి కురిపించారు. వానరుల హుంకారాలతో, గర్జనలతో ఆకాశం దద్దరిల్లింది.

## సేతుబంధనం

జగదాత్మ సర్వానందనిలయుడైన రఘువీరుడు, రాజీవనేత్రుడు, ఈ సైన్యమంతా లంకలోని త్రికూటపర్వతానికి చేరడానికి త్వరగా ఉపాయం చెప్పవలసిందని సాగరుని అడిగాడు. దానికి సముద్రుడు 'నలుడనే వానరానికి ఋషి ఇచ్చిన వరమొకటున్నది. నలుడు బాల్యంలో సాలిగ్రామాలను నీళ్ళలో వేసేవాడు. అప్పుడు ఋషి నీ చేతితో ఏ రాళ్ళువేసినా నీళ్ళలో తేలుతాయి



అని వరమిచ్చాడు. అందువల్ల త్రికూటాచలం వరకూ నలుని హస్తాలతో సేతుబంధన చేయవలసింది' అని చెప్పి ఆజ్ఞగైకొని సరిన్నాథుడు తన స్వస్థలానికి వెళ్ళాడు. తదుపరి కౌసల్యానందనుడు నలుని రావించి ఇలా అన్నాడు 'నీళ్ళలో రాళ్ళువేస్తే తేలే వరదానం ప్రసాదించినందున ఆ ఋషి ధన్యుడైనాడు. నీవంటి తనయుని కని నీ తల్లి ధన్యయైనది. స్నేహశీలివై నీ సామర్థ్యాన్ని ప్రదర్శించు'. రఘువీరుడు మాటలాడుతుండగానే వానరులు హుంకారాలతో గర్జిస్తూ, పాషాణాలు, పర్వతాలు అపారంగా తెచ్చి సముద్రజలాలలో పడవేశారు. నలుని హస్తం వాటిని తాకగానే అవి కట్టెలవలె, సొరకాయలవలె, ఒకదానిపై ఒకటి పేర్చినా సముద్రంలో తేలసాగాయి. సద్గురు కృపవలన భవసాగరం నుండి జీవులు తరించబడ్డట్లు, నలుని స్పర్శ వలన పాషాణాలు నీటిపై తేలియాడాయి. పదునెనిమిది పద్మాల వానరులు, డెబ్బైకోట్ల భల్లూకవీరులు పర్వతాలు, పాషాణాలు, వృక్షాలు అసంఖ్యాకంగా తేసాగారు. అనూహ్యమైన ఎన్నో పర్వతాలను, వాటిపైనున్న గ్రామాలను తటాకాలతో సహా ఎత్తుకొని పరుగున రాసాగారు. వానర సైన్యమంతా పరుగులిడుతున్నారు. భూమిపై నడిచే వారొక్కరు కూడా కనబడటం లేదు. లక్షల, లక్షల పర్వతాలు లెక్కలేకుండా నీళ్ళలో వేస్తున్నారు. రామకార్యం కొరకు హనుమంతుడు విశాలరూపం ధరించి విచిత్రగతిలో మందరాచలానికి వెళ్ళాడు. అక్కడ నుండి ఎన్ని పర్వతాలు తెచ్చాడో మూలకావ్యాన్ననుసరించి చెప్తాను వినండి. నాలుగులక్షల పర్వతాలు తోకతో చుట్టుకొని, ఆరు లక్షల శిలలు నెత్తిపై పెట్టుకొని, రెండులక్షలు చేతులతో, ఎన్నో పర్వతాల పంక్తులను భుజాలపై పెట్టుకొని వాయువేగ, మనోవేగాల కంటే ముందుగా ఆకాశమార్గాన పరుగున వచ్చాడు. వానరులు అమితంగా శ్రమించి, మెల్ల మెల్లగా నిద్రలోకి జారేవారు. కాని హనుమంతుడు శ్రమరహితుడై అసంఖ్యాకమైన పర్వతాలను కుప్పలు కుప్పలుగా

పడవేయసాగాడు. అసంఖ్యాకమైన పాషాణాలను సముద్రంలో పడవేయడం చూచి అయోధ్యానాథుడు అచ్చెరువొంది 'హనుమా! నీ బలం ధన్యమైంది' అన్నాడు.

మొదటిరోజున నలుడు అద్భుతరీతిలో పదునాలుగు గ్రామాల పొడవున సేతువును నిర్మించాడు. కాని నా వల్ల ఈ పాషాణాలు తేలుతున్నాయన్న గర్వం మిక్కుటమైంది. కన్నుమూసి తెరిచేలోగా ఒక చేప వచ్చి ఆ సేతువునంతా మింగేసింది. సూర్యుడుదయించేసరికల్లా అక్కడ సేతువు లేదు. రావణుడు సేతువును ధ్వంసం చేసాడేమోనని సుగ్రీవాది వానరవీరులు తర్కించసాగారు. కానీ సేతువు లేని కారణం రఘుపతికి మాత్రమే ఎరుక.

శ్రీరాముడు శరభుని పిలిచి ఆ తిమింగలాన్ని వెంటనే రప్పించాడు. ఆ తిమింగలంతో శరభుడు సేతువును వెతికి త్వరగా తీసుకునిరా! లేకపోతే రఘుపతి నీకు గట్టి శిక్ష వేస్తాడు అన్నాడు. సమాధానంగా ఆ తిమింగలం రాఘవునితో 'నేను మీ దర్శనానికి వచ్చేటప్పుడు నన్ననుసరించి చిన్నపిల్లలు కూడా వచ్చారు. పసితనం వల్ల వాళ్ళు తెలియక సేతువును మింగేసారు. నేను దాన్ని తిరిగి క్షణంలో నిర్మిస్తాను. లేకపోతే నా వీపునే సేతువుగా చేస్తాను' అన్నది. రఘువీరుడు చిరునగవుతో 'పిల్లలు మంచి అద్భుతాన్ని గావించారు' అన్నాడు. గర్వోపహతుడైన నలుడు అధోవదనుడై నేలచూపులు చూచాడు. ఇది ఇలా ఉండగా మత్స్యబాలలు సేతువును వెలికి గ్రక్కి పూర్వస్థలంలో తెచ్చిపెట్టారు. ఆ తదుపరి నలుడు విశాలమైన ఆ సేతువును నిర్మించసాగాడు. కాని నీళ్ళలో పడ్డ రాళ్ళను వెంటనే చేపలు మింగేసేవి. చేపలు పర్వతాలను మింగగా నలుడు నిస్సహాయుడై చూస్తుండిపోయాడు. ఆ తరి, మత్స్యరూపియైన నారాయణుడు జలచరాలతో 'నేను, రఘువీరుడు వేరువేరుగా కన్పిస్తున్నా ఇద్దరిదీ ఒకటే రూపం. సేతుబంధనానికి ఎలాంటి ఆటంకం కలుగచేయవద్దు.



నలునికి సహాయంగా మీ వీపు కూడా మొత్తం ఈ పనికే వినియోగించండి' అన్నాడు. అంతటితో మత్స్యాలు పర్వతాలను మ్రింగటం చాలించాయి. ఆ సమయంలో ఇదంతా చూడటానికి ఎంతో అద్భుతంగా వుంది. కాని ఆ మత్స్యాలు పర్వతాలను, శిలలను ఎత్తి దూరంగా తీసుకునివెళ్ళేవి.

ఇదంతా చూచి నలునికి ఏం చేయాలో తోచక మతిపోయి అవాక్కయినాడు. హనుమంతుడు నలునితో 'సఖా! నీకు కొంచెం కూడా గర్వం తగదు. అన్నిటికీ కర్త రఘునాథుడు. అలాంటప్పుడు నీకు గర్వమెందుకు? స్తంభాలు లేకుండా ఆకాశం నిలబడింది. నీళ్ళపై భూమి తేలియాడుతున్నది. సూర్యచంద్రులు, తారలు, వాయువు వీటన్నింటినీ నడిపే వాడెవ్వడు? అనంతమైన బ్రహ్మాండాలను ధ్వంసం చేసి వెంటనే సృష్టించడానికి క్షణం పట్టదు. అటువంటి రాముని ముందు జీవుడు గర్వపడడం భావ్యమా? సూర్యుడుదయించగానే చంద్రుడస్తమిస్తాడు. మిణుగురుపురుగు తేజస్సు వలన జగత్తు ప్రకాశిస్తుందా? అందువలన గర్వం విడనాడు. నీకొక రహస్యం చెబుతాను మనస్సులో ఉంచుకో. ఒక శిలపై 'ర' కారాన్ని గీచి దానికి దీర్ఘాన్ని ఇవ్వు. రెండవ శిలపై 'మ' కారాన్ని గీయి. అదే రెంటినీ ఏకం చేస్తుంది. నీవు పవిత్రమైన రామనామాన్ని సేతువుపై ఎలా వ్రాయమంటావు? అని అడుగుతావు. కపులు పాదాలతో తొక్కుతారని నీ మనస్సులో అనుమానంగా ఉంది. ఈ భేదాలన్నిటికి కారణమైన నీ అభిమానాన్ని వదలిపెట్టు. ముఖ్యంగా సదా రామనామాన్ని స్మరిస్తే హృదయంలో అభేదం సర్వత్రా ప్రకాశిస్తుంది. అలాగే పాషాణాలను చూసినా ఏమాత్రం భేదం కనిపించదు. గొడ్డలి పెట్టులాంటి తీక్ష్ణమైన హనుమ పలుకులతో నలుని అభిమాన తరువు సమూలంగా ఛేదించబడి ఆ విధంగా సేతువు నిర్మించాడు. శ్రీరామనామస్మరణ చేస్తూ నలుడు చిన్న పెద్ద ఎక్కువతక్కువగా ఉన్న రాళ్ళను జోడించినా కూడా ఎలాంటి భేదం కనబడలేదు.

ఈ కావ్యంలో హనుమంతుని మనోభావాన్ని విజ్ఞులే తెలుసుకొనగలరు. సేతుబంధనంలో వాస్తవంగా నలుడు రాళ్ళపై రామనామాన్ని వ్రాయలేదు. సాగరంలో పాషాణాలు నావలాగా నీటిపై తేలాయంటే అది రాముని గుణవిశేషమే. ఈ సంఘటన రాముని అద్భుత మహిమను ప్రకటంచేస్తుంది. సేతుబంధన నిమిత్తం రాముడు నలుని సృష్టించాడు. భక్తవత్సలుడైన రఘునందనుడు తన మహిమ ద్వారా దాసుల నైపుణ్యాన్ని ఇనుమడింపచేస్తాడు. అలా ఐదురోజులలో త్రికూటపర్వతం వరకు వంద యోజనాల పొడవు, పది యోజనాలు వెడల్పు గలిగిన సేతువును నిర్మించారు. ఇదంతా ఆకాశం నుండి దేవతలు తిలకిస్తున్నారు. సేతువు ఆదిశేషువులాగున్నది. నలుడు సేతువును పూర్తిచేసాడన్న వార్త రఘుపతికి వానరులు నివేదించారు. నలుని రావించి రఘురాముడు పరమప్రీతితో 'మిత్రమా! అసంభవమైన కార్యం నీవల్ల సంభవమైంది. ఆ అద్భుతకార్యంతో నీ జన్మ ధన్యమైనది. నీ కీర్తి ముల్లోకాల్లో నిండిపోతుంది' అని హృదయానికి హత్తుకున్నాడు. తదుపరి రాముడు త్రికూటాచలానికి వెళ్లటానికి సిద్ధం చేయమన్నాడు. నలుడు సంకేతమివ్వగానే వానరసమూహం గావించిన కోలాహలానికి భూగోళమంతా దద్దరిల్లింది.

సుముహూర్తంలో రామలక్ష్మణులు దశయోజన విస్తీర్ణమైన వానరసేనతో బయలుదేరారు. వానరులు సేతువుపై నడుస్తూ కొసలోనున్నవారు నీటిలో పడిపోతే వెంటనే నీటిలో పల్టీకొట్టి ఎగిరి వచ్చి స్వస్థలంలో చేరేవారు. రఘువీరుడు పాదచారియై పోవడం గమనించి హనుమంతుడు, సుగ్రీవుడు పరుగున వచ్చారు. సుగ్రీవుడు ఎలాంటి కుటిలభావం లేకుండా వినోదంగా నవ్వుతూ ఇలా చేస్తే ఏదో విపరీతం జరుగబోతుందని తోస్తున్నది. మీ పాదాలు సోకి సేతువునందలి శిలలన్నీ ఉద్ధరింపబడి అహల్యవలె అబలలై వానరులను కౌగిలించుకుంటారు అన్నాడు. రఘునందనుడు వెంటనే హనుమంతుని భుజస్కంధాల నధిరోహించాడు. లక్ష్మణుడు అంగదుని భుజస్కంధాలపై



కూర్చున్నాడు. ఉదయాద్రిపై బాలసూర్యునిలా వారు శోభిల్లారు. నాలుగు ఘడియల లోపలే రఘునందనుడు త్రికూటాచలానికి చేరాడు. చుట్టుముట్టిన అపారమైన వానరసేనను చూచి లంకానగరం తల్లడిల్లింది.

శుకుని చేతిబంధనాలు చూచి, రాఘవుడు శుకుని వదలివేయమని ఆజ్ఞాపించాడు. శుకుడు రాఘవుని చరణాలకు నమస్కరించి లంకకు తిరిగి వెళ్ళాడు. అక్కడ రావణుని సముఖంలో రఘురాముని పరాక్రమాన్ని అద్భుతంగా పొగిడాడు. 'సరిత్సహితంగా సముద్రుడు ప్రత్యక్షంగా రాముని కలిసాడు. నీళ్ళల్లో పాషాణాలను తేలేట్లు చేసిన రఘునందనుని ప్రతాపానికి జోహార్లు. మృత్యువునే లెక్కచేయని పరమ శక్తిమంతులు వానరగణాలు. మీ సందేశాన్ని సుగ్రీవునికి చెప్పేటంతలోనే పరుగున వచ్చి నన్ను పట్టుకొని నేటి వరకు బంధించారు. కరుణాసాగరుడైన రాముని దయవలన నేను విడిపించబడ్డాను. ఓ రాజా! జానకిని తీసుకెళ్ళి రామునికి సమర్పించవలసింది. రఘురాముని స్నేహం చేసిన వారికి ఆచంద్రార్కం శుభం కలుగుతుంది' అన్నాడు.

ఈ మాటలు విని రావణుడు క్షోభిల్లి, 'వాళ్ళు కొట్టిన దెబ్బలకు నీవు చాలా భయపడ్డావు. అందువలననే నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావు. శత్రువు ప్రతాపాన్ని నా ముందు పొగిడిన నీకు మరణం తప్పదు' అంటూ శుకసారణులతో 'మీరు వెంటనే త్రికూటాచలం వెళ్ళి రాముని సైన్యం వివరాలు త్వరగా తేవలసింది. వానరులలో ముఖ్యులు ఎవరెవరు? ఒక్కొక్కరి ఆదేశంలో ఎంత సైన్యం ఉంది? అని తెలుసుకుని మిమ్ములను మీరు రక్షించుకుంటూ త్వరగా రండి' అని ఆదేశించాడు. ఆజ్ఞకు బద్ధులై వారిరువురు మరుక్షణంలో వానరవేషధారులై వానరసైన్యంలో కలిసి యథేచ్ఛగా తిరుగాడసాగారు. సైన్యం సమాచారమంతా సేకరించి అయోధ్యానాథుడున్న సభామంటపాన్ని దూరంగా నిలబడి గమనించసాగారు. ఆ సమయంలో విభీషణుని దృష్టి అకస్మాత్తుగా వారిపై పడింది. పరుగున వెళ్ళి క్షణంలో వారిని పట్టుకుని రాఘవుని వద్దకు

తీసుకునివచ్చాడు. వీరు రావణుని గూఢచారులు. మన సేన వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకోవడానికి వానరవేషధారులై యథేచ్ఛగా తిరుగుతున్నారు. సున్నం రాసుకుని కాకి రాజహంసలా తిరిగినట్లు, దారి దోపిడీదొంగలు బ్రాహ్మణ వేషధారులై సంచరించినట్లు, దుర్జనులు మంచివారిలా నటించినట్లు, పరీక్షకులు మంచి నుంచి చెడును ఏరి తీసినట్లు, వానరవేషంలో వచ్చినా విభీషణుడు వారిని పట్టుకున్నాడు. రాజాధిరాజైన రఘురాముడు చిరునగవుతో వీరికి సమస్త సైన్యాన్ని చూపించండి అని ఆజ్ఞాపించాడు. ఇక్కడి సమాచారమంతా దశవదనుడికి నివేదించమన్నాడు. బదులుగా శుకసారణులు 'రఘునందనా! మఖపాలనా! విశ్వేశా! నీ మహిమ గూర్చి విన్నాము కానీ ఈ రోజు కనులారా గాంచాము' అని పలికి శ్రీరాముని అనుజ్ఞ గైకొని తిరిగి వెళ్ళారు.

వేగులిద్దరూ వచ్చిన తరువాత రావణుడు గోపురం పదహారవ అంతస్థుకు వెళ్ళాడు. సేవకులంతా చుట్టూ చేరారు. వేగులతో రావణుడు శత్రుసైన్యంలో ఎవరెవరో ఇక్కడినుండి వివరంగా చెప్పండి అన్నాడు. సమాధానంగా వారిరువురూ సంకేతాలతో వానరసేనంతా పదియోజనముల నిడివితో లంకచుట్టూ విడిది చేశారు. ఒక్కొక్క వీరుడు అసమానమైన పరాక్రమము గలవాడు. వానరసముద్రం మధ్యలో మల్లయోధులు నిలిచి ఉండగా తమాలనీలుడైన రాముడు వస్త్రాభరణాలతో దేదీప్యమానంగా వెలుగుతున్నాడు. బంగారు వన్నెవలువల్లో కనపడేవాడే రఘురాముడు. సుగ్రీవుని తొడపై తలను పెట్టి ఇష్టాగోష్ఠి జరుపుతున్నాడు. లంకానగరాన్ని తగులబెట్టి వెళ్ళినవాడు, రఘువీరుని వెంటబెట్టుకొని వచ్చినవాడు వాయుకుమారుడైన హనుమంతుడు రాముని పాదాలు వత్తుతున్నాడు. మీ తమ్ముడైన విభీషణుడు రాఘవుని దగ్గర కూర్చుని జరిగిన సంగతులన్నీ రామునికి వినిపిస్తున్నాడు. సూర్యునివలె దేదీప్యమానంగా ప్రకాశిస్తూ రాముని వెనకున్నవాడే సౌమిత్రి. ఆవల



మహాపురుషుడైన అంగదుడు మనవైపే కోపంగా చూస్తున్నాడు. వాని తర్వాత వైద్యుడు, మహావీరుడు, సుగ్రీవుని మామ అయిన సుషేణుడు. అతని అధీనంలో ఇరవైకోట్ల వానరసైన్యం ఉంది. తదుపరి భల్లూకవీరుడైన జాంబవంతుడు డెబ్బైరెండుకోట్ల సైన్యానికి నాయకుడు. ఆ తరువాత సేనాధిపతి నీలుడు. అతడి సామర్థ్యం అపారమైనది. ఆ తరువాత శిలలతో సముద్రంపై సేతువు నిర్మించిన ధీశాలి నలుడు. బలసముద్రుడు, పర్వతాకారులైన శరభుడు, ఋషభుడు యుద్ధం కోసం ఎదురుచూస్తున్నారు. ఇక మిగతా వానరగణాల పేర్లు, బలసముద్రులైన వారి వివరాలు మీకు సంపూర్ణంగా చెప్పాలంటే, ఆ వివరాలను వ్రాయటానికి ఈ భూవైశాల్యం చాలదు. అందువల్ల ఓ రావణా! మొత్తంమీద వాళ్ళతో యుద్ధం చేయాలంటే యముడే సరిపోడు. ఇక యితరుల విషయం ఏం చెప్పగలం? శుకసారణుల మాటలు విని రావణుడు అత్యంత క్రోధంతో మిమ్ములను శిరశ్ఛేదనం చేయాలనిపిస్తున్నదన్నాడు. వాళ్ళు 'రాజా! మేము మీ గూఢచారులము. మేము అబద్ధం చెపితే మమ్ములను దండించాలి' అన్నారు. ఇక్కడ విభీషణుడు అందరికీ చూపుడు వేలితో దూరంగా గోపురం పైనున్న రావణుని చూపించాడు. పదితలలకు పది గొడుగులతో పదికిరీటాలు సూర్యకిరణాల్లా వెలిగిపోతున్నాయి. సేవకులు చామరాలు వీస్తుండగా ఉమ్మివేసుకొనే పాత్ర పట్టుకొని ఒకడున్నాడు. మేఘాలు పర్వతశిఖరంపై దిగినట్లు, తన సంపదనంతా శత్రువుకు ప్రదర్శించాలని రావణుడు గోపురంపైన అలంకారాలతో ప్రకాశిస్తూ మెరుపుతీగవలె భాసిల్లాడు. ఛత్రచ్ఛాయలో నేలపైనున్న రామసేనను వంగి చూచాడు రావణుడు. మేఘాలు క్రమ్మగానే జగత్తంతా అచ్ఛాదితమైనట్లు సేనాసహితంగా శ్రీరామచంద్రుడు ఛత్రచ్ఛాయల్లో విశ్రమించాడు. వంగి చూస్తున్న లంకాపతిని చూచి కపివీరులంతా క్షోభిల్లారు. లక్ష్మణుడు వింటిని తీసుకొని ఆకర్ణాంతం సారించి అర్ధచంద్రబాణం వేశాడు. కన్నుమూసి తెరిచేలోపల కిరీటాలు, గొడుగులు నేలకూలాయి. అనుకోని ఈ

విపత్తుకు రావణుడు కంగారుపడి వెంటనే క్రిందికి దిగివెళ్ళాడు. ఒక్కసారిగా పదిగొడుగులను ఖండించి నేలకూల్చిన ఆ వీరుడెవ్వరు? అన్న దిగులుతో రావణునికి అన్నపానాదులు రుచించలేదు. నిద్రపోవాలనే కాంక్ష కలుగలేదు. తలనొప్పితో బాధపడుతున్న పులివలె, నిప్పులో చిక్కుకొన్న మహాసర్పంవలె దు:ఖతప్తుడైనాడు దశకంధరుడు.

శ్రీరామవిజయంగ్రంథం సుందరమైనది. ఇది కేవలం క్షీరసాగరమే. ఈ సాహిత్యం కోమలమైన శేషశయనం వంటిది. దీనిపై ఆ సర్వేశ్వరుడే శయనించాడు. ఇక్కడ సప్రేమకళలుగల శ్రీలక్ష్మి ఆయన పాదపద్మాల చెంతనే విలసిల్లుతుంది. సద్భావుకులైన శ్రోతలే హరికి చుట్టుప్రక్కలనున్న పౌరులు, సేవకులు.

సుందరకాండ ఇంతటితో సమాప్తం. సరసమైన యుద్ధకాండమంతా ఎంతో రసభరితమైనది. భక్తజనులు సదా శ్రవణం చేస్తారు. అయోధ్యాపతియైన రఘునందనుడు ధనుర్బాణాలు తీసేసి రెండు చేతులు నడుముపై నుంచి భీమానది ఒడ్డున నిలబడ్డాడు. శ్రీశీధరవరదుడు! బ్రహ్మానందుడు! పాండురంగడు! పుండరీకవరదుడు! భక్త హృదయారవింద భ్రమరం! అభంగుడు! అభేదుడు! అయిన జగద్గురువునకు స్వస్తి!

శ్రీరామవిజయంగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా శ్రోతలు ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**ఇరువది మూడవ అధ్యాయం మధురం**

## అధ్యాయము - 24

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**స**ముద్రంలోతు తెలుసుకోవచ్చునేమో, ఆకాశాన్ని కొలువవచ్చునేమో కాని అగాధమైన రామకథను కూలంకషంగా తెలుసుకోవడం ఎవరికైనా సాధ్యమా? ప్రయత్నించి గాలినంతా పోగుచేసి మూటకట్టవచ్చునేమో కాని రఘుపతి చరణాలను వర్ణించనలవికాదు. సర్పకులభూషణుడు, సహస్రవదనుడైన వాసుకి, వేదాలు కూడా ఈ విషయంలో నేతి, నేతి అంటూ మౌనం వహించాయి. రఘువీరుని గుణాలనే సరోవరాన్ని సంరక్షించే రాజహంసలైన వ్యాసవాల్మీకుల ప్రజ్ఞాపాటవాల ముందు బ్రహ్మాండాలన్నీ తలవంచవలసిందే. వారికి కూడా అపారమైన రాఘవుని గుణాలను వర్ణించనలవి కాలేదు. అటువంటప్పుడు పామరులైన మానవ శలభాలకు ఆ గుణాంబరుని వర్ణించతరమా! అయినప్పటికి అభిమానాన్ని వదలి రఘుపతి గుణాలను కీర్తించాలి. గంగాతీరంలో ఎవడైనా దప్పికతో మూర్ఛపోతాడా! అలా సీతావల్లభుని గుణాలను యథాశక్తి గానం చేసేవాడికి అలుపుండదు.

### సీతవద్ద రావణుని మాయోపాయం

పూర్వ అధ్యాయాన్ననుసరించి రఘువీరుడు త్రికూటపర్వతానికి విచ్చేసాడు. ఈ అధ్యాయంలో వాగ్దేవి అతిజాగ్రత్తగా యుద్ధకాండ పేటిక తెరిచింది. అందులోని అమూల్యమైన సాహిత్యరత్నాలను పండితులే గ్రహించగలరు. రావణుని పది ఛత్రాలను సౌమిత్రి ఛేదించాడు. దాంతో ఘోరావమానం పాలయి దశముఖుడు ప్రధానులందరితో కలసి సమాలోచన జరిపాడు. 'నాకు రెండు సమస్యలున్నాయి. ఎలా సాధించాలో తెలియడం లేదు. ఒకటి రామలక్ష్మణులను సంహరించడం, రెండు జానకీదేవిని

వశపరచుకోవడం. ఈ రెండు తప్ప నాకు వేరే కోరిక లేదు' అన్నాడు లంకానాథుడు. బదులుగా వజ్రదంష్ట్రుడు 'సీతకు ఎందుకంత గౌరవమిస్తున్నారు? బలాత్కరించి మీ కోరిక పూర్తిచేసుకోవలసింది' అని సలహా ఇచ్చాడు. బదులుగా దశకంధరుడు, 'నాకు విరించి శాపమున్నది. పరస్త్రీని బలాత్కరిస్తే నా శరీరం నూరుముక్కలౌతుంది. సింహానికి కళ్ళుపీకినట్టు, పులికి ముందుకాళ్ళు నరికివేసినట్లు, పాములకు గారడీవాడు కోరలు తీసి దీనుని చేసినట్లు అయింది నా పరిస్థితి. అరణ్యంలో అన్నిటికన్నా శ్రేష్ఠమైనది ఏనుగు, కాని సింహాన్ని చూడగానే దానికి మరణభీతి కలిగినట్లు శాపవశాన నేను పూర్తిగా బలహీనుడనయ్యాను. రాఘవునిపై మనసు విరిగి జానకి తనంతట తానే నామీద మరులుకొనేలా ఏదైనా చేతనైతే చేయండి' అని అడిగాడు. వెంటనే కపట విద్యాప్రవీణుడైన ప్రధాని విద్యుజ్జిహ్వుడు 'నేను రాఘవుని నకిలీ శిరస్సును, కోదండాన్ని సృష్టిస్తాను. వాటిని చూస్తే అవి కల్పితాలని లేశమాత్రం కూడా సీతకు అనుమానం రాదు' అనగా లంకాపతి అమితానందపడ్డాడు. మద్యపానాన్ని సేవించేవానికి దారిలో తాటిచెట్లవనం కనబడ్డట్టు, స్త్రీలోలునికి స్త్రీలరాజ్యం ప్రాప్తించినట్లు, అనుకోకుండా కుక్కకు కక్కినకూడు దొరికినట్లు, నిమ్మతోపు కనబడగానే కాకి అమితానందపడినట్లు, లంకేశుడు విద్యుజ్జిహ్వునితో మాలో నీవే బృహస్పతివి. నీ చాతుర్యం తర్కింపనసాధ్యం. నీవు వెంటనే శిరస్సు, ధనుస్సు గైకొని అశోకవనానికి రావలసింది అంటూ రావణుడు కపటవిద్యాప్రవీణుడైన విద్యుజ్జిహ్వుని వస్త్రాభరణాలతో గౌరవించాడు.

పిమ్మట లంకానాథుడు అశోకవనం ప్రవేశించి అక్కడ అధోవదనయైయున్న జగన్మాతయైన మైథిలిని చూచాడు. కమలం దగ్గర ఏనుగులా, లేడి ప్రక్కన పులిలా సీత ఎదుట రావణుడు నిలబడి 'నేను అమంగళం పలుకుతున్నాను. నీ ధైర్యమంతా నిష్ప్రయోజనమయింది. ఓ జానకీ! నీ పతి మరణించాడు. నీవు నన్ను వరిస్తే మండోదరి సేవిస్తుంది. నీ ఆజ్ఞలో లంకానగరం చరిస్తుంది. మొదట ఈ సంగతి విను. సాగరానికి సేతువును నిర్మించి త్రికూటపర్వతం వద్దకు అందరూ వచ్చారు. అప్పుడు మా ప్రధాని ప్రహస్తుడు నిమిషంలో సేనాసమేతంగా వెళ్ళి రామలక్ష్మణులు నిద్రిస్తుండగా వారిని వెన్నుపోటు పొడిచాడు. నీ భర్త శిరస్సును ప్రహస్తుడు ఛేదించాడు. మొండెం త్రికూటపర్వతం వద్ద పడివుంది. లక్ష్మణుని చంపబోతే అయోధ్యకు పారిపోయాడు. మా సహోదరుడు విభీషణుడు కూడా అక్కడే పడివున్నాడు. సుగ్రీవునికి అంగదునికి కూడా శిరశ్ఛేదం చేశారు. జాంబవంతుని, మైందుని మోకాళ్ళవరకు ఖండించారు. నల, నీల అంజనేయులను నిద్రిస్తుండగా చూర్ణం చేశారు. మిగతా వానరసైన్యాన్నంతా రాక్షసులందరూ మింగేశారు. సేతువును సమూలంగా ధ్వంసం చేశారు. ఇక వానరులెక్కడికిపోతారు! రక్తం వరదలా ప్రవహించి సముద్రంలో కలిసిపోతున్నది. ఇదంతా నీ మనస్సుకు అసత్యంగా తోస్తున్నదేమో' అంటూండగా విద్యుజ్జిహ్వుడు శిరస్సుతో సహా వెంటనే ప్రత్యక్షమైనాడు. అతడు ధనుస్సు, శిరస్సు సీతాదేవి ముందుంచాడు. చామనఛాయతో కిరీట కుండలాలతో విరాజిల్లుతూ రాజసం ఉట్టిపడే రాముని ముఖబింబం రక్తంతో నిండి ఉంది. సరళమైన ముక్కు, మెరిసే దంతాలు, తలపై వెంట్రుకలు, చెవులవరకున్న విశాలనయనాలు, అన్నీ రక్తసిక్తమై వున్నాయి. ఇది చూచి జానకి మూర్ఛపోయి నేలమీద పడింది. ఆమె అగ్నిలో పడ్డ కమలం వలె కమిలిపోయింది. ఆమె మూర్ఛనుండి లేచి సర్దుకొని శిర్ణకమలాన్ని హృదయానికి హత్తుకొని విపరీతంగా శోకించింది. ఆహా! ముల్లోకాలకు భర్తయైన రాముని రాణి ఆ క్షణంలో శోకసముద్రంలో మునిగిపోయింది. ఆమె కన్నీటికి భూమి కూడా తడిసిపోయింది. కవి యొక్క వాణి కూడ మూగపోయింది.

రాజీవాక్షా! రఘునందనా! స్మరారిమిత్రా! జగన్మోహనా! అనంతగుణ సంపన్నా! ఎందుకయ్యా అలా చేశావు? పదునాలుగేళ్ళ పర్యంతం రఘువీరా! నీవు అరణ్యాలలో శ్రమించావు. కోమలమైన నీ పాదాలలో సూటిగానున్న రాళ్ళు దిగబడ్డాయి. నా కారణంగా అరణ్యంలో ఎంతో శ్రమించావు. హే సీతా! అంటూ చెట్లను, రాళ్ళను హృదయానికి హత్తుకొని ఉద్ధరించావు. నా కారణంగానే వాలి సంహరింపబడ్డాడు. సూర్యసుతుడు మిత్రుడయ్యాడు. హనుమంతుడు నన్ను వెదకటానికి పంపబడ్డాడు. సాగరంలో సేతుబంధన జరిగింది. త్వరగా త్రికూటాచలానికి వచ్చి త్రుటిలో శత్రువుకు అపారమైన కీర్తిని కలిగించావు. న న్నీ భవసాగరంలో పడద్రోసి ఎందుకు అవతారాన్ని చాలించావు? రవికులావతంసుడైన దశరథుని కోడలు, అయోధ్యాధీశుని ధర్మపత్నియైన నన్ను విడిపించుటకు ఇక ఎవరు వస్తారు? నేను పరదేశంలో దీనావస్థలో నున్నాను. రఘువీరా! నేను ఎవరిని శరణుజొచ్చేది. సూర్యవంశానికే దీనివల్ల కళంకం ఏర్పడింది. వాల్మీకి వ్రాసిన భవిష్యత్తంతా తారుమారయింది. జంబుకం వెళ్ళి పంచాననాన్ని చంపడం ఎంత విడ్డూరం? మేక కాళ్ళ గుర్తులు పడ్డ చోటులో నిలిచిన నీటిలో సింహం జారిపడడం ఎలా సంభవం? ఎలుక నోట్లో సింహం ఇరుక్కొనడం, కర్పూరపు బొమ్మ బడబానలాన్ని మ్రింగివేయడం, జగద్రక్షకుడు జగత్తుకే కాలుడైన వానిని భూతాలు మ్రింగడం, దోమధాటికి కనకాద్రి నేలకూలడం, నక్కలన్నీ కలిసి ఐరావతాన్ని కట్టివేయడం, మిణుగురు పురుగు ప్రకాశంలో బ్రహ్మాండమంతా వెలిగిపోవడం, చీమ కడుపులో సింహం తలదాచుకొనడం, ఈగ రెక్కపోటుకు ఆదిశేషువు భయభ్రాంతుడవడం, చిత్రంలో నున్న పాము అకస్మాత్తుగా గరుడుని మ్రింగివేయడం ఇవన్నీ ఎలా అసంభవాలో రాక్షసులు రఘునాథుని గెలవడం కూడా అటువంటిదే. కర్మగతి చాలా అనూహ్యమైనది. ఎటువంటి అనర్థం సంభవించింది? ఆదిశేషుని అవతారమైన లక్ష్మణుడు రాముని వదలిపెట్టి



ఎలా వెళ్ళాడు? అతడు అయోధ్యకు వెళ్ళి భరతునితో ఏం చెప్పగలడు? ఈ వార్త విన్నవెంటనే కౌసల్య ప్రాణత్యాగం చేస్తుంది. కైకేయి ఎంతో ఆనందించి వెంటనే సూర్యవంశాన్ని దూషిస్తుంది. తన మూర్ఖత్వంతో వంశాన్ని ముక్కలు చేసింది.'

అలా సీత శోకించి ముఖంపై చేతులడ్డుపెట్టుకొని కన్నీరు కార్చగా నేలంతా తడిసిపోయింది. సీత దశముఖునితో విధిని ఎవ్వరూ తప్పించలేరు. మీరు నాకు మిథిలానాథుడైన నా తండ్రితో సమానం. పుట్టింటి పక్షాన నాకు చితి పేర్పించవలసింది. నేను శిరస్సుతో సహా అగ్ని ప్రవేశం చేస్తాను అన్నది. ఇంత జరిగినా సీతాసాధ్వి సత్త్వగుణాన్ని విడువలేదని తెలుసుకొని రావణుడు జిడ్డుగారే ముఖంతో అక్కడనుండి సభకు వెళ్ళాడు.

రావణుడు నిష్క్రమించిన తరువాత జానకి శోకార్ణవంలో మునిగిపోయింది. ఆ సమయానికి విభీషణుని రాణి సరమ రహస్యంగా అక్కడికి వచ్చింది. ఆమె జానకి దర్శనం చేసుకుని లంకలో అనుక్షణం జరిగిన సంగతులన్నీ వివరించింది. రఘుపతి హితవు కొరకు విభీషణుడు పాటుపడ్డట్టు, సీతాదేవి వద్దకు సరమ వచ్చి ఓదార్చింది. నానారూపాలు ధరించి రాక్షసులేవిధంగా కుటిలవిద్యలు ప్రదర్శిస్తారో పూసగుచ్చినట్టు జానకి చెవిన వేసింది. 'అమ్మా! ఎందుకు వ్యర్థంగా శోకిస్తావు. రాముడు త్రికూటాచలంలో సుఖంగా ఉన్నాడు. నిన్ను క్షణంలో వశం చేసుకొనేందుకు ఇదంతా రావణుడు సృష్టించిన మాయాజాలమే. సూక్ష్మదృష్టితో బాగా అవలోకించు. నీకే అర్థమవుతుంది. ఓ జనకబాలా! నీ స్వయంవరంలో రావణుని రొమ్ముపై విల్లుపడింది. దానిని త్రుటిలో రెండుముక్కలు చేశాడు నీ పతి. దానికంటే బలమైన వింటిని ప్రహస్తుడు వెళ్ళి ఎలా తీసుకురాగలడు? వాళ్ళు మాయా శిరస్సు, ధనువు తీసుకొచ్చారు' అని సరమ చెప్పేటంతలో గాలి తాకిడికి దీపం ఆరిపోయినట్టు, మేఘాల మధ్య క్షణకాలం ఇంద్రధనుస్సు మెరిసి

మాయమైనట్లు, క్షణంలో కృత్రిమ శిరస్సు, ధనుస్సు మటుమాయమైనాయి. ఇదంతా గమనించి జానకి సరమతో 'నీ బుద్ధికుశలతకు నా జోహార్లు. రాక్షసమాయలన్నీ నీకు బాగా తెలుసు' అంటూ సరమను దగ్గరకు పిలిచి హృదయానికి హత్తుకొని 'లంకకు నీవు రాణివవుతావు' అని ఆశీర్వదించింది. ఆ సమయంలో అయోధ్యానాథుడు సుఖంగా ఉన్నాడని ఆకాశవాణి పలికింది. దాంతో సీత ఆనందానికి అవధులు లేవు.

## మండోదరి జానకిని సందర్శించడం

ఇదిలా ఉండగా అక్కడ పతివ్రత, గుణసరిత్తు, జ్ఞానఖని, ఎవరి సౌందర్యంముందు మన్మథుడు కూడా తీసికట్టో అట్టి మండోదరికి జానకిని దర్శించాలని మనస్సు తహతహలాడింది. లంకాధీశుడు పరమచింతాక్రాంతుడై ఏకాంతంగా మండోదరితో ఏమన్నాడో వినండి. 'ఓ శుభకళ్యాణీ! నీవు అశోకవనానికి వెళ్ళి జానకిని సమాధానపరచి నా పడకగదికి వచ్చేట్టుగా చేయవలసింది. నీవు పతివ్రతా శిరోమణివి. ఎలాగైనా నీవు ఈ కార్యాన్ని సాధించవలసినద'నగా, మండోదరి బయటకు చిరునవ్వుతో 'అలాగే' అంటూ బయలుదేరింది. చంద్రునిలోనైనా మచ్చ ఉన్నది. కాని మచ్చలేని అపూర్వమైన ముఖవర్చస్సు కలది మండోదరి. వెంటనే బయలుదేరి అశోకవనాన్ని చేరింది. భూజాత అయినజానకితో మీ దర్శనానికి మండోదరి వచ్చిందని త్రిజట తెలుపగా జానకి ఎంతో ఆనందించింది. పుష్కర సమయంలో జాహ్నవి గౌతమిని కలుసుకోవడానికి వెళ్ళినట్టు, చాతుర్య సరోవర మరాళమైన, సుగంధ చంపకకళికయైన మండోదరి జానకి వద్దకు వెళ్ళింది. సీత పాదపద్మములకు మండోదరి నమస్కరించగానే సీత ఆమెను వెంటనే ప్రేమతో లేవనెత్తి హృదయానికి హత్తుకుంది. వారి కలయిక మూర్తీభవించిన గంగాయమునలవలె, లక్ష్మీపార్వతులవలె, శచీ సరస్వతులవలె, కృష్ణా గోమతులవలె, మందాకినీ భోగావతులవలె గోచరించింది.



మండోదరి తను భర్తకు ఇచ్చిన మాట మరచి స్వానంద సాగరంలో లీనమయింది. అర్ధవైనాలుగు అంతఃకరణాలతో జానకితో తాదాత్మ్యం చెందింది. వేదశాస్త్రాలన్నీ ఏకమైనట్లు బ్రహ్మానందంలో తన్మయులై ఒకరిలోనొకరు లీనమయ్యారు. దశకంఠుని రాణియైన మండోదరి జానకితో 'నేడు ఎంతో సుదినం. నాకు మీ దర్శనభాగ్యం లభించింది' అని ఒక క్షణం ప్రశాంతంగా కూర్చున్నది. పిదప మండోదరి మధురవచనాలతో 'సకల భూతాలపట్ల సమతతో వర్తించేది ఆ రఘురాముడొక్కడే! తరంగాలెన్నైనా సాగరం ఒక్కటే. ఇళ్ళు ఎన్ని అయినా ఆకాశం ఒక్కటే. మణులెన్నైనా దారం ఒక్కటే. అలాగే అలంకారాలెన్నైనా బంగారం ఒక్కటే! అలలెన్నో కాని నీరు ఒక్కటే! ఎన్ని అక్షరాలున్నా ఓంకారమొక్కటే! అవయవాలు అపారం కానీ శరీరం ఒక్కటే! ఆకులు అపారం కాని వృక్షం ఒక్కటే! జలచరాలు ఎన్ని ఉన్నా నీరు ఒక్కటే! అలాగే సర్వవ్యాపకుడు ఒక్కడే! చరాచరములైన సకల జీవరాశులలో ఆ అయోధ్యానాథుడు వసించి ఉన్నాడు. అలాంటప్పుడు దశముఖుని ప్రేమిస్తే దోషమేముంది?' అని అడిగింది. 'సకల దేహాలలో అయోధ్యాధీశుడే నిండివున్నప్పుడు లంకేశుని అన్యంగా ఎందుకు భావిస్తావు? సీతా! ఆయనపై అనవసరంగా దురాగ్రహం చెందడం ఎందుకో నాకు తెలియచెప్పవలసింది' అన్న మండోదరి మాటలు విని జానకి నవ్వుతూ 'అత్యంత బలశాలి అని నిరూపించుకొనుటకు ఆకాశాన్ని బద్దలు కొట్టాలా? భేదభావం లేక సర్వభూతాలలో నిండినవాడు ఆ సారంగపాణి ఒక్కడే! మాయతో భాసిల్లుతున్నాయి జగత్తు, ఆకాశం. ఎండమావులలో నిండుగా నీరు, మోడువారిన చెట్టుకు పక్వమైన ఫలాలు, స్వప్నంలో సంపూర్ణంగా సంపద లభించడం, అద్దంలో కనబడే ధనంతో దరిద్రుని మనోరథం నెరవేరడం అన్నీ మిథ్యలే. అలంకారాలన్నీ మిథ్య. సువర్ణం ఒక్కటే సత్యం. తరంగాలన్నీ మిథ్యాభాస. ఉన్నది నీరు ఒక్కటే. అలా రఘునందనుడొక్కడే అభేదస్వరూపుడు,

ఇక రావణుడు ఎవరు? ఎలా సంభవం? బ్రహ్మానంద స్వరూపునితో అన్యత్వానికి తావులేదు. ఇక్కడ సీత, మండోదరి కూడా మిథ్యాభాసాలే. అలాంటప్పుడు రావణుడెక్కడున్నాడు? బ్రహ్మాండమెంత గొప్పదో ఆకాశమంత ప్రచండమైనది. అటువంటప్పుడు ఎవరు బలవంతులని చెప్పగలం? ఈ వాదనంతా వ్యర్థమే. అటువంటి నిర్వికారుడు జగజ్జెట్టి ముందర ద్వైతభావ ప్రసక్తే లేదు. ఇక రావణుని కలియడమనేదేముంది? ఇంకా బాహ్యదృష్టిని త్యజించలేదా!' అని సీత పలుకగా మండోదరి 'ఆ సర్వవ్యాపకుడు అయోధ్యావాసిగా ఎందుకు మరొక దేశానికి వచ్చాడో నాకు వివరించవలసింది' అని అడిగింది. ముల్లోకాధిపతికి రాణి, విదేహరాజనందన అయిన సీత బదులుగా ఇలా అంది. 'త్రిపుటి ఆయనలో లీనమయింది. వేదాలే మూగపోయాయి. ధ్యేయము, ధ్యాత, ధ్యానము, జ్ఞేయము, జ్ఞాత, జ్ఞానమును భజించేవాడు, భజన చేయబడేవాడు, భజన మూడూ అతడే. ఇక రావణుడెవ్వడు? మనకు కనబడేదంతా నాశమయ్యేదే. అభేదమైన ఆ పరబ్రహ్మమొక్కటే శాశ్వతం. ఇక మండోదరి, సీత ఎక్కడుంటారు? పాము తాడులాగా అగుపడడం, ముత్యపుచిప్ప రజతంలా ప్రకాశించడం, ఇవన్నీ మాయచేసే మిథ్యాభాసలేయని తెలుసుకో!'

మయపుత్రి సావధానురాలై చూడగా వాస్తవం గోచరించింది. నిర్వికారము, నిరామయమయిన ఆ పరబ్రహ్మాన్ని కీర్తించటానికి శబ్దజాలం సరిపోదు. ఆ పరబ్రహ్మ అవ్యక్తుడు, అనామకుడు. అక్కడ రాముడు కూడా అనామకుడే. ఈ రహస్యం తెలుసుకున్నవాడే ఆత్మారాముడు. అటువంటి పరిపూర్ణుడు సమాధిలో ఉన్నా లేకున్నా మాట్లాడుతున్నా మౌనంగావున్నా ఎల్లప్పుడు ఆత్మస్థితిలోనే ఉంటాడు.

జగన్మాత జానకి పలుకులు విని మండోదరి బ్రహ్మానందంలో తేలియాడింది. అంతుబట్టని సమాధిస్థితిలో నిశ్చలమైంది. ఆ అభేదస్థితిలో మాటలు, సంభాషణలన్నీ లుప్తమైనాయి. బ్రహ్మానందం పొంగిపొరలింది.



ఆనందదాయకుడైన జగద్గురునితో తాదాత్మ్యం చెంది ఆనందం ముప్పిరిగొనగా మండోదరి సావధాన గద్గదిత చిత్తయై జగన్మాత పాదాలను ఆశ్రయించింది. 'నా సంశయాలన్నీ సంపూర్ణంగా సమసి పోయాయి. ఈ రోజు ఎంతో ధన్యమైనది' అంటూ వైదేహి చరణాలపై పదే పదే మోకరిల్లింది. బ్రహ్మానందుడు శ్రీధరకవితో 'ఈ రోజు ధన్యమైనది. ఆత్మ విచారమనే సత్సంగంలో సంపూర్ణంగా గడిచింది. భాగీరథి పవిత్రమైనదే కాని ప్రయాగలో దాని మహిమ అపారం. అలాగే శ్రీరామవిజయగ్రంథమనే పవిత్ర భాగీరథిలో మండోదరీ సంవాదం ప్రయాగ వంటిది. భీమానదిలో స్నానం చేయడానికి అన్ని తీరాలు సులభమైనవే. కాని పండరి మహిమ అగాధం. అక్కడ స్నానం చేస్తే కర్మాకర్మలనుండి ముక్తులవుతారు' అన్నాడు.

ఆ విధంగా సీత అనుమతి పొంది మండోదరి ఇంటికి వెళ్ళింది. రావణుని వద్దకు వెళ్ళి జరిగిన సంగతి చెప్పింది.'కాలిన ఇనుముపై బడ్డ నీళ్ళు జారిపోవచ్చు, ఎండమావిలో సూర్యుడు మునిగిపోవచ్చు, చీకటి బావిలో సూర్యుడు పడిపోవచ్చు కాని జానకి వశం కావడం అసంభవం. తమ కులానికి విఘాతం, అనర్థం కలిగించే కార్యాన్ని బుద్ధిమంతులెన్నడూ ఆచరించరు. చేతిలో ఉన్న బంగారాన్ని వదలి పేడకుప్పకు పాకులాడడమెందుకు? ముత్యాలకుప్పకు బదులు చిల్లపెంకులు మూటగట్టుకోవడమెందుకు? రాజాహ్వానాన్ని త్రోసిపుచ్చి జిల్లేడుకాయలు భక్షించడమెందుకు? ఓ దశముఖా! రాముని భార్యను విడిచి త్రికరణ శుద్ధిగా రాముని శరణువేడు. పరసతిని అభిలషిస్తేనే మహాపురుషులు దోషమంటారు. ఇక బలవంతంగా బంధిస్తే అనర్థానికి అంతమేముంటుంది? సీతాదేవి విఘ్నదేవతలలో మిన్న. ఘోరమైన అనర్థాన్ని కలిగించగలదు. ఆమెను రఘునాథునికి అప్పగించు. నీకు శుభం కలుగుతుంది. మహాసర్పాన్ని తలక్రింద బెట్టుకొని ఎవడైనా సుఖంగా నిద్రించగలడా? బలవంతంగా అగ్నిని తెచ్చి ఇంట్లో పెట్టుకొంటే బతికి

బట్టకట్టగలడా? పరుల ద్రవ్యాన్ని అభిలషించేవాడు, తెలిసి పరనింద చేసేవాడు, ద్వేషం కలిగినవాడు ఆనందంగా జీవించగలడా? విభీషణుడు పరమసాధువు. నీ అవివేకాన్ని చూచి అయోధ్యాపతిని శరణువేడి జననమరణాల కతీతుడయ్యాడు. రఘునందనుడు పరమప్రతాపవంతుడు. నీటిపై రాళ్ళను తేలియాడించాడు. అతడి ప్రతాపం తెలిసికూడా నీవు ఎందుకు ద్వేషబుద్ధి వహిస్తున్నావు?' అంటూ వాడియైన శబ్దరత్నాలతో మండోదరి రావణుని ప్రబోధించింది.

బదులుగా రావణుడు నవ్వి 'ప్రియా! నీవు చెప్పిన మాటలలో ఉన్న మంచి, నా మనస్సుకెంతో నచ్చింది. కాని పౌరుషాన్ని వదిలిపెట్టిన తరువాత ఈ లోకంలో జీవించడం వ్యర్థం. విభీషణుడు చిరంజీవి కావచ్చు, కాని ప్రళయకాలంలో మరణం తప్పదు. అంతవరకు దేహాభిమానంతో జీవించి ప్రయోజనమేమి? ఓ శుభకళ్యాణీ! ఈ పురుషార్థం వల్ల ఎవరు గౌరవిస్తారో నాకు చెప్పు! రఘునందనుడు ఆదిపురుషుడనీ, వారిని గూర్చిన వర్తమానమంతా నాకు తెలుసు. ఆయనే యుద్ధం చేయాలన్న కాంక్షతో సముద్రం దాటి వచ్చాడు. వారి కోరిక తీర్చకుండా ఎన్నటికీ సీతను తిరిగి ఇవ్వను. నేను నా పౌరుషాన్ని చూపించి రాఘవుని జయిస్తాను' అని అన్నాడు. రావణుని మాటలు విని మండోదరి చింతాక్రాంతయై, త్వరగా తన మందిరంలోనికి వెళ్ళి దు:ఖకూపంలో మునిగిపోయింది.

### సుగ్రీవుడు రావణుని బాధించడం

పర్వతశిఖరాన్ని మేఘాలావరించినట్టు రావణుడు గోపురాన్ని ఎక్కగానే నల్లని ఛాయ ఆవరించింది. మెరుపులా వస్త్రాలంకారాలు మెరుస్తుండగా, పదిఛత్రాలు తలపై విరాజిల్లుతున్నాయి. సేవకులందరూ చుట్టుముట్టి సపర్యలు చేయసాగారు. ఇక్కడ విభీషణుడు రామునికి గోపురాన్ని అధిరోహించిన రావణుని చూపాడు. వెంటనే శ్రీరాముడు 'త్రికూటపర్వతం చాలా ఎత్తైనది, అందరం దానిపైకెక్కి లంకానగరాన్ని తిలకిద్దాం' అంటూ పైకి లేచాడు. చుట్టూవున్న వానరులంతా త్రికూటపర్వతం పైకి వాయువేగంతో వెళ్ళారు. కనకాచలంపైకి దేవతలంతా వరుసగా వెళ్ళినట్లు, వానరులతో సహా అయోధ్యాధీశుడు త్రికూటాచలాన్ని అధిరోహించాడు. రఘుపతి రెండుచేతులు విభీషణుడు, సుగ్రీవుడు పట్టుకోగా, త్రికూటాచలంపై రఘువీరుడు ఎలా శోభిల్లాడో చూడండి. ఉదయాచలంపైన బాలభానునిలా, ఐరావతంపైన దేవేంద్రునిలా, కైలాసం పైన కర్పూరగౌరునిలా, త్రిభువనేశ్వరుడు విరాజిల్లాడు. లావణ్యామృత సాగరుడు, ఈశ్వర ప్రియుడు, సముద్రునిచే ప్రసాదించబడిన అలంకారాలతో మెరుపుతీగలా మెరిసిపోతున్నాడు. దివ్యమైన పీతాంబరాలతో విరాజిల్లుతున్న అయోధ్యానాథుని గోపురంపైనుండి లంకానాథుడు విలోకించాడు. ఇంద్రాది సకలదేవతలు వైకుంఠనాథుని పరివేష్టించినట్టు, వానర సమేతంగా రామచంద్రుడు త్రికూటాచలంపై శోభిల్లాడు. అనంతమైన వేదార్థాలతో వేదనారాయణుడు విరాజిల్లినట్లు అనేకమైన వృక్షాలతో కల్పతరువు విలసిల్లినట్లు, మహావీరులతో సీతాకాంతుడు శోభిల్లాడు. ఆ సమయంలో సుగ్రీవుడు ఒక అద్భుతం గావించాడు. ఏనుగు కంటబడ్డ తర్వాత సింహం ఊరకుండనట్లు సుగ్రీవుడు ఎవరితో చెప్పకుండా అకస్మాత్తుగా పైకెగిరి, పర్వతశిఖరంపై పిడుగుపడ్డట్టు పరమావేశంతో రావణుని ఢీకొన్నాడు. సుగ్రీవుని కుడిచేతి వేటుకు కిరీటాలన్నీ క్రిందపడ్డాయి. వింధ్యాద్రిపై అకస్మాత్తుగా విద్యుల్లత వచ్చిపడ్డట్లు సుగ్రీవుడు చేసిన ఈ విపరీతానికి లంకానాథుడు కలవరపడ్డాడు. సుగ్రీవుడు ముష్టిఘాతాల తరువాత గుండెలపై పిడిగుద్దులు గుద్దాడు. ఒక ఘడియ కాలం మల్లయుద్ధం అద్భుతంగా సాగింది. వాలివలె సుగ్రీవుడు కూడా అవలీలగా నన్ను పట్టుకుని రాముని వద్దకు తీసుకుని వెళ్ళి అవమానిస్తాడు. పలాయనం తప్ప వేరే మార్గం లేదనుకున్నాడు రావణుడు. పదహారు అంతస్తుల గోపురం పైనున్న మహావీరుని చూచి లంకానగరమంతా

ఒక్కసారి తల్లడిల్లింది. జనమంతా నగరాన్ని మొత్తం కాల్చడానికి హనుమంతుడు వచ్చాడనీ, వీడేమో లంకంతా తలక్రిందులు చేసి సముద్రంలో పడేస్తాడనీ కలవరపడసాగారు.

సుగ్రీవుని ధాటికి తట్టుకొనలేక దశకంఠుడు ఇంటి యజమాని లేవగానే పారిపోయే దొంగవలె, సింహం కంటపడకుండా పూర్వపుణ్యం వలన తప్పించుకున్న నక్కవలె, పాము కంటబడి కూడా తన కలుగులోనికి పారిపోయిన ఎలుక వలె త్రుటిలో తప్పించుకొని పారిపోయాడు. సుగ్రీవుడు వెంటనే ఎగిరి త్రికూటాచలానికి వచ్చాడు. జయజయనాదాలు మిన్నుముట్టగా రఘురాముడు సుగ్రీవుని హృదయానికి హత్తుకొన్నాడు. దేవతలు ఆకాశం నుండి పుష్పవృష్టి కురిపించారు. సుగ్రీవునికి జయమంటూ చూపుడు వేలిని ఆడిస్తూ తలలూపసాగారు. శ్రీరాముడు సుగ్రీవునితో 'బృహస్పతే ఈనాడు పొరపాటు పడ్డాడా అన్నట్లు నీవంటి మహావీరుడు అనాలోచితంగా ప్రవర్తించడం వింతగా ఉంది. సకలసైన్యాన్ని ప్రక్కన బెట్టుకొని రాజు హఠాత్తుగా ఎగిరి శత్రువును పట్టుకోకూడదు. అటువంటి విజయం ఎంత త్వరగా సాధించినా దానివల్ల కలిగే ప్రయోజనమేముంది' అని నీతిబోధ చేశాడు. ఈలోగా వానరులంతా రకరకాల పుష్పాలు తెచ్చి కిష్కింధాపతిని పూజించారు. సైన్యసమేతంగా సీతాపతి యథాస్థానానికి తిరిగివచ్చాడు.

**అంగదుని దూతగా నిర్ణయించడం**

మల్లయోధులందరితో కలసి రఘునందనుడు సభ చేశాడు. సుగ్రీవుడు, విభీషణుడు కలసి దగ్గరగా కూర్చున్నారు. చాతుర్యగుణసముద్రుడు, రాజాధిరాజు అయిన శ్రీరామచంద్రుడు రాజనీతి గురించి ఆ సమయంలో ఎక్కువగా విచారణ చేయసాగాడు. రావణునితో యుద్ధం చేయకుండా సీతను పొందలేమా అని ప్రశ్నించగా విభీషణుడు ఇలా అన్నాడు. 'సామదానభేద



దండోపాయాలతో సమయాసమయాలను గుర్తించి చతురులు, శత్రువులను తమ అధీనం చేసుకుంటారు. పాము మంత్రానికి కట్టుబడుతుంది. అగ్ని నీటితో శాంతిస్తుంది. వేదాంత జ్ఞానం భవసాగరాన్ని దాటి ఆవలితీరాన్ని చేరుస్తుంది. కామక్రోధాది బలమైన శత్రువులను వివేకం నిర్జిస్తుంది. భక్తి సర్వేశ్వరుని మన అధీనం చేస్తుంది. శమదమాలతో బుద్ధిమంతులు మనస్సును జయిస్తారు. మూలాన్ని శోధించి వ్యాకరణవేత్తలయిన పండితులు రకరకాల అర్థాలను వెలికి తీస్తారు. బండ క్రింద యిరుక్కున్న చేతిని ఉపాయంతో బయటకు తీసుకోవాలి. మొరటుగా లాగితే ఎంతో బాధ కల్గుతుంది. అలాగే సామాన్ని పాటించి దశకంఠుని వశం చేసుకుందాం. సమయోచితంగా ప్రవర్తించగల బుద్ధిమంతుని దూతగా పంపాలి. సభలో కూర్చోగానే బృహస్పతివంటి ప్రవీణుడైన, సరస్వతీ ప్రసన్నుడైన, సమయోచితంగా మాట్లాడుటలో నిష్ణాతుడైన వానిని, వేదశాస్త్ర పురాణాలు సంపూర్ణంగా కరతలామలకమైన వానిని, సభలో సూర్యునిలా ప్రకాశించగలవానిని ఒకవేళ శత్రువులు అందరూ కలసి ఎదురుతిరిగితే అగస్త్యునిలా శత్రుసాగరాన్ని ఆపోసన పట్టగల యమునివంటి వీరుని ఎన్నుకోవాలి. నిర్మలమైన హృదయంకలిగి కపటరహితుడైనట్టి, భోళాశంకరుని వంటి, దేవసభలోని శచీంద్రునిలా, సభలో విశిష్టంగా విరాజిల్లే వీరుని వెతకాలి. భగవంతునిపట్ల ప్రేమతో, మహాత్ములపట్ల మిత్రభావంతో, సదా సత్కర్మలు ఆచరిస్తూ క్రోధము, మోహము విసర్జించినవాడు కావాలి. ఓ జగద్వంద్యా! రాఘవా! అటువంటి గుణగణాలు గల మంచి వ్యక్తిని రావణుని వద్దకు దూతగా పంపాలి. నరులలో, వానరులలో, భల్లూకాలలో ఎవరిని దూతగా పంపవచ్చో మీరు, నేను, సుగ్రీవుడు కలసి ఆలోచించి ఎంపిక చేద్దాం. ఏనుగుల గుంపులోకి దుమికి సింహం తన పని తాను సాధిస్తుంది. సుపర్ణుడొక్కడే వెళ్ళి అమృతభాండాన్ని తీసుకుని వచ్చాడు. గురుపుత్రుడు కచుడు ఒక్కడే వెళ్ళి సంజీవనిని సాధించాడు. సముద్రాన్ని

లంఘించి అంజనేయుడు సీతను శోధించి తిరిగి వచ్చాడు. ఆ విధంగా కార్యాన్ని సాధించి త్వరగా తిరిగి వచ్చే వానిని శీఘ్రంగా ఎంపిక చేయాలి.'

విభీషణుని మాటలు విని రఘునందనుడు ఎంతో ఆనందించాడు. 'నీ తెలివికి జోహార్లు. నీవు సకల కళాప్రపూర్ణుడవు' అన్నాడు. అపారమైన రత్నరాశి నుండి నిపుణుడు అమూల్యమైన రత్నాన్ని ఏరినట్టు వీరుడైన వాలిపుత్రుని దూతగా ఎన్నుకున్నారు. విభీషణుడు రామునితో రాజీవనేత్రా! జలదవర్ణా! చారుగాత్రా! పద్మోద్భవ జనకా! స్మరారిమిత్రా! అంగదుని పంపవలసింది. నవగ్రహాలలో సూర్యునివలె, సర్పాలలో ఆదిశేషునివలె వానరులలో అంగదుడు చతురుడు, సర్వలక్షణ సంపన్నుడు. శాస్త్రసాలలో వేదాంతంవలె, శస్త్రాలలో సుదర్శన చక్రంవలె, పక్షులలో గరుడునివలె, అద్భుత బలసంపన్నుడు' అన్నాడు. ఇది విని రఘురాముడు మిక్కిలి సంతోషించి, మీరు ఉత్తమరత్నాన్ని ఎంపిక చేసారని మెచ్చుకోగా అంగదుడు చేతులు జోడించి రఘుపతితో ఇలా అన్నాడు. 'పురాణపురుషా! పరమానందా! భక్తహృత్పద్మకోశ భ్రమరమా! జగదంకురమూలకందా! నేను ఏం చేయాలో ఆజ్ఞాపించవలసింది. రాజీవాక్షా! రణరంగధీరా! అసుర కానన వైశ్వానరా! జనకజామాతా! అతి ఉదారా! మీ ఆజ్ఞ నాకు సెలవియ్యవలసింది. చరాచర ఫలాంకితద్రుమా! విశాలఫాలా! పూర్ణకామా! అజఅజిత ఆత్మారామా! మీరు నన్ను ఆజ్ఞాపించవలసింది. రావణకుంభకర్ణులను కలిపి ఈ క్షణంలో కట్టి తెమ్మంటారా, లేక లంకను ఎత్తుకుని తలక్రిందులుగా సముద్రంలో పడవేయమంటారా!' అని కార్యార్థాన్ని అడుగగా రాముడు అంగదుని మాట విని ఆనందించాడు. 'అద్భుతమైన నీ బలం వల్ల పుణ్యశీలుడైన వాలి ధన్యుడైనాడు. చంకలో ఇరికించుకుని రావణుని నాలుగు సముద్రాల్లో స్నానం చేయించిన తండ్రికి తగ్గ తనయుడవు. నీవు వెంటనే లంకకు దూతగా వెళ్ళి సామరస్యంగా రావణునితో జానకిని సమర్పించవలసింది' అని చెప్పు. తదుపరి నా మాటలుగా రావణునితో 'నీవు



నాకు తెలియకుండా నా హృదయరత్నమైన జానకిని దొంగలించావు. వెంటనే సీతను తెచ్చి అప్పగిస్తే, నీవు లంకను శాశ్వతంగా పాలిస్తావు. లేకపోతే నీ వంశమంతా నాశనమవుతుంది. ఆలోచించి నీ నిర్ణయం చెప్పవలసింది' అని చెప్పమన్నాడు రాఘవుడు. అంగదుడు జనకజామాతకు నమస్కరించి అనుమతి పొంది వెంటనే ఆకాశంలోకి ఎగిరి అకస్మాత్తుగా రావణుని సభలో ఆదిత్యుడే వానరరూపంలో ప్రకటితమయ్యాడా అన్నట్లు ప్రత్యక్షమయ్యాడు. వైకుంఠంలో ఉండే గరుడుడు అకస్మాత్తుగా భూమిపైకి ఏతెంచినట్లు, యోగభ్రష్టుడు అనుకోకుండా కర్మభూమికి అరుదెంచినట్లు, అంగదవీరుని చూడగానే సభలోని అసురులంతా అవాక్కయ్యారు. ఆయుధాలు పైకితీసి మెల్లమెల్లగా ముందుకు వస్తూ ఇలా అనుకోసాగారు. 'పూర్వం ఒక వానరుడు లంకానగరాన్ని తగులబెట్టాడు. ఇంతకుముందు సుగ్రీవుడు గోపురంపైకి వచ్చి రావణుని పదిఛత్రాలు విరిచాడు. ఇప్పుడు ఎలాంటి భయం సంకోచం లేకుండా వీడు ఒక్కడే సభలోకి వచ్చాడు'.

అంగదుడు నలుమూలలా సభంతా పరిశీలించాడు. నక్కల గుంపులోకి సింహం వలె వచ్చిన అంగదునిగని, గరుడుని చూచి పాము గడగడలాడినట్లు సభాసదులంతా వణికిపోయారు. సూర్యుడు ఉదయించగానే గుడ్లగూబలు గూడు చేరినట్లు, చంద్రుని చూచి చోరులు ఇబ్బందిపడ్డట్లు, సభలో పండితుని చూచి అల్పులు మతి పోగొట్టుకొన్నట్లు వసంతకాలంలో కోకిల కూత విని కాకి కన్నీరు కార్చినట్లు భక్తులైన సాధువులను చూచి నీచుడు తాపం చెందినట్లు, నన్ను చూచి రాక్షసులంతా ఉన్మాదులై తంటాలు పడుతున్నారు అనుకుని అసమానమైన ప్రకాశంతో వెలిగిపోతూ వాలినందనుడు పుచ్ఛాసనంపై సభామందిర స్తంభానికి వీపానించి ఠీవిగా రావణుని కంటే ఎత్తుగా కూర్చున్నాడు. పరస్థలం నుండి సభకు వచ్చినా, సభాసదులెవ్వరూ ప్రశ్నించలేదు. అటువంటివారిని శతమూర్ఖులంటారు. అంగదుడు రావణునితో 'ఓ గర్విష్ఠా!

దశవదనా! పాపీ! నేను ఎందుకొచ్చాను అని అడగవేం? నేను వాలి పుత్రుడను. అయోధ్యాపతి దూతను. నీ అంతర్యం తెలుసుకోవడానికి ఇక్కడకు వచ్చాను' అని అన్నాడు. రావణునికి అంగదుడు చేసిన బోధను విపులంగా జ్ఞానులకు వివరిస్తాను. బ్రహ్మానందంగా ఆలకించవలసింది. రవికులభూషణుడైన రఘువీరుడు సాధుహృదయపద్మాలకు రామచిలుకవంటివాడు. అట్టి బ్రహ్మానందుడు, శ్రీధరవరదుడు, అభంగుడు ఎన్నటికీ అలసట చెందడు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**ఇరువది నాలుగవ అధ్యాయం మధురం**



**అధ్యాయము - 25**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**పూ**ర్వం క్షీరసాగరాన్నుండి వెలువడ్డ అపూర్వమైన చతుర్దశ రత్నాలవలె రామకథా సముద్రాన్ని మథించి రామవిజయాన్ని వెలికితీసారు. పెరుగు నుండి వెన్న, స్వాతిచినుకు నుండి ముత్యం వెలువడినట్లు, దశరథాంశ నుండి ఉద్భవించిన రాముని మహిమ అద్భుతం. జ్ఞానం వలన శాంతి, శాంతివలన విరక్తి, విరక్తి నుండి నివృత్తి విశేషంగా లభిస్తాయి. ఆ విధంగా అపార ప్రతిభాశాలియైన వాల్మీకి మేధాశక్తే రామకథాబ్ధికి కారణం. దాని ఆవలి తీరానికి చేరటానికి వక్తకు శక్తి లేదు. దరిద్రునికి దారిలో అపారమైన ధనం లభించినా తాను మోయగలిగినంత మాత్రమే తీసుకుని వెళ్ళగలడు. అలాగే నా బుద్ధికందినంతవరకు రామవిజయాన్ని సంపూర్ణంగా వెలువరించాను.

### అంగదరాయబారం

పూర్వ అధ్యాయాన్ననుసరించి వాలినందనుడు రావణుని ఎదుట ఆసీనుడైనాడు. మకుటంపైన శోభించే మణివలె పుచ్ఛాసనంపై అంగదుడు విరాజిల్లాడు. రావణునితో 'దశముఖా! రత్నాలవంటి హితకారకమైన నా మాటలు విను. నరదేహంతో ఉన్నపుడే ఎవరి కీర్తి ముల్లోకాల్లో వ్యాపిస్తుందో వారిని చిరకాలం ధన్యజీవి అని అందరూ కొనియాడతారు. వివేకం సద్బుద్ధికి బలం. దుర్బుద్ధిని కుశలురు త్యజిస్తారు. జ్ఞానుల రసవత్తరమైన బోధలు హృదయగతం చేసుకో! ఎవరినీ హేళన, ఎవరితో చెడు సంభాషణ చేయవద్దు. ఇతరుల గుణగణాలను బాగా తెలుసుకొని పరోపకారం చెయ్యి. ఎవరి ప్రవర్తన చూచి బ్రాహ్మణులు సంప్రీతులవుతారో వారి కుటుంబం సదా సుఖంగా ఉండాలని ఆశీర్వదిస్తారు. అట్టి సంసారం ధన్యమౌతుంది. సకలజీవులలో

జగన్నాథుడున్నాడు. అందువల్ల ఎవరినీ ద్వేషించవద్దు. ఇతరులకు బాధ కలిగించే పదజాలాన్ని ఉపయోగించకు. ద్వేషముతో ఎవరినీ ఏమీ అనవద్దు. కామక్రోధ మదమత్సరాలనే శత్రువులను తరిమివెయ్యి. ఈ శరీరము నశ్వరము అని తెలుసుకుని విచక్షణతో వ్యవహరించు. వేదాల ఆధారంగా సత్కర్మాచరణ చెయ్యి. నేను కర్తను అన్న అహంభావాన్ని ఎన్నటికీ కలిగి ఉండకు. నీటిమీద ఉన్నా తామరాకు ఎలా తడి తగలకుండా ఉంటుందో అలా నిమిత్తమాత్రంగా సత్కర్మలు ఆచరించు. చిత్తంలో ఏకాగ్రత సాధించి మనస్సును భగవద్భజనలో లగ్నం చెయ్యి. ఈ జగత్తంతా మిథ్యాభాసమని గ్రహించి ఆత్మస్వరూపంలో రమించు. రాక్షసేంద్రా! పరధనంపైన, పరసతిపైన నీ మనస్సు లగ్నం చేయకు. సదా సద్గురువచనాన్ని పాలించి సద్భావంతో మంచిగా వ్యవహరించు. సత్సాంగత్యంలో మనస్సు నిలిపి, దుర్జనులను దూరంగా పంపివేయి. ఎంతటి విపరీత పరిస్థితులు కలిగినా స్వధర్మాచరణ మానవద్దు. ధర్మపాలన చెయ్యి. దుష్టులను సంహరించు. అహోరాత్రాలు సద్భజనలో నీ శరీరాన్ని సానబెట్టు. ఓ రాజా! శమము, దమము, ఉపరతి, దయ, క్షమ, తితిక్ష, శాంతులను అహోరాత్రాలు ప్రీతితో రక్షించు. ఆత్మప్రాప్తి కోసం భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు, ఆనందం, సద్విద్య, సమాధానాలను నీవు అనుదినం అంటిపెట్టుకుని ఉండు. దైవకృప వలన అపారమైన జ్ఞానం లభించినా అణుమాత్రం కూడా అహంకరించకు. కాలాంతరంలో దారిద్ర్యం ప్రాప్తించినా ధైర్యాన్ని వీడవద్దు. ఓ రావణా! ఈ విధంగా నేను చెప్పేది బాగా ఆలకించు. నా మాటలను సద్భావంతో స్వీకరించి త్రికరణశుద్ధిగా అయోధ్యాపతితో చెలిమి చెయ్యి. శ్రీరాముడు కేవలం గుణనిధి. ఇతరుల దోషాలను విస్మరించి, సదా అంతరంగంలో పరిశుద్ధుడై ఉంటాడు. రఘునందనుడు ఇతరుల సద్గుణాలను అభినందిస్తాడు. శ్రీరామునిది ఒకేబాణం! ఒకే మాట! ఒకే భార్య! నీవు రాఘవునితో సఖ్యంగా ఉండి జానకిని అర్పిస్తే ఆచంద్రార్కం అక్షయంగా



లంకానగరాన్ని పాలిస్తావు. నీవు ఎవరి భక్తుడవని అంటావో, ఆ పరమశివుడే రఘుపతిని ధ్యానిస్తాడు. అట్టివారితో వైరం పెట్టుకోవటం నిజంగా స్వామిద్రోహమే అవుతుంది. సనకసనందన సనత్కుమారులు ముఖ్యంగా బ్రహ్మ, ఇంద్రుడు ఎవరి అజ్ఞను పాలిస్తారో, ఎవరు వేద ఉదయాచలానికి దినకరుడో, మహామాయకు వరుడో, అట్టి అయోధ్యానాథుడు, ఉదారుడు, నీలమేఘశ్యాముడు, గుణసాగరుడు, సీతావల్లభుడు, కమలోద్భవుడు, కమలాకరుడు, అనంత బ్రహ్మాండానికి ఆది అయినవాడు, శంకరుడు ఎవని ఆజ్ఞను పాలిస్తాడో అట్టి జగద్వంద్యుడు, వేదశాస్త్రపురాణాలు తెలిసిన నారదాదులు ఎవరి గుణాలు గానం చేస్తారో అట్టి శేషశయనుడైన రఘువీరునితో స్నేహం చెయ్యి. శతకోటి అపరాధాలు చేసినా, తిరిగి వచ్చి శరణు వేడితే రఘునందనుడు అట్టివానిని అందరికంటే ఎక్కువగా ప్రేమిస్తాడు. భక్తిభావంతో నువ్వులు సమర్పించినా బంగారుకొండవంటి మనస్సుకల రాముడు భక్తులకు ద్వారపాలకునిలా ఉండి అంతర్‌బాహ్యాలలో కూడా రక్షిస్తాడు. అందువల్ల ఓ రావణా! రాముని శరణు వేడు. జానకిని నీ కన్యగా భావించి రాఘవునికి సమర్పించు. ఓ దశకంఠా! నీవు పరమజ్ఞానివి. వేదాలనే ముక్కలుచేసి పారేశావు. సూర్యకులభూషణుడైన రాముని సర్వస్వంగా భావించి స్నేహం చెయ్యి' అలా అంగదుడు వివేకవంతమైన పదజాలంతో భక్తిసాగరంలోని రత్నాలను లంకేశ్వరునకు సమర్పించాడు.

అందుకు పరమకుబుద్ధి, దుర్విచారుడైన దశకంధరుడు ఆహుతిగైకొన్న అగ్నిలా కోపాగ్నితో ప్రజ్వరిల్లాడు. సాధువుల ఆంతర్యం తెలుసుకోవడానికి దుర్జనులు కుట్రపన్నినట్లు అంగదునితో రావణుడు 'ఓరీ కోతీ! అనాచారుడా! ఎవరు నువ్వు? ఆకులు తినేవాడా! ఒరే పామరుడా! నేను రావణుడను. ఇక్కడకు వచ్చి నాకే నీతులు బోధిస్తావా? మశకా! అగ్నిముందు గడ్డిపోచవలె, శివుని ముందు మన్మథునివలె మాడిపోతావు. సింహానికి నక్క నీతులు

బోధించినట్లు నాకే నీతివాక్యాలు చెబుతావా! ఒరే కోతీ! నీ తండ్రి ఎవరో నాతో చెప్పు!' అని అనగా తారాతనయుడు ఈ విధంగా బదులిచ్చాడు. 'నా తండ్రి ఎవరు అని అడిగావు కదూ! ఓరీ దుర్జనా! నా తండ్రి ఎవరో నీకు ఇంతవరకు తెలియదు కదూ! ఎవరైతే నిన్ను చంకలో ఇరికించుకుని నాలుగు సముద్రాల్లో స్నానం చేయించారో వారే నా తండ్రి. నా చిన్నతనంలో నా తండ్రి నిన్ను నా ఊయలకు ఈగలాగా వేలాడకట్టగా నేను నీ గడ్డాన్ని మీసాలను పీకుతుండేవాడిని. ఓరీ అనామకా! ఆ సమయంలో నేను నీ మీద మూత్రం పోసినందువల్ల నీ మనస్సు నొచ్చుకున్నది. తరువాత నీ తండ్రి పుత్రభిక్ష పెట్టమని నా తండ్రి వాలిని అర్థించాడు. నీ ముఖానికి మసిపూసి తలను పంచశిఖలతో గుండు చేయించి కాళ్ళుపట్టుకుని గిరగిరా తిప్పి లంకలోకి విసిరివేశాడు. నిన్ను శిక్షించడానికి ఇక్కడకు వచ్చాను. ఇంకా నేను ఎవరి దూతను అని అడిగావు. నీ గుండెలమీద పడివున్న వింటిని అలవోకగా లేవనెత్తి అవలీలగా విరిచేసి, తాటకను సంహరించి, సుబాహుసహితంగా ఇరవై కోట్ల రాక్షసులను నేలకూల్చి, మారీచుని శరవేగంతో ఎగురకొట్టిన రఘునందనుని దూతను. నీ చెల్లెలు శూర్పణఖను ముక్కు లేకుండా చేసిన సౌమిత్రి అగ్రజుడు, ఈశ్వర సఖుడు, అయోధ్యాపతి రఘునాథుని దూతను నేను. ఖరదూషణులను వధించి జనస్థానాన్ని నిష్కంటకం చేసిన సింహబలుడైన ఆ రఘురాముని సొమ్మును నక్కలా దొంగిలించి తీసుకొచ్చావు. యజ్ఞశాలలోనికి దొంగతనంగా వెళ్ళి పురోడాశాన్ని తెచ్చిన కుక్కవలె, దేవతా గృహంలోకి మలినుడు, హింసకుడు జొరబడినట్లు, ఇంటిలో యజమాని లేనప్పుడు దొంగ కోశాగారంలో ప్రవేశించినట్టునీవు జానకిని దొంగిలించావు. చోరుడవైన నిన్ను పట్టుకోవడానికి త్రికూటపర్వతానికి విచ్చేశాడు సీతారమణుడు. నీ ఆయుష్షు గడువు తీరిపోయింది. శతమూర్ఖుడవైన నీకు ఇది బోధపడటం లేదు.'



బదులుగా రావణుడు 'ఒరే మర్కటమా! నేను దశవదనుడను. కుంభకర్ణుడు రామలక్ష్మణులను వానర సహితంగా క్షణంలో మ్రింగివేయగలడు. దేవతలతో సహా దేవేంద్రుని బందీగా తీసుకుని వచ్చిన నాకు, మానవులయిన రామలక్ష్మణులను నిర్జించటం ఒక లెక్కా! పాము తలనున్న మణిని తీసుకెళ్ళిన గరుడుడు తిరిగి దానిని పాముకిస్తాడా? ఏనుగు తలను చీల్చి ముత్యాన్ని కైవసంచేసుకున్న మృగరాజు భయపడి దానిని తిరిగి ఇచ్చేస్తాడా! అవి సంభవాలైతే నేను జానకిని తిరిగి ఇవ్వడం జరుగుతుంది. అరే! అనుదినం ఇంద్రుడు మాలకట్టి నాకు తెచ్చిస్తాడు. చంద్రుడు ఛత్రం పడతాడు. సూర్యుడు దీపం పట్టుకుంటాడు. వరుణుడు నీళ్ళు మోస్తాడు. అగ్ని గుడ్డలుతుకుతాడు. గాలి ఇంట్లో చెత్తనూడుస్తాడు. అటువంటి సమర్థుడనైన నన్ను నరవానరులు ఏం చేయగలరు? వెనుకటికి ఒక వానరుడు దొంగవలె లంకకు వచ్చాడు. అశోకవనాన్ని ధ్వంసం చేస్తే పట్టుకొని సభకు తీసుకొచ్చారు. తోకకు నిప్పంటిస్తే నగరాన్ని కాల్చి పారిపోయాడు. వాడు తిరిగి మరలా వస్తే చూర్ణం చేసేస్తాం' అని అన్నాడు.

ప్రతిగా వాలిపుత్రుడు ఇలా అన్నాడు. 'ఓరీ మశకా! రాక్షసా! విను! నీ కొడుకును వధించి, ఇంద్రజిత్తును గుహలో తోసి అశోకవనాన్ని విధ్వంసం చేశాడు. అప్పుడు నీ బలం ఎక్కడికి పోయింది? ఖలుడా! మలినుడా! దుర్జనుడా! నిన్ను శిక్షించడానికే మరలా మారుతి వచ్చి ఉన్నాడు. ముల్లోకాధిపతి, ముల్లోకాలకు మూలస్తంభమైన శ్రీరాముని మామూలు మానవుడని నీవు సంబరపడుతున్నావా? ఒరే! గాడిదా! పిల్లకాలువలు – భాగీరథి, ఏనుగులు – ఐరావతం, గుర్రాలు – సూర్యుని రథానికి కట్టబడిన ఉచ్చైశ్శ్రవము, మిణుగురుపురుగు – సూర్యుడు, కాకి – గరుడుడు, వానరులు – వాయునందనుడు, పాషాణాలు – పరుసవేది, పశువులు – శివునివాహనమైన నంది, తారలు – చంద్రుడు, పర్వతాలు – కనకాద్రి, పాములు – ఆదిశేషువు

ఎన్నటికీ సమానం కావు. అలాగే మామూలు మనుషులు – రాఘవేంద్రుడు సమానం అనుకున్నావా? ఓరీ అపవిత్రా! నీవు ఆ మాట ఎలా అనగలిగావు. నీవు పదితలలున్న గొర్రెవు. శివునికి తల్లి సీతాదేవి. నిశ్చయంగా ఆమే ఆదిమాయ, భవాని. రణరంగమే హోమకుండము. అపారంగా రాక్షసులు అందులో ఆహుతి అయిపోతారు. చివరకు నీవు పూర్ణాహుతయి పోతావు. గాడిదకు చందనం రాసినట్టు, నీ వేదాధ్యయనం వ్యర్థమే. షడ్రసాలలో కలియ తిప్పినందువల్ల గరిటకు రుచి తెలుస్తుందా? నీవు పదిముఖాలతో నున్న వనచరుడవు. నిన్ను వధించటానికి విలుకాడైన రాముడు సమరధీరుడై త్రికూటాచలానికి విచ్చేసాడు'.

అతి పరుషమైన ఆ అంగదుని మాటలు వాడియైన బాణాలవలె హృదయంలో గుచ్చుకోగా రావణుడు పరమకుపితుడై వాలినందనునితో ఇలా అన్నాడు. 'ఓరీ! మర్కటా! వనచరా! నీవంటి పామరుడు భూమికే భారం. నీ తండ్రిని చంపి నీ తల్లి తారను, సుగ్రీవునికి ఇచ్చాడు. దానికి ప్రతీకారం చేసి తండ్రి ఋణం తీర్చుకోవా? చేతకాకపోతే సముద్రజలాల్లో మునిగి జీవితం చాలించు. లేకపోతే ఓరీ మశకా! నా వెనుక నుండి త్వరగా పారిపో! సుగ్రీవుని వధించి రఘునందనుడు నీకు కిష్కింధారాజ్యమిస్తాడా! నీ తల్లి వ్యభిచారిణి కాబట్టి సుగ్రీవుని వరించింది. నిజంగా సుగ్రీవుడు, రఘువీరుడు నీకు ప్రధానశత్రువులు' అని దుర్బోధ చేయగా అంగదుడు 'వాలి రామబాణంతో ముక్తుడైనాడు. రాఘవుని మహిమ వల్ల వాలి అక్షయమైన సాయుజ్యపదాన్ని పొందాడు. దశముఖా! నిన్ను ఈ క్షణమే శిక్షిస్తాను చూడు! నా ముష్టిఘాతాలతో నిన్ను ముక్కలు ముక్కలు చేస్తాను. ఓరీ! అపవిత్రా! నీ శక్తి సామర్థ్యాలేమిటో ముల్లోకాల్లో అందరికీ బాగా తెలుసు. నిన్ను ఒకరోజు సహస్రార్జునుడు బందీ చేసినప్పటికీ ఇంకా సిగ్గులేకుండా తలెత్తుకు తిరుగుతున్నావు. వెనుక నీవు బలిచక్రవర్తి ఇంట బందీగా పడి ఉన్నావు. అక్కడ దాసి నిన్ను పురుగులాగా



పట్టుకుని, చంకలో ఇరికించుకొని ఎడతెరిపి లేకుండా తిట్టిపోసింది. అటువంటిది నీ ప్రతాపం. ఇంకా సిగ్గులేకుండా నీ ముఖం ఎలా చూపిస్తున్నావు! నీ పదితలలు ఖండించడానికి రఘువీరుడు ఆయత్తమయినాడు' అని అనగా రావణుడు మెరుపువేగంతో అంగదునిపై బాణం వేశాడు. సేవకులతో ఆ కోతిని పట్టుకోండి అని ఆజ్ఞాపించాడు. బలశాలురైన నలుగురు రాక్షసులు అంగదుని పట్టుకోవడానికి వేగంగా పరుగెత్తారు. క్షణకాలంలో అంగదుడు ద్వారం వద్ద నిలబడి అద్భుత పరాక్రమం ప్రదర్శించాడు. యమకింకరునివలె గర్జించగా ఆ శబ్దానికి ఆకాశం దద్దరిల్లింది. రావణుని గుండెలపై తోకతో గాయాలు చేశాడు. రావణుని కిరీటాన్ని త్రుటిలో కాలిబొటనవ్రేలితో ఆకాశానికి ఎగురగొట్టాడు. క్షణకాలంలో ఆ సభా మండపాన్ని తలపై నిడుకుని ఆకాశానికి ఎగురగా పధ్నాలుగు గ్రామాల విస్తీర్ణంలో సూర్యకిరణాలు తక్కువగా ప్రసరించాయి. భుజాలపైనున్న నలుగురు రాక్షసుల ప్రాణాలు పైకెగిరిపోయాయి. వాలినందనుడు ఆకాశమార్గాన వెడుతుంటే వాళ్ళు ప్రేతాల్లా వేలాడసాగారు.

అకస్మాత్తుగా వస్తున్న అంగదుని చూచి ఆశ్చర్యపడ్డాడు జానకీరమణుడు. ఎంతో ఆనందించాడు సుగ్రీవుడు. భుజాలపైనున్న ప్రేతాలను దించి, మండపాన్ని భూమిపైనుంచి ముల్లోకాధిపతియైన రాముని చరణాలకు మోకరిల్లాడు అంగదుడు. ప్రీతితో భ్రమరం పద్మంలోని సుగంధాన్ని సేవించినట్టు, అంగదుడు రఘువీరుని పదాంబుజాలను సేవించాడు. జగన్నాథుడైన శ్రీరాముడు అంగదుని ప్రేమగా అక్కున చేర్చుకుని ఆలింగనం చేసుకున్నాడు. వాలిపుత్రుని చూచి వానరులంతా ఎంతో ఆనందించారు. రావణుని కిరీటాన్ని అంగదుడు శ్రీరాముని ముందుంచగా దానిని రఘురాముడు వెంటనే విభీషణుని శిరస్సున అలంకరించాడు. శ్రీరాముడు అంగదునితో 'రాబోయే కాలంలో విభీషణుడు సింహాసనంపై ఎక్కడ

కూర్చుంటాడు? అందువల్ల ఈ మండపాన్ని యథాస్థానంలో ఉంచిరా!' అన్నాడు. ఆ మాటలు విని వాలిసుతుడు ఆదిశేషువు భూమిని తలపై ఉంచుకున్నట్లుగా మండపాన్ని తలపై నిడుకుని యథాస్థానంలో ఉంచి త్రికూటాచలానికి తిరిగి వెళ్ళిన అంగదుని బలపరాక్రమాలకు రాక్షసులు ఆశ్చర్యచకితులైనారు.

ఇక్కడ రాఘవునితో వాలినందనుడు లంకలో జరిగిన సంగతులన్నీ వివరించాడు. 'పర్వతశిఖరంపై మేఘాలు ఎంత వర్షించినా నీరు నిలవనట్లు రావణునికి ఎన్ని నీతులు బోధించినా ఏమీ తలకెక్కలేదు. ప్రతిరోజు కాకి పాలలో స్నానం చేసినా ఎన్నటికి రాజహంస కాలేనట్లు, పెరుగులో బొగ్గును ఎన్నిరోజులుంచినా తెల్లబడనట్లు, ఇసుకను ఎంత దంచినా అది ఎన్నటికీ మెత్తబడనట్లు, పరుసవేదిని వదిలి పాషాణాన్ని తెచ్చుకున్నట్లు, పుట్టుగుడ్డి ముందు దీపం వుంచినట్లు, బధిరుని ముందు రుద్రవీణ వాయించినట్లు, శతమూర్ఖుని ముందు నీతి బోధించటం వ్యర్థం. గుమ్మడి కాయలో చక్కెర బాగా కూరి ఎన్ని దినాలుంచినా, దానికి ఏమాత్రం తీపి అంటదు. ప్రేతానికి షోడశోపచారపూజ ఎంత చేసినా ఏం ఫలం? ఆ విధంగా లంకానాథునికి ఎంత బోధించినా వ్యర్థమే. సూర్యచంద్రులున్నంత వరకు విభీషణుడు రాజ్యం చేస్తాడు. ఓ సీతా రమణా! మీ మాట ఎన్నటికీ వ్యర్థం కాదు. యుద్ధం లేకుండా జానకిని రావణుడు ఎన్నటికీ తిరిగి ఇవ్వడు.'

## భీకరయుద్ధారంభం

ఈ మాటలు విన్నంతనే వీరోత్తముడైన రాఘవేంద్రుడు బలిష్ఠమైన తన బాహుదండాలను చరిచి కోదండంపైనున్న ఆచ్ఛాదన తొలగించగానే సూర్యోదయంతో చీకటి నశించి వెలుగులు విరజిమ్మినట్లు కోదండం కాంతులు వెదజల్లింది. సీతారాముడు నిలబడి క్షణంలో వింటికి నారిని సంధించి టంకారం చేయగా, ఆ ధ్వనికి సప్తద్వీపాలు దద్దరిల్లాయి. కాలుడే అదిరిపడేటట్టుగా



సుగ్రీవుడు వేసిన రంకెకు పద్దెనిమిది పద్మాలవానరులు హుంకారాలు చేస్తూ లేచారు. డెబ్బైరెండు కోట్ల భల్లూకాల నినాదాలతో ఆకాశం తల్లడిల్లి తన కంఠాన్ని, దిగ్గజాలన్నీ గుంపుగా కూర్చుంటే ఆ బరువుకు కూర్మం తన వీపును సవరించుకున్నాయి. యజ్ఞవరాహం తన దంతాలను సర్దుకుంది. వానరులంతా ఒక్కపెట్టున చేసిన హుంకారాలకు దేవతలు కూడా ఉలిక్కిపడ్డారు. ఆ ప్రదేశమంతా దుమ్ముధూళితో నిండిపోయింది. మేరుపర్వతం కంపించింది. ఏనుగుపైకి లంఘించే మృగరాజు వలె ఎలాంటి జంకు, గొంకు లేక ఇరవై కోట్ల వానరులతో సుషేణుడు లంక పైకి లంఘించాడు. సకలపాపాలను రామనామం త్రుటిలో ఎలా మాడ్చిమసిచేస్తుందో అలా వానరోత్తముడైన అంజనాతనయుడు, రాక్షసులను మట్టుబెట్టడానికి పరిగెత్తాడు. సకలవానరగణాలకు సేనాపతియైన నీలుడు వాయువేగంతో పరుగుతీసాడు. ఆ కోలాహలానికి ఎగసిన ధూళికి ఆకాశమంతా నిండిపోయి కల్పాంతమయిందా అన్నట్టుగా తల్లడిల్లింది. సముద్రం చెలియలికట్ట దాటి భూమిని ముంచెత్తింది. నీటిపై తేలియాడే గుమ్మడికాయలా భూమండలం ఊగిసలాడింది. ఆకాశం ఊగి తారలు ఢీకొని నేలరాలాయి. మేరుపర్వతాలవంటి లంకానగరం బురుజులపైన బాణాలరాశులు ప్రళయకాలపు మెరుపుతీగల్లా మెరుస్తున్నాయి. లంకా దుర్గం పైకి బలిష్ఠులైన ప్రతాపశూరులు ఎగబ్రాకి రాక్షసుల జుట్టుపట్టుకుని ఒక్క ఊపుతో నేలమీద పడేశారు. అద్భుతమైన పెద్దపెద్ద యంత్రాలెన్నిటినో అసురులు యుద్ధానికి సిద్ధం చేశారు. వానరసేన అతిశక్తివంతమైన శస్త్రాలను రాక్షసులపై ప్రయోగించింది. కోటానుకోట్ల పర్వతాలను ఒక్కసారిగా వానరులు తెచ్చి పడవేయగా యంత్రాలతో సహా రాక్షసులు నుగ్గునుగ్గు అయ్యారు. దుర్గంపైనున్న రాక్షసులను గురిచూచి వానరులు శస్త్రఘాతాలతో హింసించారు. అదే సమయంలో దుర్గ శిఖరం కూలి రాక్షసప్రేతాలను

భయకంపితులను చేసింది. తోకను తాడుగా విసిరి అసురుల కంఠాలకు చుట్టి ఒక్కసారి కుదిపి లాగగా రాక్షసులు ప్రేతాలవలె కందకంలో పడ్డారు.

ఒక వానరుడు అకస్మాత్తుగా ఎగిరి రాక్షసుల కాళ్ళు పట్టుకుని గిరగిరా త్రిప్పి ఆకాశంలోకి ఎగరేస్తే వారు నేలకు కొట్టుకొని మరణించారు. ఒకడు రాక్షసుల పొట్టచీల్చగా, ఒకడు కాళ్ళు చేతులు ముక్కు విరిచేశాడు. ఒకడు ప్రేతంలా భుజంపై వేలాడదీసి లంకంతా తిప్పాడు. ఆ విధంగా ఎక్కువమంది రాక్షసులు మరణించారు. గోపురం పైనుండి రావణుడు గమనించగా, దశదిశలు ఆకాశం అంతా వానరమయంగా గోచరించింది. దశకంధరుడు తన సైన్యాన్నుద్దేశించి, ఏం చూస్తున్నారు? త్వరగా బయటకు పదండి. సమస్తవానరులను సంహరించి సమరభూమిని తుడిచివెయ్యండి అని ఆజ్ఞాపించాడు. చతురంగదళాలతో కోటానుకోట్ల రాక్షస సైన్యం లంకనుండి బయలుదేరింది. పర్వతసమానమైన రాక్షసులు అందవికారమైన ముఖాలతో, నుదుట ఎర్రని కుంకుమతో, పొడవైన వెంట్రుకలతో, తెల్లని గడ్డం, నాలుక రక్తం ఓడుతుండగా, నిప్పుకణికలవలె కళ్ళు రక్తసిక్తమై, విపరీతంగా మద్యం సేవించి శస్త్రాలు చేతబూని తూలసాగారు. దేవతల శిరస్సులుగల చిత్రపటాలను పాదాలకు దారంతో కట్టి, తొడలమధ్య కంకాళాలు మెరుస్తుండగా ఆవేశంతో గర్జించసాగారు. తళతళలాడే డాలు, కత్తి, శక్తి, శూలము, బల్లెము, గద, పరిఘ, చక్రాలు చేబూనారు. ముంజేతికి చామరాలు వేలాడుతున్నాయి. వానరుల బొమ్మలు గజ్జెల వలె కాళ్ళకు ధరించారు. అందరూ కలసి భూమండలమంతా అదిరిపోయేటట్టుగా పెద్దగా 'దేవతలంతా పారిపోయారు. మిమ్ములనందరిని రామునితో సహా మింగివేస్తాము' అంటూ గర్జించసాగారు.

తరువాత మనోహరమైన నానాజాతి అశ్వాలపై రాక్షసులు ఖడ్గధారులై వెళ్ళసాగారు. వెనుక ఐరావత సమానమైన గజదళం, వాటిపై శూలం చేబూనిన అసురులున్నారు. వాటిననుసరించి అంబరాన్ని అతిక్రమించినట్లున్న ధ్వజాలతో,



రత్నఖచితమైన చిత్రాలతో రంగులీనుతున్న రథాలు నడువసాగాయి. వాటికి మేలుజాతి ఉత్తమాశ్వాలను పూన్చారు. సంగ్రామ సంకేతమైన దుందుభులు మ్రోగించారు. రణ వాద్యాలతో, బాకాలతో యుద్ధరంగం ప్రతిధ్వనిస్తుండగా ఒక పద్ధతిలో ఇరుసేనలు తలపడ్డాయి. జయయశస్వీ! అయోధ్యానృపవరా! అంటూ వానర వీరులు పరుగులిడుతూ, రాక్షసులను వృక్షాలతో గాయపరచి యుద్ధంలో మట్టి కరిపించారు. యమునివలె వానరులు పరుగు పరుగున పర్వతాలు, పెద్దకొండరాళ్ళు అసురులపై వేసి వారి శరీరాలను తుత్తునియలు చేశారు. రాక్షసులు తమ బలప్రయోగంతో కోటానుకోట్ల కపుల శిరస్సులను, టెంకాయలు ఎగరవేసినట్లు ఆకాశంలోకి ఎగురవేశారు. చెరకు గడలను ముక్కలు చేసినట్లుగా వానరుల చేతులు కాళ్ళు విరచి ఒకకుప్ప పోశారు. డాలుతో తమను కాపాడుకొంటూ బల్లేలతో బలంగా వానరులను పొడవబోతే, లెక్కలేనంతమంది వానరులు లంఘించి రాక్షసుల గుండెలను చీల్చగా ఎవరెవరో తెలియని స్థితిలో ఎంతోమంది మరణించారు. ఆవేశంగా కపులు బండలు వేయగా, రాక్షసుల ముఖాలు పచ్చడై, రక్తం బొటబొటా కారి, తలలు ముక్కలై ఆకాశానికి ఎగిరాయి. పైకెగిరిన ఆ శిరస్సులు స్వర్గమార్గాన్ని ఛేదిస్తూ వెళ్ళి అది కూడా నశ్వరమని తెలిసి సీతాపతిని చూడటానికి క్రిందకు దిగి వస్తున్నాయా అన్నట్లున్నాయి.

రణరంగంలో అందరూ కలసి నాట్యం చేస్తూ రెండు చేతులతో చప్పట్లు కొడుతూ, మాకు ఇక్కడ నాట్యం చేయడమే పని, అని ఆనందించసాగారు. తెగిపడ్డ శిరస్సులు, మేము మోక్షం పొందుతాం, మీకు ఇది ఎన్నటికీ సాధ్యం కాదు అని రణరంగంలోని భీరులవద్ద పకపకా నవ్వాయి. ఈ విధంగా వానరవీరులు విజృంభించి ఉద్దండమైన గజదళాన్ని చూచి వాటి కుంభస్థలాలను పెకలించి ఆకాశానికి ఎగురవేశారు. ఏనుగు దంతాలు అవలీలగా విరచి మావటిని వాటితోనే గాయపరచి కుంభస్థలాలను ఛేదించారు. ఏనుగుల తోకను

పట్టుకొని గిరగిరా త్రిప్పి ఆకాశంలోకి ఎగురవేసి దాన్ని లక్ష్యంగా చేసుకుని ఇంకో ఏనుగును విసిరేవారు. అలా ఒకదాని వెనుక ఒకటి ఆకాశంలో గుండ్రంగా పరిభ్రమించేవి. ఒక గుర్రం కాళ్ళు పట్టుకొని రౌతుతో సహా నేలకేసి బాదేవారు. వృక్షాలతో సహా పర్వతాలను తటాలున రథాలపై వేయగా రథసారథితో సహా నుగ్గునుగ్గయ్యేవి. అలా సురావతారాలైన వానరులు మూడు రాత్రులు, మూడు పగళ్ళు తారాస్థాయిలో యుద్ధం చేయగా రాక్షసులు పారిపొయ్యారు.

జరిగినదంతా కలయజూచి రణదక్షుడైన ధూమ్రాక్షుడు రథారూఢుడై వేగంగా బాణాలు వేసి లక్షలాది వానరులను నేలకూల్చాడు. వానరులంతా శిలలు, పర్వతాలు తెచ్చి పైన పడవేసినా చతురుడైన ఆ ధనుర్ధారి వాటిని పిండిపిండి చేశాడు. అసంఖ్యాకమైన వానరగణాలను క్షణం లోపల ధూమ్రాక్షుడు సంహరించాడు. మిగతా వానరసైన్యం పారిపోయింది. ఇంతలో హనుమంతుడు పరుగున వచ్చి ఒక పర్వతాన్ని ధూమ్రాక్షుని పైనవేశాడు. దాంతో గుర్రాలు రథం చూర్ణమయ్యాయి. తెలివిగా రాక్షసుడు పైకెగిరి తప్పుకున్నాడు. గరుడుని తేనెటీగ కుట్టి చంపాలనుకున్నట్లు ధూమ్రాక్షుడు శూలంతో మారుతిపైకి వచ్చాడు. ఏనుగుపైకి లంఘించే మృగేంద్రంలా ఆవేశంగా వాయుపుత్రుడు ముష్టిఘాతాలతో ఆ రాక్షసుని శిరస్సును మట్టికుండవలె చూర్ణం చేశాడు. ఏనుగుపై పర్వతం పడ్డట్టు, మహావృక్షం కూలిపోయినట్టు, ధూమ్రాక్షుడు విగతజీవుడై నేలరాలాడు. మనసు దృఢమైతే ఇంద్రియాల ఆటలు సాగనట్టు, మనసు దేనియందు నిలువదో దానిపై ప్రీతి కలగనట్టు, ధూమ్రాక్షునికి పట్టిన గతి చూచి క్షతగాత్రుల కళ్ళ భ్రమలు తొలగిపోయి పలాయనం చిత్తగించారు. ధూమ్రాక్షుడు అంతరించాడన్న వార్తవిని రావణుడు చింతాక్రాంతుడయ్యాడు. వజ్రదంష్ట్రుని సైన్యంతోసహా రణరంగానికి వాయువేగంతో వెళ్ళవలసిందని ఆజ్ఞాపించాడు. ఆ తరుణంలో వానరులు



రాక్షసులు తలపడగా రాక్షసులు వానరవీరులను నేలకూల్చసాగారు. వజ్రదంష్ట్రుడు రథారూఢుడై వానరసైన్యంతో తలపడి రెండు లక్షలమందిని హతమార్చాడు. ఇది చూచి వాలిసుతుడు వేగంగా పరుగెత్తి వందలాది పర్వతాలను తెచ్చి యమునివలె శత్రువులపై పడేశాడు. ఆ పర్వతాల హోరులో ఒక అక్షౌహిణి రాక్షస సైన్యం మరణించింది. నేలంతా రక్తం ప్రవహించసాగింది. ఆ సమయంలో తారాతనయుడు ఎన్నో శిఖరాలున్న ఒక మహాపర్వతాన్ని పెకలించి పరమావేశంతో వజ్రదంష్ట్రుని పైకి విసిరాడు. కానీ వజ్రదంష్ట్రుడు ఒక్క బాణంతో దాన్ని నుగ్గుచేశాడు. ఇది చూచి పరమప్రతాపి అయిన అంగదుడు మహా వృక్షాన్ని పెకలించి హుంకారంతో ఆకాశం దద్దరిల్లేట్లు వజ్రదంష్ట్రుని వృక్షంతో చావబాదాడు. నల్లిని నలిపినట్లు నలచడంతో శరీరం నుగ్గునుగ్గై రక్తసిక్తమైంది ఆ ప్రదేశమంతా.

క్షణంలో అకంపనుడు సైన్యంతో యుద్ధానికి వచ్చి వానరదళంపై అసంఖ్యాకమైన బాణాలు సంధించాడు. సింహం పంజా దెబ్బకు ఏనుగు మరణించినట్లు, హనుమంతుని వృక్షఘాతాలకు అకంపనుడు తనువు చాలించాడు. రాక్షసుల హాహాకారాలు విని దశకంధరుడు శోకార్ణవంలో మునిగిపోయాడు. అప్పుడు జ్యేష్ఠకుమారుడైన ఇంద్రజిత్తు తండ్రిని శాంతపరచి, 'రాజా! నీవు దుఃఖించనవసరములేదు. నీ శత్రువును ఈ రోజు రణరంగంలో పట్టుకోకపోతే నా పేరు ఇంద్రజిత్తు కాదు. నేను ఏ జంతువు కడుపునో పుట్టాననుకుంటాను' అంటూ ఇంద్రజిత్తు తండ్రికి నమస్కరించి అపారమైన సైన్యంతో బయలుదేరాడు. అసంఖ్యాకమైన ఆ సేనాసముద్రం సత్వరంగా రణభూమికి విచ్చేసింది. రణకోవిదులు, శూరులు అయిన వానరవీరులు శిలలు, తరువులు గైకొని అసురులపై, కాకుల మీదికి రాజహంసలవలె కలయబడ్డారు. రాళ్ళలో రత్నాల వలె ప్రకాశించే ఈ వానరవీరుల ప్రతాపం ముందు రాక్షసులు నిస్సహాయులయ్యారు. వానరుల ప్రతాపంచూచి ఇంద్రజిత్తు

రథాన్ని ఆ వైపు తిప్పాడు. అది చూచి వాలిపుత్రుడు మహాపర్వతాన్ని గైకొని లంఘించాడు. ప్రతాపవీరుడైన జంబుమాలితో వాయుకుమారుడు, విద్యున్మాలి పైకి సుగ్రీవుని మామ అయిన సుషేణుడు, జంఘునామి పైకి వీరుడైన నలుడు తలపడ్డారు. రణమండలమంతా హాహాకారాలు సింహనాదాలు ఆకాశాన్నంటాయి. లెక్కలేనన్ని వానర రాక్షసప్రేతాలు, గులకరాళ్ళు, ముత్యాలు కలిసి కుప్పగా పడివున్నట్లుగా ఉన్నాయి. హనుమంతుడు జంబుమాలిని కాళ్ళుపట్టుకొని చీల్చాడు. అదేసమయంలో సుషేణుడు విద్యున్మాలిని, నీలుడు జంఘునామిని నేలకేసి కొట్టి చంపేశారు. ఇంతలో సూర్యుడు అస్తమించగా చీకటి నలుదిశలా వ్యాపించింది. ఎవరెవరో కనబడటం లేదు. ఎవర్రా అక్కడ? అని అసురులు ప్రశ్నించగా మేము రాముని దూతలమని సమాధానం చెప్పిన కపులపై రాక్షసులు హఠాత్తుగా కలియబడి హింసించేవారు. ఎవర్రా అక్కడ? అని వానరులు అడుగగా మేము రాక్షసులమని చెప్పగా కపివర్యులు వారిపైబడి చూర్ణంచేసేవారు.

### నాగపాశబంధనం

ఇంతలో చంద్రుడుదయించటం చూచి అందరూ ఆనందపడ్డారు. వానరవీరులు అసురుల పరాక్రమాన్ని దారుణంగా అణచివేశారు. ఆ సమయంలో ఇంద్రజిత్తు రథంతో సహా సేనలతో పైకెగిరి మేఘాలచాటున దాగి సర్పబాణాలను వర్షించసాగాడు. రాక్షసుల కపటం అద్భుతమైనది. బాణాలు సర్పాలై వానరుల దేహంపై తిరుగసాగాయి. దాంతో వారు ఖిన్నులైనారు. కాని రామలక్ష్మణులపై ఇంద్రజిత్తు సర్పబాణాలువేయగా, శ్రీరాముడు వెంటనే నలుదిశలు పరికించి ఈ బాణాలు ఎక్కడినుండి వస్తున్నాయి? దీని సంధానకర్త కళ్ళకు కనబడడేమి? యుద్ధభూమిలో కనబడితే వాడిని ముక్కలు చేస్తాను అన్నాడు. ఆ దురాత్ముని పట్టుకోవటానికి చాలామంది వానరులు పైకెగిరారు. ఆకాశమంతా వెతికినా ఇంద్రజిత్తు జాడ తెలియక



తిరిగివచ్చి మానవదనులై దిక్కులు చూడసాగారు. రామలక్ష్మణులకు లెక్కలేనన్ని బాణాలు తగలగా వారిరువురూ మూర్ఛిల్లి నేలపై పడిపోయారు. ఆ సమయంలో ఇంద్రజిత్తు పైనుండి 'ఏం రాక్షసులు తలపడగా రాక్షసులు వానరవీరులను నేలకూల్చసాగారు. వజ్రదంష్ట్రుడు రథారూఢుడై వానరసైన్యంతో తలపడి రెండు లక్షలమందిని హతమార్చాడు. ఇది చూచి వాలిసుతుడు వేగంగా పరుగెత్తి వందలాది పర్వతాలనుకున్నారు? ఖరదూషణులను చంపారు. శిలలతో సాగరానికి వంతెన కట్టారు. మేము క్షత్రియులము, రాజకుమారులము అంటారు. ఏం బాణాలు వదలడంలేదే?' అంటూ మిగతా వానరసైన్యంపై బాణాలు వేయగా వారు మొదలు నరికిన చెట్ల వలె నేలరాలారు. అగ్నిపూలతో పర్వతం సిందూరవర్ణంలో కనబడినట్లు అసంఖ్యాకంగా కపుల శరీరాలు రక్తసిక్తమైనాయి. ఇంద్రజిత్తు ముఖ్యులయిన రాక్షసుల ప్రేతాలను ఏరుకుని లంకకు వెళ్ళాడు. జయజయధ్వానాల ఘోషవిని లంకేశుడు ఎంతో ఆనందించి పుత్రుని హృదయానికి హత్తుకుని నీవల్ల నా జన్మ ధన్యమైంది అని అభినందించాడు. త్రిజటతో రావణుడు 'సీతను పుష్పకవిమానంలో కూర్చుండబెట్టుకొని రామలక్ష్మణుల ప్రేతాలతో సహా యుద్ధభూమినంతా చూపించు. అప్పుడైనా సీత నాకు వశమౌతుందేమో!' అన్నాడు. అవశ్యం అంటూ సీతను విమానంలో తీసుకెళ్ళగా, రామలక్ష్మణులు యుద్ధభూమిలో పడివుండడం చూచి సీత మూర్ఛిల్లింది. వెంటనే త్రిజట సీతను పట్టుకొని పైకెత్తి, 'తల్లీ! నీవు ధైర్యంగా ఉండు. కోదండపాణియైన రాముడు మేల్కొంటాడు' అని ఓదార్చింది. ఇంతలో విభీషణుని భార్యయైన సరమ రహస్యంగా విచ్చేసి విదేహపుత్రి చెవిలో 'ఓ జగన్మాతా! ధైర్యం వహించు. రామలక్ష్మణులు లేచి వచ్చి అసురులందరినీ సంహరిస్తారు. దీన్ని గూర్చి చింతించవద్దు. నేను ఎన్నడూ అబద్ధం చెప్పను. అసత్యమాడితే నా తల తెగిపడుతుంది. నా పూర్వీకులంతా ఆకల్పాంతం నరకాన్ననుభవిస్తారు' అని ఊరడించింది. త్రిజట

జానకితో 'మాతా! నీవు దిగులు పడనక్కరలేదు' అని అంటూండగా పుష్పకవిమానం అశోకవనంలో దిగింది. సీతను యథాస్థానంలో కూర్చుండబెట్టి త్రిజట రావణునితో 'సీతలోని సత్వగుణం కల్పాంతమైనా మారదు' అంది. త్రిజట సీత వద్దకు తిరిగి వచ్చి, ప్రక్కన కూర్చొని సీతతో 'చిత్తవృత్తులన్నింటినీ అంతర్ముఖం చేసి ఆత్మస్థితిలో విశ్రాంతి పొందమని' చెప్పింది. సరమ జనకనందినితో నీవు ఏమాత్రం దిగులు పడనక్కరలేదు. పురాణపురుషుడైన సారంగపాణి చేతలు నీకు తెలియవా? అమోఘమైన తన ప్రతాపాన్ని పెంపొందించుకొనేందుకు అయోధ్యాధీశుడు మొదట శత్రువుకు కీర్తినిచ్చాడు. ఇది ఆరంభం మాత్రమే. ఈ సకలసృష్టినంతా ఒక్క బాణంతో రఘునాథుడు దహించివేయగలడు. అటువంటప్పుడు దోమలాంటి ఇంద్రజిత్తును చంపడం ఒక లెక్కా! రావణుడు, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు వాళ్ళ భుజబలం ప్రదర్శించేందుకు ఒక అద్భుతమైన నాటకమాడారు. నీకు అంతా తెలుసు. రాత్రికాగానే సూర్యుడు ఉదయిస్తాడా లేదా అని అనుమానం ఎవరికీ కలుగదు. రామనామస్మరణ చేస్తే పాపాలు నశించి పోతాయి, ఆ విషయంలో ఎవరికీ సందేహం కలుగదు. శుద్ధజ్ఞాన ముదయించిన తర్వాత జననమరణాలు నశిస్తాయా, నశించవా అన్న సందేహం ఎవరికీ కలుగదు. క్షమ, శాంతి కలిగిన వానికి ఎవరితోనన్నా కలహం వస్తుందా అన్న అలోచన ఎన్నటికీ కలుగదు. అలాగే అయోధ్యానాథుడైన రఘునందనునికి జయం కలుగుతుందా, అపజయమా అన్న అనుమానం ఎవ్వరికీ రాదు. రామనామాన్ని స్మరిస్తే భక్తులు జయము, శుభము నొందుతారు. జానకీ! జగదానందుడు, పూర్ణపురుషుడైన శ్రీరాముని విజయం వరిస్తుందని చెప్పింది.

ఇక్కడ విభీషణుడు సుగ్రీవునితో ఏ సమయంలోనైనా రాక్షసులు పర్వతాన్ని తెచ్చి రామునిపై పడవేస్తారు అని అన్నాడు. తెల్లవారే లోపల వీరిని భద్రపరచాలని కన్నుల నీరు నింపుకొన్నాడు. జీవించి ఉన్న మిగతా వానరులు



తోకతో మండపం చేసి అందులో రామలక్ష్మణులను పదిలపరిచారు. అక్కడే వానరులంతా కూర్చుని బ్రహ్మాది దేవతలను గద్గదకంఠంతో ప్రార్థించసాగారు. సూర్యవంశభూషణుడైన దశరథుని మహాపుణ్యాల కొండయైన రాముని చుట్టూ చేరి చింతాక్రాంతులై ప్రార్థించారు. విభీషణుడు యుద్ధభూమిలో శోధించగా మారుతి క్రిందపడి ఉన్నాడు. ఒక కన్ను తెరిచి విభీషణునితో ఈ చరాచర జగత్తుకే జీవనమైన రఘునందనుడు సుఖంగా ఉన్నాడా? అని అడిగాడు. విభీషణుడు గద్గదకంఠుడై నీవేం దిగులు పడనక్కరలేదన్నాడు. గాయాలతో విహ్వలుడైన జాంబవంతుడు విభీషణుని దగ్గరకు పిలిచి పురాణపురుషుడు జగదాత్ముయైన రఘువీరుడు క్షేమమే కదా? అని ప్రశ్నించాడు. వెక్కి వెక్కి ఏడుస్తూ విభీషణుడు ఇద్దరూ నాగపాశబద్ధులైనారన్నాడు. వెంటనే సుషేణుడు మూర్ఛనుండి తెప్పరిల్లి కళ్ళుతెరచి ఇలా అన్నాడు 'ద్రోణాచలంలో ఎన్నో ఔషధాలున్నాయి. ఎవరైనా బలశాలి దానిని తెచ్చినట్లయితే రామలక్ష్మణులు మూర్ఛ నుండి మేలుకుంటారు' దానికి విభీషణుడు ఇంత రాత్రి వేళ ఔషధాన్ని తెచ్చే వీరుడెవ్వరని ప్రశ్నించాడు. జాంబవంతుడు ఒక్క అంజనేయుడు తప్ప వేరెవ్వరికీ అది శక్యం కాదు అన్నాడు. సుషేణుడు, జాంబవంతుడు, విభీషణుడు, ఆంజనేయుని వెంటబెట్టుకుని శ్రీరాముని వద్దకు వెళ్ళారు. అప్పుడు కిష్కింధానాథుడు వారితో ఇలా అన్నాడు. 'మీరు రామలక్ష్మణులనెత్తుకుని కిష్కింధకు వెళ్ళండి. నేను రావణుని వంశాన్ని సమూలంగా సంహరించి జానకిని తీసుకొనివస్తాను. విభీషణునికి రాజ్యపట్టాభిషేకం చేసి బందీలైన దేవతలను విడిపించి నేను, వాయునందనుడు తిరిగి వస్తాము'.

ఆ సమయంలో దేవవాణి ఇలా పలికింది. 'కోదండపాణియైన రాముడు మేల్కొంటాడు'. ఆ క్షణంలోనే రాముని కన్నులు తెరచుకొన్నాయి. మానససరోవరంలో రాజహంసలు చుట్టూ ప్రీతితో సమావేశమైనట్లు రాముని చుట్టూ దాసులంతా ఆసీనులయ్యారు. కమలం చుట్టూ తుమ్మెదలు చేరినట్టు,

సర్పాలన్నీ చందనాన్ని చుట్టుముట్టినట్టు, అమూల్యమైన ముత్యాలచుట్టూ పరీక్షకులు చేరినట్టు చేరారు. శ్రీరాముడు సుగ్రీవునితో 'నీవు నీ సైన్యాన్ని తీసుకొని కిష్కింధకు తిరిగివెళ్ళు. ఇక్కడ మేమిద్దరమూ ఉంటాము' అని గంభీరంగా పలుకగా అందరి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. సుగ్రీవుడు డగ్గుత్తికతో ఈ విపరీతం ఎందువల్ల సంభవించింది అని ప్రశ్నించాడు. సూర్యుని వదలి కిరణాలు ఎక్కడికైనా పోతాయా? కనకాన్ని వదలి కాంతి కల్పాంతంలోనయినా ఉండగలదా? ఘటాన్ని వదలి మట్టి భిన్నంగా ఎలావుంటుంది? వస్త్రాన్ని వదలి దారం వేరుగా ఉండగలదా? సాగరాన్ని వదలి అలలు అడవిలో ఉండగలవా? నిన్ను వదలి ఓ రామా! మేము ఎలా ఉండగలం? అన్నాడు. విభీషణుడు అయోధ్యానాథునితో సూర్యుడు చీకటిబావిలో పడవచ్చునేమో! ఆదిశేషుడు భూమిని వదిలివేయవచ్చునేమో! కానీ మీ సామర్థ్యం ఎన్నటికీ మొక్కవోదు. పనికిమాలినవాడు అతిగా మాట్లాడుతాడు. అది రణకోవిదులు అంగీకరించరని అన్నాడు. ఇంతలో వాయువు గుప్తరూపంలో వచ్చి ఒక అద్భుతం గావించాడు. సీతావల్లభుని చెవిలో గరుడమంత్రాన్ని ఉపదేశించాడు. రఘువీరుడు మంత్రాన్ని జపించిన మరుక్షణమే సుపర్ణుడు వేగంగా వాలాడు. శరీరంలో లెక్కలేనన్ని వెంట్రుకలున్నట్లు రాముని ఒళ్ళంతానిండిన సర్పాలు గరుడుని ప్రతాపాన్ని తెలిసి పారిపోయాయి. వెంటనే రామలక్ష్మణులు లేవగా పదునెనిమిది పద్మాల వానరులు సింహనాదాలు చేయగా లంకానగరం దద్దరిల్లింది. మధ్యాహ్న సూర్యునిలా దేదీప్యమానంగా రామలక్ష్మణులు గోచరించారు. దేవతలంతా జయజయధ్వనాలు చేస్తూ పూలవర్షం కురిపించారు. సుగ్రీవాది వానరులంతా ఈ రోజే లంకను తల్లక్రిందులు చేయాలన్నారు. శ్రీరాముడు కోదండాన్ని శత్రువుల బాటవెంట ఎక్కుబెట్టాడు.



యుద్ధకాండ రసభరితమైనది. అందులోని వీరరసం అద్భుతమైనది. ఈ కథనంతా విన్నవారికి శత్రుక్షయం కలుగుతుంది. బ్రహ్మానందుడు, శ్రీధరవరదుడు, దశముఖాంతకుడు, సమరధీరుడు, భక్తపాలకుడు, నిర్వికారుడు, అభంగుడు శ్రీరఘువీరునికి స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా చతురులయిన భక్తులు ఆలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఇరవై అయిదవ అధ్యాయం మధురం**



# అధ్యాయము - 26

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

మంగళప్రదాయిని భవానికి జయము. మూలస్థానేశ్వరి, అయోధ్యవాసిని, ఆదిమాయకు కులస్వామిని, రఘునాథుని ప్రణవరూపిణికి జయము. ఓ అంబా! నారద, వ్యాస, వాల్మీకి, విరించి, అమరేంద్ర, సనకాదికులు, వేదశాస్త్రాలు, సహస్రముఖుడు నీ కీర్తిని గానం చేస్తుంటారు. సుగ్రీవుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు, విభీషణ, అంగద, హనుమంతులు అందరూ నీ కరదీపికలే. ప్రతాప దీపికలు చేబూని నిన్నే స్మరిస్తూ నర్తిస్తారు. పద్దెనిమిది పద్మాల వానరగణాలు త్రికూటపర్వతం వద్ద స్వానందంలో తేలియాడుతున్నాయి. రణరంగమే హోమకుండము. అందులో ద్వేషాగ్ని ప్రచండంగా ప్రజ్వరిల్లుతుంది. గొర్రెలవలె ఎంతో మంది రాక్షసులు అందులో ఆహుతై పోతున్నారు. దేవాంతక, నరాంతక, మహోదరులు, ప్రహస్త, అతికాయ, ఘటశ్రోతులు, ఇంద్రజిత్తు, దశవక్రుడు అందరూ ఆహుతి కావలసినవారే. నీ దాసుడైన నీ దివిటీ విభీషణుడు అక్షయంగా లంకను పాలించి, భక్తితో జానకిని మూలస్థానమైన అయోధ్యకు తీసుకుపోతాడు. నీ బిడ్డడైన హనుమంతుడనే దివిటీకి బలవంతంగా తోకకు గుడ్డలు చుట్టి నిప్పంటించగా క్షణంలో లంకను కాల్చి వసంతం ఆడుకొన్నాడు. అలాగా నీ దివిటీలెన్నో అపారంగా ఉన్నాయి. నీ దాసానుదాసుడైన శ్రీధరుడను నేను. యథాశక్తి రామవిజయదీపికను వెలిగించాను. బాలురు, అమాయకులు, భక్తులు, అజ్ఞానులు ఈ ప్రపంచమనే చీకటిలో ప్రగ్గుతుంటారు. అటువంటి వారికి ఈ గ్రంథమనే దివిటీ మార్గాన్ని సుగమం చేస్తుంది.

### ప్రహస్తవధ

పూర్వ అధ్యాయంలో రామలక్ష్మణులను ఇంద్రజిత్తు నాగపాశబద్ధుల చేస్తే వాయుదేవుడు వచ్చి వారిని బంధవిముక్తుల చేశాడు. వెంటనే



రణరంగధీరుడు, ప్రతాపసూర్యుడైన శ్రీరఘువీరుడు వింటిని సారించి శత్రువు కోసం ఎదురు చూడసాగాడు. కోటానుకోట్ల వానరులు గట్టిగా సింహనాదం చేయసాగారు. ఆ హోరుకు లంకలోని రాక్షసులు భయంతో తల్లడిల్లిపోయారు. నిర్మలమైన శ్రీరామచంద్రుని చూచి వానరసముద్రం ఉప్పొంగిపోయింది. వానరసేన లంకాదుర్గ పర్యంతం నిండిపోయింది. పాషాణాలు, పర్వతాలు చేత ధరించి వానరులు లంకపైకి విసిరివేయగా రాక్షసుల మందిరాలు కూలి ప్రళయం తాండవించింది. సూర్యచంద్రులవలె రామలక్ష్మణులు యుద్ధానికి సన్నద్ధంగా ఉన్నారని, వానరులు దుర్గం చుట్టుముట్టారనే వార్త రావణునికి తెలిసింది. రావణుడు, పుత్రా! శత్రువనాన్నంతా పూర్తిగా తగులబెట్టినా, పూర్వవైభవంతో మళ్ళీ ఎలా చిగురించింది? మాడిమసైపోయిన విత్తనం తిరిగి ఎలా మొలకెత్తింది? మృత్యువు కబళించి ఎందుకు వదిలివేసింది? ప్రహస్తా! ఈ అసంభవం ఎలా సంభవమైంది? అని ఉదాసీనంగా అడిగాడు. ప్రధాని, సేనాపతి, ప్రతాపవంతుడు అయిన ప్రహస్తుడు నేను శత్రువులందరిని సంహరించి వస్తాను, ఆజ్ఞాపించవలసింది అని మహారాజునర్థించాడు. ఆ నరవానరాలు నా కొక లెక్కా? నా బాణధాటికి ఎవరు తట్టుకోగలరు? అని పలుకగా దశకంఠుడు ఎంతో సంతోషించాడు. వస్త్రాలంకారాలు ప్రహస్తునకిచ్చి ఆదరించి యుద్ధంలో విజయం కలగాలని ఆశీర్వదించాడు. యజమాని ముఖతా ఆదరించిన దినమే సుదినం.

ఇరవై అక్షౌహిణుల సైన్యాన్ని, చతురంగబలాలను వెంటబెట్టుకుని ప్రధాని ప్రహస్తుడు ఉత్తరద్వారం గుండా బయలుదేరగా అద్భుతరీతిలో సుడిగాలి వీచి కళ్ళంతా దుమ్ముకొట్టుకొని పోయాయి. ప్రహస్తుని రథధ్వజం ఆమూలాగ్రం విరిగిపోయింది. పక్షులు ఆకాశమార్గాన పోతూ రక్తం ఓడుతున్న భుజస్కంధాన్ని ప్రహస్తుని ముందు పడవేశాయి. అదిచూచి ప్రహస్తుని మనస్సు కలుక్కుమంది. కాని వీరులంతా చుట్టూ ఉన్నందున అపశకునాన్ని లెక్కచేయక

ముందుకుసాగాడు. రాక్షస సైన్యాన్ని చూచి వానరులు సింహనాదం చేసి స్వర్గాన్ని తాకుతున్నట్లున్న లంకానగర బురుజులన్నింటినీ చూస్తుండగానే నేలమట్టం చేశారు. రెండు సైన్యాల మధ్య యుద్ధం జోరుగా మొదలైంది. శస్త్రాస్త్రాలను రాక్షసులు ఏకధాటిగా కుప్పించారు. ఆకాశంలో మెరుపుల్లా కత్తులు మెరవసాగాయి. గద, పాశం, శక్తి, శూలం గైకొని బలంగా వానరులు పొడవసాగారు. వానరుల దెబ్బలు కాచుకుంటూ రాక్షసులు హఠాత్తుగా వానరసేనను ఎదుర్కున్నారు. అది గమనించి ప్రతాపంలో సూర్యసమానులైన వానరవీరులు పర్వతాలు, వృక్షాలు, పాషాణాలు తెచ్చి బలంగా విసిరివేయగా రాక్షసులు చూర్ణమయ్యారు. అసంఖ్యాకంగా పక్షులు ఆశ్రయించిన పర్వతానికి అగ్ని రగులుకున్నట్లు, రాక్షసుల స్థావరాలపై వానరసముహం వచ్చిపడేది. వానరులు చతురులు, రణకోవిదులు. చాలామంది రాక్షసులను హతమార్చారు. అది చూచి సేనాపతి ప్రహస్తుడు వాయువేగంతో రథాన్ని అటువైపు తిప్పాడు. పర్వతంపై పిడుగుపడ్డట్టు వానరవీరులపైకి అకస్మాత్తుగా వచ్చి లెక్కలేనన్ని అద్భుతమైన బాణాలు వదిలాడు.

ఆ సమయంలో విభీషణుడు రామునితో 'ప్రహస్తుడు సేనాపతి. రావణునికి అతి ముఖ్యమైన ప్రధాని. వానితో పోరుకు సేనాపతి నీలుని పంపవలసింది' అన్నాడు. ఇంతలో ప్రహస్తుడు వానరదళాలను లెక్కలేకుండా హతమార్చసాగాడు. ఆతడి ధాటికి తట్టుకోలేక, శక్తిచాలక వానరులలో మహాయోధులు, సమరధీరులు కూడ వెనుతిరిగారు. రఘునాథుని చూచి ప్రహస్తుడు రథాన్ని అటువైపుగా తిప్పాడు. అది గమనించి జనకజామాత వింటిని తీసుకుని క్షణంలో బాణం ఎక్కుపెట్టబోగా నీలుడు చేతులు జోడించి వానరసైన్యం వింటుండగా 'ఓ జగద్వంద్యా! జగద్దు:ఖ హరణా! జనకజాపతే! జగన్మోహనా! మాయాచక్రచాలకా! నిరంజనా! నేను ఒక్క క్షణంలో ప్రహస్తుని ప్రాణాలు హరిస్తాను. నాకు అనుమతివ్వవలసింద'ని వేడుకున్నాడు. సీతారాముడు 'అవశ్యం! విజయుడవై తిరిగిరా!' అని ఆశీర్వదించాడు.



నాస్తికుని పండితుడు ధైర్యంగా వాదనకు పిలచినట్లు ఒక మహాపర్వతాన్ని గైకొని నీలుడు అకస్మాత్తుగా ప్రహస్తుని యుద్ధానికి ఆహ్వానించాడు. ప్రహస్తునితో నీలుడు 'నీవు పెద్ద రణకోవిదుడవంటారు. యుద్ధం చేయటానికి రకరకాల శస్త్రాలను ప్రక్కనపెట్టుకుని నిన్ను నీవు ఎందుకు మోసం చేసుకుంటావు? పైకి పెద్దపులి వలె కనబడుతున్నావు. లోపల ఈ నక్క వేషాలు ఎందుకు? ఎవరైనా విరక్తుని వేషం వేసుకొంటే లోపల త్యాగబుద్ధి కలుగదు. పైకి వైరాగ్యం నటించేవానికి లోపల కామం పెరుగుతుంది. మేడిపండులాగా చూడటానికి అందంగా కనబడతావుగాని ఆంతర్యంలో ఉండేదంతా మోసమే. ఓ సేనాపతీ! ప్రహస్తా! మీ పితృగణాలన్నీ యమపురిలో ఏం చేస్తున్నారోనన్న సమాచారం సేకరించటానికి, నిన్ను యమపురికి పంపడానికి మృత్యుదేవత నిన్ను ఇక్కడకు రావించింది. తిరిగి లంకకు ఎలా వెళ్ళగలవు? నిజంగా దశముఖుడు శతమూర్ఖుడు. అనవసరంగా జానకిని తెచ్చి కులక్షయం గావించాడు' అన్నాడు. ప్రహస్తుడు 'మర్కటా! నీలా! నీకు మరణకాలం ఆసన్నమై బుద్ధి చలించింది' అంటూ బాణం సంధించాడు. నీలుడు వెంటనే ఒక పర్వతాన్ని తటాలున ప్రహస్తునిపై వేశాడు. ప్రహస్తుడు బాణం వేయగానే అది క్షణంలో ముక్కలైంది. వెంటనే మరొక మహాపర్వతాన్ని ప్రహస్తునిపై వేయగా ప్రహస్తుడు దాన్ని పిండిచేశాడు. ఒకదాని వెంబడి ఒకటిగా నూరుపర్వతాలను నీలుడు అద్భుతంగా వేశాడు కాని ప్రహస్తుడు వాటన్నింటినీ ఛేదించటం సీతాపతి గమనిస్తున్నాడు. ప్రహస్తుని బలం అమోఘం. నీలునికి సర్వాంగాలు దెబ్బతిన్నాయి. కాని అగ్నిదేవుని పుత్రుడైన నీలుడు యుద్ధంలో వెనుకంజ వేయలేదు. పైగా దక్షుడైన నీలుడు శతయోజనాల పొడవైన తాటిచెట్టును విరిచి ఎత్తుకొని చూపరులకు ప్రళయకాలంలోని రుద్రునిలా శోభిల్లాడు. తన భుజబలమంతా కూడదీసుకొని ఆ వృక్షాన్ని పడవేయగా రథ సహితంగా ప్రహస్తుడు చూర్ణమయ్యాడు. వానర శిబిరంలో జయజయధ్వానాలు

మిన్నంటాయి. దేవతలంతా పుష్పవృష్టి కురిపించారు. గాయపడ్డ రాక్షసులు వేగంగా రావణుని వద్దకు వెళ్ళి జరిగిన సంగతి చెప్పారు. ప్రహస్తుడు నేలకూలాడని తెలియగానే లంకానాథుడు ఎంతో దుఃఖించాడు. 'తామరతూండ్లతో దోమ ఐరావతాన్ని బంధించినట్లు, మిణుగుపురుగు కాంతికి ఆదిత్యుడే మండిపోయినట్లు, పులివంటి పరాక్రమవంతుడు ఆవుదూడ చేత చంపబడ్డాడు. ఇది ఎలా సంభవించింది?' అని వగచి వెంటనే సైన్యాధిపతితో 'సేనను త్వరగా సిద్ధం చేయండి. నేను ఈ రోజు యుద్ధం చేసి అద్భుతరీతిలో రఘునాథుని, వానరులను జయిస్తాను. యుద్ధాన్ని గూర్చి నగరంలో అంతా దండోరా వేయించండి' అన్నాడు. యుద్ధవార్తను విని లంకానగరమంతా కోలాహలమయింది. అనేకమంది మహావీరులు శస్త్రాలతో సిద్ధమయ్యారు.

**మండోదరి నీతివాక్యాలు**

లంకాధిపతి పట్టపురాణి, వివేకఖని అయిన మండోదరి యొక్క ఆంతరంగిక గూఢచారి సభలో కూర్చుని ఉన్నాడు. వాడు మహామేధావి. సభలో జరుగుతున్న విపరీతాన్ని విని వెంటనే, వర్షాకాలంలో వరద వచ్చి పరుగులెత్తే నదిలాగా, ధనుస్సు నుండి ఎక్కుపెట్టిన బాణంలాగా, సూర్యుడస్తమించగానే పరుగున గూటికి చేరే పక్షుల్లాగా, వాడు వేగంగా తన యజమానురాలి వద్దకు వచ్చి చేతులు జోడించి నమస్కరించి తలవంచుకొని సభలో జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించాడు. 'యుద్ధంలో ప్రహస్తుడు నేలకూలాడు. దశాననుడు సకలసైన్య సమేతంగా యుద్ధానికి బయలుదేరబోతున్నాడు' అని విన్నవించాడు.

మండోదరి సౌందర్యరాశి. ఆమె ముందు రతీదేవి కూడా దిగదుడుపే. ఆమె ముఖవర్చస్సును చూచి చంద్రుడే సిగ్గుతో తలవంచుకోవాలి. గౌరవర్ణంలో ఉన్న ఆమె చంపకకళిక కంటే సుకుమారమైనది. ఆమె శరీరం నుండి వెలువడే



కాంతికి అలంకారాలు మెరిసిపోతున్నాయి. అటువంటి సర్వాంగ సుందరమైన యువతి కోసం ముల్లోకాల్లో వెదికి వేసారి మన్మథుడే అలసిపోయాడు. పకపకా నవ్వినపుడు పలువరుసల తేజస్సుకు మందిరమంతా దేదీప్యమానమై రత్నాలెన్నో నేలరాలినట్లుండేవి. ఆమె శరీర సువాసనకు మొత్తం భవనమంతా గుబాళించేది. ధగధగ మెరిసే వస్త్రాలలో నుండి వచ్చే పరిమళం మృదుమధురంగా ఉండేది. ఆమె చేతిగాజులు మెరుపుల్లా మెరిసేవి. రావణుడు ఇరవైనేత్రాలతో పిచ్చివానివలె ఆమెను చూస్తుండేవాడు.

అందాలరాశియైన మండోదరి దూత తెచ్చిన వార్త విని సుఖాసనం నుండి తటాలున లేచి సభకు బయలుదేరింది. చుట్టూ దాసదాసీలు నానా ఉపచారాలు చేస్తుండగా, చతురుడు, వయోవృద్ధుడైన ప్రధాని మాల్యవంతుడు, కుమారుడైన అతికాయుడు వెంట వచ్చారు. పార్వతికి స్కంధకుమారునిలా, రతీదేవికి జయంతపుత్రునిలా మండోదరికి అతికాయుడు శోభిల్లాడు. వేలాది దూతలు వెంటరాగా బంగారు రాజదండకి పట్టుకొని ఇద్దరు ముందు నడుస్తూ జనసమూహాన్ని దారి వదలమని హెచ్చరిస్తూ సాగిపోతున్నారు. ఆమె శరీరకాంతులకు గోపురద్వారాలు మెరుస్తున్నాయి. ఆ విధంగా మండోదరి సతి సభాద్వారం ప్రవేశించింది. జనులంతా ఆదరపూర్వకంగా తలవంచుకుని లేచి దారివదలగా మండోదరి పతిపాదాలకు నమస్కరించింది. దశముఖుడు దరహాసవదనుడై 'మీ రాకకు కారణమేమి?' అని అడిగాడు.

తన ఆసనంలో కూర్చొని ఒక్కక్షణం మౌనం వహించి తర్వాత మయపుత్రి, 'శుభ్రమార్గాన్ని వదలి అడ్డదారిలో నడచినవారికి ఎన్నో అపాయాలు కలుగుతాయి. అందరితో విరోధించి మనకు శుభం కలగాలంటే అనర్థం కలుగక తప్పదు. వేదశాస్త్రాలు దేన్నైతే అనుచితమని ఘోషిస్తున్నాయో దాన్ని కావాలని ఆచరించినట్లయితే విఘాతం తప్పదు. ఇందులో సందేహం లేదు. వివేకం, సద్బుద్ధి వల్ల తెలివిగలవారు అనర్థాన్ని త్రుటిలో తప్పించుకోగలరు.

సాధువులవచనాలు ఎల్లప్పుడు హృదయంలో ధరించాలి. రాజా! నీకు పురుషార్థాలన్నీ సంపూర్ణంగా ఉన్నాయి. పరసతి, పరధనంపై ఎవరికి మనస్సుపోదో వారు ధన్యులని శాస్త్రాలు నొక్కి వక్కాణిస్తున్నాయి. నందనవనంలో విహరించే భ్రమరం దివ్యపుష్పాల సుగంధాన్ని గ్రోలుతుంది గాని ఉల్లిపువ్వు వద్దకు పోతుందా? దేవతా గృహంలో కల్పతరువు పూలపై శయనించేవాడు, నిప్పుల పక్కన పడుకుంటాడా? అష్టనాయికలు ఎవరి సౌందర్యాన్ని చూచి తలవంచుతారో అటువంటి అసామాన్య సౌందర్యరాశియైన భార్య పక్కన ఉండగా ఇతర కాంతలను ఆలింగనం చేసుకోవాలన్న కోరిక గలవాడుంటాడా? కోరిన కోరికలు తీర్చే కామధేనువు, కల్పతరువు, చింతామణులను ఇంట నుంచుకొని ఎవరన్నా వట్టి అన్నం తినడానికి ఇష్టపడతారా? విచిత్రంగా లేదూ! ఆంతర్యంలో యథార్థం తెలిసీ ఎవరైనా పరకాంతను బలవంతం చేస్తే వారికి అనర్థం తప్పదు. మీరు సర్వజ్ఞులని నాకు తెలుసు. కాని అభిమానంతో ఇవన్నీ చెపుతున్నాను. తెలిసీ బలవంతంగా కర్మ చేసినవాడు శతమూర్ఖుని కంటే నీచమైనవాడు. అందువలన లంకేశ్వరా! కామానికి అంతం ఎక్కడ? కాముకునికి అనర్థం చెంతే ఉంటుంది. మీ స్వామి ఈశ్వరుడు. ఆయనకు శత్రువు అపవిత్రమైన కామం. దానితో నీవు స్నేహం చేసి ఉమాపతిని క్షోభింపచేస్తున్నావు. ఈశ్వరునికి మిత్రుడు రామచంద్రుడు. ఆయనతో నీవు నిజంగా స్నేహం చేస్తే కర్పూరగౌరుడైన శంకరుడు సంతోషించి నీకు అక్షయపదాన్నిస్తాడు. సీత పరమ పతివ్రత. ఆమె రాముని సతి. మంచి సద్గుణసంపన్నురాలు. ఆమెను తీసుకొచ్చి చెరలో పెట్టి కులక్షయం కావించావు. ఆమె బడబాగ్ని వంటి తీవ్రమైన అగ్నిజ్వాల. క్షణంలో బ్రహ్మాండాన్ని మసి చేయగలదు. రాజా! సహస్రార్జునుడు నిన్ను బలవంతంగా బందీగా ఉంచాడు. ఆయనను పరశురాముడు సంహరించాడు. ఆ పరశురాముని రాఘవుడు జయించాడు. ఎవరైతే నీటిలో



రాళ్లను తేలియాడేటట్లు చేశారో అటువంటి బలశాలి రఘునందనునితో స్నేహం కలుపుకుని సీతను స్వాధీనం చెయ్యి. శ్రీహరి హిరణ్యకశిపుని హతమార్చాడు. కాని వాని కడుపునబుట్టిన ప్రహ్లాదునితో చెలిమి చేసి తనవానిగా చేసుకుని చిరంజీవిని చేసి ఆచంద్రార్క కీర్తినిచ్చాడు. అలాంటి రామునితో స్నేహం చేసి సత్కీర్తిని పెంపొందించుకో. నిన్ను బందీ చేసిన వాలిని రాముడు ఒకే బాణంతో నేలకూల్చాడు. ఈ సంఘటనలను గుర్తుతెచ్చుకుని రామునితో స్నేహం చెయ్యి. రాముడు శత్రుత్వంతో ఎన్నటికీ వశంకాడు. ఆయన భక్తికి బానిస. సీతను సమర్పించి సీతానాథుని నీ వానిగా చేసుకో. తమ పరాక్రమంతో దేవతల కిరీటాలు నేలపాలు చేసిన కోటానుకోట్ల రాక్షసులంతా యుద్ధంలో గతించారుగదా! బలిచక్రవర్తి మహాభక్తుడు. ఆయన పురుషోత్తముని వశపరుచుకున్నాడు. అలాగే శ్రీరాముని నీవశం చేసుకో" అని నీతి బోధించింది మండోదరి.

బదులుగా దశకంఠుడు 'ప్రియా! నీవు చక్కగా చెప్పావు. కాని నేను ధైర్యసాహసాలు కలిగిన అసురేశ్వరుడను. రామునితో స్నేహం ఎన్నటికీ చేయను. నేను యుద్ధంలో నరవానరులందరిని సంహరించి వస్తాను. నా ధైర్యసాహసాలు ఎట్టివో నీవు చెవులారా విను. కైలాసాన్ని అల్లకల్లోలం చేసి సకల దేవతలను బందీగా చేసాను. ఈ రోజు యుద్ధంలో శత్రువుల శిర:కమలాలు తెస్తాను చూడు' అన్నాడు. 'ఓ ఉదారా! బలప్రయోగంతో అనర్థాన్ని ఇంటికి ఆహ్వానించావు. రత్నాలు పారేసి రాళ్ళను ఎందుకు సంగ్రహించడం? కల్పవృక్షాన్ని పెకలించి కంటక వనాన్ని పెంచడం ఎందుకు? రాజహంసను తరిమేసి గుడ్లగూబను ఎందుకు పెంచడం? అమృతాన్ని వదలి మేక పాలు త్రాగడం వల్ల ప్రయోజనమేమిటి? కామధేనువును వదలి మేకను పెంచుకోవడమెందుకు? గన్నేరుకాయ పైకి అందంగా అగుపడుతుంది. లోపలేమో కాలకూటం నిండివుంటుంది. అటువంటి వాటిని

వివేకవంతులెన్నటికీ సేవించరు. పనసవిత్తనం, ఉమ్మెత్త విత్తనం ఒకే విధంగా కనబడుతాయి. కాని ఉమ్మెత్తను పొరపాటున సేవిస్తే పిచ్చివాళ్ళైపోతారు. వివేకవంతులు వానిని సరిగా గుర్తించగలరు. పాము తల మీదనున్న మణికి ఆశపడితే ప్రాణహాని ఎలా కలుగుతుందో అలా శ్రీరాముని రాణిని అపహరిస్తే వంశం సమూలంగా నాశనం అవుతుంది' అని మండోదరి మందలించగా లంకాపతి 'సూర్యుడు చీకటిబావిలో పడడం, ఎండమావిలో మునిగిపోవడం, మృగరాజును నక్క చంపడం, దోమ చేతితో బడబానలాన్ని ఆర్పడం ఇవన్నీ అసాధ్యాలు. ఇక నీవు ఇంటికి వెళ్ళు. ధైర్యంగా వుండు. ఎలాంటి దిగులు పెట్టుకోకు' అని దర్పంగా పలికాడు.

మండోదరి నీతి వాక్యాలు, వివేకమనే ఆకాశంలో నక్షత్రాలవంటివి. సద్బుద్ధి సాగరంలోని రత్నాలు, కాని రావణుడు అలక్ష్యంచేశాడు. కమలం సువాసనెంతో మనోహరమైనది. దాని విషయం కప్పకు, సీతాఫలం రుచి కొంగకు, కస్తూరి సువాసన కాకికి, తత్త్వవిచారాన్ని గూర్చి తాగుబోతుకు, ఎలా తెలుస్తుంది? పుట్టుగుడ్డి ముందు రత్నాలుంచినా, బధిరుని ముందు మధుర గానం. పతివ్రతాధర్మాలన్నీ వ్యభిచారిణికి చెప్పడం, ధర్మశాస్త్రాలు బందిపోటుకు బోధించటం వ్యర్థమని, మండోదరి త్వరగా తన మందిరానికి వెళ్ళి ఏం చేయడానికి మనసొప్పక ఆభరణాలు భోగవిలాసాలు మొత్తం తీసిపారేసింది.

**దశకంఠుని యుద్ధప్రయాణం**

వెంటనే సంగ్రామానికి సంకేతంగా భేరీ నినాదాలు మిన్నంటాయి. దశకంఠుడు పరివారంతో సహా యుద్ధానికి బయలుదేరాడు. వెంట ప్రధాని, కుమారుడు, మొత్తం లంకాసైన్యమంతా కదిలింది. లంకానగర మహాద్వారాలన్నీ ఒక్కసారిగా తెరచుకున్నాయి. చతురంగబలాలు, మహాగజాలతో వస్తుంటే చూడటానికి ప్రళయమే వచ్చి సముద్రం ఉప్పొంగిందా



అన్నట్లుంది. పర్వత సమానమైన ప్రచండవీరులతో, తాబేలు లాంటి అభేద్యకవచాలు ఆపాదమస్తకం మెరుస్తుండగా ఒంటిమీద బిరుదులన్నీ తగిలించుకుని, కత్తి, శక్తి, శూలం, తోమరం మొదలైన ఆయుధాలతో, లోహపుగుండు, ఖడ్గం, ముద్గలం, కొడవలి, విల్లంబులు, గద, పరశువు, యమదంష్ట్ర, వడిసెలలతో, అపారమైన పదాతిదళాలు పరుగులిడుతున్నాయి. వాటి వెనుక మేలుజాతి అశ్వాలతో అశ్వదళాలు ఒక్కసారిగా కదిలాయి. అసంఖ్యాకమైన అశ్వాలు శ్యామసుందరంగా ఉన్నాయి. తోక పసుపు, గిట్టలు రక్తవర్ణంలో, కళ్ళు తామ్రవర్ణంలో అందంగా ముల్లోకాల్లో సంచరించే అశ్వాలున్నాయి. సూర్యరథానికి పూన్చే చింతామణి వేగంతో సమంగా ఈ అశ్వాలు భూమిపై సంచరిస్తాయి. పసుపురంగులో వున్నది సకిలిస్తే ఆకాశమంతా ప్రతిధ్వనిస్తుంది. ఊదారంగులో నున్నది పరమ చపలమైనది. ఒకటి మాణిక్యంలా ప్రకాశించగా, ఒకటి నీలంగా వెన్నెలవంటి తేజస్సుతో మెరుస్తుంది. సింహముఖంతో సుందరంగా ఒకటి, చకోర చంద్రవర్ణంతో సుకుమారంగా ఒకటి, తెల్లటి జుట్టుతో ఒకటి, కుంకుమ సిందూరవర్ణంలో ఒకటి, నేరేడు రంగులోని పరమచపలమైన అశ్వాలను జంబూద్వీపం నుండి తెప్పించారు. క్రౌంచ ద్వీపంనుండి తెల్లటిగుర్రాలను, శశివర్ణపు గిట్టలున్న వాటిని తెప్పించారు. శాల్మలీ ద్వీపంనుండి సుకుమారమైనవాటిని కొన్నింటిని, శాఖలద్వీపం నుండి చిత్రవిచిత్రమైనవాటిని, నాగద్వీప, కుశద్వీపాల నుండి బలిష్ఠమైనవాటిని, పుష్కరద్వీపంనుండి శ్యామకర్ణి అశ్వాలను తెప్పించారు. గాలిలో వెళ్ళినట్టు నీటిపైకూడ వెళ్ళగలవి, పెద్దనోరు, పొట్టిమెడగల తెలుపు నలుపు గుర్రాలు బయలుదేరాయి. యుద్ధభూమిలో పరమధైర్యసాహసాలు ప్రదర్శించగల అందమైన అశ్వాలు, కపులవలె చంచలంగా, సుకుమారంగా యుద్ధంలో ధైర్యం వహించగల అశ్వాలున్నాయి. గరుడునితో సమానంగా ఎగురగల, పక్షిలాగా ఆకాశంలో పయనించగల, సంజ్ఞామాత్రం చేతనే

శత్రుదళాలలోకి గాలివేగంతో పోగల అశ్వాలున్నాయి. దివిటీలు తిప్పినట్లు రౌతు కత్తిని తిప్పితే ఒక్కసారే అశ్వాలు కూడా తదనుగుణంగా తిరుగుతాయి. అలా అశ్వాలు, ఖడ్గాలతో రణరంగమంతా నిండిపోయింది. రౌతుది గుర్రానిది ఒకే మనసా అన్నట్లుంది. అటువంటి అశ్వాలతో యుద్ధం సాగుతున్నది. అశ్వాలు రత్నఖచితమైన అలంకారాలతో, విశాలమైన ముత్యాలహారాలతో మెరుస్తూ రణరంగమంతా నాట్యం చేస్తున్నాయి. కాళ్ళకు గజ్జెల ధ్వనులతో, ముందుకాళ్ళు నేలకు తగలకుండా ముఖాన మెరుపుల్లా మెరిసిపోతున్న రత్నఖచిత పతకాలతో, బలిష్ఠమైన వజ్రకవచాలతో నున్న ఆ అశ్వాలపై సమర్థులైన రౌతులున్నారు. వాటివెనుక మదించిన గజదళాలు ఘీంకరిస్తున్నాయి. ఐరావతం పుత్రుడా అన్నట్లు తెల్లగా నాలుగు దంతాలతో, వేగంగా పరుగులిడగల ఏనుగులు, రత్నఖచితమైన పతకాలు తోకమీద, పొట్టపై ఊగుతుండగా రత్నఖచితమైన అంబారీలతో, ఆకాశాన్నంటే ధ్వజాలతో, గంటలు మ్రోగుతుండగా, చామరాలు వీస్తుండగా గజదళాలు బయలుదేరాయి. గరుదుని ముక్కులాంటి అంకుశంతో ప్రతిభాశాలురైన మావటివారితో, సంజ్ఞామాత్రంగా త్వరితగతిన పరుగులిడగల గజాలతో గజదళం శత్రుసమూహం పైకి దండెత్తింది. వాటి వెనుక దివ్యరథాల చక్రాలు మెరుపుల్లా వేగంగా కదులుతున్నాయి. ధ్వజాలు ఆకాశాన్నంటుతున్నాయి. ధనుస్సులు, శక్తి, మొదలైన అస్త్రాలతో రథాలపై నేర్పరులైన సారథులు పగ్గాలు చేబూని ముందు కూర్చుని ఉన్నారు. ఆ విధంగా త్రికూటపర్వతం వద్దకు అపారమైన చతురంగ దళాలన్నీ వెళ్ళాయి. అక్కడ రణవాద్యఘోషతో శశివదన లాంటి భేరీలు మారుమ్రోగుతున్నాయి. ఆ శబ్దానికి జగత్తంతా దద్దరిల్లింది. శంఖారావాల ధుమధుమలతో నిండిపోయాయి. మధురమైన సన్నాయి, బాకాలు, డప్పుఢమారాది వాద్యాలు మోగుతున్నాయి. ఈ రోజు రావణుడు సకలసైన్యాన్ని వెంటబెట్టుకొని పుత్రపౌత్ర సమేతంగా యుద్ధానికి వచ్చాడని విభీషణుడు



రామునికి చూపించాడు. ఒక లక్షపుత్రులు సవాలక్ష మనుమలు కలిగిన రావణుని కుటుంబం ధన్యమయిందని వానరులంతా ఆదరంగా చూచారు. పుత్రులు, ప్రధానులందరిని పేరుపేరునా చెప్పి, విభీషణుడు చూపించగా రాముడు అచ్చెరువొందాడు.

రావణుని రథం బ్రహ్మచే నిర్మితమైనది, దివ్యమైనది, నిరుపమానమైనది. దాని కాంతుల ముందు వేయి సూర్యులు కూడా దిగదుడుపే. దానికి సాటి మరో రథం ముల్లోకాల్లో కూడా ఉండదు. అందులో సువర్ణ వస్త్రాభరణ భూషితుడైన మండోదరి నాథుడున్నాడు. పదిఛత్రాలు ఒకదానికొకటి కొట్టుకొంటున్నాయి. చామరాలు సూర్యకిరణాల్లా మెరిసిపోతున్నాయి. అపారమైన ఆ శత్రు వైభవం చూచి సుగ్రీవుడు పెదవి కొరుక్కొన్నాడు. ఏనుగుల అలికిడి విని మృగరాజు గర్జించినట్లు కపిరాజు కోపం పట్టలేక ఆవేశపడ్డాడు. పర్వతం పైనున్న గడ్డి అంతా కలసి పైకివస్తే అగ్నిజ్వాల ఊరకుండగలదా? మృగరాజు కంటబడ్డ ఏనుగు స్తిమితంగా ఎలా ఉండగలదు? ఆవిధంగా కిష్కింధానాథుడు పరమావేశంతోలంఘించి పర్వతాన్ని గైకొని రావణుని మీద పడేశాడు. రావణుడు ఒక్క బాణంతో దాన్ని పిండి చేసి సుగ్రీవుని మీద పది బాణాలు వేస్తే అవి హృదయంలో గుచ్చుకున్నాయి. కోపంతో కపిరాజు వెంటనే విశాలపర్వతాన్ని పెకలించి రావణునిపై ఆకాశం నుండి పడేశాడు. దాన్ని రావణుడు ఛేదించి నూరుబాణాలు వేస్తే అవి సుగ్రీవునికి గుచ్చుకుని రక్తం ధారలుగా ప్రవహించింది. ఆ క్షణమే సుగ్రీవుడు మూర్ఛిల్లి నేలపై బడ్డాడు. పద్దెనిమిది అక్షౌహిణుల వానరులు వెంటనే ఒక్కసారి లేచి శిలలు, వృక్షాలు, పాషాణాలు గైకొని రావణునిపై వర్షం కురిపించగా వాటిని ఒకేమారు ఖండించాడు. నాస్తికుని కుతర్కం ముందు ఎంతటి పండితులైనా నిలువలేనట్లు వానరులంతా కలసి వచ్చినా లంకానాథుడు లెక్కచేయలేదు. అసంఖ్యాకమైన బాణాలతో వానరులనందరినీ గాయపరచాడు. దాంతో కపిశ్రేష్ఠులంతా రాముని

ఎదుట నిలబడ్డారు. మేము ఏడుగురము సింహంలా లంఘిస్తాము అంటూ అనుమతి గైకొని శరభుడు, గవయుడు, గంధమాదనుడు, మైందుడు, కుముదుడు, ద్వివిదుడు, గవాక్షుడు పర్వతాలు గైకొని వేగంగా రావణునిపై పడవేశారు. రావణు డా పర్వతాలను పిండిచేసి బాణాలు వేస్తే ఏడుగురికి గుచ్చుకున్నాయి. వారంతా హాహాకారాలతో భూమిపై పడ్డారు. దశముఖుని దెబ్బలకు తట్టుకోలేక కపిసైన్యమంతా పారిపోసాగింది.

ఇదిచూచి రణరంగధీరుడైన రాముడు వెంటనే వింటిని ఎక్కుపెట్టాడు. అప్పుడు ఊర్మిళాపతియైన లక్ష్మణుడు వచ్చి నా చేతులు ఆవేశంగా ఉన్నాయి. నాకు ఆనతి ఇచ్చినట్లయితే నేను రావణాసురుని శిక్షిస్తానన్నాడు. అలాగే అన్నాడు రఘునందనుడు. సౌమిత్రి బాణాన్ని సంధించి సింహంవలె పైకిలేచి రావణాసురుని వద్దకు వచ్చాడు. ఓరీ తస్కరా! దశముఖా! బుద్ధిహీనా! శతమూర్ఖా! నీవు జానకిని తెచ్చి కులక్షయం గావించావు. యముని కోరల్లో చిక్కిన తర్వాత తప్పించుకుని పోవడం ఎవరికైనా సాధ్యమా? అని లక్ష్మణుడు మాట్లాడుతున్నంతలో విశాలమైన పర్వతాన్ని చేబూని హనుమంతుడు పరుగున వచ్చి దశముఖునిపై బడ్డాడు. విపరీతమైన శబ్దం చేస్తూ పిడుగు పడ్డట్టు ఆ పర్వతం రావణాసురుని పైన పడగా, రావణుడు దాన్ని గాలిలోనే పిండిచేశాడు. హనుమంతుడు రథం పైకెక్కడం గమనించి, రావణుడు బలంగా కాలితో ఒక్క తన్నుతన్నాడు. ఆ దెబ్బకు మారుతి మూర్ఛపోయి వెంటనే తేరుకుని రావణుని గుండెలపై పిడిగుద్దులు గుద్దాడు. దాంతో రావణునికి కళ్ళు తిరిగాయి కానీ వెంటనే సవరించుకుని బలంగా హనుమంతుని పిడికిళ్లతో గుద్దాడు. ఇంతలో విశాలమైన పర్వతాన్ని గైకొని నలుడు పరుగున వచ్చి రావణునిపై పడవేశాడు. రావణుడు దాన్ని ఆకాశంలోనే పిండి చేసి నలునిపై ఐదుబాణాలు వేయగా అవి వాని గుండెల్లో గుచ్చుకున్నాయి. వెంటనే నలుడు బ్రహ్మదత్తమైన మంత్రాన్ని జపించగా కోటానుకోట్ల నలులుద్భవించారు. ఆ నలులందరూ



పర్వతాలు గైకొని రావణునిపై పడవేయగా, ఉభయదళాల సైన్యం సీతానాథుడు ఏదో మహిమ చూపాడని అచ్చెరువొందాయి.

లంకానాథుడు బ్రహ్మాస్త్రం సంధించగా సూర్యోదయం కాగానే నక్షత్రాలు మాయమైనట్లు కోటానుకోట్ల నలులు మాయమైనారు. పాదరసం సూక్ష్మకణాలుగా విడిపోయి మళ్ళీ ఏవిధంగా ఒక్కటౌతుందో అలా మిగతా నలులు మాయమై అసలు నలుడు ఒక్కడే మిగిలాడు. ఇంతలో సింహనాదం చేస్తూ లక్ష్మణుడు ముందుకు ఉరికితే మితిమీరిన గర్వంతో రావణుడు 'నీవు మానవకుమారుడివి. తలపై తడియైనా ఆరని పసివాడివి. నీవు నాతో యుద్ధం చేసేవాడివా! కావాలంటే ఎవరినైనా అడుగు' అన్నాడు. ప్రతిగా లక్ష్మణుడు 'ఓరీ మశకా! నా యుద్ధకౌశలం చూసి మాట్లాడరా కీటకమా! ఓరీ మూర్ఖా! నీకు ఆయుష్షు మూడింది. లంక ఎప్పుడో విభీషణునికి ఇవ్వబడింది. సింహం చెంతకు వచ్చిన ఏనుగు ప్రాణాలతో బయటపడగలదా? గరుడుని చేత చిక్కిన సర్పం తిరిగి పుట్టలోకి వెళ్ళగలదా? పామునోట చిక్కిన ఎలుక ఎలా తప్పించుకోగలదు? ముక్కంటి నుండి ప్రళయాగ్ని బయల్దేరిన తర్వాత దాన్ని ఆర్పేసి జీవించడం మన్మథునికి కూడా తరంగాదు. శ్రీరాముని సౌభాగ్యరాశిని లంకకు తీసుకునివచ్చావు. నీవు పుత్రపౌత్రులతో జీవించడం త్రికాలాల్లో సంభవించదు' అని హెచ్చరించి, ధారాపాతంగా మాటలు వెలువడినట్లుగా లక్ష్మణుడు బాణవర్షం కురిపించాడు. నేర్పరియైన లేఖకుడు అక్షరం వెంట అక్షరం ఒకే వరసలో రాసినట్టు సౌమిత్రి బాణాలు వరుసగా రావణునిపై వదిలాడు. రావణుని శరీరం మీద, భుజాలపై బాణాలు గుచ్చుకున్నాయి. దానికి బదులుగా రావణుడు లక్ష్మణునిపై ఐదు బాణాలు వేశాడు. మెరుపుల్లా వస్తున్న ఐదు బాణాలను చూచి వెంటనే సౌమిత్రి బాణాలతో వాటిని పిండిచేశాడు. విపరీతమైన క్రోధంతో దశకంఠుడు బ్రహ్మశక్తిని గైకొని అభిమంత్రించి వదిలాడు. లక్ష్మణుడు తన శక్తినంతా ఉపయోగించి బాణం

వేశాడు. కాని ఆ బాణం దాని శక్తిని సగం మాత్రమే ఖండించింది. మిగతా సగం హృదయంలో గుచ్చుకొవడంతో, సౌమిత్రి నిశ్చేష్టుడై కిందపడ్డాడు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఆగిపోయాయి. అదిచూచి రావణుడు రథం దిగి పరుగున వచ్చి నిద్రించే వాణ్ణి దొంగ గాయపరచినట్టు మూర్ఛిల్లిన లక్ష్మణుని ముష్టిఘాతాలతో గాయపర్చసాగాడు. వెంటనే మారుతి యమునిలా రావణునిపై లంఘించి కాలితో బలంగా తన్నాడు. తేలును చెప్పుతో కొట్టినట్టు, పామును రాళ్ళతో కొట్టి చంపినట్టు మారుతి కాలితాపులతో ఆ అసురుని హృదయాన్ని చూర్ణం చేశాడు. రావణుడు రక్తం కక్కుతూ రథం ఎక్కి పారిపోయాడు. ఆ సమయంలో లక్ష్మణుడు సావధానుడై వేగంగా ఒక నిర్వాణ బాణం వదలగా అది రావణుని హృదయం నుండి దూసుకొని ఆవలికి వెళ్ళిపోయింది. గాయపడ్డ సౌమిత్రిని గమనించి, రాముడు ప్రళయకాలాగ్నివలె క్షోభిల్లి తమ్ముని వెనక్కు రావించి తాను వెళ్ళాడు.

**రావణపరాభవం**

పర్వతశిఖరంపై మేఘంవలె రథంపై కూర్చున్న రావణుని చూచి రాముడు హనుమంతుని భుజస్కంధాలపై అధిరోహించాడు. క్రోధాయమానుడై రఘునందనుడు మొదట ఒక బాణం వదలగా అది క్షణంలో రావణుని పదిఛత్రాలను ఛేదించింది. రెండవ బాణం సూర్యకిరణాల్లాంటి చామరాలను పడగొట్టింది. పదికిరీటాలు ఒక్కసారే చూర్ణమయ్యాయి. పది ధనుస్సులు కూడా అయోధ్యానాథుడు ఛేదించి ఆరంభంలోనే అద్భుతం కావించాడు. తదుపరి పరమ పురుషుడయిన రాఘవుడు గంభీరంగా, 'దశముఖా! నిన్ను ఈ రోజు యుద్ధంలో వదిలేస్తున్నాను. నీవు బాగా అలసిపోయావు.వెంటనే తిరిగి వెళ్ళిపో. నీ సంపదనంతా అనుభవించి నీ భార్యలనందరిని అడిగి ఇక్కడకురా. వచ్చేటప్పుడు పుత్రపౌత్ర ఆప్తజనుల సందేశాలు తీసుకొని రా! నీవు వచ్చిన తర్వాత యుద్ధంలో నీ దేహాన్ని ఖండఖండాలుగా చేసి వెంటనే



భూమిపై పడవేస్తా. ఇది నిశ్చయమని తెలుసుకో! ఇంత సైన్యాన్ని దగ్గరుంచుకుని నీవు యుద్ధానికెందుకొచ్చావు? దుర్జనా! బుద్ధిహీనా! మలినా! నీ ముఖం నాకు చూపించకు అని రాముడు హెచ్చరించగా దశముఖునికి గర్వభంగమై అజసర్పన్యాయంలా అచేతనంగా ఉండిపోయాడు. దరిద్రంతో పీడింపబడేవాడు దేశాన్ని వదలి వెళ్ళినట్లు, కులభ్రష్టుడైన బ్రాహ్మణుడు వెలివేయబడినట్లు, శపథం చేసి మాట తప్పినవాడు సిగ్గుపడి వెళ్ళినట్లు రావణుడు రణరంగాన్ని విడిచి వెళ్ళాడు. నానావిధాలుగా ప్రయత్నించి కుంభకర్ణుని నిద్రలేపమన్నాడు రావణుడు.

గంభీరము, అద్భుతమైన రామకథను పండితులు శ్రవణం చేస్తారు. స్వస్తి. శ్రీరామవిజయగ్రంథం అంబరంవంటిది. నానా దృష్టాంతాలు నక్షత్రాల్లా సుందరమైనవి. అందులో ఉదయించాడు చంద్రునిలా, నిష్కళంకుడు, అక్షయుడైన శ్రీశీరామభద్రుడు. బ్రహ్మానందా! శ్రీరామచంద్రా! నిర్మలా! శీతలా! ఉదారా! మీ కృపతో శ్రీధరుడు చకోరంలా స్వానందామృతాన్ని సేవించాడు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు ఆలకిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఇరవై ఆరవ అధ్యాయం మధురం**



# అధ్యాయము - 27

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**సో**మరిపోతు పనీపాటా చేయకపోయినా, ఇల్లు వదలి బయటకు వెళ్ళకపోయినా పూర్వపుణ్యాన సకల జన సంరక్షకుడైన జగన్నివాసుడు వాని ఇంటికి వచ్చినట్లు, మట్టితవ్వబోతే మాణిక్యాల పెట్టె అయాచితంగా లభించినట్లు మాకు ఇది యథార్థంగా సద్గురు కృపవల్లనే లభ్యమైంది. ఎక్కువ శ్రమ లేకుండానే రామవిజయమనే రత్నాల భాండాగారం లభించింది. ఆ ఆనందానికి అవధులు లేవు. ఎంతో తృప్తి లభించింది. ఆ మందసాన్ని పరికిస్తే అందులో ఏడు సంచులున్నాయి. అవే సప్తకాండలు. ఒకదానికంటె మరొకటి రసవత్తరమైనది. ఆ సంచులను బాగా పరీక్షించి చూస్తే అందులో ప్రకాశవంతమైన భక్తిజ్ఞాన వైరాగ్యాలనే దివ్యనాణాలు ధగధగా మెరుస్తున్నాయి. చతురులయిన శ్రోతలు జ్ఞానసంపన్నులయిన సహాధ్యాయులు మూకుమ్మడిగా దగ్గర చేరి మాకు సమానంగా వాటా ఇమ్మని ప్రేమగా వాదులాడారు. ఇవి వాల్మీకి సంచులు. పూర్వపుణ్యాన లభించాయి. మాకందరికీ సమంగా పంచాల్సిందేనన్నారు. చతురులైనశ్రోతలందరూ సమతుల్యంగా శ్రవణం చేయటానికి ఒకే పంక్తిలో కూర్చునగా, సంచులను వారిముందు ఒక్కసారిగా కుమ్మరించారు. వారు కూడా కర్ణద్వారాలను తెరిచి హృదయభాండాగారాలలో ఆ ధనాన్నిదాచుకుని, శ్రోతలు, వక్తలు కూడా సావధానులై ఆత్మసుఖాన్ని సంపూర్ణంగా అనుభవించారు. ఐదుసంచులు ముగిసాయి. ఆరవదైన యుద్ధకాండ విశాలము, గంభీరమైనది.

### కుంభకర్ణుని నిద్రాభంగం

గత అధ్యాయంలో కథననుసరించి రాఘవుడు రావణుని దూషించాడు. ఛత్రాలు, కిరీటాలను ఛేదించాడు. రావణుడవమానం పొంది శోకసాగరంలో



మునిగి లంకకు తిరిగివెళ్ళాడు. రాహుగ్రస్తుడైన చంద్రునివలె, మసిబారిన వనంలా, మాడు నొప్పితో బాధపడుతున్న పెద్దపులిలా దశకంఠుడు లంకలో దిగాడు. ఛత్రం, సింహాసనంపై ప్రీతి కలుగలేదు. రావణునికి ఎటు చూసినా సంపూర్ణంగా రాముని రూపమే తప్ప ఇంకేమీ కనబడుటలేదు. ఏదీ గుర్తుకు రావటంలేదు. అత్యంత కళాహీనంగావున్న రావణుడు సభలో నున్న మహోదరునితో, ఎటువంటి విపరీతకాలం వచ్చింది. ఈగలు భూగోళాన్నే కుదిపేసినట్లు, చిత్రంలోని పాము గరుడుని మింగేసినట్లు, మిణుగురు పురుగు తన కాంతితో సూర్యుని కాల్చేసినట్లు నాకు ఈ రోజు యుద్ధంలో ఒక మానవునిచేత పరాజయం కలిగింది అని బేలగా అన్నాడు. బదులుగా ప్రధాని సత్వరం కుంభకర్ణుని లేపినట్లయితే క్షణంలో రామలక్ష్మణులతో సహా సైన్యాన్నంతా మింగివేయగలడు అని సూచించాడు. రావణునికి ఈ సూచన బాగా నచ్చింది. వెంటనే కుంభకర్ణుని లేపమనగా, విరూపాక్షుడు, మహోదరుడు ఇరువురు కలసి పదివేలరాక్షసులను, నాలుగువేల మద్యపాత్రలను, అపారంగా ఏనుగులను, పశువులను, పర్వతాలవంటి అన్నరాసులతో సహా కుంభకర్ణుని నిద్రలేపటానికి భయంకరమైన వాద్యాల హోరుతో అక్కడకు వెళ్ళారు. వనగజాలు, దున్నపోతులు ఎన్నో కుంభకర్ణుని ముక్కులో ఇరుక్కుని, అతడి ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో క్రిందమీదవుతూ ఎటూ పోలేక భీతిచెందాయి. కుంభకర్ణుడు ఒకటింబాతిక లక్షగ్రామాల పొడుగున్నాడు. లోతైన సముద్రంలో నిలిస్తే నీళ్ళు ఆయన నడుముదాకా వస్తాయి. అటువంటి భయానకమైన శరీరం గల కుంభకర్ణుని చూచి రాక్షసులకే వణుకు పుట్టింది. రాక్షసులంతా కలసి ద్వారంలో నిలబడి పెద్దగా కేకలు పెట్టారు. ఆ భయానకమైన అరుపులకు బావులలోని సకల జలచరాలు మృతిచెందాయి. మ్రోగించిన ఆ భేరీ నినాదాలు స్వర్గపర్యంతం వినబడ్డాయి. గుండెలపైన ఏనుగులచే తొక్కించారు. కాని అన్ని ప్రయత్నాలు కుంభకర్ణుని మేల్కొల్పటంలో

విఫలమయ్యాయి. ఆకాశాన్నంటే ఒక వెదురుబొంగును కుంభకర్ణుని ముక్కులో ఎక్కించారు. రెండవముక్కుకు అడ్డుపెట్టి ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నిలుపుదల చేశారు. ఒకడు చెట్లు, రాళ్ళతో మర్మస్థలం మీద బలంగా మోదాడు. చాలా ఘాటైన మందులను నాసికారంధ్రంలో కుమ్మరించారు. ఎన్నెన్నో ఉపాయాలు చేశారు. కాని కుంభకర్ణుని నిద్రలేపటానికి ఎవరితరమూ కాలేదు. కిన్నర స్త్రీలను కుంభకర్ణుని చెవిలో కూర్చుండబట్టి, ఆదిశేషుడే పరవశించే మధురాతి మధురమైన గానాన్ని వినిపించారు. ఆ గానానికి కుంభకర్ణుడు మేల్కొని, సావధానుడై కూర్చున్నాడు. ఒక్కసారి భయంకరంగా ఒళ్ళు విరుచుకుని, తెచ్చిన మద్యభాండాలన్నీ తాగేశాడు. ఎదురుగా ఉన్న లెక్కలేనన్ని పశువులను నమిలేసి, పళ్ళసందుల్లో ఇరుక్కుని ఉన్నవాటిని తీసేసి అన్నము, మాంసపురాసులతో కలిపి మింగేశాడు. తరువాత కళ్ళతోనే ప్రశ్నార్థకంగా ప్రధాని వైపు చూశాడు. వెంటనే ప్రధాని అతనికి వినయంగా నమస్కరించి 'సీతను అపహరించింది మొదలు హనుమంతుడు లంకను కాల్చి రామలక్ష్మణులను తీసుకురావడం, నిన్నటి యుద్ధంలో రావణుడు పరాజయం పొందడం వరకు సర్వం పూసగుచ్చినట్లు వివరించాడు. అందువల్ల రావణుడు శోకతప్తుడై మిమ్ములను వెంటనే లేపమన్నాడు. రాక్షసులందరూ హతులయ్యారు. సర్వనాశనమయ్యే సమయం ఆసన్నమైంది' అన్నాడు. ఆ మాటవినగానే కుంభకర్ణుడు తటాలున లేచి యుద్ధానికి సన్నద్ధుడైనాడు. కాని ప్రధాని రాజదర్శనం చేసుకొమ్మని సవినయంగా మనవి చేశాడు.

కుంభకర్ణుడు రాజసభకు బయలుదేరాడు. అపారమైన లంకాదుర్గాలు కూడా కుంభకర్ణుని కటిభాగం వరకే వచ్చాయి. రాక్షసులు ఆకాశాన్నుండి వింతపదార్థం ఏదైనా తీసుకొచ్చారేమోనని దేవతలంతా పరుగులు తీశారు. కుంభకర్ణుని ఆకారం చూచి లంకను చుట్టుముట్టిన వానరులంతా వెంటనే పారిపోయారు. కొందరు మూర్ఛపోయారు. ఆ సమయంలో విభీషణుడు



రామునితో 'స్వామీ! అదుగో కుంభకర్ణుని నిద్ర లేపారు' అన్నాడు. కుంభకర్ణుని ఆకృతి చూచి రాముడు ఆశ్చర్యపోయాడు. వెంటనే విభీషణుడు 'రామా! కుంభకర్ణుడు జన్మించే సమయంలో ప్రళయం వచ్చింది. భయంకరమైన కేకలతో నలుదిక్కులు పిక్కటిల్లాయి. తల్లి కడుపులో నుండి భూమిపై పడగానే కుంభకర్ణుడు ముప్పదివేలమంది స్త్రీలను నోటిలో వేసుకొని నమిలి మింగేశాడు. ఇంద్రుని ఐరావతాన్ని పట్టుకొని నేలకేసి కొట్టి చంపేశాడు. ఐరావతం దంతం విరిచి దాంతో దేవేంద్రుని కొట్టాడు. దేవేంద్రుడు వజ్రాయుధం తీసుకొని కుంభకర్ణుని మీద వేస్తే వెంట్రుక కూడా కదలలేదు. వాడు ఎప్పుడూ నిద్రపోతుంటాడు కాబట్టి లోకం ఇంకా మిగిలి ఉంది' అన్నాడు. కుంభకర్ణుని చూడగానే వానరగణాలకు చలిజ్వరం వచ్చింది. ఆ చలికి ముడుచుకుని పక్కకు తిరిగి పళ్ళుకొరుక్కుంటూ కూర్చున్నారు. కోదండపాణియైన రాముడు చుట్టూ కలియజూస్తూ భయావహులైన వానర సమూహం ఆంతర్యాన్ని గ్రహించి, మారుతి వైపు చూశాడు. నిముషంలో హనుమంతుడు లంకకు వెళ్ళి సభకు నడిచి వెళుతున్న కుంభకర్ణుని తటాలున నడుము వరకు పైకి లేపాడు. రామలక్ష్మణ సహితంగా వానరులు ఆ అద్భుతాన్ని గాంచి నిశ్చేష్టులైనారు. విపరీతమైన మద్యం మత్తులోనున్న కుంభకర్ణునికి తనను ఎవరో పైకి ఎత్తారన్న విషయం కూడా తెలియలేదు. అనంతరం హనుమంతుడు కుంభకర్ణుని ఇంకా పైకి లేపి గిరగిరా తిప్పి త్రికూటాచలంపై విసిరి వేయాలనుకున్నాడు. ఆకాశంలో తిప్పుతుండగా, లంకమీద పడితే లంకంతా నుగ్గునుగ్గు అవుతుంది కదా! తర్వాత విభీషణుడు లంకను ఎలా పాలించగలడు? త్రికూటాచలంపై వేస్తామా అంటే వానరులంతా బూడిదవుతారు కదా! భూమండలంపై పడేద్దామంటే భూమి పాతాళానికి క్రుంగిపోతుంది కదా! అని అనుమానించి కుంభకర్ణుని చెట్లమీద పడేటట్లు విసిరేసి రాముని వద్దకు తిరిగి వెళ్ళాడు. సూర్యుడుదయించగానే చీకట్లు మటుమాయమైనట్లు వానరుల

చలిజ్వరం, భయం నశించాయి. మారుతి తన భుజబలం ప్రదర్శించడమనే మందుతో వానరులందరి హిమజ్వర భయాన్ని తొలగించాడు. తదుపరి హనుమ రాముని పాదాలపై మోకరిల్లాడు. సుగ్రీవాది వానర ప్రముఖులంతా పరుగున మారుతిని కలసి, శబ్దకుసుమాలతో స్తోత్రమాలను కట్టి మారుతి కంఠంలో అలంకరించారు. కౌగిట్లో చిక్కిన కుంభకర్ణుని ఎందుకు వదిలేశావో బోధపడలేదు అని అడిగారు. వాడి మృత్యువు నా చేతులలో ఉందని హనుమంతునికి తెలుసు అందువల్ల వదిలేశాడని శ్రీరాముడు అంతరార్థాన్ని వివరించాడు. శ్రోతలు సింహావలోకనం చేస్తే జరిగిన కథలో కుంభకర్ణుడు రావణుని కలుసుకోవడానికి రాజసభకు వెళుతున్నాడు. ఎదురుగా వస్తున్న తమ్ముని చూసి రావణుడు ఎంతో ఆనందించాడు. కుంభకర్ణుడు నమస్కరించి తన ఆసనంలో కూర్చున్నాడు.

పిదప కుంభకర్ణుడు లేచి రావణునితో 'మహాప్రళయమే వచ్చిందా! భూమిరసాతలానికి క్రుంగిందా! యముడే దిగి వచ్చాడా! ఏమి ఆపద వచ్చిందని నన్ను నిద్రలేపార'ని మేఘగర్జనలాంటి స్వరంతో అడిగాడు. సమాధానంగా రావణుడు జానకిని బలవంతంగా తీసుకొనిరావడం, అందువల్ల వానరదళంతో శ్రీరాముడు త్రికూటపర్వతానికి విచ్చేయడం, ధూమ్రాక్షుడు, వజ్రదంష్ట్రుడు, ప్రహస్తుడు మొదలైన ప్రధానులు యుద్ధంలో గతించడం, తాను ఎంతో నైపుణ్యంగా యుద్ధం చేసినా పరాజయం పొందడం అన్నింటినీ వివరించి, ఇప్పుడు ఏంచేయాలో నాకు తోచక నిన్ను నిద్రలేపమన్నాను. 'నేను దు:ఖమనే వ్యాధితో బాధపడుతున్నాను. దానికి తగిన మందు నాకు ఇవ్వవలసింది. ఆపదసమయంలో తోడుగా నిలిచేవాడే నిజమైన బంధువు. అన్ని సంశయాలు పూర్తిగా నిరసించాలంటే సద్గురుచరణాలను ఆశ్రయించాలి. దట్టంగా వ్యాపించిన చీకట్లు తొలగాలంటే దివిటీలు వెలిగించాలి. శత్రువు శస్త్రాలను నిరోధించడానికి డాలు ముందు పెట్టాలి. కష్టకాలం సంభవించినపుడు దాత



వద్దకు వెళ్ళాలి. ఆ విధంగా మాకు విపరీతమైన విపత్తు కలిగినందున నిన్ను మేల్కొలిపాం' అన్నాడు. సమాధానంగా కుంభకర్ణుడు 'బుద్ధి కర్మానుసారిణి. జానకిని అనవసరంగా తెచ్చి కులక్షయానికి పునాది వేశావు. రాముడే ఆ వైకుంఠవాసి నారాయణుడు. వానరులంతా దేవతల అవతారాలు అని పూర్వమే నాకు నారదుడు తెలిపాడు. శుభాశుభకర్మలన్నీ అనుభవింపక తప్పదు. జరగబోయేదాన్ని ఎవరూ తప్పించుకోలేరు. రాజా! నీవు చేయగూడని పనిచేశావు. కనీసం సీతను అనుభవించావా!' అని అడుగగా రావణుడు 'నేను చాలా ప్రయత్నం చేసాను కాని ఆమె నాకు వశం కాలేదు. ఆమె ఎన్నటికీ రామునికి తప్ప వేరెవరికీ వశంకాదు' అని జవాబిచ్చాడు. కుంభకర్ణుడు రావణునితో 'నీవు మంత్రం జపించి కపటంతో సుందరమైన రఘువీరుని రూపం ధరించు. క్షణంలో సీత నీ వశమవుతుంది' అని సలహా యిచ్చాడు. ప్రతిగా లంకేశ్వరుడు 'నేను రఘువీరుని వేషం ధరించగానే సూర్యుడుదయించగానే చీకటి మాయమయినట్లు, గరుడుని చూడగానే ప్రాణభయంతో సర్పాలు పారిపోయినట్లు, నాలోని దుర్వాసనలన్నీ నశించి, పరసతులు మాతృసమానంగా, ఒకే బాణం, ఒకే మాట, ఒకే పత్నీవ్రతుడనవుతున్నాను. అందువల్ల తమ్ముడా! రాముడు, సౌమిత్రి, వానరగణాలను సంహరించకుండా జానకి ఎన్నటికీ నా వశం కాదు' అన్నాడు. తదుపరి కుంభకర్ణుడు 'నేను సకల సైన్యాన్ని మింగేసి క్షణంలో రామలక్ష్మణులను బంధించి తెచ్చి నా ధైర్యసాహసాలు ప్రదర్శిస్తాను' అని రావణునికి నమస్కరించి బయలుదేరగా అపారమైన సైన్యసమూహం అనుసరించింది.

### కుంభకర్ణుడి రణరంగప్రవేశం

కుంభకర్ణుడు యుద్ధానికి రాగానే అక్కడనున్న వానరులంతా రామచంద్రునికి ఈ విషయం తెలియచేయటానికి పారిపోయారు.

కుంభకర్ణుడు ఆంతర్యంలో, 'నేను ఈ వానరుల పైకి వెళ్ళి ప్రయోజనమేమి? జంబుకం పైకి సింహం లంఘించడం ఏం గొప్ప! చీమపైకి ఏనుగు పరుగిడినట్లు, కీటకంపైన గరుడుడు పోరు సలిపినట్లు, మూఢుల సభలో ఎంత గొప్ప పండితుడైనా రాణించనట్లు నేను వీళ్ళతో కలహించడం వ్యర్థం' అనుకున్నాడు. మొదట్లో అసంఖ్యాకమైన రాక్షస సమూహాన్ని చూచి తెలివిగా వానరులు పరుగెత్తారు. తిరిగి శిలలు, వృక్షాలు గైకొని అందరూ కలసి వచ్చారు. తీవ్రమైన యుద్ధం జరిగింది. రక్తం వరదలై పారింది. అయినా ఘటశ్రోతుడు లెక్కచేయక వీళ్ళతో యుద్ధం చేయడం దేనికి? మూర్ఖులు వాదించినా పండితుల మనస్సు రంజిల్లనట్లు, ఆంబోతులెంత పోట్లాడినా పెద్దపులి లెక్కచేయనట్లు, పద్దెనిమిది పద్మాల వానరదళాలు పర్వతాలు, పాషాణాలు వేస్తున్నా లెక్కచేయక కుంభకర్ణుడు లోహపుగుండుని తీసుకొని నేరుగా రామునిపైకి వెళ్ళాడు. పర్వతంపై ఎంత వర్షం కురిసినా దానికి కించిత్తు బాధకూడా ఉండదు. తాబేటి వీపుపై ఎన్ని పూలు పోసినా అది కొంచెం కూడా చలించదు. ఆ విధంగా ఎన్ని పర్వతాలు, పాషాణాలు ఒంటిపై పడుతున్నా కుంభకర్ణునికి ఏమాత్రం బాధ కలుగలేదు. హనుమంతుడు శతశృంగ పర్వతాన్ని పెకలించి కుంభకర్ణునిపై వేయగా అతడు ఒక ముష్టిఘాతంతో వెంటనే దాన్ని ముక్కలు చేశాడు. ఒరే! మర్కటా! ధైర్యంగా ఉండు. నీవే మా నగరాన్ని తగులబెట్టావు అంటూ కుంభకర్ణుడు హనుమంతుని పైకి శూలాన్ని విసిరేశాడు. ఆ దెబ్బకు మారుతి మూర్ఛిల్లి నేలపై పడిపోయాడు. అదిచూచి సేనాపతి నీలుడు వాయువేగంతో పరుగున వచ్చాడు. కుంభకర్ణుని యుద్ధపటిమను విమానాలలో నుండి దేవతలు తిలకించసాగారు. నీలుడు వేసిన పర్వతాన్ని ఒక్క పిడికిటిపోటుతో పిండి చేసి మరొక పిడికిటిపోటుతో నీలుని మూర్ఛిల్లజేసాడు. ఆపైన యమునికే విద్య నేర్పగల నలుగురు వానరులు ఋషభుడు, శరభుడు, గవాక్షుడు, గంధమాదనుడు పరుగున వచ్చారు. వారు నాలుగు పర్వతాలను



కుంభకర్ణునిపై వేస్తే ఆయన ఒక్క గుద్దుతో వాటిని పిండిచేసి శరభుని, గవాక్షుని తన చేతివేటుతో నేలకూల్చాడు. మిగిలిన ఇద్దరిని ఆకాశానికి విసిరేస్తే నేలపై పడి ప్రాణాలు విడిచారు. తదుపరి కుంభకర్ణుడు బ్రహ్మాండం బద్దలయ్యేట్టు వికటాట్టహాసం చేసి వానరులను భక్షించటానికి పరుగెత్తాడు. ఒక్కసారిగా అనేకమంది వానరులను ఒడిసి పట్టుకొని నోట్లో వేసుకొని చప్పరించి మింగేసాడు. ఆ విధంగా వేలాది వానరులను నోట్లో వేసుకొని మింగేస్తే కొంతమంది చెవి రంధ్రాలలో నుండి బయటపడి పారిపోసాగారు. మిగిలిన వానరులు ప్రాణభయంతో యుద్ధం వదలి పారిపోయి పర్వతగుహల్లో దాక్కున్నారు. కొంతమంది సుగ్రీవుని శరణువేడగా సుగ్రీవుడు ఒక విశాలమైన పర్వతంగైకొని పరుగెత్తి కుంభకర్ణునిపై పడవేయగా దాన్ని అతడు లోహపు గుండుతో చూర్ణం చేశాడు. సుగ్రీవుడు కుంభకర్ణునితో 'ఓరీ! రాక్షసా! అమంగళా! నీ బలం అంతా వ్యర్థం. నీ ముక్కు, చెవులు క్షణంలో ఛేదిస్తాను' అన్నాడు. ఈ మాటలు విని విమానాల్లో ఉన్న దేవతాగణాలన్నీ సంతోషించాయి. 'నీ అగ్రజుడైన దశకంఠుడు దొంగవలె పంచవటికి వచ్చి చిత్రత్నమైన, సౌందర్యవతియైన జానకిని దొంగతనంగా తీసుకొచ్చాడు. ఆ దొంగతనానికి శిక్షగా రావణానుజుడవైన నీకు ముక్కు, చెవులు కత్తిరించి ఇప్పుడే శిక్షిస్తాను' అని శపథం చేశాడు.

'ఒరే అల్పుడా! నీవు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. పరుగున వచ్చిన పక్షి బడబాగ్నిని ఆర్పివేసినట్లు, దోమ కోపంతో పర్వతాలన్నింటినీ మ్రింగివేసినట్టు, తేలు తన తోకతో కొట్టి అగ్నిని ఆర్పివేసినట్లు, సాలీడు తన దారంతో ఐరావతాన్ని కట్టివేసినట్టు, ధగధగ మెరిసే సూర్యమండలాన్ని మిణుగురు పురుగు మింగివేసినట్టు ఒరే! బలహీనుడవైన వానరమా! నా ముందు కోపపడితే నల్లిలా నీ శరీరాన్ని నలిపి వేస్తాను' అని కుంభకర్ణుడు మాట్లాడుతుండగానే సుగ్రీవుడు ఒక పర్వతాన్ని ఎత్తుకుని కుంభకర్ణుని గుండెలపై

పడవేశాడు. ఆ పర్వతం గుండెలకు తగిలి పిండయిపోయింది. కుంభకర్ణుడు కోపంతో సుగ్రీవుని కాళ్ళు పట్టుకొని గిరగిరా త్రిప్పి నేలకేసి కొట్టేంతలో సుగ్రీవుడు కుంభకర్ణుని చేతిలో నుంచి జారి ఆకాశమార్గానికి ఎగిరాడు. కపిరాజు గ్రహమండలం వరకు ఎగిరాడు కాని కుంభకర్ణుడు తిరిగి చేజిక్కించుకొని చంకలో ఇరికించుకొన్నాడు. చంకలోని దుర్గంధంతో సుగ్రీవుడు ఊపిరాడక సతమతంకాగా 'వాలి మా అన్నకు చేసినదానికి ప్రతిగా నిన్ను ఈవిధంగా బాధపెట్టి కక్ష తీర్చుకొంటాను' అని, జయజయధ్వానాల ఘోషలో కుంభకర్ణుడు వెనుతిరిగాడు. జటిలమైన సంసారజాలంలో చిక్కిన సాధకుడు బయట పడటానికి ఎలా ప్రయత్నిస్తాడో ఆ విధంగా ఉంది కపిరాజు పరిస్థితి. దుర్గంధంలో పడిన ముత్యం వలె, బురదలో పడ్డ హంసవలె, కసాయి చేతిలో చిక్కిన నిర్మలమైన శ్రోత్రియ బ్రాహ్మణుని వలె ఉంది సుగ్రీవుని పరిస్థితి. కుంభకర్ణుడు బాగా మత్తులో ఉన్నాడు. ఏమాత్రం దేహస్ఫురణ లేదు. ఇది గమనించి చంకలో నుండి సుగ్రీవుడు క్షణంలో జారుకొన్నాడు. కన్నుమూసి కన్ను తెరిచేలోగా సుగ్రీవుడు కుంభకర్ణుని భుజాలపై నిలబడి తన పని సాధించుకొన్నాడు. రెండు విశాలమైన చెవులను రెండుచేతులతో పట్టుకొని పళ్ళమధ్యలో ముక్కును బంధించి ఒక్కసారిగా కుంభకర్ణుని ముక్కు, చెవులు పీకేసి ఆకాశానికెగిరి రాముని పాదాల చెంతకు వచ్చి ప్రేమతో రాముని చరణాలకు ప్రణమిల్లాడు. ఒక్కసారిగా వానరులు జయజయ ధ్వానాలు చేశారు. దేవతలు పూలవర్షం కురిపించి సుగ్రీవుడు 'యశస్వి' అని పొగిడారు. రఘువీరుడు సుగ్రీవుని కౌగిలించుకున్నాడు. సుగ్రీవుడు ముక్కు, చెవులు పీకేసినా కుంభకర్ణునికి ఏమీ తెలియలేదు. కుంభకర్ణునికి జరిగిన అవమానం రావణునికి తెలిసి ఎంతో విచారించాడు. మంగలిని పిలిపించి ఆకాశాన్నంటే వెదుళ్ళను తెప్పించి వానికి అద్దం కట్టి ఏడంతస్తుల మహాద్వారంపై మంగలిని నిలబెట్టాడు. కుంభకర్ణుని ఎదురుగా అద్దాన్ని చూపించారు. తెగిపోయిన ముక్కు,



చెవులను అద్దంలో చూచుకున్న తర్వాత చంకలో నుండి సుగ్రీవుడు తప్పించుకొన్నాడన్న విషయం కుంభకర్ణునికి బోధపడింది. అగ్నిపూలతో పర్వతం ఎర్రబారినట్టు, కుంభకర్ణుని మొహం రక్తసిక్తమైంది. తన స్వరూపాన్ని చూచుకొని మనస్సు కలత బారగా, కుంభకర్ణుడు మనస్సులో, నేను ఊరికే తిరిగి వెళ్ళి దశగ్రీవునికి ఏం చెప్పేది. ముఖం ఎలా చూపించేది. కపులతో సహా రామలక్ష్మణులను యుద్ధంలో మింగివేయడానికి క్షణం కూడా పట్టదు. భూమిని తలకిందులు చేసి దేవతలనందరిని నాశనం చేస్తాను అని తలపోసి, కుంభకర్ణుడు వెనుతిరిగాడు. పళ్ళతో పెదవులను బిగబట్టి చావుకేక పెట్టాడు. దాంతో భూగోళమంతా దద్దరిల్లింది. తిరిగి కుంభకర్ణుడు రావడం చూచి వానరులు పరుగెత్తి శరణు శరణు అంటూ రఘుపతిని శరణుజొచ్చారు. రాఘవుని లక్ష్యంగా పెట్టుకుని కుంభకర్ణుడు పరుగెత్తాడు. దారిలో అపారబల సంపన్నుడైన లక్ష్మణుడు కుంభకర్ణుని యుద్ధానికి పిలిచాడు. ఒక్కక్షణం ఇక్కడ నిలువు. నా శరకౌశలాన్ని చూడు అని పిలిచినా కుంభకర్ణుడు ఆగక రామునివైపుకు పరుగెత్తాడు. మిక్కిలి కోపంతో సౌమిత్రి కుంభకర్ణునిపై ఏడు బాణాలు వేశాడు. కాని అవి మొత్తం కుంభకర్ణుని శరీరంలోనికి ప్రవేశించి లుప్తమయినాయి. సౌమిత్రి లెక్కలేనన్ని బాణాలు వేయగా, పర్వతం ముందు పూలవాన కురిసినట్టుగా ఆ బాణాల తాకిడిని కుంభకర్ణుడు లెక్కచేయలేదు.

ఇది గమనించి ఒక గద తీసుకుని విభీషణుడు అన్న వద్దకు పరుగున వచ్చాడు. 'ముక్కులేనివాడా! ఒక్కక్షణం నాతో యుద్ధం చెయ్యి. నేను పూర్వమే రావణునికి ఎంతో నచ్చచెప్పాను. కాని అసభ్యమైన కామవికారంతో నా మాటలు వినక తెలివితక్కువగా ప్రవర్తించాడు. ప్రియవచనాలు చేదుగా ఉంటాయి. చెడు ఎప్పుడూ మనసుకు తియ్యగా ఉంటుంది. ఐశ్వర్యమదంతో, గర్వంతో బిగుసుకుపోయాడు. రావణుడు చేసిన దుష్కర్మల ఫలితాలు మీకు త్వరలో అనుభవానికి వస్తాయి' అని విభీషణుడు హెచ్చరించగా కుంభకర్ణుడు

ఇలా సమాధానం చెప్పాడు. 'ఒరే విభీషణా! శతమూర్ఖా! నాకు ముక్కు చెవులు లేవని నవ్వుతున్నావు. నేనెవరో సరిగ్గా చూడు. ఇంతవరకూ నేనెవరో నీకు సరిగ్గా తెలియదు. కులక్షయమవుతుందని నీవు ఇక్కడకు వచ్చి వీళ్ళతో కలిసావు. నీ ముఖం నాకు చూపించకు, లేదా క్షణంలో నీ ప్రాణం తీస్తాను. రాక్షసులలో నేను సింహం వంటివాడిని. నీవు జన్మతః నక్కవంటివాడివి. నీవు కులానికి నిప్పు పెట్టినవాడివి. కాని మాకు తిలాంజలి సమర్పిస్తావని కులోద్ధరణ కొరకు నిన్ను వదిలేశాను. నీవు వేగంగా రాముని వెనుకకు వెళ్ళు. నేను ఈరోజు తప్పక క్షణంలో వానరసేననంతా మింగేస్తాను' అన్న మాటలు విని విభీషణుడు వెనుదిరిగాడు.

## కుంభకర్ణ వధ

కుంభకర్ణుడు లోహపుగుండుతో రాముని పైకి పరుగున వెళ్ళాడు. కుంభకర్ణుని చూచి శ్రీరాముడు 'ఈనాడు నా బాణానికి నీవు యోగ్యుడవైనావు. నీవు ముల్లోకాలను పీడిస్తున్నావని తెలిసి నేను అవతరించాను. నీవు మింగిన వానరులందరిని నిన్ను చీల్చి బయటకు రప్పిస్తాను. నీకు మరణమాసన్నమయింది. జాగరూకునివై నా వైపు చూడు' అంటూ సూర్యకులభూషణుడైన రాముడు వింటిని ఎక్కుపెట్టాడు. ఆ ఆదిపురుషుని ప్రతాపం వేదశాస్త్రాలే వర్ణించలేకపోయాయి. రణరంగధీరుడైన రఘువీరుడు చీకటి ముగియగానే దినకరుడు ఉదయాచలాన విరాజిల్లినట్లు కుంభకర్ణుని ఎదుట నిలిచాడు. రాముడు కుంభకర్ణునితో 'నీవు యమపురికి వెళ్ళు, నీ వెనుకనే రావణుని కూడా పంపుతాను. లంకలో విభీషణుని నియమిస్తాను. ఆకాశంలో సూర్యచంద్రులు పరిభ్రమించేంతవరకు రాజ్యం చేస్తాడు' అన్నాడు. దానికి బదులుగా కుంభకర్ణుడు 'నీవు జన్మాంతర శత్రువువన్న విషయం మాకు ఎరుకే. నీ శక్తి సామర్థ్యాలు వర్ణించావు. కాని నీ ఆటలు నాముందు సాగవు. పంటికి తగలకుండా కపిసేననంతా మింగివేయగలను. నీవు ఖర,



దూషణ, త్రిశిరులను వధించావు. వాలిని మోసంతో సంహరించావు. నేను నిద్రలో మునిగి ఉన్నప్పుడు ముల్లోకాలు నిన్ను వీరుడని కొనియాడాయని తెలుసు. అందుకే ఇప్పుడు నేను వచ్చాను. వనచరాలను పీడించే ఏనుగు సింహం ఎదురుపడగానే నిర్వీర్యమవుతుంది. మేఘాల ముందు ఎంతటి అగ్నిజ్వాలలయినా క్షణంలో చల్లారిపోవలసిందే. ఆ విధంగానే నీవిప్పుడు! ఏదీ నీ నిర్వాణబాణం వదులు!' అని ప్రగల్భాలు పలికాడు. అన్నీ విని రఘునందనుడు వింటికి బాణాన్ని ఎక్కుపెట్టాడు. ప్రళయకాలంలో మెరుపుల వంటి అమోఘమైన రాఘవుని బాణాలను రాక్షసుడు నోటితో మింగేసాడు. అసంఖ్యాకంగా పైనబడే బాణాలను మింగివేసిన కుంభకర్ణుని సామర్థ్యానికి వానరులు భయభ్రాంతులయ్యారు. గంగానది అంతా సముద్రంలో కలిసినట్లు, బాణాలన్నీ కుంభకర్ణుని నోట్లో కలసిపోయాయి. కుంభకర్ణుడు ప్రచండంగా గర్జించగా ఆ కేకకు బ్రహ్మాండమంతా దద్దరిల్లింది. జలచర, వనచరాలెన్నో గతించాయి. ముద్గరాన్ని చక్రాకారంలో త్రిప్పి రామునిపై వేయాలనుకున్నాడు. ఇంతలో రణరంగధీరుడైన రాముడు దివ్యాస్త్రాన్ని వెలికి తీసి మంత్రించి బాణానికి చివర ప్రళయాగ్నిని నింపి ఆకర్ణాంతం సారించి బాణం విడిచాడు. ఆ బాణం ముద్గర ఉన్న చేతిని ఛేదించి, పాముని గొనిపోయే గరుడునిలా ఆకాశంలోకి దూసుకెళ్ళింది. వెంటనే రాముడు సూర్యమంత్రం జపించి ఇంకో బాణం వదిలాడు. అది రెండవ హస్తాన్ని ఖండించి పైకెగిరిపోయింది. వింధ్యపర్వతంలాంటి రెండుభుజాలు నేలరాలాయి. కాని ఆ భుజాలు కూడా కపిసైన్యాన్ని హింసించసాగాయి. అది చూచి వానరులంతా యుద్ధభూమిని వదలి చెట్ల తొర్రల్లోకి, పర్వతగుహల్లోకి పారిపోయారు. అక్కడ కదలక స్థిరంగా నిలబడ్డది ఒక్క రఘురాముడే. రాముడు రెండు బాణాలు తీసి నారి సారించి వేగంగా వదిలాడు. ఆ దెబ్బతో రెండు కాళ్ళూ నడుమువరకు విరిగాయి. ఆ కాళ్ళు చేసిన కోలాహలానికి రాళ్ళు కూడా పిండయ్యాయి. వానరులు పెద్దపెద్ద

చెట్లను తెచ్చి కాళ్ళను బలంగా మోదసాగారు. రాక్షసుడు పొట్టతో దొర్లుతూ నోరుచాచి శత్రువుపై కురికాడు. ఆ సన్నివేశాన్ని విమానాలలో ఉన్న దేవతలు చూచి ఆశ్చర్యపోయారు. ముక్కులో నుండి, కళ్ళలోనుండి, నోటినుండి కుంభకర్ణుడు క్రోధంతో నిప్పులు కక్కసాగాడు. అప్పుడు శ్రీరాముడు భీమకాలాస్త్రాన్ని సంధించాడు. గాలిని చీల్చుకుంటూ వేగంగా వెళ్ళే ఆ దివ్యబాణాన్ని ఆకర్ణాంతం నారి సారించి క్షణంలో విడిచాడు రాఘవుడు. వజ్రాయుధం పర్వతశిఖరాలను ఖండించినట్టు ఆ బాణం శిరస్సును ఖండించగా, ప్రళయగర్జన చేస్తూ ఆ శిరస్సు ఆకాశాన్ని ఛేదిస్తూ వెళ్ళిపోయింది. దేవతలంతా భయాక్రాంతులై విమానాలలో పారిపోయారు. సూర్యచంద్రులు కూడా భయభ్రాంతులయ్యారు. ఇంతలో ఆ శిరస్సు వేగంగా లంకలో పడింది. ఆ తాకిడికి అనేక భవనాలు నేలకూలాయి. కొంతమంది రాక్షసులు మరణించారు. ఆ సమయంలో దేవతలు రామునిపై పుష్పవృష్టి కురిపించారు. అందరూ రఘువీరుడు జయించాడని జయజయధ్వానాలు చేశారు. దేవతలు దుందుభులు మ్రోగించారు. ఆ ఆనందానికి అవధులు లేకుండాపోయింది. వానరులంతా పరుగున వచ్చి రఘుపతి పాదాలకు నమస్కరించారు. కుంభకర్ణుని మిగతా సైన్యం గాయాలతో లంకలో ప్రవేశించి సభకు వెళ్ళి జరిగినదంతా వివరించారు. ఆ వర్తమానం విని రావణుడు వికలుడై సింహాసనం నుండి క్రిందపడ్డాడు. కుంభకర్ణుడు కూడా హతుడైనాడు. తమ్ముడు లేక అంతా శూన్యంగా కనబడుతుంది అంటూ శోకసముద్రంలో మునిగాడు రావణుడు. ఇంతలో ఇంద్రజిత్తు పరుగున వచ్చాడు.

రావణుని అనునయించి 'రాజా! బాగా ఆలోచించు. మృత్యులోకానికి వెళ్ళకుండా ఎవరైనా చిరంజీవిగా ఉన్నారా? మనకు విపత్కాలం ఆసన్నమయింది. వానరులు రాక్షసులను సంహరిస్తున్నారు. మిణుగురుపురుగు సూర్యమండలాన్ని మ్రింగినట్లు, దోమ భూగోళాన్ని ఒక్క ఊపు ఊపినట్లు, పక్షి రెక్కగాలికి ప్రళయాగ్ని చల్లారినట్లు, భూతాలు యముని ముక్కలు ముక్కలుగా చేసి భక్షించినట్లు నర, వానరుల చేతిలో వీరకేసరియైన కుంభకర్ణుడు యుద్ధంలో మరణించాడు. ఇది మనకు విపరీతకాలం, అందువల్ల బాగా ఆలోచించు' అన్నాడు. రావణుని ఇరవై కళ్ళనుండి దుఃఖంతో నీరు కారసాగింది. ఆ సమయానికి ఆరుగురు రాక్షసవీరులు యుద్ధానికి తయారైనారు.



రామవిజయ గ్రంథం విశేషమైనది. అందులో యుద్ధకాండ వీరరసపూరితం. సావధానంగా శ్రవణం చేస్తే బ్రహ్మానందం కలుగుతుంది. రణరంగధీరుడైన రఘువీరుడు భక్తవత్సలుడు, పరమ ఉదారుడు, అభంగుడు, అక్షయుడు, శ్రీధరవరదుడు, సర్వదా విజయలక్ష్మిని వరిస్తాడు. స్వస్తి।

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా చతురులైన భక్తులు శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఇరవై ఏడవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 28

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

శ్రీరామచరిత్ర అతి మధురమైనది. రామకథ పారాయణ చేస్తే అంతరంగం ఉల్లాసమై రామస్మరణను గూడా మరపించి రామునితో తాదాత్మ్యం చెందిస్తుంది. అనంతమైన రఘువీరుని మహిమను శోధించడానికి మనస్సు పరుగులు తీసినపుడు, ఉత్కంఠావస్థలో సంపూర్ణంగా రామునిలో లీనమవుతారు. ఆ జగదీశ్వరుని గుణాలను లెక్కించటానికి బుద్ధి త్వరితంగా పరిగెత్తినపుడు, అంతరంగం మౌనమై రామమయమవుతుంది. చైతన్యఘనుడైన అయోధ్యాధీశుని భావావేశంతో స్మరిస్తే చిత్తం రామునితో తాదాత్మ్యం చెందుతుంది. పాలు పితికినట్టు అహంకారాన్ని పిండితే రామకథాబ్ధి ఆవలి ఒడ్డు చేరి, నిరహంకారులై బ్రహ్మానందంలో ఓలలాడతారు. ఇతరాన్ని వదలి ఏకాగ్రతతో రామచరిత్ర శ్రవణం చేస్తే ఆనందమయులవుతారు. మాటిమాటికి రాముని దర్శించాలని కళ్ళు ఉవ్విళ్ళూరుతుండగా, రామచరిత్ర వర్ణించడానికి నాలుక నాట్యం చేస్తుండగా, రామచరణారవింద పరిమళాలను ప్రీతితో నాసిక సేవిస్తుండగా, సర్వేంద్రియాలు రఘునాథుని సేవలో లీనమవుతాయి. ఇంద్రియాలన్నింటిలో నాలుక అదృష్టం గొప్పది. రఘుపతి గుణ గణాలను బ్రహ్మానందంగా వర్ణిస్తుందన్నారు వక్త. బదులుగా శ్రోతలు రామచరిత్ర శ్రవణం చేసినందువల్ల దశేంద్రియాలు ధన్యమైనాయి. రసభరితమైన యుద్ధకాండను కొనసాగించవలసిందని కోరారు.

### నరాంతకాదుల వధ

గత అధ్యాయాన్ననుసరించి రాముడు కుంభకర్ణుని వధించాడని విని రావణుడు ఉద్విగ్నుడైనాడు. ఆరుగురు వీరులు వరుసగా మహాపార్శ్వుడు,



మహోదరుడు, దేవాంతకుడు, నరాంతకుడు, త్రిశిరుడు, ఇంద్రజిత్తు తమ్ముడైన అతికాయుడు రావణుని అనుమతి గైకొని చతురంగ దళాలు వెంటరాగా యుద్ధానికి వెళ్ళారు. నానావిధాల రణవాద్యాల ఘోష వింటుంటే మనస్సుకు భీతిగొల్పేలా ఉన్నాయి. మహాద్వారం దాటి ఆరుగురు వీరులు బయటకు రాగానే, గద్దలు ఆరుగురి రథాలలో తెగిన తలలను పడవేశాయి. ఈ అపశకునాన్ని చూసి ఆ వీరుల మనస్సులు కలత చెందినా వారు దానినేమాత్రం పట్టించుకోక వేగంగా యుద్ధానికి తరలివెళ్ళారు. యుద్ధభూమిలో పడివున్న రాక్షసుల మృతకళేబరాలను చూచి అసురసైన్యం వెనుదిరగడం గమనించి నరాంతకుడు అశ్వారూఢుడై అరుదెంచాడు. ఆ వీరుని ధాటికి వానరులకు గాయాలు అనివార్యమయ్యాయి. శిరస్సులు మట్టికుండల్లా పగిలిపోతున్నాయి. నరాంతకుడు వానరదళాన్ని వక్కచూరలా నుగ్గుచేశాడు. వాని అశ్వం క్షీరార్ణవం నుండి ఉద్భవించింది. చంద్రకిరణాల మూసలోనుండి దిగవచ్చిందా అన్నట్లుంది ఉచ్చైశ్రవం సోదరుడైన ఆ శ్యామకర్ణ శత్రుసైన్యంలోకి గంగాప్రవాహంకన్నా, గరుడుని కన్నా వేగంగా ప్రవేశించగలదు. ప్రళయకాలంలోని మెరుపులా అతడి కత్తి మెరుస్తున్నది. గిరగిరా తిప్పుతున్న దివిటీల వెలుగులో ఎవరికీ ఏమీ కనబడడం లేదు. అశ్వము, ఖడ్గము, యోద్ధ ఈ మూడు ఒక్కటైనట్లుగానున్న నరాంతకుని యుద్ధపటిమను చూచి అందరూ శ్లాఘించారు. ఎదురు వెళ్ళిన పదునెనిమిది లక్షల వానరులు వాని ధాటికి తట్టుకోలేక హతులైనారు. మిగతా వానరసైన్యం వెనుతిరగడం దూరంనుంచి అంగదుడు గమనించాడు.

వృక్షాలపై పిడుగుపడ్డట్టు, అంగదుడు యమునిలా నరాంతకునిపై విరుచుకు పడ్డాడు. అకస్మాత్తుగా అంగదుని ఘోరమైన ముష్టిఘాతాలకు నరాంతకుడు గుర్రంతో సహా ప్రాణాలు విడిచాడు. నరాంతకుని మరణం చూచి నలుగురు వీరులు మహాపార్శ్వుడు, మహోదరుడు, దేవాంతకుడు,

త్రిశిరుడు నలువైపుల చుట్టుముట్టారు. అంగదుడు రెండు పర్వతాలను చేతులతో ఎత్తుకుని ఎదురుగా నిలబడి నలుగురితో యుద్ధం చేయడమెలా అని సందిగ్ధావస్థలో పడ్డాడు. ఇంతలో ఋషభుడు, నలుడు, వాయునందనుడు కూడా వచ్చారు. నలుడు ఒకపర్వతాన్ని చేబూని మహోదరుని యుద్ధంలో సంహరించాడు. దేవాంతకుని సమీపించి హనుమంతుడు 'ముక్కులేనివానికి మన్మథుడని, వ్యభిచారికి బ్రహ్మచారి అని, గుడ్డివానికి ఆదిత్యుడని, నక్కను చూచి పరిగెత్తేవానికి కేసరియని, రెండు మెల్లకన్నులు గలవానికి కమలనేత్రుడని, విధవకు భాగీరథియని, జారిణికి అనసూయని, బాల్యంలోనే విధవరాలైన యువతికి సావిత్రని, పట్టెడు మెతుకులు గతిలేనివానికి ఇంద్రుడని, తాగడానికి మజ్జిగ కూడా లభించని వానికి క్షీరసింధువని, గొర్రెలు కాచుకొనేవానికి పండితుడని, శవాలు మోసేవానిని రాజేంద్రుడని, దరిద్రుని కుబేరుడని పిలిచినట్లు దేవాంతకుడనే నామధేయం నిజంగా నీకు ఎవడో మూర్ఖుడు పెట్టి ఉంటాడు. వృషభాన్ని సింహాసనం ఎక్కించినట్టు, కుక్కకు సుగంధం పూసినట్టు, ఒంటెకు పట్టువస్త్రాలు అలంకరించినట్టు, ఉమ్మెత్తను కనకచెట్టు అని పిలచినట్టుంటుంది నీకు పెట్టిన దేవాంతక నామధేయం. చర్మాల్లో ఏనుగు చర్మంలా, పక్షుల్లో భరద్వాజ పక్షిలా ఉంది నీ పేరు' అని అంటూ వాయుపుత్రుడు ఒక్క ముష్టిఘాతం గుండెపై ఇచ్చేసరికి దేవాంతకుడు విగతజీవుడయ్యాడు.

ఇది గమనించి త్రిశిరుడు పరుగున వచ్చాడు. హనుమంతుడు చెట్టుతో మోది క్షణంలో త్రిశిరుని సంహరించగా, ఋషభుడు పర్వతంతో మహాపార్శ్వుని నేలకూల్చాడు. ఇది చూచి అతికాయుడు సారథితో, వీరందరిని పట్టించుకోక రథాన్ని నేరుగా రామునివైపుకు పోనియ్యమన్నాడు. వాని రథానికి వేయి గుర్రాలున్నాయి. కాని వాటి సూత్రధారి, సారథి ఒక్కడే. సూర్యుని సారథియైన అరుణునికి కూడా ఆ వేగం అంతుబట్టలేదు. అతికాయుడు స్థూలశరీరుడు. ఇంద్రజిత్తులాంటి ప్రచండవీరుడు. వాని ఎదురుగా ఐదుగురు వానరులు



గవయుడు, గవాక్షుడు, కుముదుడు, శరభుడు, మైందుడు అందరూ ఒక్కసారిగా పర్వతాలను వానిపై పడవేశారు. అతికాయుడు ఒకేబాణంతో వాటిని పిండిచేసి ఐదుగురిపై బాణాలు వేస్తే అందరూ హాహాకారాలు చేస్తూ కిందపడ్డారు. ఇది గమనించి రాముడు విభీషణునితో ఆ వచ్చేవాడు ఎవడని అడిగాడు. బదులుగా విభీషణుడు 'ఆ వచ్చేవాడు రావణుని పుత్రుడు, పేరు అతికాయుడు. తేజోవంతమైన ఆ దివ్యరథాన్ని వీనికి బ్రహ్మదేవుడిచ్చాడు. వాని బలపరాక్రమాలు అత్యద్భుతమైనవి. వాని నెదిరించటం ఇతరులకు సాధ్యం కాదు. వానినంతం చేయడానికి మీరే ధనుర్బాణాలు చేపట్టాలి. లేదా లక్ష్మణుని పిలిచి,యుద్ధానికి పంపవలసింది' అని మనవి చేశాడు. రాముడు వింటికున్న తొడుగు తీయగానే విరజిమ్మిన బ్రహ్మాండమైన వెలుగు రాత్రిపూట సూర్యుడుదయించాడా, యజ్ఞకుండంలో యాజ్ఞికులు రగిల్చిన అగ్నిజ్వాలా అన్నట్లుగా వుంది. అది గమనించి లక్ష్మణుడు, అతికాయుడితో తాను యుద్ధం చేస్తానని వేడుకుంటే సీతారమణుడు యుద్ధంలో విజయుడవై తిరిగి రా! అని ఆశీర్వదించి పంపాడు. వింటిని ఎక్కుపెట్టి లక్ష్మణుడు ముందుకు వెళ్ళి, అతికాయునితో 'అతికాయా! ఈ రోజు నీ శరీరం ముక్కలు చేస్తాను. బాణంతో నీ స్థూల సూక్ష్మదేహాలను వేరుచేస్తాను. తిరిగి లంకకు ఎలా వెళ్ళగలవో చూస్తాను. సింహానికి దాపుగా వెళ్ళిన ఏనుగు తిరిగి వెనుకకు పోగలదా? అలా రాక్షసులంతా మృత్యువు నోట్లో చిక్కుకున్నారు. పాము నోటినుండి ఎలుక తప్పించుకోగలదా? అలా యముడు యమపాశం పట్టి నిన్ను ఈ రోజు యుద్ధానికి లాక్కొచ్చాడు' అని అన్నాడు. బదులుగా అతికాయుడు 'నీవు మహావీరుడంటున్నావు. కాని చూడబోతే పెద్దపులివేషం వేసుకొన్న నక్కలాగా ఉన్నావు. రాజువేషం ఎవరన్నా వేసుకొంటే జనం భయపడతారా? అంతర్గతంగా మనస్సు తల్లడిల్లుతుండగా వైరాగ్యం నటించినట్లుంటుంది. నీ ప్రారబ్ధం నిన్ను అయోధ్య వదలి ఇక్కడకు వచ్చేట్లు చేసింది. ఏదో పాశం నిన్ను ఇక్కడకు లాక్కు వచ్చింది. స్వర్గంలో నీ

పితృదేవతలు ఏం చేస్తున్నారోనన్న సమాచారం తెలుసుకోవడానికి నిన్ను ఇప్పుడే అక్కడకు పంపిస్తాను' అన్నాడు. అతికాయుని మాటలు విని లక్ష్మణుడు సావధానుడై 'నా బాణాన్ని ప్రతిఘటించు. అది నీ ప్రాణం తీస్తుంది' అన్నాడు. అతికాయుడు తెల్లటి వేయిగుర్రాలతో అలంకరించిన నూరు అంతస్తులుగల తన రథాన్ని లక్ష్మణునివైపు తిప్పాడు. లక్ష్మణుడు ఐదు బాణాలు వేస్తే అవి మెరుపుల్లా రాసాగాయి. అది గమనించి లంకేశుని పుత్రుడు ఐదుబాణాలు వేసి వాటిని ఖండించాడు. వెంటనే సౌమిత్రి వేయిబాణాలు వేస్తే నేర్పరియైన అతికాయుడు ప్రళయకాలంలోని మేఘంలా గర్జించి వేయిబాణాలు వేశాడు. తదుపరి లక్ష బాణాలను సుమిత్రానందనుడు వర్షంలా కురిపించాడు. వాటి ధాటికి శస్త్రాలు వ్యర్థమయ్యాయి. ఏనుగుల తలలపైనున్న ముత్యాలు, రత్నాలు చెల్లాచెదురయ్యాయి. మెరుపుల వంటి అద్భుతమైన శక్తిగల ఆ బాణధాటికి రక్తం ఏరులయి పారగా ఆ ప్రవాహం ప్రేతాలు, వృక్షాలు, తెగిపడిన వీరుల చేతిపట్టాల మెరుపులతో మెల్లగా సాగిపోతుంది. ఆ రక్తప్రవాహంలో విరిగిన వీరుల దంతాలు గులకరాళ్ళలా గోచరిస్తున్నాయి, డాళ్ళు తాబేళ్ళలాగా తేలుతున్నాయి. తెగిన ఏనుగు తొండాలు మొసళ్ళలా కనబడుతున్నాయి. అసాధారణమైన ఆ సౌమిత్రి పరాక్రమాన్ని తిలకించి వానరులంతా ఆశ్చర్యంగా తలలు పంకించారు. అతికాయుడు నానా అస్త్రాలు సౌమిత్రిపై ప్రయోగించగా సౌమిత్రి ఒక దివ్యబాణాన్ని వెలికి తీసి బ్రహ్మాస్త్రాన్ని సంధించి వదలగా కల్పాంతంలోని మెరుపులా క్షణంలో అతికాయుని శిరస్సుని ఖండించింది. దేవతలంతా జయజయధ్వానాలతో పుష్పవృష్టి కురిపించారు.

## ఇంద్రజిత్తు యుద్ధం

రాక్షసదళంలో చాలా భాగం నశించిపోగా మిగిలినవారు గాయాలతో లంకలో ప్రవేశించి రావణునికి జరిగిన సంగతులన్నీ నివేదించారు. ఆ వార్తలు విని రావణుడు మూర్ఛిల్లాడు. ఇది గమనించి ఇంద్రజిత్తు పరుగున వచ్చి



సపర్యలు చేసి కూర్చుండబెట్టాడు. రావణుడు 'నా పెన్నిధివంటి ఆరుగురు వెళ్ళారు. ఒక్కరు కూడా తిరిగిరాలేదు. నన్ను వెన్నంటి ఉండే అతికాయుడు కూడా వెళ్ళిపోయాడు' అని దుఃఖించగా ఇంద్రజిత్తు 'రాజా! కానున్నది కల్పాంతంలోనైనా కాక మానదు. ఇప్పుడు నేను యుద్ధానికి వెళ్ళి తప్పక శత్రునాశనం గావిస్తాను' అని వెంటనే చతురంగదళాలతో రణరంగానికి బయలుదేరాడు. తన చుట్టూ సేనలతో చక్కగా కోట కట్టుకొని రక్తంతో స్నానం చేసి, రక్తవర్ణపు బట్టలు ధరించి, పోక సమిధలు తెచ్చి నెయ్యి, ధాన్యాలతో యుద్ధభూమిలో హెూమంచేశాడు. ఆ హెూమగుండం నుండి రథం, ధనుస్సు, బాణాలు, సారథి, గుర్రాలతో సహా వెలువడ్డాయి. వెంటనే ఆ రథాన్ని అధిరోహించి మేఘాలచాటుకు వెళ్ళి జోరుగా శరవృష్టి కురిపించాడు. ఆ బాణాలు పూర్తికాకుండానే మరల పిడుగుల్లాంటి బాణాలు వర్షించాడు. ఆ ధాటికి కపుల శిరస్సులు, చేతులు, కాళ్ళు లెక్కలేకుండా విరిగిపడ్డాయి. కోటానుకోట్ల వానరులు నేలకూలారు. ఆ తాకిడికి తట్టుకోలేక హాహాకారాలు చేస్తూ కపివీరులు ఒకరిపైనొకరు నేలపై కుప్పగా పడ్డారు. పారిపోదామనుకునే లోపలే చేతులు కాళ్ళు తెగిపడ్డాయి. ఇదంతా తటస్థంగా గమనిస్తున్న రామలక్ష్మణుల శరీరాలకు బాణాలు గుచ్చుకున్నాయి. ధనుస్సులు చేతినుండి జారిపోగా రామలక్ష్మణులు నేలపై పడ్డారు. లీలావతారుడైన ఆ కోదండపాణి శత్రువు ప్రతాపాన్ని చూడదల్చుకున్నాడు.

నూరుబాణాలు ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై వేయగా వారు నేలపై వాలారు. పద్దెనిమిది బాణాలతో సుగ్రీవుడు నేలపై పడ్డాడు. ఆరుబాణాలతో గంధమాదనుడు పడిపోయాడు. పన్నెండు బాణాలతో ఋషభుడు, మైందుడు నేలవాలారు. పదహారు బాణాలతో నీలుడు, నాలుగు బాణాలతో ఋక్షపాలుడు, ఆరుబాణాలతో నలుడు ప్రేతాలవలె పడిపోయారు. ముప్పది బాణాలతో

అంగదుడు యుద్ధరంగంలో నేలకూలాడు. గవయుడు, గవాక్షుడు, శరభుడు ముప్వురు అరవై బాణాలతో నేలరాలారు. అరువది నాలుగు బాణాలతో దధిముఖుడు, పావకలోచనుడు క్రిందపడ్డారు. పద్నాలుగు బాణాలు సుషేణుని పూర్తిగా గాయపరిచాయి. మూడు బాణాలతో గజకేసరి అనే వానరుడు, నాలుగు బాణాలతో హేమకూట, గౌరముఖవీరులు పడిపోయారు. సుముఖ, దుర్ముఖ, జ్యోతిర్ముఖులు పదిబాణాలతో, మిగతా అసంఖ్యాక వానరులు ఐదు బాణాలతో నేలపైబడ్డారు. ఆ విధమైన అనర్థం గావించి ఇంద్రజిత్తు రథంనుండి క్రిందకు దిగి జయవాద్యాలతో లంకలో ప్రవేశించాడు. రావణుడు మిక్కిలి సంతోషించి పుత్రుని ఆలింగనం చేసుకొని 'నాయనా! నా కీర్తి ప్రతిష్ఠలను పూర్తిగా పెంపొందించినవాడవు నీవొక్కడవే' అన్నాడు. ఇక్కడ వానరులందరూ కింద పడిపోగా మిగిలిన వారిద్దరే చిరంజీవులు– విభీషణుడు, హనుమంతుడు. అమిత బలాఢ్యులైన వారి ప్రాణాలన్నీ రాఘవుని పైనే. వారిద్దరు మ్లానమైనవదనంతో వెక్కి వెక్కి ఏడుస్తూ 'కాలమెంత కఠినమైనది. ఇప్పుడు ఆలోచన చేయగలవారెవ్వరు?' అని దుఃఖించసాగారు.

ఇంతలో సూర్యాస్తమయమయింది. నలుదిశల చీకటి కమ్మసాగింది. వెంటనే కాగడాలు పట్టుకొని యుద్ధభూమిలో వెదుకసాగారు. మహావృక్షాలు నేలకూలినట్టు పరాక్రమవంతులైన వానరవీరులు అక్కడక్కడ నేలపై పడివున్నారు. యుద్ధభూమిలో తిరుగుతూ ఇరువురూ అంతా గమనిస్తున్నారు. స్పృహ తప్పి ఉన్న జాంబవంతుని చూసి హనుమంతుడు సపర్యలు చేసి కూర్చుండబెట్టాడు. చరాచర జీవరాశులకు జీవమైన రామలక్ష్మణులు క్షేమంగా వున్నారా? అని అడిగాడు జాంబవంతుడు. సమాధానంగా విభీషణుడు వెక్కివెక్కి ఏడుస్తూ రామలక్ష్మణులు నిశ్చేష్టులు కాగా మిగతా సైన్యం విగతజీవులైనారు అని అన్నాడు.



## హనుమ ద్రోణాచలాన్ని తేవడం

జాంబవంతుడు ఎవరైనా ద్రోణాచలాన్ని తెస్తే దాని ఔషధాల సువాసన వల్ల అందరూ జీవిస్తారు. సూర్యోదయానికి పూర్వం మూలిక తేవాలన్నాడు. ఆ వార్త విన్నంతనే మారుతి ఆవేశంతో క్షీరాబ్ధి ఆవలి ఒడ్డు చేరి నాలుగుకోట్ల యోజనాల దూరం వెళ్ళి ఔషధంతో మూడోఝాముకల్లా తిరిగివస్తాను అన్నాడు. ఆంజనేయుడు విభీషణునితో 'రామలక్ష్మణులను జాగ్రత్తగా చూచుకోవలసింది' అని గద్గద స్వరంతో వేడుకున్నాడు. ఆ తరువాత హనుమంతుడు వేగంగా ఆకాశానికి ఎగిరి యశస్వియైన రఘునాథుడు శక్తిని ప్రసాదించుగాక! అని ధ్యానించాడు. కాళ్ళుచేతులు ఆడిస్తూ వైకుంఠం నుండి పాలసముద్రానికి వెళ్ళే గరుడునిలా సాగిపోయాడు. మానససరోవరానికి వెళ్ళే రాజహంసలా అంజనాతనయుడు సప్తద్వీపాలను దాటిపోయాడు. సప్తసముద్రాలు దాటి ద్రోణాచలం వద్దకు వెళ్ళి మారుతి ఎదురుగా నిలబడ్డాడు. సాగరతీరంలో అగస్త్యునివలె, బలి చక్రవర్తి వాకిట వామనునివలె, రాజుల ధనాగారం చుట్టూ సంచరించే తస్కరునివలె, చెట్టు వద్ద గొడ్డలితో నిలబడ్డ కట్టెలు కొట్టువానివలె, రత్నాలరాశి వద్ద ప్రేమతో అప్రమత్తుడై నిలబడిన వానివలె, ఆంజనేయుడు ద్రోణాచలం ముందు నిలుచున్నాడు.

హనుమంతుడు చేతులు జోడించి ద్రోణాచలాన్ని స్తుతించి 'ఓ పర్వతమా! నీవు పరోపకారం చేశావు. నీవు పుణ్యరూపుడవై ఆనందంగా జీవించెదవుగాక! నిన్ను స్మరిస్తేనే సకలరోగాలు పారిపోతాయి. ఇంద్రజిత్తు బాణంతో రామలక్ష్మణులను నిశ్చేష్టులను గావించాడు. నీవు నిజంగా ప్రాణదాతవు. ముల్లోకాలలో ఇది సత్యము. నీ కీర్తి విని పరుగున వచ్చిన యాచకుడను నేను. నిర్మలమైన ఔషధాలనిచ్చి నన్ను వెంటనే పంపించవలసింది' అన్నాడు. వెంటనే ఆ పర్వతం సాకారంగా ప్రత్యక్షమై మారుతితో ఇలా అంది. 'ఓ వానరా! ఎక్కడనుండి వచ్చావు? రాముడెవరు? లక్ష్మణుడెవరు? దేవతలకే

ఇక్కడి ఔషధాలు దుర్లభం. ఇక నీకు ఎక్కడనుంచి వస్తాయి! నన్ను ఆశ్రయించుకుని నీవు ఇక్కడనే ఉండు' అని సలహా యిచ్చింది. దానికి రాఘవప్రియుడైన అంజనేయుడు, 'ఓ ద్రోణాచలమా! నీది రాతిగుండె. మందబుద్ధివి, మూఢమతివి, మాలిన్యానివి. ఎన్నో మంచికార్యాలు చేయవలసిన నీకు ఇంతటి నిర్దయ ఎలా కలిగిందో నాకు అర్థం కావడంలేదు. కాకికేం తెలుస్తుంది ముత్యాలహారం విలువ? తాగుబోతుకు తత్త్వవిచారమేం బోధపడుతుంది? దయలేని వానికి ధర్మశాస్త్రాలల్లోని సారం తెలియదు. మాంసభక్షకునికి దయ, హింస చేసేవాడికి ప్రేమ ఎందుకుంటుంది? దుర్మార్గునికి వైరాగ్యం, పిసినారికి ధర్మం, వ్యభిచారికి సత్కర్మలు, అల్పుడికి భజన, భూతప్రేతాలకు కీర్తన, జ్వరం వచ్చినవాడికి పాలు, స్తోత్రపాఠకులకు జపతపాలపట్ల ప్రీతి ఎన్నటికీ కలుగదు. అలా నీవు అత్యంత నికృష్టుడవు. రామభజన తెలియని పామరుడవు. నిన్ను క్షణంలో లంకకు ఎత్తుకొనిపోతాను' అని పాము ఆకారంలో తోకను పెంచి, ద్రోణాచలం చుట్టూ గరుడుడు అమృతకలశాన్ని గొనిపోతున్నట్టు, ఆదిశేషుడు ఆవగింజప్రాయంగా భూమిని శిరస్సున ధరించినట్టు, హనుమంతుడు అరచేతిలో సూర్యుని గొని పోతున్నాడా అన్నట్లుగా అసంఖ్యాకమైన మెరుపులతో కూడిన ద్రోణాచలంతో సాగిపోతున్నాడు. ద్రోణాచలం బంగారు పళ్ళెంలా, అందులోని ఔషధాల తేజస్సే దీపాల్లా దేదీప్యమానంగా వెలుగుతుండగా, ఆ దృశ్యం చూడటానికి అంజనేయుడు రామునికి హారతియిస్తున్నాడా అన్నట్లుగా ఉంది. నాలుగో ఝాము బ్రాహ్మీముహూర్తంలో మారుతి త్రికూటపర్వతానికి రాగానే విభీషణుడు ఆనందంగా పరుగెత్తుతూ ఎదురు వచ్చాడు. ఆ పర్వతం నుండి మూలికల సువాసనలతో వీచిన చల్లనిగాలి అంతటా వ్యాపించింది. ఆ గాలి సోకగానే రామలక్ష్మణులు, వానరసేన అంతా పైకిలేచారు. రాత్రి ముగియగానే సూర్యుడు కిరణ సమేతంగా ఉదయించినట్లు తమాలనీలుడైన రాముడు వానర సమేతంగా



లేచాడు. ఎవరికీ శరీరంపై ఎలాంటి గాయాలు కానరాలేదు. తదుపరి వాయుపుత్రుడు ద్రోణాచలాన్ని యథాస్థానంలో ఉంచటానికి తిరిగి వెళ్ళాడు. పిల్లవాడు బంతి ఆట ఆడినట్లు విశాలమైన ఆ పర్వతాన్ని పూలగుత్తిలాగా యథాస్థలంలో ఉంచి ఆంజనేయుడు త్రికూటపర్వతానికి తిరిగి వచ్చాడు.

ఆ సమయంలో దేవతలచే ఆవృతమైన ఇంద్రునివలె, కపిసేనచే శ్రీరాముడు పరివేష్టించబడ్డాడు. హనుమ గద్గదితుడై రామచరణాలపై వాలాడు. రఘువీరుడు వాయుకుమారుని హృదయానికి హత్తుకున్నాడు. ఆ బంధం ఎన్నటికీ వీడదు. శంకరుడు స్కంధుని, ఇంద్రుడు జయంతుని, పవిత్రమైన సంజీవనిని సాధించి తెచ్చిన కచుని దేవగురువు కౌగిలించుకున్నట్లుగా ఉన్నది ఆ దృశ్యం. హనుమంతుని తనువంతా నిమురుతూ రఘునందనుడు 'ఈ రోజు ఎంతో సుదినం. స్వామి గౌరవాన్ని నీవు నిలబెట్టావు. అందరి ప్రాణదాతవు నీవు. రాత్రికిరాత్రే పర్వతాన్ని తీసుకుని రావడం సామాన్యమైన పనికాదు. పిల్లవాడికి బాగులేకపోతే తండ్రి వెళ్ళి మందు తెస్తాడు. కాని నీవు చూపిన పరాక్రమం అత్యద్భుతమైనది. దానిని వర్ణించనలవికాదు' అని అంటూండగానే వానర సేనంతా 'స్వామి ఆదరం ముందు సుధారసపానం కూడా ఎందుకూ పనికిరాదు. నీ జీవితం ధన్యమైనద'ని హనుమంతుని కొనియాడారు. సుగ్రీవాది వానరవీరులు పరుగున వచ్చి హనుమంతుని హృదయానికి హత్తుకున్నారు. సుగ్రీవుడు వానరసేనసుద్దేశించి 'ఇంకా ఏం చూస్తున్నారు? వెంటనే లంకకు వెళ్ళి అన్ని భవనాలకు నిప్పుపెట్టండి' అని ఆజ్ఞాపించాడు. పదునెనిమిది పద్మాల వానరసేనను గైకొని నలుడు, నీలుడు, మారుతి పరుగున వెళ్ళారు. ఆకాశాన్నంటే దివిటీలు వెలిగించి ఉత్సాహంగా రామభవానీ దివిటీలమంటూ రణరంగమంతా అల్లకల్లోలం చేశారు. కాగడాలు తీసుకొని అందరూ ఆకాశాన్నంటే గర్జనలు చేస్తూ రఘువీరునికి జయమగుగాక! అంటూ జయజయధ్వానాలు చేస్తూ పరుగులిడసాగారు. లంకాదుర్గం పైకెగిరి

వానరగణాలన్నీ లంకలో ప్రవేశించాయి. ఆ సమయంలో అద్భుతంగా సుడిగాలి వీయగా కాగడాలతో ఒక్కసారిగా భవనాలకు నిప్పంటించారు. ఆ సుడిగాలి తాకిడికి మంటలు విపరీతమై ఆకాశానికెగిశాయి. ఆ గందరగోళానికి లంకావాసులంతా పారిపోయారు. గాలివల్ల పొగ విపరీతంగా వ్యాపించింది. అక్కడ ఎవరికి ఎవరూ కనబడటం లేదు. లంకనంతా మింగేయాలన్నట్లు మంటలు ఆవేశంగా పరుగులు తీశాయి. కోట్ల భవనాలు దగ్ధమయ్యాయి. రాక్షసులు, స్త్రీలతో సహా కాలిపోయారు. ఇదంతా గమనిస్తూ వానరులు దివిటీలు పట్టుకుని నిలబడ్డారు. రాక్షసుడు కనబడితే వానరులు దివిటీతో కాల్చసాగారు. ఈ విషయమంతా దూతలు వెంటనే రావణునికి నివేదించారు. హనుమంతుడు ద్రోణాచలాన్ని తీసుకొని రావటం, శత్రువులందరిని బ్రతికించటం వానరసేనంతా లంకలో ప్రవేశించి భవనాలన్నింటినీ దగ్ధం చేయటం అన్నీ వివరించారు. రావణుడు జంఘ, ప్రజంఘ, క్రోధన, విరూపాక్ష, శోణితాక్ష రాజకుమారులను కుంభ, నికుంభులను ఉద్దేశించి 'త్వరగా పరుగెత్తండి' అని ఆజ్ఞాపించాడు. సైన్యాన్ని సిద్ధంచేసుకొని కుంభనికుంభులు వేగంగా పరుగెత్తి పర్జన్యాస్త్రం వేసి మంటలన్నింటినీ ఆర్పేశారు. శరీరాన్ని వదిలి ప్రాణం వెళ్ళిపోయినట్లు వానరులంతా లంకనుండి బయటకు వచ్చారు. యుద్ధభూమిలో అంతా కలసి యుద్ధం చేయటం ఆరంభించారు.

రాక్షససైన్యం రావటం చూచి అంగదుడు సైన్యానికి ముంగిట నిలిచి ఒక పర్వతాన్ని చేతిలోకి తీసుకుని వేగంగా క్రోధనుని పైకి లంఘించాడు. బలంగా పర్వతాన్ని పైన వేసేసరికి క్రోధనుడు రథంతో సహా నుగ్గునుగ్గయ్యాడు. ఇది చూచి జంఘునుడు, ప్రజంఘునుడు, విరూపాక్షుడు దారుణంగా అంగదునిపై కలియబడ్డారు. అంగదుడు ఒక విశాలమైన చెట్టుతో జంఘప్రజంఘులను నేలకూల్చాడు. కాని విరూపాక్షుడు బాణాలతో చాలామంది వానరులను సంహరించాడు. ఇంతలో మైందుడు ఒక పర్వతంతో పరుగున వచ్చి



విరూపాక్షుని పై వేయగా వాడు మరణించాడు. శరభుడు శోణితాక్షుని వధించాడు. ఇంతలో కుంభకర్ణుని కుమారుడైన కుంభుడు పరుగున వచ్చి ధనుస్సును ఆకర్ణాంతం సారించి తొమ్మిది బాణాలు వేశాడు. వాటి ధాటికి మైందుడు నేలకూలాడు. శరభునికి రెండు బాణాలు గుచ్చుకోగా మూర్ఛిల్లాడు. అప్పుడు విశాలమైన పర్వతాన్ని గైకొని అంగదుడు పరుగున వచ్చాడు. కుంభుడు అంగదుని చేతిని ఖండించగా అది పర్వతంతో సహా యుద్ధభూమిపై పడింది. ఆ బాధను భరించలేక అచేతనం కావటం చూచి వానరులు హాహాకారాలు చేస్తూ రాఘవుని వద్దకు పరుగెత్తారు. ఏనుగు ఘీంకారం విని ఆవేశంతో పంజా విసిరే మృగరాజులా సుగ్రీవుడు కుంభుని హృదయాన్ని ఢీకొన్నాడు. కుంభుని ధనుస్సు లాక్కుని ముక్కలుముక్కలు చేశాడు. తదుపరి ఇద్దరూ మల్లయుద్ధం గావించారు. రెండు ఘడియల పాటు ఇద్దరిమధ్య ఘోర యుద్ధం జరిగింది. వానరరాజు కుంభుని గుండెలపై గట్టిగా పిడికిటితో పొడిచాడు. దాంతో వాడి హృదయం నూరుముక్కలై ప్రాణం పోయింది. వెంటనే నికుంభుడు ఆవేశంతో సుగ్రీవుని పైకి దండెత్తాడు. ఇది గమనించి ఆంజనేయుడు ఒక బలిష్ఠమైన పర్వతాన్ని గైకొని పరుగున వచ్చి నికుంభునిపైవిసిరాడు. దానిని నికుంభుడు పొడిపొడి చేసేశాడు. దాంతో మారుతి మనసు క్షోభించి విశాలమైన చెట్టును పెకలించి వానిపై విసిరాడు. దాన్నిగూడా నికుంభుడు క్షణంలో విరిచేశాడు. నికుంభుడు పరిఘను చేబూని మారుతి గుండెలపై మోదాడు. ఆ దెబ్బకు ఒక క్షణం హనుమంతుడు మూర్ఛిల్లాడు. వెంటనే తేరుకొని ఆంజనేయుడు శతశృంగ పర్వతాన్ని పెకలించి నికుంభునిపై వేయగా దాంతో వాడు నుగ్గునుగ్గయ్యాడు.

### ఖరాక్షాదుల సంహారం

గాయపడ్డ సైనికులు లంకకు తిరిగివెళ్ళి రావణునికి జరిగిన సంగతంతా వినిపించారు. ఇది విని దశకంఠుడు చింతాక్రాంతుడయ్యాడు. కాని వెంటనే

రావణుడు పరమప్రతాపవంతులు, యుద్ధకోవిదులైన ఖరాక్ష, విశాలాక్ష, మకరాక్షులను రావించి యుద్ధానికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. రణాతురులైన వారు వెంటనే రథారూఢులై సేనాసహితంగా కేకలువేస్తూ వేగంగా రణరంగాన్ని చేరారు. వానరులు చెట్టుకొమ్మలు, రాళ్ళు తీసుకొని ఒక్కసారిగా కలియబడ్డారు. కనబడ్డ రాక్షసవీరులను ఒక్కరిని కూడా మిగలకుండా గోళ్ళతో రక్కి పొట్టలు చీల్చి అందరినీ గాయపరచారు. కత్తి, ఈటె, గద కాక అసురులు బాణాలు సంధించి వానరుల శరీరాలను ఛేదించారు. రణరంగంలో వానరుల ధాటికి తట్టుకోలేక రాక్షసులు వెనుదిరిగారు. ఇది గమనించి మకరాక్షుడు బాణవర్షం కురిపిస్తూ పరుగున వచ్చాడు. వర్షం ధారగా కురిసినట్టు మకరాక్షుడు శరవర్షధారలు కురిపించాడు. దాంతో లెక్కలేనంతమంది వానరులు మరణించారు. దూరాన్నుండి చూచి మకరాక్షుని గర్వభంగం చేయాలని వీరాధివీరుడు జగద్వంద్యుడైన రఘువీరుడు కోదండాన్ని ఎక్కుపెట్టి గణగణమని గజ్జెల శబ్దం చేసే ఒకబాణాన్ని వదిలాడు. సూర్యుడుదయించగానే తారలు మాయమైనట్టు రాముడు బాణం వదలగానే మకరాక్షుని శరపరంపర మటుమాయమైంది. వినాయకుడు లేవగానే విఘ్నాలు మాయమైనట్టు, సుడిగాలికి మేఘాలు చెల్లాచెదురైనట్టు, ఒక్క విష్ణునామం జపించితే అనంతమైన పాపాలు పటాపంచలయినట్టు, అగ్ని రగిలితే అసంఖ్యాకమైన అరణ్యాలు దగ్ధమయినట్లు, మూర్ఖుని శబ్దజాలాన్నంతా పండితుడు ఒక్క మాటతో ఖండించినట్లు, ఒక్క సింహనాదానికి ఏనుగుల సమూహమంతా గుండెలదిరి మరణించినట్లు, చేసిన బోధ హృదయానికి హత్తుకుంటే సహజంగా కామక్రోధాలు పలాయనం చిత్తగించినట్లు, బ్రహ్మానందం కలిగిన తరువాత క్షుద్రమైన విలాసాలన్నీ నశించిపోయినట్టు, ఒక్క రామబాణంతో మకరాక్షుని శరవృష్టి మాయమయింది. మకరాక్షునికి ముక్తి ప్రసాదించడానికి రఘురాముడు ఒక దివ్యాస్త్రాన్ని సంధించి వాని మెడకు గురిపెట్టి వదలగా, ఆ బాణం



గరుడుని వలె వేగంగా వెళ్ళి క్షణంలో మకరాక్షుని కంఠం ఛేదించి ఆకాశానికి ఎగిరిపోయింది. విశాలాక్ష, ఖరాక్షులిరువురు శంకరుడు ఎవరిని నిరంతరం ధ్యానిస్తాడో అట్టి సర్వాత్మకుడు, సర్వసాక్షి అయిన శ్రీరఘురాముని యుద్ధానికి పిలిచారు. వారు పరుగున వెళ్ళి రాఘవునితో 'ఎల్లప్పుడూ నీకు జయం కలుగుతుందా? అకస్మాత్తుగా కాకతాళీయంగా మకరాక్షుడు నీచే చంపబడ్డాడు' అంటూ రామునిపై తీవ్రమైన శరాలను సంధించారు. మృగరాజు ముందర పిల్లులు తీరికగా కూర్చున్నట్టు, మూఢుడు ప్రవీణులైన పండితులతో వాదించ వచ్చినట్లు, పులి ముందు నక్క గళం విప్పినట్లు, ఒంటె తుంబురునివలె గానం చేస్తానని ప్రతిజ్ఞ చేసినట్లు వారు రాముని ముందు కుప్పిగంతులు వేయనారంభించారు. అపారంగా వర్షించిన ఆ రాక్షసుల బాణాలను చిటికలో నివారించి రఘువీరుడు ప్రళయకాలపు మెరుపుల్లాంటి రెండుబాణాలను వింటికి సంధించి వదలగా అవి రాక్షసుల శిరస్సులను ఖండించి ఆకాశమార్గాన దూసుకెళ్ళాయి.

### ఇంద్రజిత్తు ప్రతాపం

ముగ్గురు వీరులు దివంగతులైనారన్న వార్త రావణునికి తెలిసింది. వెంటనే మహావీరుడైన ఇంద్రజిత్తు సేనాసమేతంగా యుద్ధానికి పరుగు తీసాడు. యుద్ధభూమిలో హోమం చేయగానే కృత్య అనే దేవత వచ్చి త్రుటిలో ఇంద్రజిత్తును రథంలో కూర్చుండబెట్టుకొని ఆకాశానికి ఎగిరిపోయింది. ఇంద్రజిత్తు ఆ కృత్యను అడ్డం పెట్టుకుని వానరులంతా నశించిపోయేటట్టుగా ఒక బాణం వేశాడు. దాంతో వానరగణాలు మిక్కిలి భీతి చెందాయి. వెంటనే వాయువు జగద్వంద్యుడైన శ్రీరాముని చెవిలో, అగ్నేయాస్త్రం వేసి ఆ దేవతను నిర్మూలించవలసిందని రహస్యంగా చెప్పాడు. మరల దేవతను అడ్డం పెట్టుకుని ఇంద్రజిత్తు బాణం సంధించబోగా రాముడు మంత్రాన్ని జపించి ఆగ్నేయాస్త్రాన్ని వదిలాడు. దాంతో ఆ దేవత భస్మమయింది. ఆంతర్యంలో వివేకం కలుగగానే

దుర్వాసనలు తృష్ణ, కల్పనలతో పారిపోయినట్లు, సూర్యుడుదయించగానే చీకటి మాయమయినట్లు, దేవతను నిర్మూలించగానే ఇంద్రజిత్తు నేలపైబడ్డాడు. వెంటనే రణరంగంలో నిలబడి అపారంగా శరవర్షం కురిపించాడు. ఆ ధాటికి వానరగణాలు క్షోభిల్లాయి. మహాపర్వతాన్ని చేబూని అంజనాసుతుడు ఆవేశంగా పరుగెత్తాడు. గదను చేపట్టి విభీషణుడు పళ్ళు కొరుకుతూ ముందుకు దూకాడు. పరిఘను గైకొని మైందుడు కోపంగా అరుదెంచాడు. కౌమోదకితో ధన్వంతరి ముందుకురికాడు. శతఘ్నులతో ఋషభుడు, చక్రాన్ని చేబట్టి శరభుడు, శక్తిని గైకొని గంధమాదనుడు పరుగెత్తారు. మహాపర్వతాన్ని తీసుకుని జాంబవంతుడు, మహావృక్షాలతో అంగదుడు, తోమరాన్ని గైకొని నీలుడు శత్రువు పైకి లంఘించారు. నలుడు పెద్దరాళ్ళను ఎత్తుకోగా, సుగ్రీవుడు పర్వతాన్ని తీసుకుని పరుగెత్తారు. పెద్దగా హుంకరిస్తూ కుముదుడు ఇనుపకడ్డీతో ముందుకు దూకాడు. లక్ష్మణుడు వింటిని సంధించి మూడుబాణాలు వేశాడు. రఘూత్తముడు ప్రచండమైన నూరుబాణాలు వదిలాడు. ఇంత శరవృష్టి జరిగినా ఇంద్రజిత్తు ఏమాత్రం లెక్కపెట్టక వాటిని నివారించి అసంఖ్యాకంగా బాణాలు వేసి అష్టాదశ పద్మాల వానరులను గాయపరచి, రామలక్ష్మణులపై ప్రచండమైన అస్త్రాలను వేశాడు. రామలక్ష్మణులతో సహా వానరులందరినీ వికలుర చేసి ఇంద్రజిత్తు పౌరుషాన్ని చూపించి వెనుదిరిగాడు. జయజయధ్వానాలు మిన్నుముట్టగా ఇంద్రజిత్తు లంకలో ప్రవేశించి, తండ్రికి అభివాదం చేసి జరిగినదంతా విన్నవించాడు. రావణుడు ఇంద్రజిత్తుతో ఇలా అన్నాడు. 'నీవు క్షణంలో శత్రువులను వధించి వస్తావు, నక్షత్రాలు పగలు మాయమై రాత్రిళ్ళు తిరిగి ప్రకాశించినట్లు, గడ్డి కాలిపోగానే భూమినుండి విత్తనం తిరిగి మొలకెత్తినట్లు, వారు తిరిగి జన్మిస్తున్నారు.' దానికి ప్రతిగా ఇంద్రజిత్తు 'ఈసారి రామలక్ష్మణులను వానరసహితంగా సమూలంగా నిర్జించి మీకు నా ముఖం చూపిస్తాను' అని ప్రతిజ్ఞ చేశాడు. 'అది పూర్తికాకుండా నేను మిమ్ములను



కలవను' అంటూ తండ్రికి నమస్కరించి వెంటనే బయలుదేరాడు. చతురంగ దళాలను సిద్ధం చేసుకుని వర్షాకాలంలో నదివరదలలో పొంగినట్టు పరుగుతీసాడు. మూడుసార్లు యుద్ధం చేసి విజయం సాధించుకుని వెళ్ళి నాల్గవసారి విజయఢంకా మ్రోగించటానికి మరలివచ్చాడు.

యుద్ధకాండ అతిమధురమైనది. దాంట్లో వీరరసం పాలు ఎక్కువ. చతురులైన శ్రోతలు సావకాశంగా అత్యాదరంతో దాన్ని తిలకిస్తారు. రణరంగ ధీరుడు, సువేళాచలవాసి, ప్రతాపరుద్రుడు, శ్రీధరవరదుడు, ఆనందసముద్రుడు, బ్రహ్మానందుడు, జగద్గురువు అయిన శ్రీరామచంద్రునకు స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా చతురులైన భక్తులు పఠిస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఇరవై ఎనిమిదవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 29

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**రా**మకథ పరమపావనమైనది. అమృతానికన్నా ఎంతో మధురమైనది. దేవతలు సుధారసపానం చేసినా కల్పాంతంలో మరణం తప్పదు. అమృతం నాలుకను తీపి చేస్తుంది. అది చెవులకు, కళ్ళకు తృప్తి కలిగించలేదు. కాని రామకథ అలాకాదు. సర్వేంద్రియాలకు తృప్తి కలిగిస్తుంది. సుధారసం సేవిస్తే గర్వం పెరుగుతుంది. కథామృతం గ్రోలితే మదమత్సరాలు నశిస్తాయి. త్రివిధ తాపాల దుఃఖం, కష్టాలు సద్భక్తులకు ఎన్నటికీ కలగవు. కథామృత శ్రవణం చేయటానికి కారణభూతుడైన ఆ రఘురాముని చరణాలకు మోకరిల్లి ముందు కథను కొనసాగిద్దాం. అమృతాన్ని ఇంద్రుడు నిరంతరం సేవిస్తాడు. కాని సర్వలోకాలు రామకథామృతపానం చేస్తాయి. స్వర్గలోకంలో నివసించేవారు కూడా రామకథను శ్రవణం చేయటానికి సదా అభిలషిస్తారు. భక్తజనులంతా రామకథా సుధాపానం చేయండి.

### ఇంద్రజిత్తు కాపట్యం

గత అధ్యాయంలో ఇంద్రజిత్తు యుద్ధభూమిలో నిలబడగా, వానరులు, భల్లూకాలు శిలల, వృక్షాల వర్షం కురిపించారు. సేనకు అగ్రభాగంలో ఆంజనేయుడు నిలబడి ఇంద్రజిత్తును చూచాడు. ఇంద్రజిత్తు పరమ దురాత్ముడు. కుటిలమైన మాయాజాలంతో మాయాసీతను సృష్టించి రథంలో కూర్చుండబెట్టుకున్నాడు. వన్నెపెట్టిన బంగారువర్ణంతో, మోహనరూపంతో, సకల వస్త్రాభరణభూషితయై, చంద్రబింబం లాంటి ముఖం, సర్వలక్షణాలతో నిర్మలంగా విరాజిల్లుతున్నందున, ఆమె మాయతో సృష్టించబడిందని ఎవ్వరికీ తోచలేదు. మేధావులు కూడా ఆమెను నిజమైన సీత అని నమ్మాల్సిందే. ఆ



విధంగా మాయాసీతను సృష్టించి, ఇంద్రజిత్తు మారుతితో 'ఒరే! మీ స్వామి పత్ని జానకిని బాగా చూడు. ఆమే రాముని భార్య. ఈ దేవత త్రేతాయుగంలో మా కులాన్ని నాశనం చేయటానికి జన్మించింది. పంచవటినుండి అసంఖ్యాకులైన అసురులు నానాబాధలు పడి సంహరించబడ్డారు. ప్రహస్తుడు, అతికాయుడు, మహోదరుడు, దేవాంతక, నరాంతకులు, కుంభకర్ణాది రాక్షసులందరూ ఈమె వల్లనే మరణించారు. పనస అనుకుని ఉమ్మెత్తకాయను, ముత్యాలహారమనుకుని సర్పాన్ని, సుందర రత్నమనుకుని నిప్పుకణికను తెచ్చినట్టు, మేడిపండువంటి అతిలోక సౌందర్యవతిని మా రాజు తెచ్చాడు. నక్షత్రం ప్రతిబింబాన్ని నీటిలో చూచి వల వేసినట్టు సీతను లంకకు తెచ్చి అనవసరంగా కష్టాలు కొనితెచ్చుకున్నాడు. కలహకారకురాలు, పాపియైన ఈమెవల్ల రాక్షసవనమంతా తగులబడిపోయింది. అటువంటి పరమచండాలురాలైన ఈమెను వ్యర్థంగా ఎందుకు ఉంచుకోవాలి?' అంటూ కత్తి దూసి ఆ మాయా సీతను వధించాడు. సీత శిరస్సు ఖండించి మారుతికి చూపించి 'ఇక రాముని అయోధ్యకు వెళ్ళమని చెప్పు' అన్నాడు. ఈ విధంగా చెప్పి ఇంద్రజిత్తు వెంటనే నికుంభిలకు వెళ్ళి అక్షయమైన రథం కొరకు అద్భుతమైన యాగం ఆరంభించాడు. జానకి వధ చూసిన అంజనేయుడు ఒక్క ఘడియకాలం నిశ్చేష్టుడై, నేలపై మూర్ఛిల్లాడు. కొంచెం తెప్పరిల్లగానే వెక్కివెక్కి ఏడుస్తూ, నేను రాఘవునికి ఏం చెప్పేది సీతను గూర్చి నా స్వామి అహోరాత్రాలు ఎంతో కష్టపడ్డాడు. సీత స్వరూపమని వృక్ష పాషాణాలను కౌగలించుకున్నాడు. సుగ్రీవుని స్నేహం చేసి వాలిని సంహరించాడు. సీతను వెదకి ఆ వార్తను రఘునాథునికి చెప్పగా ఎంతో ఆనందించాడు. అప్పటినుండి రాముడు నాకు సీతాశోకహరణుడు అని పేరు పెట్టాడు. అట్టి నేను ఈవార్తను మోసుకుని స్వామి దగ్గరకు ఎలా వెళ్ళేది? ఇంద్రజిత్తు శరధాటికి పడిపోయినప్పుడు ద్రోణాచలాన్ని తెచ్చి రఘురాముని సంతోషపరచినందుకు

నన్ను ఎంతో ఆదరించాడు. ఆ శ్రమంతా వ్యర్థమయింది. నేను నిజంగా అభాగ్యుడిని. ఈ వార్త వింటే రాఘవుడు ఏం చేస్తాడో తోచడం లేదు. నేను ఇంతకు ముందు రఘునాథునితో జనకపుత్రి క్షేమంగా ఉన్నది అని చెప్పాను. ఇప్పుడు జానకి వధించబడ్డదన్న వార్త రామచంద్రునికి ఎలా చెప్పేది? ధనసహాయం చేసిన వారి వద్దనే దొంగతనం చేసినట్టు, పెంచి పోషించినవాని శిరస్సునే ఖండించినట్టు, ఆజన్మసుఖం కలిగించినవారిని దుఃఖసాగరంలో ముంచినట్టు, మంటల్లోనుండి రక్షించినవాని తల నరికినట్టు, దప్పికతీర్చి రక్షించినవానిని వెంటనే సంహరించినట్లు, మంచి సంభాషణ మధ్యలో దారుణమైన తిట్లను వినిపించినట్లు, నేను రాముని వద్దకు వెళ్ళి ఈ వార్తనెలా చెప్పేది? అని హనుమంతుడు ఆలోచిస్తుండగా, వేగంగా రఘునాథుడు అక్కడకు వచ్చాడు. హనుమ తలవంచుకుని వెక్కిళ్ళు పెడుతూ భయాందోళితుడైనాడు. అది గమనించి రామలక్ష్మణులు కంగారుపడి ఏం జరిగిందని మారుతిని ప్రశ్నించారు. హనుమంతుడు గుండెలు పగిలేలా ఏడుస్తూ జరిగినదంతా విన్నవించాడు. జానకిని యుద్ధభూమికి తెచ్చి ఇంద్రజిత్తు వధించాడనగా, సారంగపాణియైన రామునికి దుఃఖం ఆగలేదు. ఆకర్ణాంతం అశ్రుధారలు కారసాగాయి.

రామసేనంతా హాహాకారాలు చేశారు. మంగళరూపుడైన రఘునందనుడు సీత గుణగణాలు తలచుకుని దుఃఖించుచుండగా లక్ష్మణుడు రాముని పాదాలపై వాలాడు. అందమైన రూపం కలిగి, మూర్తీభవించిన పరబ్రహ్మంవలెనున్న జగద్వంద్యుడైన రాముని చరణకమలాలకు సౌమిత్రి నమస్కరించాడు. బ్రహ్మాండనాయకా! రఘుపతీ! మిథ్యయైన మాయికమైన వాటి గురించి కలతబడనేల? ఆకారం పొందిన ప్రతిదీ తప్పక నాశనం కావలసిందే. వివేకమనే వజ్రాన్ని తీసుకుని మోహపర్వతాన్ని చూర్ణం చెయ్యి, సద్గురువు వసిష్ఠుని వద్ద ఇంతకుముందు మనం నేర్చుకున్న విద్య అదేగదా!



నీవు దేవాధిదేవుడవు. పరబ్రహ్మవు. జన్మరహితుడవు, అజేయుడవు, ఆత్మారాముడవు. నీకు మాయను గూర్చి ఆశ్చర్యమెందుకు? మిథ్యామయమంతా బూటకమే కదా! జానకి మరణం పొందినా నిన్ను వదలి ఎక్కడకు పోగలదు? కాంతి లేకుండా దీపం, బంగారం, రత్నం ఉండవు. పార్వతి తిరిగి జన్మించినా ఈశ్వరునే ఎలా భర్తగా పొందిందో, అనాదిగా సీతాదేవి మిమ్ములనే భర్తగా పొందడం యథార్థం. నేను ఇప్పుడు పరివారంతో సహా లంకకు వెళ్ళి రావణుని వధించి, దేవతలను విడిపించి విభీషణుని పట్టాభిషిక్తుని చేసి వస్తాను అనగా, రాముడు అధోవదనుడైనాడు. వానరసేనంతా విచారవదనులై నిస్తేజంగా రాముని అవలోకించారు.

ఇంతలో విభీషణుని ప్రధానులిరువురు జానకి ఆచూకీ తెలుసుకుని వచ్చారు. విభీషణుడు సంతోషాంతరంగుడై రామునితో, 'జగద్వంద్యా! చాపపాణీ! జానకీదేవి క్షేమంగా ఉన్నది. నేను లంకకు దూతను పంపి సమాచారం తెలుసుకున్నాను. ఇంద్రజిత్తు పరమకపటి. అందమైన మాయాసీతను సృష్టించి వధించాడు. హనుమంతుడు కపటం తెలియనివాడు. అంతా నిజమనుకున్నాడు' అని నిజాన్ని నివేదించాడు. విభీషణుని మాటలు విని కపిసేనంతా జయజయధ్వానాలు చేశారు. అందరి ముఖాలు ఒక్కసారిగా వెలిగిపోయాయి. ఆ ఆనందానికి అవధులు లేవు. ఉదయాచలంలో సూర్యుడుదయించగానే చీకటి వెంటనే మాయమైనట్టు, విభీషణుడు తెచ్చిన వార్త వినగానే వారి దుఃఖం పటాపంచలయింది. హృదయంలో వేదాంతజ్ఞానం కలుగగానే అరిషడ్వర్గాది పరివారంతో సహా అజ్ఞానం పరారయినట్లు, ఇంటియజమాని మేల్కొనగానే దొంగ పలాయనం చిత్తగించినట్లు, అన్నం లేక అలమటించినవానికి క్షీరసాగరం ముందు నిలిచినట్లు, సింహగర్జన విని ఏనుగులు ఘీంకరిస్తూ పరుగులు తీసినట్లు, అనాదిగా రోగంతో బాధపడేవానికి వైద్యులు అమృతం అందించినట్లు దుఃఖం మటుమాయమై రాముని వదనం

పున్నమినాటి చంద్రబింబంలా వెలిగిపోయింది. వానరసేనాసాగరమంతా ఆనందంతో ఉప్పొంగిపోయింది. రాముడు విభీషణునితో 'నీ ఉపకారం తీర్చుకోలేనిది. అనుక్షణం మమ్ములను ప్రాణసఖునివలె కాపాడుతున్నావు' అని మెచ్చుకున్నాడు. విభీషణుడు రాముని చెవిలో 'ఇంద్రజిత్తు నికుంభిలా మందిరంలో కుటిలమైన హోమం చేస్తున్నాడు. ఆ హోమధూమం ఆకాశానికి ఎగిసింది. ఆ హోమాహుతి నుండే ఈ సువాసనలు వస్తున్నాయి. ఆ హోమ గుండం నుండి ప్రకాశవంతమైన రథం ఇప్పటికే సగం బయటకు వచ్చింది. గుర్రాలు, సారథి, ధనుర్బాణాలతో వెలువడే ఆ రథం సంపూర్ణ కార్యసిద్ధి కలిగిస్తుంది. ఆ తరువాత ఇంద్రజిత్తును జయించటానికి శక్యం కాదు' అని రహస్యంగా తెలియజేసాడు. 'నాలుగుసార్లు దండెత్తి యుద్ధంలో విజయం సాధించివెళ్ళాడు. త్వరగా యాగాన్ని విధ్వంసం చేసి దాన్ని నిలిపివేయాలి. రథం పూర్తిగా బయటకు వచ్చిన తరువాత జయింపనలవికాదు. పదునాలుగు సంవత్సరాలు నిరాహారిగా ఉండి, బ్రహ్మచర్యం పాటించినవాని చేతిలో ఇంద్రజిత్తు మరణంపొందుతాడని భవిష్యవాణి చెప్పింది' అని వివరించాడు.

రాముని సంకేతాన్ని గ్రహించి, ధనుర్బాణాలు గైకొని లక్ష్మణుడు ఆయత్తమైనాడు. పసివాడైన తమ్ముని చూచి వాత్సల్యంతో చాపపాణి కౌగిలించుకుని చెవిలో మంత్రాన్ని ఉపదేశించాడు. ఏ మంత్రమైనా, ఏ అస్త్రమైనా, ఏయే సమయాల్లో ఎలా ప్రయోగించాలో ఆ విధానమంతా రాజీవనేత్రుడు సౌమిత్రికి విశదీకరించాడు. తలపై అభయహస్తముంచి, ఇంద్రజిత్తును వధించి, విజేయుడవై శుభంగా తిరిగిరా అని ఆశీర్వదించాడు. పరమ బుద్ధిమంతుడు, కళాప్రవీణుడైన రాఘవుడు, మారుతి విభీషణులను లక్ష్మణునికి తోడుగా పంపాడు. నలుడు, నీలుడు, జాంబవంతుడు, అంగదుడు, గవయుడు, గవాక్షుడు, ఋషభుడు, మైందుడు, పనస, కేసరి, దధిముఖుడు, ద్వివిదుడు మొదలగు వీరులనేకమంది అనుసరించారు. అసంఖ్యాకమైన ఆ



వానరగణానికి విభీషణుడు దారి చూపాడు. నికుంభిలా దుర్గం మహా దుర్భేద్యమైనది. లంకాదుర్గం కంటె కఠినతరమైనది. గజేంద్రునిపై దేవేంద్రునిలా అంగదుని భుజస్కంధాలపై లక్ష్మణుడధిరోహించాడు. ముందుమార్గం కఠినమని విభీషణుడు హెచ్చరించాడు. ఇక్కడనుండి ఎగిరి నికుంభిలా దుర్గంలోకి ప్రవేశించి, ఇంద్రజిత్తు చేస్తున్న హోమాన్ని విధ్వంసం చేయాలి. ఆ నికుంభిలా దుర్గాన్ని ఏడుగురు మహాబలశాలురు కాపలా కాస్తుంటారు అని అన్నాడు. వానరవీరులైన ఋషభుడు, గవయుడు, హనుమంతుడు శిలలు, పర్వతాలు చేబూని, ఆకాశమార్గాన నికుంభిలలో, ఇంద్రజిత్తు యాగం చేస్తున్న గుహలోకి ప్రవేశించారు. ఆ యాగాన్ని రక్షిస్తున్న భూతాలను మారుతి చిటికలో కొట్టి తరిమేశాడు. మహాపాపియైన ఇంద్రజిత్తు రక్తోదకంతో స్నానం చేసి రక్తవస్త్రాలు ధరించి, ఏడు ప్రేతాలపై వజ్రాసనంలో కూర్చుని ఉన్నాడు. రక్తం బొట్లుబొట్లుగా కారుతుండగా, తలంతా ఎర్రటి తొడుగు పెట్టుకున్నట్టుగా వుంది. తదేకదృష్టితో త్వరత్వరగా ఆహుతి చేస్తున్నాడు. లెక్కలేనన్ని బ్రాహ్మణుల శిరస్సులు పెద్దగుట్టగా దాపున పడివున్నాయి. మెడలో ఎముకల మాల ధరించి తలకు చనిపోయిన పామును చుట్టుకున్నాడు. బ్రాహ్మణుల దంతాలను పేలాలవలె తాజా రక్తమాంసాలతో సహా హోమంలో వేశాడు. అగ్నిలో నుండి సూర్యునికంటె తేజస్సుగల రథం వెలువడుతుండగా, అభాగ్యునికి దివ్యనిధి పొందబోయే సమయంలో విఘ్నం కలిగినట్టు, హనుమంతుడు ఒక పర్వతాన్ని హోమకుండంపై పడేసి సర్వనాశనం చేశాడు. అగ్ని చెల్లాచెదరై నలువైపుల వ్యాపించింది. ఆరాధ్యదేవత వెనుదిరిగిపోగా, అగ్ని రథాన్ని తిరిగి తనలో ఇముడ్చుకుంది. గొప్ప అనర్థం వాటిల్లింది. ఇంద్రజిత్తు వీపుపైన ఋషభుడు కాలకృత్యాలు తీర్చుకున్నాడు. యజ్ఞపాత్రలు విరగగొట్టి హోమద్రవ్యాలని పారబోసి, వానరులంతా వెళ్ళిపోయారు. ఆ రణగొణధ్వనికి శక్రజిత్తు సావధానుడై, జరిగిన వైపరీత్యానికి ఎంతో దుఃఖించాడు. నా దేవత ఎంతో

క్షోభించి ఉంటుంది. దీన్ని శత్రువులు ఎలా సాధించారో? నా ఆయుర్దాయం ముగిసిపోయే సమయం ఆసన్నమైంది అని అనుకున్నాడు. ఇంద్రజిత్తు కుపితుడై, ఒక దివ్యరథాన్ని అధిరోహించి, అద్భుతమైన సేనతో నికుంభిల నుండి యుద్ధానికి బయలుదేరి కపిసేనముందు నిలిచాడు. నక్షత్రాల్లోని చంద్రునివలె, గ్రహాలమధ్య సూర్యునివలె, వానరవీరుల మధ్య వెలిగిపోతున్న సౌమిత్రిని చూచి యుద్ధానికి సన్నద్ధమయ్యాడు. పర్వతాలలో మేరుపర్వతం వలె ఇంద్రజిత్తు రథారూఢుడుకాగా, రాక్షససైన్యమంతా వానరసేనతో తలపడింది. రాళ్ళు, చెట్లు, పర్వతాలు గైకొని వానరులు పరుగులు తీసారు. రాక్షసదళాలు వారిని తట్టుకోలేక నేలకూలాయి. శూలం, కత్తి, శక్తి వంటి ఆయుధాలతో అసురులు వానరులను పొడిచి చంపేశారు. కాని నలుడు, నీలుడు, జాంబవంతుడు, ప్రతాపరుద్రుడైన హనుమంతుడులాంటి వీరుల ధాటికి ఎంతో మంది అసురులు అసువులు బాసారు.

### సౌమిత్రి-ఇంద్రజిత్తుల యుద్ధం

అసమానమైన శత్రువుల పరాక్రమం చూచి ఇంద్రజిత్తు మిక్కిలి కోపించాడు. పైగా హోమాన్ని నాశనం చేశారన్న అక్కసుతో పళ్ళు పటపట కొరికాడు. దెబ్బతిన్న పాములా, తొండం మెలి తిరిగిన ఏనుగులా, ముక్కుమీద దెబ్బపడ్డ పెద్దపులిలా, అవమానం పొందిన మహాతపస్విలా, ఆజ్యం పోసిన అగ్నిలా ఇంద్రజిత్తు క్షోభిల్లి వేగంగా రథాన్ని ముందుకు నడిపాడు. ఏనుగును చూచిన మృగరాజులా, ఆదిశేషుని అవతారమైన లక్ష్మణుడు సింహనాదం చేసి వింటిని సంధించి ఒక దివ్యబాణాన్ని వేసి, మెరుపులా ముందుకురికాడు. దేవతలు కౌతుకంగా వజ్రాలరాశివంటి సౌమిత్రిని పరికించసాగారు. సౌమిత్రికే శుభం కలగాలని దేవతలంతా ఆశిస్తున్నారు. ఇంద్రజిత్తు సౌమిత్రితో, 'నీవు నాతో యుద్ధం చేయాలనుకోవడం లేడి పులిపై, కీటకం గరుడునిపై, ఆవుదూడ ఏనుగుపై, పిపీలికం కనకాచలంపై, సాలీడు భూమిపై, తేలు కొండెతో



నిప్పుపై, మిణుగురు పురుగు సూర్యునిపై, ఈగ భూగోళంపై, చిమట బడబానలంపై తలపడినట్లుంటుంది నీవు నాతో యుద్ధం చేయటానికి రావడం. ఓ నరుడా! యుద్ధంలో నా బాణానికి ఎదురు నిలువగల వీరుడు లేడు' అన్నాడు. సమాధానంగా లక్ష్మణుడు 'నీ దృష్టికి నేను చిన్నగా కనబడవచ్చు. నివురుగప్పిన నిప్పుకూడా క్షణంలో అడవిని కాల్చివేస్తుంది. చూపుకందని సింగం కూడా గజరాజును వణికించి వేస్తుంది. వజ్రం చేతిలో ఇమిడేంత చిన్నదైనా పర్వతాలను చూర్ణం చేయగలదు. వామనుడు పొట్టివాడైనా తన పాదాన్ని ముల్లోకాలకు ప్రసరింపజేస్తాడు. అగస్త్యుడు పొట్టివాడైనా సాగరాన్ని ఔపోసన పట్టాడు. సూర్యుడు చూడటానికి చిన్నగా ఉన్నా భూమికంతా వెలుగునిస్తాడు. నరశ్రేష్ఠుడైన రాఘవుని దాసుణ్ణి నేను. ఈ రోజు యుద్ధంలో నేను నిన్ను బాణాలతో ముక్కలుముక్కలు చేస్తాను' అన్నాడు. వారి మనోరథం ఎప్పుడు ఈడేరుతుందానని ఇంద్రాది దేవతలు ఆత్రుతగా ఆకాశంనుండి తిలకించసాగారు.

ఆ మాటలు విని ఇంద్రజిత్తు కుపితుడై మెరుపులాంటి ఒక దివ్యబాణాన్ని రామానుజునిపై వేశాడు. సద్వివేకం వల్ల జ్ఞాని క్రోధాన్ని ముక్కలు చేసినట్టు సౌమిత్రి ఆ బాణాన్ని ఖండించాడు. ఇది చూచి ఇంద్రజిత్తు అమిత క్రుద్ధుడై బాణవర్షం కురిపించాడు. సుమిత్రాసుతుడు ఒకే బాణంతో వాటినన్నింటిని పిండి చేశాడు. సూర్యుడుదయించగానే ఆకాశంలో నక్షత్రాలు లుప్తమయినట్టు, సుడిగాలి వీచగానే మేఘాలు చెల్లాచెదురయినట్టు, అంతర్యంలో బోధ కలుగగానే అనేక పాతకాలు నశించినట్టు, అనేకమైన సంసారదు:ఖాలను ఆత్మజ్ఞానం హరించినట్టు, ఇంద్రజిత్తు వేసిన బాణాలన్నింటిని లక్ష్మణుడు అవలీలగా ఛేదించాడు. సౌమిత్రి ఒక బాణం వేయగా దానినుండి అనేక బాణాలుద్భవించాయి. ఒకేఒక పుత్రుడున్న వాడికి అపారమైన సంతానం కలిగినట్టు, నూనెబొట్టు నీటిలో పడగానే నలువైపులకు వ్యాపించినట్టు,

సత్పురుషునికి దానమిస్తే కీర్తి సర్వత్రా వ్యాపించినట్టు, కులవంతునకు ఉపకారం చేస్తే చెప్పకనే యశస్సు పెంపొందినట్టు, ఒక్క బాణం వదలగానే అది నలువైపులా వ్యాపించింది. గురి చూసి సౌమిత్రి లక్షబాణాలు వదిలాడు. కాని ఇంద్రజిత్తు చిటికలో వాటిని ముక్కలు చేసి మూలవేశాడు. లక్ష్మణుని పరాక్రమంచూసి ఇంద్రజిత్తు మెచ్చుకోలుగా తలపంకించాడు. రణధీరుడెప్పుడూ తన స్థానం తప్పడు. ఈతడు నైపుణ్యం గల యోధుడు. తదుపరి ఇంద్రజిత్తు మంత్రం జపించి వారుణాస్త్రం సంధించాడు. దాంతో ఏనుగు తొండం వంటి ధారతో మేఘాలు వర్షించగా, సంపూర్ణంగా వైరాగ్యం కలగగానే సంసారదుఃఖమంతా పటాపంచలయినట్లు, లక్ష్మణుని వాయవ్యాస్త్రానికి మేఘాలతోపాటు ప్రచండమైన ఇంద్రజిత్తు సేన కూడా చెల్లాచెదురైంది. ఇంద్రజిత్తు ఒక మహాపర్వతాన్ని గాలికి అడ్డం పెట్టగా, సౌమిత్రి వజ్రాస్త్రంతో ఆ పర్వతాన్ని ఛేదించాడు. మంచిచెడు వివేచన తర్వాత కామక్రోధాలు మాయమైనట్టు పర్వతం పిండైపోయింది. తదుపరి ఇంద్రజిత్తు బడబానలాస్త్రం వేయగా సౌమిత్రి సాగరాస్త్రంతో ఖండించాడు. అగాధమైన సాగరాన్ని చూచి ఇంద్రజిత్తు అగస్త్యమంత్రం జపించాడు. క్షణంలో సముద్రం ఇంకిపోయింది. ఇంద్రజిత్తు పాపాస్త్రం వేయగా లక్ష్మణుడు నామాస్త్రం సంధించాడు. శక్రారి మహేశ్వరాస్త్రం ప్రయోగించగా లక్ష్మణుడు బ్రహ్మాస్త్రం జపించాడు. బ్రహ్మాస్త్రం మహేశ్వరాస్త్రాన్ని పూర్తిగా కబళించింది. ఆ ఉభయుల కౌశలాన్ని, జాంబవంతుడు, హనుమంతుడు ప్రశంసార్థకంగా గమనించసాగారు. ఇంద్రజిత్తు విపరీతమైన కోపంతో మెరుపుల్లాంటి ఐదు బాణాలు ఆకర్ణాంతం సారించి వదలగా, అవి నేరుగా సౌమిత్రి గుండెల్లో గుచ్చుకున్నాయి. మేరుమందరాలనే పొడి చేయగల కఠోరమైన ఆ ఐదు బాణాలు కలిగించిన బాధను ఆదిశేషుని అవతారమైన లక్ష్మణుడు సహించి, వెంటనే తొమ్మిది బాణాలు వెయ్యగా ఇంద్రజిత్తు కపాలంలో గుచ్చుకున్నాయి. ఇంద్రజిత్తు



ప్రచండమైన వీరుడు. లక్ష్మణుడేమో బాల్యం తీరనివాడు. విభీషణుడు స్నేహపూర్వకంగా గద తీసుకుని ముందుకు వచ్చాడు. గదను త్రిప్పి ఇంద్రజిత్తుపైన వేశాడు. దాన్ని బాణంతో ఖండించి ఇంద్రజిత్తు విభీషణునిపై ఐదుబాణాలు వేశాడు. అవి విభీషణుని గుండెలో చొరబడ్డాయి. ఇది గమనించి జాంబవంతుడు కాలుని వలె పరుగున వచ్చి పర్వతంపై వజ్రం పడ్డట్టు, ఇంద్రజిత్తుపై బడి అరచేతితో చరచగా అశ్వాలతో సహా రథం చూర్ణమయింది. మేఘనాథుడు విరథుడై నేలపై నిలబడి యుద్ధం చేయసాగాడు. వెంటనే హనుమంతుడు విశాలమైన పర్వతాన్ని ఇంద్రజిత్తుపై వేశాడు. నలుడు, నీలుడు, ఋషభుడు, అంగదుడు, శరభుడు, గవయుడు, గవాక్షుడు, కుముదుడు, కేసరి, పావకలోచనుడు, మైందుడు ఒక్కసారిగా శిలాపర్వతాలు గైకొని శక్రారిపై బలంగా వేశారు. ఆ యుద్ధాన్నంతా కుతూహలంగా దేవతలు ఆకాశం నుండి అవలోకించసాగారు. ఇంద్రజిత్తు అతి చతురుడు, గొప్పపరాక్రమవంతుడు, రణకోవిదుడు. చిటికలో బాణవర్షం కురిపించి పర్వతాలను పిండిచేశాడు. వెంటనే ఇంద్రజిత్తు మేఘాల చాటుకు వెళ్ళి అక్కడనుండి వానరసేనపై శరవర్షం కురిపించాడు. సౌమిత్రికి సరియైన స్థానం కల్పించడం కోసం హనుమంతుడు భుజాలపై సౌమిత్రిని ఎక్కించుకుని వెంటనే ఆకాశానికి ఎగిరాడు. పన్నెండుగ్రామాల ఎత్తున ఇంద్రజిత్తు, నూరుయోజనాలపైన హనుమంతుడు నిలబడి అద్భుతమైన యుద్ధం చేశారు. తదుపరి ఇంద్రజిత్తు నేలపై దిగగా, లక్ష్మణుడు కూడా దిగాడు.

### ఇంద్రజిత్తు వధ

సమస్త దేవతలు, ఋషిగణాలు లక్ష్మణునికి శుభం కలగాలని, యుద్ధంలో విజయం సిద్ధించాలని ఆకాంక్షించారు. వెనుకనుండి వానరసేనంతా ఆవేశంగా గర్జిస్తూ చుట్టూ చక్రాకారంలో నిలబడ్డారు. ఇద్దరూ అసహాయశూరులే. ఆకాశం దద్దరిల్లేట్టు సింహనాదం చేయగలరు. మహావేశంతో బ్రహ్మాండాన్ని

మ్రింగివేయగల సమర్థులు. ఇరువురి శరీరాల్లో బాణాలు గుచ్చుకున్నాయి. నెమలి పురివిప్పినట్టు, పర్వతంపై గడ్డి మొలచినట్టు వారి శరీరాలపై బాణాలు కనబడుతున్నాయి. తదుపరి సౌమిత్రి తూణీరం నుండి ఒక దివ్యాస్త్రాన్ని తీసాడు. ఆ బాణముఖం ముక్కంటి మూడోనేత్రం నుండి వెలువడ్డ అగ్నిలా, మధ్యాహ్నం మండే సూర్యునిలా వెలిగిపోతున్నది. దానినుండి భూమిపైకి వెలువడ్డ ప్రకాశమైన కిరణాలను లెక్కింపనెవ్వరికి సాధ్యంకాదు. ఆ అస్త్రం రామనామముద్రాంకితమై దేదీప్యమానంగా ప్రకాశిస్తూ లక్ష్మణుని మనోరథాన్ని తప్పక పూర్తి చేస్తుంది. ఆ బాణాన్ని ధనుస్సుపై ఎక్కుపెట్టి, ఆకర్ణాంతం సారించి, 'పూర్ణబ్రహ్మ, సనాతనుడు, మాయాతీతుడు, శుద్ధచైతన్యమూర్తి, సూర్యవంశజుడు అయిన రఘునందనుడు నిజమైనట్లయితే, నేను పన్నెండు సంవత్సరాలు నిరాహారంగా, బ్రహ్మచర్యం పాటించినవాడినైతే, త్రికరణశుద్ధిగా రామోపాసన చేసినట్లయితే, మంగళకారిణి జగన్మాత సీతాదేవి నిజంగా పతివ్రత అయితే, హనుమంతుడు నిజంగా రామదాసుడయితే, శివకంఠంలోని హాలాహలం రామనామంతో సంపూర్ణంగా శమించినట్లయితే ఈ బాణం ఇంద్రజిత్తు శిరస్సును ఖండించుగాక!' అని సంకల్పించి ఇంద్రజిత్తు కంఠానికి గురిపెట్టి బాణం వదిలాడు. ఆకాశమార్గాన వస్తున్న ఆ తీవ్రమైన బాణాన్ని చూచి శక్రారి నిర్వాణబాణం వదిలాడు. కాని ఇంతలో యమునివలె ఆ బాణం ఇంద్రజిత్తు కంఠం, భుజాలు ఛేదించి ఆకాశమార్గాన ఎగిరిపోయింది. రైతు కొడవలితో పంటను అవలీలగా కోసినట్టు, ఆ బాణం త్రుటిలో శిరస్సును భుజాల సహితంగా తీసుకునివెళ్ళింది. ఆశ్చర్యంగా భుజాలు ఎగిరి లంకలో పడ్డాయి. శిరస్సు క్రిందికి దిగుతూ కందకంలో పడబోయింది. ఋషభుడు పరుగున వెళ్ళి ఆ శిరస్సును పట్టుకున్నాడు. అందరూ జయజయధ్వానాలు చేయగా దేవతలు పూలవర్షం కురిపించారు.

ఇంద్రుడు ఎంతో సంతోషించాడు. నేడు నా భాగ్యం పండింది. సౌమిత్రి దయవల్ల నేను నిజంగా దిక్కులు చూడగలుగుతున్నాను. దుందుభి మరణిస్తే



ఋషులంతా ఆనందించినట్టు ఇంద్రజిత్తు మరణానికి ఇంద్రుని ఆనందం ఆకాశం అంచులు దాటిపోయింది. లక్ష్మణునిపై ఇంద్రుడు అనేకసార్లు పుష్పవర్షం కురిపించాడు. ఇంద్రుని ముఖబింబం నిష్కళంకంగా, క్షయరహితంగా వెలిగిపోయింది. ఇంద్రజిత్తు నేలరాలగానే రాక్షససైన్యమంతా దీనవదనులై ఇంద్రియాలన్ని నిస్తేజం కాగా జీవచ్ఛవాల్లా తయారయింది. దీపం ఆరగానే కాంతి నశించినట్టు, చంద్రుడు అస్తమించగానే వెన్నెల మాయమయినట్టు, పాట ఆగగానే స్వరాలన్నీ ఆగిపోయినట్టు ఇంద్రజిత్తు పడిపోగానే సేనంతా వీగిపోయింది. సంపూర్ణంగావిజయం సాధించి లక్ష్మణుడు వెనుదిరిగాడు. అనేకసార్లు విభీషణుడు సౌమిత్రిని శ్లాఘించాడు. హనుమంతుని భుజస్కంధాలపై కూర్చున్న సౌమిత్రికి శరాఘాతం వల్ల కలిగిన నొప్పులు శరీరాన్ని బాధించసాగాయి. అందరూ త్రికూటపర్వతం వైపుకు నడవసాగారు. దారిలోకలసిన వానరగణాలందరికీ విభీషణుడు జరిగినదంతా వివరించాడు. విశాలమైన ఇంద్రజిత్తు శిరస్సును పట్టుకుని వస్తున్న ఋషభుడు రఘువీరుని దృష్టి శిరస్సుపై పడాలని తన వద్దనే ఉంచుకున్నాడు.

ఇది ఇలా ఉండగా త్రికూటపర్వతంలో ఎవరినైతే పరమేశ్వరుడు నిరంతరం ధ్యానిస్తాడో ఆ రాముడు సౌమిత్రిని గూర్చి చింతాక్రాంతుడైనాడు. రఘురాముడు సుగ్రీవునితో లక్ష్మణుడు నికుంభిలకు వెళ్ళాడు. అక్కడ ఏం జరిగిందో మనకు ఎటువంటి వార్త అందలేదు. ఇంద్రజిత్తుతో యుద్ధం కష్టతరమైనది. మమ్మల్ని నాగపాశంతో బంధించాడు కదా! శరవృష్టి కురిపించి సేననంతా సంపూర్ణంగా తుదముట్టించాడు గదా! ఇంద్రజిత్తు నిపుణుడైన యోద్ధ, సౌమిత్రి బాల్యదశలోనున్నాడు అంటూ అయోధ్యాధీశుడు కళ్ళనీరు నింపుకున్నాడు. సుగ్రీవుడు రఘుపతితో మీరు మనస్సులో ఎలాంటి దిగులు పెట్టుకోవద్దు. ఇంద్రజిత్తును వధించి సౌమిత్రి త్వరగా ఇక్కడకు వస్తాడన్నాడు. ఈ విధంగా ఆలోచిస్తున్నంతలో ఒక వానరుడు పరుగున వచ్చి సౌమిత్రి ఇంద్రజిత్తుని

వధించాడన్న వార్త తీసుకురాగా, రఘువీరుడు ఎంతో ఆనందించాడు. సుగ్రీవుడు పరుగున ఎదురువెళ్ళి బాలసూర్యునివలె వెలుగుతున్న సౌమిత్రిని హనుమంతుని భుజాలపై నుండి క్రిందకు దించి, సుగ్రీవుడు, విభీషణుడు చెరొక చెయ్యి పట్టుకొని నడిపించారు. శరీరంలో బాణాలవల్ల కలిగిన బాధ ఎక్కువకాగా లక్ష్మణుడు మెల్లగా నడిచి రఘునందనునికి సాష్టాంగనమస్కారం చేశాడు. వృత్రుని వధించిన ఇంద్రుని బృహస్పతి ఆలింగనం చేసుకున్నట్టు రాజీవనేత్రుడు లక్ష్మణుని ప్రేమతో కౌగిలించుకున్నాడు.

శ్రీరాముడు లక్ష్మణునితో 'ఇంద్రజిత్తుని వధించడంతో నీ పరాక్రమం బ్రహ్మాండమంతా నిండి పోయింది. ఇంద్రజిత్తును గెలవడం ఎవరి తరం కాదు. నీవు యుద్ధంలో అతనిని సంహరించి దేవేంద్రునితో సహా దేవతలను ఆనందమయం చేశావు' అంటూ అతని తలపై తన వరదహస్తాన్ని ఉంచాడు. దాంతో సౌమిత్రి శరీర రుగ్మతంతా నశించి ఆనందభరితుడైనాడు. విభీషణుడు, జాంబవంతుడు మొదలైన వారినందరిని కలిసి రఘువీరుడు వాళ్ళను రత్నాల్లాంటి మాటలతో గౌరవించాడు. వారి బలపరాక్రమాలు ధన్యమైనవి. శత్రువు శిరస్సు ముందు ఉంచి ఋషభుడు నమస్కరించాడు. సీతానాథుడు దాన్ని గమనించి 'ఋషభా! నీ జన్మ ధన్యమైంది. ఈ శిరస్సును ప్రతిదినం ఎర్రటి పుష్పాలతో పూజచేస్తూ జాగ్రత్తగా వుంచి, తిరిగి అడిగినప్పుడు దాన్ని తీసుకునిరా' అన్నాడు. వైద్యుడు, ప్రతాపశూరుడైన సుషేణునితో రఘువీరుడు, 'బాణాలు గుచ్చుకుని బాధ పడుతున్న సౌమిత్రికి నీవుఉపచారాలు చెయ్యి' అన్నాడు. సుషేణుడు ఔషధాలిచ్చి, లక్ష్మణుని దివ్యదేహుని గావించాడు. తదుపరి విభీషణుడు యుద్ధం ఏవిధంగా జరిగిందో వివరించాడు. వీరులిద్దరి పరాక్రమం విని మేఘశ్యాముడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ఇంద్రజిత్తు పరాక్రమం ధన్యమైనది. అతడి బలపరాక్రమాలకు అంతులేదు. దేవతలనంతా దీనులచేసి బందీ గావించాడు. తరువాత సులోచన రాజీవనయనుని వద్దకు



శిరస్సు అడగటానికి వచ్చిన ఆ మధురకథ వింటే ఎంతో ఆనందం కలుగుతుంది.

రామవిజయగ్రంథం ప్రచండమైనది. దానిలో యుద్ధకాండ రసభరితమైనది. వింటే కోరికలన్నీ తీరిపోతాయి. ఇతరములపై ప్రీతి కలుగదు. బ్రహ్మానందా! శ్రీరామా! జగద్వంద్యా! పూర్ణబ్రహ్మా! శ్రీధరవరదా! అనామా! పూర్ణకామా! అభంగా! స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ఇరువది తొమ్మిదవ అధ్యాయం మధురం**



# అధ్యాయము - 30

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**సూ**ర్యకులభూషణుడు, విరించి జనకుడు, పద్మలోచనుడు, ఈశ్వరుని హృదయాన సదా వసించే వాడు, దశకంఠుని మదమణచినవాడు, సచ్చిదానందుడు, రఘుకుల కమలదివాకరుడు, అజేయుడు, మాయారణ్యానికి అగ్నివంటివాడు, భక్తహృదయాబ్జ భ్రమరము, లీలావతారుడు, షడ్గుణైశ్వర్య సంపన్నుడు, శ్రీ, కీర్తి, విజ్ఞాన, ఔదార్య, వైరాగ్య పరిపూర్ణుడు, సత్యజ్ఞాన శాశ్వతుడు, నిర్వికల్పుడు, అనంతుడు, హేతువాదానికి దృష్టాంతాలకు అతీతుడు, భవగజాలను మట్టు పెట్టే మృగేంద్రుడు, మోక్ష ఫలప్రదాత, తాటకను అంతమొందించినవాడు, సురపాలకుడు, జగద్గురువు అయిన రఘునాథుడు రాక్షసులను వధించటానికి త్రికూటపర్వతానికి విచ్చేశాడు.

### సులోచనావిలాపం

గత అధ్యాయంలో కథననుసరించి గుణసింధువు రాముని తమ్ముడైన లక్ష్మణుడు ఇంద్రజిత్తును వధించగా శిరస్సును ఋషభుడు త్రికూటాచలానికి తీసుకుని వెళ్ళాడు. ఆ శరీరానికి పట్టిన గతి విచిత్రమైనది. మొండెము యుద్ధభూమిలో ఉండిపోగా భుజాలు లంకలో పడి బంతివలె ఎగిరి నికుంభిలా దుర్గంలో పడ్డాయి. భుజదండం సులోచనా భవనప్రాంగణంలో పడ్డ సమయంలో ఆమె చెలులతో కలసి తన మందిరంలో ఆనందంగా కూర్చుని ఉంది. సులోచన అసాధారణ సౌందర్యవతి. ఆదిశేషుని కుమార్తె. పైగా రావణుని పెద్దకోడలు. ఇంద్రజిత్తు భార్య. రాక్షసులకు రాణి. ఆమె అందం చూచి దేవతలు కూడా సిగ్గుపడేవారు. దేవతలు గంధర్వరాజ కుమార్తెలు ఆమెకు అహోరాత్రాలు సేవ చేస్తుంటారు. దేవేంద్రుని సతి కూడా ఈమెకు సరిపోలదు. ఆమె శరీరం



నుండి వచ్చే పరిమళం ఒక క్రోసెడుదూరం విస్తరిస్తుంది. మదనుని భార్య కూడా ఈమెకు సరిరాదు. నిషధరాజపుత్రి దమయంతి పరమ సౌందర్యవతి అని చతురులైన కవులు నానావిధాలుగా వర్ణించారు. కాని ఆమె కూడా సులోచన సౌందర్యానికి సాటిరాదు. ఆమె శరీరకాంతులతో ఆభరణాలన్నీ దివ్యరత్నాలవలె అత్యంత శోభాయమానంగా వెలిగిపోతుంటాయి. కిన్నరకన్యలు మధురస్వరాలతో ఆమె చెంత గానం చేస్తుంటారు. ఒక చెలికత్తె అలంకరిస్తుండగా మరొకతె చామరం వీస్తుంది. ఇంకొకతె నానారకాల సంభాషణలతో ఆమె మనస్సు రంజిల్లజేస్తుంటుంది.

అటువంటి ఆనంద సదనంలో అమృతంలో విషం పడ్డట్టుగా, ప్రాంగణంలో బలమైన ఆ భుజదండం నేలపై పడగానే ఆ శబ్దానికి ఉలిక్కిపడి ఏం జరిగిందో చూడటానికి ఒక చెలికత్తె పరుగున బయటకు వచ్చింది. పిడికిలి బిగించి పడి ఉన్న తన యజమాని భుజదండాన్ని చూచి భయవిహ్వలయై ఈ విషయం ఎలా చెప్పాలా అన్న సంకటంలో పడింది. చివరకు, 'సఖీ! నేడు ఒక విచిత్రం జరిగింది. ఒక మహావీరుని భుజదండం ఆకాశమార్గాన వచ్చి మన ప్రాంగణంలో పడింది' అని చెప్పగా, సులోచన మనస్సు కలవరపడింది. వెంటనే రత్నపాదుకలు ధరించి మెరుపువేగంతో పెరటిలోకి వచ్చి చూడగా, శరీరమంతా వికలమై, ముఖమంతా పాలిపోయి కళ్ళు చెమ్మగిల్లి, నిశ్చేష్టితయై, నోట్లోవున్న తాంబూలాన్ని ఉమ్మేసి సఖులతో ఈ రోజు 'సీతకోసం త్రికూటపర్వతాన విడిది చేసిన అయోధ్యానాథునితో యుద్ధం చేయడానికి నా ప్రాణేశ్వరుడు వెళ్ళాడు' అంటూ భుజదండాన్ని సమీపించగా అది తన ప్రాణనాథుని హస్తమని గుర్తించింది. ఐదువేళ్ళు ముద్రిక లతో అలరారుతుండగా వీరకంకణం మణికట్టుపై దివ్యంగా మెరుస్తున్నది. ముంజేతి పైభాగంలో కీర్తిపతకాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. ఆ దండాన్ని చూచి సులోచన 'ఈ రోజు నా జీవితనావ మునిగిపోయింది' అంటూ చేతితో ముఖాన్ని

బాదుకుంటూ బ్రహ్మాండమంతా మునిగిపోయిందా అన్నట్టు పెద్దపెట్టున రోదించసాగింది. మెరుపు దెబ్బకు గురైన పూలగుత్తిలా శేషనందిని నిస్తేజమయింది. ధనం అంతా పోగొట్టుకున్న లోభివలె, నీటిలోనుండి బయటపడ్డ చేపవలె, పతివియోగంతో సులోచన తల్లడిల్లింది. కాలగతి విపరీతమైనది. ఎండమావిలో సూర్యుడు మునిగిపోయినట్లు, దీపపు వెలుగుకు చంద్రుడు, చీకటిబావిలో సూర్యుడు పడిపోయినట్లు, లేడిపిల్ల అరణ్యంలో సింహాన్ని పట్టుకున్నట్లు, పిపీలకం మేరుపర్వతాన్ని, కీటకం గరుడుని, దోమ బడబానలాన్ని మ్రింగినట్లు, భూతాలు యముని యుద్ధంలో సంహరించినట్లున్నది ఈ విపరీతం అంటూ బావురుమంది సులోచన.

సఖులంతా సులోచనను లేవదీసి కూర్చుండబెట్టి ఓదార్చసాగారు. పతి భుజదండాన్ని కావలించుకుని సులోచన ఆక్రందించసాగింది. భుజదండాన్ని చూచి సులోచన 'నా విభునికి మరణం ఎలా కలిగింది? జరిగిన సమాచారమంతా నాకు విశదంగా రాసి చూపించవలసింది. అహోరాత్రాలు నా మనస్సు పతి పాదాలపై లగ్నమైతే జరిగినదంతా నా కళ్ళకు కట్టినట్టు రాసి చూపించు' అని అర్థించింది. బంగారు సిరాబుడ్డిని ముందుంచి భూర్జపత్రాన్ని ముందు పరచి, కలాన్ని అందించగా, అద్భుతరీతిలో ఆ హస్తం త్వరత్వరగా జరిగిందంతా వ్రాసింది. సులోచన ఆ పత్రాన్ని కళ్ళకద్దుకుని సజల నయనాలతో చదువుతుండగా చుట్టూ వున్న చెలులంతా నిశ్శబ్దంగా ఆలకించసాగారు.

'ఓ శేషకన్యా! సుకుమారీ! చంపక కళికా! నా మానస సరోవర రాజహంసమా! ప్రాణేశ్వరీ! సులోచనా! విను! విజయం సాధించాలన్న ఆశతో నేను రహస్య ప్రదేశంలో యజ్ఞం చేస్తుండగా అగ్నిలోనుండి అందమైన దివ్యరథం వెలువడింది. ఫలితం పొందబోయేంతలో శత్రువులు వచ్చి బండరాళ్ళు వేసి ఆరాధ్య దేవతను కించపరచారు. పర్వతమంతా ఎక్కిన



తరువాత శిఖరం నుండి క్రిందికి తోసివేయబడ్డట్టు, నది అంతా దాటి తీరం దగ్గర మునిగిపోయినట్టు, ఆత్మజ్ఞానం ప్రాప్తించే సమయానికి విషయవాసనలలో చిక్కుకున్నట్టు, నిధి లభించగానే స్పృహ కోల్పోయినట్లు, కష్టపడి వేదాధ్యయనం గావించినా అభిమానం చావనట్టు, ఆకాశాన్నంతా సూర్యుడాక్రమించినా చివరకు రాహువు నోట్లో చిక్కినట్టయింది నీ భర్త పరిస్థితి. ప్రారబ్ధ బలం చాలనందువల్ల శత్రువులు జయించారు. కల్పాంతంలో కూడా జరగబోయేదాన్ని ఎవరూ తప్పించలేరు. తరువాత భీకర యుద్ధం జరిగింది. కాని జయం మనల్ని వరించకుండా శత్రువైన లక్ష్మణుని వరించింది. శత్రువు శౌర్యపరాక్రమాలు గల అసహాయశూరుడు. అతడి శరకౌశలం అసాధారణమైనది. దానికి తగ్గట్టుగా శిరస్సును సమర్పించాను. రామునితో మైత్రి కలిసింది. విభీషణుడు దేహంపై ఆశతో భయపడి రాముని శరణుజొచ్చాడు. నేను దేహత్రయాన్ని విసర్జించి సీతాపతి మైత్రి సలిపాను. సౌమిత్రి మహాతపస్వి, పరమ పవిత్రుడు. చాలాకాలం నిరాహారంగా ఉండి సముద్రాన్ని దాటి నా శిరస్సు కోసం వచ్చాడు. నేను కూడా లోభత్వం వదలి ఉదారంగా శిరస్సును సమర్పించినందువల్ల నా శిరస్సును రామచరణాల వద్ద సమర్పించటం జరిగింది. మొండెం యుద్ధభూమిలో నిలబడి ఉంది. శిరస్సు శ్రీరాముని చూడటానికి వెళ్ళింది. మాయానదిని దాటడం దుర్లభం. నేను ఆవలిఒడ్డున నీకోసం ఎదురుచూస్తుంటాను. ఓ ప్రాణప్రియా! నీ కీ విషయాలు వివరించడానికి భుజదండాన్ని ఇక్కడకు పంపాను. త్వరగా రా!'

ఆ పత్రాన్ని చదివి శేషకుమారి నేలపైబడి అమితంగా దు:ఖించింది. 'నేడు బలార్ణవం శోషించింది. ధైర్యమనే మహాపర్వతం కుంగిపోయింది. ఇంద్రజిత్తనే సూర్యకిరణాలను శత్రుతారాగణాలు మాయం చేసాయి. రణ సరోవరంలో శత్రుకమలాలను ఏనుగువలె ఛేదించే నిన్ను ఈనాడు సౌమిత్రి

అనే సింహం ముక్తుని చేసింది. ఐరావతంతో సమానమైన బలంగల దేవేంద్రుడే నీ ధాటికి యుద్ధంలో తల్లక్రిందులయ్యాడు. కాని నేడు మానవుడైన లక్ష్మణుడు నిన్ను సంహరించాడు. నా సౌభాగ్యభాండాగారాన్ని సౌమిత్రి అనే తస్కరుడు దోచుకున్నాడు. నా అదృష్ట సాగరాన్ని సౌమిత్రి అనే అగస్త్యుడు మింగివేశాడు. ఇంద్రజిత్తు నా చందమామ. సౌమిత్రి అనే ప్రతాపరాహువు తిరిగి అడగటానికి వీలులేకుండా నా చంద్రుని కళలతో సహా కబళించాడు' అని సులోచన నానావిధాలుగా శోకించడం చూచి పశుపక్ష్యాదులూ కరుణతో కన్నీరు కార్చాయి.

సఖులంతా సులోచనతో 'మీరెందుకు ఈ విధంగా దు:ఖిస్తారు. సంసారమాయనుండి బయటపడి పరలోక సాధనకు మార్గం చూడండి. కనబడేదంతా నశించిపోయేదే. మూలంలో చూస్తే ఈ మాయ రజ్జు సర్పభ్రాంతివంటిది. చేప భూమిపై గజ్జెలు కట్టుకుని నాట్యం చేయడం, గొడ్రాలి కొడుకు వ్యాపారానికి వెళ్ళడం, రాత్రుళ్ళు ఎండమావులలో చేపలు పట్టడం, ఆకాశంలో క్షణమాత్రం కనబడే గంధర్వ నగరం ఇవన్నీ భ్రాంతిమంతాలే' అని ఆమెను ఓదార్చారు. ఇదిలావుండగా, సులోచన తన మందిరంలోకి వెళ్ళి, అపవాదుకు సజ్జనుడు భయపడ్డట్టు, వాంతిని చూచి కడుపులో తిప్పినట్టు, అందమైన ఆడదాన్నిగని విరక్తుడు వికలమైనట్టు, సులోచన నానారకాల సంపదను చూచి కలత చెందింది. శుకపికాది పక్షులన్నీ ఆమె బాధ చూచి చేతులు జోడించాయి. భవనానికి నమస్కరించి పల్లకిలో భర్త చేతిని ఉంచి, మేలుజాతి గుర్రంపై కూర్చొని లంకకు బయలుదేరింది. ముందుగా దూత వెళ్ళి సకల సమాచారం నివేదించి చిన్న కవాటాన్ని తెరిపించగా సులోచన లంకలో ప్రవేశించింది. సూర్యుడస్తమించగానే చీకటి వ్యాపించినట్లు, నగర దుర్గంపైనున్న రాక్షసులంతా ఈ వార్త విని కలవరపడ్డారు. సభలోనున్న లంకానాథుడు అకస్మాత్తుగా కోడలిని, ఆమెతీరునూ చూచి తడబడ్డాడు.



సులోచన గద్గదితయై మామగారి పాదాలకు మోకరిల్లింది. రావణుడు చెలికత్తెలతో 'అమ్మగారు ఇక్కడికెందుకు వచ్చారు?' అని అనగా, భుజసహితంగా భూర్జపత్రాన్ని మామగారి ముందుంచి, 'నా భర్త స్వర్గాన్నలంకరించాడు. వారిని కలుసుకోవడానికి నేను పోతున్నాను' అన్నది.

ఈ వార్త వినగానే రావణుడు ఒక మహావృక్షం నేలకూలిందంటూ గుండెలు బాదుకుంటూ సింహాసనంపై నుండి నేలమీద పడ్డాడు. లంకానాథుడు మట్టిని చేతితో పదిముఖాలకు రాసుకుని గొల్లుమని పెద్దపెట్టున రోదించాడు. ఆ రోదన విని మండోదరి వెంటనే అక్కడకు వచ్చి పుత్రుని మరణవార్త తెలిసి మూర్ఛిల్లింది. వేయిమంది రాజాంగనలు మహాసభాస్థలికి విచ్చేసి శోకార్ణవంలో మునిగిన మయపుత్రిని ఓదార్చసాగారు. 'నాయనా! మేఘనాథా! నా ముద్దు బిడ్డా! నన్ను అడగకుండా రణరంగానికి ఎందుకు వెళ్ళావు? ముల్లోకాల్లో గాలించినా నీవంటి ధనుర్ధారి దొరకడే? నీ శరకౌశలంతో శత్రువుల నందరినీ సంహరించి దేవతలను బందీలుగావించావు. పూర్వం నేనొక వ్రతం ఆచరిస్తూ పూర్తికాకుండా మధ్యలో ఆపివేయాల్సివచ్చింది. అందువల్లనే నీవంటి పెన్నిధిని కోల్పోయాను. నేను చేసిన పూర్వకర్మ ఇప్పుడు అడ్డుతగిలింది. పంక్తిభేదం చూపడం, సాధువులతోనాడిన దుర్భాషలు, శివకేశవులు వేరని భావించడం, హరికీర్తనా స్థలాలను భంగపరచటం, అన్నార్తులను భోజనంముందునుండి లేవదీయడం, ఇతరుల ధనానికి ఆశపడడం, గురుద్రోహం, ఇతరుల నుండి లాభం పొందటానికి వేరొకరికి హాని చెయ్యటం, గంగాదేవికి దోషం ఆపాదించడం, అరణ్యంలో జింకపిల్లను సర్వనాశనం చేయడం, భిక్షవేయకుండా యతీశ్వరులను గుమ్మం ముందునుంచే తరిమివేయడం వంటి మహాదోషాలు పూర్వజన్మలో ఏం చేశానో వాటివల్లనే ఈనాడు నా బిడ్డ ఇంద్రజిత్తు హతుడైనాడు' అంటూ మండోదరి సులోచనను హృదయానికి హత్తుకున్నది. ఇద్దరూ కలసి నేలపైబడి శోకించారు. ఆ ఘట్టం చూసి ధరిత్రి

కూడా కంపించింది. ఇంతలో సులోచన 'నేను వెళ్ళి నా పతి శిరస్సు తీసుకుని వస్తాను. నా భర్త నా కోసం ఎదురుచూచి అలసిపోయి ఉంటాడు' అన్న సులోచన మాట విని దశవదనుడు మిక్కిలి కుపితుడై దెబ్బ తగలరాని చోట తగిలింది. త్వరగా సేనను సిద్ధం చేయండి. ఈ రోజే ఆఖరి యుద్ధం. రామలక్ష్మణుల శిరస్సులు తేవడమో లేక పుత్రుడు వెళ్ళిన త్రోవలో పయనించడమో తేలిపోవాలి అన్నాడు. రావణుని కోపం చూచి మయపుత్రి కోడలి చెవిలో 'నీవు వెళ్ళి నీ భర్త శిరస్సు తీసుకుని రా. నీవు శ్రీరామచంద్రుని వద్దకు వెళ్ళి శిరస్సును అడుగు. ఆయన భక్తవత్సలుడు, పరమ ఉదారుడు, దయాసింధువు, దీనబంధువు, చరాచర జీవరాసులకు ఆయనే జీవనం. జానకి తప్ప తక్కిన స్త్రీలను తల్లితో సమంగా భావిస్తాడు. ఒకేబాణం, ఒకేమాట. దు:ఖంలోనే సుఖముందన్న దృష్టి కలవాడు శ్రీరాముడు. అందువల్ల వారిని కలిస్తే నీ జీవితం ఇహంలోను, పరంలోను సార్థకమవుతుంది. పుణ్యపరాయణులైన శ్రీరామభక్తులు సుగ్రీవుడు, జాంబవంతుడు, హనుమంతుడు, న్యాయసింధువైన విభీషణుడు సదా వారిని వెన్నంటి ఉంటారు' అని చెప్పింది. అత్తగారి మాటలు విని సులోచన ఒక నిర్ణయానికి వచ్చి త్రికూటపర్వతానికి వెళ్లటానికి మామగారి అనుమతి కోరింది. వెంటనే రావణుడు 'వాళ్ళు నిన్ను అక్కడే బందీ చేస్తే అప్పుడేం చేస్తావో చెప్పు? బుసకొట్టే పాము నోట్లో చేయి పెట్టడమెందుకు?' అన్నాడు. ఆ ప్రశ్నకు సమాధానంగా సులోచన 'పరసతులపై కోరికగల ఎవడో చండాలుడు చేసే పని అది. అటువంటి అరాచకం చేస్తే వారి వంశం దగ్ధమైపోతుంది. పతివ్రతనభిలషించి ఎవరు సుఖంగా ఉన్నారో చెప్పండి' అని అడిగింది. ఆ మాటలు విని రావణుడు అధోవదనుడై 'అలాగైతే తప్పక వెళ్ళు. అక్కడ వాళ్ళు నీకేదైనా అపకారం చేస్తే శత్రుసమూహాన్ని భస్మం చేస్తాను' అన్నాడు. శేషతనయ 'మంచిది' అని వెంటనే బృహస్పతివంటి పండితులతో



వందిమాగధులతో ఐదువందలమంది దాసీలతో గుర్రంపై బయలుదేరింది. సంసారమాయకు అతీతంగా మహాత్ములు ఆత్మస్వరూపంలో లీనమౌతారు.

ఆ విధంగా సులోచన లంక నుండి శ్రీరామచంద్రుని శరుణువేడటానికి వెళ్ళింది. అమితవేగంగా శ్రీరామ సభ వద్దకు వచ్చి పుణ్యగంగయైన సులోచన ఆ కృపాసాగరుని కలిసింది. సాధువుల గృహాలకు విశ్రాంతి కోసం శాంతం విచ్చేసినట్లు పుణ్యవతి సులోచన సీతాపతి చెంత చేరింది. ఆ సమయంలో మహావృక్షాలచే చుట్టబడిన కనకాద్రిలా, వానరులచే పరివేష్టించబడిన రాఘవుడు, కోటి మదనులైనా సాటిరాని సౌందర్యవతి సులోచన ఆగమనాన్ని గమనించాడు. వానరులంతా యంత్రాలవలె రఘురాముని చుట్టూ చేతులు జోడించుకొని తిరుగ సాగారు. వానరుల మధ్యనున్న పవిత్రమూర్తియైన రఘురాముడు పీఠంపై ప్రకాశవంతంగా విరాజిల్లాడు.

## సులోచన శ్రీరాముని దర్శించడం

గుర్రం పైనుండి కిందకు దిగి మనస్సులో శంకరుని స్మరిస్తూ విజ్ఞురాలైన సులోచన హంసగమనంతో సాగింది. ఇంతలో ఒక వానరుడు పరుగున వచ్చి ఆనందంగా 'రావణుడు భయపడి సీతాసతిని పంపించాడు' అని శ్రీరామునికి చెప్పాడు. బదులుగా కోదండపాణియైన రఘువీరుడు రావణుడు యుద్ధంలో నేలకూలేదాకా సీతాదేవి మీ కంటపడదు అని తెలిపాడు. శేషకుమారి దగ్గరకు రాగానే రఘునందనుడు విభీషణుని పరికించగా ఆయన కళ్ళనిండా నీళ్ళతో గద్గదకంఠుడై, 'జగద్వంద్యా! రాజీవ నేత్రా! ఇంద్రజిత్తు సతీమణియైన ఈమె పరమ పవిత్రురాలు. ఈమె నామం జపిస్తేనే సకల పాపాలు పటాపంచలవుతాయి. విధి బలీయమైనది. ఇంతవరకు ఎండపొడ ఎరుగని సుకుమారి ఈనాడు తన భర్త శిరస్సుకై పరుగున వచ్చింది' అని తెలిపాడు.

సులోచన శ్రీరాముని దగ్గరకు వచ్చి రఘురాముని తదేకంగా చూచి జయజయధ్వానాలతో రాఘవుని చరణాలకు మోకరిల్లింది. ఎవరి పాదధూళి

వల్ల అహల్య ఉద్ధరింపబడిందో అట్టి శ్రీరామచరణ కమలాలపై ఆదిశేషుని కుమార్తెయైన సులోచన భ్రమరంలా వాలిపోయింది. దరిద్రునికి ధనం దొరికినట్లు, పుట్టుగుడ్డికి చూపు వచ్చినట్లు, వాన కురవడం చూచి నెమలినాట్యం చేసినట్లు, వరదలో కొట్టుకొనిపోతున్నప్పుడు ప్రాణసఖుడు పట్టుకొని హృదయానికి హత్తుకున్నట్లు, యోగి తన మనస్సును నియంత్రించి సమాధిస్థితి పొందినట్లు, శ్రీరామచంద్రుని గాంచి సులోచన చిత్తచకోరం ఉల్లాసమైంది. రఘునాథ సూర్యుని ముందు సులోచన కమలమయింది. సంసారతాపంతో తపించిన సులోచన శ్రీరాముని పాదాలను దృఢంగా పట్టుకుంది. అక్కడనుండి లేవడానికి మనస్సు ఇష్టపడడం లేదు. ఈ ఆనందాన్ని మించి కళ్ళారా చూసేదేముంటుంది అనుకుంటూ సులోచన రామపాదాలపై నుండి తల ఎత్తలేదు. చంద్రుడు అమృతాన్ని వర్షించినట్లు, జగదీశుడు, దీనబంధువు, త్రినేత్రుడు ఎవరికై పరితపిస్తారో, అట్టి కృపాసింధువైన శ్రీరాముడు 'మాతా! నీవు వెంటనే పైకి లెమ్ము. ఈ సంసారంలో బాగా అలసిపోయావు. పరలోకంలో అక్షయసుఖాలతో నీవు ఆనందిస్తావు' అని అభయమిచ్చాడు.

శ్రీరాముని పలుకులు విని సులోచన పైకి లేచి చేతులు జోడించి శ్రీరాముని స్తవం చేసింది. 'శ్రీరామా! విషకంఠమిత్రా! నీకు జయము జయము. రఘూత్తమా! రాజీవనేత్రా! జలదవర్ణా! చారుగాత్రా! మిత్రకుల మకుటమణీ! జగద్వంద్యా! జగన్నాయకా! జనకజాపతీ! జగద్రక్షకా! జననమరణ భయవిమోచనా! జనకజామాతా! జగద్గురో! జామదగ్నివిజితా! జలజనయనా! జగదీశ్వరా! జలదవరా! జగద్వ్యాపకా! జన్మజరారహిత! పురాణ పురుషా! రఘునందనా! భక్తవత్సలా! జగన్మోహనా! మాయాచక్రచాలకా! నిరంజనా! నిష్కళంకా! నిర్గుణా! దుఃఖహరణా! ఆనంద అయోధ్యాపురవిహారా! వేదవంద్యా! వేదసారా! పరమ ఉదారా! రఘువీరా! అహల్యోద్ధారా! మఖపాలకా! జయజయరామా! విశ్వపాలకా! విశ్వవ్యాపకా! విశ్వకరణా! విశ్వచాలకా!



విశ్వరక్షణా! విశ్వేశ్వరా! విబుధ లలాట పట్ట లేఖనా! జగజ్జీవనా! సనకసనందన మనోరంజనా! హే రఘువీరా! దానవదళనా! భవభంజనా! భవహృదయా! మంగళరూపా! మంగళ కారకా! జయ మంగళజననీ ఉద్ధారకా! మంగళ భగినీ ప్రాణ నాయకా! మంగళసహిత మంగళధామా! కమలోద్భవ జనకా! కమలనయనా! కమలనాయకా! కమల శయనా! కమలనాభా! కమలవదనా! కమలసదనా! కమల ప్రియా! నమో భవవారణపంచాననా! నమః పాపారణ్య కుఠార తీక్ష్ణా! హేశ్రీరామా! త్రివిధ తాపశమనా! అనంత శయనా! అనంతా! ఓ చాపపాణీ! నిన్ను వర్ణించలేక ఆదిశేషుడే అవాక్కయినాడు. వేదాలే మూగవోయాయి. అటువంటప్పుడు నేను నిన్ను స్తవం చేయాలనుకోవటం చిన్నమడుగులోని నీళ్ళు గంగలో కలవాలనుకోవడం వంటిది, ఇత్తడి పుష్పాలతో కనకాద్రిని కొలవడంవంటిది, సముద్రానికి బావినీళ్ళతో అర్ఘ్యప్రదానం చేయడం, సూర్యుని జిల్లేడుపూలతో పూజించడం, మలయానిలానికి కొంగుతో గాలివీయడం, పాలసముద్రానికి మజ్జిగ సమర్పించడంలాంటిది. భూమి భారం తెలుసుకోవడం, ఆకాశానికి స్తంభాల నెత్తడం, సప్త సముద్రాల నీటిని తీతువుపిట్ట కొలవడం, జగత్తంతటికి వెలుగునిచ్చే చంద్రుడు క్షణకాలం గతితప్పడం, ఉమ్మెత్త పూలతో ఉమావరుడు దరిద్రుని పూజించటం వంటిది. నీ పాదాలు దర్శించగానే దేహత్రయ బంధనాలు విడిపోయాయి. మనస్సు ఉన్మనీ అవస్థనొంది జననమరణాల చక్రబంధం వీగిపోయింది. పెద్దపాత్రలోనైనా, చిన్నపాత్రలోనైనా సూర్యబింబం ఒకే రకంగా కన్పిస్తుంది. అలాగే స్త్రీ పురుష భేదం లేకుండా అందరిలోనూ నీవు వ్యాపించి ఉన్నావు. అందువలన ఓ కోదండపాణీ! ఈ స్త్రీ దేహం ధరించిన స్వరూపాన్ని నా పతి శిరస్సుతో సహా కలిపి అగ్నిలో వేయవలసింది' అని ఇంద్రజిత్తు భార్య వేడుకుంది.

'నీవు అయోధ్యాధీశుడవు. నేను చాతకపక్షిని. నీవు మేఘానివి. కృపాకటాక్షాన్ని వర్షించు! సూర్యుడుదయించిన చోట చక్రవాకాలుంటాయి.

ఆ విధంగా సూర్యకులప్రకాశకుడవైన నీవున్న చోట మేముంటాము. పాలునీళ్ళను హంస వేరుచేస్తుంది. అలాగే శ్రీరామా! తమాలనీలా! ఈ భవసాగరాన్నుండి నీవు మమ్ము తరింపచేస్తావు. పతి మరణవార్త విన్నంతనే పంచప్రాణాలు ఎగిరిపోయాయి. కాని నా పతి శిరస్సు కారణంగా ఓరామా! నీ పాదాలను ఆశ్రయించాను. ఓ రఘునాథా! నీవు చిత్తశోధకుడవు. అందరి మనోగతాలు తెలిసినవాడవు' అన్న సులోచన మాటలు విని జగన్నాయకుడైన రఘురాముడు స్తబ్ధుడైనాడు. ఆదిశేషుని తపస్సు ధన్యమైంది. ఆ భోగీంద్రుని గర్భాన కన్యారత్నం జన్మించింది. సులోచన తెలివితేటలు చూచి వానరులంతా గౌరవాదరాలతో తలవంచుకున్నారు. సుగ్రీవుడు శ్రీరామునితో 'ఈమెకు శిరస్సు ఇవ్వమని చెప్పవలసింది' అని ఆనతిచ్చాడు. జాంబవంతుడు 'ఈమె పుణ్యఖని' అన్నాడు. అంగదుడు 'ఈ పతివ్రత జీవితం ధన్యమైన'దన్నాడు. 'ఈమె నామం స్మరిస్తే పాపాలు సంపూర్ణంగా నశించిపోతాయి. ఈమెకు సాయుజ్యముక్తితో కూడా పతి శిరస్సునిచ్చి పంపవలసింద'ని ప్రార్థించాడు మారుతి.

ఆపైన జనకజామాత దశకంఠుని కోడలైన సులోచనతో 'మేము నీ భర్త శిరస్సును ఇక్కడకు తెచ్చామన్న వార్త నీకెలా తెలిసింది?' అని అడిగాడు. నా భర్త రాసిన జాబు అంటూ భూర్జపత్రాన్ని తెచ్చి చూపించగా కౌసల్యాసుతుడు అచ్చెరువొందాడు. వానరులంతా 'ఇది మాకు నిజమనిపించడంలేదు. నిర్జీవ హస్తం జాబు ఎలా రాయగలదు? దీన్ని మేము నమ్మాలంటే, ఇప్పుడు నీ భర్త శిరస్సుచే నవ్వించు' అని అడిగారు. ఈమె మహిమ చాలా గొప్పది. ఈమె ఏదైనా చేయగలదు, లేదని నిర్ణయించలేము అని శ్రీరాముడు పలుకగా సుగ్రీవుడు ఋషభుని చేతులమీదుగా ఇంద్రజిత్తు శిరస్సును తెప్పించాడు. ఆ తల అతి విశాలంగా నుదుట కుంకుమతో భయంకరంగా ఉంది. నాలుక నోటి బయట వేలాడుతున్నది. కుడి కన్ను మూసుకుని వుంది. జుట్టు పట్టుకుని తలను తెచ్చి ఋషభుడు ఎదురుగా పెట్టాడు. సులోచన దానిని హృదయానికి



హత్తుకుని ఆలింగనం చేసుకొంది. ఆమె వెక్కివెక్కి ఏడుస్తూ ముల్లోకాలను జయించిన ఇంద్రజిత్తు శిరస్సు నేడిక్కడ పడివుంది. కర్మగతి ఎంత విచిత్రమైనది. నేలమీద ఉత్తరీయాన్ని పరచి దానిపై శిరస్సు ఉంచింది. పతి శిరస్సుకు నమస్కరించి 'అయోధ్యానాథుడైన శ్రీరామచంద్రుడు, స్వర్గం నుండి దేవతలు అంతా చూస్తున్నారు. నన్ను నీ చేత నవ్వించమన్నారు' అని విన్నవించింది. ఇది విని శ్రీరాముడు 'నీవు ధన్యవు' అన్నాడు.

## శిరస్సు నవ్వడంలోని రహస్యం

'ఓ ప్రాణసఖా! నీవు నన్ను ఎన్నోవిధాలుగా వినోదింపజేసేవాడివి. కాని ఈరోజు ఎందుకో కోపాన్ని ధరించావు. నేను చేసిన తప్పులన్నీ కడుపులో దాచుకుని ఈ రోజు నా పతివ్రతా ధర్మాన్ని రఘుపతికి నిరూపించు. యాగాన్ని విధ్వంసం చేసారన్న కోపంతో మౌనం ధరించావా? లేక యుద్ధంలో విజయం సాధించలేకపోయానని విచారిస్తున్నావా? లేక రామదర్శనం చేత సాయుజ్యపదం ప్రాప్తించిందని జననమరణ చక్రబంధం నుండి బయటపడ్డానని మాటలు కరువయ్యాయా?' అని సులోచన ఇటువంటి భావం కలిగే ఎన్నో మాటలు చెప్పింది. నవ్వించటానికి సులోచన కొంచెం హాస్యంగా కూడా మాట్లాడింది. 'శూర్పణఖ నీ మేనత్త. మొదట్లో లక్ష్మణుడు ఆమె ముక్కుచెవులు కోసి ఎంతో ఆదరించాడు. చెల్లెలి అలంకారం చూచి మీ పినతండ్రి కుంభకర్ణుడు ఆనందించి తన ముక్కుచెవులు సుగ్రీవునికి సమర్పించాడు' అని నవ్వు వచ్చేటట్లుగా ఎన్నివిధాల ప్రయత్నించినా ఆ శిరస్సు నవ్వలేదు. ఇది చూచి సులోచన ఎంతగానో దుఃఖించింది. నేను ఇంతకు మునుపే కొంచెం నా తండ్రి సహాయం కోరివుంటే ఈ శత్రువులందరినీ అరక్షణంలో ఓడించేవాడు కదా! అన్నది. విడ్డూరమైన ఆ మాట వినగానే శిరస్సు పకపకా నవ్వింది. కమలం విచ్చుకున్నట్లు కుడికన్ను తెరుచుకుంది. వానరులంతా 'శిరస్సు ఎందుకు నవ్వింది?' అని అడిగారు. దానికి ప్రతిగా శ్రీరాముడు 'ఈమె

తండ్రి ఆదిశేషుడు. ఆయనే లక్ష్మణుడుగా అవతరించాడు. తన మామగారే తనను చంపాడని ఆ శిరస్సు పకపకా నవ్వింది' అని విపులీకరించాడు. 'ఎడమకన్ను అజ్ఞాన స్వరూపం దానికి నాలో సుగుణాలు కనబడలేదు. కుడికన్ను జ్ఞానమయమైనది. కన్ను తెరచి నన్ను చూచింది' అని వివరించాడు. వానరులంతా సులోచనను ఎంతో అభినందించారు. సులోచనాదేవి సకల స్త్రీ జాతికే పెన్నిధి. అచేతనమైన శిరస్సును నవ్వించగలిగింది. ఆమె జీవితం ధన్యం.

అప్పుడు వీరుడైన లక్ష్మణుడు మాయామోహపీడితుడై సులోచన వైపు చూచి కళ్ళనీళ్ళు నింపుకున్నాడు. రఘుపతితో 'నిజంగా నేను చాలా అన్యాయం చేశాను. నా అల్లుని చంపి కుమార్తె సులోచనను కష్టపెట్టాను' అని దు:ఖసాగరంలో మునిగిన లక్ష్మణుని చూచి రఘునందనుడు 'క్షత్రియధర్మం చాలా దారుణమైనది. దీనిని పూర్వకాలంలో దేవతలు నియమించారు. అన్నగాని, తండ్రిగాని, కొడుకుగాని బంధువులెవరైనా యుద్ధంలో ఎదురునిలిస్తే వారిని వధించినా అణుమాత్రం కూడా దోషం లేదు' అని ధర్మాన్ని ఉపదేశించాడు. లక్ష్మణుడు రామునితో 'విశ్వఫలాంకితద్రుమా! అజఅజిత పూర్ణకామా! నీవు చెప్పినదంతా నిజం. మాయాచక్రం అభేద్యమైనది. ఆత్మీయ వియోగం వల్ల ఎంతో వ్యథ కలిగింది. సీత వల్ల మీరు ఎన్నో కష్టాలనుభవించారు. వృక్షాలను పాషాణాలను ఆలింగనం చేసుకున్నారు.' ఈ మాటలు విని రఘునాథుని హృదయం ద్రవించింది. 'నేను వెంటనే ఇంద్రజిత్తును జీవింపచేసి ఉభయులను కలుపుతాను. ఇంద్రుని అమృతం తెమ్మని, ఆదిశేషుని అల్లుని బ్రతికిస్తాను' అంటే మహావీరులంతా ఈ వార్త విని తల్లడిల్లారు. లక్ష్మణుని మాట పట్టించుకోవద్దని సుగ్రీవుడు సైగచేశాడు. విమానాల్లో నుండి పరికిస్తున్న దేవతలంతా ఇది చూచి భయావహులయ్యారు. అంగదుడు చేతితో, విభీషణుడు తలతో, జాంబవంతుడు కళ్ళతో వద్దని సైగచేశారు. కాని ఆంజనేయుడు



నిర్భయంగా అందరికీ ఆనందం కలిగించే రీతిన ఈ విధంగా అన్నాడు. 'మీరు ఔదార్యంతో తోడేలును మేక అనుకుని దగ్గర తీయకూడదు. పాముతో స్నేహం చేయరాదు. పాలుపోసి పెంచినా విషవృక్షం వల్ల ఏం ప్రయోజనం? ఇంద్రజిత్తు బలంతోనే రావణుడు దేవతలను బందీ చేశాడు. వీని కాపట్యం తెలుసుకోవడం ఇంద్రుడికి కూడా సాధ్యం కాదు' అన్నాడు. సౌమిత్రి 'మారుతి చెప్పింది సత్యం. అందరికి ఏది ప్రియమో ఆ రకంగా చేయమ'ని శ్రీరామునికి విన్నవించాడు. సుగ్రీవుడు సులోచనతో 'నీ పతి శిరస్సును గైకొని త్వరగా వెళ్ళు' అన్నాడు.

### సులోచనాసతి సహగమనం

ఆ మాటకు కొంచెం నిరాశపడి సులోచన, రాముని దృష్టి తగిలితే చాలు అంతా చక్కబడుతుంది అని పతి శిరస్సును రాముని పాదాల చెంత ఉంచింది. రఘువీరునికి ప్రదక్షిణం చేసి నమస్కరించి చేతులు జోడించి 'ఆదిపురుషా! వైకుంఠనాయకా! మత్స్యరూపా! వేదోద్ధారకా! కూర్మరూపా! సృష్టిపాలకా! ఆదివరాహ స్వరూపుడవు నీవు! నీవే స్తంభం నుండి ఉద్భవించిన నరహరివి! వామనరూపుడవు! మధుకైటభారివి! ఇరువది ఒక్కసార్లు దండెత్తి భూమిపై క్షత్రియులు లేకుండా చేసింది నీవే! అటువంటి ఓ రఘునాథా! కౌసల్యాత్మజా! జనకజామాతా! తల్లితండ్రి సకలబంధువులు నీవే! నీవు జగద్వంద్యుడవు! మదన శత్రుహృదయారామా! శ్రీరామా! దీనబంధూ! సర్వోత్తమా! పూర్ణబ్రహ్మ! జగద్గురో! ఈ రోజునుండి లంకపైకి వానరులు దండెత్తకూడదు. నేను అగ్ని ప్రవేశం చేసేటప్పుడు ఎవ్వరూ విఘ్నం కలిగించకూడదు' అన్నది. అలాగేనని రఘురాముడు సులోచన తలపై చేయి ఉంచి అభయమిచ్చాడు. సులోచన పదేపదే రాఘవునికి నమస్కరించి, హృదయంలో రఘునందనుని రూపం ముద్రించుకుని జయహో రామా! అంటూ శిరస్సు గైకొని బయలుదేరింది. యుద్ధభూమికి వచ్చి భయంకరమైన

ఆ శరీరాన్ని సముద్రతీరంలో, ఏర్పాటుచేసిన విశాలమైన చితిపై ఉంచింది. ఆ సమయంలో రావణమండోదరులు పరివారంతోసహా అక్కడకు వచ్చారు. ఆ సన్నివేశాన్ని దేవతలంతా కుతూహలంగా పరికించసాగారు.

సులోచన స్నానం చేసి సౌభాగ్యప్రదాతకు కానుకలిచ్చి చితిపై భర్త శరీరాన్ని ఉంచి అగ్ని రగిలించింది. చితికి ప్రదక్షిణం చేసి ధర్మశిల పైకెక్కి నిలబడి ఆకాశాన్ని చూచింది. ఆ దుందుభుల శబ్దానికి విమానాల్లోనుండి తిలకిస్తున్న దేవతలుకూడా జడుసుకున్నారు. సకల దేవతలు అపారమైన కానుకలు స్వీకరించారు. దివ్యశరీరుడైన ఇంద్రజిత్తును విమానంలో చూడగానే పతిని చేరాలని సులోచన తహతహ లాడింది. శరీరాన్ని విడువగానే ఆత్మజ్యోతి దివ్యశరీరం పొంది పతి చెంత చేరింది.

సులోచన అగ్నిలో దూకగానే మండోదరి రావణులు అమితంగా దు:ఖించారు. సముద్రంలో స్నానంచేసి పరివారంతో సహా రావణుడు తిరిగి వెళ్ళాడు. మండోదరి ఏడుస్తూ లంకలో ప్రవేశించింది. ప్రజలు యశస్వి, ఏకపత్నీవ్రతుడైన అయోధ్యానాథుడు సులోచన జన్మను సార్థకం చేశాడని స్తుతించారు. అగ్నిపురాణంలో వ్యాసుడు చెప్పిన ఈ కథ అతిరసవంతమైనది. అందువల్ల రామవిజయాన్ని ఎంపికచేసి బ్రహ్మానందంగా పండితులు సదా ఆలకిస్తారు.

ముందు చెప్పబోయే కథ అతి మధురం. అహిరావణ మహిరావణ కథ, పాతాళానికి రామలక్ష్మణులను అపహరించుకు పోవడం, మారుతి వారిని తేవడానికి వెళ్ళడం ఉంటుంది. ప్రేమమయులైన భక్తులు ఈ కథ వింటే బ్రహ్మానందభరితులౌతారు. కథ హృదయానికి హత్తుకుంటుంది.

శ్రీధరవరదా! బ్రహ్మానందా! పురాణ పురుషా! అనాది సిద్ధా! నిర్గుణా! జగదంకురకందా! జగద్వంద్యా! అభంగా! స్వస్తి!



శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు సదా ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**ముప్పదవ అధ్యాయం మధురం**



### అధ్యాయము - 31

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

రణరంగధీరుడు, రవికులశ్రేష్ఠుడు, రాజీవనేత్రుడు, రాక్షసాంతకుడు, రమణీయగాత్రుడు, రాజేశ్వరుడు, రమాపతి, ఆత్మారాముడు, అయోధ్యానాథుడు, ఆనందరూపుడు, అక్షయుడు, అవ్యక్తుడు, నిత్యుడు, ఆదిమధ్యాంతరహితుడు, నిర్మలుడు, అనంతుడు, కర్మవిమోచన చేసి కైవల్యాన్ని ప్రసాదించే వాడు, కరుణాసముద్రుడు, కోదండపాణి, బంధాలను ఛేదించి పాపాలను నశింపచేసి భక్తులకు శుభం కలిగించేవాడు, పరాత్పరుడు, పరమానందుడు, పురాణపురుషుడు, పంకజనేత్రుడు, పరమహంస, విరించి జనకుడు, క్షీర సాగరంలో నివసించేవాడు, ఈశ్వరుని హృదయంలో సదా వసించువాడు, మనోహరుడు, మంగళధాముడు, మునిజన హృదయ మేఘశ్యాముడు, మాయాతీతుడు, మనస్సుకు విశ్రాంతి కలిగించేవాడు, మానవవేషధారి, దీనదయాళుడు, రఘువీరుడు, దశరథనందనుడు, దశముఖాంతకుడు, దుష్టులను శిక్షించేవాడు, దానవ రిపుల దారిద్ర్యాన్ని ఛేదించేవాడు, దశావతార వేషధారియైన రఘునాథా నమస్సులు! నీకు జయము!!

**అహి మహి సంహారం**

గత అధ్యాయంలో సులోచన అగ్నిలో ప్రవేశించింది. బంధుమిత్రులంతా యుద్ధంలో గతించారే, ఇప్పుడు మనకు సహాయపడేవారే లేరే అని రావణుడు చింతించాడు. ఆ సమయంలో ప్రధాని విద్యుజ్జిహ్వుడు 'పాతాళంలో ఉన్న అహిమహిరావణులు కపట విద్యలో ప్రవీణులు. వారు రామలక్ష్మణులను తీసుకుని వెళ్ళి కాళికాదేవికి బలి ఇవ్వగలరు' అని తెలియజేసాడు. ఈ వార్త విని దశకంఠుడు ఎంతో ఆనందించాడు. రావణుడు వర్తమానం పంపగా కామక్రోధాలు అహంకారాన్ని కలిసినట్టు వెంటనే వారిరువురు రావణుని కలిసారు. రావణుడు వారిని ఆలింగనం చేసుకొని దుఃఖాకులితచిత్తుడై ఇంద్రజిత్తు మరణవార్త వారికి తెలియచేశాడు. ఆ వార్త విన్నంతనే అహిమహిరావణులు 'నీకు ఇంతవరకు కలిగిన శోకం చాలు. ఈ రాత్రిలోపల రామలక్ష్మణులను తీసుకుపోతాము. మిగతావారిని జయించడానికి మీకెంతో సమయం పట్టదు కదా!' అనగా లంకేశ్వరుడు పరమానందభరితుడయ్యాడు.

విభీషణుని ప్రధానులిరువురు రహస్యంగా ఆ సంభాషణ విని వాయువేగంతో వచ్చి ఆ వార్తను విభీషణునకు నివేదించారు. విభీషణుడా వార్తను నల, నీల, జాంబవంత, మారుతులకు వినిపించగా, సేనలంతా కాపలా కాస్తుండగా హనుమంతుడు రాముని చుట్టూ తోకతో వర్తులాకారంలో ఆకాశాన్ని అంటేలా వజ్రదుర్గంలాంటి అద్భుతమైన కోటను నిర్మించాడు. చుట్టూ అక్కడక్కడ వానరులు అప్రమత్తంగా రాముని స్తుతిస్తూ కూర్చుని ఉన్నారు. కాలపురుషుడు జగత్తంతా అజ్ఞానమనే దట్టమైన కంబళిని కప్పినట్టు ఆ రాత్రి గాఢాంధకారం నలుదిక్కులా అలుముకుంది. ఆ చీకటిలో పక్షులు పలురకాల శబ్దాలు చేస్తున్నాయి. నక్కలు, ఎలుగుబంట్లు రావిచెట్టు మీద ఒకదానిపైనొకటి దొర్లుతున్నాయి. భూతాలు, యక్షిణులు అరణ్యంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నాయి. అప్సరసలు మాయాజ్వాలరూపంలో గుప్తంగా సంచరిస్తున్నారు. శ్మశానమంతా ప్రేతగణాలతో నిండి భయానక రూపంలో అపవిత్రులను బాధిస్తున్నాయి. పవిత్రులను చూచి పారిపోతున్నాయి. పక్షుల కిలకిలారావాలు, గుడ్లగూబల అరుపులతో, చక్రవాకాల రాగాలతో, తీతువుల కూతలతో ఆ వనమంతా నిండిపోయింది. కలువపూలతో కలవడానికి తుమ్మెదలు జోరుగా తిరుగుతున్నాయి. తలపై మణి ధరించిన పాములు తిరుగుతుంటే అక్కడ నిధులుంటాయని అవి అదృష్టవంతులకు దక్కుతాయని కొందరు వాటికోసం సంచరిస్తున్నారు.

ఆ రాత్రి అసురులిరువురు అక్కడికి వచ్చారు. కోట చుట్టూ వానర కిశోరాలు గర్జిస్తున్నాయి. లోపలికి పోవడానికి ఏమాత్రం దారి కనబడటంలేదు. అసురులు బలంగా వాడి శూలాలతో పొడిచి బలిష్ఠమైన ఆ దుర్గాన్ని ఛేదించాలని ప్రయత్నించారు. శూలాలు విరిగిపోయాయి గాని వజ్రంలాంటి దుర్గం చెక్కుచెదరలేదు. దిక్కుతోచక అసురులు ఆకాశంలోకి ఎగిరి దుర్గ మర్యాదల నతిక్రమించి పైనుండి రామలక్ష్మణులు నిద్రించే స్థలానికి హఠాత్తుగా దిగారు. నేలపై బంగారువర్ణం కలిగిన జింకచర్మంపై శివకేశవులవలె లీలావతారులైన రామలక్ష్మణులు నిద్రిస్తున్నారు. గాఢనిద్రలోనున్న వారిని రాక్షసులిరువురు మౌనంగా పడకతో సహా ఇరువురిని నెత్తిన పెట్టుకుని, ఏడువేల యోజనాల పొడవైన బిలమార్గాన్ని ఏడు ఘడియలలో తొలిచి, వేయి యోజనాలున్న దధి సముద్రాన్ని దాటి, లంక కంటె అపూర్వమైన మహికావతి నగరాన్ని చేరి, కామక్రోధాలు ఆత్మను ఆవరించి ఉన్నట్టు ఆ రక్కసులిరువురు రామలక్ష్మణులను ఒక భవనంలో వుంచి గట్టి రక్షణనేర్పరిచారు. మహికావతీ నగర మధ్యభాగంలోని ముఖ్యస్థలంలో మహావిశాలంగా చూడటానికి అతి భయంకరమైన భద్రకాళీ ఆలయం ఉంది. ఆ దేవాలయం గోడలు ఇరువది ఒక్క యోజనాల ఎత్తుగలిగి మహాబలిష్ఠంగా ఉన్నాయి. దధి సముద్రతీరాన దృఢమైన రక్షణ కొరకు అతిబలాఢ్యుడైన మకరధ్వజుని ఆజ్ఞాపాలనలో ఇరువది కోట్ల రాక్షసులను నియమించారు. మహికావతిలో నిద్రిస్తున్న రామలక్ష్మణులను సమ్మోహనాస్త్రంతో, దానిపై నాగపాశంతో బంధించి అహిమహిరాక్షసులు తామే కాపలాకాయసాగారు. అక్కడ సువేళాచలంలో రాత్రి ముగిసి తెల్లవారగానే వానరులందరూ రామదర్శనార్థం వచ్చి చూస్తే శయ్యాసహితంగా రామలక్ష్మణులిరువురూ కనబడలేదు. ఎదురుగానున్న భయంకరమైన బిలాన్ని చూచి సుగ్రీవాది కపివీరులందరూ తల్లడిల్లారు. ఆ రామభక్తులకు ద్వాదశ గ్రామాల పొడవుగల భయంకరమైన రాక్షసుల పాదముద్రలు స్పష్టంగా



గోచరించాయి. చరాచరసృష్టికే ఆధారభూతమైనవానిని, కమలోద్భవుడు నిత్యం అర్చించునట్టి రఘువీరుని చోరులు అపహరించారని తెలిసి సుగ్రీవుని హృదయం కుమిలిపోయింది. వానరులంతా నేలపైబడి దొర్లుతూ ఆక్రందించసాగారు. ఒకరు పెద్దగా రామా! అని హృదయవిదారకంగా అరుస్తూ అందరం రఘురాముని వద్దకు పరుగునపోదాం అంటూ విలపించసాగారు. 'జగద్వంద్యా! రాజీవనేత్రా! మమ్ముల నెందుకిలా కష్టపెట్టావయ్యా! నీవు పరాత్పరుడవు, ఆదిపురుషుడవు. మమ్ములను ఉపేక్షించి ఎక్కడకు వెళ్ళావు?' అని పెద్దపెట్టున ఆక్రందనలు చేయుచుండగా విభీషణుడు పరుగున వచ్చి 'అందరూ నిశ్చలంగా వుండండి. ఈ విషయం బయటకు పొక్కితే రావణుడు వెంటనే యుద్ధానికి తరలివస్తాడు. రాముడు లేని మన సేన ప్రాణం లేని దేహం వంటిది. ఇక ముందు ఏంచేయాలో తేలేదాకా ఈ విషయం ఎవ్వరికీ తెలియనివ్వవద్దు. నిత్యసత్యుడైన, బ్రహ్మాండతత్వమంతా నిండిన సద్గురునాథుని అన్వేషించినట్టు, మట్టిలో కలసిపోయిన ముత్యాన్ని కంసాలి జాగ్రత్తగా గాలించినట్టు, వేదాంతసారాన్ని పండితులు సాధించినట్టు, సముద్రంలో పడిపోయిన వేదాలను మత్స్యరూపంలో ముకుందుడు వెలికితీసినట్టు, సీతాహృదయారవిందుడైన రఘురాముని శోధించితేవాలి. మీరు రఘునాథుని ప్రాణమిత్రులు. భగీరథ ప్రయత్నం చేసి నిష్కళంకుడు, ప్రతాపసూర్యుడైన రఘురాముని ఉదయానికల్లా తీసుకొనిరండి. మీరు అపారమైన అదృష్టం కలవారు. క్షణంలో రఘురాముని వెదకి తీసుకొనిరాగలరు.' అనగానే వానరులంతా అంజనేయుని స్తుతించి అనేకసార్లు ఇలా అన్నారు. 'నీకు తప్ప వేరెవ్వరికీ రఘువీరుని ఉనికి తెలియదు. రాముని తిరిగి పొందేవరకు మీరే మాకు సద్గురువు. కామక్రోధాలవంటి అహిమహిలను నిర్జించి ఆత్మారాముని మాకు చూపించండి. పూర్వం మీరే సీతాన్వేషణకు వెళ్ళి ఆమె ఉనికిని రామునికి తెలియజేశారు' అని ప్రార్థించగా అంజనేయుడు 'బ్రహ్మాండంలో ఎక్కడున్నా

వెదికి క్షణంలో లక్ష్మణునితో సహా రాముని సువేలాచలానికి తీసుకుని వస్తాను' అంటూ సుగ్రీవ విభీషణాదులతో 'మీరు కపిసేనకు రక్షణగా ఉండండి. నేను అసురులను సంహరించి విజయలక్ష్మితో అయోధ్యాపతిని తీసుకువస్తాను' అని అభయమిచ్చాడు.

నల, నీల, అంగద, జాంబవంతులతో సహా మారుతి ఏడువేల యోజనాల పొడవు కలిగిన అంధకార బంధురమైన ఆ గుహలో ప్రవేశించాడు. కూడా వచ్చిన నలుగురు మార్గమధ్యంలో ఊపిరాడక మూర్ఛిల్లారు. నలుగురిని భుజాన వేసుకుని మారుతి గుహ వెలుపలికి రాగా, చల్లగాలికి ఆ నలుగురు వీరులు మూర్ఛనుండి తెప్పరిల్లారు. అక్కడ ఇరువది కోట్ల రాక్షసులతో కాపలా ఉన్న మకరధ్వజుని గాంచి ఐదుగురూ కావళ్ళను ధరించి యాత్రికుల వేషాలలో ముందుకు సాగారు. కాని అసురులు వారిని నిలదీసి ఎక్కడకు పోతున్నారని ప్రశ్నించారు. సమాధానంగా కపివీరులు మహికావతి నగరానికి కాళికా దర్శనార్థమని బదులిచ్చారు. ఆ సమాధానం విని రాక్షసులు కుపితులై, కర్రలతో దండెత్తగా హనుమంతుడు ప్రళయకాల రుద్రుడైనాడు. ఇరువది కోట్ల రాక్షసులను ఐదుగురు వానర కిశోరాలు నేలకేసి కొట్టి ప్రాణంతీసి, సముద్రంలోకి విసిరిపారేశారు.

మకరధ్వజుడు పరుగున వచ్చి మారుతితో తలపడి ముష్టియుద్ధం చేశాడు. మారుతి సప్తపాతాళాలు దద్దరిల్లేటట్లుగా గర్జించి మిక్కిలి ఆవేశంతో పిడిగుద్దులుగుద్ది మకరధ్వజుని మట్టి కరిపించాడు. మారుతి వాని గుండెలపై కూర్చొని ఇప్పుడు నిన్ను విడిపించే నాథుడెవ్వరనగా, మకరధ్వజుడు 'అంజనేయుడు నా తండ్రి. వారు ప్రస్తుతం ఇక్కడ లేరు. ఉంటే పరుగున వచ్చి నిన్ను నూరుముక్కలు చేసేవాడు' అని అనగానే మారుతి సందేహాస్పదుడయ్యాడు. మకరధ్వజుని చేయిపట్టుకుని 'ఇలా నీతో చెప్పిందెవరు? నేనే రుద్రావతారుడనైన హనుమంతుడను. నేను బ్రహ్మచారిని.



నీవు నా కుమారుడంటున్నావు. ఈ విషయం నాకు చాలా వినోదంగా ఉన్నది. నాకు నీవెలా జన్మించావో ఆ వివరం నాకు చెప్పుమన్నాడు. బదులుగా మకరధ్వజుడు 'లంకాదహనం చేసి తిరిగి వస్తున్న సమయంలో శరీరమంతా స్వేదభరితంకాగా, ఫాలభాగంలోని స్వేదబిందువును తీసి క్రిందపడవేయగా, సముద్రంలో మొసలిగా వున్న మా తల్లి మింగింది. తత్ఫలితంగా నేను జన్మించాను' అని చెప్పి హనుమంతునికి పాదాభివందనం చేశాడు. ఇంతలో మొసలి ప్రాణవల్లభుని చూడటానికి పరుగున వచ్చి 'నీవు చూడటానికి చిన్నగా వున్నావు. ఎలా లంకాదహనం చేశావో ఆ రూపాన్ని మాకు చూపి మా సందేహాన్ని నివృత్తి చేయవలసింది' అని ప్రార్థించింది. వెంటనే అంజనాసుతుడు విరాట్ రూపాన్ని ప్రదర్శించగా మొసలి మారుతి పాదాలు పట్టుకొని 'మీరు చింతిల్లవద్దు. అయోధ్యానాథుడు క్షేమంగా ఉన్నారు. అహిమహిరావణులు మోసగాళ్ళు. రామలక్ష్మణులను తీసుకొచ్చి ఉదయం కాళికాదేవి ముందు రెండోఝాముకు బలి ఇస్తారు. మీరు దేవాలయంలోనికి వెళ్ళి రహస్యంగా కూర్చుంటే అక్కడే రామలక్ష్మణులను కలుసుకొనవచ్చు' అని తెలియచేసింది. ఆ మాటలు విని ఆనందభరితుడైన వాయునందనుడు 'ఆ అసురులను చంపి నీ కొడుకును వారి స్థానంలో నియమిస్తాను' అని వరమిచ్చాడు. 'మహికావతి నగరం ఇక్కడికి పదమూడువేల యోజనాల దూరంలో వున్నది. మధ్యలో దుస్తరమైన దధిసాగరమున్నది. అందువల్ల మీరు ఐదుగురు వీరులు నౌకలాంటి నా నోటిలో ఆసీనులుకండి. నేను మిమ్ములను త్వరగా మహికావతి చేర్చి మరల తిరిగి తీసుకొస్తాను' అన్నది. నల, నీల, అంగద, జాంబవంతులు మొసలి మాటలకు భీతిల్లారు. నీటిలో మొసలి పట్టు బలమైనది, భక్షిస్తుందేమోనని సందేహించి మారుతితో 'మేము ఇక్కడ రక్షణగా వుంటాము. నీకు తప్ప వేరెవరికి ఈ సముద్రాన్ని లంఘించటం సాధ్యం కాదు' అన్నారు. వెంటనే హనుమంతుడు సావధానుడై శ్రీరామ చరణాలను స్మరించి 'శ్రీరాముడు యశస్వి'

అంటూ జయకారాలు చేస్తూ ఎగిరిపోయాడు. మనోవేగంతో మహికావతి నగరానికి ఇరవైఒక్క దుర్గాల వద్దనున్న రక్షకభటులకు కానరాకుండా సాగిపోయాడు. అణు రేణువులకంటే సూక్ష్మరూపం ధరించి అంజనేయుడు భద్రకాళి దేవాలయంలోనికి ప్రవేశించాడు. దేవాలయంలో రాక్షసులు ఎన్నో క్షుద్రపూజలు చేస్తున్నారు. మద్యము, మాంసము, బ్రాహ్మణుల శవాలు, పూజకు సిద్ధం చేయబడివున్నాయి. క్షుద్రమంత్రాలు పఠిస్తూ ఒకరితో ఇంకొకరు ఇలా చేస్తే మోక్షం ప్రాప్తిస్తుందని ప్రమాణ గ్రంథాలలో చెప్పబడివుంది అంటున్నారు. ఈ మాటలు విని రామభక్తుడైన హనుమ ఏం మోక్షప్రాప్తో! కొద్దిసేపట్లో నా చేతిలో మీకు కపాలమోక్షమున్నదనుకున్నాడు. దేవాలయంలోకి వెళ్ళి దేవిని ఎత్తి, అభిషేక జలం పోయే తూముకు అడ్డంగా పడవేశాడు. వజ్రాలతో పొదిగిన తలుపును మూసి తన సర్వాంగాలకు కుంకుమ రాసుకుని దేవి స్థానంలో భవానిలా కూర్చున్నాడు. మారుతి భయంకర రూపాన్ని చూచి లేడి ఇంట్లోకి పెద్దపులి వచ్చినట్టుగా ఉంది అని ఆ దేవి అనుకున్నది.

వెలుపల ఎంతో మంది రాక్షసులున్నారు. షడ్రసోపేతమైన ఆహారరాసులున్నాయి. పూజాసామగ్రి గైకొని అహిమహి రాక్షసులు అక్కడకు వచ్చారు. వజ్రాలు పొదిగిన ద్వారాన్ని తెరువబోగా అది తెరుచుకోలేదు. ఒకరేమో దేవికి కోపమొచ్చిందని స్తోత్రం చేయసాగారు. లోపల నుండి రుద్రరూపిణియైన మారుతి 'బలికోసం రఘునాథుని తెచ్చిన భక్తులైన మీరందరూ ధన్యులు' అని పలికాడు. 'ఇంతకు ముందు లంకలో ఎంతోమంది ప్రాణాలు నేను హరించానన్నది సత్యం. ఇప్పుడు మీ ఆహారం తిందామని నేను ఇక్కడకు వచ్చాను. నా రూపం చాలా భయంకరంగా ఉంటుంది. చూస్తే మీ కళ్ళు పోతాయి. అందువల్ల ద్వారం గుండా కాక నైవేద్యాన్ని పూజ మొదలుపెట్టక ముందే గోపురం పైన బొరియచేసి అందులో నుండి సమర్పించండి' అని దేవి ఆనతీయగా అహిమహిరాక్షసులిరువురు ముల్లోకాల్లో గూడా తమ వంటి భక్తశిరోమణులు లేరని ఆనందించారు.



దేవాలయ గోపుర భాగం విశాలమైనది. అక్కడ వెంటనే ఒక కన్నం చేసి పంచామృతాన్ని అందులోనుండి అభిషేకంగా దేవిపై పోసారు. హనుమంతుడు నోరు తెరిచి గడగడా పంచామృతాన్ని సేవించాడు. దాని వెనుక మంచినీటిని పోయగా నోటిని ప్రక్షాళనం చేసుకున్నాడు. ధూపదీప సువాసనాలన్నీ దేవిని ఆస్వాదించమన్నాడు. భక్తులతో నైవేద్యాలన్నింటిని వెంటనే సమర్పించమన్నాడు. విశాలమైన పాత్రలనిండా అన్నాన్ని ధారగా కుమ్మరించారు. జయజయధ్వానాలతో దేవిని కీర్తిస్తూ అసురులంతా నర్తించసాగారు. అరణ్యంలో దావాగ్ని నానారకాల కట్టెలను భస్మం చేసినట్టు, రెండుచేతులతో రుద్రరూపిణియైన హనుమ ఆ అన్నరాసులను స్వాహా చేయసాగాడు. దోనెలతో పంచభక్ష్య పరమాన్నాలను, చిత్రాన్నాలను, పచ్చళ్ళను, ఊరగాయలను అసంఖ్యాకంగా సమర్పించారు. పెరుగు, పాలు, నెయ్యి, వెన్న వర్షాకాలంలో సముద్రాన్ని చేరే నదుల్లా వరదలై ప్రవహించాయి. పూజారి ఇనుపకడ్డీ తీసుకుని ప్రసాదాల కొరకు తూములో చాలాసార్లు పొడిచాడు. తూముకు అడ్డంగా కూర్చున్న దేవి యినుపకడ్డీ పోట్లకు తాళలేకపోయింది. నాకు ఎలాంటి కష్టకాలం దాపురించింది అని తల్లడిల్లింది. హనుమ నైవేద్యం స్వీకరిస్తుండగా రామలక్ష్మణులను తీసుకొచ్చారు. తూములో ఎంత పొడచినా అభిషేకతీర్థంగాని, నైవేద్యంగాని బయటకు రాలేదు. ఏం అనర్థం సంభవించనుందోనని కొందరు, రఘునాథుని దొంగతనంగా తెచ్చినందున దేవి కోపగించి ఏ రకమైన అనర్థాన్ని కలుగచేస్తుందోనని వృద్ధులు తికమకపడసాగారు. రావణుడు అతి సౌందర్యవతియైన సీతనపహరిస్తే అకస్మాత్తుగా ఒక వానరుడు వచ్చి లంకానగరాన్ని దహనం చేసి ఎంతోమందిని హతమార్చాడు. అలాగే ఇక్కడ కూడా ఏదో జరుగుతుందని గ్రహించిన బుద్ధిశాలురు త్వరత్వరగా తమ నివాసాలకు వెళ్ళిపోయారు.

అక్కడ అన్నరాసులన్నీ అయిపోయినా దేవికి తృప్తి కలుగలేదు. 'చాలు' అన్నమాటే రాలేదు. పవిత్ర జలాలతో తాంబూలాన్ని సమర్పించారు. అప్పుడు రుద్రరూపిణి పెద్దగా కేకవేసి 'నేను ఈరోజు చాలా సంతృప్తి చెందాను. మీకందరికీ అక్షయపదాన్ని ఇస్తాను. మిమ్ములను లంకాపతితో సమానంగా చేస్తాను. ఇప్పుడు నేను చాలా ప్రసన్నంగా ఉన్నాను' అనగా, దేవి వాక్కు విని బుద్ధిశాలురు ఇళ్ళకు వెళ్ళారు. తదుపరి దేవి 'రామలక్ష్మణులను వెంటనే తీసుకురండి. వారిని దేవాలయం లోపలికి పంపి పిదప ఏం జరుగుతుందో గమనించండి. అనంతుడు, వేదశాస్త్రాలకే అగోచరుడు, సచ్చిదానందుడు అయిన రఘువీరుని నేను మింగేస్తాను' అన్నది. దేవి మాటలకు అహిమహిరాక్షసులిరువురు ఎంతో ఆనందించి, రామలక్ష్మణులను తేవడానికి ఇరవైమంది రాక్షసులను పంపారు. రవికులానికి పెన్నిధులైన వారిరువురిని నాగపాశబంధం నుండి విముక్తి చేసి రథానికి గట్టిగా కట్టారు. సమ్మోహనాస్త్రం ఉపసంహరించగానే రామలక్ష్మణులు అప్రమత్తులయ్యారు. రాజీవాక్షుడు కళ్ళు తెరువగానే రాక్షసులంతా చుట్టూ గుమిగూడారు. రాముడు సౌమిత్రితో శత్రువులు మన ధనుర్బాణాలు హరించి మనలను రథానికి కట్టారు. ఈ విషయం తెలిస్తే చిద్రత్నమైన జానకి దుఃఖసాగరంలో మునిగిపోతుంది. భరతుడు ప్రాణత్యాగం చేస్తాడు. విన్నంతనే కౌసల్యాసుమిత్రలు మరణిస్తారు. వసిష్ఠాదిమహామునులు దుఃఖసాగరంలో మునిగిపోతారు. నా ప్రాణ స్నేహితులైన విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, నల, నీల, అంగద, జాంబవంతులందరూ ప్రాణాలు విడుస్తారు. బందీలుగా వున్న దేవతలందరి ధైర్యదుర్గం బీటలు వారుతుంది.ఆకలిగా వున్నవాడిని అన్నపాత్ర ముందు నుండి లేపినట్లవుతుంది దేవతల పరిస్థితి. లక్ష్మణా! ఇప్పుడు మనం ధైర్యంగా వుండాలి. హనుమ కూడా ఏదో సంకట పరిస్థితిలోనున్నాడు. లేకపోతే క్షణంలో ఈ విఘ్నం తొలగిపోయివుండేది. మన హనుమంతుడు సాక్షాత్తు రుద్రుని



అవతారము. త్వరగా వచ్చి ఈ రాక్షసులను సంహరిస్తాడు. అని శ్రీరాముడు లక్ష్మణునికి ధైర్యం చెప్పాడు. శ్రోతలు తెలుసుకోవలసినదేమిటంటే రామలక్ష్మణులూ శ్రీమన్నారాయణుడు ఆదిశేషుని అవతారాలే!

రామలక్ష్మణులను నిరాయుధులగావించి గట్టిగా కట్టి ఎర్రని పుష్పమాలలను వారి మెడలో వేశారు. కుంకుమపొడి చల్లుతూ వాద్యాల హెూరులో ఆయుధాలు చేబట్టి అసురులు భీకరంగా నర్తించసాగారు. ఆ విధంగా ఊరేగింపు బయలుదేరగా నగరవాసులంతా రఘురాముని చూడటానికి వచ్చారు. ఆ ఇరువురు రాకుమారులను కనులారా దర్శించుటకు కొందరు ఎత్తైన భవనాలనధిరోహించారు. ప్రజలు రామలక్ష్మణులను చూచి ఉద్రేకాన్ని ఆపుకోలేక కన్నీటి పర్యంతమైనారు. హాహాకారాలు మిన్నంటాయి. ఆడ, మగ చరాచర జీవులన్నీ రఘునాథుని చూచి శోకించాయి. దేవాలయానికి మూడు ప్రదక్షిణలు గావించి దేవి గర్భాలయ ద్వారం తెరచి రామలక్ష్మణులను లోనికి ప్రవేశపెట్టారు. తలుపు మూసివేసి రాక్షసులంతా మద్యాన్ని సేవించి ఉన్మత్తులై చేతిలో దివిటీలు పట్టుకుని నాట్యం చేస్తూ ఒళ్ళు తెలియని స్థితిలోనున్నారు.

రామలక్ష్మణులు గర్భాలయంలోని దేవిని పరికించగా, యమునివలె భయంకరంగా కేక పెట్టింది. మీ ఇద్దరిని నేను మింగేస్తాను. త్వరగా మీ కులదైవాన్ని స్మరించుకోండి. మీ ప్రాణమిత్రుడెవరినైనా మరణించే ముందు స్మరించుకోండి అన్న దేవి మాటలకు జనకజామాత ఏమన్నాడో వినండి.

భక్తులకు ఏదన్నా ఆపద వస్తే నన్ను స్మరిస్తారు. ఈరోజు రఘునాథుడైన నేను ఈ సంకటస్థితిలో ఎవరిని స్మరించేది. కాని నా ప్రాణానికి ప్రాణమైన ప్రియాతి ప్రియమైన స్నేహితుడు వాయునందనుడే ఇక్కడున్నట్లయితే మాకీ ఆపద ఎన్నటికీ కలిగివుండేది కాదు. పుత్రునిలా ప్రీతితో ఎన్నో సేవలు చేసేవాడు. తల్లీ! నీవు కూడా మారుతిలాగా మాతో ఎందుకు స్నేహం చేయరాదు?

అన్నాడు. ఆ మాటలకు మారుతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. శ్రీరాముని పాదాలపై బడి మారుతి వెక్కివెక్కి ఏడ్వసాగాడు. ఆ కన్నీటితో శ్రీరాముని పాదాలు కడిగి తన నిజరూపాన్ని బయటపెట్టాడు. హనుమంతుని చూచి రఘురాముడు ప్రేమగా లేవనెత్తి హృదయానికి హతుకున్నాడు. ఆ సన్నివేశాన్ని ఎలా శ్రోతలకు వివరించాలా అని తర్కించి ఏ ఉపమానం సరిపోక కవి మౌనం వహించాడు. మారుతి లాగా వెన్నంటి రక్షణ వుండే భక్తుడు లభించడం అసంభవం. రఘువీరుడు మారుతితో 'నేను ఎన్ని అవతారాలు ఎత్తినా నీవు చేసిన ఉపకారాన్ని ఎన్నటికీ మరచిపోలేను. నీ ఉపకారాలకు అంతంలేదు. ఎన్నని నేను జ్ఞాపకముంచుకొనేది' అని అభినందించాడు. తదుపరి మారుతి లక్ష్మణుని కలిసాడు. శ్రీరాముడు హనుమంతునితో 'ఇప్పుడు శత్రువులను ఎలా వధించాలి?' అని ప్రశ్నించాడు. బదులుగా అంజనేయుడు 'మీరు ఏమాత్రం దాన్ని గూర్చి చింతించనవసరం లేదు. మీరు వెనుక దాగివుంటే, నేనుఒక్కొక్క రాక్షసుని లోపలకు రావించి వాని శిరస్సును ఖండించి యిక్కడే భస్మం చేస్తాను' అని సమాధానం చెప్పగా రాముడు 'నా ధనుర్బాణాలు తెచ్చినట్లయితే నేను క్షణంలో ఆ రాక్షసులను సంహరిస్తానన్నాడు. అంజనేయుడు నేను లోపల అహిరావణుని మర్దిస్తాను. మీరు బయట మహిరావణుని అంతం చేయండి అని పలికి మారుతి గుప్త రూపంలో వెళ్ళి విల్లంబులు తెచ్చిచ్చి, రామలక్ష్మణులను వెనుక దాచి, తాను దేవిలాగ కూర్చుని 'అహిరావణా! నీవు మొదట నా దర్శనం చేసుకో' అని ఆజ్ఞాపించాడు. ఆ మాటలు విని సింహం వద్దకు ఏనుగులా, పులివద్దకు లేడిలా, పాము బొరియలోకి ఎలుకలా, చావుకోరి కీటకం మూర్ఖంగా దీపాన్ని కౌగిలించుకున్నట్లు అహిరావణుడు లోనికి ప్రవేశించాడు.

భయంకరమైన దేవి రూపాన్ని చూచి వణికిపోతూ అహిరావణుడు దేవి పాదాల చెంత మోకరిల్లగానే మహారుద్రుడైన ఆంజనేయుడు రక్కసుని చేతులతో



కాళ్ళతో కొట్టి, తలను తన పాదంతో తొక్కి నూరుముక్కలు గావించాడు. భయంకరమైన వాని కేకలు విని బుద్ధిమంతులు లేచి వెళ్ళిపోయారు. అహిరావణుడు లోనికి వెళ్ళి ఇప్పటికి నాలుగు ఘడియలయ్యింది, సోదరుడు బయటకు రాలేదేమిటా! నని మహిరావణుడు సంకోచిస్తుండగా ఏమి జరిగిందో తెలుసుకుందామని పూజారి దేవాలయంలోకి వెళ్ళగా, వెనుకనే తోటి పూజారి మెల్లగా లోపలున్న ప్రసాదాలను తీసుకుపోదామని ఆశగా లోనికి ప్రవేశించాడు. యమధర్మరాజు పిలిచినట్టు పూజారి ముందు దేవికి పాదాభివందనం చేయగానే కాళ్ళతో నల్లిని నలిపినట్టు నలిచేశాడు హనుమంతుడు. ఈ వైపరీత్యాన్ని చూచి రెండవవాడు భయంతో వణుకుతూ 'ఆయన లంకను కాల్చిన హనుమంతుడే'నని కేకలు వేస్తూ వెనక్కు తిరిగి ద్వారానికి అడ్డంగా పడి రెండు చేతులతో నోరు కొట్టుకుంటూ ఆక్రోశంతో, 'లంకను ద హనం చేసిన ఆ యముడే దేవిని తూముకు అడ్డం వేసి దేవళంలో కూర్చొని నైవేద్యాలన్నీ తానే ఆరగించాడు. పూజారితో సహా అహిరావణుని యమపురికి పంపాడు అని అరిచాడు. రాక్షసులు హనుమంతుని పేరు వినగానే హాహాకారాలు చేస్తూ నలుదిక్కులకు పారిపోసాగారు. దిక్కు తెలియకుండా పారిపోతున్న వారిని ఒక్కొక్కరిని పట్టుకొని హనుమ మృత్యులోకానికి పంపాడు. ఇంతలో మహిరావణుడు కవచము, శస్త్రాలు ధరించి అపారమైన సేనావాహినితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. 'ఒరే మర్కటమా! నీవు బయటకురా! మహాబలశాలీ నీవు ఎక్కడకు వచ్చావో తెలుసా! ఈ రోజు రామునితో సహా నిన్ను కూడా మృత్యుపురికి పంపిస్తాను' అని బీరాలు పలికాడు. ఇంతలో హనుమ చూపరులకు ఆశ్చర్యం కలిగించేలా రామలక్ష్మణులను భుజాల పైకెక్కించుకొనగా ఒకే వాహనంపైనెక్కిన శివకేశవుల వలె, ఒకే రథమధిరోహించిన సూర్యచంద్రులవలె, బ్రహ్మేంద్రులవలె వారు గోచరించారు. రామలక్ష్మణులు మారుతి భుజాలపై అధిరోహించగానే, ఒక్క తోపుతో తలుపును

విరగగొట్టి వాయునందనుడు బయటకు వచ్చాడు. పిల్లవాడు బంతిని విసిరివేసినట్లుగా తోకతో దేవాలయాన్నంతా చుట్టి ఆకాశానికి విసిరివేశాడు. దేవాలయంతో పాటు దేవికూడా సముద్రజలాలలో లీనమయింది. మిగతా రాక్షసులందరినీ కట్టకట్టి సముద్రంలో పారవేశాడు.

హనుమభుజస్కంధాలనుండి రామలక్ష్మణులు నేలపై దిగారు. శ్రీరాముడు ఒకచోట స్థిరంగా నిలచి విల్లు సారించి బాణాన్ని ఎక్కుపెట్టి మహిరావణునితో 'ఓరీ! కపటీ! నా బాణాన్ని కాచుకో! నీ కోసం అహిరావణుడు ఎదురు చూస్తున్నాడు. నిన్నూ అక్కడకే పంపిస్తాను' అన్నాడు. మహిరావణుడు ధనుస్సు సారించి రామునిపై బాణం వేయగా రాముడు దానిని తృటిలో ముక్కలు చేశాడు. నరవీరుడైన రఘునందనుడు నూరుబాణాలు వేయగా అవి మహిరావణుని నుదుటిపై వరుసగా గుచ్చుకున్నాయి. కాని అక్కడ ఒక అద్భుతం జరిగింది. నేలపైబడ్డ ఒక్కొక్క రక్తపుబొట్టు నుండి ఒక్కో మహిరావణుడు ఉద్భవించాడు. రాముడు వేసే ఒక్కోబాణానికి లక్షలు, కోట్లు మహిరావణులుద్భవించసాగారు. ఆ రాక్షసుడు వేసే బాణాల నుండి రామచంద్రుడు తప్పుకుంటూ, ఈ వింత ఏమిటి అని రఘువీరుడు నలుదిశలా పరికించ సాగాడు. ఒక్కరైతే క్షణంలో శస్త్రాలతో వధించవచ్చుకాని ఇప్పుడేం చేయాలో తోచడం లేదు అనుకున్నాడు రఘువీరుడు. ప్రాణాలర్పించగల భక్తుడు, వజ్రదేహి అయిన హనుమంతుడు కూడా ఈ విపరీతాన్ని చూచి చింతాక్రాంతుడయ్యాడు. వెంటనే అంజనేయుడు మొసలి వద్దకు వెళ్ళి మహిరావణుని వృత్తాంతం సమూలంగా వివరించమని అడిగాడు.

దేవాంగన రంభ ఇంద్రభవనానికి వెళ్ళేటప్పుడు భృగుమహర్షికి నమస్కరించకపోగా కురూపి, వృద్ధ బ్రాహ్మణుడని వెటకారం చేసింది. తపోధనుడైన ఆ మహర్షి 'నీవు సర్పానివై సదా ఘోరారణ్యాలలో సంచరిస్తావు' అని దారుణమైన శాపమిచ్చాడు. రంభ పరుగున వచ్చి మహర్షిపాదాలపైబడి



శాపవిముక్తిని ప్రసాదించమని వేడుకుంది. నీవు ఒకసారి సర్పంగా ఇంకో క్షణంలో పద్మినిగా కనబడతావు. సూర్యుని రేతస్సు నీపైబడ్డప్పుడు నీకు శాపవిముక్తి కలిగి స్వస్థానం చేరుతావు అని అనుగ్రహించాడు. ఆమె అహి రూపంలో తిరుగుతూ పద్మిని అయిన క్షణంలో సూర్యరేతస్సు ఆమెపై వర్షించింది. అహిముఖంలో పడ్డ వీర్యం వల్ల అహిరావణుడు, మహిపై బడ్డ వీర్యం వల్ల మహిరావణుడు ఉద్భవించారు. దాంతో రంభ ఉద్ధరించబడి వెళ్ళిపోయింది. కాని రక్త బిందువులు మహిరావణునిగా మారడం గూర్చి చంద్రసేననడగవలసింది అని మొసలి అహిమహిరావణుల జన్మ వృత్తాంతం వివరించింది. అహిరావణుని పత్నియైన చంద్రసేన సత్యసంధురాలని విని హనుమ ఆమెను కలుసుకొనుటకు ఎగిరిపోయాడు. మహికావతికి వచ్చి రాజసదనంలో ప్రవేశించాడు. అక్కడ చంద్రసేన రామధ్యానంలో ఉన్నది. రఘువీరుని చూచి ఆమెకు మోహజ్వరం వచ్చింది. జన్మజన్మలకు శ్రీరాముడే నా భర్త కావాలి అనే కోరికతో ఆమె దేహధ్యాస వదలి సదా శ్రీరాముని ధ్యానిస్తున్నది. హనుమంతుడు ఆమె వద్దకు వచ్చి చప్పట్లు కొట్టాడు. కళ్ళు తెరచి చూడగా ఆమెకు రామదూత కన్పించాడు. హనుమంతుడు ఆమెకు నమస్కరించి జరిగినదంతా నివేదించాడు. పురాణపురుషుడైన రఘునందనుడు సంకటస్థితిలో నున్నాడు అని తెలుపగా ఆమె కావలసిన సమాచారమంతా నేను చెప్తాను కాని నీవు నా మనోరథాన్ని నెరవేర్చాలి అని కోరింది. హనుమ అలాగేనన్నాడు. కాని ఆమె ప్రమాణం చేయమని నిర్బంధించగా ముందు జరగవలసిన కార్యాన్ని ఆలోచించి హనుమ 'ఒక్కసారి నీతో రఘునందనుడు సంభోగిస్తాడు' అని ప్రమాణం చేశాడు. 'రామునికి విజయం ప్రాప్తించటానికి జరిగినదంతా చెప్తాను సావధానంగా విను. మహిరావణుడు ఘోరతపస్సు చేసి శివుని సంతృప్తి పరచి నేను పోరాడేటప్పుడు యుద్ధసమయంలో అమృతం వర్షించాలి, ఆ అమృతం నా రక్తంతో కలిసి మహిరావణుడుద్భవించాలి అని

వరమడిగాడు. అందుచేత శివుని కంఠంలోని భ్రమరాలు హుటాహుటిన పాతాళానికి వెళ్ళి అమృతాన్ని గ్రోలి రక్తంపైన వర్షిస్తాయి. ఒకసారి రక్తం అమృతంతో కలియగానే అక్కడ మహిరావణుడుద్భవిస్తాడు' అని చెప్పింది.

ఈ మాటలు వినగానే హనుమ నేరుగా అమృతభాండాన్ని వెతకటానికి పాతాళం వెళ్ళాడు. అమృతకుండం వున్న ప్రదేశం లోకపాలకులచే రక్షించబడి దుర్భేద్యమైనది. వారిని నిర్జించి అమృతకుండం చేరాడు. అక్కడ నుండి అసంఖ్యాకంగా తుమ్మెదలు నోటినిండా అమృతాన్ని గైకొని వెళుతున్నాయి. పర్వతాల్లాంటి శరీరాలు గల ఆ భ్రమరాలను హనుమ మట్టుబెట్టాడు. ఇంతలో మేరుపర్వతం వంటి ఆకారం గల భ్రమరనాయకుడు కోపంతో హనుమ పైకి లంఘించాడు. ఒక్క ముష్టిఘాతానికే రెక్కలు విరిగి కింద పడ్డాడు. కిందపడగానే ఆ భ్రమరం దీనవదనుడై మారుతి చెంతకు వచ్చి 'నాకు ప్రాణభిక్ష పెట్టు, నేను నీకు అవసరం వచ్చినప్పుడు సాయపడతాను' అని ప్రమాణం చేయగా హనుమ ఆ భ్రమరరాజాన్ని విడిచిపెట్టాడు. వెంటనే అక్కడ నుండి రాఘవేంద్రుని వద్దకు వచ్చి బ్రహ్మాస్త్రంతో శత్రువును వధించమని సూచించాడు. వాయునందనుడు మాట్లాడుతున్నంతలో రాఘవుడు బ్రహ్మాస్త్రం సంధించి వదలగా మహిరావణులందరు నశించారు. ఆ విధంగా బ్రహ్మప్రాప్తి నొంది సంసారతాపాలన్నీ పటాపంచలైపోగా మహిరావణుడు ఆకాశానికెగిరి తారలలో కలిసిపోయాడు. బ్రహ్మాస్త్రంతో మహిరావణుడు సమూలంగా భస్మం కాగానే దేవతలంతా జయజయధ్వానాలు చేశారు. నాయకుడి అస్తమయం చూచి రాక్షసులంతా పారిపోసాగారు. హనుమ తోకతో సేననంతా చుట్టి లోహపు గుండుతో సైన్యాన్ని చావమోదాడు. కొందరు రాక్షసులు ఆకాశానికి ఎగిరి పారిపోయారు. కాని హనుమ తోకతో వారినందరిని బంధించి సముద్రంలో ముంచాడు. ఎవరు ఏ దిక్కుకు వెళితే తోక ఆ వైపు వెళ్ళేది. ఆ విధంగా తోకరూపంలో హనుమ బ్రహ్మాండమంతా వ్యాపించాడు. మారుతే ఈశ్వరుడు.



ఆయన తోకకు అంతులేదు. బ్రహ్మాండం లోపల వెలుపల గూడా తోక విహరించింది. దశదిశలు చుట్టి రాక్షసులను పట్టి తెచ్చింది, మహికావతిలో ఇంటింటిని శోధించి పురుషులనందరిని వెతకి తెచ్చి లోహపు గుండుతో చూర్ణంచేశాడు. భర్తలను ఇంట్లో దాచి స్త్రీలు దారికడ్డం నిలబడ్డారు. కాని తోక వదలక రహస్యస్థలాలలో వున్నా కూడా రాక్షసులను పట్టి తెచ్చింది. హాహాకారాలు మిన్నుముట్టాయి. గూఢచారులు ఈ వార్తను చంద్రసేనకు నివేదించారు. 'మమ్ములను చంపితే జానకి మీద ఒట్టేనని మారుతికి చెబితే మీకు ఈ ఆపద తప్పుతుంది' అని చంద్రసేన సలహా చెప్పగా ఆ ఉపాయంవల్ల జనులంతా రక్షించబడ్డారు.

దేవతలంతా జయజయధ్వానాలు చేసి రామలక్ష్మణ, వాయుకుమారులపై పుష్పవృష్టి కురిపించారు. మహిరావణుని మరణకారణం ఎలా తెలిసిందని సౌమిత్రిని ప్రశ్నించాడు రాముడు. హనుమంతుని వద్దకు వెళ్ళి శత్రుక్షయం కావడానికి ఏమేమి చేసాడో అడగవలసిందన్నాడు. శ్రీరాముడు ప్రేమతో మారుతిని గట్టిగా ఆలింగనం చేసుకుని విచారవదనంతోనున్న మారుతిని చూచి ప్రాణసఖా! నీవు తలవంచుకునిఉన్నావేమి? ఏం జరిగిందో నాకు చెప్పమని హనుమంతుని ముఖాన్ని ప్రేమగా నిమిరాడు శ్రీరాముడు. హనుమంతుడు అమూలాగ్రం జరిగినదంతా వివరించాడు. చంద్రసేనకు మిమ్ములను తన వద్దకు తీసుకొస్తానని గట్టిగా ప్రమాణం చేసి వచ్చానన్నాడు. ఆ మాట విని రామచంద్రుడు పకపకా నవ్వి 'హనుమా! నీవు అపారమైన తెలివిగలవాడివే. నేను ఏకపత్నీవ్రతుడనని ఎలా విస్మరించావు. నీ ప్రమాణాన్ని నేను త్రోసిపుచ్చలేను. నేనా దుర్వ్యసనానికి పాల్పడలేను. నీవు మహామేధావివి. ఏదో ఉపాయమాలోచించ'మని కోరాడు.

మారుతి వెంటనే చంద్రసేన ఇంటికి వెళ్ళి శ్రీరాముని తీసుకొస్తాను గట్టి మంచం వుందికదా అని అడిగాడు. చంద్రసేన నవ్వి గట్టి మంచం

వేయించి పూలతో అలంకరించి పలురకాల విలాస వస్తువుల నుంచింది. హనుమంతుడు చంద్రసేనతో 'మంచం విరిగినట్టయితే శ్రీరాముడిక్కడ ఒక్క క్షణం ఉండడు. తర్వాత నాకేం బాధ్యత లేదు' అని స్పష్టం చేశాడు. చంద్రసేన మంచం ఎన్నటికీ విరగదని బదులు పలికింది. వెంటనే హనుమంతుడు తాను ప్రాణదానం చేసిన భ్రమరాన్ని రావించి ఎవరికీ తెలియకుండా అరిటాకులా మంచాన్ని పూర్తిగా లోలోపల తొలిచివేయవలసిందని ఆజ్ఞాపించాడు. అలాగేనని ఆజ్ఞ గైకొని ఆ భ్రమరం పని పూర్తిచేసింది.

హనుమంతుడు శ్రీరాముని చంద్రసేన ఇంటికి తీసుకొచ్చాడు. రఘువీరుడు మంచంపై కూర్చోగానే మంచం పొడిపొడయ్యింది. వెంటనే రఘువీరుడు బయలుదేరాడు. చంద్రసేన దీనంగా మారుతి వంక చూసి 'ఓ వానరా! నీవు కపటివి. నీవే ఈ మంచాన్ని ఆ విధంగా తొలిపించావు. రఘురాముడు నా వద్దకు వచ్చినా కూడా నా మనోరథమీడేరలేదు. నేను నిన్ను శపిస్తున్నానంది. ఆ మాట విని రఘునాథునికి దయ కలిగి ఆమె తలపై చేతినుంచి 'నీవు దిగులు పడవద్దు. అందమైన ఈ ధ్యానమూర్తిని నీ హృదయంలో నిరంతరం భోగించు. నేను రాబోయే కాలంలో శ్రీకృష్ణుడనై అవతరించినప్పుడు నీవు సత్యభామవవుతావు' అని అభయమిచ్చాడు.

రఘురాముని మాటలు విని ఆమె సమాధిస్థితి నొందింది. తదుపరి మహికావతి నగరానికి మకరధ్వజుని రాజుగా నియమించాడు శ్రీరామచంద్రుడు. రామలక్ష్మణులను భుజాలపై ఎక్కించుకొని హనుమంతుడు ఎగిరి నల, నీల, అంగద, జాంబవంతులతో కలసి సూర్యుడుదయించే సరికల్లా త్రికూటపర్వతాన్ని చేరాడు. ససైన్యంగా విభీషణుడు, సుగ్రీవుడు పరుగున ఎదురొచ్చారు. ప్రేమగా సుగ్రీవుడు, విభీషణుడు హనుమంతుని చూచి ఔరా! ఈ దేహాన్ని దిగదుడ్చి నీకు సమర్పించాలన్నారు. ఆశ్చర్యంగా మారుతివంక చూచి ముల్లోకాల్లో కూడా నీ కీర్తి వ్యాపించింది. నీ జన్మ ధన్యమని



కొనియాడారు. జయజయధ్వానాలు మిన్నంటాయి. అందరినీ రావించి ఈ బ్రహ్మాండంలోనే మారుతివంటి భక్తుడు లేడు. ఆయన ప్రతాపం వలన వానరులంతా ధన్యులయినారని రఘువీరుడు హనుమంతుని ప్రతాపాన్ని తానే స్వయంగా కొనియాడాడు.

అగ్నిపురాణంలో ఈ కథను బహుసుందరంగా వ్యాసుడు వర్ణించాడు. దాని సారాంశం బ్రహ్మానంద వరదుడైన శ్రీధరుడు వివరించాడు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా చతురులైన పండితులు ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది ఒకటవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 32

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**భ**క్తవల్లభుడు, త్రిభువనేశ్వరుడు, రణరంగధీరుడైన రఘుపతి సువేలాచలంపై నిర్మలాకాశంలో పూర్ణచంద్రునిలా శోభిల్లాడు. వానరుల జయజయధ్వానాలు విని, రఘువీరుడు అహిమహిరావణుల సంహరించి త్రికూటపర్వతం చేరాడన్న వార్త తెలిసి, రావణుడు పరమచింతాక్రాంతుడైనాడు. మనస్సులో ఇంద్రజిత్తుని తలచుకుని ఎంతో క్షోభిల్లాడు. జీవచ్ఛవంలా బ్రతికి ప్రయోజనమేముందనుకున్నాడు. దీపంలేని గృహంలా, ముక్కులేని ముఖంలా, కంటిపాపలు లేని కళ్ళలా, ఇంద్రజిత్తులేని లంక కళావిహీనమైంది అంటూ లంకాధిపతి దు:ఖంతో కంపించి, దానికి కారణమైన రామలక్ష్మణులపై కోపోద్రేకంతో ఊగిపోయాడు. లంకలోనున్న సైన్యాన్నంతా సిద్ధం చేయమని ఆనతిచ్చాడు. ఆజ్ఞాపించగానే యుద్ధభేరులు పెద్దఎత్తున మ్రోగాయి. వెంటనే మిగిలిన ప్రధానులంతా తారలు చంద్రుని పరివేష్టించినట్టు రావణుని చెంత చేరారు. చతురంగదళాలతో రావణుడు లంకనుండి బయలుదేరాడు. అసంఖ్యాకంగా వుండే కాల్బలము, అశ్వదళాలు, రథాలు ఎన్నని లెక్కించగలము. పర్వతసమానమైన గజబలాలు కోటానుకోట్లు బయలుదేరాయి. రావణుని ముఖ్యరథ కాంతిముందు వేయిసూర్యుల కాంతికూడా సరిపోలదు. దానిపై శస్త్రాస్త్రాలు ధరించి రావణుడు ఆసీనుడైనాడు. రావణుడు యుద్ధానికి రావడం చూచి వానరులు కోపంతో చెట్లు, రాళ్ళు చేబూని కేకలు వేస్తూ పరుగున వచ్చారు. రావణుడు వింటికి బాణాన్ని సంధించి గురి చూస్తుండగా వానరులు శత్రుసైన్యంపై పర్వతవర్షం కురిపించారు. రావణుడు అసంఖ్యాకంగా వదిలిన బాణాలు త్రుటిలో పర్వతాలను ఛేదించి పిండిచేసి సైన్యానికి ఆవల పడవేసాయి. మెరుపు కంటే తీక్ష్ణమైన బాణాలను అసంఖ్యాకంగా



రావణుడు వదలగా ఆ ధాటికి తట్టుకోలేక వానరగణాలు వెనుదిరిగాయి. ఇది గమనించి ప్రచండవీరుడు, రణరంగధీరుడైన అయోధ్యానాథుడు వింటి నెక్కు పెట్టి త్వరగా బాణాన్ని సంధించాడు.

కర్పూరం అగ్నితో తలపడితే అగ్ని ఊరకుంటుందా? పులిదగ్గరకు వృషభం వస్తే పైన పడకుండా వుండగలదా? ఆ విధంగా ప్రతాపసూర్యుడు, త్రుటిలో నివారించాడు. వేదాంతులు ఎంతటి వ్యావహారిక చర్చనైనా ఒక్కమాటతో ఖండించినట్టు రావణుడు వేసే బాణాలకంటే అమోఘమైన బాణాలువేసి రఘువీరుడు నివారించాడు. అలలతో నిండిన సముద్రాన్ని అగస్త్యుడు ఒకేసారి మింగినట్లు, సూర్యోదయం కాగానే చీకట్లు మాయమయినట్లు, అపారంగా వర్షం కురిస్తే దావానలం మటుమాయమయినట్లు, భూతాలు ఎన్ని దుష్కార్యాలు చేసినా వాటి ఆటలు యముని ముందు సాగనట్లు, సుడిగాలికి మేఘాలు చెల్లాచెదురయినట్లు, రాముని ఎదుట ఏ అస్త్రాలు పనిచేయకపోగా దశకంఠుడు నిశ్చేష్టుడయినాడు. ఆ పరిస్థితి చూచి రావణుడు కోపోద్రిక్తుడై పంచాగ్నులవంటి ఐదు నిర్వాణశరాలను రాముని పైకి వదిలాడు. రాఘవుడు వాటిని నివారించే లోపల మెరుపువేగంతో అవి అకస్మాత్తుగా వచ్చి శరీరంగుండా ఆవలివైపుకు దూసుకెళ్ళాయి. ఏ విధంగా మన్మథబాణాలకు మారుతి కల్పాంతం వరకు చలించలేదో, ఆ విధంగా ఐదుబాణాలు శరీరాన్ని చీల్చుకుంటూ వెళ్ళినా అభేద్యమైన రాముని వజ్రకవచకాయం చెక్కుచెదరలేదు. పదునైన గొడ్డలితో బలంగా కొట్టినా చెట్టు చలించనట్టు, ఎంత వర్షం కురిసినా పర్వతం చలించనట్టు, దుష్టులు ఎన్ని నిందలువేసినా సాధువుల అంతరంగం వికలంకానట్టు, ప్రహ్లాదునికి విషం యిచ్చినా ధైర్యాన్ని వీడనట్టు, అతిగంభీరుడైన రాముడు అణుమాత్రం కూడా తన స్థానాన్నుండి కదలలేదు. రాముని శరీరం గుండా ఐదుబాణాలు దూసుకెళ్ళాయని రావణుడు సంతోషించాడు. ఇంతలో రాజాధిరాజు, నిపుణుడు, రణకోవిదుడైన రఘునాథుడు ఏడుబాణాలను

రావణునిపై విడిచాడు. ఆ ఏడుబాణాలు రావణుని గుండెలు చీల్చి లంకలో పడ్డాయి. ఆ దెబ్బకు రావణుడు మూర్ఛిల్లాడు. అతి సుకుమారమయిన రాముని శరీరంనుండి ఐదుబాణాలు దూసుకెళ్ళడం గమనించి, ప్రేమాతిశయంతో లక్ష్మణుడు రాముని వెనక నిలబడి వజ్రకవచాన్ని సరిచేసి అర్ధచంద్రబాణంతో రావణుని సారథిని సంహరించి, తదుపరి పదిబాణాలతో రావణుని పదిధనుస్సులను ఛేదించాడు. ఇంతలో విభీషణుడు పరుగున వచ్చి వేగంగా ఎనిమిది బాణాలు వేసి రావణుని రథానికున్న ఎనిమిది గుర్రాలను మట్టుపెట్టాడు. వెంటనే ఒక్క బాణంతో సూటిగా రావణుని రథధ్వజాన్ని నేలకూల్చాడు.

## శక్తిని ఛేదించడం

ఇంతలో రావణుడు ఇంకొక రథాన్ని తెప్పించి అందులో కూర్చున్నాడు. రావణుడు రక్తపిపాసియై, ప్రళయాగ్నివలె క్షోభిల్లి పరమదారుణమైన మహాశక్తిని గైకొని విభీషణునిపై ప్రయోగించాడు. అనివార్యమైన ఆ శక్తి మహిమ తెలిసి లక్ష్మణుడు ముందుకొచ్చాడు. దారుణమైన ఆ శస్త్రంముందుకు దూసుకొస్తుండగా లక్ష్మణుడు డాలువలె విభీషణుని ముందు నిలిచాడు. మెరుపువేగంతో వస్తున్న ఆ శక్తిపై లక్ష్మణుడు బాణం వేయగా అది ఆకాశంలోనే మూడుముక్కలై రాక్షససైన్యం పైనబడింది. మంత్రాన్ని సరిగ్గా జపించకపోతే మంత్రం ఉచ్చరించిన వానినే కబళించినట్లుఆ శక్తి అసురుల పైబడి వారిని దగ్ధం చేసింది. శక్తి వ్యర్థమయిందని తెలిసి రావణుడు విభీషణునితో 'లక్ష్మణుని వెనుక నిలబడి ఏం యుద్ధం చేస్తావురా? ఓరీ మూర్ఖా! రామునితో కలసి సంకటాన్ని కొనితెచ్చావు. బీద ఏడుపులు ఏడ్చి చక్కగా నీ ప్రాణాన్ని రక్షించుకున్నావు. మేమంతా రాక్షస సింహాలము. నీవు మాలో నక్కలా జన్మించావు. కులాభిమానాన్ని వదలిపెట్టి శత్రువు శరణుజొచ్చావు. నిన్ను ఇన్నాళ్ళు పోషించడం, బూడిదలో పన్నీరు పోసినట్టు. శవానికి శృంగారం



చేసి ఊరేగించినట్టు వ్యర్థం' అని నిందించాడు. బదులుగా విభీషణుడు 'ఒరే బుద్ధిహీనుడా! దశగ్రీవా! కపటీ! మలినుడా! నేను రఘుపతిని శరణుజొచ్చి జననమరణాతీతుడయ్యాను. నేను నీకు హితవు చెప్పాను. కాని నీవు రాజునన్న గర్వంతో కులాన్నంతా నాశనం గావించావు. నిన్ను కూడ రఘురాముడు తప్పక వధిస్తాడు' అనగా రావణుడు కోపోద్రిక్తుడై పళ్ళు పటపట కొరుకుతూ ఆవేశంతో ఊగిపోయాడు. 'నిన్ను సౌమిత్రి రక్షించాడు. ఇపుడు వానినే బూడిద చేస్తాను. అజేయుడైన ఇంద్రజిత్తును నికుంభిలలో హతం చేసిందీతడే. పెన్నిధి అయిన అతికాయుని వీడే క్షణంలో పొట్టన పెట్టుకున్నాడు. కాని ఈరోజు యుద్ధంలో సౌమిత్రి ప్రాణాలు తీస్తాను' అని పలికి లంకాపతి ధగధగ మెరిసే శక్తిని పొదిలోనుండి బయటకు తీసాడు. దాని తేజస్సుతో జగత్తంతా నిండిపోయింది. వేయి సూర్యులుదయించారా అన్నంత తేజస్సుతో ఆ శక్తి ప్రచండంగా వెలిగింది. దాన్నిచూస్తే కాలదండమే జగత్తునంతా సంహరించటానికి అవతరించిందా అన్నట్లు, ప్రళయాగ్నిశిఖలు కాలుని నోటినుండి ఎగిసి వస్తున్నాయా అన్నట్లు, ప్రళయకాల మేఘాల మాటునుండి వెలువడిన మెరుపేమో అన్నట్లు, సప్తకోటి మంత్ర తేజస్సంతా అందులో నిక్షిప్తం చేసినట్లుంది. అటువంటి శక్తిని మయుడు అల్లుడైన రావణునికి కానుకగా ఇచ్చాడు. ఆ మయశక్తిని ఇంతవరకు ఎవరిపై ప్రయోగించలేదు. దానిని ప్రస్తుతం రావణుడు సౌమిత్రిపై ప్రయోగించాడు. న్యాసహితంగా మంత్రం జపించి వదలగా దాని ధాటికి నవఖండాలలో భూమి ఆకాశం దద్దరిల్లాయి. ఆ శక్తి ముందు వేయి మెరుపులు కూడా వెలవెల పోయాయి. సముద్రుడు భయవిహ్వలుడైనాడు. దిక్పాలకుల రోమాలు భయంతో నిక్కబొడుచుకున్నాయి. దేవతలు విమానాల్లో పారిపోయారు. వానరులు పర్వత గుహల్లో దాక్కొన్నారు. మూర్ఛిల్లిన వారెవరూ తిరిగి జాగృతం కావడంలేదు. ఇరుపక్షాలు భయంతో దిక్కుతోచక మహావీరులతో సహా పరుగులెత్తారు. ఆ

సమయంలో బ్రహ్మాండానికే ధైర్యాన్నిచ్చే మారుతి పరుగున వచ్చాడు. మారుతి బలంలో జగజ్జెట్టి. ఆ శక్తిని ఎడమచేత్తో పట్టుకొని విరిచేసేంతలో అది 'స్త్రీ'గా మారిపోయి మారుతితో 'నీవు బ్రహ్మచారినంటావు. పరస్త్రీలను ఎందుకు పట్టుకుంటావు. త్వరగా నన్ను వెళ్ళనీ. నేను రావణుని కుమార్తెను. సౌమిత్రిని వరించాను. ముహుర్తానికి వేళవుతుంది. త్వరగా వెళ్లనివ్వమని బ్రతిమాలింది. ఇంద్రియాలను జయించిన వాడు, యోగియైన మారుతి స్త్రీ కదా అని దయతలచి తటాలున వదిలేసాడు. ఆ శక్తి వెంటనే పూర్వరూపం ధరించి ప్రళయం సృష్టిస్తూ వెళ్ళిపోయింది. వానరదళంలో హాహాకారాలు చెలరేగాయి. దేవతలు మయశక్తి ఎవరిమీద పడుతుందో ఏమో అని భయంతో చకితులయ్యారు. తనవైపే మనోవేగంతో వస్తున్న ఆ మయశక్తిని ఛేదించటానికి లక్ష్మణుడు బాణాన్ని ఆకర్ణాంతం సారించాడు. ఇంతలో ఆ శక్తి మెరుపు వేగంతో వచ్చి హృదయంలో గుచ్చుకొని, వక్షఃస్థలాన్ని చూర్ణం చేసి వీపుగుండా బయటకు వచ్చి, పృథ్విని చీల్చుకుని పాతాళోదకాలలో కరిగిపోయింది. ఇక్కడ సౌమిత్రి శరీరం అచేతనంగా నేలపై పడివుంది. మట్టి కుండ ముక్కలైనట్లు, గాలికి పనస వక్కలైనట్లు, సుమిత్రానందనుడు ఛిన్నాభిన్నమైనాడు. యుద్ధంలో సౌమిత్రి నేలకూలాడన్న వార్త విని వానరులంతా శోకతప్తులై హాహాకారాలు చేయసాగారు. ఆ హెూరుకు దేవతలంతా గుమిగూడారు. విభీషణుడు పెద్ద కేకవేసి సుగ్రీవుని, రఘునందనుని పిలచి లక్ష్మణుని వద్దకు పరుగున వెళ్ళాడు. ఆ దృశ్యం చూసి అంగదుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు, సుషేణుడు, శరభుడు, గవయుడు, హనుమంతునితో సహా వానరులంతా గుండెలు బాదుకుంటూ పరుగున వచ్చారు. అందరూ ఆక్రందిస్తూ సౌమిత్రి చుట్టూ చేరారు. రఘునాథుడు లక్ష్మణుని ప్రక్కనే కూర్చుని అచేతనంగా చూడసాగాడు. ఆ దృశ్యం చూడటానికి హృదయవిదారకంగావుంది. వీపులో నుంచి రక్తం స్రవిస్తున్నది. ముక్కుపుటాలవద్ద చేయిపెట్టి చూడగా శ్వాస ఆగిపోయింది.



కళ్ళు ఎర్రబారాయి. ఆకర్ణాంతం సారించిన వింటిలోని బాణంతో సహా నిశ్చేష్టతంగా నేలపై పడివున్నాడు. రవ్వంతకూడా ప్రాణచలనం లేదు. ఇది చూచి రాజీవనేత్రుడు నేలపైబడి గుండెలు బాదుకోసాగాడు. వెంటనే విభీషణుడు సీతారాముని అనునయించి కూర్చుండబెట్టాడు. లక్ష్మణుని తొడపై బెట్టుకుని రాముడు కూర్చున్నాడు. లక్ష్మణుని ముఖంలో ముఖం పెట్టి అయోధ్యానాథుడు, 'ప్రాణసఖా! నా మాట విను. నాతో ఒక్కసారి మాట్లాడు. కొంచెం కళ్ళుతెరిచి నా వంక చూడు. నీవు సుకుమారుడవు. బాలుడవు. ప్రతాపంలో నీ కీర్తి ముల్లోకాలలో నిండిపోయింది. వనవాసంలోనున్న ఈ పధ్నాలుగు సంవత్సరాలు మంచి ఫలాలు మాకు తెచ్చిపెట్టావు. కాని నిన్ను నేను ఉపవాసిగా ఉంచాను. ఏం తిన్నావని ఏ రోజూ అడగలేదు. ఆ కోపం మనస్సులో పెట్టుకొని నన్ను విడిచిపోతావా? నేను కూడా ప్రాణత్యాగం చేసి నిన్ను కలుసుకుంటాను. నేను ఒక్కడినే అయోధ్యకు వచ్చానని తెలిసి సుమిత్ర నిన్ను గురించి అడిగితే నేనేం సమాధానం చెప్పేది. కళ్ళు తెరిచి చూడు. అన్యులకు శక్యంకాని ముల్లోకాలను ఇంద్రజిత్తు జయించాడు. అటువంటి వీరుని నీవు బాణాలతో చిత్రవధ చేసి చంపేశావు. నీకు శుభం కలగాలని దేవతలు ఆశిస్తుండగా నేటి యుద్ధంలో నీవు శాశ్వతంగా శయనించావు. నీవల్ల భరత, శత్రుఘ్నులు కూడా ప్రాణాలు విడుస్తారు.' అని రాముడు శోకిస్తుండగా హాహాకారాలు మార్మోగాయి. యుద్ధభూమిలో శత్రు సముఖంలో శోకించడం క్షాత్రధర్మం కాదు. ముందు శత్రువును ఓడించి పిదప సౌమిత్రికి మనకు తోచినట్లు ఉపచారాలు చేయవచ్చు. మానవోత్తమా! రఘునందనా! లక్ష్మణుని గూర్చి భయపడనవసరం లేదు. బాణాన్ని చేపట్టి రావణుని వధించమంటూ వింటిని చేతికందించాడు పరమభక్తుడైన విభీషణుడు.

రాక్షసకుల వైశ్వానరుడు, రణరంగధీరుడైన రఘురాముడు లేచి బ్రహ్మాండాన్ని కబళించే కాలునిలా ధనుష్టంకారం చేయగా గంటలన్నీ గణగణ

మోగసాగాయి. భూమితో సహా ఆదిశేషుడు కూడా తల్లడిల్లాడు. సప్తపాతాళాలు కలవరపడ్డాయి. శ్రీరాముని కోపాన్ని చూచి అరణ్యంలోని గజ, సింహ, శార్దూల, భూత గణాలన్నీ విగతజీవులైనాయి. దాశరథి హృదయంలో ఉప్పొంగే క్రోధ తరంగాల హోరు, వజ్రం కంటే బలిష్ఠమైన రఘునాథుని ఊరువును చూడటానికి యమునికే శక్యం కాలేదు. రఘునందనుడు రావణునితో 'సౌమిత్రిపై శక్తిని వేసి ఎక్కడకు పారిపోతున్నావు? నిన్ను నా శరాఘాతంతో చూర్ణం చేస్తాను' అన్నాడు. సౌమిత్రి మరణించాడన్న ఆనందంలోనున్న దశముఖుని పైకి సింహబలుడైన రాముడు లంఘించాడు. విషపూరితమైన ఆదిశేషుని వంటి, సముద్రంలో బడబానలం వంటి, ప్రళయకాల మెరుపుల వంటి బాణాలతో నిండిన తూణీరం నుండి రఘుపతి ఒక్కబాణం వేయగానే కోటానుకోట్ల రాక్షసుల శిరస్సులు నేలరాలాయి. కలుగులో నుండి వెలువడే సర్పంలా, పురివిప్పిన మయూరంలా, గడ్డితో నిండిన పర్వతంలా, ఉమ్మెత్తకాయ మీద ఉండే ముళ్ళలా రావణుని శరీరమంతా శరమయమయింది. రావణుడు వాడియైన బాణాలు వేసినా ఏం ప్రయోజనం కనబడలేదు. తల్లి మాటకోసం పరశురాముడు క్షత్రియసంహారం గావించినట్టు, సౌమిత్రి నేలకూలగానే రఘువీరుడు రాక్షస సంహారం గావించాడు. గరుడుడు పాములను సంహరించినట్టు, శంకరుడు త్రిపురాసురులను భస్మం చేసినట్టు, ప్రళయాగ్ని కల్పాంతంలో సర్వాన్ని తనలో లీనం చేసుకున్నట్టు, తారకాసురుని సైన్యాన్ని షణ్ముఖుడు, గాఢాంధకారాన్ని సూర్యుడు, పర్వతాలను దేవేంద్రుడు భవభయాలను జ్ఞానం, పాపాన్నంతా నామం అంతం చేసినట్లు, ప్రతాపసూర్యుడైన రఘునందనుడు శత్రుతారాగణాలను విధ్వంసం చేశాడు. ప్రయాగలో స్నానంచేస్తే కోటిజన్మల పాపాలు క్షాళనమైనట్టు, తమాలనీలుడైన రాముని ప్రభంజనానికి శత్రుమేఘసమూహాలు ఛిన్నాభిన్నమయ్యాయి. నేలకూలిన రాక్షసదళాలనంతా వాల్మీకి లెక్కించాడు. మదించిన గజాలు



పదివేలు, పదిలక్షల గుర్రాలు రౌతులతో సహా, ఏబది లక్షల రథాలు సారథితో సహా నేలరాలాయి. నూరుకోట్ల కాల్బలం మరణిస్తే ఒక మొండెం పైకి లేస్తుందని అంటారు. అలాంటి కోటిమొండాలు ఆ రణరంగంలో నాట్యం చేయసాగాయి. ఒక్కసారి రాముడు ధనుష్టంకారం చేయగా, ఆ ప్రతిధ్వనికి పదునాలుగు గంటలు మ్రోగుతున్నాయా అన్నట్లుగా ఉంది. అర్ధయామం వరకు గంటలు గణగణా మ్రోగుతుండగా ఆ శబ్దానికి నేలరాలిన రాక్షసులను లెక్కించడం శేషునికి కూడా సాధ్యం కాలేదు. వేదాంత శాస్త్ర ప్రచండ గర్జనలా రామకోదండ టంకారాలు వినబడ్డాయి. సన్మార్గంలో సంచరించే సాధుపుంగవునిలా రామబాణం పయనిస్తే మూర్ఖుని వితండవాదంలా, బోయవాడైన వాల్మీకి నడవడిలా, రావణుని శరాలు దారితప్పాయి. రాముని బాణధాటికి రాక్షసేంద్రుడు దిగ్భ్రముడైనాడు. ఇరుసైన్యాలలోను ఎటుచూచినా రామరూపమే గోచరించింది. కోటానుకోట్ల రఘువీరులు బాణవర్షం కురిపిస్తుండగా దశదిశలలో ఎటు చూచినా, దశకంఠునికీ దశరథతనయుని రూపం తప్ప వేరే కనబడలేదు. ముందు, వెనుక, కుడి, ఎడమ అంతటా ధనుర్ధారియైన శ్రీరాముడే. రాక్షసులలో వానరులలో ఘనశ్యాముడైన రాముని స్వరూపమే అంతటా గోచరించింది.

రావణుడు ఆంతర్యంలో పరికించగా అక్కడకూడా జగన్మోహనుడైన రాముడే నిలబడి వున్నాడు. మనస్సు, బుద్ధి, చిత్తం అంతఃకరణాలన్నీ కూడా రామమయమయ్యాయి. దశేంద్రియాలు, పంచప్రాణాలు, పంచభూతాలు, పంచవాసనలు, చతుర్విధదేహావస్థలు, భోగస్థానం సర్వం శ్రీరామరూప మయింది. ఆవిధంగా సర్వత్రా రామరూపం గోచరించింది. రావణుడు పరికించి చూడగా రథం, సారథి, ధ్వజం, చాపం, బాణం అంతా రఘువీరమయమయింది. రథం దగ్గర రామరూపం కనబడగా రథాన్ని అధిరోహించాడు. చివరకు అంతర్బాహ్యాలలో కూడా రాముడే వ్యాపించగా

పారిపోవడానికి కూడా ఎక్కడా చోటు దొరకలేదు. అణురేణువులతో సహా బ్రహ్మాండమంతా ఎటుచూచినా రాముడే. రావణుడు బాణాలు వదిలేసి రథంనుండి నేలపై దూకగా భూమిపై కూడా రామరూపమే. భయంతో వెనక్కు తిరిగి చూడగా రాక్షసవాహిని పరుగున వస్తున్నారు. అరే! రాముడొస్తున్నాడని భయంతో పెద్దగా కేక వేసి ముందుకు తిరిగి చూడగా లంకంతా రామరూపంగా కనబడింది. కోట బురుజులపై కూడా రాముడే నిలబడివున్నాడు. ఏం చేయాలో తోచక అడకత్తెరలో పడ్డ వానివలె రావణుడు లంకకు పారిపోయాడు.

పారిపోయి వచ్చిన పిశాచంవలె రావణుడు మందిరం ప్రవేశించి మండోదరికి జరిగిన సమాచారమంతా వివరించాడు. 'ప్రియే! నేను నా శక్తిసామర్థ్యాలతో లక్ష్మణుని సంహరించాను. కాని రాముడు సర్వత్రా వ్యాపించాడు. ఆ ధాటికి నేను పారిపోయి ఇక్కడకు వచ్చాను. సుందరీ! బట్టలోనున్న కస్తూరి ఖాళీ అయినా వాసన మిగిలి వున్నట్టు, శుభాశుభ కర్మలు చేసిన తరువాత కీర్తి మిగిలి వున్నట్టు, సాయంకాలం సూర్యుడస్తమించిన తరువాత ఎరుపుదనం మిగిలిఉన్నట్టు, ప్రచండ ప్రభంజనం తరువాత వృక్షాలపై దాని తాకిడి మిగిలి ఉన్నట్టు, నదీప్రవాహం తగ్గిన తర్వాత బురద మిగిలి ఉన్నట్టు నా శరీరంలో భయం ఇంకా పోలేదు. అసురగురువైన శుక్రాచార్యులు నాకు మృత్యుంజయమంత్రం ఉపదేశించారు. నేను దానిని అనుష్ఠానం చేస్తాను' అన్నాడు రావణుడు. బదులుగా మండోదరి 'దశముఖా! వ్యర్థంగా ఆ మంత్రం అనుష్ఠానం చేయవద్దు. అంతకంటె ఈశ్వరుని మిత్రుడైన రాముని స్నేహం చెయ్యి లేదా యుద్ధానికి వెళ్ళి హోరాహోరిగా యుద్ధంచేయి' అంది. కాని లంకేశుడు ఆమె మాట పెడచెవిన పెట్టి కుటిలకర్మలలో మునిగిపోయాడు. వెంటనే హోమం చేయడానికి భూమిలో ఒక రహస్యమైన గుహను నిర్మించాడు. సకల సంభారాలు గైకొని తాను దానిలో ఆసీనుడయ్యాడు. కాలనేమి అనే రాక్షసుని పిలిచి, 'వాయుపుత్రుడు ద్రోణాద్రిని తీసుకొస్తాడు.



నీవు త్వరగా వెళ్ళి, దారికాచి మారుతి ప్రయత్నాన్ని విఘ్నం చేసి ద్రోణగిరిని బలవంతంగా తీసుకెళ్ళు లేదా నీ బలపరాక్రమాన్ని ప్రదర్శించి హనుమంతుని సంహరించు. లేదా నానావిధాలుగా హనుమంతుని మార్గమధ్యంలో మాటల్లో పెట్టు. రాత్రి ముగిసి తెల్లవారగానే సౌమిత్రి ప్రాణం పోతుంది' అని ఆజ్ఞాపించాడు. వెంటనే కాలనేమి రాక్షససేనతో బయలుదేరి విప్రవేషం ధరించి దారిలో కాపుకాసాడు.

## హనుమ ద్రోణాచలాన్ని మళ్ళీ తేవడం

ఇక్కడ రఘునందనుడు ధనుర్బాణాలను విసర్జించి సౌమిత్రి చెంత కూర్చుని విపరీతంగా దు:ఖించ సాగాడు. అప్పుడు వైద్యనిపుణుడైన సుషేణుడు సౌమిత్రిలోని కవళికలనుబట్టి సూర్యుడుదయిస్తే ప్రాణం పోతుందని చెప్పాడు. ద్రోణాచలాన్నుండి ఎవరైనా సంజీవనిని తీసుకుని వస్తే వెంటనే సౌమిత్రి మామూలు మనిషవుతాడు. నాలుగుకోట్ల యోజనాల దూరం వెళ్ళి రాత్రిలోపల పర్వతాన్ని తీసుకురావాలి అని చెప్పగా రఘునందనుడు వానరుల వంక చూశాడు. కార్యాన్ని సాధించలేమని వానరులంతా తలలు దించుకున్నారు. ఇదిచూచి కళ్ళనుండి నీరు కారిపోతుండగా రఘునందనుడు స్తబ్ధుడైనాడు. పరమ దారుణమైన పరిస్థితిని గమనించి మృత్యువు చెలికాడైన, సీతాశోకహరణుడైన అంజనేయుడు రామునికి సాష్టాంగ నమస్కారంచేసి, 'ముల్లోకాధిపుడైన రామచంద్రా! మీరు దు:ఖించవలదు. మూడవప్రహారం లోపల నేను ద్రోణాచలాన్ని తీసుకొస్తాను' అని పలికాడు. ఆ మాటలకు శ్రీరాముడు ఆనందభరితుడై 'సౌమిత్రి సంపూర్ణంగా నీ భిక్షపై ఆధారపడి ఉన్నాడు. అతడికి ప్రాణదానం చేసి స్నేహభావంతో చేయూతనీయవలసింది' అన్నాడు. ఆ మాటలు విని యశస్వి అయోధ్యానాథునికి జయము! జయము! అంటూ మారుతి ఉత్తరదిశగా ఆకాశానికి ఎగిరాడు. మనసులో శ్రీరాముని స్మరించి ప్రాణమిత్రుని యింట ప్రియమైన వస్తువు దాచుకున్నట్లు

శ్రీరామచరణాలను తన అంతరంగంలో భద్రపరచాడు. సాగరంలో లవణంలా, ఆకాశంలో లీనమయిన గాలిలా రామపాదాలపై మనస్సు లగ్నంచేసి వాయునందనుడు ఎగిరిపోయాడు. గరుడుడు క్షీరాబ్ధి దాటినట్టు హనుమంతుడు గాలికంటే వేగంగా సాగిపోయాడు. తలపై తోకనుంచుకొని రామనామాన్ని పదేపదే స్మరిస్తూ, ఇంకా ఇంకా పైకెగిరాడు. ఒక్క గడియకాలం లోపల సప్తద్వీపాలు దాటి ద్రోణాచలం దాపునున్న మందరాచలాన్ని చూశాడు. దాని కాంతి చంద్రునితో సమానంగా కైలాసగిరి వలె శ్వేతవర్ణం కలిగి, కర్పూరం వలె సంపూర్ణంగా శీతలత్వాన్ని కలిగి ఉన్నది. పాలసముద్రాన్ని మథించినప్పుడు వెలికివచ్చిన నవనీతగోళంలా, నిర్దోషికి కీర్తి తానంతట అదే వచ్చినట్లు, భూమిలో నుండి క్రొత్తగా తెల్లకలువ వికసించినట్లు ఆ పర్వతం విరాజిల్లుతున్నది.

## కాలనేమి వృత్తాంతం

దానికి ఒక యోజన దూరంలో కాలనేమి బ్రాహ్మణ వేషం ధరించి, రాక్షసులను శిష్యులుగా చేసి ఆశ్రమాన్ని సృష్టించాడు. అక్కడ ఫలాలతో నిండిన వృక్షాలు, నిర్మలమైన నీటితో నిండిన సరోవరం, విశాలమైన యజ్ఞశాల, హెూమకుండం, యజ్ఞవేదిక అన్నీ యథావిధిగా ఉన్నాయి. ఎన్నో యజ్ఞపాత్రలు హెూమకుండం చుట్టూ విరాజిల్లుతున్నాయి. సమిధలు, దర్భలు అన్నీ సిద్ధంగా వుంచబడ్డాయి. అన్న సత్రాలను మట్టుబెట్టే నిశాచరుడైన కాలనేమి కొంగజపం చేస్తూ మారుతిరాకకై ఎదురుచూడసాగాడు. గన్నేరుకాయ మెరుపువలె, దాంభికుని శుష్కజ్ఞానం వలె, కాంస్య విగ్రహాలను ముందుంచుకొని విక్రయించే వానివలె కూర్చొన్నాడు. ఇంతలో వాయుసుతుడు దప్పికతో అటుఇటు చూడగా, ఆ కపటి పరుగున వచ్చి మారుతికి నమస్కరించి, 'మహాపురుషులైన మీ దర్శనంచే నా జన్మ ధన్యమైంది. స్వామీ! దయచేసి మీరు ఈ రోజు మా ఆతిథ్యం స్వీకరించండి. దుర్లభమైన మీ దర్శనం నాకీ రోజు కలిగింది. మీరు ఎల్లప్పుడూ ఇక్కడే వుండండి లేదా కనీసం ఒక్కరోజైనా మాతో గడపండి'



అని వేడుకొనగా హనుమంతుడు ఎంతో సంతోషించాడు. హనుమంతుడు ప్రసన్నంగా ముందు కార్యం చాలా ముఖ్యమైనది. నాకు చల్లని నీళ్ళు ఇచ్చినట్లయితే సకలోపచారాలు చేసినట్లే. కాలనేమి ఎంతో వేడుకున్నాడు. కాని మారుతి అంగీకరించలేదు. దాంతో వికల మనస్కుడై శిష్యులతో ఈ వానరానికి నీళ్ళు ఇవ్వండన్నాడు. జీవితంలో మరల వేరెవరినీ అడిగే అవకాశం లేకుండా మారుతికి విఘ్నదేవత వున్న సరస్సును చూపించారు. ఆ విఘ్నదేవత పరమదారుణమైనది. దాని దేహము పర్వత సమానమైనది. నీళ్ళు త్రాగడానికి వచ్చిన జీవాలనెన్నింటినో అది భక్షించింది. ఆ కొలనులో నీళ్ళు తాగటానికి మారుతి కూర్చొనగా ఆ జలదేవత మారుతి కాలు పట్టుకుంది. హనుమంతుడు దాని మెడ పట్టుకొని బయటకు లాగి గుండెలపై ఒక తన్ను తన్నగా అది వెంటనే మరణించింది. దాని శరీరంలో నుండి ఒక దివ్యాంగన వెలువడి, మారుతి పాదాలపైబడి జరిగిన వృత్తాంతమంతా నివేదించింది. నేను స్వర్గంలోని దేవాంగనను. అందగత్తెనన్న అహంకారంతో ఎవ్వరినీ లెక్కపెట్టలేదు. ఒక తపస్విని చూసి నేనపహాస్యం చేసినందుకు 'పాపీ! నీవు విఘ్నదేవతవై పడివుండు' అని శాపమిచ్చారు. నేను శాపాన్ని ఉపసంహరించమని ప్రార్థించగా వారు 'ద్రోణాచలాన్ని తీసుకుపోవడానికి రాత్రికిరాత్రి మారుతి వస్తాడు. ఆయన తప్పక నిన్ను ఉద్ధరిస్తాడు. ఆ మాట ఈ రోజు నిజమైంది' అని తన కథ చెప్పి మారుతితో ఆ దేవాంగన 'కాలనేమి కపటరాక్షసుడు. మునీశ్వరుడు కాదు. నిన్ను సంహరించటానికి రావణుడు అతనిని ప్రేరేపించాడు' అని చెప్పి స్వర్గపథంలోకి ఎగిరిపోయింది. హనుమంతుడు కాలనేమిని చూచి 'ఈ దురాత్ముని తప్పక శిక్షించవలసిందే' అనుకుంటుండగా కాలనేమి 'మావంటి మంచి బ్రాహ్మణునికి గురుదక్షిణ ఏమివ్వగలరు?' అని అడుగగా, మారుతి కాలనేమి గుండెలపై ఒక్క పోటు పొడిచాడు. దాంతో ఐదు యోజనాల శరీరం గల రాక్షసుడు ఎదురు నిలిచాడు. హనుమ అసురునితో యిక

ఆలస్యమెందుకు? త్వరగా చెప్పు. ఎందుకిక్కడికి వచ్చావు? అంటూ వాడి కాళ్ళు పట్టుకుని నేలకేసి కొట్టగా కాలనేమి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అది చూచి మిగతా శిష్యులు లంకకు పారిపోయారు.

కాలనేమిని నేలకేసి బాదిన శబ్దం విని పధ్నాలుగువేల గంధర్వులు పరుగున మారుతిపైకి దండెత్తారు. కాకులన్నీ కలసి సూర్యుని, మూర్ఖులంతా కలిసి వాచస్పతిని పట్టుకోవాలనుకొన్నట్టు, హనుమంతునిపైకి దండెత్తారు. క్షణంలో హనుమంతుడు వారందరినీ గిరగిరా తిప్పి నేలకేసి బాదగా అందరూ మరణించారు.

మనస్సులో సౌమిత్రిని గూర్చి చింతిస్తూ హనుమంతుడు అక్కడినుండి వెంటనే ఎగిరి త్వరితగతిని ద్రోణాద్రి చెంత చేరాడు. ద్రోణాద్రి అపరంజివలె, ఆకాశంలో మెరుపు వలె మెరిసిపోతున్నది. హనుమంతుని చూడగానే ద్రోణాద్రి భయవిహ్వలుడై ఈయన నన్ను తీసుకుపోవడానికి మరలా వచ్చాడు. ఎక్కడి రాముడో ఎక్కడి రావణుడో ఒకసారి వచ్చి తీసుకెళ్ళాడు. ఆయుష్షు తీరగానే వచ్చే మృత్యువులా తిరిగి ఎదుటవచ్చి నిలబడ్డాడు. వివేకంతో ఆలోచించి పనిచేస్తే ఎన్నో విఘ్నాలు తొలగిపోతాయి. ఆ ఓషధి వల్ల క్షణం క్షణం ఎన్నో అనర్థాలు కలుగుతున్నాయి అని మనసులో తలపోసాడు. హనుమంతుడు పర్వతం ఎదురుగ నిలబడి చేతులు జోడించి నమస్కరించి పెద్దగా గొంతెత్తి 'లక్ష్మణుని శక్తి ఛేదించింది. అందరూ దుఃఖంలోనున్నారు. త్రిలోకపాలకుడైన శ్రీరామునికి నీవు మేలు చేయవలసింది. మృతసంజీవని ఔషధాన్ని నాకు సమర్పించు లేదా నీవు అక్కడదాకా నన్ను అనుసరించు. దానివల్ల అయోధ్యాధీశుడు సంతృప్తుడవుతాడు. నీ కీర్తి ముల్లోకాల్లో పెరుగుతుంది. మాటల్లోబడితే సమయం దాటిపోతుంది త్వరగా కానీ!' అన్నాడు. సమాధానంగా ద్రోణాద్రి 'మర్కటా! పామరుడా! చీటికిమాటికి ఎందుకు వస్తావు? నీకు ఔషధం ఇచ్చేదిలేదు. నేను అక్కడకు వచ్చేది లేదు' అని యీసడించుకుంది. బదులుగా



హనుమ 'ఒరే! ద్రోణాద్రీ! నిర్దయా! ఖలుడా! మహామలినుడా! ఒరే బుద్ధిహీనా! నిన్ను క్షణంలో పెళ్ళగించి లంకకు తీసుకెళ్తాను' అంటూ తోకను చాచి పర్వతం చుట్టూ మూడుసార్లు తిప్పి పైకి లేపి అరచేతిలో పెట్టుకొని హనుమ ఆకాశానికి ఎగిరి సాగిపోయాడు. చంద్రుడు ఇది చూచి ఏమి అద్భుతం! హనుమ పర్వతం గైకొని ఆకాశమార్గంలో ఎలా పయనిస్తున్నాడా! అని ఆశ్చర్యచకితుడయ్యాడు.

**భరత-హనుమ సమాగమం**

అక్కడ నందిగ్రామంలో భరతునికొక దుస్స్వప్నం వచ్చింది. ఒక నల్లటివాడు వచ్చి తన కుడిచేయిని మింగేశాడు. కలవరపడి లేచాడు భరతుడు. విపరీతమైన ఆ స్వప్నవార్త విని వసిష్ఠుడు 'సీతాసౌమిత్రి సహితంగా రఘునందనుడు క్షేమంగా వుండుగాక! ఇది దుష్ట స్వప్నం. శాంతియాగం చెయ్యవలసింద'న్నారు. వెంటనే హోమద్రవ్యాలు తెప్పించి కైకేయీనందనుడు యాగం చేస్తూ ఆహుతులు సమర్పిస్తుండగా పెద్ద అగ్నిపర్వతం నేలపై పడుతుందా అన్నట్లుగా, ఆకాశమార్గంలో పోతున్న హనుమంతుని చూచాడు. వసిష్ఠుడు భయభ్రాంతుడు కాగా అకస్మాత్తుగా వచ్చిన ఈ అరిష్టాన్ని తూట్లు పొడిచి ఒక మూల పడేస్తాను. మీరు శాంతచిత్తులై ఉండవలసిందని ధైర్యవచనాలు పలికాడు. భరతుడు త్వరత్వరగా పూర్ణాహుతి చేసి యాగం ముగించి వింటిని గైకొని రామనామబీజాంకితమైన వాడిబాణాన్ని ఆకర్ణాంతం సారించి విడిచాడు. మెరుపులాగా ఆ బాణం ఆకాశమార్గాన చరించి పర్వతంతో సహా హనుమంతుని చేతిని మింగివేసింది. మారుతి రామనామస్మరణ చేస్తూ మదగజంపై పర్వతం పడ్డట్లు పెద్దగా కేకవేసి నేలపై పడ్డాడు.

రామనామస్మరణ విని భరతుడు పరుగున వచ్చి చూడగా మహాపర్వతం చేబూనిన అద్భుతమైన వానరం నేలపై బడివుంది. భరతుడు ప్రేమతో 'మిత్రమా!

నీవు ఎవరు? రామనామజపం చేస్తున్న నిన్ను చూడగానే నాకు స్నేహభావం కలిగింది' అని అడిగాడు. వాయునందనుడు హాహాకారాలు చేస్తూ 'లక్ష్మణుడు ఎలా మృత్యుముఖంలోంచి బయటపడగలడు? సూర్యోదయమైతే రఘునందనుడు కూడా ప్రాణత్యాగం చేస్తాడు' అని ఆక్రోశించాడు. భరతుడు నేలపై కూర్చొని 'ప్రాణసఖా! నాకు యథార్థాన్ని విన్నవించు. ఏదో విపరీతం జరిగినట్లుంది' అని అడిగాడు. హనుమంతుడు నీవెవరని ప్రశ్నించగా భరతుడు 'నేను రాముని దాసుడనని' బదులుపలికాడు. 'నీవు రావణుని కంటె ఎంతో అనర్థంగావించావు' అంటూ జరిగినదంతా చెప్పి దశముఖుడు శక్తి ప్రయోగించినందువల్ల లక్ష్మణుడు నేలకూలాడు. అతడిని జీవింపచేయడానికి నేనీ ద్రోణాచలాన్ని తీసుకొనిపోతున్నాను. నీకు తెలియక ఆ కార్యానికి విఘ్నం కలిగించావు. సూర్యుడుదయించే లోపల ఈ పర్వతాన్ని ఎవరు తీసుకుపోతారు? సమర్థుడు, కృపాళువు అయిన రఘురాముడు ఎదురు చూచి ఎంతో అలసిపోయివుంటాడు, అని చెప్పగా భరతుడు 'నాలుగుకోట్ల యోజనాల దూరం నుండి పర్వతాన్ని తీసుకొచ్చిన నీవు ఈశ్వరుడవు తప్ప వేరుకాదనిపిస్తున్నది. సూర్యోదయం లోపల పర్వతాన్ని తీసుకుని లంకకు వెళ్ళలేకపోతే అంతకంటే అనర్థం ఏమైనా ఉంటుందా? కపీశ్వరా! నేనే రాముని దాసుడనయితే నిన్ను పర్వతంతో సహా ఒక్క నిముషంలో లంకలో దింపుతాను. ఈ పని చేయలేకపోతే సూర్యవంశంలో జన్మించడం వ్యర్థం. నా తల్లి పడ్డ శ్రమంతా వృథా. వైకుంఠంలో నుండి నా తండ్రి దశరథుడు అపహాస్యం చేస్తాడు. హనుమంతా! నీవు పర్వతంతో సహా బాణాగ్రాన కూర్చోవలసింది. వింటిని సారించి నిన్ను త్రికూటాచలానికి పంపుతాను' అని దృఢంగా అన్నాడు. భరతుని మాటలకు హనుమంతుడు అచ్చెరువొంది 'నీవు నిజంగా రాముని సహోదరుడవే. మీ ధైర్యసాహసాలు వర్ణింపనలవికావు' అంటూ భరతుని పాదాలకు నమస్కరించి, మీ వంశం ధన్యమైంది. ముల్లోకాల్లో మీ కీర్తి



నిండిపోయింది. మహారాజు సాక్షిగా నేను నిజం చెప్తున్నాను. నేను రాముని దాసుడనయిన హనుమంతుడను. నా బలపరాక్రమాలు రఘురామునికి తెలుసు. ఈ బ్రహ్మాండాన్ని బంతిలా విసిరేయగలను. మీరు రామనామాంకిత బాణం ప్రయోగించినందువల్ల దాన్ని గౌరవించాను. సూర్యుడు పశ్చిమాన ఉదయించుగాక! మేరుమందరాలు వాటి గతి తప్పుగాక! కాని రామదాసుడనైన నా సామర్థ్యమెన్నటికీ మొక్కవోదు. సూర్యుడుదయించే సమయమాసన్నమైనది. త్వరగా నాకు అనుమతి ప్రసాదించవలసినది' అని పలుకగా భరతుడు నీకు సర్వదా జయము కలుగుగాక! రఘుపతికి నా సాష్టాంగ నమస్కారములు తెలిపి సీతాసౌమిత్రితో సహా త్వరగా అయోధ్యకు రమ్మని విన్నవించవలసింది అన్నాడు. ఆవశ్యం అంటూ హనుమ అరచేతిలో పర్వతాన్ని తీసుకుని జయజయ యశస్వీ సీతాపతి! అంటూ ఎగిరిపోయాడు. పూర్వం అమృతభాండాన్ని తీసుకెళ్ళిన గరుడునిలా ఎగిరిపోతున్న మారుతిని దేవతలంతా విమానాలలో నుండి తిలకించారు.

ఇక్కడ జానకీరమణుడు, వానరులందరూ మారుతి ఇంకా ఎందుకు రాలేదు? చాలా ఆలస్య మయిందని చింతించసాగారు. ఇంతలో వానరులు దూరంగా ఆదిత్యునిలా మెరసిపోతున్న పర్వతాన్ని చూచి రఘుపతితో స్వామీ! సూర్యుడుదయించాడు అని తెలియచేశారు. ఆ మాట వినగానే సీతాకాంతుడు మిక్కిలి కోపించి, 'నిజంగా అతడు కులఘాతకుడే! ఉత్తరాన్నుండి ఉదయించాడు. ఇంకా ఆరుఘడియల రాత్రి మిగిలి ఉండగా, ఈ రోజు తూర్పుదిక్కును వదలి ఎందుకు త్వరపడి ఉత్తరదిక్కున ఉదయించాడు? అని వెంటనే ధనుస్సు ఎక్కుపెట్టి రాహుముఖబాణాన్ని గైకొని లోక ఆయుష్యచోరుడైన సూర్యుడు రాక్షసులతో కలిసాడు' అంటుండగా సుషేణుడు ఉదయించింది సూర్యుడు కాదు, హనుమంతుడు వస్తున్నాడని పలుకగా సీతాపతి ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోయాడు. ధైర్యసాహసాలు గల అంజనా తనయుడు

అవలీలగా పండును తెచ్చినట్టు ఆ పర్వతాన్ని గైకొని రామదర్శనానికి వచ్చాడు. దట్టమైన అంధకారంలో రావణుడు ప్రాణాలతో పారిపోతుండగా అనంతమైన దివిటీలతో హనుమంతుడు వెదకడానికి వచ్చాడా! అన్నట్టు, అమృతభాండాన్నే తెచ్చాడా అన్నట్టు, కీర్తిధ్వజాన్ని స్థాపించాడా అన్నట్టు, సౌమిత్రి ప్రాణాలు తిరిగి వెనక్కు తెప్పించటానికి ఏతెంచాడు హనుమంతుడు.

ఇంతలో సుగ్రీవాది వానరులు పరుగున పర్వతాన్ని దింపటానికి ఎదురెళ్ళారు. పర్వతాన్ని నేలపైకి దించి హనుమ తన స్వామి రఘునాథునికి సాష్టాంగనమస్కారం చేశాడు. రఘురాముడు ఆసనం నుండి పైకిలేచి హనుమంతుని లేవనెత్తి హృదయానికి హత్తుకొని తన కన్నీటితో హనుమంతునికి అభిషేకం చేశాడు. తన స్వహస్తాలతో హనుమ ముఖాన్ని అప్యాయంగా నిమిరాడు. ఇంతలో సుషేణుడు పర్వతానికి నమస్కరించి, మంత్రించిన అక్షతలను ఔషధంపై వేసి నాలుగు తీగలు గైకొని వేగంగా నాలుగు పాత్రలనిండుగా రసం పిండి లక్ష్మణుని చెంతకు పరుగున వెళ్ళాడు. ఆ సంజీవని రసాన్ని సగం నోట్లోపోసి మిగతా గాయాలకు చక్కగా రాసాడు. దాంతో గాయాలు మాయమయి సంపూర్ణకాంతితో లక్ష్మణుడు దివ్యదేహుడయ్యాడు. నిద్రలోనుండి లేచినట్టు అకస్మాత్తుగా లేచి సౌమిత్రి నిలబడి ఆకర్ణాంతం సారించిన బాణంలా పరుగెత్తి రావణుడెక్కడ? నా బాణంతో చూర్ణం చేస్తాను అంటూండగా రఘురాముడు వారించి, లక్ష్మణుని ఆలింగనం చేసుకున్నాడు. అందరూ జయజయ ధ్వానాలు చేశారు. దేవతలు పూలవర్షం కురిపించారు. సుషేణుడు మిగతా వానరులను కూడ సజీవులను చేశాడు. సగరుని ఉద్ధరించటానికి గంగను భగీరథుడు భూమిపైకి తెచ్చినపుడు అసంఖ్యాకమైన జీవరాసులు ఉద్ధరించ బడ్డట్టు, చక్రవాకం కొరకు సూర్యుడు పరుగులిడగా సర్వత్రా వెలుగు నిండినట్టు, చకోరం కోసం చంద్రుడుదయించగా ఓషధులన్నీ రసభరితమయినట్టు, చాతకం కొరకు మేఘం వర్షించగా సర్వజగత్తు



ఆనందించినట్టు, పెళ్ళికొడుకు పంక్తిలో పెళ్ళివారంతా తృప్తి పొందినట్టు, సౌమిత్రికోసం తెచ్చిన సంజీవని చనిపోయిన మిగతా వానరులకంతా ఉపయోగపడింది. మారుతి ధైర్యసాహసాలను ఏకధాటిగా రాముడు వర్ణించగా, ఇంద్రాది దేవతలు విమానాలలో నుండి మారుతి కీర్తిని గానం చేశారు. పర్వతాన్ని తీసుకుని మారుతి తిరిగి వెళ్ళాడు. సౌమిత్రి సజీవుడైనాడని రావణాసురునికి తెలిసింది. నూరుగురు రాక్షసులను ఎంపికచేసి వారితో రావణుడు ‘ఆ మారుతిని అడ్డగించి ద్రోణాచలాన్ని బలవంతంగా తీసుకురండి’ అని చెప్పిపంపించాడు. ఆ రాక్షసులు మారుతిని వెంబడించి వానరా! పర్వతాన్ని విడిచిపెట్టు అని కేకవేశారు. మారుతి పర్వతాన్ని ఒకచేత్తో పట్టుకొని, కాళ్ళతో బాది నూరుగురిని చంపి ద్రోణాచలాన్ని స్వస్థానంలో ఉంచి తిరిగి త్రికూటపర్వతం చేరగా అప్పుడు సూర్యోదయమయింది. సూర్యకులభూషణుని చరణకమలములకు నమస్కరించి, చేతులు జోడించి హనుమ నిలబడ్డాడు. నందిగ్రామంలో జరిగిన విషయమంతా రఘుపతికి నివేదించాడు. భరతుడు బాణం వేసి నన్ను ద్రోణాచలంతో సహా పడద్రోసాడు. నేను ఒక్క క్షణం చికాకు పడగా, పరమప్రతాపవంతుడైన భరతుడు నాతో సహా పర్వతాన్ని బాణాగ్రంలో స్థాపన చేసి క్షణంలో త్రికుటాచలానికి చేర్చటానికి సిద్ధపడ్డాడు అని విన్నవించగా వానరులంతా ఆశ్చర్యచకితులయ్యారు. అందరూ ప్రేమగా రావణుని వధానంతరం భరతుని కలుసుకోవటానికి కుతూహలపడ్డారు. హనుమ రామపాదాలకు నమస్కరించి ‘స్వామీ! భరతుని భక్తి అపారం. అతడు ప్రేమమూర్తి. వైరాగ్యఖని, అద్భుతజ్ఞాని, చకోరం చంద్రునికై ఎదురుచూసినట్టు మీరాకకై ఎదురు చూస్తున్నాడు. వనంలోకి వెళ్ళిన ఆవు కోసం దూడ ఎదురుచూసినట్టు, చాతకం గొంతెత్తి వర్షపు చినుకుకై వేచిఉన్నట్టు, సకల భోగభాగ్యాలను త్యజించి అహోరాత్రాలు మీ దర్శనం కోసం ఎదురుచూస్తున్నాడు’ అని మారుతి తెలుపగా ఆంతర్యంలో ఆత్మారాముడు సంతోషించాడు.


రామవిజయగ్రంథం సుందరమైనది. అది ఉదారమైన కల్పతరువువంటిది. దృష్టాంతాలనే పండ్లతో నిండుగా విరాజిల్లుతుంది.

శ్రీధరవరదా! ఆదిపురుషా! శ్రీమద్భీమాతట విలాసా! బ్రహ్మానందా! పండరీశా! నిన్ను సదా భజిస్తాను. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. సదా చతురులైన శ్రోతలు ఆలకిస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**ముప్పది రెండవ అధ్యాయం మధురం**



**అధ్యాయము - 33**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**సూ**ర్యకులభూషణుడు, జానకీ నేత్ర సరోజాలకు సూర్యునివంటివాడు, స్కందుని తండ్రికి మిత్రుడు, సూర్యకులోద్ధారకుడు, బ్రాహ్మణ శ్రేయోభిలాషి, సౌమిత్రాగ్రజుడు శ్రీరాముడు భక్తమానస చకోర చంద్రుడు, త్రివిధతాపాలను నశింపచేసేవాడు, ఆనందసముద్రుడు, భరతహృదయారవింద భ్రమరమైనవాడు, భవభయహరుడు, రాజీవాక్షుడు, ముముక్షువులనే చాతకాలకు మేఘంవంటివాడు. సకలకళాతీతుడు, అనంగుడు, ఆనందమయుడు, నిర్మలుడు, నిస్సంగుడు, అక్షయుడు, అభంగుడు, నిశ్చింతుడు, రణరంగ ధీరుడైన ఆ రఘునందనునికి ప్రణతులు.

### రావణహోమవిధ్వంసం

ముందు అధ్యాయాన్ననుసరించి హనుమంతుడు ద్రోణాద్రిని తెచ్చి సౌమిత్రిని కాపాడాడు. తరువాత విభీషణుడు రామునితో 'రణరంగానికి రావణుడు రాలేదు. ఇంద్రజిత్తువలె రహస్యంగా ఏదో యజ్ఞం చేస్తున్నాడు. ఆహుతుల పరిమళాలు గుబాళిస్తున్నాయి. ఆకాశమంతా పొగలు వ్యాపించాయి. అగ్నిలో నుండి ప్రకాశవంతమైన రథం సగం బయటకు వచ్చింది. పూర్ణాహుతి అయితే రథం సంపూర్ణంగా వెలువడుతుంది. ఆ యజ్ఞం పూర్తి కాకముందే అక్కడికి వెళ్ళి యాగాన్ని సర్వనాశనం చేయాలి' అంటూ పదిమంది కపివీరులను ఆయత్తం చేశాడు. వారు వరుసగా నలుడు, నీలుడు, జాంబవంతుడు, అంగదుడు, హనుమంతుడు, గవయుడు, గవాక్షుడు, గంధమాదనుడు, శరభుడు, కేసరి, పావకలోచనుడు. అందరూ రఘువీరునికి నమస్కరించి బయలుదేరారు. ఆ పదిమంది క్షణంలో దశదిశలు జయించి

రాగల ధీరులు. వెంటనే ఆకాశంలోకి ఎగిరి దశముఖునిపైకి దండెత్తారు. పక్షి ఆకాశంలో ఎగిరినట్టు ఎగిరి క్షణంలో వారు లంకను చేరి రావణునికై ప్రతి ఇల్లూ శోధించారు. కనబడ్డ రాక్షసులనెల్లా రావణుడెక్కడ ఉన్నాడో వెంటనే చూపమని చావబాదారు. లంకంతా శోధించినా రావణాసురుని జాడ తెలియలేదు. ఆ సమయంలో విభీషణుని భార్య సరమ ఆ రహస్యప్రదేశాన్ని చూపించింది. గట్టి రక్షణ గల గుహలో దురాచారి, కపటియైన రావణుడున్నాడని తెలిపింది.

ఆ మాటలు విన్నంతనే వానరులు ఆ గుహకు అడ్డంగా వున్న రాతిని పగులగొట్టి మార్గాన్ని సుగమం చేశారు. అక్కడ కాపలా వున్న రాక్షసులందరిని క్షణంలో వధించి వానరగణాలు లోనికి ప్రవేశించాయి. విస్తీర్ణమైన ఆ గుహలో ప్రచండమైన శివాలయం దానిముందు దివ్యంగా ప్రజ్వరిల్లుతున్న హోమగుండంలో దశముఖుడు కళ్ళుమూసుకుని ఆహుతులు సమర్పించసాగాడు. చుట్టూ రక్త, మద్యమాంసాల రాసులు పర్వతాల్లా వున్నాయి. అసంఖ్యాకంగా కంకాళాలు పడిఉన్నాయి. రక్తస్నానం చేసి లంకానాథుడు వజ్రాసనంలో ఆసీనుడై వున్నాడు. సంపూర్ణంగా కులక్షయమైనా జయం పొందాలన్న పట్టుదలతో అతడు చేసే ప్రయత్నాన్ని చూచి వానరవీరులు ఆశ్చర్యచకితులయ్యారు. పెనుశిలలు గైకొని వానరులు హోమగుండాన్ని, సకల సామగ్రిని, యజ్ఞపాత్రలను విధ్వంసం చేశారు. అయినా రావణునికి బాహ్యప్రజ్ఞ కలగలేదు. రావణుని వస్త్రాలన్నీ చింపి అతడిని నగ్నం గావించారు. దశముఖాలకు మట్టిని పూసారు. ఒకరు మర్మాంగాలపై రాళ్ళతో కొట్టారు. ఒకరు వక్షఃస్థలంపై బాదారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా రావణునికి స్పృహ రాలేదు.

వెంటనే అంగదుడు రాణివాసానికి ఎగిరి వెళ్ళి ఉన్నఫళంగా మండోదరిని ఎత్తుకొని రావణుని వద్దకు తెచ్చాడు. పరమ సుందర సుకుమారమైన రావణుని



రాణియైన మండోదరిపై వానరులు లంఘించి చీర, రవికలతో సహా సర్వాలంకారాలనూ నుగ్గునుగ్గు చేశారు. మండోదరి రావణునితో 'నీ అనుష్ఠానం తగలబెట్టనా! నీ భార్యను వానరులు చిత్రహింసలుపెట్టినా నీకు సిగ్గుగా లేదా?' అని ఆక్రోశిస్తుండగా వానరులు ఆ పతివ్రతను నగ్నంగా చేసి రావణునిపై తోశారు. దారుణమైన ఆమె ఆక్రందనలకు రావణుడు కళ్ళు తెరిచాడు. హోమమంతా విధ్వంసం చేసారని మండోదరి చెప్పగా, లంకాపతి కోపంతో తటాలున లేచి వానరుల మీదికురికాడు. చాలామంది వానరుల కాళ్ళు పట్టుకొని నేలకేసి బాదాడు. అంగదమారుతులకు అనేకమైన ముష్టిఘాతాలిచ్చాడు. వానరులంతా సువేలాచలానికి తిరిగి వచ్చి రావణుడు యుద్ధానికి ఆయత్తమై వస్తున్నాడని చెప్పారు. రఘువీరుడు సభను చాలించి త్వరగా విడిదిని సారించి ఈ రోజుతో మండోదరి సౌభాగ్యం ముక్కలయిందన్నాడు.

లంకలో రావణుడు మండోదరిని సమాధానపరచి వస్త్రాభరణాలిచ్చి, హృదయానికి హత్తుకున్నాడు. 'దారుణమైన ప్రారబ్ధాన్ని అనుభవించకుండా తప్పించుకోలేము. అందువల్ల జరిగిందానికి విచారించక అంతఃపురానికి వెళ్ళమని అనునయించాడు. నేను ఈ రోజు అంతిమ యుద్ధం చేయబోతున్నాను. శత్రుసంహారం చేసి వారి శిరస్సులను తెస్తాను. లేకపోతే ప్రియే! ఇదే మన చివరి కలయిక' అని చెప్పి మండోదరిని మందిరానికి పంపి గుహలో నుండి బయటకు వచ్చి కోపోద్రిక్తుడై ఏకధాటిగా రణభేరి మ్రోగించాడు. రణాతురులైన మిగిలిన రాక్షస దళాలు మిగిలినవారినందరిని వెంటబెట్టుకుని, ముందు కాల్బలము నడువగా, వెనుక అశ్వదళాలు అనుసరించాయి. వాటివెనుక అంబారీతో సహా మదగజాలు, ఆ వెనుక రథాలు సాగిపోయాయి. వందిమాగధులు రావణుని బలపరాక్రమాలను గానం చేస్తుండగా మెరుస్తున్న ఛత్రచామరాలతో లంకాధిపతి రథంలో ఆసీనుడై వున్నాడు.

రావణుడు రణప్రియుడే కానీ ఈ రోజు ముక్తికాంతకై పరుగులిడుతున్నాడు. పరివారమంతా ముందు సాగిపోగా మిగిలిన వారందరినీ కూడా తీసుకునివెళుతున్నాడు. తన తదనంతరం సోదరుడైన విభీషణుడు లంకా రక్షణ గావిస్తాడన్న నమ్మకంతో రణభూమికి రావణుడు వాయువేగంతో తరలివెళ్ళాడు. వానరాలు పరుగున శిలలు, పర్వతాలు, వృక్షాలు గైకొని ప్రళయకాలంలోని వర్షధారలా కుండపోతగా కుమ్మరించారు. పది ధనుస్సులకు బాణాలు సంధించి రావణుడు వదలగా, పర్వతాలు తునాతునకలై సైన్యం ఆవలపడ్డాయి. ప్రచండ పరాక్రమవంతుడైన రావణుడు వేసిన బాణాలకు వానరులంతా మరణించారు. ఇది గమనించి రఘునాథుడు క్షణంలో రావణుని ముందు నిలిచాడు. రఘురాముడు రావణునితో 'మలినా! శతమూర్ఖా! పామరా! దొంగతనంగా సీతను తీసుకొచ్చి అనవసరంగా కులక్షయం గావించావు. సంతతి, సంపత్తి, విద్య, ధనం అన్నీ వదలుకుని, వేదాలను ధిక్కరించి, గాడిదకు గంధం పూసినట్టు నీ జ్ఞానం ఎందుకూ కొరగాకుండా పోయింది. రావణా! ఈ రోజు యుద్ధంలో నిన్ను తునాతునకలు చేసి రాబోయే అవతారంలో నీకు తప్పక ముక్తిని ప్రసాదిస్తాను. నీ ప్రాణం తీయటానికి నా బాణం వస్తున్నది కాచుకో' అన్నాడు. బదులుగా దశకంఠుడు ఇలా జవాబిచ్చాడు. 'నీవు శ్రీరామచంద్రుడంటున్నావు. అయితే నేను భయంకరమైన రాహువును. మానవా! ఈ రోజు యుద్ధంలో నిన్ను సంపూర్ణంగా కబళిస్తాను. నేను బాణం వదిలితే మేరుమందరాలే నుగ్గునుగ్గవుతాయి. నీవు సుకుమారుడవు. మానవుడవు. నీ ధైర్యసాహసాల గురించి ఆలోచించాల్సిందేముంది? సీత అత్యంత సౌందర్యవతి. అరణ్యాలలో కష్టపడుతున్నదని నేను తెచ్చాను. తిరిగి నీవు పొందడం అసంభవం. సూర్యుడు పశ్చిమాన ఉదయించడం, దోమ భూమిని ఎత్తడం, ఏనుగు తలపైనున్న ముత్యాన్ని నక్కకు భయపడి సింహానికి ఇచ్చివేయడం, రాళ్ళతో కొట్టినందువలన సుడిగాలికి బాధకలగడం, గరుడుడు సర్పాలను శరణుకోరడం, చీమలు అగ్నిని మ్రింగివేయడం ఇవన్నీ ఒకవేళ సంభవం కావచ్చునేమో కానీ, నీకు మాత్రం జానకి కనబడటం అసంభవం' అని ఆకాశంలో మేఘంలా రావణుడు గర్జించాడు. బదులుగా రఘువీరుడు 'దశకంఠా! నీకు మరణకాలం ఆసన్నమై దారి తప్పావు. నా బాణం తిరుగులేనిది. ఈ రోజు యుద్ధంలో నీవు రామబాణ ధాటిని తెలుసుకొంటావు' అంటూ ప్రచండమైన కోదండాన్ని చేపట్టి రాముడు టంకారం చేశాడు.



పరమపరాక్రమవంతులైన వీరులిరువురూ ప్రచండమైన యుద్ధం చేశారు. రణాతురులైన వీరులందరూ అపారంగా ఒక వ్యూహం ప్రకారం మోహరిల్లారు. ఆ భీకర సంగ్రామానికి భూమికూడా అనుక్షణం కంపించింది. కాగడాల వెలుగులో ఉభయుల ధనుస్సులు, రాజముద్రికలు మెరుపుల్లా మెరుస్తున్నాయి. రావణుడు భుజంగాస్త్రం ప్రయోగించగా అన్ని దిక్కుల నుండి పాములుద్భవించి కపిసైన్యం మీదకు రాసాగాయి. దట్టమైన మేఘసముదాయంలా సర్పాలు సర్వం వ్యాపించాయి. అది గమనించిన రఘురాముడు గరుడాస్త్రాన్ని సంధించాడు. వెంటనే భూమి, ఆకాశాల్ని చీల్చుకొని అసంఖ్యాకమైన గరుడపక్షులు రివ్వున వచ్చి సర్పాలనన్నింటినీ భక్షించాయి. సర్ప సంహారం పూర్తి కాగానే గరుడపక్షులు కూడా మాయమయ్యాయి. మూర్ఖులు పండితుని ముందు తమ వాచాలత్వం ప్రదర్శించినట్లు రావణుడు ఆగ్నేయాస్త్రాన్ని సంధించగా రాముడు పర్వతాన్ని అడ్డుపెట్టి ఆ ప్రభంజనాన్ని ఆపివేశాడు. రావణుడు వజ్రాస్త్రంతో ఆ పర్వతాన్ని ఛేదించి అసంఖ్యాకంగా శస్త్రజాలాన్ని ప్రయోగించగా అయోధ్యానాథుడు ఆ శరపరంపరను ఒకే బాణంతో నేలకూల్చాడు. రావణుడు సూర్యాస్త్రాన్ని సంధించి, రాఘవునిపై విడిచాడు. రాముడు బాణాన్ని సంధించేంతలో ఆ బాణం శ్రీరాముని చరణాలకు తగిలి ఆవలివైపుకి దూసుకెళ్ళిపోయింది. రాముని పాదాలు సుకుమారమైనవి. ఆ శస్త్రం రాముని వామపాదం తాకి వెళ్ళడం చూచి వానరులంతా ఒక్కసారిగా

పైకిలేచి యుద్ధభూమిలో పడిఉన్న శస్త్రాలను గైకొని అకాలమృత్యువులా దాడిచేశారు.

పరమార్థాన్ని పొంది జ్ఞానులు ప్రాపంచిక సుఖాలను కాలదన్నినట్లు, నిర్మలులు, రామోపాసకులైన వానరులు రాక్షసులందరినీ నిర్మూలించారు. అవధులు లేని అహంకార మకుటాన్ని పరమార్థ బాణం బూడిద చేసింది. త్రయావస్థలనే అంతులేని కవచాలను సూర్యఖడ్గాలు ముక్కలు చేసాయి. సమవృత్తి శస్త్రాలను చేబట్టి ద్వేష ధనుస్సులను సంపూర్ణంగా తుత్తునియలు చేశారు. నైరాశ్యచక్రాలతో లోభం అనే పొట్టును ఆకాశానికి ఎగురగొట్టారు. ఆత్మసాక్షాత్కార బాణాలు సిద్ధి పతాకాలను పూర్తిగా ఖండించాయి. బోధ పరశువు మోహ ధ్వజాన్ని ఛేదించింది. అనుసంధాన పరిఘను గైకొని అవిద్యా రథాన్ని చూర్ణం చేశారు. అభేదాస్త్రం వదలి ద్వైతరథాంగాలను ఛేదించారు. నివృత్తి అస్త్రంతో ప్రవృత్తి శస్త్రాలను చూర్ణం చేశారు. విరక్తి గదను చేబూని కామకుంజరాన్ని అణగద్రొక్కారు. ముందు నడిచే క్రోధ, మద, మత్సర అహంకారాలనే కాల్బలాన్ని శమదమాస్త్రాలతో నుగ్గునుగ్గు చేశారు. సంకల్పం, ద్వేషం, కుటిలత్వం అనే అసురుల అశ్వాలను సమాధానమనే ప్రబలమైన శక్తులతో విచ్ఛేదించారు. ఆశ, కోరిక, కామనలు, మోహం దారుణంగా పైకిరాగా మనోజయమనే డాలుతో రామభక్తులడ్డుకొంటున్నారు. ఆ విధంగా వానరులు విపరీతంగా అసురదళాలను అణచివేశారు.

రావణుడు శర సముదాయాన్ని ప్రయోగించాడు గాని మాయ అతడిని కప్పివేసింది. కొండమీది మేఘంలా రావణుడు రథారూఢుడు కాగా నేలపై అయోధ్యానాథుడు అచంచలంగా వున్నాడు. అది గమనించి వాచస్పతి ఇంద్రునితో 'రాజాధిరాజు, త్రిభువనేశ్వరుడు, గుణ సముద్రుడు, ఉదారుడు, ధీరుడు అయిన శ్రీరామచంద్రుడు సీతను తీసుకుపోవడం నిమిత్తమాత్రమే అని తెలిసి కూడా మనలను బంధవిముక్తులను చేయడానికి యుద్ధం



చేస్తున్నాడు. ఈ సమయంలో వెంటనే వారికి మీ రథాన్ని పంపవలసింది' అని సూచించాడు.

సారథ్యంలో నిపుణుడైన మాతలిని తత్క్షణమే పిలిపించి సహస్రనయనుడు ఇలా అన్నాడు. 'శస్త్రాస్త్రాలన్నీ నింపి, దివ్యాశ్వాలను పూన్చి తళతళలాడే నా రథాన్ని వెంటనే త్రికూటపర్వతం వద్దకు తీసుకుని వెళ్ళవలసింది.' అనుమతి గైకొని నమస్కరించి వెంటనే మాతలి వేగంగా వెళ్ళిపోయాడు. కన్నుమూసి కన్ను తెరిచేంతలో రథం రాముని వద్దకు వచ్చింది. మాతలి రథం దిగి శ్రీరామునికి ప్రణామం చేసి 'రాజీవాక్షా! తమాలనీలా! తమరు రథాన్ని అధిరోహించి యుద్ధం చేయవలెనని దేవేంద్రుడు తన రథాన్ని పంపాడు, నా పేరు మాతలి. యుద్ధభూమంతా రథంలో త్రిప్పగలను' అని పలుకగా విని జగదాత్మయైన రఘువీరుడు ఎంతో ఆనందించాడు. ఆకలిగొన్న వానికి సమయానికి అన్నం పెట్టినట్లు, దప్పికగొన్నవానికి చల్లని నీటినిచ్చినట్లు, రోగికి మేలిమి మందు దొరికినట్లు, మరణించేవానికి అమృతం దొరికినట్లు, దరిద్రునికి ధనం లభించినట్లు, యుద్ధంలో సహాయం లభ్యమైనట్లు పురందరుడు సమయోచితంగా స్యందనాన్ని పంపాడు. అతడి జన్మ ధన్యమైంది. ఉదయాచలంపై సూర్యుని వలె, సుపర్ణునిపై నారాయణునివలె, జగద్వంద్యుడు, దశరథతనయుడైన రఘురాముడు రథానికి ప్రదక్షిణ చేసి నేర్పరియైన సారథి మాతలి ముందు కూర్చుని ఉండగా రథాన్నధిరోహించి యుద్ధభూమికి తరలి వెళ్ళాడు.

రఘురాముడు రథాన్నధిరోహించటం చూచి వానర సైన్యమంతా ఆనందించింది. సంపూర్ణంగా రామునికి చేయూతనిచ్చిన శచీపతి జన్మ ధన్యమైందని కొనియాడారు. శ్రీరామునికి దేవేంద్రుడు రథాన్ని పంపటం చూచి లంకానాథుడు అపరిమితమైన కోపంతో పళ్ళు కొరికాడు. రాజహంసను చూచి కాకి కుమిలినట్లు, భాగ్యవంతుని చూచి దుర్జనులకు అమితమైన

ద్వేషం రగిలినట్లు, మహాత్ముల మహిమలు చూచి పతితులు ఓర్వలేనట్లు, శివప్రతిమను కళ్ళారా చూచి మ్లేచ్ఛులు దుఃఖించినట్లు, హరికీర్తన విని భూతప్రేతాల మనస్సు విరిగిపోయినట్లు రాముని రథాన్ని చూచి రావణుడు క్షోభిల్లాడు. ఇంద్రజిత్తు యుద్ధంలో మరణించాడన్న వార్త కంటే, మండోదరిని వానరగణాలు పరాభవించిన దానికంటే రావణునికి ఆ రథాన్ని చూచి ఎక్కువ దుఃఖం వాటిల్లింది. ఆ విధంగా విపరీతమైన కోపంతో రావణుడు బాణం వెంట బాణం వదలగా రాముడు గురి తప్పకుండా అన్నింటిని తునాతునకలు చేశాడు. సింహాలవలె ఇద్దరూ హాహాకారాలు చేస్తూ దారుణంగా యుద్ధం చేశారు. ఒకరపైనొకరు వేసుకున్న బాణాలు మంటపంలా తయారయ్యాయి. ఆ యుద్ధం చూచి ముల్లోకాలు భీతిల్లాయి. ఆ బాణధాటికి ఆకాశం అగుపడకుండాపోయింది. దేవతలు విమానాలు వదిలి పారిపోయారు. అద్భుతమైన బాణధాటికి సూర్యచంద్రుల గమనం ఆగిపోయింది. గాలి చొరబడడానికి కూడా అక్కడ వీలులేదు. మేఘాలు రక్తాన్ని వర్షించాయి. నక్షత్రాలు త్వరత్వరగా రాలిపోయాయి. విపరీతమైన మెరుపులతో భూమి కంపించింది. సప్తపాతాళాలు తల్లడిల్లాయి. శేషకూర్మాలు కూడా కలవరం చెందాయి. వారిరువురి యుద్ధం చూసి రాక్షస, వానర సైన్యాలు కూడా భయకంపితులయ్యాయి. ఒకరు కాలుడైతే మరొకరు మహాకాలుడు. ఒకరు దావాగ్ని అయితే మరొకరు బడబాగ్ని, క్రోధంతో ఇరువురూ భూమండలాన్ని మ్రింగివేయాలనుకొంటున్నారు. అక్షరక్రమాన్ననుసరించి పండితులు వేదాధ్యయనం చేసినట్లు రఘునాథుని బాణాలు వరుసక్రమంలో అతివేగంతో సాగిపోయాయి. రథాలు రెండూ పెద్ద పెట్టున శబ్దం చేస్తూ ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. గుర్రాలు గుర్రాలతో, తలపడి రెండుకాళ్ళపై ఎదురుగా నిలబడ్డాయి. సారథి సారథితో తలపడ్డాడు. ఇరుపక్షాలలో ఆవేశం అమితంగా ఉంది. ఇరువర్గాలు కల్లోల పూరితులై హాహాకారాలు చేస్తున్నాయి. పండితులు



అవిశ్రాంతంగా వాదిస్తూ వాదన నుంచి ఒక్కక్షణం పక్కకు వెళ్ళినట్లు, పరమచతురుడైన సారథి రథాన్ని పక్కకు తిప్పి మళ్ళీ ముందుకు దూకిస్తున్నాడు. వర్షం తగ్గి, తిరిగి మరల జోరుగా కురిసినట్లు, రథం ముందుకు సాగగానే బాణవృష్టి మొదలయింది. సముద్రం పోటెత్తినప్పుడు అలలు ఒడ్డుకు విరుచుకపడ్డట్లు, రథికులు ఒకరిపైనొకరు సంధించుకొన్న బాణాలు ఉవ్వెత్తున పడుతున్నాయి. ముందుకు విరుచుకుపడ్డ అల వెనుకకు వెడుతున్నట్లు, రథికుల చాపంలోని అల్లెత్రాడు సంచరిస్తున్నది.

అహోరాత్రాలు ఏడుదినాలపాటు యుద్ధం చేసినా రామరావణులిరువురూ క్షణమాత్రం కూడా విశ్రాంతి తీసుకోలేదు. అకస్మాత్తుగా రాముడు నాలుగు బాణాలు సంధించి వదలగా అవి రథానికున్న గుర్రాలను ఛేదిస్తూ వెళ్ళాయి. వెంటనే రావణుడు క్షణంలో నూతనాశ్వాలను రథానికి పూన్చాడు. అపుడు నరవీరశ్రేష్ఠుడైన రాముడు అర్ధచంద్రబాణాన్ని గైకొని నవగ్రహాలలోని ఆదిత్యునివలె శరాస్త్రం సంధించి మనోవేగంతో వదిలాడు. వెంటనే రావణుడు క్షణంలో అర్ధచంద్రబాణాన్ని ఖండించగా రాముడు తీక్ష్ణమైన శక్తిని ప్రయోగించాడు. అది రావణుని హృదయంలో గుచ్చుకుని రావణుని పదితలలను ఖండించింది. కాని వెంటనే పదితలలు యథావిధిగా మొలుచుకొచ్చాయి. వెంటనే రాముడు తిరుగులేని సూర్యముఖబాణాన్ని వదలగా అది రావణుని తలలన్నీ ఖండించింది కాని అవి తిరిగి యథాప్రకారం ఉద్భవించాయి. రావణుని శిరస్సులు పదేపదే వెలువడుతున్నాయే, మరి రావణుడు మరణించేదేట్లా? అని దేవతలు, వానరులంతా చింతాక్రాంతులయ్యారు. రాజాధిరాజైన రఘునాథుడు క్షణకాలం చింతిల్లగా అది గమనించి సారథియైన మాతలి 'అనంతకోటి బ్రహ్మాండనాయకా! సకలచిత్త పరీక్షకా! మొదట అమృత భాండాన్ని పగలగొట్టు. తలలన్నీ నేలరాలుతాయి' అని సలహా యిచ్చాడు. మాతలి మాటలపై గౌరవంతో జనకజామాత అగస్త్యదత్తమైన బాణాన్ని గైకొని త్వరగా వదిలాడు.

## రావణసంహారం

దేవతలలో ఇంద్రునివలె, పక్షులలో గరుడునివలె, పాములలో ఆదిశేషునివలె, వానరులలో హనుమంతునివలె, శాస్త్రాలలో వేదాంతంవలె, నక్షత్రాలను మాయంచేసే ఆదిత్యునివలె, శస్త్రాలలో సుదర్శనంవలె, తీర్థాలలో ప్రయాగవలె, నక్షత్రాలలో చంద్రునివలె ఆ బాణం అతి సమర్థవంతమైనది. శేష, కూర్మ, వరాహాలు, ధరణీ, సప్తసముద్రాలు, సూర్యచంద్రులు వీరందరూ వారి వారి శక్తిని ఆ బాణంలో నియమించారు. అగ్ని, వాయువు, ఇంద్రుడు, సూర్యుడు, కుబేరుడు, యముడు, వరుణుడు, దేవఋషులు తమ సామర్థ్యాన్నంతా ఆ బాణాగ్రాన ఉంచారు. ఆ బాణాన్ని తూణీరంనుండి వెలికితీయగానే సహస్ర సూర్యప్రభలు భూమండలమంతా వ్యాపించాయి. ఆ వెలుతురు చూడలేక అందరి కళ్ళు నేలవాలాయి. బాణముఖంలో బ్రహ్మాస్త్రాన్ని స్థాపించి రాజీవనేత్రుడు శరాన్ని వింటికి సంధించాడు. సీతాపతి ఆ బాణాన్ని ఆకర్ణాంతం సారించి వదలగా, జనులందరికీ కల్పాంతమే వచ్చిందా అన్నట్లుగా ఉంది. అత్యంత తేజోరాశియైన ఆ బాణధాటికి శశి, సూర్యులే లుప్తమయినారు. దేవతలంతా విమానాలలో పారిపోయారు. నీళ్ళులేని కుండ ఊగినట్టు భూమి ఊగిసలాడగా ప్రచండవీరులంతా మూర్ఛిల్లారు. ఆ బాణం జగద్వంద్యుని చెవిలో 'స్వామీ! నేను దశకంఠుని ప్రాణాన్ని అమృతభాండంతో సహా తీసుకొనివస్తాను' అని పలికింది. వెంటనే రావణుని వక్షఃస్థలానికి గురిపెట్టి తమాలనీలుడు బాణం వేయగా బ్రహ్మాండమంతా ఆనందంతో ఉప్పొంగింది. అసంఖ్యాకమైన మెరుపులు ఒక్కసారిగా ఫెళఫెళారావాలతో మెరిసినట్లు ఆ బాణం రావణుని హృదయంలో సంచరించి భాండంతో సహా వక్షఃస్థలాన్ని ముక్కలు చేసింది. హృదయం ఛిద్రమై విశాలమైన సింహద్వారం వలెనున్న రావణుని శరీరం క్రిందపడిపోయింది. వెంటనే బాణం మూడుతలలను ఖండించి తిరిగి రాముని తూణీరంలోకి వెళ్ళిపోయింది. మిగిలిన తలలు



కూడా ఛేదించటానికి రఘునాథుడు బాణం తీయబోగా లక్ష్మణుడు 'స్వామీ! యుద్ధం అయిపోయింది. నీ బాణం తాకకముందే రావణుని ప్రాణం పోయింది. ప్రేతాన్ని చూడటానికి జనమంతా పోతున్నారు' అని ప్రార్థించాడు.

తూణీరంతో సహా ధనుస్సును సౌమిత్రికిచ్చి రాముడు నేటితో తన అవతారకార్యం ముగిసిందన్నాడు. సర్వత్రా జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. దేవతలంతా జయభేరులు మ్రోగించారు. దుందుభుల నాదాలతో బ్రహ్మాండమంతా దద్దరిల్లింది. గంధర్వ, కిన్నర గణాలన్నీ పరుగున త్రికూటాచలం వచ్చి రఘుపతిపై అద్భుతమైన పుష్పవృష్టి కురిపించాయి. రాముడు రావణుని వధించాడని తెలిసి ముల్లోకాలు ఎంతో ఆనందించాయి. ఋషీశ్వరులంతా సంతోషించారు. వానరులంతా ఆనందంతో నాట్యం చేశారు. రాముని చుట్టూ వున్న వీరులందరూ సమూలంగా పెకలింపబడ్డ మహావృక్షంలా పడివున్న రావణుని చూడటానికి వెళ్ళారు. ముఖంపై గద్దలు కూర్చుని రావణుని కళ్ళు పీకుతున్నాయి. రక్తం నలువైపులా వరదలై కారిపోతున్నది. ముఖమంతా మట్టిగొట్టుకొని మకుటం నేలపై పడిఉన్నది.

ఆ స్థితిలో అందరూ రావణుని పరికిస్తుంటే విభీషణునికి దు:ఖం పొంగిపొర్లింది. నేలపైబడి రెండు చేతులతో గుండెలనదుముకొంటూ 'నీవు గతించిన తరువాత దిక్కులన్నీ శూన్యంగా గోచరిస్తున్నాయి. నీ ప్రతాపం అమోఘమైనది. నీ కోపం బడబానలంతో సమానం. నీ నైపుణ్యం సాగరసమం. వేదాలనే ఖండించినవాడవు. దారుణమైన తపమొనరించి, సంపూర్ణంగా సంతతి, సంపత్తులననుభవించి, దేవతల గర్వమడంచి బందీలుగా చేశావు. నీ కారణంగా ఆదిపురుషుడు రాఘవుడిగా అవతరించాడు. నిర్గుణుని సగుణునిగా చేసి లంకేశుడు అద్భుత కార్యాన్ని సాధించాడు. నిర్వికారుడైన పరమపురుషుని ప్రత్యక్షంగా చూపించాడు. జానకిని తెచ్చి మాకందరికి ఉపకారం చేశాడు. వేదవంద్యుడైన రాజీవనేత్రుని మా ప్రాణమిత్రుని చేశాడు. సుగ్రీవునితో సహా

మాకందరకు రావణుడెంతో మేలుచేశాడు. రావణా! పరబ్రహ్మ, చిత్స్వరూపుడైన రాముడు నీవల్ల అవతారం ధరించి నీ కీర్తిని ఆచంద్రార్కం పెంపొందించాడు' అని విలపించసాగాడు. శ్రీరాముడు విభీషణునితో 'నీవు వివేకమూర్తివి. నశ్వరమైనదాన్ని గురించి ఎందుకు శోకిస్తావు. అంతటా వ్యాపించివున్న ఈ జగత్తు, అంబరం, అన్నీ ఎండమావివలె మిథ్యయే. వంధ్యావల్లీ ఫలంవలె మూలంలోనే అంతా అసత్యం. అండపిండ బ్రహ్మాండం, ఆకారం నశించిపోయేదే. నిరాకారమే సత్యం. మూలంలోనే అశాశ్వతమైన దాన్ని గురించి చింతించటం ఎందుకు?' అని రఘునందనుడు విభీషణుని ఓదార్చాడు. ఇంతలో స్త్రీ జనంతో సహా మండోదరి పరుగున అక్కడకు వచ్చింది. పతి ప్రేతాన్ని కౌగిలించుకుని మండోదరి శోకించుచుండగా మిగతా వేయిమంది స్త్రీలు రోదిస్తూ వక్షఃస్థలాన్ని బాదుకోసాగారు. మండోదరి 'ప్రాణనాథా! నీవు లేక మేమందరము అనాథలము. జయలక్ష్మిని రఘునాథునకు అర్పించి అల్లునిగా చేసుకున్నావు. లంకాగజమస్తకం పైకి రఘునాథకేసరి లంఘించి దివ్యమైన ముత్యాన్ని తీసి యుద్ధభూమిలో పారవేశాడు. సౌభాగ్యనావయైన లంకానాథుడు నేడు అకస్మాత్తుగా మునిగిపోయాడు. వేదభాండారమంతా నేడు యుద్ధభూమిలో వీగిపోయింది.సీత కారణంగా రఘునందనుని లంకకు రప్పించి బాహ్యంగా విరోధం నటిస్తూ ఆంతర్యంలో భజిస్తూ వ్యవహరించావు. పనస చూడటానికి ముళ్ళ మాదిరున్నా లోపల మధురంగా వుంటుంది. అలాగే నీవు బాహ్యంగా విరోధం నటించావు' అంటూ రోదిస్తున్న మండోదరిని అందరూ గుంపుగా చేరి అవలోకించసాగారు.

ఆ సమయంలో విభీషణునితో రాముడు 'మీ అన్నగారి రాణి మండోదరి జ్ఞానఖని, పతివ్రతా శిరోమణి. ఆమెను స్మరిస్తే దోషాలు నశించిపోతాయి. ఈమెను ప్రాతఃకాలంలో స్మరిస్తే పాపులుద్ధరించబడతారు. నీవు ఆమె చేయి పట్టుకొని తన మందిరానికి తీసుకెళ్ళు' అన్న రఘునందనుని మాటలు విని



విభీషణుడు మండోదరి చెంతకు వచ్చి ఆమె చేయి పట్టుకొని 'అమ్మా! మందిరానికి పోదాంపదమ'న్నాడు. మండోదరితో రఘురాముడు 'తల్లీ నీవు జ్ఞానఖనివి. అంతర్ముఖివై అద్వైత జ్ఞానాన్ని పరిశీలించు. అహంకారం తృటిలో నశించేది. ఆత్మస్వరూపం శాశ్వతమైనది. అది తెలిసీ శోకించడం వ్యర్థం అని అనునయించాడు. మయకన్య తేరుకొని శ్రీరామచరణాలకు నమస్కరించి తన మందిరానికి బయలుదేరింది. మండోదరితో సహా మిగిలిన స్త్రీలను విభీషణుడు వారివారి మందిరాలకు పంపేశాడు. అనంతరం అనుమతి గైకొని లంకాధిపతి శరీరాన్ని పవిత్ర సాగర తీరమైన సింధూసంగమంలో ఉంచి, ప్రళయాగ్నిలా చితి పేర్చి రాజకళేబరాన్ని ఉంచారు. స్వయంగా బ్రహ్మ ఏంచేయాలో చెపుతుండగా విభీషణుడు ఉత్తరక్రియలు యథావిధిగా నిర్వర్తించాడు. అటుపిమ్మట విభీషణుడు త్రికూటాచలానికి తిరిగిరాగా లంకలోని ప్రజలు విభీషణుని కలవటానికి విచ్చేసారు. ప్రధాని విద్యుజ్జిహ్వుడు మిగతా రాక్షససైన్యగణం శ్రీరాముని సమీపించి సాష్టాంగపడ్డారు. అగ్ని కట్టెలనన్నింటిని పూర్తిగా కాల్చి భస్మం చేసినట్లు, రావణుడు యుద్ధంలో సంహరింపబడటంతో, సూర్యోదయంతో చీకట్లు తొలగినట్లు, జ్ఞానోదయంతో అజ్ఞానం నశించినట్లు, శత్రుత్వం అంతా అంతరించింది. త్రికూటాచలం వచ్చిన రాక్షససేన మాకు విభీషణుడి ఆనతే ఆధారం అని అన్నారు. వానరులంతా లంకకు విచ్చేసి నగరం నలువైపులా అవలోకిస్తున్నారు.

### విభీషణుని రాజ్యస్థాపన

అనంతరం విభీషణుడు శ్రీరాముని ముందు చేతులు జోడించి మృదుమంజుల స్వరంతో ప్రేమపూర్వకంగా 'రాజీవదళనయనా! పురాణపురుషా! సీతారమణా! బ్రహ్మాండనాయకా! గుణ సంపన్నా! లంకకు రావలసింది. విరించి నిర్మితమైన లంకానగరాన్ని మీరు ఒకసారి తిలకించి సౌందర్యరాశి సీతను ప్రతిగ్రహించి అయోధ్యకు వెళ్ళవలసింది' అని

ప్రార్థించాడు. అందుకు జగద్గురువు, సుహాసవదనుడైన రఘుపతి 'నేను నీకు లంకను దానంగా ఇచ్చాను. అక్కడకు రావడం తగని పని' అన్నాడు. 'కన్యాదానం చేసిన తరువాత ఆ ఇంట్లో భుజించకూడదు. విప్రుడికి దానమిచ్చిన అనంతరం ఆ ఇంటికి ఎన్నడూ వెళ్లకూడదు. సత్పాత్రుడికి గోదానం చేస్తే దాని పాలు తీసుకోరాదు. ఆ విధంగానే లంకకు రావడం జరుగని పని. పైగా భరతుని కలవకుండా నేను మంగళస్నానాలు, నానాభోగాలు, తాంబూల భోజనాదులు స్వీకరించలేను. భరతుని కలిసిన తరువాతే వ్రతం పూర్తవుతుంది' అని సౌమిత్రిని సుగ్రీవుని పిలిచి 'మీరు వానరులతో సహా లంకకు వెళ్ళిరండి. సుముహూర్తం నిర్ణయించి విభీషణునికి పట్టం కట్టండి. బందీలుగా ఉన్న రాజులను దేవతలను విముక్తుల చేయండి. అనేక వస్తువులను రావణుడు బలవంతంగా లంకలో ఉంచాడు. ఎవరివి వారికి తిరిగి ఇచ్చి సంతోషపెట్టండి' అని ఆనతిచ్చాడు రాఘవుడు. వెంటనే సౌమిత్రి, సుగ్రీవుడు లంకకు బయలుదేరారు. విభీషణుడు రామునికి సాష్టాంగ నమస్కారం చేయగా, 'విభీషణా! నీ స్థానం బలి, ధ్రువుడు ఉపమన్యుల సరసన ఉంటుంది!' అని ఆశీర్వదించాడు శ్రీరాముడు. రాఘవుని ఆనతితో వెంటనే లంకకు వెళ్ళి పట్టాభిషేకానికి కావలసిన సామగ్రిని సిద్ధం చేశాడు. మంత్రాలు, వేదఘోషల మధ్య విభీషణుడు సింహాసనాధీశుడయ్యాడు. దివ్యచ్ఛత్రంతో ఎన్నో ఊరేగింపులు చేసి ఉత్సవాలు జరిపారు. సుగ్రీవుని లక్ష్మణుని ఎన్నో వస్త్రాభరణాలతో విభీషణుడు ఆదరించి గౌరవించాడు. వానరసైన్యాలను వస్త్రాభరణాలతో సత్కరించాడు. లంకను కలయజూచిన సుగ్రీవలక్ష్మణులకు తనివి తీరలేదు. మనస్సు ఆహ్లాదమైంది. విభీషణునికి వీడ్కోలు చెప్పి తిరిగి త్రికూటాచలం చేరారు. శ్రీరామునికి విశేషాలు వివరించారు.

**సదాశివబ్రహ్మేంద్రాదులు శ్రీరాముని దర్శించడం**

ఆ సమయాన బ్రహ్మ, రుద్ర ఇంద్రాదులు, ముప్పదిమూడు కోట్ల దేవతలు కలిసి రఘునాథుని దర్శనానికి వచ్చారు. అష్టవసువులు, ఏకాదశరుద్రులు,



మరుద్గణము, ద్వాదశాదిత్యులు, గణ గంధర్వ యక్ష కిన్నరులు సిద్ధ చారణులు అంతా విచ్చేశారు. అష్టనాయికలు, దిక్పాలకులు, ఎనభైఎనిమిదివేల మునిబృందాలు, ఏబదిఆరు దేశాలప్రభువులు రామదర్శనానికి పరుగున చేరారు. సప్తద్వీప నవఖండ ప్రజలు, పాతాళవాసులు, నాగలోకవాసులు, ఉపదేవ కర్మదేవులు త్రికూటాచలం చేరారు. అసంఖ్యాక వాద్య ఘోషతో దిక్కులు పిక్కటిల్లాయి. అందరి నోటా రఘునందనుని చర్చే వినిపించసాగింది. త్రికూటపర్వతంపై దేవతలంతా నలుమూలల నుండి కలిశారు. దేవతల్లో ముఖ్యులైన బ్రహ్మ ఇంద్ర ఈశ్వరులు కూడా ఈ రఘునందనుని చూచి ఎవరికి ఎలా అనిపించిందని మాట్లాడుకోసాగారు. రఘువీరుని చూచి మనస్సులో అపర్ణారమణుడు నా హృదయంలో ఈతని పేరు తలిస్తేనే చల్లబడింది అనుకొనగా బ్రహ్మ రఘుపతిని గమనిస్తూ ఈతడు క్షీరాబ్ధినివాసి జగదాత్ముడైన నా జనకుడు అని భావించాడు. తనను వెన్నంటి రక్షించే రక్షకుడని ఇంద్రుడు తలపోసాడు. కోటి మన్మథుల పిత ఈతడే అని సురగణాలు భావించాయి. భక్తులకు పూర్ణబ్రహ్మంలా గోచరించాడు.

సదాశివుని గమనించగానే సీతాపతి మనసు ఆనందభరితమై, ఆసనం వదిలి పరుగున వచ్చాడు. పాదాలకు అభివందనం చేయగా త్రిపురారి లేవనెత్తి ఆలింగనం చేసుకొన్నాడు. శ్రీరాముడు నీలమేఘశ్యాముడు. త్రిలోచనుడు కర్పూరగౌరుడు. వారి సమాగమం చంద్రబింబంలో మృగచిహ్నంలా అలరారుతోంది. క్షీరాబ్ధిలో నీలవర్ణంతో ఆదినారాయణుడు శోభిల్లుతున్నట్లు, గంగాయమునలు కలిసి కృష్ణవర్ణంగా కనిపించినట్లు, భక్తుల పూజాపేటికలో సాలగ్రామంలా శివ, శ్రీరాముల ఆలింగనం శోభిల్లింది. శ్వేతోత్పలమకరందాన్ని భ్రమరం ప్రీతితో అస్వాదించినట్లు, శివసీతానాథుల ఆలింగనం కనువిందు చేసింది. శివకేశవుల నామాలే భిన్నంకాని వారిరువురికి భేదంలేదన్నట్లు, వారు

ఒక్కటిగా గోచరిస్తున్నారు. అభేద అనామ నిర్గుణ స్వరూపం నుండే సకల సృష్టి జనిస్తుంది.

తరువాత విరించి నా తండ్రి శ్రీమన్నారాయణుడే శ్రీరాముడని తెలిసి హృదయానికి హత్తుకున్నాడు. అటుపిమ్మట దేవేంద్రుడు నమస్కరించగా తప్తకాంచనవర్ణసుందరుడైన రఘుపతి అతణ్ణి ప్రేమతో ఆలింగనం చేసుకున్నాడు. దేవతలనందరిని కైవల్యదాతయైన రఘురాముడు ఆనందంగా కలుసుకున్నాడు. అసంఖ్యాకంగా వున్న దేవతలు, మునులు చిన్నాపెద్దా అందరిని సీతాపతి సముచితరీతిన పలకరించాడు. వాద్యాల ఘోషలో అష్టనాయికలు నృత్యం చేస్తుండగా సకలదేవతలతో సహా రఘురాముడు సభ తీరాడు. వీణ చేబూని నారద తుంబురులు సామగానం చేస్తుండగా రఘువీరుడు సాదరంగా తిలకించాడు.

శ్రీరామవిజయగ్రంథం పావనమైనది. యుద్ధకాండ ఇంతటితో సమాప్తం. ఉత్తరకాండ అగాధమైనది. ముమ్ముందు అవధరించండి. మకుటంపై మణి ప్రకాశంలా, దేవాలయంపై మెరిసే కలశంలా, తేజోవంతమైనది. భోజనంలో పెరుగన్నంలా, శ్రవణం చివర మననంలా, తపాంతంలో పూర్ణఫలంలా, ఉత్తరకాండ రసభరితమైనది. ఆరంభంలో కథ అతిమధురం. జానకీరఘుపతుల కలయిక, రాఘవాజ్ఞను పాలించి హనుమంతుడు జానకిని పిలుచుకొని రావడం మొదలైనవి ఉంటాయి.

ఈ కథ అతి మధురం. శ్రీరామభక్తులు బ్రహ్మానందంలో తేలియాడుతూ ప్రేమ ముప్పిరిగొనగా రామవిజయం శ్రవణం చేస్తారు. శ్రీమద్భీమాతటవిలాసా! బ్రహ్మానందా! గురువర్యా! శ్రీధరుడు త్రికరణశుద్ధిగా నీ పాదాలపై అనన్య శరణాగతి నొందాడు. స్వస్తి!



శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన పండితులు సదా ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది మూడవ అధ్యాయం మధురం**

యుద్ధకాండ సమాప్తం



## అధ్యాయము - 34

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

జగద్వంద్యా! వేదసారా! ప్రణవరూపా! విశ్వంభరా! కరుణార్ణవా! పరమ ఉదారా! రాఘవేంద్రా! శ్రీరామా! నీకు జయము. మన్మథ దహన హృదయ రత్నా! చతురాస్య జనకా! మంగళ భగినీ మనోమోహనా! జగజ్జీవనా! భక్తవరదా! సీతావల్లభా! భయానకమైన శరీర ప్రారబ్ధం వల్ల ఎన్నో ఘోర విఘాతాలు, అనర్థాలు కలుగుతాయి. వాటివల్ల నా మనస్సులో ఎలాంటి దుఃఖం కలగకుండా చెయ్యి. ఓ శ్రీరామా! బోధరూపంలో నా హృదయంలో వుండి శాంతి, క్షమ, దయ, ఉన్మనీలను సదా నా మానస సదనంలో విరాజిల్లజెయ్యి. వివిధ ఆకృతులు, చరాచర సృష్టి అంతా నీ స్వరూపంగా నా కళ్ళకగుపడుతుంది. వాంతిని చూడగానే మనస్సు వికలమైనట్లు నా మనస్సు విషయవాసనల పట్ల రమించకుండా చూడు. శ్రవణ కీర్తనాది నవవిధ భక్తిపరాయణుల సత్సమాగమం నాకు సదా కలిగేటట్లు దీవించు. నీ చరిత్ర, లీలాగానం వింటే ఓ సీతాపతీ! చిత్తవృత్తులన్నీ ఆనందించేటట్లు చెయ్యి. నా మనస్సు, బుద్ధి కాలికి కడియాలు, గజ్జెలుగా నా ప్రేమ పీతాంబరంలా సదా నీ నడుమున విలసిల్లనీ. తాటకా సంహారా! అయోధ్యానాథా! నా స్థూల దేహలింగం నీ పాదుకలుగా విరాజిల్లేట్లు సర్వదా నన్ను ఆశీర్వదించవలసింది. బ్రహ్మానందా! భక్తవత్సలా! నా పంచప్రాణాలన్నీ కర్ణకుండలాలుగా, హారంలోని పతకంలా సదా నీ చెంత ఉండనీ!

### జానకీసతికి రఘుపతి ఆహ్వానం

ఉత్తరకాండ భాగీరథీ సమానం. అందులో అంతర్వాహినిగా సరస్వతి సాగుతోంది. అందులోని దృష్టాంతక్షేత్రాలు ఒకదానికంటె మరొకటి



విశేషమైనవి. గత అధ్యాయంలోని కథనసుసరించి దశకంధరుని వధించి, రఘువీరుడు విజయుడైనాడు. తదుపరి సకలదేవతలు శ్రీరామదర్శనానికి వచ్చారు. దేవతల తాకిడి ఎక్కువై వారి కిరీటాలు ఒకదాన్నొకటి రాసుకొంటున్నాయి. కిరీటాలలోని రత్నాలు దేదీప్యమానంగా మెరుస్తూ నక్షత్రాలకంటె మిక్కిలిగా ప్రకాశిస్తున్నాయి. గంధర్వ, యక్ష, కిన్నర గణాలు, సురాసుర నరవానరులతో సువేలాచలం క్రిక్కిరిసిపోయింది. హనుమంతుడు తన మదిలో రావణుడు హతుడైనా జానకిని త్వరగా తెమ్మని రాముడు ఇంకా ఆజ్ఞాపించలేదేమా! అని అనుకోసాగాడు. అనుక్షణం వాయుకుమారుడు తన ముఖంలోకి తదేకంగా చూస్తుండటం గమనించి అయోధ్యావిహారి యిలా ఆజ్ఞాపించాడు. 'ప్రాణసఖా! హనుమంతా! వెంటనే వెళ్ళి సౌభాగ్య సరిత, గుణ భరితయైన జానకికి విభీషణునితో చెప్పి మంగళస్నానం చేయించి వస్త్రాలంకారాలిచ్చి పల్లకీలో ఇక్కడకు తీసుకురావలసింది'

రాముని ఆజ్ఞ విన్నంతనే హనుమ ఆకాశమార్గంలో త్వరగా వెళ్ళాడు. లేగదూడ అడవిలో తల్లి ఆవును చేరుకొన్నట్లు, మానససరోవరానికి మరాళం వెళ్ళినట్లు, దప్పిగొన్న వాడు నీటి చెలమను చేరినట్లు, ఇందిర దర్శనానికి గరుడుడు గంతులేసినట్లు వెంటనే అశోకవనంలోకి హనుమ ప్రవేశించి జానకీమాతకు సాష్టాంగ ప్రణామంచేశాడు. తప్పిపోయిన పసిబాలుని అకస్మాత్తుగా తల్లి కలుసుకున్నట్లు, పోయిన రత్నం దొరికినట్లు, పోయే సమయంలో నోట్లో అమృతం పడినట్లు మారుతిని చూచి సీత ఎంతో సంతోషించింది. హనుమ చేతులు జోడించి సీత ముందు నిలబడి అయోధ్యానాథుడు సేనాసహితంగా సువేలాచలంలో సుఖంగా ఉన్నాడు. కంటకుడైన దశకంఠుని వధించి విభీషణుని రాజుగా నియమించాడు. బందీలయిన దేవతలను విడిపించగా అందరూ రాఘవుని కలిసారు అని చెప్పగా జగన్మాత 'ఆహా! నీ మాటలు అమృతం కన్నా మధురంగా ఉన్నాయి.

నీవు నిజంగా ప్రాణస్నేహితుడవు. నా కారణంగా ఎంతో శ్రమించావు. అపారమైన నీ మేలు అయోధ్యానాథునికి తెలిసే ఉంటుంది. ఆరునెలలు నేను ఎన్నో కష్టాలననుభవించాను. వెంటనే నన్ను రఘునాథుని వద్దకు తీసుకెళ్ళవలసింది అని అన్నది. ఆ మాట విని హనుమ విభీషణుని మందిరానికి వెళ్ళి సకలం నివేదించి సీతకు మంగళస్నానం చేయించి వస్త్రాభరణాలిచ్చి సువేలాచలానికి తీసుకెళ్ళాలి అని తెలిపాడు. ఆ వార్త విని విభీషణుడు ఆనందించి మారుతి చేయి పట్టుకుని సీతను దర్శించటానికి అశోకవనానికి విచ్చేశాడు. రఘుపతికి ప్రాణప్రియులైన ఆ చిరంజీవులిరువురు జానకి చెంతకు వచ్చారు. విభీషణుడు సాష్టాంగ నమస్కారము చేయగా జగన్మాత 'సూర్యచంద్రులున్నంతవరకు నీవు చిరంజీవివై లంకను పాలిస్తావు' అని దీవించింది. పార్వతి ముందు కుమారస్వామి వలె, రేణుక ముందు పరశురాముని వలె విభీషణుడు చేతులు జోడించి సీత ఎదుట నిలబడి 'జగన్మాతా! ప్రణవ రూపిణీ! సద్గుణ సరితా! అనాదిసిద్ధీ! అపరిమితా! ఆదిమాయా! ఇందిరా! నీవు ఆదిపురుషుని మేల్కొలిపి అనంతబ్రహ్మాండాన్ని సంపూర్ణంగా సృష్టించావు. త్రిమూర్తులు నీ పసిపాపలు. ఆ ముప్పురితో ఉత్పత్తి స్థితి లయలు కావించి నీ ఇచ్ఛ పూర్తికాగానే తిరిగి అందరినీ హస్తగతం చేసుకొంటావు. నీకు సర్వం తెలుసు కానీ వినోదానికి. అమాయకత్వం నటిస్తావు. రావణుడు నిన్ను లంకకు తెచ్చాడంటే అదీ నీ అభీష్టమే! బందీలయిన దేవతలను విడిపించి, మారుతి సుగ్రీవాది వానరులందరినీ, మమ్ములను, రాముని మిత్రులుగా చేసి మాకెంతో మేలు చేశావు. ఇపుడు మంగళ స్నానంచేసి వస్త్రసాభరణాలు ధరించి త్రికూటపర్వతంలోని రఘునందనుని దర్శనానికి త్వరగాపోదాం' అని విన్నవించాడు. బదులుగా జగన్మాత 'రాముడు మంగళస్నానం చేయకుండా నేను చేస్తే ఎంతో పాపం కలుగుతుంది. పతి లేకుండా ఏ పనీ చేయకపోవడం పతివ్రతా ధర్మం. రఘుపతి ఆజ్ఞ లేకుండా ఏమిచేసినా అది అధర్మమే' అని చెప్పింది.



మారుతి, 'జగన్మాతా! రఘునాథుడు ఆనతిచ్చాడన్నాడు. మరల రెండవసారి విభీషణుడు పలికిన పలుకులను గౌరవించి జానకి అవశ్యమనింది. ఇంతలో విభీషణుని రాణియైన సరమ సకల సామగ్రితో ఆశోకవనం చేరింది. సరమ, త్రిజట ఇరువురూ సీతకు ప్రాణ స్నేహితురాళ్ళు. ఇద్దరూ కలసి జానకి కురులను విరబోశారు. హనుమంతుడు విభీషణుడు కలసి ఒక మూల కూర్చొని ఉండగా సరమ స్వహస్తాలతో జానకిని పూజించ నారంభించింది. ఉత్తమ పట్టు వస్త్రాన్ని గైకొని సీతకు పరదాగా కట్టి, రత్నఖచితమైన బల్లను వేసి సరమ సీత పాదాలనభిషేకించింది. సుగంధభరితమైన నూనెతో త్రిజట సీతకు తలంటి, స్నేహ, ఆదరవచనాలతో 'అనంతమైన శుభాలతో కల్ప పర్యంతం మీ దంపతులిరువురు ఆనందభరితులై జీవించెదరు గాక' అని ఆశీర్వదించింది. సరమ కస్తూరిపొడి తీసుకొని స్వహస్తాలతో నలుగు పెట్టి 'తల్లీ! త్రిజటా! జనక తనయ బాగా నీరసంగా వుంది. త్వరగా స్నానానికి వేడినీళ్ళు తీసుకురావలసింది' అన్నది. త్రిజట త్వరగా వేడి నీళ్ళు తీసుకురాగా సరమ సీత శరీరాన్నంతా రుద్ది స్నానం చేయించింది. విభీషణుడు రంగురంగుల అమూల్యమైన అలంకారాలను పంపించాడు. ప్రళయకాలపు మెరుపులకంటె కాంతిగల చీరను కట్టుకుని ముల్లోకాల్లో కూడా దుర్లభమైన దివ్యాలంకారాలను ధరించింది. కర్ణభూషణాల కాంతులు సూర్యమండల కాంతిని మరిపించాయి. సర్వాలంకార కాంతులు దశదిశలు వ్యాపించాయి. నుదుట కుంకుమ రాసుకుని మధ్యలో సువాసనకు కస్తూరి దిద్దింది. దివ్య సుగంధాన్ని త్రిజట జానకి సర్వాంగాలకు పూసింది. దివ్యఫలాలతో జానకి పమిట చెరగు నింపింది. సరమ జానకితో 'అమ్మా! ఒక్క పండు తినవలసింది' అని వేడుకుంది. కాని మంచి రుచిగల సుందర సుగంధభరితమైన ఆ అమృతఫలాలను జానకి విభీషణ, హనుమంతులకు ప్రసాదంగా పంచిపెట్టింది. సరమ, త్రిజటలకు కూడా పరమప్రీతితో పండ్లిచ్చింది. ఒక్క పండు మాత్రం

తాను తీసుకుని ఆరగించింది. అందరూ ముఖప్రక్షాళన చేసుకున్న వెంటనే విభీషణుడు జానకి వద్దకు వచ్చి, దివ్యమణిమయ హారాన్ని ఆమె ముందుంచాడు. ముల్లోకాల్లో కూడా దొరకని ఆ మణిహారాన్ని రావణుడు తన కోశాగారంలో వుంచాడు. దానిని విభీషణుడు ప్రేమతో సమర్పిస్తే జగన్మాత కంఠంలో ధరించింది. ఇంతలో లంకలోని పదునెనిమిది అక్షౌహిణుల సైన్యం వెంటనే సిద్ధమయి వాద్యాలు మార్మోగుతుండగా రత్నఖచితమైన పల్లకీని తెచ్చి సీతముందుంచారు. విభీషణుడు మరియు మారుతి జానకికి పాదాభివందనం చేసి పల్లకిలో కూర్చుండమన్నారు. సరమ, త్రిజటలను జానకి గట్టిగా కావలించుకుని 'ప్రాణసఖులారా! నేను మిమ్ముల మరలా చూడగలనో లేదో?' అని దుఃఖించింది. సరమ, త్రిజట కళ్ళు అశ్రుపూరితాలై వెక్కివెక్కి ఏడుస్తూ జానకి చరణాలపై మోకరిల్లారు. వారు తమ మెలికలు తిరిగిన శిరోజాలతో జానకి చరణాలు తుడిచి, పల్లకీలో కూర్చుండబెట్టి గద్గద స్వరంతో 'ప్రాణసఖీ! జనకనందినీ! మమ్ములను ఎన్నటికీ మరువవద్దు' అని వేడుకున్నారు. బదులుగా సీత 'మీరు చేసిన మేలు నేను ఎన్నటికీ మరువలేను' అన్నది. నిపుణుడు దివ్యరత్నాన్ని పెట్టెలో పెట్టి కాపాడినట్టు, మహాత్ములు తమ జ్ఞానాన్ని లోకానికి బహిర్గతం కాకుండా వ్యవహరించినట్టు, ధనవంతుడు తన ధనాన్ని సర్వదా గుప్తంగా వుంచినట్టు విభీషణుడు పల్లకీకి రక్షణగా ఉన్నాడు.

అతిఉల్లాసంగా వాయుసుతుడు కుడివైపు వేగంగా నడువగా, మధ్యభాగంలో లంకానాథుడైన విభీషణుడు త్వరగా అడుగులు వేశాడు. వాహకులు అతివేగంగా త్రికూటాచలం వైపు సాగిపోగా విభీషణ, హనుమంతులిరువురు వాహనంపై తాము కూడా ఒక చేయివేశారు. ముందు ఛత్రధారులు పరుగులిడగా వాద్యాల హెూరు మారుమ్రోగింది. స్కందగణపతులిరువురు పార్వతి చెంతనున్నట్లు, మారుతి విభీషణులు ప్రేమతో పల్లకీ వెంట పరుగెత్తారు. త్వరగా రాముని సేనను చేరారు. ఆ సంరంభాన్ని



చూడానికి వానరులు పరుగెత్తితే వారిని వేత్రహస్తులు దండించారు. వెంటనే అయోధ్యాపతి లంకాధిపతిని రావించి 'మీ వేత్రహస్తులు మా వానరులను హింసించారని తెలిసింది. ఆ సీత కోసమే వానరులు ఎన్నో కష్టాలు సహించారు. కనుక పల్లకీలోనున్న సీతను వారికి చూపవలసింది. భర్త ప్రక్కనున్నపుడు స్త్రీ ఎంతమంది జనం ఎదుట ఉన్నా తప్పు కాదు' అని ఆజ్ఞాపించాడు. అలా రామాజ్ఞ కాగానే పల్లకీ నేలపై దిగింది.

## సీతమ్మకు శ్రీశిరాముని పరీక్ష

జానకి నేలపై కాలిడగానే అందరూ ఒక్కసారి జానకిని చూసారు. పల్లకీ బయట ముల్లోకాధిపతి రాణి నిలబడగా రత్నాలపెట్టె తెరవబడిందా అన్నట్లు కాంతులు వెల్లివిరిసాయి. ఎవరి ముఖకమలం ముందు కోటిచంద్రప్రభలు సరిపోలవో, లావణ్యసాగరమే ఉప్పొంగి నారీ రూపం ధరించిందా అన్నట్లు జగజ్జనని ఆదిమాయ, విశ్వఖని దేవతల అవతారాలైన భక్త శిరోమణులను అవలోకించింది. జానకిని చూడగానే దేవగణాలకు, గంధర్వులకు అసురులకు మనస్సులో ఇంత అపురూప సౌందర్యవతిని పరమదుర్మార్గుడైన దశకంఠుడు ఆరునెలలు అత్యాచారం చేయకుండా ఎలా వుండగలిగాడు? అన్న వికల్పం కలిగింది. జగదాత్మయైన రఘువీరుడు వారందరి ఆంతర్యం గ్రహించి జానకితో ఏమన్నాడో వినండి. అప్పుడు వాద్యాలన్నీ ఆగిపోయాయి. దేవతలంతా నిస్తబ్ధమయ్యారు. భల్లూకాలు, వానరాలు అందరూ మౌనంగా వినసాగారు. భ్రుకుటిముడిచి క్రూరంగా సీతను చూచి రఘునాథుడు 'నిన్ను గురించి నువ్వు ఒక్కసారి ఆలోచించి చూడు. నిన్ను రాక్షసుడు ఎత్తుకుపోయాడు. దుర్భరమైన ఆ అపవాదును రూపుమాపటానికి నిన్ను విడిపించి తెచ్చాను. గుండెల మీదినుండి పాషాణాన్ని దింపినట్టు, రోగికి రోగం మటుమాయమయినట్లు, జన్మాంధునికి చూపు వచ్చినట్లు ఈ రోజు ఎంతో ఆనందంగా వుంది. నిన్ను

ఆ రాక్షసుని చెరనుండి విడిపించి మా మాట నిలబెట్టుకొన్నాము. ఇక నీ యిష్టం వచ్చిన చోటుకు వెళ్ళిపోవలసింది. నేను సర్వం త్యజించి ఉదాసీనంగా అడవులలో సంచరిస్తాను. నా మనస్సులో ఎలాంటి కామవాసనలు మిగిలిలేవు. మా సంగతి పూర్తిగా వదిలేసి నీకు నచ్చిన మహారాజుని వివాహం చేసుకో. వ్యర్థంగా ఇక్కడ నిలబడి ప్రయోజనమేముంది. ఎనిమిది దిక్కులలో నీ ఇష్టం వచ్చిన దిశగా వెళ్ళవచ్చు. నన్ను కైకేయి బయటకు గెంటింది. నాకు సింహాసనంగాని, ఎలాంటి నిలువనీడ గాని లేవు. ఘోరారణ్యాలలో వనచరాలతో కలసి తిరుగుతుంటాను. తినటానికి అన్నం దొరకకపోతే కందమూలాలు భక్షిస్తాను. నారచీరలు ధరించి దర్భాసనంపై శయనిస్తాను. అందువల్ల ఓ సీతా! మాతో కలిసి నీవు సుఖించలేవు. వ్యర్థంగా ఇక్కడ ఉండటం కంటె వేరే మార్గం చూసుకో. నేను ఉపాధుల్ని వదలి ఏకాంతంగా ఉండదలిచాను. నాతో మరొకరు వుండడం ఇష్టం లేదు. ప్రపంచవాసనలకు తావులేదు' అని రఘునాథుడు పలుకగా, సీత ప్రళయమే శబ్దరూపంలో శస్త్రాంలా తూట్లు పొడిచిందా అన్నంత బాధపడింది.

శబ్దాలు కావు అవి పిడుగులు. ఆ మాటలు శరీరానికి తగిలినంతనే శరీరం ముక్కలైనంత బాధ కలుగుతుంది. ఎంతో బాధనణచుకొని అగ్నిలో పడ్డ కమలంవలె వడలిపోయి నయనాలనుండి అశ్రుధారలు కారిపోతుండగా ఆ సీతాసాధ్వి ఇలా అంది. 'జగద్వంద్యా! శ్రీరామచంద్రా! ఆనందకందా! గుణసముద్రా! నన్ను వెంటనే వధించు. ఆరునెలలు కష్టాలుపడి ఈ రోజే రామచరణాలను దర్శించాను. నా పూర్వకర్మ బలంగా వుంది. అందువల్లనే ఇంకా విఘ్నాలు కలుగుతున్నాయి. ఆనందించే రోజు వస్తుందని సమాధాన పడ్డాను. కాని నా ప్రారబ్ధం నాకన్నా ముందే నడుస్తున్నది. కామధేనువు పాలు పితికితే జీలగ పాలు వచ్చినట్టు, అమృతభాండాన్ని చేతబట్టుకోగానే దుర్భరవిషంగా మారినట్టు, మృగేంద్రుడు రక్షణగా వున్నా జంబుకం చేయి



విరగగొట్టినట్టు, గరుడుని గృహంలో నివసించే ప్రాణిని పాము కాటేసినట్టు, యాచకుడు పరుగున వచ్చి కల్పతరువు నీడకు చేరితే అది ఎండిపోయిన కట్టెతో కొట్టినట్టు, పులిచేత చిక్కిన ఆవును విడిపించి యజమాని దాన్ని క్రూరతో కొట్టి చంపినట్టు, గంగ వరదలో మునిగిపోయే ప్రాణిని కాపాడి బాణాలతో వధించినట్టు, మండే ఇంట్లోనుంచి రక్షించి తిరిగి మంటలో వేసినట్టు, కరుణాసాగరుని వద్దకు వస్తే క్రూరత్వం ప్రదర్శించడం విచిత్రం. తల్లి పుత్రునికి విషమిచ్చినట్లు, తండ్రి కొడుకును వధించినట్లు, యజమాని దాసుని దండించినట్లుగా ఉంది నా స్థితి. భాగీరథి సాగరుని శరణు గోరగా నా వద్ద చోటు లేదంటే అది ఎక్కడకుపోతుంది? జలచరాలకు నీరు, నిలువనీడ ఇవ్వకపోతే వాటి గతేమిటి? పక్షులపై ఆకాశం కోప్పడితే అవి ఎక్కడికి పోగలవు? దయతో ఆశ్రయమిస్తానని తీసుకొచ్చి మధ్యలో వదిలేస్తే వాడు ఎవరిని శరణు కోరగలడు? అన్నార్తుడైనవాడిని దాత తరిమివేస్తే వాడు ఏం చేయగలడు? నా పరిస్థితి ఆ విధంగా వుంది. తమ ఇచ్ఛ వచ్చినట్లు సూర్యుడు కిరణాలపై కోపిస్తే, సముద్రం అలలపైన అలిగితే, అమృతం మాధుర్యాన్ని బయటకు తరిమేస్తే, తన కొమ్మతో కల్పతరువు మౌనం పాటిస్తే, చంద్రుడు తన కళలను త్యాగం చేస్తే, మేరువు తన శిఖరంపై కోపిస్తే ఏం చేయగలదు? భాగీరథివలె దోషం లేకుండా సర్వదా అగ్నివలె శుచిగా నిర్మలంగా వున్న నేను మాట్లాడుతున్నాను. దశకంధరుడు తీసుకెళ్ళడంతో చిన్న దోషం జరిగింది. దానికి ఇంత పెద్ద శిక్ష వేయడం సమద్రష్టలకు భావ్యమేనా? గాలితాకిడికే కమిలిపోయే కమలాన్ని వజ్రంతో వేటువేసినట్లు, వనంలో తిరిగే లేడిని అన్యాయంగా వధించినట్టు, పుటం పెట్టని సువర్ణం అగ్నితో కలిసి సంపూర్ణమైనట్టు నేను అందరూ చూస్తుండగా అగ్ని ప్రవేశం చేస్తానని ప్రమాణం చేస్తున్నాను. పూర్వమొనరించిన దుష్కర్మలఫలితంగా ఎన్నటికీ సువర్ణంగా మారలేని లోహం వంటి భక్తులు కూడా పరుసవంటి దేవుని సాన్నిధ్యంలో

సువర్ణంగా మారుతారు కనుక నేను అగ్ని ప్రవేశం చేస్తున్నాను' అని కళ్ళలో కన్నీరు కారిపోతుండగా జానకి వానరులతో త్వరగా కుండం తయారు చేసి వెలిగించమని ఆజ్ఞాపించింది.

వెంటనే పెద్ద పెద్ద కట్టెలతో విశాలమైన చితిని సిద్ధంచేశారు. అగ్నిజ్వాలలు ప్రచండమై ఆకాశానికెగసాయి. ఆ సమయంలో 'నేనే పరిశుద్ధనయితే తిరిగి వచ్చి నా స్వామి పాదాలు సందర్శిస్తాను. నాలో దోషం వుంటే నేనీ అగ్నిలో భస్మమవుతానని' అంటూ జగన్మాత అగ్నిప్రవేశం చేయడానికి బయలు దేరింది. సురాసుర వానర ఋషిమునీశ్వరులంతా చింతాక్రాంతులైనారు. మంచి సంతోషసమయంలో ఈ అనర్థమేమిటో? అని అందరూ అనుకున్నారు.

మంచి యుద్ధాన్ని చూచి వీరుడు ఎంత నిర్భయంగా వుంటాడో ఆ విధంగా అగ్ని ముందర విదేహపుత్రి నిర్భయంగా నిలబడింది. ఆ అగ్నికుండానికి ప్రదక్షిణ చేసి కనులారా రఘునందనుని గాంచి మెడలోనున్న పూలహారాన్ని అగ్నిలో వేసి సత్యానికి జయము జయము అంటూ మూడుసార్లు జయజయధ్వానాలు చేసి ముల్లోకాలకు మాత అయిన సీత అగ్నిగుండంలో దూకింది. తన హృదయరత్నమైన సీత అగ్నిలో ప్రవేశించిందని తెలిసి కుమార్తె ఎంత కష్టపడిందోనని మంగళజనని, భూదేవి విపరీతంగా కంపించింది. అంతటా హాహాకారాలు మిన్నుముట్టాయి. కపిసేనంతా శోకార్ణవంలో మునిగిపోయింది. దేవతలందరూ ప్రళయమే వచ్చిందేమోనని వ్యాకులపడ్డారు. దిక్కులంతా దుమ్ము, ధూళితో నిండాయి. సప్తసముద్రాలు పొంగాయి. వైకుంఠం, కైలాసం అన్నీ ఊగసాగాయి. ఆకాశం వణికింది. నక్షత్రాలు అపారంగా రాలిపోయాయి. సౌమిత్రి, వాయునందనుడు మొదలైనవారు కన్నీరుమున్నీరయ్యారు. అగ్నిలో దూకిన తరువాత తిరిగి సీతాసతిని సందర్శించేదెలా అని అనుకున్నారు. అంతా విధివిశేషం. పరమదుర్భరమైన



సంఘటన జరిగిందని తలపోశారు. ఒక ఘడియకాలం జానకీ దేవి అగ్నిలో గుప్తంగా ఉండి, తలనిండా పువ్వులతో తిరిగి ప్రత్యక్షమైంది. ముందు చూచినదానికంటె ఆమె సౌందర్యం వందరెట్లు పెరిగింది. ఆ సౌందర్య ప్రభలు భూమండలమంతా నిండిపోగా అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

అరణ్యకాండలో కథననుసరించి అసలు సీత లక్ష్మణరేఖ వెనుక గుప్తమై శపథం మిషతో ఇప్పుడు ప్రకటమయ్యింది. సీత రూపాన్ని అగ్నిధరించి రాక్షసవనాన్ని కాల్చి శపథం పేరిట స్వస్వరూపంలో కలిసిపోయాడు. రాముని చిత్‌శక్తి సీత. ఆమె లంకకే పోలేదు. ఈ విషయం వేదాంతజ్ఞానం కలిగిన సాధుసజ్జనులందరికీ గుర్తుండి ఉంటుంది. ఆ విధంగా వెలువడిన జానకిని చూచి అందరూ జయజయ ధ్వానాలు చేశారు. అష్టాదశపద్మవానరులు నమస్కారం చేశారు. సురవరులంతా సీతపై పుష్పవృష్టి కురిపించారు. సీతాసతి పవిత్రమైనది అంటూ అందరూ ప్రణామం చేశారు. సౌమిత్రి, సుగ్రీవుడు, విభీషణుడు జానకీదేవికి సాష్టాంగ నమస్కారాలు చేశారు. హనుమంతుడు ఆమెకు పాదాభివందనం చేసి ఆనందంతో నాట్యం చేశాడు.

ఆ సమయంలో సీతాసతి మెల్లగా హంస గమనంతో శ్రీరాముని వద్దకు బయలుదేరింది. శ్రీరాముని ముఖంలోకి చూచి సీత నగుమోముతో పరుగున వెళ్ళి జగద్గురువులైన రఘువీరుని పాదాలు గట్టిగా పట్టుకొంది. రఘుపతి ఆమెను లేవదీసి కౌగిలించుకుని ఆమెను వామాంకంపై కూర్చుండబెట్టుకున్నాడు.

**పరమేశ్వరబ్రహ్మేంద్రుల సంస్తుతి**

నవమేఘశ్యాముడైన రఘుపతిని, విద్యుల్లతలా మెరిసిపోతున్న జానకిని చూచి అందరూ సీతారాములకు జయజయధ్వానాలు చేశారు. అసురుల వాద్యఘోష తారాస్థాయికి చేరింది. అనుమతి తీసుకొని బయలుదేరడానికి

దేవతలంతా పైకి లేచారు. సదాశివుడు రాఘవునితో 'పురాణపురుషా! పూర్ణబ్రహ్మా! ఆనందకందా! నిజసుఖధామా! పూర్ణకామా! సర్వేశా! రవికులభూషణా! జలజనేత్రా! జనకజామాతా! నీలగాత్రా! సచ్చిదానందా! సుహాస్యవస్త్రకా! మీ లీల చూచి ధన్యులమైనాము. చరాచర జీవచిత్తచాలకా! అనంతబ్రహ్మాండపాలకా! రాక్షసులందరినీ నిర్జించి నిజ భక్తులను తరింపజేశావు. యుగయుగాలు అవతరించి పాపులు దుష్టులైన అసురులను మర్దించావు. కాని ఈ అవతారంలో శ్రీరామా! నీవు అగాధలీలను చూపించావు. నేను రఘునాథుని ఎప్పుడు చూచేదా? అన్న ఆర్తి నాలో మెండుగా వుంది. మీ నామంతోనే హాలాహలం సంపూర్ణంగా శాంతించింది. సీతా సహితంగా రామచంద్రా! నీవు వెంటనే అయోధ్యానగరానికి వెళ్ళవలసింది' అని కర్పూరగౌరుడు పలుకగానే రఘునందనుడు 'నాకు మీరు ఆరాధ్యదైవతం. అనాది సిద్ధుడవు. కైలాసనాథుడవు. విశ్వంభరుడవు. విశ్వాతీతుడవు. మీరు ఎన్నో అద్భుతాలు చేశారు. హాలాహలం బ్రహ్మాండాన్నంతా జ్వలించి వేస్తుంటే మీరు దానిని వెంటనే కంఠంలో ఇముడ్చుకుని సకలలోకాలను రక్షించారు. మీరు పరమదయాళురు. నన్నెందుకు స్తుతిస్తున్నారు? మీకన్నా నేను వేరుగా వున్నానా?' అని జవాబిచ్చాడు.

శ్రీరాముని మాటలు విని కమలోద్భవుడు 'క్షీరబ్ధివాసా! నారాయణా! మధుకైటభారీ! భవభంజనా! అనంతవేషా! ఆనందవదనా! అనంతనయనా! అనంతా! పరమాత్మా! నీవు నా తండ్రివి. నీ నాభికమలంనుండి నేనుద్భవించాను. నీ ఆజ్ఞానుసారం అద్భుతమైన ఈ జగత్తును సృష్టించాను. సృష్టిలోని రావణకుంభకర్ణాది క్రూరరాక్షసులకు అహంకారం పెరిగిపోయింది. వారిని సంహరించటానికై అయోధ్యలో ఈ రూపంతో నీవు అవతరించావు. పితృాజ్ఞాపాలన మిషతో నీవు అరణ్యాలకు వచ్చావు. పరమపురుషా! సీత కారణంగా రాక్షసులను వధించి భక్తులను రక్షించావు'. బదులుగా రాఘవుడు



'కమలాసనా! వేదపాలనా! విశ్వజనకా! సకల లలాట పట్టలేఖకా! నీకు సర్వం తెలుసు. నీవు నేను వేరుకాదని మొదటినుండి ఇద్దరికీ బాగా తెలుసు. మరి బాహ్యంగా ఈ స్తుతెందుకు?'

ఇంతలో పున్నమినాటి చంద్రునివలె దేవేంద్రుడు అమితోత్సాహంగా 'హే అయోధ్యానాథా! జగదుద్ధారా! బ్రహ్మానందా! పరాత్పరా! మాకు ఎంతో సహాయం చేశావు. అపరిమితమైన నీ గుణగణాలు వేదాలకే అంతుబట్టవు. ఓ రఘునాథా! భవబంధచ్ఛేదకా! నా మనస్సులో ఒక కోరిక వున్నది. దానిని మీరే తీర్చగలరు. నన్ను మీరు ఏదైనా ఆజ్ఞాపిస్తే నేను త్వరగా ఆపని చేస్తాను. ఆపాదమస్తకం శిరసావహిస్తాను' అని వేడుకుంటే రాఘవేంద్రుడు ఎంతో సంతోషించి 'సహస్రాక్షా! నీవు చతురుడవు. సమయానికి ఎంతో సహాయం చేశావు. యుద్ధానికి రథం పంపి ఎంతో ఉపకారం చేశావు. ఆ రథంలో కూర్చుని నేను అమోఘవిజయం సాధించాను' అని పలుకగా ఇంద్రుడు 'శ్రీరామా! భక్తకామకల్పద్రుమా! మంగళధామా! నేను ఈ పదవిలో సుఖించటం నీ ప్రసాదమే. అటువంటప్పుడు సమయోచితంగా రథాన్ని పంపడం ఉపకారమవుతుందా? చకోరం చంద్రుని, చాతకం మేఘాన్ని, చక్రవాకం సూర్యుని, సముద్రాన్ని అలలు ఏంచేసి తృప్తిపరచగలవు? రత్నం ముందు రాయిని, క్షీరాబ్ధిముందు మజ్జిగను, కుబేరునికి చిల్లిగవ్వ సమర్పించినట్టు మీముందు నేను మాటలాడుట తగదు. నన్ను ఆజ్ఞాపించవలసింది' అంటూ ప్రేమ ఉప్పొంగగా ఇంద్రుడు రాఘవుని చరణాలనాశ్రయించాడు.

### ఇంద్రుని అమృతవృష్టి

ఇంద్రుని పైకిలేపి రామచంద్రుడు నగుమోముతో అందరికీ ఆనందం కలిగించే మాటలు చెప్పాడు. వేదశాస్త్రాలను శోధించి పండితులు ధర్మాధర్మ విశ్లేషణ చేశారు. కాని అందరూ ఏకకంఠంతో పాపపుణ్యాలను

విశదీకరించారు. పరోపకారంవల్ల ఎంతో పుణ్యంవస్తుంది. పరపీడనం వల్ల అనంతమైన పాపం సంక్రమిస్తుంది. ఎన్ని గ్రంథాలు తరచి చూచినా వాటిభావం అదే. అటువంటి మహోపకారం వానరులు చేశారు. నాకు పూర్తిగా సహకరించి ఎంతో కీర్తిని ఆపాదించారు. యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకొని అసంఖ్యాకులు ప్రేతాలై పడిఉన్నారు. వాళ్ళబంధుమిత్రులంతా దుఃఖంలో మునిగిఉన్నారు. నా మిత్రులైన ఆ వానరులందరికీ పునర్జీవనం ప్రసాదించి ఎవరికీ దేహంపైన ఏరకమైన గాయాలు లేకుండా చేయవలసింది. అందరూ ఆరోగ్యంగా కలకాలం సుఖంగా ఉండాలి. వాళ్ళు నివసించే వనం సదా ఫలవంతంగా వుండాలి. ఓ అమరేంద్రా! త్వరగా ఈ కార్యం పూర్తిచేయవలసింది' అని ఆజ్ఞాపించాడు. పరాత్పరుడైన రాఘవుని పలుకులు విని అందరూ ఆనందించారు. ఇంద్రుడు శ్రీరాముని పాదాలపై మోకరిల్లి 'వానరులందరినీ క్షణంలో పునర్జీవులను చేస్తాను' అని పలుకగా, సీతారమణుడు అందరికీ వీడ్కోలు తీసుకోవడానికి అనుమతిచ్చాడు. దేవతలంతా విమానాలలో బయలుదేరగా దుందుభులు మారుమ్రోగాయి. ఆకాశంలో జేగంటలు మ్రోగాయి. సర్వత్రా ఆనందానికి అవధులులేవు. ఇంద్రుడు ఆజ్ఞాపించినంతనే అమృతమేఘాలు ఆకాశంలో గుమిగూడి గంభీరంగా గర్జించసాగాయి. పడమట మేఘాలుద్భవించి మెరుపులతో సహా యుద్ధభూమి నిండా అమృతవృష్టి కురిసింది. ఒక ఘడియ కాలం అపారంగా అమృతం కురియగా వానరులంతా నిద్రనుండి మేల్కొన్న వారి వలె, శ్రీరాముని ముంగిట సాష్టాంగనమస్కారం చేశారు. తరువాత ఇంద్రుని ఆజ్ఞానుసారం వర్షం ఆగిపోయింది. ఈ సందర్భంలో చతురులయిన శ్రోతలు యిలా ప్రశ్నించవచ్చు. వానరులు, రాక్షసులు అందరూ ఒకే చోట నేలకూలారు గదా! మరి రాక్షసులెందుకు తిరిగి జీవించలేదు? అని. దానికి వక్త సమాధానం ఇది. నాటక రామాయణ కావ్యంలో ఈ కథను అంజనేయుడే స్వయంగా చెప్పాడు. దాన్ని ప్రమాణం



కాదని ఎవరనగలరు? ఆ జరిగినదంతా దర్శించి శ్రీధరకవి చెబుతున్నమాటలివి. శంకరుడు మొదటనే భూతాలను పంపి ఇలా ఆజ్ఞాపించాడు. 'మీరు వానరుల శిరస్సులు తాకకుండా మిగిలిన రాక్షస ప్రేతాలను భక్షించండి' అబద్ధంలో నుండి నిజాన్ని బయటకు లాగినట్లు, తాంబూలం నుండి రాయిని తీసినట్టు, రత్నాలనుండి మామూలు రాతిని పరీక్షకుడు ఏరినట్లు, భూతాలన్నీ రాక్షస కళేబరాలను ఏరి భక్షించి, అస్థిపంజరాలను సముద్రంలో పారేశాయి. అవేవీ భూమిపై మిగలలేదు. అందువల్ల అమృతపుజల్లు కురియగానే వానరులు మాత్రం పునర్జీవించారు. కవి ఇలా బదులు చెప్పగా శ్రోతల సంశయాలు సూర్యోదయంతో అంధకారంవలె మటుమాయమయ్యాయి. అన్నం తినేటప్పుడు నోట్లోకి రాయి వస్తే తీసివేసి తిరిగి భోజనం చేసినట్లు వారి సందేహాలు పూర్తిగా సమసిపోయి తిరిగి కథాశ్రవణం కొనసాగించారు.

రఘునాథుడు విభీషణునితో ఇక మాకు బయలుదేరడానికి అనుమతినివ్వవలసిందని అడుగగా విభీషణునికి విపరీతమైన దు:ఖం కలిగి వెక్కివెక్కి ఏడవసాగాడు. శ్రీరామచరణాలను కౌగిలించుకుని ఆయన పాదాలపై కన్నీరుకార్చసాగాడు. 'నాకు లంకారాజ్యాన్నిచ్చి ఓ రామా! నీవు నన్నొదిలి వెళ్ళిపోతున్నావా? అనంత రాజ్యాన్ని నీ పాదాక్రాంతం చేస్తాను. నీ పూజ తప్ప నాకు మోక్షం కూడా అక్కరలేదు. అటువంటప్పుడు తృణప్రాయమైన ఈ లంకారాజ్యం నేనేం చేసుకొనేది. నేను మీతో అయోధ్యకు వచ్చి అక్కడ మీ సేవ చేసుకుంటాను' అని తన హృదయవేదనను వెలిబుచ్చగా రఘురాముడు విభీషణుని హృదయానికి హత్తుకుని 'ప్రాణసఖా! నేను సర్వదా నీ హృదయంలో నివసిస్తాను. నీవు నాతో అయోధ్యకు రావలసింది. దారిలో మాట్లాడుకుందాము. అయోధ్యలోని వేడుకలలో పాల్గొని నీవు, సుగ్రీవుడు తిరిగి మీ రాజ్యాలకు వెళ్ళవలసింది' అని అనునయించాడు. విభీషణుడు ఆ

మాటలకు ఎంతో ఆనందించి అత్యంత విశాలమైన గుణగంభీరమైన ప్రభు ఆజ్ఞ పాలించే పుష్పకవిమానాన్ని తెప్పించాడు. సకలజగత్తు కలసివచ్చినా కూడా అది విశాలమవుతుంది. కావాలంటే సంకోచిస్తుంది. అలా అందరినీ తనలో సర్దుబాటు చేయగలదు. అలాంటి విమానాన్ని సేవకులు రాముని వద్దకు తీసుకుని రాగా శ్రీరాముడు దానిని చేతితో స్పృశించి కళ్ళకద్దుకుని నమస్కరించాడు. సీత వేలు పట్టుకొని దివ్యరత్నఖచితమైన మెట్లెక్కి విమానంలో సీతాసమేతంగా రఘునాథుడు ముఖ్యాసనంలో ఆసీనుడయ్యాడు. పదునెనిమిది పద్మాల వానరులు, యాభై ఆరు కోట్ల నల్లకోతులు, డెబ్బై రెండు కోట్ల ఎలుగుబంట్లు, విభీషణుని సైన్యం అంతా విమానాన్ని అధిరోహించారు.

పద్దెనిమిది అక్షౌహిణీల సైన్యం వాద్యఘోష చేస్తుండగా ఎనిమిదిమంది కపిశ్రేష్ఠులు ఎనిమిది మూలలలో రాఘవుని చెంత నిలుచున్నారు. హరితవర్ణంగల చామరంతో అంగదుడు, లక్ష్మణుడు ఇరువురు చెరోవైపు సమానంగా వీయసాగారు. ఆ విధంగా రాజాధిరాజు, సమర్థుడైన రఘురాముడు అయోధ్యవైపు సాగిపోయాడు.

రామవిజయం రత్నాలఖని. ఉత్తరకాండ కిరీటంలోని మణి వంటిది. సజ్జనులైన మీరు ముందే కథను శ్రవణం చేయండి. బ్రహ్మానందం కలుగుతుంది. యతీశ్వరుడు పూర్ణజ్ఞాన సముద్రుడైన బ్రహ్మానందుని పాదకమలాల చుట్టూ శ్రీధర భ్రమరం సదా పరిభ్రమిస్తుంది. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన పండితులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది నాలుగవ అధ్యాయం మధురం**

**అధ్యాయము - 35**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**ఓ** శ్రీరామా! దేహబుద్ధి లంకను కైవశం చేసుకుని అహంకారియైన రావణుని చంపి సద్భావకుడైన విభీషణుని సింహాసనమధిష్ఠింపజేశావు. జనక తనయ, జ్ఞానరాశి అయిన సీత రఘురాముని కలిసిన తరువాత స్వానందమనే విమానంలో ఆత్మారామునితో బయలుదేరింది. రెండువేల యోజనాల ఎత్తులో పుష్పకవిమానం ఎగురుతుండగా వాద్యాలఘోషలో వానరులు రాఘవుని కీర్తిని గానం చేశారు.

### పుష్పకంలో జానకీరాముల పయనం

పూర్ణిమనాడు చంద్రుడు త్వరగా పశ్చిమానికి వెళ్ళినట్లు, సముద్రంలో పడవలు గాలి వేగానికి త్వరగా తిరిగి వచ్చినట్లు, దివ్యమణిమయ కాంతులలో మేఘాలగుండా విమానం గంట గణగణ మోగుతుండగాఅతివేగంగా ఉత్తరం వైపు పయనించింది. ఆ విధంగా విమానం సాగిపోతుండగా రవికులభూషణుడు అసురకులకానన దహనుడైన రఘునందనుడు తన వామాంకంలో మెరుపువెంట మేఘంలా కూర్చున్న వైదేహితో ఇలా అన్నాడు. 'కాంతా! నేలవైపు చూడు. ఆ కనబడేదే దేదీప్యమాన హేమవర్ణవిలసితమైన లంకానగరం. ఆవలిఒడ్డున నికుంభిలా దుర్గం. అక్కడే సౌమిత్రి ఇంద్రజిత్తును వధించాడు. మేము నివసించిన త్రికూటాచలం అదే. ప్రాణసఖీ! బాగా చూడు. చంద్రముఖీ! ఆవలితీరాన యుద్ధభూమిని చూడు. అక్కడే ఘోరయుద్ధం జరిగింది. మహాబలవంతులు పరాక్రమశీలురు అయిన ఎంతోమంది రాక్షసులు నశించారు. వజ్రదంష్ట్రుడు, విరూపాక్షుడు, అకంపనుడు, మత్త, మహామత్త, ప్రహస్త ప్రధానులు, భయానక విశాల రూపంగల కుంభకర్ణుడు, దేవాంతక,

నరాంతక, మహోదర, కుంభ, నికుంభ, త్రిశిర, మహాసురులు కూడా ఇక్కడే మరణించారు. జానకీ! ఏడురోజులు యుద్ధంచేసి రావణుడు ఇక్కడే విగతజీవుడయ్యాడు. అటువైపు సముద్రం చూడు! అక్కడ నీలుడు సేతువు నిర్మించాడు. ఆవలితీరాన ఉత్తరంవైపు కనబడేదే దర్భశయనం. అక్కడే సముద్రుడు వచ్చి నన్ను కలిశాడు. ముందు కనబడేవి మలయాచల, వింధ్య పర్వతాలు. అదిగో కిష్కింధ! ఆనందంగా తిలకించు. ఆవలి ఒడ్డున పంపాసరోవరం, అక్కడే వాయుకుమారుడు నన్ను ప్రథమంగా కలుసుకున్నది. సుగ్రీవుని కొరకు నేను వీరుడైన వాలిని వధించింది. అక్కడే శబరి ఉద్ధరింపబడింది. అక్కడ కబంధుడు వధింపబడ్డాడు. ఆ కనబడేదే గోమతీ తీరం. అక్కడే ఖరదూషణసంహారం జరిగింది.

గజగమనా! ముందు కనబడేదే పంచవటి. అక్కడనుండే రావణుడు నిన్ను తీసుకెళ్ళింది. పద్మనయనా! గౌతమీ తీరాన కనబడే శరభంగ, సుతీక్ష్ణ ఋషి ఆశ్రమాలను, మందకర్ణి నదిని, సింహాద్రిని బాగా వినోదంగా తిలకించు. ఇక్కడే మనం దత్తాత్రేయుడు అత్రిముని అనసూయలను కలుసుకున్నది. అదే అగస్త్యాశ్రమం. ముందు కనబడుతున్నదే చిత్రకూటం, భరద్వాజాశ్రమం. ముందున్నది తీర్థాలలో మేటి అయిన ప్రయాగ. అక్కడ దూరంగా కనబడుతున్నది నందిగ్రామం. అక్కడే ప్రాణసమానుడయిన భరతుడున్నాడు. దానికావల శృంగబేరపురంలో మహాభక్తుడు, కిరాతుడైన గుహుడు నివసిస్తున్నాడు. ఓ జలజాక్షీ! సాదరంగా చూడు. సరయూ తీరాన పరమసుందరంగా మెరుస్తున్నదే అదే మన నివాసస్థలమైన అయోధ్యానగరం.' పరమ స్నేహాదరాలతో చాపపాణి అయిన రాముడు సీతకు అన్నీ చూపించాడు. తదుపరి ఆ మోక్షప్రదాత ఒక్క క్షణం అగస్త్యాశ్రమంలో విడిది చేయాలనుకున్నాడు. రామాజ్ఞతో క్షణంలో విమానం ఋషి ఆశ్రమంచెంత నేలపై దిగింది. ఆ సమయంలో జానకీరమణుడు జానకితో ఇలా అన్నాడు



'మనం అగస్త్యుని కలుసుకుందాం. లోపాముద్ర నిన్ను ఇంటిలోకి తీసుకుపోతుంది. అక్కడ ఎందరో ఋషిపత్నులు నిన్ను చూచి ఎన్నో ప్రశ్నలు వేస్తారు. రావణుడు నిన్నెలా తీసుకెళ్ళాడు? రఘుపతి లంకకెలా వచ్చాడు? ఆ కథంతా ఎలా జరిగింది, అని నిన్ను అగస్త్య పత్ని ప్రశ్నిస్తుంది. అన్ని విషయాలు చెప్పు. కాని సేతువు నిర్మించడం గురించి ఆమెకు ఎప్పుడూ చెప్పవద్దు. ఆ కథ ఆమెకు తెలిస్తే నిన్ను చులకన చేస్తుంది' అని పలికి రాఘవుడు విమానంనుండి దిగాడు.

## అగస్త్యసందర్శనం

వాద్యాలహోరు మిన్నంటగా శిష్యులు పరుగున వెళ్ళి అగస్త్యునితో స్వామీ! భల్లూకవానరాలతో విమానం నేలపై దిగింది. అని తెలియజేసారు. రఘువీరుని తిలకించడానికి తటాలున లేచాడు కుంభసంభవుడు. అపారమైన శిష్యకోటితో రాముని త్వరగా కలుసుకోవడానికి వెంటనే ఆశ్రమం బయటకు విచ్చేశాడు. విమానం నుండి క్రిందకు దిగి రాముడు ఋషిసమూహాన్ని చూచి ఎదురురావడం గమనించి, బ్రహ్మ ఇంద్రుని సాదరంగా కౌగిలించుకున్నట్లు, కలశోద్భవుడైన అగస్త్యుడు పరుగున వచ్చి రఘుపతిని హృదయానికి హత్తుకున్నాడు. వెంటనే సౌమిత్రిని కూడా ఆలింగనం చేసుకున్నాడు. శ్రీరాముడు ఋషులందరికీ సాష్టాంగనమస్కారం చేశాడు. రాముడు చిరునవ్వుతో ఈ రోజు ఎందుకు స్వామీ! ఆశ్రమాన్ని వీడి వెలుపలకు వచ్చారు. గతంలో అరణ్యకథనంలో రావణుడు సీతను ఎత్తుకుపోయిన తరువాత రామలక్ష్మణులు ఇరువురు సీతను వెదుకుతూ అగస్త్యాశ్రమానికివచ్చారు. ఆ సంగతి తెలిసి అగస్త్యుడు రామదర్శనానికి రాలేదు. ద్వారంలోనుండే రామలక్ష్మణులను వెనక్కి పంపివేశాడు. ఆ సంఘటనను గుర్తుచేసి రఘుపతి, 'ఆ రాముడినే నేను. ఆ రోజు నన్ను ఆదరించలేదు. ఈ రోజు విశేషంగా

ప్రేమిస్తున్నారే కారణమేమిటి విప్రోత్తమా?' అని ప్రశ్నించాడు. సమాధానంగా అగస్త్యుడు 'ఓ రాఘవా! ఆ సమయంలో నీవు భార్యారహితంగా వచ్చావు. నీలో ఏ వైభవమూ లేదు. ఆ విపరీత పరిస్థితిని చూచి నేను నీ దర్శనం చేసుకోలేదు. ఇప్పుడు నీవు భార్యాసహితంగా వచ్చావు. అందువల్ల కలిశాను. గౌరవమంతా స్త్రీకే. నీవు నిర్వికారుడవు. రఘునందనా! నీవు మానావమానాలకతీతుడవు. నీవు సచ్చిదానంద పరబ్రహ్మవు. నీవు అజఅజిత ఆప్తకాముడవు, ఏ ఉపాధి లేనివాడవు, నిర్గుణడవు. అనామకుడవు. నానావికారాలు హెచ్చు తగ్గులు అన్నీ స్త్రీకే రాఘవా!' కలశోద్భవుని ప్రత్యుత్తరానికి రఘువీరుడు ఆనందించి ఆశ్రమంలోనికి కుంభసంభవునితో కలిసివెళ్ళాడు.

అగస్త్యుని భార్య లోపాముద్ర వచ్చి జానకి చేయిపట్టుకొని ఆశ్రమంలోనికి తీసుకొనివెళ్ళి పూజించి ఇలా ప్రశ్నించింది 'వైదేహీ! నిన్ను రాముడు అమితంగా ప్రేమిస్తారు కదా. నీవు లేని విరక్తిలో ఆయన మానసికస్థితి ఎలా ఉన్నది? వనాల్లో సంచరించేటప్పుడు నీవు అలసిపోతే రాముడు నిన్ను ఎలా సంతోషపెట్టేవాడో మాకు తెలియజేయవలసింది' అని అడుగగా ముల్లోకాలకు అధిపతి శ్రీరాముని పట్టపురాణి అయిన వైదేహి బ్రహ్మానందంతో శ్రీరాముని ప్రతాపాన్ని కొనియాడింది. 'శ్రీరాముడు పరమ దయామయుడు. నన్ను ఎంతో ప్రేమించాడు. నీవు స్త్రీలోలుడంటున్నావు కాని రాముడెన్నటికీ కాదు. ఆయన అపారమైన దయాశీలి. నాతో అమితంగా చెలిమి చేశాడు. సదా విరక్తుడు, నిష్కాముడు అయిన ఆయనకు నామరూపాలు లేవు. నన్ను రావణుడు తీసుకెళితే దయాసాగరుడైన రఘురాముడు నానావిధ ప్రయత్నాలు చేసి నన్ను విడిపించాడు' అని తెలిపితే లోపాముద్ర 'సీతా! నిన్ను లంకానాథుడు ఏ విధంగా తీసుకెళ్ళాడు? జానకీరమణుడు నిన్నెలా విడిపించాడు! ఆ వైనం మాకు వివరంగా తెలుపవలసింది' అని అడిగింది. వైదేహి ఆనందంగా 'నేను



లేడి చర్మంతో ఒక పయ్యెద కావాలని కోరాను. సంగతి తెలిసినంతనే హుటాహుటిగా అయోధ్యానాథుడు అడవిలోకి పరుగెత్తాడు. వెనుకనే అతిథి వేషంలో రావణుడు వచ్చి నన్ను తీసుకెళ్ళాడు. నా వియోగంలో రాముడు వృక్షాలను, పాషాణాలను ఆలింగనం చేసుకున్నాడు. నా కోసం సుగ్రీవుని స్నేహం చేసి వాలిని సంహరించి వానరులందరితో మైత్రి చేశాడు. నన్ను వెదకటానికి వాయునందనుని పంపగా లంకానగరాన్ని కాల్చివేసి లంకకు రాముని తీసుకొచ్చాడు. అష్టాదశ పద్మ వానరులతో శ్రీరామచంద్రుడు వచ్చి లంకానగరాన్ని చుట్టిముట్టి అపారమైన యుద్ధం చేశాడు. రావణుని సంతతినంతా యుద్ధంలో సంహరించి విభీషణుని పట్టాభిషిక్తుని చేసి పుష్పకవిమానంలో తిరిగి వచ్చాడు. నేను భూమిపై చూడగా శతయోజన విస్తీర్ణమైన సేతుబంధనాన్ని అద్భుతంగా రాళ్ళతో నిర్మించారు. సముద్రాన్ని రాళ్ళతో బంధించడం నాకు ఎంతో ఆశ్చర్యం కలిగించింది' అని సీత రాముని హెచ్చరిక విస్మరించి సేతుచరిత్ర అంతా సవిస్తారంగా వివరించింది. వెంటనే లోపాముద్ర పాషాణాలతో సముద్రాన్ని బంధించటం ఏం పెద్ద సాహసం? ఒక్క బాణంతో సాగరాన్ని శోషింప చేయవచ్చును గదా? నా భర్త క్షణంలో సముద్రం మొత్తాన్ని తాగేశాడు అని చులకన చేయగా సీత రఘురాముని గూర్చి ఈమె చులకనగా మాట్లడుతున్నదే ఏం జవాబుచెప్పాలా అని ఒక్క క్షణం ఆలోచించి రఘురాముడు శరాన్ని సంధిస్తే సప్తసముద్రాలు నీటిచుక్క లేకుండా పోతాయి. జలచరాలన్నీ విగతజీవులవుతాయి. రాముని వద్దనున్న వానరగణమంతా అమిత బల సంపన్నులు, సప్త సముద్రాలను ఒకేసారి ఆపోసన పట్టగలరు. వారు పరమ పవిత్రులు. నీ భర్త మూత్రాన్ని వారు ఎలా త్రాగగలరు. అందువలన సేతుబంధనం జరిగింది. లేకపోతే క్షణంలో సముద్రుని ఆచమనం చేసి వుండేవారు అని బదులివ్వగా లోపాముద్ర నిరుత్తరురాలై జానకిని పూజించి సంతోషపరచింది.

అగస్త్యుడు రఘునందనుని పూజించిన తరువాత, అయోధ్యాపతి ఋషులందరి అనుమతి గైకొని సీతాసహితంగా పుష్పకవిమానంలో ఆసీనుడయ్యాడు. పుష్పకం గాలిలోకి లేచి అయోధ్యదిశగా బయలుదేరింది. ఇంతలో ప్రయాగనదీ తీరాన ఉన్న భరద్వాజ మహర్షిని దర్శించాలన్న కోరిక కలిగింది. వెంటనే ప్రభువు అభీష్టాన్ని అనుసరించి విమానం నేలపై దిగింది. మహానదులన్నీ వడివడిగా సముద్రాన్ని చేరినట్లు భరద్వాజ మహర్షితో సహా అసంఖ్యాకంగా మునీశ్వరులు నలువైపులనుండి పరుగున వచ్చారు.

రఘురాముడు నేలపై దిగగానే ఋషులకు నమస్కరించాడు. రాముని భరద్వాజమహర్షి ప్రేమగా ఆలింగనం చేసుకున్నాడు. భరద్వాజమహర్షి 'ఈ రోజు నా జన్మ ధన్యమయింది. అయోధ్యాధీశుడు నా గృహానికి విచ్చేశాడు.' అని ఎంతో సంతోషించారు. తదుపరి భరద్వాజుడు ప్రేమగా లక్ష్మణుని కౌగిలించుకున్నాడు. ఆ రోజున రఘునందనుని తన ఆశ్రమంలో విడిది చేయమన్నాడు. జగదాత్మయైన రఘునందనుడు స్నేహపూర్వకంగా హనుమంతునితో ఇలా అన్నాడు 'ఈరోజు మేము ఋషి ప్రీత్యర్థం ఇక్కడ నివసిస్తాము. అందువల్ల ముందు నీవు త్వరగా వెళ్ళి భరతునితో, శృంగగిరిలోని భక్తశిరోమణి గుహునితో ఈ విషయాన్ని తెలియజేయవలసింది'. రాముని ఆజ్ఞగైకొని రఘువీరుని చరణాలకు నమస్కరించి వాయుసుతుడు వాయు వేగాన ఎగిరిపోయాడు. ఆకాశం నుండి సూర్యుడు దిగివచ్చినట్లు హనుమంతుడు అకస్మాత్తుగా గుహుని నివాసానికి వచ్చి 'రఘురాముడు విచ్చేశాడు' అని తెలియజేశాడు. జగదానంద మూలకందుడు, భరత హృదయారవింద భ్రమరము, భక్తజనవరదుడు, పరమానందుడు, ఉదారఘనుడు, సర్వాంతర్యామి, మనోమోహనుడు, పరాత్పరుడు, విశ్వాత్మకుడు, విశ్వపాలకుడు, విశ్వమనోద్ధారకుడు, జనహృదయచాలకుడైన శ్రీరాముడు దగ్గరకు వచ్చాడు అన్న పలుకులు విని గుహుడు ఆనందంతో



ఉప్పొంగిపోయి పరుగున మారుతి పాదాలు పట్టుకొని గదితుడైనాడు. ఆ పరమభక్తుని హృదయానికి హత్తుకున్నాడు హనుమంతుడు. తిరిగి గుహుడు మారుతి చరణాలపై వాలి త్రికరణ శుద్ధిగా మీకు ఆరతి ఇస్తాను అంటూ పండ్లుపూలు తెచ్చి గుహుడు హనుమంతుని పూజించాడు. గుహునితో నందిగ్రామం లోనున్నభరతుని వద్దకు వెళ్ళి స్వామి వస్తున్నాడన్న వార్తను వినిపిద్దాం అని హనుమ సూచించగా భక్తశిరోమణులిరువురు వెంటనే లేచి ఒకరి చేయి ఒకరు పట్టుకొని క్షణంలో వేగంగా బయలుదేరారు.

## నందిగ్రామంలో భరతుని స్థితి

అక్కడ నందిగ్రామంలో భరతుడి నిరీక్షణకు పధ్నాలుగు సంవత్సరాలు నిండాయి. ఇంకా రఘునాథుడు రాలేదేమా అని వేళ్ళమీద లెక్కపెట్టసాగాడు. భరతుడు సర్వగుణ సంపన్నుడు. ఆయన భక్తిసాగరంలో చేపవంటివాడు. రత్నాలఖనిలో అమూల్యరత్నం. వివేకమనే గంగాఝరి. జ్ఞానాకాశంలో భాస్కరుడు. వారి క్షమ ఆదిశేషునికంటె నిశ్చలమైనది. ఆయన దయా మేరువు. గుణాగుణ నిర్గుణుడు. ఆకాశంలో మేఘంవంటివాడు. విరక్తినందనుడైన భరతుడు గడువు దాటిపోతున్నది, ప్రేమమయమయిన తల్లివంటి నా రాముడు ఇంకా నాకు కనిపించలేదు. ఇక దేహం చాలించి రఘునందనుని వెతుకుతాను అని వెంటనే హోమగుండాన్నేర్పరచి భరతుడు అగ్నిని రగిలించాడు. హోమగుండం ముందు నిలబడి రాముని అంతర్యంలో ధ్యానిస్తున్నాడు. కిరీటం, కుండలాలతో విశాలమయిన కనుదోయితో, శ్యామలవర్ణుడు, సుహాస్యవదనుడైన భరతుడు అకస్మాత్తుగా గుండంలో దూకబోతుండగా వాయుసుతుడు దగ్గరకు వచ్చి రావణుని చంపి, సురులను చెర విడిపించి, జగదాత్ముడయిన రఘురాముడు వస్తున్నాడని చెప్పాడు. భక్తజన సహాయకుడైన రాఘవుని ఆగమనవార్త విని భరతుడు కళ్ళు తెరవగా హనుమ నమస్కరించాడు. విపరీతమైన వేసవిలో క్షతగాత్రుడైన సారథికి దప్పిక

కలుగగానే చెంత మంచినీరు లభించినట్లు, చకోరానికి ఆకలి కాగానే అనుకోకుండా సూర్యుడుదయించినట్లు భరతుడు హనుమంతుని చూచి ఆనందించాడు. హనుమంతుని పరమప్రీతితో పైకిలేపి హృదయానికి హత్తుకుని 'రఘుపతి ఎక్కడికొచ్చాడు? ప్రాణసఖా! నాకు వెంటనే చూపించు' అని అర్థించాడు.

ప్రాణంపోయే సమయంలో హఠాత్తుగా అమృతం నోట్లో పడ్డట్లు భరతుడు మారుతిని చెంత కూర్చుండబెట్టుకుని వివరంగా జరిగినదంతా చెప్పమని అర్థించగా మేఘం అమృతం వర్షించినట్లు మారుతి చెప్పసాగాడు. కృపాసాగరుడైన రఘునాథుడు అనుక్షణం నిన్ను తలచుకొని ఎప్పుడు మనం భరతుని కలుసుకుంటాం అని అడుగుతూనే ఉన్నారు. ఇంద్రపదవితో సమానమైన రాజ్యాన్ని విడిచి సకల భోగభాగ్యాలు త్యజించి మీరు నందిగ్రామంలో బస చేశారు. మీ సహోదరప్రేమకు జోహార్లు అని పలుకగా భరతుడు 'మారుతీ! ఎండమావిలో సూర్యుడు మునిగిపోతే, చీకటిలో సూర్యుడు చిక్కిపోతే, భాగీరథి దోషాలవల్ల కుంటుబడితే, ఆదిశేషుడు ధరిత్రిని మోయలేక పారిపోతే, సముద్రం చెలియకట్ట దాటితే నాకు రాజ్యకాంక్ష కలుగుతుంది' అని పలికి శత్రుఘ్నునితో 'నీవు త్వరగా అయోధ్యకు వెళ్ళి వసిష్ఠునికీ, తల్లులందరికీ ఈ శుభవార్త త్వరగా తెలియచెయ్యవలసింది. తెల్లవారుతూనే ప్రజలను, సేనను జగద్వంద్యుడైన శ్రీరాముని ముంగిటకు వాద్యాల ఘోషతో తీసుకు రావలసింది' అని చెప్పాడు.

అనుమతి గైకొని శత్రుఘ్నుడు పరుగున అయోధ్యకు వెళ్ళి సుమంతుని కలుసుకోగా అతడి వదనం ప్రసన్నమయింది. ఇంకా చూస్తావేం త్వరగా లేచిరా! శ్రీరఘునాథుడు అయోధ్యను సమీపించాడు. హనుమంతుడు నందిగ్రామంలో ఉన్నాడు. మిగతావారికి త్వరగా ఈ విషయం తెలియజేయాలి. ఆ మాటలు విన్న సుమంతుని ఆనందానికి అవధులు లేవు. సంతోషంగా



పరుగుతీశాడు. రఘురాముడొచ్చాడని దుందుభులు మ్రోగించారు. భేరీల మోతకు ఆకాశం దద్దరిల్లింది. శత్రుఘ్నుడు రాజభవనాలపై కలశాలను యథాస్థానంలో ఉంచాడు. సూర్యోదయం కాగానే భూమిపైన కిరణాలు ప్రసరించినట్లు, రఘురాముడు వచ్చాడన్న వార్త నగరంలో పాకిపోయింది. అన్నివీధుల్లో జనం పరుగులెత్తారు. శరీరం రోమాంచితం కాగా వారి ఆనందానికి అవధులు లేవు. కనులలో నుండి ఆనందాశ్రువులు కారసాగాయి. పదునారు పద్మాల సైన్యం త్వరగా సిద్ధంకాగా పద్నాలుగు వేల గజదళం ఒకవైపు మోహరించాయి. శత్రుఘ్నుడు సుమంతుడు కలిసి కౌసల్యా భవనానికి వచ్చి మాతా! సౌమిత్రి సీతా సహితంగా రఘురాముడొచ్చాడని తెలుపగా కౌసల్యా సుమిత్రలిరువురు ఆనందంతో ఉప్పొంగిపోయి కన్నులనుండి ఆనందాశ్రువులు కారిపోతుండగా త్వరగా వాహనాల నధిరోహించారు. వసిష్ఠుని వద్దకు వెళ్ళి శత్రుఘ్నుడు ఆనందంగా 'స్వామీ! రఘునందనుడు విచ్చేశాడు. త్వరగా అతని సన్నిధికి పోదాం పదండి' అన్నాడు. రఘునాథుని ఆగమన వార్త విని బ్రహ్మపుత్రుడు స్వానందంలో ఓలలాడాడు. చతురంగ బలాలన్నీ నగరం వెలుపల ఆయత్తమయినాయి. మెరుపువలె పతాకం మెరుస్తుండగా మకరతోరణాలు ముందుకు సాగిపోయాయి. పద్దెనిమిది పద్మాల ప్రజలు నగరం వెలుపలకు పరుగెత్తారు. కైకేయి, సుమిత్ర, కౌసల్యలు పల్లకీల నధిరోహించారు. మంగళ వాద్యాలహోరులో ఆ సంరంభం వర్ణించనలవికాదు. వసిష్ఠ, శత్రుఘ్న, సుమంతులు దివ్యరథాలలో ఆసీనులు కాగా జనులంతా ఆనందమయులై రఘురాముని దర్శించటానికి బయలుదేరారు. ముహూర్త సమయం సమీపిస్తే ఉత్సవం వేగంగా సాగిపోయినట్లు, దప్పికగొన్నవారు గంగ ఒడ్డుకు పరుగులెత్తినట్లు బ్రహ్మానందంలో జనులు సాగిపోయారు. నంది గ్రామంలో భరతుడు, హనుమంతుడు సూర్యోదయాన్నే నిద్రలేచి నిత్యకృత్యాలు ముగించుకొని

ముందుకు సాగిపోయారు. 'ఈ రోజు నా జన్మ ధన్యమైంది. కన్నులారా నిధివంటి రాముని గాంచబోతున్నాను' అన్నాడు భరతుడు.

**భరతుని కలయిక**

ఇక్కడ భరద్వాజ మహర్షి అనుమతి గైకొని రఘునందనుడు పుష్పకంలో కూర్చొని త్వరగా విమానాన్ని అయోధ్యవైపు సాగిపొమ్మన్నాడు. భరతునితో హనుమ 'త్వరగా పైకి చూడండి' అన్నాడు. వెంటనే హనుమంతునితో 'ఆకాశంలో వాద్యఘోష వింటుంటే నాకు ఆశ్చర్యం కలుగుతున్నది అన్నాడు. హనుమ అది పుష్పకవిమానం, సేనాసహితంగా సీతారమణుని తీసుకుని అతివేగంగా వస్తున్నద'ని పలుకగా విమానానికి సాష్టాంగనమస్కారం చేసి తిరిగి తలెత్తి విమానాన్ని అవలోకించాడు. తిరిగి సాష్టాంగ నమస్కారం చేసి భరతుడు చంద్రుని కొరకు చకోరం ఎదురుచూసినట్లు ప్రేమగా ఆకాశంలోకి చూడసాగాడు. మారుతి చేయిపట్టుకుని కైకేయీ తనయుడు ముందుకు సాగిపోయాడు. రాఘవుని ఆనతి ననుసరించి పుష్పకం నేలపై దిగింది. సీతాసహితంగా రఘునందనుడు విమానంనుండి కిందికి దిగి ఆ అయోధ్యారాజ్యానికి సాష్టాంగప్రణామం చేశాడు. జన్మభూమికి, జాహ్నవికి, జననికి, సద్గురుస్థలమైన పవిత్రభూమికి శివహరి ప్రతిమలకు మహాత్ములు సాష్టాంగప్రణామం చేస్తారు. అంతేకాక తాపసులకు, వేదజ్ఞులకు, వృద్ధులకు, బ్రాహ్మణులకు, యజ్ఞప్రాసాదానికి, ధ్వజానికి, బలిపీఠానికి, సమాధిస్థలానికి మహాపురుషులు నమస్కరిస్తారు. సత్యవ్రతుడైన రఘునాథుడు అయోధ్యకు నమస్కరించడం హనుమంతునితో సహా భరతుడు కూడా చూచి అష్టభావాలు ముప్పిరిగొనగా శ్రీరామునికి ప్రణమిల్లారు. శ్రీరామవియోగం చేత శరీరమంతా కృశించిపోగా, భస్మధారియై వల్కలాలు ధరించి తాపసివలెనున్న భరతుని గాంచి సీతారమణుడు కలవరపడ్డాడు. తమాలనీలుడైన రఘువీరుడు నేలపై నడుస్తూ ఆవు లేగదూడ వద్దకు వెళ్ళినట్లు వేగంగా వెళ్ళాడు. అలాగే భరతుడు,



లోభి ధనాన్ని చూడగానే పరుగున వెళ్ళి కౌగిలించుకున్నట్లు, శ్రీరామచరణాలపై మోకరిల్లాడు. పుట్టుగుడ్డికి చూపు వచ్చినట్లు, మృత్యుముఖంలో అమృతాన్ని సేవించినట్టు, దరిద్రునికి అకస్మాత్తుగా ధనం లభించినట్లు, దొంగలు దోచుకొనే సమయానికి అనుకోకుండా రక్షకుడు పరుగున వచ్చినట్లు భరతుడు అమితానందభరితుడయ్యాడు. రాఘవుడు భరతుని లేవనెత్తి హృదయానికి హత్తుకున్నాడు. ఇద్దరి కనులనుండి వెలువడిన అశ్రుధారలు వరదలై పారాయి. వారి కలయిక హరిహరుల సంగమం వలె, సూర్యచంద్రుల వలె, క్షీరాబ్ధివలె గోచరించింది. వేదాంత గ్రంథాల సారమంతా ఒక్కటైనట్లు, శ్రీరామ భరతుల కలయికలో ఏకత్వం మేళవించింది. సమసంతోషం సమాన ప్రేమలతో మనసంతా నిండిపోగా వియోగవ్యథ దిగంతాలకు పారిపోయింది. ఎంతసేపు ఆలింగనం చేసుకున్నా తనివితీరడం లేదు. ఆ సన్నివేశాన్ని సుగ్రీవ విభీషణులు కన్నులారా గాంచారు. శ్రీరామభరతుల ప్రేమ అద్భుతమైనది. ఒకదానికంటె మరొకటి మధురం. ప్రాణాధికమైనది. సహోదరుడు, సాధువు, విరక్తుడు, భక్తుడు ఈ నాలుగు విధాలుగా భరతుడు వందనీయుడు. రాజ్యాన్ని వదలి అరణ్యాలలో పద్నాలుగు సంవత్సరాలు నివసించాడు. ఆ సహోదరప్రేమ మనలో లేదు. ఒకరి ప్రాణాలు మరొకరు తీసుకుంటాము. ఇప్పుడు రఘునాథుని దాసులమైనందున ముల్లోకాలలో కూడా కీర్తించబడుతున్నాము. కాని వాలి, రావణులిరువురు ధన్యులు. వారు విరోధంతోనే సచ్చిదానందస్వరూపుడైన రఘునందనుని చెలిమి చేశారు.

లేగదూడ ప్రేమగా ఆవుపొదుగుకై పరుగులిడినట్లు భరతుడు పరుగున వచ్చి ప్రేమపూర్వకంగా జానకి చరణాలకు ప్రణమిల్లాడు. తదుపరి భరతుడు, లక్ష్మణుడు ఉప్పొంగిన ప్రేమతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. సుగ్రీవ, విభీషణులతో రఘునందనుడు ఈ శుభసమయంలో మీరు కూడా భరతుని గాఢాలింగనం చేసుకొమ్మన్నాడు. ఆ మాటలు విని ఇరువురు భరతునికి

సాష్టాంగప్రణామం చేయగా భరతుడు మొదట సుగ్రీవుని లేవనెత్తి కౌగిలించుకున్నాడు. వెంటనే విభీషణుని లేపి ప్రీతితో హృదయానికి హత్తుకున్నాడు. ఆ మీదట నల, నీల, వాయునందనులను, జాంబవదాది వీరులను కలుసుకున్నాడు.

పిమ్మట భరతుని వలె దీక్షతోనున్న గుహుడు భక్తితో రామునికి నమస్కరించాడు. రాఘవునికి అందరూ సమానమే. గుహుని రాముడు హృదయానికి హత్తుకోగానే గుహుని ఆనందానికి అవధులు లేవు. గుహ, భరతులతో కలసి రఘునాథుడు విమానంలో ఆసీనుడు కాగానే విమానం వాయువేగంతో గాలిలో పయనించింది. క్షీరాబ్ధితీరంలో గరుడుడు వాలినట్టుగా నందిగ్రామ సమీపాన విమానం దిగింది. సీతారాములు పుష్పకవిమానం నుండి దిగీదిగగానే క్షణంలో వానరులు, అసురులందరూ దిగిపోయారు. వెంటనే రాఘవుడు పుష్పకంతో నీవు వెంటనే కుబేరుని వద్దకు వెళ్ళి మళ్ళీ స్మరించగానే మా వద్దకు వచ్చెయ్యి అని ఆజ్ఞాపించాడు. అనుమతి గైకొని పుష్పకం గాలిలోకి లేచి కుబేరుని వద్దకు వెళ్ళిపోయింది.

నందిగ్రామ సమీపంలోని అరణ్యంలో రఘునాథుడు విడిది చేయగానే వానర అసురదళాలన్నీ అక్కడనే కూర్చొన్నాయి. అక్కడ అయోధ్య వెలుపల సుందరంగా రథాన్ని అలంకరించి సైన్యమంతా ఆనందంగా బయలుదేరారు. పదునాలుగువేల గజదళం, భయంకరమైన పదహారుకోట్ల కాల్బలం శత్రుఘ్నుని వెంట శ్రీరాముని కలుసుకోవడానికి వచ్చారు. భరతుడు రాఘవునితో 'శత్రుఘ్న సుమంతులు, తల్లులు, స్నేహపూర్వకంగా మిమ్ములను కలుసుకోవడానికి వచ్చారు. తపోజ్ఞాన సమర్థులు, శాంతి క్షమలలో పర్వతం వంటివారు, సద్గురునాథులు అయిన వసిష్ఠులవారు కూడా మిమ్ములను త్వరగా కలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. అయోధ్యనుండి సకలబ్రాహ్మణులు,



పదునెనిమిది పద్మాలసైన్యం సంపూర్ణంగా అపారమైన ప్రీతితో మిమ్ములను కలవాలనుకొంటున్నారు' అని చెప్పాడు.

సుమంతుడు, శత్రుఘ్నుడు రథం దిగి సీతారాముని చూచి సాష్టాంగనమస్కారం చేశారు. శత్రుఘ్న, సుమంతులను కలవటానికి రఘునాథుడు ఆసనం నుండి పైకి లేవగా శత్రుఘ్నుడు కన్నీటితో పాదాభివందనం చేశాడు. శ్రీరాముడు గదితుడై శత్రుఘ్నుని గాఢాలింగనం చేసుకొన్నాడు. వెంటనే సుమంతుడు శ్రీరాముని పాదాలు పట్టుకొనగా, సహోదరునివలె ఆదరంగా రఘుపతి ఆలింగనం చేసుకున్నాడు. పరమప్రీతితో సౌమిత్రి, సుమంత, శత్రుఘ్నులను కౌగిలించుకున్నాడు. తదుపరి వానరముఖ్యులందరు, సుగ్రీవ, విభీషణ, భూపాలురు, సుమంత, శత్రుఘ్నులను ప్రేమపూర్వకంగా కలుసుకున్నారు. వెంటనే సౌభాగ్యవతియైన జానకికి ఇరువురూ నమస్కరించారు. తదుపరి సుమంతుడు రఘురామునితో సద్గురువైన వసిష్ఠులవారు వచ్చారని విన్నవించాడు. ఆ మాట వినగానే రఘునాథుడు పరుగున ఎదురెళ్ళాడు. రాముని చూచి వసిష్ఠుడు వాహనం నుండి కిందకు దిగాడు. కనులారా సద్గురుని గాంచి జనకజామాత గదితుడై ప్రణమిల్లగా వసిష్ఠుడు త్వరగా ప్రేమతో లేవనెత్తాడు. 'జగద్వంద్యా! రఘునాథా! అందరకూ నీ దర్శనం దుర్లభం. భూభారాన్ని తగ్గించడానికి నీవు సూర్యవంశంలో అవతరించావు. సంసారభయ శత్రు విమోచనా! రావణాంతకా! చిన్మయలోచనా! పురాణపురుషా! జగన్మోహనా! నీ లీలలను చూపించి ధన్యులచేశావు' అనగా జగదాత్మయైన రాముడు 'ఇదంతా మీ కృపామాహాత్మ్యమే. గురుభక్తునికి శివ, బ్రహ్మ సనకాదికులు నమస్కరిస్తారు. రోగ, కాల, భయ, మృత్యువులవాత పడ్డవారు మీవలన రక్షింపబడతారు. దేవతలంతా బంధవిముక్తులు కావడం గురుకృపా విశేషమే' అని స్తుతించాడు.

తదుపరి సుమిత్రా తనయుడు ప్రేమగా వసిష్ఠుని చరణాలకు నమస్కరించగా, గురువు హృదయానికి హత్తుకొని నీ కీర్తి ధన్యమైందని మెచ్చుకొన్నాడు. పిమ్మట జానకి ప్రేమతో వసిష్ఠుని పాదాలకు నమస్కరిస్తే, 'అనంతకళ్యాణం, సౌభాగ్యవర్ధనం కలుగుగాక!' అని సీతను ఆశీర్వదించాడు. 'ఓ సీతా! నువ్వు పూర్ణసతివి. నువ్వు రాఘవుని కీర్తిని పెంపొందించావు. నువ్వు ప్రణవ రూపిణివి. చిత్‌శక్తివి. ఈ బ్రహ్మాండమంతా నీ స్వఇచ్ఛతో రచింపబడింది' అని వసిష్ఠుడు కీర్తించాడు.

**మాతాపుత్రుల సమాగమం**

అనంతరం వేలాదివేల దండపాణులు ముందు నడుస్తుండగా కౌసల్య, సుమిత్ర, కైకేయి సువర్ణవస్త్రసాదితమైన మేనాలలో అరుదెంచారు. సుమంతుడు రఘురామునితో స్వామీ! మీ తల్లి దగ్గరకు వచ్చింది అనగానే సీతాకాంతుడు క్షణమాత్రం సైపలేక తల్లివద్దకు పరుగులు తీసాడు. పల్లకీని నేలమీద దింపగానే లేగదూడ ఆవును చూచి చెంతకు పరుగెత్తినట్లుగా రఘురాముడు తల్లి చరణాలకు మ్రొక్కాడు. కౌసల్య వెంటనే ముల్లోకాధిపతి, శ్రీరాముని పైకి లేపి హృదయానికి హత్తుకుంది. అశ్రుధారలతో రఘుపతి తల్లికి అభిషేకం చేశాడు. వాత్సల్యం ముప్పిరిగొనగా తల్లికూడ బాష్పరుద్ధకంఠయై 'వత్సా! పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యాల్లో తిరిగి సుకుమారమైన నీ పాదాలు శీతోష్ణానికి శోషించాయి. శ్రీరామా! అయోధ్య ప్రజల మానస సరోవరానికి నీవు రాజహంసవు. శ్యామలవర్ణుడవు. సుకుమారుడవు. అట్టి నిన్ను మీ తండ్రి కంటకమైన వనవాసానికి పంపాడు. నిర్మలుడైన నా రామచంద్రుని పదునాలుగు సంవత్సరాలు వియోగమనే రాహువు కబళించాడు. ఈ రోజే సంపూర్ణంగా రామచంద్ర ముఖబింబ దర్శనం అయింది. పధ్నాలుగు సంవత్సరాల దీర్ఘరాత్రి గడిచిపోయింది. ఈరోజు రామసూర్యోదయమైంది. అయోధ్యలోని



జనవదనాలు వికసించాయి. నవమేఘవవర్ణుడైన రఘువీరుడు వియోగ సమీరాన్ని పారద్రోలాడు. నేటివరకు మా దేహక్షేత్రాలు బీడువారాయి' అని అంది. బదులుగ ఆ తల్లినుద్దేశించి 'అమ్మా! కళ్ళారా నీ పాదపద్మాలు దర్శించి నా భాగ్యం పరిపూర్ణమైంది' అని ఓదార్చాడు. తరువాత లక్ష్మణుడు కౌసల్య పాదాలకు నమస్కరిస్తే ఆమె లక్ష్మణుని కౌగిలించుకుని గదితయై 'మీరిద్దరూ నా చింతామణులు. వడిశెలవలె దూరంగా విసిరివేయబడ్డారు. నా పూర్వపుణ్యంవల్ల తిరిగి మిమ్ములను కళ్ళారా చూడగలిగాను' అని అంది. సుమిత్ర పాదాలకు ఆత్మారాముడు నమస్కరించగా ఆమె ప్రేమతో ఆలింగనం చేసుకుని గత పధ్నాలుగు సంవత్సరాలుగా అయోధ్యను ప్రేతకళ ఆవరించింది. ఈ రోజు తన ప్రాణమైన రఘుపతి రాకతో చైతన్యవంతమైంది అని తెలిపింది. రాముడు కైకేయికి ప్రణమిల్లగా ఆమె ప్రతిగా కౌగిలించుకుని 'రఘునాథా! ఈ రోజునుంచి నువ్వు కల్యాణరూపుడవై పాలించు. నేటితో నా తలపైబడ్డ అపకీర్తి అంతరించింది' అని అన్నది. ఎండిపోయిన మడుగులోని చేపల్లా అయోధ్య ప్రజానీకం తల్లడిల్లారు. జగజ్జీవనుడైన శ్రీరాముని రాకతో అందరూ ఆనందసాగరంలో తేలియాడారు.

ఇక్కడ సుమిత్ర చరణాలకు లక్ష్మణుడు మోకరిల్లగా ప్రేమతో లేవనెత్తి హృదయానికి హత్తుకుంది. 'పద్నాలుగు సంవత్సరాలు నిరాహారంగా నువ్వు అరణ్యంలో ఎంతో కష్టపడ్డావు' అని అంటే సౌమిత్రి 'రఘువీరుని దయవల్ల నేను ఎంతో ఆనందంగా ఉన్నాను' అని సమాధానమిచ్చాడు. లక్ష్మణుడు కైకేయికి నమస్కరిస్తే ఆమె కౌగిలించుకుని విజయుడివి కమ్మని ఆశీర్వదించింది. తరువాత కౌసల్య చరణాలకు మంగళజనని జానకి ప్రణమిల్లగా కౌసల్య హృదయాలింగనం చేసుకుని 'పద్నాలుగు సంవత్సరాలు నువ్వు ఎంతో శ్రమించావు' అంటూ ప్రేమతో జానకి వేలికి నవరత్నముద్రికను

తొడిగింది. అనంతరం సుమిత్రాదేవికి ప్రణమిల్లగా ఆమె 'ఓ తల్లీ! నువ్వు అరణ్యంలో ఎంతో కష్టపడ్డావు' అని తన మెడలోని మాల తీసి జానకికి వేసి ప్రేమగా హృదయానికి హత్తుకుంది. పిమ్మట సీత కైకేయికి నమస్కరిస్తే, ప్రేమగా ఆలింగనం చేసుకునే బుద్ధికూడా ఆమెకు రాలేదు. అలాటి ఆమె మరేం చెప్పగలదు? అయినా కుటిలంగా 'నీ వయస్సు చాలా తక్కువ అయినా చాలా కీర్తి గడించావు. రావణుని సంపదంతా బాగా అనుభవించి వచ్చావు. శ్రోత్రియుల పాత్ర అని తెలియక కుక్క తీసుకెళ్ళితే, కోపంతో దానిని చంపినా ఆ పాత్ర ఎన్నటికీ పవిత్రం కాదు. ఆవిధంగా రావణుని చంపి శ్రీరాముడు నిన్ను విడిపించాడు. ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా త్రిలోకఖ్యాతి చేకూరుతుంది. శ్రీరాముడు అరణ్యాల్లో కష్టించాడు కాని నీవు లంకలో సుఖంగా ఉన్నావు. అక్కడ నువ్వు పొందిన ఆనందం ఇంకా నీకు బాగా గుర్తుండే ఉంటుంది' అన్న కైకేయి మాటలకు సీత అపవిత్రునికి జవాబు చెప్పడం ఉత్తమునికే చేటు అన్నట్లుగా మౌనంగా లేచి వెళ్ళి కౌసల్య పక్కన కూర్చుంది. శాంతి చెంత క్షమ నిరంతరం శోభిల్లినట్లు, ఎక్కడ సదా ప్రేమ ప్రీతి లాస్యంచేస్తాయో అక్కడ భక్తి ఉన్నట్లు, ఎక్కడ చిత్తవృత్తులు నిశ్చలమవుతాయో ఆ స్థలాన్ని ఎన్నటికీ వదలకూడనట్లు భావుకులైన దుర్జనులను వదిలి మహాత్ముల చెంత వసించినట్లు జగన్మాత జానకి కౌసల్యవద్దకు చేరి శాంతించింది.

శ్రీరామవిజయగ్రంథం రసవంతం. అందులో ఉత్తరకాండ కలశం వంటిది. ఇకపైన అయోధ్యా ప్రవేశం కథను సావధానంగా అవధరించండి. మంగళస్నానాలు చేసి, భోజనం స్వీకరించి, మంచి సుముహూర్తంలో శ్రీరాముడు అయోధ్యలోకి ప్రవేశించబోతాడు.

శ్రీధరవరదా! రాఘవేశా! బ్రహ్మానందా! పురాణపురుషా! నీ దాసునికి దయతో అక్షయపథాన్ని ప్రసాదించవలసింది. స్వస్తి!



శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

ముప్పది అయిదవ అధ్యాయం మధురం



## అధ్యాయము - 36

# శ్రీగణేశాయనమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**స**ద్గురుడు, ఆద్యుడు, నిర్వికారుడు, బ్రహ్మాదిదేవతలకు పుట్టినిల్లయినవాడు, ఆదిమాయకు అతీతుడైనవాడు, రవికులభూషణుడు, రఘువీరుడు, అనంత బ్రహ్మాండాన్ని సృష్టించినవాడు, ప్రళయాన్ని శాసించగలవాడు, భరతాగ్రజుడైన రాముడు నందిగ్రామంలో విడిది చేశాడు.

### నందిగ్రామంలో విడిది

అయోధ్యనుండి విచ్చేసిన సకలజనులతో, షోడశ పద్మదళాలతో, రాజసైన్యంతో నందిగ్రామం క్రిక్కిరిసిపోయింది. అష్టాదశ పద్మవానరదళాలు, డెబ్బదిరెండు కోట్ల భల్లూకదళాలు, ఏబదియారు కోట్ల నల్లకోతులు సావకాశంగా దిగాయి. తదుపరి విశ్రవసుని పుత్రుడు, పుణ్యపండితుడైన విభీషణుని సేన కిందికి దిగింది. వారంతా రామభక్తి పరాయణులే. పదునెనిమిది అక్షౌహిణీల విభీషణుని సేన అహోరాత్రులు వాద్య ఘోషలో నుండగా, అంతకంటె మిన్నగా అయోధ్యాపురవాసులు బాజాభజంత్రీలు వాయించారు.

శత్రుఘ్న సుమంతులు సువర్ణవస్త్రాలతో తయారుచేసిన లక్షల శిబిరాలను నిర్మించారు. అవి రత్నఖచిత స్తంభాలతో ఆకాశాన్నంటే కలశాలతో తళతళా ప్రకాశిస్తున్నాయి. సుగ్రీవ, విభీషణాది రాజేంద్రులకు ముఖ్యమైన కపిశ్రేష్ఠులకు విశాలమైన శిబిరాలు కేటాయించబడ్డాయి. పర్వతాలలో మేటియైన మేరువులా రవికులతిలకుడైన శ్రీరాముని శిబిరం అతి ప్రముఖమైనది. మాతా గురుసోదరులతో సహా రఘువీరుడు అక్కడ నివసించాడు. లోపలి గదిలో సీతాదేవి, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి నలుగురు కోడళ్ళు వసించారు. సర్వత్రా ఆనందానికి అవధులు లేవు. రఘువీరుడు వచ్చాడని తెలిసి మామ



జనకమహారాజు అపారమైన సైన్యంతో సహా మేళతాళాలతో విచ్చేశాడు. ఏబదియారు దేశాల రాజులు సప్త ద్వీప నవ ఖండాలలో వసించేవారు బహుమతులు గైకొని పరుగున రామదర్శనానికి విచ్చేశారు. సకల ఋషీశ్వరులు, నానావ్రతాలు, సాధనలు చేసేవారు యోగయాగాలన్నీ వదిలేసి రఘువీరుని దర్శనానికి ఏతెంచారు. సప్తనగరాలలో వసించేవారు, గిరికందరాలలో, నానాతీర్థాలలో, రహస్యగుహలలో, వృక్షాగ్రాలలో వసిస్తూ వాయువే ఆహారంగా కలవారు, నానావిధమైన ఆసనాలలో వుండేవారు, శమదమాది అష్టాంగ యోగ, దేహదండన, నానా హఠయోగ వ్రతాచరణలు చేసేవారు అన్నీ వదిలేసి పరుగున వచ్చారు. మంటపంలో కూర్చున్న రఘునందనుడు పైకి లేచి వచ్చిన వారందరినీ ఆలింగనం చేసుకున్నాడు. సాకారుడు, నిరాకారుడు, (దేహి, విదేహి) అయిన రఘురాముడు తన దర్శనానికి వచ్చిన జగన్మాత పిత, మిథిలేశ్వరుడు, మామయైన జనకుని కౌగిలించుకున్నాడు.

తదుపరి నర, వానర, నృప వీరులకు, వసిష్ఠాది సకల ఋషీశ్వరులకు శ్రీరాముడు లక్షలాది బంగారు గంగాళాలలో వేడినీళ్ళు తెప్పించి, సుగంధ తైలాలతో మంగళస్నానాలు చేయించాడు. అందరికీ వస్త్రాలంకారాలు, నానారత్నభూషణాలు సమర్పించి శ్రీరాముడు అందరినీ సత్కరించాడు. విభీషణాది సుగ్రీవ వానరులకు త్వరగా మంగళస్నానాలు చేయించి అమూల్యమైన వస్త్రాలంకారాలను స్వయంగా రఘువీరుడు ఆనందంగా సమర్పించాడు. మణిమయ పాదుకలు తెప్పించి రఘునందనుడు గురుదేవుని పాదాలముందుంచాడు. వాటిని ధరించి వసిష్ఠులవారు స్వస్థానంలో ఆసీనులయ్యారు. ముగ్గురు చెల్లెళ్ళతో సహా సీత లోపల స్నానంచేసి సమస్త వస్త్రభూషణాలు ధరించింది. సకల అయోధ్యావాసులైన స్త్రీ, పురుషులందరినీ జానకీరమణుడు సమానంగా ఆదరించాడు. పిమ్మట రఘునందనుడు

సోదరులతో సహా జటలు విప్పుకొని తైలసుగంధాలతో మంగళస్నానం ఆచరించాడు. పదునాలుగు సంవత్సరాలు వ్రతదీక్షలోనున్న సీతాపతి నేడు సర్వం విసర్జించి అభ్యంగస్నానం చేశాడు. సుమంతుడు వస్త్రాలంకారాలు తెచ్చి రఘూత్తమునికి సమర్పించాడు. ఆ లావణ్యామృతసాగరుడు వస్త్రాభరణాలు ధరించగానే భరతుడు పాదుకలు తలపై నిడుకొని తెచ్చి రాఘవుని ముందుంచాడు.

అనంతరం రఘునాథుని ఆజ్ఞమేరకు సౌమిత్రి, భరత, శత్రుఘ్నులు, సుమంత ప్రధాని మంగళ స్నానాలు ఆచరించారు. సంధ్యాది నిత్య అనుష్ఠానకర్మలు పూర్తికాగానే వంట పూర్తయింది. సకలఋషులు, రాజులు భోజనానికి కూర్చున్నారు. విభీషణ, సుగ్రీవ, వాయునందనులు, నల, నీల, శరభ, గంధమాదన, సోదరసహితంగా రఘునందనుడు భోజనానికి ఆసీనుడయ్యాడు. మణిమయమైన బంగారు పళ్ళెరాలుంచి రత్నఖచితమైన పాత్రలలో నీటిని పోసి అందరికీ సమానంగా వడ్డించారు. వెండికొండలా అన్నం మెరసిపోగా, పంచభక్ష్యపరమాన్నాలతో ఆ వంట చూడటానికి ఆకులతో కొమ్మలు అలరారినట్లున్నది. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, పంచామృతంతో సహా దేనికీ రఘురాముని పంక్తిలో లోటు లేదు. భోజనాలను గురించి అంతా వర్ణిస్తే గ్రంథం అనవసరంగా విస్తారమవుతుంది. సకల జీవరాసులు రఘురాముని భోజనంతో తృప్తి చెందాయి. చేతులు కడుక్కున్న తరువాత పదమూడు గుణాలు గల తాంబూలాన్ని శ్రీరామునితో సహా అందరూ సేవించారు. కోటి మన్మథుల తండ్రివంటి రాముడు అక్కడే మూడు రోజులు వసించాడు. తదుపరి అయోధ్యా ప్రవేశానికి వసిష్ఠులవారు సుముహూర్తం నిర్ణయించారు. మంగళకరమైన పుష్యార్కయోగంలో గుణసముద్రుడు, ఉత్తముడైన రామచంద్రుడు బయలుదేరాడు. వాద్యాలఘోషతో, పదునాలుగువేల భేరీనినాదాలతో, విభీషణుని వాద్యాల హోరుతో ఆ



ప్రదేశమంతా మార్మోగింది. విభీషణ, సుగ్రీవాది రాజులు దివ్య రథాలనధిరోహించగా వాద్యాల హోరుకు భూమి కూడా కంపించింది. దివ్య రథంలో సీతాసహితంగా రఘునాథుడధిరోహించగా శత్రుఘ్నభరతులు చామరం వీచారు. వేలాదివేల దండపాణులు ముందు దారిచూపగా అన్నివిద్యలలో ఆత్మవిద్య ఉత్తమమయినట్లు, సప్తనగరాలలో అతిశ్రేష్ఠమైన అయోధ్యానగర ద్వారం వరకు రఘువీరుడు సాగిపోయాడు.

## అయోధ్యాప్రవేశం

అయోధ్యానగర విశేషాలను అప్పుడు వానరులు, అసురులు కళ్ళారా తిలకించారు. అయోధ్యతో పోలిస్తే దేవలోకం తక్కువే. అయోధ్య చుట్టూ వున్న ఉపవనాలతో పోలిస్తే నందనవనం సాటిరాదు. వృక్షాలు సదా సుఫల సంపూర్ణంగా ఆకాశాన్ని ఛేదిస్తున్నాయా అన్నట్లుంటాయి. దట్టమైన చెట్లవల్ల సూర్యకిరణాలు నేలను తాకలేవు. వనాలలో కస్తూరి మృగాలు సదా క్రీడిస్తుంటాయి. రావే సాలియ, నెమలి, చాతకం, లావే, తిత్తర మొదలైన పక్షులు సదా రామనామాన్ని ఉచ్చరిస్తుంటాయి. స్ఫటికాలతో తాపడంచేసిన సరోవరాలలో ఎర్రకలువలు సువాసనలు వెదజల్లుతూ రాజహంసలు ఆనందంగా నర్తిస్తుంటాయి. అయోధ్య చుట్టూ ఉన్న కోటగోడ ఎత్తుగా, దాట శక్యం కానిదిగా, తేజోవంతంగా నాగపడగ ఆకృతితో దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. సూర్యకిరణాలు చక్కగా విస్తరించినట్లు దుర్గమంతా వృక్షాలతో విరాజిల్లుతోంది. వాటి పండ్లు ఆకాశాన్ని తాకటాన్ని వానరులంతా వీక్షించారు. కనకాద్రి సంతతా అన్నట్లు కోటబురుజులు నలువైపుల విరాజిల్లగా, మహాద్వారం తేజస్సును వర్ణించనలవికాదు. ఐరావతంలో దేవేంద్రుడు వెళ్ళే మహాద్వారం కంటె మిన్నగా అయోధ్యవీధులు ఇరువది నాలుగు యోజనాల నిడివితో, కస్తూరివాసనలు గుబాళించగా, మఠమంటపాలు, చావడీలు అపూర్వమైన రత్నాలతో శోభిల్లుతున్నాయి. వజ్రాలతో సభామంటపం మెరవగా,

పైన ముత్యాలు హంసల్లా నాట్యం చేస్తున్నాయి. పచ్చలు చేసే శబ్దాలు రామచిలకలు చేసే కిలకిలరావాలనుబోలి ప్రతిఇంటా అద్భుతంగా వినిపిస్తున్నాయి. వీణ, తప్పెట్లు, మృదంగవాద్యాలతో చిత్రాలు మధురంగా గానం చేస్తున్నట్లు రత్నాల బొమ్మలు హస్తసంకేతాలు చూపిస్తూ నాట్యమాడినట్లున్నాయి. నూరు అంతస్తుల గోపురాలు విశాలంగా వున్నాయి. ప్రతి అంతస్తులో అందమైన బొమ్మలు, కొంచెం గాలివీచగానే గిరగిరా తిరుగుతూ నృత్యం చేస్తున్నాయి. రత్నఖచితమైన గోపురాలపై దశావతారాల బమ్మలు ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. రాజగృహంలో వజ్రాల స్తంభాలు అమిత దేదీప్యమానంగా మెరుస్తుండగా స్తంభాల మూలంలో నీలాలు పొదగబడ్డాయి. స్తంభానికి పై భాగంలో పచ్చలు చెక్కారు. ఆ భవనంలోని పొడవైన దూలాలు దట్టంగా పచ్చలతో, పొడవైన మాణిక్యాలతో సంపూర్ణంగా పొదగబడి తేజోవంతంగా ప్రకాశిస్తున్నాయి.

ఆ కాంతుల ముందు నక్షత్రాలు కూడా వెలవెలబోతున్నాయి. ప్రతి ఇంటిలో అష్టమహాసిద్ధులు, నవనిధులు ద్వారంలో తిష్ఠవేసివున్నాయి. స్త్రీ, పురుషులందరూ సమానబుద్ధి కలిగి ధర్మవర్తనులై వున్నారు. మృత్యు, రోగ, దారిద్ర, దుఃఖాలు, దుర్బుద్ధి, కరువు, పాపం, శోకం, దొంగతనం, కాపట్యం, హింసించటం, దూషణ మొదలగు అవగుణాలు అయోధ్యలో లేవు. గొడుగుకు దండం, పూలహారంలో దారం, చదరంగంలో తెలివితేటలు, యుద్ధంలో శూరత్వం ముఖ్యమని తెలుసుకోవాలి. ఋషులు భిక్షకు యింటికి రాకపోతే గృహస్థులు ఎంతో దుఃఖించేవారు. ఋషులు కూడా ప్రజల సుఖశాంతులకై ప్రార్థిస్తూ గృహస్థులు ఇచ్చిన భిక్షను ఆనందంగా స్వీకరించేవారు. ఆవులు రోజుకు మూడుసార్లు పాలిస్తాయి. సమయోచితంగా వానలు కురుస్తాయి. ధర్మశాలలో విశాలమైన మంటపాలలో వజ్రాల లింగాలు ఉజ్జ్వలంగా ప్రజ్వరిల్లుతుంటాయి. ఎరుపురంగు మాణిక్యాలతో గణేశుడు నిర్మలంగా అలరారుతుంటాడు.



ప్రతి ఇంటా వేదాధ్యయనం, న్యాయమీమాంస, సాంఖ్య, పతంజలి, వేదాంత వ్యాకరణ చర్చ జరుగుతుంటాయి. చప్పట్లు, మృదంగం మొదలైన ఉపాంగాలతో ప్రేమ గల భక్తులు కీర్తనగావిస్తారు. రాగోపరాగాలనే భార్యలతో ఒకరు సామగానం చేస్తారు. నృత్యకళావిశారదులు తాండవనృత్యం చేస్తారు. విద్యుత్ప్రాయమైన ధ్వజస్తంభాలు దేవళాలపై మెరుస్తుంటాయి. చందనం పూసి, కుంకుమతో రంగులు దిద్దుతారు. అయోధ్యలో ఎవరికీ వృద్ధాప్యం రాదు. నానా తీర్థాల జలం ఇంటింటా సమృద్ధిగా లభిస్తుంది. నీలిరంగు నెమళ్లు వీధులవెంట పరుగులిడుతుంటాయి. ప్రతి వీధినా ఒకదానికంటె ఒకటి అందమైన మందిరాలు గోపురాలతో చిత్రవిచిత్రంగా శోభిల్లుతున్న అయోధ్యను చూసి వానరగణాలు నిశ్చేష్టులయ్యారు.

ఆ సమయంలో రఘునందనుడు అయోధ్య చేరాడు. మహాద్వారంలో గణేశ, సరస్వతులను పూజించి, రఘుపతి త్వరత్వరగా సకలరాజన్యులు వెంటరాగా అయోధ్యలో ప్రవేశించాడు. నది సముద్రాన్ని కలిసినట్లు, భ్రమరం నందనవనంలో పరిభ్రమించినట్లు, చతుర్ముఖుని షడంగాలనుండి వేదాలు వెలువడినట్లు, వృత్రాసురుని వధించి ఇంద్రుడు తన మందిరంలో అరుదెంచినట్లు అందరితో కలిసి రఘునందనుడు అయోధ్యలో ప్రవేశించాడు. దేవతలు ఆకాశం నుండి చూస్తుండగా, అసంఖ్యాకమైన భూపాలుర కిరీటాలు ఒకదానికొకటి ఢీకొనగా రత్నాల కాంతులు నలువైపులా ప్రసరించాయి. దేవాంగనలకంటె అందమైన సుందరీమణులు రత్నదీపాలతో రామునికి హారతి పట్టడానికి వచ్చారు. లక్షలాది స్త్రీలు రాఘవునితో 'చిన్మయలోచనా! నీ చరణాలలో జయలాభాలు అఖండంగా లభిస్తాయి' అని చెప్పి తమ యింటి గోపురాల పైకెక్కి పూర్ణచంద్రబింబాల్లాంటి వారి ముఖచంద్రికలనుండి విశేషకాంతులు విరాజిల్లగా ఆరతిపట్టారు. వారి వంక చూచి రఘునాథుడు

నొసటితో సంకేతం చేయగా వారు రాముని మనోభావాన్ని అర్థం చేసుకున్నారు. వస్త్రాలంకారాలు తెప్పించి వెంటనే వారిని సత్కరించగా, నగరంలోని వారందరూ క్షణంలో అక్కడకు పరుగెత్తారు. మండపంలో తొక్కిసలాట జరిగింది. దండపాణులు వారిని దండించగా, రాముడు చూచి వెంటనే దూతలను పంపి జనులందరిని పిలుచుకొని రమ్మన్నాడు. రాముని ఆజ్ఞ కాగానే సకలజనులు దగ్గరకు వచ్చి శ్రీరాముని ముఖారవిందాన్ని దర్శించి చరణాలపై మోకరిల్లారు. రఘురామునిపై స్త్రీలు అక్షతలు వేశారు. ఒకరు ముఖారవిందానికి దిష్టి తీసారు. ఒకరు 'ఓ రాఘవా! మేము మా శరీరాలనే నీకు దిష్టిగా సమర్పిస్తాము అన్నారు. ఇంకొకరు ఈ మాదిరిగా మాకు నీ ముఖ దర్శనం లభించదు గదా!' అన్నారు. దేవతలంతా పుష్పవృష్టి కురిపించగా, జగద్వంద్యుడైన రఘువీరుడు తన మందిరంలోకి ప్రవేశించాడు. లోపలకు వెళ్ళి దేవతలకు పుష్పాంజలి సమర్పించాడు. సమస్తరాజన్య సేనలు అయోధ్యలో విడిది చేసాయి. అష్టాదశ పద్మ వానరులకు, లంకలోని రాక్షసులకు చిటికలో సుమంత, శత్రుఘ్నులు ఆదరోపచారాలు చేశారు. విభీషణ సుగ్రీవ రాజులందరూ సదా రాముని సన్నిధిలోనున్నారు.

## శ్రీరామపట్టాభిషేకం

వసిష్ఠులవారు రాజ్యపట్టాభిషేకానికి సిద్ధం చేయసాగారు. శ్వేతచామరం, శ్వేతచ్ఛత్రం, శ్వేతగజ, శ్వేత తురంగాలు, చతుస్సముద్రాల జలాలను, సప్త మృత్తికలను తెప్పించారు. సభామండపంలో దేదీవ్య మానమైన దివ్యసింహాసనాన్ని అలంకరించారు. సకల విద్వాంసులు, భూపతులు అందరూ విచ్చేసారు. వసిష్ఠుడు రాజీవనయనుడయిన రఘురామునితో 'జలజగాత్రా! జానకీజీవనా! జగద్వంద్యా! అనంతసదనా! మీరు ఇక రాజ్యాన్ని చేపట్టవలసింది' అని అర్థించాడు. భరతుడు ప్రేమతో 'పదునాలుగు సంవత్సరాలు నేను చేసిన



తపస్సు ఈ నాటికి ఫలవంతమయ్యేటట్లు త్వరగా ఆశీర్వదించవలసింది. మీరు సింహాసనంపై అధిష్ఠించగానే అక్షయమైన భాండారాలన్నీ తెరచి యాచకులందరికి బ్రహ్మానందంగా దానం చేస్తాను' అని వేడుకున్నాడు. వసిష్ఠుడు రఘునాథుని చేయిపట్టుకొని మండపంలోకి తీసుకుని వచ్చాడు. సీతాసహితంగా సింహాసనంపై కూర్చుండబెట్టి వేదమంత్రాలతో అభిషేకించారు. పూర్ణుడు, ఘనశ్యాముడైన రఘువీరునికి తప్తకాంచనవర్ణ పీతాంబరం కట్టి దివ్యాభరణాలతో కౌస్తుభాది మకుట కుండలాలతో అలంకరించారు. జానకితో కలసి సింహాసనమధిష్ఠించిన రఘువీరుని వద్దకు సకలరాజన్యులు విచ్చేసి అక్షతలు వేసి ఆశీర్వదించారు. సుముహూర్తం కాగానే సకలవాద్యాల హెూరు మిన్నంటగానే సింహాసనంపై దివ్యచ్ఛత్రాన్ని ప్రతిష్ఠింపచేశారు. అందరూ ఒక్కసారిగా జయజయధ్వానాలు చేశారు. దేవతలు పుష్పవృష్టి కురిపించారు. సకల రాజాధిరాజులు రాఘవునికి నమస్కరించి కానుకలు సమర్పించి చేతులు కట్టుకుని ఎదుట నిలుచున్నారు. భరతుడు కోశాగారాన్ని తెరచి యాచకులను గౌరవించాడు. ఉదారుడు, ధీరుడు, రఘుపతి తమ్ముడైన భరతుడు యాచకులందరికీ చాలుచాలు అన్నంతవరకు పెద్ద పెద్ద మూటలు కట్టి ధనాన్ని పంచిపెట్టాడు. గుర్రాలు, ఏనుగులు, అమూల్యమైన రత్నాలను యాచకులకు దానం చేశాడు. వేదంలో చెప్పినట్టుగా బ్రాహ్మణులను గోదాన, భూదానాలతో అపారంగా సత్కరించి సంతోషపరచాడు.

ఆ విధంగా పదహారురోజులపాటు అద్భుతమైన ఉత్సవాలు జరిగాయి. నాట్యగత్తెలు వచ్చి రాముని ముందు నాట్యం చేసి తమ విద్యను ప్రదర్శించారు. లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు యౌవరాజ్య పట్టాభిషేకంగావించాడు రాముడు. వస్త్రాభరణాలిచ్చి నలుగురిని ముఖ్యప్రధానులుగా చేశాడు. వారి అనుమతితో రాజ్యం చేస్తానని రాముడు సెలవిచ్చాడు. దివ్యాన్నాలతో రాజులందరికి విందు చేశాడు. వస్త్రాలంకారాలతో సేనాసహితంగా గౌరవించాడు. రాఘవుని

గుణగణాలు కీర్తిస్తూ శ్రీరాముని అనుమతి గైకొని సకలదేశాధినేతలు సేనాసహితంగా స్వదేశాలకు తరలి వెళ్ళారు.

సుగ్రీవ, విభీషణులను మాత్రం ఒక మాసం వుంచుకొని నిత్యం తన పంక్తిలో భోజనం, నానా విలాసాలతో, సంరంభాలతో ఆనందింపచేశాడు. రఘునాథుడు సింహాసనంపై ఆసీనుడు కాగా ఆనందంగా సోదరులు చుట్టూ చేరారు. భక్తిప్రపత్తులతో భరత, శత్రుఘ్నులు చామరం వీచసాగారు. ఆ సమయంలో తలుపు సందునుండి ఆ దృశ్యం చూచిన కైకేయి 'ముల్లోకాలలో కూడా భరతుని వంటి అభాగ్యుడు ఉండడు. పద్నాలుగు సంవత్సరాలు బికారిలా వనవాసం చేశాడు. చివరకు అన్నకు చామరం వీచి దాస్యం చేస్తున్నాడు. ఇదంతా నా పూర్వపాపఫలం. నా గర్భాన దరిద్రుడు జన్మించాడు. అన్నకు దాస్యం చేస్తుంటే నాకెంత దుఃఖం కలుగుతుంది' అని వసిష్ఠునితో ఏకాంతంగా వాపోయింది. బదులుగా వసిష్ఠుడు 'ఇకనైనా ప్రశాంతంగా వుండు, దశరథమహారాజును పొట్టన పెట్టుకున్నావు. రాఘవుని అరణ్యాలకు పంపావు. సచ్చిదానందుడు, పూర్ణబ్రహ్మ రఘునందనుడుగా అవతరించాడు. నీవు మూర్ఖురాలవు కాబట్టి నీ కా జ్ఞానం ఇంతవరకూ కలగలేదు.

బ్రహ్మాది దేవతలెవరిని ఆరాధిస్తారో, అపర్ణారమణుడు సదా ఎవరిని హృదయాన ధ్యానిస్తాడో, సనకాదికులు ప్రేమతో సదా ఎవరిని హృదయకమలాన నిలుపుకుంటారో అటువంటి పురాణ పురుషుడు రఘునందనుడు. ఆయనను మనసారా భజించు. నీ తెలివితేటలను కట్టిపెట్టు. వ్యర్థప్రసంగాలు చేయవద్దు. నీకు జ్ఞానాన్ని ఉపదేశించడం అరణ్యరోదనం వంటిది. చెవిటివానికి సంగీతం వినిపించడం వంటిది. వెల్లుల్లి కర్పూరాన్ని కబళించినట్లు, పూలతోటలో ఉల్లి చెట్టు ఉద్భవించినట్లు నీవు దుర్గుణాలు మానడంలేదు. రోజూ కాకి పాలు తాగినా నలుపుదనం వీడనట్లు, వేపచెట్టుకు



పాదుతీసి ఎంత చక్కెరపోసినా చివరకు పండు చేదుగానున్నట్లు, నీకు జ్ఞానాన్ని బోధించటానికి నేను పడ్డ శ్రమంతా వ్యర్థమయింది. మట్టిని పరుసతో ఎంత రుద్దినా అది ఎన్నటికీ బంగారం కాలేదు. పాలలో ఇసుకవేస్తే అది కల్పాంతానికి కూడా కరగదు. ఆ విధంగా నీకు నేను బోధించిన జ్ఞానమంతా వృథా అయింది. ఇప్పటికైనా నీ మనస్సును స్థిరంగా రఘునాథునిపై నియమించవలసింది అని ఆమెకు బోధచేసి వసిష్ఠులవారు వెలుపలకు వచ్చారు.

## వానరులు స్వస్థానాలకు వెళ్ళడం

ఆ సమయంలో రఘురాముడు విభీషణ, సుగ్రీవులకు వీడ్కోలు సందేశమిస్తున్నాడు. శ్రీరాముడు వానరులతో మీరంతా భోజనం చేసి బయలుదేవలసినది. వారి మాటలపై ఆదరంతో అంతా అవశ్యం అన్నారు. ఆ రోజు గొప్ప వేడుక. బ్రాహ్మణులను, వానరులందరినీ రావించి భోజనాలు ఆరంభించారు. సరసిజోద్భవునికి తండ్రియైన రఘురాముడు ప్రేమతో గంధాక్షతలు చల్లి ఆదరంగా అందరికీ పూలహారాలను సమర్పించాడు. సుగంధపరిమళ ద్రవ్యాలను అందరికీ శోభాయమానంగా పూసారు. ధూపదీపానంతరం భోజనాలకు కూర్చొన్నారు. శ్రీరామగృహంలోని దివ్యాన్నపు సుమధుర సువాసనలకు వసంతుడు కూడా భోజనేచ్ఛతో అక్కడే ప్రదక్షిణం చేయసాగాడు. ఆ అన్నపు వాసనలు స్వర్గంలో ఉన్న దేవతలకు కూడా చేరాయి. వారికి కూడా శ్రీరామపంక్తిలో కూర్చొని భోంచేయాలని నోరూరింది. బంగారు పీటలు వేసి దివ్యరత్నాలతో పొదిగిన పళ్ళాలు పెట్టారు. ఎదుట వుంచిన ముక్కాలిపీటలు కూడా దివ్యరత్నాలతో పొదగబడి నలుమూలల దివ్యకాంతులు వెదజల్లాయి. సువాసనలతో నిండిన జల పాత్రలను ప్రక్కన అమర్చారు. పాత్రలచెంత వుంచిన దీపస్తంభాలు రత్నాల వెలుగులో శోభిల్లాయి.

ఆ రామభక్త భోజనపంక్తిలో ప్రథమంగా సంపూర్ణ విశ్వాసమనే లవణం వడ్డించబడింది. విరక్తి అనే మిరియాల పొడి, నానాసాధనలనే శాకాలు వడ్డించబడ్డాయి. సత్కర్మలనే పండ్ల ముక్కలను, నవవిధభక్తులనే పాలతో కలిపి, వాటిపై నిశ్చలత అనే చక్కెర వేయగా అంతా తెలుపుగా గోచరించింది. ఆత్మబోధ అనే అన్నం పూర్ణంగా, దానిలో అక్షయశాంతిఅనే పప్పులుసు, అభేదత్వమనే నానారకాల వడలు అక్కడ వడ్డించబడ్డాయి. పూర్ణప్రాప్తి అనే బొబ్బట్లు, భూతకృపలనే సుకుమారమైన గారెలు, నూనెలో వేయించిన సొజ్జప్పాలతో అపారమైన మృష్టాన్నాలను వడ్డించారు. సత్వగుణమనే నేతిని వేడిచేసి లోపల తీయగానున్న పక్వాన్నంలో వేశారు. క్షమయనే పేణీలతో అందరికి సరిసమానంగా వడ్డన చేశారు. వివేకమనే అందమైన అప్పడాలను వైరాగ్యమనే అగ్నిపై కాల్చారు. విజ్ఞానమనే అమృత ఫలాలను సత్వగుణమనే అరటి పండ్లను అందరికీ పంచారు. సకలప్రాణులతో సమత ప్రధానంగా పాటించి అందమైన ఘుమఘుమలాడే మజ్జిగపులుసు అందరికీ వడ్డన చేశారు. ఆ భోజనం రుచి వేదాంతశాస్త్రవేత్తలయిన సజ్జనులకే బోధపడుతుంది. అక్కడ ప్రధానంగా గురుకృపయే ఘృతం. అదిలేక భోజనానికి రుచే లేదు. ప్రేమజ్వాలలలో అన్నం పరిపక్వం గావించబడింది. సద్భక్తులందరూ భోజనానికి కూర్చొన్నారు. స్వానందజలాలతో పాత్రలను శుద్ధిచేసి, దేహబుద్ధిని నైవేద్యంగా వదిలి పెట్టారు. నిఃస్పృ అనే గాయత్రిని జపించి ఆత్మ ప్రత్యయమైన నామభావాన్ని నీళ్ళలో వదిలారు. నివృత్తిని ఆపోసనగాపట్టి బిగ్గరగా రామనామస్మరణ గావించారు. పంచప్రాణాలను ప్రధాన నైవేద్యంగా సమర్పించి, యోగాభ్యాసం మొదటచేసి, శిఖనుండి కామగ్రంథులను పెకలించి స్వహస్తాలతో నీళ్ళువదిలారు. సంపూర్ణంగా నిరభిమానులై కరక్షాళన చేసుకున్నారు. అందరూ జగజ్జీవనుని దర్శించగా ఆనందాశ్రువులు స్రవించాయి. క్షుధాక్రాంతులయిన శ్రీరామభక్తులందరూ పసందుగా ప్రేమతో పద్మాసనం వేసుకుని సంతృప్తిగా



భుజించారు. భవరోగంతో బాధపడేవారికి కడుపులో భావక్షుధ లేదు. అటూ ఇటూ చూస్తున్నారే తప్ప ఒక్క ముద్ద కూడా తినలేకపోయారు. చంద్రోదయంతో ఇతర పాషాణాలు చలించకపోయినా సోమకాంతమణి ద్రవించినట్లు శ్రీరామపంక్తిలో భోజనం చేయడానికి భక్తులకు సాధ్యమౌతుందికాని, అభాగ్యులకు అవకాశం లభించదు. ఆనందంగా భుజిస్తూ, మధ్యలో రామనామాన్ని ఉచ్చరిస్తూ ఋషులు వేదాలను స్మరించి భావచర్చ చేశారు. ఎవరికైతే దైవీసంపత్తి కలదో వారికి రామపంక్తిలో భోజనంచేసే భాగ్యం కలుగుతుంది. బ్రహ్మానందులై తృప్తిగా త్రేన్చసాగారు. ఎక్కడ ముల్లోకాధిపతిరాణి, త్రిజగజ్జనని జానకి వడ్డిస్తుందో అక్కడ నీచపదార్థాలకు ఏమాత్రం తావులేదు. స్వానుభవమనే జలాన్ని సేవించి కర్మధర్మాల ఉత్తరాపోసన చేసి అందరూ లేచారు. వారు ఈ సంసారాన్నంతా త్యజించినట్టున్నారు. నిగర్వం, దంభరాహిత్యం తాంబూలంగా సేవించారు. రామనామ ముద్రాంకితమైన ధనాన్ని యాచకులకు దక్షిణగా దానంచేశారు. భక్తియే భూషణంగా వస్త్రాలను సద్భక్తులకు రాజీవనేత్రుడు సమర్పించాడు. ఆ సంరంభాన్ని వర్ణించడానికి ఆదిశేషువుకు కూడా శక్తి చాలదు. ఆ విధంగా స్వపంక్తిలో కూర్చుండబెట్టుకుని అందరికీ భోజనం పెట్టాడు. తదుపరి అందరినీ సభామండపానికి రావించి రఘునందనుడు గౌరవించాడు. ముకుటకుండలాలు, సర్వాలంకారాలు స్వయంగా రఘువీరుడు అందజేసాడు. అదే విధంగా ఇతర వానరులను సత్కరించాడు. విభీషణ, జాంబవంత, సుగ్రీవుని వానరసేనలను వస్త్రాలంకారాలిచ్చి గౌరవించాడు. రెండు సింహాసనాలను, రెండు ఛత్రాలను విభీషణ, సుగ్రీవులకు రాజీవనేత్రుడు బహూకరించాడు. తిరిగి వస్త్రాలు, నానా అపారమైన వస్తువులను కానుకగా సమర్పించాడు. కాని హనుమంతుడు ముందున్నప్పటికీ రఘునాథుడు ఆయన వంక చూడలేదు. దీని భావమేమని విపరీతంగా వానరసేనలన్నీ ఎదురుచూసాయి. హనుమంతుని వంటి పెన్నిధిని

పక్కన పెట్టుకుని బ్రహ్మాండాన్ని దిగదుడ్చి దిష్టి తీయవలసింది పోయి రాముడు అతనివంక ఎందుకు చూడలేదా? అని తలపోసారు. ఆయన చేసిన ఉపకారాలరాశి మేరుపర్వతానికన్నా మిన్న. ఆయనను సత్కరించటానికి రాముని దృష్టి సోకలేదేమా? అని తలచారు. వెంటనే రఘుపతి లేచి మారుతిని హృదయానికి హత్తుకుని నేను సదా నీ హృదయంలో వసిస్తాను అన్నాడు. నిన్ను వదిలి ఒక్క క్షణం వుండటానికి నాకు మనస్కరించదన్నాడు. హనుమంతుడు రాముని పాదాలు పట్టుకొని నాకు అదే ప్రసాదించమన్నాడు.

సీతకూడా వానరులందరికీ వస్త్రాలంకారాలిచ్చి సత్కరించింది. కాని హనుమంతునికి మాత్రం తన మెడలోని ఒక దివ్యహారాన్ని తీసి ఇచ్చివేసింది. ఆ హారాన్ని వర్ణించడానికి ఏ ఉపమానం సరిపోదు. ముల్లోకాలలో ఏ వస్తువు కూడా దానిముందు దిగదుడుపే. పృథ్వి మొత్తం ఒక్క మణికి సమానం. అటువంటి హారాన్ని తీసుకుని జానకి మారుతి మెడలో వేసింది. హనుమంతుడు వెంటనే ఎగిరి చెట్టు పై కూర్చుని ఒక్కొక్క మణిని పంటితో విరగ్గొట్టసాగాడు. ఒక్కొక్క మణిని విరగగొట్టి ఇందులో రఘునందనుడు లేడు. వ్యర్థమైన రాళ్ళు నాకెందుకని విసిరివేయసాగాడు. సుగ్రీవాది వానరులు వ్యర్థంగా దివ్యహారాన్ని పగలగొట్టడమెందుకనగా అందులో రఘువీరుడు లేడని బదులిచ్చాడు. వానరులంతా నీ హృదయంలో ఇప్పుడా శ్రీరాముని చూపించమనగా హనుమంతుడట్లే చేశాడు! హృదయాన్ని చీల్చి చూపగా అందులో నిండుగా శ్యామవర్ణుడైన శ్రీరాముని రూపాన్ని అందరూ దర్శించారు. సింహాసనంపై రఘునాథుడు ఆసీనుడైనట్లే మారుతి హృదయ పీఠంలో రాముడు దర్శనిమిచ్చాడు. వానరులందరూ లేచి హనుమంతునికి నమస్కరించారు.

అంజనాతనయుడు అయోధ్యలో నిలచిపోగా, మిగతా వానరులంతా తమ గ్రామాలకు బయలు దేరటానికి సిద్ధమయ్యారు. లక్ష్మణ, భరత,



శత్రుఘ్నులు సుగ్రీవ విభీషణులను తమ మందిరాలకు తీసుకెళ్ళి వస్త్రాభరణాలతో ఆదరించారు. కౌసల్య సుమిత్రలతో సుగ్రీవ విభీషణులు తల్లులారా! మాపై కలకాలం మీ ప్రేమను కురిపించవలసింది అని అర్థించారు. బదులుగా కౌసల్యా,సుమిత్రలు 'ఔరా! మీరు మాకు చేసిన ఉపకారం వెలలేనిది. రఘునాథునికి విజయం చేకూర్చి నా బిడ్డను నాతో కలిపారు' అంటూ అమూల్యమైన ఆభరణాలిచ్చి వారిరువురిని గౌరవించారు.

పిదప సుగ్రీవ విభీషణులు కైకేయి మందిరం వైపు బయలుదేరారు. మధ్యలో భరతుడు కలసి అక్కడకు మీరు వెళ్ళవద్దు. ఆమె అనుచిత ప్రేలాపనతో మీ మనస్సుకు దుఃఖం కలుగుతుంది అని వారించాడు. భరతుని మాట విని వారు వెనుతిరిగి శ్రీరఘునాథుని చెంతకు వచ్చి వెళ్ళుటకు అనుమతి కోరటానికి వచ్చారు. చేతులు జోడించి నిలబడి కళ్ళనిండా నీరు నిండగా అందరూ 'ఓ రాఘవా! ఎన్నటికీ మమ్ములను మరువవద్దు. ముల్లోకాల రాజ్యసంపదను వదిలి నీ సన్నిధిలో నిత్యం వసించాలి. కాని మా ప్రారబ్ధం మంచిది కాదు. బలవంతంగా తీసుకెళ్ళిపోతున్నది. మీరు చేసిన ఉపకారం ఎంతని గుర్తు పెట్టుకొనేది. జన్మజన్మలకు మన మధ్య దూరం ఉండకూడదు. రాఘవా! మధురమైన నీ పలుకులు సదా మా మదిలో స్మరిస్తాము' అని సుగ్రీవ విభీషణులు వెక్కివెక్కి ఏడ్వసాగారు. సమాధానంగా రఘువీరుడు 'నేను సదా మీ హృదయాలలో వసిస్తాను' అని అనునయించి ఆసనం నుండి పైకిలేచి ఇరువురి శిరస్సులపై చేయి వుంచి ఆశీర్వదించగా, రఘురాముని కుడిచేతివైపు నుండి బయలుదేరారు. మరల ఆ రఘువీరుడు వారిని సత్కరించి అయోధ్యానగరం వెలుపల వరకు వెళ్ళాడు. వానరులందరు రఘునందనునికి నమస్కరించారు. విభీషణ, సుగ్రీవ, జాంబవంత, నల, నీల, అంగదులు అక్కడ రఘునాథునికి నమస్కరించి బయలుదేరారు. గద్గదిత చిత్తులై వెనుకకు తిరిగి రాముని చూచి

నమస్కరిస్తూ వానరులు, అసురులు వాయువేగంతో దక్షిణదిశగా సాగిపోయారు. కిష్కింధలో సుగ్రీవుడు వానరులతో సహా నిలిచిపోయాడు. విభీషణుడు గౌరవ సత్కారాలు పొంది రాక్షసులతో సహా లంకకు వెళ్ళి ప్రశాంతంగా నివసించాడు.

ఇక్కడ అయోధ్యలో రఘునాథుడు సోదరసహితంగా రాజ్యపాలన చేయగా భూమండలమంతా ఆనందభరితమైంది. ఎక్కడా లేశమాత్రమైనా దు:ఖానికి తావులేదు. శ్రీరాముడు పదకొండువేల సంవత్సరాలు రాజ్యం చేయగా అందరు ధర్మాన్ని పాలించేవారే కాని పాపం రవంతయినా లేదు. విష్ణువు ఎన్నో అవతారాలెత్తాడు. కాని రామావతారంలో ఎంతో సుఖించాడు. పదకొండువేల సంవత్సరాలు అక్షయంగా రాజ్యపాలన చేశాడు. ముసలితనం, మృత్యువు, దుఃఖం, దారిద్ర్యం అణుమాత్రం లేవు. సీతా సహితుడై రాజీవనేత్రుడు, బ్రహ్మానందంగా గడిపాడు. సూర్యునివలె తేజస్కులైన వసిష్ఠుడు, విశ్వామిత్రుడు, అగస్త్యుడు మొదలైన ఋషులు జానకీపతి చెంత సదా నివసించారు. అగస్త్యుని సత్సంగాన్ని నిత్యం రఘునందనుడు అభిలషించేవాడు. రాఘవుని దర్శించి యాచకులందరూ సంభావనలు పొంది సంతృప్తిగా వెళ్ళేవారు.

శ్రీరామవిజయగ్రంథం మధురమైనది. ఉత్తరకాండ కథ అద్భుతమైనది. రాజీవనేత్రుని రాజ్యపాలనలో సకలకార్యాలు ధన్యమైనవి. రామవిజయం ఒక్కపారాయణతో పాపాలన్నీ దహించబడతాయి. శ్రవణం చేస్తే శత్రువులు పరాజయం పొందుతారు. సద్భావంతో పఠిస్తే అజ్ఞానులకు జ్ఞానోదయమవుతుంది. సంతానం లేని వారికి సంతానప్రాప్తి కలుగుతుంది. భవరోగాలు పారిపోతాయి.

అయోధ్య ప్రవేశించిన తరువాత, ముందుకథ అతి రసవంతమైనది. పండితులు రాఘవుని మనసారా స్మరించి శ్రవణం చేస్తారు.



అయోధ్యాపురవాసియైన రామా! శ్రీబ్రహ్మానందా! కల్యాణధామా! శ్రీధరవరదా! పూర్ణకామా! నామానామాలకు అతీతుడవు నీవు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులయిన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది ఆరవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 37

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

**రా**ఘవా! కరుణాకరా! నీకు జయము. అజకులభూషణా, మనోవిహారా! రావణానుజపాలకా! సమరధీరా! మిత్రపుత్ర హితప్రియా! ప్రతాపసూర్యవంశ వివర్ధనా! మయజామాత కుల కాననవిచ్ఛేదనా! సకల బృందారక బంధ విమోచనా! ఆనంద సదనా! అక్షయా! కౌసల్య హృదయారవింద భ్రమరా! భరత నయన పద్మ దివాకరా! సౌమిత్రి ప్రాణాధారా! అతి ఉదారా! అయోధ్యాప్రభో! బ్రహ్మానందా! రఘునందనా! మిగతా గ్రంథ రచనను నాచే పలికించు. ఓ జగన్మోహనా! నీ లీలలు, నీ మాటలు యథార్థమైనవి.

పండితులారా! సావధానంగా ఆలకించండి. ముప్పదిఆరవ అధ్యాయంలో రాజాధిరాజైన రఘునందనుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆ పురాణపురుషుడు పదకొండువేల సంవత్సరాలు నిర్విఘ్నంగా రాజ్యపాలన చేశాడు. అయోధ్య ప్రజలు సకల మానవాళి ఆనందభరితులయ్యారు. విదేహ రాజనందిని, జగన్మాత, ప్రణవ రూపిణి అయిన అయోధ్యారాణి ప్రథమగర్భం ధరించింది. ఆరుమాసాలు నిండగానే జానకికి రఘునందనుడు సీమంతం చేయించాడు. ఆ సంరంభం సంపూర్ణంగా వర్ణించడానికి ఆదిశేషునికి కూడా అలవికాదు.

### సీతాపరిత్యాగం

వసంతకాలంలో క్రీడా వనవిహారానికి సీతాసమేతంగా రాఘవుడు వేంచేశాడు. ఆ వనం నందనవనం కన్నా శోభాయమానంగా ఉంది. వృక్షాలన్నీ సదా ఫలభరితంగా, సూర్యకిరణాలు కూడా ప్రసరించలేనంత దట్టంగా నిండి ఉన్నాయి. ఆ ప్రదేశంలో సీత చేయిపట్టుకుని రాజీవనయనుడు విహరిస్తూ,



నానారకాల వృక్షాలను సీతకు చూపిస్తూ ఏకాంతంగా ఉన్న ఆ సమయంలో రాఘవుడు ప్రేమగా 'సుకుమారీ! జనకబాలా! నీ మనస్సు ఏం కావాలని కోరుతుంది. నీకు ఇష్టమైనవన్నీ తక్షణం తీరుస్తాను' అన్నాడు. నగుమోహము గల జానకీదేవి 'రఘునందనా! నా మనసులో ఒక కోరిక ఉంది. నాకు మిగిలిన వాటిపై మోజు లేదు' అని తెలిపింది.

రాజీవాక్షుడు, 'సీతా! సిగ్గుపడక నీ మనస్సులో ఏముందో నాకు చెప్పు సత్వరం నెరవేరుస్తాను' అని అన్నాడు. 'గంగాతీరంలో పవిత్రులయిన ఋషి పత్నులతో కలసి అయిదురాత్రులు గడపాలని ఉంది. దర్భాసనం వేసుకొని భూమిపై శయనిస్తూ, కందమూలాలు తిని శుచిగా ఉండాలని కోరికగా ఉంది' అని జానకి తెలిపింది. ఆమె మాటలకు శ్రీరాముడు మనసులో 'పూర్వం వనవాసం చేసి దారుణమైన కష్టాలు అనుభవించింది. అయినప్పటికీ ఈమెకు అరణ్యవాసం మీద మోజు తీరలేదు' అనుకుని భవిష్యత్సంఘటనలు తెలిసిన వాడు కాబట్టి సీతతో 'ఓ సుకుమారీ! నీకోరిక తప్పక నెరవేరుస్తాను' అని అన్నాడు. అనంతరం ఒకనాడు రఘువీరుడు నగరంలో సంచరించే నగర రక్షకులయిన గూఢచారులను ఇలా ప్రశ్నించాడు. 'మీరు నిరంతరం నగరంలో సంచరిస్తారు కదా! ప్రజలు మమ్మల్ని గురించి ఏమంటున్నారో దృఢచిత్తులై ఉన్నదున్నట్లుగా మాకు తెలియజేయవలసింది. పొగడినా, తెగడినా, కీర్తించినా, నిందించినా, మాకు తెలియజేయవలసింది' అని కోరాడు. ఎటువంటి వార్త తెలియజెప్పినా మీకు ఎటువంటి ఆపద రాదని అభయం ప్రసాదిస్తున్నానని అన్నాడు. అందుకు గూఢచారులు రాఘవా! సకల భక్తులు, పుణ్యవంతులు, అందరూ తమ యశస్సును కీర్తిస్తారు. కాని దుర్జనుడైన ఒక రజకుడు తన భార్యను హింసించగా, ఆమె కోపంతో తన పుట్టింటికి వెళ్ళిపోయింది. చాలా రోజుల తర్వాత తండ్రిని వెంటబెట్టుకుని ఆమె తన భర్త ఇంటికి వచ్చింది. వారిద్దరిని చూసి రజకుడు కోపావేశంతో మామనుద్దేశించి 'ఈమెను ఎన్నటికీ

నా ఇంటిలోకి రానీయను. నేను రాముణ్ణి కాను. రావణుడు జానకిని తీసుకెళ్ళి బహుకాలం తన ఇంట్లో ఉంచుకొన్నా తిరిగి తెచ్చుకున్నాడు. నేను రజకుడను పరిశుద్ధుడను. జనులందరి మురికి, మైల పోగొట్టే వంశం మాది. అటువంటి విపరీతాన్ని మేము సహించం. తిరిగి సీతను తీసుకొచ్చి రఘునాథుడు అనౌచిత్యంగా ప్రవర్తించాడు. నేను రాముని వంటి స్త్రీలోలుడను కాను. ఈమె ముఖం నాకు చూపించవద్దు' అని ప్రేలాడు. చండాలుడైన ఆ రజకుడు మీమీద కళంకం మోపాడు' అని విన్నవించాడు. ఇదంతా విని రాముడు చింతాక్రాంతుడయ్యాడు. లక్ష్మణుని పిలిపించి జరిగిన విషయమంతా వివరించి 'లక్ష్మణా! ఆ రజకుడు వేసిన నింద వల్ల సీతను త్యాగం చేస్తాను' అని తన మనోభీష్టం తెలిపాడు. రావణునితో సహా రాక్షసవంశ నిర్మూలన చేసి జానకీ బాలను త్రికూటాచలానికి తెచ్చినప్పుడు ఇంద్రుడు, ఈశ్వరుడు, సకలదేవతల సమక్షంలో జానకి తన దివ్యత్వాన్ని నిరూపించుకుంది. అయినా రజకుడు ఈ విధంగా నిందారోపణ చేయడం దుస్సహంగా ఉంది.' శరీరాన్ని వదిలిన ప్రాణంలా, కోపాన్ని విడిచిన జమదగ్నిలా, సంసార లంపటాలను త్యాగం చేసిన తపోధనునిలా, సంసారభయంతో మమతను వదలిన యోగిలా శ్రీరాముడు లక్ష్మణునితో 'అహింసావాది హింసను విడనాడినట్లు, మౌని వాచాలత్వాన్ని వదిలినట్లు, సత్పురుషులు మనసారా పరనిందను వదలివేసినట్లు, శ్రోత్రియులు దుష్టాచారాన్ని పరిత్యజించినట్లు నేను నిజంగా సీతను వదిలివేస్తున్నాను' అన్నాడు. ఆ మాటలు విన్న సుమిత్రాకుమారుడు మ్రాన్పడిపోయాడు. తిరిగి ఇలా అన్నాడు. 'జానకీరమణా! మూర్ఖుడు, మ్లేచ్ఛుడు, దుర్మతి, సదా వేదాలను దూషిస్తాడు. కానీ పండితులు వాటిని త్యజిస్తారా? ముత్యాలను వాయసం గుర్తించదు కాని రాజహంస వాటిని వదిలివేస్తుందా? కప్ప భ్రమరాన్ని నిందిస్తుంది కాని అది ఎన్నటికీ పద్మాన్ని వదలదు. దుష్టుడు మహాత్ములను నిందిస్తాడు కాని తెలివికలవాడు రాత్రింబగళ్ళు వారిని పూజిస్తాడు.



దొంగ వెన్నెలను దూషిస్తాడు కాని చకోరం వదలదు. అందువల్ల జానకీనాథా! ఎన్నటికీ గుణసరిత్తైన జానకిని వదలవద్దు. నేనా రజకుని నాలుక ఛేదిస్తాను'. బదులుగా శ్రీరాముడు 'అలా చేస్తే లోకమంతా విశేషంగా మనలను నిందిస్తుంది. తన తప్పు కప్పిపుచ్చుకోవడానికి రజకుని దండించాడంటారు. లక్ష్మణా! నీవిప్పుడు సీతను వనంలో వదిలిరాకపోతే నేను ప్రాణత్యాగం చేస్తాను' అని తన నిర్ణయం తెలుపగా, లక్ష్మణుడు బ్రాహ్మీముహూర్తంలో జానకీ గృహంలో ప్రవేశించి, పరమవిహ్వలుడై జగన్మాత చరణాలకు మొక్కి, 'అరణ్యంలోని తాపసులను చూచి రమ్మని రఘోత్తముడు ఆనతి ఇచ్చాడు' అని తెలుపగా విని విదేహరాజనందిని ఎంతో ఆనందించింది. లక్ష్మణా! నా మనోభీష్టాన్ని పూర్తిచేసి తన మాటను నిలబెట్టుకోవడానికి నిన్ను పంపించారు. అక్కడ ఐదురాత్రులు గడిపి త్వరగా తిరిగి వద్దాం అన్నది. సీతాదేవి మాటలు విని సౌమిత్రి కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. మనస్సులో ఈ తల్లిని అరణ్యంలో వదిలి రావడమెలా? అని శోకించాడు.

ఇక్కడ జానకి ఆనందంగా ఋషిపత్నుల పూజించటానికి వస్త్రాభరణాలు, వస్తువులు, సౌభాగ్యద్రవ్యాలు విశేషంగా తీసుకున్నది. సౌభాగ్యసరిత్తు, మంగళభగిని సీత క్షణంలో రథంలో కూర్చుంది. లక్ష్మణుడు రథానికి పరదాలు దింపి నొగళ్ళపై తాను కూర్చున్నాడు. ఎవరికి ఈ సంగతి తెలియదు. గంగాతీరానికి రథం చేరగానే అక్కడ ఎన్నో అపశకునాలను జానకి గమనించింది. దారికడ్డంగా పెద్దసర్పాలు పరుగెత్తాయి. పతివియోగమని గుడ్లగూబ అరుస్తుంది. కాకి ఎడమవైపు ఎగరడం, విపరీతంగా శోకించడం లాంటి అపశకునాలు చూచి జానకి మనస్సు కలుక్కుమంది. మరదియైన లక్ష్మణునితో విపరీతమైన ఈ చిహ్నాలు ఎందుకు కనబడుతున్నాయి? అని ప్రశ్నించింది. కాని భూధరావతారుడైన లక్ష్మణుడు బదులివ్వలేదు. కళ్ళ నుండి కన్నీరు కారుతుంటే సౌమిత్రి కంఠం గద్గదితమైంది. వెంటనే సీత 'తమ్ములతో

సహా జనకజామాత సుఖంగా జీవించుగాక! ఆయన అశుభము, దుఃఖము అంతా నాపైబడుగాక!' అని ప్రార్థించింది. మరదితో త్వరగా మనం గంగాతీరం చూచి రఘుపతిని కలుసుకోవడానికి అయోధ్యకు వెళ్ళిపోదాం అన్నది. కాని సౌమిత్రి మారుపలుకక నిస్తబ్ధత పాటించాడు. తదుపరి నౌకలో జానకిని రథంతో సహా కూర్చుండబెట్టాడు. గంగానదిలో దిగి త్వరగా ఆవలి ఒడ్డుచేరి తిరిగి వాయువేగంతో రథాన్ని తోలాడు.

ఆ అరణ్యం పరమభయంకరంగా వుంది. అక్కడ మనుష్యసంచారం లేదు. సింహాలు, సర్పాలు, పులులు అన్నీ అక్కడ వాసం చేస్తున్నాయి. సీత లక్ష్మణునితో 'ఏమీ! ఇక్కడ ఒక్క ఋషి ఆశ్రమం కూడా కానరాదే! భాగీరథి ఏ వైపున ఉన్నది? నన్ను ఎక్కడికి తీసుకుపోతున్నావు?' అని అడిగింది. విప్రుల వేదఘోష చెవులపడటం లేదే? యాగశాలలో స్వాహా వషట్కారధ్వనులు వినబడడంలేదే? అని ప్రశ్నించింది. ఇంతలో దట్టమైన అడవిలోకి రథాన్ని తీసుకెళ్ళాడు సౌమిత్రి. దర్భాసనం వేసి జానకిని దింపి ఆ స్థలంలో కూర్చుండబెట్టాడు. భూగర్భ దివ్యరత్నము, వనితాసముదాయతిలకమైన, సౌందర్యరాశియైన సీతామాతను అడవిలో వదలిపెట్టాడు. ఆమె సుందర ఆకాశంలో నక్షత్రాలవలె, ముల్లోకాలలో కూడ కృపాపాత్రమైన ఆమె శరీరకాంతులు అపారంగా వనమంతా విరాజిల్లాయి. చంద్రునిలో మచ్చవున్నది కాని అంతకంటె సుందరమైనది జానకి వదనం. మెరుపులకంటె ప్రకాశంగా ఆమె ఆభరణాలు అలరారుతున్నాయి. ఆమెను దర్భాసనంపై కూర్చుండచేసి సాష్టాంగప్రణామం చేసి తలవంచుకుని రోదిస్తూ నిలబడ్డాడు. ప్రదక్షిణ చేసి లక్ష్మణుడు తిరిగి ఆమె పాదాలను దృఢంగా పట్టుకున్నాడు. మరది పలికే మంచిమాటలను జానకి మౌనంగా విన్నది. 'జగన్మాతా! రజకుడు నింద వేసాడని రఘునాథుడు నిన్ను ఘోరారణ్యాలలో వదలి రమ్మన్నాడు. ఆయన



ఆజ్ఞ పాలించటానికి నిన్ను అరణ్యంలోకి తీసుకొచ్చాను. మీరు రఘుపతి చరణాలను మనసారా స్మరిస్తూ సుఖంగా వుండండి' అని లక్ష్మణుడు అన్న ఆనతి నివేదించాడు. అకస్మాత్తుగా పిడుగుపడి సుకుమారమైన కమలం అంతమైనట్లు, సీత మూర్ఛిల్లింది. లక్ష్మణుడు మనస్సు రాయి చేసుకుని రోదిస్తూ రథాన్నధిరోహించి వేగంగా తిరిగి వెళ్ళాడు. వనదేవతలను, వృక్షపాషాణాలను, గజ, తురగ, పంచాననాలను జానకిని రక్షించమని వేడుకున్నాడు. భూమి, నీరు, కాంతి, గాలి అన్నింటినీ సుకుమారమైన జానకిని కాపాడమని వేడుతూ పవన వేగంతో సౌమిత్రి అయోధ్యానగరం చేరాడు.

అక్కడ సీత మూర్ఛనుండి తేరుకొని కళ్ళు తెరచిచూస్తే లక్ష్మణుడు చాలా దూరం వెళ్ళిపోయాడు. లేచి నిలబడి పెద్దగా కేక వేసింది. చేతులెత్తి లక్ష్మణా! త్వరగా తిరిగి రా! నేనేమి అన్యాయం చేశాను? ఎందుకు నన్ను వదలివెళ్ళుతున్నావు? నీవు వెళ్ళి త్వరగా రఘుపతితో నన్ను వధించమని చెప్పు. ఈ ఘోరారణ్యంలో నేను ఒంటరిగా ఎక్కడకు వెళ్ళేది అంటూ రఘునాథా! త్వరగా పరుగున రా! అంటూ పెద్దగా కేకవేసింది జగన్మాత. వనంలోని జంతువులు వృక్షాలు, లతలు, అన్నీ జానకితో కలసి రోదించాయి. భూమి బలంగా వణికింది. పక్షులు, పర్వాతాలు దు:ఖించాయి. ఏనుగులు, పులులు దుఃఖంతో మూర్ఛిల్లాయి. సీతను చూచి హంస ముత్యాలహారాన్ని విడిచి శోకించింది. నెమలి నృత్యాన్ని మరచి విలపించింది. పక్షులు తమ రెక్కలతో సీతకు నీడనిచ్చాయి. వాటి ముక్కులతో నీరు తెచ్చి సీతపై చిలకరించాయి. అడవిలో ఆవులు తోకతో సీతకు గాలి వీచాయి. వనదేవతలు కూడా సీతాదేవిని చూచి దుఃఖించాయి. అరణ్యంలోని జంతుసముదాయమంతా పెద్దగా రోదిస్తూ తమ శత్రుత్వాన్ని మరచి విపరీతంగా విలపించాయి. హే రామా! హేరామా! అంటూ సీత ప్రగాఢంగా దుఃఖించింది.

సీత దుఃఖాన్ని చూచి తీగలు, పొదలు, బావులు, ఏర్లు, నదులు అన్నీ పరితాపంతో సంచలించాయి. హే రామా రాజీవనేత్రా! పవిత్రురాలైన నన్ను ఎందుకు త్యజించావు? నీవు దీనదయాళుడవే. నన్ను ఎందుకు విస్మరించావు? నన్ను ఎందుకు ఒంటరిగా వదిలిపెట్టావు? నన్ను ఓదార్చేవారెవరు? నాకు నీవు తప్ప ఎలాంటి ఆధారమూ లేదు. రాఘవా! నాకెందుకింత అన్యాయం చేశావు. కృపాసాగరా! కోదండపాణీ! నా మొర ఆలకించకుండా నన్ను ఘోరారణ్యంలో వదిలిపెట్టావు. పుట్టినప్పటినుండి నేనే తప్పుచేయలేదు. కలలో కూడా ఎవరికీ హాని చేయలేదు. కాని పూర్వజన్మలో ఏం చేసానో నాకు తెలియదు. బహుశా అదేమన్నా అనుభవానికి వచ్చిందేమో! నీవు కరుణాకరుడవు. అనాథబంధూ! నేను నీ దాసిని. హీనురాలను. పామరురాలిని. నన్ను అలక్ష్యం చేయవద్దు. నా సర్వస్వం నీవే. ఓ దాశరథీ! నాపై ఎందుకు దయ కలగలేదు. రఘుపతీ! మన స్నేహాన్ని మరచి, నాపై ఎందుకింత కాఠిన్యం వహించావు? నేను అజ్ఞానిని. బాలను. అమాయకురాలను. కృపాసింధూ! నన్ను త్యజించి అరణ్యానికి పంపడం నా కోరిక ఫలమేనా? ఇపుడు నేనెక్కడికి వెళ్ళేది? ఎవరి దర్శనం వల్ల నా జన్మాంతర కర్మ నశిస్తుందో అటువంటి ప్రాణమిత్రుడు నాకిక్కడ ఎవరున్నారు? రామా! నీవే నా తల్లివి. తండ్రివి. సోదరుడవు. హితుడవు, బంధువు అన్నీ నీవే! నా అపరాధాన్ని మన్నించి నాకు అభయాన్ని ప్రసాదించు. కరుణాసాగరా! రఘువీరా! దయాసముద్రా! నన్నుద్ధరించు. సదా నిన్ను ధ్యానం చేసేటట్టు నీవు నా మదిలో వసించేటట్టు నన్ను ఆశీర్వదించు అని ప్రార్థించింది.

అక్కడ అయోధ్యాపురి చేరి లక్ష్మణుడు గుణసింధువైన రఘునందనుడు మ్లానవదనుడై ఏకాంతంగా మందిరంలో కూర్చొని వుండగా కలుసుకొని శ్రీరామపాదాలకు మోకరిల్లాడు. కరుణాసముద్రుడైన రాముడు సీతాదేవిని తలచుకుని కన్నీరు కార్చాడు. అది చూచి లక్ష్మణుడు రఘురాజా!



చిత్రపటంలోని వృక్షచ్ఛాయవలె ఈ సంసారమాయ స్వప్నం లాంటిది. ఇది కూడా మిథ్య అని ఊరడించాడు. కాని అవధులు లేని ఆ శోకసాగరాన్ని అగస్త్యునివలె రఘువీరుడు సంపూర్ణంగా ఆపోసనపట్టి మౌనం వహించాడు.

**వాల్మీకి సమాదరణ**

ఇదిలా వుండగా అక్కడ జనకనందిని అరణ్యంలో దుఃఖిస్తూ పోసాగింది. అనుక్షణం మూర్ఛిల్లి భూమిపై పడుతూ, తిరిగి చేతులు భూమిపై ఆనించి పైకిలేచి సర్వం మరచి నేను ఇప్పుడు ఎక్కడకు వెళ్ళాలి రాఘవేంద్రా! అని రోదించసాగింది. నేను అనాథను. అత్యంత దీనురాలను. ప్రాణం వదిలేద్దామా అంటే ఆత్మహత్యాపాతకం చుట్టుకుంటుంది. రెండవది గర్భహత్యాదోషం కూడా సంప్రాప్తిస్తుంది. గుంపులో నుండి తప్పిపోయిన ఆవువలె, లేడి ఒంటరిగా వనంలో వున్నట్లు, నీరు లేకుండా జలచరాలు తల్లడిల్లినట్లు, నిషధరాజపత్ని దమయంతి పూర్వం ఘోరారణ్యంలో శోకించినట్లు, భిల్లవేషంలో భవాని ఒంటరిగా అరణ్యంలో సంచరించినట్లు, సీతాదేవి ఏ దారి తోచక కుడినుండి ఎడమకు, ఎడమనుండి కుడికి సంచరించ సాగింది. పెద్దపెట్టున రోదిస్తుండగా ఒక వింత జరిగింది. అక్కడకు కందమూలాలు ఏరుకోవడానికి వాల్మీకిఋషి వచ్చాడు. ఆయన త్రికాలజ్ఞుడు, తేజోరాశి. ఆయన జ్ఞానానికి అవధులు లేవు. రామావతారానికి ముందే ఆయన రామకథ రాశాడు. ఆయన అరణ్యంలో సంచరిస్తుండగా జగన్మాత ఆక్రందనలు విన్నాడు. సీతను దూరం నుండి వాల్మీకి ముని చూచి దగ్గరకు వచ్చి ఈ శుభకళ్యాణి ఎవరు? ప్రణవరూపిణియైన మూల ప్రకృతియా? అనాదిపీఠనివాసిని నాకు దర్శనమివ్వటానికి అరుదెంచిందా ఏమి? నా తపస్సు ఈ రూపంలో ప్రకటమైంది అని తలపోశాడు.

వాల్మీకి దగ్గరకు వచ్చి 'మాతా! నీవెవరు? ఈ ఘోరవనంలో ఏం చేస్తున్నావు? నీకు ఈ శోకాన్ని కలిగించిన వారెవరు?' అని ప్రశ్నించాడు.

బదులుగా జగన్మాత నేను మిథిలేశ్వరుని కుమార్తెను. రావణాంతకుడైన రాముని భార్యను. నేను ఏ పాపం చేయకపోయినా నన్ను ఈ ఘోరారణ్యంలో వదిలాడు సౌమిత్రి. నేను పరదేశిని, అనాథను. ఇప్పుడు నా తండ్రి మీరే అని జవాబిచ్చింది. వాల్మీకి 'ఓ జననీ! నా పేరు వాల్మీకి. కోదండపాణియైన అయోధ్యానాథునికి బాగా తెలుసు. నీ తండ్రి నా మిత్రుడు. నీవు నా బిడ్డవంటిదానవు. నీకు ఇద్దరు కుమారులు జన్మిస్తారు. వారు తండ్రికంటె పరాక్రమవంతులు. నిన్నెవరైతే బయటకు పంపారో వారికి సరైన ప్రతిచర్య చేయగలరు' అని జానకి చెయ్యి పట్టుకుని ఆశ్రమానికి తీసుకెళ్ళి, ఋషిజనాలకు పరిచయం చేయగా, తాతా! ఈమె ఎవరు? అంటే వాల్మీకి ఈమె జగన్మాత జానకి అని తెలిపాడు. ఋషులు ఈ అనర్థాన్ని ఇంటికెందుకు తెచ్చారు. మేమంతా అమాయక బ్రాహ్మణులం. గ్రామాన్ని కుటిల జనులను వదలి ఘోరారణ్యానికి వచ్చాము. కాని ఇక్కడ కూడా విఘ్నం వాటిల్లింది. ఈమె అత్యంత సౌందర్యవతి. ఈమెపై ఎన్నో అపవాదులు వచ్చాయి. ఈమె రాక మాకు అనర్థమని అనుమానం కలుగుతున్నది అన్నారు. ఒకరు సీత పతివ్రత అయితే వెంటనే భాగీరథిని ఇక్కడకు తీసుకురావాలి. అలా జరగపోతే ఈ క్షణమే ఈమెను ఇక్కడనుండి పంపెయ్యాలి అన్నారు. ఆ మాట విని జనకనందిని భాగీరథితో 'సగరకులాన్ని తరింపచేసిన ఓ తల్లీ! హరిచరణాలనుండి ఉద్భవించిన జహ్నుతనయా(జాహ్నవీ)! బ్రహ్మాండాన్ని చీల్చుకొని స్వయంగా ప్రకటమైనావు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, ఇంద్రాది సకలదేవతలు సప్త ఋషులు, సనత్కుమారులు సదా నిన్ను స్తవనం చేస్తారు. నీ నీటిని అణుమాత్రం స్పర్శించినా అపారమైన పాపాలన్నీ భస్మమవుతాయి. తెల్లని దివ్యమైన పూలహారంలా నీ కిరీటం ధగధగా మెరిసిపోతున్నది. హిమనగాన్ని ఛేధించుకొని ఒక్కసారిగా సాగరాన్ని నింపావు. ఇపుడు నా కారణంగా నీవు వేగంగా ఇక్కడకు రావలసింది' అని ప్రార్థించింది.



తరలివచ్చిన ఆ గంగా ప్రవాహాన్ని చూచి ఋషులంతా భయాక్రాంతులయ్యారు. ఉద్విగ్నచిత్తులై ఆశ్రమం వదలి పారిపోయ్యారు. ఒకరు సీతాదేవికి నమస్కరించి మాతా! ఆశ్రమం మునిగిపోతున్నది. నీవు తప్ప మమ్ములను రక్షించేవారెవ్వరూలేరు అని వేడుకొన్నారు. వెంటనే సీత గంగాదేవిని ప్రార్థించి ప్రవాహాన్ని నిశ్చలం చేసింది. జనకబాల పతివ్రత ఇది సత్యమని ఋషులంతా గర్జించారు. ఋషులందరూ కలసి జానకిని స్తోత్రం చేశారు. మాతా! నీ కష్టం చూడలేక భాగీరథి పరుగున వచ్చింది అని పొగిడారు. తదుపరి వాల్మీకి సీతాదేవిని ఆశ్రమంలో గుప్తంగా వుంచాడు. సకల ఋషులుకూడా ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచారు.

**కుశలవుల జన్మ**

నవమాసాలు నిండిన తరువాత శుభనక్షత్ర శుభదినం నాడు మధ్యాహ్న సూర్యుడు నడినెత్తికి వచ్చిన తర్వాత జానకి ప్రసవించింది. వృద్ధ ఋషిపత్నులు పరుగున వచ్చి చూడగా సూర్యచంద్రులవంటి ఇద్దరు పుత్రులు కనువిందు చేశారు. చూడటానికి మొదట పుట్టినవాడు పొట్టి, వెనక పుట్టినవాడు పొడవుగా వున్నాడు. ఇద్దరూ పుత్రులు ఒకే క్షణంలో జన్మించారు. వాల్మీకి స్నానానికి వెళ్ళగా శిష్యులు పరుగున వచ్చి జానకికి కవలలు జన్మించారని తెలిపారు. ఆ మాట విన్నంతనే దర్భ, గరికలు చేబూని జానకి వద్దకు వచ్చి శాస్త్రరీత్యా చేయవలసింది చేశాడు. పిదప దర్భపై బాలుని పరుండబెట్టి అభిషేకం చేసి కుశుడని నామకరణం చేశాడు. వాడు నిర్మలంగా, విశాలమైన నేత్రాలతో, శ్యామవర్ణంతో రాముని పోలియున్నాడు. చిన్నవాడిని గరికపై పరుండబెట్టి వెంటనే అభిషేకం చేసి వానికి లవుడని నామకరణం చేసి గొప్ప వేడుక చేశారు. శుక్లపక్షచంద్రునివలె, క్రమక్రమంగా ఉదయించే సూర్యునిలా రాఘవుని

పుత్రులు సుందరంగా, దినదిన ప్రవర్ధమానంగా పెరిగారు. వారిద్దరి ఆలనపాలన అనుదినం వాల్మీకి చూసేవాడు. ఋషి బాలకులతో వారు ఎల్లప్పుడూ ఆటలాడుతుండేవారు. ఏడు సంవత్సరాలు నిండగానే ఋషులందరిని రావించి ఉపనయన మహోత్సవం జరిపించాడు. కామధేనువు నాలుగురోజులపాటు కావలసిన పదార్థాలన్నీ సమకూర్చి ఋషులందరినీ సంతృప్తుల చేసింది. అందమైన ఆ బాలురను చూచి చాలామంది ఋషులు ఎన్నో వరాలు ఇచ్చారు. వాల్మీకి వారిరువురితో వేదాధ్యయనం చేయించారు. అరువదినాలుగు కళలలో పరిపూర్ణులను చేశారు. సకలపురాణాలు కరతలామలకం గావించారు. శతకోటి గ్రంథసమానమైన రామచరిత్రను చదివించారు. బాలుర తెలివితేటలు అత్యద్భుతమైనవి. పెక్కురు తర్కంలో వారిముందు ఓడిపోయారు. మంత్రశాస్త్రమంతా స్వయంగా వాల్మీకి ముని వారికి బోధించారు. ధనుర్వేదం చదివిన తర్వాత వారి చేతికి ధనుర్బాణాలిచ్చి యుద్ధగతి మనసుకు హత్తుకునేలా మొత్తం నేర్పించారు. ఆ విధంగా పదునాలుగు విద్యలు, అరువది నాలుగు కళలు వాల్మీకిముని వద్ద నేర్చుకుని బాలురిరువురు ఋషి పుత్రులతో కలిసి తిరుగుతుండేవారు. నానారకాలైన వినోద సంభాషణలు చేసి జానకి మనస్సు రంజింప చేసేవారు. కందమూలాలు తెచ్చి జగన్మాత ముందుంచేవారు. సత్సంగం లభించినవారు సంసారదుఃఖాలను విస్మరిస్తారు. ఆ విధంగా జానకి లోగడ జరిగినా దుఃఖాన్నంతా మరచింది. పది సంవత్సరాలు నిండగానే ఇరువురూ వేటకెళ్ళేవారు. నానారకాల జంతువులను చంపి, ఈడ్చుకుని వచ్చి తల్లికి చూపేవారు.

## కుశలవుల బ్రహ్మహత్యాదోషం

ఒకరోజు అరణ్యంలో తిరుగుతూ పర్వతశిఖరంపై ధ్యానస్థుడై ఉన్న ఒక శృంగిని గమనించారు కుశలవులు. ఆయన వాల్మీకి మహర్షి సోదరుడు. సంపూర్ణంగా జింక వేషంలో ఉన్న ఆయనను చూచి కుశుడు బాణం వదలగా



ఆయన వెంటనే ప్రాణం వదిలాడు. ఆ ప్రేతాన్ని ఈడ్చుకొంటూ ఇరువురూ ఆశ్రమానికి రాగా వాల్మీకి మహర్షి వారివద్దకు వచ్చి దేనిని ఈడ్చుకొనివచ్చారని ప్రశ్నించాడు. మీ కోసం జింకను వధించి తెచ్చాం. దాని చర్మం ఒలిచి మీకు ఆసనం చేయిస్తాం అన్నారు కుశలవులు. ఇంతలో వాల్మీకి పరికించి చూస్తే తన సోదరుడు వధింపబడిన సంగతి తెలిసింది. మీరిరువురూ చేయరాని పని చేశారు. బ్రహ్మహత్యగావించి అరణ్యం నుండి ఎలా రాగలిగారు? అన్నాడు వాల్మీకి. సోదరుడికి ఉత్తరక్రియలను విధియుక్తంగా పూర్తిచేసి వెంటనే జానకి దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించాడు. జానకి 'తాతా! సూర్యవంశం అతి తీక్షమైనది. పైగా మీరు బాలురను సకల కళా ప్రవీణులను చేశారు. ఒంట్లో భయమన్నది లేనివారితో ఇటువంటి ఉపద్రవాలు తప్పవు. మీ మంత్రోపదేశం ఫలించింది. ప్రస్తుతం దోషపరిహారార్థం ఏం చేయాలో సమర్థులైన మీరే చేయించండి' అని అర్థించింది. సహస్రసువర్ణకమలాలతో ఉమారమణుని భక్తితో అర్చిస్తే బ్రహ్మహత్యాపాతకం తొలగిపోతుందని వాల్మీకి వివరించాడు. వెంటనే కుశలవులు తాతా! సువర్ణ కమలాలు ఎక్కడ లభిస్తాయో తెలిపితే మేము వెంటనే వెళ్ళి వాటిని తీసుకొస్తాం అని వేడుకున్నారు. అయోధ్య సమీపంలోని బ్రహ్మసరోవరంలో అసంఖ్యాకంగా కమలాలు వున్నాయి. వాటిని పరాక్రమశాలియైన రాముడు రక్షిస్తుంటాడు. ఆ బ్రహ్మకమలాలతో రాఘవుడు నిత్యం శివార్చన చేస్తాడు. మహాబలశాలురు రాత్రింబవళ్ళు ఆ సరోవరం చుట్టూ కాపలా తిరుగుతుంటారు అని వాల్మీకి ముని హెచ్చరించాడు. వెంటనే వారిరువురు పకపకా నవ్వి మునీశ్వరా! మేం క్షణంలో కమలాలను తెస్తాం. అలాగైతేనే నిజంగా మీ శిష్యులమని తెలుసుకోండి. అక్కడ యముడే రక్షిస్తున్నా వాడిని పూర్తిగా శిక్షిస్తాం. స్వయంగా రఘునందనుడే వస్తే వాడిని ఇక్కడికి పట్టి తెస్తాం అంటూ ధనుస్సుకు బాణాన్ని ఎక్కుపెట్టి వారిద్దరూ వేగంగా వెళ్ళిపోయారు. సింహం చూడటానికి చిన్నగా ఉన్నా దాని పరాక్రమం

అసాధారణం. సూర్యచంద్రులు చిన్నగా కనిపించినా వారి ప్రకాశం భూమిపైన ఉజ్జ్వలం. అగస్త్యుడు పొట్టిగా ఉన్నా సముద్రాన్ని ఆపోశనం పట్టాడు. ఆ విధంగా యువవీరులు వేగంగా బ్రహ్మసరోవరం చేరగా కుశుడు త్రుటిలో కమలానన్నింటిని కోసివేశాడు. తరువాత అక్కడి సంరక్షకులు సమీపించగానే లవుడు వారిపై శరపరంపర కురిపించాడు. చాలామంది రక్షకులు దివంగతులయ్యారు. మిగతావాళ్ళు అయోధ్యకు పారిపోయారు. మునిబాలురిద్దరు వచ్చి ఘోరయుద్ధం చేసి కమలాలను తీసుకెళ్ళారు అన్న వార్త శ్రీరామునికి తెలిపారు. రఘుపతి ఆ బాలుర శక్తిసామర్థ్యాలకు ఆశ్చర్యచకితుడయ్యాడు.

ఇంతలో ఇద్దరూ వేగంగా కమలాలను తీసుకువెళ్ళి వాల్మీకి ముందు సమర్పించారు. దానిని చూచి వాల్మీకి ఆశ్చర్యపడ్డాడు. పిల్లల అద్భుతమైన శక్తిసామర్థ్యాలను విని జానకి అబ్బురపడింది. నూతన శివలింగాన్ని సిద్ధపరచి సహస్రకమలాలతో పూజించగా బ్రహ్మహత్యాపాతకం నుంచి వారు సంపూర్ణంగా విముక్తులయ్యారు.

ఒకరోజు లవకుశులిద్దరూ జానకి చరణాలు స్పృశించి 'మేము ఏ దేశంలో జన్మించాము? ఏ గ్రామం? ఏ వంశం? మా తండ్రి ఎవరో మాకు చెప్పవలసింది' అని కుశుడు ప్రశ్నించాడు. అందుకు సీత ఈ విధంగా సమాధానం చెప్పింది 'అయోధ్యానగరంలో అజరాజపుత్రుడైన దశరథుడు ప్రతాపంలో ప్రచండమైనవాడు. ఆయనకు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అనే నలుగురు ప్రఖ్యాతిగాంచిన కుమారులు ఉన్నారు. వారిలో రావణుని అంతంచేసిన ప్రతాపవంతుడు మీ తండ్రి. రజకుడు నిందించాడని నన్ను ఘోరారణ్యంలో వదిలిపెట్టాడు' అని జగన్మాత కళ్ళలో నీరు నిండగా రహస్యాన్ని వెల్లడించింది. జరిగినదంతా తెలుసుకొని ఇద్దరూ ఆవేశపూరితులై తల్లిని ఓదార్చారు.



## అశ్వమేధయాగం

అయోధ్యలో పన్నెండేళ్లనుంచి వర్షం పడలేదు. సీతాసాధ్విని క్షోభపెట్టినందుకు లక్ష్మి సమస్తం వెళ్ళిపోయింది. నరసంచారం లేని దగ్ధారణ్యంలో అయోధ్యాపురి కళావిహీనమైంది. వర్షం కురవక పశువులు, విప్రులు ఎంతో బాధపడ్డారు. రఘునందనుడు వర్షం ఎందుకు కురవడంలేదు? అని వసిష్ఠుని ప్రశ్నించాడు. ఏ తప్పు చేయకుండా జానకి వెలివేయబడింది. జానకి వంటి హృదయరత్నాన్ని, సకల పతివ్రతాశిరోమణిని బయటకు పంపితే లక్ష్మి కూడా వెళ్లిపోయింది. అందువల్ల వర్షాలు కురవడం లేదు. కాబట్టి సంపూర్ణ అశ్వమేధయాగాన్ని నిర్వహించి శ్యామకర్ణ గుర్రాన్ని దేశంమీద వదిలిపెట్టాలి అని వసిష్ఠుడు కర్తవ్యోపదేశం చేశాడు.

ఇందుకు అనుగుణంగా వెంటనే సరయూతీరాన ఒక యోజన విస్తీర్ణప్రదేశంలో విశాలమైన మంటపాన్ని నిర్మించి దూతలనందరినీ పంపి మునీశ్వరులను రప్పించాడు. విభీషణ, సుగ్రీవులకు సందేశం పంపగా వారు సైన్యసమేతంగా వెంటనే అయోధ్యకు విచ్చేశారు. నలుడు, నీలుడు, అంగదుడు, జాంబవంతుడు, శరభుడు, గవాక్షుడు అద్భుతమైన బలశాలురైన అష్టాదశపద్మ వానరులందరూ విచ్చేశారు. సకలసామగ్రి వచ్చింది. వసిష్ఠుడు రఘునందనుడు అశ్వశాలకు వెళ్ళి సలక్షణమైన శ్యామకర్ణ అశ్వాన్ని ఎంపిక చేశారు. సువర్ణఫలకాన్ని తెచ్చి అశ్వం నుదుట కట్టారు. దానిపై వసిష్ఠుడు, దశరథనందనుడు రావణాంతకుడు సురబంధవిమోచనుడు, సకల నృపశ్రేష్ఠుడు, రవికులమండనుడు, శ్యామకర్ణాశ్వాన్ని వదిలాడు. ఎవరైనా బలవంతులుంటే ఈ అశ్వాన్ని బంధించవచ్చు. దీని వెంట షోడశ పద్మదళసహితంగా శత్రుఘ్నుడు రక్షణగా పంపబడ్డాడు అని రాశారు. రాజీవనేత్రుడు అశ్వాన్ని పూజించి నుదుటిపై సువర్ణఫలకాన్ని కట్టిన అనంతరం శత్రుఘ్నుడు అన్నగారికి నమస్కరించి సైన్యసమేతంగా బయలుదేరాడు. రఘునందనుడు శత్రుఘ్నునితో

పదహారవ దినంలోపల సకల దేశాలను జయించి రాజులతో సహా తిరిగి రావలసింది అని చెప్పాడు. చక్కటి జానకి సువర్ణప్రతిమను చేయించి ప్రతిమతో సహా రఘువీరుడు యజ్ఞదీక్ష వహించాడు. కిరణాలలో సూర్యునిలా, దేవతల మధ్య ఇంద్రునిలా, యజ్ఞమంటపంలో ఋషులందరి మధ్య శ్రీరాముడు శోభిల్లాడు. సుగ్రీవుడు విభీషణుడు, మారుతి యజ్ఞమంటపానికి రక్షణగా ఉన్నారు. సుమంతుడు, భరతుడు, లక్ష్మణుడు నిరంతరం రాఘవుని పక్కనే కూర్చొని ఉన్నారు. ఏయే వస్తువులు కావలసి వస్తే అవి వెంటనే సమకూర్చేవారు. ఈ వైభవాన్ని దేవతలు విమానాలనుండి వీక్షించారు. ఇక్కడ ఏబదిఆరు దేశాలను మహావీరుడైన శత్రుఘ్నుడు జయించగా సకలరాజులు శరణువేడి బహుమతులు అందించారు. ఆ సమయంలో పాతాళంలో వరుణుడు మహాయజ్ఞం ఆరంభించాడు. దానికి వాల్మీకిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. వాల్మీకి ఆశ్రమరక్షణ విధిని లవకుమారుడికి అప్పగించి పాతాళానికి వెళ్ళిపోయాడు. కుశుడు కందమూలాలు తీసుకురావడానికి అరణ్యంలో సుదూరంగా వెళ్ళిపోయాడు. లవకుమారుడు ఆశ్రమరక్షణ విధిని పాటిస్తూ వెంట ఇతర మునిబాలకులతో నానా క్రీడలతో వినోదిస్తూ చెట్టునీడన కూర్చున్నాడు. ఎనిమిది, పదేళ్ళ మునికుమారులు అందమైన కౌపీనాలతో, తలపై శిఖలతో ఆడుతూ పాడుతూ ఉన్నారు. ఇంతలో అకస్మాత్తుగా అక్కడికి శ్యామకర్ణాశ్వం పరుగున వచ్చింది. ఈ గుర్రం చూడరా ఎలా ఉందో! అంటూ మునిపుత్రులు లవునికి చూపించారు. సీతా తనయుడు పరుగున వెళ్ళి అశ్వాన్ని జుట్టు పట్టుకొని నుదుటిపై ఉన్న ఫలకాన్ని చదివిన అనంతరం 'ముల్లోకాల్లో రాఘవుడు బలశాలా?' అని పకపకా నవ్వాడు. వారి తల్లి మాత్రమే వారిని ప్రసవించిందా? భూమి నిర్వీర్యమైందా? ఈ అశ్వాన్ని ఎలా విడిపించుకుపోతారో చూస్తాను? నేను పట్టుకొన్న గుర్రాన్ని తిరిగి వదలిపెట్టనని ప్రతిన చేస్తున్నాను. ఈమాట తప్పితే సీత కడుపున జంతువుగా జన్మించినట్లే!



అని ఆ అశ్వం కళ్ళు తుడిచి వేడుకోలుగా వెన్నుచరిచి పైన ఉండే వస్త్రాన్ని మెడకు చుట్టి అరటిచెట్టుకు కట్టాడు. 'చూడండి గుర్రం ఎలా నాట్యంచేస్తున్నదో!' అని మునిబాలకులతో అన్నాడు.

వారందరూ భయంతో పొట్ట నిమురుకున్నారు. 'ఏ రాజు గుర్రం తప్పిపోయివచ్చిందో! నువ్వు బలవంతంగా పట్టుకున్నావు. వచ్చినవారికి మేము లవకుమారుడే బంధించాడని చెప్తాం' అని ముని పుత్రులు హెచ్చరించారు. మేమే దీనిని పట్టుకున్నాం. ఇందులో అనుమానమేముంది? నేను యముడిని కూడా శిక్షిస్తాను. సకల క్షత్రియులను అంతం చేస్తాను' అని వారితో అంటూండగానే అశ్వరక్షకవీరులు పరుగున వచ్చారు. బ్రాహ్మణ కుమారులను చూసి వీరులు ధాటిగా 'ఎవర్రా శ్యామకర్ణిని అరటిచెట్టుకు బంధించింది' అని దబాయించారు. పిల్లలు భయంగా 'అక్కడ కోపంగా చూస్తున్న బాలకిశోరం మేం వద్దంటున్నా కట్టాడు వాడినే శిక్షించండి' అన్నారు.

రామవిజయగ్రంథం పావనమైంది. ఇందులో లవకుశుల అధ్యాయం అమృతం కంటె మధురమైనది. చతురులైన భక్తులు శ్రవణం చేయండి. బ్రహ్మానందుడు, శ్రీధరవరదుడు జానకీ హృదయకమల భ్రమరమైన శ్రీరాముని చరిత్ర అగాధమైనది. శతకోటిశ్లోకవిస్తారమైనది. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది ఏడవ అధ్యాయం మధురం**

## అధ్యాయము - 38

# శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

ధనుర్బాణాలు చేబూని లవుడు నిలబడగా, వెనుకనుండి చతురంగదళాలు మిన్నంటే ఘోషతో అరుదెంచాయి. సకలరాజ్యాధినేతల మధ్యనున్న ప్రచండవీరుడైన శత్రుఘ్నుడుకి గుర్రాన్ని పట్టుకున్న వైనం తెలిపారు. శత్రుఘ్నుని కనుసైగతో అపారమైన సైన్యం శ్యామకర్ణను కట్టబడివున్న చోటుకు చేరింది. ఆడుకుంటున్న ఆ ఋషిపుత్రులను చూచి గుర్రాన్ని ఎవరు బంధించారు? అని ప్రశ్నించారు. పిల్లలు భయంతో చెవులపై చేతులు పెట్టుకుని మేము పట్టుకోలేదని ప్రమాణం చేశారు. 'విల్లంబులు ధరించిన ఆ బాలుడు గుర్రాన్ని కట్టివేసాడ'ని చెప్పారు. వీరులంతా నవ్వుకుంటూ బాలురు తెలియక కుతూహలంతో గుర్రాన్ని కట్టివేశారు. శ్యామకర్ణను త్వరగా విడిపించండి. అయోధ్యకు వెళ్ళిపోదాం. రఘునందనుడు మనకొరకు ఎదురుచూస్తుంటాడు అన్నారు. గుర్రాన్ని విడిపించడానికి వీరులు పరుగెత్తగా ఎవర్రా మీరు? దొంగల్లా గుర్రాన్ని విప్పడానికి వచ్చారు. గుర్రాన్ని పట్టుకుని యుద్ధానికై ఎదురుచూస్తున్నాను. మీ రఘునాథుడెవరో వారితో చెప్పండి. నన్ను మీరు బాలుడనుకుంటున్నారు. కాని మీ అందరికీ యముడను నేను. మీ అహంకార కవచాన్ని ఈరోజు యుద్ధంలో చీల్చి చెండాడుతాను అని లవుడు హెచ్చరించగా వీరులు అవాక్కయ్యారు. సుకుమారమైన ఈ బాలుడు క్రీడాధనుస్సు గైకొని ధైర్యంగా సవాలు చేస్తున్నాడు. వీనిపై శస్త్రం ప్రయోగిస్తే సకలవీరులు మమ్ముచూచి నవ్వుతారు. త్వరగా గుర్రాన్ని విప్పుకుని ముందుకు పోదాం పదండి అని అనుకున్నారు.

### లవుని ప్రతాపం - శత్రుఘ్నుడు బంధించడం

గుర్రాన్ని వదలిపెట్టడానికి వీరులు పరుగిడితే లవుడు వింటిని సంధించి త్వరగా వందలాది బాణాలు వదిలి చిటికలో వారి చేతులను విరిచి పారేశాడు.



మర్రిఆకులు తటాలున కిందరాలినట్లు వీరుల మణికట్లు భూమిపై రాలాయి. మిగతా వీరులంతా హాహాకారాలు చేస్తూ పరుగెత్తారు. ఖడ్గ సహితంగా వీరుల భుజదండాలను లవుడు పెద్దఎత్తున నేలకూల్చాడు. కొమ్మలు లేని మానులవలె ఆ వీరులు నిలబడ్డారు. హాహాకారాలు చేస్తూ సేనలందరూ దగ్గరగా వచ్చారు. లక్షలాది వీరులు వెనుకనే పరుగున వచ్చారు. మేఘాల నుండి వర్షం ధారగా కురిసినట్లుగా లవుడు బాణాలు వదలితే ఆ ధాటికి శత్రుశరాలన్నీ రాసులుగా క్రిందపడ్డాయి. ఈ బాలుడు పన్నెండు ఏళ్ళ ప్రాయంలో ఉన్నాడు. వీని ప్రతాపం ముందు కాలుడు కూడా నిలవలేడని వీరులందరూ దూరంనుండి అవలోకించారు. ఒకరేమో వీనిని చూస్తే వీని గురువు బహుసమర్థులని తెలుస్తున్నది. అందువల్లనే వీనికింత శక్తి సామర్థ్యాలు వచ్చాయి. పదహారు అక్షౌహిణుల సైన్యం ఒక్కసారిగా దండెత్తినా, బాలుని జయించడం ఎవరి తరంకాలేదు. లవుడు బాణాలతో హతమార్చాడు. నెమలిపింఛంవలె వీరులంతా చుట్టూ చేరగా మహారథియైన శత్రుఘ్నుడు పెద్దగాకేకవేస్తూ ముందుకొచ్చాడు. గజకళేబరాలన్నీ దట్టంగా పేరుకున్నాయి. నడిచేందుకు దారిలేదు. పెద్దపెద్ద వీరులని పేరుబడ్డవారంతా నేలరాలారు. ప్రేతాలన్నింటిని దాటుకుని ముందుకురికాడు శత్రుఘ్నుడు. బాలుని చూడగా రఘునందనుని మరోరూపంలో ఉన్నాడు అనుకుంటూ 'నీవెవరిబిడ్డవు. అసంఖ్యాకమైన సేనను మట్టుబెట్టావు. నా ధైర్యసాహసాలు చూపి నిన్ను ఇప్పుడు కఠినంగా శిక్షిస్తానన్నాడు'. బదులుగా లవుడు 'సింహం వద్దకు మదమెక్కి వచ్చిన ఏనుగు, గరుడుని బాహుబంధంలో చిక్కిన పాము తిరిగి క్షేమంగా ఎలా వెళ్ళగలవు?' అని ప్రశ్నించగా శత్రుఘ్నుడు వింటికి బాణాన్ని ఎక్కుపెట్టి ఆకర్ణాంతం సారించి లవునిపై వదిలాడు. సీతాపుత్రుడు క్షణంలో దానిని భంగపరిచాడు. తదుపరి ఐదుబాణాలు వదలగా వెంటనే వాటిని ఖండించాడు. పిదప మిక్కిలి కోపంతో శత్రుఘ్నుడు నూరుబాణాలను గుప్పించగా, లవుడు వదిలిన బాణాలకు ఆకాశం

కప్పివేయబడింది. సేనా సహితంగా కైకేయి తనయుడు వేసిన వాడియైన శస్త్రాస్త్రాలను లవుడు వెంటనే ఛేదించాడు. పరమ సంకటస్థితిని గమనించి శత్రుఘ్నుడు రఘునాథుడు తనకిచ్చిన నిర్వాణ బాణాన్ని తూణీరం నుండి వెలికితీశాడు. మేఘాల చాటు నుండి మెరుపులా మెరుస్తున్న ఆ దివ్యబాణాన్ని వింటికి సంధించి లవునిపైకి వదిలాడు. ఆ బాణాన్ని చూడగానే లవుడు ఇది ఖండించవలసింది కాదు. దీని నివారణోపాయం కుశుడికి మాత్రం తెలుసు. నా ప్రాణరక్షకుడైన కుశుడు ఫలాలు తేవడానికి దూరంగా వెళ్ళాడు. ఈ బాణాన్ని నేను ఎన్నటికీ తప్పించుకోలేను అని తెలిసి పరమధైర్యశాలియైన లవుడు ఒక దివ్యబాణాన్ని వదిలాడు. ఆ బాణం శత్రుఘ్ముని దివ్యబాణాన్ని సగం ఖండించింది. మిగతా సగం లవుని హృదయానికి గుచ్చుకొనగా లవుడు నేలపైబడి మూర్ఛిల్లాడు. రక్తం ధారలై స్రవించింది. కళ్ళు, ముఖమంతా రక్తసిక్తమయినాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు సంపూర్ణంగా నిలిచిపోయాయి. శిఖలోనుండి రక్తం బడబడా కారింది. ప్రాణాలతో మిగిలిన వీరులు పెద్ద ఎత్తున సింహనాదం చేస్తూ కిశోరం పడిపోయిందంటూ లవుని వద్దకు పరుగెత్తారు. దూరం నుండి చూస్తున్న ఒకడు అతడు నాటకమాడుతున్నాడని అరిచాడు. ఇంతలో శత్రుఘ్నుడు రథం దిగి లవుని వద్దకు వచ్చాడు. దగ్గర కూర్చుని ఈ బాలుని కన్నతల్లి జన్మ ధన్యమైనది. రత్నాన్ని ప్రసవించిందంటూ చేతిలోకి ఎత్తుకున్నాడు. శ్యామసుందరుడు, ఆకర్ణనయనుడు, ఆజానుబాహుడు, సుహాస్యవదనుడు అయిన శత్రుఘ్నుడు నీరుతెచ్చి లవుని ముఖంపైనున్న రక్తాన్ని తుడిచాడు. చుట్టూ ఉన్న వీరులంతా రఘువీరుని రెండవ అవతారమని ఆశ్చర్యపోయారు. ఈతడి కొరకు తల్లి విపరీతంగా దు:ఖిస్తుందని అనుకున్నారు. బాలుని చూచి ప్రేమ పొంగిపొరలగా శత్రుఘ్నుని నయనాలు అశ్రుపూరితాలయ్యాయి. బాలుని రామచంద్రునికి చూపించాలని రథంలో పరుండబెట్టుకుని శ్యామకర్ణను తీసుకొని వేగంగా వెళ్ళిపోయాడు. వాద్యాల



మోతలో మహాసిద్ధులు సాధించిన సిద్ధుని వలె శత్రుఘ్నుడు ఆనందం పట్టలేక తిరిగివెళ్ళాడు.

ఇక్కడ పిల్లలు పరుగెత్తి జానకి వద్దకు వెళ్ళి 'మాతా! మీ లవుని పడగొట్టి రథంలో తీసుకెళ్ళారు' అని చెప్పారు. విషయమంతా విని జానకి మూర్ఛిల్లింది. లోభికి తన ధనం దొంగిలించారని తెలియగానే ప్రాణాలన్నీ స్తంభించినట్లు సీత కట్టెవలె నిశ్చేష్టిత అయి గుండెలు బాదుకుంటూ ఆక్రందించసాగింది. 'నేను అనాథను, బలహీనురాలను, పరదేశిని. కేవలం బికారిని. నాలాంటి అశక్తురాలికి అదృష్టవశాత్తు ఇద్దరు బిడ్డలు కలిగారు. ఇద్దరిలో ఒకరిని ఎవరో నిర్దయగా తీసుకెళ్ళారు. పూర్వకర్మదుష్కృతిఫలం ఇప్పుడు అనుభవానికి వచ్చింది. అతి నిర్మలమైన ముఖబింబంతో, అందమైన విశాల నయనాలతో అత్యంత కోమలుడైన నా బిడ్డ గాయాలు చూస్తేనే మనలేదు. వానిపై బాణం వేసిన వాని కళ్ళు పేలిపోవుగాక!' అని సుహాస్యవదన అయిన సీత బాలుని తలచుకుని తల్లడిల్లింది. 'నా బిడ్డ అత్యంత బలహీనుడు. కందమూలాలతో బ్రతికేవానికి ఎదిరించగల బలమెలా వస్తుంది? బాలునిపై శస్త్రం వేసినవాడు క్షత్రియుడు కాదు. ముష్కరుడై వుంటాడు. అక్కడ ఎవరికైనా ఎందువల్ల దయ కలుగలేదు? నాలాంటి దరిద్రురాలి ధనాన్ని ఎవడో పాపి నిర్దయగా దొంగతనం చేశాడు. నాలాంటి గుడ్డిదాని కట్టెను బలవంతంగా తీసుకెళ్ళి ఎవడో పాపి అరణ్యంలో పారవేశాడు. నా రెక్కను నరికివేశాడు. నా కళ్ళను పీకేశాడు. నా కల్పవృక్షాన్ని పెకలించాడు. తండ్రియైన వాల్మీకి ముని కూడా ఈ సమయంలో పాతాళానికి వెళ్ళాడు. నాకు అనర్థం వాటిల్లింది. నేను ఎవరితో చెప్పుకునేది. కుశుడు వనానికి వెళ్ళాడు. ఇప్పుడు పరుగున వెళ్ళే వారెవరు? నా బిడ్డ లవుని నాతో కలిపేవారెవరు?' అని కుమిలిపోయింది.

కుశుడు అరణ్యంలో తిరిగి వస్తుండగా అపశకునాలు ఎదురయ్యాయి. కాళ్ళు మొద్దుబారాయి. అయినప్పటికీ పరుగున వచ్చాడు. ఆ వటువుకు

కటిలో కౌపీనం శోభించింది. తలపైనున్న శిఖ గాలికి రెపరెపలాడింది. తల్లి ఆకలితో వుంటుందని పరుగున వచ్చాడు. పర్ణకుటీరంలో ప్రవేశించి 'మాతా తమ్ముడు ఎక్కడికి వెళ్ళాడు? ఈ రోజు నాకు ఎదురురాలేదు. ఆడుతూ ఎక్కడ కూర్చున్నాడో ఏమో!' అన్నాడు. ముల్లోకాధిపతిరాణియైన సీత ఆక్రోశంతో రోదిస్తూ 'ఈ రోజు పరాయిరాజు వచ్చి నీ తమ్ముని బందీగా పట్టుకెళ్ళాడు. నీవే అతడికి రక్షకుడవు. నిన్నే అనుక్షణం తలచుకుంటూ ప్రాణం వదలగలడు. నీవు త్వరగా వెళ్ళు' అని పలుకగా కుశుడు ధనుర్బాణాలు గైకొని జానకికి సాష్టాంగనమస్కారం చేసి సద్గురు దేవులకు జయమంటూ జయజయధ్వానాలు చేశాడు. గురునామ మంత్రం జపిస్తూ సర్వాంగాలకు విభూతి రాసుకున్నాడు. తల్లి ఎదురుగా నిలిచి, 'ఇంద్రచంద్రకుబేరులు, బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ఎదురు నిలచినా నేను నీ కుమారుడనైతే ఈరోజు నా బలాన్నంతా ప్రదర్శించి వారిని నా బాణంతో ముక్కలు చేస్తాను. యుద్ధరంగంలో రథాలను, కుంజరాలను తునిమి శత్రువులను శిక్షించి తమ్ముని విడిపిస్తాను' అంటూ ఆ జగజ్జెట్టి తల్లికి నమస్కరించి త్వరగా వెళ్ళిపోయాడు.

**కుశుని ప్రతాపం - లవుని విమోచనం**

ఏనుగుల జాడ పట్టుకుని సింహం లంఘించినట్లు, సర్పాలను వెదుకుతూ గరుడుడు కోపంగా పరుగిడినట్లు దూరంగా సైన్యాన్ని చూచి కుశుడు పెనుకేక వేసి 'ఆగండి! ఆగండి! దొంగల్లాగా నా వస్తువును తీసుకెళుతున్నారు. దొంగలను శిక్షించినట్లు మీ చేతులు, కాళ్ళు నరికి చెవి ముక్కు కోసి మిమ్ములను శిక్షిస్తాను' అని పెద్దగా అరిచాడు. సేనాసముదాయమంతా కలవరపడి వెనుక వస్తున్న వీరుని చూచారు. ఆ రాజసము, ఘనశ్యామసుందరుని చూచి రెండవ రాఘవుడనుకున్నారు. పన్నేండేళ్ళ బాలుని చూచి వీరులంతా వణికిపోయారు. మిగిలిన వారినికూడా అంతం చేయటానికి వచ్చాడని ఒకరన్నారు. కుశుడు



వింటిని ఎక్కుపెట్టి ఒక దివ్యబాణాన్ని వదలగా శరవర్షం కురిసింది. సైన్యాధిపతి సైన్యంతో సహా వెనుదిరిగి బాణవర్షం కురిపిస్తూ బాలకా! నిన్ను క్షణంలో పట్టి అయోధ్యకు తీసుకునిపోతానన్నాడు. పది దారుణమైన వాడి బాణాలను కుశునిపై ప్రయోగించగా, మూర్ఖుడు ఎన్ని మాట్లాడినా పండితుడు ఒక్క మాటతో ఖండించినట్లు, గంగాజలాన్ని తాకగానే పాపాలన్నీ మటుమాయమయినట్లు, కుశుడు ఒక్క బాణంతో ఛేదించి వెంటనే తొమ్మిది బాణాలను వదిలాడు. నాలుగు బాణాలు గుర్రాలను, ఒకటి సేనాపతి రథాన్ని ముక్కలు చేసాయి. మిగిలిన బాణాలలో ఒకటి చాపాన్ని, ఒకటి కవచాన్ని శరీరం నుండి వేరుచేసి విరథుని చేసాయి. పిదప నడచుకుంటూ ఉన్మత్తమైన సూకరం సింహంపైకి వచ్చినట్టు కుశునిపైకి రాగా రెండుబాణాలతో రెండు చేతులు నరికి, వెంటనే ఒక దివ్యబాణంతో శిరస్సును ఎగరగొట్టాడు. సేనాపతి మరణించగానే ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగాయి. సేనాపతి సోదరుడు నాగేంద్రుడు యుద్ధానికి వచ్చాడు. విద్యుత్ప్రాయమైన ఇరువది బాణాలు నాగేంద్రుడు వదలగా ఆ బాణాల తేజస్సుకు ఆకాశమంతా వెలుగు నిండింది. సీతానందనుడు ఒకేనామంతో మహాపాతకాన్ని భస్మంచేసినట్టు ఒక్కబాణంతో వాటిని నుగ్గు చేశాడు. ఒక్క అర్ధచంద్రబాణంతో నాగేంద్రుని శిరస్సు ఖండించి, లెక్కలేనన్ని బాణాలు కుప్పించగా ఎవరూ ముందుకు రాలేదు. ఇంతలో గాలికంటే వేగంగా కైకేయి నందనుడు ముందుకొచ్చాడు. మెరుపువంటి ప్రకాశవంతమైన బాణాలను వెంటనే వర్షించాడు.

చతురుడయిన రాఘవుని పుత్రుడు వాటినన్నింటిని పిండిచేసి మేఘంవలె శత్రుఘ్ను దళాలపై శరవృష్టి కురిపించగా సుడిగాలికి మేఘాలు నశించినట్లు, పర్వతశిఖరంపై వజ్రఘాతం పడ్డట్టు, శత్రుఘ్నుని గుండెలపై గుచ్చుకొనగా శత్రుఘ్నుడు నేలకూలాడు. తదుపరి కుశుడు చుట్టూ పరికించగా దినకరునికి అంధకార ముఖం చూపించలేనట్టు, ఎదిరించే వారెవరూ లేరు.

షోడశపద్మదళాలను, దేశదేశాలరాజులను అగ్ని గడ్డిని మసిచేసినట్లు మట్టుబెట్టాడు. కుశుడు చాపాన్ని తొడుగులో పెట్టాడు. యాజ్ఞికుడు అగ్నికి అచ్ఛాదన చేసినట్లు, మెరుపు మేఘాల చాటున దాగినట్లు, బహిష్కరణ పొందిన గ్రామంలోని మందిరంవలె రథాలన్ని శూన్యంగా కనబడ్డాయి. సాక్షాత్కారంకోసం సాధకుడు తత్త్వాన్నంతా సమగ్రంగా శోధించినట్లు, లవుని కారణంగా కుశుడు రథాలన్నీ వెతకాడు. శత్రుఘ్నుని ప్రధానరథంలో మూర్ఛిల్లిన లవుడు కనిపించాడు. వెంటనే కుశుడు లవుని ఎత్తుకొని కౌగలించుకున్నాడు.

ఇంతలో లవుడు కన్నులు తెరచి, సోదరుని వదనాన్ని విలోకించి వెంటనే పైకిలేచి నిలబడి, శత్రుఘ్నుడు ఎక్కడకు పారిపోయాడని అడిగాడు. కుశుడు 'ఒరే! నీవు చాలా శ్రమించావు అన్నాడు. బదులుగా లవుడు నిన్ను చూడగానే కష్టమంతా సమసిపోయింది. మనం శ్యామకర్ణను వెంటబెట్టుకుని ఆశ్రమానికి పోదాం' అన్నాడు. కుశుడు 'అలా పోకూడదు. ఇప్పుడు యుద్ధానికి చాలామంది వస్తారు. వారినందరినీ యుద్ధంలో జయించి తదుపరి గుర్రాన్ని తీసుకుని తల్లి దర్శనం చేసుకుందాం' అని అన్నాడు. లవుడు 'అయోధ్యకు వెళ్ళి రాజైన రాఘవుని పట్టుకుని వాల్మీకి చరణాలకు సమర్పిస్తామని పందెంకాద్దామా' అని అడిగాడు.

## లక్ష్మణునితో యుద్ధం

తదనంతరం శ్యామకర్ణను వృక్షానికి కట్టి ధనుర్బాణాలు గైకొని అయోధ్యామార్గంవైపు చూస్తూ ఇరువురూ నిలబడ్డారు. గాయపడిన మిగిలిన సైనికులు కొందరు అయోధ్యకు పరుగున వెళ్ళి రాఘవునికి సకల వృత్తాంతం నివేదించారు. ససైన్యంగా శత్రుఘ్నుని యుద్ధంలో పన్నెండేళ్ళ బ్రాహ్మణ బాలురిరువురు సంహరించారు. యజ్ఞమండపంలో రఘునందనుడు తమ్ముని సమాచారం విని చేతిలోని ఆహుతిని వదిలేసి నేలపై దొర్లాడు. కళ్లలో నీరు



ధారగా స్రవించగా లక్ష్మణభరతులు, విభీషణ, హనుమత్, సుగ్రీవులు ఈ వార్తవిని తల్లడిల్లారు. యజ్ఞానికి విఘ్నం వాటిల్లింది. మహావీరుడైన శత్రుఘ్నుడు మరణించాడు. ఇంతలో రాజీవనయనుడు లక్ష్మణునితో శత్రుఘ్నుని వంటి రణధీరుని ఋషికుమారులు యుద్ధంలో సంహరించారు. అపారమైన సైన్యాన్ని తీసుకుని సోదరుని కోసం వెంటనే వెళ్ళవలసింది అన్నాడు. శ్రీరామచరణాలకు నమస్కరించి వాయువేగంతో లక్ష్మణుడు చనుదెంచగా, వెంట అపారమైన చతురంగదళాలు అనుసరించాయి. పదునాలుగు గ్రామాల వెడల్పున విస్తరించిన సేనా సముద్రంతో సహా, వాయువేగంతో లక్ష్మణుడు రణరంగానికి వచ్చాడు. సేనాపతి కాళజిత్తు సౌమిత్రి వద్దకు విచ్చేయగా, దారిలో వారికి శశిఆదిత్యులవలె లవకుశులు గోచరించారు. ఇరువురు శ్యామవర్ణసుందరులు, పన్నెండు ఏళ్ళ పసిబాలురు, చేతిలో ధనుర్బాణాలు గైకొని ధైర్యంగా ఎదురు చూడసాగారు. తమ్ముని మనస్సు తెలుసుకోవటానికి వీరుడైన కుశుడు 'అశేషమైన సేన వచ్చింది. వారి ప్రతాపం విశేషంగా కనపడుతున్నది. సేనాపతి చతురుడు. కోపావేశంతో రథమెక్కి దారుణమైన యుద్ధం చేస్తాడు. మనకు తిరిగి జయించనలవికాదు' అని అధైర్య వచనాలు పలుకగా లవుడు 'నీవు నా వెంట రక్షణగా వుంటే నాకు అపారంగా బలం పెరుగుతుంది. సరస్వతి వెంట వుంటే కఠిన పదాల భావం వెంటనే స్ఫురించినట్లు, నీ అండ చూచుకుని నేను శత్రువులను నిర్వీర్యం గావిస్తాను. అగస్త్యుని చూడక సముద్రం గర్జించవచ్చు. నీవు మృగేంద్రుడవు. జంబుకం నీ వద్దకు వచ్చింది. చీకటి సూర్యుని గెలిస్తే, భూతాలు యముని మింగితే యుద్ధంలో నీవు చెప్పింది నిజమవుతుంది. అన్నా! ఆకాశం ఎండమావిలో మునిగిపోవడం, గాలిని భూగోళంలో బంధించడం సాధ్యమయితే, ఆ సైన్యం నీ ముందు యుద్ధం చేసి జయించవచ్చు. అన్నా! నాదొక అనుమానం. ఆశ్రమం వద్ద ఘోరయుద్ధం జరిగినపుడు నా ధనుస్సు ఎందుకు విరిగింది' అని అడిగాడు.

ఇంతలో సైన్యమంతా "బాలురను పట్టుకోండి. మన కనుచూపు దాటి వాళ్ళు ఎక్కడకు పోగలరు? పట్టుకోండి" అంటూ పైకి రాసాగారు. వీరులిద్దరూ సైన్యాన్నంతా గడ్డిపోచల్లా చూస్తూ నిలబడ్డారు. కుశుడు ఈ సమయంలో మనకు ధనుస్సు ఎవరిస్తారు? సూర్యుని ధనుస్సుకోసం ప్రార్థించమన్నాడు. రాఘవుని పుత్రులిద్దరూ ఏకనిష్ఠతో ఊర్ధ్వవదనులై సూర్యుని ఆరాధించారు.

'జయజయ తమోనాశకా! సహస్రకిరణా! అంబర చూడామణీ! సూర్యనారాయణా! జీవమిళింద బంధ విమోచనా! హృదయ దళప్రకాశకా! కనకభూషితమైన ఏకచక్రరథంలో సప్తముఖ అశ్వాలతో బహువేగంగా అరనిముషంలో అపారమైన రథాన్ని మనోవేగంతో చరిస్తావు. ఆదిపురుషుడవు. నిర్వికారుడవు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నిజంగా నీ స్వరూపులే. సర్వప్రకాశకుడవు. ఆదిత్యుడవు. సకలరోగాలను దు:ఖాలను భయాలను హరిస్తావు. విశ్వదీపకా! విశ్వపాలకా! త్రిభువననేత్రా! ప్రకాశకా! కాలాత్మకా! కాలరూపా!' అని స్తుతించారు. ఆ బాలకుల ప్రార్థన విని వెంటనే సూర్యుడు ప్రసన్నమై అక్షయంగా ధనుర్బాణాలను ఆకాశ మార్గంనుండి భూమిపై వేశాడు. సూర్యునికి సాష్టాంగనమస్కారం చేసి ధనుర్బాణాలు గైకొని (వాల్మీకి) గురుధ్యానం పూర్తిచేసి సూర్యారాధన చేశారు. మా సద్గురువులు అఖండ ప్రజ్ఞావంతులు. క్షణంలో బ్రహ్మాండాన్ని గెలవవచ్చు అని ఉత్సహించారు. లవుడు ఈ రోజు యుద్ధంలో మన కోరిక పూర్తికావచ్చునంటూ సూర్యదత్తమైన కోదండాన్ని తీసుకుని త్వరగా వచ్చాడు. ఆ సమయాన సౌమిత్రి సైన్యమంతా అక్కడికి చేరింది. వారిరువురి గురి తప్పదు. వేసిన బాణం వ్యర్థం కాదు. పదాతి, అశ్వ, గజ, రథాలు, ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఎవరైనా ధనుస్సు ఎక్కుపెడితే, వారి భుజం వెంటనే విరిగిపడేది. మణికట్లు ఖడ్గంతో సహా నేలకూలాయి. లక్షల శిరస్సులతో వారు భూమిని పూజించారు. రక్తపుటేరులు ప్రవహించాయి. కళేబరాలు అందులో కొట్టుకొనిపోసాగాయి. అపారమైన



వీరులను సంహరించారు. కాళజిత్తుతో సౌమిత్రి వారిరువురూ ఒకచోట వుంటే కల్పాంతానికి కూడా వారిని జయించటం సాధ్యంకాదు. అసంఖ్యాకమైన సైన్యాన్ని తీసుకుని అగ్రజుని చుట్టుముట్టు. చిన్నవానిని నేను పట్టుకుంటాను. వెంటనే సైన్యాన్ని రెండుభాగాలుగా చేసి ఇరువది నాలుగు వలయాలు చేశారు. గడ్డిపోచ అగ్నిని చుట్టుముట్టినట్లు, నక్క పెద్దపులిని, సర్పాలు గరుడిని బంధించినట్లు, సౌమిత్రి లవుని చుట్టుముట్టాడు. కాని ప్రతిజ్ఞాపాలకుడు, వీరుడు అయిన లవుడు చాపానికి శరాన్ని ఎక్కుపెట్టి చక్రాకారం తిప్పి ఏకధాటిగా బాణాలు వదిలాడు. వాల్మీకి దివ్యమంత్రం ధన్యమైంది. ఒక్క బాణంతో కోటిశరాలను అందరిపై వేసి రాఘవసుతుడు అద్భుతం గావించాడు.

రఘుపతి మిత్రుడైన 'రుధి' అనే రాక్షసుడు, మహాబలవంతుడు ఆకాశంలో ఎగిరివచ్చి నేలపై దిగి లవుని చాపాన్ని బలవంతంగా తీసుకుని పక్షిలాగా ఎగిరిపోయాడు. చేతిలోనుండి చాపాన్ని తీసుకువెళ్లగానే సర్పం వెంటబడితే పారిపోయే దొంగకు కాళ్ళు విరిగినట్లు, పాము కప్పను పట్టుకోబోతే అనుకోకుండా మంటల్లో చిక్కుకున్నట్లు, ఎలుగుబంటినుండి తప్పించుకోబోతే రేగిచెట్టు రాపిడికి వళ్ళంతా గీసుకుపోయినట్లు, నిధికోసం ప్రయత్నిస్తే విఘ్నదేవత గొంతు నులిమినట్లుంది లవుని పరిస్థితి. కాని సీతాసుతుడు పరమచతురుడు, గరుడుడు ఆకాశానికి ఎగిరినట్లుగా వెంటనే ఎగిరి రుధిరాక్షసుని పట్టుకున్నాడు. వాని చేతినుండి ధనుస్సును లాక్కుని, అసురుని జుట్టు పట్టుకుని గిరగిరా తిప్పి నేలకేసి బాదాడు. మట్టికుండవలె ఆ రాక్షసుని అవయవాలన్నీ చూర్ణమయ్యాయి. అందరూ చూస్తుండగా రుధి ప్రాణాలు వదిలాడు. ధనుస్సు చేతికందగానే సీతానందనుడు యుద్ధంచేసి ఇరువది నాలుగు వలయాల సైన్యాన్ని క్షణంలో సంహరించాడు. మహాబలశాలురు కూడా ఆయుధాలు పారవేసి లవుని పాదాలపైబడి ప్రాణాలు కాపాడమని అర్థించారు. ఒకరు యుద్ధం వదలి పారిపోగా, మరొకడు మౌనంగా

శరణువేడాడు. కాని లక్ష్మణుడు సింహనాదం చేస్తూ ముందుకు పరుగెత్తి మెరుపులవంటి ఐదు తీక్ష్ణమైన బాణాలను మహా కోపంగా లవునిపై వేశాడు. లవుడు వెంటనే ఒక దివ్యాస్త్రాన్ని సంధించి ఇనుమును పొడిచేసినట్లు ఐదుబాణాలనూ పిండిచేశాడు. లవుడు సౌమిత్రితో 'నీవు పూర్వం ఇంద్రజిత్తును వధించావు. ఆ విద్యలన్నీ నాపై ఈరోజు ప్రదర్శించు. నీవు పదునాలుగేళ్ళు నిరాహారంగా ఉండి ఎంతో శ్రమించావు. ఈ రోజు యుద్ధంలో సావకాశంగా నిదురపోవచ్చు అన్నాడు. సౌమిత్రి 'నీవెవరు' అని అడుగగా, లవుడు నవ్వి 'నన్నడగడానికి నీవెవరు?' వచ్చే బాణాలను కాచుకొమ్మని హెచ్చరించాడు. లవుడు భయమెరుగని ప్రచండవీరుడు. ఒక బలమైన బాణాన్ని వదలి సౌమిత్రిని రథంతో సహా ఆకాశానికెగరగొట్టాడు. రథం ఆకాశంలో గిరగిరా తిరిగి భూమిపై పడింది. కాని సౌమిత్రి త్వరగా ఇంకో రథాన్ని అధిరోహించాడు. వర్షం కురిసినట్లు ఏకధాటిగా లక్ష్మణుడు బాణాలు వదిలాడు. లవుడు వాటికి పదిరెట్లు బాణాలు గుప్పించి, లక్ష్మణుని బాణాలను తటాలున త్రుంచేశాడు. ఇంతలో సౌమిత్రి మంత్రం జపించి బాణాన్ని వదలగా దానినుండి కోటానుకోట్ల గదలు వెలువడ్డాయి. విమానంలోనుండి అది చూచిన సకలదేవతలు ఆశ్చర్యచకితులయ్యారు. వెంటనే లవుడు గురుమంత్రం జపించి చక్రాన్ని వదలగా, అది అపారమైన గదలను ఛేదించి వెంటనే మాయమయింది. సౌమిత్రి పర్వతాన్ని వదలగా లవుడు వజ్రాయుధాన్ని ప్రేరేపించాడు. అది పర్వతాన్ని ఖండించి స్వస్థానానికి వెళ్ళిపోయింది. సూర్యవంశశిరోమణి కుమారుడైన లవకుమారుడు బాణాగ్రంలో పన్నెండు సూర్యులను స్థాపించి వదిలాడు. ద్వాదశ ఆదిత్య సమూహం వెలువడగానే బ్రహ్మాండమంతా తలవంచింది. ఇది చూసి లక్ష్మణుడు రాహుఅస్త్రం వదిలాడు. సూర్యరాహు అస్త్రాలు ఒక్కటిగా కలసి క్షణంలో మాయమయ్యాయి. అహినాయకుడు కామాస్త్రం వేయగా లవుడు కామాంతకాన్ని ప్రేరణ చేశాడు. నామంవల్ల



పాతకం హరించినట్లు కామాస్త్రం వెంటనే దగ్ధమైంది. సౌమిత్రి తారకాస్త్రం వదలగా లవుడు షణ్ముఖాస్త్రం వదిలాడు, సౌమిత్రి విఘ్నాస్త్రం వదలగా లవుడు హేరంబాస్త్రం సంధించాడు. సౌమిత్రి సముద్రాస్త్రం వేయగా, లవుడు అగస్త్యాస్త్రంతో తిప్పికొట్టాడు. ఊర్మిళాపతి పావకాస్త్రం సంధించగా, లవుడు మేఘాస్త్రం ప్రయోగించాడు. ఆత్మజ్ఞానం లభించగానే ప్రేమమోహాలు మాయమయినట్లు మేఘాస్త్రం ప్రచండాగ్నిని రూపుమాపింది. లక్ష్మణుడు తనలో 'అక్షౌహిణుల రామసైన్యం నేలకూలింది. వీరి అంతుతెలియడం లేదు. శ్యామకర్ణ ఎన్నటికీ వశంకాదు. ప్రస్తుతం యజ్ఞాన్ని ఏం చేయాలి? ఎదురుగా వున్నవారెవరో? ఈ విషయం ఏమి అర్థం గాకుండా వున్నది. శివకేశవులు బాలకుల రూపంలో ప్రకటమైనట్లుగా తోస్తున్నది. ఇతరులకు ఇంత శక్తి ఉండదు. ఇది ముల్లోకాల్లో ఎవరికీ తరం కాదు' అని యోచిస్తుండగా, లవుడు సౌమిత్రితో 'ఊరకే వున్నావేమి? నీ బాణాలు అయిపోయినట్లున్నాయి. అయోధ్యకు వెళ్ళి నిన్ను రక్షించే రఘునాథుని త్వరగా తీసుకొనిరావలసింది' అన్నాడు. సౌమిత్రి సమాధానం చెప్పక, బాలుని అవలోకించి తిరిగి కోపం పెల్లుబుకగా బాణాలు వదిలాడు. లక్ష్మణుడు ఆదిశేషుని అవతారం. ఇది సీతాసుతునికి తెలుసు. అందువల్ల నాదాస్త్రం ప్రయోగించగా ఒక విచిత్రం జరిగింది. అసంఖ్యాకంగా మంజులనాదాలు వినవచ్చాయి. ఆ ధ్వని బ్రహ్మాండమంతా నిండిపోయింది. ఫణిపాలుడు ధనుస్సును విసర్జించి నాదబ్రహ్మంలో కలిసిపోయాడు. ఉమ్మెత్తగింజ తింటే శరీరం నిశ్చేష్టమవుతుంది. సౌమిత్రి పరిస్థితి అలాగే తయారయింది. నాదాస్త్రం హృదయమంతా నిండిపోయింది. పాముకలుగులో ప్రవేశించినట్లు నాదం అంతటా వ్యాపించింది. లక్ష్మణుడు మూర్ఛిల్లి భూమిపై పడిపోయాడు. ఇక్కడ కుశడు ఇరువది నాలుగు ఆవర్తాలు అద్భుతంగా పడగొట్టి కాళజిత్తుతో సహా అందరినీ సంహరించాడు. రెండుదళాలను మట్టుపెట్టి ఇరువురు సోదరులు

ఏకమయ్యారు. ఘోరయుద్ధం జరిగిన తరువాత ఏనుగులు పారిపోయ్యాయి. రథాలలో రథికుడు గాని, సారథిగాని లేరు. ఖాళీరథాలను గుర్రాలు ఇష్టమొచ్చినట్లుగా రణభూమిలో పిచ్చిపట్టినట్టు లాక్కెళుతున్నాయి.

అక్కడ అయోధ్యలో కోదండపాణి రహస్యంగా భరతుని పిలిచి 'అధిక సేనలు గైకొని సౌమిత్రికి సహాయంగా వెళ్ళవలసింది. లక్ష్మణుడు ప్రచండయోధుడు. వానితో ఈ మాట చెప్పు. బాలకులిరువురిని ప్రాణాలతో పట్టుకుని రమ్మని చెప్పు. వారు మరణించకుండా దండించవచ్చు. లేకపోతే వారి తల్లి హృదయవిదారకంగా రోదిస్తుంది. బాణాలు శరీరంలో గుచ్చుకోకుండా మోహనాస్త్రంతో వారిని పట్టుకోవలసింది. వారి తల్లిదండ్రులెవరో? ధనుర్విద్య నేర్పిన గురువెవరో? ఎందుకు అరణ్యంలో సంచరిస్తున్నారో? సకల వర్తమానం తెలుసుకోవలసింది. వారి స్వరూపం, ఆకారం ఎవరిని పోలివున్నాయి. త్వరగా రథంలో తీసుకురావలసింది. సౌమిత్రికి కోపం అధికం. బాలకుల ప్రాణాలు తీస్తాడేమో! అది చాల అన్యాయం. బాలకులపై కరుణ చూపవలసింది. ఎవరి హృదయం కోమలమో వారు ఆ దృష్టితో బాలురను చూస్తారు. అగ్ని సెగలో నెయ్యికరిగినట్లు ప్రేమతో హృదయం ద్రవించిపోతుంది. బాలకులు లేక మందిరం శూన్యంగా వుంది. మేము ఆ బాధ భరిస్తున్నాం. వివేకం లేకుండా గుణసరితైన సౌందర్యవతి సీతను త్యజించాను' అని రఘునాథుడు మాట్లాడుతుండగా కంఠం గద్గదమైంది. ప్రియాంగన జ్ఞాపకం వచ్చి కళ్ళలోనుండి కన్నీరు కారాయి.

ఆ విధంగా రాజీవనేత్రుడు చెబుతుండగా గాయపడిన సైనికులు పరుగున వచ్చి సౌమిత్రి, కాళజిత్తు ససైన్యంగా నేలకూలారు. ఆ మాటలు విని హనుమంతుడు చింతాక్రాంతుడైనాడు. సర్వేశ్వరుడు మనపై అత్యంత కోపంగా వున్నాడని శ్రీరాముడు తెలిపాడు.




బ్రహ్మానందుడు శ్రీధరునితో ముందుముందు యుద్ధం చాలా రసకందాయంగా వుంటుందని అన్నాడు. చతురులయిన శ్రోతలు, పండితులు ప్రేమగా శ్రవణం చేస్తారు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులయిన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది ఎనిమిదవ అధ్యాయం మధురం**



## అధ్యాయము - 39

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

దేవాధిదేవా! రాజీవనేత్రా! పురాణపురుషా! ఘనశ్యామగాత్రా! భక్తజనులను తరింపజేయడానికి నీవు విచిత్రమైన లీలలు చూపిస్తావు. సౌమిత్రి రణరంగంలో నేలకూలాడని విని కోదండపాణి శోకాకులిత చిత్తుడై నేలమీద పడిపోగానే సుమంతుడు సపర్యలు చేసి లేవదీశాడు. అపారమైన సైన్యంతో హనుమంతుడు వెళ్ళాడు. భరతుడు వాయువేగంతో యుద్ధానికి పరుగెత్తాడు. భరతుడు, హనుమంతుడు యుద్ధభూమిని పరికిస్తుండగా సీతాసుతులు ఇద్దరూ వారి ఎదుట నిలిచారు. రఘురామునివలె నున్న వీరిని చూచి వీళ్ళు తప్పకుండా సీతాదేవి పుత్రులే. జానకి గర్భంతో ఉన్నప్పుడు 'శ్రీరామచంద్రుడు ఆమెను అరణ్యంలో వదలిపెట్టాడు' అని భరతుడు రహస్యంగా హనుమంతుని చెవిలో చెప్పాడు. బదులుగా హనుమంతుడు రత్నాలఖనిలో తప్ప రత్నాలు మరెక్కడా ఉత్పత్తి కావు. వీరు జానకీసుతులని నాకు బోధపడింది అని తన మనస్సులో భావాన్ని తెలియజేసాడు.

### భరతుని యుద్ధం

'అవతలి పక్షంలో నరుడు వానరుడు కలసి మెల్లగా ఏదో మంతనాలు చేస్తున్నారు నీకు అదేమిటో అర్థమయిందా? మనిద్దరం యుద్ధంలో నిమగ్నమై వుండగా శ్యామకర్ణను తీసుకువెళ్లాలని ఆలోచిస్తున్నారేమో'నని లవుడు, కుశుడు పరస్పరం చెవిలో గుసగుసలాడుకున్నారు. 'అలాగైతే నీవు శ్యామకర్ణను కనిపెట్టి వుండు. నేను వారిని యుద్ధంలో మట్టుపెడ్తాను,' అని కుశుడు లవునితో చెప్పి యుద్ధానికి సన్నద్ధమై వారి ముందు నిలిచాడు. ధనుర్బాణాలు గైకొన్న భరతునితో కుశుడు 'ఆకారం పెద్దదిగా కనిపిస్తుంది. నువ్వు లక్ష్మణుని



కన్నా పెద్దవాడివా? నీ పేరేమిటో త్వరగా చెప్పు. నీ తండ్రి ఏ దేశానికి రాజు. పూర్వం నువ్వు ఎప్పుడు ఎవరితో భీకరమైన యుద్ధం జరిపావో చెప్పు. ఈ క్షణంలో నువ్వు నా పేరు అడగవచ్చు. నేను వీరుడైన కుశేంద్ర చూడామణిని' అని తెలిపాడు. ఇది విన్న భరతుడు 'బిడ్డలారా! మీరిక్కడనుండి తత్క్షణం వెళ్ళిపోండి. మీకు ప్రాణదానం చేస్తున్నాను. భరతుడు వదిలిపెట్టాడని వెళ్ళి మీ అమ్మకు తెలియజేయవలసింది' అని హెచ్చరించాడు. అందుకు కుశుడు నవ్వుతూ 'మీ సోదరులిరువురు మరణించారు. దానికి ప్రతీకారంగా శ్రీరాముడు నిన్ను పంపాడా? యుద్ధం మాని మాటల్లో పడ్డావెందుకు? వెంటనే ప్రతాపం చూపించు. లేదంటే వెన్నుచూపి అయోధ్యకు పారిపో! వెనకనుండి మటుకు నిన్ను చంపనని హామీ ఇస్తున్నాను' అన్నాడు. భరతుడు వింటిని ఎక్కుపెట్టి ఆకర్ణాంతం సారించి కుశునిపై వదిలాడు. కుశుడు దానిని మధ్యలోనే ఖండించి, వెంటనే శరపరంపరతో ఎంతో మందిని సంహరించాడు. భరతుడు ప్రయోగించిన అస్త్రాలకు సీతాసుతుడు చెక్కుచెదరలేదు. భరతుడు ప్రయోగించిన కార్తవీర్యాస్త్రం నుండి వేయిచేతులతో వీరులుద్భవించి అప్రతిఘటితమైన బాణాలు వదలుతూ పెద్దకేకలు వేస్తే ఆకాశం దద్దరిల్లింది. ఇది చూసి రాఘవపుత్రుడు వేగంగా భార్గవాస్త్రం వదిలాడు. ఆ వెంటనే కార్తవీర్యాస్త్రం మాయమయింది. భరతుడు కాళరాత్రిని ప్రేరేపిస్తే అంతటా చీకటి వ్యాపించింది. వెంటనే సీతాతనయుడు ద్వాదశాదిత్యులను ప్రయోగించాడు. ఆ ప్రకాశానికి ప్రపంచం వేడెక్కింది. భరతుడు కలికాలాంతానికి కూడా వీరిని జయించడం ఎన్నటికీ శక్యం కాదు అంటూ మహిషాసురాస్త్రం వదిలితే కుశుడు అనివార్యమైన శక్తిని ప్రయోగించాడు. భరతుడు త్ర్యంబకాస్త్రాన్ని ప్రయోగిస్తే, కుశుడు భస్మాసురాస్త్రంతో అడ్డుకున్నాడు. వెంటనే మేఘంనుండి వెలువడే మెరుపులా సూర్యముఖాస్త్రం ప్రయోగించి భరతుడి ఎదలో నాటాడు. భరతుడు రథంనుండి

దొర్లి నేలమీద పడ్డాడు. సైన్యసంహరణ అంతకుముందే ముగిసింది. ఇది గమనించి హనుమ పరుగున వచ్చి ఒక విశాలమైన పర్వతాన్ని గిరగిరా తిప్పి బలంగా కుశుని మీదికి విసిరేశాడు. కుశుడు వజ్రముఖబాణంతో ఆ అచలాన్ని పిండిచేస్తే వచ్చిన ధూళి ఆకాశం అంతా వ్యాపించింది. మారుతి హృదయానికి గురిచూసి ఒక వజ్రబాణాన్ని సంధిస్తే ఆ వజ్రకాయుడు మూర్ఛిల్లి నేలమీద ఒరిగిపోయాడు.

అయోధ్యలో శ్రీరాముడు, విభీషణుడు ఘోరయుద్ధం చేస్తున్న ఈ బాలకులు ఎవరు? ఎవరికి సంబంధించినవారు? అని మీమాంస చేయసాగారు. ఇంతలో యుద్ధంలో భరతుడు పడిపోయాడని, హనుమంతుడు మూర్ఛిల్లాడని రణరంగం అల్లకల్లోలంగా ఉందనే వార్త వచ్చింది. విభీషణుడు శ్రీరామునితో 'ఇక యజ్ఞం చేయడమెందుకు? అంతా పరమాశ్చర్యంగా ఉంది. పోయి చూడవలసిందే!' అని పలుకగా రఘురాముడు 'కాలం ఎంత కఠినమైనది. తమ్ములు ముగ్గురూ నేలకూలారు. సంపూర్ణంగా కుల క్షయమైంది' అంటూ మిక్కిలి కోపంతో యజ్ఞకంకణాన్ని తెంపేసి అక్కడ ఉండే హోమద్రవ్యాలను దాటి పైకిలేచాడు. అయోధ్యను ఉద్రిక్తత ఆవరించింది. ఎటువంటి సంకేతాలు లేకుండా ఒక్కసారిగా అందరూ రథారూఢులై వాయువేగంతో వెళ్ళిపోయారు.

విభీషణుడు, సుగ్రీవ, జాంబవంత, నల, నీల, శరభ, అంగదులు అయోధ్యలోని సమస్తదళాలు అతి వేగంగా పరుగులు తీశాయి. వర్షాకాలంలో గంగ వరదలై సాగరం వైపు పరుగిడినట్లు నరవానర సైన్యాలు రణసింధువు వద్దకు వెళ్ళాయి. రణంలో నేలబడ్డ తమ్ములు ముగ్గురూ ఒకేసారి భూమికి నమస్కరిస్తున్నట్లు కలసిపడి ఉండటం గమనించాడు కోదండపాణి. ఆ మృతకళేబరాలను చూసిన రాఘవుని ఆత్మ ఎంతో క్షోభించింది. నీ కుమార్తెను అనవసరంగా కష్టపెట్టానని భూమికి ప్రణమిల్లాడు రఘువీరుడు.



## యుద్ధానికి శ్రీరాముని ఆగమనం

దూరంనుంచి శ్యామసుందరులైన బాలకులను గమనించి రఘురాముడు అభినందనగా ఇలా అన్నాడు. 'బాలవటువులైన మీకు కౌపీనం, యజ్ఞోపవీతం ఎంతో శోభ కలుగజేస్తున్నాయి. తలపై శిఖ ఎగురుతున్నా మీ దృష్టి మాత్రం శత్రుదళాల మీదే ఉన్నది' వానరగణమంతా వృక్షపాషాణాలు తీసుకుని ఒక్కసారిగా పైకి రాగా కుశలవులు ధనుస్సు సారించి ముందుకు వచ్చి మృగేంద్రాల్లా గర్జిస్తూ బాణ పరంపరను వదిలారు. అదిచూచి రఘుపతి ఆశ్చర్యచకితుడైనాడు. అసంఖ్యాక బాణాలతో వానరదళాలను నానాబాధలు పెట్టి, సకలశిలలను వృక్షాలను విరిచి శత్రుదళాలపై పడవేశారు. బాలకుల ప్రతాపం నిరుపమానం. వారి దారుణ శరాఘాతాలకు తట్టుకోలేక అనేకమంది నిర్జీవులైనారు. మిగిలినవారు పారిపోయారు. ఆ సమయంలో హనుమంతుడు మూర్ఛదేరి ఒక్కసారిగా పైకెగిరి ఇలా అనుకున్నాడు. 'తోకతో ఇద్దరినీ బంధించి శ్రీరామసన్నిధిలో ఉంచుతాను' అని వెంటనే అంజనాసుతుడు గాలిలోకెగరగానే కుశుడు వదలిన బాణాలన్నీ మారుతి హృదయభాగాన్ని తగిలి నేలమీద పడ్డాయి. 'మర్కటా! ఒక్క క్షణం నిలు! లోగడ నువ్వు అశోకవనాన్ని ధ్వంసం చేశావు. కాని అటువంటి పని ఇక్కడ సాధ్యం కాదు. వృక్షపాషాణాలు విసరడానికిది రాక్షస యుద్ధం కాదు. పెకలించుకుని త్వరగా తీసుకెళ్ళడానికిది ద్రోణగిరీ కాదు. గోవు గిట్టలో నిలచే నీరంత లేని సముద్రాన్ని లంఘించి లంకను దహించి అదే మహత్తర సాహసంగా భావించావేమో కానీ అటువంటివి మావద్ద సాగవు. ఇది పరమ దుస్తరమైన సంగ్రామం. ఓ వానరా! నీకిక్కడ విజయం సిద్ధించదు. మా తల్లికి నీవంటే ఎందుకో అమితప్రేమ. ఆమె అనుక్షణం నిన్ను తలచుకోబట్టి నీవు రక్షించబడ్డావు. నువ్వు శిలలా కదలకుండా ఉండు' అని కుశుడు గర్జిస్తూ పరిహాసం చేశాడు. ఆ సమయంలో వృక్షం చేతబూని సుగ్రీవుడు ముందుకు పరుగెత్తాడు. ఒక్క బాణంతో లవుడు ఆ

వృక్షాన్ని విరిచేసి, సుగ్రీవుడి శరీరాన్ని శరమయం చేశాడు. 'ఓరీ సూర్యపుత్రా! నీవెంటే కాలుడున్నాడు. నీవంటి పాతకుడిని ఈ రోజు శిక్షిస్తాను. అన్నయైన వాలిని చంపించి ఆయన భార్యతో జీవించావు. ఎవరి అండదండలు చూసుకొని నువ్వీ పనిచేశావో వారి తెలివితేటలు మాకర్థమయ్యాయి. నీకు దొరికిన గురువు గొప్ప న్యాయం చెప్పి తారను నీదానిని చేశాడు. నువ్వు మర్కటానివి. నీకు జ్ఞానమెక్కడిది. గురువు అపసవ్యమార్గంలో నడిస్తే శిష్యులకు మాత్రం ఏ విధంగా సవ్య జ్ఞానం లభిస్తుంది. దానికి ప్రాయశ్చిత్తం ఈరోజు యుద్ధంలో ఒక్కసారిగా లభిస్తుంది' అని లవకుమారుడు సహస్రబాణాలతో సుగ్రీవుని యుద్ధంలో నేలకూల్చాడు. ఆయన శరీరమంతా బాణాలంతో పనస పండుపై ముళ్ళలా ఉన్నది. వెంటనే జాంబవంతుడు పరుగున ముందుకు వచ్చాడు. 'జాంబవంతా! నువ్వు దుర్బలుడివి. చూపు సరిగా ఆనడంలేదు' అంటూ కుశుడు వెయ్యిబాణాలతో జాంబవంతుని పడగొట్టాడు. ఆ వెంటనే పెద్దరాయి తీసుకొని నీలుడు అతివేగంగా వచ్చాడు. 'ఇది సేతుబంధనం కాదు' అంటూ లవుడు అయిదు బాణాలు వేసి నీలుణ్ణి యమపురికి పంపాడు. అదిచూచి అంగదుడు కోపంతో పరుగున వచ్చాడు. 'ఇది రావణుడి సభామంటపం కాదు, ఎత్తుకుపోవడానికి. నీవు నా పక్షాన చేరితే నీ తండ్రికి జరిగినదానికి ప్రతీకారం చేస్తాను. శత్రువుకు సేవచేయడానికి నీకు సిగ్గులేదూ! నీ తల్లి వ్యభిచారిణి అయింది. దానికి ప్రాయశ్చిత్తమిదే!' అంటూ జానకీసుతుడు అయిదు బాణాలతో అంగదుని అంతం చేశాడు. ఆ విధంగా ఎనిమిదిమంది వానరవీరులు, హనుమంతుడు, ఇతర నరవానర శ్రేష్ఠులు రణరంగంలో నేలకొరిగారు.

ఇదంతా గమనించిన రఘుపతి నారి సారించి బాణం వదిలాడు. వెంటవెంట పదిబాణాలు వేశాడు. కుశుడు నూరు నిర్వాణబాణాలు వేస్తే రఘురాముడు వెయ్యిబాణాలు వేశాడు. కుశుడు లక్ష వదిలితే రాముడు



కోటి, ఆ బాణపరంపర సూర్యబింబాన్ని కప్పివేసింది. రఘురాముని హస్తనైపుణ్యమే వేరు. అంతకంటే విశేషమైన నేర్పును కుశుడు చూపెట్టాడు. అక్కడ వదిలిన బాణాలు లెక్కించడం ఆదిశేషువుకూ సాధ్యంకాదు. ఆ ఇద్దరు చిరంజీవులతో యుద్ధం చేయడం శ్రీరామునికి కూడా వశం కాలేదు. 'ముని కుమారులారా! నా మాట ఆలకించండి. మీకు అటుకులు, లడ్లు, మిఠాయిలు ఇస్తాను. మీకు పాలు తాగడానికి గోవులిస్తాను. మీ పట్ల ప్రసన్నుడనయ్యాను. మీరేది కోరినా నెరవేర్చడానికి నేను సిద్ధమే. మీ దారిద్ర్యం తీరేలా ఏనుగుల్ని, అశ్వాల్ని ఇస్తాను!' అని అంటే వారు ప్రతిగా మాకు అడగటానికి ఏ కోరికలు లేవు. నీకేమైనా తీరని కోరికలుంటే అడుగు తీరుస్తాం. నీ సంపదను నువ్వే అనుభవించు. మేము నీ కీర్తిని విన్నాం. ముల్లోకాలు వెదికినా నీవంటి నిర్దయులుండరు. నిన్ను సాధువని ఎవరు అంటారు? కాపట్యంతో వాలిని అనవసరంగా చంపావు. భాగీరథిలా ఎటువంటి పాపం చేయని జానకి వంటి అనర్ఘరత్నాన్ని అన్యాయంగా తరిమివేశావు. పవిత్రురాలు, పతివ్రత అయిన సీతను అతిఘోరంగా కాననాలకు పంపావు. ఆ ఖ్యాతి నీకు శోభించదు అని బదులిచ్చారు.

ఆ ఇరువురి మాటలకు శ్రీరాముడు ప్రత్యుత్తరమివ్వలేదు. పైగా రాఘవునికి వారిపట్ల ప్రేమ ఉప్పొంగింది. వెంటనే ముద్దు పెట్టుకోవాలన్పించింది. ఇంతలో వారు 'త్వరగా బాణాలు వెయ్యి. నువ్వు అసలైన క్షత్రియుడవని అందరూ అంటారు కాని యుద్ధరంగంలో మాటల్లో పడ్డావు' అని పరిహసించారు. దానికి లీలావతారుడైన రఘువీరుడు, 'మీరెవరు? ఎవరి సంబంధీకులు? ఏ వంశంలో జన్మించారు. మీ మాతాపితల పేర్లు తెలియజేయండి. ఇద్దరికీ ఒకేతీరున ఒకేచోట సమసమానంగా విద్యను, వేదశాస్త్ర పురాణ రామాయణాలను ఏ గురువు నేర్పించారు? మీ ధనుర్విద్య, మంత్రాస్త్రాలు, కళాకౌశలం చిత్రవిచిత్రంగా ఉన్నాయి. పవిత్రులైన మీ సద్గురువు

నామధేయమేమిటి?' ఈ ప్రశ్నలకు బాలకులిద్దరూ పకపకా నవ్వారు. 'యుద్ధంలో నీ సోదరులు మరణించారు. ఆ దుఃఖం వదిలివేశావు. నీ యుద్ధ విద్య ప్రదర్శన ఇదా! యుద్ధానికి వచ్చి బంధుత్వాన్ని లెక్కిస్తున్నావు. సోదరులు మరణించారని భయం వేస్తుందా ఏమిటి? నువ్వు ఈ ప్రశ్నలు వేయడానికి కారణమేమిటి? త్వరగా నిశిత బాణాలతో నీ సోదరులను చంపిన దానికి ప్రతీకారం తీర్చుకో! తరువాత బంధుత్వాల గురించి చర్చించవచ్చు. నువ్వు అయోధ్యానాథుడివి. రావణాది అసురులను సంహరించావు! ఆనాటి విద్యలు ఈరోజు బహిర్గతం చేయండి చూస్తాం. మేం చిన్నపిల్లలం. నువ్వు పూర్వం నుంచి పేరుపొందిన యోద్ధవు. వసిష్ఠగురువులు నీకు మొత్తం ధనుర్విద్య నేర్పించారు. ఏకపత్నీవ్రతుడవైన నీవు సత్కీర్తిగల జానకిని వదిలి అపకీర్తి మూటకట్టుకున్నావని లోకమంతా నిన్ను దూషిస్తోంది. మాతో పోరాటం చేయకుండా నిన్ను వదలం. నీకు భయంగాఉంటే అయోధ్యకు పారిపో! నీకు భార్యాబిడ్డలు లేరు. ఇక సన్యాసం స్వీకరించి సుఖంగా ఉండు' అని సలహా ఇచ్చారు. 'ముందు మీ విషయమంతా వివరించండి. తరువాతే యుద్ధం చేస్తాను' అన్నాడు రఘువీరుడు. ఆ మాటలకు కుశుడు నవ్వుతూ 'పవిత్రమైన జానకి ఉదరకమలంలో మేమిరువురం జన్మించాం. శత్రుశరీరాలను కట్టెలవలె తూట్లువేసి యుద్ధంలో పిండిచేస్తాం' అన్నాడు. 'వాల్మీకి మాకు పూర్ణగురువు. ఆయనే మమ్మల్ని సంరక్షించారు. తరువాత ఉపనయనం చేసి వేదం నేర్పించారు. సకలశాస్త్రాలు, రామచరిత్ర, ధనుర్వేదం అన్నీ సమగ్రంగా పఠించాం. మా తల్లికి తండ్రి వాల్మీకిముని అంటారు. తల్లి కోసం భార్గవుడు భూమిపై క్షత్రియనిర్మూలనం చేశాడు. అట్లాగే మేం కూడా భూమిని నిర్వీర్యం చేద్దామని సంకల్పించాం. తల్లికోసం వినతాసుతుడు సర్పాలను సంహరించాడు. ఆ విధంగా మేము కూడా తల్లి కోసం అదే నిర్ణయం తీసుకున్నాం. నువ్వు సీతాసాధ్విని త్యజించావు. ఫలితంగా నీ శక్తి



అంతరించింది. నువ్వు చాలా తెలివి తక్కువ పనిచేశావు. తిరిగి నువ్వు శక్తిమంతుడవు కాలేవు' అని సావధానంగా అంతా బోధపడేటట్టు వివరించారు.

ఆ మాటలు విని దయాసముద్రుడు సర్వేశ్వరుడైన శ్రీరాముడు సీతను తలచుకుని గుండెలవిసేలా రోదిస్తూ భూమిపై వాలిపోయాడు. తరువాత కాసేపటికి మూర్ఛనుండి తేరుకుని రఘుపతి లేచాడు. ఆ సమయంలో విభీషణుడు మారుతిని వీరెవరి కుమారులు అని ప్రశ్నించాడు. అందుకు విచారవదనంతో మారుతి ఆ బాలురు సంపూర్ణంగా రాముని ప్రతిబింబమే! జానకి గర్భాన జన్మించారు అని సమాధానమిచ్చాడు. నాలుగు ఘడియల పాటు సంపూర్ణంగా శ్రీరాముడు మౌనం పాటించాడు. సీతను వదలిన రోజు నుండి వరుసగా రోజులు లెక్కించాడు. పన్నెండు సంవత్సరాల మూడుమాసాలని లెక్కవచ్చింది. ఇదంతా గమనిస్తున్న లవకుశులు పరస్పరం చెట్టునీడన కూర్చుని శ్రీరాముడు చేస్తున్నదేమిటి? అని అనుకున్నారు. వెంటనే కుశుడు ఒక బాణం వేసి చెట్లను ఎగరకొట్టాడు. కుశుడి బాణ కౌశలానికి జగన్మోహనుడు ముగ్ధుడయ్యాడు. వీరు ఎన్నటికీ మాటలతో నాకు వశం కారు. ఇక యుద్ధం చేయక తప్పదు అంటూ రఘునాథుడు పోరుకు సిద్ధమయ్యాడు. ఎన్ని బాణాలు ప్రయోగించినా అవన్నీ ఆకాశంలోకి వెళ్ళి వ్యర్థమయ్యాయి. ఇదంతా విమానాలనుంచి గమనిస్తున్న ఇంద్రాది దేవతలందరూ రాముడింత సామర్థ్యరహితంగా తయారయ్యాడేమిటా? అని అనుకున్నారు. అకాలంలో వచ్చే మేఘాల్లా రాముని బాణాలు నిష్ఫలమయ్యాయి. ఇంతలో కుశుడు మోహనాస్త్రం సంధించాడు. ఆ మోహనబాణం హృదయంలో నాటుకోగా మొత్తం మోహభరితుడై పుత్రవదనం విలోకిస్తూ రాఘవుడు మూర్ఛిల్లాడు. శ్రీరాముడు నేలపై ఒరగగానే ఆర్తనాదాలు నలువైపులా చెలరేగాయి. పర్వతాన్ని చేబూని హనుమంతుడు ముందుకు లంఘించాడు. వజ్రబాణం వేయగానే మారుతి క్షణంలో మూర్ఛిల్లాడు. వెంటనే

విభీషణుడు గదచేత ధరించి పెద్దగా అరుస్తూ ముందుకు అడుగేశాడు. కుశుడు వదిలిన శరం లంకాపతి హృదయంలో నాటుకోగానే అతను మూర్ఛిల్లాడు. ఇక ఎవరూ మిగలలేదు. లవకుశులు శ్రీరాముని సమీపించి తండ్రిని బాగా గమనించి ప్రేమతో పాదాలకు నమస్కరించారు. రఘుపతి కిరీటం తీసి కుశుడు తన తలపై పెట్టుకున్నాడు. కౌస్తుభ కుండలాలు, కటిమేఖల అన్నీ ధరించాడు. సౌమిత్రి భూషణాలన్నీ తీసి లవకుమారుడు ధరించాడు. శ్యామకర్ణను వెంటబెట్టుకుని దివ్యరథంలో కూర్చున్నారు.

## హనుమదాదుల జానకీమాత సందర్శనం

'అన్నా! ఇటు గమనించు. వానరులను పట్టుకుని తల్లికి చూపిద్దాం' అని లవకుమారుడు కోరాడు. నల, నీల, సుగ్రీవ, మారుతులను తోకలు పట్టుకొని జాంబవంత అంగదులను నేలపై ఈడ్చుకొంటూ తీసుకెళ్ళారు. భూమిపై ఈడ్వడంతో శరీరం గీసుకుపోతోంది. మారుతీ! నా మాటవిని నువ్వు త్వరగా లేచి వారితో యుద్ధం చెయ్యి! అని వానరపంచాయతనం కోరగా హనుమంతుడు నిరాకరించాడు.'త్రిభువననాథుడైన శ్రీరాముడే మూర్ఛిల్లాడు. ముందు జరగవలసిన పనులు చాలా ఉన్నాయి. ప్రస్తుతం మరణించినట్లుగా నటించి జానకీమాత దర్శనం చేసుకుందాం. ఆ ఆదిశక్తి సామర్థ్యం ప్రచండం. వర్ణనాతీతం' అన్నాడు అంజనేయుడు. ఇంతలో బాలకులు ఆశ్రమానికి వచ్చారు. రథంనుండి త్వరగా దిగి ఆశ్రమంలోనికి ప్రవేశించారు. కిరీటం ధరించిన కుశుడు ఎదురుపడగానే జానకికి రఘునాథుడే వచ్చాడనిపించి మేలిముసుగు సరిచేసుకుంది. వెంటనే కుమారులిద్దరూ తల్లికి సాష్టాంగ దండప్రణామం ఆచరించారు. ఆనందాశ్రువులతో జానకి పుత్రులను హృదయానికి హత్తుకుంది. సీత కంఠాన్ని కౌగిలించుకున్న కుమారులు జరిగిన సమాచారం వివరించారు. శ్రీరామునితో సహా నలుగురిని యుద్ధంలో



బంధించాం అన్న సంగతి విని సీత మూర్ఛిల్లింది. వెంటనే లేచి ఆక్రందించి గుండెలు బాదుకుంది. ఆ త్రిభువనేశ్వరుడు, ఘనశ్యాముడు యుద్ధంలో మీకెలా తటస్థపడ్డారు? తెలిసే మీరు పితృహత్యకు ఎలా పూనుకున్నారు. చేపలతో సముద్రం శుష్కింపబడ్డట్లు, నక్కచే సింహం పట్టుబడ్డట్లు, దీపం తేజస్సుకు సూర్యుడు మాడినట్లు, గడ్డివేటుకు వజ్రం తెగిపోయినట్లు, పతంగం వల్ల అగ్ని మింగబడ్డట్లు, చిన్న గులకరాయి బరువుకు ఆదిశేషుడు కుంగినట్లు, దోమరెక్క వేటుకు మేరువు దొర్లినట్లు, చలిచీమ నోటిగాలికి ప్రళయకాలమేఘాలు చెల్లాచెదరైనట్లు, బియ్యపుగింజ బరువుకు ఐరావతం మూర్ఛిల్లినట్లు, సుమహారం బరువుకు పాతాళకూర్మం గాయపడ్డట్లుగా ఉంది శ్రీరాముడు మీచే బంధింపబడిన వృత్తాంతం అని అంది జానకి. లవకుశులు 'తల్లీ! మూర్ఛనుండి తేరుకోగానే అందరూ తెప్పరిల్లుతారు. దానిని గురించి చింతిల్లవద్దు' అన్నారు లవకుశులు. తల్లీ! మేం కోతులను బంధించాం. అవి చాలా అందంగా గంతులేస్తున్నాయి. బయట చెట్లకు కట్టాం. నువ్వు వచ్చి చూడాల్సిందే అని బ్రతిమిలాడారు. జగన్మాత వచ్చి హనుమ, నల, నీల, జాంబవంతులను గమనించి ఆశ్చర్యపడింది. బాలవీరుల సామర్థ్యానికి అబ్బురపడింది. ఇప్పుడు వీరికి బాలురను పరిచయం చేస్తే సిగ్గుపడతారనుకుంది. వానరులను ఇంట్లో ఉంచడం పొరపాటు. అరణ్యంలో వదిలేయండి అని కుమారులను మందలించింది. వారిద్దరూ వానరులను తోకపుచ్చుకొని గిరగిరా తిప్పి విసిరేశారు. వెంటనే ఆ మహావీరులు లేచి శ్రీరాముని వద్దకు పారిపోయారు.

రఘువీరుడు మూర్ఛనుండి తెప్పరిల్లగానే తిరిగివచ్చిన వానరవీరులు వాల్మీకి ఆశ్రమంలో జరిగిన సమాచారాన్ని నివేదించారు. మేము మూర్ఛిల్లినట్లు నటించి జానకిని చూశాం. వారిరువురూ శ్యామకర్ణను ఆశ్రమానికి తీసుకెళ్ళి పూజ చేశారు. మీ రథం ఆభరణాలు ఆ ఇరువురూ తీసుకునివెళ్ళారు. గరుడుడు

శ్రీహరిని గెలిచినట్లుగా ఉన్నది. సూర్యుని వల్లే మేఘాలు జనిస్తాయి. అయితే అవి ఒక్కోసారి సూర్యుడినే అడ్డగిస్తాయి అని చెప్పారు. ఆ మాటలు వింటూ తమాలనీలుడు కొంతసేపు మౌనం పాటించాడు.

ఇక్కడ వాల్మీకి మహర్షి యుద్ధంలో కుమారులు రాముని గెలిచారని, ఆశ్రమం వద్ద ఘోరయుద్ధం జరిగిందన్న విషయం తెలిసి హుటాహుటిన వెనక్కు వచ్చాడు. ఆశ్రమానికి రాగానే సీత జరిగిన వృత్తాంతం వివరించింది. శ్యామకర్ణను పట్టుకొచ్చారనగానే వాల్మీకి నవ్వి వెంటనే రణరంగానికి వచ్చి ఒక అద్భుతం సృష్టించాడు. కమండలంలోని ఉదకం ప్రోక్షించగానే సేనలన్నీ జీవితమయ్యాయి. లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు మొదలైనవారందరూ నిద్రనుండి లేచినట్లుగా లేచి సావధానులయ్యారు. అనంతరం వాల్మీకి వచ్చి శ్రీరాముని ఆలింగనం చేసుకుని 'రాఘవా! నువ్వు సర్వజ్ఞుడివి. కర్తవు నీవే. అందరి గర్వం అణచడానికీ లీల నువ్వే సృష్టించావు. నిజానికి సీత నిన్ను వదిలి దూరంగా ఎక్కడికి పోయింది. అనంత బ్రహ్మాండానికి కర్తవు నీవే. నువ్వు పురాణపురుషుడివి. రఘువరా! మాయాతీతుడవైన నీవు ఈ లోకం నిమిత్తం అజ్ఞానాన్ని ధరించావు' అన్నాడు. 'నేను యుద్ధం చేసి ఈ ఇరువురినీ నిర్జించగలను. కాని నేను నా బలాన్ని వారి ముందు చూపలేదు' అన్నాడు శ్రీరాముడు.

వాల్మీకి బదులుగా నవ్వి చేయి కంటికి తగిలిందని కోపంతో ఎవరన్నా చేతిని నరుక్కుంటారా? భోజనం చేసే సమయంలో పొరపాటున నాలుక పళ్ళమధ్య పడితే దానిపై కోపగిస్తామా? కనుక రాజేంద్రా! కనకం కాంతిపై కోపపడినట్లు, రత్నం తన తేజస్సును తరిమినట్లు, కట్టెతో వృక్షం తన ఫలాలను తెంపినట్లు, కలకండ తీపిదనంపై కోపగించినట్లు, ప్రవాహంపై గంగ రుసరుసలాడినట్లు కాంతిపై దీపం కోపించినట్లుగా ఉన్నది మీ ఆలోచన. హే



జగదాత్మా! అయోధ్యాపతీ! నీ సంతానానికి అమోఘమైన నీ బలం సంప్రాప్తించింది. రాఘవా! 'ఆత్మా వై పుత్రనామాసి' అని శ్రుతులుకూడా ఘోషిస్తున్నాయి అని ధర్మసూక్ష్మం బోధించాడు. వాల్మీకి మాటలకు రాఘవుడు సమాధానపడి పరివారంతో సహా అక్కడే ఉండి లవకుశులను కలుసుకున్నాడు.

**సుపుత్రస్వీకారం**

ఈ పుత్రసమాగమ మహోత్సవాన్ని చూసి తరించడానికి సకలదేశ రాజన్యులు వారి సేనలతో విచ్చేశారు. శత్రుఘ్న, సుమంతులు త్వరితంగా హేమమయ శిబిరాలు నిర్మించారు. అయోధ్య ప్రజలంతా ఆ మహోత్సవం దర్శించడానికి వేగంగా వచ్చారు. వసిష్ఠాదిమునులు ఆ వేడుక చూడటానికి త్వరపడ్డారు. బంగారు మంటపాలతో నిర్మించిన సభలో రఘువీరుడు నిత్యనియమం పూర్తిచేసిన తరువాత నూతన వస్త్రాలు, అలంకారాలు ధరించి సభామంటపంలో అందరితో కలిసి కూర్చున్నాడు. వాల్మీకి, ఆశ్రమానికి వెళ్ళి లవకుశులను, శ్యామకర్ణను తీసుకునివచ్చి రాఘవుని ముందు నిలబెట్టాడు. ఇంద్రాది దేవతలు సకల దేశాధిపతులు లవకుశులను చూసి ఇరువురూ అచ్చంగా రఘుపతినే పోలి ఉన్నారన్నారు. శ్యామసుందరంగా ఆకర్ణాంత నయనాలతో, విశాలమైన నుదురు, సుహాస్యవదనంతో ఉన్న పుత్రులు, రఘునందనుడు సమసామ్యంగా త్రిమూర్తుల్లా గోచరించారు.

ఆ సమయంలో ఆకాశవాణి రాఘవా! నీ పుత్రులను చూసి సురులు తలలను పంకిస్తూ జయజయధ్వానాలు చేస్తున్నారని తెలియజేసింది. వస్త్రాలంకారాలు ధరించి లవకుశులు శ్రీరాముని వద్దకు వచ్చి చేతిలో ధనుర్బాణాలతో తండ్రికి నమస్కరించారు. సర్వత్రా జయజయధ్వానాలు వెల్లివిరిసాయి. దేవతలు పుష్పవృష్టి కురిపించారు. రాజులంతా పుత్రులను ఆలింగనం చేసుకున్నారు. వెంటనే రఘునందనుడు లేచి తన పుత్రులను

హృదయానికి హత్తుకుని తలపై ముద్దిడి తన చెంత కూర్చోబెట్టుకున్నాడు. వారిరువురిని సకల వేదశాస్త్రాలలో ప్రవీణులుగా వాల్మీకి తీర్చిదిద్దారని ప్రశంసించాడు. అప్పుడు శతకోటి రామాయణాన్ని బాలురు గానం చేశారు. గంభీరమైన అవతార చరిత్ర విని రఘుపతిలో ప్రేమ పొంగిపొర్లింది. వారిరువురూ పదునాలుగు విద్యలను అభ్యసించారని, అరువదినాలుగు కళలు బాలురు కరతలామలకంగా అధ్యయనం చేశారని గమనించి, వాల్మీకితో మీ గురుత్వం ధన్యమైంది. బాలకులకు మీరు నేర్పిన యుద్ధాభ్యాసం అద్భుతంగా ఉందన్నాడు. సమాధానంగా వాల్మీకి 'నిజానికి నా గురుత్వంలో ఏముంది? మీ వీర్యం యొక్క శక్తి సంపత్తులు అమోఘం' అన్నాడు. సౌమిత్రి, భరత, శత్రుఘ్నులు, సుమంత, సుగ్రీవ, విభీషణులు హనుమదాది సకలసైన్యాలు సీతను తేవడానికి బయలుదేరాయి. ఆశ్రమం వద్దకు వచ్చి అందరూ నమస్కరించారు. వాల్మీకి ప్రార్థన మన్నించి సీత వెలుపలకు వచ్చింది. అందరూ గద్గదితులై జగన్మాత చరణాలపై మోకరిల్లి పల్లకిలో బయలుదేరమని వేడుకున్నారు. సకల మునిపత్నులను సేవించి జానకి పల్లకిలో కూర్చుంది. సముద్రాన్ని చేరే మందాకినిలా వేగంగా వెళ్ళి రఘుపతి చెంత సీత పల్లకి దిగింది. వాల్మీకి వచ్చి రఘుపతితో 'పంచభూతాలలో శశి ఆదిత్యులవలె వెలుగుతున్న శ్రీరామా! నువ్వు సాక్షీభూతంగా అందరి హృదయాలలో వసిస్తావు. ఆదిమధ్యాంత శక్తిరూపిణియైన జానకి నిజంగా ఏ పాపం ఎరుగదు. జానకి నా ధర్మకన్య. నేటివరకూ నా ఇంట్లో పెరిగింది. ఇప్పుడు ఆమెకు నీ చేతిని అందించి అర్ధాంగిగా నీచెంత కూర్చోబెట్టుకో' అని అన్నాడు. ఆ సమయంలో ఆకాశవాణి కూడా జనకనందిని పతివ్రత ఇది సత్యం అని పలికింది. అనంతరం శ్రీరాముడు సీతను కౌగిలించుకుని తన అంకపీఠంపై కూర్చుండబెట్టుకున్నాడు. వాద్యఘోషలో రఘువీరుడు సకలముని బృందంతో సహా అయోధ్యకు రమ్మని వాల్మీకిని ప్రార్థించాడు.



యజ్ఞాన్ని పూర్తిచేయడానికి అందరూ శ్రీరాముని మాట మన్నించారు. వాల్మీకి తదితరులు దివ్య వాహనాల్లో ఆసీనులయ్యారు. జానకితో సహా సూర్యునిలా వెలిగిపోతున్న రఘునందనుడు రథాన్ని అధిరోహించగా ఇరువైపులా పుత్రులు విరాజమానులయ్యారు. శిరస్సున చిత్రవిచిత్రకాంతులతో దివ్యచ్ఛత్రం విరాజిల్లింది. నిజ భక్తబృందం రామునికి అపారంగా చామరసేవ చేశారు. మకరాంకితాలు ముందుకు సాగగా భట్రాజులు సూర్యవంశకీర్తిని స్తవనం చేస్తుండగా రఘువీరుడు అయోధ్యలో ప్రవేశించాడు. కౌసల్యా సుమిత్రలు ప్రేమతో సీతను కౌగిలించుకున్నారు. లవకుశులకు కౌసల్య వెంటనే దిష్టితీసింది.

తన రాకకు పూర్వమే యజ్ఞసామగ్రి సిద్ధంగా ఉండటంతో శ్రీరాముడు పూర్ణాహుతి చేసి యాగం పూర్తిచేశాడు. వస్త్రాలంకారాలు, దక్షిణలు, అపారంగా మునీశ్వరులకు బహూకరించారు. వారు రఘువీర చరిత్రను గానం చేస్తూ తమ తమ ఆశ్రమాలకు వెళ్ళిపోయారు. రాజులందరూ కానుకలు తీసుకొని శ్రీరాముని అనుమతితో సీతమహిమను స్తుతిస్తూ తమ నగరాలను చేరుకున్నారు. ప్రాణస్నేహితులైన విభీషణ, సుగ్రీవులను రఘుపతి సత్కరించి వారి స్వస్థానాలకు పంపాడు.

అనంతరం రఘుపతి భార్యాబిడ్డలతో కలసి అయోధ్యను పరిపాలించాడు. ఈ కథ విన్నవారికి అక్షయ సుఖాలు కలుగుతాయి. ఈ కథ పెనుసంకటాలను హరిస్తుంది. శ్రోత వక్తలకు ఇరువురికీ విజయం కలుగుతుంది. శ్రీరామవిజయగ్రంథం సకలచింతలను హరిస్తుంది.

ముందు కథ చాలా మధురం. చివరి అధ్యాయంలో శ్రీరాముడు లీలనెలా చూపించాడో సాదరంగా శ్రవణం చేయండి. ఈ గ్రంథంలో మొత్తం నలుబది అధ్యాయాలున్నాయి. మిగిలిన ఒకటి అతిమధురం. మకుటంపై మెరిసే మణి

వంటింది. బ్రహ్మానందా! స్వామిసమర్థా! శ్రీధరవరదా! పండరినాథా! ఈ గ్రంథం పఠించిన భక్తులను నువ్వే రక్షించు. స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరమైనది. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

**॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥**

**ముప్పది తొమ్మిదవ అధ్యాయం మధురం**



**అధ్యాయము - 40**

## శ్రీగణేశాయ నమః శ్రీసీతారామచంద్రాభ్యాం నమః

జయము జయము నిగమాగమరూపా! అఖిలా! అజితా! అమలా! అసురసంహారకా! పరమ మంగళా! అచలా! అవినాశా! మన్మథవారణ విదారక మృగేంద్రా! బృందారకవద్యా! క్రోధ మేఘవిచ్ఛేదక సమీరా! మదతమోనాశక భాస్కరా! పరాత్పరా! పరమానందా! మత్సర తృణ దాహకా! వైశ్వానరా! మాయాచక్రచాలకా! విశ్వంభరా! దంభనగచ్ఛేదక వజ్రధరా! భూమిజావరా! భయనాశనా! అహంద్వి పంచముఖ దర్పహరణా! మోహఘట శ్రోత్ర సంహరణా! శోక శక్రజిత గర్వవిదారణా! ఊర్మిళా రమణాగ్రజా! శ్రీరామా! నీ కృపాబలంతో రామవిజయగ్రంథం సమాప్తమయింది. రసభరితమైన చివరి అధ్యాయాన్ని నా ద్వారా పలికిస్తున్నావు.

**లవణాసురసంహారం**

గత అధ్యాయంలో లవకుశాఖ్యానం ముగిసింది. జానకిని తెచ్చి రాముడు అశ్వమేధయజ్ఞం పూర్తి చేశాడు. తదుపరి ఒకరోజు కోదండపాణి సింహాసనంపై కూర్చునివుండగా బంధువర్గమంతా చేతులు జోడించి ఎవరి స్థానాలలో వారు నిలబడిఉన్నారు. క్షీరసాగరవాసునికి నివేదించడానికి దేవతలు వేగంగా వెళ్ళినట్లు యమునా తీరంలో నివసించే బ్రాహ్మణులు, ప్రజలు అయోధ్యకు వచ్చారు. ఆ సమయంలో భక్తజన సభాభూషితుడై రఘునాథుడు ముత్యాలమండపంలో ఆసీనుడై వున్నాడు. కోటిమన్మథుల తండ్రి, దీనబంధు, గుణసింధు అయిన రఘురామునితో ప్రతీహారి, ప్రజలు మిమ్ములను కలవాలని వచ్చారని తెలియజేసాడు. ఎవరో నా ప్రజలను పీడించి ఉంటారనుకుని వెంటనే వారిని తీసుకుని రమ్మన్నాడు రఘువీరుడు. ముత్యాలమండపం దగ్గరకు ప్రజలంతా

వచ్చి జయజయ ధ్వానాలు చేసి నమస్కరించారు. వారిని తన సమ్ముఖానికి రావించి జగదుద్ధారకుడు కనుసైగలతోనే పలకరించాడు. యమునా తీరంలో అతిక్రూరుడైన లవణాసురుడు ఉన్మత్తుడై ఘోరపాతకాలు, అత్యంత క్రూరమైన కర్మలు చేస్తున్నాడు. వాడు మురదైత్యుల సంతతి. యమున ఆవలిఒడ్డు అతని నివాసస్థానం. రోజూ ప్రజలను, బ్రాహ్మణులను ఆవులను చంపి ఆ చండాలుడు భక్షిస్తూ ఉంటాడు. రఘువీరా! అటువంటి వానిని చంపి అందరికీ సుఖం ప్రసాదించవలసిందని వేడుకున్నారు. వారి మాటలు విన్న కోదండపాణి కోపోద్రిక్తుడయ్యాడు. కళ్ళు ఎర్రబడగా వెంటనే కోదండాన్ని తెప్పించాడు. అప్పుడు శత్రుఘ్నుడు ముందుకువచ్చి శ్రీరామచరణాలకు మ్రొక్కి లవణాసుర వధకు అనుమతివ్వాల్సిందని అర్థించాడు. చతురంగబలాలతో వెళ్ళి లవణాసురుని వధించి, ప్రజలను సుఖపెట్టమని ఆనతిచ్చాడు తమాలనీలుడు. మంత్రశక్తి గల దివ్యబాణాన్ని తమ్మునికి ఇచ్చాడు. శ్రీరామచరణాలకు నమస్కరించి శత్రుఘ్నుడు బయలుదేరాడు. సంగ్రామ సంకేతంగా సేవకులు భేరీలు మ్రోగించారు. మూడు అక్షౌహిణుల సైన్యం అమితవేగంతో బయలుదేరింది. అనేకమైన నౌకలలో యమునను దాటి, నాలుగు దిక్కుల పరికిస్తే అనేకమంది ఋషీశ్వరులు కానవచ్చారు.

వారు శత్రుఘ్నునితో 'ఈ రాక్షసుడు పరమదారుణమైనవాడు. పూర్వం మాంధాత మహారాజును చంపాడు. వాడి భుజబలం అంతులేనిది' అని లవణాసురుని పరాక్రమాలను వివరించారు. శత్రుఘ్నుడు లవణాసురునికి మరణం ఎలా సంభవిస్తుందని ప్రశ్నించాడు. 'వీడు పూర్వం ఈశ్వరుని ఆరాధించగా శంకరుడు స్వహస్తాలతో శూలాన్ని ప్రసాదించాడు. వాడు ఆ బలంతో విశ్వాన్నంతా జయించాడు. ఆ శూలాన్ని తీసివేస్తే వాడు వెంటనే మరణిస్తాడు. ఆ శూలం మందిరంలో పెట్టి వాడు ఆహారంకోసం రాత్రింబవళ్ళు జంతువులు, గోవులు, బ్రాహ్మణుల కోసం తిరుగుతూ ఉంటాడు.



సమయం చూసి వాడి దగ్గరకు వెళ్ళాలి. శూలం చేతబట్టాడా, అతని బలం ఎన్నటికీ క్షీణించదు. వాడి భయంవల్ల మధురానగరం నిర్మానుష్యమైంది' అని ఋషులు తెలిపారు. అనంతరం శత్రుఘ్నుడు మధురాపట్టణం దాటి వాడు లేని సమయం చూసి మందిరం తెరిచాడు. ఆ శూలం పూజలో పెట్టబడి ఉంది. దాన్ని శత్రుఘ్నుడు వెంటనే తీసుకున్నాడు. శూలం చేతబూని కైకేయి సుతుడు సైన్యంతో సహా సిద్ధంగా లవణాసురుని కోసం ఆతడి నివాసం వద్దనే కాపుకాసాడు. ఆవులు, బ్రాహ్మణులను చంపి ఆ ప్రేతాలన్నింటిని నెత్తిపై వేసుకొని అరణ్యంనుండి తిరిగి వస్తూ చుట్టూ వున్న మానవసైన్యాన్ని చూసి ఎంతో ఆనందించాడు. ఈశ్వరుడు 'ఈనాడు నా ఆహారాన్ని నా ఇంటిదగ్గరకే పంపాడు' అని అనుకుంటూ పొలికేక పెట్టి, లవణుడు శూలపాణియైన శత్రుఘ్నుని చూసి శూలం దొంగలించాడన్న కోపంతో లంఘించి ఉద్రేకంతో అమితమైన రోషంతో 'నువ్వు మానవ పుత్రుడవు. నిన్ను చంపి క్షణంలో అయోధ్యాపట్టణాన్ని లోబరుచుకుంటాను. నా మేనమామ రావణుడు. శ్రీరాముడు అతనిని కాపట్యంతో సంహరించాడు. ఇప్పుడు నేను రాఘవుని వధించి సీతను బలవంతంగా తీసుకువస్తాను. మీ నలుగురిని చంపి ప్రతీకారం తీర్చుకుంటాను. ఈరోజే ప్రథమ ఆహుతిగా నిన్ను స్వాహా చేస్తాన'ని బెదిరించాడు. లవణునితో శత్రుఘ్నుడు 'అల్పుడా! నల్లిని చంపాలంటే ఆలస్యం ఎందుకు? వెంటనే నిన్ను సంహరిస్తాను' అని అనగానే వృక్షాన్ని పెకలించి వేగంగా పరుగెత్తాడు లవణాసురుడు. శత్రుఘ్నుడు వింటిని సంధించి బాణం వదిలాడు. వృక్షాన్ని ఛేదించగానే అసురుడు పర్వతాన్ని విసిరాడు. దానిని కైకేయీ సుతుడు ముక్కలు చేశాడు. అసంఖ్యాకమైన వాడి బాణాలను శత్రుఘ్నుడు ప్రయోగిస్తే లవణుడు లెక్కచేయక గడ్డిపోచతో సమానంగా భావించాడు. ధారగా వర్షం కురిసినట్లు వృక్ష, పాషాణాలు విసిరివేశాడు. వాటిని బాణాలతో ఖండించాడు శత్రుఘ్నుడు. అనంతరం శత్రుఘ్నుడు

ఆలోచించి మధుకైటభుల కోసం బ్రహ్మ నిర్మించి యిచ్చిన బాణాన్ని వెలికి తీసాడు. బ్రహ్మ దానిని రఘుపతికిచ్చాడు. లవణాసురుడు వధకు బయలుదేరేముందు రాముడు ఆ బాణాన్ని శత్రుఘ్నునికిచ్చాడు. దానిని శత్రుఘ్నుడు సంధించగా, అది ప్రళయకాలవిద్యుత్తులా, వింటినుంటి వేగంగా బయలుదేరి లవణుని హృదయాన్ని చీల్చింది. మేరుపర్వతం మీద ఐరావతం పడ్డట్టు అసురుడు నేలకూలాడు. వెంటనే ప్రాణంపోగా కళేబరం భూమిపై పడింది. శత్రుఘ్నుని విజయానికి దేవతలు పుష్పవృష్టి కురిపించారు. వెంటనే మధురాపట్టణం ప్రజలతో నిండిపోయింది. అయోధ్యాపురం ఎంత సుందరమో మధురానగరం కూడా అంతే. దేశం అంతా ప్రజలతో నిండగానే దుఃఖ దారిద్ర్యాలు పారిపొయ్యాయి. శత్రుఘ్నుని విజయవార్త వినగానే రఘుపతి ఛత్రచామరాది రాజచిహ్నాలను పంపాడు. శత్రుఘ్నునికి ఛత్రం పట్టి మధుర మహారాజును చేశాడు. సముద్రపర్యంతం ఉన్న సమస్తదేశాలను ఆయనకిచ్చాడు.

## బ్రాహ్మణబాలుని అకాలమరణం

ఒకరోజు అయోధ్యలో ఒక విచిత్రం జరిగింది. శ్రీరాముడు అయోధ్యను పదకొండువేల సంవత్సరాలు పాలించాడు. రామరాజ్యంలో నిజంగా అకాలమృత్యువన్నది లేదు. అటువంటి సమయంలో ఒక బ్రాహ్మణసుతుడు అకస్మాత్తుగా ఉపనయనం కాగానే మరణించాడు. వెంటనే తండ్రి ఆ పిల్లవాడిని ఎత్తుకుని రాజసమ్ముఖానికి తెచ్చాడు. 'నువ్వు ఏదో తప్పు చేశావు. అందుకే అకాలంగా నా పుత్రుడు మరణించాడు. దీనికి వెంటనే ప్రాయశ్చిత్తం చెయ్యి' అని శ్రీరామునిపై నిందవేశాడు. ఇది విని రఘురాముడు చింతాక్రాంతుడయ్యాడు. ఆ సమయంలో నారదముని విచ్చేయగా సీతాపతి జరిగిన వృత్తాంతమంతా వివరించాడు. అందుకు నారదుడు 'ఎవరో శూద్రుడు తపం చేస్తున్నాడు. ఆ పాపం వల్ల ఈ మునికుమారుడు మృతి చెందాడు. తపస్సు చేయడం బ్రాహ్మణ ధర్మం. ఇతరులకది అధర్మం. శూద్రుడి తపస్సు వల్లే ఈ అకాలమరణం సంప్రాప్తించింది' అని వివరించాడు. ఇది విన్న వెంటనే రాముడు పుష్పకాన్ని స్మరించాడు. స్మరించినంతనే విమానం చెంతనిలిచింది. మంత్రి, సేనలతో సహా శ్రీరాముడు విమానమెక్కగానే అది పయనమైంది. తమాలనీలుడు పృథ్వీమండలమంతా శోధించాడు. గుహలు, పర్వతాలు, కఠిన స్థావరాలు కనబడ్డ తపస్వినల్లా జాతివిచారణ చేశాడు. వారంతా శ్రేష్ఠమైన బ్రాహ్మణులమని బదులిచ్చారు. వారికి రఘురాముడు నమస్కరించి తిరిగి వారిని పూజించాడు. అనంతరం భూమినంతా రఘునాథుడు శోధించాడు. దక్షిణాపథంలో వెదుకగా, దట్టంగా కొమ్మలు ఉన్నచోట గిరికంధరంలో ఒక అధమకిరాతుడు తపస్సు చేస్తున్నాడు. వాడు ధూమపానం చేస్తాడు. 'నీది ఏ కులం? ఏ వేదం? తపస్సు ఎందుకు చేస్తున్నావు?' అని రఘుపతి అతనిని ప్రశ్నించగా, 'నేను కిరాతుడిని, స్వర్గం కోసం తపస్సు చేస్తున్నాను' అని సమాధానమిచ్చాడు. ఆ మాటలకు జానకీనాథునికి కోపం వచ్చింది. 'నువ్వు చాలా అధర్మం చేశావు' అంటూ మిక్కిలి వాడియైన బాణాన్ని ప్రయోగించి కంఠాన్ని ఛేదించాడు. వెంటనే అతడు స్వర్గానికి వెళ్ళిపోయాడు. దేవేంద్రుడు విమానంలో వచ్చి రఘునాథుని కలిసి కిరాతవధ వల్ల మహోపకారం జరిగి దేవతల మనోరథం నెరవేరింది. 'సీతావల్లభా! రఘునందనా! పురాణపురుషా! గుణసంపన్నా! నాకు ఏదైనా ఆనతీయండి. దాన్ని వెంటనే పూర్తి చేస్తాను' అన్నాడు. రఘుపతి దేవేంద్రుడితో 'అయోధ్యలో మునికుమారుడు మరణించాడు. అతనికి ప్రాణదానం చెయ్యి' అన్నాడు. సహస్రవదనుడు అందుకు అంగీకరించాడు. గ్రామానికి వెళ్ళినవాడు తిరిగివచ్చినట్లు మునిపుత్రుని ప్రాణం తిరిగి వచ్చింది. అదే విధంగా పూర్వం మరణించిన వారందరిని యథాప్రకారం ఇంద్రుడు బ్రతికించాడు. అప్పుగా ఏదైనా వస్తువు తీసుకునివెళ్ళి తిరిగి ఇచ్చినట్లే వారికి వారి సంతానాన్ని అమరేంద్రుడు తిరిగి ఇచ్చాడు.

## బ్రహ్మదత్తుని శాపవిమోచన

అక్కడ అయోధ్యాపతి అగస్త్యుడుండే అరణ్యాలవైపు వెడుతూ, సహజంగా వనాలను, ఉపవనాలను అవలోకించాడు. ఆ సమయంలో రెండు పక్షులు వచ్చి రాఘవునికి మోకరిల్లి రాఘవేంద్రా! మా వివాదాన్ని పరిష్కరించి ముందుకు సాగవలసిందని వేడుకున్నాయి. వారి వినతి విని రఘూత్తముడు విమానాన్ని నిలిపాడు. తోడనే గుడ్లగూబ, గ్రద్దా రెండూ మాట్లాడసాగాయి. 'పూర్వకాలం నుండి నాకు ఇల్లు ఉంది. ఈ గద్ద నన్ను బలవంతంగా తరిమేసి తాను అక్కడ నివసిస్తోంది' అని గుడ్లగూబ ఫిర్యాదు చేసింది. 'ఆ గుడ్లగూబ నన్ను అకారణంగా పీడిస్తోంది. ఇల్లు నిజంగా చాలాకాలంగా నాదే' అని గద్ద సమాధానం ఇచ్చింది. సీతాపతి ప్రధానిని చూసి 'వీరి వివాదాన్ని పరిష్కరించండి. నిజం తెలుసుకుని ఇల్లు ఎవరిదో వారికే ఇప్పించవలసింది' అని ఆదేశించాడు. 'ఇక్కడ నేల లేనప్పుడే నేను ఈ చెట్టుపై ఇల్లు కట్టుకుని నిజంగా ఉంటున్నాను' అని పాపమతి అయిన గద్ద అంది. 'ఈశ్వరుడు పృథ్విని సృష్టించాడు. దానిపై చెట్లు పెరిగిన తరువాతే నేను ఇల్లు నిర్మించుకున్నాను' అని గుడ్లగూబ అన్నది. 'ఎక్కువకాలం బట్టి వుంటున్నదికాబట్టి గద్ద మాటలు నిజం' అని ప్రధాని అన్న మాటలకు శ్రీరాముడు ఫక్కున నవ్వాడు. 'నువ్వు ఏం అర్థం చేసుకున్నావు? పృథ్వి వృక్షాలకు ఆధారం. గూటికి చెట్టు ఆశ్రయం. దురాత్ముడైన గద్ద నిజంగానే గుడ్లగూబను పీడిస్తున్నాడు' అని తీర్పు చెప్పాడు. యథార్థాన్ని వెలికి తీసి రాముడు గుడ్లగూబకు గూటిని ఇచ్చి గద్దతో 'నువ్వు చండాలురాలవు. నిన్ను ఇప్పుడే వధిస్తాను' అంటూ వెంటనే అస్త్రం సంధించాడు. వెంటనే ఆకాశవాణి ఎలుగెత్తి 'హేరామా! కోదండపాణీ! ఈతడిని చంపవద్దు. ఈతడు పూర్వం బ్రహ్మదత్తుడనే మహారాజు. గౌతమునికి శిష్యుడు. ఒకరోజు అతని గృహానికి గౌతముడు భోజనానికి విచ్చేశాడు. ఆయనకు మాంసం వడ్డించాడు. అది చూసి గురువు మనస్సు క్షోభించి వెంటనే శాపం ఇవ్వగా గద్దగా మారిపోయాడు.



అనంతరం గురుచరణాల మీద వాలి శాపవిమోచనం అర్థించాడు. రామదర్శన మాత్రాన నువ్వు ఉద్ధరణ పొంది స్వర్గానికి పోతావు అని గౌతముడు సెలవిచ్చాడు. ఈ విధంగా శాపవిముక్తి అయింది' అని పలికింది. ఇంతలో అకస్మాత్తుగా విమానం వచ్చింది. బ్రహ్మదత్తుడు దివ్యదేహం పొంది భక్తిభావంతో రామచంద్రునికి నమస్కరించాడు. కోదండపాణిని స్తవం చేసి వెంటనే విమానంలో కూర్చొని రఘువీరుని కృపవల్ల స్వర్గసుఖాలతో జీవించాడు.

అనంతరం అయోధ్యావాసి రాముడు కలశోద్భవుని ఆశ్రమానికి వస్తూ మునులకు సాష్టాంగ నమస్కారం చేశాడు. రఘుపతిని అగస్త్యుడు ఎంతో ఆదరంతో ఆశ్రమంలో పూజించాడు. అగస్త్యుడు రాఘవునికి ఒక అందమైన హస్తకంకణం ప్రసాదించాడు. పృథ్విలో మూల్యం అంతా ఒక్కొక్క రత్నంలో ఇమిడి ఉంది అన్నట్లుగా ఉన్నది ఆ కంకణం. దానిని బ్రహ్మ సృష్టించాడు. 'స్వర్గంలోనున్న వస్తువులన్నీ అతిప్రకాశవంతమైనవి. అవి మనుష్యులకు లభించడం దుర్లభం. మీకు ఎలా లభించింది?' అని శ్రీరాముడు అగస్త్యుని ప్రశ్నించాడు.

## విదర్భరాజు వృత్తాంతం

అగస్త్యుడు ఆ కథా వృత్తాంతాన్ని ఇలా వివరించాడు. 'సరోవరానికి ఆవలిఒడ్డున కనబడుతున్నదే, అది పుణ్యవంతుడు తపోరాశి అయిన విదర్భ మహారాజు ప్రేతం. ఆయన అపరిమిత దానాలు చేశాడు. రామా! ఆయన ఘోరమైన తపస్సు చేశాడు కానీ రవంత కూడా అన్నదానం చేయలేదు. ఆయన స్వర్గానికి వెళ్ళి అక్కడ ఆకలి బాధ పడ్డాడు. ఆయనను చూసి బ్రహ్మ నీకు తినడానికి ఇక్కడేమీ దొరకదు. అన్నదానం చేయని వాడికి ఇక్కడ ఏమీ లభించదు. నువ్వు వెంటనే వెళ్ళి నీ కళేబరాన్ని భక్షించు. నువ్వు ఎన్ని రోజులు భుజించినా దాంట్లో మాంసం తరగదు' అని అన్నాడు. ఆ భూపాలుడు

విమానంలో కూర్చుని రోజూ వచ్చి తన ప్రేతాన్ని తిని తిరిగి స్వర్గానికి వెళ్ళేవాడు. రాఘవా! అన్నదానికి మించిన దానం వేరే లేదు. అదృష్టముంటేనే వైరాగ్యప్రాప్తి కలుగుతుంది. సద్గురునాథుడే దేవుడు. శాంతిలోనున్న ఆనందం వేరే ఎక్కడా లభించదు. తిథులలో ద్వాదశి శ్రేష్ఠమైనది. మంత్రాలలో గాయత్రి మహత్తరమైనది. తీర్థాలలో ప్రయాగ మంచిది. 'రాఘవా! అలాగే దానాలలో అన్నదానం అత్యంత శ్రేష్ఠం అని ఆ సమయంలో విదర్భరాజుతో కమలాసనుడు వివరించాడు. నీకు అగస్త్యముని సందర్శనమైతే నీ కర్మ విమోచనమవుతుందని విముక్తి చెప్పాడు బ్రహ్మ. ఒకరోజు ఆ రాజు ప్రేతాన్ని భక్షిస్తుండగా అకస్మాత్తుగా నన్ను చూశాడు. దయతో నా హృదయం ద్రవించింది. నేను అతడికి వరదానమిచ్చి అతడి కర్మ విమోచనం చేశాను. వెంటనే విదర్భరాజు స్వర్గానికి పోతూ అమృతపానంచేసి, గురుపూజ సంపూర్ణంగా చేసి ఈ హస్త కంకణం ఇచ్చాడు. ఈ రత్నంపై దైవాంశ ఉంది. అందువల్ల మనోరథం ఈడేరుతుంది' అని అగస్త్యుడనగానే అయోధ్యాపతి కంకణం చేత ధరించాడు.

## దండకారణ్యవృత్తాంతం

అనంతరం రాఘవుడు అగస్త్యునితో 'దీనిని దండకారణ్యమని అంటారు గదా! దీని పూర్వవృత్తాంతం తెలియజేయవలసింది' అని కోరాడు. అగస్త్యుడు 'రామా! మనువు పుత్రుడు ఇక్ష్వాకుడు. వాని కొడుకు దండకుడు ఒకరోజు వేటకు వెళ్ళాడు. ఆ అరణ్యంలో ఋష్యాశ్రమాలు ఎక్కువ. దండకుడు గమనిస్తూ పోగా అత్యంత శోభాయమానమైన భృగువు ఆశ్రమం కనిపించింది. అక్కడ మహారాజు ఒక్క క్షణం విశ్రమించాడు. ఆ సమయంలో భృగువు ఆశ్రమంలో లేడు. ఇంట్లో ఆయన కుమార్తె అరజ ఒంటరిగా ఉంది. ఆమెను చూసి రాజు మోహాక్రాంతుడయ్యాడు. కాని ఆమె వయస్సు పది సంవత్సరాలు. దండకుడు ఆ కన్యను బలవంతంగా అనుభవించాడు. ఆమె మూర్ఛిల్లగా దండకుడు అక్కడినుండి వెళ్ళిపోయాడు. భృగువు ఆశ్రమానికి తిరిగి రాగానే కూతురు



అచేతనంగా పడి ఉండటం గమనించి కారకుడు దండకుడేనన్న విషయం గ్రహించి ఎంతో క్షోభించి 'నీ సేన, ప్రజలు, దేశం సమస్తం వనాలు, వృక్షాలు, నగరాలు, నీరు, గడ్డి, ధ్యానం నీ వంశంతో సహా అందరూ ఏడురోజుల్లో భస్మమైపోతారు' అని శపించారు. ఆ విప్రోత్తముడిలా శపించగానే అంతా భస్మమయింది. అక్కడ చెట్లు, పక్షులు, నీరు ఏమీ మిగలలేదు.

చాలాకాలం వరకూ ఆ దేశమంతా శూన్యంగా ఉంది. కొంతకాలం తర్వాత నారదుడు పర్వతాల మధ్య తగవుపెట్టాడు. మేరు, వింధ్యాచల పర్వతాలు ఒకదానికంటె ఒకటి పెరిగిపోతున్నాయి. సూర్యమండలం తల్లడిల్లింది. సకల సృష్టి కల్లోలమైంది. వింధ్యాద్రి సూర్యుడు కనబడనంత ఎత్తు ఎదిగింది. అంతా చీకటైంది. అప్పుడు ఋషులు, దేవతలు వచ్చి మీకు తప్ప వింధ్యాచలం ఎవరికీ శక్యం కాదు. పరమదుర్మార్గమైనది. మీరు వెంటనే దక్షిణానికి తీర్థయాత్రలు చేయవలసింది అని నన్ను ప్రార్థించారు. అందువల్ల 'నేను కాశి వదలి త్వరగా మునులతో సహా దక్షిణానికి వచ్చాను. నన్ను చూడగానే వింధ్యాచలం భూమిపై అడ్డంగా వాలింది. దానితో నేను మళ్ళీ తిరిగి వస్తాను. అంతవరకు పైకిలేవద్దు. లేస్తే శపిస్తాను' అని బెదిరించాను. శాపభయం వల్ల ఆ పర్వతం అప్పటినుండి ఈనాటివరకు పైకి లేవలేదు. అప్పుడు సూర్యుడుదయించగానే సూర్యోదయాన్ని చూచి లోకమంతా ఆనందించింది. అప్పుడు దండకారణ్యమంతా ఎడారిలాగుండేది. మునులతో సహా నేను అక్కడే నివాసమున్నాను. ఇంద్రునితో చెప్పి సమృద్ధిగా వానలు కురిసేలా చేసాను. అంతేగాక ధనధాన్య బీజాలెన్నో దేవేంద్రుడు ఇక్కడ వర్షించాడు. దాంతో చాలాకాలం ఈ దేశానికి పట్టిన చెడ్డకాలం పోయి మంచిరోజులు వచ్చాయి'. అని అగస్త్యుడు సవివరంగా దండకారణ్య వృత్తాంతం వివరించాడు. అనంతరం అనుమతి తీసుకుని రఘువీరుడు వెళ్ళిపోయాడు. సీతాపతి పుష్పకం ఎక్కి అయోధ్యకు వెడితే వెంటనే మునీశ్వరుడు కుమారునితో సహా శ్రీరామదర్శనానికి

విచ్చేసి 'రఘూత్తమా! నీ చేతలకు ధన్యవాదాలు. మృతపుత్రుని తిరిగి సజీవునిగా చేశావు. మేరువు కన్నా నీ కీర్తి పెరిగిపోయింది' అని కీర్తించాడు. ముత్యాల మండపంలో జానకితో సహా చుట్టూ తమ్ముళ్ళు, ముందు హనుమంతుడు నిలబడగా శ్రీరాముడు శోభిల్లాడు.

శ్రీరామవిజయగ్రంథం పావనం. ఉత్తరకాండ అతి సరసం. ఒకరోజు మధ్యాహ్నం రఘుపతి ప్రత్యక్షమై 'తాను స్వస్థానానికి వెళ్ళిన ఆ కథను వర్ణించవద్దు. ఇక్కడితో గ్రంథం ముగించు. అవతారం చాలించడం గురించిన చరిత్ర రామవిజయంలో చెప్పవద్దు. నేను అక్షయుడను. నాశనం లేనివాడను. నేనే బ్రహ్మానందుడను, పండరినాథుడను. సదా భీమాతీరంలో నిలబడి ఉంటాను. ధనుర్బాణాలు త్యజించి, నడుముకు రెండువైపులా చేతులుంచి సమపాదాలతో నేత్రాలతో సకలోపచారాలతో నేను నిలబడి ఉంటాను' అని తెలిపాడు.

ఆ విధంగా అనుమతి తీసుకొని శ్రీధరుడు నమస్కరించి రామునికి జయజయధ్వానాలు చేసి రామవిజయ గ్రంథాన్ని ముగించాడు. పండరినాథా! విశ్వభరితా! జగదాత్మా! జగద్గురో! నలభై అధ్యాయాలు ఉండే ఈ గ్రంథం ప్రేమపూర్వకంగా నీకు సమర్పిస్తున్నాను.

**ఉపసంహారం**

వాల్మీకికృత మూల గ్రంథం, హనుమత్కావ్యం అతి మధురమైనది. తదుపరి ఈ గ్రంథాన్ని వ్యాసుడు రామకథగా చెప్పాడు. దానిని ప్రమాణంగా తీసుకొని, పండరినాథుని కృపవల్ల చెవిలో విఠలుడు ఏది చెప్తే అది రాశాను. రామవిజయగ్రంథం ఏది కోరితే అది ఇస్తుంది. దీని కర్త పండరినాథుడు. శ్రీధరనామం నిమిత్తమాత్రం. ఊరకే నన్ను ముందుకు త్రోశాడు. ఈ గ్రంథానికి పండరినాథుడు వరదానం చేశాడు. ఎవరైతే ప్రతిరోజూ దీన్ని చెపుతూ



చదువుతూ అద్భుతంగా దీని జ్ఞానం కలిగివుంటారో వారికి సంకటాలు, మహావిఘ్నాలు తొలగిపోతాయి. ఒకసారి పారాయణ చేస్తే వెంటనే సంకటాలు సుడిగాలికి మేఘాల్లా చెల్లాచెదురవుతాయి. ఐదుపారాయణాలు సంపూర్ణంగా చేస్తే మహావ్యాధులు కూడా తొలగి పోతాయి. సంతతి సంపద సంపూర్ణంగా పొందుతారు. శుచితో పదిపారాయణాలు చేస్తే రఘునాథునిలా ప్రకాశవంతులైన పిల్లలు కలుగుతారు. శ్రవణం, పఠనం లేకున్నా నిత్యం పూజిస్తే ఇంట్లోని బాధలన్నీ హనుమంతుడే వచ్చి తొలగిస్తాడు. ఇంతవరకు రఘునాథుని కథ చెప్పే భక్తులను చిరంజీవి హనుమంతుడు అంతర్బాహ్యాలలో రక్షిస్తూ వారివద్ద నిలిచి ఉంటాడు. రామకథాశ్రవణం చేస్తే వాయునందనుడు ప్రేమతో సదా చేతులు జోడించి నిలబడి ఉంటాడు. శుచిగా రామవిజయాన్ని దిండుగా చేసుకుని నిద్రపోతే స్వప్నంలో మారుతి దర్శనమిస్తాడు. ఆ విధంగా ఈ గ్రంథచమత్కారాలు రామోపాసకులకు తెలుసు.

బాలాకాండం ఎనిమిది అధ్యాయాలు, అయోధ్యకాండ నాలుగు అధ్యాయాలు, ప్రచండమైన అరణ్యకాండ నాలుగు అధ్యాయాలు, కిష్కింధకాండ రెండు అధ్యాయాలు, మారుతి లీలాచరిత్ర వున్న రసభరితమైన సుందరకాండ ఐదు అధ్యాయాలు, రసవత్తరమైన యుద్ధకాండ పది అధ్యాయాలు, పరమపావనమైన ఉత్తరకాండ ఏడు అధ్యాయాలు, మొత్తం నలుబది అధ్యాయాలు కలిసి రసవంతమైన రామవిజయం అయింది. సదా శ్రవణం చేస్తే బ్రహ్మానందం పుష్కలంగా లభిస్తుంది.

ప్రథమాధ్యాయంలో మంగళాచరణం, గణేశ, సరస్వతి, గురుస్తవనం, వాల్మీకి పుట్టుక, రావణుడు, అతని సోదరుల జన్మ, దశరథ లగ్నవృత్తాంతం ద్వితీయాధ్యాయంలో ఉన్నాయి. శ్రావణ కథ, శృంగి ఆగమనం, దశరథుని యాగం పూర్తిచేయడం, అనంతరం హనుమంతుని జన్మకథ

తృతీయాధ్యాయంలోని విశేషాలు. కౌసల్య, సుమిత్ర, కైకేయీల సీమంతోత్సవాలను గురించి అడగడానికి రాజు వెళ్ళడం, శ్రీరామధ్యానం, జన్మస్థితి నాల్గవ అధ్యాయంలోని కథ. శ్రీరాముని ఉపనయనం, బ్రహ్మచర్యంలో తీర్థాటన, విశ్వామిత్రుడు రఘురాముని అడగటం పంచమాధ్యాయంలో వివరించడం జరిగింది. యోగవాసిష్ఠకథనం, వేదాంత భాగ నిరూపణం ఆరవఅధ్యాయంలో వర్ణితం. తాటకను చంపి యాగాన్ని రక్షించడం, అహల్యోద్ధారణ, సీత జన్మవృత్తాంతం చెప్పడం ఏడవ అధ్యాయంలోని కథ. ఎనిమిదవ అధ్యాయంలో సీతా స్వయంవరం, దశకంఠుని పరాభవం చిత్రితమైంది. సీతారామ కళ్యాణానంతరం రాముడు పరశురాముని జయించడం, రఘుపతి అయోధ్యాప్రవేశం రఘునాథుని రాజ్యాభిషేక యత్నం, కైకేయి అనర్థం కావించడం, దశరథుని దు:ఖం నవమాధ్యాయంలోని కథ. శ్రీరాముడు వనాలకు తరలిపోవడం, కౌసల్య శోకం, జాహ్నవీ తీరానికి శ్రీరామగమనం, దశమాధ్యాయములోని వృత్తాంతం. దశరథుని ప్రాణత్యాగం, భరతుడు మేనమామ ఇంటినుండి రావడం, భక్తిరసదివ్య నిరూపణ పదకొండో అధ్యాయంలోని మాధుర్యం. చిత్రకూటంలో రఘునందనుని కలియడం, భరతుడు స్తోత్రం చేయడం, నందిగ్రామంలో భరతుని స్థాపన పన్నెండవ అధ్యాయంలోని వర్ణన. మునుల దర్శనం, అగస్త్య మహిమ పదమూడవ అధ్యాయంలోని కథ. శూర్పణఖను అవమానించడం, త్రిశిర ఖరదూషణ వధ, రావణుడి వర్తమానం పదునాలుగవ అధ్యాయంలో నిరూపితం. రఘురాముడు జింకను వధించడానికి వెళ్ళడం, రావణుడు సీతను ఎత్తుకుపోవడం, కాపట్యంతో పాటు జటాయు వధ పదునైదవ అధ్యాయంలో ఉంది. శ్రీరాముని సీతా విరహం, జటాయువు ఉద్ధరణ, పంపాసరోవరం చేరడం పదహారవ అధ్యాయంలో ఉన్న కథ. వాలిసుగ్రీవుల జన్మవృత్తాంతం, వాలి వధ పదిహేడవ అధ్యాయంలోని ఇతివృత్తం. తారకు బోధచేయడం,



వానరగణాలు సీతను అన్వేషించడం, సంపాతి దర్శనం పద్దెనిమిదవ అధ్యాయంలో వర్ణితం. సముద్రోల్లంఘన, లంకాశోధన, రావణ సభను పరిభ్రమిస్తూ వాయునందనుడు పొందిన విజయం పందొమ్మిదవ అధ్యాయం. హనుమంతుడు సీతను దర్శించడం, అశోకవన విధ్వంసం, అక్షయాది రాక్షస సంహారం. ఇరవయ్యవ అధ్యాయ విషయం. ఇంద్రజిత్తును రావణుని హింసించి లంకను దహించడం, మారుతి కిష్కింధకు రావడం ఇరవైఒకటవ అధ్యాయం. బ్రహ్మాస్త్ర బంధనం. ఆ మిషతో వాయునందనుడు సముద్రంలో తోకను ఆర్పడం, రాముడు సముద్రతీరానికి చేరడం, విభీషణుడు రావణునికి నీతి బోధచేయడం త్రికూట పర్వతం వద్దకు వెళ్ళడం, బ్రహ్మ లేఖను చదవడం ఇరవైరెండవ అధ్యాయం. విభీషణుడు శ్రీరాముని సందర్శించడం, సాగర దర్శనం, సేతు బంధనం, రాముడు త్రికూటాచలానికి రావడం ఇరవైమూడవ అధ్యాయం. సీత ముందు కాపట్య ప్రదర్శన, మండోదరి జానకిని కలవడం, సుగ్రీవుడు రావణుని హింసించడం ఇరవైనాలుగవ అధ్యాయం. అంగదుడు రావణునికి బోధించడం, దారుణ యుద్ధం, రామలక్ష్మణులు నాగపాశబద్ధులు కావడం ఇరవైఅయిదవ అధ్యాయం. ప్రహస్తవధ, మండోదరి నీతి, ప్రతియుద్ధానికి రావడం, పరాజయం పొందడం ఇరవైఆరవ అధ్యాయం. కుంభకర్ణుని నిద్రమేల్కొలుపు, దారుణ యుద్ధం, కుంభకర్ణ మరణం ఇరవైఏడవ అధ్యాయం. నరాంతకాదులు ఆరుగురి మరణం, శక్రజిత్తు శరకౌశలం, మారుతి ద్రోణాచలం తేవడం ఇరవై ఎనిమిదవ అధ్యాయం. నికుంభిల వెళ్ళి హోమవిధ్వంసం, లక్ష్మణుడు శక్రజిత్తును సంహరించడం ఇరవైతొమ్మిదవ అధ్యాయం. ముప్పయ్యవ అధ్యాయంలో సులోచన విచారం. ముప్పయ్యొకటవ అధ్యాయంలో అహిమహి సంహారం. శక్తిని ఛేదించడం ముప్పై రెండవ అధ్యాయం. రావణుడి హోమవిధ్వంసం, ఘోరయుద్ధం, రావణ వధ, విభీషణ రాజ్యస్థాపన ముప్పైమూడవ అధ్యాయం. జానకి

శపథం, ఇంద్రుని అమృతదృష్టి, దేవతలు పూజించి స్వస్థానాలకు మరలడం ముప్పై నాలుగవ అధ్యాయం. పుష్పకంలో సపరివారంగా బయలుదేరి శ్రీరాముడు అగస్త్యుని దర్శించడం, భరతుని కలయిక, ముప్పైఐదవ అధ్యాయంలో కథ రాఘవుడు నంది గ్రామానికి తరలిపోవడం, అయోధ్యా ప్రవేశం, పట్టాభిషేకం, వానరులు స్వస్థానాలకు వెళ్ళడం. ముప్పైఆరవ అధ్యాయంలో కథ. లవకుశులకథ ముప్పైఏడు, ముప్పైఎనిమిది, ముప్పైతొమ్మిది అధ్యాయాలలో మధురంగా వర్ణితం. నలభయ్యవ అధ్యాయంలో రఘువీరుడు కిరాతుని వధించి మరణించిన ఋషి కుమారుని తిరిగి తీసుకుని రావడం, దండకారణ్యవృత్తాంతం వర్ణితమైనాయి.

నలభై అధ్యాయాలతో సంపూర్ణమైన రామవిజయ గ్రంథాన్ని, అందులోని పూర్తిభావాన్ని శ్రవణమననాలతో వివేకవంతులైన పండితులు గ్రహిస్తారు.

శ్రీరామవిజయగ్రంథం నృపతి వంటిది. అందులోని నలభై అధ్యాయాలు దోషదళాలను సంహరించే ప్రచండమైన ప్రతాపం గలిగిన మహావీరులవంటివి.

రామవిజయ గ్రంథం నలభై అంతస్తులు కలిగిన సుందరమైన దివ్య మందిరం. సీతాసహితంగా రఘువీరుడు అందులో విహరిస్తుంటాడు. రామవిజయం నలభై భాగాలతో అలరారే బృందావనం వంటిది. అందులో రఘువీరుని కథ తులసికోట వంటిది. దాని ఆకులే దృష్టాంతాలు. భక్తులు సదా పారాయణలనే ప్రదక్షిణలు ఆచరిస్తారు. రామవిజయగ్రంథం నలుబది కోశాగారాలతో నిర్మితమైన అతి అందమైన భవంతి. ఆ కోశాగారాలు అపారంగా సాహిత్యద్రవ్యంతో నింపబడివున్నవి. ఈ గ్రంథం సూర్యుని వంటిది. చుట్టూ దృష్టాంతాలనే కిరణాలున్నాయి. సాహిత్య తారాగణాలు ఈ గ్రంథ చంద్రుని పరివేష్టించి ఉన్నాయి. అహంరూపమైన దశకంధరుని వధించి సదా విజయలక్ష్మిని ధరించే రఘువీరుని గ్రంథమే ఇది. దీని దృష్టాంతాలే వానరులు.



రామవిజయమనే గ్రంథపేటికలో నలభై అధ్యాయాలనే అరలున్నాయి. వాటిలో నవరత్నద్రవ్యాలతో సంపూర్ణంగా నింపి నాకు బ్రహ్మానందుడిచ్చారు. భవదుఃఖ, దారిద్ర్యాలను రూపుమాపే అపారమైన భాగ్యం లభించింది. ఈ గ్రంథం పండరీపురం. అందులోని ఉపమానాలే యాత్రికసముదాయాలు. రత్నఖనియైన రామవిజయాన్ని వర్ణిస్తే వాక్కు ధన్యమౌతుంది. బ్రహ్మానందుని కృపవలన ఈ గ్రంథం సంపూర్ణమయింది. శ్రీమన్నారాయణుడు ఆనంద సంప్రదాయాన్ననుసరించి మూలజ్ఞానాన్ని సంపూర్ణంగా సృష్టికర్తయైన బ్రహ్మదేవునికి ఉపదేశించాడు. ఆ జ్ఞానాన్ని బ్రహ్మ అత్రికి, తదుపరి అత్రి తన పుత్రుడు, ఆది పురుషుడైన దత్తాత్రేయునకు, దత్తాత్రేయులవారు శుద్ధమైన ఆ జ్ఞానాన్ని సదానందునికి, వారి నుండి సుప్రసిద్ధువైన యతీశ్వరులు రామనందులవారికి, వారు గంభీరులు, జ్ఞానానంద దివాకరులు, కళ్యాణధామవాసి, సహజానంద యోగీశ్వరులయిన మంగళానందేశ్వరులకు, వారు తపోజ్ఞాన తేజఃపుంజమైన పూర్ణానంద మహాయతి రాజుకు, వారు పూర్ణదత్తాత్రేయ అవతారమైన సహజ యతి దత్తానందుల వారికి, వారు ఆ దత్తానందుల గర్భాన శుద్ధపూర్ణ అవతారంగా జన్మించిన బ్రహ్మానందులవారికి ఉపదేశించారు. ఆ బ్రహ్మానంద యతీంద్రులే నాకు తండ్రిగా, గురువుగా సుప్రసిద్ధులు.

పండరి నుండి నాలుగు యోజనాల దూరంలో నైరృతి మూలనున్న నార్ఖురే గ్రామంలో బ్రహ్మానందులు పూర్వాశ్రమంలో కరణంగా పనిచేశారు. తదుపరి పండరికి వచ్చి విధియుక్తంగా సన్యాసం స్వీకరించి భీమానదీతీరంలో సమాధి పొందారు. వారే నా తండ్రి. సావిత్రి నా తల్లి. శ్రీధరుడనైన నేను మాతాపితరులిరువురికీ ప్రణమిల్లి రామవిజయగ్రంథాన్ని పూర్తిగావించాను. పదహారు వందల ఇరువదిఅయిదు శక సం॥ సుభాను నామ సంవత్సరం శ్రావణ మాసం. భానువారం సప్తమీ శుభదినాన పండరీ క్షేత్రంలో ఈ గ్రంథ

రచన పూర్తయింది. గ్రంథకర్తకు శ్రోతలకు శుభం కలుగుగాక! సుభాను నామ సంవత్సరంలో భానువారంనాడే భానువంశంలో శ్రీరఘురాముడు జన్మించాడు. గ్రంథకర్తకు, శ్రోతలకు శుభం కలుగుగాక! సూర్యచంద్రులున్నంత వరకు ఈ గ్రంథం వర్ధిల్లుగాక!

బ్రహ్మానందా! పాండురంగా! శ్రీధరవరదా! పూర్ణఅభంగా! పురాణపురుషా! భక్తభవభంగా! శ్రోతవు వక్తవు నీవే! స్వస్తి!

శ్రీరామవిజయగ్రంథం సుందరం. వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణ మహాకావ్యం ఆధారంగా రచించబడింది. చతురులైన భక్తులు ఎల్లప్పుడూ ఈ రామకథను శ్రవణం చేస్తారు.

॥ శ్రీరామచంద్రార్పణమస్తు ॥

**నలుబదవ అధ్యాయం మధురం**

ఉత్తరకాండ సమాప్తం

**శుభంభవతు**

